

శ్రీ
చెన్నకేశవ పరబ్రహ్మణే నమః

తొలి తెలుగు

అధ్యాత్మ రామాయణము

కాణాదం పెద్దనసోమయాజి (క్రీ.శ. 1775) ప్రణీతము

పరిష్కర్త, పీఠికాకర్త, సంపాదకుడు

వైద్యం వేంకటేశ్వరాచార్యులు



ప్రచురణ
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
2016

ADHYATHMA RAMAYANAMU

(Pages XIV + 48 + 634 = 696)

Vaidyam Venkateswaracharyulu

T.T.D. Religious Publications Series No. 1153
© All Rights Reserved

First Edition : 2016

Copies : 1000

Published by :
Dr. D. Sambasiva Rao, I.A.S.
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P:
Publication Wing,
T.T.D., Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

ముందుమాట

భారతీయ సనాతన జీవన వ్యవస్థకు నిలువుటద్దం శ్రీమద్రామాయణ మహాకావ్యం. లౌకిక వాఙ్మయంలో భారతదేశంలోనేకాక ఈ విశ్వంలోనే ప్రప్రథమ కావ్యంగా వాల్మీకి రామాయణం కీర్తింపబడుతూ ఉన్నది. ఏతత్ కృతికర్త వాల్మీకి మహర్షి. వాల్మీకి తర్వాత రామాయణగాథ అనేకులచే వివిధ రూపాలలో చిత్రించబడింది. అట్టి రామాణాలలో అధ్యాత్మ రామాయణం ముఖ్యమైనది. ఇది సంస్కృతంలో బ్రహ్మాండపురాణంలోని ఒక భాగంగా రూపొందింది. ఆధ్యాత్మికతత్త్వ ప్రధానంగా ఈ రచన కొనసాగింది కనుక దీనికి అధ్యాత్మ రామాయణం అనే పేరు సార్థకమయ్యింది.

ఈ అధ్యాత్మ రామాయణాన్ని పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పినట్లుగా ప్రశస్తి. నాలుగువేల పైచిలుకు శ్లోకాలుగల ఈ గ్రంథం వాఙ్మయ లోకంలో ఒక ప్రముఖ గ్రంథంగా ఆదరింపబడుతున్నది.

దీనిని అనేకులు ఇతర భాషల్లోకి అనువదించారు. గద్వాల ఆస్థానంలో విద్వత్కవిగా ప్రసిద్ధి పొందిన కాణాదం పెద్దనసోమయాజి అనే కవీశ్వరుడు 3,360 గద్య పద్యాలుగల చంపూ ప్రబంధ కావ్యంగా "అధ్యాత్మ రామాయణం" అన్న పేరుతో ఈ గ్రంథాన్ని రచించాడు.

ప్రసిద్ధ పరిశోధక పండితులు శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు ఈ గ్రంథాన్ని పరిష్కరించి విపులమైన పీఠిక రచించి ముద్రణకు సిద్ధం చేసి తి.తి.దే. వారి ప్రచురణగా ప్రకటించుటకు సమర్పించినారు. వారిని అభినందిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం ఈ గ్రంథాన్ని ధార్మిక గ్రంథాల ప్రచురణలో భాగంగా ప్రచురిస్తున్నది.

సాహితీప్రియులు, భక్తమహాశయులు దీనిని ఆదరించి భగవదనుగ్రహానికి పాత్రులు కాగలరని ఆశిస్తున్నాము.

సదా శ్రీవారిసేవలో

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

ఓం నమో వేంకటేశాయ



శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః



విషయసూచిక

పీఠిక	1-47
అధ్యాత్మ రామాయణము	**1-612**
కావ్యావతారిక	1-12
బాలకాండము (ప్రథమాశ్వాసము)	**13-82**
కథా ప్రారంభము-బ్రహ్మనారద సంవాదము	13
బాలకాండ కథా ప్రారంభము	19
అయోధ్యాపుర వర్ణనము	34
శ్రీరాముల జననము	43
విశ్వామిత్రుడయోధ్యకు వచ్చుట	52
తాటక వధ	55
అహల్యా వృత్తాంతము	59
విశ్వామిత్రుడు రామలక్ష్మణులను మిథిలాపురమునకు తోడ్కొనివెళ్లుట	64
శివధనుర్భంగము	68
సీతారామ కల్యాణము	69
పరశురామ సమాగమము	75
అయోధ్యకాండము (ద్వితీయాశ్వాసము)	**83-176**
నారద సమాగమము	83
పట్టాభిషేక భంగము	94
వనగమన ప్రయత్నము	111
వనవాసాగమనము	128
ఋష్యాశ్రమ దర్శనము	136
వాల్మీకి వృత్తాంతము	141
దశరథ మరణము	149
భరతుడు రామునిచెంతకు వెళ్లుట	160
పాదుకా పట్టాభిషేకము	173

అరణ్యకాండము (తృతీయాశ్వాసము) **177-248**

దండకారణ్యప్రవేశము 178

విరాధవధ 180

శరభంగ సుతీక్ష్ణ సమాగమము 183

అగస్త్యాశ్రమగమనము 191

శూర్పణఖ పరాభవము 206

మాయామృగ వృత్తాంతము 219

సీతాపహరణము 227

జటాయువు మోక్షణము 234

కబంధ మోక్షము 237

శబరి వృత్తాంతము 242

కిష్కింధ కాండము (చతుర్థాశ్వాసము) **249-322**

రామ సుగ్రీవమైత్రి 250

వాలి వధ 260

ఆరాధన విధానము 279

సుగ్రీవాగమనము 295

స్వయంప్రభ వృత్తాంతము 300

సంపాతి వృత్తాంతము 308

హనుమత్ప్రేరణము 317

సుందరకాండము (పంచమాశ్వాసము) **322-364**

హనుమంతుడు సముద్రమునుదాటి లంకకేగుట 324

ఆంజనేయుడు సీతాదేవిని జూచుట 335

హనుమంతుడు లంకను గాల్చుట 355

అంగదాదులు మధువనంబునకువచ్చుట 358

హనుమంతుడు శ్రీరాములకు సీతను జూచిన తెరంగెరింగించుట 359

యుద్ధకాండము-పూర్వభాగము (షష్ఠాశ్వాసము) **365-440**

ఆంజనేయుండు లంకా ప్రభావంబు దెల్పుట 367

సుగ్రీవుండు కపిసైన్యంబుల వెడలించుట 368

శ్రీరామచంద్రుండు సముద్రమును జూచుట 370

రావణుడు మంత్రులతోనాలోచించుట 372

విభీషణుండు రావణునకు నీతి జెప్పుట 375

రావణుండు విభీషణుని పరాభవించుట 376

విభీషణుండు రాముని శరణుజొచ్చుట 379

రావణుండు శుకుండను దూతనుబంపుట 384

రాముడు సముద్రుని మీద బ్రహ్మాస్త్రము వేయుట 385

నలుండు సేతువును గట్టుట 389

శుకుండు రావణునకు వానరవీరులందెల్పుట 393

శుకుండు రావణునకు హితంబు దెల్పుట 395

వానర రక్షస్సేనాసంకుల యుద్ధము 404

ఇంద్రజిత్తు ప్రథమ యుద్ధము 406

ఆంజనేయుండు ద్రోణగిరిదెచ్చుట 408

రావణుని పంపున రాక్షస వీరులు యుద్ధంబునకు వెడలుట 409

మహోకాయుని యుద్ధము 413

ప్రహస్తుని యుద్ధము 415

అతికాయుని యుద్ధము 416

కుంభనికుంభుల యుద్ధము 418

రావణుడు ప్రథమ యుద్ధంబునకు వచ్చుట 421

రామరావణుల యుద్ధము 424

లక్ష్మణుడు మూర్ఛపోవుట 426

రావణునకు కాలనేమి జ్ఞానోపదేశంబు జేయుట 430

ఆంజనేయుండు కాలనేమిని సంహరించుట 435

ఆంజనేయుడు ద్రోణగిరిని దెచ్చుట 437
లక్ష్మణుండు మూర్ఛదేలుట 438
యుద్ధకాండము-ఉత్తరభాగము (సప్తమాశ్వాసము) 441-530
కుంభకర్ణుని నిద్రలేపుట 442
కుంభకర్ణుండు రావణునకు హితోపదేశము జేయుట 442
కుంభకర్ణుండు యుద్ధంబునకు వచ్చుట 445
కుంభకర్ణుని వధ 448
విభీషణుండు రామునకు నింద్రజిత్తుజేయు
నికుంభిలాహోమంబు విఘ్నంబొనర్పుమని చెప్పుట 451
లక్ష్మణుండునికుంభిలా హోమంబు విఘ్నంబొనర్చుట 453
ఇంద్రజిత్తుయుద్ధమునకు వచ్చుట 454
ఇంద్రజిత్తు వధ 456
రావణుండు రెండవసారియుద్ధంబునకు వచ్చుట 458
పాతాళ హోమమును జెరచుట 462
మండోదరి బుద్ధి జెప్పుట 465
రావణుండు యుద్ధమునకు వచ్చుట 467
రామరావణుల యుద్ధము 472
రాముడు రావణుతలలు దెగవ్రేయుట 478
రాముడు రావణాసురుని సంహరించుట 480
లక్ష్మణుండు విభీషణు శోకంబుజల్లార్చుట 484
విభీషణునకు రాజ్యాభిషేకంబొనర్చుట 487
సీతాదేవియనలంబు ప్రవేశించి వెడలుట 491
బ్రహ్మ స్తోత్రము 494
ఇంద్రుండు శ్రీరాములను స్తుతియించుట 496
శ్రీరాములయోధ్యకు మరలి వచ్చుట 499
శ్రీరాముడు హనుమంతుని భరతునొద్దకు బంపుట 504

భరతుండు రాములకు నెదురుగావచ్చుట 507
భరతుండు రాములను దర్శించుట 509
శ్రీరాములయోధ్యా నగరంబునకు వచ్చుట 514
శ్రీరామచంద్రుల పట్టాభిషేకము 516
శ్రీరాములను ఈశ్వరుడు స్తుతిజేయుట 518
శ్రీరాములను ఇంద్రాది దేవతలు స్తోత్రముజేయుట 521
శ్రీరాములు హనుమదాది వానరుల నిజనివాసంబులకు బంపుట 523
శ్రీరాములు రాజ్యపాలనంబు సేయుచు సుఖంబున నుండుట 524
ఈ యధ్యాత్మ రామాయణంబు జనులకు సకలాభీష్ట ప్రదంబని చెప్పుట 526

ఉత్తరకాండము (అష్టమాశ్వాసము) 531-612

అగస్త్యాదిమునులు శ్రీరాముల కడకేతెంచుట 532
అగస్త్యుండు రాములకు రావణాద్యుత్పత్తి క్రమ మెరింగించుట 534
విశ్రవసు వలన కైకసియందు రావణాదులుద్భవించుట 539
రావణాదులు బ్రహ్మను గూర్చి తపంబొనర్చి వరంబులు గొనుట 541
రావణుండు కుబేరుని జయించి పుష్పకంబును గొనుట 545
రావణుండు యముని జయించుట 545
రావణుండింద్రాదులతో యుద్ధంబు జేయుట 549
రావణుండు కైలాసమెత్తుట 553
రావణుండు వాలిని గూర్చి యుద్ధమునకు బోవుట 554
అగస్త్యుండు రాముల స్తుతియించుట 555
సనత్కుమారుండు రావణునకు రాములే పరదైవమని చెప్పుట 560
రావణుండు శ్వేతద్వీపంబునకు యుద్ధార్థమై బోవుట 563
అగస్త్యుండు రామునకు దివ్యాభరణంబొసంగుట 565
సీతాదేవి రామునకు వైకుంఠమునకు రమ్మని దేవతలు ప్రార్థించిరని చెప్పుట 568
లక్ష్మణుండు సీతను వాల్మీకాశ్రమంబున విడిచివచ్చుట 569

శ్రీరాముడు లక్ష్మణునకు రాజ్యపాలనయందప్రమత్తుండై
యుండవలయునని చెప్పుట 571
శ్రీరాముడు లక్ష్మణునకు జ్ఞానోపదేశంబు జేయుట 579
శత్రుఘ్నుండులవణాసురుని వధించుట 582
కుశలవులు శ్రీరామసన్నిధానమందు రామాయణంబు గానంబు జేయుట 587
సీతాదేవి భూమిలో ప్రవేశించుట 590
శ్రీరాముడు కౌసల్యకు జ్ఞానోపదేశంబు జేయుట 592
యముడు మౌనివేషంబున రామసన్నిధానంబునకు వచ్చుట 596
దుర్వాసుండు రామదర్శనార్థమై వచ్చుట 599
లక్ష్మణుండు శ్రీవైకుంఠంబునకు వేంచేయుట 601
శ్రీరాముని నిర్యాణము 605

అనుబంధం **613-632**

I. తెలుగు సాహిత్యంలో అధ్యాత్మరామాయణాలు 613

II. గద్వాల సంస్థాన సంబంధితం 617-628

1. గద్వాల సంస్థాన పాలకులు-కాలం 617
2. గద్వాల సంస్థాన చిత్రపటం 619
3. గద్వాల సంస్థానం కోట 620
4. కేశవస్వామి ఆలయం-స్వామివారు 621
5. సంస్థాన నిర్మాత చిత్రం 623
6. అధ్యాత్మరామాయణం ప్రారంభ పుటలు (గద్వాల ముద్రిత ప్రతి) 624
అధ్యాత్మరామాయణం ప్రారంభ పుట-(1984 లిఖిత కాగిత ప్రతి) 627

III. సురపురం సంస్థాన సంబంధితం 628

1. వేణుగోపాలస్వామి ఆలయం
2. వేణుగోపాలస్వామి వారు

IV. ఈ బంధాలకు చిత్రాలు ఇలా. . . . 629

-★)★(★-

పీఠిక

శ్రీదములు నూపురితవేదములు పాపతతి
భేదములు తాపస వినోదములు తాప
చ్ఛేదములు సాధుకృత వాదములు సన్నిహిత
మోదములు సందళిత ఖేదములు పుణ్యా
స్వాదములు సద్వన పయోదములు మామ కథ
యాదములు నీదుమృదు పాదములు భక్తా
హ్లాదములు జూపుచు ప్రసాదములు నామదిన
పాదుకొన చేయుము రమాదయిత రామా!

ప్రవేశిక

ఆంధ్రదేశ సంస్థానప్రభువులు రసికావతంసులు. వారి ఆశ్రయాన సాహితీవృక్షం శాఖోపశాఖలుగా విస్తరించింది. అందులో తెలుగుశాఖ బహు సుకవి సంతతులకు ఆశ్రయమై కావ్యపుష్పఫలాల సౌరభరసాలను రసజ్ఞులకు అందించింది. సంస్థానాలలో పరశ్శతంగా ప్రబంధాలూ, కమనీయ కావ్యాలూ మొదలైనవి వెలువడినవి. వాటిలో శిరశ్శేఖరాలయిన సత్కృతులను రచించిన సుకవిపుంగవులలో కాణాదం పెద్దన సోమయాజి ప్రథమ శ్రేణికి చెందినవారు.

తొలితెలుగు అధ్యాత్మరామాయణమగు ప్రస్తుత కృతిని రచించినవారు సుకవితా విభ్రాజి కాణాదం పెద్దనసోమయాజి. కాణాదంవారిని గురించి వారు రచించిన ఆధ్యాత్మరామాయణాన్ని గురించి కవి పరిచయం, కావ్య పరిచయం అనే ప్రధాన ఉపశీర్షికలలో తెలుసుకుందాం.

కవి పరిచయం

పేరు

ఈకవి పెద్దన[1], పెద్దామాత్యుడు[2], పెద్దనార్యుడు[3], పెద్దయజ్వ[4], పెద్దనాధ్వరి[5], పెద్దన సోమయాజి[6], అనే పేర్లతో వ్యవహరింపబడినాడు. పెద్దనగారు కాణాదం వంశీయుడు. కనుక వీరి పేరుకుముందు కాణాదం[7], కణాద[8], అని పేర్కొనబడింది. వీరి పూర్వ స్వస్థలం నందవరం. కనుక వీరు నందవరం పెద్దామాత్యులుగాకూడ పేర్కొనబడినారు[9].

---

1. 'ప్రీతచరిత్రులు కణాద పెద్దనసుకవీ!' – ముకుందవిలాసము 1-26.
2. నందవరం పెద్దామాత్యుడు, విప్రవంశము అనే పుస్తకమునందు 1898 ముద్రితం. చూడు : ఆంధ్రవాఙ్మయసూచిక 190పుట.
3. 'పేశలవచోరచనచర్యు పెద్దనార్యు' – ముకుందవిలాసము 1-23.
4. అధ్యాత్మరామాయణం 7వ ఆశ్వాసం యుద్ధకాండం ఉత్తరభాగం 412వ పద్యం చక్రబంధ శార్దూల వృత్తం. ఈ బంధ చిత్రం వెలుపలనుండి మూడవ వలయంలో పెద్దయజ్వ అనిఉంది. చూడు ప్రస్తుత గ్రంథం పుట 528లోని చక్రబంధం.
5. 'అలకణాదము పెద్దనాధ్వరి దనరించె పటుచమత్కృతులతో బాలకాండ' – యథాశ్లోక తాత్పర్య రామాయణము–అవతారిక.
6. 'సూక్తి విభ్రాజి పెద్దన సోమయాజి' – అధ్యాత్మరామాయణము 1-22.
7. 'కాణాదవంశ విఖ్యాతి సాంద్రు' – ముకుందవిలాసము 1-22.
8. 'కణాదపెద్దనసుకవీ' – ముకుందవిలాసము 1-26 మరియు పై 5వ అధోజ్ఞాపిక.
9. పెద్దన పూర్వీకులు మంత్రులుగ, కరణాలుగా ఉన్నారు. కనుక నందవరీకు లయిన వీరు తమపేరు చివరన అమాత్యశబ్దాన్ని చేర్చుకున్నారు.

కులగోత్రాదికం

ఈకవి ప్రవరుడు నందవరీక విప్రవరుడు, ఋక్‌శాఖీయుడు, ఆశ్వలాయన సూత్రీయుడు, ఆత్రేయ గోత్రీయుడు, కాణాదం వంశీయుడు[1].

'పెద్దన గోత్రానికి మూలపురుషుడు 11వ శతాబ్దం వాడయిన మహాభాష్యం మహాదేవభట్టు. కాశీనుండి విచ్చేసి నందన చక్రవర్తి చేత నందవరం గ్రామాన్ని (నేడు కర్నూలుజిల్లా బనగానిపల్లె మండలంలో ఉండిన నందవరం గ్రామాన్ని) అగ్రహారంగా బడసిన పదమూడు గోత్రాల విప్రులకు ప్రాతినిధ్యం వహించిన పదముగ్గురిలో మహాభాష్యం మహాదేవభట్లు (బట్టు)గారొకరు. వీరు నందవరాగ్రహార వాస్తవ్యులు. నందవరం చౌడేశ్వరీ దేవి వీరికులదేవత. నందవరీకులలో ఆత్రేయగోత్రీయుల కుటుంబాలు ఆనాడు అరవై ఉండేవి. ఆ అరవై కుటుంబాలలో కణాదం/కాణాదం వారి కుటుంబం ఒకటి'[2].

పూర్వీకులు

16వ శతాబ్దంలో తిరుమల దేవరాయలవారి విజయనగర విద్వ దాస్థానంలో తమ కవితా పాండిత్యాలను ప్రదర్శించి నందవరాగ్రహారాన్ని పునరుద్ధరింపజేసిన నలుగురు విద్వత్కవిపండితులలో కాణాదం నృసింహభట్టు[3] ఒకరు. ఆయన వంశపరంపరలోనివాడే కాణాదం కృష్ణసోమయాజి. కాణాదం కృష్ణసోమయాజి వేద శాస్త్రపురాణాదివేది, సుకవిపుంగవుడు. ఈయనకు పెద్దనసోమయాజి మనుమడు. ఈ అంశాన్ని కిందిపద్యం సుస్పష్టం చేస్తుంది.

తే.గీ॥ వేదశాస్త్ర పురాణాది వేదియైన
సుకవి కాణాదకుల కృష్ణసోమయాజి
పౌత్రమణివగు నీకిట్టి ప్రౌఢి యరుదె !
సుగుణ విభ్రాజి ! పెద్దన సోమయాజి !!

– అధ్యాత్మరామాయణం 1.27.

---

1. 'సీ. నను నందవరపురాన్వయ పయోనిధి చంద్రు
కాణాదవంశ విఖ్యాతి సాంద్రు
నాశ్వలాయనసూత్రు నాత్రేయమునిగోత్రు' – అధ్యాత్మ రామాయణము 1-22, ముకుందవిలాసము 1-23
2. చూడు : నందవరీక ప్రశంస. పరిష్కర్త, సంపాదకులు : (ప్రస్తుతపీఠికా కర్త) వైద్యం వేంకటేశ్వరాచార్యులు. ప్రచురణ : నందవరీక సంఘం, నందవరం– కర్నూలుజిల్లా. తాళపత్రగ్రంథాలలోని విషయాలను సేకరించి పరిష్కరించి వైద్యం వేంకటేశ్వరాచార్యుల సంపాదకత్వాన ప్రచురితం.
3. చూడు. పైది.

కుటుంబం

పెద్దనార్యుని తండ్రి తిమ్మనార్యుడు. ఈ అంశాన్ని యథాశ్లోక తాత్పర్య రామాయణం (బాలకాండం), ముకుందవిలాసం, అధ్యాత్మరామాయణం కావ్యాల ఆశ్వాసాంత గద్యలు తెలియచేస్తున్నాయి[1].

లక్ష్మీపతి పండితుడు పెద్దన సోమయాజికి తమ్ముడు[2]. పెద్దనగారి తాత, తండ్రి, తమ్ముడు మొదలయినవారంతా విద్వత్కవి పండితులుగా విరాజిల్లినారు[3]. అయితే పెద్దనగారి మూడు రచనలు తప్ప మిగతావారి రచనలు మృగ్యం/అలభ్యం.

పెద్దనగారి సోదరికి భర్త ధూర్వసి నాగార్యుడు[4]. పెద్దనగారి స్వగ్రామం నందవరం అనీ ఆయన బావగారయిన ధూర్వసి నాగార్యుల వారిది కోవెలకుంట్ల తాలుకాలోని దుర్వేసి (ధూర్వశి) అనే గ్రామం అనీ ఆత్మీయులు బ్రహ్మశ్రీ గడియారం రామకృష్ణ శర్మగారు దాదాపు రెండు దశాబ్దాల క్రితం నాకు ఒక ఉత్తరం ద్వారా తెలిపినారు.

నృసింహవిలాస ప్రణేత అయిన లక్ష్మీనృసింహకవి, చూతపురీ విలాసం రాజకన్యాపరిణయం కావ్యాలను రచించిన నరసింగకవి అనే సోదరులు కాణాదం పెద్దనగారికి బావమరది వరుసవారనీ, వారు ప్రౌఢులయిన జంటకవులనీ, కొల్లాపురం సంస్థానం సమీపానగల ఎల్లూరు వారి స్వగ్రామమనీ, గద్వాల సంస్థానంలో ఆ జంటకవులకు విశేషమర్యాద లుండెడివనీ తెలియవస్తోంది.[5]

విద్యా గురువులు

ధూర్వసినాగార్యుడు పెద్దనగారికి సోదరిభర్తగా బావగారేగాక విద్యా గురువుకూడా. నాగార్యుని గురించి పెద్దనగారు–

కం॥ ఉర్వర వీరనృసింహా
ఖర్వకృపాలబ్ధ సరస కవితాలహరీ
ధూర్వహు మద్భగినీధవు
ధూర్వసి నాగార్యు సుగుణధుర్యునుతింతున్ – ముకుందవిలాసం 1.17

1. 'కాణాదాన్వయతిమ్మనార్యకుమార . . . .' ఆశ్వాసాంతగద్యలు.
2. 'ప్రౌఢ లక్ష్మీపతి పండిత సోదర్యు' – ముకుంద. 1–23, అధ్యాత్మ 1–22.
3. గద్వాల చినసోమభూపాలుడు పెద్దనగారితో ఇలా అన్నాడు.
   కం॥మీతాతయు మీతండ్రియు, మీతమ్ముడు మీరు మరియు మీకులజులు వి
   ఖ్యాత ప్రబంధరచనా, ప్రీతచరిత్రులు కణాదపెద్దన సుకవీ!– ముకుంద 1–26
4. '... మద్భగినీధవు, ధూర్వసినాగార్యు సుగుణధుర్యు నుతింతున్' – ముకుంద 1–17.
5. I. గోలకొండ కవులసంచిక–పుట 408, ముద్రణ.1934, II. విజ్ఞానసర్వస్వం 4వ సంపుటం–2. పుట1176, ముద్రణ 1961. III. చూతపురీవిలాసము. కర్త ఎల్లూరి నరసింగకవి; ప్రచురణ 1980. పీఠిక– కపిలవాయి లింగమూర్తి, పీఠికలో ఈ అంశాలు ప్రస్తావించబడినవి. పుట 11.

ఉ॥ ... ... వచస్సుధా
మా గురు నాగనార్యగురు మద్భగినీధవు నాశ్రయించెదన్ – అధ్యాత్మరామాయణం 1-15.'

అని స్తుతించినాడు.

కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ ప్రాంతాలలో నృసింహస్వామి ఆరాధన ఎక్కువ. నాగార్యుడు దుర్వేసి గ్రామస్తుడు కనుక వీరు నృసింహారాధకుడు అయి ఉంటాడని ఒక ఊహ. బాల్యంలో నందవరంవాసి అయిన పెద్దన ధూర్వసిలో బావగారి వద్ద చదువుకొని ఉంటాడని మరొక భావన.

పెద్దనగారి విద్యాగురువులలో మరొకరు పిల్లేమల్లేశ్వర దీక్షితులవారు. వీరిని పెద్దన ఇలా స్తుతించినాడు.

కం॥ ఎల్లప్పుడు సేవించెద
నుల్లంబున వేదశాస్త్ర యోగాన్వితులన్
బిల్లేవంశాంచితులన్
మల్లేశ్వర దీక్షితులను మద్గురువరులన్ – ముకుందవిలాసం 1.17

ఉ॥ వాగనుశాసన ప్రతిభ వర్తిలి సంస్కృత సంస్కృతాంధ్ర భా
షాగరిమం బ్రసిద్ధులగు సాధువరిష్ఠుల యోగనిష్ఠులన్
మా గురుమల్లికార్జున సమాఖ్యుల దీక్షితులన్ (వచస్సు ధా
మా గురు నాగనార్యగురు మద్భగినీధవు నాశ్రయించెదన్) – అధ్యాత్మ రామాయణం 1-15.

ఆశ్రయమిచ్చిన ప్రభువులు

సదాశ్రయం, సరసాశ్రయం లేనిదే రసవత్కవిత్వమైనా రాణించదని విజ్ఞులమాట. పెద్దనకు అలాంటి ఆశ్రయం లభించింది. అందువల్ల ఆయన రాణించే రసవత్కావ్యాలను రచించినారు.

పెద్దనకు ఆశ్రయమిచ్చిన ప్రభువులు గద్వాల, బోరవెల్లి, సురపురం సంస్థానంవారు.

కాణాదం పెద్దన నూనూగుమీసాల నూత్నయౌవనంలో గద్వాల సంస్థాన ప్రభువగు పెదసోమభూపాలుని ఆశ్రయాన్ని పొందినాడు. పెద్దన 'పెదసోమ భూపాలుని దండకం' రచించినాడు. పెదసోమభూపాలుడు వాల్మీకి రామాయణాన్ని యథాశ్లోక తాత్పర్యంగా తెనిగింపచేయాలని సంకల్పించినాడు. అందులో బాలకాండం రచనకు కాణాదంవారు శ్రీకారం చుట్టినారు. భద్రజయోపాఖ్యానం అనే రచనను కూడా పెదసోమభూపాలుని ఆనతిమేరకు కాణాదంపెద్దన రచించినాడు. గద్వాల పెదసోమభూపాలుడు క్రీ.శ. 1712లో హతుడు కావటంవల్ల సంస్థానంలో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. దానితో యథాశ్లోక తాత్పర్య రామాయణాది రచనలు ఆగిపోయినవి.

గద్వాల సంస్థాన ప్రభువు కూతురు గిరియమ్మ. ఈమె బోరవెల్లి సంస్థాన ప్రభువు చినసోమభూపాలుని అర్థాంగి. కాణాదంపెద్దన బోరవెల్లి సంస్థానంలో ఉన్నారు[1]. అందుకే వీరిని బోరవెల్లి కాణాదం పెద్దన అనికూడ స్థానిక సంస్థానం ప్రాంతీయులు పేర్కొన్నారు[2]. బోరవెల్లి సంస్థానం తదనంతర కాలాన గద్వాలసంస్థానంలో విలీనమయింది.

గద్వాల సంస్థానంలో రాజకీయ సంక్షోభం ఏర్పడిన కారణాన కాణాదం పెద్దనను సురపురం సంస్థాన ప్రభువు పామనాయకుడు తమ సంస్థానానికి ఆహ్వానించినారు. పామనాయకుడు కవిపోషకుడేగాక స్వయంగా కవికూడ. ఆ ప్రభువు 'భార్గవపురాణము'[3] అనే బృహత్ కావ్యాన్ని రచించినాడు. పామనాయకుని ఏలుబడిలో సురపురం సంస్థానంలో ఉన్నపుడు (1752-72) కాణాదం పెద్దన శేషశైలేశలీల, మత్స్యపురాణం అనే రచనలు చేసినాడు. మత్స్యపురాణం పామనాయకుని ఆదేశం మేరకు రచించబడింది. అది సురపురంలో వెలసిన వేణుగోపాలస్వామి వారికి అంకితం.[4]

తదనంతరకాలాన గద్వాల సంస్థానంలో చినసోమభూపాలుడు ప్రభువైనాడు. అపుడు గద్వాల సంస్థానంలో రాజకీయ వ్యవస్థకు స్థిరత్వం చేకూరి కవిపండితపోషణ బాగా జరిగింది. ఆ సందర్భాన కాణాదంవారు తిరిగి గద్వాల సంస్థానానికివచ్చి చినసోమభూపాలుని ఆస్థానంలో ఆశ్రయం పొందినాడు. చినసోమభూపాలుని సంస్థానపు అష్టదిగ్గజ కవులలో పెద్దన గారు వయసులోను కవితాపాండిత్యంలోనూ పెద్దవారగుటచే అగ్రస్థానాన్ని పొందినారు. చినసోమభూపాలుని కోరికమేరకు కాణాదం పెద్దన ముకుంద విలాసం, అధ్యాత్మరామాయణం అనే రచనలు చేసినాడు.

పై అంశాలను బట్టి కాణాదం పెద్దనకు ఆశ్రయమిచ్చిన ప్రభువులను వరుసగా ఒక పట్టికగా కింద పేర్కొనడమైనది. వారి కాలాలుకూడ తెలుపడ మైనది.

1. గద్వాల పెదసోమభూపాలుడు- 1705 - 1712
2. బోరవెల్లి గిరియమ్మ- 18వ శతాబ్ద పూర్వార్ధం
3. సురపురం పామనాయకుడు- (1752-1773)
4. గద్వాల చినసోమభూపాలుడు- (1761-1794)

కాలం

కాణాదం పెద్దనార్యుని రచనల ఆధారంగ ఆయన కాలనిర్ణయం స్థూలంగ చేసే అవకాశం ఉంది. ఈ కాలనిర్ణయానికి గద్వాల, సురపురం సంస్థానాల ఏలికల పాలనాకాలం కూడ ఉపకరిస్తుంది. కనుక సంబంధిత మైన ఆయా అంశాలను ప్రస్తావిస్తూ కాణాదంవారి కాలనిర్ణయం చేద్దాం.

1. విజ్ఞానసర్వస్వము 4వ సంపుటము. పుట 1176.
2. సంస్థానముల సాహిత్యసేవ (పుట-30) కేశవపంతుల నరసింహశాస్త్రి, పొ.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాదు. పునర్ముద్రితలఘుగ్రంథాలు-2012.
3. ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, హైదరాబాదు. 1986 లో ప్రచురించినారు. విపుల పీఠికా కర్త : తిరుమల రామచంద్ర.
4. చూడు : అనుబంధం 623 పుట.

ముష్టిపల్లి పెదసోమభూపాలుడు క్రీ.శ. 1608–1705 మధ్యకాలాన పూడూరు దుర్గానికి అధిపతి. శిధిలమైన పూడూరు దుర్గం క్షేమకరం కాదని పెదసోమభూపాలుడు 1698–1705 మధ్యకాలాన పూడూరుకు ఐదుమైళ్ల దూరాన గద్దవాలుగుండు ఉండేచోట/గద్దపల్లి దగ్గర బలిష్ఠమైన ఒక కోటను నూతనంగా నిర్మించి గద్వాల సంస్థానాన్ని ఏర్పాటుచేసినాడు.[1] ఈ ప్రభువును క్రీ.శ. 1712 (నందననామ సవంత్సర జ్యేష్ఠ శుద్ధ అష్టమినాడు[2] యుద్దంలో శత్రువులు కుట్రచేసి చంపినారు. దీనిని బట్టి గద్వాల సంస్థానం 1705నాటికి ఏర్పడిందనీ ఆ తర్వాత ఏడు సంవత్సరాలు అంటే క్రీ.శ. 1712 వరకు పెదసోమభూపాలుడు గద్వాల సంస్థాన పాలనం చేసినాడని స్పష్టమౌతోంది.

కాణాదం పెద్దన పెదసోమభూపాలుని సంస్థానంలో ప్రవేశించి 'పెదసోమ భూపాల దండకం', 'భద్రజయోపాఖ్యానం' రచించటం, యథాశ్లోక తాత్పర్య రామాయణ బాలకాండ రచనకు శ్రీకారం చుట్టటం జరిగింది. అంటే పెదసోమభూపాలుని పాలనాకాలంలోనే కాణాదం పెద్దన గద్వాల సంస్థానంలో ఉండినాడనటం సుస్పష్టం. కనుక పెద్దన నూనూగు మీసాల నూత్నయౌవనంలోనే 1710 ప్రాంతంలో పెదసోమభూపాలుని ఆస్థానంలో ఉన్నాడనటానికి అడ్డంకులులేవు. అప్పటికే పైరచనలలో సోమభూపాల దండకం, భద్రజయోపాఖ్యానం రచనలు చేసినవారు కావటంవలన పెద్దనకు కనీసం 22 సంవత్సరాలయినా ఉంటాయనుకుంటే ఆయన క్రీ.శ. 1690 ప్రాంతంలో జన్మించి ఉంటాడు.

కాణాదం పెద్దన అధ్యాత్మరామాయణంలో ఆ రచనాకాలాన్ని పేర్కొన్నాడు. ఆపద్యం–

అచలనవరసైక రచితభావశకాప్తి
మన్మథాభిహిత సమస్ఫుటాప్తి
నలరజేసె నిజమహాకృతినధ్యాత్మ
రామమూర్తి జగతి రమ్యకీర్తి – అధ్యాత్మరామాయణం 8ఆశ్వాసం–426 పద్యం

అచల=7, నవ–9, రస=6, ఏక=1(ఒకట్లస్థానం=1, పదులస్థానం=9, వందలస్థానం=6, వేలస్థానం=1) కనుక శాలివాహన శకం 1697. దీనికి సరియగు క్రీస్తు శకం 1697+78=1775. అధ్యాత్మరామాయణ రచన క్రీ.శ. 1775 అని కవిగారే చెప్పినారు. పెద్దన జనన కాలం పూర్వోక్త ఉపపత్తుల ప్రకారం క్రీ.శ. 1690. దీనిని బట్టి అధ్యాత్మరామాయణ రచనా కాలం నాటికి పెద్దన వయస్సు 1775–1690=85 సంవత్సరాలని స్పష్టమౌతుంది. క్రీ.శ. 1775 తర్వాత పెద్దన రచనలేవీ చేయలేదనే భావించవచ్చు. చేసివుంటే వాటిపేర్లైనా తెలిసేవి కదా! కనుక వయోవృద్ధులైన పెద్దనగారు క్రీ.శ. 1776 ప్రాంతంలో పరమపదించి ఉంటారని భావించ వచ్చు. కనుక స్థూలంగా కాణాదం పెద్దనగారి కాలం క్రీ.శ. 1690–1776. పెద్దన జననమాదిగా మరణించేవరకు ఆయా సంస్థానాధీశ్వరుల ఆశ్రయంలో రచించిన కావ్యాదుల కాలాలు ఈ విధంగా ఉంటాయి.

1. కోటలో కొంతభాగం అనుబంధం 620వ పుటలో చూడవచ్చు.
2. కాకతీయ సంచిక, మారేమండరామారావు వ్యాసం–గద్వాల సంస్థానము–పుట 263, ప్రచురణ : 1935.

క్రీ.శ. 1690 కాణాదం పెద్దన జననం. నందవరం (ప్రస్తుత బనగానిపల్లె మండలం, కర్నూలు జిల్లా).

క్రీ.శ. 1700–1710 దుర్వేసి (కోవెలకుంట్ల తా॥)లోని బావగారగు నాగార్యుని దగ్గర మరియు కొల్లాపురం ప్రాంతంలో పిల్లే మల్లేశ్వరదీక్షితుల వద్ద విద్యాభ్యాసం. విప్రవంశం అనే రచన చేసినారు.

క్రీ.శ. 1710–1712 గద్వాల సంస్థానం పెదసోమభూపాలుని ఆశ్రయం. 'పెదసోమభూపాల దండకం', 'భద్రజయోపాఖ్యానం', రచనలు. రాజాగారి మరణంతో యథాశ్లోక తాత్పర్య రామాయణ బాలకాండ రచన ఆగిపోయింది.

క్రీ.శ. 1713–1751 బోరవెల్లి సంస్థానం గిరియమ్మగారి ఆశ్రయం. భోజచంపూవ్యాఖ్యాది రచనలు చేసినారు.

క్రీ.శ. 1752–1762 సురపురం పామినాయకుని ఆశ్రయం. 'శేషశైలేషలీల', 'మత్స్యపురాణం' రచనలు చేసినారు.

క్రీ.శ. 1763–1775 గద్వాల చినసోమభూపాలుని ఆశ్రయంలో 'యథాశ్లోక తాత్పర్య రామాయణ బాలకాండ' రచన పూర్తి చేసినారు. 'ముకుందవిలాసం', అధ్యాత్మరామాయణ' రచనలు చేసినారు.

క్రీ.శ. 1776 పరమపదం – గద్వాల సంస్థానం.

మొత్తం జీవితకాలం 86 సంవత్సరాలు. ప్రస్తుత ఆధారాలను బట్టి స్థూలంగా పైన చెప్పిన కాల నిర్ణయం చేయబడింది.

వైదుష్యం

తెలియవస్తున్నంతలో కాణాదం వంశం 11వ శతాబ్దం నుంచి తరతరాలుగా పండిత వంశంగా దర్శనమిస్తుంది. పెద్దన గురువులదగ్గర సుశిక్షితుడై అసాధారణ ప్రజ్ఞా పాటవాలు సంపాదించుకున్నాడు. రసవత్కావ్య రచనలతో పాటు బంధగర్భ చిత్రకవిత్వాలలోకూడ కాణాదంవారు ప్రావీణ్యం కలవారు. శేషశైలేశలీల అనే అపంచవర్ణీయకృతిని (కేవలం పది అక్షరాలతో) చేసినారు. భోజచంపువునకు వ్యాఖ్యానం సంతరించినాడు, సంస్కృతభాషలో దిట్ట. బాహట గ్రంథానుభావధుర్యుడు. సూక్తి విభ్రాజి. ప్రౌఢమైన విష్ణు చిత్తీయాన్ని పోలిన మత్స్యపురాణాది రచనలు, శిరీషకుసుమపేశల సదృశమైన ముకుందవిలాసాది రచనలు చేసినవాడు.

'ఉభయకవితా నిస్సహాయ సాహితీ విహారుడు', చతుర్విధకవిత్వ ప్రవీణుడు'. ఆశువుగా సమస్యా పూరణాది ప్రస్తావోచిత పద్యకవనం విద్వదాస్థానాలలో వినిపించినవాడు. వీరిని సమకాలీనుడైన వెన్నలకంటి వేంకటకవి ఇలా ప్రశంసించినారు.

ఉ॥ ఇద్దరు జోడు నన్నకవి యెర్రన, తిక్కన సోమయాజి గా
నుద్దగు వారికిన్ ముగురికొక్కడె దీటగు నల్లసాని మా
పెద్దన వారితోడుతను బేరువహించిన శ్రీ కణాదముం
బెద్దన సోమయాజి విను పెద్దన బోల్చు కవిత్వసంపదన్ – అధ్యాత్మ. అవతారిక 23 ప.

గద్వాల ప్రభువు చినసోభూపాలుడు కృష్ణరాయలవలె అభినవ భోజరాజ బిరుదాంకుడు. కాగా ఆ ప్రభువు విద్వదాస్థానంలో విరాజిల్లిన అష్టదిగ్గజ కవులలో కాణాదంపెద్దన అభినవఅల్లసానిపెద్దనగా విరాజిల్లిన విద్వత్కవి వర్యుడు.

కాణాదం వారికి తదనంతర సమీపకాలం వాడయిన సురపురం కేశవయ్య 'దాశరథి చరిత్ర'ను రచించినపుడు కాణాదంవారి 'ముకుందవిలాస' పదప్రయోగాలను ప్రామాణికంగా గ్రహించినాడు[1].

చినసోమభూపాలుని విద్వదాస్థానంలో 'షట్చాస్త్రసంపన్నులైన విద్వాంసులు నూటికుందురనీ వారిలో కాణాదంవారు మేటి' అని ఆదిపూడి ప్రభాకర కవి ప్రశంసించినారు.[2]

కవిసింహ పోకూరికాశీపతి తన త్ర్యర్థికావ్యం 'సారంగధరీయం', అవతారికలో కాణాదంవారి భద్రాపరిణయంవలె తనకవిత్వం ఉంటుందని చెప్పినాడు[3]. అంటే పెద్దన కావ్య ప్రాశస్త్యంకూడ ఇక్కడ వ్యక్తంచేయటం జరిగిందన్నమాట.

కందుకూరి వీరేశలింగం పంతులుగారు కవులచరిత్రలో కాణాదం వారిని గురించి వ్రాస్తూ 'ఈతని గ్రంథంలోనున్నన్ని శబ్దాలంకారములు మరియే గ్రంథంలోను లేవు. ఈతని కవనము రసవంతమయి కవిజన హృదయరంజకముగానుండును' అని వ్రాసినాడు[4].

తిరుపతి వేంకటకవులు కాణాదంవారి ముకుందవిలాసాన్ని ఒక సుదీర్ఘ ఉత్పలమాలికా వృత్తంలో ప్రశంసించినారు[5]. ఇలా ఎందరెందరో కవి పండితులు కాణాదంవారి కవనాన్ని, వైదుష్యాన్ని ప్రశంసించినారు.

రచనలు

పెద్దన రచనలను అస్తిత్వాన్నిబట్టి మూడురకాలుగా వర్గీకరించవచ్చు. అవి: 1. పేరుకూడా తెలియని రచనలు, 2. పేరు మాత్రమే తెలిసిన రచనలు, 3. పేరుగాంచిన రచనలు.

---

1. డా॥వల్లపురెడ్డి బుచ్చారెడ్డి దగ్గరగల దాశరథి చరిత్ర వ్రాతప్రతి.
2. సీ॥ శ్రీకేశవపద రాజీవార్చనాయత్త సుస్వాంతుడైన శ్రీ శోభనాద్రి
   సార్వభౌమునిచేత స్థాపింపబడినట్టి గద్వాల పురము విఖ్యాతి తోడ
   చినసోమభూపాలుడనగ నాతని మన్మ డేలుచుండెను నూట యేబదేడ్ల
   క్రింద నాతనిరాజ్యమందు షట్చాస్త్రసంపన్నులై నట్టి విద్వాంసులొక్క
   తే.గీ॥ నూటికుందురు వారిలోమేటి యనగ-నుభయ కవితా సమర్థుడబ్జభవకులుడు
   శ్రీముకుంద విలాసంబు చేసినట్టి-ఘనుడు పెదనాఖ్యుడొప్పుదిక్కనకు సముడు
   – యథాశ్లోక తాత్పర్య రామాయణం పీఠిక. సంస్థాన ప్రచురణ : శా.శ. 1818.
3. చూడు : సారంగధరీయం – అవతారిక 24 పద్యం వాఖ్య. ప్రథమ ముద్రణ : 1933.
4. ముద్రణ-2005. పుట 779.
5. ఈ పద్యం తరువాతి 18వ పుటలో ఇవ్వబడినది.

పేరుకూడ తెలియని రచనలు

గద్వాల చినసోమభూపాలుడు పెద్దనగారిని అధ్యాత్మరామాయణాన్ని ఆంధ్రంలో రచించమని కోరుతూ–

కం॥ మునుపుం భద్రాపరిణయ
మను కృతి జేసితిరి కేశవాంకితముగ మా
యనుమతి, మరియు ననేకము
లొనరించితి రాంధ్ర సంస్కృతోక్తుల గృతులన్ – అధ్యాత్మ 1–26.

దీనినిబట్టి పెద్దన సంస్కృతాంధ్రాలలో అనేక కృతులొనరించినట్లు సుస్పష్టం. అయితే ఆ అనేక రచనలలో పేర్లుకూడ తెలియనివి ఎన్నో...!

గద్వాల సంస్థానంలో తొలితెలుగు సమస్యాపూరణం[1]

గద్వాల సంస్థానమందు జరిగిన విద్వద్గోష్ఠులలో అవధానాది కార్యక్రమాలలో ఎందరో కవివర్యులు చెప్పిన పద్యాలు అసంఖ్యాకంగా ఉన్నాయి[2]. వాటిలో సమస్యాపూరణ పద్యాలుకూడ ఉన్నాయి. అయితే గద్వాల సంస్థాన సాహిత్యాన్నిగురించిన రచనలలో రామభూపాలుగారి (క్రీ.శ. 1845–1901) కాలాన మరియు తదనంతర కవులకాలాన చెప్పిన సమస్యలను మాత్రమే పరిశోధకులు ప్రస్తావించినారు. రామభూపాలుగారికి పూర్వం చెప్పిన సమస్యల్ని ఇందాక పరిశోధకులెవ్వరూ గుర్తించలేదు[3]. చినసోమభూపాలు గారి కాలాన (క్రీ.శ.1762–1793) చెప్పబడిన (క్రీ.శ. 1775కు పూర్వం) తెలుగు సమస్య పద్యమొకటి లభిస్తున్నది. అది ఇందాక లభిస్తున్నవాటిలో గద్వాల సంస్థానానికి సంబంధించిన తొలితెలుగు సమస్యా పూరణ పద్యం. ఆ పద్యం ఇది –

సమస్య : శంఖంబుల్ దివినుండి వ్రాలిపడియెన్ జంబూఫల ప్రక్రియన్

పూరణ : ప్రేంఖల్లీల విశృంఖలస్థితిని బ్రేరేపింప నుచ్చైశ్రవః
కంఖాణుండు ఘనాళినుండి జలరేఖాబిందుసందోహము
ల్పుంఖాపుంఖిని వేలు లక్షలును గోట్లున్యర్బుదంబుల్ మహా
శంఖంబుల్ దివినుండి వ్రాలిపడియెన్ జంబూఫల ప్రక్రియన్

1. ప్రస్తుత పీఠికాకర్త రచించిన 'విద్వద్గద్వాల సంస్థాన సాహిత్యం – విస్మృత విశేషాలు' అనే వ్యాసం 'గద్వాల రాజుల వంశచరిత్ర' అనే సంచికలో ప్రచురితం. పుటలు 100 నుండి 108 వరకు. ముద్రణ. 1995. ఆ వ్యాసంనుండి ప్రస్తుతాంశం గ్రహించడమైనది.
2. 'గద్వాల సంస్థానం–అవధానాలు, ఆశుకవితలు, చాటువులు' అనే విషయాన్ని పరిశోధనాంశంగా తీసుకొని సంబంధిత పద్యాలన్ని సేకరించి సందర్భోచిత వ్యాఖ్యలతో విశ్లేషిస్తే అదొక బృహద్గ్రంథం అవుతుంది.
3. కె. శాలన్న రచించిన 'విద్వద్గద్వాల' (1967 ముద్రణ) అనే నాటికలో పెదసోమ భూపాలుని ఆస్థాన సభయందు చెప్పినట్లు 'గాడిద ఏడిచెగదన్న ఘనసంపన్నా', 'దోగ్ధ్రీధేనువు గర్భమందు బులికందుల్పుట్టెనుగ్రాకృతిన్' అనే సమస్యల్ని పేర్కొన్నారు. అన్యత్రా రచితాలైన ఈ సమస్యల్ని నాటికను రక్తికట్టించేందుకు స్వీకరించటం జరిగింది.

ఈ సమస్యను కాణాదంపెద్దనసోమయాజి పూరించినారు. సందర్భోచితంగా ఈ సమస్యాపూరణ పద్యాన్ని పెద్దన తాను రచించిన అధ్యాత్మరామాయణం కిష్కింధకాండలో వర్షాగమన వర్ణన సందర్భంగా (142వ పద్యం) చేర్చినారు. ఇలా గ్రంథస్థం కాక పెద్దన చెప్పిన సమస్యా పూరణ పద్యాలు, ఆశువులు, చాటువులు ఇంకెన్ని కాలగర్భాన కలిసిపోయినవో . . . !

పేరుమాత్రమే తెలిసిన రచనలు

పెద్దన రచించిన సోమభూపాలదండకం, శేషశైలేశలీల, మత్స్య పురాణం, భోజచంపూవ్యాఖ్య అనేరచనలు దాదాపుగ నామమాత్రంగా వినబడుతున్నాయి. వీటిని గురించి–

సోమభూపాల దండకం :

కాణాదం పెద్దన నూనూగుమీసాలనూత్న యౌవనంలో ఉన్నపుడు గద్వాల పెదసోమభూపాలునిగురించి పోతనగారి భోగినీ దండకం ఫక్కిలో సోమభూపాలదండకాన్ని రచించినాడు. ఈ వివరాలు గద్వాలసంస్థాన ఆశ్రితకవివర్యుడు కవిశరభ పెదమందడి వేంకటకృష్ణకవిగారు (క్రీ.శ. 1888–1943) గద్వాలసంస్థానచరిత్రను రచించేందుకు సేకరించిన అంశాలను వ్రాసి ఉంచిన లిఖితప్రతులలో పేర్కొని దండకంలోని కొంతభాగం ఇవ్వటం జరిగింది. దండకంలో పేర్కొన్న భాగం 'శ్రీముష్టిపల్యన్వయాంబోధి చంద్రుండు పెద్దావనీనాథపుత్రుండు శ్రీసోమ భూపాలకుం డొక్క నాడెక్కువై నట్టి మేల్ తేట పన్నీటిచే మజ్జనంబాడి....'

శేషశైలేశలీల :

గద్వాల ఏలిక చినసోమభూపాలుడు పెద్దన్నతో

"తే॥గీ॥ కాదివర్ణంబు ఇరువదియైదు విడిచి
చేసితి వపంచవర్గీయ చిత్రకృతిని
శేషశైలేశ లీలాఖ్యచే నెసంగ
యాది మిత వర్గనియతి శక్యంబె జగతి"

అన్నట్లు ముకుందవిలాసం (1–24)లో పేర్కొనబడింది. క,చ,ట,త,ప (కాదివర్గాలు ఐదు) అనే వర్గాలలోని 25 అక్షరాలు వదలిపెట్టి కేవలం యాదిమితంగా 'య,ర,ల,వ,శ,ష,స,హ,ళ,క్ష' అనే పది అక్షరాలతో మాత్రమే ఈ కృతిని రచించబడింది. కావ్యనామంలోకూడ అపంచవర్గీయాక్షరాలే వాడటం జరిగింది. పెద్దన పాండిత్యప్రకర్షకు చిత్రకవితా ప్రీతికి ఈ కావ్యం చక్కని నిదర్శనం. శేషశైలేశలీలనుండి సింహావలోకన, ముక్తపదగ్రస్త కందమొక దానిని తూమాటి దొణప్పగారు 'ఆంధ్ర సంస్థానములు – సాహిత్య పోషణము'[1]లో ఉదహరించినారు. శేషశైలేశలీల పామనృపాలునకు అంకితం అనికూడా దొణప్పగారు పేర్కొన్నారు. కాని అది సరికాదు. పెద్దన ఏకృతినికూడా నరాంకితం చేయలేదు. అది సురపురం పామనాయకుని ఆశ్రయంలో వేణుగోపాలస్వామికి అంకితంగా రచించబడింది[1]. దొణప్పగారు ఉదహరించిన పద్యం

1. ప్రచురణ : ఆంధ్ర విశ్వకళాపరిషత్తు – వాల్తేరు. 1969.

కం॥ సరసావంశీ సురవా
సురవారాశంసి శౌర్య శూరా శరహా
శరహారి హరి స్వరయా
స్వరయాహవ లీల యాస్య వశహా సరసా !

ఈ పద్యం ముకుందవిలాసంలోనూ (3-315)ఉంది. అపంచవర్ణీయ మైన (య-ర-ల-వ-శ-ష-స-హ) దశాక్షరాలతో మాత్రమే ప్రత్యేకంగా ఒక కృతినే రచించినవారిలో ప్రప్రథమకవి కాణాదం పెద్దనార్యుడే. అయితే ఆ కృతి అలభ్యం కావటం మన దురదృష్టం. ఈ కృతి నిర్బిందు నిరనునాసిక కృతి. కనుక ముక్కుమూసుకొని చదివినా శబ్దాలు నంగిగారాక స్వచ్ఛంగా పలుకుతాయి. ప్రయోగాత్మకంగా పై పద్యాన్ని ముక్కుమూసుకొని చదివి గమనించండి[1].

మత్స్యపురాణం :

సురపురం సంస్థానాన్ని రాజాబహిరి పామనృపాలుడు క్రీ.శ. 1752 నుండి 1773 వరకు పాలించినాడు. పెద్దనార్యుడు క్రీ.శ. 1752 నుండి దాదాపు దశాబ్దంపాటు సురపురం సంస్థానంలో ఉన్నాడు[2]. పామనాయకుని ఆశ్రయాన పెద్దనార్యుడు మారమణాంకితంగా (సురపురం సంస్థానప్రభువుల ఇలువేలుపు అయిన) వేణుగోపాల స్వామివారికి అంకితంగా మత్స్యపురాణాన్ని రచించినాడు. ఇది సంస్కృత మత్స్యపురాణానికి ఆంధ్రీకృతి. ఈ రచన గద్వాల ప్రభువు చినసోమభూపాలుని ఆశ్రయాన రచించబడిన ముకుంద విలాసానికన్నా పూర్వం రచించబడినట్లు ముకుందవిలాసంలో పేర్కొన బడింది. మత్స్యపురాణం ప్రౌఢంగా ఆముక్తమాల్యద శైలివలె రచించబడి ఉంటుంది[3]. పెద్దనార్యుడు మత్స్యపురాణాన్ని రచించినట్లు కింది పద్యంవల్ల తెలియవస్తోంది.

---

1. గద్వాల ఆశ్రితకవియైన కవిసింహ పోకూరి కాశీపతి అవధానులుగారు. ఇటీవలి కాలంలో ఆదోని తాలుకా హాలహర్వి గ్రామస్థులగు శ్రీమన్ముద్దనూరి హనుమంత రెడ్డిగారికి అంకితంగా 'శ్రీశౌరిశైశవలీల' అనేకృతిని (61 పద్యాలు సవ్యాఖ్యానం) రచించి 1970లో ప్రచురించినారు.

   అపంచవర్ణీయ కృతిని గురించి తెలిపే పద్యం

   తేగీ॥ సుకవులు ప్రబంధములలోన నొకటిరెండు
   పద్యములు నేర్పుజొప నపంచవర్గ
   కవితయాని రచించుటేకాని నేటి
   కెంచనిక్కేవల స్వరా పంచవర్గ
   ముగను నిర్బిందు నిర్గద్య మూగనుగ్రంథ
   మును రచించిన కవిలేరు భవినెటేని
   శౌరిశైశవలీల నా సరణి వెలయ
   నే రచించితిగావున నిరనునాసి
   కముగ రూపొందె సూవె నిక్కముగ ముద్ద
   నూరి హనుమన్నృపాల విస్ఫార కేల – శౌరిశైశవలీల ఉపోద్ఘాతం 11 ప

2. క్రీ.శ. 1763లో గద్వాల సంస్థానానికి చినసోమభూపాలుడు ప్రభువైనాడు. చినసోమభూపాలుని పాలనాకాలంలో పెద్దనార్యుడు తిరిగి గద్వాల సంస్థానానికి విచ్చేసి సాహిత్య వ్యాసంగాన్ని సాగించినాడు.
3. మున్+విష్ణు, చిత్తీయతుల్యమౌ మదీయ కవితా – ముకుందవిలాసము 1-31.

ఉ॥ శ్రీరమణీయతన్ సురపురీ నగరీ సగరీయదేశ[1] భూ
భార ధురీణుడౌ బహిరి పామనృపాలు సభాంతరంబునన్
మా రమణాంకితంబుగను మత్స్యపురాణమొనర్పబూనవే
సారసుధాప్రసార విలసత్కృతి సాంద్ర వచశ్చమత్కృతిన్
ముకుందవిలాసం 1-25

పెద్దనకృత మత్స్యపురాణం అలభ్యం.

సురపురం సంస్థానంలో అనేక కవి పండితులుండినారు. సంస్థాన ప్రభువు పామనాయకుడుకూడా (భార్గవపురాణాన్ని రచించిన) కవి వర్యుడే. ఈ సంస్థానంలో రచించబడిన తెలుగు కావ్యాలలో పామనాయకుని భార్గవ పురాణం, కిరీటివేంకటాచార్యుల అచలాత్మజా పరిణయం (అసంపూర్ణం), సురపురంకేశవయ్య దాశరథి చరిత్ర (అసంపూర్ణం) నంబెరుమాళ్ల పురుషకారి వంశీయుల తెలుగు కీర్తనలు, తిరుమల బుక్కపట్నం శ్రీనివాసదేశికుల సప్తపది (తిరుప్పావైకి తెనుగుసేత) తప్ప మిగతా రచనలేవికూడా లభ్యాలు కాకపోవటానికి ఏదైనా బలమైన కారణం ఉంటుందేమో !

భోజచంపూవాఖ్య :

భోజుని చంపూ రామాయణానికి పెద్దనార్యుడు సంస్కృతంలో వ్యాఖ్యానాన్ని రచించినాడు. కాణాదంవారికి భోజుని సాహిత్యంపై మక్కువ ఎక్కువ 'ఏకోరసః కరుణఏవ' అని భవభూతి చెప్తే, 'శృంగారః ఏక ఏవ రసః' అన్న నిరంకుశ విద్వత్ప్రభువు భోజుడు. గద్వాల చినసోమభూపాలుడు అభినవభోజునిగా విఖ్యాతుడు, కవులచే అలా కీర్తించబడినాడు. ఈయన రతిరహస్య ప్రణేతకూడా కావటం గమనార్హం. భోజచంపూవ్యాఖ్యను రచించటంవల్ల పెద్దనకున్న సంస్కృతభాషా పాండిత్యాదులను స్థూలంగా ఊహించవచ్చు. కానీ ఈ వ్యాఖ్య అలభ్యం. పెద్దన ఈ వ్యాఖ్య రచించినట్లు కింది పద్యంవల్ల తెలియవస్తోంది.

తే॥గీ॥ భోజచంపూ ప్రబంధార్థ బోధనాను
బంధ గీర్వాణ టీకా నిబంధనాది
పేశలవచో రచన చర్యు పెద్దనార్యు
గాంచి దయమించి పలికె సగౌరవముగ
- ముకుందవిలాసం 1-23

భద్రజయోపాఖ్యానము :

దీని రచన పెదసోమభూపాలుని కాలాన (1710-1712) జరిగింది. అయితే దీనికి మెరుగులుదిద్ది చినసోమభూపాలుని కాలాన సంవర్ధిత శృంగార కావ్యంగా తీరిచిదిద్ది ముకుందవిలాసంగా సంతరించటం జరిగింది. భద్రాదేవి శ్రీకృష్ణుని అష్టమహిషులలో ఒకతె. ఆమెకు కలిగిన సంతానం భద్రజయుడు. ఈ విషయాన్ని కింది పద్యం స్పష్టం చేస్తుంది.

1. కృష్ణా రైల్వేస్టేషన్‌కు కొంచెం మీదుగాకృష్ణా-భీమా నదులు కలుస్తాయి. ఆ రెండునదుల మధ్యగల ప్రాంతాన్ని సగరదేశమని అంటున్నట్లు కపట్‌రాళ్ కృష్ణారావ్ కన్నడలోరచించిన 'సురపుర సంస్థానద ఇతిహాస'(పుట11) అనే గ్రంథంలోఉంది.

కం॥ సూనశర గురునికృప నా
సూనశరీరిణికి నొక్క శుభలగ్నమునన్
సూనశరుండితడోయన
సూనుడు భద్రజయుడనగ సునయుండొదవెన్ – ముకుందవిలాసం 3-302

పెదసోమభూపాలుని కాలాన భద్రజయోపాఖ్యానకృతి రచించబడినట్లు అధ్యాత్మరామాయణం అవతారికలోని కింది పద్యం స్పష్టం చేస్తుంది.

కం॥ ... ...
... ... భద్రజయో
పాఖ్యాన కృతియు పెదసో
మాఖ్య నృపుడొనర్పజేసె హరికర్పణగన్. – అవతారిక 1-36

విప్రవంశం :

తెలియవస్తున్నంతలో ఇది పెద్దన రచించిన మొదటి రచన[1]. పెద్దన నందవరీకి. నందవరీకులను గురించి తెలియజేసే ఈ రచన క్రీ.శ.1898లో ముద్రితమైనట్లు ఆంధ్రవాఙ్మయసూచిక (పుట 190)లో పేర్కొనబడింది. ఈ రచనను తాను చూసినట్లు పూజ్య ఆత్మీయులు కీ.శే. నిడుదవోలు శివసుందరేశ్వరరావు గారు తెలిపి ఉండిరి. అయితే ముద్రితమైనా కూడా ఈ రచన నేటివరకు (ఈ పీఠికా కర్తకు) లభించలేదు.

పేరుగాంచిన రచనలు :

పెద్దనగారు రచించిన కావ్యాలలో లభ్యమౌతున్న కావ్యాలు మూడు. అవి : యథాశ్లోకతాత్పర్య రామాయణము (బాలకాండం), ముకుంద విలాసము, అధ్యాత్మరామాయణము. ఈ మూడున్నూ పేరుగాంచిన రచనలే.

యథాశ్లోక తాత్పర్యరామాయణం-బాలకాండం :

తెలుగులో భాస్కరరామాయణాదులు ప్రథాన కథను వాల్మీకి రామాయణం నుండి గ్రహించినా అవి మూలవిధేయాలు కావు. ఎన్నో కొత్త కల్పనలు వాటిలో చోటుచేసుకొన్నాయి. వాల్మీకంలోని అంశాలను యథాతథంగా తెలుసుకోదలచినవాళ్లకు ఉపయుక్తంగా ఉంటుందని గద్వాల పెద్దసోమభూపాలుడు వాల్మీకాన్ని యథాశ్లోక తాత్పర్య నిరూపణ పూర్ణంగా రచింపచేయాలనే తనకోరికను ఆస్థానకవులకు తెలిపి వారిని కార్యోన్ముఖులను చేసినాడు. కాని పెదసోమభూపాలుడు క్రీ.శ. 1712లో యుద్ధంలో మోసానికి గురై శత్రువులచే హతుడౌతాడు. ఆ కారణంగా ఆయన సంకల్పించిన యథాశ్లోక తాత్పర్య రామాయణానువాదం ఆగిపోతుంది. తదనంతర కాలాన ఆయన మనుమడు చినసోమభూపాలుడు తాతగారి సంకల్పాన్ని సఫలీకృతం చేస్తాడు. పై విషయాలను యథాశ్లోక తాత్పర్య రామాయణం-అవతారికలోని ఈ క్రింది పద్యాలు స్పష్టీకరిస్తాయి.

1. పెద్దన గద్వాల సంస్థాన ప్రవేశానికి ముందు విద్యాభ్యాసానంతరం ఈ రచన చేసి ఉంటాడని. భావించబడుతున్నది.

కం॥ శ్రీమద్రామాయణమిది
నేమమ్మున వృద్ధసోమ నృపతి మునుకవి
గ్రామణులచేత నాంధ్రము
గా మహినిర్మింపబూనె గావున నాకున్

తే॥గీ॥ అతని సంకల్ప మీడేర నర్హమగుట
ప్రేమ నీకాండలన్ని జెప్పింతుగాన
కొదువ కాండలు మీరింపు గూర్పవలయు
నమర కేశవదేవ నామాంకితముగ

పై పద్యంలో 'కొదువ కాండలు' అని ఉన్నందున పెదసోమ భూపాలుని కాలాన కొంతరచన జరిగినట్లు స్పష్టమౌతుంది. వాల్మీకిరామాయణాన్ని యథాశ్లోకతాత్పర్యంగా రచించటం చినసోమభూపాలుని కాలాన పూర్తయింది. అందులో బాలకాండం (3ఆశ్వాసాలు) కాణాదం పెద్దనసోమయాజి, అయోధ్యకాండం 5ఆశ్వాసాలు) కొత్తపల్లి రామచంద్రాచార్యులు, అరణ్యకాండ (3ఆశ్వాసాలు)గార్గ్యపురం సుబ్బాశాస్త్రి, కిష్కింధ కాండం (3ఆశ్వాసాలు) కామసముద్రం అప్పలాచార్యులు, సుందరకాండం (3ఆశ్వాసాలు) తిరుమల కృష్ణమాచార్యులు, యుద్ధకాండం (పూర్వభాగం – 4ఆశ్వాసాలు మరియు ఉత్తరభాగం – 4ఆశ్వాసాలు) బోరవెల్లి శేషాచార్యులు రచించినారు. కృత్యవతారికను కామసముద్రం అప్పలాచార్యులవారు రచించినారు. ఈ గ్రంథాన్ని రెండు సంపుటాలుగా గద్వాల సంస్థాన ప్రభువులు ప్రచురించినారు. బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ కాండాలు గలది మొదటి సంపుటం; సుందర, యుద్ధకాండలు (పూర్వ,ఉత్తర భాగాలు) గలది రెండవ సంపుటం. మొదటి సంపుటం రాజారామభూపాలరావుగారిచే భైరంపల్లి తిరుమలరాయ పరిష్కృతంగా శా.శ. 1818లో గద్వాల–సాహిత్య విద్యా ముకుర ముద్రాక్షర శాలలో ముద్రితం. కాగా రెండవ సంపుటి సీతారామ భూపాలుగారిచే ఆదిపూడి ప్రభాకరకవి పరిష్కృతంగా గద్వాల సాహిత్య విద్యాముకుర ముద్రాక్షరశాలలో ముద్రితం. యథాశ్లోక తాత్పర్య రామాయణం బాలకాండమును పెద్దన మూడు ఆశ్వాసాలుగ రచించినారు. మూలం 1వ సర్గనుండి 22 సర్గల వరకు గల కథను ప్రథమాశ్వాసంగా (430 పద్య గద్యాలు), 23వ సర్గనుండి 49వ సర్గ వరకుగల భాగాన్ని ద్వితీయాశ్వాసంగ (384 పద్య గద్యాలు), 50వ సర్గనుండి 77వ సర్గవరకు గల కథాభాగాన్ని తృతీయాశ్వాసంగ (405 పద్య గద్యాలు) యథాశ్లోక తాత్పర్యంగా అనువాదం చేయబడింది. బాలకాండం మొత్తం ఆశ్వాసాద్యంత పద్యాలు కలుపుకొని 1227 గద్య పద్యాలతో రచించబడింది.

యథాశ్లోక తాత్పర్య రామాయణం కృత్యవతారికలో కామసముద్రం అప్పలాచార్యులు ఎవరెవరు ఏ భాగాన్ని రచించినారో తెలుపుతూ –

"అలకణాదము పెద్దనాధ్వరి యొనరించె
పటుచమత్కృతులతో బాలకాండ" (46వ ప) అని చెప్పినాడు.

యథాశ్లోక తాత్పర్య రామాయణము పూడూరు కేశవదేవునికి అంకితం[1].

ముకుందవిలాసం :

ఈ కావ్యం పెద్దనార్యునిచే శృంగారచమత్కార రసానుబంధంగా రసవత్ప్రబంధంగా, కోవిదులొనంగా రచించబడింది. దీనికి భద్రాపరిణయం, భద్రాపరిణయోల్లాసం అనికూడా నామాంతరాలు. విద్వద్గద్వాల సంస్థాన సంజనిత కవితా వనితా మతల్లికి అపూర్వమణిభూషణం ముకుందవిలాసం. మేనత్తకూతురూ అష్టమహిషులలో ఒకతె అయిన భద్రాదేవికి శ్రీకృష్ణునితో జరిగిన పరిణయం ఇందలి ఇతివృత్తం.

కం॥ కుందవిలాసము తావి ము
కుందవిలాసము సదా ముకుందవిలాసం
బిందు విలాసమును సుధా
బిందు విలాసము హసించుపేశల ఫణితిన్

అని ప్రశంసించ బడిందీకృతి. సంగీత సాహిత్యాభిజ్ఞుడయిన పెద్దనార్యుడు ముకుందవిలాసంలో 'సరసస్ఫూర్తి సరస్వతీయువతికిన్ సంగీత సాహిత్యముల్ వరవక్షోజయుగంబనాబరగు' అని భావించి సంగీతం 'ద్రాక్షాగుచ్ఛ మాధుర్య వైఖరిగా' ఉంటుందనీ, సాహిత్యం 'నారికేళఫలపాక వ్యాప్తి' సౌఖ్యాన్నిస్తుందనీ అంటారు. నిజమే మరి. సంగీతం ఆపాత మధురం, సాహిత్యం ఆలోచనామృతం అన్నారు విజ్ఞులు. పెద్దనార్యుడు ముకుందవిలాసంలో సంగీతసాహిత్యాలను మేళవించి రచనసాగించినాడు. ఇందలి పద్యాలు లయబద్ధంగా పరవళ్ళుతొక్కుతాయి. మృదుపదగుంఫన మాధుర్యంతో మిటారించే సొబగైన నడకలతో–రామరాజభూషణుడి వసుచరిత్రలోని పద్యాలను తలపింపజేస్తాయి. వాటివలెనే పెద్దన పద్యాలు సంగీతంతో మైమరపిస్తాయి, సాహిత్యంతో ఆనంద తన్మయత్వాన్ని కలిగిస్తాయి.

ఉదాహరణకు –

'సురసాల సమశీల సురసాల తరుజాల సరసాలవాచాల పరిసరంబు' అనే పద్యం 'చమరీనికరవాల సమరీతి రతిఖేల దమరీ గళితవాల సమితిలీల' అనే పద్యం, 'ఈ దారి బోరాదు కేదార కోదార శాదారతము వేరె జనగవలయు' అనే పద్యం, 'కలవంబుల రకంబుల పికంబులుగేరె రమణ గీరములు బేరములువారె' అనే పద్యం ఇలా ఉదహరిస్తూపోతే ఎన్నో పద్యాలు... అవన్నీ... హృద్యాలే.

1. పూడూరు దుర్గాన్ని పాలించిన వీరారెడ్డి కూతురు బక్కమను పెద్దసోమభూపాలుడు వివాహం అడినాడు. పూడూరు కేశవస్వామి దయవలననే పెదసోమభూవిభుడు గద్వాల సంస్థానం నిర్మించగలిగినాడు. గద్వాలలో కేశవస్వామిని ప్రతిష్ఠించు కున్నాడు. గద్వాలకు కేశవనగరం అనికూడ వ్యవహారం. పెదసోమభూపాలుని ఆనతిచే రచించబడిన గ్రంథాలన్నికూడ పూడూరు కేశవస్వామికే అంకితం.

ప్రతిపద్య చమత్కారచణుడైన చేమకూరవేంకటకవి కృతివలె పెద్దనార్యుని ఈ సత్కృతి సచమత్కృతి. కృతినామధేయంలోనే చేమకూర వారిని తలపింపజేసినారు కాణాదంవారు. అతనిది విజయవిలాసమైతే ఇతనిది ముకుందవిలాసం. అతనికృతికి సుభద్రాపరిణయం అని నామాంతరం. ఇతనికృతికి భద్రాపరిణయం అనినామాంతరం.

కం॥ ఈ సతి కౌనునకేసరి
కేసరి, నెమ్మోము కల్మికిన్ కల్వలసా
మేసరి, మేసరిగెకు మిం
చేసరి, చేసరసిజముచేసరి సిరులన్

అనే కాణాదంవారి పద్యం 'వాతెరకు నమృతమేతుల–మేతులకింపుల పిసాళి మిసిమికి క్రొమ్మించేతుల' అనే చేమకూరవారి పద్యాన్ని స్మరణకు తెస్తుంది. ముకుందవిలాసంలో ఇలాంటి ఉదాహరణలెన్నో.....! 'మందారమకరంద మాధుర్యం' గా దిద్దితీర్చిన పోతనార్యుని పద్యాల ఒరవడిలో పెద్దనార్యుడు హృద్యాలుగా చెప్పినవెన్నో ఉన్నాయి. 'మందార కుందార విందారత మిళింద బృందంబు జనునె కోరిందపొదుకు' అనే పద్యం 'ఏదివ్యతరమూర్తి నీక్షింప వాంచాప్తి చూడ్కి సాఫల్యంపు సొంపునింపు' అనేపద్యం ఉదాహరణలు.

ప్రబంధోచితమైన వివిధ వర్ణనలతో మూడు ఆశ్వాసాలుగ 903 గద్యపద్యాలలో రచించబడిన ముకుందవిలాసంలో – 'తాడుదన్నెడువారిం దలదన్నువారులేరె, మ్రొక్కబోయినదేవుడెదురైనరీతి' లాంటి సామెతలూ, 'కయ్యమునకు కాల్జాచుగతి, కన్నులగట్టినట్టుల, చల్లగాబ్రతుకు, తూచాతప్పక, కన్నులుగప్పు, ముద్దుగారు మున్నగు జాతీయాలు, పలుకుబళ్లు పుష్కలంగా ఉన్నాయి. పెళ్లి సమయాన సీతారాముల కల్యాణపుపాటలు పాడటం, వధూవరులను మెరవణిచేయడం, అంట్లునాటేపద్ధతి, శకునాలపై నమ్మకం– మొదలైన ఆనాటి నమ్మకాలూ, ఆచారవ్యవహారాలూ కావ్యంలో కనిపిస్తాయి. పాడేటి, బహునాళ్ళు, ఇటీవల మొదలయిన వ్యావహారిక పదాలూ కావ్యంలో చోటుచేసుకున్నాయి. 'తారాబల హీరోపల హారోజ్వల రాకాధిప లోకాధిప వరనందన హరిచందన బృందారక నందారక కుందశత్ కుందమరుత్ సింధురదర సుందరతర' ఇలా సెలయేటి జలధారవలె పరవళ్లు తొక్కుతూ సాగిపోయేవిధంగా సంస్కృతపదభూయిష్ఠ రచనలు చేయడంలోనూ, 'ఇవిగదా దుక్కికైదువ సంకురవతమ్మి కంటివాల్గెరల బొక్కసములయ్యె' – ఇవిగదా తెలిమావు రవుతు సంతుపిసాళి దొడసజ్జ బవళించునొడయలయ్యె' లాంటి ముచ్చటైన అచ్చతెలుగు పదాలు వాడటంలోను ఎంతో నిపుణుడు కాణాదం పెద్దన.

బంధ గర్భ చిత్ర కవితావిలాసాలకు కూడా కాణాచి కాణాదంవారి ముకుందవిలాసం. శ్రీకృష్ణుడు రైవతశైలంపై వనవిహారంచేస్తాడు ప్రథమాశ్వాసంలో అందువల్ల ప్రథమాశ్వాసాంతంలో శైలబంధాన్ని రచించి బంధంలో కేశవ దర్శనం కలిగిస్తాడు కవి. భద్రాదేవీ శ్రీకృష్ణుల అనుబంధానికి నిదర్శనమన్నట్లు కందద్వయ గర్భిత నాగద్వయబంధం రచించబడింది. భద్రాదేవి గర్భవతి అయిన కథాభాగంగల ఆశ్వాసంలో గర్భకవిత్వం రచించబడింది. బలభద్రానుజునికి భద్రాదేవికి భద్రజయుడు జన్మించిన కథాభాగం గల ఆశ్వాసంలో

సర్వతోభద్రబంధం రచించబడింది. బంధగర్భ చిత్రకవితలను ఔచిత్యవంతంగా సార్థక్యంగా ప్రయోగించటంలో పెద్దనకు ఉద్ది పెద్దనయే.

ముకుందవిలాసంలో కందద్వయ గర్భిత నాగద్వయబంధం (చంపకమాల1-291), శైలబంధ కందం (1-294), పుష్పగుచ్ఛబంధ చంపకమాల (1-295), చక్రబంధ శార్దూలం (2-279), ఛత్రబంధ కందం (2-280), గోమూత్రికాబంధ సుగంధి (1-2281), సర్వతో భద్ర బంధం(3-319) ఉన్నాయి. వీటిలో చక్రబంధం మాత్రం అధ్యాత్మ రామాయణం (7-412)లో మరల చోటుచేసుకుంది. అయితే ముకుంద విలాసంలోని చక్రబంధ పద్యంలో పెద్దనార్య అని ఉండగా అధ్యాత్మ రామాయణం చక్రబంధం అదే పద్యంలో పెద్దయజ్వ అని మార్చబడింది[1].

సురపురం సంస్థానమందుండిన నంబెరుమాళ్లపురుషకారి కేశవయ్య పెద్దనకు తదనంతరసమీపకాలం వాడు. కేశవయ్య నిరోష్ఠ్యదాశరథి చరిత్రను రచించినాడు. ఆ రచనలోని కొన్ని పదప్రయోగాలకు పెద్దనగారి భద్రావరిణయం లోని పదాలను ప్రామాణికంగా గ్రహించినాడు[2].

గద్వాలసంస్థానంలో ఉండిన ఆదిపూడిప్రభాకరకవి పెద్దనను 'శ్రీముకుందవిలాసంబు జేసినట్టి ఘనుడు[3]' అని సగర్వంగా పేర్కొన్నాడు. కవిసింహ పోకూరి కాశీపత్యవధాని గద్వాలసంస్థానంలో ఉండిన తదనంతర కాలం వారు. ఆయన రచించిన సారంగధరీయం త్ర్యర్థికావ్యంలోని చాలా పద్యాలకు ముకుందవిలాసంలోని పద్యాలు స్ఫూర్తినిచ్చినవి. తనకృతి సు-భద్రాపరిణయం అభే నామాంతరంగల ముకుందవిలాసాన్ని పోలి ఉంటుందని ఉపమగా ముకుందవిలాసాన్ని పేర్కొన్నాడు[4].

అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి (క్రీ.శ.1831-1892) పిఠాపురం సంస్థానమందుండిన విద్వత్కవి. ఆయన కాణాదంవారి ముకుందవిలాసానికి సమ్మోహితుడై భద్రాపరిణయం అనే కావ్యాన్ని రచించినాడు. అయితే పెద్దన ముకుందవిలాసంలోని పద్యాలకు పద్యాలనే భావాలకు భావాలనే మక్కికి మక్కిగా తన కావ్యంలో చేర్చుకున్నాడు, కథలోనూ పెద్దమార్పులేదు. దీనికంతా కారణం అంతటి విద్వత్కవికూడ ముకుందవిలాసానికి సమ్మోహితుడు కావటమే. పండిత వంగూరి సుబ్బారావుగారు దీనిని అచ్చపు గ్రంథచౌర్యమని (శతకవాఙ్మయ చరిత్రలో) పేర్కొన్నారు.

1. దీనిని బట్టి ముకుందవిలాసం రచనానంతరం పెద్దన యజ్ఞాన్ని చేసి యజ్వ (సోమయాజి) అయినాడని తెలుస్తుంది. ముకుందవిలాస ఆశ్వాసాంత గద్యలలో ముకుందవిలాసంలో పెద్దనార్య అని ఉండగా అధ్యాత్మరామాయణంలో పెద్దన సోమయాజి అని ఉండటం గమనింప దగిన అంశం. చక్రబంధ శార్దూలపద్యం 'సత్యోపేత' అనే సమాసంతో ప్రారంభం అవుతుంది. వ్రాత ప్రతులలో సత్యోపేతలోని 'పే' అక్షరం 'పె'గా లిఖితం. సందర్భాన్ని బట్టి దానిని 'పే'అని చదవాలి. ఇది ఆనాటి లేఖనా పద్ధతి. పెద్దనార్య / పెద్దయజ్వ అనే పేరులోని 'పె' అక్షరం సత్యోపెతలోనిదే కావటం గమనార్హం. చిత్రకవిత్వంలోకూడా అక్షరాలను హ్రస్వంగా దీర్ఘంగా చదవటంలో సడలింపు ఉంది.
2. డా॥ వల్లపురెడ్డి బుచ్చారెడ్డి దగ్గరగల దాశరథి చరిత్ర వ్రాత ప్రతి.
3. యథాశ్లోక తాత్పర్యరామాయణం 2వ సంపుటం పీఠిక. సంస్థాన ప్రచురణ.
4. సారంగధరీయం (అవతారిక. ప్రథమ ముద్రణ-1933)

సుప్రసిద్ధ జంటకవులు తిరుపతివేంకటకవులు గద్వాలసంస్థానానికి వెళ్లినపుడు అప్పటిప్రభువు రామరాయలవారితో ముకుందవిలాసాన్ని గురించి చంపకమాలికలో ఇలా తమభావాలను చెప్పినారు –

చం॥ వినుమొకమాట రామపృథివీవర! పెద్దన కుద్దియైన పె
ద్దన కవిరాజు సోవవసుధావరు నాసతిబూని పాండితీ
ధనులగు సత్కవీశ్వరు 'లుదార రసాకరమిద్ది' యంచుబే
ర్కొనగ రచించె బూర్వము ముకుందవిలాసము నా ప్రబంధమ
య్యనఘు కవిత్వధాటి కడునందము జందము గల్గి నిండు జ
వ్వనమున జెన్నుమీరు చెలివాతెర తీయదనంబు చేదుచే
దని యయిపించు నొక్కయెడ నంతియకాక మరొక్కచోట నూ
తనమగునట్టి రైకను యదాయదగా బగులంగజేయ జా
లిన ననబోడి నున్ బొగురు లేతమిటారపు గబ్బిగుబ్బ దో
యిని గనివేగ ఢీకొని హిహీ కడుమెత్తని దానవంచు న
వ్వును నొకచోట మిట్టిపడి పోయెడిమీల నిగారపుం బసం
దున దులదూగి పూవిలుతు తూపును రూపును మాపు మాయలా
డిని గని గన్ని గన్నిగల ఠీవిని బొల్చెడి వాలు చూపులన్
గని మొనమాన్పబోవునటుగాన దదీయ రసాతిరేక మిం
తని వచియింపగా దరమె? యట్టి మహాకృతి రత్నమెల్లవా
రున బఠియించి యర్థము నిగూఢముగా గనలేక దీని కి
న్మన ప్రభువైన రామజన నాయకుడెవ్వరి చేతనైన టీ
కను నొనరింపజేసిన సుఖమ్మున నుండుగదా యటంచు దా
మనుకొను చుండుటల్ విని, రయమ్మున నా కృతి రత్నమొక్క మి
త్రుని కడజూచి యర్థమును దోచిన పట్టును నిశ్చయించి ద
క్కిన యదిగూడ సాధ్యమని కేవలమున్ మనమందు నిశ్చయం
బును నొనరించి, దీనికిని బొల్పగుటీక నొనర్చినన్ యశో
ధనములచేత మాకుభయ తారకమౌనని చేయబూను మా
మనవిని జిత్తగించి తగుమన్నన దీనికి నాయకత్వముం
గొనగదవయ్య మూలమునకుం గృతినాథుడు మీ కులీనడౌ
జనవరుడేకదా! యని రసమ్ముగ జంపకమాల చేత జె
ప్పిన తిరుపత్యభిఖ్యకవి వేంకటసత్కవులన్ గణించి టీ
కనునొనరింపజేయగదగన్ మనమందున నిశ్చయింపుమా! – నానారాజ సందర్శనం–101ప.

ముకుందవిలాసానికి తంజావూరు, మద్రాసు, కాకినాడ మొదలయిన చోట్ల గల ప్రాచ్యలిఖిత గ్రంథాలయాలలో తాళపత్ర మరియు కాగిత ప్రతులున్నాయి[1]. ముకుందవిలాసం ప్రప్రథమంగా శా.శ.1797లో (క్రీ.శ. 1875) గద్వాలలోని సాహిత్యవిద్యా ముకుర ముద్రాక్షరశాలలో గద్వాల ప్రభువు రామభూపాలరాయల వారిచే ముద్రింపించబడింది. ఆ తర్వాత 1985లో తెలుగువిజ్ఞానపీఠంవారు (ఇదే తర్వాత తెలుగు విశ్వవిద్యాలయంగా మారింది) ఆచార్య రవ్వా శ్రీహరిగారి పీఠిక/సంపాదకత్వాన ప్రచురించినారు. తెలుగులో సుప్రసిద్ధ అకారానుక్రమ నిఘంటువులు ముకుందవిలాసంలోని పదాలను స్వీకరించి అర్థాలను చెప్పినవి.

ముకుందవిలాసాన్ని గురించి ప్రస్తుత పీఠికాకర్త తేది 02-06-1989లో ఆకాశవాణికి (హైదరాబాదు)లో ప్రసంగించడమైనది. సమాలోచనలో (పక్షపత్రిక సెప్టంబరు-అక్టోబరు 1989-రాజమండ్రి) కూడా ప్రస్తుత పీఠికా కర్త రచించిన 'కాణాదం పెద్దన సోమయాజి కృతులు-పరిశీలన' అనే వ్యాసం ప్రచురితం. మిత్రులు శేషంరామానుజాచార్యులు కాణాదంవారి రచనలను గురించి సిద్ధాంతగ్రంథాన్ని రచించే ప్రయత్నంచేసి కృషిసల్పినారు. కానీ ఏవోకారణాలవల్ల సిద్ధాంతగ్రంథం విశ్వవిద్యాలయానికి సమర్పించలేదు.

1930 ప్రాంతాన పిఠాపురం దాసరి లక్ష్మణస్వామి వర్ణన రత్నాకరమును సంకలించినారు. అందులో ముకుందవిలాసంలోని పద్యాలు కొన్ని సంకలించబడినవి.

2002లో ఎ.రామకృష్ణ హైదరాబాదు విశ్వవిద్యాలయానికి 'ముకుందవిలాసం - ఒక పరిశీలన' అనే లఘు సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి ఎం.ఫిల్. పట్టా పొందినారు.

ప్రస్తుత పీఠికాకర్త తన ఇంట ఉన్న ముకుందవిలాస లిఖిత, ముద్రిత ప్రతులను తండ్రిగారి ప్రేరణచే చిన్నవయసులోనే చదవటం జరిగింది. అందువల్ల హైస్కూలులో విద్యార్థిగా ఉన్నపుడే ముకుందవిలాసంపై మక్కువ ఎక్కువగా కలిగింది. అప్పుడప్పుడు గుర్తించిన, తోచిన (ముకుందవిలాసంలోని) చమత్కారాలను ఒకచోట వ్రాసిఉంచటం జరిగింది. ఆ తర్వాత వ్యాఖ్యానం కూడ (చిత్తుప్రతి) వ్రాయటం జరిగింది, ప్రస్తుతం ముకుందవిలాస వ్యాఖ్యానానికి తుదిమెరుగులు దిద్ది శుద్ధప్రతి తయారు చేయబడుతుంది. దీనిని ప్రచురించాలని సంకల్పం.

అధ్యాత్మరామాయణం :

కాణాదంవారికి రామకథ అంటే చాలా ఇష్టం అందుకే కాబోలు భోజుని చంపూరామాయణానికి వ్యాఖ్యానం సంతరించినాడు. యథాశ్లోక తాత్పర్యంగా వాల్మీకి రామాయణ బాలకాండను అనువదించినాడు. వృద్ధాప్యంలో ఈ అధ్యాత్మరామాయణాన్ని రచించి తరించినాడు. అధ్యాత్మ రామాయణాన్ని గురించి కావ్య పరిచయం శీర్షికలలో తెలుసుకుందాం.

1. ప్రస్తుత పీఠికాకర్త ఇంట కూడ ముంకుందవిలాసానికి ఒక తాళపత్ర ఒక కాగిత లిఖిత ప్రతులు తండ్రి తాతలకాలంనుంచి ఉన్నాయి.

విద్వత్కవియైన కాణాదంవారు ఆశ్రయించిన ప్రభువులు గద్వాల పెద్దసోమభూపాలుడు, సురపురం పామనృపాలుడు, గద్వాల చిన సోమభూపాలుడుకూడ కవులే కావడం గమనార్హం. కవిరాజు అయిన కాణాదం రాజకవులను మాత్రమే ఆశ్రయించటం విశేషం. రాజులను ఆశ్రయించినా తనరచనలను వారికి అంకితం చేయక వారి ఇలువేలుపులైన కేశవస్వామి, మారమణుడు (వేణుగోపాలస్వామి) వార్లకే అంకితమీయటం మరో విశేషం.

కావ్య పరిచయం

రామాయణ ప్రశస్తి – ప్రాచుర్యం

రామాయణ కథ వైదికవాఙ్మయంలో ఉన్నట్లు మన పరిశోధక పండితులు నిరూపించి తద్విషయ గ్రంథాలనుకూడా ప్రచురించినారు[1]. లౌకికవాఙ్మయంలో భారతదేశంలోనే గాక విశ్వంలోనే ప్రప్రథమకావ్యం వాల్మీకిరామాయణం. వాల్మీకి రామాయణం తర్వాత అనేక రామాయణాలు వెలువడినవి. విశ్వసాహితీ ప్రపంచంలో రామాయణం విరాడ్రూపంగా దర్శనమిస్తుంది. భూమిమీద రెండువేల ఐదువందల రామాయణా లున్నట్లు పరిశోధకపండితులుచెప్తున్నారు[2]. రామకథను తెలియనివారుండరనటం అతిశయోక్తి కాదు. రామాయణాన్ని ఎన్నిసార్లు చదివినా పునరుక్తికాదు. ఎందుకంటే చదివినపుడల్లా ఏదో ఒక నూతన భావన గోచరిస్తూనే ఉంటుంది. అందువల్ల రామాయణం నిరుక్తిలా నిత్యనూతనంగా భాసిస్తుంది.

తెలుగులో తొలినాళ్లనుంచీ రామాయణవృక్షం వివిధసాహితీ ప్రక్రియలుగా విస్తరిల్లుతూనే ఉంది. నన్నయభట్టు రాఘవాభ్యుదయాన్ని రచించిన తర్వాతనే భారతాంధ్రీకరణకు పూనుకున్నాడని పరిశోధకపండితులు చెప్తారు. తిక్కన ఉత్తరరామాయణాన్ని ఆంధ్రీకరించినాడు. ఎర్రాప్రెగడ సంక్షేప రామాయణాన్ని రచించినాడు. భాస్కర రామాయణం, రంగనాథ రామాయణం, మడికిసింగన వాసిష్ఠ రామాయణం, మొల్ల రామాయణం, కూచిమంచి తిమ్మకవి అచ్చతెలుగు రామాయణం, గోపీనాథ వేంకటకవి రామాయణం, విశ్వనాథవారి రామాయణకల్పవృక్షం మొదలైనవి ఆది నుంచీ ఆధునికం వరకూ పరశ్శతంగా వెలువడినవి. ఆ పరంపరలో వెలువడినదే కాణాదం పెద్దనసోమయాజి కృత అధ్యాత్మరామాయణం. దీనికి మూలం సంస్కృత అధ్యాత్మ రామాయణం. మూలమైన సంస్కృత అధ్యాత్మ రామాయణాన్ని గురించి సంక్షిప్తంగా–

అధ్యాత్మరామాయణం (మూలం)

సంస్కృత రామాయణాలు అనేకం. వాల్మీకి రామాయణం, గాయత్రీ రామాయణం, మంత్ర రామాయణం, అక్షర రామాయణం, అద్భుత రామాయణం, చిత్ర రామాయణం, వాసిష్ఠ రామాయణం, అధ్యాత్మ రామాయణం... ఇలా ఎన్నో...! ఎన్నెన్నో...!! అందులో అధ్యాత్మరామాయణం విశిష్టమైన ప్రత్యేకతను సంతరించుకుంది.

1. మంత్రరామాయణం.
2. అద్భుతరామాయణ–భూమికా–ప్రాచ్యప్రకాశం–వారణాశి.

అధ్యాత్మరామాయణం బ్రహ్మాండపురాణాంతర్గతం. బ్రహ్మాండ పురాణాన్ని రచించినవారు వ్యాసభగవానుల వారు. అంటే అధ్యాత్మరామాయణ కర్త వ్యాసులవారన్నమాట.

అధ్యాత్మరామాయణాన్ని సాక్షాత్తు పరమేశ్వరుడు పార్వతికి చెప్తాడు. శుభప్రదమైన ఈ రామాయణంలో ఏడు కాండలు, అరవైనాలుగు సర్గలు, నాలుగువేలా రెండువందల శ్లోకాలు రచించబడి తత్త్వార్థవివేచనం చేయబడింది. ఈ విషయాన్ని కింది శ్లోకం తెలుపుతుంది.

శ్లో॥ పార్వత్యై పరమేశ్వరేణ గదితే హ్యధ్యాత్మ రామాయణే
కాండైః సప్తభిరన్వితేఽ తి శుభదే సర్గాశ్చతుఃషష్టి కాః ।
శ్లోకానాం తు శతద్వయేన సహిత న్యుక్తాని చత్వారివై
సాహస్రాణి సమాప్తితః శుతి శతా న్యుక్తాని తత్త్వార్థ తః ॥

అధ్యాత్మరామాయణంలో రామచరితను వర్ణించే ఆయాసందర్భాలలో ప్రసక్తానుసారంగా భక్తి జ్ఞాన, ఉపాసన, నీతి, సదాచార సంబంధ దివ్యోపదేశాలు చేయబడినవి. అందువలననే దీనిని అధ్యాత్మరామాయణం అన్నారు.

అధ్యాత్మరామాయణం-వాల్మీకేతర అంశాలు :

అధ్యాత్మరామాయణంలో వాల్మీకి రామాయణంలో లేని కొన్ని అంశాలు చెప్పబడినవి. సంక్షిప్తంగా వాటివివరాలు. శ్రీరాముని పరమాత్మునిగా వర్ణించటం, శంకరుడు రామాయణ వక్తగా ఉండటం, కౌసల్య కైకేయి వసిష్ఠ వాయుకుమార రావణ విభీషణాదులు రామావతార కార్యమెరిగి తత్తదుచితంగా మెలగటం, పడవను ఎక్కించుటకుముందు నావికుడు రామునిపాదం కడగటం, సీతమ్మవారు వెనుకటి రామాయణాలను ప్రస్తావించటం, మందరకు సరస్వతీ దేవి ప్రేరణకల్మి, వాల్మీకి, సిద్ధుడు పాదుకార్చన మొదలైనవాటినిగురించిన ప్రస్తావనలు, రామునిజన్మరహస్యం వసిష్ఠుడు తెల్పటం, రావణుడు తన మృతికై కావలసి సీతాపహరణం చేయటం, సీతాలక్ష్మి పంచవటిలో అదృశ్యమై రావణవధానంతరం అగ్ని ముఖాన వెలువడటం, రావణుడు సీతమ్మను స్పృశించక ఆమె నిల్చిన భూఖండాన్ని పెకలించి ఎత్తుకొని పోవటం. చరమ సీతాఖననం, హవిర్విభాగం, నాగపాశవిషయాదులు.

అధ్యాత్మరామాయణం అనేకరామాయణాలపై అధికంగా ప్రభావం చూపింది. తులసీదాసులవారు హిందీలో రచించిన రామచరితమానస్‌లోని అధికభాగం అధ్యాత్మరామాయణం ఆధారంగా రచించబడింది. భాస్కర, రంగనాథాది రామాయణాలు కూడ అధ్యాత్మరామాయణంలోని కొన్ని ఘట్టాలను / అంశాలను స్వీకరించినవి. విశ్వనాథవారిరామాయణ కల్పవృక్షం లోని పారమార్థిక సంబంధమైనవాటికి ప్రధానంగా అధ్యాత్మ రామాయణమే ఆలంబనం.

కాణాదంవారి తొలితెలుగు అధ్యాత్మరామాయణం :

భాస్కర, రంగనాథ రామాయణాలలో అధ్యాత్మరామాయణంలోని కొన్ని అంశాలు చోటుచేసుకున్నాయి. అయితే అధ్యాత్మ రామాయణాన్ని పూర్తిగా తెలుగులో చెప్పిన మొదటికవి కాణాదంపెద్దనసోమయాజి[1]. అంటే తొలితెలుగు అధ్యాత్మరామాయణం కాణాదంవారు రచించిన ప్రస్తుత కావ్యమేనన్నమాట. ఈ విషయాన్ని కాణాదంవారుకూడ తన అధ్యాత్మ రామాయణ అవతారికలో ప్రస్తావించినాడు. నన్నయ తిక్కనాది పూర్వ తెలుగు కవులు అధ్యాత్మరామాయణాన్ని తెలిగించకపోవటం తనభాగ్యమనీ, దానిని కేశవాంకితంగా తెలిగించి భవబంధాలనుబాసి ముక్తిశ్రీలలో ఓలలాడుతానని కాణాదంవారు ఇలా ఒక పద్యంలో చెప్పినారు. . .

మ॥ అల మున్నన్నయ తిక్కయజ్వ ముఖులీ యధ్యాత్మ రామాయణం
బలరంగా దెలుగింపకున్నది మదీయం బైన భాగ్యంబెకా
నెలమించెందుచు కేశవార్పితముగా నేతత్పురాణంబు నే
తెలుగింతున్ భవబంధముల్ దొలగ ముక్తిశ్రీల నోలడగన్

– అధ్యాత్మరామాయణం అవతారిక–30వ ప.

అధ్యాత్మరామాయణం–ఆశ్వాసవిభాగం

బ్రహ్మాండపురాణంలోని అధ్యాత్మరామాయణం ఏడుకాండలుగా ఉంది. అయితే ప్రస్తుత అనువాదం ఆ ఏడు కాండలను ఎనిమిది ఆశ్వాసాలుగా విభజించటం జరిగింది. రామాయణంలోని బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ, సుందరకాండలు ఐదున్ను ఐదు ఆశ్వాసాలుగా, యుద్ధకాండం పూర్వ భాగం ఆరవ ఆశ్వాసంగా, యుద్ధకాండం ఉత్తరభాగం ఏడవ ఆశ్వాసంగా, ఉత్తరకాండాన్ని ఎనిమిదవ ఆశ్వాసంగా విభజించటం జరిగింది. ఈ విషయాన్ని క్రింది పద్యంకూడ తెలియజేస్తుంది.

సీ॥ శ్రీమించుగద్వాల సోమేంద్ర వరదుడౌ
నాదికేశవ శౌరి కర్పితముగ
నమృతసారమగు బ్రహ్మాండ పురాణోక్త
మైనయధ్యాత్మరామాయణమున
నటబాల కాండాదులైదును మరియుద్ధ
కాండంబు రెండు భాగములుగాగ
నుత్తర కాండంబు నొకటిగాగను నెన్మి
దాశ్వాసముల జేసెనాంధ్రసూక్తి

1. కాణాదంవారికన్నా పూర్వం రచించిన అధ్యాత్మరామాయణాలు అలభ్యాలు, అసమగ్రాలు

తే.గీ॥ సుగుణ విభ్రాజి పెద్దన సోమయాజి
యట్టియధ్యాత్మరామాయణాఖ్యకృతియు
జగతినాచంద్రతారార్కముగ బ్రసిద్ధి
గాంచుగాత! శ్రీరాముల కరుణచేత – అధ్యాత్మ. 8-428వ ప.

కృతిప్రేరకులు- అంకితం

గద్వాల చినసోమభూపాలుడు ఒకానొకదినాన కాణాదం పెద్దన సోమయాజితో 'బ్రహ్మాండ పురాణాంతర్గత మైన అధ్యాత్మరామాయణాన్ని 'కేశవాంకితంగ ఆంధ్రోక్తి' జేయమని కోరుతాడు. అధ్యాత్మరామాయణ రచనకు ప్రేరకుడు చినసోమభూపాలుడు కాగా తద్గ్రంథాన్ని అంకితం ఇచ్చినది చినసోమ భూపాలుని కులదైవమైన (గద్వాల) కేశవస్వామి వారికి. ఈ విషయాలన్ని కింది పద్యం సువ్యక్తం చేస్తున్నది.

మ॥ ధర బ్రహ్మాండపురాణ రాజమున విస్తారస్థితిన్ బొల్చు ను
త్తరఖండంబున కాండసప్తకముతో తత్త్వార్థసారాంశమై
యరయన్ రామకథా సుధాకలితమై యధ్యాత్మ రామాయణం
బరుదౌ మీరది కేశవాంకితముగా నాంధ్రోక్తి జాయందగున్

– అధ్యాత్మరామాయణం అవతారిక -25వ ప.

ఛందోభాషా విశేషాలు :

కం॥ "విద్యలలోపల నుత్తమ
విద్య కవిత్వంబు మరి కవిత్వము ఛందో

వేద్యము" అన్నారు విజ్ఞులు. పూర్వకాలం ఎక్కువశాతం కవులు తమకవిత్వాన్ని పద్యాలలోనే చెప్పేవారు. పద్దెం గుర్రంలాంటిది. దానిని మచ్చిక చేసుకొని మంచిగా నడపగలిగిన కవి నేర్పరియైన రౌతులాంటివాడు. రౌతును బట్టి గుర్రం నడుస్తుంది. గుర్రాన్ని రౌతు అనుసరిస్తే అవహేళన తప్పదు. అలాగే ఛందస్సు కవి ఆధీనంలో ఉండాలి. అలాంటి కవి లయబాగా తెలిసినవాడయి ఉంటాడు. లయవేత్తకాని కవిచేతిలో ఛందోబద్ధమైనాకూడా పద్యానికి నాదసిద్ధి, ధారాశుద్ధి చేకూరదు. పద్యంలోని లయవల్ల ఆపాత మధురత్వం, భావంవల్ల ఆలోచనామృతత్వం సిద్ధిస్తుంది. పొడుగాటి నల్లగౌను వేసుకున్నంతమాత్రాన ప్రతివాడు న్యాయమూర్తి కాజాలడు. అలాగే కేవలం గణయతి ప్రాసలతో పదాలను కట్టేసినంతమాత్రాన కవిత్వం కాదు, అతడు కవికాదు. పద్యంలో భావపరిపుష్టి, వ్యాకరణదృష్టి, పదప్రయోగ విజ్ఞత, అలంకార విన్యాసం, ఔచిత్యం ఇవన్నీ సమకూడితేకాని అది కవిత్వంకాదు. అలాంటి ప్రథమశ్రేణికి చెందిన సత్కవులు కవిత్రయం, కవిసార్వభౌమ, సహజపాండిత్యులు, భువనవిజయ కవిదిగ్గజాలు, ప్రతిపద్య చమత్కారచణులు మొదలగువారు

అగ్రశ్రేణికి చెందినవారు. అలాంటికోవకు చెందిన ఆంధ్రదేశ సంస్థానకవులలో కాణాదం పెద్దనసోమయాజి కూడా అగ్రేసరులలో ఒకడు. బహుగ్రంథ ప్రణేత అయిన కాణాదంవారు అధ్యాత్మ రామాయణంలో వివిధ ఛందస్సులకు చెందిన పద్యాలను ప్రయోగించినాడు. ఆ వివరాలు పట్టికలలో పొందుపరచి అందివ్వడమైనది. దీనివల్ల అధ్యాత్మరామాయణంలోని ఛందోవైవిధ్య విశేషాలు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది.

ఛందః ప్రయోగం

I ఛందప్రయోగ (స్థూల) సూచిక			
1.	సంస్కృత ఛందస్సు	1. సామాన్య వృత్తాలు	740
		2. విశేష వృత్తాలు	76
2.	దేశీయ ఛందస్సు	1. జాతులు	1103
		2. ఉపజాతులు	805
3.	వచనాలు	(లఘు + అలఘు)	638
అధ్యాత్మరామాయణంలోని మొత్తం పద్య గద్యాల సంఖ్య			**3362**

II సంస్కృత ఛందస్సు										
I సామాన్య వృత్త ప్రయోగ సూచిక										
		అశ్వాసాలు - పద్యాలు								
		1	**2**	**3**	**4**	**5**	**6**	**7**	**8**	
1.	శార్దూల విక్రీడిత	14	13	17	12	07	20	24	04	111
2.	మత్తేభ విక్రీడిత	41	17	14	18	25	25	25	12	177
3.	ఉత్పలమాల	34	39	40	30	19	40	38	47	288
4.	చంపకమాల	23	33	16	21	15	18	15	23	164
	మొత్తం :	112	102	87	81	66	103	102	87	**740**

II సంస్కృత ఛందస్సు - II విశేష వృత్తప్రయోగ సూచిక										
సంఖ్య	విశేష వృత్తంపేరు	1 ఆ	2 ఆ	3 ఆ	4 ఆ	5 ఆ	6 ఆ	7 ఆ	8 ఆ	మొత్తం
1.	అంబురుహ			1						1
2.	ఇంద్రవ్రజ							1		1
3.	ఉపేంద్ర వ్రజ			1						1
4.	కవిరాజ విరాజిత							1		1
5.	చంద్రవర్మ							1		1
6.	తరల			1	1			1		3
7.	దండకము						1			1
8.	ధ్రువకోకిల			1						1
9.	పంచచామర	1	1		1		1	3		7
10.	పాదప	1						1		2
11.	పృథివి			1						1
12.	భుజంగప్రయాత	1	1	1			1	10	1	15
13.	మణికర			8						8
14.	మత్తకోకిల	1		1			2	1		5
15.	మత్తమయూర							5		5
16.	మహాస్రగ్ధర			1		1	1	1		4
17.	మానిని							1		1
18.	మాలిని	2								2
19.	లయగ్రాహి	1			1					2
20.	వసంత తిలక			1						1
21.	శిఖరిణి							1		1
22.	సరసిజ							1		1
23.	సుకేసరి			1						1
24.	సుగంధి			1				1		2
25.	సుమవిచిత్ర					1		1		2
26.	సుస్వాగత							1		1
27.	స్రగ్ధర						1			1
28.	స్రగ్విణి						1	1		2
29.	స్వాగత							2		2
30.	మంగళమహాశ్రీ								1	1
	మొత్తము	**7**	**2**	**21**	**3**	**2**	**9**	**34**	**2**	**76**

విశేష వృత్తాలు – సంక్షిప్త పరిచయం :

1. **అంబురుహవృత్తం:** ఇది 20వ కృతి ఛందస్సులో పుట్టింది[1]. గణాలు: భ భ భ భ ర స వ, యతి 13. అరణ్యకాండంలో సుతీక్ష్ణుడు రాముని స్తుతించే సందర్భంలో (72) ఈ వృత్తం ఉంది.

2. **ఇంద్ర వ్రజ :** ఇది 11వ త్రిష్టుప్పు ఛందస్సులో పుట్టింది. గణాలు : త త జ గా, యతి 8. కొందరు ఋతుభిర్యతిః–6పై యతి అనికూడ పేర్కొన్నారు. యుద్ధకాండం ఉత్తరభాగం (362)లో ఈశ్వరుడు శ్రీరాముని స్తుతించే సందర్భాన ఈ వృత్త ప్రయోగంఉంది.

3. **ఉపేంద్రవ్రజ వృత్తం :** ఇది 11వ త్రిష్టుప్పు ఛందస్సులో పుట్టింది. గణాలు :జ త జ గా, 5పై యతి, పాదాంతయతి అనికూడ కొందరు పేర్కొన్నారు. ఈ వృత్తాన్ని ఉపేంద్రమాలా అనికూడ కొందరన్నారు. అరణ్యకాండం (44)లో శరభంగుడు రామునికి సమస్కరించి యోగ సమాధినిష్ఠుడైన సందర్భాన ప్రయోగం ఉంది.

4. **కవిరాజవిరాజిత వృత్తం :** ఇది 23వ వికృతిచ్ఛందస్సులో పుట్టింది. గణాలు: న జ జ జ జ జ జ వ, యతులు 8–14–20 త్రివిరామాలు. రంగకవి ఒకేయతిని చెప్పినాడు. మూడు యతులుగానీ, ఒకేయతిగానీ ఉండవచ్చునని లక్షణ దీపిక. దీనిని కొందరు రుద్రర్తు యతిగా 'సుధాలహరి' అనికూడ పేర్కొన్నారు. (మందార) యుద్ధకాండం–ఉత్తరభాగంలో ఆశ్వాసాంతపద్యంగా (414) ఈ పద్యం జయజయ ధ్వానంతో చెప్పబడింది. ఈ పద్యంలో చివరి మూడుపాదాలలో మూడు యతులు పాటించబడినవి. మొదటిపాదంలో 'జయజయ నీరద శారద' అని సవరిస్తే మూడు యతులుంటాయి. అర్థాన్నికూడా సాధించవచ్చు.

5. **చంద్రవర్మ వృత్తం :** ఇది 12వ జగతిచ్ఛందస్సులో పుట్టింది. గణాలు : ర న భ స, యతి 7. దీనికి చంద్రపద్మముదితం అనే పేరుకూడా ఉన్నట్లు వృత్తరత్నాకరం వ్యాఖ్యలలో కనిపిస్తుంది. శ్రీరాముని యక్షులు స్తుతించే సందర్భాన యుద్ధకాండం–ఉత్తరభాగం (382)లో ఈ పద్యం ఉంది.

6. **తరలవృత్తం :** ఇది 19వ అతిధృతి ఛందస్సులో పుట్టింది, గణాలు : న భ ర స జ జ గ, యతి 11. అరణ్యకాండం (360)లో శ్రీరామప్రాశస్త్యాన్ని చెప్పేసందర్భాన, కిష్కింధకాండం (224)లో జటాయువు శ్రీరాముని స్తుతించే సందర్భాన ఈ వృత్తం ప్రయోగం ఉంది. కొన్ని లక్షణగ్రంథాలు దీని యతిస్థానం 12అని చెప్పినారు. పెద్దన యతి 12వ స్థానంలోనే వేసినాడు.

7. **దండకవృత్తం :**ఉద్ధురమాలా వృత్తాల కోవకుచెందింది. 26 అక్షరాలకు ఎక్కువగా ఉన్న వృత్తాలను ఉ ద్ధురమాలావృత్తం అంటారు. వృత్తం అన్నందున పాదనియమం ఉంది. సంస్కృత దండకాన్ని చాలా మందికవులు నాలుగుపాదాల దండకాన్నే రచించినారు. శ్రీనాథుడు శృంగారనైషధంలోని దండకం, నాలుగు పాదాలుగ రచించినాడు. పారిజాతాపహరణంలోని శ్రీకృష్ణ స్తుత్యాత్మకదండకం రెండుపాదాల

1. వృత్తం ఎన్నవఛందస్సులో పుట్టితే ఆ వృత్త పాదంలో అన్ని అక్షరాలు ఉంటాయి.

దండకం. నన్నయ భారతంలోని దండకం ఏకపాద దండకం. గణప్రయోగభేదాన్ని బట్టి దండకభేదాలు అనేకం. ఆ ప్రభేద దండకాలకు కూడా పేర్లున్నాయి. విస్తరభీతిచే ఇక్కడ పేర్కొనలేదు. యుద్ధకాండం పూర్వభాగం (99)లోని దండకం ఏకపాద దండకమే. అయితే ఇది స్రగ్విణీ భుజంగప్రయాత వృత్తద్వయ గర్భిత దండకం. దండకం ప్రారంభాన స్రగ్విణీవృత్తం, అంత్యాన భుజంగ ప్రయాతవృత్తం గర్భితమైఉన్నాయి.

8. **ధ్రువకోకిల :** తరలవృత్తాన్ని కొందరు ధ్రువకోకిల అనికూడా పేర్కొన్నారు. లక్షణం తరలకు, ధ్రువకోకిలకు సమానం. కొందరు 11వస్థానం యతిగా వేయగా మరికొందరు 12వ స్థానం యతిగా చెప్పినారు. పెద్దన సోమయాజి ఒకచోట ధ్రువకోకిల అనీ మరి మూడు తావులలో తరళ అని పేర్కొన్నాడు. లక్షణం మాత్రం రెండింటికి ఒకరీతిగానే ఉంది. కనుక పెద్దన పేర్కొన్న రీతిగనే రెండు పేర్లతో దీనిని ఇక్కడ వివరించటం జరిగింది. అరణ్యకాండ (76)లో సుతీక్ష్ణ శ్రీరామ సంభాషణ సందర్భానా ఈ వృత్తం ధ్రువకోకిల పేరుతో ప్రయోగించటం జరిగింది.

9. **పంచచామరవృత్తం :** ఇది 16వ అష్టి ఛందస్సులో పుట్టింది. గణాలు: జ ర జ ర జ గ, యతి 10. ఇది వరుసగా 8 లగములు కలది. అనుష్టుప్‌లోని ప్రామాణివృత్తానికి ఇది రెట్టింపు. ఈ పద్యం బాలకాండ (364)లో శ్రీరామస్తుతి, అయోధ్యకాండ(570) ఆశ్వాసాంత సంబుద్ధి స్తుతిగా పుష్పమాలికా బంధంగా, కిష్కింధకాండ (372)లో హనుమ మహేంద్రపర్వతాన్ని లంఘించిన సందర్భాన, యుద్ధకాండ పూర్వభాగంలో (255)లో ధూమ్రాక్షుడు యుద్ధానికి వెళ్లటాన్ని గురించిన వర్ణన, యుద్దకాండం ఉత్తరభాగం (364,369,384)లో రామస్తుతి, రామతత్వ ప్రశంస, గంధర్వులు చేసిన రామస్తుతి సందర్భంగా ప్రయోగం ఉంది.

10. **పాదపవృత్తం :** ఇది 11వ త్రిష్టుప్పు చంధస్సులో పుట్టింది. గణాలు : భ భ భ గా, యతి 7. బాలకాండంలో (372)లో అహల్యకృతరామస్తుతి, యుద్ధకాండ–పూర్వభాగం (366)లో శ్రీరాముని ఈశ్వరుడు స్తుతించే సందర్భాన ఉంది.

11. **పృథివీవృత్తం :**ఇది 17వ అత్యష్టి ఛందస్సులో పుట్టింది. గణాలు : జ స జ స య వ, యతి 12. ఈ వృత్తానికి పృథ్వి, పృథ్వికా, వసుమతి అనికూడా నామాంతరాలున్నట్లు వివిధ ఛందోగ్రంథాలవల్ల తెలుస్తోంది. అరణ్య కాండంలో సుతీక్ష్ణుడు శ్రీరాముని స్తుతించే సందర్భాన ఈ వృత్తం ఉంది.

12. **భుజంగప్రయాతవృత్తం :** ఇది 12వ జగతి ఛందస్సులో పుట్టింది. గణాలు : 4యగణాలు. యతి 8. 1–367 అహల్యకృత శ్రీరామస్తుతి, 2–288 రాముడు గంగను గాంచినపుడు (విజయవిలాసంలో అర్జునుడు గంగనుగాంచుటను తలపించేలా), 3–46 శరభంగుడు చేసిన శ్రీరామ స్తుతి, 6–101 దండక గర్భితం, 7–260 నుండి 268వరకు శ్రీరామ స్తుత్యాత్మకాలు, 7–380 పితృదేవతలు శ్రీరాముని స్తుతించటం, 8–184 శ్రీరాముని విమాన ప్రయాణం ఈ వృత్తంలో ఉంది.

13. **మణికరవృత్తం :** ఇది 13వ అతిజగతి ఛందస్సులో పుట్టింది. గణాలు: న జ జ ర గ, యతి8 దీనికి ప్రభాతం, మృగేంద్రముఖం అనికూడపేర్లు. జటాయువు శ్రీరాముని స్తుతించేసందర్భాన ఈ వృత్తం ప్రయోగించ బడింది. మణిఖచితమైన ఆభరణాల మూటను జటాయువు తన కరంతో శ్రీరామునికి అందించినాడు. కనుక మణికరవృత్తం ప్రయోగం సార్థకం.

14. **మత్తకోకిల :** ఇది 13వ ఛందస్సు ధృతిలో పుట్టింది. గణాలు :ర స జ జ భ ర, యతి 11. బాలకాండ-361, అరణ్యకాండ-71, యుద్ధకాండ-109,133, యుద్ధకాండ ఉత్తరభాగం- 361లో మత్తకోకిల ప్రయోగంఉంది.

15. **మత్తమయూర వృత్తం :** ఇది 11వ అతిజగతి ఛందస్సులో పుట్టింది. గణాలు: మ త య స గ, యతి 8. యుద్ధకాండ-250,51,52,53 బ్రహ్మకృతంమస్తుతి మరియు యుద్ధకాండలో-257 ఈ పద్య ప్రయోగంఉంది.

16. **మహాస్రగ్ధరా వృత్తం :** ఇది 22వ ఆకృతి ఛందస్సులో పుట్టింది. గణాలు: స త త న స ర ర గ, యతులు 9,16. ఆరణ్యకాండ-215, సుందరకాండం-141, యుద్ధకాండం-91లో ఈ పద్యప్రయోగం ఉంది.

17. **మానినీ వృత్తం :** ఇది 22వ ఆకృతి ఛందస్సులో పుట్టింది. గణాలు : 7 భగణాలు, 1 గురువు. యతి 18. యుద్ధకాండంలో బ్రహ్మ శ్రీరాముని స్తుతించే సందర్భాన ఈ పద్యంఉంది.

18. **మాలినీవృత్తం :** ఇది అతిశక్వరి-11వ ఛందస్సులో పుట్టింది. గణాలు: న న న య య, యతి 9. బాలకాండంలో (375) అహల్యకృత శ్రీరామస్తుతి, (496) ఆశ్వాసాంత సంబుద్ధిగా ప్రయోగించటం జరిగింది.

19. **లయగ్రాహి :** ఇది పాదానికి 26 అక్షరాలకు మించిన వృత్తం. కనుక ఉద్ధురమాల వృత్తాల కిందికి వస్తుంది. ప్రతిపాదానికి 39 మాత్రలు, 30 అక్షరాలు ఉంటాయి. గణాలు : భ జ స న భ జ స న భ య, యతులు 8+8+8 పై ప్రాసయతులు నియతం. యతి అక్కరలేదు. నాలుగు పాదాలలో కలిసి 16స్థానాలలో ప్రాసమైత్రి ఉంటుంది. బాలకాండ (373), కిష్కింధకాండ (376)లో ఈ పద్యం వాడటం జరిగింది.

20. **వసంతతిలక వృత్తం :** 14వ ఛందస్సు శర్వరిలో పుట్టింది. గణాలు: త భ జ జ గా, యతి 11. లక్షణగ్రంథాలలో ఈ వృత్తం యతిస్థానం 8 అనిఉంది. పెద్దన 11వ స్థానంలో యతినికూర్చినాడు. ఈవృత్తాన్ని అప్పకవి సింహోన్నతం, ఔద్దర్షిణి, శోభావతి, మధుమాధవి అని కూడా పేర్కొన్నాడు. సింహోద్ధతం, ఉద్ధర్షిణి, తిలక, వసంతతిలక, కాశ్యప, మొదలైన నామాంతరాలుకూడా వివిధ లక్షణ గ్రంథాలలో ఉన్నాయి. అరణ్యకాండంలో (68) స్తుత్యాత్మకంగా ఈ పద్యం ఉంది.

21. **శిఖరిణి :** ఇది 17వ అత్యష్టి ఛందస్సులో పుట్టింది. గణాలు : య మ న స భ వ. యతి 13. యుద్ధకాండ ఉత్తరభాగం (370)లో స్తుతిపరంగా ప్రయోగించటం జరిగింది.

22. **సరసిజవృత్తం :** 24వ సుకృతి ఛందస్సులో ఈవృత్తం పుట్టింది. గణాలు: మ త య న న న స, యతులు 10-18. యుద్ధకాండ ఉత్తరభాగం (255)లో బ్రహ్మ శ్రీరాముని స్తుతించుటకు ఈ వృత్తంవాడినారు.

23. **సుకేసరి వృత్తం :** ఇది 15వ అతిశక్వరి ఛందోజాతం. గణాలు : న జ భ జ ర, యతి 11. ప్రభద్రకం, సుఖేలకం అనికూడ దీనికి నామాంతరాలు. జటాయువు రాముని స్తుతించే సందర్భాన (3-358) ఈపద్యం ఉంది.

24. **సుగంధి వృత్తం :** ఇది 15వ అతిశక్వరి ఛందోజాతం. గణాలు :ర జ ర జ ర, యతి : 9. దీనికి శాలిని, చామర, ప్రశాంతి, శాంతి, హంసయాన మొదలయినవి నామాంతరాలు వివిధ లక్షణ గ్రంథాలలో కనిపిస్తాయి. యుద్ధకాండం ఉత్తరభాగంలో బ్రహ్మకృత శ్రీరామస్తుతి (254) లో ఈ పద్యం ఉంది.

25. **సుమవిచిత్ర వృత్తం :** ఇది 12వ జగతిచ్ఛందోజాతం. గణాలు : న య న య, యతి 7. దీనికి కుసుమవిచిత్ర అనికూడా వ్యవహారం. సుందరకాండం ఆశ్వాసాంతాన ఈవృత్తం గోమూత్రికా బంధంగా ప్రయోగించినారు. యుద్ధకాండం ఉత్తరభాగంలోనూ ఈవృత్తం ఉంది.

26. **సుస్వాగత వృత్తం :** ఇది 11వ ఛందమైన త్రిష్టుప్పులో పుట్టింది. గణాలు : భ భ త ల గ, యతి 7. దీనిని గజరాజవృత్తమని లక్షణదీపికలో పేర్కొన్నారు. యుద్ధకాండం ఉత్తరభాగంలో (360)లో ఈశ్వరుడు శ్రీరాముని స్తుతించే సందర్భాన ఈ పద్యంఉంది.

27. **ప్రగ్ధరావృత్తం :** ఇది 21వ ఛందస్సు ప్రకృతిలో జన్మించింది. గణాలు: మ ర భ న య య య, యతులు 8,15. దీనిని లఘుప్రగ్ధర అని అనిరుద్ధ చరిత్రలో పేర్కొన్నారు. యుద్ధకాండ పూర్వభాగం ఆశ్వాసాంతాన పుష్పబంధంగా ఈ పద్యం రచించినారు. ప్రగ్ధర అంటే పూలదండ. కనుక బంధప్రయోగంలో ఈ వృత్తప్రయోగం ఔచిత్యంగా ఉంది.

28. **ప్రగ్విణీవృత్తం :** ఇది 12వ జగతీ చ్ఛందోజాతం గణాలు : ర ర ర ర, యతి: 7. యుద్ధకాండం పూర్వభాగం (100) దండకగర్భితంగా యుద్ధకాండ ఉత్తరభాగం (378)లో రెండుతావులలోనూ స్తుత్యాత్మక ప్రయోగమే.

III దేశీయ ఛందస్సు (I జాతులు, II ఉపజాతులు)

I జాతులు

		1 ఆ	2 ఆ	3 ఆ	4 ఆ	5 ఆ	6 ఆ	7 ఆ	8 ఆ	మొత్తం
1.	కందము	178	212	132	116	94	110	107	150	1099
2.	ఉత్సాహ			2			1	1		04
మొత్తం		178	212	134	116	94	111	108	150	**1103**

II ఉప జాతులు										
		1 ఆ	**2 ఆ**	**3 ఆ**	**4 ఆ**	**5 ఆ**	**6 ఆ**	**7 ఆ**	**8 ఆ**	**మొత్తం**
1.	సీసము	53	67	48	63	23	50	68	63	435
2.	తేటగీతి	36	67	48	42	20	23	26	37	299
3.	ఆటవెలది	8	12	08	05	08	02	07	20	71
మొత్తం		98	146	104	110	51	75	101	120	**805**

IV వచనాలు

		1	**2**	**3**	**4**	**5**	**6**	**7**	**8**	**మొత్తం**
1.	లఘు+అలఘు	99	109	86	66	31	101	71	75	**638**

29. **స్వాగతవృత్తం:** ఇది 11వ త్రిష్టుప్ఛందస్సంజాతం. గణాలు : భ భ త ల గ, యతి7. దీనిని గజరాజవృత్తం అనికూడ పొత్తపి వేంకటరమణ కవి పేర్కొన్నాడు. యుద్ధకాండ ఉత్తరభాగం (360)లో ఈశ్వరుడు శ్రీరాముని స్తుతించే సందర్భాన ఈవృత్త ప్రయోగంఉంది.

30. **మంగళ మహాశ్రీ వృత్తం :** ఇది 26వ ఛందస్సు ఉత్కృతి సంజాతం. గణాలు: భ జ స న భ జ స న గ గ, యతి 9,17. ఉత్తరకాండ (432) చివరనఉంది. కావ్యం మంగళంతోనూ, శ్రీకారాంతంగాను ముగించబడింది.

విశేషవృత్తాలు అధికశాతం. స్తుతిసందర్భాననే ప్రయోగించబడినవి.

భాషావిశేషాలు :

విశేష పదప్రయోగాలు సామెతలు లోకోక్తులు గురించి వివరించి రాస్తే పీఠిక చాలా విస్తరిస్తుంది. కనుక కేవలం నామమాత్రంగా పేర్కొనడమైనది.

విశేష ప్రయోగాలు :

1-21 పోలికె (పోలిక అనుటకు)

1-53 వాచింప (వచింపకు)

1-22 దగ్గెర, చేరికె (దగ్గర, చేరిక అనుటకు)

1-79 తెల్లనివన్ని పాలని

1-245 ముడించె (ముడిచె అనుటకు)

2-142 చేరికె (చేరిక కు)

2-169 రాజ్యానకు

2-233 బాలికె (బాలికకు మారురూపం 'కేదారములందు బాలికెలు వసియింపన్' అని యతిస్థానప్రయోగాలు పూర్వకవులవి కనబడుతున్నాయి.

2-325 రాకడ, 3-404 రాకడకు

2-391 చేసళ్ళక (చేయి సడలక)

2-402 మాపటివేళ (మునిమాపువేళ)

2-429 చిగురొత్త

3-96 కడపమాను (దేహళి)

3-158 కానరాజేయు

3-158 బైట (బయట)

3-421 చేసును, 4-365 చేసుట (చేయును, చేయుట) పూర్వకవుల ప్రయోగాలున్నవి.

3-141 మున్ముంచగ (మునుముందుగ)

4-154 పనిబాట

4-193 పండుబారు

4-207 మొగమోట

5-82 లోగా

5-102 వాంచి, 8-41 వాంచి (వంచి)

6-322 కగ్గోలు

7-187 నూటొక్కమారు

8-135 రక్షించే విభున్ గొల్చెదన్

8-188 నూటొక్కమారు

8-316 తలవాంచి (తలవంచి)

లోకోక్తులు / సామెతలు :

1-130 పద్మపత్రస్థ జీవన బిందుస్థితి

1-131 లోహముదడయ కయస్కాంత సన్నిధానమున బలెన్

1-133 తన కంఠస్థితహేమము తనరజడుండెరుగనట్లు

1-134 చండకిరణ మండలంబున దమమెట్టు లుండనేర్చు

1-135 చండాంశునకు నహోరాత్రంబులు లేనియట్లు

2-4 మెరుగు తీగెలతోడి మేఘుంబు కైవడి

2-70 నిప్పుద్రొక్కిన కోతిరీతి

2-79 తెల్లనివన్నీ పాలని

2-102 దండహత భుంజంగిని పుట్టన్ జనుగతి

2-103 ఈనిన పులి గుహనుండునటుల

2-123 సాహసము షడ్గుణ మింతికి నా నిజంబుగన్

2-124 వజ్రపాతగత శైలగతిన్ క్షితి వ్రాలి

2-132 కాముకులకు నాపన్నులకేమయిన నొకింత సిగ్గు నెగ్గున్ గలవే

2-133 కాంతల హృదయంబులెంత కఠినంబులొకొ

2-138 బొంకులపుట్ట

2-139 ఎనయగ కామినీవశుల కెక్కడిసౌఖ్యములెంచి చూచినన్

2-40 కననెంత సాధ్వియైనను వనితల వశులగుచునమ్మవలవదు సుజనుల్

2-42 రేయొక యుగముగాగ గడుపు

2-180 వత్సము గోవుబాయలేనటు

2-193 అగ్ని సంతప్త లోహస్యంది జలబిందుగతి అంబు బుద్బుదంబుల సంగతి

2-196 నదీప్రవాహ పతితాగత కాష్ఠము లట్ల గూడుచున్ పరిపరివీడు

2-202 ఆమఘట స్థంబునగు నంబువుంబలె

2-215 ప్రవాహపతితంబగుగోడయుబోలె

2-249 కాముకులకు సత్యవాక్య గరిమలుగలవే

2-250 పోతుటీగకున్ జూడగరానిది

2-278 ధీనిధులు సత్యసంధులు ప్రాణభయంబైన విడువ రభిహిత వృత్తిన్

2-411 అశనిక్షతుండనలంబుచే గాల్పబడినట్లు

2-441 అశనిహత సాలమునుబోలి

2-450 దైవము బలిష్ఠము

2-460 జలపత్రాంత గతంబగు జలబిందువురీతి

2-510 కన్నుల కరువుదీర

2-514 ధేనువత్యంత తృషార్థమైన జలము నారసివచ్చినరీతి

2-526 సత్యంబగునే యెంతయు నున్మత్త వాక్యములలో బోలెన్

2-527 ఘనుల కసత్యభీతి యధికంబగు

2-541 క్షమాసారుల్ గదా సాధువుల్

3-71 శారిఘంటంబులందొక సూర్యుండుబలె

3-100 భాస్కరునకు దీప్తి స్వభావమై పగిది

3-100 వికాసములు స్వభావంబులగు మేఘమునకు బోలి

3-108 పూవున తావియువలె

3-310 పూతంబైన...పురోడాశంబును హీనంబగు శ్వానంబునుంబోలె

4-209 మొక మెర్రజేసి పలుక

5-38 పిండారబోసినట్లు

5-57 కటకటపడుచు

5-63 భూతిగప్పిన శిఖిరీతి

5-167 ఆకసము సర్వగతమయ్యు నయ్యఖిలమునంటనివిధాన

5-176 శునకమునకు ఘృతముంబలె

6-245 పుట్టవిరిసినట్టుల

6-263 మొగులు మూగిన రీతి

6-369 పావక కీల తూలతతి భస్మము నౌగతి

7-64 కన్నుల్ నిప్పులురాల

7-74 అశనిఘాత నిపాతితావనీరుహమట్ల

7-184 (పుడమింబడె) తాళోత్పతిత పక్వఫలముల లీలన్

7-185 కందుక ఖేలనమువోలె

7-189 వజ్రనిహత ప్రత్యంత భూమీధరోత్కరశృంగవ్రజమౌచు

7-242 జ్వలనంబున నుంచిన కాంచన ప్రతిమయుంబోలె

7-319 రాకరాక వచ్చు

8-231 కులాల చక్రభ్రమణ న్యాయమున

8-233 తేజంబేయెడ తిమిరముగా నాశమొనయించు

8-248 హంసంబు క్షీరంబు గ్రహించి జలంబు త్యజించుగతి

8-312 సతులకు పతియే పరదైవతమగు

8-384 ఛిన్నములట్ల క్షితినిబడిరి

చిత్రకవితావిశేషాలు[1]

కాణాదంవారు రసవత్కవిత్వ రచనలోనేగాక చిత్రకవిత్వనిర్మాణం లోనూ కడుంగడుదిట్ట. శేషశైలేశలీల అనేకృతిని అపంచవర్గీయాక్షరాలతో రచించటం కాణాదంవారి చిత్రకవితా ప్రియత్వానికి నిపుణత్వానికి పరాకాష్ఠ. వీరి ముకుందవిలాసంలోనూ బంధగర్భ చిత్రకవితావిశేషాలు పుష్కలంగా దర్శనమిస్తాయి. ఇక ప్రస్తుత అధ్యాత్మరామాయణం రసవత్కావ్యం. అయితే సందర్భోచితంగా అధ్యాత్మరామాయణంలో అక్కడక్కడ చిత్రకవిత్వం చోటుచేసుకుంది.

1. ప్రస్తుత పీఠికాకర్త రచించిన 'అధ్యాత్మరామాయణం-చిత్రకవితావిశేషాలు' అనేవ్యాసం 'మూసీ' పత్రిక (హైదరాబాదు) నవంబరు-2013 సంచికలో ప్రచురితం.

చిత్రకవిత్వంలో హృదయాన్ని కదిలించే లక్షణాన్ని ఆశించరాదు. అది బౌద్ధికవ్యాయామ క్రీడమాత్రమే. కవితారసాస్వాదనంతో ప్రమోదించే కోవిదుడు చిత్రకవిత్వంతో కూడా వినోదిస్తారు. కన్నులు కలవారు పూలదండను మాత్రమే కాక వజ్రాలహారాన్ని కూడా చూసి పరవసిస్తాడు. అలాగే కోవిదునికి మృదులమైన కవిత్వంమీదనేకాక పటుత్వమైన చిత్రబంధ గర్భకవిత్వం మీదకూడా కాంక్ష ఉంటుంది. కవితాచిత్రాలను తెలిసిన కోవిదుడు కోమల కవితాసుందరితోనే గాక చిత్రబంధ కవితాప్రౌఢాంగనతో కూడా వినోదిస్తాడు. మెత్తని పెదవి తేనియలను క్రోలే రసికుడు. కఠినంగా ఉన్నవని వక్షోజాలతో వినోదాన్నిపొందకుండా ఉంటాడా!? " 'శ్లేష'లు భూషగా, నాగద్వయాది బంధాలు రతికాల బంధాలుగా, గర్భకవిత్వం గర్భధారణగా కలిగిన కవితా వధూమణికి కబ్బం నిజమైన సంతు"

తెలుగులో చిత్రకవిత్వం ఎప్పటినుంచి ఉందోకానీ నన్నయగారు భారతంలో 'మృదుమధుర విస్తర నవరసభావ భాసుక కవితావిశారదులైన మహాకవులు' రాజరాజ నరేంద్రుని సభను అలంకరించినట్లు చెప్పినాడు. ఇక చిత్రకవిత్వంచోటు చేసుకున్న తొలితెలుగు కావ్యం నన్నెచోడుని కుమారసంభవం. చిత్రకవిత్వాన్ని గురించి చెప్పిన తొలితెలుగు లక్షణగ్రంథం విన్నకోట పెద్దన కావ్యాలంకారచూడామణి. కాగా సంపూర్ణంగా చిత్ర కవితామయంగా వెలువడిన తొలితెలుగుకావ్యం గణపవరపు వేంకటకవి విరచిత ప్రబంధరాజవేంకటేశ్వర విజయవిలాసం. ఇలా ఎందరో తెలుగు కవులు తెలుగుసాహిత్యంలో చిత్రకవిత్వానికి కూడా చోటు కల్పించి తెలుగు పండితులకు వినోదాన్ని కలిగించినారు. అలాంటివారిలో కాణాదంవారు ప్రథమశ్రేణికి చెందినవారిలో చేరుతాడు. వీరి ప్రస్తుత అధ్యాత్మ రామాయణం లోని చిత్రకవితావిశేషాలను గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం –

ద్వ్యర్థి

రెండర్థాలు వచ్చేటట్లు పద్యం చెప్పటంకూడ చిత్రకవిత్వమే. అధ్యాత్మ రామాయణం కావ్యావతారిక (8వ పద్యం) లో వినాయక–గరుడస్తుతి ద్వ్యర్థిగా రచించబడింది. ఎనిమిది సంఖ్యకు 'గజం' సంకేతం. గజముఖుడైన వినాయకస్తుతిని ఎనిమిదవ పద్యంలో చెప్పటం గమనార్హం. ఆ పద్యం మత్తేభవిక్రీడితంలో చెప్పటం మరోవిశేషం. ఆ పద్యం–

మ॥ వినుతింతున్ విబుధేంద్ర చిత్రముగ నా విర్భూత సంవిత్సుధా
ఘన సంపాదనకై సువర్ణరుచి పక్షస్ఫూర్తిమై పుష్కరా
ప్తిని గ్రీడించు సుకీర్తియోగ శుభమూర్తిన్ దక్షదౌహిత్రు న
ర్వినతానందకరున్ వినాయకుని నిర్విఘ్ను ప్రభావాప్తికిన్

వినాయకుడు–1 గణపతి, 2 వి=పక్షి, నాయకుడు= అధిపతి (గరుడుడు). విబుధ–ఇంద్ర, సుధా–ఘన–సంపాదన, సువర్ణ, సువర్ణ–రుచి–పక్ష, పుష్కరాప్తి, వినత–ఆనంద–కరు (1 వినతులైన వారికి ఆనందాన్ని కలిగించే తుండం కలవాడు, 2 తల్లియైన వినతకు ఆనందాన్ని కలిగించినవాడు (వైనతేయుడు).

వినాయక గరుడస్తుతి తర్వాతి పద్యం హనుమద్విష్వక్సేన స్తుత్యాత్మక ద్వ్యర్థి. ఇది తొమ్మిదవ పద్యం. ఆంజనేయుని రూపాలు తొమ్మిదని అంటారు. నవాంజనేయరూపాలు. అందుకని తొమ్మిదవ పద్యంలో హనుమంతుని స్తుతించటం గమనార్హం. ఇది విష్వక్సేనస్తుతికూడ

ఉ॥ ఊహ .... నుతింతునెంతయున్. అధ్యాత్మ 1-9.

శ్లేష

చిత్రకవిత్వంలో శ్లేష చమత్కారంకూడ ఒకటని చెప్తారు. అధ్యాత్మ రామాయణంలో అక్కడక్కడా శ్లేష చమత్కార చిత్రకవిత్వం చోటుచేసుకుంది. మచ్చునకు ఒకపద్యం-

సీ॥ పూర్వభూ భృన్మార్గమునకు వన్నియగూడె
నఖిలంబునను తమోవ్యాప్తి వీడె
కువలయంబు వికాస నవనవ శ్రీమించె
దరవృత్త పంకజాతము ముడించె
నతి రమ్యగతి సదాగతి దావిరాజిల్లె
సత్పథ స్థితికి తేజముఘటిల్లె
విమల కళా కలాపములు బెంపువహించె
యాశాంతముల దెల్వియావహించె

తే॥గీ॥ కంథులుప్పొంగె శుభతరంగములెసంగె
నరుల జతవిచ్చె సుకవుల హర్షమెచ్చె
శితగుణమెలర్చె సుకర సంగతి దనర్చె
నురువిభావాప్తి రామచంద్రోదయమున - అధ్యాత్మ బాల కాం.,

పై పద్యంలో శ్రీరాముని జననాన్నీ చంద్రోదయాన్నీ శ్లేషగా చెప్పినారు. రామ-చంద్రోదయం=రమ్యమైన చంద్రోదయం, రామచంద్రోదయం= శ్రీరామచంద్రుని పుట్టుక. రమ్యమైన శ్లేష చమత్కారచిత్రం.

ప్రాస క్రీడలు

వివిధ ప్రాసాలంకారాలతో చెప్పిన పద్యాలుకూడ చిత్ర కవితా శీర్షిక కిందికే వస్తాయి. అధ్యాత్మ రామాయణంలో ప్రాసక్రీడా విలాసాలు అనేకాలు. మచ్చునకు కొన్ని -

రామభక్తి విలాసాన్ని రమ్యప్రాస విలాసంగా

"సీ॥ సంసార దావాగ్ని సంతప్తులకు సుధా
స్తోమవర్ష నియుక్తి రామభక్తి" అనే పద్యంలో అందించినారు.

వృత్తాలలో అంత్యప్రాసలు పొతనవలె ప్రయోగించిన సందర్భాలు అనేకం. మచ్చునకు-

"ఉ॥ రాముడు భూసుతావృతసరాముడు...." అనుప్రాసవిన్యాసాలు కూడా అనేకం మచ్చునకు–

కం॥ చిత్రంబులు భవ్యవనీ
చైత్రంబులు భవమహోఘ జైత్రంబులు చి
త్సూత్రంబులు కృత విబుధ
స్తోత్రంబులు రామచంద్రు సుచరిత్రంబుల్ – బాలకాండ 100వ ప.

కం॥ కురిసెన్ పువ్వులవానలు
మొరసెన్ సురదుందుభులు సముత్సాహకళన్
నెరసెన్, దిక్కుల తమములు
విరిసెన్, విష్ణుండు లోక విభుడుదయించెన్ – బాలకాండ 244వ ప.

యమకాలు

అధ్యాత్మ రామాయణంలో యమకాలు అత్యధికం. అయితే అవి సరళంగా సుందరంగా ఉండటం కవి నైపుణ్యానికి, పరిణతికి దర్పణం పడతాయి. మచ్చునకు...

ఉ॥ గంగను వాంఛితంబు లెసగంగను కల్మష దుర్విషంబు ద్రుం
గంగను జన్మకోటి దలగంగను పుణ్యము వెల్ల తీగె సా
గంగను సంతత త్రిదివ గంగను వేడ్కను సమ్మదోర్మిం బొ
గంగను గాంచె భక్తి సెలగంగను దన్మునిపుంగవుండొగిన్ – బాలకాండ 318వ ప.

తే॥గీ॥ అంత నారామ నామంబు నాలకించి
యంతరారాము గనుచుండి యాత్మదృష్టి
వింతనారామ యపుడు దెల్వినిసహించి
చెంతనారాము గనియె బాహ్యాంత దృష్టి – అయోధ్య. 174వ ప.

కం॥ మహితనయా యను లక్ష్మణ
మహితనయా యనుచు నశ్రుమగ్నాక్షుండై
మహిపతి యతిదుఃఖంబున
మహి పతితుండయ్యె జనము మనముల బొంగలన్
– అయోధ్య. 273వ ప.

ద్విపాద చిత్రం

పద్యంలోని మొదటి రెండుపాదాలూ ఒకేరీతిగా, చివరి రెండుపాదాలు మరొక రీతిగా రచించటంకూడా చిత్రకవిత్వంలో ఉంది. దీనిని యుగ్మక యమకం అనికూడా అంటారు. ఇలాంటి పద్యాలుకూడ అధ్యాత్మ రామాయణంలో కొన్ని ఉన్నాయి. మచ్చునకు ఒకటి –

తే॥గీ॥ రాక రాక వచ్చు రామచంద్రుని జూడ
సంతసించిరచటి జనములెల్ల
రాక రాక వచ్చు రామచంద్రుని జూడ
సంతసించి రచటి జనమువెల్ల

రాక–అంటే పున్నమి. రాక రాక వచ్చు–పున్నమ పున్నమకూ వచ్చు, రామ–అందమైన, చంద్రునిచూడ–చందమామనుచూడగా, సంతసించునట్లు జనములెల్ల, రాక రాకవచ్చు–చాలాకాలంరాకుండా ఉండి (లేకలేక) వచ్చిన, రామచంద్రునిచూడ–శ్రీరామచంద్రుణ్ణి చూడగానే, సంతసించిరచటి జనములెల్ల. వనవాసానంతరం రామచంద్రుడు అయోధ్యకువచ్చిన సందర్భాన ఈ పద్యంఉంది. ఇలాగే పలుతావులలో శిష్ట పదవిశిష్ట అనల్ప కల్పనా చాతుర్య మాధుర్య ధుర్యంగా సాగింది అధ్యాత్మ రామాయణ రచన. కాణాదంవారి కావ్యాలలో ఉన్నన్ని యమకాలు తెలుగు సాహిత్యంలో మరేకావ్యంలోనూ లేవని కందుకూరివారు కవులచరిత్రలో పేర్కొనటం ఈసందర్భాన ప్రస్తావోచితం.

చక్రవాళరచన

శ్లో॥ పదమన్త్యం సమాదాయ యమకస్థితి భూషితః ।
ఆవృత్యా గీయతే యస్తు చక్రవాళ స్స ఉచ్యతే ॥

పూర్వపాదాంతం అక్షరాలే ఉత్తర పాదారంభాన ఆవృత్తిగా వేరే అర్థంలో సాగటం దీనిలోని ప్రధాన లక్షణం. ప్రారంభపదం, ముగింపు పదం ఒకటే అయివుంటుంది. అయితే అర్థభేదం ఉంటుంది.

చక్రవాళకందం రామా జగదభిరామా!
రామాంక కుఠారి మదభరత్వ విరామా
రామా భూతధరామా!
రామానుజతాత్త దివిజరాజారామా!

సోష్మచిత్రం

'ప' వర్గాక్షరాలు అంటే 'ప–ఫ–బ–భ–మ' మరియు అంతస్థాలలో 'వ' అచ్చుల్లో 'ఉ–ఊ' మరియు కంఠ్యోష్ఠ్యాలు 'ఒ,ఓ,ఔ' లు ఓష్ఠ్యాలు. వీటితో నిర్మించే పద్యం (స+ఓష్ఠ్యం) సోష్మం.

శా॥ భూమాప్రేమ సభావగోపయువసుభ్రూ విభ్రమా విద్భవ
వ్యామోహారు విభావ భావభవ భావప్రాప్త భానూద్భవా
భూమీ పార్శ్వ భర ద్రుమ ప్రభ శుభాంభోభృద్వి భావైభవా
సోమ క్ష్మాపవరోపభావ్య విభవస్తోమా బహుప్రాభవా – అరణ్య 428వ ప.

నిరోష్ఠ్యచిత్రం

ఓష్ఠ్యాలు లేకుండా చెప్పే పద్యం

కం॥ ధారాధర దేహసితా
సారాధర జలజశంఖ చక్రధర దయా
నీరాకర సరసీజా
గారాకర సంగ్రహైక కల్యాణ నిధీ – అరణ్య 432వ ప.

సోష్ఠ్య నిరోష్ఠ్య సంకరం

ఒక అక్షరం ఓష్ఠ్యం, తర్వాతి అక్షరం / అక్షరాలు నిరోష్ఠ్యం / నిరోష్ఠ్యాలు ఇలా ఒక క్రమ పద్ధతిగా సోష్ఠ్య నిరోష్ఠ్యంగా చెప్పే పద్యం. అనగా ఓష్ఠ్యం పక్కన ఓష్ఠ్యం రాకుండా రచన సాగుతుందన్నమాట.

ఉత్సాహ॥బాలలోల భక్తపాల భర్గ వంద్య మహిమ ది
క్పాల పోష మౌనితోష భద్రవేష పటిమ ని
ర్వేల భాగ్యపుణ్యయోగ్య వేదవేద్య పరమ గ
ద్వాల వాస భూరివాస వాగ్ధరాది నుతగుణా! – అరణ్య. 433వ ప.

పాదభ్రమకం

పద్యంలో ఏ పాదానికి ఆ పాదం ముందునుంచి వెనకకు, వెనుక నుంచి ముందుకు (అనులోమ విలోమంగా) చదివితే ఒకేరీతిగా ఉండేటట్లు రచించే దానిని పాదభ్రమక / అనులోమ విలోమ చిత్రం అంటారు.

సుందరకాండంలోని ఆశ్వాసాంతంలో ఈ పద్యం రచించబడింది. కిష్కింధకు హనుమ 'వెళ్లివచ్చిన' సందర్భాన ఈ పద్యం ప్రయోగించటం విశేషం.

గుణితక్రమం

పద్యంలోని పదాలు/సమాసాలు వరుసగా తలకట్టు, దీర్ఘం, గుడుసు, గుడుసుదీర్ఘం ఇలా గుణిత క్రమంలో రచించటం.

చం॥ **క**మల విరోధి **కా**మజయకారి **కి**రద్యుతి **కీ**ర్తనీయుడున్
కుముదహితుండు **కూ**టమృగగోప్త **కృ**తాంకుడు **క్లృ**ప్తసత్కళా
క్రముడును **కే**శవేక్షణము **కై**రవణీశుడు **కో**కభేదనా
గమనుడు **కౌ**ముదీకరుడు **కం**ధిభవుండుదయించె తూర్పునన్
– సుందర–31వ ప.

గర్భకవిత్వం

ఒక పెద్ద పద్యములో మరొక చిన్నపద్యం ఇమిడ్చి రచించటం గర్భకవిత్వం. ఇలాంటి చిత్రకవిత్వం సంస్కృతంలో చాలా తక్కువ. తెలుగులో ఇదొక విశేష చిత్రకవిత్వంగా స్థానం ఏర్పరచుకుంది. పెద్దన సోమయాజి ఒక చంపకమాలలో రెండుకందపద్యాలు ఇమిడ్చి రచించటమేగాక ఆ కందాలు యమకాలంకారశోభితంగా కూడ చెప్పడం ఆయన పాండిత్య ప్రావీణ్యానికి నిదర్శనం. ఇది ఆశ్వాసాంత స్తుత్యాత్మక సంబుద్ధి పద్యం.

చం॥ వరకరుణాభిరామ సురవాసుర వారనుతాంఘ్రి పద్మసుం
దరశరణార్థి కేకిశరదాశర దానవ దర్పహారి శం
కరవినుతాంకలోక జనకా జనకాది మునీంద్ర చిత్త సం
స్థిర ఘన భావ సూర్యవనధీ వనధీశ నివేశ కేశవా !

– అయోధ్య 567వ ప.

పై చంపకమాలా వృత్తంలోని గర్భగత ప్రథమ కందం –

కం॥ కరణాభిరామసురవా
సురవార నుతాంఘ్రి పద్మ సుందర శరణా
శరణార్థి కేకి శరదా
శరదానవ దర్పహారి శంకరవినుతా

పై చంపకమాలా వృత్తంలోని గర్భగత ద్వితీయ కందం –

కం॥ వినుతాంకలోక జనకా
జనకాది మునీంద్రచిత్త సంస్థితఘన భా
ఘనభావసూర్య వనధీ
వనధీశ నివేశ కేశవా వరకరుణా !

యుద్ధకాండంలో శ్రీరామస్తుత్యాత్మకదండకం రచించబడింది. దండకం ప్రారంభాన స్రగ్విణీవృత్తం, ముగింపులో భుజంగప్రయాతవృత్తం గర్భస్థంగా ఉండేటట్లు రచించబడింది.

శ్రీరామదండకం :

'శ్రీరామ చంద్రా! మహారాజచంద్రా! మహీజామనోజ్ఞా! ధనుస్సాహసజ్ఞా! నమత్ప్రేమకారీ! సుశాంతా! మహాకాంతి కాంతా! యనంతా! హరీ! దేవ! సుగ్రీవమిత్రా!..... ఇకన్ గావవే! దేవదేవా! యహోజానకీశా! దయాశ్రీనివేశా! యహోరావణారీ! జయశ్రీవిహారీ! మహీశస్వరూపా! సమస్తాత్మ దీపా! మహాత్మన్నమస్తే నమస్తే నమస్తే నమః'

పై దండకంలోని గర్భగతమైన ప్రగ్విణీవృత్తం. . .

రామచంద్రా! మహా–రాజచంద్రా! మహీ
జామనోజ్ఞా! ధను–స్సాహసజ్ఞా! నమ
త్ప్రేమకారీ! యశ–శ్శ్రీవిహారీ! సుశాం
తా! మహాకాంతి కాం–తా! యనంతా! హరీ!

పై దండకంలోని గర్భితమైన భుజంగప్రయాతవృత్తం

అహోజానకీశా! ద–యా శ్రీనివేశా!
యహోరావణారీ! జ–యశ్రీవిహారీ!
మహీశస్వరూపా! స–మస్తాత్మ దీపా!
మహాత్మన్నమస్తే న–మస్తే! నమస్తే!

బంధకవిత్వం

కాణాదంవారు అధ్యాత్మ రామాయణంలో మొత్తం తొమ్మిది బంధాలు సందర్భోచితంగా ఆయా కాండల చివరన రచించినారు. ఆ వివరాలు –

1. పుష్పమాలికా బంధం – అయోధ్యకాండం–570వ ప. (పంచచామరం)
2. జాంబవత్పాద బంధం – కిష్కింధకాండం–373వ ప.(ఉత్పలమాల)
3. రథబంధం – కిష్కింధకాండం–374వ ప.(కందం)
4. విశ్వముఖమత్స్యత్రయ బంధం – సుందరకాండం–242వ ప. (చంపకమాల)
5. గోమూత్రికా బంధం – సుందరకాండం–244వ ప. (సుమవిచిత్ర వృత్తం)
6. ఖడ్గబంధం – యుద్ధకాండం పూర్వభాగం 397వ ప. (కందం)
7. పుష్పబంధం – యుద్ధకాండం పూర్వభాగం 398వ ప. (స్రగ్ధరావృత్తం)
8. చక్రబంధం – యుద్ధకాండం ఉత్తరభాగం 412వ ప. (శార్దూలవిక్రీడితం)
9. ఛత్రబంధం – యుద్ధకాండం ఉత్తరభాగం 413వ ప. (కందం)

పై బంధాలలో చక్రబంధం మాత్రం చిరుమార్పులతో ముకుంద విలాసం నుండి గ్రహించబడింది.

పై బంధాలలో అన్ని బంధాలకూ పూర్వకవుల ప్రయోగాలు కనబడుతున్నాయి కానీ జాంబవత్పాదబంధం, విశ్వముఖ మత్స్యత్రయబంధం అనేవాటికి మాత్రం పూర్వకవుల ప్రయోగాలు మృగ్యం / అలభ్యం. కనుక 'ఈ బంధాలకు చిత్రాలెలా ఉంటాయో తెలిస్తే చెప్పండి!' అనే వ్యాసాన్ని వ్రాసి సమాలోచన పత్రిక (రాజమండ్రి---) లో ప్రచురించటం జరిగింది. స్పందనరాలేదు. ఇటీవల మరల ఒకవ్యాసం ప్రకటించటం జరిగింది[1]. అభిజ్ఞుల సహకారంతో ఈ బంధాలకు చిత్రాలు రూపొందించి ప్రస్తుతం ఆయాతావులలో ముద్రించబడినవి. సూచనకు సలహాలకు ఆహ్వానం.

1. వివరాలకు చూడు : అనుబంధం పుట : 629–632. "ఈ బంధాలకు చిత్రాలు ఇలా..." అనే వ్యాసం

కాణాదం వారికాలాన గద్వాలలో కామసముద్రంవారు మొదలైన కవులు, బోరవెల్లిలో చింతలపల్లి కవులు సురపురంలో తిరుమల బుక్కపట్టణం మరియు పురుషకారికవులు, పెద్దన చిత్రకవిత్వానికి సముచిత స్థానం ఇచ్చినారు.

పూర్వకవ్యనుకరణ

కవిత్రయం, భాస్కరాదులు, శ్రీనాథ, పోతన, చేమకూర వేంకటకవి మొదలయిన కవులను తలపింపచేసే పద్యాలు అధ్యాత్మరామాయణంలో అనేకం. అయితే స్వీయకవితా ప్రతిభాపాటవాలుకూడా ద్యోతకమవుతాయి. విస్తరభీతిచేకేవలం ఒకపద్యం మచ్చునకు–

చ. అటజని కాంచెరాముడు దనంతననంతఘనాంతరస్ఫుర
త్తటి దుపమాసమాహిత నితాంతలతాంత బలాంతకాశ్మసం
ఘటితవిశాలసానురుచికారక గైరికధాతు కూటమున్
దటపటలీనటచ్చటులదైవతకూటము చిత్రకూటమున్

–అయోధ్య.332వ ప.

పై పద్యం పెద్దన మనుచరిత్రలోని 'అటజనికాంచెభూమిసురుడు' అనే పద్యాన్ని గుర్తుకు తెస్తుంది. కాణాదంవారు ముకుందవిలాసంలోనూ 'అటజనికాంచె కృష్ణుడు' అని ఇదే పోకడతో ఒక పద్యాన్ని చెప్పినాడు. అల్లసాని పెద్దనార్యుడు నందవరీకి. కాణాదంపెద్దనార్యుడూ నందవరీకి. కవితాశక్తిలోకూడా కాణాదంవారు అసామాన్యులు. కనుకనే కాణాదంవారిని అభినవఅల్లసానిపెద్దనగా పేర్కొన్నారు.

పెద్దన తన ముకుందవిలాసంలోని పద్యాలను అధ్యాత్మరామాయణంలో కొన్నింటిని యథాతథంగా మరికొన్నింటిని భావానుకరణంగా చెప్పినాడు. మచ్చునకు యథాతథంగా–

ఉ॥ దాతదయావిశిష్టుడు... యెంచిచూచినన్. అనే ముకుందవిలాసం లోని (1–79) పద్యం అధ్యాత్మరామాయణంలో (1–50) యథాతథంగా గ్రహించడ మైనది.

ఇక భావాన్ని గ్రహించి, పద్యాన్ని మార్చి చెప్పినదానికి ఒక ఉదాహరణ–1.

ముకుందవిలాసంలో 'కరిశిరోర్పితహేమ ఘటపయఃస్నానంబు' అనే (1–90) సీసపద్యంలోని భావం అధ్యాత్మరామాయణంలో 'కరిశీర్షార్పిత' (1–59) అనే మత్తేభంగా అవతరించింది. కరిశీర్షార్పితం కనుక మత్తేభంలో చెప్పటం విశేషం. ఇలాంటి విశేషాలు చమత్కారాలు అధ్యాత్మరామాయణంలో అడుగడుగునా దర్శనమిస్తాయి.

రసవద్ఘట్టాలు : వర్ణనలు, అలంకారాలు

రామాయణ మహాకావ్యంలో రసవద్ఘట్టాలు అనేకం. అవి అలంకార భూయిష్టాలు. వర్ణనానైపుణ్యానికి నిలయాలు. సందర్భోచితంగా అష్టాదశ వర్ణనలేగాక తదితర అనేక వర్ణనలుకూడా ఈ రామాయణ

మహాకావ్యంలో చోటు చేసుకున్నాయి. అవి కవి ఆలంకారిక దృష్టికి, భావుకతకు, ప్రతిభాపాటవాలకు దర్పణం పడతాయి. మచ్చునకు ఒక పద్యం–

గర్భవతియైన కౌసల్యను గురించి బాలకాండ (241వ ప.)లో చెప్పటం జరిగింది. గర్భంలో ఉన్నది దశావతారాలెత్తిన నారాయణుడు. కనుక గర్భవతి వర్ణన దశావతారాలు స్ఫురించేలా చెప్పటం విశేషం. ఆపద్యం–

సీ॥ కోరికల్ జలధులై గూడగా విహరించు
నంగ సంకోచంబునధిగమించు
పంటివారుచియంటి మంటిగోష్ఠిఘటించు
సతతంబు ప్రహ్లాద మతివహించు
నొకటి రెండడుగుల నొకదారివర్తించు
నుర్వీదానాదుల కుత్సహించు
బహుముఖవ్యావృత్తి భంగిపరిహరించు
తనువున పాండురత్వము భరించు

తే.గీ॥ వలయు బుద్ధిని కలికి భావమున మించు
తనదు గర్భార్భకు దశావతార కలన
వెలిదెలుపు రీతి దౌహృదావిర్భవమున
రమ్యతత గాత్రి కోసల రాజపుత్రి – బాలకాండ. 241వ ప.

పీఠిక ఇప్పటికే అనుకున్న పుటలను మించినది. కనుక విస్తరభీతిచే అనేక అంశాలను విస్తరించక నామమాత్రస్మరణం చేయటం జరిగింది. పరిష్కరణ– పాఠభేదాలను గురించి తప్పక తెలుపవలసి ఉన్నందున ఆ అంశాలను స్పృశించక తప్పదుకదా !

పరిష్కరణ – పాఠభేదాలు

కాణాదంవారి అధ్యాత్మరామాయణం ప్రప్రథమంగ (శాలివాహన శకవర్షములు 1801 బహుధాన్య ఆశ్వీయుజ శుద్ధపాడ్యమి శుక్రవారము నాటికి సరియగు ఆంగ్ల సంవత్సరం క్రీ.శ. 1879లో గద్వాలసంస్థాన ప్రభువులు సాహిత్యవిద్యాముకుర ముద్రాక్షరశాలలో ముద్రితం. పుటలు 71+36=106 పుటలు 1/4 డెమ్మీ, 100 ప్రతులు. పరిష్కర్త పురాణం దీక్షాచార్యులు – సంస్థాన ధర్మాధికర్త. గద్వాల ప్రభువు రామభూపాల రాయలవారు[1] ప్రచురించినారు.

1. పుట 625.

అధ్యాత్మరామాయణానికి తాళపత్రప్రతికూడా ఒకటి మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్నట్లు ఆంధ్రవాఙ్మయసూచిక వల్ల దాదాపు 30 సంవత్సరాలక్రితం తెలిసింది. ప్రస్తుత పీఠికాకర్త దాదాపు 28 సంవత్సరాలనాడు మద్రాసుకు వెళ్లి అధ్యాత్మరామాయణ తాళపత్ర ప్రతిని గద్వాలవారి ముద్రిత ప్రతితో సరిపోల్చి పాఠభేదాలు గుర్తించడమైనది.

పూర్వముద్రిత ప్రతిలో 1/4డెమ్మీ సైజు పేపరు నిండుగా పద్య / గద్య పంక్తులు ముద్రించబడినవి. అంటే ఏ పద్యానికి ఆ పద్యం విడివిడిగా గాక పంక్తులలో పద్యం/ గద్యం ఎక్కడ అయిపోతే అక్కడినుండే తరువాతి పద్యగద్యాలు ముద్రణ చేయబడినవి. ఇది తొలినాళ్ల అచ్చు పద్ధతి. ఆ నాటి గ్రంథాలన్నీ అలాగే అచ్చైనవి. వలపలగిలక పద్ధతి అచ్చులో కూడా ఉండేది. పూర్వపు అచ్చుపుస్తకాలు వర్తమాన కాలపు సామాన్య పాఠకులు చదివేందుకు కొంత ఇబ్బంది పడటం తప్పదు. పూర్వ ముద్రితప్రతిలోని ఒక పుటను అనుబంధంలో మాదిరికి ఇవ్వడంజరిగింది[1]. పూర్వ ముద్రితప్రతిలో పద్యాల క్రమసంఖ్య ఇవ్వలేదు. ప్రస్తుతం పద్య క్రమసంఖ్య ఇవ్వబడింది.

పూర్వ లిఖిత, ముద్రిత ప్రతులలోవలె ప్రస్తుత ప్రతిలోను ఆధునిక పాఠకుల సౌకర్యార్థం అరసున్నను ఉంచలేదు, సాధు, శకట, రేఫలను వేరుగా వ్రాయలేదు.

పూర్వముద్రిత ప్రతిని తాళపత్రప్రతి పాఠభేదాలను పరిశీలించి 1985 జనవరి నాటికి ప్రస్తుత పీఠికాకర్త మరొక పరిష్కృత శుద్ధప్రతిని వ్రాయటం జరిగింది. ఈ ప్రతిలో పదాలు ఏపాదానికి ఆపాదం విడివిడిగా ఉండేటట్లు ఆధునిక విరామ చిహ్నాలతో వర్తమాన ముద్రిత పద్యకావ్యాలవలె వ్రాయటం జరిగింది[1]. ఈ ప్రతి ఆధారంగానే డి.టి.పి. చేయించి ప్రస్తుత ముద్రిత ప్రతిని అందించటం జరిగింది.

గద్వాలవారి ముద్రితప్రతి పాఠం (గ.ము.పా), మద్రాసు తాళపత్రప్రతి పాఠం (మ.తా.పా) రెండున్నూ ఆయా పాఠాలుగల పుటలలో ఇవ్వడమైనది. సరైనదని అనిపించిన పాఠాన్ని పద్యంలోనూ, తదితరపాఠాన్ని అధోజ్ఞాపిక లోనూ ఇవ్వడమైనది. ఆ పాఠాలకు సంబంధించిన వివరాలు, గ్రహించిన పాఠానికి కారణాలు ఈ దిగువన కనబరచడమైనది.

1-64 శ్రీమదిలా శ్రీమహిళా – గ.ము.పా.
శ్రీమహిళా శ్రీదిలా – మ.తా.పా.
పాఠచర్చ : శ్రీభూదేవులు అంటూంటాం. అంటే ముందు శ్రీదేవి ఆ తర్వాత భూదేవి. కనుక అలాఉండే మ.తా.పా. పద్యంలో గ్రహించబడింది.

1-146 యగుచు నవచ్ఛిన్ను నందున్న భ్రాంతాత్ములగుచు – గ.ము.పా.
యై నవచ్ఛిన్ననందు భ్రాంతాత్ములగుచు – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. తేటగీతిపాదం కుదురలేదు. కనుక మ.తా.పా. గ్రహించబడింది.

1. చూడు అనుబంధం పుట : 626.

1-548 తరియింతుమికన్ – గ.ము.పా.
తరియింతువికన్ – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. అర్థం భేదిస్తుంది. కనుక మ.తా.పా గ్రహించడమైనది.

3-190 జొప్పడువారలకు నాకు సమ్మతిరణమున్ – గ.ము.పా.
జొప్పడువారకకు నాకు సుమ్మతి రణమున్ – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. యతిభంగం, అచ్చు తప్పుకావచ్చు.

3-217 చాపమున న్శరచయంబు – గ.ము.పా.
చాపంబున శరచయంబు – మ.తా.పా.
పాఠచర్చ : కోపంబున-చాపంబున-టోపంబున-క్షేపంబన అని పద్యం శబ్దలంకారంగా ఉంది. 'చాపమున న్మర' అంటే శబ్దాలంకారం ఆపాదంలో లోపిస్తుంది.

3-167 యొకనాడు గౌతమీ తటిని చంచత్తటి – గ.ము.పా.
యొకనాడు గౌతమీ ప్రకట చంచత్తటి – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. యతిభంగం.

4-374 ధరావరా – గ.ము.పా.
ధరాధరా – మ.తా.పా.
పాఠచర్చ : ధరాధరా అనేపాఠం బంధంలో సరిగా ఇముడుతుంది. మిగతా పాదాలలోని 3,4,5 అక్షరాలు సహాస, లశీల, నిమాని అని ఉండటంకూడ గమనార్హం. కనుక మ.తా.పా. గ్రహించబడింది.

4-376 ఖేలవర గద్వాల – గ.ము.పా.
ఖేలవర శ్రీ గద్వాల -- మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. అక్షరలోపం.

6-47 వరు-ణుడు నీచేత నిర్జితుడునయ్యె – గ.ము.పా.
వరు-ణుండు నీచేత నిర్జితుండునయ్యె – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. గణ యతులు పొసగవు.

6-71 ఏనిడుభాగ్యసంగతి గడున్ – గ.ము.పా.
ఏనిడుభాగ్యసంగతి మహిన్ – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. యతిభంగం.

6-221 ధరణి యాదృవ – గ.ము.పా.
ధరణి యదుర – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. అచ్చుతప్పు కావచ్చు.

6-246 క్షణం-బూరక యుండెను మరల్ప నయబలుడయ్యున్ – గ.ము.పా.
క్షణం-బూరక యుండెను మరల్ప నురుబలుడయ్యున్ – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. యతిభంగం.

6-264 నఖిలాండ నిధులు ఘూర్ణిల్లు చుండ – గ.ము.పా.
నిఖిలాండ నిధులు ఘూర్ణిల్లుచుండ – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. అచ్చుతప్పు కావచ్చు, యతిభంగం.

6-364 ప్రాప్తితాహంకార రూపిణియగు – గ.ము.పా.
ప్రాపితాహంకార రూపిణియగు – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. అచ్చుతప్పుకానోపును, యతిభంగం.

6-367 గ-ణాంచితంబగు మృదుసూక్ష్మహేమపీఠి – గ.ము.పా.
గ-ణాంచితంబగు హేమపీఠాగ్రమందు – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. యతిభంగం.

6-380 భ్రాతిగ రామువీక్షణమునుంగపి – గ.ము.పా.
భ్రాతిగ రాము వీక్షణములం గంపి – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. యతిభంగం.

7-91 సవిధిన్నిండార – గ.ము.పా.
సరవిన్నిండార – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. ప్రాసభంగం.

7-95 యాగుహ జొచ్చియు యేకాంతమున – గ.ము.పా.
యిక గుహజొచ్చియు యేకాంతమున – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. యతిభంగం.

7-254 నాకు భర్త వీవ రా మనేక కార్య కారకా – గ.ము.పా.
నాకు భర్త వీవ రామనాకకార్య కారకా – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. అచ్చుతప్పు కావచ్చు, గణభంగం.

7-290 త్వత్ప్రసాద తపము మహిమ వలన – గ.ము.పా.
త్వత్ప్రసాద మహిమ తపము వలన – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. పొరపాటున మహిమ తపము పదాలు వెనక ముందులుగా పడిఉంటాయి.
యతిభంగం.

7-306 జలముల – గ.ము.పా.
శరముల – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. ప్రాసభంగం.

7-322 శ్రీవేష సహితుడై – గ.ము.పా.
శ్రీశేష సహితుడై – మ.తా.పా.
పాఠచర్చ : రెండున్నూ సరైనవే. అయితే మ.తా.పా. మేలైనదని భావించబడింది.

7-384 హర్షమందరాఘువా – గ.ము.పా.
హర్షమంద దేవరాఘువా – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. ముద్రణలో అక్షరాలు జారిపొయి వుంటాయి. గణభంగం.

8-26 తజ్జనకుడువచ్చి నక్కన్యకను – గ.ము.పా.
తజ్జనకడువచ్చి తత్కన్యకను దెచ్చి – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. యతిభంగం.

8-78 రథోత్తమనన్ – గ.ము.పా.
రథోత్తమ మనన్ – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. అచ్చులో అక్షరం జారిపోయిఉంటుంది. అక్షరలోపం.

8-82 దెంపర – గ.ము.పా.
వెంపర – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. అచ్చుతప్పుకావచ్చు, యతిభంగం.

8-407 పర-మాత్ముండవును పరమేశ్వరుడవు – గ.ము.పా.
పర-మాత్ముడవును పరమాధిపుడవు – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. యతిభంగం.

8-432 సాధుతరవినిర్మల – గ.ము.పా.
సాధుతర భూహితవినిర్మల – మ.తా.పా.
పాఠచర్చ : గ.ము.పా. ముద్రణలో 'భూహిత' జారిపోయి ఉంటుంది. గణలోపం, యతిభంగం.

ముగింపు

ముకుందవిలాసానికి వ్యాఖ్యానం రచించి దానిని వ్యాఖ్యతో ప్రచురించటం, అధ్యాత్మరామాయణాన్ని విపులపీఠికతో సుపరిష్కృతంగా బంధచిత్రాలతో ప్రచురించాలని మూడు దశాబ్దాలనాడు సంకల్పం కలిగింది. హైస్కూలులో విద్యార్థిదశలోనే కాణాదంవారి రచనలపై ఆకర్షితుడనైనాను. ఈ నాటికి అధ్యాత్మరామాయణానికి ఇలా పీఠిక సంతరించి ప్రచురించే భాగ్యం కలిగింది. సహృదయులైన సాహితీవేత్తలు, విద్వాంసులు కవి పండితులు ఇందలి గుణాలను కాణాదంవారిగా, అవగుణాలుంటే నావిగా గ్రహిస్తారని మనవి.

ఒక పురాతనగ్రంథాన్ని పరిష్కరించి కవిహృదయానుగుణంగా పీఠిక/ వ్యాఖ్య సంతరించి వెలువరించటంలోని శ్రమను అనుభవజ్ఞులు ఎలాగూ గుర్తిస్తారు. ఈ నా కృషిని అలాంటి సహృదయులు ఆదరిస్తే నేను ధన్యుడను.

సాహిత్యారాధకుడు

వైద్యం వేంకటేశ్వరాచార్యులు

దీపావళి
విజయ 2013





శ్రీరస్తు

శ్రీ భూ చెన్నకేశవ పరబ్రహ్మణే నమః

అధ్యాత్మ రామాయణము

కావ్యావతారిక

శ్రీ కాంతామణి జానకీస్ఫురణచే చెల్వంబుగా తాను రా
మాకారంబున లోకబృందమున కాత్మానందమౌ నద్వితీ
యైకబ్రహ్మము కేశవుండు గరుణాయత్తస్థితిన్ నిర్మల
శ్లోకున్ దిర్మలరాయ సోమనృపతిన్ సుశ్రీయుతుంజేయుతన్ ॥ 1

సీ॥ సరసగుణోద్భాసి జనక పయోరాశి
జనియించి వెలసిన జలజపాణి
రమ్యలక్షణశాలి రాజసహోదరి
భావంబుగనిన సంపన్నిధాన
రామనామ నిరూఢి రంజిల్లుశౌరికి
మానినియగునట్టి మంగళాఖ్య
యాశ్రితస్వజన గేహాంగణసీమల
సిరులునించ వహించు శ్రీసమాఖ్య

తే.గీ॥ యతనువిధిరీతి కుశలవత్వానుభూతి
గను సుతులగన్న కైకజ నెనయనేగ
నవని జనియించి విలసిల్లు నాదిలక్ష్మి
సహ జయంబూని సోమభూజాని బ్రోచు 2

మ॥ తన శేష స్థితి దెల్పెనెంతయు ననంతవ్యాప్తి నౌభక్తిచే
వనరాశి స్థలి తల్పముఖ్య కృతి సేవావృత్తి రామాఖ్యచే
ననువౌశౌరికి వేడ్కగూర్చు సుమిత్రానంద సంధానతన్
మను సల్లక్షణుడైన లక్ష్మణుడు సోమక్ష్మావరున్ బ్రోవుతన్. 3

మ॥ తమ శంఖారి యుగాంశతల్ దెలుప దైత్యత్రాస కారిస్ఫరో
ద్యమముంగైకొని రామశౌరికిని పార్శ్వాలంకృతి స్ఫూర్తి నం
దు మహీసాధనభూతులౌ భరత శత్రుఘ్నుల్ యశశ్శౌర్యసం
భ్రమయుక్తిన్ విజయం బొసంగుదురు సోమక్ష్మా వధూభర్తకున్ 4

ఉ॥ రామ పరాత్మ తత్త్వము దిరంబుగ వేడిన నవ్వధూటికిన్
రామపరాత్మ తత్త్వము పరంబని తెల్పిసుఖించు విశ్రుతుల్
శ్రీమహితుల్ శివాకృతులశేషజగన్నుతులాదిదంపతుల్
సోమ నృపాలు సత్యభవశోభన శీలుని బ్రోతురెప్పుడున్ 5

మ॥ తనబ్రహ్మాఖ్య నిజంబుగా వెలుగ సత్యస్ఫూర్తి శోభిల్లి చి
ద్ఘనతం బాపి విభారతీకలిత లక్ష్మ్య వ్యాప్తి నానందభా
వనచే భాసిల హంసగమ్యుడగుచున్ వర్తించు వాణీశు డి
చ్చును విజ్ఞాన చిరాయురున్నతులు శ్రీసోమక్షమాజానికిన్ 6

సీ॥ దళమహీవలయితాంత స్వర్ణ కర్ణికా
వనజమే దేవి నివాస భూమి
మరిపరాపస్యతి మధ్యమా వైఖరు
లేదేవి నిజవైభవోదయములు
శ్రీమహాకాళీ శచీచండికాదు లే
దేవికి పరివార దేవసతులు
సుకరహిరణ్మయాంశుకకింశుకశ్రేణు
లే దేవికిని నలం కృతిచయంబు

తే.గీ॥ లేమహాదేవి కరుణా సుధైకసార
మసమవిద్యారసంబుగా నెసగునట్టి
ధేనువాగీశ్వరీ మహాదేవి ఠీవి
నిగమతతిమాత మత్కృతి నిలుచుగాత! 7

- వినాయక గరుడ స్తుతి -

మ॥ వినుతింతున్ విబుధేంద్రచిత్రముగ నావిర్భూత సంవిత్సుధా
ఘనసంపాదనకై సువర్ణ రుచిపక్ష స్ఫూర్తియై పుష్కరా
ప్తినిగ్రీడించు సుకీర్తియోగ శుభమూర్తిన్ దక్షదౌహిత్రు న
ర్వినతానందకరున్ వినాయకుని నిర్విఘ్న ప్రభావాప్తికిన్ 8

- హనుమ ద్విష్టక్కేన స్తుతి -

ఉ॥ ఊహసముద్యదాత్మరుచినుగ్రకరున్ గబళింప జాలి ర
క్షోహరుముద్రచే భువన కోశము లేశముగా గమించి సో
త్సాహత తత్సతీభజన దార్చిన పావనవంశభావ్యుడౌ
నాహరియూధకాంతు నమరారికృతాంతు నుతింతు నెంతయున్ 9

కం॥ లోకాళికి రామాయణ
కేకాకృతి శుభమొసంగు గీర్వాణకృతి
శ్రీకిన్ గురు రామాంబుద
కేకిన్ వాల్మీకిదలచి గీర్తింతు మదిన్ 10

ఉ॥ శ్రీసరసీరుహాక్ష గుణసింధుసుధాంశము గ్రోలి చిద్రసో
ల్లాసి పురాణ వర్షము నిలం గురియించి భవౌఘ తాపమున్
ద్రోసి సుధీజనాళి కతితుష్టి ఘటించు ఘనప్రకాశులన్
వ్యాసుల సన్నుతించెద ననంత విలాసుల నిష్టసిద్ధికిన్ 11

ఆ॥ కాళిదాసు దండి హేళిదాసాది గీ
ర్వాణ కవులదలచి వారివలెను
ప్రబలు నాంధ్ర కవుల భాస్కర సోమాంధ్ర
కవి పితామహాది ఘనులనెంచి 12

కం॥ భారతమున్ వ్యాసోక్త వి
భారతమున్ జేసినన్న భట్టవచస్యో
భారతమునించు సుప్రతి
భారతు గుంటూరి తిక్కయజ్వ నుతింతున్ 13

కం॥ భాగవతం బఖిలాగమ
భాగవతంసంబు చేసి పరమాంధ్రకళా
వాగమృతంబున చిన్మయ
భోగహితంబున నెసంగు పోతననెంతున్ 14

ఉ॥ వాగనుశాసనప్రతిభ వర్తిలి సంస్కృత సంస్కృతాంధ్ర భా
షా గరిమంబ్రసిద్ధులగు సాధువరిష్ఠుల యోగనిష్ఠులన్
మా గురుమల్లికార్జున సమాఖ్యుల దీక్షితులన్ వచస్సుధా
మా గురు నాగనార్యగురు మద్భగినీధవు నాశ్రయించెదన్ 15

వ॥ అదియును గాక 16

కం॥ శ్రీకరముగ మును రాముడు
కాకవి మదమడచి శాంతి గరుణింపడకో!
యీకృతి తత్కథయగుటను
కాకవి మదమడచి శాంతిగరుణింపడకో! 17

మ॥ సకలద్రష్టలుగాక కొన్ని ఋషి వాచాప్రోక్తముల్ గొన్ని వే
రొకరుల్ చెప్పిన వీపురాణములటంచూహించు నీర్ష్యజ్ఞన
ప్రకరంబుల్ దమయుక్తికిన్ దగునటుల్బ్రాపించు వాక్యంబు లు
త్సుకతన్ సర్వపురాణవేత్తలు బహుశ్రోతల్ నిబద్ధింతురే! 18

వ॥ అనియిష్టదేవతా నమస్కరణంబును సుకవి పురస్కరణంబునుం గుకవి జనస్వరూప పరిష్కరణంబునుం గావించి నే నొక్క మహాపురాణంబు సరసవచన చాతురీధురీణంబుగా నొనరింపబూని యున్న సమయంబున 19

సీ॥ తనదు సోమ సమాఖ్య దనర షోడశమహా
దాన కళాధురంధరతమించి
తనరాజనామాంకమును సమర్థంబుగా
కువలయవికసనోత్సవమునించి
తనదుచంద్రధ్వజోత్తమము సార్థముగాగ
నరి విభేదన శక్తి నతిశయించి
తనసోమవంశవర్తన ప్రసిద్ధంబుగా
విజయ విఖ్యాతిచే విస్తరించి

తే.గీ॥ నవని జెలు వొందు మాఘ మాసాది ఘటిత
రామకేశవ గోపాల రథమహోత్స
వారచిత హేమమణితులాభారదాన
భరిత భువనాళి సోమభూపాల మౌళి. 20

వ॥ వెండియు నఖండ చక్రభరణ దీక్షాదక్ష దక్షిణ కరప్రచారుండును, గంభీర ప్రతిభా విశిష్ట ముష్టిపల్లి కులాంభోరాశి భాసిత విహారుండును, సుప్రసిద్ధ ధ్రువాది పూర్వ రాజర్షివర్య మర్యాదానుక్రమ సత్క్రియా చరణుండును, సమాశ్రిత ద్విజరాజ సమాదరణుండును, శ్రీమత్కేశవ స్వామి పదాధీనవైభవుండును, వసుదేవ దేవకీ సదృశ ప్రభావ తిర్మలరాయ మహీశ్వరాంగనామణీ మంగాంబాగర్భ సంభవుండును, శ్రీమద్విజయలక్ష్మీ సహాయుండును, నగు సోమభూపాలరాయుండు నొక్క శుభవాసరంబున

సమీరచలిత సమాచ్ఛాదిత స్వచ్ఛాంబరంబులు, క్షీరపూర సంగతినెసంగు తురంగంబుల మెరుంగు లెరింగించుచు, సుధానిధి ననుకరించుసుధా ధవళిత సభాభవనంబున శ్వేతద్వీపరూపంబగు వజ్రసింహాసనంబున సుఖాసీనుండగుచు, చతురానన సనందనాది బుధ ప్రముఖజనంబు బరివేష్టింప, మకుటఘటిత ముక్తాఫల పద్మరాగ కాంతులును, పరిప్రసృతశంఖ చక్ర రుచులంబచరింప మౌక్తికా శ్రవణ భూషణంబు లింద్ర ప్రహ్లాద సందేశాగత సురాసురాచార్య చర్యల నిర్వచింప, వక్షోలక్షిత హీరపతకంబునచ్చటనుదయించు నిందునందంబునంద, తారహారంబులు పతిసమాగత తారకామాలికల పోలికె జెలంగ, భూషణ విశేషంబుల ప్రతిబింబించు సభాజనంబు సాయుజ్య నియుజ్యమాన నిజాశ్రిత నికరంబు ననుకరింప నాత్మీయంబులగు నౌదార్య ధైర్య స్థైర్య సౌందర్య గాంభీర్య చాతుర్యాది గుణసంతానంబుల ననంత కల్యాణగుణానుభావుండగు వాసుదేవునికరణి నిరంతర శ్రీవిలాసంబుల నుల్ల సిల్లుచు ॥ 21

సీ॥ ననునందవర పురాన్వయపయోనిధి చంద్రు
కాణాదవంశ విఖ్యాతి సాంద్రు
నాశ్వలాయన సూత్రు నాత్రేయ మునిగోత్రు
సకల విద్వత్కవిప్రకరమిత్రు
ప్రౌఢలక్ష్మీపతి పండిత సోదర్యు
బాహట గ్రంథానుభావ ధుర్యు
వేదశాస్త్ర పురాణ వివిధ మర్మధురీణ
వరచతుర్విధ కవిత్వ ప్రవీణు

తే.గీ॥ భోజచం పూప్రబంధార్థ బోధనాను
బంధగీర్వాణ టీకా నిబంధనాది
సూక్తి విభ్రాజి పెద్దనసోమయాజి
గాంచి దయమించి పలికె సగౌరవముగ 22

॥ వెన్నెలకంటి వేంకటపతి చెప్పిన పద్యము ॥

ఉ॥ ఇద్దరు జోడు నన్నకవి యెర్రన తిక్కన సోమయాజి దా
నుద్దెగువారికిన్ ముగురికొక్కడెయొడగు నల్లసాని మా
పెద్దన వారితోడుతను పేరు వహించిన శ్రీకణాదమున్
బెద్దన సోమయాజి నిను బెద్దన బోల్చు కవిత్వసంపదన్ 23

వ॥ కావున 24

మ॥ ధర బ్రహ్మాండపురాణ రాజమున విస్తారస్థితిన్ బొల్చు ను
త్తరఖండంబున కాండసప్తకముతో తత్వార్థ సారాంశమై

యరయన్ రామకథాసుధాకలితమై, యధ్యాత్మ రామాయణం
బరుదౌ మీరది కేశవాంకితముగా నాంధ్రోక్తి జేయందగున్ 25

కం॥ మునుపుం భద్రా పరిణయ
మనుకృతి జేసితిరి కేశవాంకితముగ మా
యనుమతి మరియు ననేకము
లొనరించితి రాంధ్రసంస్కృతోక్తుల గృతులన్ 26

తే.గీ॥ వేదశాస్త్ర పురాణదివేదియైన
సుకవి కాణాదకుల కృష్ణసోమయాజి
పౌత్రమణివగు నీకిట్టి ప్రౌఢియరుదె
సుగుణ విభ్రాజి! పెద్దనసోమయాజి! 27

కం॥ అనిబహుమతి పూర్వకముగ
ననవిని సంకల్పసిద్ధుడగు సోమవిభుం
డనుమోదించిన యీకృతి
మునుకొని లోకోపకారముగ నగుననుచున్ 28

మ॥ అలము న్నన్నయ తిక్కయజ్వముఖులీ యధ్యాత్మ రామాయణం
బలరంగా దెలుగింపకున్నది మదీయంబైన భాగ్యంబెకా
నెలమింజెందుచు కేశవార్పితముగా నేతత్పురాణంబునే
దెలుగింతున్ భవబంధముల్ దొలగముక్తి శ్రీలనోలాడగన్ 29

వ॥ అని నిశ్చయించి మదీయ గ్రంథ సంధాయక మనీషా పటిష్ఠుండగు సోమభూపాలరాయ శ్రేష్ఠ
వంశాభ్యుదయంబభి వర్ణించెద. 30

కం॥ శ్రీనారాయణ చరణా
ధీనాభ్యుదయమున సురనదీ సహజయశ
శ్రీనిరవగు వంశమున న
హీనాచలవసతి వేంకటేంద్రుడు వెలసెన్ 31

కం॥ ఆ వేంకట విభు తనయుడు
ధీనిధి ముష్టిపలి ముఖ్యదేశ ముఖాంగ
శ్రీవిఖ్యాతుడు మాధవ
సేవామతి పెద్దనృపతి చెలగెన్ జగతిన్ 32

కం॥ పెద్దన్న నృపతులందుం
బెద్దన్న విధిం దనర్చె విభవమున గదుం
బెద్దన్న ధర్మమున నరు
బెద్దన్న బలాప్తి నకులు బెద్దన్న యనన్ 33

ఉ॥ ఆరయ ముష్టిపల్లి నగరాంకుడు పెద్దనృపాలమౌళి పూ
డూరను దేశముఖ్య విధినుండు శివాభ్యుదయాప్తిగణ్యుడౌ
వీరవరేణ్యపుత్రికను వేడ్కవరించియు బక్కమాంబనా
సారసగంధియందుగనె సాంద్రవిభుం పెదసోమభూవిభున్ 34

సీ॥ ప్రతిభ కృష్ణాతుంగభద్రాంత రక్షమా
మండలి బ్రోచె సామ్రాజ్య మహిమ
కందనూల్ముఖ్య దుర్గముల దేశమునెల్ల
దేశముఖ్యైక ప్రతిష్ఠ నేలె
గురుభూసురాదుల కురుభూమి రాజ్యాదు
లొసగెను బ్రీతి విధ్యుక్తరీతి
యవన ముఖ్యమహీశ నివహంబుల జయించి
కప్పముల్ గొనియె విక్రమ నిరూఢి

తే.గీ॥ యాత్మ రాజ్యంబుకేశవాయత్తముగను
జేసి హరిగృహమార్జన సేచనాది
నిఖిలకైంకర్యములను తానే ఘటించె
నౌర పెదసోమవిభుడు ప్రహ్లాద నిభుడు 35

కం॥ ఆఖ్యాత యథాశ్లోక స
మాఖ్యగ నుద్యోగపర్వ మట భద్రజయో
పాఖ్యాన కృతియు పెద సో
మాఖ్య నృపుడొనర్పజేసె హరికర్పణగన్ 36

ఉ॥ శ్రీసతి రీతి భాగ్యము శచీసతి రీతివిభుత్వ మన్నపూ
ర్ణా సతి రీతి భూసురగణ ప్రకరంబుల కన్న దాన ము
ర్వీసతి రీతితాల్మిగనురీతి నెసంగు శుభాంగి లింగమాం
బాసతి పెద్దసోమనృపమౌళి వరించెను ముఖ్యభార్యగన్ 37

తే.గీ॥ అట్టి పెదసోమవిభుని లింగాంబికకును
ప్రబలు తిర్మలరాయలు రామరాయ
లనగ గలిగిరి సుతులు కశ్యపుని కదితి
కింద్రుడు నుపేంద్రుడను పుత్రులెసగునటుల 38

చం॥ సరసుడు పూరుషోత్తముడు సత్యభవస్తుతి పాత్రుడున్ దయా
పరుడు ననంత గోత్ర పరిపాలుడు చక్రభృతి ప్రవీణుడున్
వరదుడు సాధుసంతతి నివాసుడు కేశవ భక్తి భావ్యుడౌ
తిరుమల రాయడింపెసగు తిర్మలరాయడనన్ మహోన్నతిన్ 39

కం॥ ఆ తిరుమల రాయనికిన్
భ్రాతిగ ననుజుడగు రామరాయడెసంగెన్
వాతాశన జాతాశన
పూతాశన శౌరివాస భూతాశయుడై 40

చం॥ అరయ నయోధ్యలీల దగునాత్మపురిందగి పార్థివేందిరా
దరమతియై మహావనము దారిచి యాహరి ముఖ్యమౌ బలో
త్కరము భజింపగా బహుముఖస్థితి మానిచి రాజ్యమేలె దా
నరుదుగ రామరాయ డిలనగ్రజ సంతతి నాదరింపుచున్ 41

వ॥ అందు 42

కం॥ తిరుమలరాయలు లక్ష్మీ
తరుణీమణి మునువరించి తగుననగా సు
స్థిరయగు మంగాఖ్య సతిన్
వరియించెను భావి తనయ వర్తన జెలగెన్ 43

సీ॥ సంపద లక్ష్మికి సవతె యీ సతియన
సంపద లక్ష్మమ్మ సవతె యగుచు
శీలాప్తితులసికి చెల్లెలీ సతియన
క్షమనసంతమ్మ కగ్రజయె యగుచు
క్షమనసంతాఖ్య కగ్రజయె యీ సతియన
క్షమనసంతమ్మ కగ్రజయ యనుచు
ఠీవితిర్మలరాయ దేవి యీ సతియన
ఠీవి తిర్మలరాయ దేవి యగుచు

తే.గీ॥ జనక భూరమణేంద్రుని తనయ నియతి
జనకుడైన రమణేంద్రు తనయ యగుచు
సోమనృపు గాంచుటను ననసూయ యనగ
మహి వెలెసె సద్గుణాలంబ మంగమాంబ 44

కం॥ శ్రీమత్తిర్మలరాయలు
శ్రీమతి మంగాంబయందు చినసోమనృప
శ్రీమంతుని గనియె రమా
సీమంతిని యందు శౌరి చిత్తజునిబలెన్ 45

ఉ॥ తానొనరించు ధర్మములు తక్కువగా గనకుండ దేవతా
స్థాన వనీతటాక కృతిజాల వివాహ సుతాది సప్తసం
తానము లుద్ధరించుటకు దాతగు సోమనృపాలుడే జయ
శ్రీనిధి చిన్న సోమనృపసింహుడనన్ జనియించె నిమ్మహిన్ 46

చ॥ హరిదన శౌర్యకీర్తులను నాప్తతమున్ వెలయించెనంచు తా
నరుడిల సోమభూవరుడనందగ యాహరి శౌర్యకీర్తులన్
సరినలరించగా దివిటి చామరముల్ వెలయింప మెచ్చి యా
హరినరవర్యుజేసెను దయామతి నాతని కేశవాకృతిన్ 47

సీ॥ శ్రీకృష్ణ పదభక్తిచేత ప్రహ్లాదుని
హరికథా గానాప్తి సురమునీంద్రు
నియతినేకాదశీ నిష్ఠ రుగ్మాంగదు
నాద్వాదశీచర్య నంబరీషు
వరరామగుణసక్తి వాల్మీకి నధ్యాత్మ
రామాయణ ప్రేమ రాజమౌళి
భారతశ్రవణ సంపద జనమేజయు
సకల పురాణాళి శౌనకాఖ్యు

తే.గీ॥ క్షమను ధర్మజు విజ్ఞాన సరణిజనకు
విద్యలను భోజు, వితరణావృత్తి కర్ణు
బోల్పదగుగాక నితరుల బోల్పదగునె
దేవవిభునకు చినసోమభూవిభునకు 48

సీ॥ శ్రీకేశవస్వామి శిఖరంబు హేమశృం
గంబుతోసాంగంబుగా ఘటించె
నాదేవు దేవాలయమున చతుర్భుజా
త్మిక మహాలక్ష్మి ప్రతిష్ఠ చేసె
నచటనే నధిక రమ్యముగ శ్రీగోపాల
రామదేవ గృహాది రచన నెరపె
నాస్వామి సమ్ముఖంబందు విస్తృత మహో
న్నత బాహ్యరంగమంటపమొనర్చె

తే.గీ॥ మరియు ప్రాకారగోపుర మంటపములు
నూర్జిత వ్యాప్తి సకల మహోత్సవములు
జేసె సేవాతిశయములా శ్రీవిభునకె
ప్రేమతిర్మలరాయేంద్రు సోమవిభుడు 49

ఉ॥ దాతదయా విశిష్టుడు స్వతంత్రుడు శాంతుడనేక భాగ్యసం
ధాత యొకప్పుడున్ వెగటు దట్టని నిండు మనంబువాడు వా
క్చాతురి నీతియున్ దగిన జాణ భళీ హితగోష్టి నుండు రా
జేతరిముష్టిపల్లి ధరణీంద్రుడు సోముడె యెంచిచూచినన్ 50

శా॥ శ్రీరంజిల్లగ శౌరిభోజనృప పుత్రిన్ సత్యభామన్ శుభో
దార ప్రీతివరించు రీతి చినసోమాధీశవర్యుండు దా
శ్రీరామాంబను వెంకమాంబనువరించెన్ సద్గుణ స్ఫూర్తి భా
ర్యారత్నంబులు గాగ నిత్యశుభ సౌఖ్యశ్రీలు వర్ధిల్లగన్ 51

ఉ॥ చంద్రునిగన్న క్షీరనిధి సంపదనంది జయంతుగన్న దే
వేంద్రుని లీలవైభవ సమృద్ధి నెసంగి రతీంద్రు గన్న ప
క్షీంద్రు హయేంద్రు రీతిదయనింపు వహింపుచు రామరాయ భూ
మీంద్రుని గన్న సోమధరణీంద్రుడు జెన్నలరున్ శుభోన్నతుల్ 52

తే.గీ॥ మహిని చినసోమనృపు తల్లిమంగమాంబ
కనుగు చెల్లెలనంతాంబ యందు సిరుల
నతను నయ్యన్న బోల్చు నయ్యన్న కొదవి
యలరు వెంకన్న విభుడు జయంత నిభుడు 53

సీ॥ అగ్రజ పదసమాయత్త రాజ్యముబ్రోచి
భరత సమాఖ్యచే పరిధవించి

దృఢచాపఘోష నిర్జిత మేఘనాదత
నలసుమిత్రానంద మతిశయించి
మధుతనూభవ జయప్రథిత విగ్రహలీల
శత్రుఘ్ను విఖ్యాతి సంగ్రహించి
రామసమానుడౌ సోమభూపాలుని
యనుజ విస్ఫూర్తిచేనతిశయించి

తే.గీ॥ అన్నదయ సర్వవిద్యల యందుసకల
భాషలందును లిపులందు ప్రౌఢయగుచు
గజరథాశ్వాది విభవ సంగతుల వెలసె
వినయవిసరుండు వెంకన్న జనవరుండు 54

ఉ॥ అన్నకుమార సోమనృపుడాత్మ సమంబుగ నాదరించగా
నన్నరు సన్నిధిన్ నకులునట్ల శుభోన్నతి జెన్ను మీరి అ
య్యున్నకనంతమాంబకు సుతాగ్రణి కీర్తుల దార్తగన్నవెం
కన్నగుణాళి నెన్నహరిగన్నకుమారునికన్న మిన్నగన్ 55

వ॥ ఇవ్విధంబున 56

కం॥ తనుజముఖుల్ తనభార్యా
వనజముఖుల్ గొలువ కేశవస్వామి దయన్
జనసోమనృపాలాగ్రణి
దనసామ్రాజ్యానుభూతి ధారుణి వెలసెన్ 57

సీ॥ శ్రుతులు వచ్చుటకుగా సుధనుదర్చుటకుగా
జలచరాకారముల్ సంగ్రహించి
నేలబ్రోచుటకుగా బాలుగాచుటకుగా
వనమృగ రూపముల్ వరుసగాంచి
బలినడంచుటకుగా ఖలులద్రుంచుటకుగా
భూసుర వేషముల్ బూనిమించి
రమణి దెచ్చుటకుగా యమున ద్రచ్చుటకుగా
రామదేహంబులురహి వహించి

తే.గీ॥ త్రిపురములు త్రోవ సుజనుల కృపనుబ్రోవ
బుద్ధగతి కల్కి భావంబు నుద్ధరించి
ధర్మ సహకారి యదుకులోద్ధారియగుచు
జేరి గద్వాల కేశవ శౌరి వెలయు 58

మ॥ కరి శీర్షార్పిత హేమ పాత్ర జలముఖ్య స్నాన దివ్యాంబరా
భరణా లేపన ధూపదీప సుమనో భక్ష్యాన్న నైవేద్య భూ
సుర వేదధ్వని వాద్య నాట్య విధులన్ సొంపొంద నీలీల వ
త్సరమాసర్తు దినోత్సవాదులెసగున్ దత్కేశవ స్వామికిన్ 59

షష్ఠ్యంతాలు –

కం॥ ఏతాదృగ్విధ గుణునకు
సీతాదృగ్యుగ చకోర సితకిరణునకున్
బూతాచల సీతాచల
జాతాచల చాపరచిత సంస్మరణునకున్ 60

కం॥ జ్ఞానవియల్లీనరయ
ప్రాణజయారాధ్యునకును ప్రత్యాహార
ధ్యాన సమాధాన శమా
ధీన సమాధి ప్రయుక్త ధీబోధ్యునకున్ 61

కం॥ శ్రోతవ్య జ్ఞాతవ్య
ధ్యాతవ్య ప్రముఖభావ్యతా భవ్యునకున్
ధాతముఖ స్తవ్యునకున్
వాతాశనరాజశయన వాస్తవ్యునకున్ 62

కం॥ గద్వాలనగర ఖేలున
కుద్వేల దయానుభావయుత శీలునకున్
చిద్వద్ధన విద్వజ్జన
హృద్వర్తన లీలునకు మహితలోలునకున్ 63

కం॥ ★శ్రీమహిళా శ్రీమదిలా
ప్రేమ కళాలోలరతికి శ్రీముష్టిపలీ
సోమాధిప సామోద
క్షేమాదరమతికి చెన్నకేశవపతికిన్ 64

వ॥ అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా సమర్పింపంబూనిన శ్రీమదధ్యాత్మ రామాయణంబను మహాపురాణంబునకు కథా క్రమం బెట్టి దనిన 65

★ శ్రీమదిలా శ్రీమహిళా – గ.ము.ప్ర. పాఠం

- బాలకాండము -

- కథా ప్రారంభము బ్రహ్మనారద సంవాదము -

మ॥ కలదోంకార శుభప్రకార ముఖరద్ధ్వంటా మహానాద వి
శ్చలితామోద వినోదమేదురనభ స్థానంబు వేదాంత వా
క్ఫలితార్థ ప్రతిపాదనా చతుర సంపన్మౌళి పారంపరీ
వళితా స్థానము సత్యలోకము దపో వ్యాపార సుశ్లోకమై 66

కం॥ ఆలోకంబున లోకస
మాలోకాగమ్య సమ్యగాలోకమణీ
పాళీకీలిత శాలా
జాలంబైయొక్క దివ్య సభవెలుగొందున్ 67

సీ॥ శ్రుతి పురాణాగమ స్మృతి శాస్త్ర ముఖ్యముల్
వేర్వేర మూర్తీభవించి నిలువ
నలసప్తకోటి మహామంత్ర మూర్తులు
సముచిత స్థితి నూడిగములు సలుప
నిచ్ఛాక్రియా శక్తులిరు కెలంకులనిల్చి
రమణీయమణిచామరములు వీవ
మనుపురంధరముఖామర మహాముని కోటి
తమ తమ కార్యతంత్రములొనర్ప

తే.గీ॥ నప్సరసలాడ గంధర్వులలమిపాడ
భాసురంబైన హేమ పద్మాసనమున
సరస సావిత్రియును సరస్వతి భజింప
కమల భవుడందు పేరోలగముననుండె 68

వ॥ అయ్యవసరంబున 69

కం॥ నారదుడు భక్తియోగ వి
శారదుడు శరీరకాంతి సంక్రాంత శర
న్నారదుడు బద్ధమానస
పారదుడు సమస్త లోక పర్యటనమునన్ 70

వ॥ ఒక్కనాడక్కమలభవు భవనంబునకు వచ్చియచట మూర్తిమంతంబు లగు ఛందో బృందంబులు బరివేష్టింప బాలభాను ప్రభాభాసమానం బగు నిజతేజంబున సభాంగణంబునలకరింపుచు

మార్కండేయాది మునిమండల స్తూయమానుండును సర్వార్థ గోచర జ్ఞానుండును భక్తాభీష్ట ప్రదాన
సుముఖుండును నగు చతుర్ముఖు గాంచి సభక్తి దండ ప్రణామంబు గావించి సన్నుతించిన ప్రసన్నుండై
యవ్విరించి పరానుగ్రహ వాంఛాసంగతుండగు నమ్మునిపుంగవుం గురించి యిట్లనియె 71

కం॥ నారద వైష్ణవ ముఖ్య యు
దారత నీవెద్దియడుగ దలచెదు దానిం
జేరి వచించెద వినుమన
నారూఢత కమలభవున కమ్మునిబలికెన్ 72

కం॥ మునునీ వలనను సర్వము
వినినదియె సురేశయిపుడు వినుమొక్కటియే
వినగు రహస్యమేనియు
ననుగ్రహము గలదె యేనియది చెప్పదగున్ 73

సీ॥ అనఘాత్మ! కలియుగం బాసన్నమైనచో
నరులు దురాచార పరులు పుణ్య
వర్జితులును సత్య వార్తాపరాఙ్ముఖుల్
పరధన స్త్రీరతుల్ బాపమతులు
కామకింకరులును కాంతా పరాధీన
విధులు మాతా పితృద్వేషకులును
దేహాత్మ దృశులు నాస్తికులు హింసకులు మం
దులు పశుప్రాయు లౌదురు మరియును

తే.గీ॥ విప్రులును వంచకులు వేద విక్రయులును
జాతి మాత్రులు విత్తార్థ సాధ్య విద్యు
లధికమద లోభయుతులౌ దురాత్మ ధర్మ
వర్తనల బాయుదురుక్షత్ర వైశ్యజనులు 74

తే.గీ॥ తొలగి నిజధర్మ విధులు శూద్రులును గొంద
రాచరింతురు బ్రాహ్మణాచార విధులు
స్త్రీలు గత భర్తృకలునయ్యు సిగ్గు భయము
బాసి శ్వశుర జన ద్రోహపరత గండ్రు 75

తే.గీ॥ కానవీరలకెట్లు సద్గతులు గలుగు
ననుచు జింతించెదను లఘూపాయమునను

వీరు సద్గతి జెందెడు విధము సెపుమ
నీకు సకలంబు దెలియనౌ లోకనాథ! 76

కం॥ అని పలికిన ముని పలుకులు
విని పలుకుం గలికిమగడు విబుధ! మునీంద్రా!
నను లెస్సయడిగితివి నీ
యనఘ ప్రశ్నము వచింతునని యిట్లనియెన్ 77

చ॥ మును ద్రిపురాంతకున్ విబుధ ముఖ్యు శుభాఖ్యుని భక్తవత్సలున్
దన విభుగాంచి రామ పరతత్త్వము సర్వము నిర్విశంక వ
ర్తన నెరుగం దలంచి ప్రమదంబు హృదంబుజ వీధినిండగా
వినయముతోడ భక్తిరస విస్తృతి పార్వతి వేడె వేడినన్ 78

కం॥ ప్రాణేశ్వరికి రహస్యం
బైనను శ్రీరామ తత్త్వ మఖిలంబునువి
జ్ఞాన నిధి శివుడు సువ్యా
ఖ్యానముగా దెలియ జెప్పె నాద్యంతంబుల్ 79

తే.గీ॥ అదియునధ్యాత్మరామాయణాఖ్యమైన
సత్పురాణోత్తమము దాని శైలపుత్రి
యాజగద్ధాత్రి బూజించి యనుదినంబు
మననమొనరించు నానంద మగ్నయగుచు 80

తే.గీ॥ అట్టి యధ్యాత్మ రామాయణాఖ్య మెపుడు
ప్రాణుల కదృష్టవశమున ప్రబలగలదు
ధాత్రి దానిపారాయణ మాత్రమునను
ప్రాప్యమగుచుండు జనులకు పరమపదము 81

సీ॥ అవని నెందాకనీ యధ్యాత్మరామాయ
ణాఖ్య మావిర్భూతి నందకుండు
నందాక బ్రహ్మహత్యాది పాపంబులు
జృంభించి నిశ్శంక చేనెసంగు
క్రూరులు యమభటుల్ జేరి నిర్భయ వృత్తి
వర్తింతురతి ఘోరవర్తనముల
సర్వశాస్త్రములు నిశ్చయ మార్గమెరుగక
నన్యోన్య సంవాద మాచరించు

తే.గీ॥ రామతత్త్వ స్వరూప నిర్ధారణంబు
దెలియ నిర్బోధమగు మహాత్ములకునైన
నగుట నధ్యాత్మ నామ రామాయణంబు
విస్తృతంబైన శుభగతి వెలయు జగతి 82

వ॥ కావున మునీంద్రా! నీయధ్యాత్మ రామాయణ శ్రవణ కీర్తనాదులనగు ఫలంబఖిలంబునుం జెప్ప నశక్యంబగునై నను నాకు మున్ను శివుం డుపదేశించుటం జేసియథా మతింగొంత జెప్పెద నిమ్మహత్త్వంబు సమాయత్తచిత్తంబున వినుమని యిట్లనియె. 83

కం॥ ఈ రామాయణ మధ్యా
త్మారంభము శ్లోకమేని యర్థం బేనిన్
సారమగు భక్తి జదివిన
నారయనతడా క్షణమున నఘముల బాయున్ 84

కం॥ అధ్యాత్మ రామచరితం
బధ్యయనము శక్తి కొలది ననిశము దృఢమౌ
బుధ్యాప్తి జేయునెవ్వడు
సిధ్యనుగతి జెందునతడు జీవన్ముక్తిన్ 85

వ॥ వెండియు నెవ్వండేనియు నీ యధ్యాత్మ రామాయణంబు నిత్యంబును నిశ్చల భక్తిం బూజించు నతండశ్వమేధ ఫలంబునం జెందు, మరియునుం దీని నొరుండు పఠియించుతరి దైవగతిం జేరియ నాదరంబున నేనియు వినునతండు కలుషంబుల దొలంగు, నీ గ్రంథ సమీపంబున భక్తి పురస్సరంబుగా నమస్కరించిన సర్వదేవ తార్చన ఫలంబు బ్రాపించు, నేతత్పురాణ సత్తమంబు సమస్తంబునుం బుస్తకంబున లిఖించి రామభక్తున కొసంగిన వాడశేష వేదాధ్యాపకులును నఖిలశాస్త్ర వ్యాఖ్యాతలును నందరానిపుణ్యంబునం బొందు, నిదియునుంగాక నేకాదశీదినంబున నుపవసించి రామభక్తి సభాంతరంబున నీయుపాఖ్యానంబు సువ్యాఖ్యానంబు సేయు నరోత్తముండు బ్రత్యక్షర కృతంబగు గాయత్రి పునశ్చర్యా ఫలంబు ననుభవించునని మరియును 86

సీ॥ శ్రీరామనవమి రాత్రిని జాగరంబుగా
నాదినంబుపవాసమాచరించి
ప్రేమతోనధ్యాత్మ రామాయణమనన్య
వృత్తిచే జదివిన వినినబుణ్యు
డలకురుక్షేత్రాది యగుపుణ్య తీర్థాళి
కడుసర్వగత రవిగ్రహణ వేళ

నాత్మతుల్య ధనంబు వ్యాససమానులౌ
బ్రాహ్మణుల కొసంగు ఫలము గాంచు

తే.గీ॥ సత్యమిది నిత్యమీరామచరిత రాగ
కలనగానంబు గావించు ఘనునియాజ్ఞ
నటబ్రతీక్షింతురింద్రాదులైనసురలు
నారద మునీంద్ర! భక్తి విజ్ఞాన సాంద్ర! 87

కం॥ కావున దిన మధ్యాత్మ వి
భావిత రామాయణంబు పారాయణముం
గావించువాని పుణ్యం
బావంతయు కోటి గుణితమై ఫలియించున్. 88

తే.గీ॥ అట్టి యీరామచరిత యందద్భుతముగ
బరగు శ్రీరామహృదయమే నరుడు భక్తి
మూడునాళ్లు పఠించిన వాడు బ్రహ్మ
హంతయైనను పూతాత్మడగు నిజంబు 89

వ॥ మరియు నీరామ హృదయంబు హనుమత్సన్నిధిందత్రీతిగా మౌనవ్రతంబున దిన త్రయంబు ద్రివారంబు పఠియించిన సకలాభీష్ట సిద్ధియగు నశ్వత్థ తులసీ ప్రదక్షిణంబు లొనర్పుచుం బఠియించిన సకలాభీష్ట సిద్ధియగు బ్రహ్మహత్యా నివర్తకంబగు ననిచెప్పి కమలభవుండు వెండియు నిట్లనియె. 90

కం॥ శ్రీరామగీత మహిమ
స్వారస్యమశేషముగను శంకరుడెరుగున్
గౌరితదర్ధం బెరుగు శు
భారతి నేనెరుగుదును తదర్థంబనఘా! 91

ఆ.వె॥ అగుటనంత దెలుపనది యశక్యముగొంత
యెరుగజేతు దీని నెరిగినపుడ
చిత్తశుద్ధి గలుగు శ్రీరామగీతచే
బోని పాపమెచట గానమెపుడు 92

తే.గీ॥ అనఘ! శ్రీరాము డుపనిషదంబురాశి
మథనమొనరించి తివిసిలక్ష్మణుని కొరకు
గృపనొసంగిన శ్రీరామగీతయనెడు
నమృతపానంబుచే నరుడమరుడగును 93

చ॥ మును జమదగ్నిరాముడు దమున్విరసించిన కార్తవీర్యునిన్
దునుమ శివాంతికంబున ధనుఃకళ నేర్చుచు గౌరికిం బరా
యణమగు రామగీతవిని యత్నమునన్ గ్రహియించిదా బఠిం
చిన సుఫలాప్తినందుటను జెందెను విష్ణుకళాంశ సంగతిన్ 94

కం॥ పంచవిధ మహాపాతక
సంచయనిష్కృతికి వాంఛ సలిపిన దినమున్
గొంచక నొక మాసము వా
ంచిన శ్రీరామగీతచే ముక్తుడగున్ 95

వ॥ మరియు నీరామగీతా సకృత్కీర్తనంబున దుర్వర్తన దురాలాపదురన్న దుష్ప్రతిగ్రహాది దోషంబుల దొలంగు, నదియునుంగాక యతీశ్వర సన్నిధానంబున నశ్వత్థ తులసీ సాలగ్రామ సమీపంబులనే తత్పరనంబున ననేకఫలదంబగు, శ్రాద్ధకాలంబున శ్రద్ధాయుక్తి నీరామగీత పఠింపుచు ద్విజ భోజనంబు గావించు నతని పితరులు పరమపదంబునందుదు, రెవ్వండేనియు నేకాదశి నుపవసించి ద్వాదశి దినంబున నగస్త్యతరు మూలంబున వసించి యీతద్గీతా పారాయణం బొనర్చు నతండు సాక్షాద్రామ స్వరూపంబని సురలు బూజింతురగుటం గావున 96

కం॥ ధ్యానము దానము తీర్థ
స్నానము లేకయును రామ సద్గీతాను
ష్ఠానముచే దిన మనుసం
ధానముచే గాంచునరుడనంత ఫలంబున్ 97

తే.గీ॥ కాననిక నన్నియును జెప్పగాగ నేమి
మరియు వేదపురాణాగమస్మృతీతి
హాసశతములునైన నధ్యాత్మరామ
చరితమునకు కళాంశంబు సమముగావు 98

వ॥ అట్లగుట నీయధ్యాత్మ రామచరితంబు నిరంతరంబును భక్తిం బంచి వినిన యతండు విష్ణు పదంబు నందియమర వంద్యుండగునని, మునీంద్రుండు సాంద్రానందుండై యరవిందభవునకిట్లనియె 99

కం॥ చిత్రంబులు భవ్యవనీ
చైత్రంబులు భవమహాఘ జైత్రంబులు చి
త్సూత్రంబులు కృత విబుధ
స్తోత్రంబులు రామచంద్రు సుచరిత్రంబుల్ 100

వ॥ కావున నీ యధ్యాత్మతత్త్వ ప్రధానంబగు రామకథా సంవిధానంబు యథాక్రమంబునం జెప్పవేయని ప్రార్థించిన, భక్తియోగ విశారదుం డగునారదునకు సకలార్థ సంధాతయగు విధాతయిట్లనియె 101

- బాలకాండ కథా ప్రారంభము -

మ॥ అమరుల్ ప్రార్థన సేయ నే విభుడు మాయామర్త్యుడై సూర్యవం
శమునన్ బుట్టి సమస్త దైత్యవరులన్ శాసించి సత్కీర్తి లో
కములన్నించి దనంతనాద్యమహిమంగన్పట్టె నభ్భాసుతా
రమణున్ రాముని నిర్విరాముని చిదారామున్ హరిన్ గొల్చెదన్ 102

సీ॥ విశ్వంబు సృజియింప వెలయింప విలయింప
క్రమమముగా నేకకారణమునగుచు
దనరారు మాయ కాధారభూతంబునై
తద్వికారంబుల తగులులేక
చిత్తాదికములకు జింతింపగారాని
దివ్యరూపంబున దేజరిలుచు
నమలప్రకాశమై యానందసాంద్రమై
నిజబోధ రూపమై నివ్వటిలుచు

తే.గీ॥ సమరభూభారవారణార్థము ధరిత్రి
రాజవిస్ఫూర్తి వర్తించు రామమూర్తి
విజిత నిజతత్త్వ మౌనిభావిత మహత్త్వ
జానకీ కాంతు భక్తినే సంస్మరింతు 103

మ॥ అవనిన్ సర్వపురాణ సమ్మతము నీ యధ్యాత్మ రామాయణం
బవుటన్ భక్తి పఠించినన్ వినిన ధూతాఘ స్థితిన్ కోటి గో
నివహంబిచ్చు ఫలంబు గాంచు మరియుం నిష్కామనుండైనచో
భవబంధచ్యుతుడై నరుండు పిదపన్ బ్రాపించు నీశున్ హరిన్ 104

కం॥ గౌరీశ శైలజాతయు
శ్రీరామార్ణవ సమేత స్థిర మధ్యాత్మ
శ్రీరామ గీత యనునది
భూరి పవిత్రముగ జేయు భువన త్రయమున్ 105

వ॥ అని ప్రశసించి విరించి మరియునిట్లనియె 106

సీ॥ కాళీవధూహస్త పాళీపరిన్యస్త
నాళీకకృత ఖేల నాళికంబు
నాగాస్య సమ్మోద యోగాశ్రయ వినోద
భాగాంచిత మరుత్సమాగమంబు

నానావిధవిహారమానాధిక కుమార
సేనావిధాన సంధానితంబు
కామాది ఛేదన స్థేమాది సాధన
స్తోమాది బిరుదగాథామితంబు

తే.గీ॥ కలదు చలదుత్తమాంగ సంఘటిత గాంగ
రంగదురుభంగ ఘుంఘుమారవ మృదంగ
సాంగనటనానుషంగ భాస్వత్కురంగ
శయ రచితకేళి కైలాస శైలమౌళి 107

వ॥ వెండియు తత్కలధౌత మహీధరంబు మహీధరకన్యాచరణ విన్యాస ధన్యాయిత వన్యా సముత్కటంబులను, నాగకటక విశంకట క్రీడా ఘటకంబులగు కటకంబులను, సుమనోదర్శనీయ దివ్యకూట స్థలంబులగు మణి ప్రస్థంబులను, వివిధ కలాసవైభవాను భావ హేతువులగు గైరికాదిధాతువులను, దూరీకృత నిమజ్జజ్జన దురిత జర్ఝరంబులగునిర్ఝరంబులను నిరంతర మననోత్కంఠముని కంఠీరవ మందిరంబులగు కందరంబులును, నపవర్గ సౌధసంచార సౌఖ్య సంపాదక సమీప సోపాన రంగంబులగుశృంగంబులను, వెలుగొందుచుండు మరియును 108

కం॥ ఆరజతాచల శిఖర స
మారచితానేక భానుమండల తేజ
స్సారంబగు హేమమయా
గారంబున రత్న పీఠికా మధ్యమునన్ 109

సీ॥ తారకబ్రహ్మ బోధముసేయు వైఖరి
మునుపు సువ్యాఖ్యానముద్రతోడ
తగునిజాంతర్యామి తత్త్వదర్శనలీల
దెలుపు నంతర్ముఖ దృష్టితోడ
చిత్సుధాసారంబు శిరసావహించిన
రీతిదోచు సుధాంశురేఖ తోడ
శుద్ధ సత్వము మూర్తి జూపట్టు గతి శుభ్ర
కళలీను దివ్య విగ్రహము తోడ

తే.గీ॥ ననితరానందమూని జెన్నలరువాని
నురుతరధ్యాన నిష్ఠ సుఖోపవిష్టు
సిద్ధ సంఘాదిసేవితు నిద్ధ చరితు
నతుల విజ్ఞాన విభవు నయ్య భవుగాంచి 110

కం॥ ఒకనాడు దేవి పార్వతి
ప్రకటిత వామాంగ వసతి భక్తి వినతిచే
నొక వాక్యము హిత కందము
సకలా నందంబుగాగ శంభున కనియెన్ 111

కం॥ పరమేశ్వర నీవాదిమ
పురుషుడ వెరుగుదువు సకలమును గావున నీ
కరయన్ మ్రొక్కెద నాకున్
బురుషోత్తమ తత్త్వమహిమ బోధింపగదే! 112

కం॥ అతి గోప్యతరంబేనియు
నితరులకున్ జెప్పరాని దేనియు దానిన్
హితమతి మహానుభావులు
తతమతి బోధింతు రెలమి తమ భక్తులకున్ 113

వ॥ కావున 114

తే.గీ॥ నీకు ప్రియ భార్య నదియునుగాక మిగుల
భక్తిగలదాన బ్రోవవే భక్తవరద!
రామతారక చిత్ర కథామృతాత్మ
తత్త్వబోధంబుచేనన్ను ధన్యజేసి 115

ఉ॥ ఏను వధూస్వభావయుతనేని యెరుంగగజాలు దాననే
దానభవాంబుధిన్ బుధులు దాటి సుఖింపుదురట్టి భక్తి వి
జ్ఞాన విరాగ భావముల సంగతి చేత నెసంగు నిర్మల
జ్ఞానము దెల్పవే! నతవశంకరశంకర! లోకశంకరా! 116

ఆ.వె॥ అభవ! నీకు నాకు నఖిల తత్త్వామృత
సారమైన రామచంద్రునందు
నచల భక్తి వెలయునది గాక భవమోక్ష
ణమునకితర సాధనములు గలవె! 117

వ॥ అయినను నింకనొక్కరహస్యంబు దెలియగోరెద నెరుంగింపవేయని
యిట్లనియె 118

మ॥ అరయంగొందరు రాము నాద్యు నజు నిత్యానందు నిర్ధూత దు
స్తరమాయాగుణ సంప్రవాహు నమృతున్ సర్వాత్ము సర్వేశ్వరున్

బరునింగా మదినప్రమత్తులగుచున్ భావించి సంసిద్ధులై
పరమధ్యాన మొనర్చి మోక్షపదవింబ్రాపింతురేకాగ్రతన్ 119

సీ॥ పదపడిరాముడు పరమాత్ముడయ్యును
పరులచే బోధింపబడిన గాని
తను దానెరుంగడు తనదుమాయా వృత్తి
మరచియుండుట జేసి మానసమున
నటుగాక నిజరూపమదియెరుంగునె యేది
సీతావియోగంబుచేదపించు
విలపించు టెట్టులవ్విధినిజం బేనియు
ప్రాకృత జనులతో పాటిగాక

తే.గీ॥ నమరమునిమానసాంబుజ ధ్యానయోగ్యు
డయ్యె నేరీతినని కొందరందురిట్టి
సంశయచ్ఛేద మొనరించి సమరసోక్తి
దేటపరుపవె దీని నోదేవ దేవ! 120

మ॥ అని ప్రార్థించిన గౌరికీశుడనియెన్ హర్షించి శ్రీరామ చి
ద్ఘన తత్త్వంబతి దుర్లభంబు తెలియం గాంక్షించితీవట్లు నన్
మును నెవ్వారడుగంగ లేదు మరి నేమున్ జెప్పగా లేదు నీ
కనిశంబొప్పు పరాత్మ భక్తి గిరికన్యా! ధన్యవీ వెంతయున్ 121

వ॥ అదియును గాక 122

సీ॥ సంసారదావాగ్ని సంతప్తులకు సుధా
స్తోమవర్షనియుక్తి రామభక్తి
తాపత్రయామయ తాప పీడితులకు
రమ్యభేషజయుక్తి రామభక్తి
పంచమహా పాపపటల సర్పములకు
రచితగారుడశక్తిరామ భక్తి
భవవిపద్వారాశి పాత భీతులకును
ప్రబలతరీయుక్తి రామభక్తి

తే.గీ॥ ప్రేమబోధిత గురుసూక్తి రామభక్తి
కామితాత్మ జనాసక్తి రామభక్తి
శ్రీమదురు సంపదనురక్తి రామభక్తి
సామరస్యోదిత విముక్తి రామభక్తి. 123

వ॥ కావుననీకిట్టి భక్తియందాసక్తి గలుగుటంజేసి తద్రహస్యం బెరింగించెద సమాదరంబున వినుమని మరియును 124

ఉ॥ రాముడు భూసుతావృతసరాముడు సాధుశుకాళి కేళికా
రాముడు సర్వ సంపదభిరాముడు చాపవిరోపణానమ
ద్రాముడు రావణాదిక విరాముడు దైత్యవధ ప్రహృష్టసు
త్రాముడు పూర్ణసంపద విరాముడు మాకు ప్రసన్నుడయ్యెడున్ 125

శా॥ ధ్యానాయోధ్యవసించి శాంతి మహిజాతం గూడి గుర్వాజ్ఞచే
జ్ఞానైకానుజయుక్తి బోధ రవిజాసక్తిన్ భవాంభోధి తో
ర్తోనం దాటి మదాంధ మోహగుణ దైత్యుంద్రుంచి సామ్రాజ్యయో
గానందంబున జెందురాముని నిజాత్మారామునిం గొల్చెదన్ 126

వ॥ అనిచిత్తంబున రఘుసత్తముం బ్రార్థించి భక్తివిజ్ఞానవతి యగు పార్వతికి దివ్యప్రభావుండగు మహాదేవుండు రామహృదయంబగు రహస్యంబు వచించువాడై యిట్లనియె 127

కం॥ ప్రకృతి పరమ్మున సాధ్యం
బకలంకంబమృత మచల మానందంబై
యొకటిగ వెలుంగు బ్రహ్మము
ప్రకటంబై వెలయురామ పదవాచ్యంబై 128

కం॥ జ్ఞాన స్వరూపమును ని
త్యానందమనంతమైన యద్వస్తువునన్
మౌనులు రచించుకతన న
నూనత రాముడని పల్కు నుపనిషదుక్తుల్ 129

మ॥ అనయం బాపురుషోత్తముండు తనమాయాసంప్రభావాప్తి నొ
య్యన విశ్వంబు సృజించియాకసమునట్లంతర్బహిర్వ్యాప్తుడ
య్యు నిగూఢంబుగ నుండునందు నటులయ్యున్ బద్మపత్రస్థ జీ
వనబిందు స్థితినంటడా గుణములన్ వర్ణింపదాసాక్షియై 130

కం॥ జడమయ్యు నీ ప్రపంచము
గడుతత్సన్నిధి వికాస కలనం గానం
బడు చేష్టింపుచు లోహము
దడయ కయస్కాంత సన్నిధానమున బలెన్. 131

శా॥ అజ్ఞానావృత చిత్తవృత్తులగు మూఢాత్ములల్పరానంద స
త్యజ్ఞానాత్ముని రామునిందెలియలేరా సంవిబోధంబు ధూ

తాజ్ఞానంబును బ్రహ్మ మౌనతనియం దారోపముం జేతురా
స్వాజ్ఞానంబున దేహబుద్ధి సుతదారాగార సంసక్తులై 132

కం॥ తన కంఠస్థితహేమము
తనర జడుండెరుగనట్లు తగపరమాత్మున్
దన హృదయస్థితు నవ్విభు
ననయము గనలేడు మూఢుడజ్ఞానమునన్ 133

తే.గీ॥ సహజ దీప్తంబుగా నుండు చండకిరణ
మండలంబున దమమెట్టు నుండనేర్చు
నటుల విజ్ఞాన ఘనము పరాత్మయైన
యతని నజ్ఞానమెటు లొందు నచలపుత్రి! 134

వ॥ అదియునుం గాక చక్షురింద్రియ భ్రమణంబు చేతనక్షత్ర గ్రహాదికంబులు భ్రమించు విధంబున యజ్ఞానంబునం గను పట్టు, వెండియుందేజస్వరూపకుండగుచు చండాంశునకు నహోరాత్రంబులు లేని యట్లు నిత్యంబును బ్రకాశస్వరూపకుం డగునతనియందు జ్ఞానాజ్ఞానంబులు గానం బడవట్లగుటం గావున, పరానంద మయుండును విజ్ఞాన స్వభావుండును నజ్ఞానసాక్షియును బుండరీ కాక్షుండును నారాయణుండును నగు రామచంద్రునందు దమోమయంబును మోహాకారంబునునగు నజ్ఞాన కల్పనంబు మూఢమతులచేతచెప్పంబడుగాని బ్రహ్మవాదులచే జెప్పబడదీయర్థంబు నతిరహస్యంబును నతి దుర్లభంబును నపవర్గసాధనంబును నగు సీతారామ హనుమత్సంవాదంబును రామహృదయ విషయంబగు నితిహాసంబు వచియించెదనాకర్ణింపు మని యపర్ణకు శివుండిట్లనియె 135

సీ॥ దేవతాలోక విద్రావణు రావణు
సుతయుత చతురంగయుతము గాగ
సమరంబున జయించి శౌర్యంబు వెలయించి
రణజయస్థేముదురాముడపుడు
సీతాసమేతుడై చిర యశోన్వీతుడై
యనుజ భానుజ వాయుతనుజ ముఖ్య
బలములతోడ పుష్పకమెక్కి సాకేత
పురిజేరి సిరిమీరి భూరి మహిమ

తే.గీ॥ ఘనులచేత వసిష్ఠాది మునులచేత
యుక్తుడగుచును పట్టాభిషిక్తుడగుచు
కలిత రవికోటి రుచిపేటి కనకవాటి
చిత్రమణి సింహ పీఠినాసీనుడగుచు 136

కం॥ తననికట స్థితు నభిహితు
ననుపమ మతిమంతు విరచితాంజలిమంతున్
వినయ నమత్తనుమంతున్
హనుమంతుంగాంచిపలికె నవనిజతోడన్ 137

కం॥ కృతకార్యుని వృతధైర్యుని
వ్రతచర్యుని సకల విషయ రసనిరపేక్షున్
వితత జ్ఞానాపేక్షున్
హితుని మరుత్సుని జూచితే! మహితనయా! 138

తే.గీ॥ ఇతడకల్మష చారిత్రుడతి పవిత్రు
డధిక భక్తుండు పాత్రుండు నమితపుణ్యు
డనితరశరణ్యుడగు బ్రోవుమతివయితని
దివ్య మామక తత్ప్రోప దేశమొసగి 139

వ॥ అనిన మహాప్రసాదంబని మహీతనయ వినయసంపన్నుండును నతివిధేయుండును నగునాంజనేయున
కిట్లనియె 140

మ॥ సకలోపాధి విముక్తమద్వయమునై శాంతంబు సత్తాత్మయై
యకలంకంబును స్వప్రకాశమమలంబై సచ్చిదానందమై
ప్రకటంబయ్యె నతీంద్రియంబగు పరబ్రహ్మంబు రామాఖ్యచే
నొకటన్వర్తిలుచుండె దానె సగుణత్వోపాసనా యోగమై 141

కం॥ ప్రకటముగ నేను మూల
ప్రకృతిని తత్సన్నిధాన బలమున నాచే
సకలంబు సృజింపంబడి
యకుటిలుడగు నతనికృత్యమనితోపబడున్ 142

వ॥ మరియునయోధ్యానగర స్థలంబున విమలంబగు రఘుకులంబున నుత్పత్తియును, విశ్వామిత్ర సహాయసంపత్తియును, తత్సవన రక్షణంబును, గౌతమసతి శాపమోక్షణంబును, గిరిశ శరాసన భంగంబును, మత్పాణి గ్రహణప్రసంగంబును, భార్గవ గర్వ నాశంబును, సాకేత పురప్రవేశంబును, నందు మత్సహాయంబున ద్వాదశ వర్షస్థితినియమనంబును, దండకారణ్య గమనంబును, విరాధ నిధనంబును, మారీచమథనంబును, మాయా సీతాపహరణం బును, జటాయు మరణంబును, శబరీపూజనంబును, హనుమ త్సమాయోజనంబును, సుగ్రీవరంజనంబును, వాలిభంజనంబును, రావణ కుంభకర్ణాది వధంబును విభీషణ రాజ్యదాన విధంబును, మత్పుర స్సమాగమంబును, పుష్పకయానాగమంబును, సాకేతపునఃప్రవేశంబును, పట్టాభిషేచనంబును, నాదిగాగల యనేక కార్యవర్గంబు సర్గస్థితి హరణకారిణియును, బ్రకృతి రూపిణియునైన నాచేతం జేయబడిన వయ్యును,

నిఖిలాత్ముకుండును నిర్వికారుండును నగు రఘువీరుని యందు నారోపింపంబడియుండుగావున మరియును. 143

ఉ॥ రాకలు పోకలున్ మరియు రాగవిరాగము లాదికృత్యముల్
లేక సుఖస్వరూపమును నిశ్చలమున్ బరిణామ హీనమై
యేకము నైన నవ్విభుని కిన్నియుగల్గిన యట్లుదోచు మా
యా కలనా గుణానుగతి నాతతరీతి సమీరనందనా! 144

కం॥ అనియా విధమునవసుధా
తనయ బ్రబోధింపుచున్న తరిననిల సుతున్
వినయయుతంగనిరాఘవు
డనియె న్నిజతత్త్వ హృదయమఖిలంబు దయన్ 145

సీ॥ అనఘాత్మ! వివరింతు నాత్మ స్వరూపంబు
విను జలోపాధి చేతను నభంబు
నటజలాకాశ మహాకాశములును బిం
బాకాశమన త్రివిధాప్తి దోచు
తెరగునబుధ్యుపాధి వశంబునను జేసి
తగనవచ్ఛిన్న చైతన్యమనగ
పూర్ణంబుననబింబ భూతమైయాభాస
మన త్రివిధంబుగా నాత్మదోచు

తే.గీ॥ నట్టి యవికారియును నఖిలైకసాక్షి
★యై నవచ్ఛిన్ను నందు భ్రాంతాత్ములగుచు
తివిరిసాభాస బుద్ధి కర్తృతను జీవ
తాప్తి నారోపణము జేతురవని యందు 146

తే.గీ॥ సిద్ధ మాభాసమనమృషా బుద్ధి సుమ్ము
కనగ నజ్ఞానసంభూత కార్యమదియు
నై యవచ్ఛిన్నుడే బ్రహ్మమవ్విభేద
మింతయును భ్రాంతి జనితమౌ నిద్ధ చరిత! 147

కం॥ అలతత్త్వ మహావాక్యా
వళిబోధన్ బూర్ణతో నవచ్ఛిన్ననకున్
గలయగ నొకటిగ తనరున్
వెలయగ నాభాగకహము వీడుట చేతన్ 148

★ యగుచు – గ.ము.ప్ర. పాఠం

కం॥ దానం బూర్ణ త్మైక్య
జ్ఞానమహాభాగు డుదయసంగతుడైనన్
దోనన్ సమూలముగ న
జ్ఞాన తమంబెల్ల దెగు నసంశయమనఘా! 149

మ॥ ఇది సిద్ధంబని నిశ్చయించి మదిలోనెవ్వాడు మద్భక్తిసం
పదగాంచున్ హృతమాయుడై యతడు మద్భావంబు బ్రాపించు ని
ట్లదిగాకం బహుశాస్త్రగర్త పతితుండౌ భక్తి హీనుండు దు
ర్మదుడై జన్మశతంబులైన గనడాత్మజ్ఞానమున్ మోక్షమున్ 150

కం॥ ఇదివేద హృదయమగునా
హృదయము గోప్యంబు నేనెయెరిగించితి నీ
కిది భక్తిహీనకుమతుల
కదేయమగు నింద్ర పదవి కన్ననధికతన్ 151

వ॥ అనియివ్విధంబున శ్రీరామదేవుండుపదేశించిన పవన తనయుండు గృతార్థుండయ్యెంగావున
నీరామహృదయంబతి గోప్యంబును నతివవిత్రంబును సాక్షాద్రామ కథితంబును
సర్వవేదాంతసారంబును నగుటం దీనిభక్తి బఠించిన పుణ్యుండు బహుజన్మార్జితంబులగు బ్రహ్మ
హత్యాది కలుషంబులం దొలంగి ముక్తుడగునని వెండియు 152

శా॥ జాతి భ్రష్టుడు పాపియున్ బరవధూ సక్తుండు యోగిఘ్నుడున్
మాతాపిత్రభిఘాతి మద్యపుడు హేమస్థేయి యేనిన్ నిజం
బేతన్ముఖ్యతరంబు రామహృదయంబే ప్రొద్దు వాచింపసం
ప్రీతిన్ యోగి విలంఘ్యమౌపదము బ్రాపించున్ సురారాధ్యుడై 153

కం॥ అనవిని పార్వతి శర్వున
కనియెను ధన్యను గృతార్థ నైతిని మదిదో
చినసంశయ మెడలెను నా
కనఘాత్మా! భవదనుగ్రహముచేత నికన్ 154

కం॥ అభవ! భవన్ముఖ కమల
ప్రభవంబగు రామతత్త్వ పరమామృతమున్
శుభమతి గ్రోలిన నామది
కభిమతముగ దృప్తిజాలదయ్యడు గానన్ 155

కం॥ స్ఫురితంబులు చిద్వైభవ
భరితంబులు దూర దూర పరిధూతమహా

దురితంబులు శ్రీరాముని
చరితంబులు వినగనాకు సమ్మదమొదవెన్ 156

కం॥ మునునిటు సంక్షేపముగా
వినగా నొనరించి తింక విస్ఫుటవర్ణం
బును విస్తరంబుగాగను
వినిపింపుము రామచరిత విభవంబు భవా! 157

వ॥ అనియడిగిన మహాదేవుండద్దేవింగరుణించి యజ్ఞానభయ ప్రతారం బును, సంపదాయుష్య సంతాన సమృద్ధి కారణంబును, నస్మదీయ పారాయణంబును నగునధ్యాత్మరామాయణంబు మున్ను శ్రీరామ దేవుని వలన వినిన యనుక్రమంబునం జెప్పెద వినుమని యిట్లనియె 158

సీ॥ ఆరావణాదిక క్రూరాసు రానేక
భారాతి పీడితాకారయగుచు
ధారుణిగోరూపధారిణియై తొల్లి
సురలతోడను మౌనివరులతోడ
శోకంబునను సత్యలోకంబునకు వచ్చి
విన్ననైయజునకు విన్నవింప
నుర్వినాశ్వాసించి నొకముహూర్తము గాంచి
ధ్యానించి లోనెంచితద్విరించి

తే.గీ॥ విమలబోధము నెసగి సర్వము నెరింగి
క్షోణిసతితోడ దేవతా శ్రేణి తోడ
క్షీరవారాశి తీరంబు దారిజేరి
భక్తిమది జేర్చియలరమాపతిని గూర్చి 159

తే.గీ॥ శ్రుతి పురాణోక్త నిర్మల స్తోత్రములను
భక్తిగద్గదితానంద బాష్పములను
నజుడు సర్వజ్ఞ నీశ్వరునజరునమృతు
నఖిల లోకాంతరాత్ము నాహరినుతింప 160

కం॥ అంతట దోచె సహస్రా
నంతమణీ కాంతితోదనంతను ప్రాచీ
సంతమసమవియసుకృతై
కాంతిక లభ్యుండు హరి యొకానొకరీతిన్ 161

వ॥ అప్పుడు 162

సీ॥ శ్రీమహీసముపేతు హేమాంబరాన్వీతు
దీపిత స్వర్ణయజ్ఞోపవీతు
జలజాత పత్రాక్షు సకలలోకాధ్యక్షు
కౌస్తుభ శ్రీవత్స కలితవక్షు
హరినీలమణిదేహు కరుణాపరీవాహు
జలజగదాశంఖచక్ర బాహు
వనమాలికాహారు వైనతేయవిహారు
సనకాది మునిలోక సపరివారు

తే.గీ॥ స్మితముఖోల్లాసు కుండల శ్రీవిలాసు
భూరికోటీర కటక కేయూర ధారు
నఖిల పూర్ణ స్వభావు మహానుభావు
నాది దేవుని గాంచెనయ్యబ్జభవుడు 163

వ॥ ఇట్లు గాంచి నమస్కరించి విరించి యద్దేవుం గురించి యిట్లని స్తుతియించె 164

సీ॥ అక్షరాయ సమస్త సాక్షిణే భవ్యాయ
సేవ్యాయ దివ్యాయ చిన్మయాయ
సకలాగమస్తోమ సారసంస్తుత్యాయ
నిత్యాయ సత్యాయ నిర్మలాయ
మౌనీంద్ర నిశ్చల ధ్యానైకగమ్యాయ
సౌమ్యాయ రమ్యాయ శాశ్వతాయ
సంతతారుణమండలాంతర్నివేశాయ
శ్రీశాయ ధీశాయ కేశవాయ

తే.గీ॥ దివ్యయోగీంద్ర హృచ్ఛిఖాతేవనాయ
భక్తసంవిత్సుధారసప్లావనాయ
శివ విరించాది విశ్వైక జీవనాయ
దేవదేవ! నమోస్తుతే పావనాయ 165

వ॥ అనిమరియును 166

తే.గీ॥ నిరతమును కర్మపరిపాక పరతజేసి
యెవ్వడు ముముక్షువుల చేత హృదయ వీధి
నమలగతి ప్రాణబుద్ధీంద్రియాదినియతి
దలపబడు నట్టి నీకు వందన మొనర్తు 167

కం॥ ఈ నిఖిలము గుణమయ మా
యానుగతిం జేతుబ్రోతు వణతువుపైనన్
స్వానందానుభవాత్ముడ
వౌ నీ కాసంగలేశమన లేదు హరీ! 168

సీ॥ సాత్వికోత్తములైన సనకాది మునులకు
నాంతరంగికధారణాంచితములు
న పరోక్షసిద్ధ లౌనమరవిజ్ఞానుల
కావిర్భవధ్యాన భావితములు
ప్రాప్తకార్యార్థులై బ్రహ్మాదులైనమా
చేతను బహు పూర్వ సేవితములు
ననుభూతిపరులైన నఖిల యోగీంద్ర సం
తతులచే సంతత దర్శితములు

తే.గీ॥ నీపదాంభోరుహములట్టి నీ పదములు
చిరతపః పాక నిరతి నీక్షింపగంటి
నేకృతార్థుడనైతి నా హృదయ దోష
కలుషములడంచిబ్రోవవే కమలనయన! 169

ఆ.వె॥ నీ పదార్చనైక నిర్మల తులసికా
మాల్య పాళితో రమావధూటి
నీయురస్థలమున నిలయంబుగనియును
స్పర్థజేయునట సపత్ని రీతి 170

తే.గీ॥ అఖిల కామంబు లెడలి శుద్ధాత్ములైన
శిష్టమతులకు నీభక్తి చేత బోలి
అధ్యయన దాన కర్మవ్రతాదికముల
గానబడదాత్మశుద్ధి నిష్కర్ములకును 171

కం॥ కావున నీపద భక్తి
శ్రీవిభవంబధిక మనిరుచిన్ సారజ్ఞుల్
తావకభక్తియె కోరుచు
కైవల్య పదంబునైన కాంక్షించరొగిన్ 172

కం॥ చిరభవరోగార్తులకున్
పరమౌషధ భక్తి నీదు భక్తియె కానన్

పురుషోత్తమ నిరతము సా
దరమతి నాకట్టి భక్తి దయసేయ గదే! 173

సీ॥ తత భవాంభోరాశి దాటంగ వచ్చునే
నలినాక్ష! నీభక్తి నావలేక
నమిత పాపదవాగ్ని నార్పంగ వచ్చునే
విశ్వాత్మ! నీ దాస్య వృష్టిలేక
విషయాంధకారంబు విరియింపవచ్చునే
వరద! నీధ్యాన భాస్కరుడులేక
వివిధజన్మ లతాళి విదళింపవచ్చునే
హరి! నీపదస్మరణాసి లేక

తే.గీ॥ నతిశయానంద సంధాయ కాపవర్గ
సౌధమున నెక్కవచ్చునే శౌరి! నీదు
పరమ కారుణ్య సోపాన పంక్తి లేక
భక్తిపరితోషకర వేష! పరమపురుష! 174

కం॥ అనివినుతించు విరించిం
గనుగొనిగరుణించి ప్రకృత కార్యంబేమీ!
ననుగాంచగ నొనరించెద
వినిపించుమటన్న హరికి విధియిట్లనియెన్ 175

కం॥ రావణుడు భువనజన వి
ద్రావణుడు సమిద్ధ యుద్ధరంగవిముఖితై
రావణుడు మహోదగ్ర వి
రావణుడుగలండు జగతి రాక్షస పతియై 176

కం॥ పౌలస్త్య సుతుడు దుర్మద
శీలుడు మద్దత్తవర విజృంభిత దర్పో
ద్వేలుండగుచు త్రిలోకీ
కాలుండగు నతడు విశ్వకంటకుడగుచున్ 177

కం॥ సురతతులన్ నరపతులన్
గురుమతులన్ మునులఘనుల గుణగణవతులన్
బరసతులన్ వరమతులన్
గరమతులంబుగ గలంచు కలుషాత్ముకుడై 178

వ॥ అదియును గాక 179

సీ॥ పక్వముల్ శాసింపపాకశాసనుడయ్యె
పావకుండయ్యె తత్పచనవిధిని
తగ దదాజ్ఞభరింప దండధరుండయ్యె
నొకమూలకోణపు డొదగనయ్యె
పాశధరుండు తద్భవనబద్ధుండయ్యె
పవనుండు వీవనల్ బరపనయ్యె
నర్థియయ్యెను వాని నభయార్థములు వేడ
నార్యేశుడిష్ట కార్యకరుడయ్యె

తే.గీ॥ అశనివశవృత్తిజేసె యథార్థనామ
రూఢినస్వప్నకులము నాద్రోహియైన
రావణు వధించి భువనముల్ బ్రోవుమయ్య
యార్తరక్షణ కృత దీక్ష! యంబుజాక్ష! 180

తే.గీ॥ నరులచేతను మృతియు వానరుల చేత
పరిభవంబును వాని కేర్పరచి తేను
గానమనుజుడ వగుచునాకష్టదనుజు
ననుజ తనుజాన్వితముగాగ దునుముమనిన 181

సీ॥ అనిననయ్యజునకు హరియిట్టులను నన్ను
మున్ను కశ్యపుడను మునివరుండు
తపమున మెప్పించి తనయుండవగుమన్న
నయ్యర్థమునకు నేనియ్యకొంటి
నామౌని దశరథ భూమీశుడైయిప్పు
డవని పాలన సేయునతని సతులు
కౌసల్య మొదలుగా గలరు వారలయందు
చతురాకృతుల నేను సంభవింతు

తే.గీ॥ యోగమాయయు జనకునకుద్భవించు
సీతనాతత్సహాయాప్తి చేతనుండి
యపుడ దనుజుల హరియింతుననుచు జెప్పి
యంతనంతర్హితుండయ్యె నవ్విభుండు 182

కం॥ అంతటనయ్యజుడమరుల
కెంతయునిట్లనియె జగతి నినకులమున శ్రీ

కాంతుడు దశరధ భూమీ
కాంతునియందవతరింపగలడటు గానన్ 183

కం॥ మునుమును మీయంశంబుల
జనియింపగజేసి సుతుల సతులందుమహా
వనచరులైదనుజారికి
ననుచరులై యుండవలయు నప్పుడపుడమిన్ 184

కం॥ అని నిర్దేశించిధరాం
గననాశ్వాసించి పంచికమలభవుండున్
దన భవనమునకు జనదా
రునుహర్షిలిరపుడు నిర్జరులు విజ్వరులై 185

సీ॥ అంతధాతయుజాంబవంతుని జయవంతు
శక్రుండు విక్రమ శాలివాలి
భానుండు సముదగ్ర భావు సుగ్రీవుని
నటసమీరుడజేయు నాంజనేయు
అలవిశ్వకర్మయు నలుని మహాబలు
పావకుండహిత విఫాలు నీలు
ధననాథుడురుశౌర్యధను గంధమాధను
తగబృహస్పతి జవాధారుతారు

తే.గీ॥ మరియు కల దేవతతులెల్ల మరియు కలుగు
వానరుల నుద్భవముసేయ వారుఘోర
రూపులు మహాప్రతాపులు రూక్ష వృక్ష
శిఖర ముఖ్యాయుధులు నౌచు జెలగిరవని 186

వ॥ ఇవ్విధంబున ననేక సంఖ్యాకులగు వానరవీరులనేక శైలకాననారామ జనన స్థితిం బ్రతీక్షింపుచుండి
రా సమయంబున 187

- అయోధ్యాపుర వర్ణనము -

ఉ॥ పూతము పుణ్య సంపదనుభూతము పూర్ణ సమస్తవస్తు సం
జాతము దేవభూతమనుజాతము కేతనవాతధూత జీ
మూతము సద్యశోగుణ సమూతము సాధుపరీత మొప్పుసా
కేతము రత్న సుందరినికేతము రాజరమాసమేతమై. 188

ఉ॥ భాసురమూలబంధముఖ బంధములందగి చక్రరీతులన్
వాసికినెక్కి సూర్యశశి వర్తనలంగని వాయురోధన
శ్రీసముదగ్ర నిశ్చలత జెంది సకీలకముద్రలం హఠా
భ్యాసముజేయు సిద్ధవరుపద్ధతి సాలము బోల్చునప్పురిన్ 189

ఉ॥ ఆనగరేంద్రసాల వరమావిధి ఖేచర యోగమూనుచో
దాను తదేక సంగతిని దాల్చుట ఖేయవరంబుకుండలీ
స్థానమునంటి యావరణ చక్ర చయాక్రమణక్రమానుసం
ధాన సజీవనస్థితుల దార్కొనియెం బరిపూర్ణభావమున్ 190

కం॥ నాసాగ్ర శిఖాలక్షిత
భాసుర యంత్రానుభావ భాసితగతిచే
నాసాలముఖంబాత్మ
శ్రీసముదగ్రమగు సుఖ పరిప్లుతి దనరున్ 191

సీ॥ పురదర్శనాత్మీయ భువనాగతాఖండ
పటు కుండలీశ్వర ఫణములనగ
నగర లక్ష్మీఖేల నావాస ఖేయాబ్ధి
జాత వప్రాంబుజచ్ఛదములనగ
నరభవాభ్యవతీర్ణ సురనివాసార్థసం
గతమేరు శైలశృగంబులనగ
ప్రతిపక్ష రాక్షస క్షతి కృతి ప్రక్రియో
ద్గతి విక్రమిత చక్రధారలనగ

తే.గీ॥ నిజకుల నృపాల జనజాలనిలయ మూల
పట్టణావేల పాలనా బద్ధశీల
ధరణితల ఖేలదున్నమత్తరుణ తరణి
కిరణశిఖలనదగు పురీవరణ శిఖలు 192

సీ॥ తారకయోగ ప్రకారకాభ్యున్నతి
దగుచంద్రశాలావితానములను
చంద్రమంలసుధాసార యోగశ్రీల
సార్థంబులగు సౌధసార్థములను
లంబికాయోగావలంబమాన స్ఫూర్తి
జెలగుపతాకికాజిహ్వికలను

మిహిరబింబాలోక మహితయోగ కళాభి
రామంబులగు హేమధామములను

తే.గీ॥ నాపరాకాశదేశ స్వయం ప్రకాశ
భావయోగానురక్తి దీప్తంబులగుచు
ప్రబలుగోపురరత్న కుంభముల చేత
దనరు దివ్య ప్రభావాప్తి దత్పురంబు 193

కం॥ పురి సూర్యచంద్ర వీథుల
నరుదుగ జరియించు రాజ హంసవిహారం
బిరవై శృంగాటక వి
స్ఫురణంబున మెరసి దివ్య సుఖమున్ గూర్చున్ 194

తే.గీ॥ మంత్రయోగంబులును ధర్మమహిమలెరిగి
యరుళలయ యోగమొనరింప నతిశయించి
హఠమునను పరచక్రంబు లాక్రమించు
రాజయోగంబుచే బోల్చురాజధాని 195

చం॥ శ్రుతితతికిన్ గుశీలవులు సుస్థిరశాస్త్రమణీఖనీస్థలుల్
క్రతుతతికిన్ శతక్రతులు గాఢతపోనల సామిధేనికుల్
శ్రుతిశిఖరాంతర స్థలతిరోహితతత్త్వధనాంజనప్రద
స్థితులువసింతురప్పురిని చిద్ర్దససిద్ధవరుల్ మహీసురుల్ 196

చం॥ అలభృగువంశసంభవశరాస నిరస్త పరప్రకల్పితో
జ్వల శరమార్గుడైన రఘువర్యుని రాముని దెల్పులీలచే
అలభృగువంశ సంభవశరాస నిరస్త పరప్రకల్పితో
జ్వలశరమార్గమైన నృపవర్గము జెన్నగునప్పురంబునన్ 197

చం॥ హరి రఘురాముడై యటదశాస్యహృతాత్మవిమానరాజమా
దరమున దెచ్చుతెచ్చినను తత్కృపనేనదిగాంతునంచు త
త్పురముననేవిధంబులనుతుల్ఘటియించగనుండునద్ధనే
శ్వరబహుమూర్తులో యనగవైశ్యులుబోల్తురధీశవశ్యులై 198

చం॥ హరిపదమందుమున్నుజననాప్తినిగాంచుటతత్పదాంకమై
బరగుహలంబు చిహ్నముగభాసిలి వెండియు రామమూర్తియౌ
హరిపదమాశ్రయించుటకు నప్పుడు నందువసించిరోయనన్
బరిచితధర్మసూక్ష్మమతి భద్రులు శూద్రులు బోల్తు రచ్చటన్ 199

మ॥ అరగంటన్‌గనుచున్ బ్రమత్తగతి చర్యంబోల్చి పద్మాసన
స్ఫురణన్మించుచుభక్తికై పరులచేబోధింపగావించుచున్
గరిమన్‌గేవలకుంభకాప్తి నచలాకారంబులన్ నిల్చుచున్
గరులొప్పున్ బురిరాజయోగకలనాకౌశల్య విస్ఫూర్తులన్ 200

చం॥ పవనమనోజవంబులను బట్టగనిల్పని జాలునాత్మవై
భవములబోల్చు సత్వరతభంగి నెసంగి ఖలీనభావనా
ప్రవశగతిప్రభావములభాసిలుయోగ్యవతంసవృత్తిచే
నవిరళవైరివర్ణవిజయాహ్వయముల్ హయముల్ బురంబునన్ 201

ఉ॥ ఆ నగరాంగణంబుల శతాంగములన్ గణుతింపగాననం
తానుపమప్రచారగతినంచిత దివ్యతరప్రభావతా
నూనజయాంకరీతి సుమనోనిలయత్వ మహత్వభూతిస
న్మానితభాతిచెన్నగు ననూనవిమాన సమాన సంగతిన్ 202

కం॥ శాంత నవసత్వధాటీ
సంతత సంగరహితాప్తి సలుపుచు విమతా
శాంతజయా త్యంతరయా
క్రాంత నయార్భటులు భటులుగలరయ్యోరన్ 203

కం॥ సుకర కలనాదముల భా
వకళామోదములను ముఖ వరబిందువిశే
షకముల సొంపులునింపుచు
సకియలుపురిదగుదురాత్మసౌందర్యములన్ 204

చం॥ చరణకరాక్షి యుగ్మములు షట్కమలంబులు చిన్నభంబు గౌ
నరయగ నారు కుండలిసహస్రదళాబ్జముమోముగాగ జె
చ్చెరకనుబొమ్మ సంజ్ఞల వశీకృతులై నిజలక్ష్యయోగ సు
స్థిరులగు వారినయ్యుపరతిం గరగింతురు కాంతలప్పురిన్ 205

మ॥ నిజమాకాశసుమంబు జూడ నగుబో నీవియ్యగానంచు నా
రజపుం బల్కులబల్కుపల్లవికులన్ రాగంబులన్ బెంపుచున్
నిజమాకాశసుమంబుజూడనగుబో నీవీయ్య నంచున్ దమిన్
నిజయోగానుభవంబుదెల్పుపురినెంతే పుష్పలావీతతుల్ 206

మ॥ శుకసూక్తి శ్రవణంబులన్ మనములంజొక్కించు సర్వాగమాం
తకళల్ బెంచినిరంతరామృత ఫలాదానంబులం బూన్చి పొం

దికనానందము నించి భూజనులకెంతేనాత్మసంసక్తిచే
నకళంకస్థితి జెన్నగున్ నగరిలో నారామ సౌభాగ్యముల్ 207

ఉ॥ మందమరుత్ప్రసక్తిగనిమానస గర్వమునిల్పజాలు సొం
పొందినహంస యోగకళలూని సహస్రదళాబ్జ ఖేలనా
నందమునన్ నిజాంతరమునన్ సుగుణాళులెసంగగా సరో
బృందములొప్పునప్పురి పరిష్కృత పూర్ణతరామృత స్థితిన్ 208

సీ॥ నవసరోజాస్వాదనటనాగతామోద
ఘటనాయతి వినోదగతి వహించి
కేళీసరిత్పార్శ్వ నాళీ ప్రతోళీ స
మేళీకృతి వ్యాప్తి బాళిమించి
భోగినీ హృదయాంగ రాగయోగాభంగ
భోగసాంగత్యంబు పొలుపుగాంచి
తత శిరోగృహ సమావృతనభోంతర సమా
యతగుంభనావాప్తి నావహించి

తే.గీ॥ యందుమందాను గతి జెలువందునికట
నంద దిందు కళాంతనిష్యందదమృత
బిందుకందళ సందోహసుందరాను
బంధగంధావహుండౌచు గంధవహుడు 209

కం॥ అందుల వీరును వారన
కందరు ధర్మాధిరూఢులందరు సత్యా
నందులు విభవేంద్రులు గో
విందపదారాధనమున వెలసినకతనన్ 210

కం॥ ఆ రాజధానిమనుకుల
ధౌరేయులు శరపరాస్త దైత్యేయులు రా
జ్యారూఢ క్రములై దు
ర్వార పరాక్రములు గలరు వారల వరుసన్ 211

సీ॥ ఎసగు నెవ్వనిధర్మ మిక్ష్వాకు మాంధాతృ
సగరాదినృప పునస్మరణ గూర్చి
మలయునెవ్వని కీర్తి మందాకినీ బిందు
సందోహముల తోడ సరసమాడి

యలరునెవ్వని బలంబఖిలదిక్పాలక
ప్రకరాభయప్రద ప్రౌఢిమించి
యమరునెవ్వని శౌర్య మర్యమాత్మజగర్వ
నిర్వాపణ క్రియానిపుణమగుచు

తే.గీ॥ వెలయునాతడు దనుజాత విజయనీత
పాకదమన పురోద్భూత పారిజాత
కులకుసుమజాత వాసనా గుణ పరీత
శోభనాస్థాని దశరథ క్షోణిజాని 212

కం॥ భాసురమతి సౌశీల్యము
గౌసల్యయు పతిసుఖైక కైకయు సుగుణో
ల్లాస సుమిత్ర సుమిత్రయు
నా సుదతులు గలరు మువ్వురన్నరపతికిన్ 213

వ॥ అమ్మనువంశ ధురంధరుండు 214

మ॥ సరయూ తీరమునన్ వసిష్ఠ రచితాచారాప్తి బెక్కుల్ మహా
ధ్వరముల్ జేసి సురల్ ద్విజుల్ బ్రియమునందం దైత్యులం గూల్పదన్
గరమర్థాసన మిచ్చి వాసవుడు రాకల్ పోకలం గూర్పనీ
సరణిన్ షష్టి సహస్ర వర్షములు రాజ్యం బేలెనిర్వార్యుడై 215

వ॥ అంతనొక్కవాడు సత్య పరాక్రముండును, త్రిలోకవిశ్రుతక్రముండును, శ్రీమంతుడును, నద్ధరాకాంతుండు, నిజగురుండును, ముని వరిష్ఠుండును, నగువసిష్ఠం గాంచి, నమస్కరించి, తనకు సంతతి లేమికిం జింతించి, యిట్లనియె 216

సీ॥ నిజవంశ కల్పావనీ జాతమూలంబు
నకలంకపుణ్య లతాంకురంబు
సుగతి సౌధారోహ సోపాన పటలంబు
నరక సరిత్తారణ ప్లవంబు
సంసార భారాపసరణోపభృతికంబు
సకల పితృణ మోక్షణధనంబు
హర్షవారాశితారాధిపాభ్యుదయంబు
సంతాపశాంతి విశ్రాంతి భూమి

తే.గీ॥ మహిత కీర్తి పరిస్ఫూర్తి మార్గదాయి
వివిధ గృహ ధర్మచయ పురోవృద్ధికారి

ఆప్త బంధు జనాదికాహ్లాదకరము
తాపసోత్తమ జగతి సంతతియెకాదె 217

కం॥ తనయులు శుభలక్షణ మహి
త నయులు నాకగుదురెట్లు దాని దెలుపవే!
తనయ విహీనుని నృపవ
ర్తనమును ధనమును సుఖాయతన మేమిటికిన్ 218

వ॥ అనిచింతింపుచున్న యన్నర శ్రేష్ఠునకు వశిష్ఠుండు సంతాన కరంబుగా నొక్కవృత్తాంతంబు జెప్పెదనని యిట్లనియె 219

చ॥ తనకు సుతుండు లేమికిని తన్నిజ భూమిని వృష్టి లేమి కొ
య్యనమును రోమపాదుడను నంగవిభుండు బుధాళి ఋష్యశృం
గునిగొని తెచ్చినంత గలుగున్నిజమన్నను జన్మమాది న
మ్మునివనవాసి గ్రామ్యవిధముల్ గననేరడటంచు చింతచేన్ 220

తే.గీ॥ ఆతడే రీతినేతెంచు నంచునెంచి
వారసతులను చాతుర్యవతుల గాంచి
నృపతిబంచిన వారలంతికము జేర
నాటవిక చేష్ఠితుండౌట నమ్మునియును 221

ఉ॥ దూరమె కాంచివింతమదిదోచినయంతనె నిల్చిదగ్గిరన్
జేరిన యోరగానొదిగి చేరికె నెన్న డెరుంగనట్టియా
కారము లౌటనివ్వెరగుగా గనియంగ గతుల్ దనట్లుగా
నారసియాత్మ జాతియని యంతటగొంతమదిన్ దలంచుచున్ 222

కం॥ వింతల ఋషులని కాంతల
చెంతలజని తాను మ్రొక్క చిరునవ్వుల వా
రెంతయుదనకున్ మ్రొక్కిన
సంతసమున మునియు కొన్ని సల్లాపములన్ 223

సీ॥ భర్మాంబరంబులు చర్మంబులని గంధ
లేపనంబులు భూతిలేపనమని
మండనంబులు పుష్పకాండబులనియును
మణిమాలికలు వనమాలికలని
గురుకుచమ్ములు రొమ్ము కొమ్ములంచనియును
జడలును చక్కని జడలుననియు

ప్రేమగానంబులు సామగానములని
నర్తనమానంద నర్తనమని

తే.గీ॥ యలరబాడి పదక్రమమనుట యెల్ల
నలరబాడి పదక్రమ మనుట యనుచు
మునులగా నమ్మివారభామినులనటవి
నట విభాండకసుతుడుండు నవసరమున 224

వ॥ ఇవ్విధంబున వధూ పురుషభేదం బెరుంగక గ్రుమ్మరు నమ్ముని మౌగ్ధ్యమ్ముగని యమ్ముగ్ధలు తమ వైదగ్ధ్యమ్మున 225

చ॥ ఫలములు గొమ్మటంచు తగు భక్ష్యములిచ్చుచు మేని మేనితో
నలముచు కర్కశ స్తనములానుచు మాటల తేటలం భ్రమం
సొలపి మదాశ్రమ స్థలము జూతువురమ్మనితోడి తెచ్చి య
చ్చెలువలు గ్రామ్యవర్తనుని జేసి రసంగుని ఋష్యశృంగునిన్ 226

కం॥ అంతటనురోమపాదుడు
శాంతను దన తనయ గుణనిశాంత నొసంగన్
సంతసిలెమునియు గలిగెం
సంతతమగు వృష్టినిష్టి సంతతి గలిగెన్ 227

వ॥ అట్లగుటంజేసి 228

కం॥ శాంతాధీశుడు నపహృత
చింతాలేశుడగు ఋష్య శృంగునసంగున్
శాంతి ప్రసంగుదెచ్చుక
సంతానేష్టి యొనరింపు జనవర మాతోన్! 229

కం॥ కలుగుదురు దాననీమది
కల కుదురుగ లోకపాలక స్థిరతేజుల్
నలుగురు తనూజులనుచుం
కుల గురుడు వచింప నృపతి గురుహితమతియై 230

కం॥ చని యంగదేశమునకున్
గని యంగనృపాలు తత్ప్రకల్పితపూజల్
గొని ఋష్యశృంగముని దో
కొనివచ్చి సమర్చలిచ్చి గురుసహితముగన్ 231

కం॥ హితులు పురోహితులు మహీ
పతులు సమాహితులు మంత్రిపరిజన తతులా
శ్రితులును పరివృతులుగ శుచి
గతుల సతులు దానుదీక్షగైకొని పతియున్ 232

వ॥ అంతవసిష్ఠాది మునిపుంగవ సంగతుండగు ఋష్యశృంగునిం బురస్కరించి సరయూ తటంబున నుత్కటంబగు యజ్ఞవాటంబున యథావిధి నశ్వమేధమహాధ్వరం బొనరించి యభీష్టంబుగా బుత్రకామేష్టి గావించు సమయంబున 233

కం॥ నేమంబున ననలశిఖా
స్తోమంబున పరమభక్తితోడన్ గూడన్
హోమంబులు సేయను జ్వల
ధామంబుగ దేజరిల్లు తన్మధ్యమునన్ 234

వ॥ అంతట దప్తజాంబూనద ప్రభావహుండగు హవ్య వహుండు బురుషుండైయావిర్భవించి సువర్ణ పాత్రంబునంబరిపూర్ణంబగు పరమాన్నంబు దెచ్చి యద్దివ్యహవిస్సుదేవ నిర్మితంబును పుత్రప్రదంబును నగుదీని నుపయోగించిన బరమాత్ముండగు విష్ణుండు పుత్రుడగునని చెప్పి యప్పాయసంబు నొసంగి యంతర్హితుండైన నద్దశరథుండు లబ్ధ మనోరథుండై వసిష్ఠ ఋష్య శృంగాదులంబూజించి మందిరంబులకువచ్చి యమ్ముని చంద్రుల యనుమంతబున 235

కం॥ అర్థము గోసలపుత్రికి
యర్ధము గైకేయి కొసగ నప్పుణ్య సతుల్
స్వార్ధములందు సుమిత్రకు
నర్ధం బర్ధం బొసంగి రాదరమొసగన్ 236

కం॥ ఆ పాయసము భుజించిన
భూపాలుని సతులు గర్భమున బూర్ణశశిన్
బ్రాపించిన ప్రాచీరుచి
దీపించిరి గర్భగతుల దేవ సుతులనన్ 237

కం॥ అందరిలో గౌసల్యా
సుందరి దినమొక్కరీతి సొంపొందెను గో
విందుని సంపూర్ణ కళా
సందర్భము గర్భమున నెసంగిన కతనన్ 238

చం॥ కలికికి మంటి మీద రుచిగల్గెను, చెక్కుల ఘర్మవారి బెం
పలరెను, వింతకాంతి తనువందు నెసంగె, నిడూర్పు పాయువుల్

వెలసెను, మధ్య మాంబరము వృద్ధిగనెన్, దన గర్భ వీధినిం
పొలయగ పంచభూతమయుడుండ దదున్నతి దెల్పుకైవడిన్ 239

తే.గీ॥ వేడ్క గౌసల్యగర్భంబు వృద్ధిగాంచ
వేలుపుల వైభవంబులు వృద్ధి గాంచె
నాతి వక్షోజ ముఖములు నల్లబడిన
నెల్లదనుజుల ముఖములు నల్లబడియె 240

సీ॥ కోరికల్ జలధులై గూడగా విహరించు
నంగ సంకోచంబునధిగమించు
పంటివారుచియంటి మంటిగోష్ఠిఘటించు
సతతంబు ప్రహ్లాద మతివహించు
నొకటి రెండడుగుల నొకదారివర్తించు
నుర్వీదానాదుల కుత్సహించు
బహుముఖవ్యావృత్తి భంగిపరిహరించు
తనువున పాండురత్వము భరించు

తే.గీ॥ వలయు బుద్ధిని కలికి భావమున మించు
తనదు గర్భార్భకు దశావతార కలన
వెలిదెలుపు రీతి దౌహృదావిర్భవమున
రమ్యతతగాత్రి కోసల రాజపుత్రి 241

వ॥ ఇవ్విధంబున నవ్వధూమణు లెసంగనంత దశమమాసంబున 242

- శ్రీరాముల జననము -

మ॥ రవియున్ శుక్ర బృహస్పతుల్ గుజశనుల్ రమ్యాంశనుచ్చస్థులై
సవరింపన్ శుభముల్ బునర్వసువునన్ జైత్రాద్యపక్షోజ్వల
న్నవమింజంద్ర సమేత కర్కటక లగ్నంబందు భవ్యాప్తి ను
ద్భవిలెందానె సనాతనంబగు బరబ్రహ్మంబు కౌసల్యకున్ 243

కం॥ కురిసెన్ పువ్వులవానలు
మొరసెన్ సురదుందుభులు సముత్సాహకళల్
నెరసెన్ దిక్కుల తమములు
విరిసెన్ విష్ణుండులోక విభుడుదయించెన్ 244

సీ॥ పూర్వ భూభృన్మార్గమునకు వన్నియగూడె
నఖిలంబునను తమోవ్యాప్తి వీడె

కువలయంబు వికాస నవనవ శ్రీమించె
దరవృత్తి పంకజాతము ముడించె
నతిరమ్యగతి సదాగతి దా విరాజిల్లె
సత్పథస్థితికి తేజముఘటిల్లె
విమలకళాకలాపములు బెంపువహించె
యాశాంతముల దెల్వియావహించె

తే.గీ॥ కంథులుప్పొంగె శుభతరంగము లెసంగె
నరుల జతవిచ్చె సుకవుల హర్షమెచ్చె
శితగుణ మెలర్చె సుకర సంగతి దనర్చె
నరువిభావాప్తి రామచంద్రోదయమున 245

వ॥ అయ్యవసరంబున 246

సీ॥ నీలోత్పలశ్యాము నిఖిలగుణస్తోము
నినసహస్రవిభాసు కనకవాసు
శంఖ చక్రోపేతు జలజ గదాన్వీతు
దీర్ఘచతుర్బాహు దివ్యదేహు
కరుణారస నిశాంతు నరుణాబ్జనేత్రాంతు
నటసుస్మిత కపోలు నలకఫాలు
మకుట ప్రభాకీర్ణ మకరకుండల కర్ణ
వనమాల్యవళితు శ్రీవత్సలలితు

తే.గీ॥ రత్నకటకాది భూషణరాజమాను
పరమపురుషైక లక్షణ భ్రాజమాను
సూను నసమాను నద్భుత శ్రీనిధాను
కాంచి కౌసల్య సంతోష కలితయయ్యె 247

వ॥ ఇట్లు గనుంగొని కనుంగవ హర్షాశ్రువులు బెనంగొన నాశ్చర్యంబున నంజలి ఘటించి దేవా నీవు శంఖ చక్ర గదాధరుండవగుట బరమాత్ముండును బరిపూర్ణుండును ననంతుండును నచ్యుతుండును నగు పురుషోత్తముడవగుదు వట్టి నీకు నమస్కరించెదనని మరియు నిట్లనియె 248

మ॥ నినువర్ణింతురు వా గగోచరునిగా నిత్యంబు బుధ్యాదికం
బునకుంగన్గొనగా నతీంద్రియునిగా పూర్ణాంతరానంద వ
ర్తనుగా జ్ఞానమయైక మూర్తిగను సత్తామాత్రుగా నెంతయే
ననఘుల్ సాధులు వేదవాదులగు వారాసక్తిచే నీశ్వరా! 249

కం॥ ఈ విశ్వము సత్వాది గు
ణావేశత బ్రోవజేయ నణపదగుదువౌ
నీవీ మాయా సంగతి
నావికృతులు నిన్ననంట వమలుడ వగుటన్ 250

కం॥ చనుటయు వినుటయు చేయుట
గనుటయునను లేని నిర్వికారుడవయ్యున్
జనుటయు వినుటయు చేయుట
గనుటయునుం గలుగునట్లు గనబడు దీశా! 251

కం॥ అమనుం డప్రాణుండును
విమలుండును శుభ్రుడనుచు వివిధ విధములం
గ్రమమున శ్రుతి నుతియింపగ
నమలాత్మా! నినునుతింప నన్యులవశమే! 252

తే.గీ॥ సర్వభూతంబులందున సముడవగుచు
వెలుగుచుండియు విజ్ఞాన వృత్తులకును
గానబడకుందు వధికవిజ్ఞానులైన
భక్తులకు దోచుచుందువు వ్యక్తముగను 253

ఉ॥ నీయుదరాంతరాళసరణిన్ బరమాణువు లట్ల పద్మజాం
డాయుతముల్ గనంబడు మహాత్ముడవై తగు నీవు నీగతిన్
నాయుదరంబు నందు జననం బదిలోక విడంబమయ్యె నే
డాయతి భక్తవత్సలుడవౌట గనుంగొననయ్యె రాఘవా! 254

మ॥ పతి పుత్రార్థ ముఖభ్రమాదులను సంభావించు సంసార దు
ర్మత మోహాబ్ధి బరిభ్రమించుచును నీమాయావృతింజెందు నా
కతులంబౌచు భవత్పదాబ్జ మనుభవ్యంబైన పొంతంబు సం
గతమయ్యెన్ దరియింపగంటి భవదుఃఖంబుల్ కృతార్థస్థితిన్ 255

కం॥ నీ విశ్వవిమోహన మా
యా వరణమునంట కుండ నఖిలాత్మక మ
ద్భావంబున నెపుడే త
త్తావక రూపము వసింప దయసేయగదే! 256

వ॥ మహాత్మా! జగదాశ్చర్యకారకంబగు నీయలౌకిక రూపం బుప సంహరించి కోమల స్వభావంబగు బాలభావంబున మహానందం బొనర్చి లాలనాలింగ నాదులగు నాదరణంబుల నీదయం బ్రాపించి

యజ్ఞానంబు నుత్తరించెదనని జననింగరుణించి నీకెద్దియిష్టం బునట్లు గావింతునని భగవంతుం డిట్లనియె 257

కం॥ ఆరాధింపంబడి భూ
భారాహరణార్థమవని పద్మభవునిచే
నారావణ హృతికి నరా
కారాదృతి గంటి నదియుగాకను వినుమీ! 258

మ॥ జననీ! నీవును నీ విభుండును దపశ్చర్యాప్తిచే నన్ను బు
త్రునిగా గోరిననట్లు జేసితిని మద్రూపంబు నీజేయు ప్రా
క్తన పుణ్యస్థితి జూడగా గలిగె మత్సందర్శనం బేరి కై
నను దుర్లభ్యము నీకునెప్పుడు మహానందంబునై గన్పడున్ 259

కం॥ మనసంవాదం బెవ్వరు
వినినం జదివినను వారు విభవాన్వితులై
నను సంస్మరించుచును నొ
య్యన మత్సారూప్య పదవి నందుదురంతన్ 260

ఆ.వె॥ అనుచు తల్లితోడనని దేవ దేవుండు
లీలతోడ చిన్న బాలుడగుచు
కావు కావుమనుచు కడరోదనము సేసె
కావు కావుమనగ దేవతతులు 261

శా॥ బాలుండయ్యు సురేంద్ర నీలనిభుడున్ భాస్వద్విశాలాక్షుడున్
బాలార్క ప్రతిమానుడున్ భువన సంభావ్యుండు సౌందర్య లీ
లా లాలిత్య విశేషుడైన యతనిన్ లక్షించి గౌసల్యయున్
జాలావిస్మయమందె నెంతయు మదిన్ సంతోష ముప్పొంగగన్ 262

సీ॥ అంతట దశరథుండపుడు కుమారోద
యోత్సవంబాలించి యుత్సహించి
యానందజలధిమగ్నాశయంబునమించి
గురునితోనచ్చోటి కరుగుదెంచి
యక్కుమారుని గాంచి హర్షాశ్రువులు నించి
యటమంగళస్నానమాచరించి
స్వపురోహితుని చేత జాత కర్మంబులు
గావించియున్నత క్రమముతోడ

తే.గీ॥ అంతగైకేయి గనియె శుభాభిరతుని
భరతుని సుమిత్రగనియెను వరవిభవముల
భవ్యపూర్ణేందు వదనానుభవుల గవల
నవల లక్ష్మణ శత్రుఘ్ను లనెడి సుతుల 263

వ॥ అప్పుడప్పుడప్పుడక్తి రథుండు బుత్రోత్సవంబు ననేకంబుగా బ్రాహ్మణ సహస్రంబులకు గ్రామ సహస్రంబులును, బహుక్షీరధానులగు ధేనువులను, ప్రభాత వర్ణంబులగు సువర్ణంబుల నుచిత రత్నంబులను, విచిత్రాకారంబులగు సుగంధ వస్త్రాలంకారంబుల నొసంగి, విధి సంగతంబుగా విజ్ఞాన గరిష్ఠుండగు వసిష్ఠుని చేత నక్కుమారులకు నామకరణంబు లొనరించిన 264

ఆ.వె॥ జ్ఞాన శిష్టులైన మౌను లెవ్వనియందు
చిత్తమిడి రమింపజేతురౌట
తానురమణుడౌట నైనను రాముడం
చనియె గురుడు నృపతి యగ్రసుతుని 265

వ॥ మరియు నయ్యనుక్రమంబున 266

కం॥ ధరణీ భరణమున మనో
హరలక్షణకరణమునను నరిహరణమునన్
భరతుండును లక్ష్మణుడున్
ధర శత్రుఘ్నుడని గురుడు నామములిడియెన్ 267

వ॥ అంతనంతఃపురకాంతలెంతయు నుచితగతుల నబ్బాలురం బాలింపుచుండనందు గొందరు సుందరులు గౌసల్యానందనుం దొట్లనునిచి యానందబున 268

కం॥ జో జో రఘుకుల సోమా!
జో జో లోకాభిరామ! జో జో రామా!
జో జో సుగుణస్తోమా!
జో జో యని పాడిరపుడు జోలల్ బాలల్ 269

వ॥ అంత 270

సీ॥ అమృతంబు నమరసంహతికి ద్రాపిన మేటి
తల్లిచన్నుల బాలు ద్రావనేర్చె
జలరాశి వటపత్రశాయి యౌ బాలుండు
లీల బాన్పున బవళింపనేర్చె
నిజబోధచే యోగ నిద్ర జెందు విభుండు
దివిరి జోకొట్ట నిద్రింప నేర్చె

ప్రకృతికి చేష్టలు ప్రాపించు నెరదంట
యట్టిట్టు కాలుసేయార్చ నేర్చె

తే.గీ॥ బొజ్జనిండ నజాండముల్ బొరలనుండు
ప్రోడ పొత్తిటిలోపల బొరల నేర్చె
హేల నిలయత్తు దొరతలయెత్తనేర్చె
రాముడట శైశవ కళాభిరాముడగుచు 271

మ॥ గురిబ్రహ్మాదుల నాత్మ సత్పదవులన్ గూర్చుండగా బెట్టులా
వరి గూర్చుండగ జొచ్చె, వేదముల తేవన్ గూడ మాటాడు జా
లరి మాటాడగ జొచ్చె, నెల్లనడవళ్లన్ బ్రాణులం గూర్పునే
ర్పరి మెల్లన్నడవంగ జొచ్చె, విభుడా రాముండు బాల్యంబునన్ 272

కం॥ చనుబాలు ద్రావి పెరుగన్
జనుబాలుడు రాముడనుచు సమ్మతిదను నెం
చనుబాలు పడినవారిన్
జనుబాలుం ద్రావకుండ సలుపున్ బిదపన్ 273

వ॥ అయ్యవసరంబున 274

కం॥ తమ ముగ్ధాలోకనముల
తమ ముగ్ధాలాపములను తమహాసములన్
తమముగ్ధ చేష్టలను మో
దమునించిరి బాలురపుడు తమబంధులకున్ 275

కం॥ వారలు వృద్ధింజెందిరి
వారక నుచితోపచార వైభవములచే
వైరులకు భయము నిర్జర
వీరులకును నిర్భయంబు వృద్ధింజెందెన్ 276

తే.గీ॥ అందు రాముని లక్ష్మణుడాశ్రయింప
నటుల భరతుని శత్రుఘ్నుడనుసరింప
సేవ్యసేవక గతి జంటజేసిరపుడు
పాయసాంశానుసార ప్రభావములను 277

కం॥ అలరన్ బాల్య క్రీడా
లలితుండై రాముడపుడు లక్ష్మణయుతుడై

కలభాషణాది లీలల
దలిదండ్రులకున్ముదంబు దార్చెన్మరియున్ 278

సీ॥ సరిరాకమోముతో చంద్రుడచ్చట గొల్చు
రీతి ముత్తెపు రావిరేకమెరయ
అర్జునాఖ్యముల మోహరిపొత్తు గాంతుమ
న్మరణి వీనులమద్దికాయల మర
యిదిశైలతటమని యెదవసించిన తీరు
నలరారు పులిగోరు కళలు మీర
నభమున శబ్దగుణంబు గల్గుట దెల్పు
లీలఘంటల మొలనూలు మ్రోయ

తే.గీ॥ జూడ బ్రహ్మాండ భాండముల్ సూక్ష్మగతుల
నెరిగి పదపద్మముల నాశ్రయించెననగ
పసిడియందెల గజ్జలు మిసిమిదేర
రాఘవుడు బాల్య శృంగార రసమెసంగె 279

వ॥ మరియును 280

సీ॥ శ్రీకరంబుగమౌళి కాకపక్షములతో
నొసట కావిరిబొట్టు మిసిమితోడ
కనుదోయి దీర్చిన కాటుక రేఖతో
సిరిమించు చిన్న పల్వరుస తోడ
తత్కాల సదృశ సూక్తస్మితాస్యంబుతో
కరమునమణికందుకంబు తోడ
కాంచనరత్న భూషాంచిత శ్రీలతో
కటిజుట్టు కనకాంశుకంబు తోడ

తే.గీ॥ సమవయస్కులతో నాత్మ సదనవీథి
బ్రేమగ్రీడించు గుణధాముడాము గాంచి
దనరి కౌసల్య తోడుత దశరథుండు
ప్రమదముగ దేలె కన్నుల పండువుగను 281

కం॥ వినువారికి శ్రీరాముని
గనువాంఛలు బొడమి సుఖముగావింపగ త
జ్జననీజనకుల కప్పటి
జనులకతని గాంచు సుఖము శక్యమె తెలియన్ 282

వ॥ వెండియు నొక్కనాడు దశరథ మహీభుజుండు భుజియింపుచుండి పెక్కుమారులక్కుమారునింబిలిచిన రాకున్న, నాకొన్నవాడు తోడితెమ్మన్నరయమ్మునం గౌసల్య గోమున రామునిం జీర నతండు నాటలంబాటించి పరువెత్తినదానును వెంబడిన్ బరువెత్తి యోగి మానసంబులకుం బట్టరాని యాదిట్టనిన్ బట్టుకొనలేక మరలిచనిన జననిం గరుణించి నవ్వుచున్ దనంతవచ్చి పంకాంకితంబగు పాణి పంకజంబున నొక్క కబళంబు గ్రహించి మరియునుం గ్రీడింపంజను నిట్టి గురుజన బృందంబులకు నానందంబు నొందింపుచు మాయా మానుష వేషుండగునప్పరమ పురుషుండు విలాసవిశేషంబుల విహరింపుచుండ కొండొక కాలంబున వారలకు సముచిత ప్రకారం బగు కౌమారం బుదయించిన 283

కం॥ ఆకౌమారవయస్సున
నాకౌమరుల కపుడు నృపుడు హోళి నుపనయ
స్వీకరణము గావించెను
శ్రీకరముగ నవ్వసిష్ఠ చేతన్ బ్రీతిన్ 284

కం॥ వేదము శాస్త్రమును ధను
ర్వేదము నాదిగ సమస్త విద్యలు లీలా
పాదన జదివిరి ప్రజ్ఞకు
పాదనగా భువన భరణ పటువుల్ వటువుల్ 285

కం॥ ఉపనయన వేద్యుడగు విభు
డుపనయన శ్రీవహించెనురుతరవిద్యా
ధిపుడగు జగద్గురుండిటు
విపులన్ గురునొద్దనెల్ల విద్యలు నేర్చెన్ 286

వ॥ ఇట్లపూర్వంబుగా రామచంద్రుండష్టాదశకళా ప్రవీణుండై యంతట 287

మ॥ పటుబాణాసనబాణతూణధరుడై బాల్యంబునన్ రాముడొ
క్కట సౌమిత్రి భజింపనేగి మృగయాకాంక్షన్ హయారూఢుడై
యటవిం గండక పుండరీక చమరీ హర్యాది నానామృగ
చ్ఛటలం ద్రుంచిజరించివచ్చు పురి కిచ్చందండ్రి కర్పించుచున్ 288

కం॥ ఆరాముడు చతురతచే
సారంగ తురంగ తుంగ సాంగ శతాంగా
ద్యారూఢత గనినయ వి
స్తారత నడపింప నేర్చె చతురంగంబుల్ 289

సీ॥ ప్రతిదినంబును సుప్రభాతంబుగా లేచి
స్నాన సంధ్యా సురార్చనలు దీర్చి
తలిదండ్రులకును వందనము జేసి వినీతి
పౌరకార్యములు తప్పక నొనర్చి
యతిథి బాంధవ సుహృదాది సంయుతముగా
భుజియించి సంతోషమునవసించి
మునులచేత పురాణములు ధర్మ శాస్త్రముల్
మును సమర్మంబుగా వినియుజదివి

తే.గీ॥ యటతదర్థాను సంధానమాచరించి
తెలిసి పరులకు తాను బోధింపుచుండు
సహజ బోధంబు తనకునైజంబుగాగ
బాలుడయ్యును రాముండు ప్రౌఢయగుచు 290

మ॥ అకలంకాంతరు డాప్తచక్రుడు గురూద్యద్భక్తి శీలుండు బూ
ర్ణకళాత్తప్రతిపన్నిశాంతుడ నిశానందద్విభాభాసి మి
త్రకళావృద్ధి వికాసమూర్తి సహ జాత శ్రీసమావేశ తో
షకుడింపారెను రామచంద్రుడు సదాశ్చర్య ప్రభావాప్తిచేన్ 291

వ॥ ఇట్లు పరిణామదూరుండును నిర్వికారుండును నగు రఘువీరుండు కపటమనుజ శరీరుండగచు
గృహీత సకల వ్యవహారుండై వినోదింపు చుండు సమయంబున 292

- విశ్వామిత్రుడయోధ్యకు వచ్చుట -

కం॥ కౌశికుడు తపోవినమ
త్కౌశికుడు నిజప్రభార్క కరచలిత తమః
కౌశికుడు పరిమళిత గుణ
కౌశికుడు విచిత్ర సత్ర కరణమనీషన్ 293

కం॥ నారాయణుడు పరాత్ము డు
దారాముడనంగధరణి ధశరథ నృపునం
దారయ జనియించుటమది
నారసి యావిభుని జూచునభిలాషమునన్ 294

కం॥ గాధ్యాత్మజ మునిగనియె న
యోధ్యను సురనగరచయ సయూధ్యను సుజనా

రాధ్యను రవికుల నృపవర
సాధ్యను వినుత సురసిద్ధ సాధ్య నయోధ్యన్ 295

వ॥ ఇట్లుగని తనరాక దౌవారిక ముఖంబున నెరిగించిన నతిరయంబున దశరథుండు వసిష్ఠయుక్తుండై ప్రత్యుత్థానాభి వందనంబుల నక్కుశిక నందను నిజమందిరంబునకుందెచ్చి యర్ఘ్యపాద్యాది విధులం బూజించి యంజలి ఘటించి సభక్తి వినయంబుగా నిట్లనియె 296

కం॥ మౌనీంద్ర! మీరు వచ్చుట
నేను గృతార్థుండనైతి నిలయంబు సుఖ
శ్రీనిండె తపముబండెను
దానన్ నావంశమెల్ల ధన్యంబయ్యెన్ 297

కం॥ మీవంటి మహాత్ములు దయ
నేవాని గృహాంగణమున కేతెంతురు బు
ణ్యావాసవానిగృహమున
దావలముగ నెల్ల సంపదలు బ్రాపించున్ 298

కం॥ మునినాథ! మీకు నాశ్రమ
జనులకు గోవులకు సుఖమె జనునే సుకృతా
వనములుగా తావకపా
వన సవనంబులును మీనివాస వనంబుల్ 299

తే.గీ॥ అనఘ! నాభాగ్యమెల్ల నీయదియె కాదె
పూని నీకిష్టమయ్యది దానిజేతు
సత్యమింతయు మీరలిచ్చటికివచ్చు
కారణము దెల్పవే నాకు భూరి చరిత! 300

వ॥ అనిన నమ్మునీంద్రుండు నరేంద్రా! మనువంశ భూషణుండవు సత్యభాషణుండవగు నీ యనుశాసనంబును సకలంబును సుకరంబ యని మరియును 301

కం॥ ప్రతి పర్వంబున నే సుర
పితృహితముగ నిష్టిజేయ భీకరభృత్యో
ద్ధతి మారీచ సుబాహులు
దితిజులు జేతురది దుర్మతిన్ బ్రతికృతులన్ 302

వ॥ కావున తద్దనుజ శిక్షణంబు గావింప లక్ష్మణ సహితంబుగా విహితనయుండును భవదగ్రతనయుండును విజయాభి రాముండగు రామునింబనుపుము, దీన నీకు సకల శ్రేయో విశేషంబు లయ్యెడు నిక్కార్యంబు

విశిష్టంబుగా వశిష్ఠునితో విచారింపుము యిష్టంబేని యొనరింపుమనిన నత్యంత చింతాక్రాంతుండై
యమ్మహీ కాంతుం డేకాంతంబున నరుంధతీకాంతునకిట్లనియె 303

కం॥ నలుగురు తనయులు కానక
కలిగిరి బహువర్షములకు ఘనమతులు మరు
త్తులితులు వారలలో గుణ
కలితుడు రాముండు నాకు కడు గూర్మి సుమీ! 304

తే.గీ॥ ఇటుల సుప్రేముడగు రామునెటుల విడుతు
విడిచియేరీతి మరియు జీవింపగలను
ముఖ్యముగ గోరె నిదియె నిమ్మునివరుండు
నిదియు విపరీత గతి దోచె నెట్టులనిన 305

కం॥ బాలుండకృతాస్త్రుడితం
డేలాగున కలనగెలుచు నిద్దనుజుల నా
భీల బలాన్వితులను మా
యాలక్షణ యుతుల మరియు నదియుంగాకన్ 306

చం॥ వలదనియంటి మేని మునివర్యుడు పావకచర్యుడాగ్రహో
జ్వలిత శపించు సత్యము యశంబు నశించును దాన గాన ని
శ్చలముగ సత్యమున్ యశము సంపదలు న్నిలువంగ, యోగదృ
గ్బలమున నిశ్చయించి తెలుపంగదవే! యిది మౌనిపుంగవా! 307

వ॥ అనిన నన్నరశ్రేష్ఠునకు వశిష్ఠుండతి గోప్యంబగు దేవరహస్యంబు ప్రయత్నంబుగా నెరుంగించెద
వినుమని యిట్లనియె 308

ఉ॥ ఆమును భూమి భారహరణార్థముబ్రార్థితుడై విధాతచే
నామహనీయ మూర్తి పరమాత్ముడు నీసతికిన్ జనించె నీ
రాము డమానుషుండును బురాతనుడీతని చేత దానవ
స్తోమము ద్రుంపగా బడియె తొల్లిరణంబుల దారుణంబులన్ 309

వ॥ మరియునుం గాక నరేంద్రా! నీవు పూర్వంబున బ్రహ్మసుతుండవగు కశ్యప ప్రజాపతివి నీసతియగు
గౌసల్యయు నదితియను దేవతామాత యగు, మీరలిద్దరుం బెద్దగాలంబు హరిధ్యాన పూజా తత్పరులై
నియమ సమగ్రంబుగా నుగ్రంబగు తపంబొనరింప భక్తవత్సలుండగు భగవంతుడు ప్రసన్నుండై
వరంబువేడుమనిన మీరు మాకు పుత్రుండవగుమని ప్రార్థించిన నవ్విభుండు రామనామంబున
మీకు సుతుండై యవతరించె నంత 310

తే.గీ॥ ఆదిశేషుండు లక్ష్మణుండై జనించి
యనుసరించెను శ్రీరాము నఘవిరాము
పరగ హరిపాంచజన్యంబు భరతుడయ్యె
జగతి శత్రుఘ్నుడై సుదర్శనము బొడమె 311

చం॥ అల హరియోగమాయ ధరనాజనకాధిపజాత సీత నా
నలరనెసంగె రామునకు నాసతి గూర్పదలంచి వచ్చినా
డలఘుడు కౌశికుండిచటి కమ్ముని వచ్చుట మీకు భద్రముల్
గలిగెడు సంశయంబెడలి గన్గొను మాహరిగాగ రామునిన్ 312

ఆ.వె॥ ఇదియు యధికగోప్య మెవ్వారికేనియు
జెప్పవలదు ప్రీత చిత్తమునను
పూజదనుపుగాధిపుత్రుని రామ ల
క్ష్మణుల వెంట బనుపు జనవరేణ్య! 313

కం॥ అని తనగురు డెరిగించిన
విని తన్నరవరుడు జాల విస్మయపరుడై
తను కృతకృత్యునిగా నె
మ్మనమున దలపుచును ముదితమానవుడయ్యెన్ 314

వ॥ అంతనప్పంక్తిరథుండు రామలక్ష్మణుల రావించి శిరంబుమూర్కొని యక్కునంజేర్చి చెక్కునిమిరి మీరలిమ్ముని వరు వెంటంజని విజయంబు గైకొని శుభంబు గాంచి రమ్మని దీవించియర్పించిన తన్ను బూజించిన విశ్వామిత్రుండు బ్రసన్నుండై యద్ధరిత్రీశ్వరు నాశీర్వాదించి బాణ బాణాసనతూణీర కృపాణధారులగు నారాజ కుమారులందోడ్కొని కొంతదూరంబున సరయూ తీరంబున విధ్యుక్తంబుగా మాధ్యాహ్నిక కృత్యంబు నిర్వర్తించి యనంతరంబున 315

శా॥ ఏ విద్యాభ్యసనంబుచే గలుగదీ తృష్ణాక్షుధాదిశ్రమం
బేవిద్యాద్వయమున్ బలాతి బలులై యేపారువిఖ్యాతిచే
నే విద్యల్ మరిదేవ నిర్మితములై యెన్నందగున్ భక్తిచే
నావిద్యల్ దగనిచ్చె రామునకు దా నక్కౌశికుండాదృతిన్ 316

వ॥ అంతనమ్మునీశ్వరుండక్కుమార సహితంబుగా నచ్చటన్ గదలిచను నెడ 317

ఉ॥ గంగను వాంఛితంబు లెసగంగను కల్మష దుర్విషంబు ద్రుం
గంగను జన్మకోటి దలగంగను పుణ్యము లెల్ల తీగె సా

గంగను సంతత త్రిదివగంగను వేడ్కను సమ్మదోర్మి బొం
గంగను గాంచె భక్తి సెలగంగను దన్ముని పుంగవుండొగిన్ 318

వ॥ ఇట్లుగాంచి మరియు నయ్యమర తరంగిణి నిజాంతరంగ క్రీడారంగ త్సురాంగనా వక్షోజాత కురంగమద మేచకరుచి చాకచక్యంబు నందటామంద మందారాది బృందారక తరుసందోహ సుమబృంద నిష్యంద మరందరస పిశంగ ప్రభాసంగతిం బతంగ సుతాసరస్వతీ భావిసంగమ ప్రసంగంబు నెరుంగం జేయు మార్గంబున స్వర్గంబునం బ్రవహింపుచు స్వర్గనిర్గతంబై భర్గ జటాభర్గంబునం దదీయ పరస్పర సంసర్గ వ్యగ్ర భావ విరళ కరణారోపిత స్నేహ మోహంబునూహింపం జేయుచు, నీళగళమస్తక స్థలగళితంబై నీహార మహీ భృద్వర శిరః కలితంబగుచు నుపకంఠసక్త ముక్తాసరంబుననుసరింపుచు, హిమగిరిచ్యుతంబై చిరతపః ప్రాప్త నిజకార్య సత్వర మనోరథ భగీరథ రథానుకృతిం దదగ్ర శీఘ్రగతి పతన నిగ్రహసజ్జీకృత శ్వేతరజ్జు ఘటనాకృతిననుకరింపుచు మహాప్రవాహంబుల మహీతలంబు గలంక హరింపనలంకరింపుచు సగరసుత సుగతి పథాయమాన సోపాన సమాన యగుచుం బ్రకాసించునని బ్రశంసించి కౌల్యకరణీ యంబు లొనరించి యమ్మహానది నుత్తరించుతరి నత్తాపసోత్తముండు సత్యపరాక్రముండగు రామునకిట్లనియె 319

- తాటక వధ -

కం॥ తాటకయను నొకయక్ష వ
ధూటిక కుంభజుని శాప దోషంబున దో
షాటకయై యాఘోర మ
హాటవి జరియించు నతిభయంకర లీలన్ 320

కం॥ ఆ రాక్షసి లోకతతిన్
దారుణగతి కామరూపధారిణి యగుచుం
గారించు నారి యనుచు వి
చారింపక త్రుంపు మనిన సమ్మతితోడన్ 321

కం॥ రాఘవు డప్పుడు చాప
జ్యాఘోష మొనర్పదన్మహా నిర్ఘోషం
బాఘన నిర్ఘాత శత
ద్రాఘీయ స్ఫూర్తి నిండె తద్వనమెల్లన్ 322

శా॥ ఆరావంబటులాదిశా విదళనంబై కర్ణరంధ్రచ్ఛిదా
ప్రారంభం బొనరింప తాటక సహింపన్ రాక నెవ్వాడొ మ
ద్ఘోరారణ్యము జొచ్చియోడక ధనుర్ఘోషంబు గావించెడిన్
జేరన్ లేరు సురాదులేని యిటకుం జింతింపనంచున్ వడిన్ 323

మ॥ వికట భ్రూకుటి దుర్నిరీక్ష్యగుచున్ వేండ్రంబుగా దంత ప
జ్తిక దీండ్రింపుచు గోప నిప్పులురులన్ నేత్రంబులన్ హుంక్రియా
వికృతోగ్రాస్యము విచ్చివచ్చునెడలన్ వీక్షించి తద్రాక్షసిన్
బ్రకటస్థేముడు రాముడిట్లనియె చిత్ర స్ఫూర్తి సౌమిత్రితోన్ 324

శా॥ దీనింజూడు మతిప్రమాణతను వృద్ధిం జేసి మేఘోన్నతిన్
గానందోచుచు ఘోరరూపయగుచున్ గాఢోగ్రమాయాబలా
ధీనప్రక్రియ వచ్చుచున్నది సముద్దీపించి యిద్దానవిం
గానం ఖండితకర్ణనాసికనుగా గావించెదన్ ద్రుంచెదన్ 325

వ॥ అనునత్తరిం దత్తాటకయు క్రోధమూర్ఛిత చిత్తయై ధరాపరాగం బెగయింపుచు రాఘవులందద్రజో మేఘంబులం గప్పి ముహూర్త మాత్రంబు మోహింపంజేసి మాయా సృష్టి శిలా వృష్టిం కురిసి నవ్వీరుండు గోపించి యుత్కర్షంబున వానినన్నింటిని నివారించి వాడినారసంబులు దానిమేనం గీలించిన నిలువరించక సరభసంబునం బరువెత్తు నత్తాటక కరంబులు శరంబులంద్రుంచె నంత 326

కం॥ హత భుజయై యతిగర్వో
ద్ధతి మరియున్ బరచివచ్చు దానిందోనన్
హృత కర్ణనాసికనుగా
నతిధృతి లక్ష్మణుడొనర్చె నద్భుత లీలన్ 327

వ॥ వెండియు నయ్యక్షిణి యాక్షణంబున నంబరంబున కెగసి యంతర్ధానయై మాయాధ్వాంతంబు గల్పించి యనేక భీకర రూపంబులం భ్రమించి శిలావర్షంబునముంచినంజలించక నవ్వీరులుసాయకంబుల నమ్మాయ మాయించి కులిశపాత సంకాశంబుగా గుణటంకారంబు సేసిన నాశబ్దంబు చేతన్ గ్రోధమోహితయై మహారభసంబున రామలక్ష్మణులపై నశనిబోలెన్ గవిసినన్‌కుశికసుతుండు సంధ్యాసమయంబయ్యె నీరక్కసి నుక్కణగింపుమనిన యపుడ 328

మ॥ రఘువీరుండొక యమ్ములవ్రేసితదురోగ్రావంబు భేదించి దో
ర్లఘిమంగీటణగించె పాపభట జాగ్రచ్చిత్త శృంగాటకన్
మఘవోచ్ఛాటక మౌనిజంతు పటలీ మాయాకృతా ఖేటకన్
ద్యుఘనధ్వాన సదృక్ష రూక్షతర రావోద్ఘాటకన్ దాటకన్ 329

కం॥ శస్త్ర ధరవరుడు రఘువరు
డస్త్రంబున నొకట తాటకాఖ్య దునిమిదా
స్వస్త్రీయుతుడగు సుందుని
స్వస్త్రీయుతునిగనొనర్చె సముచిత మనగన్ 330

వ॥ ఇట్లురుధిరంబు దొరుగ మడిసిపడిన యత్తాటక తనువువలన వెడలి తొల్లి శాపంబునం బ్రాపించు పిశాచరూపంబునం బాసి రామప్రసాదంబున సుందరాంగియును సర్వాభరణభూషితయునగు నొక్క యక్షిణి యక్షిగోచరయై రామునకు ప్రదక్షిణ నమస్కారంబులు గావించి సన్నుతించి తదాజ్ఞం గాంచి స్వర్గంబునకుం జనియె నంత నక్కౌశికుండు తనకు మ్రొక్కిన రామచంద్రుంబరమానందంబున గౌగిలించి దీవించి విమర్శించి మరియును 331

కం॥ రామునకునధిక తేజో
ధామునకు రహస్యమంత్ర తతితో గూడన్
నేమంబున సర్వాస్త్ర
స్తోమంబు నొసంగి గాధి సూనుడు ప్రేమన్ 332

తే.గీ॥ అంతనారాత్రి మునిజనాత్యంత మైత్రి
వెలయు కామాశ్రమంబున విశ్రమించి
క్రమము తోడుత వామనాశ్రమము జేరి
యవలినాడు ప్రభాత కృత్యములు దీర్చి 333

వ॥ అంతనవ్విశ్వామిత్రుండు రాజపుత్ర సహితుండై జనిచని వనజభవ సభాభవనంబునుం బోలె నారద గాలవ కౌండిన్యశాండిల్య ప్రముఖ ముని మండల మండితంబును, రాజసైన్యంబునుం బోలె సముద్దండ పుండరీక ఖడ్గాచ్ఛభల్లసారంగ హరిప్రభృతి మహాసత్వ సంపన్నం బును, నమరావతియునుం బోలె సర్వ సుపర్వోత్సవలక్షితంబును, మేరునగంబునుం బోలె సముద్ధృతధ్రువాది పాత్ర స్థంబును, కమలాకరంబునుం బోలె పరమహంస సంసత్సంకులంబును, నంబరమార్గంబునుంబోలె సిద్ధచారణాది విహారయోగ్యంబునై, ప్రసిద్ధంబగు సిద్ధాశ్రమంబు జేరి యందు 334

కం॥ మునిగణము లడుగ నారా
మునిగుణములు దెలిపెకుశిక ముఖ్యుడు వారల్
దను వారింబూజించగ
దనివారంబహువిధముల తత్పరలీలన్ 335

తే.గీ॥ అంత మరునాటి వేకువ నాహ్నికములు
క్రమతనొనరించి మునుల సంగతి వసించి
హుత హుతాశనుడగు గాధి సుతుని గాంచి
యంజలి ఘటించి రాముడిట్లనియె బ్రీతి 336

కం॥ దీక్షం గైకొను మునివర!
రక్షించెద నీమఖంబు రక్షోధములన్

శిక్షించెద జూపుమునను
వీక్షింపుమటన్న నధిక విశ్వాసమునన్ 337

కం॥ అపుడు మహాహవ దీక్షా
నిపుణుండై గాధి సుతుడు నిలిచినయచ్చో
నపుడు మహావహదీక్షా
నిపుణుండై రామవిభుడు నిలిచెన్ బెలుచన్ 338

శా॥ ఆరీతిం గుశికాత్మజుండు మునిలోకాన్వీతుడై యజ్ఞ కృ
త్యారంభంబొనరింపుచుండగని మధ్యాహ్నంబు నందుద్ధతిన్
మారీచుండు సుబాహుడున్ రుధిరమున్ మాంసంబు వర్షింపుచున్
జేరన్ వచ్చి భటాళితో సవనముం జీకాకుగా జేయగన్ 339

మ॥ అలుకం గాంచి రఘూద్వహుండపుడు బ్రత్యాలీఢ పాదంబునన్
విలుకోపెక్కెడి దిక్కుడుంగములు కుంఠీభూతముల్‌గా దృఢా
కలనన్ బాణయుగంబు గూర్చిగుణమాకర్ణాంతమున్ గావడిన్
బలుచిత్రంబుగ నేసి రాక్షస యుగ ప్రత్యేక లక్ష్యంబుగన్ 340

వ॥ ఇట్లు రాఘవుండు కరలాఘవంబున శరయుగళంబు యసుర యుగళంబుపయింబరగించిన మారీచుండను రజనీచరు శత యోజన దూరంబు పరిభ్రమింపంజేసి జలరాశిం బడవైచిన నది మహాశ్చర్యం బైయుండె వెండియు నొక్క కాండంబు ప్రళయానల ప్రచండంబై సుబాహుండను రాక్షసుందహించి యాక్షణంబ యమక్షయంబున కనిపెనంత వారి మీద సురలు విరులవానలు గురియించిరి భేరులు మొరయించిరి సిద్ధచార ణాదులు నుతించిరి క్రమంబున సమాప్తసత్రుండగు విశ్వామిత్రుండు రఘు సత్తముందన తొడలపై నిడుకొని యానంద బాష్పంబులందడపి కౌగిలించి పూజించి యనుజ సహితంబుగా పక్వఫలాదికంబుల భోజనంబు గావించి మధుర సుధాసిక్తంబులగు పురాణ సూక్తంబుల దివసత్రయంబు గడిపి చతుర్థ వాసరంబున నాకౌశికుండు దాశరథికిట్లనియె 341

ఉ॥ రామవిదేహదేశ నగరంబున నాజనకుండు యోగవి
ద్యామహితుండొనర్చెడి మహాధ్వరముంగనివత్తమీశ్వరుం
డామహిపాలునింట మును పాత్మశరాసము నిల్పియుండె ను
ద్దామత జూడ గల్గునది తన్నృపుడున్ మిము బూజజేసెడిన్ 342

కం॥ అని పలుకుచు ముని తతులన్
జనపాలక సుతులు తోవ చనుదేరంగా
జనిగంగాతట నికటం
బున గౌతము నాశ్రమంబు పొడగననదియున్ 343

- అహల్యా వృత్తాంతము -

శా॥ నానాదివ్య ఫలప్రసూనమును నానాపక్షి సంతానమై
నానాపక్షి మృగాది హీనముగ గానందోప చిత్రంబుగా
దానింగన్గొనిరాముడిట్లను మునీంద్రా! యేలనిట్లయ్యె నీ
స్థానం బెవ్వరియాశ్రమంబు వినగా తత్త్వస్థితిం దెల్పవే! 344

సీ॥ అనినవిశ్వామిత్రుడనియె నిందొక పురా
వృత్తంబు చిత్రంబు వినుము రామ!
సర్వధర్మజ్ఞుండు జననుతప్రజ్ఞుండు
గౌతముండనగ సుధీతముండు
హరినితపోనిష్ఠ నారాధనము చేసి
బ్రహ్మచర్య వ్రత ప్రతిభ తోడ
బ్రహ్మర్షి వర్యుండు బహుకాలము వసింప
బ్రహ్మ సన్నిహితుడై ప్రమదమెసగ

తే.గీ॥ అధిక సౌందర్య సౌశీల్య నయ్యహల్య
సురవధూతుల్య నొసగ నాశోభనాంగి
ప్రీతి శుశ్రూషసేయ న గ్గౌతముండు
మునివరుండుండు నీ తపోవనమునందు 345

వ॥ అయ్యవసరంబున 346

మ॥ ఒకనాడింద్రుడహల్య గాంచిమది కామోత్కర్షమోహించి పా
యకతత్సంగమవాంఛతో నెపుడు రంధ్రాన్వేషియై యుండగా
నొకటన్ గౌతముడిల్లు బాసి చనుచోనూహించెదన్మోని వే
ష కృతిం గాంచి రమించె తద్రమణితో జారక్రియారూఢుడై 347

వ॥ అప్పుడయ్యంగన నతనినెరింగియుం గామసంగతి నూరకుండినం దనయిష్టంబు దీర్చుకొని యంత నమరకాంతుండు సత్వరంబున నయ్యాశ్రమంబు వెడలివచ్చుచుండ గౌతముండును నెదురు వచ్చి తన రూపంబున వచ్చు నతనింగాంచి కోపంబు దీపింప నిట్లనియె 348

కం॥ ఓరీ! నారూపము నీ
వీరీతి ధరించినాడ వెవ్వరవు దురా
చారా! నిజముగ జెప్పుము
వేరనినన్ నిన్ను భస్మ విధమొనరింతున్ 349

చ॥ అనినభయంబున్ సవినయంబున మేనువడంక నమ్రుడై
యనిమిషనాథుడిట్లనియె నమ్మునితోడ బురందరుండ నే
నని యతికామ కింకరుడనైతి జుగుప్సిత కర్మమాచరిం
చిన కలుషాత్మకుండ ఖిలచేష్టుడ దుష్టుడ నన్ను బ్రోవవే! 350

వ॥ అను నాక్షణంబ గ్రోధతామ్రాక్షుండై గౌతముండు దెంపున నిలింపపతింగని నీవు యోనిలం
పటుండవగుట సహస్రయోనివి గమ్మని శపియించెనగుటం గావున 351

కం॥ పరలోకమణచు బుణ్యము
హరియించు నఘంబు బెంచునఖిల వినింద్యం
బురునరక మల్ప సుఖమై
పరసతి సంగంబు ప్రాణ భంగము దెచ్చున్ 352

వ॥ అనియిట్లు గౌతముండ వ్వాసవుననుశాసించి నిజాశ్రమంబు బ్రవేశించి కృత దౌశ్శీల్యయగునయ్యహల్యం
గాంచి నీవు దుర్వృత్తవై ఖలాచారంబు బాటించుట శిలాకారంబున నుండుమని శాపం బొసంగి
మదీయాశ్రమంబు విలాస భాసమానంబయ్యును సకలజంతు విహీనంబయ్యెడు ననిపలికిన యులికి
పడి యహల్యయుం జలించి కృతాంజలియై ప్రార్థించిన 353

సీ॥ అంతగౌతముడు శాపాంతంబు వచియింప
దలచి శాంతించి తత్తన్వితోడ
కాంతనీవిటు శిలాకారవయ్యును నిరా
హారవై మరియు నహర్నిశంబు
నాతప వాత వర్షాదులు సహియించి
పరమంబగుతపంబు నెరపుచుండి
ఏకాగ్రమతి బరమేశ్వరు రాముని
ధ్యానింపుచుండుమీ యాశ్రమమున

తే.గీ॥ నాగతిననేక వర్ష సహస్ర కాల
మరుగ నరుగతి రాముడై యవతరించి
దశరథునియింట మరి సహోదరునితోడ
దేవ దేవుండు నిచటికేతేర గలడు 354

వ॥ అట్లు వచ్చి మదీయాశ్రమంబు జొచ్చి నీమీద పదవిన్యాసంబు సేసిన శిలారూపంబగు శాపంబునుం
బాసి రామునింగనుంగొని పూతవై పూర్వవిధంబున మదీయ శుశ్రూషం జేసి సుఖంబుండగలవని
సెప్పి యప్పుడగ్గౌ తముండు హిమవంతంబునకుంజనియెనయ్యహల్యయు నియ్యాశ్రమంబున

భూతాదృశ్యయై యిప్పుడుందపంబొనర్పుచు పాపకర్శంబగు భవదీయ పాదస్పర్శనంబు కాంక్షింపుచున్న యది ముని పత్నియుబ్రహ్మపుత్రియు నగునిత్తపస్వినిం బాలింపుమని కుశికవరుండు రఘువరుకరంబు తనకరంబున నవలంబించి యమ్మహోపలంబుజూపిన నవ్విభుండుపాద స్పర్శంబు జేసిన 355

కం॥ పాషాణము దోషాహృతి
యోషాకృతితోడ వెలసెనుదధి వెడలున
ద్దోషాధిపరేఖయన్
భూషాయతి సుందరాంగ భూతి సెలంగన్ 356

తే.గీ॥ ప్రకృతి మహదాది వికృతిగా బరపుకర్త
వికృతియగు గౌతమునిభార్య బ్రకృతి జేసె
నాతడఘటన ఘటకుడన్ రీతి నట్టి
చిత్రసృష్టికి మునులెల్ల చిత్రపడిరి 357

తే.గీ॥ అపుడురాముని మునివరుల్ హరియటంచు
భక్తిజేసిరి సుకృత సాఫల్యయైన
యయ్యహల్యకు నారాముడాత్మ నామ
సూక్తి జేయుచుమ్రొక్కె విధ్యుక్తినంత 358

మ॥ కనియెన్ భక్తినహల్య నీలమణి సంకాశుం కృపావేశు కాం
చనవాసున్ మృదుమందహాసు విలసచ్చారిత్రునిన్ పద్మనే
త్రుని శ్రీవత్స శుభాంకవక్షుని ధనుస్తూణీశరాలక్ష్యున
య్యనుజాన్వీతు రఘు ప్రభూతు గుణకల్పా రామునిన్ రామునిన్ 359

వ॥ ఇట్లు దశదిశా ప్రభాసమాన విభాభిరాముండగు రామునింగాంచి గౌతమభాషితంబు దలంచి నారాయణునిగా నిశ్చయించి విధివి హితంబుగా నర్ఘ్యాదులంబూజించి దండప్రణామంబాచరించి యహల్య హర్షజలాలంకృత నేత్రయుం బులకాంకితగాత్రయునై యప్రమత్త గతింగద్గద వాక్యంబులనిట్లని స్తుతియించె 360

మత్త॥ ఏపరాగము భారతీశ గిరీశ ముఖ్యమహాత్మకుల్
నీపయిన్ దమమానసంబులు నిల్పియుం గనరట్టియీ
నీపదాగ్ర పరాగమద్దిర నేస్పృశించితరించి నీ
ప్రాపుగంటి జగన్నివాస! కృపావిలాస! రమాపతీ!! 361

శా॥ ఆనందుండవు సర్వపూర్ణుడవు మాయాభర్తవున్ బ్రహ్మమౌ

యీనీకీచలనాది కర్మములు లేవే వేళనట్లయ్యు నీ
మానుష్యస్థితి మోహపుచ్చెదవు సుమ్మా సర్వచేష్టాది స
న్మాన ప్రక్రియ దోచె చిత్రముగ రామా! ముక్తి ధామా! హరీ! 362

ఉ॥ ఏవిభుపాద పంకజ పరీతపరాగ పవిత్రమూర్తియౌ
దేవతరంగిణీమణి విధిప్రముఖామర కోటి పావన
శ్రీవెలయించె నేడిటుల దృగ్విషయంబుగ దోచియట్టియా
శ్రీవరుడే గనంబడియె చెప్పవశంబెమదీయ భాగ్యముల్ 363

పం॥ హరిన్ నరావతారునిన్ దయావిహారునిన్ ధను
ర్ధరుం బరున్ మరుద్విధేయు రామనామధేయునిన్
సరోజ నేత్రురమ్యగాత్రు సమ్మతిం భజింతుని
న్నరుంబరున్ భజింపనొల్ల నామదిన్ రఘూత్తమా! 364

ఉ॥ ఎవ్వని పాదపద్మరజమెప్పుడు వేద శిరోవిమృగ్యమౌ
నెవ్వనినాభి పద్మభవుడెంతయు లోకవిధాత ధాతయౌ
నెవ్వని నామసార జపకృత్యకళారసికుండు శంకరుం
డవ్విభు రామమూర్తి హృదయంబున భావన జేతు నిత్యమున్ 365

తే.గీ॥ బ్రహ్మలోకంబునను భవపద్మభవులు
హర్ష భాష్పావృత కుచాగ్రయైన వాణి
నారదాదులు యేయవతార కథలు
గానమొనరింతు రట్టి నిన్నే నుతింతు 366

భుజంగ॥ పరాత్మా! స్వయం జ్యోతిభావైకదూరా!
పురాణా! యనాద్యంత పూర్ణ ప్రచారా!
చరన్మాయికాలోక సమ్మోహ కారా!
పరానుగ్రహా! పారిభవ్యావతారా! 367

చం॥ అరయగ నిట్టి నీవు భువనావన లీల జరింతువేకముం
బురుషుడవున్ స్వతంత్రుడవు బూర్ణుడవయ్యును విశ్వజన్మసం
భరణ లయ ప్రవృత్తి నిజమాయనెసంగు గుణానుభావసం
స్ఫురణ విరించి విష్ణుహరమూర్తుల వర్తిలుచుందు వీశ్వరా! 368

ఉ॥ ఏపదమిందిరాసతి వహించెనెదన్ భజియించి ప్రేమచే

నేపున నాక్రమింపబడె నెట్టి పదంబున నీజగ త్రయం
బేపదమున్ విరక్తులు మునీశ్వరులాత్మదలంతురట్టి యీ
నీపద పంకజమ్మునకు నేనిదె మ్రొక్కెద రామరాఘవా! 369

వ॥ దేవా! నీవు జగదధి భూతంబును జగదాశ్రయంబును జగదాత్మకుం డయ్యును సర్వాంతర్యామివై యేకస్వరూపంబునం బ్రకాశించు పరుండవు వాచ్యవాచకంబులగు రూపనామభేదంబులం జగన్మయుండ వయ్యును వాగగోచరుండవగు ప్రణవాత్మకుండవు వెండియు నొక్కండవయ్యును బహురూపయగు మాయచేతం గార్యకారణ కర్తృత్వాది ఫలసాధన భేదంబుల భిన్నుండవయ్యుండుదువాకాశంబు సర్వ వ్యాపకంబయ్యును నన్నింటి నంటనిపగిది బాహ్యాభంతరగతుండ వయ్యు నసంగుండవు నమలుండ వగుట నిత్య శుద్ధ బుద్ధాద్వయ స్వభావంబగు సత్తామాత్రంబ వగుదువని మరియును 370

కం॥ నీ మాయామోహితులై
బ్రామిక మాయా విదూరుపరమేశ్వరు నో
రామ! నిను నెరుగరెవ్వరు
నీమనుజాకృతివటంచు నెంతురు బుద్ధిన్ 371

పాదప వృత్తము :

కావున నేనిదె కాంతను మూఢన్
నీవిధమెన్నగ నేర్తునె యజ్ఞా
నావృత నెంతయునట్లగుటన్ నే
భావన మ్రొక్కెద బల్మరురామా! 372

లయగ్రాహి :

శ్రీదములు నూపురితవేదములు పాపతతి
భేదములు తాపసవినోదములు తాప
చ్ఛేదములు సాధుకృతవాదములు సన్నిహిత
మోదములు సందళిత ఖేదములు పుణ్యా
స్వాదములు సద్వనపయోదములు మామక భ
యాదములు నీదుమృదు పాదములు భక్తా
హ్లాదములు జూపుచు ప్రసాదములు నామదిన
పాదుకొనజేయుము రమాదయిత రామా! 373

కం॥ నేనిందుండిన నాకున్
మానక నీపాద భక్తి మన్నింపగదే!
శ్రీనారాయణ! భక్తా

ధీన! హృషీకేశ! నినునుతించెద రామా! 374

మాలిని :భరిత భవవినాశున్ భానుకోటి ప్రకాశున్
కరధృత శరచాపున్ కాలమేఘస్వరూపున్
గురుకనకసువాసున్ కుండల శ్రీ విలాసున్
శరజనయను నిన్నున్ సానుజుం గొల్తురామా! 375

వ॥ అనియిట్లు సన్నుతించిన తన సన్నిధిం బ్రసన్నుండునుం బురుషోత్తముండునునగు రఘుసత్తము బ్రశంసించి నమస్కరించి యహల్యయు నతనియనుమతిగాంచి తనపతియగు గౌతముండున్న హిమవన్నగం బునకుంజనియె నివ్విధంబుగ 376

సీ॥ ఇది యహల్యాకృతం బీస్తోత్ర మెవ్వరు
పఠియించినను ధూత పాపులగుచు
పరమపదంబున బ్రాపింతురతి భక్తి
కోరిపుత్రార్థులౌ వారు మదిని
రాముని నిల్పి వర్షము పఠించిన దీన
వంధ్యయైనను పుత్రవతియెయగును
నేకోరికలునైను చేకూరునీరీతి
సలిపిన రామప్రసాదమునను

తే.గీ॥ మరియు పంచమహాపాపమతియునైన
నట పితృ భ్రాతృ హింసకుండైన దీని
భక్తి నిత్యము పఠియింప ముక్తుడౌను
చెప్పనేల సదాచార శీలులకును 377

వ॥ అంతనట్లు సమాచరిత జగదాశ్చర్యచర్యుండగు రఘు వర్యుంజూచి కుశికవరుండిట్లనియె 378

– విశ్వామిత్రుడు రామలక్ష్మణులను మిథిలాపురమునకు తోడ్కొని వెళ్లుట –

కం॥ రామ! వినుమింక జనకుం
డామిథిలా పురినొనర్చు నధ్వర వరమున్
బ్రేమ సెలంగ గనుంగొని
యామీద నయోధ్య సేరనగు గాకనుచున్ 379

వ॥ అదియునుంగాక తజ్జనకుండును ధరాతల సంజాతయునుసకల గుణ సమేతయునగు సీతయను దన కూతురుకు భూతపతి చాపగుణారోపణంబు పణంబుగా జేసినవాడదియునుంగనుంగొంద మని

గాధినందనుండు సాభిప్రాయంబుగానపొంగ సూచిత ప్రేముండగు రామునకిట్లనియె 380

కం॥ రామమునీంద్రుల మగుటన్
గామిత విజ్ఞాన దృష్టిగనియున్ వినియున్
భూమీసుత గుణములలో
నేమునుమును కొంత కొంత యెరుగుదుము సుమీ! 381

కం॥ చిల్లక్ష్మి గాన జానకి
పల్లవములచే సరాగ భావముగని కిం
చిల్లక్ష్మి గాంచిమించెడి
పల్లవములకున్ విరాగ భావము గూర్చున్ 382

కం॥ చిత్సాయకములు శరథులు
సత్సంపద్దర్పణములు జంఘలు జానుల్
తత్సారమోదకదళిక
లుత్సాహముమీర నూరులుర్వీసుతకున్ 383

చం॥ వసుమతియాకటీతటము వాతెర దానమృతంబయౌవిభా
వసువగు దేహయష్టి మరివాసిగ నాశుగమౌ కటాక్షమా
కసమగుమధ్య సీమయిటుగావున తత్ప్రకృతి స్వభావ లౌ
రసికత పంచభూతములు రామకునంగములయ్యెగా బలెన్ 384

కం॥ ననులేదందురు కొందరు
జననీ నీగర్భ నికట సంగతి నునుపన్
గననగు ననంతరమనని
జనిమాయయె నిలిచెననగ సతికౌనలరున్ 385

కం॥ ఆకాశకుసుమమనియెడి
వాకువృథాగాకయుండ వనితకుదగునౌ
నాకౌనునాభి యవ్విరి
బ్రాకినయళులనగ రోమరాజిదనర్చున్ 386

కం॥ జానకి వలుద కుచంబులు
నానందపరాత్మ వనమహాలికుచంబుల్
జ్ఞానస్తబకరుచంబులు

భానవసుధనిండుగుండు బంగరు చెంబుల్ 387

ఆ.వె॥ సరస బిస విలాస సరసిజ సత్కళా
కరము లౌర బాహు కరము లెన్న
వల్లకీ వినోద వరనాద శంఖసో
త్కంఠమౌరతరుణి కంఠ సరణి 388

కం॥ శ్రవణ శ్రీలంగనుగొని
సవరణ సతినయనయుగము సారసమనన
ప్రవణ శ్రీలంగాంచెను
నవగతి నధికారలక్షణంబదిగాదే! 389

కం॥ రదములు ముక్తా కృతి గన
రదనచ్ఛ దమమృత భావరసికతగనగా
వదనం బమృత కరస్థిత
వదలక పూర్ణదశ నెసగె వసుధాసుతకున్ 390

తే.గీ॥ సీత వైరాగ్య వన్మోని సేవ్యగాన
నాస కనక తిరస్కార నయము గాంచె
తనురమ వధూతిరస్కారతను వహించె
నౌర సంబంధ గుణములట్లుగునె కావె! 391

కం॥ వజ్రమణుల్ నఖర కళల్
వజ్రి మణుల్ చికుర కళలు వశమగునే య
వ్వజ్రికినేని న్వనితా
వజ్ర మణికి నఖ శిఖాళి వర్ణన సేయన్ 392

మ॥ తనుమధ్యామణికిన్ బిరుందు రశనాధారంబధిష్ఠాన మొ
య్యన గౌనమ్మణిపూరితాకరవరం బౌనాభిచందోయి మే
లనిశ స్ఫూర్తి యనాహతంబగు విశుద్ధాబ్జంబు కంఠంబు జ
య్యన పద్మద్విదళంబు కన్గవ సహస్రారాబ్జమౌమోమిలన్ 393

కం॥ ఈయందంబున వెలసిన
నీయిందుముఖీలలామ కెంతయుసరిగా
నీయోగమాయనేనియు

నాయెడనీయోగమాయ యనయగురామా! 394

వ॥ అని ప్రసంగవంశంబున నెరింగింపుచున్ జనిచని 395

కం॥ అరుగంగ మార్గమున నం
దరు గంగన్ దాటి గమన ధాటి న్మిథిలా
పురనికట వాటి నొకముని
వరవాటి న్విశ్రమించి వసియింపంగన్ 396

వ॥ అంతనజ్జనకుండు గౌశికాగమనంబు విని ముదితమనంబున నుపాధ్యాయ సహితంబుగా వచ్చిదండప్రణామం బొనర్చి విధి విహితంబుగా మునులతో నతనింబూజించి సంతుష్టం గావించి సమంచితాభిరామలక్షణులగు రామలక్ష్మణులంగాంచి హర్షాశ్చర్యం బులతో నిట్లనియె 397

శా॥ వీరెవ్వారలు రాకుమారులు మహావీరుల్ జగన్మోహనా
కారుల్ సూర్యశశి ప్రచారులు దిశాగ్రద్యోత మానప్రభా
సారుల్ సాధుగుణప్రసారులు సమంచద్బాణతూణీధను
ర్ధారుల్ దేవసుత ప్రకారులు మునీంద్రా నాకెరుంగింపవే! 398

కం॥ ధరనీ నరపుంగవులే
నరవరు సుతవరులొ కనమనః ప్రియకరులై
సురపారాయణులగున
న్నరనారాయణుల కరణి నాకుందోచెన్ 399

కం॥ అనవినియమ్ముని యీగుణ
ధనులు నయోధ్యాధిపతికి దశరథునకు నం
దను లిందగ్రజుడీతం
డని రాముని జూపి ప్రేమనతనికి ననియెన్ 400

సీ॥ అసుర సంహారార్థ మర్థింపనావెంట
గురునాజ్ఞ ననుజుని గూడివచ్చె
నామాట దాటక భీమాటవి నిశాట
దాటక నొకపాటగీటడంచె
నేచిసుబాహుమారీచులనీచుల
మడియించి సుడియించి మఖముగాచె

గౌతమ శాపసాకల్య నహల్యను
చేతనగా రాతి నాతి జేసె

తే.గీ॥ నిపుడు నీయధ్వరము జూడ నిటకు వచ్చె
రాముడు సమస్త సుగుణాభి రాముడితడు
సాదరుండీ మహాత్ముని సోదరుండు
మహితలక్షణుడైన లక్ష్మణుడితండు 401

- శివధనుర్భంగము -

ఉ॥ ఇప్పుడు నీగృహంబున మహేశశరాసము జూడగోరెడిం
దప్పక సర్వరాజవిదితంబు తదీయ చరిత్రమంచుమున్
జెప్పగ విన్నవాడితడు శీఘ్రమెచాపము దేగబంపు బెం
పొప్పగ దానిగన్గొని యయోధ్యకు తండ్రిని జూడబోయెడిన్ 402

వ॥ అని జెప్పిన జనకుండు దద్రాజతనూజులం బూజార్హులనియర్హ విధింబూజించి మతిమంతుడగు మంత్రినింబిలిచి రయంబునం బినాకపాణి చాపంబు రామునకుంజూపుమనిన నాసచివుండునుం దానిం దెచ్చుటకుననేక భటులంబంచె నంత నమ్మిథిలాధీశుండు గాధేయునితో తొల్లియు నిచ్చాపంబు జూపిన నిఖిల భూపాల కుమారులు దీనింజలింపజేయనేరక నూరక జనిరని పలికి వెండియు తద్రఘువీరు నుద్దేశించి యిట్లనియె 403

కం॥ ఈతడు చేతన్ బాతిగ
నేతద్ధను వెక్కుబెట్టె నేనియు బ్రీతిన్
నాతనయన్ భూ తనయన్
జాతనయన్ బెండ్లి సేతు సత్యంబనియెన్ 404

ఉ॥ ఆయెడ భారవాహులు బలాఢ్యులు పంచసహస్ర సంఖ్యగా
నాయత ఘంటికాశత సమావృతమై మణివస్త్రభూషితం
బై యనిశార్చితంబగు పురారిశరాసము దెచ్చిరప్పుడ
త్యాయతి జూపి మంత్రివరుడద్దను వా రఘువీరమౌళికిన్ 405

వ॥ ఇట్లు జూపినంజూచి ప్రహృష్ట చిత్తంబున రఘుసత్తముండు దృఢా యత్తపరికరుండై యత్తరి వామహస్తంబున లీలామాత్రంబుగా నెత్తి తచ్చాపంబున గుణారోపం బుసేసి సకలరాజలోకంబు నిరీక్షింప దక్షిణకరంబున నీషదాకర్షణంబు గావించిన 406

కం॥ దిశలల్లాడ విదిక్కులు
భృశగతి వీడం ద్రిలోకభీకర రేఖా

వశతన్ లోకము నిండన్
బశుపతి కార్ముముకము తీవ్రభంగిన్ విరిగెన్ 407

మ॥ ఘనతన్ జానకి యాత్మతుల్యపతి యోగప్రాప్తికై హర్షిలన్
జనకుండున్ దనదుష్కరంబగు ప్రతిజ్ఞా లబ్ధికై ప్రీతికై
కొనజూపెన్ రఘుభర్త హేమమహిభృత్కోదండ కోదండఖం
డనపాండిత్య పటిష్ఠనిష్ఠుర భుజాడంబంబు శుంభద్గతిన్ 408

వ॥ ఇట్లు చండకరకుల వేదండంబు కరకాండంబున ఖండ పరశుకోదండంబు నిక్షుదండంబు ఖండించు విధంబున రెండు ఖండంబులు సేసిన సుర బృందంబులద్భుతంబున నతని వినుతించి కుసుమ వర్షంబులు గురిసె దేవదుందుభులు మొరసెనచ్చరలాడిరి వియచ్చరులు బాడి రప్పుడు 409

కం॥ దానన్ జనకుండాశ్చ
ర్యానందము లొలయ రాము నాలింగన స
న్మానంబులు నెరయ నిజా
స్థానంబున బహువిధముల సంస్తుతి జేసెన్ 410

- సీతారాము కల్యాణము -

కం॥ ఆతరి సీతామాతలు
చేతస్సంప్రీతితోడ శ్రీరాముగుణ
వ్రాతంబులు శుద్ధాంత
స్త్రీతతితో గూడ సన్నుతించిరి వరుసన్ 411

వ॥ ఆసమయంబున 412

సీ॥ కమలాంశ సంభూత కమనీయ గుణజాత
వసుధావతీర్ణ సువర్ణ కర్ణ
సౌందర్య భావిత సౌభాగ్య దేవత
కారుణ్య విస్తార ఘన విహార
పూరితాలంకార పూర్ణ వయస్సార
హేమచేల శుభాభిరామశీల
సకలాంగ సుకుమార సాంద్రతేజః పూర
దివ్య శృంగార సత్కీర్తి హార

తే.గీ॥ సీత పరిపూత వనితా సమేత యగుచు
జనకు ననుమతి శుద్ధాంత సరణివెడలి

తెరవెడలివచ్చు మోహినీ దేవి రీతి
సభకు నేతెంచి ప్రమదాతి శయము మించి 413

మ॥ కనియెన్ జానకి రామునిన్ జలద రేఖా దామునిన్, విస్ఫుర
ద్వనజాతాక్షుని పీనవక్షుని, శుభావాసున్మహోల్లాసు, కాం
చనచేలుం గరుణాలవాలు, త్రిజగత్సమ్మోహనాకారునిన్
ఘనదోస్సారుని రాకుమారుని మహా గాంభీర్య సంచారునిన్ 414

మ॥ స్మితవక్త్రాంబుజయై చలద్రశనయై చేలాంతరవ్యంజితో
చిత వక్షోరుహయై రణచ్చరణ మంజీరాళియై వచ్చియా
క్షితిసంజాత సువర్ణహారమును దా శ్రీరాము కంఠంబునం
దతుల ప్రేమఘటించి వేజనియె లజ్జాయత్త చిత్తాబ్జయై 415

ఉ॥ అంతట రాజకాంతలు గవాక్ష తటాంతర పాళిజేరి శు
ద్ధాంతములందు నుండియు పురాంతర కాంతలు చంద్ర శాలికా
సంతతి నుండి రామునిలసద్గుణ ధాముని సుందరాంగున
త్యంత శుభాంతరంగుగని యాత్మబరస్పరముంబ్రియంబునన్ 416

సీ॥ అతివరో! దశరథుండశ్వమేధము జేయ
బహునాళ్ల కొదవిన బాలుడితడు
బాలరో! యీ చిన్ని ప్రాయంబుననెగాధి
సుతు వెంట వచ్చిన సుగుణుడితడు
సకియరో! మొదట తాటకద్రుంచి గ్రతువేళ
దితిజాళి నొంచిన ధీరుడితడు
సుదతిరో! శిలనాని పదమూని యలమౌని
మానిని గూర్చిన మాన్యుడితడు

తే.గీ॥ వెలదిరో! నేడు హరువిల్లు విరిచినట్టి
రాముడు త్రిలోక మోహన ధాముడీత
డితడు పతిగాగ సీతమున్నేమి నోచె
ననుచు దలచిరి తమలోన వనితలపుడు 417

ఉ॥ అత్తరిగాధి సూతి మిథిలాధిపతింగని యీ వివాహ సం
పత్తికి గాగ పత్రికలు బంపుము దూతల చేత వచ్చుగా

కిత్తరి రాజు పంక్తిరథుడిందు సపుత్రకళత్ర మిత్రవి
ద్వత్తమ మంత్రిముఖ్య పరివారకుడై ప్రమదంబు తోడుతన్ 418

వ॥ అనిసెప్పినప్పుడజ్జనకుండట్ల సేసిన వేగంబున వేగులవారయోధ్యకుం జని యారచిత సువర్ణ హరిద్రారేఖలగు లేఖ లొసంగిన దశంథుం డునుం దన్ముఖంబున పురోహిత సహితంబుగా రామకృతంబును సర్వంబునుం దద్వివాహ ప్రసంగంబును నెరింగిన యానంద తరంగితాంతరంగుడై వారికి పారితోషికంబు లొసంగిమంత్రుల కిట్లనియె 419

మ॥ చతురంగంబులముంగలన్నడుపుడిచ్చన్ మున్నుగా దానరుం
ధతితో నగ్నులతో వసిష్ఠుడు ప్రపూతన్ రామమాతన్ శుభా
ర్థితుడై దోకొని పోవుగాతయని నిర్దేశించి దానున్ రథ
స్థితుడై పంక్తి రథుండు నేగి మిథిలాసీమాభి ముఖ్యంబుగాన్ 420

వ॥ ఇట్లు దశరథుండు సత్వరంబుగా కతిపయ ప్రయాణంబుల సకలమంగళాకరంబగు మిథిలానగరంబు జేరంజని తన్నికటంబున విడిసిన జనకుండును గుతుకంబున జతురంగ బలంబులతో నెదురు వచ్చి యధార్హంబుగా నమ్మహారాజుంబూజించి వివిధ సంపత్సందోహ సుందరంబగునొక్క మందిరంబున విడియించి చనియె నంత కుశిక సుతుండును దశరథునకు ననుజ సమేతంబుగా రామునప్పగించి యమ్మహాత్ముండు పుత్రమాత్రుండు గాడని యితం డొనర్చిన విచిత్ర చరిత్రంబులు ప్రశంసించెనయ్యెడ నక్కుమారులుం జననీజనక పురోహితులకు మ్రొక్కినం దీవించి రప్పుడజ్జన పతియమ్మునిపతిం బూజించి రామునింగాంచి బరమానందంబునం బునఃపున రాలింగనంబు లొనర్చు మూర్ధాఘ్రాణంబు జేసి మరియును 421

కం॥ ననుగన్న తండ్రి నేడిదె
నినుగంటిన్ భాగ్యఫలము నిండగగంటిన్
మునివరుననుగ్రహంబున
నొనరెన్ శోభనములనుచు నుపలాలించెన్ 422

వ॥ అంతనవ్వైదేహుననుమతిన్ దత్పురోహితుండును గౌతమ నందుండును నగు శతానందుండు వచ్చి దశరథ వసిష్ఠులతో నిమ్ముహూర్తంబులందు రామునకు సకల లక్షణోపేతయగు సీతను, లక్ష్మణునకు వినిర్మలయగు నూర్మిళను దనతనూజను, భరత శత్రుఘ్నులకు నిజ భ్రాతయగు కుశధ్వజుని పుత్రికలగు మాళవీ శ్రుతకీర్తుల నిత్తునని పుత్తెంచెనిదిమారాజునకు నభిమతం బనిన వారును బ్రియంబందిరంత శతానందుండు 423

కం॥ మాతల్లి యగునహల్యను
మాతండ్రికిగౌతమునకు మరిగూరిచెనే

డీతండని రామునిగని
యాతత గతిబూజసేసి యమ్ముని సనియెన్ 424

వ॥ అంతతద్వృత్తాంతం బెరింగి నంతుష్టాంతరంగుండై మిథిలా కాంతుండు పురంబునలంకరింపజేసి 425

చం॥ అగరు సుగంధధూపము సమంచిత రత్న వినూత్నదీపమున్
మృగమదపంకలేపము ననేకవితాన కళాకలాపమున్
సుగమ పతాకికాది బహుసుందరమున్ గృతచిత్రమందిరం
బుగను వివాహయోగ్యతరభూషితమై పురమొప్పె నత్తరిన్ 426

కం॥ ప్రేమల నిచ్చట వనితల్
రామాదుల పెండ్లికొడుకులం గావింపన్
గోమలులచ్చట సీతా
రామాదుల పెండ్లికూతురం జేసిరొగిన్ 427

వ॥ అంతటన్ జనక నిర్దిష్ట ముహూర్తంబున దశరథుండు రథంబున వసిష్ఠ ప్రముఖులు విశిష్ట యానంబులను రామభద్ర ప్రభృతి కుమారులు భద్రగజంబుల నరుంధతీ కౌసల్యాదులాందోళికంబుల నింద్రవిభవంబునం జనుదేరనెయ్యంబున వియ్యంబులవార లెదుర్కొన భేరీపటహకాహళవీణా పణవమృదంగ నిస్సాణమంగళ తూర్యాది నిస్స్వానంబులును గాయక గానంబులును వారవిలాసినీన నర్తనంబులును వందిమాగధ కీర్తనంబులును, భూసురాశీర్వచనం బులునుంబర్వంబున నెసంగు మహోర్ణవంబు నెరింగింప నృపమందిరంబునకు వచ్చియచ్చట సువిస్తారంబును రత్న స్తంభాది సంభారంబును విచిత్ర రంగవల్లీ విధానంబును పట్టాంశుకముక్తివితానంబును నిక్షుదండకదలీ కాండపుష్పఫల పల్లవాది తోరణవాసితంబును ననేక విభా భాసితంబును నగు సువర్ణ మంటపంబున నందరు యథార్హంబుగా వసియింప సంభావిత శోభన ద్రవ్యాదికంబగు వివాహ వేదిక నుదంచితరత్న పీఠంబున నుచిత మంత్ర పాఠంబులతో శుభలక్షణ సాంద్రుండగు రామచంద్రునిం గూర్చుండ నియమించి జనకుండును వసిష్ఠ వామదేవ కౌశిక శతానందాదుల నభీష్టపూజలందనిపిన వారును వివాహ యోగ్యంబుగా శుభాగ్నులం బ్రజ్వలింపజేసిరప్పుడు 428

తే.గీ॥ జనకుడు సభార్యుడై రామచరణ యుగము
గడిగి తద్వారి మౌళి భాగమునదాల్చె
పరగనేవారి వారిజభవుడు భవుడు
నమరులు ధరింతురట్లు గృతార్థులగుచు 429

కం॥ ఉర్వీ కుమారినంచిత

సర్వాలంకారవతిగ సవరించి విదే
హోర్వీశుడక్ష తోదక
పూర్వకముగనుచిత మంత్ర పూతముగాగన్ 430

కం॥ ఆరీతి జనకవిభుడా
త్మారాముడుగాన హరి సమర్పితబుద్ధిన్
శ్రీరామునకున్ ముక్తి
శ్రీరామునకొసగె తనదు చేతన్ సీతన్ 431

తే.గీ॥ అట్లొసంగిన నారాముడపుడు సతికి
కలితమంగళ సూత్రంబుగట్టె నరుత
నమృతవారాశి దనకూతునాదిలక్ష్మి
హరికొసగు లీల జనకుండు హర్షమొందె 432

కం॥ అత్తరి రాముడు సీతయు
మొత్తములగు నాత్మ మోహముల దోయిళ్లన్
ముత్తెపు బాలుం బోసిరి
చిత్తుగ నొండొరుల మౌళిసీమల నంతన్ 433

మ॥ ఘనుడారాముడు బెండ్లియాడెనటులా కంజాత పత్రేక్షణన్
వినుత శ్రీకర లక్షణన్, మధుకరీ వేణిన్ సుపాణిన్, శుభా
ర్జన లీలన్ జనవంద్య శీల, నమృతా సారోల్ల సద్భాషితన్
గన కాంచన్మణిభూషితన్ సుగుణరేఖా భాసితన్ భూసుతన్ 434

తే.గీ॥ హరునిధర్మంబు ఖండించి యవలరాము
డవనిజా శ్రీకరగ్రహోత్సవము గాంచె
ప్రకృతి ధర్మంబు ఖండించి ప్రాజ్ఞుడెనయు
మోక్షలక్ష్మి కరగ్రహంబునకు బోలి 435

వ॥ అంతట లక్ష్మణునకు నూర్మిళను, మాండవీశ్రుత కీర్తుల భరత శత్రుఘ్నుల కొసంగి, యిత్తెరంగున వివాహంబులొనర్చినన్ గృతాగ్ని హోత్రులును దారయుక్తులునై యాకుమారులు లోకపాలుర లీలం బ్రకాశించి రప్పుడజ్జనకుండును సకల జనంబులన్ బరమతుష్టలం జేసి దానును సంతుష్టుండయ్యె నివ్విధంబున 436

కం॥ శ్రీరాముల పరిణయములు

వారక భక్తిని బఠించువారికి నెల్లన్
భూరివిభవ పరిణయములు
సూరులకును ముక్తికాంత శుభపరిణయముల్ 437

వ॥ అంతనిట్లు గృతకృత్యుండై జనకుండు వసిష్ఠునకు నారదోక్తంబగు సీతా వృత్తాంతంబు దెలుపు వాడై యిట్లనియె 438

సీ॥ విను మౌనివరకంధి వేలాతటంబున
మును యజ్ఞభూమి శోధన మొనర్ప
సీతాముఖంబున నీతన్వి లక్షణా
న్వీతజనించిన సీతయనుచు
పేరిడి పుత్రికా ప్రీతి మత్ప్రియభార్య
కొసగ బెంపుచునుండ నొక్కనాడు
మహతి వీణియ విష్ణు మహిమలు బాడుచు
నారదుండఖిల విశారదుండు

తే.గీ॥ చేరనిటవచ్చి నేను బూజింపమెచ్చి
యొక రహస్యంబు నీకు నభ్యుదయకరము
దీని దెల్పెదనని కృపాధీనుడగుచు
నేకతముగాగ నాతోడ నిట్టులనియె 439

మ॥ సురకార్యార్థము భక్తరక్షణకు విష్ణుండచ్యుతుండీశుడ
ప్పరమాత్ముండిటు మాయచే మనుజరూపం బూనిరామాఖ్య దా
శరథిస్ఫూర్తి చతుర్విధాకృతులు దోచెందానె జన్మించెని
ద్ధరణిన్ లక్ష్మియు నీ గృహంబునను సీతాఖ్యాతి గల్గెన్ జుమీ! 440

క॥ కావున నీవీ సీతా
దేవిన్ రామునకెయిమ్ము దృఢయత్నముచే
నేవారి కియ్యబోకుము
నావిభునకు పూర్వ భార్యయగునిది సుమ్మీ! 441

క॥ అనిసుర మునిదివమునకున్
జనినతదాప్రభృతిగాగ జానకి లక్ష్మీ
వనితయనుచు రామున కె

ట్లొన గూర్తునటంచు చింతనుండుచు నంతన్ 442

చం॥ హరుడు పురంబులంగెలిచి యంతట నీఘన చాపముంగరం
బరసి మదీయ పూర్వుల గృహంబున నుంచెను దీని కర్షణం
బిరవుగ నీ వివాహమున కేను పణంబుగజేయ దీనిచే
ధరగల సర్వరాజుల మదంబులు దూలెగణింపనింతటన్ 443

కం॥ ఈముని విశ్వామిత్రుడు
రామునిగొనివచ్చి తీరె ప్రతినయు సీతా
రామనొసంగితి పూరిత
కామునిగా జేసెనితడు కరుణన్ నన్నున్ 444

కం॥ అనిపలికి విదేహుడు రా
ముని గని ఫలియించె జననమున్ జానకితో
నినుగంటి నేడు ప్రభతో
నినుగన్న విధంబుదోప నేనిదె రామా ! 445

ఉ॥ నీపటు నామ సంస్మృతిని నీపద వారిధరియించి వెండియున్
నీపదభక్తి జేసి భవనీరజ గర్భ సురేంద్రముఖ్యులన్
దాపసులున్ ధరించి భవతాపము పాయుదురట్టి నీవు మ
త్ప్రాపిత పూర్వపుణ్యముల బంధుడవైతివి గాదెరాఘవా! 446

వ॥ అనివినుతించి జనకుండు జామాతయగు రఘునేతకు సువర్ణ దీనారంబులు కోటిశతంబును శతాంగబులు నయుతంబును తురంగంబులు నియుతంబును గజంబులు షట్చతంబును భటవ్రాతంబులు లక్షమితంబును దాసీజనంబు త్రిశతంబునుంగా ననేక పరికరంబు నరుణంబొసంగి కూతురగు సీతాదేవికిం బ్రీతితోననేక దివ్యాంబరాభరణాదులిచ్చి యివ్విధంబుగా సభార్యులగు భరత లక్ష్మణ శత్రుఘ్నుల సంతుష్టలంజేసి దశరథ వసిష్ఠాదుల యథార్హంబుగా బూజించియంతట 447

కం॥ ధన్యాత్ముడు పతి గలిగియు
కన్యా సహజంబు గానకలితాశ్రుపయో
విన్యాస నయనయగు జన
మాన్యను సీతగని జనకమహివతి గరుణన్ 448

కం॥ పతి శిశ్రూషణమతివై

పతినే దైవతముగాగ భావింపు మను
వ్రతవై పాతివ్రత్యము
సతికిదిగదవమ్మ! సుకృత సౌఖ్యవు గమ్మా!! 449

- పరశురామ సమాగమము -

వ॥ అని బుజ్జగించి తజ్జనకుండునుం గమనోద్యుక్తులగు నద్దశరథాదుల చేతననుజ్ఞాతుండై మరలివచ్చె విశ్వామిత్రుండు మునియుక్తుండై రామాదుల నామంత్రణంబుసేసి యథేచ్ఛం జనియె నంత నా రఘువీరుల ప్రయాణ సమయమంబున పటహకాహళ భేరీ ప్రముఖా రవంబులు హితజన శుభకరములును సర్వభూత భయంకరంబులునై యొప్పె నప్పుడవ్విధంబున వారుమిథిలాపురంబు గదలి యోజన త్రయ దూరంబు జను నవసరంబున 450

కం॥ అతి ఘోర దుర్నిమిత్త
వ్రతతి గనంబడిన పంక్తిరథుడీవిషమ
స్థితికేమి హేతువని యా
యతమతి వేడిన వసిష్ఠుడానృపుతోడన్ 451

ఆ.వె॥ ఆది భయముదోచు నదినివారితమౌచు
నభయ మపుడెకలుగు శుభకరముగ
జూడు మృగచయంబు సుప్రదక్షిణముగా
బోవదొడగెనిపుడు భూవరేంద్ర! 452

చం॥ అనిమునియీ గతిన్ దెలుపునప్పుడు గప్పెడు పాంసువృష్టితో
జననయనానురోధన దశన్ వడిగాసుడిగాలి కీలిత
ధ్వని నిబిడంబుగా విసరె దాన భయంబును విస్మయంబునుం
బెనగొన నెమ్మనంబులను బేరిచి వారటులుండు నయ్యెడన్ 453

సీ॥ చండప్రచండ కోదండకాండధరుండు
తతకఠోరకుఠారయుతకరుండు
పార్థివ బ్రహ్మర్షిభావనా కలితుండు
బహుజటాపటల విభ్రాజితుండు
కార్తవీర్యార్జున ఖండన ప్రవణుండు
సకల రాజన్యభంజనచణుండు
కాలసాక్షాదంతక క్రోధ భరితుండు

నతులదోస్సార శౌర్యాన్వితుండు

తే.గీ॥ నీలనీరదధాము డున్నిద్రరౌద్ర
జితరిపుస్తోము డూర్జిత స్థేముడాజి
రంగభీముడు భార్గవరాముడపుడు
కాననయ్యెను త్రోవనాకస్మికముగ 454

కం॥ ఈమాడ్కివచ్చు భార్గవ
రాముని వీక్షించి పంక్తిరథుడు భయముచే
నాముని కర్ఘ్యాసన పూ
జాముఖముల జేయమరచిసంభ్రాంతుండై 455

వ॥ వెండియు దండప్రణామంబు లాచరించి రక్షరక్షేతి దీనశబ్దంబులం బ్రాణదానం బొనర్చుమని తన్నుంబ్రార్థింపుచున్న దశరథునాదరింపక నతని నతిక్రమించి రఘునందనుం గదిసి భృగునందనుండు రోష భీషణంబుగా పరుష భాషణంబుల నిట్లనియె 456

కం॥ క్షత్రకులాధమ! సహజ
క్షత్రియుడన నోర్వనేను సరి మన్నామ
క్షత్రియు నినుగని యోర్తునె
చిత్రముగా దర్పమెడల జేతుం జూతున్ 457

ఉ॥ బ్రాతిగనీవు భూతపతి ప్రాతశరాసముద్రుంచి దుర్మద
ద్యోతితమైన గర్వమున నుబ్బెడు నేడు మదీయ వైష్ణవ
ఖ్యాత వరాసమెక్కిడిన నంత నినున్ నృపమాత్రుడంచు నీ
రీతి యెరింగి యుద్ధమొనరించెద కొంతనినున్ సహించెదన్ 458

కం॥ కాకున్నన్ నీతోడుత
నీకున్న బలంబునెల్ల నేడువధింతున్
వీకన్ సకలక్షత్రియ
లోకాంతకుడనగ జగతిలో నను వినవే! 459

కం॥ అని భార్గవుడుద్ధతుడై
యను నయ్యెడ జలధులింకె నవనివడంకెన్
జనదృఙ్ని రోధనంబై
గన ఘోరముగాగనంధకారము గప్పెన్ 460

కం॥ అప్పుడు దశరథరాముడు

తప్పక వీక్షించి జామ దజ్ఞునికోపం
బుప్పతిల కొంతశాంతిం
గప్పుచునిట్లనియె పరుష గంభీరముగా 461

ఉ॥ నీవు మహీసురుండవని నీకఠినోక్తి సహించితిన్ శమం
బావహిలంగ విప్రునకు నస్త్ర ధరత్వము శౌర్యమున్ సమి
జ్జీవన మన్యహింసము నిషిద్ధములయ్యెను వానిబూనితిన్
గావున ధర్మదూషితము గాదెదురించి నినుంజయించినన్ 462

ఆ.వె॥ అనుచునొవ్వ బలికియలుక భార్గవుచేతి
విల్లు గొనియులీల నల్లెగూర్చి
తూణమందునొక్కబాణంబు దీసి సం
ధించి రాముడాగ్రహించి పలికె 463

కం॥ భృగువంశభవ యమోఘం
బగురామశరంబు దీని నఖిలంబగు ని
జ్జగమో లేక భవత్పద
యుగమో లక్ష్యంబు వ్రేయనొయ్యన జెపుమా! 464

కం॥ అని రాఘవుండు బలికిన
విని వికృతాస్యుడయి పూర్వ వృత్తాంతంబున్
మనమునను సంస్మరింపుచు
ననియెన్ జమదగ్నిసూనుడవ్విభుతోడన్ 465

ఆ.వె॥ రామ! దివ్యనామ! రమణీయ గుణధామ!
నిను బురాణ పురుషునిఖిల విభుని
పరుని హరుని గాగ భావించి తలుతు మ
త్తామసము సహించు దయవహించు 466

చ॥ వినుమును చక్రతీర్థమున విష్ణునిగూరిచి బాల్యవేళనే
ననితర భక్తిచే నహరహంబు దపంబొనరింప మెచ్చియ
య్యనఘుడు శంఖచక్రధరుడచ్యుడంత బ్రసన్నమూర్తియై
ననుగనియిట్లు బల్కె రఘునాథ! దయార్థ సనాథ! ప్రీతితోన్ 467

సీ॥ వినువిప్ర! నీతపోవిభవంబు ఫలియించె
జనునీవు మచ్చిదంశము గ్రహించి
ముయ్యేడుమారులు మొనసిదుష్టక్షత్ర
వరులను ద్రుంచి భూభర మణంచి
వారిశోణితనదీ పూరంబుచే పితృ
తృప్తిగావించి తత్పితృవితతికి
స్వర్గమార్గంబును సవరించి యామీద
సర్వభూమియును కశ్యపునకిచ్చి

తే.గీ॥ దనరశాంతింపుమంత త్రేతాయుగమున
నవని దశరథ రాముడవై జనించి
దర్శనంబిచ్చి నీకు మద్దత్తమైన
యచ్చిదంశంబు మరల నేనావహింతు 468

కం॥ అంతటనుబ్రహ్మాదిన ప
ర్యంతము నీవుండి ముక్తినందెదవని నా
కెంతయు వచించియప్పుడ
యంతర్హితుడయ్యె విష్ణుడగుటం గానన్ 469

కం॥ ఆవిధమంతయు జేసితి
నీవింటంగొంటి విపుడు నీతేజము నీ
వావిష్ణుండవు సుమ్మీ!
యావిధి బ్రార్థింప జననమందితి జగతిన్ 470

కం॥ నిను బ్రహ్మాదులకైనన్
గనుగొన దుర్లభము నిన్నుగంటినీవున్
ననుగరుణించితి వికనా
జననంబున్ సఫలమయ్యె సర్వేశ! హరీ! 471

సీ॥ అదిగాక బ్రకృతికి నవ్వలయై పూర్ణ
మవికారమును గమనాదిరహిత
మమలమై చిన్మాత్ర మైనట్టి నీయందు
నజ్ఞాన సంభవంబైనయట్టి

జన్మాదిషడ్భావ సంగతియది లేదు
జలములందున ఫేనజాలమట్లు
నగ్నియందును ధూమమట్టుల నీయందు
గనుపట్టి మాయ స్వకార్యమైన

తే.గీ॥ నీ ప్రపంచంబునొగి సృజియింపుచుండు
నట్టి నీ మాయ నావృతులైన జనము
లెరుకతో నీస్వరూపంబు నెరుగలేరు
రామ! సంపూర్ణ కామ! నిర్వాణధామ! 472

వ॥ మరియు విచారిత సిద్ధయగు నీయవిద్య విద్యానిరోధినియగునట్టి యవిద్యాకృత దేహాది సంఘాత ప్రతిబింబితయగు చిచ్ఛక్తి జీవకళ యనం బరుగునట్టి జీవునికి నెందాక దేహ మనఃప్రాణబుద్ధ్యాదుల యందభిమానంబు గలిగియుండు నందాక కర్తృత్వ భోక్తృత్వ సుఖదుఃఖాదులనుభవింపంబడిన పగిదిందోచు నెన్నండేనియు నాత్మకు సంసారంబును బుద్ధికి విజ్ఞానంబును దనంతగలుగనేరదట్లయ్యు నయ్యు భయంబు వలననగు నవివేక విజృంభణంబున నేను సంసారినను విభ్రాంతిగలుగుచుండునది యెట్లంటేని 473

కం॥ జడయోగంబున చిత్తున్
జడమగు చిద్యోగమునను జడమును చిత్తౌ
నెడనెడ జలాగ్నియోగం
బడరన్ దృష్టాంతమగు గదాయిందరయన్ 474

వ॥ కావున నిట్టి విజ్ఞానంబు భవచ్చరణకమల భక్తులకుంగాని కలుగదట్టి భక్తులగు మహాభాగవతుల సహాయంబున సంసారదుఃఖ నివర్తకంబగు నీభక్తి సంభవించినిన్నుపాసించిన నజ్ఞానంబునసించు నంతదనంత సుజ్ఞాన సంపన్నుండగు సద్గురుండు లభించు నమ్మహాత్మునుపదేశంబున నగు నీ ప్రసాదంబుననాత్మ స్వరూపకుండ వగు నిన్నెరింగి ముక్తుండగునట్లగుటం జేసి నీ సాధన భక్తి రహితులకు కల్పకోటి శతంబులనైన ముక్తిజ్ఞానశకలంకురించుటకుం జాలవుగావున నాకు నెప్పుడు భవచ్చరణ భక్తింగరుణింపవే యని మరియును 475

కం॥ నీభక్తులు నిజధర్మ
ప్రాభవముల నాత్మ వంశభవజనులనె కా
దీ భువనంబు పవిత్ర
శ్రీభవనంబుగను వెలయజేయుదురు సుమీ! 476

కం॥ వందనము నీకు రామా!

వందనము దయాభిరామ! వైభవసీమా!
వందన మనంతధామా!
వందన మభిలేశ! భక్తవత్సల నామా! 477

వ॥ అని సన్నుతించి మరియును 478

తే.గీ॥ లోక విజిగీషచే నేను నాకమునకు
మార్గమొనరించి తదియు నీమార్గణమున
ద్రుంపవే! యన రామభద్రుండు దాని
నట్లజేసి బ్రసన్నుడై యతనికనియె 479

కం॥ మెచ్చితి నీస్తోత్రంబున
కిచ్చెద నీకెద్ది యిష్టమేని యడుగుమీ!
వచ్చుగనన బ్రీతుండై
యిచ్చుట రామునకు భృగుకులాగ్రణి యనియెన్ 480

కం॥ నీపద భక్తుల సంగతి
నీపద భక్తియును మరియు నిరతశమంబున్
నాపై దయగల దేనియు
జేపట్టియనుగ్రహంబు జేయుము రామా! 481

వ॥ అదియునుంగాక నీస్తవం బెవ్వండేనియు నిత్యంబును బఠియించిన భక్తి విజ్ఞాన సంపన్నుండై నినుంజెందునట్లు వరంబొసంగుమని వేడిన ననుగ్రహంబు సేసిన రఘూద్వహువలగొని నమస్కరించి యతని చేతపూజితుండును ననుమతుండునునై భార్గవుండు మహేంద్ర నగంబునకుం జనియె నప్పుడు 482

కం॥ రాముని నుపరాగా గత
సోమునిగా దలచి బ్రీతిశుభ నేత్రజల
స్తోమముల దడపి దశరథ
భూమీపతి కౌగిలించి పొదలెన్ మిగులన్ 483

వ॥ అంతనద్దశరథుండు కుమారసహితుండై వివాహాలంకృత నికేతంబగు సాకేతంబునకుం బురందర విభవంబునంజని సుందరంబగు రాజమందిరంబు బ్రవేశించి వసిష్ఠాదులం బూజించి బంధు ప్రముఖుల బహూకరించి సుఖంబుండె నంత 484

కం॥ తమ తమ భార్యలతోడన్
దమ తమ భవనముల యందు దశరథ తనయుల్
దమ తమ వైభవముల ను
త్తమ తమముగ వెలసిరంచిత క్రీడలతోన్ 485

వ॥ అంత 486

కం॥ వైకుంఠంబున విష్ణుడు
శ్రీకాంతం గూడినట్లు సీతాన్వితుడై
సాకేతంబున రాముడు
లోకులకుం బ్రీతి నెరపె లోలత మెరయన్ 487

వ॥ అత్తరి గైకయీ భ్రాతయును భరతమాతులుండును నగుయుధాజిత్తను నృప సత్తముండేతెంచి దశరథానుజ్ఞాతుండై యతిప్రీతి భరత శత్రుఘ్నుల నిజరాజధానికిందోడ్కొని చనియెనయ్యెడ 488

కం॥ కోమల రూపవయోగుణ
ధాముల హేమ హరినీల ధాముల సీతా
రాముల బుధ శుక సీతా
రాముల నీక్షించి పంక్తి రథుడుప్పొంగెన్ 489

కం॥ ప్రేమను జానకి తోడుత
రాముని గని రామమాతరంజిలెమదిలో
నామును శచితోడుత సు
త్రాముని గని దేవదూత రంజిలు భంగిన్ 490

వ॥ ఇవ్విధంబున 491

శా॥ సాకేతంబున లోకనాథుడు జగత్సంస్తుత్యనానాగుణ
శ్లోకస్థేముడు రాముడమ్మహిజతో సొంపొంది మౌనిప్రియ
శ్రీకృన్మూర్తి నిరర్గళాప్తి నితర శ్రీనిర్వికారుండు మా
యా కార్యానుకృతిన్ మనుష్యుడగుచున్ హర్షించె దేవుండిలన్ 492

కం॥ అనినంబార్వతి శర్వుని
గనుగొని కనుగొనలహర్ష కజ్జలజలముల్
బెనగొన రాముని చరితము
లనఘా! యవ్వల వచింపు మనియడుగుటయున్ 493

- ముక్తపదగ్రస్తము -

మ॥ ప్రణవ స్థానవిహార హారమణి శంపావారిదాకార కా
రణజన్మావృతభార భారతజయప్రారంభ సంచార చా
రణముఖ్య స్తుతిసార సారసరుచిప్రాంచద్యశోదార వా
రణరక్షారతిధీర ధీరచిత పార్థజ్ఞాన సౌఖ్యోదయా! 494

చక్రవాళ కందము -

రామా! జగదభిరామా!
రామాంక కుఠారిమద భరత్వ విరామా!
రామా భూతద రామా!
రామానుజ తాత్తదివిజ రాజా! రామా! 495

మాలినీ -

సరసవిభవ కీర్తీ! సచ్చిదానందమూర్తీ!
దురిత హరణ దార్తీ! ధూత తాపత్రయార్తీ!
సురరిపు సమవర్తీ! శోషితజ్ఞాన మూర్తీ!
కిరిముఖతను వర్తీ! కేశవా ద్వైకమూర్తీ! 496

- గద్య -

ఇది శ్రీమదుభయ కవితా నిస్సహాయ సాహితీవిహార కాణాదాన్వయతిమ్మనార్యకుమార
వినయవిభ్రాజి పెద్దనసోమయాజి ప్రణీతంబైన
శ్రీమదధ్యాత్మరామాయణంబను మహాపురాణంబునందు
బాలకాండం బన్నది ప్రథమాశ్వాసము సంపూర్ణము

-★)★(★-



శ్రీ భూ చెన్నకేశవాయ నమః

అధ్యాత్మ రామాయణము

అయోధ్యకాండము.

శ్రీ రమణీ సహచారీ!
వీర శ్రీసోమ భూపవిభవోద్ధారీ!
శ్రీరత గద్వాల పురీ
క్షీరాబ్ధి విహారి! చెన్న కేశవశౌరీ! 1

వ॥ అవధరింపుము భక్తియోగ విశారదుండగు నారదునకు సకలార్థ సంధాతయగు విధాత సెప్పినట్లు విజ్ఞానవతియగు పార్వతికి దివ్యప్రభావుండగు మహాదేవుండిట్లనియె నివ్విధంబున శ్రీరామదేవుండు సీతాసమేతుండై సుఖంబుండు నవసరంబున 2

- నారద సమాగమము -

కం॥ ఒకనాడు నిజాంతఃపుర
నికటాంగణ సీమ రామనృపమౌళి విలా
స కరంబుగ జానకితో
నొకట సుఖాశీనుడగుచునుండుచు మరియున్ 3

సీ॥ ప్రకృతితో విహరించు పరమాత్ముడును బోలి
సీతతో హితగోష్ఠిచే దనర్చి
మెరుగు తీగెలతోడి మేఘుంబు కైవడి
భూషణశ్రేణితో బొలుపుమీరి
యుదయాద్రిమెరయు సూర్యుని ఠీవి నవరత్న
సింహాసనమున నాసీనుడగుచు
నమృతాంశుబింబంబు నందుచంద్రిక వలె
మోమున దరహాసమాము కొనగ

తే.గీ॥ కలిత నిజపూర్ణ భావంబు దెలుపు లీల
నాత్మతేజంబు నఖిలంబు నావరింప
నతిశయానంద విస్ఫూర్తి నధిగమించి
రమణజెలువంద కొలువుండె రామవిభుడు 4

వ॥ ఆసమయంబున 5

కం॥ నారదుడు తను విభాసిత
సారదరస్ఫటికహార శారద శశభృ
న్నీరదుడు దివ్యదృష్టి వి
శారదు డాకస్మికముగ జనుదెంచె వెసన్ 6

కం॥ ఈ రీతిని నారదముని
యారాముని గనగ నంబరాగతుడగుచున్
జేరికతదీయ సదనము
దారింజేరంగ నరిగి తన్మధ్యమునన్ 7

సీ॥ దివ్యలక్షణముల దేజరిల్లెడువాని
నీలోత్పలద్యుతి నెరపువాని
వివిధ భూషణ జాల విలసితుండగువాని
కౌస్తుభాలంకృత గళమువాని
నాత్మశుద్ధాంత మధ్యావాసుడగువాని
సింహాసనంబున జెలగువాని
తాంబూలచర్వణోత్సవసక్తుడగు వాని
నేకాంతశుభలీల నెసగువాని

తే.గీ॥ కనగనొకదండ మణికాండ కనకదండ
చామరము వీవనొకచేత జనకజాత
తత్సతీకృత బహువినోదముల వాని
సకల గుణసాంద్రు శ్రీరామచంద్రుగనియె 8

వ॥ అప్పుడు 9

ఉ॥ ఈగతివచ్చు నిర్జరమునీశ్వరు జూచి మహీజతోడుతన్
వేగమెలేచి రాఘవుడు వేడుకతో నెదురేగి భూమిపై
సాగిలిమ్రొక్కి మౌళితట సంఘటితాంజలి పాణియై బ్రమో
దాగతిదేలిభక్తి మెయినర్ఘ్యము పాద్యము నిచ్చివెండియున్ 10

కం॥ ఘనముగ బహుపూజనలిడి
కనకాసనమున వసింప గావించి మహా
వినయమ్మున రఘువరు డ
మ్మునివర్యున కిట్టులనియె ముదముదలిర్పన్ 11

సీ॥ మౌనీంద్ర! సంసారమగ్నులౌవారి క
శక్యంబు మీదు దర్శనము మరియు
నతిదుర్లభంబగునట విషయాసక్త
మానసులగు నట్టి మాదృశులకు
పూర్వపుణ్యోదిత స్ఫూర్తిచే సంసారు
లైనగాంతురు సత్సమాగమంబు
నటుగాన పూర్వజన్మార్జిత సుకృతాప్తి
నాకు భవద్దర్శనంబు గలిగె

తే.గీ॥ నట్టుగాన గృతార్థుండనైతి నేను
నెద్దికార్యంబు మీరాకకేనొనర్తు
దాని వచియింపవేయన మౌనివర్యు
డెంతయును బ్రేమ రామున కిట్టులనియె 12

కం॥ శ్రీరామ! భక్త నికర శు
కారామ! దయాభిరామ! హరి! యేటికి న
న్నీరీతి మోహపెట్టెదు
వారకలోకానుసారి వాక్యంబులచేన్ 13

కం॥ సంసారి నేనటంచు బ్ర
శంసారతి జెప్పెదీవు సత్యంబిదియా
సంసారులలోన మహా
సంసారివి నీవుగావె సంగతి దెలియన్ 14

కం॥ ఏమాయ జగములకును మ
హామేయతనాది భూతమై దనరును నీ
వామాయా జాయాయుతి
వీమెయి బ్రహ్మాది జనుల సృజియింతుగదా! 15

వ॥ అదియునుం గాక యట్టి మాయ నిన్నాశ్రయించి భవత్సన్నిధాన బలంబున త్రిగుణ స్వరూపిణియునై నిరంతరంబును శుక్లలోహిత కృష్ణ స్వరూపులగు బ్రజల సృజియింపుచుండున్ గావున నీవీ లోకత్రయ మహాగృహంబున గృహస్థుండవగుదువని వెండియు నిట్లనియె 16

సీ॥ హరివీవు సిరిసీత హరుడీవు నుమయామె
బ్రహ్మవు నీవు నీరాణివాణి

రవివీవు ప్రభ ధరాప్రభవ వెండియు కళా
నిధి వీవు రోహిణి నీదుగృహిణి
జిష్ణుండవీవు శచీదేవివైదేహి
నీవగ్ని వాస్వాహనీవధూటి
శమనుండవీవు సంయమని నీ రమణి నై
ఋతి వీవు తామసీసతిమహీజ

తే.గీ॥ వరుణుడవునీవు భార్గవిధరణి తనయ
వాయువీవు సదాగతి వసుమతీజ
ధనదుడవు నీవు సంపత్తి జనక పుత్రి
రుద్రుడు భవాని మీర లిర్వురును రామ! 17

కం॥ అరయపురుష వాచకమై
బరగిన యవియెల్ల నీవ భావించంగా
తరుణీవాచకములునీ
తరుణి ధరణిజాతయగును తరణి కులమణీ! 18

కం॥ కావున సచరాచరమగు
నీవిశ్వము నందు మీరలిర్వుర కన్నన్
భావింపగ నన్యంబన
గా వేరొక్కటియు లేదుగా మహిమాత్మా! 19

వ॥ దేవా! యిది స్థూలప్రకారంబగు నిదియునుంగాక త్వదాభాసంబునైన నజ్ఞానంబ వ్యాకృతంబనం బరగు దానమహత్తత్త్వంబుద్భవించె నందు సూత్రాత్మకత్వంబుగలిగె నదియె లింగదేహంబనంబరగు నట్టి లింగంబు దశేంద్రియంబులు పంచప్రాణంబులును బుద్ధియు నహంకారంబునుంగూడ సప్తదశాత్మకంబైన జన్మమృత్యుసుఖాది యుక్తంబగుచు బ్రవర్తించు నయ్యనాద్య విద్యకారణంబై యొప్పు నిట్టి స్థూల సూక్ష్మకారణంబులు పాధిత్రితయంబగు నేతద్విశిష్టుండు జీవుండగు నేతద్వి యుక్తుండు పరమేశ్వరుండగుం గావున 20

శా॥ జాగ్రత్స్వప్న సుషుప్తి వృత్తియగు సంసారాప్తికిన్ సాక్షివై
యగ్ర స్ఫూర్తి విలక్షణుండవగు నిన్నర్థించి చిన్మాత్రతా
సుగ్రాహ్యాభి హితస్వరూపుడవటంచున్ సారవిజ్ఞాన సా
మగ్రిన్ బ్రాజ్ఞులు జెప్పుచుందురిటు రామా! పూర్ణ కామా! హరీ! 21

కం॥ ఈయఖిల జగజ్జాలము
నీయందు జనించుచుండు నీయందణగున్
నీయందున్ గావుననీ
వాయతి నీయఖిల కర్తవగుదువు రామా! 22

కం॥ వినురజ్జువున నహింబలె
బనుపడ తనయందు జీవభావముగనగా
బెనగొను భయంబు బరమా
త్ముునిగా దనుగనినభయము దుఃఖముదొలగున్ 23

తే.గీ. అన్ని దేహంబులును బుద్ధులలరుచుండు
వరుస చిన్మాత్రమైన నీవలన నీవు
జేరి వాని బ్రకాశింపజేతుగాన
నఖిలమునకును నీవాత్మవగుదు వీశ! 24

శా॥ అజ్ఞానంబున రజ్జువందు నహియట్లారోపితంబౌచు న
య్యజ్ఞ శ్రేణికి దోపగాబడును నీయందంతయున్ దావకీ
య జ్ఞానంబున వేరులేక నదిలీయ్యంబైజనుంగాన త
ద్విజ్ఞానంబు సమభ్యసింపదగు నెంతే రామ చింతింపగన్! 25

కం॥ ఆ విజ్ఞానము జేకురు
దావక పదభక్తియుక్తి తావక భక్తుల్
కేవల ముక్తికి బాత్రులు
కావున నీభక్తి ముక్తి కారణమధిపా! 26

శా॥ నే నీదాసులకెల్ల దాసుడ నికన్ నీమాయచే మోహితుం
గా నొందింపకనుగ్రహింపు మదియుంగాక న్వీచారింపగా
నేనీనాభి సరోజజన్ముడగు వాణీభర్తకుంబుత్రుడన్
గానం బౌత్రుడ నీకు నన్నుగరుణం గావంగదే రాఘవా! 27

మ॥ అనుచుంబల్కి సభక్తికంబుగ బ్రణామానేకముం జేసి చ
య్యన నానందశుభాశ్రుపూర్ణనయనుండై నారదుండంత రా
ముునితో దేవవిధాత పంపునను మిమ్ముంగానగా వచ్చితిన్
వినుమక్కార్యము సర్వమంచు వినయావిర్భూతితో నిట్లనున్ 28

సీ॥ ఆ రావణ వధార్థ మారాధితుండవై
విధిచేత భువినుద్భవించితీవు
నిపుడు మీతండ్రి నిన్నీ రాజ్య రక్షార్థ
మభిషేక మొనరింపనభిలషింప
నటనీవు రాజ్యభోగైకసక్తుడవేని
దశకంఠదళనంబు దప్పిపోవు
నాదిని భూభార హరణార్థము బ్రతిజ్ఞ
సేసితివదియును శిథిలమగును

తే.గీ॥ సత్యసంధుడవీవు నీజగతిననుట
సత్యముగజేయు మీప్రతిజ్ఞా విధంబు
ననుచు సురముని సెప్పిన వినియు రాము
డెలమి నవ్వుచు నతనితో నిట్టులనియె 29

మ॥ వినుమోనారద! నే నెరుంగనిది భావింపంగ లేదెద్ది నే
మునుపన్నట్టి ప్రతిజ్ఞ దీర్చెద నిజంబున్ గాక కాలాను సా
ర నిమిత్తంబున జేసి తత్తదుచిత ప్రారబ్ధ సంక్షీణతం
గని భూభారము నాహరించెద గడంకన్ ద్రుంచెదన్ దైత్యులన్ 30

ఉ॥ రావణ నాశనార్థము దిరంబుగ రేపిదె దండకావనా
ఖ్యావని కేగెదన్ మరియునందు చతుర్దశ వత్సరంబులున్
వావిరి మౌనివేషమున వాసము జేసెద జానకీ మిషం
బావహిలంగ నాఖలు కులాన్వితుగాగ హరింతునెంతయున్ 31

తే.గీ. అనుచురాముడు శపథంబు నాచరింప
నారదుడు ప్రీతిలి ప్రదక్షిణద్వయంబు
సెలగ దండ ప్రణామంబు సేసి భక్తి
నతని యనుమతి సురమార్గ గతిని జనియె 32

వ॥ ఇవ్విధంబున 33

కం॥ అమరముని రామసంవా
దము దీనిం జదివి వినిన ధన్యులు భక్తి
క్రమమున వైరాగ్యము గని
యమరాభేద్యమగు ముక్తినందుదురెపుడున్ 34

వ॥ ఇట్లు సురముని రామునితో సంభాషించి చనుటయు 35

కం॥ అంతట దశరథ ధరణీ
కాంతుండొకనాడు బిలువగా బంచియు నే
కాంతమున నయ్యరుంధతి
గాంతు గులాచార్యు నార్యుగని యిట్లనియెన్ 36

కం॥ గురువర! రాముని గుణములు
సరవి బ్రశంసింతురెపుడు జనపదజనులున్
బురజనులుం గురుజనులుం
బరిజనులున్ మంత్రి వృద్ధ బాలప్రముఖుల్ 37

వ॥ మరియును 38

కం॥ వనమునకున్ జనకజనా
వనమునకున్ జాగ్రదాప్తి వర్తిలుమమ్మున్
గనియును రాముని బాలుని
గొని జనములు బతినిగాగ గోరెదరిలకున్ 39

వ॥ అదియునుం గాక 40

శా॥ ధీరోదాత్తుడు ధర్మవేది సుజనాధీనుండు వాఙ్మాధురీ
ధౌరేయుండు పరేంగితజ్ఞుడు దయాదాక్షిణ్య గాంభీర్య శౌ
ర్యారూఢుండు బ్రశాంతు డాత్మవిదుడత్యంత ప్రదుండూర్జిత
శ్రీరమ్యుండు గణింపసద్గుణములన్ శ్రీరాముడెన్నందగున్ 41

సీ॥ క్షమమును శమమునైశ్వర్యంబు ధైర్యంబు
సత్యవైరాగ్య విజ్ఞానములను
నఖిలంబునకుస్రష్ట యగుభావమును నధి
ష్ఠాతృత్వ మాత్మబోధాతిశయము
నీపది గుణములు నీవేళ రాముని
యందు నిల్చిన వవ్యయంబులగుచు
నటుగాక సకలగుణాభిరాముడు రాము
డీమహి జనకృత ప్రేముడయ్యె

తే.గీ॥ భోగముల యాగముల బహుత్యాగములను
నవని నేలితి వృద్ధుండవైతినేను
నాత్మజ జ్యేష్ఠుడగుట రాజ్యాభిషేక
మే నొనర్చెద నతని కోమౌనితిలక! 42

చం॥ భరతుడు సానుజుండగుచు బ్రాతిగ మాతులుగాననేగె నిం
దరయనతండు వచ్చుటకు నౌబహుకాలముగాన మేది నీ
భరమున రేపె రామునకు బట్టము గట్టెద మోదమేదు ర
స్థిరమతి మీరనుగ్రహము జేయుడు నేడిదె తాపసోత్తమా! 43

వ॥ కావున 44

కం॥ తెప్పింపుడు సంభారము
లిప్పింపుడు వలయు వస్తులెల్ల పనులకై
యొప్పింపుడు బహుజనముల
రప్పింపుడు మీరలరిగి రామునిచటికిన్ 45

కం॥ నూతన విచిత్ర రుచియుత
కేతనములు నిలుపదగు నికేతనములపై
నాతత బహుకాంచన ము
క్తాతతిమయ తోరణములు ఘటియింపదగున్ 46

చం॥ అనిమునితోడ బల్కి విభుడంత సుమంత్రుని మంత్రి సత్తమున్
ఘను పిలువంగబంచి యనఘా! మునిపుంగవుడానతిచ్చునే
పనులవి యెల్ల జేయుడిదె బట్టము గట్టెద నెల్లినే శుభా
ర్జనమతి యౌవరాజ్యమున రాముని సర్వగుణాభిరామునిన్ 47

కం॥ అనవిని యనుమోదమునను
మనమున బెనగొనగ నాసుమంత్రుడు మౌనిన్
గనుగొని మునివర! యేపని
కనుమతి బనుపనగు బనుపుమానను ననుడున్ 48

వ॥ అంత మహాప్రతిభా గరిష్ఠుండును, విజ్ఞాన వరిష్ఠుండును, యగు వసిష్ఠుండు విశిష్టంబుగా నతని కిట్లనియె రేపు ప్రభాతంబున ప్రభూత శుభ లక్ష్యంబగు మధ్య కక్ష్యంబున సువర్ణ భూషణ సంపన్నలగు కన్యకలన్ బదార్గురిని మణి కనకాలంకారవతంబులును చతుర్దంతంబులును, నగు ఐరావతజాతి సంజాతంబులును, నగు గజ వ్రాతంబులును, వాయురయంబులును శుభలక్షణా నిలయంబు లగు

హయంబులును, నానావిధ తీర్థోదకపూర్ణ స్వర్ణకుంభ సహస్రంబులును, నవీన సమగ్ర వ్యాఘ్రాజిన త్రితయంబును, రత్న దండ యుక్తంబును, ముక్తామణి విచిత్రంబునగు శ్వేతచ్ఛత్రంబును, విమలంబగు చామరయుగళంబును నవ్యస్ఫురణంబులగు దివ్య మాల్యాంబరాభరణంబులును, నాయితంబై యుండనియమింపుడు కుశపాణులగు మునుల సత్కరించి వసింపంజేయుడు పాఠక పఠనంబులును భేరీమృదంగ పటహకాహళ వేణు వీణాది వాదనంబులును గాయక గానంబులును, నర్తక నర్తనంబులన్ ప్రవర్తింప గావింపుడు, బాహ్యాంగణంబున శతాంగ తురంగాది చతురంగబులు, సాయుధ సన్నద్ధంబులుగా యుద్ధసన్నద్ధంబులు గానొనర్పుడు, నగరంబునం గల దేవతాయతనంబులన్నియున్ బూజాబలి ప్రదాన విధానంబుల దృప్తి నొందింపుడు వివిధోపాయన పాణులై రాజశ్రేణులు వేగంబున స్వాగతులై యుందురుగాక, యని సుమంత్రు, నామంత్రించి నమ్మంత్రివర్యుండును శ్రీమంతుడును భగవంతుండును నగునమ్ముని కాంతుండానతిచ్చిన ప్రకారంబున ననేక విచిత్రతరంబుగా పురంబు నలంకరింపంజేసి తత్తదుచిత సంభారంబు లొనరింపుచుండెనయ్యవసరంబున 49

తే.గీ. స్యందనం బెక్కిమౌని సంక్రందనుండు
సుందరంబగు రాముని మందిరంబు
జొచ్చి కక్ష్యాత్రయము దాటి వచ్చి యచట
రథముడిగియంత నిజమనోరథము దగను 50

సీ॥ ఆచార్యుడౌటచే ననివారితుండౌచు
నంతఃపురము జేర నరుగుదేర
గురునాగతునిగాగ నెరిగి వేగమెరాము
డపుడు బ్రత్యుత్థానమాచరించి
యంజలిసేర్చి సాష్టాంగ దండమొనర్చి
కనకపాత్రిక బూని జనకపుత్రి
సలిల మొసంగ దచ్చరణముల్ గడిగి ర
త్నాసనాసీనుని జేసి యతని

తే.గీ॥ బ్రీతితోడను బూజించి సీతతోడ
తనరనయ్యంబువులు శిరంబున ధరించి
యేగృతార్థుండ నైతి మునీంద్రయనిన
మునియు నవ్వుచు రామునకనియెనిట్లు 51

కం॥ నీపాద సలిలమూని యు
మాపతి ధన్యత వహించె మజ్జనకు డజుం
డేపునగాంచె శుభస్థితి
ప్రాపుగ నిపుడిట్టు లనగ నగునే రామా! 52

మ॥ అనఘా! లోకహితోపదేశకుడ వీవద్దేవ కార్యార్థమున్
దనుజేంద్రాహరణార్థమున్ మరియు భక్తప్రీతి సిద్ధ్యర్థమున్
జననంబందితి విద్ధరన్ నినుహరిన్ సర్వేశునాద్యున్ బరా
త్ముని లక్ష్మీవరుగానెరుంగుదును చేతో వీథి నే రాఘవా! 53

ఉ॥ ఐనను దేవకార్యమిదియౌట రహస్యమటంచు దాచెదన్
దీనిని మాయచే నిలజనించి మనుష్యుడవయ్యు సర్వము
న్మానక జేసెదీవు రఘునందనలోక విడంబనార్థమై
నేనును నిన్ను శిష్యుడని నీకు గురుండనటంచు నెంచెదన్ 54

సీ॥ నీవు గురుండవు దేవతాతతికి బి
తామహుండవు పితృ స్తోమమునకు
నరయనంతర్యామివై జగన్నిర్వాహ
పరతనుండెదవగోచరడవయ్యు
మాయచే బొలుతువు స్వాయత్త శుద్ధ స
త్వాకృతి మనుజుని యట్ల మరియు
వినుము! పౌరోహిత్యమును దూష్య జీవనం
బనియు విగర్హితంబని యరుగుదు

తే.గీ॥ నైననిక్ష్వాకు కులమున నవతరించు
రాముడు బరాత్ముడనుచు బూర్వమున బ్రహ్మ
వలన విని నీదు సంబంధ వాంఛ నాకు
నెనయు గౌరవమని బురోహితుడనైతి 55

తే.గీ. కానమదభీష్టము ఫలింపగలిగె నఖిల
మోహినియునైన నీమాయ మోహపెట్ట
కుండజేయుము నన్నిప్పు డో రఘువర!
గురునకును దక్షిణయొసంగ గోరితేని 56

కం॥ రామ! ప్రసంగవశంబున
నీ మహిమయు నమర కార్యనియతి దెలిపితిన్
నీముందట నీగతినే
నీమాట వచింప జెల్ల దేరికి నైనన్ 57

వ॥ అని చెప్పి వసిష్ఠుండు వెండియు బ్రకృతకార్యం బెరింగించెదనని
యిట్లనియె 58

సీ॥ వినురామ! ననురాజునిను బిల్వగను బంచె
దశరథుండమ్మహీధవుడు రేపు
నీకుర్వి రాజ్యాభిషేకంబుగావింప
దలచెనీవును ధరాతనయతోడ
నే డుపవాసంబు నియమ విధంబుగా
జేయుము మరిభూమి శాయివగుచు
నేరాజసన్నిధి కేగెద నీవు రే
పుదయకాలమున వచ్చెదవు గాని

తే.గీ॥ యనుచు వచియించి రథమున నధివసించి
రాజగురుడంత నృపమందిరమున కరిగె
రాముడపుడు లసన్ముఖ ప్రేముడగుచు
నెలమిలక్ష్మణుతోడుత నిట్టులనియె 59

మ॥ విను సౌమిత్రి విభుండు రేపెయొసగున్ వేయౌవరాజ్యంబునా
కెనయన్ నేను నిమిత్తమాత్రమగు దీవే కర్తవున్ భోక్తవై
యనఘా! సర్వభరంబు బూనుము బహిఃప్రాణంబులై పొల్తునా
కనయం బీవటుగాననేమియు విచారాంశంబు లేదిచ్చటన్ 60

ఆ.వె. అనుచు బల్కిరాముడవ్వసిష్ఠుడు జెప్పి
నట్టి వివిధ విధులు నాచరించె
నమ్మునీశ్వరుండు నమ్మహీశ్వరునకు
సకలమును వచించి చనియెనపుడు 61

వ॥ అంతనప్పంక్తిరథుడవ్విధంబున మునిపుంగవునికెరుంగించి రామాభిషేక వృత్తాంతంబంతయు నృపాంతికంబున వినియొక్క పురుషుండు హర్షంబునంజని కౌసల్యా సుమిత్రల కవ్వార్త జెప్పిన నప్పుణ్యాంగనలధిక ప్రమదంబున నమూల్యహారంబులతని కొసంగి మరియు నప్పడతి ప్రీతికృత పుత్రవాత్సల్యయగు కౌసల్యయు రామకార్య సిద్ధ్యర్థంబులక్ష్మీ ప్రార్థనం బొనర్చి తనమనంబున 62

చ॥ పనుపడ సత్యవాది నరపాలుడు దీని నొనర్పు నైననుం
గనుగొన కైకయీ వశుడు కాముకుడౌటను నేమి జేయునో
యనుచు సమాకులాత్మయయి యత్తరి కోసల రాజపుత్రి దు
ర్గను నతభక్త వర్గను విరాజిత పూజల దేల్చెనెంతయున్ 63

- పట్టాభిషేక భంగము -

సీ॥ ఆసమయంబునందట నిర్జర శ్రేణి
వాణితో దేవియా వనజభవుడు
వచన పద్ధతి నీవు వసుధలో దగునయో
ధ్యాపురి కరిగి బ్రయత్నముగను
రామాభిషేక కార్యము విఘ్నమొనరింపు
మందర యనుదాని మదినిజొచ్చి
ఆమీద కైకేయి యందు బ్రవేశింపు
మట విఘ్నమొదవ నీవిటకురమ్ము

తే.గీ॥ పొమ్మనిన నియ్యకొని వాణిపుడమిలోన
నమర హితమౌట గాన కుబ్జాఖ్యయైన
నఖిల కుమతి ధురంధర నాత్రివక్ర
బంధురను మందరను జొచ్చె పరుషగతిని 64

వ॥ తదనంతరంబ 65

మ॥ సురసంప్రేరిత భారతీకృత మతిక్షోభోద్గత క్రోధ మం
ధర యామంధర మందిరాగ్రతల సౌధంబెక్కి వీక్షించెన
ప్పురిలోనెల్లకడన్ వినూత్న శుభసంభూతార్థ సంభారసం
భరణారంభ విజృంభణంబులతి సంభావ్యంబులై గన్పడన్ 66

సీ॥ కనక చిత్రిత పతాకా నికాయములతో
విమలమౌక్తిక వితానములతోడ
రమణీయ ఘనసార రంగవల్లికలతో
నవహరిన్మణి తోరణముల తోడ
భరితేక్షుదండ రంభాకాండ పటలితో
కమనీయకాయమానముల తోడ
చందన మృగనాభిసాంకవచర్చతో
భవ్యసుధానులేపముల తోడ

తే.గీ॥ ప్రతిగృహారచితోత్సవ ప్రతతితోడ
వితత మంగళ తూర్యాది వితతితోడ
నతిశయాలంకృతంబైన యప్పురంబు
గాంచియక్కాంత విస్మయక్రాంత యగుచు 67

శా॥ ఆసౌధంబటుడిగ్గి దాసిగని కాంతా! నేడు నానావిధో
ల్లాసాలంకృతులం గనందగియె నేలా? యీపురంబంతయున్
గౌసల్యా సతియున్ మహీసురులకున్ గౌతూహలాప్తిన్మణీ
వాసోర్థాదు లొసంగెడుత్సవములావాసంబులందయ్యెడిన్ 68

కం॥ ఇదియేమి కారణంబన
నదియును మంధరను గాంచి యతివ! దశరథుం
డుదితయశుడు రామున కిం
పొదవగ యువరాజపట్ట మొసగెడు రేపున్ 69

వ॥ కావున దన్నిమిత్తంబునం బురోత్తమంబు సకలంబు నకళంకంబుగా నలంకరింపనయ్యె నయ్యుత్సాహంబున జనంబులుత్సవంబు లొనర్చెదరనినవిని విధి ప్రేరణంబున వైరంబు జనింపజని స్వామికి సపత్నీ తనూజుండను వ్యాజంబున రామాభిషేక విఘ్నోపాయంబు నంతరంగంబునం జింతింపుచునప్పుడనిప్పు డ్రొక్కిన కోతిరీతి యన్నాతి క్రోధాతిశయంబున నతిరయంబునన్ కైకేయీ నిలయంబునకు వచ్చి యచ్చోనేకాంతంబున దుకూలపాళి పర్యంకం బగు గేళీపర్యంకంబున శయనించియున్న యన్నళినాక్షినీక్షించి యిట్లనియె 70

మ॥ అతి సౌందర్యమదంబు భాగ్యమదముం బ్రాపించితద్గర్వ సం
గతి చేనేమి యెరుంగకన్ నిదురబోగా సంపదల్ జేరునే
యతి సౌఖ్యస్థితులూరునే? సకల కార్యంబుల్ జెడుంగాన నే
డతివా! నీకుమహా భయంబుపగతం బయ్యెన్ విచారించినన్ 71

కం॥ అనినన్ గైకయి దానికి
ననియెన్ భయమేమి యొదవె నధిపతి సుఖియే
తనయులకు కుశలమేయన
గనుగొని మంధరయు మదిని కటకటపడుచున్ 72

వ॥ ఇయ్యంగన నేమియు నెరుంగదు గదా యదియు నెరింగించెదనని
యిట్లనియె 73

కం॥ ప్రేమాయతి రామునకున్
భూమీపతి రేపు పట్టమున్ గట్టంగా
నేమించె పురవరంబున
తామించె మహోత్సవములు తద్విభవమునన్ 74

తే.గీ॥ అనిన దిగ్గన లేచి హర్షాప్తి దోచి
హితవచన వీచి బలికి యయ్యింతి జూచి
కైకదానికి మణిగణోత్కరములయిన
హేమమయ పాదకటకంబులిచ్చుటయును 75

కం॥ ఆపారితోషికమునకు
నేపారిన కినుక కుబ్జ యిట్లనుసుదతీ!
యాపద యొదవగ ముదముం
జూపెద విదియేమి మిగుల చోద్యము గాదే! 76

సీ॥ అనినమంధరకు నిట్లను కైక హర్షకా
ర్యమునందు భయముగా ననియెదేమి?
భరతున కన్నను భక్తుండు యుక్తుండు
హితవాదియగు రాముడెపుడు దనకు
కౌసల్యతో దీటుగా నన్నుతిలకించు
గావించు శుశ్రూష ఘనమనీష
యదిగాక సకలజనానంద శుభకరుం
డమల సమస్త గుణాకరుండు

తే.గీ॥ నట్టిరామునకభిషేక మఖిలహితము
నతనిచేనీకు భయమేమి యయ్యెనాకు
జెప్పుమజ్ఞానురాలయీచింతయేల
జేయనీవేళనుత్సవ శ్రీలననిన 77

కం॥ కుబ్జయును క్రోధవికచ మ
నోబ్జంబు విషాదతమము నలమిన మిగులం
గుబ్జంబుగాగ నపుడ
య్యబ్జ ముఖింజూచి యిట్టులనియెన్ మరియున్ 78

కం॥ తెల్లని వన్నీపాలని
యుల్లంబున దెలిసె దీవయోసుదతీ! దా
జెల్లందలచెదు గావున
కల్లరి దైవంబు నిన్ను గాసింబెట్టున్ 79

కం॥ వినుము దేవీ! మద్వచనం
బనయంబెందున మహాభయము నీకొదవున్
వినిపించెద నదియంతయు
గనిపించున్ దాన నవలి కార్యం బెల్లన్ 80

ఉ॥ కామిని యీమహీవిభుడు కాముకుడౌట నసత్యవాదియై
నేమము నన్ బ్రియోక్తులని నిన్నిట మాటల మోసపుచ్చి యా
రాముని మాతయైన తన రామకు కోసల రాజ పుత్రి కిం
గామితముల్ బ్రియం బెనయగా ఘటియించును పుష్కలంబుగన్ 81

తే.గీ॥ ఇది మదిగదించిగాదె యోసుదతి! నీదు
సుతుని శుభరతు భరతుని సుగుణ నిరతు
ననుజుతో మేనమామ గేహమున కనిచి
రాజుపట్టంబు గట్టెడు రామునకును 82

కం॥ రామ! వినులక్ష్మణుండున్
రాముననుసరించు కతన రాజ్యాంశంబున్
బ్రేమంగాంచు సుమిత్రకు
సేమంబేమాడ్కి నైన సిద్ధించు సుమీ! 83

ఉ॥ మానుగరాముడిట్లు బహుమానితుడై భరతున్ భవత్సుతున్
మానము బోవ కింకర సమానునిగా నొనరించు సన్నిధిన్
గాని యెడన్ బురిన్ వెడలగా ఘటియించును లేనిచో వెసన్
బ్రాణములన్ హరించు వినుమా! యనుమానము మాని మానినీ! 84

కం॥ పోవంబలుక సపత్నీ
భావంబున రామ జనని బానిసవై నీ
వేవిధి నాసతి గొలిచెదు
సూవే! గేకయ సుపుత్రి! సుందరగాత్రీ!! 85

కం॥ కావున యత్న మొనర్పుము
భావింపగ నీతనూజు పట్టము గట్టన్
భూవిభుని నడిగి యడవికి
వేవేగన్ రాము బనుపు విధము వధూటీ! 86

వ॥ అదియునుం గాక సపత్నీ కృత నిరాకరణంబుకన్న మరణంబు మేలగునట్లగుటంగాదె తొల్లి గద్రూవినతలకున్ దత్తనయులకు సురాసురాదులకు సపత్నీ సంబంధంబగు నీర్ష్యాబంధంబనుబంధం బయ్యెనన మంధర బోధించు నవసరంబున సురప్రేరితయగు సరస్వతియు గైకయీ హృదయదేశంబు బ్రవేశించి గలచినం దదీయ భాషితంబులు హితంబులుగా దలంచి యచ్చంచలాక్షి దానికిట్లనియె 87

కం॥ భూవిభుడు రామునకు నే
డీ విభవంబియ్యదలచి యే విధినిలుచున్
దావనము కేల బనుచున్
దావలముగ భరతునకును ధరనెట్లొసగున్ 88

వ॥ అనినం దనమాట కనుగుణంబుగా బలుకుట యెరింగియయ్యంగనతో నిక్కార్యంబునకు బూర్వనిశ్చితంబగు నొక్కయుపాయంబు దెలిపెద వినుమని మంధర యిట్లనియె 89

సీ॥ మునుసురాసుర యుద్ధమున నింద్రుచే సహా
యార్థమర్థితుడై మహారథుండు
దశరథుండును సైన్య తతితోడ నీతోడ
నఖిలాస్త్రములతోడ నచటి కరిగి
యమర వైరుల తోడ సమరంబుసేయ ర
థాక్ష కీలము వ్రీలియవని బడియె
నతడది యెరుగడీవది యెరుంగుచు పతి
ప్రాణరక్షణ గూర్చి బాధ కోర్చి

తే.గీ॥ ధైర్యమున కేలు కీలరంధ్రమున నుంచి
నిలిచితీవంత సకల దైత్యులవధించి
భర్తనిను గాంచి యాశ్చర్యపరతనించి
మించి హర్షించి నినుగౌగలించి పలికె 90

చ॥ వరదుడనైతి వేడుమతివా! మతి వాంఛిత మెద్దినీకగున్
వరయుగళం బటంచు చెలువా! చెలువార విభుండ బల్కగా
బొరి పొరి నీవు నన్నరవిభున్ రవిభున్ గని దేవసత్య వి
స్ఫురణను నాకభీష్టవరముల్ వరముల్ దయసేసెదేనియున్ 91

కం॥ ఆ వరములు నాయవిగా
క్ష్మావర! నీయందెయుండగా నగునాకున్
గావలయు నప్పుడియ్యం
గావలయున్ గొన్నినాళ్లుగాగా ననఘా! 92

ఆ.వె॥ అనిన దానికియ్య కొనిమేదినీజాని
నీగృహమున వచ్చి నిలిచెననుచు
మునుపునీదు వలన వినియుంటి నిపుడు సం
స్మృతికివచ్చెనది సుశీల! బాల! 93

ఉ॥ కావున నీవు నావరయుగంబున నొక్కటి చేత రామునిన్
దావుగ దండకావన పదంబునకై పదునాలుగేడులున్
బోవగ నొక్కటన్ భరతు భూమికిబట్టము గట్టవేడుమా
భూవరుడిచ్చు నీకునిది పూర్వము నందు వరంబొసంగుటన్ 94

కం॥ ఆమీదట నీమాడ్కిన్
భూమీపతియగును నీదు పుత్రుడు భరతుం
డీమహిని ప్రబుద్ధుండగు
కోమలి! యటమీద జూచుకొందము సుమ్మీ! 95

మ॥ అదిగానన్ మదిలోన కోపమిడి క్రోధాగారమున్ జేరి మై
కదియన్ మైలపటంబుగట్టి కడువేగన్ దీసి భూషావళుల్
వెదగాజల్లి శరంబుతోడబడియుర్విన్ బిల్చినన్ బల్కకన్
హృదయం బేరికినీక కేకయ కుమారీ! దీనవైయుండుమీ! 96

కం॥ అందున మనుజేంద్రుడు నీ
యందున బ్రేమమున సత్యమాడిన కతనన్
సుందరి! నీకునభీష్టము
నొందించున్ జూడు మామదుక్తిస్ఫూరిన్ 97

ఆ.వె॥ అనుచునాత్రి వక్రయనిన వాక్యంబులు
నహితకరములనుచు నరయకపుడు
హితకరములు గాగ నెంచె గేకయపుత్రి
దుష్ట సంగమైత్రి తోడ గూడి 98

కం॥ దుస్సంగము మతిజెరుచును
దుస్సంగము లేనియట్టి దుఃఖములిచ్చున్
దుస్సంగము దురితములిడు
దుస్సంగము కన్న వేరె దోషము గలదే! 99

తే.గీ. అంత గైకేయి యాకుబ్జ నరసి పలికె
నింతి యిటువంటి బుద్ధి నీకెటులగలిగె
వక్రసుందరి! నాకు నీవంటి యిట్టి
బుద్ధి సంపద గలుగంగ బోలదయ్యె 100

కం॥ తరుణి! విను మత్తనూజుడు
భరతుడు రాజైననీయుపాయముచే ని
న్నరయుదు బ్రాణప్రియగా
నురుతరముగ గ్రామశతము నొసగెద నీకున్ 101

కం॥ అని తనదండను మంధర
జనుచుండన్ దండహత భుజంగిని పుట్టన్
జనుగతి యొక శూన్యగృహం
బునకున్ జని బరిజనముల బోనడిచి వడిన్ 102

సీ॥ మణిసొంపు పటలంపు మైలనింపు విధాన
తనువునమలిన వస్త్రంబు బూని
భావిభూషాచ్యుతి ప్రాప్తి దెల్పెడురీతి
వివిధ భూషావల్లి విడిచి చల్లి
తొడినలంకారాప్తి దొలగునిట్లనుభాతి
నంగరాగవిభూతి నపనయించి
యుగ్రత్రివక్రాగ్ర వాగ్రస్త గావున
కడుసోలు గతినేలబడి పొరలుచు

తే.గీ॥ దశరథుని ప్రాణవాయువుల్ ద్రావదలచు
క్రూరభుజగిని బోలెపూత్కార మొలయు
కేకయ కుమారి మరికోపగృహము జేరి
యుండె నీనినపులి గుహనుండు నటుల 103

చం॥ ఇటుల వసించి మంధరకునిట్లను గైకవిభుండు రామునే
డటవికి బంపెనేనిదగు నప్పని సేయక యున్న బ్రాణసం
ఘటనకు బాయుదేనకట కానకు రాముడు బోవునంతకే
నిట ధరణిన్ శయించి వసియించెద నీగతినంచుబల్కినన్ 104

వ॥ అంత నక్కుబ్జయు నయ్యబ్జముఖిన్ గూర్చి దుర్యశంబున కోర్చియైన నిక్కార్యంబు నిర్వహించి
మనోరథంబు సాధించుమని మరియు నిట్లనియె 105

కం॥ నీపట్టిన పట్టు బిగన్
జేపట్టిన దాన శుభము సేకురునని దా
నాపట్టున కుబ్జయుజన
గా పట్టముతోననుండె కైకయు నటులన్ 106

శా॥ ధీరుండున్ గరుణావిహారుడు సునీతి స్ఫారుడున్ సద్గుణా
ధారుండున్ విధివాదచారుడు సువిద్యాసారుడున్ నిర్మలా
చారుండైనను పాపభావయుత దుష్టవ్రాత సంగంబు బు
ద్ధ్యారూఢిన్ నిరంతరంబుసేయు నతడాహాకాంచు తత్సామ్యమున్ 107

కం॥ ఆకౌతుకముప్పొంగగ
గైకేయీ భవనమునకుగా జనియచ్చో
నాకాంతన్ గానక నా
క్ష్మాకాంతుడిదేమి యనుచు కడువిహ్వలుడై 108

వ॥ మరియు 109

సీ॥ మునుపునేనింటికి జనుదేర ననుజేర
నేతెంచి నవ్వుచు బ్రీతిమించి
తోకొనిచనునట్టికైకేయియేలకో
కనుపించదనుచింత నెనసియంత
మానవేశుడు దూయమాన మానసుడౌచు
నటజేరి దాసీచయంబు జీరి
ప్రియగుణ సీమ మత్ప్రియ భామ బ్రేమమి
మ్మేలిన లేమ లేదేమి యనిన

తే.గీ॥ వారలారాజుతో దేవ! వారిజాక్షి
జేరియున్నది కోపనాగారమునకు
కారణంబేమి యెరుగము మీరలరిగి
చిత్తమెరిగి తదిష్టంబుసేయుడనిన 110

ఉ॥ అల్లననివ్వెరంబడుచు నల్కయొకప్పుడు లేనిదానికే
వల్లన గల్గెనంచు మహివల్లభుడున్ భయమందిడెందమున్
ఝల్లన తత్సమీపమున చక్కవసించి మృదుప్రియోక్తులన్
మెల్లన సంస్పృసింపుచును మేనుగరంబున కైకకిట్లనున్ 111

సీ॥ చీనిచీనాంబర శ్రేణి బూనుట మాని
కడు మైలబడుచేల గట్టుటేమి?
భూరిమణీపాళి భూషాళి సడలించి
విడిమేన గడుసున నడరుటేమి?
పటుహంస తూలాంక పర్యంకములు వీడి
వడి నేలబడి చాల నడలుటేమి?
వరరమ్యతర హర్మ్యవాసావసతిబాసి
క్రోధాలయము జేరగోరుటేమి?

తే.గీ॥ నన్ను వెతట్టె దేటికేనలిన పాణి?
కేరిమాటాడ నేటికే కీరవాణి?
యిష్టమెయ్యది జెప్పవేయించుబోణి!
సకలము నొనర్తు నీకునే జలదవేణి! 112

కం॥ ఇలనెవ్వరు నీకహితము
దలచిన వారకట పురుషతతులో! సతులో!
యల వారలు చెలువా విను
వలనుగ దండ్యులు నవశ్య వధ్యులు నాకున్ 113

ఉ॥ ఎయ్యది నీకవశ్యము నభీష్టము జెప్పుము నాకు దానినే
తొయ్యలి యీక్షణంబుననె దుర్లభమైన నొనర్తు నామదిన్
నెయ్యము నీవెరుంగుదువు నీకు బ్రియుండ వశుండ నౌదున
న్నియ్యెడ భేద పెట్టెదవదేటికె? వట్టి ప్రయాస మేటికే? 114

కం॥ వనితా! నీకు హితుండిల
ధనహీనుండైనజేతు ధనసహితునిగా
ఘనతన్ నీకహితుండిల
ధనసహితుండైన జేతు ధనరహితునిగా 115

కం॥ దేని యొనరింతు విను మె
వ్వానిన్ వెడలింతు జెప్పు వాంఛిత మబలా!
★శానా జెప్పగనేలా!
నేనా ప్రాణంబులైన నిచ్చెదనీకున్ 116

★ శాన = చాల – మాండలిక వ్యవహారం

కం॥ వేమాటలనగ నేటికి
నీమాట యొనర్పనేని నిజముగ నాకున్
బ్రేమను బ్రాణాధికుడగు
రామునిపై యానమదమరాళక యానా! 117

తే.గీ. అనుచు రామునిపై యాన నతిశయాన
నిడిన గురియాన గరియాన కడురయాన
నేత్రములునెల్ల దెరిచి కన్నీరు దుడిచి
పరుష వాగ్వీచి నృపుజూచి పలికెనిట్లు 118

కం॥ క్ష్మాకాంత సత్యభాషా
ధీకలితుడవేని సుప్రతిజ్ఞుడవేనిన్
నాకోరిక సఫలంబుగ
జేకూరగ సేయవలయు శీఘ్రముగాగన్ 119

వ॥ అదియెయ్యది యంటేని 120

సీ॥ మునుసురాసుర రణంబున రక్షితుండవై
నాచేత బ్రీతమానసుడవగుచు
నపుడిచ్చితి వరద్వయము నీకు నాకవి
నీయంద దాచి యుండితి నరేంద్ర!
యందొక్కవరముచే నస్మత్ప్రియకుమారు
భరతుని యువరాజు పట్టమునను
సవరింపు మిచ్చటి సంభారముల చేత
నితరవరంబుచే నతిరయమున

తే.గీ॥ మరియు పదునాలుగేండ్లు శ్రీమహితమౌని
వేషియును జటావల్కల భూషియగుచు
కందమూల ఫలాహార గతి నియతిని
దండకావని రామునినుండ బనుపు 121

కం॥ వనవాసాంతంబునమరి
వనమున నేయుండుగాని వచ్చున్ గానీ
వనమునకు నేడు రాముని
జనవర! బనుపుము ప్రభాత సమయమునందున్ 122

ఉ॥ దీనినొనర్పు నిక్కముగ దీనికి కొంత విడంబమైనచో
ప్రాణములన్ త్యజింతును సమక్షము నీవిటు జూడగా నటున్
గానిదె సత్యసంధుడవు గమ్మిది వాంఛితమంచు బల్కె న
చ్చానయు నౌర సాహసము షడ్గుణ మింతికి నానిజంబుగన్ 123

చ॥ అనియిటు కైకబల్కిన భయంకరవాక్యము విన్నమాత్ర న
జ్జనపతి వజ్రపాత హత శైలగతిన్ క్షితిభ్రాలి మూర్ఛచే
నెనసి విచేష్టడయ్యు నొకయించుకసేపున కల్లదేరి మె
ల్లన కనువిచ్చియశ్రుసలిలంబు విదిర్చి మహాభయంబునన్ 124

కం॥ భ్రమమో! మదిదుస్వప్న
క్రమమో! యిది నేనుగాదొ! కైకయిగాదో!
సమతం జనుసతి కీగతి
కుమతంబేమనుచు చింతగుములుచునంతన్ 125

తే.గీ. మరియు నీరీతి మతి జాలిమాలి దేలి
నెరియు వెతదూలి ధృతిమాలి నృపతి మౌళి
మ్రోల నాభీల లీల శార్దూలి బోలి
గ్రాలు గయ్యాళి నయ్యాలి గాంచి పలికె 126

కం॥ ఏమని పలికితి శుభవతి
కామిని మత్ప్రాణ హరణకరవాక్యంబున్
రాముడు గుణధాముడు నీ
కేమపరాధంబు సేసెనే! తెల్పగదే!! 127

కం॥ నాముందర ప్రేమందగ
రాముం దలతువు తదీయ రమ్యగుణంబుల్
వేమరు వర్ణింతువు గద!
వేమరువక శుభములనుచు విమలములనుచున్ 128

కం॥ నిను గౌసల్యను సమముగ
గనునెప్పుడు సేవసేయు కడురాముడటన్
చనుదానికి నీకిపుడెం
దునదానికి వేరనంగ నోరాడెనొకో! 129

వ॥ అదియునుం గాక 130

ఉ॥ కామిని! నీ కుమారునకుగా గయి కొమ్ము సమస్తరాజ్యమున్
రాముని మందిరమ్మున దిరమ్ముగ నుండగనిమ్ము నీకు నా
రామునిచే భయంబణుతరంబును గల్గదటంచు భూవర
గ్రామణి బ్రేమమీరగను కన్నుల బాష్పజలంబు జారగన్ 131

కం॥ భూమీపతి మరియున్నను
భామా! రక్షింపుమనుచు పదముల వ్రాలెన్
గామకులకు నాపన్నుల
కేమయిన నొకింత సిగ్గునెగ్గున్ గలవే! 132

కం॥ వింతగ నాగతి పాదా
క్రాంతుండై యున్నయట్టి కాంతునిగని య
క్కాంత యటుద్రోచి వైచెను
కాంతల హృదయంబులెంత కఠినంబులొకో! 133

ఉ॥ అంతటగైక యంతయు దురంతతరాంతర చింతక్రోధర
క్తాంత విలోచనాంత రుచినాతని జూచి నృపాల! యేల వి
భ్రాంతుడవైతి? విత్తునని పల్కినదీయగలేక లోగితీ
వెంత యసత్యవాదివి కులైక యశంబు గృశంబుగాదొకో! 134

కం॥ సత్యంబు బలికి మొదలన్
బ్రత్యయముగ నీయనోడి మరియు నసత్యం
బత్యంతము బలుకునతడు
గత్యంతర మెడలి నరకగతికేగు సుమీ! 135

వ॥ కావున నీవునాకొసంగిన వాక్యంబు నిక్కంబుగా నొనర్చుమని
మరియును 136

తే.గీ. అధిప ప్రొద్దున నజినాంబ రావృతునిగ
వనమునకు రామచంద్రుని బనుపకున్న
నీయెదుట బాయుదును మేను నేను విషము
గ్రోలియైనను బంధన పాళినైన 137

ఉ॥ నేనిల సత్యవాదినని నీవిటలోక విడంబనార్థమై
బూనితి సర్వసత్సభల భూవరబొంకుల పుట్టవైతివౌ
రా! ననుమోసపుచ్చుటకు రామునిపై శపథంబు జేసిమి
ధ్యానుగత ప్రతిజ్ఞుడవునై నరకంబున జెందె దక్కటా! 138

చ॥ అనియిటు బల్క కైకకటుకైక దురూక్తులు సోక శోకపున్
వననిధిమగ్నుడై మృతక వైఖరి మూర్ఛిలి సంజ్ఞమాలి మే
దినిబడి కొంతసేపునకు దేరియతండటు లుండెచింతతో
నెనయగ కామినీ వశులకెక్కడి సౌఖ్యము లెంచిచూచినన్ 139

కం॥ వనితలు దుష్టులువారల
మనములు కఠినములు పాప మగ్నములగుటన్
గాననెంత సాధ్వియైనను
వనితల వశులగుచు నమ్మవలవదు సుజనుల్ 140

వ॥ అంతట 141

కం॥ ఆరీతి నుండి భూపతి
చేరికెనగు దైవగతికి చింతింపుచు దా
నా రాము గుణము లెన్నుచు
నారేయొక యుగముగాగ నప్పుడు గడపెన్ 142

కం॥ ఆలోనపుడరుణోదయ
కాలోచిత వందిగాయకస్తవములుగా
లోలోన కైక కోప
వ్యాలోలత వారి వారి వారించె వెసన్ 143

వ॥ అంతనిక్కడ వసిష్ఠ నిర్దిష్ట క్రమంబున రాజనగర మధ్యకక్ష్యప్రదేశంబున శుభ సమున్నిద్రులగు బ్రాహ్మణ క్షత్రవైశ్య శూద్రులును, మహాపురుషు లగు ఋషులును, కనకాభరణ సంపన్నులగు కన్నెలును, సుకరంబు లగు ఛత్రచామర గజవాజి ప్రముఖ నిఖిలవస్తుప్రకరంబులును, సమారచిత సౌఖ్యులగు వారస్త్రీముఖ్యులును, బౌరజానపద జనంబును నధిష్ఠించి యుండ నత్తరి స్త్రీబాలవృద్ధ ప్రభృతి సకల జనంబులు రామాభిషేక మహోత్సవ నిరీక్షాసముత్సాహంబుల నారాత్రి జాగరూక దశం జెంది యుండియంత 144

సీ॥ కోటీరకేయూర కుండలాది విభూషు
కందర్ప శతకోటి కలితవేషు
సముచితాలంకార సంపత్సమావేశు
కౌస్తుభావిష్కృత కంఠదేశు
హరినీల కోమల శ్యామలాంగవిలాసు
నాయత పీత కౌశేయవాసు
యౌవరాజైక పట్టాభిషేకనిరూఢు
నసమాన భద్ర గజాధి రూఢు

తే.గీ॥ రమ్యదరహాస రుచిసాంద్రు రామచంద్రు
నతనికి శితాత పత్రమున్నతి వహించు
సరస లక్ష్మణు లక్ష్మణు వరసనెపుడు
రాగజూతుమొ యని యనురాగ మొలయ 145

కం॥ ఎప్పుడు ప్రభాతమగునో!
యెప్పుడునినధాము రాము నీక్షింతు మొకో!
తప్పకనని కుతుకము మతి
నుప్పతిలన్ సకల జనములుండగ నంతన్ 146

కం॥ ఈవరకు లేవడేమో!
భూవరుడనుచున్ ప్రచింత బూని సుమంత్రుం
డావిభుని కడకు మెల్లన
వావిరి జనిజయ వరంబు వర్ధిలననుచున్ 147

సీ॥ రాజు పాదములు శిరంబు సోకగమ్రొక్కి
యతిఖిన్నుడైయున్న యధిపుజూచి
యాసుమంత్రుడు ప్రీతి యన్నాతి కిట్లను
దేవికైకేయి వర్ధిలుము నృపతి
యీగతి నుండుట కేమి హేతువటన్న
యక్కైకయాత్మజయతని తోడ
రామరామయటంచు రాముని నెపుడు జిం
తింపుచు నీరాత్రి నిద్రలేక

తే.గీ॥ జాగరూకతనుండనస్వస్థ లీల
దోచుచున్నది రాముని దోడితెమ్ము
శీఘ్రముగ రాజు రామునీక్షింపదలచె
నన సుమంత్రుండు వెండి యయ్యతివ తోడ 148

కం॥ జనపతి బొమ్మన కేగతి
జనదగునన నతని జూచి జనవిభుడును మో
హనధాముని రాముని దో
కొని రమ్మని వేగ జూడ గోరెద సుమ్మా! 149

వ॥ అనిన సుమంత్రుండత్యంత జవంబునన్ జని యనివారితుండై రామ నివేశంబుబ్రవేశించి యతనింగాంచి నీకు శుభంబగు భవజ్జనకుండు నిన్ను జూడం గోరెడిరయమ్మున రమ్మన రాముండును రథా రూఢుండై సుమంత్ర సౌమిత్రి సమేతుండై యరిగి నగరద్వారంబున రథంబుడిగి మధ్య కక్ష్యంబున నధివసించి వసిష్ఠాదుల యథార్హంబుగా గని యతి త్వరితగతిన్ బితృ సమీపంబునకున్ జని తండ్రి చరణంబులకు నమస్కరించిన 150

తే.గీ. రామునాలింగనము సేయ రాజుదలచి
సంభ్రమము దోచి బాహువుల్ సాచిలేచి
బ్రేమదుఃఖంబు బొడమ హా రామ! యనుచు
వడి తనువు దూల పుడిమిపై వ్రాలెనపుడు 151

కం॥ హాహారవమున రాముడు
బాహావృతి బట్టి తొడలపై బెట్టినచో
నాహా మూర్ఛితు నృపుగని
హాహాకారమున నేడ్చి రచ్చటి వనితల్ 152

ఉ॥ ఈరహిరోదనంబగుట కేమని యచ్చటి కవ్వసిష్ఠుడున్
జేరగనంత రాముడు వసిష్ఠుని కైకనుగాంచి యిప్పుడీ
భూరమణుండు ఖేదమును బొందగ కారణమేమి? తద్విధం
బారయ జూచినంత వెత యయ్యెడు నామదినంచు బల్కినన్ 153

కం॥ ఆ రామునితో గ్రూరా
కారత దృఢతరముగాగ కైకయి బలికెన్
గారణము నీవె సుమ్మా!
భూరమణుని దుఃఖ శాంతి బూన్పగరామా! 154

సీ॥ నీచేత నొక కార్యమాచరింపగనయ్యె
నృపతికి బ్రీతిగా నేడు వినుము
పుడమిలో సత్యసంధుడవీవు జనకుని
సత్యవాదిని గాగ సలువవలదె
మునుసురాసుర యుద్ధమున బ్రీతుడగుచు మీ
తండ్రి నాకును వరద్వయము నొసగె
నవి నీయధీనంబులగు నొనర్పగ నీకు
జెప్పగానోడిలజ్జించె నృపతి

తే.గీ॥ సత్యపాశనిబద్ధు నీ జనకు ప్రతిన
నడపి రక్షింప నీవ యర్హుడవు సుమ్ము
వరుస పున్నామ నరకంబు వలన సుతుడ
త్రాతగా పుత్ర శబ్దంబు దగియెననుచు 155

కం॥ ఈలీల కైక బలికిన
శులాహతుడయిన రీతి సృక్కుచు రాముం
డేలా లఘు నరునిన్ బలె
నీలాగుననన్ను ననియెదెంతయు జననీ! 156

తే.గీ. నేను జనకార్థమై ప్రాణమైన నిత్తు
విషమునైన గ్రహింతు పృధ్వీజనైన
విడుతు గౌసల్యనైన బోవిడుతు రాజ్య
మైనను త్యజింతు విను నిశ్చయంబు తల్లి! 157

చం॥ జనకుని చిత్తవృత్తిగని చక్కగ జెప్పకనే ప్రయోజనం
బొనరుచు పుత్రుడుత్తముడు నొయ్యన జెప్పినయంతజేయున
త్తనయుడు మధ్యమస్థితిని దార్చును జెప్పిన సేయనట్టి నం
దనుడధమస్థితిన్ దనరు ధర్మవిధిజ్ఞుల చేత నెంతయున్ 158

ఉ॥ కావున నేనొనర్తు జనకస్వయముక్తము సర్వమున్ బ్రతి
జ్ఞా విధి బూని సత్యమిది సత్యము రాముడు రెండు బల్కగా
బోవునె యంచుదా బ్రతిన బూనిన రాముని మాటజూచియ
ద్దేవినిజప్రయోజనము దెల్పగబూని యనుక్రమంబుగన్ 159

తే.గీ. రామనీయభిషేచనార్థముగ దెచ్చు
నెల్ల నంభారముల చేత నిపుడు మత్ప్రి
యాత్మజుండగు భరతు రాజ్యాభిషేక
నిరతు జేయగ నిదియొక్క వరము సుమ్ము! 160

చం॥ ఇతరవరంబు చేత నిపుడీవు జటాజిన చీరధారివై
యతిరయమొప్పగా జనకునాజ్ఞ చతుర్దశ వర్షముల్ ముని
వ్రతముగ కందమూల ముఖవస్తువులన్ భుజియింపుచున్ దృఢా
యతగతి దండకావనము నందువసింపగ బొమ్ము రాఘవా! 161

కం॥ ఇదియు సుమీ! మీజనకుని
హృదయ గతము జేయు మీవ యిక్కార్యము నీ

కిది రాజుజెప్పనోడెడు
గద యన వినిరాముడపుడు గైకయి తోడన్ 162

కం। భరతునకే యగు రాజ్యం
బరయగ నే విపినమునకు నరిగెదనస్మ
త్పరిచర్య గొనక బలుకక
నరవరుడిట్లుండు కారణంబేమియనన్ 163

కం॥ విని రాముని వచనంబును
ఘనురాముని తనదు నెదుట గని దశరథుడున్
తనుదానె విగర్హింపుచు
ననియెన్ దుఃఖితుడు నగుచు నతిదుఃఖోక్తిన్ 164

తే.గీ. స్త్రీజితు విలోలు దుర్మార్గశీలు భ్రాంత
హృదయునను నిగ్రహించి గ్రహింపుమఖిల
రాజ్యమును నీవు పాపంబురాదు దీన
మహిని సహజంబు దుష్టనిగ్రహము పతికి 165

కం॥ ఈరీతి సేయ జేకుర
దారయ నాకనృత దోషమని వికలుండై
యారాజు దశరథుడు వి
స్తారతరాత్యంత శోకసంతప్తుండై 166

తే.గీ. హాజగన్నాథ! హారామ! హాగుణాభి
రామ! హాప్రాణవల్లభ! హా మహాత్మ!
నన్ను నెడబాసి ఘోరకాననము జేర
నరిగెదే! హాదయాసార! హాకుమార! 167

చం॥ అనుచు నెలుంగునింగి నెనయంగ దనూజుని గౌగిలించి హా
యనిబలవించు రాజుగని యంతిపురంబు గలంగె రాముడున్
దనకర వారిచేదుడిచి తండ్రి విలోచనపాళి మెల్ల మె
ల్లన నతడూరడిల్ల మృదులాలిత శాంతి హితోక్తినిట్లనున్ 168

ఉ॥ దీనికి ఖేదమం దకుము ధీరమతీ! నృపతీ! మదిన్ మదీ
యానుజుడేలు గాత మహినాగతినేధృతి నేగి కాన నీ
దైన ప్రతిజ్ఞ దీర్చి భవదంఘ్రిగనం దగనంత వత్తు రా
జ్యానకునైన కోటి గుణమై వనమే గన మేలునాకికన్ 169

- వనగమన ప్రయత్నము -

వ॥ కావున నరేంద్రా మదీయంబగువనవాసంబునం జేసి భవత్సత్య వాక్య సముద్ధరణంబును, దాననగు దేవకార్యాచరణంబును గైకయీ బ్రీతికరణంబును నగుంగావున నీయనుమతంబున నిశ్చితంబ వనంబునకుం బోవ నభిలషించితి మదర్థంబులగు రాజ్యాభిషేక సంభారంబులు వారింపు డేను మాతల్లియగు కౌసల్యాదేవి నాశ్వాసించి జనకతనయ ననునయించి భవచ్చరణారవిందంబులకు వందనం బొనర్చి సుఖంబున వనంబునకుం జనియెద నని పలికి జనకుని వలగొనిలక్ష్మణుండు దోడన్ జనుదేర గృహంబునకున్ జనియెనయ్యెడ 170

తే.గీ. అంత గౌసల్య రామార్థమాత్మనెంచి
హరిని బూజించి హోమంబునాదరించి
బ్రాహ్మణులకు ధనంబులు బంచిపంచి
ధ్యాన మేకాగ్రముగ మౌన మావహించి 171

తే.గీ. ఘనత నంతస్థమును చిత్ప్రకాశమేక
మట సదానందమయము సర్వాతిశయము
నైన విష్ణుస్వరూపంబు నాత్మ నిలిపి
సుదతియట వేరెరాముని జూడదయ్యె 172

కం॥ అంతట సుమిత్ర రాముని
నెంతయుగని సంభ్రమముననిట గౌసల్యా
కాంతబిలిచి యిట రాఘవు
డంతికమున నరుగుదెంచె ననిబోధించెన్ 173

తే.గీ. అంతనా రామ నామంబునాలకించి
యంతరారాముగనుచుండి యాత్మదృష్టి
వింత నారామ యపుడు దెల్విని వహించి
చెంత నారాము గనియె బాహ్యాంత దృష్టి 174

వ॥ ఇట్లు గౌసల్య రామునిన్ యాలింగనం బొనర్చియుత్సంగంబునన్ సేర్చి శిరంబు మూర్కొని కరంబున నీలోత్పల సచ్ఛాయంబగు నతని కాయంబు నివురుచు మాతృస్వభావంబున 175

కం॥ అన్నా! యాకొంటివిగద
యన్నాదికమిపుడు సిద్ధమై యున్నదిలే
వన్నా! భుజింతువని యన
యన్నాతిని జూచి రాముడల్లననగుచున్ 176

మ॥ జననీయెక్కటి భోజనావసర మిచ్చన్ వేగనే దండకా
వనికిన్ బోవలె నిశ్చయంబుగ వరద్వంద్వంబు సత్యోక్తి మ
జ్జనకుండిచ్చెను మున్ను గైకకవికాంక్షన్ వేడె నద్దేవి న
న్ననుపన్ గానన సీమకున్ భరతు రాజ్యంబందునన్ నిల్పగన్ 177

కం॥ కావున చతుర్దశాబ్దము
లావనమున మునిసహాయినై యుండిమరిన్
వేవేగ నేను మిమ్మున్
సేవింపగవత్తు చింతసేయకుమమ్మా! 178

కం॥ అదివిని కౌసల్య భయం
బున మూర్ఛిలి కొంత దెలిసి బొగిలినమదిలో
ఘన దుఃఖసాగరంబున
నెనయుచు దైన్యమున సుతునకిట్లని పలికెన్ 179

సీ॥ వినురామ! వనసీమమునకీవు జనుదేని
గొనిపొమ్ము వెనువెంటనను నిజముగ
కానిచో నిటనీవు లేనిచో నిక జీవి
తముబూన నేక్షణార్ధంబునైన
బాల! వత్సము గోవు బాయ లేనటు నిన్ను
బ్రాణతుల్యుని నిన్ను బాయలేను
రాజు బ్రసన్నుడై రాజ్యంబు భరతున
కిడుగాక నినుబంప నేలనటవి

తే.గీ॥ కకట! కైకేయికిని బ్రీతుడై వరముగ
నీమహీనేత సర్వస్వమిచ్చుగాత!
నృపతికేనియు గైకేయికేని సేయ
గలుగునపరాధమేమి నీవలన తండ్రి! 180

కం॥ నాకడుపున పుట్టుటచే
నీకీ కష్టంబు కలిగె నృపనందన! యీ
కైకకు బుట్టుగనైతివి
చేకురు నీరాజ్యమెల్ల సేయను తనయా! 181

కం॥ జనకుడు గురుడగునట్లనె
జననినగుట నంతకంటె సమధికనగుటన్
జనకుడనిపెవనమునకే
ననఘా! వలదంటి సేయనర్హంబిదియున్ 182

కం॥ నావాక్యముపేక్షింపుచు
భూవరు వాక్యంబుసేయబూనితి వేనిన్
జీవితము విడుతునని నా
జీవితసముబాసినపుడు సిద్ధము తనయా! 183

తే.గీ. అనుచు గౌసల్య పుత్రమోహమున జింతి
లంగ తద్వాక్యములు విని లక్ష్మణుండు
జగములు దహించులీల రోషంబుగ్రాల
నన్న రాముని జూచియిట్లనుచు బలికె 184

ఉ॥ భ్రాంతునికైకయీ వశునపస్మృతు వృద్ధుని బట్టి వైచి య
త్యంతబలాన్వితున్ భరతునాతని బంధుల మాతులాదులన్
ద్రుంతును నేడు రోషశిఖితో జగమెల్ల దహింపజాలునౌ
నెంతయు మత్పరాక్రమము నెల్లసురల్ గనుచుండ రాఘవా! 185

మ॥ అభియాతి వ్రజభీమ రామ! వినుమా! యత్నంబు గావింపు నీ
యభిషేకార్థముగాగ వేగనిట విఘ్నావృత్తి వర్తించు నీ
కు భటవ్రాతముద్రుంతు మత్కరనటత్కోదండదండాశని
ప్రభమౌర్వీలతికా ప్రచండ విగళద్బాణప్రతానంబులన్ 186

వ॥ అని పలుకుచు గుపితుండగు సుమిత్రా సుతునాలింగనంబుజేసి రఘుపుంగవుండు సముచితంబుగా
నిట్లనియె 187

కం॥ శూరుడవు సకల విదిత వి
చారుడ వదిగాక నాకు సమధిక హితసం
చారుడ వెరుగుదు నీబల
సారం బిదిగాదు కోప సమయము వత్సా! 188

కం॥ జనకోక్తియు శాస్త్రోక్తియు
జనపతి సూక్తియును నడపజను ధర్మంబుల్
వినునీయన్నియు నిచటనె
గనబడు గావునను నడపగానగుదీనిన్ 189

చం॥ జనకుని సేవ తీర్థపరిచర్య ఫలంబు తదుక్తిపాలనం
బున సకలాగమాధ్యయన పుణ్యము తత్పరిపూజనంబుచే
ననిమిష రాజపూజన ఫలాప్తియు సేకురు సెప్పనేలన
జ్జనకుడె దేవుడంచుగను సాధువు మోక్షముగాంచు లక్ష్మణా! 190

వ॥ కావున నెన్నిటన్ జనకానుసరణంబు ముఖ్య ధర్మంబగు నదియట్లుండ నిమ్ము 191

తే.గీ. ఇపుడు గనుపడు రాజ్యదేహేంద్రియాది
యగు ప్రపంచంబు సత్యంబ యగునయేని
నీప్రయాసంబు సఫలమిన్నియును మిథ్య
లగుట దీనిని గాంక్షింప రార్యు లనఘ! 192

సీ॥ భోగముల్ మేఘముల్ బూనిన సంచల
చ్చంచలాస్థితి నతిచంచలంబు
లగ్ని సంతప్తలోహస్యంది జలబిందు
గతి వాయువధిక శీఘ్రవ్యయంబు
నంగముల్ దెలియంగనంబు బుద్బుదముల
సంగతి గాక్షణభంగురంబు
లెనయించు విభ్రాంతి నింద్రియజాలంబు
నింద్రజాలము లీల నెనసిజాల

తే.గీ॥ నిట్టి సంసార సంచార మిదివిచార
కలనజెడిపోవు పని మాలి కలను బోలి
యగుట నింతయు నధ్రువంబనియెరింగి
శాశ్వత పదంబు గోరగా జనుబుధుండు 193

తే.గీ. తన్నుభుజగంబు భక్షింపతాను మక్షి
కముల భక్షింపదలచు భేకమును బోలి
లోకమును మృత్యు వక్త్రంబులోన నుండి
యధ్రువములగు భోగంబులభిలషించు 194

చం॥ అరయగ దేహభోగములకై బహుదుఃఖములైన నోర్చియున్
నరుడనిశంబు కర్మములొనర్చును దేహము కన్నభిన్నుడౌ
పురుషుడు గాన నెట్లతడు భోగములన్ భుజియించు నక్కటా
దరలని భ్రాంతిచే మదివృధాశ్రమమే కద! యెంచి చూచినన్ 195

చం॥ సొరిది కళత్రపుత్ర పితృసోదర బాంధవ ముఖ్య సంగమం
బరయ నదీప్రవాహపతితాగతకాష్ఠములట్ల గూడుచున్
బరిపరివీడు నైజము ప్రపాగత జంతుల బోలి మోహమున్
బొరయకనుండగా వలయు బోవుచు నున్నెడ వచ్చుచున్నెడన్ 196

ఉ॥ ఛాయ విధంబునన్ గనక సంపదలన్నియు నస్థిరంబులౌ
ప్రాయముతోయ భంగగతి భంగము నందు గణింపస్వప్నపున్
బ్రాయము కామినీ సుఖము భ్రాంతి ఘటించును జూడనల్పమౌ
నాయువుదీనికై నరు డహా! యభిమానము సేయనేటికిన్ 197

తే.గీ. అధిక దుఃఖాకులంబు రాగాదిసంకు
లంబు గంధర్వ నగర తుల్యంబునైన
యట్టి సంసారమును మూఢుడనుసరించి
యఘములను జెందునది ద్రోయు నార్యుడనఘ! 198

తే.గీ. క్రమముగను సూర్యుని గతాగతముల చేత
నాయువు బ్రతిక్షణము బోవుటది యెరింగి
సకల జనములు ముదియుట జదియు టెరిగి
యేల మృత్యువు గానలేరెవ్వరైన 199

కం॥ ఇదిపగ లిదిరాతిరి నే
డిది జేయుదమనుచు భోగబృందమునందే
మదివలచుచు నాయువుజను
టది యెరుగడు మరచి మూఢుడమల విచారా! 200

సీ॥ ఆమఘటస్థంబునగునంబువుంబలె
క్షణములో నాయువు జనుట యెరిగి
సకలరోగావళి శత్రుపాళిని బోలి
యెనసి దేహముదపియించు టెరిగి
దారుణవ్యాఘ్రి చందమునముందర నిల్చి
చెచ్చెర జరయు భర్జించుటెరిగి
మృత్యువుదనతోడ మెలగుచు నే వేళ
నొడయు కాలము జూచుచుండుటెరిగి

తే.గీ॥ నేను విప్రుడ నృపుడ పండితుడ లోక
విశ్రుతుడ సుందరుడ ధనాన్వితుడననుచు

మోహమును సేయుమనుజుడీ దేహమునను
తుద వహికి భస్మమైపోవు బ్రదుకునకును 201

కం॥ తోలును నెమ్మును మాంసము
బ్రోలుగ విణ్మూత్ర శుక్లరుధిరయుతంబై
చాలగ వికార పరిణా
మాలయమగు దేహమాత్మయన నెట్టులగున్ 202

తే.గీ. ఆగతిన నాత్మయైన దేహాభిమాన
మఖిల దోషావళిని దానమగును గాన
నట్టియీ దేహమందు నీవాస్థ జేసి
జగముల దహింప నూహింప జనునెయనగ 203

తే.గీ. దేహమేనను నట్టి బుద్ధియుగణింప
నగునవిద్యయనంగ దేహంబుగాదు
నేనలచిదాత్మయను బుద్ధి నిశ్చయంబె
విద్యయని చెప్పనగు తత్త్వవిదుల వలన 204

కం॥ ఆరయ నవిద్య సంసృతి
కారణమగు విద్య తద్విఘాతుకమగుటన్
వారక మోక్షము గోరెడి
వారలెరిగి నభ్యసింపవలయున్ విద్యన్ 205

వ॥ అదియును గాక 206

కం॥ బాధించు రిపులు కామ
క్రోధాదులు మోక్షమునకు గురుగతినందున్
గ్రోధంబెచాలు నెప్పుడు
వేధించన్ విష్ణుమనుచు విమత విభేదీ! 207

ఉ॥ క్రోధము చిత్తతాపమొనగూర్చును గ్రోధము పాపమూలమున్
గ్రోధము ధర్మనాశకము క్రోధము సంసృతి బంధనంబగున్
గ్రోధము జెందినంతన నరుండొగి భాతృ పితృప్రియాదులన్
బాధలు సేయు గావున నవశ్యము క్రోధము వీడగాదగున్ 208

వ॥ అదియునుంగాక కామక్రోధ లోభమోహమదమాత్సర్యదంభాహం కారాభిమాన పైశున్యాదులగు నీ
దుర్గుణంబులంకురంబులన్ బలెన్ బొడసూపి హితశత్రులవలెన్ బహిరంతరంబుల నావరించి దుర్జనుల

గతిన్ బుణ్యవర్జనం బొనర్చి యమదూతలరీతి నరకవ్రాతంబు నొందించు దీనిచేతనగు నజ్ఞానంబునం
జేసిబహుయోనిజనన ప్రయాసంబున కోర్చి దేహంబు నేననిప్రపంచంబు సత్యంబని మృత్యువు
నెరుంగక ననేక వర్షస హస్రంబులుండు వానింబలె తన జీవితంబునకుగా గురుబంధుజనాదులనక
పరోపద్రవంబు సేయుచుండున్ గావున నరుండు రాగాదివంశుండు గాక శమనంబున
భూతదయాపరుడై పరసమృద్ధికి సంతుష్టుండు గావలయునని చెప్పి మరియును 209

కం॥ ఆవిధి క్రోధము సాక్షా
ద్వైవస్వతుడగును తృష్ణ వైతరణియగున్
వావిరి రాగాదులు యమ
సేవకులై నరకమునకు జేర్తురు నరునిన్ 210

కం॥ సంతోషము నందనవన
మెంతయు సుగుణముల కల్పవృక్షములరయన్
శాంతియగు కామధేనువు
సంతతబోధంబు తనకు స్వర్గంబనఘా! 211

కం॥ అదిగాన శాంతి సంపద
మదిదావలముగ భజింపుమా! వినుమచ్చో
నొదవండెప్పుడు శమధన
మదిగల్గిన నీకు శత్రుడనగా ననఘా! 212

వ॥ కావున శమాది సంధానంబగు విజ్ఞానంబునన్ జేసి దేహేంద్రియ మనః ప్రాణబుధ్యాది విలక్షణంబును
సచ్చిదానంద లక్షణంబును శుద్ధంబును స్వయం ప్రకాశంబును నిరవకాశంబును నిర్వికారంబునునై
యాత్మ వెలుంగుచుండు నట్టి యాత్మ దేహేంద్రియ ప్రాణాది భిన్నుండును, నవిచ్ఛి న్నుండనియెన్న
డెరుంగంబడు నప్పుడు గదా మృత్యు జటిలంబగు సంసారదుఃఖ పటలంబు బాసిచెనునట్లగుటం
జేసినీవు హృదంతరంబున నిరంతరంబును తాదృగ్విధంబగు నాత్మస్వరూపంబు భావనావశంబున
నెరింగి బాహ్యంబులగు సకల కార్యంబుల నిర్వ్యాకులంబునం బ్రవర్తింపుచు ప్రారబ్ధంబులగు సుఖ
దుఃఖంబులనుభవింపుచు తద్గతంబులగు మోదఖేదంబుల సమంబుగాజూచుచు ప్రవాహపతితంబగు
కార్యంబొనర్పుము బాహ్యంబున సకల కర్తృత్వంబులు గలుగునట్లుండియు నంతరంబున శుద్ధ స్వరూపుండ
వగుట నిక్కర్మంబులు నిన్నంటవని చెప్పి శ్రీరామ దేవుండు లక్ష్మణున కిట్లనియె 213

తే.గీ. ఇపుడునే జెప్పిన విచారమింతవట్టు
మరువకెప్పుడు భావింపు మానసమున
నిందుచే నీకుసంసార హేయదుఃఖ
మఖిలమును జెంద దెయ్యడ ననఘ చరిత! 214

చ॥ అనియిటు లక్ష్మణుం బలికియంతట రాముడు తల్లిగాంచియో
జనని! మదుక్త తత్త్వము వెసన్మది నిల్పుము నిన్ను దుఃఖముల్
దనక విలన్ ప్రవాహ పతితంబగు నోడయు బోలె మానవుం
డనయము నిల్వకన్ దిరుగు నక్కట కర్మము తన్ను ద్రిప్పగన్ 215

సీ॥ అటు గావున చతుర్దశాబ్దముల్ క్షణమాత్ర
జేసి వేగమెవత్తు చింతిలకుము
నిటుమదాగమనంబు నీక్షింపు శోకాబ్ధి
మజ్జనకుండగు మజ్జనకుని
కైకయీ వాక్య సంక్షపితు మద్విరహాగ్ని
తప్తు నివృద్ధుని తప్పులనక
నుపచరించు మధీశు నుపచరించుట సతీ
ధర్మంబు సాధ్వీమతల్లి తల్లి

తే.గీ॥ తొల్లి జనకోక్తి భార్గవాదులు నడచిరి
గాన పితృవాక్యమది యలంఘ్యంబునాకు
నను నిరోధంబు సేయకు మనుమతింపు
మట్టులైనను సుఖవాసమమరు ననుచు 216

తే.గీ. తనపదంబుల వ్రాలిలేవని కుమారు
తెంపునకు దైవగతికి చింతించియంత
ద్రుతిని గౌసల్య సుతునంక గతుని జేసి
యతని దీవింపదలచియిట్లనుచు బలికె 217

కం॥ వనజభవ హరి శివాదులు
ఘనతరముగ దేవసిద్ధ గంధర్వాదుల్
నినురక్షింతురు వచ్చును
జనుచుగనుచు నిద్రజనుచుసమయములందున్ 218

వ. అనిమరియుంగొన్ని యాశీర్వచనంబులు చేసి గౌసల్య రామునిం బునః పునరాలింగనం బొనర్చి పనిచినం బ్రయాణోన్ముఖుండగు రాఘవుంగని యాక్షణంబ లక్ష్మణుండు నమస్కరించి యశ్రుమిశ్రి తనయనుండై గద్గదవాక్యంబులతో నిట్లనియె మహాత్మా! భవదనుగ్రహంబున మదీయ హృదయ సంశయంబపహృతం బయ్యెడు నీవువనంబునకుంజనిన నేనును వెనువెంట భవత్సేవార్థంబు వచ్చెదనని ప్రార్థించి యారఘువీరుని చేత బహుప్రకారంబుల నివారితుండయ్యు నన్ను రానీయని యెడన్

బ్రాణంబులన్‌బాయుదు నని శపథంబుంబలికిన తమ్మునిదయారసమ్మునగని రయమ్మున రమ్మని
సమ్మతించికాకుత్థ్సుండు సుమిత్రకు నమస్కరించి సనియెనంత సౌమిత్రియుం గౌసల్యా సుమిత్రలకు
వందనంబు గావించి దీవించిరత్తరి సుమిత్ర తన పుత్రుండగు లక్ష్మణునీక్షించి యిట్లనియె 219

తే.గీ. రామునిగనుంగొనుము దశరథుని లీల
మావిధంబున జూడుము మహితనూజ
ఘనముగ మహావనమయోధ్య గాగ గనుము
వినుమిదియధా సుఖంబుగా జనుముతండ్రి! 220

కం. అనుచుసుమిత్రయు లక్ష్మణు
బనిచిననంతటనురామ భద్రుడుసీతన్
జననుతనాశ్వాసించగ
జనియెన్‌తద్ధామమునకు సత్ప్రేమమునన్ 221

వ. ఇవ్విధంబున పరివారంబేమియులేక నేకతంబ రాఘవుండు వచ్చిన 222

కం. వచ్చిన పతిగని నవ్వుచు
హెచ్చిన మతి దత్పదములు హేమఘటమునన్
దెచ్చిన జలములగడుగుచు
నిచ్చనుగూర్చున్న విభునకిట్లని పలికెన్ 223

సీ. సారంగహరిముఖాంచద్బలంబులతోడ
కాంచన స్యందన కలనతోడ
భద్రలక్షణ గజప్రవరసంగతితోడ
పుండరీకాంచిత స్ఫూర్తితోడ
సారసమాన భూదారవర్గముతోడ
చమరవాలాదరక్రమముతోడ
వ్యాప్త కిరీటాది కాలంకృతులతోడ
వంశాదివాద్యరవంబుతోడ

తే.గీ॥ రచితయోగ్యాకృతి సెలంగరాజవిహిత
ధర్మగుణభూతి వెలయంగ దగిన పదవి
శుభమహావని రాజ్యవిస్ఫురణమీర
రాకయిట్లేల వచ్చితి రాజతనయ! 224

కం. అనియడిగిన వినిసీతన్
గనినవ్వుచు రాముడనియె కామినియటవీ
ఘనరాజ్యమొకదండక
వనరాజ్యంబిచ్చెనాకు వసుదాధిపుడున్ 225

వ. కావున నిప్పుడు జెప్పినప్రకారంబున 226

సీ. సారంగహరిముఖాంచద్బలంబులతోడ
కాంచన స్యందనకలనతోడ
భద్రలక్షణగజ ప్రవరసంగతి తోడ
పుండరీకాంచిత స్ఫూర్తితోడ
సారసమాన భూదారవర్గముతోడ
చమరవాలా దరక్రమముతోడ
వ్యాప్త కిరీటాదికాలంకృతుల తోడ
వంశాది వాద్యరవంబుతోడ

తే.గీ॥ రచితయోగ్యా కృతి సెలంగరాజవిహిత
ధర్మగుణభూతి వెలయంగదగినపదవి
శుభమహావనిరాజ్య విస్ఫురణమీర
బోవుటకు జెప్పవచ్చితి భూమితనయ! 227

తే.గీ. కావునను నయ్యరణ్య రాజ్యావనమున
కేనుబోయెదనిప్పుడు నీవునిచట
నాతి! శ్వశ్రూసమీపంబుననను వసించి
బ్రీతి శుశ్రూష జేయుమన్మాతకెపుడు 228

కం. అనృతముకాదు మదుక్తం
బనినన్విని సీతభీతయై రామునితో
వనమున కేలా? జనుమనె
జనకుడు ఘనుడనిన నతడు జనకజ కనియెన్ 229

చం. నరపతి బ్రీతుడైమును ఘనంబుగగైకకు సత్యసూక్తిచే
వరయుగళంబొసంగె దయ వానిని మానిని గోరునట్లుగా
భరతున కిచ్చెరాజ్యమును బ్రాజ్యమునై తగుదండకావనిం
నెరయచతుర్దశాబ్దములు నిల్వగనాకు నొసంగెమానినీ! 230

తే.గీ. కాన మహిజాత రాజ్యంబుమాని నేను
కాన మహిజాత రాజ్యంబు బూనజనుదు
తోనమహిజాత నీవునిచ్చోనచలము
తోనమహిజాత విష్ణాప్తి దొడరకిపుడు 231

చం. అనవిని సీతబ్రీతమతి నప్పతినారసినేనుమున్నుగా
గనుజనుదాన గానకునికన్ వెనకన్‌జనుదెమ్ము నీవిటన్
ననువిడనాడి పోవదగునా రఘునాయక నేడటన్న నం
తనుబ్రియభాషితన్ సదయతన్ దయతన్ గనిరాముడిట్లనున్ 232

ఉ. బాలికెనిన్ననెట్లు వనపాళికిదోకొని పోనగున్‌బహు
వ్యాళసమాకులంబదినరావళినోలి భుజించుఘోర దై
త్యాళి జరించునచ్చటను హోళినరాళ కరాళసింహ శా
ర్దూల వరాహభల్లుక తతుల్ వసతుల్ గొనియుండు మెండుగన్ 233

తే.గీ. వ్యంజనా పూపసూపాన్నరంజనముగ
భుక్తిలేదామ్ర కటురసోద్యుక్తి నొందు
కందమూలఫలాదులే కానియవియు
గాన మొక్కొక్కచోన యక్కానలోన 234

సీ. మనుజదుర్దర్శిత మార్గంబు దుర్గంబు
శణకాశ కంటక సంకులంబు
భూరిగహ్వరగుహా స్ఫారంబు ఘోరంబు
ఝల్లికాదంశాది వేల్లితంబు
పాదచారశ్రమా పారంబుదూరంబు
నతిసీతవాతాత పాన్వితంబు
బహుదురాగత భయప్రకటంబు వికటంబు
కల్పితతృణ శిలాతల్పకంబు

తే.గీ॥ కష్టతరమగు దండక కాననంబు
కాన నంబురుహాక్షి వేగంబెనేను
వత్తు చూచెదు నిలువు మావాసముననె
భయదగతి రాక్షసులగన్న బ్రతుకగలవె! 235

తే.గీ. అనిన రామునివచనంబు విని వినీత
మేదినీజాత దుఃఖసమేత యగుచు
నలము బరితాపమున గోపమలతి దోప
బ్రచలితాధర వక్త్రయై భర్తకనియె 236

కం. నన్నెట్లు విడువదలచెదు
నిన్నేకానన్యమెరుగ నిర్దోషను సా
ధ్విన్నీదు ధర్మపత్నిని
సమ్మతధర్మో దయుడవు సదయుడవయ్యున్ 237

వ. అదియునంగాక 238

సీ. నీవున్న శైలవనీ కందరమ్ములు
విమలసుందరమందిరములు నాకు
నీవుభుజింప నుండిన కందమూలాదు
లమృతాప్తిగతి దృప్తినలము నాకు
నీవెంటదిరుగనంటిన కంటకగణంబు
మృదుసుమాస్తరణ సమ్మితము నాకు
నీవులీలజరించు నిమ్నోన్నతస్థలుల్
సరసవిహార దేశములు నాకు

తే.గీ॥ నీసమీపంబు దుర్గ సన్నిభము నాకు
చేరినన్నెవ్వరును బాధసేయలేరు
కాన వెతబెట్ట నిన్ను నిక్కాన నీ స
హాయమున కార్య కారిణియగుదునిజము 239

తే.గీ. గణిత శాస్త్రప్రవీణుడొక్కరుడునన్ను
బాల్యమున జూచియిట్లనిపలికెదేవి!
ధవునితోనీకు వనవాస మౌనటంచు
నా ద్విజుడు సత్య భాషణుండగును గాత! 240

వ. వెండియు నొక్క విశేషంబు వివరించెద 241

కం. మును బహురామాయణములు
వినవెకద యెందునేని విపినంబునకున్
జనకజను విడచిరాముడు
జనియెననుట వినుట గలదెజనములవలనన్ 242

కం. కాన నను నెన్నివిధముల
కానకు గొనిపొమ్ము సౌఖ్యకారిణనగుదున్
గానియెడ నీవుజూడగ
ప్రాణంబులువిడుతు సుమ్ముప్రాణాధీశా! 243

తే.గీ. అనిపలుకు సీతనిశ్చయంబరసిరాము
డతివనాతోడరమ్ము రయమ్ముమీర
నయ్యరుంధతికిమ్ము భూషాదులీవు
ధనమువిప్రులకిత్తు నేజనుట కిపుడు 244

వ. అనిరఘువరుండు నిశ్చయించి సౌమిత్రింబంచి ధరిత్రీ సురల రావించి భక్తివినయంబులు భావించి కుటుంబవంతులును సుశీల స్వాంతులును వేదశాస్త్రతత్పరులునునగు నవ్విప్రవరులకు ననేకశత సహస్రాది సంఖ్యావహంబులగు గోనివహంబులును సకలసౌఖ్య సాధనంబులగు ధనంబులును బ్రశస్తంబులగు విచిత్ర వస్త్రంబులును ననర్ఘ్య చరణంబులగు దివ్యా భరణంబులొసంగి వెండియుం గౌసల్యా సేవకులకు నిజాంతఃపుర పరిజనంబులకు ననేక ద్రవ్యంబులిచ్చి మరియును బౌరజానపదు లగు బ్రాహ్మణాదులకు సకలార్ధి జనంబులకు బహుసహస్రంబులగు నర్థంబులిచ్చి వారిచేత దీవనలం గాంచెనంత వసుంధరాసుతయు నరుంధతీసతికి నమూల్యమాల్య భూషణాంబరంబులర్పించె నాక్షణంబున లక్ష్మణుండును నిజాశ్రిత జనంబుల ధనంబులం దనిపి తమతల్లియగు సుమిత్రం గౌసల్యకు సమర్పించి ధనుష్పాణియై రాఘవునగ్రభాగంబున నిలిచె నంత వారలందరు నృప మందిరమునకున్ జనం దలంచియపుడు 245

మ. అమరన్ రాముడు సీతతో ననుజుతో నారాజమార్గంబునం
దమి హర్షాక్షుల బౌరజానపదజుల్ దర్శింప నీలాకృతిన్
సుమనోబాణ సహస్రకాంతిని దిశాస్తోమంబులెల్లన్బద
క్రమపూతాఖిలలోకుడొచ్చు జనకాగారంబు జీరంజనన్ 246

కం. ఈమాడ్కి వచ్చురాముని
సౌమిత్రిని భూమిపుత్రి సమ్మతిగని యు
ద్దామప్రేమల దమలో
దామామోదించిరపుడు తత్పురజనముల్ 247

కం. మునుకైకేయికి వరమి
చ్చినపనికై నృపతి బనుపుచే రామునికిన్
వనవాసము మునివేషము
వినితోషములేక శోకవినివేశితులై 248

కం. రామునికి భూమినిచ్చియు
కామినికై నృపుడు సుతుని గానకుబనుపన్
గామించెనచటి సత్యము
కాముకులకు సత్యవాక్యగరిమలుగలవే! 249

సీ. అజ్ఞాన వతిదుష్టయగు గ్రూరమతికైక
నృపుని వరద్వయం బేలయడిగె?
నడిగెబో! తనకు రాజ్యము వేడకారాము
నారామమునకేల ననుపదలచె?
తలచెబో! తగునిది తగదనకతడుకై
కయివాక్యమేల ముఖ్యముగనెంచె?
నెంచెబో! ప్రియ సుతనిద్ధసత్యవ్రతు
కాముకుడైయేల కానకనిపె?

తే.గీ॥ ననిపెబో! చాలు నిందుండజనదుమనకు
భ్రాతతో సీతతోగూడ రాముడున్న
కాననంబున వసియింపగాగ వలయు
ననుచు నొండొరులనుచు తజ్జనులు మరియు 250

ఉ. చూడుడు జానకిన్ భువనసుందరి నందరుబోతుటీగెకున్
జూడగరాని దెల్లరును జూడగనొక్కతె పాదచారతన్
గూడజనాళి చుట్టుదనుగొల్చుట లేకనువచ్చుచున్నదీ
చేడియ యక్కటా! యనుచు చిత్తములన్ వెతజెందివెండియున్ 251

సీ. జనకభూపతి మేటిసవవాటి నాగేటి
కోటి నాటినయట్టి బోటియీమె
యామిథిలాపుర స్వామి యధ్వరగామి
భూమి బుట్టినదివ్య భామయీమె
మరి విదేహమహీశుమనికి వర్ధిలిజగ
న్మోహినియగు వరారోహయీమె
హరఘోరచాపగుణారోప పణరూప
సంప్రాప్తయగు నవశ్యామయీమె

తే.గీ॥ యీమనోహరశుభగుణారాముఁరాము
బ్రేమవరియించు సిరిమించు రామయీమె
సీతమహిజాత జనక సంభూతరామ
దయితనాఖ్యాతయగుపుణ్య తరుణియీమె 252

వ. అనిగణించి పరివేదించి మరియును 253

కం. మతి సర్వలోక జనస
మ్మతుడీ రాముడు తురంగమాతంగాది
స్థితివిడిచి నడిచిపోయయెను
యితడు జగద్విభుడు జూడుడిందరు గనగన్ 254

తే.గీ. సర్వనాశనియైన రాక్షసియు సుమ్ము!
కైకయను పేరజన్మించెగాకయున్న
లోకసన్నుతుడగురామునేకతమున
నేకతమునకు బొందించునిట్టి వెతల 255

కం. అలరామునకైననువెత
బొలయదె జనకసుత నడచిపోవగనకటా!
యిలపురుషయత్న మదిదు
ర్బలమెంతయు విధిబలంబెబలమగుసుమ్మీ! 256

వ. అనిబహు విధంబుల బహుజనంబులు వగలంబొగులుచుండనందు సాధుజనబృందమధ్యంబున
నుండి వామదేవుండను మునిపుంగవుం డిట్లనియె 257

మ. జనులారా! వగపేల రామునకునై సౌమిత్రికై సీతకై
వినుడీ! దెల్పెద రాఘవుండు పరుడా విష్ణుండు నారాయణుం
డనఘుండాద్యుడు నాదిలక్ష్మి యగుమాయాఖ్యాతయీ సీతయౌ
ఘనుడీ లక్ష్మణుడాదిశేషుడగునిక్కం బింతయుంజూడగన్ 258

చ. ఇతడు రజోభియుక్తి సృజియించునజుండన విశ్వకర్తయై
యితడట సత్వయుక్తి వసియించును విష్ణుడుపాలకుండునై
యితడు దమోనుయుక్తి జరియించు హరుండన నాశకర్తయై
యితడ లమాయ గూడినటియించునటుల్గనుతత్తదాకృతిన్ 259

సీ. ఇతడాది మీనమైహితునివైవస్వతు
విలయవారిధినావ నిలిపి బ్రోచె
నితడాదికూర్మమై వితలగతంబగు
నగమానె వీపున నబ్ధిదరవ
నితడాదిదంష్ట్రియై యిలరసాతలయాత
ఘోరకల్పంబున గోరనిల్పె
నితడాది నృహరిమై హితవాదు బ్రహ్లాదు
గావగోరహిరణ్యకశిపుజీరె

తే.గీ॥ యితడు వామనుడై హృతసుతవిభూతి
నదితియాచింపదెచ్చె రాజ్యంబుమరల
నితడు భృగుపతియై దుష్టభృతినడంచె
నట్టి జగదీశ్వరుడె రాముడయ్యెనిపుడు 260

కం. ఈతడు రావణముఖ బహు
దైతేయులదునుమగలడు తద్దశగళుడున్
ఖ్యాతిన్ నరుడగు రాముని
చేతన్మృతుడగును పూర్వసిద్ధంబిదియున్ 261

సీ. దశరథుండు సుతేచ్ఛతపముచే బ్రార్ధింప
నతనికిహరి రాముడనజనించె
యారావణవధార్ధ మడవికి నడవగా
గలవాడునేడు లక్ష్మణునితోడ
సీతామహాదేవి సృష్ట్యాది కారిణి
యైన విష్ణుని మాయయగునుసూవె!
యిచ్చోట దశరథుండేని కైకయియేని
యణుమాత్రమైన కారణముగాదు

తే.గీ॥ నారదుడు నిన్ననడిగె భూభారవార
ణార్ధముగరేపువచ్చెదననుచు జెప్పె
తానె రాముడు మౌనితోగాన మీర
లితనికైచింతవిడువు డజ్ఞతదొలంగి 262

చం. అనయము రామరామయని యర్ధిబఠించిన వారికెన్నడున్
గనుగొనమృత్యు భీతియనగల్గదు కావున దుఃఖహర్తయై

యెనసిన రామునందు మరియేమి యనంగలికాలమైనచో
మును కొని రామనామమున ముక్తి యగున్ మరిగల్గ దెన్నిటన్ 263

వ. కావున భక్తజనార్థంబును రావణహరణార్థంబును, దశరథమనోరథ సిధ్యర్థంబును నారాయణుండు శ్రీరామనామంబున మాయామానుష వేషంబూన విడంబించుచుండు ననివచించి వెండియు నేతచ్ఛీతా రామ రహస్యంబు నెంతయుజింతించునతనికి విజ్ఞానపూర్వకంబుగా రామవిషయంబగు నిశ్చలభక్తి సంభవించు నీరహస్యంబతి గోపనీయంబయ్యును మీరలారామప్రియులగుట నెరింగించితినని చెప్పి వామదేవుండూరకుండిన నవ్విప్రవరులందరు హృదయ సంబంధంబగు సంశయగ్రంథింబాసి రామునింబరమాత్ముండగు హరింగా నెరింగి రివ్విధంబున 264

ఉ. అంతట రాఘవుం డనుజు డంగనయుం జనుదేరతండ్రిశు
ద్ధాంతము జేరికైకగని యమ్మ! వనమ్మునకేము మువ్వురం
బెంతయుబోవవచ్చితిమి యిచ్చును గాతయనుజ్ఞ యిమ్మహీ
కాంతుడటన్నసంతసిలి కైకరంబున లేచివారితోన్ 265

తే.గీ. చేలములు వీడివల్కల చేలములును
గట్టుడనుచును తనకేల కఠినలీల
రామునకు లక్ష్మణునకును భూమిజకును
నారచీరలు గైకవేర్వేరనొసగె 266

వ. ఇట్లొసంగినరామ లక్ష్మణులు రాజలక్షణంబులగునంబ రంబులం బరిహరించి తద్వల్కలంబులు ధరియించిరంత సీతాంగనయు వాని నెన్నండెరుంగమింగరంబులగ్రహించి రఘుపుంగవు ముఖంబు లజ్జాపాంగంబులం గనుంగొనరాముండు నవ్వల్కలోత్తరీయంబు తదీయ దివ్యాంశుకంబుపై దొట్రువడం జుట్టిన నట్టియెడ రాజాంతఃపుర కాంతలత్యంతంబుగానాక్రందంబుగావింప నదివిని వసిష్ఠుండునిష్ఠ రాలాపంబులం గోపంబుదీపింపగైకేయికిట్లనియె 267

మ. ఘనదుశ్శీల! దురాత్మురాల! వినుమా! గైకేయి! నీచేతనా
వనవాసార్థము రాముడొక్కరుడెబోవంగా వరింపంబడెం
జనుగాకన్ఘనుడాతడట్ల ధరణీ సంజాత కిట్లేలని
వ్వనటంచున్ నిరసించివల్కలములన్ వారించి వైరించియున్ 268

వ. అద్దేవికిదివ్యాంబరాభరణాదులొసంగంజేయువాడై మరియు నిట్లనియె 269

తే.గీ. సీతయతిపూత పతిభక్తిచేతరాము
ననుసరింప దలచెనేని యతివయతివి
భాసిభూషాంబరములూని భర్తతోడ
గ్రీడసేయుత వనవాస ఖేదమెడల 270

చ. అనిన వసిష్ఠసూక్తి వినియంతన పంక్తిరథుండు నాసుమం
త్రునిగనియవ్వనేచర హితుల్ వనసంగతికై రథంబులన్
జనుదురుగాత యీతరి వెసన్ రథమున్ గొనితెమ్ము పొమ్మటం
చనియట రామలక్ష్మణ ధరాత్మజలంగని బేరెలుంగునన్ 271

కం. హా! యను రచితచిరస్నే
హా! యను మజ్జీవితాపహా! యనుగతమో
హా! యను సత్యకృతసమి
హా! యను దినకరకులోద్వహా! యనుమరియున్ 272

కం. మహి తనయా! యనులక్ష్మణు
మహితనయా! యనుచునశ్రుమగ్నాక్షుండై
మహిపతి యతిదుఃఖంబున
మహిపతితుండయ్యె జనము మనములబొగలన్ 273

- వనవాసాగమనము -

వ. అప్పుడప్పుడమిరేని సేదదేరం బరిచారం బొనరింపనంత సుమంత్రా నీతంబగు రథంబున రామానుమతంబున మహీతనయనారోపింప రాఘవుండును జనకునకు బ్రదక్షిణ వందనంబులొనర్చి యాస్యంద నంబునందధివసించె లక్ష్మణుండునుం దూణీరబాణాసన యుగళం బులంగైకొని తానును శతాంగంబున నెసంగె ననంతరంబ సుమంత్రుండుసారథియై యారథిక శేఖరులన్ దోకొని చను నయ్యెడ 274

కం. పదయనిరాముడు నిలుపం
గదయని దశరథుడు బలుకగా సత్వరసం
పదచేసూతుడురథముం
గదలించెను గహనమార్గగతి చోదితుడై 275

వ. అయ్యవసరంబున 276

ఉ. నందనుజూచిచూచినయనంబులకుంగడు దూరమైన ద
త్స్యందనమున్ ధదాస్వనముతద్ధ్వజమున్‌రజమున్ నరేంద్రసం
క్రందనుడల్లగాంచి మరికానక మూర్ఛమునింగిలేచి యా
క్రందమొనర్చె వారిధరగర్భగభీర మహారవంబునన్ 277

కం. ఆనరపతి వెతనొందియు
సూనునిలుపడయ్యె ననృతసూచిత భీతిన్

ధీనిధులు సత్య సంధులు
ప్రాణభయంబైనవిడువ రభిహితవృత్తిన్ 278

తే.గీ. అంత బౌరులు బాలవృద్ధాదిగాగ
బ్రాహ్మణాదికవర్ణముల్ రామరామ
నిలునిలుమటంచు నరుగుచునిలువకరిగి
రతనితో గూడ తద్రథమరుగుజాడ 279

వ. అత్తరిమరియు నద్దశస్యందనుండు నందనుందలంచి చిరతరంబుగా బరితపించి రాముని రథంబుజాడం జనువాడయ్యు వసిష్ఠాదులచేత నివారితుండై పరిజనులతో రామమాతయగు గౌసల్యాసతి మందిరం బునకుందోకొనిచను డందేనియునాకు రామవియోగంబుననగు దుఃఖవేగంబునచిరకాల జీవితంబు భావితంబుగాదు కించిత్కాల జీవితంబు గన్పించుచున్నయది యని గౌసల్యానివేశంబు బ్రవేశించి తల్పంబునంబడి మూర్చిల్లి యల్లనన్ దెలిసి భూనభోంతరదిశావ కాశంబుల నాలోకించి యెక్కడనేనియు నిరాకారంబుగాదలంచి నేమియుందోచక నూరకుండెనంతనిక్కడ 280

కం. ఆరామవిభుడు తమసా
తీరంబారాత్రి జేరిధృతి శయనించెన్
నీరాహారుండునిరా
హారుండై వృక్షమూలమందు సుఖాప్తిన్ 281

కం. సీతయునాథునితోడన్
బ్రీతయగుచు నిలిచెధర్మ భృతనయుడు సుమి
త్రాతనయుండు సుమంత్రా
న్వీతుండైగాచియుండె వెసనగ్రజునిన్ 282

ఉ. అంతట బౌరులందరు రయంబుననచ్చటికేగు దెంచి రా
మాంతికసీమనిల్చి విభుడప్పురి కిప్పుడె వచ్చెనేని మే
మెంతయు బోవువారమతడీగతి రాకవసించినన్వనా
భ్యంతరమందెనిల్చెదమటంచు వినిశ్చితులైవసించినన్ 283

సీ. ఆరాముడప్పుడ ప్పౌరులనిశ్చయం
బెరిగివిస్మయమందియేనయోధ్య
కేగుటలేదు మీరిటుగాసిజెందుదు
రనివారివంచించి చనదలంచి

యందరునిద్రింప నర్ధరాత్రమున సూ
త నియుక్తమగు రథంబునవసించి
రాముడు భూపుత్రి సౌమిత్రియునుగొంత
దూరంబు తొల్లిటియూరిదారి

తే.గీ॥ నరిగి తిరిగియు రథనేమి సరణిధరణి
దోపజూపని వేరొక్క త్రోవబోవ
లేచి చూచియు రాముడులేక శోక
సారులై బౌరులు రథంబు జాడతోడ 284

కం. రాముడు సనెనని తద్రథ
నేమిమార్గమున నరిగి నిజపురికచటం
బ్రేమవసించిరి సీతా
రామధ్యానము నిరంతరము మదిబొదలన్ 285

తే.గీ. అంతట సుమంత్ర చోదితస్యందనమున
త్రోవ రఘునందనుడు సీతతోడగనియె
జనపదములను నదముల మునిపదముల
గిరులదరులను వనముల నురుఘనముల 286

వ. ఇట్లు గనుంగొనుచుంజనిచని శృంగిబేరపురసమీపంబున 287

భుజంగప్రయాతము –

క్షమానందనీజాని గాంచెన్ బ్రమోదో
ద్గమన్మోక్ష సౌధాప్తికాంక్షి స్వపాథో
నిమజ్జజ్జన శ్రేణి నిశ్రేణి రేఖా
క్రమద్భంగ విశ్రాంతి గంగా స్రవంతిన్ 288

సీ. సుస్మితాననమెత్తి జూచుసంగతిసము
త్ఫుల్ల పంకజపాళి బొలుచుదాని
వెడదకన్నులువిచ్చి వీక్షించువైఖరి
విరచకైరవరాజి వెలయుదాని
రమ్మని కరసంజ్ఞ రచియించు సంచున
ప్రచలత్తరంగాళిబ్రబలుదాని
గళరవస్ఫూర్తిచే బిలుచువిధంబున
పక్షిరావంబుల బరగుదాని

తే.గీ॥ నర్ఘ్య పాద్యాది పూజల నలములీల
శుభజలంబులు జేర్చుచు సుమపరాగ
పటములిచ్చుచు నెదురుగా బరచుదాని
వలె నెసగుదాని గంగాభవాని జేరి 289

వ. మరియు నగ్గంగాతరంగిణీ ప్రవాహంబునారాయణు నవతారం బునుంబోలె మత్స్యకూర్మ వరాహాది జన్మాశ్రయంబును, సజ్జన హృదయంబునుంబోలె నతినిర్మలంబును, బ్రహ్మవిద్వరిష్ఠ నంతఃకరణంబునుంబోలె పరిపూర్ణంబును, నమృతరసంబునంబోలె విశదంబును, యాగమంటపంబునుంబోలె ననేక భూసురసేవితం బును, రామాయణంబునుంబోలె త్రిలోకపావనంబును, భారతంబునుంబోలె బాతకహరణంబును, భాగవతంబునుంబోలె ముక్తిప్రదంబై, మంగళతరంబుగా నెసంగ రఘుపుంగవుండు త జ్జలంబులం గృతమజ్జనుండై వందనంబొనర్చి పరమానందంబున నందొక్క విశాలంబగు శింశుపావృక్ష మూలంబున నధివసించెన య్యవసరంబున 290

కం. రామాగమన మహోత్సవ
మామెయివిని జనులచేత నటుగుహుడునిజ
స్వామియు సఖుడును నగునా
రాముని జూడంగవచ్చె రయముప్పొంగన్ 291

వ. ఇట్లువచ్చి వన్యంబులగు మధుపుష్ప ఫలాదులం దెచ్చిరామునకుం గానుకగానిచ్చి దండప్రణామంబు గావించిన గుహునింగ్రుచ్చియెత్తి యాలింగనంబొనర్చి కుశలంబడిగిన ముకుళితకరుండై నిషాదవరుండు రఘువరునకిట్లనియె 292

శా. నాజన్మంబుఫలించెధన్యతమమై నైషాదలోకంబునుం
దేజంబందె మహాప్రమోదమొసగెం నీదేహసంస్పర్శచే
రాజాధీశ్వర నేను కింకరుడ నీరాజ్యంబు నీ సొమ్ము నీ
రాజత్వంబున నీ యధీనుల మమున్ రక్షింపుమా! రాఘవా! 293

కం. రమ్ము! బురమ్మునకు బవి
త్రమ్ముగ గావింపుమందిరమ్మును భవద
ర్ధమ్ముగ దెచ్చిన వన్యా
ర్ధమ్ముల గైకొమ్ము నీకు దాసుడరామా! 294

చ. అనవిని బ్రీతుడై రఘుకులాగ్రణి బల్కు చతుర్దశాబ్దముల్
దనరగనేను గ్రామములు ధామములుం జొరనన్య దత్తమై
యెనసినకందమూలములనేని గ్రహింప సఖా! ప్రియుండ వీ
వనయము నాకు నాయదియయొ విను దావక రాజ్యమంతయున్ 295

వ. అనియాదరించి వ్యాధాగ్రణిచేత న్యగ్రోధక్షీరంబులు దెప్పించి 296

కం. వటవిటపిక్షీరంబుల
జటామకుటమున్ ఘటించి సౌమిత్రియుదా
నట రాముడు పూర్వదినము
నటులజలాశనమొనర్చె నవనిజతోడన్ 297

వ. అప్పుడు 298

కం. అస్తగిరిస్థలమస్థ
న్యస్త సమస్త కరుడయ్యె నాదిత్యుండ
య్యస్తమయోచిత కృత్యము
బ్రస్తుత సుస్థితి నొనర్చి రఘువరుడంతన్ 299

తే.గీ. సరవి సౌమిత్రి కుశపర్ణశయ్య సేయ
నందుముందు నయోధ్య సౌధాగ్రపాళి
విపుల పర్యంకమునబోలి వేడ్కదేలి
రామతోడుత నిద్రించె రామవిభుడు 300

ఉ. అంతట లక్ష్మణుండును శరాసి శరాస నిషంగధారియై
యంతిక దూరసీమను దిశాంతములుంబరికించికొంచు దా
నెంతయు కార్ముకంబు ధరియించిగుహుండు సహాయమూన్పన
త్యంతముగాచియుండెను నిజాగ్రజురాముని జాగ్రదాయతిన్ 301

సీ. ఈరీతి శయనించు నారాఘవునిగని
గుహుడశ్రుమిశ్రితాక్షుండునగుచు
వినయంబుతో లక్ష్మణునితోడనిట్లను
నన్న రాముని జూడుమా కుమార
సౌధాగ్ర విస్తీర్ణ సౌవర్ణ పర్యంక
మునశయనించునీఘనుడునేడు
తృణపర్ణ రచితాస్తరణమున వనమున
శయనించగానయ్యెచానతోడ

తే.గీ॥ నకట నేమందు మంధరా వికటకుమతి
గ్రూరచారిణియై పాపకారిణియగు
కఠిన హృత్పాకకైక రాఘవుని కష్ట
విధికి గారణమయ్యెను విధివశమున 302

వ. అనిన విని గుహునింగనుంగొని లక్ష్మణుండు మదీయంబగు వచనంబు వినుమని యతని కిట్లనియె 303

కం. ఒక్కని సుఖదుఃఖములకు
నొక్కడు కారణముగాడహో! బ్రాణికిదా
బ్రాక్కున జేసిన కర్మమె
గ్రక్కున సుఖదుఃఖములకు కారణమనఘూ 304

చ. వినుము సుఖంబుదుఃఖమును వీకనొనర్పనొకండు కర్తగా
డనఘ పరుండజేయునను టంతయు కుత్సిత మైనబుద్ధిసు
మ్మనయమునేను జేసితినటన్న వృథాయభిమానమింతయే
తనదగుకర్మ మాత్ర ఘటితంబుగ జెందును లోకమింతయున్ 305

కం. హితు లహితు లుదాసీనులు
నతిశయ మధ్య స్థబాంధవాదులు నగుచున్
దతి తమ జేసిన కర్మ
స్థితినే భావింప నగును ధీరవిచారా! 306

కం. తన కర్మ పాకవశమున
నెనయగుసుఖమేనిదుఃఖమేనియుగలుగున్
మనుజున కెయ్యది దానిన
యనయము భుజియించిశాంతుడైయుండనగున్ 307

కం. భోగసమాగమమున మరి
భోగత్యాగమున వాంఛ బొరయక దానా
భోగముల రాకపోకల
మూగవశుడుగాని వాడు మొనయు సుఖంబున్ 308

తే.గీ. తెలియనేకాలమునను నేదేశమునను
వరుసతో నెందువలన నెవ్వారిచేత
స్థిరశుభాశుభ కర్మముల్ జేయనగు న
వశ్యమును భావ్యములునవి వారి చేత 309

సీ. తగశుభా శుభఫలో దయములనరులకు
మోదఖేదంబుల మొనయనేల
విధిచేత నెయ్యది విహితమౌనది యెల్ల
సుమ్మలంఘ్యము సురాసురలకైన

పుణ్యాపాపములచే పుట్టుటచేదేహ
ముండును సుఖదుఃఖయుక్తమగుచు
క్రమవశంబునను సుఖంబు దుఃఖంబును
తన కర్మ వశమున దనకుగల్గు

తే.గీ॥ దివసమును రాత్రియును బోలె దిరుగు సుఖము
వెనుక దుఃఖంబు దుఃఖంబు వెనుక సుఖము
చేరితప్పింపవశమౌనె యేరికైన
నగుట దీనికి చింత సేయంగ నేల? 310

కం. సుఖమునడుమ దుఃఖంబును
సుఖమున్ దుఃఖంబునడుమ జూపట్టుటనీ
సుఖదుఃఖము లన్యోన్యము
సఖత విమిశ్రములు రెండు జలపంకగతిన్ 311

కం. కావున మదినిష్టాని
ష్టావాప్తిని ధైర్యవృత్తి హర్షము ఖేదం
బావహిలకుండు మిథ్యా
భావన నవియెల్ల గనుచుపండితుడనఘా! 312

కం. అని గుహ లక్ష్మణులీగతి
ననుగతి భాషింపుచుండ నమలగుణంబై
కనదరుణ కిరణపరిణయ
కనదరుణస్ఫురణదనరె గగనాంగణమున్ 313

వ॥ ఇట్లు, ప్రభాతంబగుటయు రఘుసత్తముండు గాల్యకృత్యంబులు నివర్తించి సుమంత్రుండును దనవెంట వనానుగమనంబునకున్ బ్రతిబంధించిన బ్రియోక్తులననుసంధించి నిజజనకు నాశ్వాసించు మనియును గైకయివిశ్వసించుటకు దనవనవాస శ్రవణంబొనర్పు మనియును నతనిన్ బురంబునకుమరలంబంచి సమాహితుండగు గుహునింగని దృఢపరి కరప్రభావంబగు నొక్క నావనాయితంబు గావింపుమనిన నిషాదాధ్యక్షుండాక్షణంబ శుభలక్షణంబగు నొక్క నావన్ గొని తెచ్చి సత్యపరాక్రముండగు రామున కిట్లనియె 314

కం. ఈ నావమీరలెక్కుడు
నేనావల చేర్తు బంధునివహయుతుడనై

బూనిక ననినన్ మున్నుగ
జానకి నటనిల్పి భవ్య సరణిన్‌నావన్ 315

ఆ.వె॥ అంతగుహునిహస్త మవలంబముగ రాము
డచ్యుతుండునావ నావసించె
నవల లక్ష్మణుండు వివిధాయుధములను
నావహించి మరియు దావసించె 316

కం. జ్ఞాతులతో తద్వహన
జ్ఞాతలతో నపుడు భారవహుడు గుహుడు దా
నాతరి నాతరి భక్తి ధ
నాతరియై నడపెవిభునకాసమయమునన్ 317

కం. గంగా మధ్యంబున నరు
గంగాగని మ్రొక్కి బ్రీతగతి సీతమతిన్
గంగన్ భయభక్తులు సెల
గంగన్ బ్రార్థించి నయముగా నిట్లనియెన్ 318

మ. వినుమోదేవి! నదీమతల్లి కుశలావిర్భాతిచేమేము నీ
వనవాసంబొనరించి వచ్చినను భవ్యస్థేమ సౌమిత్రిరా
మనియుక్త స్థితి నేనిటన్ బలిసురామాంసోపహారంబులన్
నిను బూజించెదనంచు వేడుకొనెనెంతే సీత సంప్రీతయై 319

కం. అత్తరివియత్తరంగిణి
నుత్తరణము సేసివారలుండగ నవలన్
దత్తటమున గుహుడవహిత
హృత్తటమున రాఘవునకు నిట్లనిపలికెన్ 320

సీ. వనగతికేసుమీ! యనుమతి జనుదెంతు
ననుమతియిమ్మునాకనఘరామ!
వలదన్న ప్రాణముల్ దొలగెదనికనన్న
విని భక్తుని నిషద విభునిజూచి
దండకావని చతుర్దశవత్సరములుండి
వత్తుసత్యంబు మద్వాక్యమనుచు

మరియు కౌగిటనుంచిమన్నించి పనిచిన
దనయూరి కొకదారిజనియెగుహుడు

తే.గీ॥ నంత రామాదులగు మువ్వురతిశయించి
వృక్షమూలంబున వసించి వేడ్కమించి
మృగమును వధించి పచనించి తగభుజించి
యచటశయనించి యారాత్రియధిగమించి 321

వ. అంతట నుదయంబగుటయు దన్మహాటవినొక్కటన్ జనునెడ 322

- ఋష్యాశ్రమ దర్శనము -

మ. కనియెన్ రాముడు సీతతో ననుజుతో కాంతారజంతుచ్ఛటా
జనితాన్యోన్య వినోద సౌహృదమనీషాతోష నిశ్శేష ధూ
త నిజప్రాక్తన వైరజశ్రమము విద్యావైభవోద్యత్తపో
ధనికశ్రీకృతవిశ్రమంబగు భరద్వా జాశ్రమం బచ్చటన్ 323

తే.గీ. అటులజని రాముడయ్యాశ్రమాంతి కమున
వచనరచనా పటువు నొక్క వటువుగాంచి
యనఘు మేమిట యునికి మీమునికి జెప్పు
మనుచు దము నెరిగించిన నతిరయమున 324

కం. ఆముని శిష్యుండునిజ
స్వామిని గనిమ్రొక్కి యమరసన్నిభుడగు నా
రాముని రాకడ చెప్పిన
నా మునివిని లేచి వేగ హర్షాగతుడై 325

సీ. రాజచిహ్నముల నేర్పడియును మరిమౌని
రాజ చిహ్నములనేర్పడినవాని
యతిధర్మగుణములనలరియు శితరశా
యతిధర్మగుణములనలరువాని
వనవిహారమెనర్ప వచ్చియు దేవతా
వనవిహారమొనర్పవచ్చువాని
తాతవాక్యమునీయదలచియప్పటితమ
తాతవాక్యముసేయ దలచువాని

తే.గీ॥ సహజమహిజానుగతిలీల సలుపబూని
సహజమహిజానుగతి లీల సలుపువాని
రామభూజాని శుభగుణారాముడైన
వానిగనుగొనె నా భరద్వాజమౌని 326

వ॥ ఇట్లు గనుంగొనిన భరద్వాజుండునురఘూద్వహు లక్ష్మణయుక్తంబుగా నర్ఘ్యపాద్యాది విధులన్ బూజించి మహాత్మా! మదీయాశ్రమ భాగంబు భవత్పాదపరాగంబునన్ బవిత్రంబుగావింపు మనిబ్రార్థించి సీతా సమేతంబుగానతనిన్‌దోడ్కొనిచని మరియు సభక్తింకంబుగా నుత్తమం బగు నాతిథ్యంబొసంగి యిట్లనిమె 327

సీ. ఇపుడుతపఃపారమేగంటిరామ నే
సంగతిచేభవచ్చరితమునను
భూతభవ్యములు విజ్ఞాతములయ్యెను
యీవు బరాత్ముండ వెరుగుదీశ!
యజుడు బ్రార్థింప మాయా నరాకృతివన
వాసాదులొనరింప వచ్చితిటకు
భవదుపాసన చేత బ్రాప్తమౌవిజ్ఞాన
దృష్టిచేనీయర్ధమెల్లతెలిసె

తే.గీ॥ బ్రకృతికంటెను బరునిన్ను బరమపురుషు
నాద్యుగంటి గృతార్థుండనైతి నేను
యింతమీదట నేవిన్నవింతునేది
ముక్తిమయధామ! రామసంపూర్ణకామ! 328

చ. అనవిని రాముడిట్లనియె నమ్మునికిన్ బ్రణమిల్లి రాజనం
దను నను మీరనుగ్రహమొనర్పుడు లక్ష్మణజానకీయుతున్
మునివరయంచుబల్కి సుసమున్నతినిద్దర బ్రొద్దుబుచ్చి య
ద్దినమటనిల్చి మౌనులునుతింపగ బ్రొద్దునలేచి యచ్చటన్ 329

కం. యమునన్ బాపచయాపా
యమునన్ బుణ్యకృత నిర్ణయమునన్ శుభతో
యమునన్ బహువీచినికా
యమునన్ దగ దానిగాంచి యారఘువరుడున్ 330

వ. అంతటన్ దన్మహానదిన్ గృతావగాహుండై మునికుమార సహాయంబున నుత్తరించి తద్దర్శిత మార్గంబున 331

చ. అటజని కాంచెరాముడు దనంతననంతఘనాంతరస్ఫుర
త్తటి దుపమాసమాహిత నితాంతలతాంత బలాంతకాశ్మసం
ఘటితవిశాలసానురుచికారక గైరికధాతు కూటమున్
దటపటలీనటచ్చటులదైవతకూటము చిత్రకూటమున్ 332

వ. వెండియుందచ్చిత్రకూటంబువైకుంఠంబునుంబోలె హరి విహార స్థానంబును, సత్యలోకంబునుం బోలెపుండరీక జాతమండితంబును, కైలాసంబునుంబోలె నీలకంఠ విలాస వాసంబును, నంతరిక్షంబు నుంబోలె ఋక్షలక్షితంబును, శూరకరంబునుంబోలె ఖడ్గ బంధురంబును, రాజధానియుంబోలె భూ దారభూషితంబును, రాజసభాభవనంబునుంబోలె చమరవాల విలసితంబును, శరత్సమయంబునుం బోలె శరభాన్వీతంబును, శివోపకంఠంబునుం బోలె దంతిముఖముఖరింతబును, దేవసైన్యంబునుంబోలె గుహాంచితంబును, దానవస్థానంబునుంబోలె భృగు సంగతంబును, బృందారకలోకంబుంనుంబోలె మందాకినీ సలిలసందోహ సందర్భి తంబును, వరుణపురంబునుంబోలె ప్రచేతస్సంతానసమాశ్రయ ణీయంబై రమణీయంబగు నమ్మహాశైరంబునందు నొక్కమనోహర ప్రదేశంబున 333

సీ సముదగ్రచిరతపస్సామ్రాజ్య విభ్రమ
భ్రాజిత మునిరాజరాజితంబు
నన్యోన్యనిర్వైరతాయత్త మిత్రతా
సముపాత్తవరసత్య సంకులంబు
నానాగమ విహార నైపుణ్య పరిగణ్య
బహు విప్రవరవచో భావితంబు
నితర సువాసనాన్వీత జీవన సార
పూర్ణ పద్మాకరస్ఫూర్జితంబు

తే.గీ॥ సతత సుమనో విలాస భాసిత ఫలోద
యావహిత దివ్య తరులచే నతులమగుచు
లీలగనుపట్టు దాని వాల్మీకి మౌని
యాశ్రమముగాంచె రఘు కులాధ్యక్షుడపుడు 334

వ॥ అందు 335

కం॥ ఆ కాకుత్థ్సుడుగనియెన్
బ్రాకట రామాయణైక భాసురకేకా
నేకాకలితాశ్రమ వన
కేకిన్ వాల్మీకి సుకృత కృత పరిపాకిన్ 336

కం॥ ఈసరణి గనికుశాసన
వాస సమాసీనుడైన వాల్మీకునకున్
దాసాష్టాంగ నమస్కృతి
జేసెన్ శ్రీరాముడనుజ సీతాన్వితుడై 337

వ॥ అయ్యవసరంబున 338

సీ॥ జానకీ సౌమిత్రి సాంగత్య సంచారు
నాదిలక్ష్మీశ పూర్ణావతారు
నవజటామకుట మండల కృతాలంకారు
సత్కృత మౌనివేష ప్రకారు
కందర్పకోటి సంకాశ దివ్యాకారు
త్రిభువన మోహన శ్రీవిహారు
కమనీయ కమల లక్షణ వీక్షణోదారు
కరుణా సుధావలోక ప్రసారు

తే.గీ॥ చాపశరధారు నతిధీరు సహజసారు
శ్రితజనాధారు సుకుమారు నృపకుమారు
నఖిల గుణహారు రఘువీరు నఘువిదూరు
కనియెవల్మీక భవమౌని కాంక్షబూని 339

కం॥ కనిదిగ్గన లేచి యతం
డనిమిష దృష్టులను జూచి యద్భుత వీచీ
జనితానందాశ్రువిలో
కనముల సత్ప్రేము రాము కౌగిట జేర్చెన్ 340

వ॥ మరియును 341

తే.గీ. ఆ జగత్పూజ్యభక్తి నర్ఘ్యాది విధుల
పూజగావించి యమ్మౌని భూరిమధుర
సరస ఫలమూల ముఖ్య భోజన మొసంగి
యాదరించిన వినయసమ్మోదములను 342

వ॥ మరియు ముకుళితకరుండై రఘువరుండమ్మునివరునకిట్లనియె 343

కం॥ జన కానుమతిని దండక
వని కానుగతిన్ వసింపవచ్చితి నిదియె

ల్లను మీరెరిగిన యదియే
యనఘా! నేనేమి దెలియ ననగా వలయున్ 344

కం॥ కానన్ సుఖవసతిగ ని
క్కానన్ గలదేస్థలంబు గరుణదెలుపుడా
స్థానంబుగొంత కాలం
బేనందు వసించెదను మహీసుత తోడన్ 345

సీ॥ అనవినినవ్వి రామునిగని మునిబల్కు
సర్వలోకముల కాశ్రయుడవీవు
సర్వలోకంబులు సర్వభూతంబులు
రామ! నీకాశ్రయ భూము లౌను
నీరీతి సీతాసమేతుడవగు నీకు
దనర సాధారణ స్థానమేను
చెప్పితినిక విశేషించి వచించెద
నీ కెద్దినియత మందిరము దాని

తే.గీ॥ సతతమును గ్రోధరహితులు సర్వసములు
శాంతులగుచు ధర్మాధర్మ సంగమెడలి
నిన్నెభజియించు వారి హృన్నీరజంబు
లునికి యగు నీకు సీతాన్వితునకు నధిప! 346

తే.గీ॥ భక్తి భవదీయ మంత్ర జాపకుడనగుచు
నితర మెరుగక శరణ మీవే యటంచు
నిస్పృహుండు నిర్ద్వంద్వుడై నిలుచువాని
మానసము నీకు సుఖమైన మందిరంబు 347

కం॥ దూరిత రాగద్వేషు లు
దారత సమలోష్టకాంచనాశ్ములు నిరహం
కారులు శమసారులునగు
వారల హృదయములు నీ నివాసము లీశా! 348

తే.గీ॥ మనసు బుద్ధియు నీయందు మరులు కొలిపి
మరియు నీయంద సకల కర్మములు నిలిపి
నిత్యసంతుష్టుడై పూర్వనిష్ముడైన
నిశ్చలుని మానసము నీకు నిలయమధిప 349

కం॥ ప్రియమున కుబ్బక మరి య
ప్రియమునకును ఖేదపడక దృఢమతిమాయా
మయమఖిలమనుచు నీసే
వయ చేసెడి వానిమది నివాసము నీకున్ 350

వ॥ అదియునుం గాక షడ్భావవికారంబులు శరీర ధర్మంబులు క్షుధాతృష్ణ సుఖదుఃఖ భయమోహంబులు ప్రాణబుద్ధి ధర్మంబులన నిర్ముక్తుండై వ్యక్తంబుగా నిత్యంబును నానందంబును ముఖ్యంబును నగునంతరాత్మ స్వరూపంబుగా నిన్ననెవ్వరు నిరీక్షింతురట్టి వారి హృదయారవిందంబు సుఖ మందిరంబుగా నీవు వసియింపుము మరియును నిరంతర యోగాభ్యాస దృఢీకృతాత్ములును భవచ్చరణ సేవాగరిష్ఠులును తావక నామకీర్తన నివర్తిత సకల కల్మషులును నగు వారి హృదయాంబుజంబు సీతాసహాయుండవగు నీకు నిలయంబగు నని పలికి వల్మీకభవుండు వెండియు నిట్లనియె 351

కం॥ రామ! గుణారామ! శుభ
స్థేమ! భవన్నామ మహిమదెలియన్వశమే
ధీమహితగతి మహేశ పి
తామహ ముఖనిఖిల దేవతా తతికైనన్ 352

తే.గీ. రామ! నీనామమది యనులోమముగను
బ్రేమ వేమరు జపియించి పెంపు మించి
మును కిరాతక రీతిచే నెనయు నేను
నతుల విఖ్యాతి బ్రహ్మర్షి నైతి కంటె! 353

వ॥ కావున నట్టి వృత్తాంతంబంతయు గ్రమంబున నెరుంగిం
చెదనని యిట్లనియె 354

- వాల్మీకి వృత్తాంతము -

కం॥ ఆ మును బ్రచేతుడనదగు
నా మునికిన్ సుతుడనగుచు నాశ్రమ సీమన్
సోమదుడను నామంబున
నేమంబున నుంటి విప్రనియతిన్ బ్రీతిన్ 355

కం॥ ఈరీతి నుండియొ కనా
డారూఢి ఫలార్థ మరిగి యడవి కినచటన్
జేరికనవి యేమియు జే
కూరక నూరకయు జనక యుపసర్పమునన్ 356

కం॥ దూరముగ ఘోరమగు కాం
తారమునకు బరువ తెరువు దప్పియలమటం
గూరిన యపరాహ్ణముగా
జేరిన దిగ్భ్రమము చేత జింతించునెడన్ 357

సీ॥ వనజీవనౌషధావాప్త చేతన భావ
యైవచ్చు తీవనానంగమలర
నంగవల్లికపారు బాకు పైయదనంటి
గురుఫలంబుల లీల కుచములెసగ
కుచకుంభికుంభాగ్ర రచిత సింధూర సుం
దరములై కురువింద సరములమర
కురువిందసరముల గూర్చు పించపు దండ
ఘనవేణి మణిచాపగతిని దోప

తే.గీ॥ గతిని గజరీతి గనుటచే గండపాళి
దండతాటంక దీప్తియుక్తముగ వెలుగ
నచ్చటికి వచ్చె మృగయాశయానుభావ
భరిత వనగోష్ఠి యొక భిల్లపల్లవోష్ఠి 358

కం॥ స్మితసుమయున్ గుచఫలయున్
బ్రతత భుజాంకురయు పాణి పల్లవయు కచాం
చిత భృంగయగుచు జంగమ
లతయోయనవచ్చు శబరలలనం గంటిన్ 359

కం॥ ఈమాడ్కి జూడ నప్పుడ
కామిని నెమ్మేని సిరులు కాముని యురులై
నామనసుబట్టి యీడ్చిన
వేమరు నేమరులు కొనుచు విభ్రాంతుడనై 360

సీ॥ శ్రుతి పదక్రమముల జూర బోబెట్టితి
సతిపద క్రమముల జాడదగిలి
యారుదర్శనముల నటమటించితినింతి
యారు దర్శనముల నాససేసి

నాటకాలంకార ధాటి మాటితి భిల్ల
చేటి కాలంకారపాటి నాటి
బహుళాగమము నందు భ్రాంతి బోవిడిచితి
మహిళాగమము నందు మనసు జొనిపి

తే.గీ॥ స్మృతుల విడిచితి తద్గుణ స్మృతుల దలచి
జాతి మరచితి నాహీన జాతివలచి
యేమి జెప్పుదు నప్పుడా లేమ బ్రేమ
కారణంబున నట విధి ప్రేరణమున 361

వ॥ ఇట్లేతెంచి యచ్చెంచుమెరుంగు బోణి మెరుంగు బోణిమిన్ మెలంగి తలంగిచన నేనుం దాని వెనువెంటం జనిచని 362

కం॥ దరిగనకన్ దిరిగితి సుం
దరి వెనుకన్ సూది వెనుకదారము బోలెన్
గిరులనకం దరులనకన్
జరునకన్ వలపు జెనక సక్తుడ గనకన్ 363

కం॥ ఆకలికి జూచినప్పుడ
నాకలితా తను విభూతి నావృత మతినై
నాకలిమి కేమి చెప్పుదు
నాకలి దప్పియును నలతయది లేదయ్యెన్ 364

వ॥ ఇవ్విధంబున ననేక జంతు భీకర శరణ్యంబులగు మహారణ్యంబులు గడచి చనునెడ విడువక వచ్చుచున్న నన్నుంగని కనికరంబున వనచరాంగన యిట్లనియె 365

కం॥ భూమీసురయిట వచ్చెద
వేమీ? యీమాడ్కి నటవి నిట వెరచితివే!
నీమార్గము దప్పితివే!
వేమరు నాకొన్నవాడవే! తెలుపగదే! 366

కం॥ అనినంత దాని మాటలు
వినినంతనె నమృత వీచి వీచిన నైనన్
జనితాతను తాపోన్నతి
వనితామణితోడనంటి వలపు దలిర్పన్ 367

కం॥ కామిని! నినుగనినప్పుడ
కామ నిపీడితుడనైతి కరుణన్ నన్నున్
గామితము దీర్చి బ్రోచెదొ!
కాముని బారికిని వశము గావించెదొకో! 368

వ॥ అనిపలికి తపించుచున్ బ్రార్థించు నన్నుంగాంచి మదీయ వయో రూపంబులకు నభిలషించి యనుకూలించదలంచునది యయ్యును వనంబులముని జనంబులంగని యుండుట నేనును విప్రసూనుం డననుభయంబున 369

ఆ.వె॥ నేను హీనకులము దాన నీవుత్తమ
మైన సత్కులీన మానితుడవు
దగునెయిట్టు లనిన దానికున్నట్టి వి
వేకమైన లేక వికల మతిని 370

కం॥ మగువా! నాతమిదీర్చగ
తగవా! యిది యనుచునట్టి తరి నాతురతం
బగలనక సంధ్యయనకం
దగమెత్తం బరచి రతికి దార్చితిదానిన్ 371

వ॥ అప్పుడు 372

మ॥ పరిరంభాశ్లథ బంధ బాహులతమై బాహాంతరావిద్ధ దు
ర్భర వక్షోజ విమర్ద దుర్దమమునై బాధస్పృహంబై బర
స్పర దష్టాధరమై బునఃపునరభీష్ట ప్రార్థనాయత్తమై
సురతంబొప్పెను నప్పుడిద్దరికి నచ్చోనొక్క కుంజంబునన్ 373

వ॥ అంతటందొంటి కంటె నత్యంత ప్రేమాంతరంగుండనై యయ్యంగనం గూడి వచ్చి వచ్చి యచట 374

కం॥ ఒక్కయడన్ వనచరచయ
చిక్కణమై పటలచపల చేష్టిత శబరీ
దృక్కణమై నొక్కొనునొక
పక్కణమున్ జేరిభిల్ల భామానుమతిన్ 375

ఆ.వె॥ కులము విందు సేసి కలజండెమటు దీసి
దానిగూడి జపము తపము వీడి
మద్విజాతి ధర్మమార్గంబు విడిచితి

తద్విజాతి ధర్మ తతుల గలసి 376

వ॥ ఇట్లు జన్మమాత్రంబున ద్విజత్వంబుగా విచారరాహిత్యంబున దుర్విషయాసక్తుండనై బ్రవర్తింపుచు కిరాతజాతినాతియందు బ్రజావృద్ధింగాంచి తత్కుటుంబ భరణార్థంబునకై యనేకకాలంబు దురితంబులకు వెరవక సకలార్థంబులొనర్చుచునర్థంబు లార్జించుచు నంత 377

కం॥ చోరుడనై బహు గహన వి
హారుడనై జనచయమున కంతిక సదృశా
కారుడనైయుండి ధను
ర్ధారుడనై యొక్కనాడు దైవవశమునన్ 378

కం॥ గుప్త విధంబుల మణిమయ
తప్తహిరణ్మయ పరిచ్ఛదంబులతోడన్
దీప్తాగ్ని విభోత్కర్షులు
సప్తర్షులు రాగగని వెసన్ ఘోరవనిన్ 379

ఉ॥ వారల దారిబారి కలవస్తువులంగ్రహియింప గోరి దు
ర్వారత జేరినంతనను వారుగనుంగొని వచ్చెదేల రా
యోరి ద్విజాధమా! యనిన నూరడి వారలతో క్షుధార్తులై
దారసుతాదులుం గలరు ద్రవ్యమొసంగుడు వారి బ్రోవగన్ 380

కం॥ అందులకై యిగ్గిరవర
కందరమున నుందు ననిన గనివారలున
న్నందరు సాంద్రదయామతి
గ్రందుగ నిట్లనిరి చాల కట కటపడుచున్ 381

కం॥ ఈ దిన దిన మొనరించెడి
యీదురితం బనుభవింప నీవొక్కడవో
నీదార సుతాదులునో
కాదన కవ్వారినడిగి గావింపుమికన్ 382

వ॥ కావున నీవు వచ్చునందాక నిందుండెదము సందియము లేదనిన నేను మందిరంబున కరిగి యందరి నడిగిన వారలిట్లనిరి 383

కం॥ నీ పాపము నీ యదియే
పాపము జేయుమని నిన్ను బ్రార్థించితిమే

యేపున నశనార్థులమై
బ్రాపించిన మాకు నొక్క పాపముగలదే! 384

వ॥ అనిననప్పలుకులు వినినంత నెంతయు నిర్వేదించి మరలి వచ్చుచుం బశ్చాత్తాపంబున నేను మనంబున నిట్లని విత్కరించితి. 385

సీ॥ స్థావర జంగమాత్మకమైన బహుజంతు
జననంబు లోపల మనుజుడగుట
నానరులందు నిచ్ఛాన్వయోత్పన్నత
కన్న చాతుర్వర్ణ్య మగుటమేలు
నాచతుర్వర్ణంబులందును వేదయో
గ్యతగల్గు బ్రాహ్మణుండగుట మేలు
నాద్విజన్మలయందు నాభిజాత్యంబున
నలరు సద్బ్రాహ్మణుండగుట మేలు

తే.గీ॥ నందులో నాత్మ విజ్ఞానియగుట మేలు
నగుట గ్రమయుక్తి నగ్ర జన్మాప్తి గనియు
నందునింద్రియ పరవశుండగునె యేని
కలుషము లొనర్చు మరి పూర్వగతికి వచ్చు 386

వ॥ కావున 387

కం॥ భూదేవాగ్రణి నగ్రకు
లోదయుడను వేదశాస్త్ర యోగ్యుడ నగునా
కీదుర్భావం బేలా
ప్రాదుర్భావంబు నొందె ప్రారబ్ధమునన్ 388

సీ॥ అనియంత ఘనచింతనత్యంత కారుణ్య
ఖనులైన మునులున్న కడకు వచ్చి
యటవారి దర్శించునంతనె పరిశుద్ధ
హృదయుండనై విల్లు నిల్లు విడిచి
శరణాగతుండనై నరకార్ణవ నిమగ్ను
ననునుద్ధరింపవే యనుచు నెదుట
మరియు దండప్రణామము సేసి లేవక
పడియున్న నను జూచి పరమమునులు

తే.గీ॥ లెమ్ము సమ్మతి నీకు శుభమ్ములగును
నెమ్మి భవదాగమము సఫలమ్మునయ్యె
దివ్యమొక్కటి మేముపదేశమిత్తు
మందుచేనీవు ముక్తుడవగుదు సుమ్ము! 389

వ॥ అని నారదపురస్సరులగు నమ్మహాత్ములు నన్ననుద్దేశించి వీడు దురాత్ముండగుటనుపేక్షణీయుండును, శరణాగతుండగుట మోక్షమార్గోపదేశంబున రక్షణీయుండును, వెండియు శుద్ధ జడ స్వభావుండగుట సులభోపాయంబు విచారింపనగునని బరస్పరంబు నాలో చించి నన్నుంగాంచి హస్తమస్తక సంయోగంబు గావించి వ్యస్తాక్షరంబుగా దివ్యంబగు భవదీయతారకనామ వర్ణద్వయంబు "మరా"యని పారాయణంబుగా నేమంబున నేము వచ్చునందాక జపింపుచుండుమని యుపదేశించి దివ్యదర్శనులగు నమ్మహా మునులు యధేచ్ఛం జనిరప్పుడేనును తదనుష్ఠానాసక్తుండనై 390

కం॥ వేసరక కన్ను దెరవక
గాసిల్లక దిటము సెడక కదలక గురియం
దాసక్తి విడక నెరుకన్
జేసళ్లక తీవ్ర తపము సేయుచు మరియున్ 391

సీ॥ అంతట తదుపదేశార్థంబు మంత్రవ
రిష్ఠంబుగా భక్తినిష్ఠబూని
యేకాగ్రమతి జపియింపుచుండ దనంత
మానసంబున నది మరులు కొనిన
నింద్రియంబుల సంగమెడలుచో తత్పర
ధ్యానైక వశత బాహ్యంబు మరవ
నానందపూర్ణ దివ్యానుభావంబున
నిశ్చల స్థితితోడ నేను నిలువ

తే.గీ॥ వీక నామేని మీద వల్మీక మొదవ
నీగతిని యుగసహస్రంబు లేగునంత
నస్మదీయ తపః ప్రభావాప్తి వలన
నఖిల భువన భయంకరంబైన యపుడు 392

శా॥ వ్యాప్తంబైన తపః ప్రకాశమహిమన్ వల్మీక మధ్యంబునన్
బ్రాప్తానందుడనైన నాకడకునై బ్రహ్మాది సంయుక్తులై
దీప్తోత్కర్షులు నిత్యహర్షులు లసద్విజ్ఞాన గుప్తర్షులా
సప్తర్షుల్ జనుదెంచి రెప్పటిక్రియన్ సమ్యగ్దయావర్షులై 393

కం॥ వచ్చి నను బిలువ నేనును
వచ్చితి నటపుట్ట వెడలి వారల సూక్తిన్
జెచ్చెర రవిహిమ మెడలియు
వచ్చిన గతినంత బ్రీతివారలు నాతోన్ 394

కం॥ వల్మీకమునను జన్మము
కల్మిన్ రెండవది యయ్యె గావున నీవున్
వాల్మీకి మహామునివని
బల్మరు నను బలికిరపుడు పరమమునీంద్రుల్ 395

వ॥ మరియును బ్రహ్మాదులు నన్ను బ్రహ్మర్షివని పలికిరంత నాచేతం బూజితులై వారలందరు దివ్య గతింజని రగుటం గావున 396

తే.గీ. రామరాజీవనయన! నీ నామమహిమ
నీమహత్వంబు గలిగె నాకిపుడు నిన్ను
హరిని బ్రత్యక్షముగ లక్ష్మణావనీ సు
తాన్వితునిగంటి ముక్తుడనయితి నిజము 397

కం॥ రమ్ము శుభమ్ములునీ కగు
నెమ్మి సమస్తమ్మునకును నిలయమ్ముగు నీ
కిమ్మెయి రమ్యమ్ముగు వా
సమ్మున్ జూపెదను రామసద్గుణధామా! 398

వ॥ అనియమ్మునివరుండు శిష్యగణ పరివృతుండై లక్ష్మణ సమన్వితం బుగా నరిగి యగ్గిరిం గంగామధ్యంబున విధ్యుక్తంబుగా నొక్క రమ్య స్థలంబున విస్తారంబుగా ప్రాక్పశ్చిమంబును దక్షిణోత్తరంబుగా సుందరంబగు మందిర ద్వయంబు గావింపంజేసి యందు దేవ సదృశాకారులగు వారనుండ నియమింపజేసిన నయ్యెడ 399

సీ॥ ఘనసారవలయిత కాంతార భాగంబు
ప్రాకారవళిత దుర్గంబుగాగ
ప్రాంత వనాంత శకుంతారవ శ్రేణి
తతవందిమాగధ స్తవముగాగ
నికటాటవీనటత్సకల మృగావళి
పరివృత సైనిక ప్రతతిగాగ
కరలగ్న కోదండకాండ ప్రకాండముల్
కైదండలిడు మిత్ర గణము గాగ

తే.గీ॥ మునిజనావన సామ్రాజ్యమునవసించి
యతులగతి పర్ణశాలా సభాంత రాళ
నవకుశాస్తీర్ణ సింహాసనమున నుండి
నిండు కొలువుండె శ్రీరామ నృపవరుండు 400

వ॥ ఇట్లు చిత్రకూటుంబు నందు మందాకినీ తీరంబున ముని సందోహంబుతో వాల్మీకి మునీంద్రుండు బూజింప సౌమిత్రి సేవింప సీతాసుందరీ సహాయుండై గ్రీడింపుచు రామచంద్రుండు స్వర్గంబునందు మందాకినీ తీరంబున ముని బృందారక బృందంబు బరివేష్టింప శచీ సుందరీ సహాయుండై గ్రీడించు బురందరు చందంబున నానందంబు నొందుచుండె నంత నిక్కడ 401

కం॥ అటుల సుమంత్రుడు గంగా
తటమున రామాజ్ఞ గాంచి తరలి మరలి మా
పటి వేళకయోధ్యకు జని
యట రాముడు రామి జనములాకుల పడగన్ 402

చ॥ పటమున మోము గప్పుకొని బాష్ప సమాకుల నేత్రుడౌచు నం
తట నృపమందిరాంగణమునన్ రథమున్ డిగిరాజు గాంచి యు
త్కట జయ శబ్దపూర్వకముగా నుతియింపుచు మ్రొక్కనవ్విభుం
డట నతి విహ్వలాత్ముడయి యప్పుడు సూతునిగాంచి యిట్లనున్ 403

- దశరథ మరణము -

ఉ॥ అక్కట సూత! రాముడు సహానుజుడై యవనీజతోడ దా
నెక్కడనున్నవాడతని నెక్కడ వీడితి వారలున్ ననున్
నిక్కము దుష్క్రియాహృదయనిర్దయు నేమని పల్కిరంచు బెం
పెక్కిన శోక వేగమున నెంతయు పంక్తి రథుండు దీనుడై 404

తే.గీ. హాగుణారామ! హారామ! హాప్రియోక్తి
వాదినీ! మేదినీ సంభవా! గుణాఢ్య!
నన్ను దుఃఖాబ్ధిమగ్ను నాసన్నభూత
జీవితుని నింకనెట్లు జూచెదరటంచు 405

కం॥ విలపించి చిరతరంబుగ
బ్రలపించెడియతిని గాంచి బ్రాంజలియగుచున్
దిలకించి యనునయోక్తుల
నెలయించుచు నాసుమంత్రుడిట్లని పలికెన్ 406

సీ॥ భూమీశ! రాముడు భూపుత్రి సౌమిత్రి
రాగదోకొని నేను రథముతోడ
శృంగి భేరపురాగ్ర సీమగంగాసరి
త్తటినిల్వ గుహుడు నచ్చటికి వచ్చి
కందమూల ఫలాదికం బొసంగిన కర
స్పర్శంబు గావించి పరిహరించి
యటగుహానీతమౌ వట దుగ్ధమున జటల్
రచియించి ననుగాంచి రాముడనియె

తే.గీ॥ సూతపురికేగి రాజుతో శోక పడకు
నాకొరకు నాకు సాకేత నగరికన్న
జోక నీకానన మనేక సుఖకరముగ
బొసగునని చెప్పుము ప్రమాణ పూర్వకముగ 407

తే.గీ॥ అనఘ! మాతల్లి గాంచి వందనము సెప్పి
నాకుగాశోక పడక భూనాథు వృద్ధు
మద్విరహశోక సంతప్తు మాటలనక
ననునయింపుచు సవరించుమనుచు బలికి 408

వ॥ మరియుం గైకకుందక్కిన వారికిం దగు విధంబులం జెప్పుమనియె నప్పుడు సీతాసతియు బతింజూచుచు నాతోడ గద్గద వాక్యంబులతో నత్తమామలయడుగు దమ్ములంబడితినని పలికి శోకాతిరేకంబునం దలవంచి చనియెనంత వారలు మువ్వురును ఆరోహణంబు సేసి గంగానది నుత్తరించిరత్తరి నేను శోకాయత్త చిత్తుండనై మరలి వచ్చితినని చెప్పిన దశరథుండు పరిజన సహితుండై పరివేదించి కైకనుద్దేశించి 409

కం॥ కాకుత్థ్సు కాన కనిచితి
కైకయి సుకుమారునెంత కట్టడివనునా
క్ష్మాకాంతుని జూచిమహా
శోకంబునగోసలేంద్ర సుతయిట్లనియెన్ 410

చం॥ ప్రియసతికిన్ వశుండవయి బ్రేమవరంబుగ రాజ్యమంతయున్
గయివశమైన సేసెదవుగాక వనంబునకిట్లు నేడుమ
త్ప్రియసుతు బంపనేల నృపతీ యిదియంతయు నీవసేసియున్
గయికొననేమి శోకమును కైకననం బనియేమి వేమరున్ 411

సీ॥ అన నశనిక్షతుండనలంబుచే గాల్పఁ
బడినట్లు దపియించి పంక్తిరథుడు
గౌసల్యకిట్లను కాంతనన్నిట్లేల
యనియెదుగాగల యర్థమిదియ
వినుమదృష్టవశంబు ననుఁ సమాగతమయ్యె
నాకును నీకు సంతాపకముగ
దుఃఖితుమరియేల దుఃఖింపజేయ ని
ప్పుడు ప్రాణములు మేన వెడలదొడగె

తే.గీ॥ ననుచునిట్లను నశ్రుపూర్ణాక్షుడగుచు
విధివశంబున మును బాల్యవేళ నొక్క
తాపసునిచేత బ్రాపించె శాపమొకటి
యదియనుభవించుటకు కాలమయ్యె నేడు 412

వ॥ తద్విధంబెట్లంటేని 413

ఉ॥ యౌవనమందు దర్పితుడనై మునునేనొకనాడు దుర్గమం
బౌ వన మందు రాత్రి మృగయాప్తిశరాసశరాసిధారినై
యావిధినేగి వేగ తమసాపగ చెంగట పొంచియుండగా
నావిధిచోదితైక గతి నాసరి ప్రొద్దున నన్నదీస్థలిన్ 414

ఆవె. దప్పిదారి నట్టి తల్లిదండ్రులకుగా
దప్పిదారి యొక్క తపసిసుతుడు
వారి ముంప ఘటము వలనను తపసులౌ
వారి ముంప నొకరవంబు బొడమ 415

కం॥ మునికృతకుంభరవంబున్
వనగతకుంభి రవమనుచు వడిదలచుచునే
ఘనశబ్దవేది శరమున
మునిసుతు వ్రేసితినిచాపమున కోపమునన్ 416

ఉ॥ అప్పుడతండు హాహతుడనైతిని యెవ్వరి కేను నేను నే
తప్పును జేయ నెవ్వరి వధం బొనరింపను నట్టి కష్టమే
చొప్పున వచ్చెనన్నెదురు చూతురు నాతలిదండ్రులక్కటా!
దప్పినసృక్కినారనుచు తద్దయుమానుష భాషబల్కినన్ 417

కం॥ విని తన్నినదంబప్పుడ
జని తన్నికటంబునకును సమధిక భీతిన్
ఘనశరహతు మునివరసుతు
గని మరి హతుడనగు రీతిగా నిట్లంటిన్ 418

ఆ.వె॥ దశరథుండనజ్ఞ దశ నమ్ము వ్రేసిన
బ్రహ్మఘాతి నే తపస్వి వర్య!
కరుణమనుచు మనుచు గద్గద సూక్తిచే
నార్తి నతని యడుగులందుబడిన 419

వ॥ అప్పుడమ్మునినందనుండు నన్నుం గూర్చి నరేంద్రా! నీవు భయం బందకుము, దైవకృతంబావశ్యకంబగు, నేను తపస్వినగు వైశ్యం డనగుట బ్రహ్మహత్య నిన్నుంజెందదైన, నింక నొక్కకార్యంబు సెప్పెద, నతివృద్ధులు నంధులుం బిపాసాన్వితులు నగు మజ్జననీ జనకులు యిగ్గిరితటం బుననొక్క విటపి శాఖాలంబితంబగు కావటనున్న వారలీవచ్చటికింజని, యేమియున్ జెప్పక వారికిక్కలశ వారినిచ్చి దప్పి దీర్చియనంతరంబ మద్వృత్తాంతంబంతయు నెరింగింపు, మట్లొనర్పకున్న మజ్జనకుండుకుపితుండై విజ్ఞాన దృష్టింగని నిన్ను సకులంబుగా భస్మంబగునట్లు శపింపంగలడని సెప్పి, యిప్పుడు భవదీయంబగు బాణశల్యంబు బ్రాణ శల్యంబై హృదయంబు భేదింపుచున్నయది దీనిం దివియుమనిన నేనునట్ల సేసిననతండు గతాసుండయ్యె నయ్యెడ 420

సీ॥ అంతఘటంబుననంబువుల్ గొని నేను
నాకలి దప్పిచే నాకులులగు
నతివృద్ధులంధదంపతులున్నచోటికి
వగనుదన్నిశను బోవగను వారు
కొడుకు జలంబులు గొని తెచ్చుటకు బోయి
రాడేమి హేతువోనేడనన్య
గతికుల వృద్ధుల నతిదుఃఖితుల దప్పి
చేనుండు మమ్ముపేక్షింప నేల

తే.గీ॥ తమకునతి భక్తుడతడని తనయుగుణము
లనుచు మత్పాద విన్యాసమాలకించి
యన్న వచ్చితె! తెచ్చితె! యంబులిమ్ము
మున్నుగామాకు నీవునంబువులు గొనుము 421

కం॥ పలుకవదేటికి మాతో
నలిగితివే! తడసి లేమి యలసితె! యనుచున్
బలవించు వారికూరక
జలములొసగి మ్రొక్కి భీతి సవినయ మతినై 422

కం॥ మీసుతుడగా నయోధ్యా
వాసుడ దశరథుడ ననెడి వాడ శరమునన్
వ్రేసితి మీసుతు మృగయా
వ్యాసక్తిన్ దారుణగతి వారణమతిచేన్ 423

వ॥ అంతట నేను జటాన్వితుండును పతితుండును నగుభవత్సుతుం జేరి ప్రార్థించిన నతండును మిమ్ముల బ్రసన్నుల జేయుమనిన వచ్చితి, నపరాధయుతుండ శరణాగతుండ, రక్షింపమని చరణంబుల వ్రాలిన వారునుం గుమారుగుణంబు లుగ్గడించి పెక్కువగల విలపించి నాచేత చితి రచియింపజేసి సుతసహితంబుగా తద్గదితులై గత జీవితులై రత్తరి తజ్జనకుండు నన్నునుద్దేశించి నీవును బుత్రశోకంబున లోకాంతరంబు జెందగలవాడవని శపించెంగావున నత్తాపసుని దురాపం బగు శాపంబు బ్రాపింప కాలంబయ్యెనని యనంతరంబ తన్నిశాసమయమంబున 424

ఆ.వె. రాము భూమిపుత్రి సౌమిత్రి దలచుచు
సుతవియోగ జనిత శోకమునను
నాకమునకు జనియె గైకయీ కృతమృత్యు
దారితుండునగుచు దశరథుండు 425

కం॥ అంతనతని యంతఃపుర
కాంతలు గౌసల్య మొదలుగాగల వార
త్యంతము నెదలన్ వ్రేయుచు
నెంతయురోదన మొనర్చి రెలుగులు సెలగన్ 426

వ॥ అంత బ్రభాతంబగుటయు మంత్రివిశిష్ఠుండై వసిష్ఠుండచ్చటికి వచ్చి గౌసల్యాదుల నాశ్వాసించి దశరథు కళేబరంబు తైలద్రోణి సవరించి వేగులవారిరావించి మీరు జవసంగతంబులగు తురంగంబులతో వేగిరంబ కేకయ నగరంబునకుం జని మదాజ్ఞం జేసి భరత శత్రుఘ్నులం గైకేయిం జూడ సాకేతమ్మునకుం దోకొని రమ్మనిన నద్దూతలతి రయమ్మునంజని భరతమాతులుండగు యుధాజిత్తుంగని సత్వరంబున వసిష్ఠోక్తం బెరుంగించి యనుజ సహితుండగు భరతుం దోడ్కొని వచ్చుచుండ నతండును భయవిహ్వలుండై మార్గంబునం దనమనంబున 427

తే.గీ. నృపతికేనియు రామునకేని యొక్క
కష్టదశబుట్ట గాబోలుగాకనిట్లు
నను గురుడు బిల్వబంపునే యనుచుచింత
నంత భరతుడయోధ్యకు నరుగుదెంచి 428

సీ॥ జనసంఘరహితమై చలితలక్ష్మీకమై
పరిహృతోత్సవమునౌపురముగాంచి
పరమచింతా భారభరితుడై భరతుండు
సంత్యక్త రాజలక్షణమునైన
రాజగృహాభ్యంతరము చేరగావచ్చి
నొక్కచోనొంటి గూర్చున్నదాని
తనమాత కేకయ తనుజాతగని భక్తి
శిరము తత్పదముల జేర్చి మ్రొక్క

తే.గీ॥ నామె బ్రేమాతిశయమున నతని నెత్తి
నెత్తిమూర్కొని యంకసంస్థితుని జేసి
నగవు చిగురొత్త నాలింగనం బొనర్చి
యతివ పుట్టింటి సేమము నడుగదలచి 429

కం॥ మాతల్లియు మాతండ్రియు
భ్రాతలు సుఖులేయటన్న భరతుడు చేతో
రీతి జలింపగ చింతా
న్వీతుండై మాతతోడ నిట్లని పలికెన్ 430

ఉ॥ మాతమదీయ తాత వినుమా! యిపుడెక్కడ నున్న వాడు నీ
వీతరి నొంటినుండెద వదేటికి నిన్నెడబాసి యొంటిమ
త్తాతవసింపడెప్పుడు నతండు గనంబడడెందు బోయనే
డాతని జూడకున్నను భయంబును దుఃఖము నెక్కుడయ్యెడిన్ 431

మ॥ అనినన్ గైకతనూజుతో ననియె నీకట్లేలచింతింప నో
తనయా! యేగతి నశ్వమేధమఖకర్తల్ ధర్మనిష్ఠల్ గనన్
జననౌనాగతికేగె బుత్రకృత వాత్సల్యుండు మీతండ్రి నా
విని మూర్ఛంబడి భూమిపై భరతుడున్ విభ్రాంత చిత్తుండునై 432

తే.గీ॥ హాజనక! నన్ను బాసియందరిగి తకట
యేమి జెప్పక నిటనున్న రామునకును
రాజునకు నప్పగింపకగ్రజునకనుచు
గళిత కచభారుడై శోక గతి నెసంగె 433

శా॥ ఈ రీతిన్ భయశోక మూర్ఛితు సుతన్ వీక్షించిరాదీసి వి
స్తార ప్రేమను బాష్పముల్ దుడిచి యాశ్వాసించి కైకేయి శో
కారంభంబిక నేల భద్రములు నీకొనేడు గైకొమ్ము భూ
భారం బీసకలంబు నీ కొరకు సంపాదించితిం బుత్రకా! 434

కం॥ అనినన్ మజ్జనకుండే
మనియెగత ప్రాణుడగుచు ననిన భరతునిన్
గని కైక భయములేకన్
బనుపడనిట్లనియె స్త్రీ స్వభావముకతనన్ 435

ఉ॥ హా రఘువీర లక్ష్మణ ధరాత్మజయంచు విలాపనంబు వి
స్తారముగాగ మేన్విడిచి స్వర్గము జెందె మహీవరుండనా
నారఘువీర లక్ష్మణ ధరాత్మజలుండరెరాజ సన్నిధిన్
వారెటు బోయిరంచు భయవర్తనుడై భరతుండు బల్కినన్ 436

వ॥ అప్పుడు 437

సీ॥ వినుము! మీ తండ్రి రామునకుగా యౌవరా
జ్యార్థంబు సంభ్రమం బాచరింప
నప్పుడు నేను నీకారాజ్యమిప్పింప
జేయతద్విఘ్నంబు సేయదలచి
వరదుడైతనకు నవ్వసుమతీపతి తొల్లి
పొసగ వరద్వయం బొసగియుండె
నందొక్కవరముచే నఖిలరాజ్యము నీకు
నొసగంగ మరివేరె నొకటి చేత

తే.గీ॥ నడవి కనుపంగ రాముని నడిగి తేను
దానిచే సత్య సంధుండు గాన నృపతి
రాజ్యమంతయు నీకిచ్చె రామునినిపె
వనమునకు గాన నాతండు సనియెనటుల 438

కం॥ రాముని పాతివ్రత్య
స్థేమ ననుచరించి చనియె సీతయు మరియా
రాముని భ్రాతృ ప్రేమను
సౌమిత్రియు సనియెనతని సహవాసమునన్ 439

కం॥ ఆరామాదులు మువ్వురు
నారామంబునకు నరుగ నతిమోహముచే
నారామాదుల దలచుచు
నారాజున్ శోకమున గతాసుండయ్యెన్ 440

తే.గీ. అనిజనని బల్క నతడు భయంబుదొల్క
నశనిహత సాలమును బోలి యవని వ్రాలి
సోలిదుఃఖితుడైన యాసుతుని తోన
నపుడు మరియును బోకనిట్లనియెగైక 441

కం॥ తనుజా! శోకం బేలా?
మనుజాధిప లీల రాజ్యమహిమలు గనుమా!
యనుజనయిత్రిన్ గేకయ
తనయన్ గని భరతుడనియె దహియించుగతిన్ 442

కం॥ పాపాత్మురాల! నీతో
పాపము భాషింప నొల్లపతి ఘాతిని నీ
పాపపు గర్భంబుననే
బ్రాపించుట చేత నిపుడు పాతకి నైతిన్ 443

వ॥ కావున 444

కం॥ విసమైనన్ గ్రసియించెద
వెసననలం బైననుంబ్రవేసించెద నే
నసి నైనన్ విశయింపుచు
నసువులు బాసియు యమక్షయము బ్రాపింతున్ 445

తే.గీ॥ క్రూరమతి భర్తృఘాతిని కుంభిపాక
కలుషగతి నీవునిక జెందగల వటంచు
వృజిన పరిపాక కైక భర్జించి యంత
జనియె భరతుండు కౌసల్య సదనమునకు 446

వ॥ ఇట్లేతెంచిన భరతునింగాంచి గౌసల్యయు ముక్త కంఠియై హాహాకారంబున శోకింపన్ గనియతండు నద్దేవి పాదంబుల పైబడి తానును శోకంబు గావింప నక్కుమారునిం గౌగిలించుకొని సాధ్వియున్ గృశాంగియు దీనవదనయు యశస్వినియునగు రామజనని యశ్రుపూరితనయనయై యిట్లనియె 447

కం॥ తనయా! నీవిటు దూరము
జనుచో నేడింత బుట్టె సర్వమునీవున్
వినియుండుదు నీజననియు
వినుపించున్ తనదు దుష్ట వృత్తం బెల్లన్ 448

ఉ॥ నా రఘు రామచంద్రుడగు నా తనయుండు సలక్ష్మణుండునై
దారయుతుండునై యజినధారియు వల్కరిధారియున్ జటా
ధారియు పాదచారియయి తద్దయు దుఃఖసముద్రమగ్నుఁనై
గూరిన నన్ను బోవిడిచి ఘోరవనంబునకేగి బుత్రకా! 449

తే.గీ. హా రఘూత్తమ! నీవు బరాత్మ మూర్తి
వయ్యు నాకుదనూజుండవైతి వకట
పుత్ర మోహంబు నాకును బోవదకట
దైవము బలిష్ఠమని బుద్ధి దలతునేను 450

చ॥ అనివిలపించుకోసల నృపాత్మజకున్ భరతుండు మ్రొక్కి యి
ట్లను వినుతల్లి! నావచన మక్కట కైకయి రాఘువాభిషే
చనమున సేయు విఘ్నమను శబ్దమెరింగిన నేను జెప్పినా
ననయము బ్రహ్మఘాతుక శతార్జిత పాతక మేను జెందెదన్ 451

వ॥ అదియునుం గాక 452

కం॥ వెస నే నిక్కార్యంబున
నిసుమంత బ్రసంగ మెరిగితేనియు జననీ!
యసిచే నరుంధతీయుతు
వసిష్ఠ వధియించు నఘము వచ్చున్ నాకున్ 453

కం॥ అనియీ విధి బహుశపథము
లను భరతుని జూచి కోసలాత్మజ యాలిం
గన మొనరిచి నిన్నెరుగుదు
ననఘా! శమియింపు మనుచు నాశ్వాసించెన్ 454

వ॥ అంతభరతాగమనవృత్తాంతంబంతయు వసిష్ఠుండెరింగి మంత్రి సహితుండై యంతిపురంబున కరుగుదెంచి విలపించు భరతునిన్ గాంచి యూరడించి యతనితో రాజు గుణంబులు బ్రశసించి

వృద్ధుండును బ్రసిద్ధుండును సత్యపరాక్రముండును నవాప్తవిజ్ఞాన క్రముండును నతిరథుండును నగు దశరథుండు నిఖిలంబుల మనుజలోక సుఖంబులనుభవించి బహుదక్షిణంబుల నశ్వమేధాది మఖంబులు గావించి చిరకాలంబు బ్రజలం బాలించి నారాయ ణావతారుండగు రామాకారున్ గుమారున్ గాంచి పిదపన్ దేవేంద్ర సహస్థితి యోగ్యంబగు స్వర్గమార్గంబునన్‌జెందె నిందున శోకింపనేల నని మరియునిట్లనియె 455

సీ॥ క్షణభోగ్యమును శోకగతి కయోగ్యంబైన
యీదేహమునకుగా నేడ్చెదేల?
నాత్మనిత్యుండు నవ్యయుడు శుద్ధుండౌట
విను జన్మనాశాది విరహితుండు
తనువు జడంబును గనక పవిత్రంబు
క్షణ దృశ్య మౌట నశ్వరముదెలియ
గాన విచారింపగా శోకమునకును
నిటయవకాశమొక్కింత లేదు

తే.గీ॥ పితృసుతహితాదికులుమృత్యుగతులునైన
మూఢుడడలును తనుదానమోదు కొనుచు
నగుట పండితుడాత్మననాత్మనెరిగి
శోకమును జెందబోడు వివేకమునకు 456

తే.గీ॥ సారెకు నసారమైన సంసారముననను
జ్ఞానియగు వానికి వియోగమైనయపుడ
యదియె వైరాగ్య హేతువై యలవరించు
శాంతి సౌఖ్యంబు గాంచు విశ్రాంతి గాగ 457

చ॥ జననము నాదిగా పురుష చక్కగ మృత్యువు గాచియుండునౌ
టన పరిహార్య మౌచు నెచటన్ దగుమృత్యువు బ్రాణి కోటికిన్
గనుక స్వ కర్మ సంగతిని గాంచును జంతువు జన్మ మృత్యులం
చు నొగి నెరింగియుండియును శోకము నొందు బుధుండదేలకో! 458

తే.గీ॥ వినుము బ్రహ్మాండకోటు లైననునశించు
భూరివిధ సృష్టలెన్నియె బోవుచుండు
సింధుసంఘంబులైన శోషించు గాన
నకట క్షణ జీవితమునకై యాసయేల 459

కం॥ జలపత్రాంత గతంబగు
జలబిందువు రీతి దొలగు క్షణభంగురమై

గల యాయువు తన వేళకు
నలువందగ దీనియందు నమ్మిక యేలా! 460

ఉ॥ దేహికి బ్రాక్తనంబయిన దేహము వీడిన కర్మసంగతిన్
దేహ పరం పరల్ గలుగు దీనను వచ్చుచు బోవుచుండు నౌ
దేహము జీర్ణ వస్త్రమును దీసి నవాంబరమూను లీలసం
దేహము లేదు గానమరి దీనికి శోకము నందనేటికిన్ 461

వ॥ అదియునుం గాక నాత్మజనన వర్ధన నాశనాది షడ్భావవికార రహితంబును ననంతంబును సత్యజ్ఞానానంద విగ్రహంబును బుధ్యాది సాక్షియు నిర్లేపంబును వరంబును స్థిరంబును నద్వితీయం బును నగుంగావున నిట్టియాత్మస్వరూపంబు దృఢంబుగా నెరింగి శోకంబు దొలంగుమని వసిష్ఠుండు వెండియు నిట్లనియె 462

కం॥ వినుతైలనిహితమగు మీ
జనకుని దేహంబుదీసి సచివులతోడన్
ఘనశాస్త్ర విధిని మాతో
యనఘా! యొనగూర్పు సత్క్రియలు జనకునకున్ 463

సీ॥ అనుచు వసిష్ఠుచే ననుబోధితుండయి
భరతుడజ్ఞాన సంభవమునైన
శోకంబు వీడి వివేకి యౌచు గురూక్త
నియతిచే నాహితాగ్నికిని బోలె
జనకుని దేహంబు సంస్కారమొనరించి
యనుజుండు దాను క్రియాళిజేసి
తనరనేకాదశి దినమాది విధియుక్త
సద్బ్రాహ్మణులకు భోజనమొనర్చి

తే.గీ॥ జనకునుద్దేశమొనరించి శత సహస్ర
కోటి సంఖ్యల ధనములు గోధనములు
గ్రామములు ధామములు మణి స్తోమములును
వస్త్రములు నిచ్చెనాతడవ్వారిగాగ 464

కం॥ అంతట ననుజుడు మంత్రులు
ప్రాంతంబున గొలువనపుడు భరతుండు గృహా
భ్యంతరమున శ్రీరాముని
జింతింపుచునుండెనట వసిష్ఠయుతుండై 465

వ॥ అంత 466

- భరతుడు రామునిచెంతకు వెళ్లుట -

శా॥ సీతాలక్ష్మణ సంయుతుండయి రఘుశ్రేష్ఠుండు ఘోరాటవిన్
భ్రాంతింజెందె మదంబ దైత్యసతిమేరం దృష్టమాత్రంబునన్
చేతో దాహమొనర్చు గాన వనరాజిందృక్తరాజ్యుండనై
సీతాన్వీతుని రామునిన్ స్మితముఖున్ సేవింతు నేనెప్పుడున్ 467

వ॥ అని భరతుండు నిశ్చితుండై యుండ ననంతరంబ మునియుతుండును మంత్రిపురజన సమన్వితుండునునై దేవసభాసన్నిభంబగు రాజసభన్ జేరి రెండవ చతుర్ముఖుండునుం బోలెసుఖాసీనుండై యరిబల భంజనుండును యనుజ సహితుండును నగు భరతున్ దర్శించి యాదరించి వసిష్ఠుండు దేశకాల యుక్తంబగు వాక్యంబుల నిట్లనియె 468

కం॥ నీకై వెడలెసమస్తము
నీకైకయు సత్యనియతి నృపతి యొసగె దా
నాకోర్కి గానరాజ్యము
గైకొనుమభిషేకపూర్వకముగా వత్సా! 469

చం॥ అనిన వినీతుడై భరతుడమ్ముని కిట్లను రాజ్యమేల నా
కనయము నేము కింకరుల మక్కట రాముడు రాజరాజగున్
గనుకనురేపు ప్రొద్దున దగన్ జనిరాముని దెత్తు రాదగున్
ఘనమతి మీరుతల్లులును గైకయి రక్కసురాలుదక్కగన్ 470

కం॥ కైకయిని మాతృగంధిని
జేకొని వధియింతునైన స్త్రీ హంతయటం
చాకాకుత్థ్థుడు నన్నున్
గైకొనడని మానితేనిగానీ మౌనీ! 471

శా॥ కానం బ్రొద్దున బాదచారినయి వేగన్గానకున్ రామునిన్
గానం బోయెద సానుజుండనయి వీకన్మీరు రాకున్న న
ట్లేనున్ రాముడు వచ్చునంతకును నెంతే నారచీరల్ జటల్
మేనన్ బూని ఫలాశనుండనయి భూమీశాయినై యుండెదన్ 472

కం॥ అని భరతుడు బలికిన విని
జనములు సాధూక్తులను బ్రశంసించిరి త
ద్వనగమనమునకు వెంటన్
జనిరిసచివులఖిలజనులు సైన్యచయంబుల్ 473

తే.గీ॥ అపుడు గౌసల్య మొదలుగా నృపతిసతులు
నవ్వసిష్ఠాది మునితతులరుగు దేర
నమ్మహాసేన జనిచని యవని యద్రువ
శృంగిబేర పురాంతిక సీమ విడిసె 474

ఉ॥ ఆ గతిసేనతో భరతుడాగతుడౌటను రామునందు దో
షాగతి వచ్చునాయితని నాగెద గంగను దాటనీక నే
డే గని వత్తునంచు నిజభృత్యుల నల్దెస నిల్పి వేగదా
రా గుహుడున్ సబంధుడును సాయుధుడై మరివచ్చియచ్చటన్ 475

కం॥ భరతుని శమదమ నియ మో
పరతుని వల్కలజటాది భరతుని ఘనభా
స్ఫురితుని రామస్మరణై
కరతుని తచ్ఛోకయుతుని గనియెన్ గుహుడున్ 476

వ॥ ఇట్లు సుఖావిష్టుండును ననుజ విశిష్టుండును నగు భరతుంగాంచి కానుకలిచ్చి శిరంబు చేతనమస్కరించిన నుత్థితున్గావించి కౌగిలించి హితుండగు నగ్గుహునితో నతండిట్లనియె 477

సీ॥ భ్రాతరాముని తోడ బ్రీతి సంగతిజేసి
హర్షాశ్రుయుతుడమలాత్ముడైన
యమ్మహాత్మునిచేత నాలింగితుండనై
సంభాషణంబులు సలిపినీవు
ధన్యుండవైతివి తావకదర్శనా
వాప్తిగృతార్థుండ నైతినేను
రాముని భూమిజసౌమిత్రి నెటగంటి
వెచ్చోట శయనించెనింతితోడ

తే.గీ॥ నాస్థలము జూడ దోకొని యరుగుమచటి
కీవురాముని భక్తుండ విష్టతముడ
వగుటచే భాగ్యవంతుడవని ప్రమోద
జలధినోలాడె రాముని దలచి తలచి 478

వ॥ అంత నత్యంతసంతోషాశ్రుభరితుండై భరతుండును గుహసహితుండై యారాత్రి నారామాదు లున్నయడకుంజని కుశాస్తరణాభివేశంబును సీతానివసనసంలగ్న సువర్ణబిందు కృత ప్రకాశంబునునగు నాప్రదేశంబు గాంచి పరితపించునంతరంగంబున 479

తే.గీ. అకట! సుకుమారి సీత సౌధాగ్రనీత
హైమ పర్యంకమృదుల శయ్యాశుభాంక

సీమరాముని తోడవసించునట్టి
దిట్టి కుశవిష్టరమున శయించె నెట్లు 480

కం॥ ఈదోషమంత నాయది
గాదే! పాపానుకృతికి గైకకొదలితే
నాదేహము గాల్పనె రా
మాదులకీ ఖేదమునకునాకరమైతిన్ 481

తే.గీ. ఈమహిజ రామ విభు వన సీమనేని
యనుసరించెను బ్రేమచే నట్ల నేను
నతని దాసానుదాసుడ ననుసరించి
జన్మ సఫలత గాంతు నిస్సంశయంబు 482

వ॥ కావున 483

కం॥ అన్నా! యెరిగితివేనియు
మన్నాథుని వసతి జెప్పుమా! బ్రార్థనచే
నన్నన్ దోడుక వచ్చెద
నన్నన్ విని తద్గుహుండు హర్షావహుడై 484

ఉ॥ అంతనిషాద వల్లభుడు నాభరతున్ విమలస్వభావుగా
స్వాంతమునన్ దలంచి ప్రియసంగతి నిట్లను దేవనీకుని
ట్లైంతయు రామలక్ష్మణ మహీసుతలందతి భక్తిగల్గుట
త్యంతము సార్థమయ్యెనని యంతయు జెప్పదొణంగి యిట్లనున్ 485

కం॥ అందమగు చిత్రకూటము
నందనువగు చిత్ర కూటమందొకచోటన్
మందాకినికి సమంబగు
మందాకినికిన్ సమీప మహిమహితముగన్ 486

కం॥ మునిజనతాశ్రమ పదమున
ననుజ మహీతనుజులును సుఖాయతి గొలువన్
గని రాముడున్న వాడా
యన జూడన్ బోవుదముదయంబున ననఘా! 487

వ॥ అనిగుహుండునున్ దన్మహాసైన్య సముత్తరణంబునకు యధానుసర ణంబుగా పంచశతనావానయనంబు గావించియందు పాండుకంబళా స్తరణంబగు స్వస్తి కంబను బ్రశస్తంబగు నొక్కనావయందు భరత శత్రుఘ్నులను మరియున్ దక్కినవానిచేత గౌసల్యాది రాజస్త్రీలను వసిష్ఠాదిగురు పురోహిత బ్రాహ్మణులను

మంత్రిప్రముఖ పరివారంబును కరితురంగాది సకలాంగంబులను గంగా సముత్తరణంబు గావింప
నంత మైత్రాఖ్యంబగు ముహూర్త సమయముంబున 488

కం॥ ఆభరతుండానంద
శ్రీభరితుండగుచు గనియె జేరిత్రివేణీ
వైభవ భావిత సుశ్రే
యోభర నిశ్రేయసప్రయోగ ప్రయాగన్ 489

వ॥ అంత 490

సీ॥ ఆ ప్రయాగపదస్థమగు భరద్వాజాశ్ర
మము గాంచి యలగ్రోశమాత్రమునకు
సేనలనిల్పి వసిష్ఠ విశిష్టుడై
జనిన భరద్వాజ ముని వరిష్ఠ
డవ్వసిష్ఠ మునీంద్రు నరసి బ్రత్యుత్థాన
మునుజేయ భరతుండు మ్రొక్కుటయును
దశరథ సుతునిగా దలచి వారలనర్ఘ్య
పాద్యాదుల బ్రమోదపరులజేసి

తే.గీ॥ యాను పూర్వికముగ సేమమడిగి మీకు
నెల్లనాతిథ్య మొనరింపనిచ్ఛయించి
తేను సేనల రప్పింపు మిచటి కనిన
నలరి ముని యాజ్ఞ నతడట్లు సలుపనంత 491

తే.గీ. ఆ భరద్వాజ మౌని శుభాజ్ఞ బూని
కామధేనువు సరియైన హోమధేను
వపుడు బహుసృష్టి నఖిల పదార్థ వృష్టి
దానభీష్టాప్తిగురిసిన దానజేసి 492

కం॥ భోజన విహారముఖ సుఖ
యోజనముల దృప్తిజేసె యోగి వరుడతం
డాజనములిష్ట వైభవ
భాజనములుగాగనింద్ర భాగ్యప్రతిభన్ 493

వ॥ ఇట్లు వసిష్ఠపురస్సంబుగా సకల జనంబులు దృప్తులై యారాత్రి స్వర్గసమంబగు నమ్మునీంద్రు నాశ్రమంబున
వసియించి ప్రభాతంబున భరతుండభివాదనపూర్వకంబుగా భరద్వాజుల ననుమంతుడై వచ్చి యంత 494

చ॥ జనియట చిత్రకూటమున సైన్యము దూరమునందు నిల్పి రా
మునిగను వాంఛచేత నతిమోదమునన్ భరతుండునగ్గుహుం
డనుజుడు తోడ రాగ ముని యాశ్రమముల్ బరికించి కానకన్
మునిజనమండలంబుగని మ్రొక్కిసభక్తి శుభోక్తి యిట్లనున్ 495

కం॥ సీతా సౌమిత్రులతో
నోతాపసులార! శ్రీరఘూత్తముడు శుభా
న్వీతుడు విఖ్యాతుడు సు
స్ఫీతుండెందున్న వాడు జెప్పరెయనినన్ 496

వ॥ అమ్ముని వరులును భరతుని వినయ భయభక్తుల సెలంగి యతనింగనుంగొని 497

తే.గీ. క్షితివరకుమార! యిచట నీచిత్రకూట
నగమునకు బశ్చిమమున మందాకినికిని
యుత్తరమున శుభారామ యుక్తమును వి
విక్తమును రామధామంబు వెలయుచుండు 498

కం॥ ఆబుషి వరదర్శితమగు
దారి సఫలపనస కోవిదార కదళికా
భూరి వకుళ కేసర సహ
కారక సహకారమైన కాంతారమునన్ 499

కం॥ భరతుండాహ్లాద కళా
భరితుండై రామచంద్ర భవనాన్వేష
స్ఫురితుండై మంత్రి సహా
చరితుండై యవ్వనమున జని చని యంతన్ 500

ఉ॥ దూరము నందు గాంచె భరతుండనుజాన్వితుడై ముదంబునన్
సారమునీంద్ర సేవితము సాలశిరః పరిలగ్న వల్కల
స్ఫార పటాంశుభావితము భవ్యము దివ్యము దేవసేవ్యమౌ
శ్రీరఘురాము నాశ్రమము చిత్తము విశ్రమమంద నత్తరిన్ 501

సీ॥ శ్రుతి సంహితోక్తభాసిత విప్రతతులను
వైభవోన్నత రాజవంశములను
తత చిత్రవస్తు చిత్రక కటకంబుల
హరిపదద్భూతి యోగ్యస్థలముల
సమధికస్యందనాగమ ముఖ్య విస్ఫూర్తి
శృంగార సుకర సారంగములను

హరి మహోద్భట విక్రమావిర్భవంబుల
గణికాది వివిధ సంగతుల చేత

తే.గీ॥ సాలముఖఖేయఝురవారి జాలములను
చిత్రకూటాగ్ర వాహినీ శ్రీలనెనసి
తగియె పురలీల నారామధామలక్ష్మి
తగిన వరలీల నారామధామలక్ష్మి 502

వ॥ ఇట్లు రామాశ్రమంబు గనుంగొని 503

కం॥ అంతటజని భరతుండ
త్యంత పవిత్రంబునగు తదాశ్రమదేశ
ప్రాంతము సీతారఘుకుల
కాంత పదాంకితము బ్రీతిగనుగొనియచటన్ 504

కం॥ హల కులిశ కలశ కల్పద
జలజ జలజరథ పదాంకుశ ధ్వజరేఖా
కలితములై రామపదా
వళితములగు చిహ్నములను వరుసన్ గనియెన్ 505

కం॥ ఈగతి భరతుండనుజ స
మాగతుడై కాంచిమంగళాంఘ్రి పదంబుల్
వేగమ తచ్చరణరజః
పూగము నిజమౌళి భాగమున ధరియించెన్ 506

వ॥ అంతభరతుండు తనమనంబున 507

తే.గీ. శ్రుతులచే ధాతృముఖ దేవతతుల చేత
వెతకనగు నేపదాబ్జ భావితరజంబు
నట్టియా రామ పదచిహ్నితాంగణముల
నకట కనుగొంటి నేనెంత సుకృతి నొక్కొ! 508

చం॥ అనియిటులద్భుతంబును బ్రియాతిశయంబు బెనన్ గొనన్ మనం
బున రఘునాథ భావనసమున్నతి చేతను హర్షబాష్ప సి
క్త నిజభుజాంతరుండునయి తద్భరతుండు బరాత్ముడైన రా
మునిదగు నాశ్రమంబునకు బోయి సమీపమునందు నచ్చటన్ 509

సీ॥ తోయదాగమ దళద్దూర్వాదళ శ్యాము
నాయతాంబుజలోచనాభిరాము

కమనీయ మృదుల వల్కల వస్త్రపరిధాను
నవజటామకుట మండల విధాను
తరుణారుణద్యుతి స్ఫురణారుచిర గాత్రు
సంపూర్ణ చంద్రప్రసన్న వక్త్రు
జానకీ క్రీడార్థ సందర్శిత వినోదు
సౌమిత్రి సేవిత జలజపాదు

తే.గీ॥ పర్ణశాలాంతర నిశాంతు పరమశాంతు
సురచిర కుశాసనాసీను శుభనిధాను
నఖిల గుణధాము శ్రీరాము నఘవిరాము
గనియె భరతుండు కన్నుల కరువుదీర 510

కం॥ ఈతీరున గని ద్వితీయు
భీతియు శోకంబు సిగ్గు బెనగొన నతివే
గాతరుడై రామపదా
బ్జాతంబుల వ్రాలెనతడు ఫాలమునొరయన్ 511

సీ॥ అతడట్ల తత్పద ధ్యానైక రతడౌట
హస్తపీఠముల యందావహించి
యశ్రుజలంబుల నర్ఘ్యంబు పాద్యంబు
నభిహితస్నానంబు నాచరించి
ముఖవస్త్రమును గప్పి మోహాభరణమూర్చి
ఘనభక్తి సాక్షత గంధమలది
ధృక్సుమాంబుల నర్చలిడి ముఖవాసనా
ధూపంబు దర్శన దీపమొసగి

తే.గీ॥ తత్పరానంద రస నివేదన మొనర్చి
క్రమముగా షోడశోపచారములు దోప
నటుల సాష్టాంగ వినతి రామాంఘ్రులందు
బడి తడవు లేవకున్న నాభరతుగాంచి 512

శా॥ ఆ రాముండును దీర్ఘబాహుడట బాహాపాళిరాదీసి వి
స్తార ప్రేమ ప్రియానుజున్ భరతునత్యంతాప్తి నాలింగనా
ద్యారూఢిన్ రచియించుచున్ దడపినేత్రానంద బాష్పంబులన్
గారాబంబున నంకపీఠినిడియెన్ గౌతూహలోపేతుడై 513

ఉ॥ అంతట తల్లులందరురయంబున రాదమ తల్లి ధేను వ
త్యంత తృషార్థయైజలమునారసి వచ్చిన రీతిరాగ దా
నెంతయు మ్రొక్కసాశ్రుజల దృక్పుటయై సుతుగౌగిలించిర
ట్లంతట దల్లులందరకు నానతుడై రఘునందునుండొగిన్ 514

తే.గీ. అప్పుడు వసిష్ఠుడాగతుడౌటగాంచి
వినతిగావించి రాముడు విరచితార్హ
విధుల బూజించి సుఖసమావిష్టుడైన
యవ్వసిష్ఠునితోడ నిట్లనుచు బలికె 515

కం॥ మాతండ్రి కుశలియేకద
నాతతమతి యేమి జెప్పుమనియెన్నాతో
నోతాపసవర! దుఃఖో
పేతుడతండన వసిష్ఠుడిట్లని పలికెన్ 516

ఉ॥ రామభవద్వియోగమున రాజగునీ జనకుండు భూరిచిం
తామితతప్తుడై నిరుధరాత్మజ లక్ష్మణునిందలంచిదా
నామెయిజెందెనాకమునకై యన రాముడు కర్ణశల్యమౌ
నాముని వాక్యమున్ వినినయంతన వేగ విషణ్ణ చిత్తుడై 517

కం॥ హా! హతుడనైతిననుచున్
హాహాకృతి నడలె రాముడవనిబడి బిత్తృ
స్నేహమున మోహమున శో
కాహతు లైరపుడు తల్లులందరు వరుసన్ 518

వ॥ మరియు నద్దశరథునుద్దేశించి సౌమిత్రియు మహీపుత్రియుశోకాయ త్తతం జెందిరత్తరి రఘుసత్త
ముండును నిజజనకునిన్ దలంచి యిట్లనియె 519

ఆ.వె. తాతగుణ సమేత తతభుజాబలసమ
న్వీతనన్ను విడిచి యెచటి కరిగి
తేన నాథనైతి నికనన్నులాలించు
వారలెవ్వరనుచు వరలుచుండ 520

వ॥ అంతనంతయున్ గని వసిష్ఠముని వారలతో నద్దశరథుండు పూర్వంబున సర్వధర్మంబు లొనర్చి
సత్యసంధుడగుట నసత్య భయంబునం బ్రతిశ్రుతంబు సకలంబు నొసంగికృతకృత్యుండయ్యె
కాలప్రాప్తంబగు దీనికి జింతింపనేలయని శాంతివచనంబుల శోకంబువారించిన వారలందరు
మందాకినింజని సుస్నాతులై వీతకల్మషులై రాసమయంబున రాముండును సౌమిత్రి సమేతుండై
నిజహస్తదత్త సలిలాసక్తుండగు జనకునకు జలంబులొసంగి జలనంబులే యన్నంబు దాముపయోగింతు

రాయన్నం బ పితృతతికి దగు ననుస్మృతి చోదితస్థితి విధియుతంబును మధుప్లుతంబును నింగుదీఫల పిణ్యాకరచితంబునునై కవ్యంబగు ద్రవ్యంబున నక్షయ స్వరూపంబగు పిండనిర్వాపణం బొనర్చి యశ్రుపూర్ణాక్షుండై పునస్స్నాతుండును సకల జనసమేతుండునునై యాశ్రమంబునకుం జని యద్దివసంబుపవసించి పరదివసంబున సపరివారంబుగా మందాకినీ మహానది నవగాహించి శు చియై విశాలంబగు పర్ణశాలం గుశాస్తరణాభిరాముండగు రామునకున్ బ్రాంజలియై వినయాభి రతుండగు భరతుండిట్లనియె 521

సీ॥ రామ! మహాభాగ! రాజ్యంబు సేకొమ్ము
నీకభిషేకంబు నీవసేయు
మగు పిత్ర్యమగు రాజ్యమగ్రజాధీనంబు
నధిప! నాకును తండ్రి యట్లనీవు
క్షత్రియ ధర్మసంగతి బ్రజంబాలించి
తగు యజ్ఞములు జేసి తనయునందు
ఘనరాజ భరమిడి వనమునకరుగనౌ
కాననస్థితికిది గాదు సమయ

తే.గీ॥ మగుట నాకు బ్రసన్నుడవగు మదీయ
జననిదగు దుష్కృతంబు గొంచంబునైన
దలచకను నన్ను రక్షించు దయనటంచు
నన్న పదముల భక్తి సాష్టాంగ మెరగి 522

కం॥ చిరముగను లేవకున్నన్
భరతుని వెసగ్రుచ్చియెత్తి పరమాదరతన్
హరిరాముడు తొడపైనిడి
యరయం గరుణార్ద్రనయనుడై యిట్లనియెన్ 523

సీ॥ వినువత్స! నీవు జెప్పిన మాటదగునైన
జనకుండు నాతోడ ననియెనిట్లు
దండకావని చతుర్దశవత్సరములుండి
నటమీదపురికినీవరుగుదెమ్ము
యిప్పుడు భరతునకేనిచ్చి తీరాజ్య
మనియె గావునను సువ్యక్తమయ్యె
వనము నాకునుధరావనము నీ కటుగాన
నిలుప నౌపితృసూక్తి నీవు నేను

తే.గీ॥ తండ్రి వాక్యముల్లంఘించి దాస్వతంత్ర
వర్తనుండయి కార్యమెవ్వాడు సేయు

నట్టివాడు జీవన్మృతుడనగబడును
ననఘ! దేహాంతరమున నిరయంబు నొందు 524

కం॥ కావున నీవును రాజ్యము
గావింపుము నేను దండకావనరాజ్యై
కావనమొనరించెదనని
పావనమున రామునకును భరతుండనియెన్ 525

కం॥ భ్రాంతుడు కామియుమూఢ
స్వాంతడు స్త్రీజితుడు జనకుడతని వచనమ
త్యంతము సత్యంబగునే
యెంతయు నున్మత్త వాక్యమిలలో బోలెన్ 526

చ॥ అన విని రాముడిట్లనియె నాభరతుంగని కామినీ జితుం
డనయము కామిమూఢమతియై జనకుండొసంగగ లేదు దా
మును పనినట్టి యర్థము సమున్నతినిచ్చెనసత్య భీతిచే
ఘనులకసత్యభీతి యధికంబగు దుర్గతి పాపభీతికిన్ 527

ఆ.వె॥ కాన కైకతోడ కానకు జనియెద
నేనటంచు సత్యనియతి బలికి
సలుప కెట్టులిక ననత్యంబుగావింతు
నవని రఘుకులుండనై కుమార! 528

కం॥ అని పలుకు రామ వాక్యము
విని భరతుండనియె రామ విపినమునకు నే
ముని గతి జనియుండెద నీ
వనఘా! రాజ్యంబు సేయుమన్ని దినంబుల్ 529

తే.గీ. అనిన విని రాముడిట్లను నతని తోడ
జనకుడు వనంబు నాకు రాజ్యంబు నీకు
నిచ్చె విపరీతముగ జేసి లేని దీని
పూర్వరీతిన సత్యంబు బోవకుండు 530

వ॥ అనిన రాముని నిశ్చయం బెరిగి భరతుండతనితో మహాత్మా! యిట్లేని నేనునువనంబునకు వచ్చి లక్ష్మణు విధంబున మిమున్ సేవించెదన్ గాదేని భ్రాయోపవేశంబున శరీరంబు బాసెదనని యభినివేశంబునన్ గుశాస్తరణంబున భ్రాజ్ముఖస్థితుండైన భరతుని నిర్బంధంబు గనుంగొని విస్మయపరుండై రఘువరుండు గురునితో నయనసంజ్ఞ గావించిన విజ్ఞాన గరిష్ఠుండగు వసిష్ఠుం డేకాంతంబున నీకు నొక్క సూక్ష్మంబు సెప్పెద మద్వాక్యంబు వినుమని భరతునితో నిట్లనియె 531

సీ॥ అనఘ! రాఘవుడు నారాయణుండు నిజంబు
బ్రార్థింపనజుడు భూభారముడుప
దశరథసుతుడయ్యె తద్యోగ మాయయు
సీతనా జనకసంజాతయయ్యె
సౌమిత్రి శేషుడా రాముననుసరించె
నరిగెదరిటు రావణాది హృతికి
తద్వనాగమనంబు దైవకృతంబగు
నిటు గాక కైకయిట్లేలసేయు

తే.గీ॥ కాన నాగ్రహమెడలు నిక్కాననాగ్ర
గతిని విడువడు రాముడీగతిని నీవు
మరలు పడుకుము పురికినై మరలుమితడు
రాగలడు వేగమసురల రాగమడచి 532

కం॥ అని చెప్పినగురు వాక్యము
విని భరతుడు శుభరతుండు విస్మయ యుతుడై
గని రాముని నికటమునకు
జని ప్రేమను బలికె సుప్రసన్ననయనుడై 533

కం॥ నీదగు పాదుక లీదగు
పాదుగ రాజేంద్ర రాజ్యభరము భరింపన్
నే దగు సేవింప గృపా
పాదన నీవచ్చు నంత పర్యంతంబున్ 534

ఆ.వె॥ అనినననుజుగనియు ననిచిన దయ తన
పాదకమలములకు పాదు గలుగు
పాదుకలు నొసంగె పరముడా రాముడు
భరతునకును రాజ్య విరతునకును 535

కం॥ కన భరతుడు రాముని గతి
ముని గతినుండుటను మకుటమున్ బాయుట రా
ముని పాదుకా ద్వయంబును
ననర్ఘ్య మకుటములు బడసెనవ్విభు కరుణన్ 536

కం॥ ఈదారి భరతుడమృత
స్వాదుకలగు పాదులు వెసన్ గైకొనియున్

మోదమునన్ గనిరాముని
యాదరమున గద్గదోక్తి నతనికి ననియెన్ 537

తే.గీ. అన్న నవపంచ వర్షంబులన్ని జన్న
ప్రథమ దివసంబునను నీవు రాకయున్న
ననలమే జొత్తు ననవత్తు నట్లయనుచు
నియ్యకొని రాముడానతి యిచ్చుటయును 538

వ॥ అంతభరతుండును శ్రీరాములకు ననేకంబులగు ప్రదక్షిణ దండ ప్రణామంబు లాచరించి వసిష్ఠ
శత్రుఘ్నమాతృ మంత్రిసేనా సమన్వితుడై ప్రయాణంబున కుపక్రమించెనయ్యెడ 539

కం॥ ఆకాలమున వికాకయి
కైకయి దాగయి మొగిడ్చి గడు భీతిని జా
లోకస్థుని కాకుత్థ్సుని
నేకాంతంబునను జూచి యిట్లని పలికెన్ 540

శా॥ నీమాయా పరిమోహితాత్మగతినై నేదుష్టమౌబుద్ధిచే
నీమీ భూమికృతాభిషేకమున కెంతే విఘ్నమున్ జేసితిన్
స్వామీ! మత్కుమతిన్ క్షమింపుము క్షమా సారుల్ గదా సాధువుల్
రామా! మోక్ష శుభాభిరామ! కరుణారామా! సరామా! హరీ! 541

సీ॥ నీవు విష్ణుండవు నిజము పురాణుండ
వవ్యక్తుడవు పరాత్ముడవు సుమ్ము!
యనఘ! మాయా మనుష్య స్వరూపంబున
నీజగంబెల్ల మోహింపజేతు
వినుభవత్ప్రేరణంబున లోకమంతయు
సదసత్క్రియావృత్తి సలుపుచుండు
నీయధీనంబగు నిఖిలంబును జడంబు
నస్వతంత్రము జేయునకట యెద్ది

తే.గీ॥ మహిని కృత్రిమ నర్తకీ కుహనలీల
బూని నర్తించు గతి నీయధీనయగుచు
నోపిమాయా నటియు బహురూపములను
విశ్వనటనంబు గావించు విశ్వనాథ! 542

కం॥ కావున దైవతకార్య
శ్రీవహనుడవైననీదుచే బ్రేరితనై

యీవిధి దుష్కృతి నేనును
గావించితి కలుషమతిని కలుషవిదూరా! 543

చ॥ అమరులకైన గోచరత నందని నీవు బ్రసన్నమైతె నే
డమరగ నన్ను బ్రోవవెయనంత! జగత్పతి! నీకు మ్రొక్కెదే
నమల భవన్నివేశిత చిదాయత ఖడ్గము చేత ద్రుంపుమా!
భ్రమనిడు మోహపాశముల భక్తి నినున్ శరణంటి రాఘవా! 544

మ॥ అని కైకేయి వచింప సస్మితముగా నాలించి శ్రీరాముడి
ట్లనియెన్ నీవు వచించినంతయును సత్యంబౌ మహాభాగ! యో
జననీ! వాణి భవన్ముఖంబున మదా జ్ఞాప్తింబ్రవేసించి ప
ల్కెను కార్యార్థముగాగ దోషమనగా లేదిందు నీ కెందునన్ 545

సీ॥ అని నిజజ్ఞానబోధన జేసియిట్లను
చనుమంబ! యనిశంబు ననుభజింపు
నిర్గతస్నేహవై నిఖిలంబు నందు మ
ద్భక్తి చేముక్తినందగలనీవు
నేను మిత్రామిత్ర నివహంబునందెల్ల
సమదర్శనంబును సలుపుచుందు
నాకెద్దియును లేదు ననుభజించెడి వారి
భజియింపుచుందునే బరమకృపను

తే.గీ॥ నలరమన్మాయచే మోహితాత్ములైన
వారు నన్నిటు మానవాకారునిగను
కలిత సుఖ దుఃఖయుతునిగా గాంతురెపుడు
తత్త్వవిదులైన వారలు దలపరటుల 546

కం॥ కానన్ నీకు మదీయ
జ్ఞానము భవహరము విధివశంబున గలిగెన్
దానన్ వసింపు మస్మ
ద్ధ్యానంబున కర్మమెడలి ★తరియింతువికన్ 547

కం॥ అనిరాముడు బోధించిన
విని కైకయు నతని హర్ష విస్మయయుతమై
గని వలగొని సాష్టాంగ
ప్రణతులు గావించిచనియె భక్తిస్ఫూర్తిన్ 548

★ తరియింతుమికన్ – గ.ము.ప్ర. పాఠం

వ॥ అంత 549

- పాదుకా పట్టాభిషేకము -

కం॥ భరతుడు గురు జననీముఖ
పరివారము తోడవచ్చి పరగనయోధ్యా
పురినిడి వారల మగుడియు
నెరినంది గ్రామమునను నిలిచెన్ దానున్ 550

కం॥ ఆ నంది గ్రామంబున
చేనందిన పాదుకలను సింహాసనల
క్ష్మీనందితముల జేసియు
దైనందిన రాజసంపదలు నడపించెన్ 551

వ॥ ఇట్లు భరతుండు రామ పరాయణ నిరతుండై శత్రుఘ్ను సహితంబుగా జటావల్కల పరిష్కారుండును నధశ్శయన ప్రచారుండునునై పాదుకల బూజింపుచు సకల కార్యంబుల నివేదింపుచు యథా న్యాయంబుగా బ్రజారక్షణం బొనర్చి రామాగమనకాంక్షియై దినంబులు గణింపుచు సాక్షాద్బ్రహ్మర్షియు బోలెనుండెనంత నిక్కడ రాఘవుండును భరతుండు సనినయనంతరంబున 552

సీ॥ చిత్రకూట విభేద చిత్రకూట వినోద
పాత్ర వాటవిహార పటిమదనరి
మందాకినీతీర మందార తరువార
బృందా రచిత శుభావృతులనెనసి
సీతావధూటీ సమేతాటవీ వాస
జాతాటన విశేష సరణ మెలగి
నిష్కాను చరితకనిష్కాను కలిత వ
రిష్కానుగతుల నర్మిలిజెలించి

తే.గీ॥ సానుకూలతపశ్శీల సానుకూల
మానిత విశాల దళశాల మౌనిశాల
లోల సహఖేలనాలీల హేళిదేలి
యందు విహరించె రఘువరుండఘు హరుండు 553

తే.గీ॥ ఆవిధిని గొంతకాలమందధివసించు
యానగంబున దానుండుటరసివచ్చు
పురజన కదంబ సంబాధమునకు దనకు
నేమి మనమున సరిరామి రామ విభుడు 554

వ॥ అంతటం జిత్రకూటంబు విడిచిదండకాటవీ గమనో
ద్యుక్తుండై సీతాలక్ష్మణయుక్తుండై రఘువరుండు చనిచని 555

సీ॥ తమ పక్షముల హరి తత్వంబు నెరుగించు
శుక సంతతుల చేత సొంపు మెరసి
తమ తపస్ఫూర్తిలో దనరిన నియమాప్తి
జెలగువన ప్రియ శ్రేణి నొరసి
తమసుమనస్సమాదర సంభ్రమంబున
బరగుమధు వ్రత ప్రతతి నెరసి
తమ సరసైక వర్తన శుచిత్వము దెల్పు
పరమహంస వతంస పటలి దొరసి

తే.గీ॥ తమ యచలమార్గగతి విరోధంబు లేక
నలరిహరి కరిముఖ గురు వ్యాప్తి నైక్య
భావనల నద్వయస్థితి బరుపు సుకృత
జంతువిశ్రమ మత్రియాశ్రమము గనియె 556

వ॥ ఇట్లు జని సకల ఋతు సుఖనివేశంబును వివర్జితజన
సంబాధ లేశంబును నగు నయ్యాశ్రమ ప్రవేశంబున 557

కం॥ మిత్ర కుల భర్తగనియెన్
చిత్ర తపశ్చరు ద్రిమూర్తి సిద్ధజనికరుం
బాత్ర వదనసూయేశ్వరు
నత్రిమునీశ్వరుని సుప్రభానశ్వరునిన్ 558

ఉ॥ ఆరహిగాంచి మౌనినిగుశాసనవాసుని నాత్మనామకో
చ్చారణ జేసి మ్రొక్కి రఘుసత్తము డోముని వర్య! తండ్రియా
జ్ఞారతి దండకావనమునన్ వసియింపగ వచ్చియిచ్చటన్
గోరికమీరమిమ్ము గనుగొంటిని ధన్యుడనైతి నేననన్ 559

కం॥ ఆముని రాముని హరిగా
స్వామినిగానెరిగి పూజసలిపి ఫలములన్
సౌమిత్రి భూమిజలతో
నామెయి నాతిథ్యమొసగి హర్షిలి పలికెన్ 560

తే.గీ. తనరు ననసూయ మజ్ఞాయ ధర్మగేయ
విలసదనసూయ చిర తపోవృద్ధ శుద్ధ

రామ వినుమిట యంతఃపురమునగలదు
సీతగని బ్రీతి గనివచ్చుగాత యనిన 561

వ॥ అంతరఘునేతయు నట్లయగుంగాతయనిన సీతయు విభుని చేతననుజ్ఞాతయై సత్వరంబున నంతిపురంబున కరిగి యద్దేవిం దర్శించి దండ ప్రణామంబొనరించిన నయ్యనసూయయుం బ్రియాతిశయంబున గౌగిలించి యనంతరంబ విశ్వకర్మ నిర్మితంబులైన యమూల్య మణిమండలంబు లగు రెండు కుండ లంబులును నిర్మలంబునైయపరిత్యక్త ప్రభాశ్రయంబగు దుకూలద్వయంబును నగణిత విభానురాగంబగు నంగరాగంబును జనకతనయ కొసంగి తత్సతితో భవచ్ఛరీరంబు దీనంజేసి శోభా విశేషంబునం బాయకుండునని సెప్పి పాతివ్రత్యంబునన్ బతినను సరించి చనుముని తోడన్ గూడి కుశలియై వేగంబ రాఘవుండు రాగలండని దీవించెనంత 562

కం॥ అత్రియు సౌమిత్రికి భూ
పుత్రికి తద్భర్తకపుడు భోజనము యధా
పాత్రవిధి జేసి యారఘు
పుత్రునితో ననియె వినయమున బ్రాంజలియై 563

ఉ॥ రామజగంబులన్ గిరిధరాపశు మానుష తిర్యగాదులన్
వేమరు నీవ జేసియును వీనిని బ్రోవగ దేహమూనియున్
బ్రామిక తత్తనూగుణ పరంపర నన్నిట నంటకుండ దీ
వామెయిగా నమోహకరియైదగుమాయయు నీకు భీతిలున్ 564

వ॥ అని యమ్మునియున్ బ్రశంసింప రఘువంశ శ్రేష్ఠుండు సుఖగోష్ఠి న య్యాశ్రమంబున విశ్రమించి యుండెనవ్విధంబున 565

కం॥ అని శర్వుడు శర్వాణికి
వినిపించిన సర్వమిట్లు విస్మితయై య
వ్వనితయు రాముని చరితము
లనఘా! యవ్వలను జెప్పుమని యడుగుటయున్ 566

– కందద్వయ గర్భిత మధ్య యమక చిత్ర చంపకమాలికావృత్తము–

చం॥ వరకరుణాభిరామ సురవాసుర వారనుతాంఘ్రి పద్మసుం
దరశరణార్థి కేకిశరదాశర దానవ దర్పహారి శం
కరవినుతాంకలోక జనకా జనకాది మునీంద్ర చిత్త సం
స్థిర ఘన భావ సూర్యవనధీ వనధీశ నివేశ కేశవా ! 567

- గర్భగత ప్రథమ కందము -

కరుణాభిరామ సురవా
సురవారనుతాంఘ్రి పద్మ సుందర శరణా!
శరణార్థి కేకి శరదా
శరదానవ దర్పహారి శంకర వినుతా! 568

- ద్వితీయ కందము -

వినుతాంకలోక జనకా
జనకాది మునీంద్ర చిత్త సంస్థిర ఘన భా
ఘనభావ సూర్య వనధీ
వనధీశ నివేశ కేశవా! వరకరుణా! 569

- పుష్ప మాలికా బంధ చిత్ర పంచచామరము -

రమా సమాన మానసాభిరామ రామ రాఘవ
క్రమాభిమాన మానితాకరాహ రామ రాగదా
ప్రమాసమాగమా శుభ ప్రభావ భావ్య భాప్తవి
భ్రమాశమాగ మానసుంధరా ధరాధిరాణ్మణీ! 570



- గద్య -

ఇది శ్రీమదుభయ కవితా నిస్సహాయ సాహితీవిహార కాణాదాన్వయతిమ్మనార్యకుమార
వినయవిభ్రాజి పెద్దనసోమయాజి ప్రణీతంబైన
శ్రీమదధ్యాత్మరామాయణంబను మహాపురాణంబునందు
అయోధ్య కాండంబన్నది ద్వితీయాశ్వాసము సంపూర్ణము

-★)★(★-



శ్రీ భూ చెన్నకేశవాయ నమః

అధ్యాత్మ రామాయణము

అరణ్యకాండము

 ర! కేశవ! కృష్ణా
పావన పరిధాన దానపాలిత కృష్ణా!
దేవ సరిన్నిభ కృష్ణా
ప్రావృత గద్వాల పురసురద్రుమ కృష్ణా! 1

వ॥ అవధరింపుము భక్తియోగవిశారదుండగు నారదునకు సక
లార్థ సంధాతయగు విధాత సెప్పెనట్లు విజ్ఞానవతియగు
పార్వతికి దివ్యప్రభావుండయ్యాశ్రమంబున నద్దివసం బధి
వసించి ప్రభాతంబున సుస్నాతుండై యత్రిమునీశ్వరు
నామంత్రణంబు చేసి ప్రయాణోన్ముఖుండై 2

కం॥ మునిమండల మండితములు
ఘనములు దండకవనములు గనబోయెదనా
కనుమతి జేయుడు శిష్యుల
బనుపుడు మార్గంబు జూపు పరమమునీంద్రా! 3

వ॥ అనిన నమ్మునీంద్రుండు హసన్ముఖచంద్రుండై రామచంద్రున కిట్లనియె 4

చం॥ అమల! పరాత్మనామ! విబుధాశ్రయ ధామ! సుధామ! రామ! స
ర్వమునకు మార్గదర్శివయి వర్తిలునీ కనుమార్గదర్శ కుం
డమరగ నొక్కడుంగలడె యైననులోక పథానుసారికిన్
గ్రమమని శిష్యులన్ బనిచెరాముని కామునితోప జూపగన్ 5

వ॥ ఇట్లు బనిచి తానును గొంత దూరంబరిగి రాముని చేత నివారింతుండై యమ్మునీశ్వరుండు
నిజాశ్రమంబునకుంజనియె నంత నక్కోసల ధాత్రీశ్వరుండు గ్రోశమాత్రంబుసని యొక్క మహానదిం
గని యయ్యత్రిముని శిష్యుల కిట్లనియె 6

కం॥ ఈనది దాటనుపాయం
బౌనది దెలుపుడన వారలతనికి దృఢమౌ
నీనావ మిమ్మునందర
తో నావల జేర్తుమనుచు తోడం గూడన్ 7

తే.గీ. వారిమువ్వురి నన్నదీ వారి కవలి
దారి కడసేర్చి యమ్మౌనిదారకులును
రామనందితులై నిజారామమునకు
బ్రేమనరిగిన నంతనారామ విభుడు 8

– దండకారణ్య ప్రవేశము –

సీ॥ ఝల్లికా ఝంకార భిల్లికాహుంకార
భల్లుకాహంకారవేల్లితంబు
శౌర్యక్షమా సర్గ హర్యక్ష ముఖ మార్గ
ధుర్యక్షమాదుర్గ దుర్గమంబు
శీఘ్రానటత్తత వ్యాఘ్రాననోద్ధూత
ప్రాఘ్రూణ ధావిత ప్రతిమృగంబు
భీకరాకృతి దురాలోక రాక్షస వరా
లోకనోద్ధత సాధ్య సాకరంబు

తే.గీ. వివిధ విధపక్ష విక్షేప విహృతి నిహత
బహుతర తరూత్పత న్మహాపతగ వితత
గళ గళ ధ్వాన కలకలాగణ్యమైన
దండకారణ్యమును గాంచె తద్విభుండు 9

వ॥ అది మరియు నశ్వత్థ కపిత్థ నింబ కదంబ జంబీర జంబూ రసాల సురసాల తమాల కృతమాల కోల తక్కోల హింతాల నాళికేర కందరాళ సింధువారకరీర కరవీర విదార కోవిదార వనీరవానీర పట్టుపటీర లుంగ విళంగ మాతులుంగ మాలుంగ నారంగ భూర్జ సర్జ బంధూక మధూక సహచరాది మహా మహీరుహవిస్తార భార ధురంధర స్కంధ బంధుర గగనలిఖ చ్ఛాయా శిఖానికాయ సమాచ్ఛాదిత ఛాయా వ్యాయామ భయంకరంబును, కరంభిత కంటకలతా సంబాధ మాధవీ మాలతీ మల్లికా వల్లికాది వేల్లితతరు తల్లజ గమన నిర్గమన మార్గిత మార్గ దుర్గమ తరంబును తరక్షు వృక్ష చరవరాహ వాహవాహారి గండకవృక శశక కాకఘూక బలాహక ప్రముఖ దుష్ట మృగ పక్షి లక్షిత భయ ప్రపంచంబును, పంచదశసంఖ్యాదిక ఫణగణాభిన్న సముత్కీర్ణ పన్నగంబును, నగంబునుం బోలె

నుదగ్రగ్రావసంగతంబును, నగరంబు లీల సాలవలయితంబును, నాట్యంబు కరణితాళ విలసితంబును, ధరణీతలంబు సరణి సౌవీర కాశ్మీర బాహ్లీకకుశాది విశేష దేశాభివేశంబును, విష్ణు వక్షంబు పోలికె హరిప్రియావాసంబు, బ్రహ్మవదనంబు పగిది శారదాశ్రయంబును, నీశ్వరార్ధాంగంబు భంగి హైమవతీ మిళితంబును, నలకాపురంబు పొందిక ముకుంద కుందనీల వరాభిరామంబును, కిష్కింధా పురంబుడంబున గజగవయ శరభ విలసితంబును, రాజసైన్యంబు సంగతి స్యందన సుందరంబును, నాశ్రమంబు క్రమంబున శాండిల్య కౌండిన్య గాలవ కౌశిక జటిపటల పరివృతంబును, భాండాగారంబు భాతి కాంచన ఖర్జూరో దుంబర భరితంబును, నమరావతీ రీతి నైరావత శోభితంబును, వారి రాశి వాశి వరణుశరణంబును, ధర్మజ యుద్ధంబు విధంబున శల్యప్రవర్తితంబును, లంకాపురంబు తెరంగున కుంభ నికుంభ సంభావితంబును, ద్విజవక్త్రంబు వడుపున గాయత్రి యుక్తంబును, సువాసినీ ముఖంబు సొంపున తిలక లలితంబును, రసాతలంబు చెలువున నాగపున్నాగ సంపన్నంబునై, విష్వక్సేనాన్వితం బయ్యును ఫలాశాంచితంబును, శివాన్వితంబయ్యును మదనాంచితంబును, సమీరణకుమారకాంచితం బయ్యును నక్షాంచితంబును, లక్ష్మణాం చితంబయ్యును మేఘనాదాంచితంబును, కృష్ణాంచితం బయ్యును నర్క జాతాంచితంబును, భీమసారాన్వితంబయ్యును కీచకాంచితం బై యొప్పు నమ్మహాగహనంబుగాంచి ప్రవేశించి యంత 10

కం॥ రాముడు సౌమిత్రింగని
భీమంబీవిపినమందు భీకరదనుజుల్
వేమరు నుందురటంచని
నేముందు న్విందు ననుచు నిట్లని మరియున్ 11

చం॥ ఇక జననౌ బ్రయత్నమున నీవనిలక్ష్మణ సజ్యచాప సా
యకములతో నిశాట భయమౌటను మున్నుగనేను వత్తువె
న్నకడను నీవురమ్ము జనుగావుత భూసుతమధ్య సీమ నా
త్మకు పరమాత్మకున్ దెలియమధ్యగతిన్ జనుమాయ కైవడిన్ 12

కం॥ వీక్షింపు మన్నిదిక్కుల
రక్షింపుము రాక్షసులు గలరు కనివారిన్
శిక్షింపుము తద్భీతన్
రక్షింపుము సీత లక్ష్మణా! రిపుహరణా! 13

వ॥ అనియిద్దరు సంభాషింపుచు సార్థయోజనంబు జనియందు 14

కం॥ పుష్కర సఖకుల మణియొక
పుష్కరణిన్ గనియె వారిభూరి కుముదినీ
పుష్కరణిన్ విలసజ్జల
పుష్కరిణిన్ శీతభీత పుష్కరసరణిన్ 15

కం॥ కని యటులక్కాసారము
కనదధి కాసారమన్నికటసీమకుగా
జనివారుం దనివారన్
గొనివారిన్ విశ్రమించు కొనునెడ నీడన్ 16

- విరాధవధ -

ఉ॥ అంతట తద్వనాగతు మహాబలునుగ్రకరాళ దంష్ట్రవ
క్త్రాంతుని గర్జనధ్వని దురంతుని వామభుజాంత రస్థ శూ
లాంత నితాంత మర్త్యచయ వ్యాఘ్రగజాదు పలాదు నొక్కదు
ర్దాంతుని గాంచె రాము డురుధాముడు సన్ముఖ సోముడెంతయున్ 17

సీ॥ ఆ రీతి గని వాని యారోపిత శరాసు
డైరాముడరి భీముడనుజుతోడ
గను వీని ననుజ యీ దనుజుడున్నత దేహు
డఖిల భయావహుండగుచు వీడు
నభిముఖుండై మన కరుదెంచుచున్నాడు
క్షితిజాత భీతయై జెదరకుండ
నుండుము కోదండ కాండముల్ బూనినీ
వని దానురఘువీరు డచలధీరు

తే.గీ॥ డచల పద్ధతి యుద్ధతుడై సమిద్ధ
బాణ బాణాసనములచే బట్టి రాగ
రాఘువాదుల నీక్షించి రాక్షసుండు
నట్టహాసంబు జేసి యిట్లనుచు బలికె 18

శా॥ మీరెవ్వారు మునిప్రకారులయి నెమ్మిన్బాణ తూణీ ధను
స్ఫారుల్ స్త్రీ సహిత ప్రచారులు జటాసంభారు లౌటన్ దురా
చారుల్గావున గాదె బాలురనుభాస్వన్మూర్తులన్ దుర్మదా
కారస్ఫూర్తుల మిమ్ము మామకముఖగ్రాసంబుగా జేసెదన్ 19

కం॥ ఏలా వచ్చితిరుగ్ర
వ్యాళాదిక భవనమునకు వనమున కనగా
నాలించి రామ భూమీ
పాలుడనియె సమదునకును పలలాదునకున్ 20

ఉ॥ రాముడ నేను నాకితడు భ్రాత హితుండగు లక్ష్మణాఖ్యుడీ
భూమిని నాకు బ్రాణహిత పత్ని మహీసుత సీత తండ్రియా
జ్ఞామహిత ప్రకారమును సల్పభవాదృశ దుష్టశిక్షణం
బీమెయిజేయ వచ్చితిమిటేము సుమా యసురాన్వయాధమా! 21

చం॥ అనునెడ రామసూక్తి విని యప్పుడ వచ్చిరవంబు హెచ్చియా
ననమటు విచ్చి చేతులు ఘనత్వర శూలము బుచ్చి పల్కె న
చ్చెనటియు నన్నెరుంగవె ప్రసిద్ధుని దేవవిరోధుని న్విరా
ధుని మునికోటి మద్భయముతో జనిరీవని వీడి రాఘవా! 22

తే.గీ. మీకు జీవేచ్ఛగలదేని మేదినీకు
మారి నాయుధములు వీడి పారిపొండు
కానిచోమిమ్ము భక్షింతుగాని విడువ
భూమినీమణి యిదియు మద్భార్యయగును 23

వ॥ అనిపలికియద్దైత్యుండత్యంత సత్వరంబునం బరతెంచి వైదేహినెత్తు కొనిబరచిన శుభవతి యగుధరాసుత విరాధాంకయగుటన్ గని కనలి రఘువీరుండన్నిశాచరుని శాతంబగు విశిఖ వ్రాతంబున నొంచిన వాడునుం గోపించి యద్దేవిందించి శూలంబెత్తి వ్రేయం బోతెంచిన నత్తరి రఘుసత్తముండు వజ్రచ్ఛాయాభీలంబగు తచ్ఛూలంబు శరంబున విచ్ఛేదంబు గావించె గ్రమ్మర నద్దనుజుండుద్ధిత భుజుండై వారి నెదురించిన బాణ లాఘవంబున రాఘవుండద్భుతంబుగా తద్భుజాద్వయంబు ఖండించె నంతటన్ బోక సముద్ధత క్రోధుండై విరాధుండును వికటంబగు ముఖంబు విచ్చి వచ్చుచుండ హసన్ముఖుండై రఘూద్వహుండు తత్పాదద్వయంబు ద్రుంచిన నప్పుడప్పలాదుండుప్పురంబున్ గుప్పించి సర్పంబు దర్పంబున విదీర్ణ వదనుండై యతనింగ్రసించెదనని కదిసిన రామచంద్రుండును నర్ధచంద్ర శరంబున తచ్ఛిరంబుధరన్ బడనేసి లీలామాత్రంబున 24

కం॥ ఘనశరుడగు రఘువరుడిటు
దునిమె విరాధుని దురాయుధుని సాధునిరో
ధుని వర్ధిత భువన విరో
ధుని తత్తను వీథిరుధిరధుని బ్రవహింపన్ 25

ఆ.వె. అంతసీత విభుని నాలింగనము చేసి
వినుతి సలిపె దేవవితతి దెలిపె
కేరి భేరిరవము కిన్నర గంధర్వు
లపుడు బాడి రాడి రప్సరసలు 26

ఉ॥ అంతవిరాధు విగ్రహమునందతి సుందర విగ్రహుండు న
త్యంత విరాజితుండు నమలాంబరుడున్ మణితప్త హేమసం
క్రాంత విభూషణుండగు నొకానొక పూరుషుడుద్భవించెన
భ్రాంతర పద్ధతిన్ వెలుగునభ్రమణిన్ బలె విభ్రమస్థితిన్ 27

ఉ॥ ఆగతినుద్భవించి ప్రణతార్తి హరున్ భవసంప్రవాహ హృ
ద్యోగకరున్ దయాకరునఘౌఘవిరాముని రామునిం ప్రస
న్నాగత ధామునిన్ గని దనంత విరాధుడు సాపరాధుడై
సాగిలిమ్రొక్కి యిట్లనియె సన్నుతి జేసి ప్రసన్న బుద్ధియై 28

తే.గీ. రామ! రాజీవ నయన! పూర్వమున నుండి
కోపమూర్తి దుర్వాసుని శాపమంటి
నేను విద్యాధరుడ నేడు నిన్ను గంటి
దేవ! మీచేత శాప ముక్తియునుగంటి 29

సీ॥ రామ! నావాణి నీనామ కీర్తనలంద
జిహ్వానీగుణ రుచిజేయునంద
స్వామి! నాకన్నులు నీ మూర్తిగను నంద
ఘ్రాణంబు నీపుష్ప గంధమంద
వరద!నాశిరము నీవందనంబుల యంద
శ్రుతులు భవత్కథాశ్రుతులు యంద
హరి!మత్పదములు నీదగు ప్రదక్షిణమంద
హస్తముల్ నీచరణార్చలంద

తే.గీ. అంతరంగంబు నీ ధ్యానమంద నిలిచి
యుండునట్లుగ దయసేయుమో మహాత్మ!
సంతత భవాఘసంతాప శాంతి కొరకు
శ్రీమహితనామ! కైవల్యధామ! రామ! 30

కం॥ నే మ్రొక్కెద భగవంతుడ
వై మరి యజ్ఞాన హరుడ వగునీకాత్మా
రామా! సీతా తిలకా
రామా! బ్రహ్మాభిదాభి రామా! రామా! 31

వ॥ అనియవ్విరాధుండు దివ్యరూపధరుండై వెండియు నిట్లనియె 32

సీ॥ అనఘాత్మ! నను ప్రసన్నుని బ్రోవు నీయాజ్ఞ
నమరలోకంబున కరిగె దేను
నధిప నీ మాయనన్నంటకుండ వరంబొ
సంగవేయనుచు విజ్ఞప్తిసేయ
బ్రేమ బ్రసన్నుడై రాముడు వానితో
జనుము విద్యాధర వినుము నీకు
ననుజూచినంతనె జనియె మాయాదోష
మంతయు విజ్ఞానివైతి నీవు

తే.గీ. నవని మద్భక్తి దుర్లభంబగును నదియు
గలిగె నేనియు మోక్షసంగతి యజేయు
గాన నీవును భక్తి విజ్ఞాన పరుడ
వైతివని చెప్పి రాఘవుండనుమతింప 33

ఉ॥ ఆపగిదిన్విరాధు డసురాకృతి బాసియు రాముచేత త
చ్ఛాప విమోచనంబు పరసంపద దొల్లిటి దేవభావమున్
ప్రాపితమైన వెండియును రాఘవుగాంచి నమస్కరించి సం
దీపిత తేజుడై యపుడ దేవపదంబును జెందెనెంతయున్ 34

వ॥ ఇట్లు విరాధుండరిగిన రాముండును సీతాలక్ష్మణ సమేతుండై జనిచని. 35

- శరభంగ సుతీక్ష్ణసమాగము -

కం॥ వరదుడు రాముడు గాంచెను
విరక్త మృగపక్షి జంతు విషయక్రమమున్
వర సకల సుఖాశ్రయమున్
శరభంగాశ్రమము సాధు జనవిశ్రమమున్ 36

కం॥ సరవి గని రచట నంతన్
మురియుచు రామాదులైన మువ్వురభంగున్
నిరపాస్తాశర భంగున్
శరభంగున్ రచిత పంచశర శరభంగున్ 37

ఉ॥ బ్రామిన భక్తినంత శరభంగుడు గాంచెను లక్ష్మణాన్వితున్
భూమి సుతాయుతున్ బరమపూరుషు సన్ముని వేషు నీరద
శ్యాము బ్రపూర్ణకాము నిరుపాధి కృపాశ్రయు సాధు సంశ్రయున్
రాముని నిర్విరాముని విరాధ విరాముని పుణ్యనామునిన్ 38

వ॥ ఇట్లు సీతాలక్ష్మణ సంగతుండగు రఘుపుంగవున్ గనుంగొని శరభం గుండు సంభ్రమంబునన్ బ్రత్యుత్థానంబాచరించి యర్ఘ్యాదుల బూజించి కందమూలాదులనాతిథ్యంబు గావించి భక్తపరాయణుండును నగు రామున కిట్లనియె 39

మ॥ పరమేశుండవు నీవు విష్ణుడవిటన్ బ్రాపింతు వీవంచు నే
చిరకాలంబు వసించి యుండితి తపశ్రీ నిశ్చితాత్ముండనై
సరవిన్నీ భజనంబుసేయుచు భవత్సందర్శనాకాంక్షి నై
హరినేనిప్పుడు నిన్నుగంటి సఫలంబయ్యెన్మదీయేష్టమున్ 40

వ॥ కావున 41

కం॥ నాతపమున సిద్ధంబగు
నాతత పుణ్యఫల మెద్ది యదియంతయునే
నీతరి నీ కిచ్చెద గొను
చేతః ప్రియయుక్తి ముక్తి జెందదనంతన్ 42

వ॥ అని తపః ఫలంబు సర్వంబును రామునకు సమర్పించి విరక్తుండై శరభంగమునీంద్రుండు నప్రమేయుండును సీతా సహాయుండును నగు రామునకు నమస్కరించి యోగసమాధి నిష్ఠుండై చితి సమారోహణంబు చేసి యంత 43

ఉపేంద్రవజ్రం -

భువిన్వియద్ధేనువు బోలి రాముం
డవారిగా భక్తజనావళి కిచ్చున్
స్వవాంఛితంబంచుననన్యబుద్ధిన్
సవర్చియద్దేవుని సంస్మరింతున్ 44

వ॥ కావున నవ్విభుండు చిరకాలంబున నుండి తన దర్శనాకాంక్షి నై యున్న మదిచ్ఛాచరణం బెరింగి స్వేచ్ఛామరణం బొసంగెనగుట నద్దేవుండగు రాముండు గనుచుండ వేగంబ యోగానలంబందు దేహంబు నాహుతిం గావించి నిర్మలంబగు బ్రహ్మలోకంబు జెందెనని మరియును 45

భుజంగ ప్రయాతము -

పయోదస్థ విద్యుద్విభారీతి సీతా
పయోజాక్షి యద్వామ భాగస్థయౌన
య్యయోధ్యా మహీశున్ హృదంతర్నివేశున్
దయావేశు భావింతు ధ్యానింతునెంతన్ 46

తే.గీ. అనుచు రాముని ధ్యానించి యాత్మనికట
గతుని దర్శించి శరభంగయతివరుండు
పాంచ భౌతిక దేహంబు పరిభవించి
బ్రహ్మపదమందె దివ్యరూపము వహించి 47

కం॥ అంతట దండకవన వి
శ్రాంతులగు మునీంద్రులెల్ల శరభంగు నివే
శాంతరమున సకలగుణ ని
శాంతుని రఘుకాంతుజూడ జనుదెంచియటన్ 48

సీ॥ శతకోటి కందర్ప సౌందర్యమున బోల్చు
ఘనదివ్య మంగళాంగంబు వాని
లక్షిత సంపూర్ణ లక్షణ శ్రేణిచే
జెలువొందు నవయవశ్రీలవాని
కారుణ్య తారుణ్య గాంభీర్య చాతుర్య
దాక్షిణ్య గుణముల దనరువాని
సహజ శృంగార సాక్షాద్విలాసంబులు
భూషణంబులు గాగ బొలుచువాని

తే.గీ. త్రిభువనైక మనోహర దీప్తివాని
అఖిల జగముల కాశీస్సుడైన వాని
రాజకళవాని రాముని రాజమౌని
మౌని జనములు గనిరి సంభ్రమము బూని 49

వ॥ అంత 50

ఉ॥ ఆముని రాజులన్ శమదమాది విరాజుల గాంచి భక్తి మా
యా మనుజస్వరూపధరుడై దగురాముడు లక్ష్మణుండునున్
భూమిజయున్ ప్రణామములు భూమిపయిన్ రచియింప నమ్మునుల్
ధీమహిత ప్రకారముల దీవనలిచ్చి నుతించి యంతటన్ 51

కం॥ రాముని సర్వహృదంబు జ
ధాముని శరచాపఖడ్గ ధారిని హరినిన్
బ్రేమను గనుగొని యిట్లని
రా మునికుంజరులు విరచితాంజలు లగుచున్ 52

మ॥ హరివీవిద్ధరణీ భరాహృతి కజుండర్థింప జన్మించినా
రరయన్ జానకి లక్ష్మి లక్ష్మణుడు శేషాంశంబగున్ రామ! యీ
సరణిన్ శంఖము చక్రమున్ భరతుడున్ శత్రుఘ్నుడౌనిట్లు మి
మ్మెరుగంజాలుదుమౌట మౌనుల భయం బెంతేని వారింపవే! 53

ఉ॥ రమ్ము మునీంద్ర సేవ్యములు రమ్య వనమ్ములు జూడ సీతతో
తమ్మునితోడ వత్తుము ముదంబున మేమును గూడమాకుసి
ద్ధమ్ముగ గల్గుమిప్పుడు గదా భవదీయ దయారసంబనన్
సమ్మతి జేసియమ్మునుల సంగతి రాముడు వచ్చియచ్చటన్ 54

సీ॥ వివిధాశ్రమోద్బుద్ధ సవధూకముని సిద్ధ
సవధూక పరివృద్ధ జనపదములు
సుచిర యాజక జాత రుచిరమంత్రాహూత
ఖచర చిత్రీభూత ఘనపదములు
మౌనీశకులజార్భకానీత సుమదర్భ
దానీ భవద్గర్భ తరుగృహములు
మోదావహాసార గోదావరీ సార
పాధోరుధీపూర పరిధికములు

తే.గీ. బ్రకట హరికిరి శిఖి ఫణి ప్రముఖ నిఖిల
కలిత వన సత్వ మిత్రతా గణ్యములును
సమధిక తపస్వి జన శణ్యములునైన
యాశ్రమారణ్యములు గాంచె నాఘనుండు 55

వ॥ అంత 56

సీ॥ నిగమ శాఖల నెచ్చనగు తిత్తిరంబుల
తగు శిక్షలను భరద్వాజములను
శబ్ద శాస్త్రము దెల్పు శాకటాయనముల
తర్కమెన్నెడి పక్షధరకులముల
పూర్వమీమాంసోక్తి బూను జైమినముల
వేదాంతరచన బర్విన శుకముల
వరయోగి కళలూను పరమహంసాళుల
ఘనసాంఖ్యములబల్కు కాపిలముల

తే.గీ. కవితల ప్రసిద్ధి గాంచిన భువన విప్ర
పటలమున బొల్చి మునిసహాభ్యస్త సకల
శాస్త్రముఖరిత ఖగపరి శ్రమముడైన
యాశ్రమంబులు గని రాముడద్భుతముగ 57

వ॥ వెండియు నొక్క దండ నఖండ బ్రహ్మ సాక్షాత్కార పూర్ణాను భవ సిద్ధాంతులగు శుద్ధ వేదాంతులును, నొక్కచక్కి షట్కర్మ నిర్మలీకృత యమ నియమాది బహిరంగాంతరంగ యోగసాధిత ప్రభావభాగు లగు యోగులును, నొక దారి నిర్నీత ప్రధాన సంఖ్యులగు సాంఖ్యులును, నొక్క సరిసె నిరశన పవన సలిలాశనాది శరీర ప్రయాసానియమ పటిష్ములగు తపోనిష్ములును, నొక్కవేర నారాయణ నారసింహ వారాహ వామన శ్రీరామ హయవదన వాసుదేవపాశుపతాది మంత్ర జపమహి మాధిష్టాతలగు మంత్రానుష్ఠాతలును, నొక్క చెంగట వేదవేదాంగాది పారాయణాదిస్వాధ్యాయ వ్రతులును, నొక్కసీమ పంచయజ్ఞ పాకయజ్ఞహవిర్యజ్ఞాది సత్క్రి యాగరిష్ములగు కర్మ నిష్ములుం, గలిగి చంద్రోదయంబునుం బోలె సోమాసక్త ద్విజాశ్రితంబును, సూర్యో దయంబునుం బోలె చతుర్ద్వార కలిత సర్వతోముఖ రమణీయంబును, కాసారంబునుం బోలె పౌండరీక మహానవ మండితంబునై, యొప్పునత్తాపసాశ్రమ మండలంబునందు రఘు వరుండు ప్రవేశించియంత 58

కం॥ అక్కడ నస్థిమయములై
నెక్కొను నంగములతో ననేక శిరంబుల్
దక్కక పడియున్నంగని
యెక్కడి వీ శిరములనిన ఋషులాతనితో 59

ఉ॥ రామ! తపోవశస్థితి గరంబు భ్రమత్తతనుండుచో ముని
స్తోమములన్వధించి దనుజుల్ భుజియించు నెడన్ బడున్న వౌ
నీముని శీర్షముల్ మునుల కెవ్వరు రక్షకులిందు లేనిచో
నామనుజాశనుల్ ముని జనాటవులన్ జరియింతు రెంతయున్ 60

తే.గీ. అనుచు భయదైన్యయుతములౌ మునిజనముల
విన్నపంబులు విని కృపా విష్టడగుచు
రాక్షసులనెల్ల వధియింప బ్రతిన జేసె
రాముడాశ్రిత రక్షణోద్ధాముడంత 61

కం॥ వనవాసులగు మునీశులు
దను వాసిగ బూజసలుప తద్వనసీమన్
దనుజారి రాము డను జా
వని జాన్వితుడగుచు గొన్ని వర్గములుండెన్ 62

ఆ.వె. ఇట్లు గ్రమముతోడ నెల్లయాశ్రమములు
జూచి సకలకాల సుఖదమఖిల
ఋతు గణాశ్రయంబు ఋషి సంకులము సుతీ
క్ష్ణా శ్రమంబు దారి నరిగి యందు 63

సీ॥ రామ సంస్మరణచే రంజిల్లు కీరముల్
సాకేతపతి దెల్పు శారికములు
భయమొంది కాకుత్థు బలికెడి కోకిలల్
క్షితి జేశునెన్నెడి కిన్నరములు
రావణారివచించు రాజహంసంబులు
భరతాగ్రజు పఠించు పారువములు

తే.గీ. దూషణారాతి కథలెల్ల తోషణాప్తి
చెవుల విని సొక్కు మృగపశు శ్రేణి గలిగి
రామ తత్త్వజ్ఞ హృతభవశ్రమమునైన
నాసుతీక్ష్ణ శ్రమముగాంచె నవ్విభుండు 64

సీ॥ పరిలంబితోదార బాహుశాఖలతోడ
ఘనతరస్కంధ భాగంబుతోడ
వల్కలపరిధాన వల్కలావృతితోడ
వ్యాప్త జటా పల్లవముల తోడ
కరుణాకటాక్ష వీక్షణ ఫలావళి తోడ
దరహాస వరసూన తతుల తోడ
ననుగత శుభలక్షణా వరోహముతోడ
ధృతమేదినీసుతాలతికతోడ

తే.గీ. శ్రితవితతి వాంఛితార్థ సంసిద్ధి గాగ
నాగతంబగు రామకల్పాగమంబు
నాత్మ జపమంత్రమూల పుణ్యాగమంబు
దృఢమనశ్రీని గనియెసుతీక్ష్ణమౌని 65

కం॥ ఆ రాముడు నయ్యెడగనె
నారాగాదికతుషానలాద్రద దుద్య
త్సార మనోమయ తీక్ష్ణన్
ధీరతరతపః ప్రభావ తీక్ష్ణసుతీక్ష్ణన్ 66

వ॥ అంతసుతీక్ష్ణుడు రఘుకులాధ్యక్షుం గూర్చి విధిప్రకారంబులం బూజలొనర్చి భక్తి రసాతిశయ సముత్కలితలోచనుండై దేవా భవదీయ జ్ఞానస్వరూప జ్ఞాననిష్ఠాగరిష్ఠుండగు నగస్త్య మహాముని శిష్యుండ భవన్మంత్ర తత్పరుండగుటం జేసి దానజన దాసుండ నగుదునని సుతీక్ష్ణుండు వెండియు నిట్లనియె 67

వసంత తిలకము :-

భూమీ సుతేశ! భవవారిధి పోత పాదా!
స్వామీ! మహీశ! విధి సంశ్రిత సద్వినోదా!
రామాయనంతగుణధామ! వరప్రమోదా!
రామాభిరామ! శుభనామ! నిరస్త ఖేదా! 68

శా॥ నీమాయాప్తి కళత్ర పుత్ర నిలయానేకాంధరూపాంతర
వ్యామగ్నున్ మలపిండ మోహమయ పాశాయత్త చిత్తున్ననున్
బ్రేమన్ జూడగ సర్వలోకములకున్ దృశ్యస్థితిన్ నీవెనే
డీమూర్తిన్ ధరియించి వచ్చితిగదే! యీశా!దయాశాలివై 69

ఉత్సాహ -

నీవు సర్వభూత హృదయ నిరతివయ్యు మాయచే
నావరింతు నీదుమంత్ర హారులైన చోరులన్
దేవనీదు మంత్రభక్తి నిధులనుద్ధరింతువౌ
సేవకుచితమైన ఫలము జేతు కల్పతరుగతిన్ 70

మత్తకోకిల -

ఈవునొక్కడ వయ్యు విశ్వమునీన బూనగమానగా
నావిధాతృ హరీశమూర్తుల నాగుణాత్మక మాయచే
నావరింపుచు మోహితాత్మకులైన వారికిదోతువౌ
సూవె! వారి ఘటంబులందొక సూర్యుడుంబలె రాఘవా! 71

అంబురుహ వృత్తము -

నీవు తమః పరవాసివినైయును నీపదాబ్జయుగంబ దృ
గ్భావిత రూపయుతంగనేనిదెకంటి దృష్టిపదంబునన్
దేవరనీదగు రూపమగమ్యము దేవకోటికి నైననున్
నీవరమంత్ర పవిత్రుల హృద్గతి నిల్చిగన్పడు దీశ్వరా! 72

ఉ॥ శ్రీమహితాత్మ! నీవునట చిద్ఘనరూపివినైన నీదుమా
యామయ సద్విడంబన నరాకృతి నెప్పుడు జూడగోరెదన్
గామ సహస్ర కోటి సుభగంబును సుందరచాప బాణమున్
రామదయార్ద్రనేత్రమును రమ్యతరస్మిత చారు వక్త్రమున్ 73

పృథివివృత్తము –

సదాప్తి నజినాంబరున్ జనకజా సహాడంబరున్
పదాశ్రితనిజానుజున్ భరితనీలకాంతి వ్రజున్
సుదుర్జయ శమోదయున్ సుగుణధామునిన్ రామునిన్
మదీయ చిర భాగ్యమున్ మరినుతింతు సద్యోగమున్ 74

మ॥ అవికారంబును చిత్ప్రకాశము ఘనంబై దేశ కాలాద్యుపా
ధి విహీనంబది నీస్వరూపమగు నెంతేనుండగా నిమ్ము దా
నవు నౌనైననునెద్ది నాకిపుడు ప్రత్యక్షంబుగా దోచె రా
ఘవ!యీ రూపము నామదిన్ నిలుపవే! కాంక్షింప నేనన్యమున్ 75

ధ్రువకోకిల–

అని సుతీక్ష్ణుడు సన్నుతించగ నాలకించి రఘూద్వహుం
డనియె నవ్వచు మౌనితో మదుపాసనాప్తి వినిర్మలం
బని యెరుంగుదు నీహృదంబుజ మౌట వచ్చితి చూడని
న్ననఘ! నీకును నన్ను దక్కగ నన్యసాధనమున్నదే! 76

కం॥ వరుసను మదుపాసకులిట
నిరపేక్షుల నన్యగతులు నిర్మలులగుటన్
శరణందురు ననుగావున
నిరతంబును వారిమదిని నేగనుపింతున్ 77

వ॥ అదియునుం గాక 78

తే.గీ. ఈవు మత్ప్రియముగ జేయు నీస్తవంబు
జనులు జదివిన భక్తివిజ్ఞానములును
గలుగుమదుపాస్తి చేముక్తి గాంచితిప్పు
డంతమందు మత్సాయుజ్యమందె దనఘ! 79

వ॥ అని రఘువరుండు మరియును 80

- అగస్త్యాశ్రమగమనము -

ఉ॥ నీగురునయ్యగస్త్యుని ముని ప్రవరుంగన నిచ్చయించెదన్
స్వాగతలీల కొన్ని దివసంబులు నందు వసించియుండెదన్
ధీగతితోడ నావిని సుతీక్ష్ణుడు బల్కెనురేపు బోవనౌ
నేగని పెక్కునాళ్ళరిగె నెమ్మిని నమ్ముని జూడగావలెన్ 81

వ॥ అని అన్యోన్యానులాపంబుల నారాత్రి గడపి ప్రభాతంబున నగస్త్య దర్శన సంభాషణాసక్తమానసంబున నరుగుచుండ మార్గ మధ్యంబున నగస్త్యానుజుండు గావున 82

కం॥ అయ్యాద్యుడు రాఘవుడు ద్వి
తీయా సహితుండునున్ దృతీయాన్వితుడై
యయ్యెడ సుతీక్ష్ణతోడ తు
రీయా వృతుడగుచు జనుచు ఋషివనసీమన్ 83

కం॥ సీతాపతి గనియె హిత
స్ఫీత తరాగమ్య నాదు చిత్ర మృగఖగ
వ్రాతాగమము నగస్త్య
భ్రాత వెలయు నాశ్రమమును గ్రమమున నందున్ 84

ఉ॥ నామము ద్రోసి రూపకలనన్ మదిబాసియు సత్య చిత్ప్రమో
దామిత వస్తురూపమున నాత్మనెరుంగు మహానుభావుడా
నాముని రాజునిం కలశజానుజునిం గనె రాముడంతసు
శ్యాముని రామునిం కలశజానుజుడుంగనియెం బ్రియంబునన్ 85

వ॥ ఇట్లు మధ్యాహ్న సమయ సమాగతుండగు రఘుపతిం గాంచి కుంభజ సోదరుండును సాదరంబున నతని నర్చించ ఫలమూలాదుల దృప్తున్ గావించెనంత ననంతర దివసంబున నగస్త్యాశ్రమ మండలం బునకున్ జనియందు 86

సీ॥ శశక శాబములకిచ్చను చనుబాలెంత
బాలెంత కరికాంత బాలినీయ
హరిజాతమాత పాహత బాలనాగంబు
నాగంబులెంచక నాముకొనగ
కృపజేసి శరభంబు కేసరి కూనల
కూనల సత్పక్షమూని బ్రోవ
కరభడింభముల కాసరచేసి బేరుండ
బేరుండములమేత వారికొసగ

తే.గీ. జాతనిర్వైరమాశ్చర్య సారమఖిల
ఋతుసుమ ఫలావృతముఖగ మృగయుతంబు
బహుసుఖతమంబు నందనోపమమునైన
నయ్యగస్త్యా శ్రమము రాముడపుడు గనియె 87

వ॥ ఇట్లు గనుంగొని యనంతరంబున 88

సీ॥ కరిజేరి నిజకరాగ్రము దారిగొని వారి
చులికి తాంబుధి వారికలన దెలుప
మృతవృషా మిష మోపిమెసవి తేపి బలోద్ధ
త ద్వీపి జీర్ణవాతాపి దెలుప
హరికోటిగిరి కోటి పరిపాటి పదధాటి
గన దాటి వింధ్యవైఖరిని దెలుప
మేటి గౌతమియేటి నీటికేనెటి లేటి
శమన దిగ్గమన సంభ్రమము దెలుప

తే.గీ. నిది యగస్త్యాశ్రమమటంచు నెరిగిరాము
డాముని నుతింపుచును మునిధామ యుతము
బ్రహ్మ ఋషి దేవఋషి కృతాభరణమైన
బ్రహ్మలోకాభమగు తదాశ్రమము జేరి 89

కం॥ అంత సుతీక్ష్ణుని గని రఘు
కాంతుండు మదాగమంబగస్త్య మునికినీ
వెంతయు జెప్పుమని మహీ
ప్రాంతంబున నిలిచి యుండ నతడరిగి వెసన్ 90

వ॥ అక్కడ 91

మ॥ ముని సంఘాన్వితునాశ్రమోపగతునిన్ముఖ్య స్థితున్ రామ భ
క్త నికాయావృతు భక్తి శిష్యతతికిన్ తద్రామ మంత్రార్థమున్
గొని వ్యాఖ్యానము జేయు పుణ్య విభవున్ గుంభోద్భవున్ దండవ
త్ప్రణుతిం గాంచి సుతీక్ష్ణుడగ్గురునితో బల్కెన్ ప్రియానమ్రుడై 92

ఉ॥ రాముడు సానుజుండును సరాముడునైమిము జూడవచ్చి నా
డోముని వర్య! యన్నమునియుం బ్రమదంబున రామమన్మనో
ధాముగనంగ గోరుచును ధ్యానము సేయుచునందు నిందుత
ద్రాముని దోడి తెమ్మనుచు దానును వెంబడి వచ్చి యచ్చటన్ 93

సీ॥ కైవల్య కల్పవృక్షమునూడలును బోలి
మౌళిపాళిక జటా జాలమొలయ
అతిశుద్ధ విజ్ఞాన మావృతం బగురీతి
వల్కలగుణపటావరణ మెనయ
నీలతోయదమధ్య నిహిత విద్యుల్లేఖ
యనుభుజంబున హేమ ధనువుమెరయ
జీవమాయా భావనావృతాత్మ విభూతి
సౌమిత్రి భూపుత్రి సక్తిదెలియ

తే.గీ. వచ్చు హరినాది దేవు దివ్యప్రభావు
నుతగుణ విశేషు మాయామనుష్యవేషు
ముఖ్య విస్ఫూర్తి శ్రీరామమూర్తి గనియె
కుంభజనిమౌని మదిలోని కుతకమూని 94

వ॥ అయ్యవసరంబున 95

సీ॥ శ్రీఖండనగతుంగ శృంగాగ్రమెవ్వాని
వాస భూమికి గుణా వర్తవేది
శరనిధులెవ్వాని కరచుళకాంతర
స్థలికినాపోశన జలకణంబు
నమిత వాతాపిదైత్యామిషంబునకు నె
వ్వాని యాననము మహానసంబు
దక్షిణదిగ్యాన దీక్షకై ఎవ్వాని
నడకకు వింధ్యంబు కడపమాను

తే.గీ. వెలయునెవ్వాని ఘనకమండలు కరండ
వారి కావేరి కంథి దేవేరి యయ్యె
నయ్యగస్త్యుని జిరతపో వ్యాప్తి వస్తు
మునిపురస్త్యుని గనియె రాముడు ప్రియమున 96

వ॥ ఇట్లు గని సీతాలక్ష్మణ సమన్వితుండై దండ ప్రణామంబు లొనర్చిన నామునియును రాముని గ్రుచ్చియెత్తి భక్తిన్ గౌగిలించి తచ్ఛరీర స్పర్శన కందళితానంద బాష్ప సంకులుండై యవ్విభునితో భవత్స మాగమంబున మదీయ పుణ్యభాగ్యంబునన్ బ్రాపించె, నేను గృతార్థుండనైతి, మీరు ప్రియాతిథులగుట నీదినంబు సఫలంబయ్యె నని, యతని కరంబున నవలంబించి, నిజాశ్రమంబునకున్ దోడ్కొని చని,

బహు విధంబులం బూజించి, వన్య విశేషంబుల భోజనంబు గావించిన, సంతుష్టుండై, సుఖోపవిష్టుం
డగు రఘువర్యునితో నేకాంతంబున గృతాంజలి పుటుండై ఘట సంభవుండిట్లనియె 97

ఉ॥ రామ! ధరాభరా హృతికి రావణ సంహరణాప్తికై యజుం
డామని దుగ్ధవార్ధి కడ బ్రార్థనజేసిన దాదిగాగనే
నీమని కోటి తోడ భవదీక్షణ వాంఛల నిచ్చటన్ దప
స్థేమ! నినున్ దలంచుచు వసించితి నీదగు రాకగోరుచున్ 98

సీ॥ శ్రీరామ యటుగాన సృష్టికినాదియౌ
పూర్వంబునందు సంపూర్ణగతిని
నిర్వికల్పుడవును నిరుపాధికుండవై
నీవొక్కరుండవ నిలిచియుండు
నిన్నాశ్రయింపుచు నీవిషయంబైన
నీస్ఫూర్తి మాయనా నివ్వటిల్లు
నిర్గుణుండవునైన నిన్ను నీశక్తియౌ
నామాయ యావృతం బైనయపుడ

తే.గీ. దాని వేదాంతులవ్యాకృతంబటంద్రు
నదియు మూలప్రకృతి యవిద్యయని కొంద
రదియ సంసృతి బంధంబునందు రిటుల
బహువిధంబులనది బల్క బడుచునుండు 99

తే.గీ. భాస్కరునకు దీప్తి స్వభావమైన
పగిది నీకును మాయ స్వభావమగుచు
రామ మాయ కులీన వర్ధన వికాస
ములు స్వభావంబులగు మేఘమునకు బోలి 100

వ॥ కావుననట్టి మాయ భవత్ప్రేర్యమాణయై, మహత్త్వంబునుద్భ వింపం జేసె, నామహత్వంబు వలన నీ
సేత సంచోదితయై యహంకారంబు సంభవించె నమ్మహత్త త్త్వావృతంబగు నహకారంబు తామసరాజస
సాత్విక భేదంబులన్ త్రివిధంబులయ్యె, నట్టి తామసాహంకార విశిష్ట చైతన్యంబువలన శబ్దంబుద్భవించె
నవ్విధంబున శబ్దంబువలన స్పర్శంబును, స్పర్శంబు వలన రూపంబును రూపంబువలన రసంబును,
రసంబు వలన గంధంబును, గలిగి యివి సూక్ష్మ తన్మాత్రలనం దగియె, మరియును నత్తామసాహంకార
విశిష్ట చైతన్యంబు వలన శబ్దగుణకంబగు నాకాశంబును, నాకాశ విశిష్ట చైతన్యంబు వలన
స్పర్శగుణకంబగు వాయువును, వాయువిశిష్ట చైతన్యంబువలన శబ్దస్పర్శరూపగుణకంబగు తేజస్సును,
తేజోవిశిష్ట చైతన్యంబువలన శబ్దస్పర్శరూపరసగుణకంబగు జలంబును, జలవిశిష్ట చైతన్యంబు వలన

శబ్దస్పర్శరూప రస గంధ గుణకంబగు పృథివియును, గ్రమంబున నుదయించె, రాజసాహంకార విశిష్ట చైతన్యంబు వలన శ్రోత్రత్వక్ చక్షుజిహ్వా ఘ్రాణంబులును జ్ఞానేంద్రియ పంచకంబును వాక్పాణి పాదోపస్థ వాయువులను కర్మేంద్రియ పంచకంబును జనించె, సాత్వికాహంకార విశిష్ట చైతన్యంబువలన నింద్రియాధి దేవతలగు దిక్కులును, నర్కుండును వరణుండును ననిలుడు వహ్నియు నింద్రుండును నుపేంద్రుండును ప్రజాపతి యును మృత్యువు ననువీరును నంతఃకరణంబు మనంబునున్ గలిగె నవ్విధంబున 101

తే.గీ. అనఘ! భూతలంబులు నింద్రియములు మనసు
గూడగా వీనివలనను గోచరించె
ఘనతరంబును మరిసర్వగతము నగుచు
బరగులింగంబు సూక్ష్మరూపంబు గాగ 102

వ॥ దేవా! మరియు నట్టి యపంచీకృతంబగు నాకాశంబు భవదీ క్షణంబునం జేసి ద్విదంబై యర్థంబు జ్ఞాతృత్వంబయ్యె దక్కిన యర్థంబునన్ వాయువునన్ గూడి మనంబును తేజస్సునన్ గూడి బుద్ధియు జలంబునన్ గూడి చిత్తంబును పృథివినంగూడి యహంకారం బున జతుర్విధంబయ్యె నవ్విధంబున వాయువునందర్థంబు వ్యానంబయ్యె, చిక్కిన యర్థంబును నాకాశంబునం గూడి సమానంబును తేజస్సునంగూడియు దానంబును జలంబునం గూడి ప్రాణంబును పృథివినం గూడి యపానంబునన్ జతుర్విధంబయ్యె తేజంబునం దర్థంబు చక్షుస్సయ్యె నిలిచిన నర్థంబును నాకాశం బునం గూడి శ్రోతంబును వాయువునం గూడి త్వక్కును జలంబునం గూడి జిహ్వాయుపృథివింగూడి ఘ్రాణంబును నయ్యె జలంబు నందర్థంబు రసంబయ్యె నుండిన యర్థంబును నాకాశంబునుం గూడి శబ్దంబును వాయువునం గూండి స్పర్శంబును తేజస్సునన్ గూడి రూపంబును పృథివినిన్ గూడి గంధంబునునయ్యె పృథివియం దర్ధంబును వాయువయ్యె మిగిలిన యర్థంబు నాకాశంబునం గూడి వాక్కును వాయువునం గూడి పాణియును తేజస్సునం గూడి పాదంబును జలంబునంగూడి యుపస్థయు నయ్యె నిట్లు పంచీకృతం బైన నీస్థూల భూత కదంబంబు వలన విరాట్పురుషుని వలన కాల కర్మ క్రమమంబున దేవతిర్య జ్మనుష్యాది జంగమస్థావ రాత్మ కంబగు ప్రపంచంబు సంభవించెనగుట నింతయు నీవయని మరియును 103

ఉ॥ ఈవురజోనియుక్తి జగమెల్ల సృజింతువు బ్రహ్మమూర్తివై
ఈవిటు సత్వయుక్తి జగమెల్లను బ్రోతువు విష్ణుమూర్తివై
ఈవు దమోనియుక్తి జగమెల్లలయింతువు రుద్రమూర్తివై
ఈవిటు మాయ చేతవసియింతువు తద్గుణ భేదసంగతిన్ 104

మ॥ అధి భూతంబగు శబ్దముఖ్యమును నధ్యాత్మంబు శ్రోత్రాదికం
బధి దైవంబుది గాదియున్ ద్రిపుటియై బ్రాపించు నీసర్వమ

త్యధిక జ్ఞప్తిని ద్రోయుచో బొలుచు నేతత్త్వ స్వరూపంబు త
ద్విధ చిన్మాత్ర నిజప్రకాశమగుచున్ దీపింతువౌ రాఘవా! 105

శా॥ జాగ్రత్స్వప్న సుషుప్తులై తగు నవస్థల్ బుద్ధిజంబుల్ గుణో
దగ్ర త్వాప్తి నివృత్తి భేదముల చేతందోచు నౌవీని చే
నగ్రాహ్యుండవు చిన్మయుండవగుదీ వట్లౌట తత్సాక్షివై
యగ్రవ్యాప్తి విలక్షణుండవగుచున్ బ్రాపింతు సీతాధిపా! 106

కం॥ మాయా సంగతిలోనుగ
జేయుచు సకలంబు నిరవశేషింపుచున
మ్మాయకు నవ్వలి నిత్య
శ్రేయోన్వితు నిన్ను వినుతి జేసెద రామా! 107

కం॥ ఎవ్వడు సచరాచరమున
కవ్వలనై యెల్ల కడల నమ్మహదాదిం
బువ్వున తావియువలెనగు
నవ్విశ్వాత్ము నిను రాఘవా! నుతి యింతున్ 108

సీ॥ శ్రీరామ సృష్టిలీలారంభమునకుగా
నీక్షింతు నీమాయ నెప్పుడీవు
నంగీకరింతువు నప్పుడా మాయను
గుణములతోడుత గూడినటుల
నామాయ ద్వివిధాప్తినగు బ్రవృత్తి నివృత్తి
విధుల నవిద్యయు విద్యయనగ
నందు బ్రవృత్తి మార్గాసక్తులయి నట్టి
వారవిద్యావశ వర్తులరయ

ఆ.వె. మరి నివృత్తి మార్గ మహితులు వేదాంత
సద్విచారకులు విశాల మతులు
తావకీనభక్తి తత్పరుల్ విద్యాను
వర్తులగుచు నుండు వారలీశ! 109

కం॥ ఉద్యత్సంసృతి బద్ధుల
విద్యావశ వర్తులైన విగత విచారుల్
విద్యాభ్యాస విశిష్టులు
సద్యోముక్తాత్మకులు నసంశయమనఘా! 110

కం॥ నీమంత్రోపాసకులును
రామ! భవత్పాద భక్తిరతులగు వారల్
నేమమున విద్యగాంతురు
నీమెయి నితరులకు గలుగ దెప్పుడునైనన్ 111

శా॥ నీపద్యంబులు వీనులన్ వినుటయున్ నీ సేవకోపాస్తియున్
నీపాదాంబుజ దాస్యవృత్తియు సదా నీనామసంకీర్తనల్
నీపై ధ్యానము గల్గి యాత్మనెపుడున్ నీమూర్తినిన్ జూచు వా
డే పారన్ భవదీయ భక్తుడగు వాడీశా! కృతార్థుండగున్ 112

వ॥ అదియునుంగాక 113

సీ॥ శ్రీరామ పద భక్తి జేయని మనుజుండు
చేష్టలతోనుండు జీవశవము
సీతేశుమూర్తి నీక్షింపని కన్నులు
తను శూన్యగేహవాతాయనములు
రఘువర్యు కథలు వర్ణన సేయని ముఖంబు
పలుకులతోనుండు పాడుబొంద
దనుజవైరికిని మ్రొక్కనివాని శీర్షంబు
పాయని ఋణబాధ మోయు గుండు

తే.గీ. నచ్యుతుని బూజసేయని హస్తయుగము
కదలుచుండెడి వక్రశాఖాయుగంబు
హరికిని ప్రదక్షిణములు సేయని పదములు
వెలిబడి జరించుతరువుల వ్రేళ్లుగావె! 114

శా॥ శ్రీరామున్ భజియించకన్ విషయదశ్చింతాపరుండౌ నరుం
డారూఢిన్ భవపాశబంధయుతుడై యంతన్ గృతాంతాలయ
ద్వారప్రాంత దురంత వైతరణికావహ్ని ప్రవాహాంతరో
దారక్రూర శిఖానికాయములచే దగ్ధుండు గాకుండునే! 115

వ॥ కావున 116

కం॥ నీపద భక్తి సుధాంచితు
లే ప్రొద్దున ముక్తులగుదురిది సిద్ధమగున్
నీపద భక్తి విహీనులు
కాపురుషులు ముక్తిగనరు కలలోనైనన్ 117

తే.గీ. రామ! పలు మాటలేల సారంబు నొకటి
జెప్పెదను నీదు పదభక్తి చేత ముక్తి
నభిలషించెడి వారికి నధిగమింప
సాధు సంగతి యొకటియె సాధనంబు 118

సీ॥ సమ చిత్తులత్యంత శాంతులు దాంతులు
నిర్జి తేషణులును నిస్పృహులును
తత భవద్భక్తి దూరిత సర్వకామనుల్
సంగ వివర్జితుల్ సత్వమతులు
సతత మిష్టానిష్ట సంప్రాప్తి సమబుద్ధి
రతులు సన్యస్త సర్వక్రియులును
స్వల్ప సంతుష్టులు శమముఖ్య సద్గుణ
ధనులు సదాబ్రహ్మ తత్పరులును

తే.గీ. సాధువులు వీరలట్టి సత్సంగమమున
నీకథాశ్రవణాసక్తి నెరయు దీన
ప్రబలు నీయందు భక్తి నీ భక్తివలన
విమలమై నట్టి విజ్ఞాన విభవ మొదవు 119

తే.గీ. కాననీనాల్గు ముక్తిమార్గంబులగుట
సంతతము రామప్రేమ లక్షణము నైన
నీదుభక్తియు నీ భక్తి నిష్కలైన
ఘనులు సంగతియును గల్గు గాక నాకు 120

ఉ॥ నాడు మొదల్ జిరస్థితి ననన్యమతిన్ దపమాచరించితిన్
నేడు ఫలించె నా తపము నీదు పదార్చన జేసి నందుచే
నేడు ఫలించె జన్మమును నిన్నవలోకము జేసినందుచే
నేడు ఫలిచె నిందలచినేనొరించిన యాగముల్ హరీ! 121

ఉ॥ రాముని పూజ జేసిన కరంబు కరంబగు, జానకీమనో
రాముని గాంచి మ్రొక్కిన శిరంబు శిరంబగు, రామమూర్తిగాం
క్షామతి తోడ జూడ గల కన్నులు కన్నులు, భక్తి నారఘు
స్వామి భజింపగాగలుగు జన్మము జన్మము, ప్రాణికోటికిన్ 122

కం॥ కావున నాహృదయంబున
నీవునెపుడు సీత తోడ నిలువుము నేనున్

బోవుచు వచ్చుచునున్నెడ
తావక సంస్మృతియె కలుగ దయ సేయు హరీ! 123

వ॥ అనియిట్లు రమా నాథుండగు రఘునాథుని సంస్తుతించి యగస్త్యముని సత్తముండు మున్ను రామార్థంబుగా సుత్రాముని చేత నిజ సమీప స్థాపితంబగు చాపంబును నక్షయ బాణంబులగు తూణంబులును విచిత్ర రత్న భూషణంబగు కృపాణంబును నొసంగి తద్రఘు వరునితో మహాత్మా! యన్నిమిత్తంబున నిట్టి మాయా మర్త్యమూర్తివై యవతరించి తట్టి దైత్యహరణ కృత్యంబు నివర్తించి భూభారంబు వారింపు మిచ్చటికి యోజన ద్వయ దూరంబుగా గోదావరీ తీరంబున నలంకృత పుణ్యారామంబు పంచవటి నామంబున నొక్క యాశ్రమంబుగలదందు కాలశేషంబపనయిం పుచు ననేక దేవకార్యంబు లొనరింపుమనిన నా కుంభసంభవు సంభాషితంబును తదీయ స్తోత్రంబును విని సంతుష్టుండై యవ్విభుండు భవత్కృత స్తోత్రంబు జనులకు సకల శ్రేయస్కరంబగు నని చెప్పి యమ్ముని నామంత్రంచి తద్దర్శిత మార్గంబునన్ జనియెనంత 124

కం॥ ఉద్ధత ధర్ముడు రఘుపతి
సద్ధీచీనగతినిట్లు సనుచో నొకచో
గృద్ర ప్రవరు జటాయు మ
హీధ్ర శిఖర సదృశకాయు వీక్షించె వెసన్ 125

కం॥ కని విస్మయమున ననుజుని
కనియెను ధనువిమ్ములక్షణా! కనుదనుజున్
మునిభక్షకుని పురస్థితు
దునిమెద వీనినన భయముతో ఖగమనియెన్ 126

ఆ.వె. అనఘ! నీకు నే వధార్హుండ గానుమీ
జనకునకు సఖుండ విను జటాయు
వనెడి వాడ భద్రమగునీకు నీహిత
వాంఛ నిచటి పంచవటి వసింతు 127

ఉ॥ మీరిటు వేటచే జనిన మేదిని జాతను సీతనున్ దృఢ
ప్రేరణ గాచియుండెదను నీవని నావిని గృద్రనాథునిన్
గూరిమి పేరిమిన్ గని రఘు ప్రభు డోవిహగేంద్ర! యిచ్చటన్
జేరిక నుండుమంచు దయచేసి కవుంగిట జేర్చి ముందరన్ 128

కం॥ కాంచెనట గౌతమీసరి
దంచత్తట సీమరాముడతి వితతవళ

త్పంచవటిం బంచతటిం
జంచ జ్జటి నికరఘటిత చటుల దళకుటిన్ 129

వ॥ ఇట్లు గాంచి యప్పంచవటి దేశంబున వృద్ధగంగయగు గోదావరికి నుత్తర తటీ ప్రదేశంబున జన సంబాధర హితంబును నతిహితం బును సమస్త వస్తు సంకులంబునునగు నిర్మల స్థలంబున విస్తారతరంబగు సుమిత్రా నందనకృత మందిరంబున నందరు వసించియుండు నత్తరి రఘుసత్తముండు సౌమిత్రితో చిత్రితోదార దూరకాంతా ప్రాంతారచిత దురంత మృగ ఖగ మృగయానుగతిన్ దిరుగుచు నవ్వనంబు వివిక్తంబుగా నెరుంగుచు మరియును సీతతో శీతతోయ వ్రాతపరిపూత గౌతమీ తటినీ నటత్సముత్తుంగ రంగత్తరంగ సంగత సుందరారవింద కుముదేందీవర సందోహ కందళన్మరంద బిందుబృంద సందర్భ గర్భ ప్రవాహ పరిసర సరసీ జల క్రీడల నోలలాడుచుం, దదీయ జలాయాత నూతన వాత పోత సముపేత శీతల సికతామయ తలంబులన్ గూడి యాడుచు, మంజరీజాత పింజరీభూత వంజుల వ్రాతకుంజ సంజాతంబుల విహరింపుచు, కదళీపనస రసాల ప్రముఖ కిసలయ కుసుమ ఫలజాలవిశాలసాలచ్ఛాయల జరించుచు, మరాళ కీరశారికా పారావతారవాదుల నాదరింపుచు, ఏలాలతాది డోలావిధాన లీలావధాన ఖేలా విధానంబుల నామోదింపుచు, సమున్నిద్ర భద్రగిరి దరీఝరీ పరీత ప్రపాత కూటవాటంబును వినోదింపుచు, స్నానపాన విహారాదుల జనక తనుజ ననుజయుతుండై యేమరక నా రామ విభుండు దేవలోకంబున దేవవిభుండునుం బోలె సుఖంబుండె నివ్విధంబున 130

శా॥ ఆవేళన్ గురు భక్తి లక్ష్మణుడు నుద్యత్కందమూలాది కం
బావేదింపుచు జాగ్రదాప్తి ధృతచాపాస్త్రుండునై రాత్రులం
దావర్తింపుచు గౌతమీతటిని సీతాన్వీతునిన్ రామునిన్
సేవా తత్పరమానసుండగుచు గొల్చెన్ బ్రీతిచే నిత్యమున్ 131

సీ॥ ఈరీతి సేవింపనెంతయు నొకనాడు
సంతుష్టి నతడు బ్రసన్నుడైన
నేకాంతమున బరమేశ్వరు రాముని
వీక్షించి వినయాభి వినతుడగుచు
సౌమిత్రి యిట్లను షడ్గుణైశ్వర్య సం
పన్నయోరామ! బ్రపన్నవరద!
కమల పత్రాక్ష! మోక్షమున కైకాంతిక
గతి యెద్దివిన వాంఛగలదు నాకు

తే.గీ. హితము వైరాగ్య భక్తి బృంహితమునైన
జ్ఞానబోధంబు విజ్ఞాన సహితముగను

దెలుపవే! సూక్ష్మ విధిచేత దీని దెలుప
ధరణి నీకన్న నొకడు బోధకుడు లేడు 132

మ॥ అనినన్ రాముడు బల్కు గోప్యతరమీ యర్థంబునౌ నైననున్
వినువత్సా! భవదీయ భక్తివిధమున్ విశ్వాసమున్ జూచి యీ
ఘనబోధంబఖిలంబు దెల్పెదను వేడ్కన్ మర్త్యుడత్యంత భా
వనచే దీని నెరింగినన్ దొలగు నీవైకల్పిక భ్రాంతులన్ 133

తే.గీ. ఆదిమాయా స్వరూపంబు నవల మరియు
జ్ఞానమునకును సాధన సంపదయును
క్రమముగానంత విజ్ఞాన కలితమైన
జ్ఞానమును దెల్పెదను విను సంతసమున 134

కం॥ ఏయది దెలిసిన సంసృతి
మాయా భయములను బాయు మర్త్యుడెరుకనా
జ్ఞేయ స్వరూపమై తగు
నాయత పరమాత్మ తత్త్వ మది యెరుగింతున్ 135

వ॥ కావున నవహితమతివై వినుమని శ్రీరామదేవుం డిట్లనియె 136

మ॥ దిన కృద్వంశమణీ యనాత్మయగు నీ దేహేంద్రియాద్యంబునన్
దనయం దాత్మయటంచు జూచుటయె మాయారూపమైతోచు నిం
దున నే కాదె యనిత్యమై యశుచియై దుఃఖాద్యమౌదేహమం
దున నిత్యత్వ శుచిత్వ సౌఖ్యగతులుం దోచున్ బరిభ్రాంతిచేన్ 137

వ॥ అట్టి యనాత్మయం దాత్మ భావంబు దోచు విధంబెట్లనిన 138

సీ॥ ఆత్మ శక్తియె మాయ యదియె బుద్ధియనంగ
స్ఫటికంబు గతి నతి స్వచ్ఛమగుట
నందాత్మ దోచుట నాత్మ బ్రకాశచే
నది బ్రకాశించుట నాత్మయనగ
వ్యవహరింపగబడు నదివృత్తి భేదాప్తి
మరియహంకారంబు మనసునయ్యె
నాప్రకాశ విశిష్ట మగునహంకారంబె
కర్తృత్వ భోక్తృత్వ కలననందె

తే.గీ. మనసు సాధనమయ్యె నామనసునందు
గల ప్రకాశంబు నింద్రియ గతిని దోచి
యంగము వెలుంగజేయ దేహాదికంబు
నగు ననాత్మను గననయ్యె నాత్మ బుద్ధి 139

కం॥ ఈదృశమాయాభ్రమమున
గాదే! సంసార చక్ర గహన భ్రమణా
పాదనము ప్రవర్తించును
లేదిది నిశ్చయముగా దెలిసినన్ దనకున్ 140

తే.గీ. అట్టి మాయకు రూపద్వయంబు బోల్చు
ననఘ! శుద్ధంబు మలినంబు ననగ్రమమున
విను సమష్టి రూపంబున విద్యయనగ
వ్యష్టిరూపంబునన విద్యయన దనర్చి 141

వ॥ మరియు నిట్టి విద్యావిద్యాత్మిక యగు మాయకు విక్షేపా వరణంబులను రెండు రూపంబులు సెప్పంబడియె నందు చిన్మాత్రంబగు పరమాత్మ యందు పిండాండ బ్రహ్మాండ రూపంబుల స్థూల సూక్ష్మభేదంబుల నుత్పత్తి విపత్తి మూలంబగు నేతజ్జ గజ్జాలంబు దోపింపంజేయుట విక్షేప శక్తియనందగు నీనట్టి విక్షేప శక్తివలనన్ దోచిన యసత్స జడ దుఃఖాత్మకంబగు ప్రపంచ స్వరూపంబును సచ్చిదానందాత్మకంబగు నాత్మస్వరూపంబును వివరింపనీక నావరించి యుండుట నావరణశక్తియనందగు రెంటివలనంజేసి 142

చ॥ అరయనలాత భూతముల యందనలభ్రమమున్మరీచికా
సరణి ఝరభ్రమంబు గుణసక్తఫణి భ్రమమట్లు మాయచే
నరుదుగకేవలుండగు పరాత్మునియందు ప్రపంచ కల్పనం
బిరవగు సద్విచారమున నేమియు లేక చనున్ నిజంబుగన్ 143

కం॥ వినగు కనగు దెయ్యెది
యనయము దలచనగు నెద్ది యంతయు స్వప్నం
బునజేయు మనోరథముల
యనుపున మిథ్యలగు తెలివి నరసినయంతన్ 144

తే.గీ. వినుము! దేహంబె సంసార వృక్షమూల
మగు దృఢంబుగ తన్మూల మగు కళత్ర
పుత్ర విత్తాది బంధంబు బోధలేక
గానబడుచుండు నాత్మకు గలికి నటుల 145

సీ॥ ప్రకృతి మూలము పాంచభౌతిక స్కంధంబు
నింద్రియ శాఖా విజృంభితంబు
సంభృతాహంకార సారప్రసారంబు
నధిక తృష్ణావల్క లావృతంబు
బంధుర విషయాళి పర్ణ సంకీర్ణంబు
రాగలోభాది సూనాగమంబు
దారపుత్రాదిక భూరి ప్రరోహంబు
మానస విటప సమన్వితంబు

తే.గీ. నసమసుఖ దుఃఖ రూపఫలాస్పదంబు
మహితజీవాత్మ పక్షి సమాశ్రయంబు
నైన సంసార వృక్షంబు నధిగమించి
యజ్ఞుడెరుగడు దాని నాత్మజ్ఞుడెరుగు 146

వ॥ కావున నిట్టి స్థూలభూత పంచకంబును శబ్దాది తన్మాత్ర పంచకం బును నహంకారంబును బుద్ధియు నింద్రియదశకంబును చిదాభాసుం డగు వ్యావహారికుండును మనస్సును మూలప్రకృతియును దేహంబునుం గూడిక్షేత్రంబునంబరగు నేతద్విలక్షణుండగు నతండు జీవుండును నిరామయుండగు పరమాత్ముండు ననంబరగు ఘటాకాశ మఠాకాశమహాకాశంబులగు యుపాధివశంబున భిన్నంబులుగా దోచియు యాకాశంబొక్కటియగు తెరంగున జీవుండును పరమాత్ముండునన బర్యాయంబులగు విచారంబున నెరింగిన జీవుండెయాత్మ స్వరూపకుండు గాడని వేరులేదని చెప్పి తదీయజ్ఞానసాధనంబు లగు వాని నెరింగించెదనని రఘువరుం డిట్లనియె 147

సీ॥ నిరభిమానము దంభనిష్ట లేకుండుట
నితరులెగ్గులు బల్కునెడ సహనము
సత్క్రియా స్థిరత హింసా వర్జనంబును
నకుటిలత్వము నిరహంకృతియును
వైరాగ్యమును మనోవాక్కాయ సద్భక్తి
చేతను సద్గురు సేవనంబు
బహిరంతరంబుల పరిశుద్ధి విషయ ని
స్పృహయు నిష్టానిష్టచిత్త సమత

తే.గీ. మనసు నిలుపుటమిత సూక్తి తనువుతాల్మి
జెందుటయు దుష్టవిధుల చేష్టింపకునికి
దనరు మానస వాక్కాయ దండములగు
జ్ఞానసిద్ధికి నివియెల్ల సాధనములు 148

వ॥ మరియు నితరులకుంబలె తనకు మాతృగర్భ నరకజన్మజరాది శ్రమాగమ చింతనంబును, పరమేశ్వరార్పణ బుద్ధిచేత స్వధర్మంబు లొనరించి వానివల్లనగు నిహపరలోక ఫలలాభంబులం దనకాసక్తియు, పుత్రదారాగారాదుల యెడనత్యంతమమకారంబులేక వ్యవహారమాత్ర ప్రవర్తనంబును నేకాంత దేశనివేశంబును కామినీ ప్రభృతి ప్రాకృత జనంబులతో సర్వదా సహవాస వర్జితంబును, వేదాంతార్థావలోకనం బును, నిత్యంబు నాత్మజ్ఞానంబు నందు బ్రయత్నంబును, సర్వాత్మకుండును రామమూర్తినగు నాయందు ననన్య విషయంబగు పరమాత్మ బుద్ధియును నివిముఖ్యసాధనంబులగు నేతదభ్యాస సిద్ధి వలన శుద్ధజ్ఞానంబు సంభవించుగావున 149

తే.గీ. అనఘ! యజ్ఞానమున మనఃప్రాణదేహ
బుధ్యహంతా విలక్షణంబుగ నెసంగు
నేచిదాత్ముడ పరిశుద్ధ నిత్యబుద్ధ
సత్తనను దెల్పి నిశ్చయ జ్ఞానమనియు 150

కం॥ అజ్ఞానముచే నాత్మను
విజ్ఞప్తి నెరింగి యనుభవించునుదనలో
ప్రాజ్ఞుడు నిత్యానందము
విజ్ఞానంబనగనిదియె వివరింపనగున్ 151

వ॥ ఇట్టి యనుభవంబునం జేసి బుధ్యాద్యుపాధిరహితంబును పరిణామాది వర్జితంబును సర్వపరిపూర్ణంబును సచ్చిదానం దాత్మకంబును నవ్యయంబును స్వయంప్రకాశంబును సర్వభాసకంబును నిరుపాధికం బును నేకంబును నద్వితీయంబును నసంగతంబును నగు పరమాత్మ స్వరూపంబు తత్త్వ దర్శనంబునగు విజ్ఞానంబున నెరుంగ నతండు ముక్తుండగుగావున 152

సీ॥ దేశికనాథోపదిష్ట వేదాంతార్థ
పరిచిత తత్త్వానుభవము వలన
నిటజీవవరులకు నేకస్వరూపత్వ
భావనాజ్ఞానంబు బ్రాప్తమైన
యప్పుడు గాదె భూతాదిక పంచవిం
శతి తత్త్వ కార్య సంతతుల తోడ
గలుగు గుణత్రయ కరణ సంతతి తోడ
నంతకు కారణంబగుచు దోచు

తే.గీ. నట్టి మూల ప్రకృతి సముద్రాంతరమున
దోచు ఫేన తరంగ బుద్బుదము లీల
నాసముద్రంబునవె లీనమైన రీతి
నాత్మయందునె లీనంబులగుచు జనుచు 153

వ॥ ఇట్టి సహజావస్థ ముక్తియగు నివ్విధంబున నాత్మయంద ననాత్మ జన్మలయంబుల కల్పితంబులగు గావున 154

కం॥ ఈవల దోచు ప్రపంచము
దావలముగ మరచి తన్ను దానెరిగి సుఖ
శ్రీవిశ్రమించు ధన్యుడు
జీవన్ముక్తుడగుననియె సిద్ధం బరయన్ 155

కం॥ ఈ విశ్వము నాకన్నన్
దావేరై లేదటంచు తదఖండ మహా
భావన సుఖియగు నాతడు
జీవన్ముక్తుడగు నిదియె సిద్ధంబరయన్ 156

తే.గీ. ఇదియె మోక్ష స్వరూపంబు విదితమయ్యె
జ్ఞాన భక్తివైరాగ్య సంసక్తి నెసగు
నాత్మ విజ్ఞానమగు దీని నవగమింప
దుర్లభంబగు మద్భక్తి దూరులకును 157

కం॥ నేత్రముల గానగూడని
రాత్రుల వస్తువును గానరాజేయు మణీ
చిత్ర ప్రదీప గతి నీ
పాత్ర విరోధమున నాత్మపదమెరుగ నగున్ 158

కం॥ మద్భక్తియుక్తులీవిధి
మద్భావన నాత్మ నెరిగి మనుదురు గానన్
మద్భక్తికి కారణమగు
మద్భక్తుల సాహచర్య మహిమయె సుమ్మీ! 159

వ॥ మరియు మద్భక్తజన సేవాపరిచర్యలును యేకాదశ్యుపవాసాది మదీయ వ్రతాచరణంబును మద్విషయంబగు నానందంబును నిత్యంబును మత్కథా శ్రవణ పారాయణ వ్యాఖ్యానాదుల యందాసక్తియు మత్పూజానిష్ఠయు మదీయనామాను కీర్తనంబును గలుగువారికి నవ్యభిచారిణి యగు భక్తి సంభవించు దానం జేసి జ్ఞానంబు జెందునందు ముక్తండగుం గావున 160

కం॥ నాచెప్పిన యీ బోధము
నీచెప్పిన ప్రశ్నమునకు నెనరగుగానన్
గోచరమగు నెవ్వనిమది
నీ చిద్విధమతడు ముక్తి నెనయు నిజముగాన్ 161

వ॥ అని చెప్పి మరియును 162

తే.గీ. ఇదియు మద్భక్తి విముఖుల కియ్యరాదు
పిలిచియైన భక్తులకును దెలుపదగును
భక్తి నరుడిదినిత్యంబు పఠనసేయ
దొలగు నజ్ఞాన తమము ముక్తుండునగును 163

వ॥ కావున 164

శా॥ నాకున్ భక్తులు యోగులు న్విమలశాంత స్వాంతులున్ మత్పదా
ర్చాకాంక్షాత్ములు సర్వదా విమలవిజ్ఞానాత్ములౌ వారితో
వీకన్ గూడి యనన్య బుద్ధి ననుసేవింపన్ దగున్ వారికై
యాకైవల్యమునున్ గరస్థముగ సేయందోచులే దెందునన్ 165

వ॥ ఇట్లు బోధితుండగుచు కృత కృత్యుండగు సౌమిత్రియును
శ్రీరామదేవుండును సుఖంబుండిరంత 166

– శూర్పణఖ పరాభవము –

సీ॥ ఆకాలమున నమ్మహారణ్యమున మహా
సత్వధారిణి కామచారిణి యగు
దైత్యకామినిజనస్థాన నివాసిని
సంచరింపుచు యథేచ్ఛా నిరూఢి
యొకనాడు గౌతమీ ★ప్రకట చంచత్తటి
పంచవటీ సమీపంబునందు
జలజ వజ్రాంకుశ ఛత్రాదిరేఖాంకి
తములు రామపదాంబుజములు జూచి

తే.గీ. తద్విభుపదారవింద సౌందర్య మోహి
తాత్మయై కామశరపరీతాంగియగుచు
వాని జూడను జనుదెంచె వారలున్న
పర్ణశాలను గాంచి సంభ్రమము మించి 167

తే.గీ. దుర్ముఖి విరూపవికృతాక్షి స్థూలమధ్య
శూర్పనఖ తామ్రకేశ రక్షో వధూటి
సుముఖ శుభమూర్తి బద్మాక్షు సూక్ష్మ మధ్యు
రమ్యనఖు నీలకుంతలు రాము జూచి 168

★ తటిని – గ.ము.ప్ర. పాఠం = (గద్వాల ముద్రితప్రతి పాఠం)

వ॥ ఇవ్విధంబున 169

కం॥ కామశత సదృశ ధాముని
రాముని సీతారమాభి రాముని గనియున్
గామ విమోహితయై యా
రామునితో నిట్టులనియె రాక్షసియంతన్ 170

ఉ॥ ఎవ్వడవీవు? నాశ్రమమునెయ్యది? చీర జటాధరుండవై
యివ్వనినుండ నేమి? వినుమేను దశాననుడై మహాత్ముడై
నెవ్వడి పేరుగన్న రజనీచర నాథునకున్ సురారికిన్
సువ్వె! కనిష్ఠ సోదరిని శూర్పణఖాఖ్యను కామరూపిణిన్ 171

ఆవె. ఖరునితో సురారివరునితో నిజసహో
దరునితోడనుందు దనరనిందు
మునుల దిందు నెందు ముందునాదనుజేంద్రు
డిచ్చెనాయధీన మీవనంబు 172

కం॥ నినునిక నెరుగం గోరెద
వినుపింపుము సరసవచన విరచన చతురా!
యనిన సహేళనముగ న
ద్దనుజాంగన కిట్టులనియె దశరథ సుతుడున్ 173

ఉ॥ రాముడ, నేనయోధ్య గల రాజునకగ్రతనూభవుండ, నీ
రామమదీయ సుందరి ధరాసుతయైతగు సీత, భ్రాతయౌ
నీమహనీయ కీర్తి వినుమెంతయు సుందరమూర్తి, నీకునే
నేమియొనర్పగావలయు నిప్పుడు సెప్పుము లోకసుందరీ! 174

తే.గీ. అనిన రామోక్తి వినియు కామార్తయగుచు
ననియెనిది బ్రేమ నిన్ను బాయంగలేదు
రమ్మునాతోడ శైలవనమ్ములందు
జేరి క్రీడింపు రామ! రాజీవ నయన! 175

చం॥ అనిన విభుండు సీతను గటాక్షములన్ గని నవ్వి దానితో
ననియెను భార్య నాకు ననపాయిని యున్నది యీ శుభాంగియిం
దునను సపత్నితో గలుగు దుఃఖముచే నెటులుండె దీవు నా
యనుజుడు సుందరుండు బహిరంగణ సీమవసించి యుండెడిన్ 176

ఉ॥ నీకనురూపుడాత డతనిన్ బతిగావరియించి క్రీడలన్
జేకొను మన్న లక్ష్మణుని జేరి నిశాచరి బల్కె రాము నా
జ్ఞా కలితాప్తిచే ననువెసన్ గయికొమ్మని కామతప్తయై
యాకరణిన్ వచించుదనుజాంగన కిట్లను నాతడెంతయున్ 177

కం॥ ఓసతి! సీతారాముల
దాసుడ నన్నును వరించి దాసివయి వెతన్
గాసిల నేటికి రాముని
రాసుతు గొని సుఖముగనుము రాక్షసియనినన్ 178

కం॥ రాముడు నిట్లన మరియును
సౌమిత్రియు నిట్టులనిన శాద్వలయుగళ
ప్రేమ భ్రామిత మతియగు
నామహిషియు బోలె తిరిగి యాసురియంతన్ 179

ఉ॥ రాముని జేరి వెండియును రాక్షసి యిట్లను దుఃఖబుద్ధియై
యేమిట నన్నువంటి సతి నీగతి ద్రిప్పెదు నీవు జూడగా
భూమిజ బట్టి మ్రింగెదను భూవర! యంచును గ్రోధమూర్తియై
రాముని మీదికిన్ గవిసి రా వికృతాకృతి తోడనయ్యెడన్ 180

కం॥ అక్కసిచే లక్ష్మణుడా
రక్కసి నసిచేత చేత రాముని యాజ్ఞన్
ముక్కును చెవులును దరగెను
ముక్కున జలముగతి రుధిరమున్ దొరుగంగన్ 181

ఆ.వె. ఆత్మమూర్తియైన యారాముగనుగొన్న
భూన భోగుణములు బొలియు గాన
నసురసతికినప్పుడారీతియగుటచే
భూన భోగుణములు బొలిసి చనియె 182

కం॥ అంతట నాశూర్పనఖయు
నెంతయు ఘోరారవమున నేడ్చుచును ఖర
స్వాంతమునన్ జనియు ఖర
ప్రాంతమునన్ బడియె నాతడాశ్చర్యపడన్ 183

ఉ॥ ఆగతియైన దానిగని యంతఖరుండు భయంకరధ్వనిన్
వేగమె బల్కెనెవ్వడిటు నిన్నొనరించెను మృత్యుదుర్ముఖా
భ్యాగతుడౌచు జెప్పుమతడంతక సన్నిభుడైన ద్రుంతుగ్రో
ధాగతి నన్ననన్నగనియాసురి రోసరి వానికిట్లనున్ 184

కం॥ గోదావరితటిని భయ
శ్రీదాయతి నున్నవాడు చేరిక రామ
క్ష్మాదయితుడు లక్ష్మణుడను
సోదరుతో సీతయను కృశోదరితోడన్ 185

కం॥ ఆతని యానతి లక్ష్మణు
డీతెరుగును జేసెనన్ను నీవునుకులసం
జాతుడవేనియు శౌర్యా
న్వీతడ వేనియును వారినిన్ ద్రుంపుమనిన్ 186

తే.గీ. భూరిమదమూరి మీరిన వారిమధిర
వారిగొని వారిదిని దానవలయుదాన
లేనిచో మేని ప్రాణంబు లేనిమాని
యిట్టి చందాన సురపురి కేగుదాన 187

వ॥ అనియప్పగిది శూర్పణఖజెప్పిన నప్పుడ కన్నుల నిప్పులుప్ప తిల్లగ్రోధ దుర్ధరుండై ఖరుండు త్రిశిరుండును దూషణుండును సహాయంబుగా చతుర్దశ సహస్ర సంఖ్యాకంబై భీకర శౌర్యోద్రేకంబగు రాక్షసబలానీకంబు రామవధార్థంబు సత్వరంబునన్ దోడ నడవ దానును నానావిధ సాధన సన్నద్ధంబుగా యుద్ధంబునను నరుగు నవసరం బున 188

సీ॥ సమదసింధురఘటా జాలఘీంకారముల్
భూరి ఘంటాఘణాత్కారములును
సైంధవహేషా ప్రచార హింకారముల్
ఘన హయారోహ హుంకారములును
రథనేమి ఘాత ఘుర్ఘర ఘులాత్కారముల్
కార్ముకమౌర్వీటంకారములును
భట భుజాస్ఫాలనాభటిత హుంకారముల్
కల్పితశూర ఫట్కారములును

తే.ట. భేరికాహళ పటహభాంకారములును
ఘటితమాగధ వందిహోంకారములును
దనరనరుదయ్యె నాహవోత్సాహబలస
మూహసన్నాహ మహితకోలాహలంబు 189

కం॥ అప్పుడు రాముడు బలముల
చప్పుడవిని దీనివింటె సౌమిత్రి! నిజం
బిప్పుడు దైత్యులు వత్తురు
జొప్పుడు వారలకు నాకు ★సుమ్మతిరణమున్ 190

ఉ॥ కానమహీజ గొంచు గిరిగహ్వర సీమవసించు సాహస
శ్రీనిధియింక నేమియును జెప్పకు జెప్పిన నీకు నాదుపై
యాన భయానకాహిత సమాక్రమ విక్రమశాలి వౌదు నీ
వైనను నేనెయొక్కడ సురారుల నెల్ల వధింపగోరెదన్ 191

కం॥ అనియత్తరి రఘుసత్తము
డనియె నిమిత్తములు గొన్నియరసియనుజుతో
మనకిత్తరి విజయంబును
దనుజావలికపజయంబు దథ్యము గలుగున్ 192

కం॥ అనిరాముడానతిచ్చిన
విని సౌమిత్రియును భక్తి విధిజనకసుతన్
గొని శైల గహ్వరమునకు
జనియచ్చట గాచియుండె సమ్మతినంతన్ 193

కం॥ రక్కసులు పెక్కు రఘువరు
డొక్కరు డేదారివీరినుక్కడచును దా
నొక్కడయని చూడగ దివి
గ్రిక్కిరిసిరి సిద్ధసాధ్య ఋషి సురముఖ్యుల్ 194

వ॥ ఇట్లు సన్నద్ధుండగు రామచంద్రునిపయిన్ జతుర్దశ సహస్రసంఖ్యం బగు నద్దనుజ బలంబు తద్దయున్గోపో ద్దీపితంబై కలిసివిశిఖ ముసల ముసండి భిండివాల శూల కరవాలతోమర ముద్గర పరశుపట్ట సప్రాసపాషాణ పాదపాదులన్ బరపియు, మాతంగ శతాంగ తరంగాదుల నెరపియు, దెలిపియు, దక్క నలుదిక్కుల నొక్కటన్ జిక్కువడ నెదిర్చి కార్చిచ్చుపయింగవియు శలభంబుల భంగి నార్చిపేర్చిన. 195

★ సమ్మతి – గ.ము.ప్ర. పాఠం

శా॥ ప్రత్యాలీఢపదబునన్ నిలిచి చాపంబందు మౌర్వీ రవం
బత్యారూఢముగాగ రాఘవుడు గ్రోధాయత్తుడై సంగరో
ద్ధత్యంబేర్పడ నిష్మరభ్రుకుటి సంధానంబ నూనంబుగా
దైత్య వ్రాతము మీద నేసె నిశితోద్యద్బాణ సంఘాతమున్ 196

కం॥ చక్రముగా చాపము శర
చక్రము నపరిమిత శంఖసంఖ్యాతముగా
విక్రమ గతి రఘుకులపతి
చక్రధరుని రీతినసుర సమితిన్ బొదవెన్ 197

వ॥ ఇట్లు విజృంభించి రఘు సంభవుండునసుర బలంబుపయిన్బళయ సమయ సముద్దండ దండధర దండంబుల బోని కాండంబులన్ బరగించి యురువణించి స్యందనంబుల ద్రుంచియు సింధురంబుల నొంచియుసైధవంబుల నడంచియు శూరభటుల బృందంబులం దలపడిన నఖముఖ కరశిరః పాద పార్శ్వ వక్ష వక్షోముఖంబులగు నంగాంగంబులనెరుంగపడకుండ తిలమాత్రంబులుగా క్షణమాత్రం బున ఖండించి రూపుమాపి విలాసంబు జూపి గుణటంకారంబును సింహహంకారంబును జేసి నిలిచిన తక్కినరక్కసులందరున్బరచి వెరచి ఖరునిశరణంబు సొచ్చిన 198

కం॥ దూషణుడప్పుడు దగుసం
భాషణముల నసుర వరుల మరలింప మహా
రోషంబున శౌర్య రసో
న్మేషంబున మరియు రాముని న్దాకివెసన్ 199

కం॥ ఆలంబున దూషణు బల
మూలంబున రఘు కులోత్తముని మీద శిలా
జాలంబులు సాలంబులు
వాలంబులు గురిసి యసుర వరులార్చుటయున్ 200

శా॥ సంధాబంధురుడా రఘూద్వహుడు రోషస్ఫూర్తి దీప్తానల
స్కంధంబు న్బురుణించి కార్ముకమునన్ సంధించి ఘోరంబుగా
గాంధర్వాస్త్రము వ్రేసి చక్కణచి రక్షశ్రేణినెల్లన్ యమ
స్కంధావారము జేరగా బనిచె దోశ్శౌర్యం బవార్యంబుగన్ 201

వ॥ ఇట్ల సురసైన్యంబంతయు సమసినన్ గని రోషభీషణుండై దూషణుండు వెండియు సాహసోదంచితం బగు సహస్ర రాక్షస బలంబునున్ బంచిన వారును మేఘుంబుగతి రాఘవునిన్ గప్పి శిలావర్షంబును శరవర్షంబును న్బుట్టించిన జలింపక నమర్షంబున నవ్వీరుండాశుగవేగంబున వాని వారించి యంత 202

కం॥ క్రందున గదిసిన రఘుసం
క్రందనుడద్దనుజులన్ శరవ్రాతముచే
నందర నింతింతలుగా
తుందునుకలు జేసి మృత్యుతుందము నించెన్ 203

కం॥ అంతటదూషణుడు చమూ
కాంతుడు రోషమున నశని కల్పములగుదు
ర్దాంతశరంబుల నా రఘు
కాంతుని గప్పిన నతండు కడు కోపమునన్ 204

కం॥ ఒక శరమున దూషణ కా
ర్ముకవరము హయోత్కరమునుద్రుంచి రఘువరుం
డొకయర్ధచంద్ర శరమున
సుకరంబుగ ద్రుంచెవాని సూతు శిరంబున్ 205

వ॥ ఇవ్విధంబున నద్భుతంబుగా యుద్ధం బొనరించిన రామభద్రుని న్గదిసి క్రోధోన్నద్రుండగు రుద్రునిన్ గదియునంతకుండునుంబోలి యద్దూషణుండు విరథుండయ్యును కోపంబున గదాహస్తుండై యెదురించినం గాంచి రఘుకులాధ్యక్షుండునుం గ్రోధ తామ్రాక్షుండై యాక్షణంబున బ్రశస్తహస్తా భరణద్వయంబగు నద్దనుజు భుజాద్వయంబు శరద్వయంబునంద్రుంచి యొక్కశరంబున యురంబు భేదించిన వాడునున్బుడమిన్పడియె నయ్యెడ 206

కం॥ భీషణముగ నీగతినృప
భూషణుడగు రఘువరుండు బోరనడంచెన్
దూషణునరి దూషణు గురు
రోషణునురు భాషణుని మరుద్వేషణునిన్ 207

వ॥ ఇట్లు సేనాధీశుండగు దూషణుండు బడినన్ జూచి మహాబలుండగు మహాకపాలుండును, స్థూలాక్షుండును, బ్రమాధియునను యోధ వీరులు గ్రోధాచారులై యాయోధనంబునన్ గాలపాశావ బాధితులై యనేక సాధనంబుల నమ్మహీధవున్ బొదివిన తత్సేసలేశుండును న్గోపావేశంబున నయ్యసుర వరుల మూడు శిరంబులు న్మూడు శరంబులన్ దెగవ్రేసిన 208

కం॥ ఆదశగను దనుజులగని
యాదశగళు సోదరుండు నగు ఖరుడువడిన్
ద్వాదశ బలముఖ్యులతో
నాదశరథ సుతుని మీది కడరెన్ గినుకన్ 209

వ॥ అంతట ఖరప్రేరితులగు ద్వాదశ సేనాధీశులును,రణాభివేశులై రాఘవేశున్గదిసి, శస్త్రాస్త్ర ప్రముఖ వివిధాయుధంబుల న్దాసియు వ్రేసియు నడచియున్మొడిచియు న్బట్టియు గొట్టియు జుట్టిముట్టి నన్నరపాల పుత్రుండు లీలామాత్రంబుగ శిఖి శిఖా సమానంబులగు నిశిత విశిఖంబుల నద్దనుజవర్మంబులు సించియు మర్మంబులు నొంచి బ్రాణంబులన్బాపియు మరియు హత శేషంబగు బలంబు నిశ్శేషంబు గావించిన రోషంబున ఖరప్రేషణంబునన్ ద్రిశిరుండు రఘువరుం దలపడియెనప్పుడు 210

కం॥ హరికుంజరములునున్ బలె
నరదానవ కుంజరులు రణంబున నితరే
తరభంజనములు నెరపగ
నరి భంజనుడపుడు రాముడతికుపితుండై 211

కం॥ త్రిశిరములు పవిహతాద్రి
త్రిశిరములన ద్రెళ్లనవని శ్రీరాముడనిన్
త్రిశరములద్రుంచి కూల్చెన్
త్రిశిరు బలప్రసరు పూర్వదేవాగ్రసరున్ 212

కం॥ ఈసరణి త్రిశిరుడీల్గిన
నాసరణిన్ గోపముఖరుడై ఖరుడలుకన్
వాసవ నిభు రామ విభున్
వాసవునిన్ నముచిబోలె వడి నెదురించెన్ 213

వ॥ అప్పుడు 214

మహాప్రగ్ధర-

ఖరుడున్ రక్తాశనాస్త్రోఘము రఘువరునిన్ గప్పెకోదండ దండ
స్ఫురణన్ సక్రోధ సర్పణంబుల జొనుపుగతిన్ బోరు ఘోరంబుగా న ద్ధరణీశుండున్ మహోద్యద్ధనువు
నిగుడ దుర్దాంత కాండప్రకాండం
బరిబోసెన్ రోదసీగహ్వరము నిబిడమై యద్భుతం బావహిల్లన్ 215

ఉ॥ అంతఖరుం డుదగ్రత మహాబలవంతుని రాము వక్షమా
కాంతుని ముష్టిదేశమున కార్ముకమున్ దెగవ్రేసి డాసి దా
నెంతయు హస్తలాఘవము నేర్పడ వ్రేయ శరంబులేసి య
త్యంతము తత్తనూకవచ మాజిధరన్ బడవేసి యార్చినన్ 216

కం॥ కోపంబున నటవైష్ణవ
★ చాపంబున శరచయంబు సంధించి దురా
టోపంబున రఘువరుడా
క్షేపంబున ఖరుని మీదికిన్ బరపుటయున్ 217

ఉ॥ నాలుగిటన్ ధ్వజాదులను, నాల్గిట చిత్రహయంబు, లొక్కటన్
గోలను, సూతుకంఠమును గోలల రెంట, రథాక్షమున్ ధరన్
వ్రీలగ జేసి విల్లు పది రెండవ తూపులద్రుంచి రాఘవుం
డోలిఖరు న్మహాసురు ద్రయోదశ బాణము చేత నొంచినన్ 218

వ॥ ఇట్లు రాముని చేత విరథుడును, విభిన్న కార్ముకుండును, వినిపాతిత హయవ్రాతుండునునై, ఖరుండు గదాపాణియై, క్షోణికి లంఘించి, రాఘవుని మీద నశని విధంబగు తనగదన్బ్రయోగించిన, నతండు దానిన్ శరంబున ఖండించి వాని శరీరంబు సహస్రంబులుగా భేదించిన నయ్యసురవరుండు రుధిరగంధమత్తుండై యత్తరి రఘు సత్తముపయిన్గదిసిన నవ్వీరోత్తముండు కించి త్త్వరిత విక్రముండై యగస్త్య దత్తంబగు దివ్యాస్త్రంబభిమంత్రించి తదీయ వక్షంబు లక్షించి వైచినన్ దచ్ఛరాగ్ని దగ్ధుండై ఖరాసురుండు గతాసుండై వసుమతిన్ బడియెనివ్విధంబున 219

కం॥ ఖరకరవంశ శిఖామణి
ఖరశర మరిబోసి ద్రుంచె ఖరుని నసురశే
ఖరునిన్ సింహధ్వాన ము
ఖరునిన్ బరితులిత గిరిశిఖరునిన్ ఖరునిన్ 220

కం॥ ఖరునీగతి వధియించిన
నరుదుగ దచ్ఛౌర్యమెంచి యగ్ని ప్రముఖుల్
సురలంచిత సుమదృష్టిన్
గురియించిరి రామశౌరి గురియించివెసన్ 221

కం॥ యామార్ధమున సమిద్ధ
స్థేముడు ఖరదూషణ త్రిశిరులంద్రుంచెన్
రాముడు గుణధాముడు రణ
భీముడు త్రిపురముల నడచు భీముడు బోలెన్ 222

ఉ॥ అంతట లక్ష్మణుండును గుహాంతరమున్వెడలంగ వచ్చియ
య్యింతిని దెచ్చి రామునకు నిచ్చి హతాసురపంక్తి గాంచి వి
భ్రాంతి వహించె సీతయును భర్తను గౌగిట సేర్చి బ్రీతవ
క్త్రాంతయునై శరవ్రణములంగములన్ దుడిచె న్గరంబునన్ 223

★ చాపమునస్మరచయంబు – గ.ము.ప్ర. పాఠం

సీ॥ ఈరీతి తమవారలా రామశౌరిచే
హతులైన శూర్పణఖాభిధాన
బారిలంకాపురి జేరి సభాంతరా
సన్నరావణపాద సన్నిధాన
ధరణిపై బడి తీవ్రసరణినాక్రోశింప
భయ వృత్తయగు నాత్మ భగిని గనియు
కినుక రావణుడిట్టులను వత్సలెమ్మిట్లు
నిన్ను విరూపిగా నెరపె నెవ్వ

తే.గీ. డింద్రుడో! ధరేంద్రుడో! వారిధీంద్రుడొక్కొ!
కాక శమనుడొ! సారంగ గమనుడొక్కొ!
తక్కిన సురాదులో! భీతిదక్కి వారి
జెప్పుమిప్పుడు భస్మంబు జేయువాడ 224

వ॥ అనిన నద్దశముఖుంగనుంగొని శూర్పణఖ రోష వికృతముఖియై యిట్లనియె 225

శా॥ అన్నారావణ! స్త్రీ జితుండవును పానాసక్తి మంతుండ వీ
వెన్నన్ మూఢుడవింతె శూరగతిచే నీక్షింప లక్షింపగా
కున్నన్ గూఢ చరాక్షి హీనుడవు నయ్యున్ రాజ వెట్లైతి వా
సన్నత్రాస మెరుంగవైతి విదుగో! సర్వంబునే జెప్పెదన్ 226

కం॥ త్రిశిరుని దూషణుని జతు
ర్దశ సంఖ్యసహస్ర దనుజ తతులన్ ఖరునిన్
విశసించెన్ క్షణమాత్రన్
విశిఖంబుల చేత రామవిభుడలుక వెసన్ 227

వ॥ కావున చారజనవిహీనుండవై యివ్విధంబెరుంగవై తగుట మూఢుండ వంటినని మరియును 228

కం॥ దానవహరుడవ్వీరుడు
దానజనస్థానమెల్ల తపసుల కభయ
స్థానముగా జేసెననన్
దానవనాథుండు మరియు దానికి ననియెన్ 229

కం॥ రాముండెవ్వడు దనుజుల
నేమిటికై ద్రుంచె దీని నెరిగింపుము నే
నామూలముగ హరించెద
రామునినన రావణునకు రాక్షసిబలికెన్ 230

కం॥ ఒకనాటియెడ జనస్థా
నికదాటి పురాధిగత ముని వ్రజవాటిన్
బ్రకటితగతి గౌతమితటి
నికటశ్రమ పంచవటిని నేజనికంటిన్ 231

తే.గీ. జనకు ననుమతి దండకావనము నుండు
కార్ముకకరుండు జటియు వల్కలధరుండు
లక్షణయుతుండు రాముండు లక్ష్మణుండు
తాదృశుడు ధూతదనుజుండు తదనుజుండు 232

కం॥ శ్రీరామ భామ రెండవ
శ్రీరామ వయోభిరామ శృంగార విలా
సారామ రూప విభ్రమ
సారామల రుచుల నింపెసగువననసీమన్ 233

కం॥ అన్నరవర కిన్నరసుర
పన్నగ సతులందు సీతపాటివధూటిన్
గన్నదియు లేదు మరియున్
విన్నదియున్ లేదు లేదు వేయన నేలా! 234

ఉ॥ దానవ నాథ! నీకునట దానిని మానినిగాగ దేరగా
బూనిన లక్ష్మణుండు ననుబూనికనిట్లు విరూపజేసినన్
దాన ఖరాదులొనిఖిల దానవులెల్ల ముహూర్తమాత్రగ్రో
ధానను జేరి పోరియని దారి విదారితులైరి రాముచేన్ 235

కం॥ కానన్ రఘు వీరునికో
పాన జగజ్జాతమెల్ల భస్మీభూతం
బౌనని నాకుందోచెడి
దీనికి సందియము లేదు దేవ విరోధీ! 236

వ॥ అది యట్లుండ నిమ్మని సెప్పి యద్ధరాసుతనుద్దేశించి మరియు నిట్లనియె 237

సీ॥ శృంగారరసము మూర్తీభవించిన మాడ్కి
సరస విభ్రమము నెవ్వెరగు నెరప
సౌందర్య శక్తి సాక్షాత్కరించిన రక్తి
కొమరారు చెలువుమోదము ఘటింప

భువన మోహనవిద్య రవళిజూపిన రీతి
జిలుకు విలాసంబు చెంగలించె
తారుణ్యరేఖ ప్రత్యక్షమై తగులీల
తనుకాంతులు మెరుంగు తళుకులీన

తే.గీ. దనరునయ్యింతి యంతమాత్రంబెకాదు
లలిత జగదేక సామ్రాజ్య లక్ష్మి సుమ్ము!
నీకు దగునట్టి సొమ్ము నాళీక వదన
పంక్తివదన! యభేద్య ప్రభావ సదన! 238

ఉ॥ కావున నీకు నారమణి గైకొన గల్గిన సార్థమౌనునీ
జీవిత మవ్విధంబునకు సేయుము యత్నము నొండు సెప్పెద
న్నీవును రామునన్నిధిని నిల్వగలే వెదురించిగాన మా
యావిధి నాహరించినను యాజనకాత్మజగాంతు వెంతయున్ 239

తే.గీ. అని యిటు విరూప శూర్పనఖాభిధాన
లక్షితాశుగ వేగయై లంక కరిగి
జానకీరూపచాంపేయ సూనవిభవ
మహిమ లెరుగించె రావణ మధుపమునకు 240

కం॥ ఆదశముఖుడంత తదా
వేదితమాద్యంతముగను విని శూర్పనఖన్
సోదరిని దాన మానా
ద్యాదరణంబులను ననునయము సేసివెసన్ 241

కం॥ అంతట నప్పంక్తి ముఖుం
డంతఃపురి కరిగి రాత్రియంతయు నటద
చ్చింతాసంతాపితుడై
యెంతయు నిద్రయును లేకనిట్లని తలచెన్ 242

సీ॥ నరమాత్రుడైన యొక్కరుడు రాముని చేత
బహుదైత్యనేత మద్భ్రాత ఖరుడు
బలశౌర్య ధైర్య విభ్రాజులు దనుజుల
నేకులు సమసి రదేమియొక్కొ!
యదిగాకమును బరమాత్ముండు మద్వాధా
ర్థము బ్రార్థితుండయ్యె ధాత చేత

నావిభుండీ రాముడన రఘు కులమున
నీనరాకృతి జనియింప బోయి

తే.గీ. నిట్టి హరిచేత నేవధియింప బడితి
నేని వైకుంఠ రాజ్యంబునెనయ గాంతు
నదియుగాదేనిదైత్య రాజ్యము భుజింతు
నగుట రాముని గూడ నేనరుగు వాడ 243

తే.గీ. అనుచు జింతించి దనుజేంద్రుడట్టి రాము
హరిని బరమేశ్వరుని గాగ నాత్మనెంచి
శౌరినిటు వైర బుద్ధిచే జేరువాడ
భక్తి వేగ బ్రసన్నత బడయ డతడు 244

సీ॥ అనియు నీరీతిగా నారాతిరిదలంచి
దశకంధరుడు బ్రభాతంబునందు
నొక్కకార్యము మదినూహించి రథమెక్కి
సింధువువర తీర సీమనుండు
మారీచసదనంబు సేరంగ జనిన న
మ్మారీచుడును జటాధారియగుచు
మునివృత్తిచే పరాత్ముని భజింపుచునుండి
ధ్యానంబు జాలించియతని గాంచి

తే.గీ. వేగముగలేచి యరుదెంచి కౌగిలించి
పూజగావించి యాతిథ్యమును ఘటించి
పూని విధియుక్తముగ సుఖాసీనుడైన
యద్దశాననుతోడ నిట్లనుచు బలికె 245

తే.గీ. అధిప! నీవేక రథమున నరుగుదెంచు
టేమి చింతాపరుని లీలనిటకు నేను
నీ ప్రియమొనర్తు యుక్తమేనియు వచింపు
న్యాయమును పాపరహితమౌనట్లు గాగ! 246

వ॥ అనిన నమ్మారీచునకు నిశాచరవరుండిట్లనియె 247

మ॥ చను సాకేతపురంబునన్ దశరథక్ష్మాజానియున్ జ్యేష్ఠుడౌ
తనయున్ రాముబ్రియున్ వనంబనుపనాత్మభ్రాతయున్ సీతయున్

వెనువెంటన్ జనుదేర వచ్చి సుఖియై వేయున్నవా డిచ్చటన్
గనగా పంచవటిన్ శుభాశ్రమ కుటిన్ కాంతార వాటీ తటిన్ 248

కం॥ ఆతని సతి సీత సరో
జాతత లోచన సమేత యఖిలభువనసం
జాత విమోహన గుణవి
ఖ్యాతయగున్ దద్వధూటి గైకొనవలయున్ 249

వ॥ అదియేమిటి కంటేని 250

- మాయామృగ వృత్తాంతము -

మ॥ అపరాధం బొకయింతలేక ఖరముఖ్యానేక మద్దానవా
ధిపులన్ శూరుల ద్రుంచి శూర్పణఖ నెంతేనింతి మత్సోదరిన్
గృపబోద్రోసి విరూపజేసి విజయశ్రీడాశి దుష్టాత్ముడీ
నృపవంశాధముడున్నవాడు వనిలో నిర్భీతిచే గావునన్ 251

కం॥ మాయామృగ కాయాదృతి
నాయావనముల వెడల్పు మారఘువరులన్
వ్యాయామవిధుల నీదుస
హాయాగతి నాహరింతు నాహరిణాక్షిన్ 252

కం॥ ఈయింత కార్య మొనరిచి
పోయెదు నీయంతనీవు పూర్వ విధమునన్
మాయామేయాదానవ
గేయా! యసహాయ! తాటకేయ విధేయా! 253

కం॥ అని యీగతి భాషించిన
దనుజేంద్రుని గాంచి సస్మితము విస్మితమున్
దనరగ నిట్లని పలికెన్
మనమునకున్ భయముదోచ మారీచుడొగిన్ 254

ఉ॥ ఎవ్వడు నీకు నాశనము నెంతయు గోరి సమూల ఘాతమౌ
నివ్వచనంబు జెప్పెనతడేకద శత్రుడు నీకు వధ్యుడున్
నెవ్వడిరామ శౌర్యమును నేను దలంచి తలంచి భీతితో
నివ్వటిలంగ నుండెదను నేటికినైనను దానవాగ్రణీ! 255

కం॥ బాలుండై కౌశికమఖ
పాలుండై రాముడొక్క బాణంబునన
న్నాలంబున వారిధితో
నోలిన్బడ వైచె నూరుయోజనములుగాన్ 256

కం॥ అదియాదిగ భయవిహ్వల
హృదయుడనై దలచి దలచి శ్రీరామ విభున్
మదినెయ్యడ నేజూచిన
తుదనయ్యెడ నవ్విభుండె దోయున్నాకున్ 257

సీ॥ దండకావని నేను వెండియు బూర్వవై
రంబు దలంచి గర్వంబుతోడ
ఖరశృంగ మృగరూప ధరుడవై యొకనాడు
మాదృశ బహుదుష్టమతుల తోడ
నాతని బాధింపనేతేర రఘువరుం
డొకయమ్ము వ్రేసిన యుదధి బడితి
నది మొదల్ తద్భ్రాంతి మది బొదల్ భీతిచే
నిలు బాసియిచ్చోట నిలిచి తేను

తే.గీ. నగుట నాడాదిగా రవర్ణాదియైన
రాజరత్నాది యగు శబ్ద రాజివినిన
రాజ రత్నంబయగు రాము రాక దోప
భయముననను బాహ్యకార్యముల్ బాసితేను 258

తే.గీ. నిద్రలోనైన నారామభద్రుజూతు
కలను రామునిగను బోధకళను గాంతు
కానరాముని మీదియాగ్రహము మాని
గృహమునకు బొమ్ము దనుజేంద్ర కృతివిగమ్ము 259

కం॥ నీవున్న సకలమున్నది
నీవన్నది లేక యున్న నేమియు లేదా
గావున చిరాగతంబిది
రావణ! నీవంశమెల్లి రక్షింప వనా 260

కం॥ హితము వచించితి వినునా
మతము పరాత్ముడగు రాముమతి నతిభక్తి
స్థితిగను రావణవైరా
గతివిడువు మతండు పరమకారుణికుడగున్ 261

కం॥ వినుమే నొక్కరహస్యము
వినిపించెద నీకు సకల వృత్తాంతంబున్
మునిజనము చేత దీనిన్
వినియుంటిన్ దొంటినుండి వీరవరేణ్యా! 262

మ॥ అనఘుండాహరి బ్రహ్మవేడ తదభీష్టార్థంబు గావింపగా
జననంబంది నరాకృతిన్ దశరథక్ష్మాజానికిన్ రాముడ
య్యెను నిన్నున్ హరియింపగా నరుడుగాడీశుండు మాయా విడం
బనమున్బూని చరించునీవిభుడు భూభారంబు వారింపగన్ 263

సీ॥ అనిన మారీచోక్తి వినిదైత్యవరుడిట్టు
లను రాఘవుండు బరాత్ముడేని
విధిపంపునను దనువధియింపమనుజుడై
యిట యత్నమున జనియించెనేని
యక్కార్యమొనరించు నచిరకాలంబున
సత్యసంకల్పుడీశ్వరుడు గాన
దాన యత్నము బూని జానకినే దెత్తు
నందుచే హరిచేత హతుడనైన

తే.గీ. బడయుదును దివ్య సేవ్యమౌ పరమ పదము
నెనయు దదిగాక నతనిజయించితేని
ఖ్యాతి భూజాత గాంతు నిర్భీత రీతి
ఘన గుణవ్రాత! తాటకా గర్భజాత! 264

ఉ॥ కావున నీవు చిత్ర మృగ కాయము గాంచి భ్రమించి దూర మ
బ్భావర పుత్రులన్ గొనుచు బొమ్ము నిజమ్ముగ నిట్లు గానిచో
నేవెసమత్కరాసిగొని నిన్ను వధింతునటన్న వాడునున్
రావణు వాక్యముల్ విని దురంతర చింతనిజాంతరంబునన్ 265

కం॥ ఈమెయి నీరావణుచే
నేమృతి గనుగాంచువాడ నిరయము హరియౌ
రామునిచే మృతి గాంచిన
నేముక్తుడనగుదు ననుచు నిశ్చిత మతియై 266

కం॥ ఆ రావణునకు నిట్లను
జేరిక భవదాజ్ఞ నేను సేయుదుననుచున్
దా రథ మధిరోహింపుచు
మారీచుడు రాము నాశ్రమము జేరియటన్ 267

సీ॥ కనకమయాంగంబు ఘనమణి శృంగంబు
రజిత బిందువరంబు రత్నఖురము
శక్ర శిలావిలోచనము విద్యుత్తుల్య
రోచనంబును చిత్రరూపమగుచు
మారీచుడీరీతి మాయామృగాకృతి
రామాశ్రమ సమీప సీమయందు
క్షణము వసింపుచు క్షణముల్లసింపుచు
దిరుగుచు జానకీ దృక్పథమున

తే.గీ. నికటమున నటియింపుచు ప్రకటముగను
దూరముగ బారుచును భీతి దూరునపుడు
నాజగన్మోహినీభూతయైన యవని
జాత మోహింప జేయుచు సంచరించె 268

ఉ॥ అంతట రాముడంతయు దశాననుచేష్టితమౌట గాంచియే
కాంతము నందు సీతగని యంగన నావచనం బొర్పునీ
యంతిక సీమకిప్పుడు దశాస్యుడు వచ్చును భిక్షురూపియై
యెంతయు నాహరించునిను నింతయు నిశ్చయమౌట గావునన్ 269

కం॥ నీయాకారంబుగ నీ
ఛాయను గావించి పర్ణశాల నిలుపుమా!
నాయాజ్ఞ నదృశ్యాకృతి
నాయగ్ని వసింపు వత్సరాంతరమీవున్ 270

తే.గీ. రావణ వధాంతరమున బూర్వపు విధమున
నన్ను జెందెదవనిన జానకియు నట్ల

జేసి బైటమాయా సీత జేర్చిదాను
యంత నంతర్హితయునయ్యె నగ్నిలోను 271

కం॥ ఆ మాయాసీతయునపు
డామాయా మృగము జూచి యద్భుత వీచిన్
రామునితో నాత్మ సుఖా
రామునితో ననియె నయముబ్రణయము దోపన్ 272

ఆ.వె. కనక మృగమును చిత్రంబు గనకదీని
గాంచుమతి నిర్భయముగ జరించుదాని
బొమ్ము క్రీడామృగమ్ముగా బూని తెమ్ము
యెన్ని విధములదీని నాకిమ్ము రామ 273

కం॥ అనినన్ మృగముల ఛాయలు
దనుజుల మాయలును గలవు దగనిందనినన్
విని సీత నీకసాధ్యం
బనగలదే! యేమియైన నగుగాక నికన్ 274

చ॥ ధనువు ధరించి యీయ కొనితమ్మునకిట్లనిపల్కు రాముడో
యనఘ! మృగంబుదెచ్చెద ధరాత్మజకిచ్చెద గాచియుండుమా
జనితధృతిన్ మదాత్మహిత సాధ్విన నిందిత సీతమాయచే
నెనయుదురాశరుల్ బలియు రీవననీవని చెప్పివెండియున్ 275

కం॥ ఆరీతి ననిన లక్ష్మణు
డారాముం గాంచి పలికె నగ్రజమృగమౌ
మారీచుండీనీచుం
డీరీతి మృగంబు గలదె యెందు నిజముగాన్ 276

కం॥ అనిన రఘువీరుడిట్లను
దనుజుండేనియు వధింతు తగుమృగమేనిన్
గొనివత్తు వనితకిత్తున్
బనిపడి రక్షించు సీత భ్రాతాయనుచున్ 277

ఆ.వె. మహిజ మానసహిత మార్గంబు సలుపగా
మహిజమాన సహిత మార్గమునను
మృగము వెంటనరుగుమేదినీశుడు యజ్ఞ
మృగమువెంటనరుగు నీశుబోలె 278

సీ॥ అఖిల మోహినియైన నామాయకాశ్రమ
మయ్యును దామాయ నాశ్రయించె
నిర్వికారుండయ్యు నిర్గుణుండయ్యును
బడిబడి మృగము వెంబడినదిరిగె
భక్తానుకంపియై భగవంతుడనుసూక్తి
నిజముగా సీతేచ్ఛ నెరపబూనె
యెరుకల కెల్లను యెరుకయౌట నెరింగి
నట్లనెదన్మార్గ మనుసరించె

తే.గీ. గాక సర్వజ్ఞుడును నిర్వికల్పుడాత్మ
ధాముడగు బూర్ణ కాముడౌ రామునకును
జాయతో నేమియట మృగచ్ఛాయతోటి
మాయతో నేమి యెద్దియే మాయనేమి 279

వ॥ తదనంతరంబున 280

కం॥ ఒక పరిగనుపడు గనుపడ
దొకపది దవ్వరుగు తిరుగునురుకున్ దొరుకున్
నికటంబుగ మృగమీగతి
వికటంబుగ విభుని దూర విపినము బరపెన్ 281

తే.గీ. అంత రాముడు రాక్షసుండని యెరింగి
శరమునను వ్రేయ మృగరూప ధరుని వాని
నపుడు మారీచుడును రక్తమాననమున
దొరుగ తత్పూర్వరూపంబు తోడ బడుచు 282

కం॥ హా లక్ష్మణ! దృఢతరబా
హా లక్షణ! బ్రోవుమన్ను హతుడనునైతిన్
జాల ననుచు రామవచో
లీల ననుచు నసురకొండలీలన్ గూలెన్ 283

తే.గీ. అటుల దశకంఠుడనుపగా నరుగు దెంచు
నతని మారీచు వంచనా హరిణవేషు
తల్లితాటక బాయు సంతాపముడుప
తల్లి కడకందె రాముడౌ ధర్మమేది 284

సీ॥ ఎరుగనివాడైన నెవ్వానినామంబు
మరణకాలమున సంస్మరణసేయ
నతని సామ్యము నందు నన్నచో నెదురుగా
నాహరి జూచుచు నతని చేత
హతుడైన యతని భాగ్యంబేమి వచియింప
నాదైత్యుదేహంబునందు వెడలు
భూరి తేజము సర్వభువనముల్ గనుచుండ
శ్రీరామునెడ బ్రవేశింపగాంచి

తే.గీ. పాతకియు సాధుమునిలోక ఘాతకియును
నసురదుష్టాత్ముడిటు పరమాత్మజెందె
నేమి కర్మంబు జేసివీడేమియయ్యె
ననుచు కడు విస్మయము నొందిరమరులపుడు 285

వ॥ అదియునుం గాక 286

మ॥ మునురామాశుగవిద్ధుడై యపుడు రామున్ సంస్కృతిన్ జేయుచున్
మొనయన్ భీతి గృహాది సర్వధనమున్ బోనాడి రాముందనం
తన జింతింపుచు ధూత పాపుడయి యంతన్ రాముచే దేహమున్
జనవీడే హరిజెందె రాముమహిమల్జర్చింపగాశక్యమే! 287

తే.గీ. అవని సురలేని యరులేని యసురులేని
పాపియేనియు ధర్మస్వరూపియేని
రాముజింతింపుచు కళేభరంబు విడువ
పరమ పదమబ్బు ననిసురల్ బలికిచనిరి 288

ఉ॥ అంతట రాముడిట్లని హృదంతర సీమదలంచె రాక్షసుం
డంతమునన్మదుక్తిగతి హాయని లక్ష్మణయంచు బల్కెన
త్యంత మహారవంబునను దానికి జానకియున్మదర్థమై
చింతయొనర్చునో యనుచు చింతిలి దానును వచ్చుచున్నెడన్ 289

కం॥ ఆలోవినితద్భాషిత
మాలోలత సీత భీతయై యిట్లను దా
నాలక్ష్మణుతో లక్ష్మణ
హా లక్ష్మణయనుచు వచనమదివింటివెకా! 290

తే.గీ. భ్రాత సౌమిత్రి నేడు నీభ్రాతయసుర
పీడితుండయ్యె గాబోలు పే రెలుంగు
తోడ నిను జీరె వెసబొమ్ముతోడి తెమ్ము
బతి ననుచు దుఃఖపడు సీత కతడు బలికె 291

శా॥ అమ్మా! రాముని మాటగాదదియు దేవారాతియెవ్వాడొ బ్రా
ణమ్ముల్ వీడుచునిట్లు బల్కెను జగన్నాథుండు రాముండుగో
పమ్ముంబూనిన యంతలోక చయముల్ భస్మంబులౌ గానదై
న్యమ్ముందోపగ బల్కునే సురసుతుండాధ్యుండు సామాన్యుడే! 292

వ॥ కావున నవ్విభుండెవ్వారికేని నసాధ్యుండు నీవు స్వస్థచిత్తవై యుండుమనిన యద్దేవియుకోపోద్దీపిత చిత్తయై యశ్రుమిశ్రిత చిత్తయునై శ్రోత్రశూలంబులగు వాక్యజాలంబుల హృదయమ్మరంది పడ నమ్మరంది కిట్లనెయె 293

సీ॥ సౌమిత్రి దుర్బుద్ధి సంగతినుండితే
భ్రాతృవ్యసన వాంఛచేత నీవు
భ్రాతృనాశన కాంక్షిభరతుండు బనిచెనే
యీవిధి రాముడు బోవుటెరిగి
ననుగొనిపోయెద ననియదోనీదుచే
బడుదునే ప్రాణముల్ విడుతుగాక
యీరీతి భార్యాపహారియౌ టెరుగడు
నిన్ను రాముడు నమ్మినిలిపె నింక

తే.గీ. రాఘవుని కన్న నన్యుకరంబునంట
నిన్ననేనియు భరతునేనియు నటంచు
మోదుకొనుచును కరముల ఖేదమునను
సీతగని యా తగని మాట చెవిని నాట 294

చ॥ శ్రుతులకు దూరమౌపలుకు చేష్టవినన్ దగదంచు మూయుచున్
శ్రుతులకు దూరకుండ పరిశుద్ధుని నన్నిటులంటి చండినీ
యతి దురితోక్తి నన్నలము నంటెదవంచని కుందివన్యదే
వతలను సాక్షి బెట్టి రఘువర్యుని జూడ నతండు బోయినన్ 295

- సీతాపహరణము -

వ॥ అంతనంతరం బెరింగి దశకంధరుండును మునివేషధరుండై దండకమండలు కరుండగుచు నరుగుదెంచినన్ గాంచి నిజంబ యతని యతినింగా దలంచి ధరిత్రీజాత భక్తి చేత బూజించి కందమూల ఫలాదులు సమర్పించి దీని భుజించి విశ్రమింపుడని వెండియు నిట్లనియె 296

చం॥ అరయగ మీరుపుణ్య జనులట్టి మిముంగని ముక్తదేహతన్
బరగు జనంబునిప్పుడిదె మత్పతివచ్చు యధాసుఖంబుగా
నెరపుచుమీ మహాప్రియము నెమ్మి నొనర్చునభీష్టమేని యి
త్తరివసియించి యుండుడన తత్కుహనాయతి సీతతోడుతన్ 297

వ॥ మరియునుందద్వచనంబులు వినంగోరదలంచి యిట్లనియె 298

కం॥ ఎవ్వనిసుత వెవ్వెని సతి
నివ్వని దితి సుతనిషేవ్య మేలానిలువన్
జవ్వని! వచింపుమింతయు
నివ్వల మద్భుత్తమంత నేవచింయితున్ 299

చ॥ అన విన సీతయిట్లనియెనా జనకాధిప పుత్రినే నయో
ధ్యనుగల రాజగున్ దశరథాధిపుడావిభునగ్రపుత్రుడై
దనరిన సర్వముఖ్యగుణధాముని రాముని ధర్మపత్నినౌ
ననుజుడు భ్రాతవత్సలుడు నాయనకుందగు లక్ష్మణుండనన్ 300

తే.గీ. గురులయనుమతి దండకాధరవసింప
వచ్చితిమిమేము పదునాల్గు వత్సరములు
నిను నెరుగ గోరుదాన నేననిన సతికి
దెలియ మునివేషియనిమిష ద్వేషి పలికె 301

చం॥ విను పౌలస్త్య సుతుండ పంక్తిముఖుడన్వి ఖ్యాతుడ న్రావణుం
డనుపేరన్ భవదీయ కామపరితప్తాంగుండనై వచ్చితిన్
గొనిపోవన్మని భావమూని వినురక్షో నాథుడన్రాముచే
వనవాసార్తుని చేత నీకునికనే వాంఛల్ఫలించున్ జెలీ! 302

కం॥ త్యజియింపుము వన ఖేదము
భజియింపుము నన్ను సకల భాగ్యములెల్లన్
భుజియింపుము ననుగాముకు
ని జయింపుము భోగభంగి నీవు శుభాంగీ! 303

సీ॥ అనిన తద్వచనంబువిని సీతభీతయై
యనువానికిట్లు నన్ననియదేని
నాశమొందుదు రఘునాథుని చేనిందు
క్షణముండు వచ్చు లక్ష్మణుడు నతడు
ననునెవ్వడు కటూక్తి ననశక్తుడగు సింహ
తరుణిని శశకంబు కరణిధరణి
పృథురామబాణనిర్భిన్న దేహుండవై
పడియె దవీవన పంక్తివదను

తే.గీ. డధికతర కోపమును జూపనాత్మరూప
మచల నిభము వింశద్భుజంబట దశాస్య
మసిత ఘనరోచియై తోచినపుడు జూచి
భూతములు వనదేవతల్ భీతి పడిరి 304

వ॥ అప్పుడప్పంక్తి కంఠుండునకుంఠుండై నిఖిల భువనభయావహంబగు నిజదేహంబునం బ్రళయకాల బంధురాంధకారంబు ననుకరించు నీలప్రభాకారంబు కాంతారంబు నాక్రమింప భూసుతాసమీపంబు నకు వచ్చి రాముండు వైకుంఠధాముండనియును తజ్జాయ మహామాయ యనియును వినియుండు న్గావున నప్పర సతిన్గర స్పర్శంబు చేసిన నిపుడ భస్మంబగుదు వనుచు భయంబున 305

తే.గీ. అసుర నఖముల బెకలించి యవనినుద్ధ
రించి భుజములచేత భరించి రథము
నందు సతిగూడ నుంచి రయంబుమించి
యంబరంబున కరిగె నయ్యవసరమున 306

కం॥ మేదినిసుతకడు దీనత
మేదిని గనుచున్ భయభ్రమిత వాదినియై
హా దేవర! రఘుకులవర!
హా దేవరలక్ష్మణా! యటంచున్మరియున్ 307

కం॥ వనదేవతలార! ననున్
ఘనదేవత లార! వచ్చి కావరె! యటవీ
జనులారా! మునులారా!
ఘనులారా! యనుచు సీత కడభీతయునై 308

చం॥ ధృతినచలాత్ముడౌ జనకునింట జనించి సతీసమాఖ్యనై
హితమతి సంగతిన్ దశరథేశ్వరు కోడలనై సువాణినై

స్తుతమతి రామ శౌరికి వధూమణినై మరిపద్మపాణినై
క్షితినుదయించుదాన నను జేరి త్రిమూర్తులు బ్రోవరే దయన్! 309

వ॥ అనియిట్లు విలపించుచు నరుగుదెంచు జనకతనూజన్గాంచి ఖరన ఖరతుండ మహోద్దండకాయుండగు జటాయుండను యొక్క పక్షివ రుండాక్షణంబున నిజపక్ష విక్షేపంబు దిశాక్షోభం బొనరింప నగాగ్రంబు నుండి శీఘ్రుంబున నెగసి యసురువరు న్గదిసి దురాత్మా! యధ్వరతంత్రంబున నుండి మంత్ర పూతంబైన దేవతోద్దేశంబగు పురోడాశంబును హీనంబగు శ్వానంబునుం బోలె శూన్యంబగు నరణ్యంబున నుండియార్యయగు రఘువర్యు భార్య నావహించి నాముందర నెందరిగెదు నిలునిలుమని యాగ్రహించి పోకుండ నిగ్రహించి యడ్డంబువచ్చి నఖంబుల వ్రచ్చియు ముఖంబున గ్రుచ్చియు వాని యంగాంగంబుల నొంచియు రథావయంబుల ద్రుంచియు పక్షమహానిలంబుగప్పి తద్రథంబుజిరజిరం ద్రిప్పి సాహసంబున మహోట్టహాసంబు చేసిన 310

కం॥ దశముఖుడును రోషానల
వశముఖుడై డాసిపక్షి వరువ్రేసి మహా
నిశితములగు సశిఖంబుల
విశిఖంబుల నవయవములు విశసించెవెసన్ 311

వ॥ మరియు నయ్యసుర వల్లభుండు భల్లప్రాసకుంతతోమరశరపరంపరల న్బరపి పక్షి వరు కక్షంబులు బొడిచియు పక్షంబులు నొడిచియు పుచ్ఛంబుగేడించియు వక్షంబు వాడించియు పదాంచలంబు నొంచియు చంచువుజించియు గలంచినన్ జలింపకకోపించి పక్షికులాధ్యక్షుండును నారాక్షసాధ్యక్షు లక్షించి పక్షపుచ్ఛ నఖముఖర చరణాదుల విదళించి రణాటోపంబు జూపిన నంత నొచ్చియుం జెచ్చెర పరస్పరంబు బట్టుచు నితరేతరంబు గొట్టుచు నన్యోన్యంబు జీరుచున్ బోరుచున్నయపుడ నప్పుడప్పతంగ పుంగవుండుప్పరంబున కున్గుప్పించి రావణు రథ్యంబుల నడంచి సారధింద్రుంచియు శతాంగంబు భంగంబుగా తుండంబునం జూర్ణంబు గావించి యుపాదంబుల న్గోదండంబు ఖండించిననంత 312

శా॥ కాంతారత్నము భూమిడించి పలభుక్కాంతుండునున్ గ్రోధసం
క్రాంతుండౌచు కరాసిచే నతని పక్షచ్ఛేదముంజేయుచో
చెంతన్ గూలిపడెన్ జటాయువును కించిద్యోత హృద్వాయుడై
యంతన్ సీతను గొంచువాడరిగె నన్యస్యందనారూఢుడై 313

తే.గీ. అంత జానకి రక్షకులనగలేక
రామ! నీరామ విడిపింప రావెయనుచు
లక్ష్మణా! వాక్కురములనలంచితేను
నిన్ను నపరాధమోర్చి మన్నించు మనఘ! 314

కం॥ రఘువీరా! యను లక్ష్మణ
యఘదూరా! యను కటూక్తి నన్నది నిన్నున్
లఘు వౌరాయను తత్ఫల
మఘమీ రాకున్నెయనుచు నాక్రోసించున్ 315

వ॥ మరియు నిట్లుపరిదేవించునద్దేవిందోకొని రావణుండును రామగమన భయంబున బవనరయంబున నంబరంబునన్ జను నవసరంబున నవ్వధూమణియథోముఖియై యుండునంత 316

తే.గీ. పర్వతంబున వానర పంచకంబు
గాంచి తనయుత్తరీయంబు చించిదాన
వివిధ భూషణములు గట్టి వైచి పెట్టె
విభునకును జెప్పెదరు గాక వీరలనుచు 317

ఉ॥ అంతట దైత్యకాంతుడు సురాదివిరోధి సరోధిదాటి య
త్యంత విభాకలంకను శుభాంకనులంక నశోకకాననా
భ్యంతర సీమలో నిలిపె నాసురకాంతలు గాచియుండగా
సంతతపూత సాధుగుణజాతనునాక్షితి జాతనెంతయున్ 318

కం॥ విననీక లోకనికరము
గననీక ననీకములను గావలినిడిలో
జననీక నేరినేనియు
జననీమతి నతడు లోక జననిం బ్రోచెన్ 319

తే.గీ. కృశయు నతిదీన పరికర్మహీన శోక
శుష్యదానవ వికృతయై సుమతి సీత
రామరామ యటంచు నిర్భరవిలాస
యగుచునుండెను దనుజ కాంతాంతరమున 320

శా॥ అంతన్ రాముడు కామరూపమృగమాయారోచి మారీచున
ట్లైంతేద్రుంచి నిజాశ్రయంబునకునై యేతెంచుచో లక్ష్మణుం
డంతన్ శుష్కముఖుండు దైన్యకలితుండై వచ్చుచో గాంచి లో
జింతం జేసెమతిన్మహా మతి రఘు శ్రీమంతుడిట్లైంతయున్ 321

సీ॥ ఎరుగడు లక్ష్మణుండీరీతి మత్కృత
యైన మాయా సీత నవనిజాత
నేనెరుంగుదునైన నితని వంచింపగా
దుఃఖింతునిక బ్రాకృతుని విధాన

వైరాగ్యగతి నేను నూరకుండితినేని
నిటదైత్యనయ వధంబెట్లు గలుగు
కాముకురీతి శోకంబు జెందితినేని
ధరణిజ వెదుకుచు తత్క్రమమున

తే.గీ. నంబునిధి మీరిలంకాపురంబు జేరి
వరుసదనుజుల ద్రుంచి రావణు వధించి
యనలముననుంచి నట్టి సీతనుగ్రహించి
యంతనరుదెంతు సాకేతమధిగమింతు 322

ఉ॥ నేను మనుష్య భావమున నీరజగర్భుడు వేడగల్గితిన్
మానుష లీలగొన్ని దిన మానములుర్వివసింతుగాన మా
యా నరమూర్తితో వెలయునట్టి మదీయకథల్ పఠించినన్
వీనుల విన్నభక్తులకు నిక్కము ముక్తియగున్ సుఖస్థితిన్ 323

వ॥ అని నిశ్చయించి మాయా ప్రభావంబు విడంబించువాడై రఘువరుం డును తనకెదురుగా వచ్చుచున్న
లక్ష్మణునింగనుంగొని 324

కం॥ ఏలా వచ్చితి లక్ష్మణ?
యీలాగున విడిచి ప్రాణహిత మత్సీతన్
బాలిక హృతయో హతయో
హాళిక నసుహరులచేత నసురుల చేతన్ 325

మ॥ అనినన్ లక్ష్మణుడన్న గాంచి పలికెన్ హా లక్ష్మణా! యన్న య
ద్ధను జోక్తిన్ విని నాతిభీతిలి భవద్వాక్యంబెయంచున్ననున్
గని పొమ్మన్నను నేను మీవచనమున్ గాదన్న యెన్నేనిన
న్ననియెన్ దుర్వచనంబులన్నియు నవాచ్యంబుల్ భవత్సన్నిధిన్ 326

తే.గీ. కానవినినోడి చాననక్కానవీడి
గానవచ్చితి మిమ్ము వేగాన ననిన
రాముడిట్లను నేమైన రాగదగునె
స్త్రీల మాటలు సత్యంబు జేసినీవు 327

కం॥ భక్షించిరొ!యపహృతగా
లక్షించిరొ! జనక తనుజలఘుగతి ననుజా
రాక్షసులని రఘువంశా
ధ్యక్షుడు చింతానుకృతి విధాలక్ష్యుండై 328

తే.గీ. ఆశ్రమమునకు నేతెంచి యాశ్రమమున
గిరుల తరులను దరులను జరుల ఝురుల
ననుజుతో రాముడా భూమితనుజ వెతకి
బహు దురాపవిలాపతాపముల నెనసి 329

కం॥ హరిమధ్యయు కరిగమనయు
హరిణాక్షియు చక్రకుచయు నళివేణియునున్
హరివాణి యగుట ధరణిజ
యరయగ నీయటవినెచటి కరిగెనొయనుచున్ 330

కం॥ మానిని నన్ను భ్రమింపక
మాని నిజస్థితిని నిలువుమా! నీవనుచున్
పూనిక జానకి గానక
దీన కలిత సూక్తి విపిన దేవతలననున్ 331

కం॥ మాయను బన్నితివే! మృగ
మా! యను సతిజూపు దైవమా! యనుహా భా
మా! యను నిను బాయగ తర
మా! యను మద్భాగ్యకృతరమా! యను మరియున్ 332

సుగంధి వృత్తము –

బాలికాలలామ గానవావిలోల మాలతీ!
జాలమావిశాలమార సాలమా రసాలమా!
తాలమా తమాలమా సతాలమానసాలమా!
రాళమా వరాళమా యరాళమా మరాళమా! 333

సీ॥ హరులార! హరులార! హరులార! కానరే!
మావధూటికి సాటి మావధూటి
దరులార! దరులార! దరులార! కానరే!
మావధూటికి సాటి మావధూటి
హరులార! హరులార! హరులార! కానరే!
మావధూటికి సాటి మావధూటి
గిరులార! గిరులార! గిరులార! కానరే!
మావధూటికి సాటి మావధూటి

తే.గీ. వనములార! వనములార! వనములార!
తపసులార! తపసులార! తపసులార!
గానరే వాసరములోమి గానరేమి
మావధూటికి మరిసాటి మావధూటి 334

వ॥ వెండియు 335

సీ॥ భ్రమరంబు చూపవే! భ్రమర సన్నిభవేణి
కమలంబ చూపవే! కమల వదన
కనకంబ చూపవే! కనక కోరకనాస
హరిణంబ చూపవే! హరిణనయన
బింబంబచూపవే! బింబారుణాధర
క్రముకంబ కానవే క్రముక కంఠి
వల్లరి చూపవే! వల్లరి సమబాహు
చక్రంబ చూపవే! చక్రకుచను

తే.గీ. గగన దేశంబ చూపవే! గగనమధ్య
భూమి భాగంబ చూపవే! భూనితంబ
కిసల జాలంబచూపవే కిసల చరణ
ననుచు సీతను వెతికె నయ్యవని నేత 336

వ॥ ఇట్లు రఘూద్వహుండు జగన్మోహకుండై విహరించియంత 337

సీ॥ సర్వజ్ఞుడయ్యును సర్వదృక్కునునయ్యు
కానలో జానకి గానడయ్యె
పరమనిత్యానంద పరిపూర్ణుడయ్యును
సీతా విరహశోకభూతుడయ్యె
నిశ్చలుండయ్యును నిరతస్థితుండయ్యు
నింతికై కాననంబంతదిరిగె
నిరహంతకుండయ్యు నిర్మముండయ్యును
మద్భార్యయని మోహమగ్నుడయ్యె

తే.గీ. నేమిటనశక్తుడైనట్టి రామమూర్తి
యాత్మసంబంధమైన మాయానువృత్తి
నజ్ఞ జనుల కాసక్తునియట్లదోచె
తాత్వికుల కిట్లు దోపడు తద్విభుండు 338

వ॥ అంతనవ్విధంబున నవ్వనంబున ననుజ సహితుండై యినకుల పతి తన కులసతి వెదకుచున్ జనునెడ భిన్నంబగు రథంబు ఛిన్నంబగు చాపంబునుంగూలిన హయనికరంబును వ్రీలిన రథకూబరంబునున్ గని లక్ష్మణున కిట్లనియె 339

కం॥ కనుమనుజ జనక తనుజం
గొని చనునొక డతని గెలిచి కొండొకడుసతిన్
గొని చనదగు ననియంతం
జనకాంతుడు కొంతమేర జని చనియచటన్ 340

- జటాయువు మోక్షణము -

చం॥ అతిరుధిరాత్త కాయు నచలాకృతి మేయు జటాయువున్ సమా
గత నికటాయువున్ బుడమిగన్గొని వీడు సతిన్ భుజించిదృ
ప్తత శయనించినాడు మరు బాణ శరాసములిమ్ము లక్ష్మణా!
యితని వధింతు నానృపతి కిట్లనుభీతి ననూరసూతియున్ 341

సీ॥ అధిప! నీకును శుభంబగు వధింపకు కర్మ
సరణినంతిమ దశాసరణి నన్ను
నేను జటాయుండ నీభార్యను హరించు
రావణు వెసడాసి రణము జేసి
తద్బాహువుల నొంచి తద్రథంబునుద్రుంచి
వాని ఖడ్గాహతి వసుధ బడితి
నసువులు బాసెద నఖిలేశ! నను జూడు
మనిన రాముడు దీనునతని గాంచి

తే.గీ. కరముల స్పృశించి దుఃఖాశ్రు కలితుడగుచు
నెవ్వడు హరించె మద్భార్య నెరుగ జెప్పు
పతగ వర్యమదర్ధమై హతుడవైతి
వగుట మత్ప్రియ బంధుండవగుదు వనిన 342

వ॥ అంతశకుంతవరుండును రఘువరుం గూర్చి ముఖంబు ముఖంబునన్ జేర్చి సూక్ష్మరవంబున మహాత్మా! భీమ విక్రముండగు దశముఖుండను దానవుండు జానకిన్ గొని దక్షిణాభిముఖుండై చనియెనని చెప్పియింక చెప్పనోపభవత్సన్నిధానంబున బ్రాణంబులన్బాసెద నిట్టి నాకు దైవవశంబున భవద్దర్శనంబు సంభవించెదానం గృతార్థుండనైతి నని వెండియు 343

తే.గీ. హరివి మాయా నరాకృతి వాత్మమూర్తి
వైన నిను నంత్యగాలంబునందు గంటి

ముక్తుడనునైతి కరముల ముట్టు నన్ను
నిక భవత్పదమందెద నేను రామ! 344

కం॥ అనినన్ రఘువరుడగుగా
కని దయ దత్తనువునందు హస్తస్పర్శం
బొనరింపనాజటాయువు
దనరగత ప్రాణుడగుచు తనువున్ వీడెన్ 345

వ॥ అప్పుడప్పతగపతి నాలోకించి హితబంధువునింబలె శోకించి రాఘవుండు లక్ష్మణయుతుండై పక్షివరునిధనంబులచే దహించి శుచిస్నానంబు గావించి వన్యంబగు మృగంబును ఖండించి తన్మాంసంబుశాద్వల స్థలంబున ప్రత్యేక భాగంబులుగా నుంచి సకల పక్షిగణంబులు భక్షింపుడు పక్షివిభుండగు నితండని నవ్విభుండు జటాయువునుద్దేశించి నామంబునన్ బిలిచి యితండు దృప్తుండగు గాక యని యవ్విభుండు ఖగేంద్రా! యిపుడు మత్పదంబు జెందు మత్సారూప్యంబందుమని యానతిచ్చిన 346

సీ॥ అనునాక్షణంబున నఖిల లోకంబులు
గనుచుండ దివ్యవిగ్రహము బూని
భాను సన్నిభ విభా భాసమానంబగు
మహనీయ దివ్య విమాన మెక్కి
శంఖ పద్మ గదాసి చక్ర కిరీటాది
వరభూషణ ప్రభావ్యాప్తి నెరయ
హరిపారిషదులు నల్వురును తాదృశులును
నర్చింప పీతాంబరాంచితుడయి

తే.గీ. మౌని సురగణ సంస్తూయమానుడగుచు
నతని గూరిచి భాషించినతిఘటించి
యర్పితాంజలిపుటుడై జటాయువపుడు
హరిని రాముని యిట్లని యభినుతించె 347

మణికర వృత్తాష్టకము -

౧ అగణిత సద్గుణు నప్రమేయు నాద్యున్
జగదుదయ స్థితి సంయమాదిహేతున్
సుగత శమైక రసున్ బరాత్మ భూతున్
దగు దశరథ రాము సదామదిన్ భజింతున్ 348

౨ నిరవధి సౌఖ్యఖనిన్ రమాకటాక్ష
క్షురిత సురేశ్వర కంజజాది దుఃఖున్
బరుని కృపాణక బాణ చాపపాణిన్
నరవరు రామును నాము నేనుతింతున్ 349

౩ వరభువన త్రయవంద్యు సుందరాంగున్
తరణి శతద్యుతి ధాము సుప్రభావున్
శరణదు సంతత సారవృక్షమూల
స్థిరనిలయున్ రఘుశేఖరున్ దలంతున్ 350

౪ భవవనదావక పావక ప్రభావున్
భవముఖ దేవు కృపాపరస్వభావున్
భవహరుదానవ పంక్తికోటి జైత్రున్
రవి శశినేత్రుని రామునిన్ గణింతున్ 351

౫ భవరతి భావన భావదూరభావ్యున్
భవవిముఖార్య తపస్వి చింతనీయున్
భవజలధిప్లవ భావదీయ పాద
ప్రవణుహరిన్ రఘుభర్త నాశ్రయింతున్ 352

౬ హరగిరిజా హృదయాబ్జ సన్నివేశున్
గిరివరధారణు కేవలున్ సురేశున్
చరణనతామరు సాధుమానవేంద్రున్
శరణమునందెద శౌరి రామచంద్రున్ 353

౭ పరవనితాధన భావవర్జితాత్మున్
పరగుణ భూషణ భావతోషితాత్మున్
పరహిత వృత్తులు భక్తిసేవసేయున్
బరగు రఘూత్తము పద్మనేత్రునెంతున్ 354

౮ స్మితలసితాస్య కుశేశయాభిరాముస్
స్మృతి సులభున్ దివిజేంద్ర నీలధాముస్
శతదళపత్ర విశాలనేత్రు రాముస్
సతతము నీశ్వర సద్గురున్ భజింతున్ 355

వ॥ అని మరియును 356

తరల

హరివిరించి శివాది భేద విధాకృతుల్ ధరియించి నీ
వరయ నీగతి నీగుణత్రితయానువృత్తి చరింతువౌ
పరగనంబు ఘటంబు నందలి భానుడుంబలె నట్టినిన్
వరసురేంద్ర నిషేవ్యునిన్ రఘువర్యునింగని మ్రొక్కదన్ 357

సుకేసర వృత్తము

రతిపతి కోటి రూపరుచిరాభ విగ్రహున్
శ్రుతిపథ గోచరున్ కృతమనోనిగ్రహున్
యతిపతి చిత్త సద్మవసనాద్యనుగ్రహున్
క్షితిపతి రామమూర్తి నుతిసేతు సుగ్రహున్ 358

చం॥ అనియిటు సన్నుతించిన జటాయువు నందు బ్రసన్నుడై విభుం
డనియెను నీకు భద్రమగు నయ్యమదీయపదంబు నొందు నీ
వెనయ వచించు నీస్తవము నెవ్వడు విన్నపఠించినన్ లిఖిం
చిన నతడున్ నినుంబలెనుజెందు మదీయ సరూపభావమున్ 359

తే.గీ. అనినరాముని గురుసూక్తి నాలకించి
యతని మదినుంచి ధ్యానించి యతిశయించి
తెలివినించి యానందించి ద్విజవరుండు
బ్రహ్మపూజిత మైనట్టి పదము జెందె 360

– కబంధ మోక్షము –

కం॥ అంతట మరియును సీతా
కాంతాన్వేషణము సేసి గాసిలికాంతా
రాంతరమున దిరుగుచు రఘు
కాంతుడనుజుతోడ నొక్క కాననసీమన్ 361

ఉ॥ ఆక్షితి భర్త వక్షమున నాస్యము నద్భుత రూపమొప్పగా
నక్షిముఖాంగ వర్జితుడునై దగుయోజన బాహుచర్యునిన్
రాక్షసవర్యు నొక్కని దురంత వనాంతర జంతు సర్వతో
భక్షణకున్నిబంధుని కబంధు కబంధుని గాన్చెనత్తరిన్ 362

కం॥ ఈరీతి గాంచివారున్
దారిన్ దద్భాహుమధ్యతల దేశమునన్

చేరియుతద్భుజ వేష్టితు
లైరప్పుడు నవ్వి రాముడనుజున కనియెన్ 363

సీ॥ కనుము లక్ష్మణ వీనిఘనసత్వ రాక్షస
వరునురోముఖు శిరశ్చరణహీను
తన బాహువులకు జిక్కును నెద్దిదానిన
నొగివీడు భక్షింపుచుండు నిజము
మనము నేతద్బాహు మధ్య బద్ధులమైతి
మికపోవ ద్రోవ వేరొకటి లేదు
యేమిసేయగ నగునిద్దరమతనికి
భక్షణమైతి మిప్పటికి ననిన

తే.గీ. నన్నతోడుత లక్ష్మణుండధిప దీని
కేటికింత విచారాంశమిపుడు మనము
వీని ఘన బాహువులు ద్రుంచి వెడల గాంచి
భూమిజాతను వెదకంగ బోలు ననిన 364

కం॥ ఆక్షణమున రాముడు త
ద్దక్షిణమగు భుజము దునిమె తనఖడ్గముచే
దక్షిణుడగు లక్ష్మణుడును
దక్షిణమునకితరభుజము దానున్ దునిమెన్ 365

ఉ॥ ఆతరి దాన విస్మితుడునై యసురప్రవరుండు వారలన్
భ్రాతల రామలక్ష్మణుల బల్కెను మీరిటు మద్భుజాచ్ఛిదా
ద్యోతిత శౌర్యులెవ్వరు నరోత్తములో! దివిదేవమూర్తులో!
భ్రాతిగదెల్పుడన్న విని రాముడు నవ్వుచు వానికిట్లనున్ 366

శా॥ శ్రీమన్మార్తికయోధ్యలో దశరథోర్వీభర్తకున్ సూనుడన్
రామాఖ్యాతుడ లక్ష్మణుండితడగున్ మద్భ్రాత తాతాజ్ఞచే
నేముంగాన వసించి వేటజన నెంతే మత్సతిన్ జానకిన్
భామన్ రాక్షసుడెవ్వడో గొనిచనన్ భార్యన్విచారింపగన్ 367

కం॥ వచ్చితిమి నీ భుజావృతి
జొచ్చితి మిటు మేము వెడలు చొప్పుగ నిన్నున్
వ్రచ్చితిమి నీబలంబున్
బుచ్చితి మెవ్వడవు వికృత మూర్తివి నీవున్ 368

వ॥ అనిన కబంధుండిట్లనియె 369

మ॥ అనఘా! రాముడవీవు రానిటకునే నత్యంత ధన్యుండనై
తిని గంధర్వవరుండ పూర్వమున నెంతే యౌవనాఖర్వగ
ర్వ నిరూఢిన్ యువతీ ప్రియుండను జగద్వ్యాపారినంచున్ దపం
బనువందన్విధిలబ్ధమై దగునవధ్యత్వంబునన్మించుచున్ 370

కం॥ శిష్టావక్ర చరిత్రుని
యష్టావక్ర ముని గాంచి యటనేనుమదిన్
దుష్టానుగతి తదాకృతి
దృష్టాయతమాత్ర నవ్వితిన్ గర్వమతిన్ 371

తే.గీ. దానికిని గోప మూని యమ్మౌని వరుడు
దానవుండవుగమ్మన్న దాననేను
ప్రార్థన మొనర్పమరి శాంతి పరతనతడు
దయను శాపాంతము వచింపదలచి పలికె 372

కం॥ త్రేతాయుగమున దశరథ
జాతుండై వచ్చి హరివెసన్ నీ చేతుల్
ఘాతములు సేయ నీకును
నాతరి శాపాంతమై యథాకృతి గలుగున్ 373

చం॥ అని శపియింప నేను దనుజాకృతినై యొకనాడు శక్రునిన్
గనిగవయంగ నాతడలుకన్ ననువజ్రము చేత మౌళిపై
గొనిన శిరంబు పాదములు గుక్షి నడంగెను వజ్ర ఘాతచే
ననయము మృత్యువున్ జనకదయ్యెను బ్రహ్మవరంబు పెంపునన్ 374

వ॥ అంతనందరున్దయ చేత నన్నున్ గని ముఖాభావంబున వీడెట్లు జీవించుననిన దేవవరుండును వీనికి నుదరంబున వదనంబు యోజనాయతంబగు బాహుద్వితయంబును గలుగునని వచించిన తాదృశభుజంబుల చేతం బ్రాప్తంబులగు సత్వంబుల భక్షింపుచు నుండితి నట్టి కరంబులు ఖండితంబులయ్యె నింకదన్ను నగ్నినిధన యుక్తంబగు గర్తంబునవైచిన కబంధకదేహంబునుం బాసి దివ్యంబగు పూర్వరూపంబు దాల్చి భవద్భార్యా మార్గంబు వచించెదననిన నవ్విభుండు ననుజుని చేత నద్దనుజు నావిధంబున న్గావించిన 375

ఉ॥ అంతట వానియంగమున నంగజతుల్యుడనేక భూషణా
క్రాంతుడు దివ్యుడొక్కరుడు గన్పడియంజలి సంఘటించియ
త్యంతము రామమూర్తికిని సాంగనమస్కృతి సప్రదక్షిణం
బెంతయు జేసి భక్తిమెయి నిట్లనిపల్కెను గద్గదోక్తులన్ 376

సీ॥ అఖిలేశ! నీవనాద్యంతుండ వౌటచే
వాఙ్మన సాగమ్య వర్తనుడవు
నైనను నామనంబతి సంభ్రమమున ని
న్నొగి సన్నుతింపగా నుత్సహించు
ననఘ! నీరూప మవ్యక్తంబు సూక్ష్మంబు
జనుతనుత్రయ విలక్షణము నగుచు
నితరంబు దృశ్యమౌ నీసమస్తమనాత్మ
రూపంబు జడము మద్రూపమగును

తే.గీ. గాన విజ్ఞానసారు వికారదూరు
సచ్చిదానంద లక్ష్మణు సర్వసాక్షి
నఖిలమునకువిలక్షణుండైనవాని
నేమివిధమున మనసు నిన్నెరుగు రామ! 377

తే.గీ. అనఘ! బుధ్యాత్మ భావైక్యమగును జీవ
పదము బుధ్యాది సాక్షియే బ్రహ్మపదము
నిట్టి నిర్విషయంబైన యాత్మ యందు
నఖిల మారోపితంబునౌ నజ్ఞ వశత 378

కం॥ హైరణ్యగర్భ నామక
మారయ నీ సూక్ష్మ రూపమాస్థూలంబౌ
వైరాజము నీ సూక్ష్మ మ
హారూపము ధ్యానమంగళాంగము రామా! 379

ఉ॥ వెండియు భూత భవ్యము భవిష్యమునైన జగంబు నీదు బ్ర
హ్మాండమయంబు స్థూలమగు నంగమునంగను పట్టు నెద్ది దా
నండ గుణోత్తరాప్తి మహదాదిక సప్తసమావృతంబునై
యుండును నీవిరాట్తను వహో! యదిధారణకాశ్రయంబగున్ 380

వ॥ కావున మహానుభావా! నీవయీ సర్వస్వరూపంబవగుదు విట్టి బ్రహ్మాండమయం బగు నీవిరాడ్దేహంబునకు నీలోకంబులవ యవానేకంబులగు నందు పాతాళంబు నీకు పాదమూలంబు మహాతలంబు పార్ష్ణిభాగంబును రసాతలంబు గుల్ఫ దేశంబును తలాతలంబు జంఘాతలంబును, సుతలంబుజానువులును, వితలంబు నూరువులును, నతలంబు మధ్యంబును, మహీతలంబు జఘనంబును, నభంబును నాభియు జ్యోతిర్లోకంబు నురస్థలంబును మహర్లోకంబు కంఠంబునునశ్వనీ దేవతలు నాసికలును, ననలంబు వదనంబును, సూర్యుండునేత్రంబులును, చంద్రుండు మనంబును కాలంబు భ్రూభాగంబును, వాచస్పతి బుద్ధియును, రుద్రుం డహంకారంబును, ఛందో బృందంబు

వాక్యంబులును, యముండుదంష్ట్రాదేశంబును, నక్షత్రంబులు దంతపంక్తులును మోహకారిణి యగు మాయ హాసంబును సృష్టియపాంగ వీక్షణంబును ధర్మంబు బురోభాగంబును నధర్మంబు పశ్చాద్భాగంబునురాత్రి దివంబులు నిమేషోన్మేషంబులు, సప్త సముద్రంబు కుక్షి ప్రదేశంబును నదీ జాలంబు నాడీజాలంబును వృక్షౌషధంబులు రోమంబులును వర్షంబు రేతంబును జ్ఞానశక్తి నిజమహిమంబుగా నెసంగు నివిస్థూల శరీరంబగు నిట్టి స్థూలరూపంబు మనంబున ధారణావశంబున నిలిపి మననం బొనర్చు నతనికి ననాయాసంబున నీభక్తి సంభవించు వేరొండు విధంబునన్ గలుగదని విన్నవించివెండియు నిట్లనియె 381

తే.గీ. కాన రఘువర నీస్థూల కాయమేను
భావన యొనర్తు భావింప బడినదెద్ది
సపులకోద్గమహర్ష రసప్రసక్తి
దాననైనను ముక్తి విధంబె గలుగు 382

చ॥ అదియటు లుండనిమ్ము ధనురస్త్రకరంబును వల్కలాంబరా
స్పదము జటాధరంబు వనభాగచరంబు సలక్ష్మణంబునౌ
నిదియగు నీస్వరూపమును నిచ్చయొనర్తు భజింపగాన ము
క్తిదమగు దీన నామదినిదింగదియింపుము నీవు రాఘవా! 383

వ॥ అదియునుం గాక 384

సీ॥ శ్రీరామునకు మ్రొక్కు శీర్షంబు శీర్షంబు
సీతేశు కథలాను చెవులు చెవులు
ఖరవైరి నీక్షించు కన్నులు కన్నులు
రఘువీరు వర్ణించు రసన రసన
యసురారి బూజించు హస్తముల్ హస్తముల్
పరమాత్మునకు సేయు పనులు పనులు
హరిప్రదక్షిణమూను చరణముల్ చరణముల్
విష్ణు ప్రశంసించు విద్యవిద్య

తే.గీ. మనుజ సింహుని చింతించు మనసు మనసు
పురుషవర్యుని నెరిగెడు బుద్ధి బుద్ధి
భక్తవత్సలు మీదటి భక్తి భక్తి
ముక్తిదాయకు జేరెడి ముక్తి ముక్తి 385

కం॥ స్ఫురణంబులు నిత్య శుభా
చరణంబులు భక్తలోక శరణంబులు శ్రీ

కరణంబులు శ్రీరామ
స్మరణంబులు భవపయోధి సంతరణంబుల్ 386

వ॥ అట్లగుటం జేసి 387

శా॥ సర్వజ్ఞుండగు శంకరుండపుడు సాక్షాద్వారణాసిస్థలిన్
బార్వత్యన్వితుడౌచు నీదుఘనరూపధ్యానముంజేయుచున్
బర్వన్రామపదంబు తారకపరబ్రహ్మార్థ వాచ్యంబుదా
నుర్విన్ బ్రాణుల కంత్యవేళనుపదేశోత్సాహియై వర్తిలున్ 388

కం॥ కావున రఘుకులపావన
నీవును బరమాత్మ వగుదు నిజముగ మాయా
భావనచే నాత్ముడవే
నీవనుచును తత్త్వబుద్ధి నెరుగరు మూఢుల్ 389

తే.గీ. రామ! పరాత్మ! సాకేతధామ! లోక
భర్త! లక్ష్మణయుత! పరబ్రహ్మమూర్తి!
నీకు మ్రొక్కెద ననుబ్రోవు నీయమేయ
మాయ ననుగప్పకుండగా జేయు మీశ! 390

తే.గీ. అనిన శ్రీరాముడిట్లను నతనితోడ
దివ్య గంధర్వ నీదు భక్తి స్తుతులకు
హర్షమందితి యోగి గమ్యము పురాణ
మైన మత్పరమస్థానమందు నీవు 391

కం॥ నీవొనరించిన యాగమ
భావిత మీస్తవమనన్య భక్తిదలచువా
రావల గళితాజ్ఞాన భ
వావృతులై నన్ను గాంతురనుభవవేద్యున్ 392

- శబరి వృత్తాంతము -

మ॥ అన గంధ్వుడు నిట్లు లబ్ధవరుడై యంతన్ హరిన్ రామునిన్
బ్రణతుల్ జేయుచు బల్కెరాఘవ పురోభాగంబునందాశ్రమం
బున నీభక్తిధురీణయై శబరినా బోల్చున్ వెసన్ దత్తప
స్విని జేరంజన మీకు దత్సకలమున్ జెప్పున్యధా రీతిగన్ 393

కం॥ అని పల్కి మ్రొక్కి యినరుచి
దనరు విమానమున నతడు తద్విష్ణుపదం

బున కరిగెన్ బ్రమదమెల
ర్పను రామస్మరణకిట్టి ఫలమగు సుమ్మీ! 394

వ॥ అంతరఘువరుండివ్విధంబున నానావిధ భయంకరమృగఖగ భవనంబగు నవ్వనంబున నలసగమనం
బునన్ గడచి చని చని 395

కం॥ తరణి కులాగ్రణి గనియెన్
సరణిన్ సోదరునితోడ జాతాన్యోన్యా
దరకేసరిణీ కరిణీ
హరిణీముఖసరణి శబరి యాశ్రమధరణిన్ 396

వ॥ అయ్యవసరంబున 397

సీ॥ ఇంద్రనీల సమానసాంద్రద్యుతల తోడ
నరుణ జటాతటి ద్భరము తోడ
గంభీర భాషిత గర్జితంబుల తోడ
ఘనచాపమణి చాప కలనతోడ
కరుణారసామృత స్ఫురణానుగతి తోడ
వ్యాప్త కటాక్ష ధారాళి తోడ
సంశ్రిత సహజ లక్ష్మణ చాతకముతోడ
భవతాపహరణ వైభవము తోడ

తే.గీ. శ్రితమనోరథ సస్య సమృద్ధికరము
సారవిపినాంతరాంతర చరమునగుచు
వచ్చు శ్రీరామ ఘనమూర్తి నిచ్చగనియె
శబరి హర్షాంబువళి తాక్షి శఫరియగుచు 398

వ॥ ఇట్లు లక్ష్మణ సహితుండై వచ్చుచున్న రామునిన్గని దూరంబుననొంచి వేగంబ ప్రత్యుత్థానం బొనరించి
మొదలన్ దత్పదంబులకు నమస్కరించి హర్షపులకాంచితయై స్వాగతంబున నభినందించి శు
భపీఠంబుల నుంచి మధురాంబువుల దచ్చరణ ప్రక్షాళనంబు గావించి తజ్జలంబు భక్తిం జేసి
నిజాంగంబున నభిషేకించి యంత నత్యంతాదరంబున నర్ఘ్యాది విధులంబూజించి మరియును 399

తే.గీ. శబరి రామార్థమై మున్ను చవులు జూచి
యమర నేరిచి దాచిన యమృతవీచి
నెనయు ఫలములు దెచ్చి రామునకు నిచ్చె
భక్తితోడను మిగుల నాసక్తితోడ 400

కం॥ వరుస సుమగంధలేపము
లరయనొసగి పదములొత్తి యాతిథ్యంబున్
విరచించి శబరి సుస్థితి
హరి రాముని గూర్చి పలికె ప్రాంజలియగుచున్ 401

సీ॥ రామ! యీ యాశ్రమ సీమమద్గురువులు
ఋషులుత్తములు వసియించియుండ
నేవారి శుశ్రూష గావించుచో నంత
నమిత వత్సర సహస్రములు సనిన
తుదను వారలు బ్రహ్మ పదమున కరుగుచో
ననుగాంచి పలికిరి నెనరుమించి
దనుజ శిక్షణమును ముని రక్షణము సేయ
ధర పరమాత్ముండు దశరథునకు

తే.గీ. రాముడను పేర జన్మించి రాగలండు
గాన నిటనిల్వునిశ్చల ధ్యాన నిష్ఠ
చిత్ర కూటాద్రి నిపుడు వసించియున్న
వాడుగనుక నారాముడు వచ్చు దనుక 402

కం॥ వహియింపుము! తనువంతకు
సహియింపుము! రామభక్తి సవరింపుమిదిన్
గ్రహియింపు! మంత దేహము
దహియింపుము! జేరుమవల తత్పదమబలా! 403

కం॥ అని వారలనిరి గావున
విని నీరాకడకు ధ్యాన వివశతగంటిన్
కనుగొంటి నిన్ను సఫలత
గనగొంటిని గురుల సూక్తి కరుణామూర్తీ! 404

చ॥ నరవర! నీదు దర్శనము నాగురు వర్యులకైన లేదునే
నరతతి హీనజాతినగు నాతిని మూఢను నాకు నీశతో
త్తరగుణ దాసదాసులకుదాసినియౌనధికారమేనియున్
నెరయుదుగాన సన్నిధిని నీకెటు దాసిని గాగజాలుదున్ 405

ఆ.వె. అయిననాదు దృష్టి నధిగమించితి మనో
వాగగోచరుడవు యోగివర్తి

వప్రమేయ మూర్తి వగునిన్ను వర్ణింప
నెరుక నికనొనర్తు నెద్ది రామ! 406

వ॥ కావున ప్రసన్నుండవు గమ్మని సన్నుతించిన శబరినింగని తదీయంబగు భక్తిరసంబున కలరి రఘువరుం
డిట్లనియె 407

కం॥ స్త్రీ పురుషత్వ విశేషము
లేపున జాత్యాశ్రమములు హేతువులవిగా
వోపిక మద్భజనమునకు
ఖ్యాపితమద్భక్తి యొకటె కారణ మరయన్ 408

తే.గీ. వేద యజ్ఞ తపోదాన విధి ముఖముల
సుముఖుడను గానుమద్భక్తి విముఖులకును
గాన వచియింతు సంక్షేప గతిని నేను
శబరి విను వింక మద్భక్తి సాధనములు 409

సీ॥ సత్సంగతి ప్రధాన సాధనంబగు మత్క
థాకర్ణనము ద్వితీయంబునగును
నటతృతీయము మద్గుణావృత్తి మత్కథా
వ్యాఖ్యానమును చతుర్థాప్తి దనరు
సరవి మద్బుద్ధిచే సద్గురూపాస్తి పం
చమము యమాది సంసక్తివలన
పుణ్యశీలతను మత్పూజనా నిష్ఠ ష
ష్ఠము సాంగ మన్మంత్ర జపనిరతియు

తే.గీ. సప్తమంబగుమద్భక్త జనసపర్య
సర్వభూత సమతయును శమదమాది
కాప్తి బాహ్యార్థ వైరాగ్య మష్టమమగు
నాస్వరూపవిచారంబు నవమమగును 410

వ॥ కావున 411

తే.గీ. పురుషతతికైన సతికైన భూరిదురిత
మతికినైన తిర్యగ్యోని తతికినైన
శబరి యీ నవవిధ భక్తి సాధనములు
గలుగ నతిసక్తియగు భక్తి గలుగు సుమ్ము! 412

కం॥ ఇటు భక్తి గలిగినంతనె
తటుకున గలుగు న్మదీయ తత్త్వానుభవం
బటులనుభవ సిద్ధుడు సం
స్ఫుటగతి తజ్జన్మముననె ముక్తిం గాంచున్ 413

తే.గీ. కాన భక్తియె ముక్తికి కారణమగు
నందు మొదలిటి సాధనం బబ్బె నేని
యతడు గ్రమమున సర్వంబునధిగమించు
నగుట భక్తియె ముక్తియౌనది నిజంబు 414

కం॥ కావున భక్తి సమేతవు
గావున వచ్చితిని నిన్ను గన ననుగనుటన్
గేవల ముక్తిం జెందెదు
నీవును నిస్సంశయముగ నిర్మల చరితా! 415

వ॥ అని చెప్పి యింక బ్రస్తుతంబగు కార్యంబు నెరుంగించెదనని
రఘుపుంగవుండిట్లనియె 416

కం॥ కర మెరిగితేని చెపుమా!
ధరణిసుత మదీయ ప్రాణదయిత నిచటనె
వ్వరు గొని చని రెందున్నది
సరసిజ దృశ నీలకబరి శబరీ వినుమా! 417

సీ॥ అనినను శబరి యిట్లను విశ్వభావన
సర్వజ్ఞుడవు గాన సర్వమీవు
నెరుగుదువైనను నీలోక మర్యాద
ననుకరింపుచు నన్ను నడిగితీవు
గాన వచించెద జానకియిప్పుడు
వసియించియున్న నివాసమరయ
రామలంకాపురి రావణాంతఃపురి
రావణా నీత నీదేవి సీత

తే.గీ. మహిజ యున్నది తదశోక మహిజవనిక
నికటమున బొల్చునిట నింపు నింప బంప
యనుసరము భాసురము దానియనుసరమున
మొనయు విలసన్నగము ఋష్యమూకనగము 418

కం॥ నలుగురు మంత్రులు కాలా
నలుగురు నిరసించు శౌర్యనయ మంత్రులుదన్
గొలువగ నలసుగ్రీవుడు
గొలువగు నా ఋష్యమూక కుధరమునందున్ 419

తే.గీ. ఆతపనసూతి పురుహూత సూతియైన
భ్రాతయగువాలిచే నతిభీతుడగుచు
ఋషి భయము బూని వాలిచే నెనయరాని
యానగంబున విహరించు ననుదినంబు 420

కం॥ ఆసుగ్రీవుడు శౌర్య శ్రీ
శ్రీసహితుడు కీశకులవరేణ్యుడతనితో
జేసిన సఖ్యము మీరలు
జేసున్మీ కార్యమతడు సిద్ధముగాగన్ 421

వ॥ అని విన్నవించి యత్తపస్విని రఘుసత్తమునితో మహాత్మా! ముహూర్త మాత్రంబిందుండుము భవత్సన్నిధానంబునం జేసి యేతత్కళేబరం బునుంబాసిభవదీయంబగు పరమపదంబు బ్రాపించెదనని శ్రీరాముల యనుజ్ఞ వడసి హుతాశనంబు బ్రవేశించి క్షణంబున సకలంబగు నవిద్యాన్విత బంధనంబున దొలంగి శబరియును శ్రీరామ ప్రసాదంబున నితర దుర్లభంబగు మోక్షపథంబు నధిగమించె నంత 422

కం॥ కావున రాముడు భక్తద
యావహుడు బ్రసన్నుడైన నఖిలేశ్వరుడ
ట్లేవారికైన దానం
దావేశత జెందదాని యర్థముగలదే! 423

ఉ॥ హీనకులీనయై శబరియేనియు నీగతి రామభక్తిచే
బూనిక ముక్తిగాంచెనిక బుణ్యులు బ్రాహ్మణులాది రాఘవ
ధ్యానపరాత్ములైన విదితాత్ములు ముక్తిని గాంచుడెక్కుడే
గానను భుక్తి ముక్తికిని గారణమౌను నసంశయంబునన్ 424

వ॥ అట్లగుట జేసి 425

శా॥ శ్రీమద్రాఘవభక్తి ముక్తిదము భేర్మిన్గామధుజ్మార్తులా
స్వామి శ్రీపద పద్ములన్ గనుక నుత్సాహాప్తి చిత్రభ్రమీ
ధామాజ్ఞాన విచారమంత్రతతి నంతన్వీడి లోకుల్ బుధుల్
శ్యామున్ రాముని పార్వతీశ్వర హృదబ్జారాము గొల్వన్ దగున్ 426

కం॥ అనిశితికంఠుడు జెప్పిన
విని సతి వినయతి ప్రమోద వృత ఘనమతితో
దనపతితో రాముని కథ
లనఘా! యవ్వలను జెప్పుమనియడుగుటయున్ 427

సోష్మము -

శా॥ భూమాప్రేమ సుభావ గోపయువసుభ్రూవిభ్రమావిద్భవ
వ్యామోహారు విభావ భావభవభావప్రాప్త భానూద్భవా
భూమీ పార్శ్వ భవద్రుమ ప్రభ శుభాంభో భృద్విభావైభవా
సోమక్ష్మాపవరోప భావ్య విభవస్తోమా బహు ప్రాభవా! 428

నిరోష్మ కందము -

ధారాధర దేహసితా
సారాధర జలజశంఖచక్రధరదయా
నీరాకర సరసీజా
గారా కరసంగ్రహైక కల్యాణ నిధీ! 429

ఉత్సాహ సోష్మ నిరోష్మ మిశ్రం -

బాలలోల! భక్తపాల! భర్గవంద్య! మహిమది
క్పాల పోష! మౌని తోష! భద్ర వేష! పటిమ ని
ర్వేల భాగ్య! పుణ్యయోగ్య! వేద వేద్య! పరమగ
ద్వాల వాస! భూరివాస! వాగ్ధవాదినుతగుణా! 430

- గద్య -

ఇది శ్రీమదుభయ కవితా నిస్సహాయ సాహితీవిహార కాణాదాన్వయతిమ్మనార్యకుమార
వినయవిభ్రాజి పెద్దనసోమయాజి ప్రణీతంబైన
శ్రీమదధ్యాత్మరామాయణంబను మహాపురాణంబునందు
అరణ్యకాండంబన్నది తృతీయాశ్వాసము సంపూర్ణము

-★)★(★-



శ్రీ భూ చెన్నకేశవాయ నమః

అధ్యాత్మ రామాయణము

కిష్కింధకాండము

 కరతుంగాకృష్ణా
శ్రీకృత ఖేయద్వయాంతరిత గద్వాలా
ఖ్యాకపుర సోమనృప ల
క్ష్మీకర బుధగేయ! చెన్నకేశవరాయా! 1

వ॥ అవధరింపుముభక్తియోగ విశారదుండగు నారదునకు సకలార్థ సంధాతయగు విధాత సెప్పెనట్లు విజ్ఞానవతియగు పార్వతికి దివ్య ప్రభావుండగు మహాదేవుండిట్లనిమె నవ్విధంబున రఘువరుండు శబరిచేత నివేదిత వృత్తాంతుండై యంతటన్ జనిచని 2

శా॥ కాంచెన్ రాముడు సామజుండగుచురంగన్వీచికాసారమున్
జంచత్కంజపుటీకుటీరపటలీసమ్యగ్వికాసారమున్
క్రౌంచశ్వేతగరుద్రథాంగయుగసంఘవ్యాప్త సంసారమున్
బ్రాంచన్నీరతుషారసారమును పంపానామ కాసారమున్ 3

వ॥ మరియు నాసరోవరంబు సరోవరలక్ష్మీ సామ్రాజ్య లక్షణంబు దెలుప నృపమందిర సందోహసందర్భిత మందిరాయితేందీవర బంధుర సుందరారవిందంబును, నరవింద కందళ నిష్యంద మకరంద బిందుతుందిల మిళింద గాయక గాన రీతి కృతారావకల్లోలంబును, కల్లోలరంగ సముల్లోల మంగళ హల్లీసక సముల్లాస వేల్లిత శితగరుల్లాసకీ చక్రంబును, చక్రచక్రాంగ కోయష్టిక జల కుక్కుట కారండవాది జలాండజారవ మాగధస్తవ సారంబును, సారసవిసర కేసర సరాగ పరాగ విచిత్ర చిత్ర కంబళాలం కృతంబును, కృతారాత్రి కాయితపత్ర పాత్రికాగత కోకనద ప్రదీప నికాయంబును, కాయమానాయ మానసూన ప్రవాళఫలవితాన వృతానేక లతానోకహ మనోహరంబునునై హరమతంబునుంబోలె విశాలశైవలంబును, సజ్జన హృదయంబునుంబోలె సువాసనా వాసితంబును, దర్పణంబునుం బోలె నిర్మలంబును, ధనేశనివేశంబునుంబోలె మహాపద్మశంఖ మకర కచ్ఛపలక్షితంబును, మదన కేతనంబునుంబోలె మీనవిరాజ మానంబును, రాజసభయునుంబోలె పుండరీకమండితంబును, నైఋతి దిగ్భాగంబనుంబోలెకుముదకలితంబును, సుగ్రీవసదనం బునుంబోలె పనసరంభాది సంభావితానుకూల

వినోదంబునునై బ్రసిద్ధంబయ్యును, నప్రసిద్ధంబును భంగవిలాస భాసురంబయ్యును నభంగవిలాస భాసురంబును, రోధస్ఫురిత ప్రచారంబయ్యును నరోధస్ఫుర్తిత ప్రచారంబును, మానసప్రభావాప్తవస్తు విస్తృతంబయ్యు నసమానప్రభావాప్తవస్తు విస్తృతంబును, పంకప్రదానతోషిత భువనజాతంబయ్యు నపంకప్రదానతోషితభువనజాతంబును, నగుచుం జెలువొందుచు మరియు నచ్చటికి వచ్చిన వారికిన్ దన వారి నెదురుబుచ్చుచు కంకణాంకిత తరంగభుజంబులు జూపుచు నూర్మికాగతసంచలజ్జ లగతలతాకిసలయాగ్ర కరాగ్ర సంజ్ఞలు జూపుచు కంబుకంఠసంకలిత పంకజముఖం బెత్తి వికచోత్పల నేత్రంబులనీక్షింపుచు పక్షిరావబులం జీరుచునంబువుల నర్ఘ్యపాద్యా దులం గూర్చుచు సుమపరాగ పటలంబులంజేర్చుచు మధుకింజల్క మధుపర్కంబులొసంగుచు బహూపచారంబులొనర్చుదాసింబలె మహాగంభీర భావంబున నెసంగుచున్ గ్రోశమాత్రవిస్తారంబగుతత్కా సారంబుగనియంత 4

తే॥గీ॥ ఆ సరసికద్భుతముమించి యరుగుదెంచి
సమయకృత్యంబులొనరించి సరవిమించి
విమల జలములు బ్రాసించి విశ్రమించి
రాముడనుజుని తోడ సంభ్రమముగాంచి 5

కం॥ ఆ సరసీనికటవనిన్
భాసురగిరి ఋష్యమూకపరిసరధరణిన్
వాసితశీతల పదమున
నాసౌమిత్రియును దానునరుగుచునుండన్ 6

- రాము సుగ్రీవమైత్రి -

సీ॥ ఘనమౌళిపాళిజుట్టిన జటాజూటముల్
కమనీయతరకిరీటములుగాగ
కాంతకర్ణాంతవిశ్రాంత నేత్రద్యుతుల్
రమణీయసితచామరములుగాగ
ప్రాంతకాంతారాళి ప్రసరించుతనురుచుల్
పరిసరావృత మహాబలముగాగ
శరచాపవరరూపసంగతుల్ వీరశృం
గార శాంతిద్యోతకములుగాగ

తే.గీ॥ గిరిగహనదుర్గ లక్ష్మి నీక్షించురాజ
లలిత లక్ష్మణులగు రామలక్షణులను
ఋష్యమూకాద్రియందు సుగ్రీవుడుండి
కాంచెనగ్గిరిదారి జరించువారి 7

కం॥ ఈరీతి వీరవరులగు
వారింగని భానుసూతి వారని భీతిన్
జేరికగల నలుగురు కపి
వీరులతో శైలశిఖర వీధికి నెక్కెన్ 8

ఉ॥ ఈ రహి దూరమున్ జని హరీశుడు మారుతిగాంచి వీర లె
వ్వారలొ వాలి పంపునను వచ్చినవారలొ దన్వధింపగా
ధీరవిచార విప్రవటుదేహముదాలిచిపోయి నీవునున్
వారును మాటలాడమరి వారి మనంబునెరుంగుమంతటన్ 9

కం॥ వారలుదుర్జనులైనను
జేరిక హస్తాగ్రసంజ్ఞ జేయునిజముగా
వారలుసజ్జనులయినను
స్మేరాస్యుండవయితెలియ జేయుమటన్నన్ 10

వ॥ అంత 11

సీ॥ బ్రహ్మతేజోయోగ బాహ్యప్తి లీలతో
ముఖలక్ష్మమేధావి ముద్రతోడ
సమధికాగమచారి జనముఖ్యరీతితో
స్ఫుటసదాగతికులోద్భాతితోడ
విబుధేంద్రకృతశాస్త్ర విద్యానుభవముతో
రచితార్యమహితగౌరవముతోడ
వరసత్వ గుణమహావాలవిస్ఫూర్తితో
నతులపలాశదండాప్తితోడ

తే.గీ॥ సతతశౌర్యాశ్రయస్థిర స్వాంతుడమిత
శాంతుడును దాంతుడగుహనుమంతుడపుడు
పరమతవిభేద నిజమతోద్ధరణకరణ
వచనపటువగు నొకవిప్రవటువునయ్యె 12

కం॥ ఈవిధివటురూపముగని
పావని రాఘవుని గని యుపాగతుడై స
ద్భావన వినతుండై విన
యావనతుండగుచు నిట్టులనియె నయమునన్ 13

కం॥ మీరెవ్వరయ్య రూపవ
యోరమ్యులు పురుషసింహు లురుతేజమునన్
వారిజహితురీతి దిశా
వారము లెలుగింపజేయు వారలుశూరుల్ 14

వ॥ అదియునుంగాక 15

సీ॥ త్రైలోక్య కర్తలలీల నామదిదోచు
చున్నది మీరలాయుధములాని
నరమూర్తులను ధాత్రి దిరుగు జగన్మయ
స్ఫూర్తులైన ప్రధానపురుషలొక్కొ
భక్తుల బ్రోవభూభరము ద్రోవనృపాప్తి
నవతరించిన పరమాత్మకులరు
సర్గస్థతిలయాప్తి సలుపునుధ్యతివిలా
సార్థమై బ్రేరకులైనవార

తే.గీ॥ లారయస్వతంత్రులై, మీరలఖిలలోక
హృదయపద్మనివేశులొయీశులగుదు
రవనిజరియించు సురపరాయణులునైన
నరనరాయణులనుచుమన్మదిదలంతు 16

చం॥ అనిన నభిజ్ఞుడారఘుకులాగ్రణి లక్ష్మణుతోడబల్కునీ
ఘనతరవాక్పటుస్వటుని గంటివె యీతడు శబ్దశాస్త్రమం
తను జదువంగబోలు బహునైపుణిచే నపశబ్ద మొక్కటిం
గనపడదేతదుక్తినని గంధవహాత్మజుగాంచియిట్లనున్ 17

మ॥ అనఘా! రాముడనేను నద్దశరథక్ష్మాధీశపుత్రుండ నా
కనుజుండీతడు లక్ష్మణుండు సతితోనాసీతతో దండకా
వనికిన్ దండ్రియనుజ్ఞరా దనుజుడెవ్వాడోహరింపన్ సతిన్
గనగావచ్చితి మీవు నెవ్వడవెరుంగం జెప్పుమాసర్వమున్ 18

సీ॥ అనవిని హనుమంతుడనియె రామునితోడ
ననఘాత్మ! సుగ్రీవుడనగమాకు
హరులకు గలడు మహామతియధిపతి
యతడు చతుర్మంత్రియుతుడునగుచు

గిరిశిరస్థలివాలికిని కనిష్ఠ భ్రాత
యవ్వాలిపాపాశయముననోలి
నర్కజునాలిని హరియించియాతని
వెడలించినను భయావృత్తినతడు

తే.గీ॥ నునికిగాఋష్యమూకాద్రినున్నవాడు
నేను హనుమంతుడనువాడ నినజుమంత్రి
నంజనాగర్భమునను ప్రభంజనునకు
సంజనించినవాడ ప్రజ్ఞానిరూఢ! 19

కం॥ ఆ సుగ్రీవుని సఖ్యము
జేసుటదగు మీకు నతడు సీతాహరుడౌ
నాసురు దునుమ సహాయము
జేసునిపుడ బోవుదము రుచించునటైనన్ 20

కం॥ అనినను రాఘవుడిట్లను
ననిలజ నేనతనితోడ నాప్తతసలుపన్
జనుదెంచితి హితుడగునా
తనికగు కార్యంబొనర్తు తప్పకననినన్ 21

వ॥ అంత హనుమంతుండును గిరిసమాన రూపంబగునిజస్వరూపంబునం జూపట్టి రఘుసత్తమునితో మహాత్మా! సౌమిత్రియుక్తంబుగా మదీయ బాహుస్కంధం బధిరోహింపుము – సచివయుతుండై తపనసుతుండున్న యెన్నగ శిఖరంబునకున్ గొనిచనియెదనని రాఘవుండును ననుజ సహితంబుగా ననిలజుభుజారోహం బొనర్చిన నాక్షణంబున వృక్ష చరవరుండునువారున్న గిరిశిఖరంబున కెగసి యొక్కవృక్ష చ్ఛాయ రామలక్ష్మణులనుంచి సుగ్రీవుంగాంచి యంజలిఘటియించి యిట్లనియె. 22

తే॥గీ॥ రవిజ! విడువు భయమ్ము శీఘ్రముగలెమ్ము
వచ్చిరిట రామలక్ష్మణుల్ వారితోడ
నీకుమిత్రత గూర్చితి నీవు వచ్చి
సఖ్యమొనరింపు మనలంబు సాక్షిగాగ 23

చం॥ అనవిని భానుసూతి ప్రమదాతి శయంబునవచ్చిరామునిం
గనితరుశాఖదెచ్చి బ్రియకల్పన పీఠముగా నొనర్చె న
య్యనిలసుతుండు లక్ష్మణునకట్లనె పీఠమొనర్చె లక్ష్మణుం
డినజున కట్లనిచ్చె వసియించియటన్ముదమందిరందరున్ 24

ఉ॥ అంతట లక్ష్మణుండు తపనాత్మజుగన్గొని రామవృత్త మా
ద్యంతము జానకీ హృతివనాగతి దెల్పిన భానుసూను డ
త్యంతము రామ నీమహిషి నామహిజన్వెదకన్ సహాయమే
నెంతయు జేతునంచు వచియించి రఘూద్వహుగాంచి వెండియున్ 25

సీ॥ వినురామ! నాచేతగననయ్యెనొకకొంత
యొకనాడు నేమంత్రి యుతుడనగుచు
గిరిమౌళియుండనంబరపాళియొకదేవి
నొకరుండు గొనిపోవుచుండునపుడు
మముగాంచినిజభూషణములెల్ల సడలించి
వస్త్రంబునను గట్టివైచె నిటకు
హారామ! హారామ! యనుచు నాక్రోశించు
సతిగొంచుదనుజుడు జనియెనంత

తే.గీ॥ దొడరగావింతు నేనెల్ల తొడవులెల్ల
జూచిగిరిగుహలోగూడ దాచినాడ
సొమ్ము గయికొమ్ము తెలిసి మీసొమ్ములనుచు
నప్పుడినజుండు రామున కప్పగించె 26

కం॥ అంతట రాముడు సీతా
కాంతాభరణంబులెల్ల గాంచియు హృదయ
ప్రాంతంబుననుంచియు గడు
జింతిలె బ్రాకృతునిరీతి చిరశోకమునన్ 27

తే॥గీ॥ అపుడు సౌమిత్రి గడుమైత్రి నన్నజూచి
యన్నిజోచితసూక్తులననునయించి
యినజుని సహాయమున మించి దనుజుద్రుంచి
యచిరగతి సీతగనియెద మనియెనంత 28

కం॥ సుగ్రీవుండును నీకు ద
శగ్రీవు వధించి యిత్తు జనకజననిదా
నుగ్రకరకులాగ్రణితో
నుగ్రతరంబుగ ప్రతిజ్ఞ యొనరించెనటన్ 29

కం॥ ఆరవి సంతతులగుటను
వారక హరిమూర్తులగుట వారిరువురకున్
మారుతి యభిజ్ఞుడగుట ను
దారస్థితి మైత్రి జేయదార్కొను బుద్ధిన్ 30

వ॥ అంత సమీపంబుననుండి సమీర తనయుండనలంబు బ్రజ్వలింపం జేసిన నిర్మల స్వభావులగు రామసుగ్రీవులగ్ని సాక్షిగా ముఖ్యంబగు సఖ్యంబు జేసిబరస్పరంబుగ కరంబులు సాచియాలింగనంబు లొనర్చిరప్పు డతిప్రణయంబున రవి సూనుండు రాముని సన్నిధానం బున వసించి మహాత్మా! వాలికృతంబగు మదీయ వృత్తాంతంబుచిత్త గింపు మనియిట్లనియె 31

సీ॥ మాయావియనువాడు మయ సూనుడొకనాడు
చెడుగ్రొవ్వుమీరి కిష్కింధజేరి
దనుబోరసింహనాదమునవాలిని జీర
నయ్యింద్రసూతిక్రోధాతిరీతి
వడిముష్టి దృఢముష్టిబొడిచిన వెతదొట్టి
వాడు వచ్చిన త్రోవబారిపోవ
నేనువాలియువేగవాని వెంబడివేగ
గుహజొచ్చిచనువాని గూడవచ్చి

తే.గీ॥ యంతవాసవినను గాంచియనునయించి
నేను వచ్చిన యందాక నీవుబోక
నీబిలము వాకిట వసించు మిటనటంచు
బలికిగుహలోని కపుడోలి బరచెవాలి 32

ఉ॥ అంతటవాలి యొక్క నెల యాబిలభూమివసించిరాకమా
సాంతముగాగ నాగుహమహారుధిరాధికధార బార న
య్యంతరమందు వాలిహతుడయ్యెనటంచునుభీతిగంది య
త్యంతమునేనునొక్కశిలనాగుహ వాతకుమూతజేయుచున్ 33

తే॥గీ॥ వచ్చి బురికేనుహతుడయ్యె వాలియనుచు
మరివచించిన శోకించి మంత్రులంత
జేరివలదన్న నన్న భిషిక్తుజేయ
లీల కపిరాజ్యమెల్ల బాలింపుచుండ 34

వ॥ అంతకొంత కాలంబునకు వాలియుయమ్మాయావింద్రుంచి యగ్గుహ ముఖంబు భేదించి నగరంబున కేతెంచి రోషంబున న్నన్నురావించి పరుషభాషణంబుల భర్జించి ముష్టి ఘాతంబుల భర్జించిన నేనును బురంబు నిర్గమించి భయాతిశయంబున నఖిల లోకంబులు బరిభ్రమించిమునిశాపభయోద్రేకంబున వాలికి గృతాగమన వ్యతిరేకంబగు ఋష్యమూకంబున నధివసించితి నమ్మూఢ హృదయుం డదియాదిగా మదీయ భార్యననుభవించుటన్ జేసిహృత దారుండను హృతాగారుండనునై దుఃఖభారంబునం బాటించితినేటికి భవచ్చరణ సందర్శనంబునసుఖంబు జెందితిననిన మిత్రవ్యధాజాత సంతాప భరుండైరఘువరుండతనితో భార్యాపహారియగు భవద్వైరి వధించెదనని శపథంబు గావించినంగాంచి రవినందనుండు రఘునందనునకిట్లనియె 35

కం॥ రామ బలయుతుల కాద్యుం
డాముఖసురలకు నభేద్యుడగు వాలిని నీ
వేమెయిగెల్చెదు దెలిపెద
వేమరునవ్వాలి బలము వినుము బలాఢ్యా! 36

సీ॥ అనఘాత్మ! దుందుభియను మహాసురుడుగ్ర
కాయుండు కిష్కింధకడకువచ్చి
యొకనాడుమహిషరూపోన్నతి రాతిరి
బోరుటకునువాలి జేరుటయును
యదివినియసహిష్ణుడయి వాలిక్రోధంబు
గదురగా మహిష శృంగములు ముట్టి
ధట్టించి శిరముపాదమును చేతులబట్టి
జిరజిరద్రిప్పివైచినను దెగియు

తే.గీ॥ నసురశిరము మతంగాశ్రమాంతికమున
బడిన యోజనదూరమయ్యెడను రక్త
వృద్ధిదొరుగంగగనుగొని వెసమతంగ
ఋషివరుడు రోషమెసగంగ నిట్టులనియె 37

కం॥ ఇది మొదలు మదీయ గిరికి
పదపడివచ్చినను వాలి భగ్నశిరుండై
జదియుననిమునిశపించిన
యదివిని వాలియును జేరడయ్యెనిచటికిన్ 38

ఉ॥ దానను ఋష్యమూకగిరిదారివసించితి భీతిలేక న
ద్దానవు శీర్షమద్రితులితంబుగనున్నది రామశక్తిచే
దీనిని నీవునెత్తి వధియింపగజాలుదు వాలినంచు దో
ద్రోన దినేంద్రనందనుడుదుందుభిశీర్షముజూపె చూపినన్ 39

కం॥ అవనిపుడదిగని నవ్వుచు
దవిలిపదాంగుష్టమునను దశయోజనముల్
దివిదేలగ దుందుభి శిర
మవలీలగనెగురమీటె నాశ్చర్యముగన్ 40

వ॥ అంతమంత్రియుతుండై రవిసుతుండు భక్తపరాయణ పరుండగు రఘువరుంబ్రశంసించి మరియు నతనితో మహాత్మా! సుత్రామ పుత్రుండిమ్మహోత్తాలంబులగు సప్తతాళంబులన్ గదలించిక్షణ మాత్రంబున విగత పత్రంబులు గావించుంగావున నీవునుం వీనినొక్క కాండంబున ఖండింపం జాలిన వాలినిం ద్రుంచెదవని విశ్వసించెదననిన రఘుకులేశ్వరుం డగుంగాకయని శరాసనంబున నొక్క శరంబరిబోశివేసిన 41

కం॥ వాలమ్ముపచ్చి యేడగు
సాలమ్ములవ్రచ్చి మరియు శైలమ్మును పా
తాళమ్మును భేధించుచు
హాళిందాశరథి శరథియందున్ జొచ్చెన్ 42

వ॥ అప్పుడప్పరమపురుషుని సాంగత్యంబునంజేసి సుగ్రీవునకు విజ్ఞాన స్వభావంబు సంభవించిన 43

సి॥ అంతసుగ్రీవుడత్యంత సంతుష్టుడై
విస్మితుండైరామవిభునిగాంచి
దేవజగద్భర్తవీవు పరాత్ముండ
విందున సందేహమేమిలేదు
మత్పూర్వ కృతపుణ్య మహిమచే భవదీయ
సంగతియును నాకు సంఘటించె
నినుభజింతురుభక్తి నిష్ఠమహాత్ములు
సంసార సంతాపశాంతి కొరకు

తే.గీ॥ నట్టి నీతోడ మోక్షమెట్లడుగువాడ
దారపుత్రాదికంబైన తావకీన

హేయమాయావృతుడగాన నెద్దియైన
నడుగనిన్ను బ్రసన్నుండ వగుమురామ! 44

కం॥ పూనిధనార్థముయత్నం
బూనినను నిధాన మొదవునోజనుభవదీ
యానందానుభవంబిపు
డేనందితినాదు భాగ్యమేమనిచెప్పన్ 45

వ॥ దానంజేసి విశేషించియనాద్యంబగు నవిద్యాబంధనంబ పరిహృతంబయ్యెనని మరియును. 46

ఉ॥ దాన తపోధ్వరాదిక విధానములన్ భవపాశనాశమున్
గానము, వృద్ధియే గలుగుగాని భవత్పద దర్శనంబునన్
దానికి నాశముంగలుగు తథ్యము నే నినుగంటి గావునన్
భానుకులేశ! నాకు భవబంధములెల్లనశించె నేటికిన్ 47

కం॥ మానసము జలింపక నె
వ్వానికి నీయందనిలుచు వశమైయపుడ
వ్వానికి సకలానర్థని
ధానంబజ్ఞానమపుడె దలగునురామా! 48

మ॥ హృదయంబున్ భవదంఘ్రియందయిన దానెందైన యుండంగని
మ్మది యట్లుండెను రామరామయను సమ్యగ్వాణియెవ్వాని వా
క్పదవింబోల్చునిమేషమైన నతడుగ్రబ్రహ్మహత్యాది పా
ప దురాపక్రియుడయ్యు ముక్తుడగు తత్పాపంబులం బాయుచున్ 49

తే॥గీ॥ ఆటనైనను మరియును పాటనైన
భీతినైన మహానందరీతినైన
వశతనైనను మరిపరవశతనైన
రామయని పల్కముక్తి కరస్థమగును 50

కం॥ దారసుఖాదిక మేనియు
గోరను విజయంబునేనిగోరనెపుడునే
నోరామ! భవవిమోచన
కారణమగునీదు భక్తి గాంక్షింతుమదిక్ 51

వ॥ అదియునుంగాక మహానుభావా! భవదీయమాయా కృతసంసార దంశితుండనైనను భవదంశకలితుండ నగుటంజేసి భవత్పాదభక్తిం బ్రసాదించియజ్ఞాన సంకటంబునం బాపి రక్షింపుము పూర్వంబున భవన్మాయా వృత్తచిత్తుండనై సమస్తంబునుమిత్రామిత్ర పూజ్యోదాసీన భావంబులగనుచుండుదునిపుడు భవత్పాదదర్శనంబు వలన మిత్రామిత్రాది విభేదంబులుదోచక సర్వంబు నందు నీ స్వరూపం బగు బ్రహ్మభావంబుదోచుటన్ గృతార్థుండనైతినని చెప్పివెండియు నిట్లనియె 52

సీ॥ నీ స్వరూపమెరుంగ నేరరాదెందాక
నందాకనీమాయ యావరించు
నీదుమాయాంబోధి నీదరాదెందాక
నందాకగుణ వృత్తులనుగమించు
తద్గుణవృత్తులు తలగిపోవెందాక
నందాకవివిధ బోధాప్తిదోచు
వివిధ భేదవ్యాప్తి వీడిపోదెందాక
నందాకకాలభయంబుగలుగు

తే.గీ॥ నగుట భవబంధములకు మాయయగుమూల
మై యవిద్య నుపాసించునట్టి మూఢు
డంధ తమమున బడుగాన నట్టినీదు
దాసి యగుమాయనుడుపవే తనకు రామ! 53

వ॥ అదియునుంగాక మహాత్మా! భవత్పాదపద్మాయత్తంబగుచిత్తంబును, భవన్నామకీర్తన రచనంబగు వచనంబును, భవత్పూజాకరంబులగు కరంబులును, భవదీయాంగ సంగమసుఖానుషంగంబగునంగం బును, గురుస్వరూపకుండైన నీదగుమూర్తి దర్శనలక్షణంబగు నీక్షణంబును, భవదవతారజన్మకర్మాద్య నంత కల్యాణగుణ శ్రవణ సముదీర్ణంబులగు కర్ణంబులును, భవదీయ దివ్యస్థాన యాత్రా ప్రదక్షిణాచరణం బగుచరణంబులును, భవత్పాదరజో విమిశ్ర తీర్థాంబు పవిత్రంబగు గాత్రంబును, శివబ్రహ్మాదిసేవ్యంబగుభవ త్పాదారవిందంబునందు వందనకృతాదరంబగుశిరంబును, బ్రవర్తించునట్లు గృపంజేయవేయని ప్రార్థించునాత్మాలింగన నిర్భాత కలుషభావుండును విజ్ఞానస్వభావుండునగు సుగ్రీవునకు బ్రసన్నుండై యాలోకించి కార్యార్థంబుగానతనియందు మోహకారిణియగుతన మాయనావరించి రఘువరుండు నవ్వుచునిట్లనియె 54

కం॥ వినుసఖ! ననుగూరిచి నీ
వనినది సకలంబుసత్యమగునైన మహా
జనములు రాఘవుడెయ్యది
యినజునకొరించెననుచు నెంతురుగానన్ 55

- వాలి వధ -

తే॥గీ॥ దుష్టతరశీలి వాలిని దునిమినీకు
జేతు కపిరాజ్యమున కభిషేకమిపుడె
నేను గావున కిష్కింధ నీవు జేరి
జీరుమవ్వాలినన నట్ల జేతుననుచు 56

కం॥ పుష్కరసఖతనయుడుసని
కిష్కింధోపవనిజేరి కిలకిలనినదా
విష్కృతి వాలిని కృతనిజ
దుష్కృతశాలినిట బిలిచె దురమొనరింపన్ 57

కం॥ ఆలీలభాతృనినదం
బాలించినయపుడ వాలి హరిమౌళిదృశా
పాళిరుషా కీలి దగన్
హేళితనూజుడు వసించు నెడవ్రాలెవెసన్ 58

వ॥ ఇట్లేతెంచిన వాలింగాంచి యార్భటించి సుగ్రీవుండుకరంబున నురంబునుం బొడిచిన నక్కీశవరుండు రోషపరుండై తమ్ముని రొమ్ము గ్రమ్మరం గ్రమ్మిన నవ్విధంబున బరస్పరంబును ముష్టాముష్టిం బొడిచియు బాహాబాహి నొడిచియు కరాకరింగొట్టియు కచాకచిం బట్టియు నఖానఖిన్ బెరికియు దంతాదంతి గొరికియు నిట్లుహూరా హూరింబోరుచు 59

కం॥ కిరియుగముం గిరియుగముం
గరియుగముం హరియుగంబు గతిబెనగుతరిం
హరిసుతులం గురుధృతులం
గరమతులంబుగ విభుండుగని విస్మితుడై 60

తే॥గీ॥ నడలు నొడలును వెడలును దొడలు మొదలు
స్వరము లురములు కరములు శిరములాది
నిరువురొకరూపముగదోపనృప కలాప
మాప్తహతి శంకశరమువేయంగనోడె 61

వ॥ అప్పుడప్పురుహూతసూతి క్రోధాతిశయంబు నశనిపాతంబునను కరించు ముష్టిఘాతంబునంబొడిచి నభయవిహ్వల భావుండై సుగ్రీవుండు వనంబునకుంబారె వాలియు నిజభవనంబునకుంజేరెనత్తరిదన తోనం జనుదెంచిన రఘుసత్తమునింగని దీనుండై రవిసూనుం డిట్లనియె 62

కం॥ ఈతీరు బ్రీతియేనియు
భ్రాతియగు నరాతిచేతి పగదీర్ప ననుం
జూతురె! మీరేశరహతి
జేతురుగాకరివిరామ! శ్రీరఘురామా! 63

కం॥ శరణాగతవత్సలుడవు
కరుణానిధివయ్యు సత్యకలితుడవయ్యున్
నెరనమ్మికయిచ్చియు రఘు
వరనన్ను నుపేక్షజేయ వచ్చునెనీకున్ 64

సీ॥ అనిన సుగ్రీవోక్తివిని సాశ్రునేత్రుడై
యతనినాలింగనం బాచరించి
వెరవకుమని రామవిభుడిట్టులను మీర
లొక్కరూపంబుననుంటజేసి
శరముమిత్రద్రోహ శంకవేయకనిచ్చి
తారీతి విభ్రాంతినందకుండ
నిపుడు నీకొక చిహ్నమేనుగావించెద
నట జనిమరి బిల్వునతిసుహితుని

తే.గీ॥ హతుడుగా జూడుమికవాలినన్న రవిజ
నేను రాముడసుమ్ము నీయానలెమ్ము
వేరనకనమ్ముమిదియని యూరడించి
యంతరాముడు సౌమిత్రికనియెనిట్లు 65

కం॥ ఓ లక్ష్మణపుష్పితలతి
కా లక్షణమొకటిబూన్చి గళమున నితనిన్
వాలికడకనుపు రవిసుతు
నోలిసమగ్ర ప్రభావయుతునని పలుకన్ 66

తే॥గీ॥ లక్ష్మణుడును తాదృశలక్షణంబు
బూంచి ప్రియమున సుగ్రీవుబంచుటయును
నతడు కిష్కింధ కడకేగి యచట నద్భు
తారవంబున వాలిని జేరుటయును 67

కం॥ ఆనినదము విని విస్మయ
మానినమది గ్రోధమధిక మదర పరికరం
బూనిన కడకన్ వాలియు
బూనికయుద్ధమున కరుగ బూనినవేళన్ 68

ఉ॥ తార తదీయ దారసముదారత కౌగిట జేర్చియవ్విభుం
జేరియిటన్వచించు కపిశేఖర బోవలదిప్పుడేనినున్
జేరియునోడి పారి మరి శీఘ్రమువచ్చుట శంకయయ్యెనం
చారయ శూరుడెవ్వడొ సహాయముగానగు భానుసూతికిన్69

చం॥ అనవిని వాలియిట్లనియె నాసతికిన్విను భామ! నీమనం
బునగల శంకబోవిడువు బొమ్ము గృహమ్మునకీవు నేనునుం
జని రిపునిం వధించియిట చయ్యనవత్తు సహాయ మొక్కడున్
గనుపడ దర్కసూతికిని కల్గిననిర్వురద్రుంతు వారలన్ 70

వ॥ కావున 71

కం॥ నీవడలకుసతి శూరుం
డేవిధి శత్రుండు బిల్వ నింటవసించున్
గావుననతని దునిమినే
వావిరి వత్తునన తారవాలికిననియెన్ 72

సీ॥ వినుము కపీంద్ర! నేవినుపింతు నొక్కటి
వినియథోచితము గావింపు మీవు
తనయుడంగదుడు కాననమున వేటలో
వినివచ్చినాతోడననియెనిట్లు
శ్రీమంతుడగు నయోధ్యామహీకాంతుండు
రాముడు దశరథ రాజసుతుడు
భ్రాతసౌమిత్రితో భార్యభూపుత్రితో
జనకోక్తిదండకావనికి నరుగు

తే.గీ॥ నందుసీతనురావణుడపహరింప
భ్రాతతోసీత వెదకుచు పరగు ఋష్య
మూకమున భానుజుని జేర వీకనతడు
నతనితో నగ్నిసాక్షి సఖ్యంబొనర్చె 73

ఉ॥ వాలిననింవధించి నినువానరరాజు నొనర్తు నేనటం
చోలిని సానుజుండయి రఘూత్తముడర్కతనూజు తోడత
న్మేలి ప్రతిజ్ఞజేసినిటు నిశ్చితులౌచును వారువచ్చిరీ
లీల నిజంబు సుమ్ము! వినులెస్సగపీంద్ర! మదీయ వాక్యమున్ 74

కం॥ ఈలాగుగానిచో నిపు
డీలోననె భంగమొందియినజుడు నీచే
చాలా గాసిలివెండియు
నేలాచనుదెంచునిదియ హేతువుసుమ్మీ! 75

కం॥ కావున నెన్నిటవైరము
బోవిడువుము యౌవరాజ్యముంగట్టుము సు
గ్రీవునకు నీవు జనివిన
తావను రఘువరుని శరణమందుము వేగన్ 76

వ॥ అని మరియును 77

మ॥ నను నీయంగదురాజ్యమున్ గులమునున్ రక్షించుగీశేశయం
చనిపాదంబుల వ్రాలి తచ్చరణముల్ హస్తంబులంబట్టి భీ
తినికంపింపుచు నశ్రుమిశ్రవిచలద్భక్తారయైదార యొ
య్యన నేడ్చెన్ రజనీముఖార్కవిరహోద్యచ్ఛోక కోకిధ్వనిన్ 78

సీ॥ అదిగాంచి యత్తారనపుడు గౌగిటనుంచి
నెనరుదీపింపనిట్లనియె వాలి
స్త్రీస్వభావమున భీతిల్లెదవీవు నో
యింతి! నాకును భయం బింతలేదు
సౌమిత్రితో గూడరామవిభుండు వ
చ్చినటైన నతనితో స్నేహమిపుడ
యగును నాకిట సంశయము లేదు భూభార
హరణార్థముగను నారాయణుండు

తే.గీ॥ నఖిలభక్త రక్షాత్మృతి నవతరించె
రాముడను పేర ననుచు బూర్వమునవిందు
నందునను జేసి నిజపక్షమన్యపక్ష
మనగ లేదా మహాత్మునకనఘ చరిత! 79

కం॥ దేవీ! యావిభుపదముల
కేవినతుడనగుచు దెత్తు నింటికి దన్నున్
సేవించువారి బ్రోచున్
సూవె! పరేశుండు భక్తి సులభుండగుటన్ 80

వ॥ ఇటుగాక సుగ్రీవుండొక్కరుండే వచ్చిన నాక్షణంబ వధింతు నదియునుంగాక సుగ్రీవునకు యౌవరాజ్యాభిషేకంబొనర్పుమని చెప్పితి వాయర్థంబునకు వినుము 81

ఉ॥ వీరుడ సర్వసమ్మతుడ విశ్రుతుడన్ శుభరాజ లక్షణో
దారుడ విక్రమక్రమ విహారుడనై తగు వాలి నయ్యునే
బోరికి జీరగా బడియు బూనికతో నొకవైరి మాత్రుచే
వారక భీత భీత మగు వాక్యమునెట్లు వచింతు భామినీ! 82

తే॥గీ॥ కాననీలోన శోకంబుమాని మాని
నీమణి గృహంబున వసింపు నీవటంచు
తార నిజదార నీరీతి నూరడించి
గారవించెనువాలియుదారశీలి 83

వ॥ అంతనిర్వక్ర పరాక్రమ శాలియగు నవ్వాలి యుద్యుక్తుండై సుగ్రీవ వధార్థంబు వచ్చిన నచ్చట నధిక పరాక్రమ స్వభావుండగు సుగ్రీవుం డును నుపకంఠకలిత సుమనోమాలికానుషంగుడై పతంగుండునుం బోలె బిట్టెగిసి ముష్టిద్వయమ్మున నవ్వాలి వక్షమ్ము గ్రమ్మిన గ్రమ్మరనయ్యోధవరుండు క్రోధపరుండై రవిసుతును రమ్ముగరమ్ము లంబొడిచిన గోపంబినుమడింప నన్యోన్యం బులందలపడి సాహసంబుల నిజనామంబులనుడువుచు వీరాలాపంబుల నొడువుచు ఝట్టియుగంబు పగిది న్గదిసి దృష్టి పాతంబుల నీక్షించియు ముష్టి ఘాతంబుల లక్షించియు సాలంబులంగొట్టియు వాలంబులం జుట్టియు రదంబుల ధట్టించియు పదంబుల ఘట్టించియుముఖంబులనదల్చియు నఖంబుల విదల్చియు నతిఘోరంబుగా బోరు సమయంబున 84

కం॥ ఆ వాలి బలముగని సు
గ్రీవుడు రఘువరునియందు దృష్టినిడిచలం
బావర్తింపగ నిరువురు
నావిధమున బోరుచుండు నవసరమందున్ 85

శా॥ అంతన్ వారలగాంచిరాముడతి శౌర్యస్థేముడైంద్రాస్త్రమ
త్యంతంబున్ శరధిం వెడల్చి ధనువందర్పించి దర్పించి క
ర్ణాంత స్ఫూర్తిగ బర్విమౌర్వినతిగాఢావాప్తిగావృక్ష షం
డాంతర్వర్తియునౌచువాలి హృదయం బాలక్ష్మమున్ జేయుచున్ 86

ఉ॥ హేళికులేంద్రుడప్పుడు దినేంద్ర తనూజుని తోడగూడగా
నాలము జేయువాని హృదయమ్మునయమ్మున గాడనేసెన
వ్వాలిని ధైర్యశాలిని నవార్యగుణాళిని దైత్యరాణ్మదో
న్మూలిని హేమమాలిని ననూనపరాక్రమశాలినంతటన్ 87

మ॥ అతిసత్వం బశని ప్రభంబునతివేగారూఢమౌబాణ మీ
గతిచే రాఘవుడచ్యుతుండు వయివంగా నమ్మహాస్త్రంబును
గ్రతచే వక్షము జొచ్చి వ్రచ్చిచనినన్ గంపించియవ్వాలి య
ద్భుత శబ్దంబొనరించి బిట్టెగసిదోడ్తో ధాత్రివ్రాలె న్వెసన్ 88

కం॥ అప్పుడు ముహూర్తమాత్రము
దప్పక మూర్ఛిల్లి తెలివిదప్పి తనంతం
దెప్పిరిచేతన మొకగతి
ముప్పిరిగొనవాలితనదు ముంగటనంతన్ 89

సీ॥ ఒక చేతసితకాండమూని సవ్యంబగు
నొకచేత కోదండమూనువాని
మౌళిసంచితజటా మకుటంబు నిడి గటి
పాళి చీరపటంబు బరగువాని

శైలాభలీలా విశాలవక్షుడు వన
మాలాభరణలక్ష్య మహిమవాని
దూర్వాదళాంకురద్యుతియుక్త నతిపీన
చార్వాయత భుజాప్రసక్తివాని

తే.గీ॥ భానుపుత్ర సౌమిత్రులు పార్శ్వ సీమ
లందుసేవింప భావింపనలరువాని
సద్గతి విధాతరఘునేత సకలదురిత
జేతమోక్షప్రదాత నీక్షించెవాలి 90

కం॥ ఈలీల రామునింగని
యాలోలత వాలి గర్వితాప్తి నతనితో
నేలాదనుదునిమితి భూ
పాలా! యపకారమేమి బరపితినీకున్ 91

మ॥ నృపధర్మం బెరుగంగనేరక విగర్హీభూతమౌవృత్తి పా
దపషండాంత తిరోహితుండవయి యుద్ధంబేమియుంజేయకన్
గపటవ్యాప్తి శరంబుబోవిడిచినంగానేర్చునేయిట్టి చో
రపుకార్యంబునగీర్తియున్ సుకృతమున్ రానేర్చునే రాఘువా! 92

కం॥ క్షత్రియుడవు మరియును మను
గోత్రీయుడవేని నిన్నుగొని యెదుటఘటీ
మాత్రముగ ననియొనర్చిన
పాత్రముగను తత్ఫలంబు బడయుదు రామా! 93

వ॥ అదియునుంగాక 94

సీ॥ తానేమిగావించె తపనసూనుడునీకు
నేనేమిగావింపనేరనైతి
నాదేవ రిపునిచే నీదేవియపహృత
యైనచో నిమ్మహాకాననమున
నరయుచు సుగ్రీవునటుగంటి శరణంటి
వక్కార్యమునకు గాననుచునుంటి
జగతివిశ్రుతమైనదగు మద్బలములోన
నించుకేనియురీతి నెరుగవైతి

తే.గీ॥ సీతతోడలంకాపురోద్భాతితోడ
రావణునిగట్టి కులముతో బ్రోవుగట్టి
నిటముహూర్తార్ధమున దెత్తునీకు నిత్తు
నీవుయిచ్ఛయొనర్చిన నేనురామ! 95

మ॥ నినుధర్మిష్ఠుడవంచులోకమనగా నేముందువిందుం బుళిం
దునిచందంబున రామ వానరుననున్ ద్రుంచంగ నేధర్మమొ
య్యన బ్రాపించెనుమర్కటామిష మభక్ష్యం బౌటదుర్గ్రాహ్యమ
య్యెనికంగావున నిట్టి కృత్యమున నీకేమబ్బెడుంజెప్పుమా! 96

కం॥ మునునాకు నీప్రయోజన
మునానాతి యిచ్చియున్నమును కొనిచని నీ
పనుపున జనకాత్మజనొక
దినమున సందియములేకదేనేనేనున్ 97

తే॥గీ॥ రాజహంతయు గోహంత బ్రహ్మహంత
ప్రాణివధకారుడగు చోరుడరయనెపుడు
నాస్తికుండన్నయుండ బెండ్లాడునతడు
వీరలందరు నరకంబు జేరువారు 98

కం॥ గురుతల్పగుండు కొండీ
డరయన్ మిత్ర ద్రుహుండు నతికృపణుండున్
దురితాతుల లోకములకు
నరుగుదు రిందరును సంశయములేదిచటన్ 99

ఉ॥ కావున నీకు ధర్మమున గల్గదు బుద్ధియు నర్థమందునుం
గావలదింద్రి యార్థముల గామ వశత్వమునంగృశించదో
భూవర హీన కర్మమును బూనితినన్నపరాధహీనునిం
జీవవధంబుజేసి యెటుజెందెదు సజ్జనులందు రాఘవా! 100

కం॥ అనియిటుహతచేతనుచే
ననబడియవ్వాలి చేత నారఘువరుడున్
సనయంబుగ ధర్మార్థో
పనయంబుగ వచనమిట్లు బలికెనతనితోన్ 101

కం॥ దుర్మార్గవరా సద్గుణ
ధర్మముచే నీజగంబు దరసి చరింతున్
ధర్మాత్ములబాలింతున
ధర్మాత్ములద్రుంతునిదియె ధర్మమునాకున్ 102

వ॥ దానంజేసి ధర్మహీనుండనగుటనిన్ను వధించితి యెట్లంటేని 103

చ॥ భగినిని పుత్రికన్ సుతునిభార్యను సోదరుభార్యబొందరా
దొగతెనునైన నిందు మదయుక్తతనెవ్వడు కామసక్తుడై
దగులును నట్టిమూఢమతి తథ్యముపాతకియౌనువాడునుం
దగిన వధార్హుడౌ ధరణినాథులకంచువచించుధర్మముల్ 104

వ॥ కావున నీవునుంగనిష్ఠ భ్రాతయగు సుగ్రీవుని భార్యగ్రహించితి వందునంజేసి ధర్మవిదుండనగు నాజేత హతుండవయితి వదియు నుంగాక వనౌకసుండవగుట గపిస్వభావంబున నెద్దియునెరుంగ నేరవు మహాత్ములగువారు నిజ సంచారంబుల భువనత్రయంబు బవిత్రంబు గావింపుచు సంచరింతురగుట వారితోడనతిభాషణం బులు బొసంగదనినయద్దేవాగ్రణి సంసర్గంబున నజ్ఞానంబుదొలంగి సుజ్ఞానంబున

జెలంగి యారామవిభుని రమావిభునిగా దలంచి నమస్కరించి యత్తరినాహరిసత్తముండు
రఘుకులోత్తమునితో నిట్లనియె 105

కం॥ ఎరిగితినినుబరమేశ్వరు
నెరుకంగొని రామరామ యేగొన్నిటినిం
నెరుగకనన్న దురుక్తము
లెరుగనియటుగా క్షమింపుమీ! మహితాత్మా! 106

తే॥గీ॥ నీ శరాహతి మరియును నీదుసన్ని
ధానసంగతి బాసెద ప్రాణములను
ధన్యుడనునైతి మిగులనీదర్శనంబు
తుదిమహాయోగులకునైన దుర్లభంబు 107

సీ॥ ఎవ్వానినామంబు మృతివేళవివశుడై
దలచిన పరమపదంబుగలుగు
నట్టివిష్ణుండె ప్రత్యక్షత నసువులు
దొలగెడి నామ్రోలనిలిచియుండె
నేగృతార్థుడనైతి నిన్ను విష్ణునిగాగ
జానకిలక్ష్మిగానేనెరుగుదు
రావణువధియింప నావిధి బ్రార్థింప
జనియించి తీవుదాశధివగుచు

తే.గీ॥ గాన శరణంటి నినుగంటి కావుమంటి
నాకనుజ్ఞయొసంగు మనాథనాథ!
రామ!నీదివ్య పదముజేరంగబోదు
నాశ్రితాధార! రఘువీర!యఘువిదూర! 108

ఆ॥వె॥ అంగదుండు బాలుడస్మత్సమబలుండు
నితని కరుణజేయు మింకనన్ను
కరముజేస్పృశించి యురమువిశల్యంబు
జేయుమనిన నటుల జేతుననుచు 109

కం॥ కరమున నంటుచు రాముడు
శరమును దివియంగ బ్రాణసంగతి వెడలన్
శిరమునను నపుడు వాలియు
హరిదేహము బాసి వెలసె నమరేంద్రుండై 110

వ॥ ఇవ్విధంబున 111

చం॥ అమరగవాలి రాఘవశరాహతి రాముని సత్కరంబుచే
నమృతకరంబుచేత నొరయంబడి వెంబడిగాప్లవంగదే
హమునటు వీడియుం బరమహంసలకేనియు దుర్లభంబును
త్తమమును దివ్యమై తగు పదంబును గాంచెనన్యలభ్యమున్ 112

సీ॥ అంతట బరమాత్ముడైన రామునిచేత
నిహతుడైనను వాలినిఖిలకపులు
బరచి కిష్కింధకు భయమందితారతో
ననిరిమహాదేవి!యాహవమున

హతుడయ్యవాలి నీయంగదు రక్షింపు
మంత్రుల రావింపు మరియు బురము
వాకిండ్లు నాలుగు వైపింపునీసూను
వినుకీశవిభునిగావింపుమనిన

తే.గీ॥ వాలిహతుడని వినినేల వ్రాలితార
ఘోర శోకాగ్నిలోనోలి గూలితేలి
శిరమునురమునుగరముల గరముమోది
కొనుచునశ్రులు దొలుకనిట్లనుచుబలికె 113

కం॥ నగరముచే నంగదుచే
నగురమ చేవిడిచి మేనుయట వీడిదివిన్
మగనిం గలసెద సతిగరి
మగనిన్ వెలసెద నటంచు మానినియంతన్ 114

తే॥గీ॥ తుమురునెరివీడ మోముచందురుడువాడ
నడలువెతగూడ పతిజాడ నరిగితోడ
రక్తరజమంటి దోగిన రమణజూచి
తత్పదంబులబడి తార తడవుమీర 115

కం॥ హానాథ! కీశవంశమ
హానాథ! యటంచువగచి యాసుదతివెతన్
హీనాథమయై రామమ
హీనాథుని జూచిలేచి యిట్లనిపలికెన్ 116

సీ॥ ఏ శరంబున రామకీశరాజునునీవు
నాశంబుజేశితి వాశరమున
నన్నువధింపుము నాథసాలోక్యంబు
జెందెద నన్ను కాంక్షించునతడు

స్వర్గంబునందైన సౌఖ్యంబుదోచదు
ననుబాసినపుడనానాథునకును
పత్నీవియోగ సంభవమైన దుఃఖంబు
ననుభవించిన వాడవనఘునీవు

తే.గీ॥ గాన వాలికి నన్ను వేగాన నిమ్ము
దాననీకగు తత్సతీదాన ఫలము
ననుచు విలపించి సుగ్రీవునచటగాంచి
అతనితో నిట్టలనుతార వెతనుమీర 117

కం॥ రామునిచేనవ్వాలి వి
రామునిచే నీయనయ్యె రాజ్యమునికనీ
రామనురుమనుంగూడి నె
రా మనుసాపత్న్యరహిత రక్తిని రవిజా! 118

కం॥ అని కరుణవగచుతారం
గని కరుణంబొగుచురీతి ఘనమతి రాముం
డనునయసూక్తులననియెన్
ఘన తత్త్వజ్ఞానవిధముగరపెడువాడై 119

తే॥గీ॥ తారభీరువుగతి నేడ్చెదవునిదేల
దుఃఖవిషయంబుగాని నాథుని గురించి
నీవిభుడనగనెవ్వడో నిక్కమితని
దేహమోగాక జీవుడో తెలియుమెరిగి 120

వ॥ కావున నీరెంటియందును దేహంబయని సెప్పితేని పంచ భూతాత్మ కంబును త్వఙ్మాంసరుధిరాస్థి వికారంబును కాలకర్మ సముత్పన్నం బును జడంబునునగునట్టి దేహంబిపుడు జొప్పడిముందలంబడి యున్నయది దీనికై శోకం బేటికియదింగాక జీవుండగు నాత్మయని చెప్పి తేనియతడు నిరామయుండును నిత్యుండును జ్ఞానమ యుండును జననమరణగమనాది వర్జితుండును స్త్రీ పురుష షండత్వాది విరహితుండును సర్వగతుండును నవ్యయుండును నద్వితీయుండును నేక

స్వరూపకుండును నాకాశంబుపగిది నిర్లేపకుండును నిత్యుండును జ్ఞానమయుండును శుద్ధుండును
నగుటంజేసి శోకంబున కర్హుండుగాడనిన యత్తార రామదేవున కిట్లనియె 121

తే॥గీ॥ తెలియదేహంబు కాష్ఠంబువలెను జడము
నరయనాత్ముండు సచ్చిత్సుఖాత్మకుండు
నగుట సుఖదుఃఖ సంబంధ మాదిగాగ
నెవ్వరిది సుమ్ము రామ! నాకెరుగజెపుమ! 122

వ॥ అనిన రఘుసత్తముం డత్తారకిట్లనియె 123

సీ॥ ఎంతకాలంబు దేహేంద్రియాదులతోడ
నొగినహంకారాది యోగముండు
నంతకాలముగదా యవివేకమునజేసి
యాత్మకు సంసారమనెడితోపు
నగుట మిథ్యాభూతమయ్యును సంసృతి
దనయంతనదినివర్తనము గాదు
విషయాభిముఖసక్తి విహరించువానికి
కలనుమిథ్యాధనాగమముబోలి

తే.గీ॥ కావుననానాద్యవిద్యాను భావమునను
గలుగు తత్కార్యమగు నహంకారవశత
గలిగినట్లుండు సంసారకలనమిథ్య
యయ్యునట రాగదోషాది కాభివృద్ధి 124

కం॥ మనసన సంకల్పంబ
మ్మనసే సంసారబంధ మహిమాదులగున్
మనసున బొరసినయాత్మకు
మనఃకృతం బైనబంధమగ్నతదోచున్ 125

వ॥ కావున శుద్ధ స్ఫటికంబు రక్తాదివస్తు సమీపస్థితంబైతత్తద్వర్ణంబగు విధంబునందోచుగాని దానికి స్వభావంబుగాని విధంబున బుద్ధీంద్రియాది సన్నిధానగతం బగునాత్మకు తత్తత్ప్రవర్తితంబగు సంసారబంధంబునం దోపుచుండుంగాని స్వభావంబుగాదు తత్ప్రకారంబెట్లంటేని అట్టియాత్ముండు స్వచ్ఛాయయగు మనంబునం బరిగ్రహించి తత్సంభూతం బులగు కామంబులననుభవింపుచుగుణ బద్ధుండైయవశంబున తత్ప్రతంబగు సంసారంబునం ప్రవర్తింపుచు బ్రధమంబుగా మనోగుణంబుల స్పృశియించి యనంతరంబున ననేక కర్మంబులంబుట్టించి తత్కర్మంబుల వలన శుక్లలోహిత కృష్ణాది

వర్ణాత్మకంబగు నిజ్జగంబునంతయుం గలగించు నివ్విధంబున కర్మవశంబున జీవుండు కల్పాంతంబునుండి దిరుగుచునంత సర్వప్రళయంబగు నప్పుడజ్జీవుండు పూర్వంబగు స్వకీయ కర్మవాసనా వశంబున ననాదిమాయావశంగతుండై తదభినివేశంబున నణంగి యుండ వెండియు సృష్టి కాలంబుగానతండు తత్పూర్వవాసనా వశాన్వితుండై జన్మించునట్లు జన్మించునపుడ యభ్యాసంబు లేక నుండియు దనంత స్తన్యపానాదులొనర్చునగుటనది పూర్వవాస నాభ్యాసవశంబనియూహింపనగు నివ్విధంబునననేక జన్మగమనాగ మనంబుల ఘటీయంత్రంబునుంబోలె బరిభ్రమించుచు దుఃఖా నేకంబులనుభవించుచుండుంగావున 126

సీ॥ ఎప్పుడు పుణ్యసమృద్ధి విశేషంబు
చేతనుమద్భక్తి శీలురైన
శాంతులునగుసాధు జనముల సంగతి
గలుగునప్పుడుగదా గలుగునాదు
భక్తియు శ్రద్ధానురక్తియు మత్కథా
శ్రవణాదులందుచే సద్గురూక్త
సరణివేదాంత మజ్ఞానంబుదాన న
శ్రమమౌ స్వరూపవిజ్ఞానమొదవు

తే.గీ॥ దానదేహేంద్రియ మనోభిమానముఖ్య
ములకు వేరగు స్వాత్మానుభూతికలన
నిత్యమానందమగు నాత్మ నిజమెరింగి
ముక్తుడగు సత్యమిది మదీయోక్తి వినుము! 127

కం॥ నేనిటజెప్పిన సూక్తులు
బూని విచారించునట్టి పుణ్యడనిశముం
దానీ సంసారజ దుఃఖానీకములంటడెన్నడైననుసుదతీ! 128

ఉ॥ కావున తార! నీవునిటుగాగ మదుక్తము శ్రద్ధబుద్ధిచే
భావనజేయు బంధముల బాసియుముక్తివసింతు పూర్వజ
న్మావళినాదుభక్తియధికాప్తి నొనర్చితివౌట దానిచే
నీవు దరింపనిప్పుడిటునే నిజరూపము జూపితిన్‌సతీ! 129

వ॥ కావున మద్రూపంబు ధ్యానింపుచుమదుక్త తత్త్వంబు భావింపుచు బ్రవాహసమాగతంబగు కార్యంబొనర్చుచున్న కర్మబంధంబులం దొలంగెదవనిన నత్యాశ్చర్యంబున నత్తారయు బరమాత్ముండగు

రఘూత్తమునుపదేశంబున నాద్యంబగు భవబంధంబునం బాసి విగతకల్మషయై దేహాభిమానసంభవం బగు శోకంబుపహరించి యద్దేవునకు నమస్కరించియాత్మానుభవసుఖంబున జీవన్ముక్తిం జెందె సుగ్రీవుండును తద్వాక్యంబులువిని యజ్ఞానంబువీడి స్వస్థ చిత్తుండయ్యెనంత రాఘవుండు సుగ్రీవునితో భవద్భ్రాతకుంద త్పుత్రునిచేతంబారలొకిక క్రియలొనరింపు మనిన నతండును నవ్వాలిం బుప్పకంబుననిడి భేరీపటహ నిర్ఘోషాది రాజోపచారంబుల మంత్రి బ్రాహ్మణతారాంగద వానరవర సంగతుండై విధిక్రమంబున సంస్కారంబొనరించి శుచిస్నాతుండగుచు శ్రీరాముల సమీపంబు నకువచ్చితచ్చరణంబులకు వినతుండై యినతనయుండు నయ వినయ సంతోషంబుల రఘువరున కిట్లనియె 130

కం॥ రాజేంద్ర! యీహరీంద్ర
శ్రీజెందిన రాజ్యమీవసేయుము నేనున్
నైజమునీపదదాసుడ
నైజేసెద సేవనీదు యనుజునితేవన్ 131

సీ॥ అనిన భానుజసూక్తివిని రాముడిట్లను
వచనంబుహసిత పూర్వకముగాగ
నీవెనేనిచట సందేహంబు లేదునా
యాజ్ఞచే గీశరాజ్యాభిషేక
మావహింపుము నీవ వేవేగనిట చతు
ర్దశవత్సరము లేను రాను బురికి
గానమద్భ్రాతలక్ష్మణుడువచ్చునువెంట
మీపురంబునకును మిత్రభావ్య

తే.గీ॥ యంగదుని ద్రీతియౌవరాజ్యముననిల్పు
మేను వర్షదినంబులు నీసమీప
గిరిననుజుతోడ వసియింతుమరలివచ్చి
సీత వెతకంగయత్నంబు సేయుమీవు 132

కం॥ అనరవిజుడు సాష్టాంగ
ప్రణామమొనరించి రామపదముల కతనిన్
గనిదేవ మీరు చెప్పిన
యనుమతిచే జేతుననియె నంతయునంతన్ 133

కం॥ అనుమతుడైరామునిచే
ననుగతుడైయినజుతోడ నటలక్ష్మణుడుం

జనిహితగతి కిష్కింధకు
ఘనమతినధిపతిగ జేసె కపితతి కతనిన్ 134

తే॥గీ॥ అపుడురవిసూతి చేత యధార్హరీతి
బూజితుండయి సౌమిత్రిభూరిమైత్రి
మరలిచనుదెంచియుండె నమస్కరించి
యన్నతోడవసించి బ్రియంబుమించి 135

వ॥ అంతరఘుకులాధ్యక్షుండు లక్ష్మణసహితుండైయతిరయంబున మాల్యనంతంబునం బ్రవర్షణ శైలాంతంబున నానావిధ వనోదర వినోదరసాదరవిహార యోగోపయోగి విస్తరతరంబను సుకరంబును నగు శిఖరంబునందు విస్ఫుటస్ఫటికతటాక కలితరుచిచ్ఛటావళిత వివిధ మందిరానేక సుందరంబును, సమీపవనోపవన పాదపోప దీపిత లతావితానసముల్ల సత్కిసలయకుసుమ సందోహకందమూల ఫలాది బంధురంబును సముత్కర్ష వర్షసంజాత శీతాత వాతాతపాది ప్రవేశ రహితాభ్యంతరబును మణిగణద్యుతి ద్యోతిత నిరంతర ప్రకాశప్రసరంబును మనోహరంబును నగునొక్కగుహాంతరంబుగని యందునివాసంబు జేసియుండిరివ్విధంబున 136

చం॥ సురుచిరదివ్యమూలఫల సూనయుతంబును మౌక్తికోపల
స్ఫురిత జలాఢ్య పల్వలవిభూషితముంబహు చిత్రవర్ష భా
సురతరలక్ష్యపక్షి మృగశోభితమైతగు పర్వతంబునం
దిరవుగరాఘవుండు వసియించెనులక్ష్మణుతోడనెంతయన్ 137

సీ॥ పురుహూత పురయాత గురుశీతతర వాత
పరిభూత పరిభీత విరహికంబు
శరధీశవరపాశ ధరదేశ వినివేశ
హరిదీశపరిణాశరాసనంబు
ధనకాంత హరిదంతరనిశాంతవిశ్రాంత
జనికాంత సునికాంత చంచలంబు
నతిమాత్ర శతపత్రహితపుత్రదిక్పాత్ర
కృతయాత్రగతిచిత్రతతఘనంబు

తే.గీ॥ నూతనద్యోత జీమూత జాత నీత
కౌతుకోపేతచాతక వ్రాతపీత
జాత సంపాత సంపాత జలకణంబు
సాగె పంకోద్గమంబు వర్షాగమంబు 138

కం॥ జలదంబులెసగెకరికిరి
బలదంబులు జాంబవాది ఫలదంబులు హృ
చ్చలదంబులు భూరిదవా
నలదంబులు సంప్రవృద్ధనలదంబులునై 139

సీ॥ గంధర్వమార్గ సంగతి బేరుగనుటుచే
నిరతఖలీన వైఖరుల చేత
విస్తారధారాతివేగవిస్ఫూర్తిచే
నమిత నిస్వనహేషితములచేత
దీపితద్యుతిమతి చాపసంయుక్తిచే
శరధిసాంగత్య విస్ఫురణచేత
స్యందనాగమముఖోత్సారప్రసక్తిచే
వాహినీవృద్ధిద వ్యాప్తిచేత

తే.గీ॥ నమర భర్తకు వాహంబులగుట జేసి
నైజవాహత్వమును దైల్పనైజరించె
వారివాహంబు లుదరప్రచారిభూరి
వారివాహంబులగుచునవ్వర్ష వేళ 140

ఉ॥ అంచలుబారె కేకులకునాటలు గేరె ఘనంబులూరె క్రొ
మ్మించులు గూరె శీతలసమీరము బారె మరుండుజేరె ము
న్ముంచుగ జాతిబాణతతి నూరెనటం బధికాళి ధైర్యముల్
గ్రించుకజారె మారెనల గ్రీష్మము మీరె జలాగమంబిలన్ 141

★శా॥ప్రేంఖల్లీల విశృంఖలస్థితిని బ్రేరేపింపనుచ్చైశ్రవః
కంఖాణుండు ఘనాళి నుండి జల రేఖాబిందు సందోహము
ల్పుంఖాపుంఖిని వేలులక్షలును గోట్లున్యర్బుదంబుల్ మహా
శంఖంబుల్ దివినుండి వ్రాలి పడియెన్ జంబూఫల ప్రక్రియన్ 142

కం॥ చూతము విచికిలకువలయ
జాతమశోకంబునంబుజాతమగు శర
వ్రాతము లేమిన్ విరహుల
గేతకతరవారి మీనకేతనుడడచెన్ 143

★ గద్వాల సంస్థానంలో లభించిన వాటిలో ఇది తొలి తెలుగు సమస్యా పూరణం.

చ॥ అదితిజనించి పుట్టగొడు గబ్బవిరోచన సంభవోగ్రతన్
బొదువుచు పూర్వది గ్వరసమున్నతియోగ్య మరుద్వహక్రియా
విదుడగు నీఘనుండల ద్రివిక్రముడేయగు నౌనుగానిచో
మొదలను కొంచకొంచమయిముట్టుచునిజ్జగమాక్రమించునే 144

సీ॥ నరులనెల్లను నభశ్చరులను గావించె
దరణినంతట నమృతంబునించె
నస్వప్నముఖ్యడౌహరినిద్ర నొందించె
చండరశ్మిప్రతాప జవమడంచె
సుదినంబులకు దుర్దినదశాప్తి కొందించె
క్షణదాయతికిదీర్ఘ గతిఘటించె
నల్పతరులనెల్ల నతిశయంబొనరించె
బురవాసులకు వనేచరతబూన్చె

తే.గీ॥ స్వప్రభావాప్తి నిజమహోచంచలాప్తి
పగలురే రేబగల్ జేయనగు సమర్థు
డీఘనుండని దెల్ప మ్రోయించె సమయ
యామికుడు నీలకంఠ కంఠైకఘంట 145

ఉ॥ ఉన్నతచంద్రికస్ఫురణనుష్మదినాంతమునందు కాళికా
సన్నిధి నీలకంఠకృత సన్నటనంబు లెసంగెనౌనెకా
యున్నత చంద్రకస్ఫురణ నుష్ణదినాంతమునందు కాళికా
సన్నిధి నీలకంఠ కృత సన్నటనంబులెసంగకుండునే 146

చం॥ సమధికలీల నాదిహరి శబ్దములున్ వినినీలకంఠ శ
బ్దములునట న్వినందొణగె తజ్జలదుండుఘనప్రసిద్ధిచే
నమరగ సర్వతోముఖ మయాత్మకుడౌనటుగాదె రెండు శ
బ్దములవియున్ వినంగ నమృతప్రద రీతికి హేతువుల్గదా! 147

తే॥గీ॥ కూత పంచమవృత్తి గైకొనిమధు ప్ర
వేశమున నుండు కోకిల వితతి బాయు
ఘనుల కవిలేమి దోచుట గనకయుండ
నిలిచి నభమున వానకోకిలములాడె 148

చం॥ ఎడపకపంక సంగతులు హెచ్చెనునిచ్ఛలు దుర్దినంబులై
బొడమె తపస్స్వరూపములు బోయెజడాత్ముడు భూరి చంచలా
త్ముడు మలినాత్ముడైన విషదుంగనుసంగతిమాకయోగ్యమం
చడకువచేజనెం బరమహంసలు పుణ్యజనేశ్వరాశకున్ 149

కం॥ రామునికి దోడుపడి త
ద్రామనుగను మనుచు దెలుపు తనయుని కిదిమా
సేమమనుచుబనిచిన సు
త్రాముని దూతయన మారుతంబటవీచెన్ 150

కం॥ వరుణుని సుతుడగుమునియొక
హరి చాపమొసంగెరామ హరికవిపెక్కుల్
వరుణుండీదలచెనొయన
హరిచాపచయంబులెసగె నవ్వరుణుదెసన్ 151

చం॥ వితరణియయ్యెనంబుదము వృష్టిదినంబుల దత్సహాయతన్
వితరణియయ్యె నంబరము వేమరునంతయువారి సంగతిన్
వితరణులయ్యు నయ్యెడ భువింగల తుంగతరంగిణుల్ సము
ద్యతి నటులౌగదా! ఘన సమాశ్రయముల్ భువన ప్రసిద్ధముల్ 152

కం॥ మరుదూఢ స్వరిభముఖ
స్ఫురదురు సింధూర పూర భూరిరజమనా
నెరసె కదంబకదంబక
పరాగపూగము సరాగపరిణతి జగతిన్ 153

తే॥గీ॥ భర్తనిదురించుతరి పనిబాట లేమి
క్షివధూటికి పెన్నెరుల్ సిక్కుదీర్చి
వేళయనుబోటి పాపటల్ విచ్చెననగ
జగతి నెల్లెడ హలముల చాళ్లు వెలసె 154

వ॥ మరియు నవ్వర్షావసరంబు సరోజాక్షుని శయన సమయంబగుట సమయరక్షకుండు పరిభాగ రక్షణార్థంబుగా నంతరిక్షంబునన్‌గట్టిన నీలపట్టుల మేలి కట్టులనంగనుపట్టు మేఘవితానంబులును, మేఘ వితానంబులు నూతనవితానంబులగుట వాతాహతిబెట్టు పటపటా త్కారంబులనందనరు నురుములును, నురుములతరుచున్ దన్నిర్గత నిర్ఘోష నిర్ఘాతంబుల నదరి కమలజాండంబుల నదరి వ్రీలిన దానందోచు తదండచరమ భాగవర్ణరోచులన మెరుచుమెరుపులును, మెరుపులు మెరవనొరసియా

వ్రీలికయందు సందుబడియు పరిగత వీరంబు జారెననం జారు వర్షధారలును వర్షధారలు హేరాళంబు లగుటనై యండంబునంగల కర్పర ద్వయంబుననుసంధింపబోసిన సీసంబు ప్రవాహ జవాహతిన్ గోసి శకలంబులై వ్రాలెననరాలు కరకలును కరకలవెంబడిందాన నింద్రుండు బంధించిన తామ్ర శలాకలు ఖండంబులై పడియెననంబడు నింద్రగోపంబులును నింద్ర గోపంబులంగని ఘనవర్తకుండు దనకున్‌గా బంపిన నిద్దంపుకెంపు లని ధరామణివానికి పణంబుగా నుంచిన నిష్కంబులన నెసగుకు సుమంబులుంగల శిలీంధ్రంబులును, శిలీంద్రకందంబుల తుండంబుల నించనేతెంచు వనవరాహంబులుంగలిగి వరాహావతా రంబునుం బోలె సుపదధారావిభేదిత భూతలంబై, కవిప్రబంధం బునుంబోలె కందవనమయూర మండూకప్లుతాది వృత్త విజృంభితంబై, మహానదియునుంబోలె శతహ్రదానేక సంకులంబై, హరికారు ణ్యంబునుంబోలె సారంగ రక్షకంబై, కృష్ణ పక్షరజనియుం బోలె రాజహంస ప్రకాశాచ్ఛాదితంబై, శూరకరంబు నుంబోలెమణి చాప శరాన్వితంబై మరియును శరదాగమంబయ్యునునశర దాగమంబై, పంకజాతకరంబయ్యు నపంకజాతకరంబై, కువలయా శ్రియంబయ్యు నకువలయ ప్రియంబై, సదాగతి సహాయంబయ్యును నసదాగతి సహాయంబై, వాహినీ ప్రచారంబయ్యును నవాహినీ ప్రచారయోగ్యంబై యట్టి వృష్టి వాసరం బెసంగెనంత 155

కం॥ ఆవార్షికదినములలో
దేవర్షి సముండురామ దేవుడు లీలన్
బ్రావర్షణ గిరియుండెను
నావర్షముబోవు దనుకనమ్మణి గుహలన్ 156

ఉ॥ నూతనవాతపోతము ననూన సచంచల మేఘజాతమున్
జాత సువర్ణ కక్ష్య గజజాతమునద్భుత రీతిజూచుచున్
జేతము బ్రీతిసేయగను శ్రీపతిరాముడు సానుజుండునై
యాతరికందమూలక ఫలాశనుడై వసియించెనచ్చటన్ 157

తే॥గీ॥ నవతృణా స్వాద చిద్రసానందమొంది
యందుగల పక్షిమృగబృంద మాత్మ దృష్టి
గాంచిరాముని మూర్తి జలించకుండె
ధ్యాననిష్ఠావధానులౌ మౌనులట్ల 158

కం॥ గిరివనముల నరమూర్తిం
దిరుగగ పరమాత్ముడనుచు దెలసిరఘువరుం
సురగణములు ఖగవిహగ
స్థిర తనువులు బూనియతని సేవించెనిలన్ 159

- ఆరాధన విధానము -

సీ॥ అపుడొక్కనాడు రహస్యంబునందు నా
త్మానంద తత్పరుండైన రామ
విభునికూర్చి సమాధి విశ్రాంతిని బ్రసన్ను
డగునంత సౌమిత్రియధిక మైత్రి
వినయైక బక్తి నిట్లనియెనోరామ! నీ
పూర్వోక్త తత్త్వ వాక్పుంజములను
సకలమాయామనస్సంశయంబులు బాసె
నిపుడొక్కటివినంగనిచ్ఛయింతు

తే.గీ॥ యోగిజనములు సత్క్రియాయోగసరణి
తావకారాధనంబునునేవిధమున
జేసిజగతి కృతార్థులై సిద్ధిగాంతు
రావిధము దెల్పవే! నాకు దేవదేవ! 160

కం॥ వారిజభవుడును నారద
పారాశర్యాదియోగ పారీణులునో
శ్రీరామ! వచింతురునీ
సారారాధనమెముక్తి సాధనమగుచున్ 161

తే॥గీ॥ వనితలకు బ్రాహ్మణక్షత్ర వైశ్యశూద్ర
తతికిముక్తికి సులభ సాధనము తావ
కార్చనములోక హితముగా నానతిమ్ము
దీని ననుజుండ భక్తుండనైననాకు 162

తే॥గీ॥ అనిన నారాముడిట్లనుననుజు తోడ
వినుమువత్స! మదర్చనావిధికి దెలియ
నంతమింతయనంగరాదైన నీకు
సెప్పెదయథాక్రమముగ సంక్షేపముగను 163

మ॥ తనశాఖోక్త విధిన్ ద్విజత్వమున బ్రాప్తంబైన వర్ణత్రయా
జనమున్ శూద్ర జనాదులేని నిజవంశ ప్రోచితాచారవ
ర్తనలన్ శుద్ధతగాంచి సద్గురుముఖోక్తంబైనమన్మంత్రమున్
గనిమద్భక్తి జపించి సిద్ధి బడయంగానౌను నిష్టాయతిన్ 164

వ॥ తన్మం త్రవిధానంబెట్టిదనిన 165

తే॥గీ॥ పద్మతోగూడ తారకబ్రహ్మ నామ
వర్ణయుగము చతుర్థ్యంతవశత గూర్చి
యవలను నమః ప్రధాన పల్లవము గూర్ప
నైన మంత్రంబుబొల్చు షడక్షరంబు 166

కం॥ ఈ మంత్రము ప్రణవాద్యం
బైమోక్షమునిచ్చు పావకాద్యంబైనన్
కామితమిడు నెన్నిట నీ
రామషడక్షరము శుభపరంపరనిచ్చున్ 167

సీ॥ బిందుయోగముల తద్బీజంబులనెన్యాస
మావహింపుచుఋషి దేవతలను
చందంబు కీలకశక్తి బీజములు ము
న్ననుచుధ్యానించి సవ్యాపకముగ
మూలంబుగొనుచు సముద్రమౌనీమహా
మంత్రంబు ప్రణవాదిమంబుగాగ
తచ్చక్ర సన్నిధిదగననుష్ఠాన త
త్పరుడయి సంపుటీకరణమొలయ

తే.గీ॥ తజ్జపస్తోత్రములు తోడుతనుపఠింప
శాంతివశ్యాది షట్ప్రయోగాంతరేష్ట
సిద్ధి ఘటియించునవహిత చిత్తుడేని
జపితనిష్కామియేని మోక్షంబొసేయు 168

కం॥ కావున నీవిధి జపవరు
డై వరుసన్ దేశికోక్తమగు మార్గమునన్
గోవిదుడు భక్తి మత్పూ
జావిధికారంభణంబు సలువగవలయున్ 169

తే॥గీ॥ అరయహృదయంబునందైనననలమందు
నైన ప్రతిమాదులందైన నర్కునందు
నైనమరియు సాలగ్రామమందునైన
సలుపవలయుమత్పూజనిస్తంద్ర మతిని 170

వ॥ తత్క్రమంబెట్టిదనిన సౌమిత్రీ మద్భక్తుండగు బుధుండు సూర్యోదయం బునకుంబూర్వంబున మంగళాచరణంబుగాదేవతాస్మరణ పూర్వకంబుగా నుద్ధితుండై మృత్తికా శౌచవిధింగావించి బ్రధమంబుగా దేహ శుద్ధికై వేదోక్తంబులనేనియు తంత్రోక్తంబుగానేనియుం బ్రాతస్నానం బొనరించి కర్మసిద్ధికరంబు గావున నిజకృతంబులగు సకల సత్కర్మంబులందును మొదల సంకల్పంబొనర్పవలయు, మరియును మద్బుద్ధిచేత సద్గురునారాధించి నియతవ్రతుండును సమాహిత చిత్తుండునునై సాలగ్రామశిలయం దభిషేకంబును బ్రతిమాదులయందు సమ్మార్జనంబును విశేషించి బ్రతిమాదుల యందు నలంకారంబు నాకుబ్రియంబగునగ్నియందు హోమంబును భాస్కరునకు స్థండిలంబున నావాహించి బూజించుట యును మదీయహితంబులగుట పరిశుద్ధంబులును బ్రసిద్ధంబునగు గంధపుష్పాదుల చేతవంచనా రహితుండై యొనర్చిన మదర్చనంబు సకల సిద్ధి బ్రదంబగునని మరియును 171

కం॥ పూనికభక్తి శ్రద్ధన్
చేనిడు జలమైన బ్రియముజేయునునాకున్
గాన సుమగంధ భక్ష్య వి
ధానాదుల జేయు పూజదరమెవచింపన్ 172

తే॥గీ॥ దివ్యమునునైన నర్చనాద్రవ్యమెల్ల
యుక్తముగ గూర్చి పూజకుద్యుక్తుడగుచు
శుద్ధమతితోడ దేవతా సుముఖముగను
నజినచేలకుశాదుల నధివసించి 173

వ॥ అంతనిజ శరీరంబున నిర్మలంబునునమృతమయంబునుంగా న్యాసవిధానంబొనర్పనగు నందు బహిరంతర్మాతృకాన్యాసంబును కేశవాది న్యాసంబును మదీయమూర్తి పంజర న్యాసంబును నిత్యంబు నప్రమత్తుండై యొనర్పందగు బ్రతిమాదులయందు నివ్విధంబున విన్యసింపందగు తనముందట వామభాగంబున కలశంబును దక్షిణభాగంబున బుష్పాది ద్రవ్యంబులనునిచి యర్ఘ్యపాద్య మధుపర్కాచమనార్థంబుగా పాత్రచతుష్టయంబు బ్రతిష్ఠింపందగు నని మరియును 174

చం॥ సుకరముగా హృదబ్జమున సూర్యవినిర్మలమైన జీవసం
జ్ఞకమగుమత్కళందలచి సర్వమునొనిజదేహమందువ్యా
పకముగ తత్కళంజొనిపి భావనచే బ్రతిమాదులందున
ట్టి కళను నావహింపగ ఘటింపనగున్ నిరతంబు లక్ష్మణా! 175

వ॥ ఇవ్విధంబు నారాధకుండు బ్రతిమాసన్నిధానంబున మంత్రవిధానం బుగా యావచ్ఛక్యంబులగు షోడచోపచారంబుల పూజా తత్పరుండై 176

సీ॥ ధ్యానంబు హృత్పటాంతఃపద్మవర్తికి
నావాహనంబఖిలాత్మకునకు
ప్రణవ పీఠాగ్ర వర్తనునకు పీఠంబు
పాద్యార్ఘ్యములు తీర్థపాదునకును
స్నానంబు నారాయణపదైక వాచ్యున
కచ్ఛాంబరంబు విద్యావృతునకు
మండనంబులుదివ్య మంగళాకృతికిని
గంధార్పణంబు భూగర్భునకును

తే.గీ॥ సుమము ధూపంబు సుమనస్క సురభితునకు
జ్ఞానరుచికి దీపంబువైశ్వానరాత్మ
నకు నివేదన నీరాజనము తమోప
హరణునకు మంత్ర సుమమాగమాంతరతికి 177

వ॥ మరియు సర్వవ్యాపకుండగు నీకుం బ్రదక్షిణనమస్కారంబులని యిప్పగిదిం బంచామృత స్నానంబులను కర్పూరకుంకుమాద్యను లేపనంబులగు శుభంబులగు సుమంబులను సురభిళంబులగు ధూపంబులను వివిధంబులగు దీపంబులను నాచమనీయపూర్వకం బుగా బహు విశేషంబులగు చతుర్విధాన్న నైవేద్యంబులను పరిమళ మిళితంబులగు తాంబూలంబులను చిత్రంబులగు నుత్తర నీరాజనం బులను నాగమోక్త ప్రకారంబున దశావరణ సహితంబుగా మదర్చనంబొనర్పవలయునని మరియును. 178

కం॥ శ్రద్ధాయుక్తతపూజా
సిద్ధిని హరినైన నాకు జేయగనవునే
శ్రద్ధాభోక్తనుగావున
శ్రద్ధారహితమగు పూజసఫలంబగునే! 179

సీ॥ అంత హోమమొనర్ప నగు ప్రయత్నంబున
తగు నగస్త్యోక్త విధానమైన
యగ్నికుండంబున నాగమక్రమముగా
నౌపాసవాగ్నియందైనగాని
మంత్రశీలుడు మూల మంత్రంబుచే నైన
కాదేని పురుష సూక్తమునైన
నట హవిస్సున నైన నన్నంబుచే నైన
నాజ్యయుక్తత హోమ మాచరించి

తే.గీ॥ తప్తకాంచనసంకాశ దీప్తిసహితు
దివ్య భూషణభూషితు దేహమహితు
ననల మధ్యస్థు నగ్నిహోత్రావసరము
నందు ధ్యానింపవలయు నిత్యముబుధుండు 180

వ॥ అంతసమీపవర్తుగు పరిచార దేవతకులన్ బలిప్రదానంబుగా హోమశేషంబు నియోజించినియతంబున నన్ను స్మరియింపుచు ధ్యానింపుచు జయమంగళాచరణంబొనరించిముఖవాసన తాంబూ లాదులొసంగి మదర్థంబుగా నృత్యగీతస్తుతి పాఠాదులంగావించి హృదయంబునన్ దలంచి సాష్టాంగ దండప్రణామం బాచరించి మద్దత్తంబగు ప్రసాదంబు మద్భావనంజేసి శిరసావహించి మచ్చరణంబులు కరంబుల శిరంబున గ్రహియించి భక్తియుక్తుండై ఘోర సంసారోత్తారణంబున నన్ను రక్షించుమని నమస్కరించి యథాపూజితంబుగాప్రత్యగ్జ్యోతిస్థితుండగునట్లు భావించి యుద్వసించ వలయునని మరియు నిట్లనియె. 181

కం॥ ఈవిధిమత్పూజాసం
భావన మొనరించిరేని మదనుగ్రహ లీ
లావృతి నిహపరలోక
శ్రీవిభవములందు సిద్ధిజెందుదురు జనుల్ 182

ఆ॥వె॥ నాకు భక్తుడగుచు నాసపర్పణమును
సతతమీవిధమున సలిపె నేని
నరుడు ముక్తుడౌచునాదు సామీప్యంబు
నందగాంచు సందియంబు లేదు 183

చం॥ ఇదియురహస్యమున్ పరమమేనె సమక్షగతిన్వచించితిన్
విదితము గాగ నాద్యము పవిత్రమునైన మదర్చనావిధం
బిదియగు సావధానమతి నెవ్వడు దీనినిభక్తియుక్తుడై
చదివినవిన్న నర్చనము సల్పుఫలంబు లభించు వానికిన్ 184

కం॥ అనుచుబరాత్ముడు రాఘవు
డనయంబుత్తమమునగు క్రియాయోగంబున్
జనభక్తుడు శేషాంశుం
డనఘుండగు లక్ష్మణునకు నడిగినజెప్పెన్ 185

ఉ॥ ఈకరణిన్వచించి జగదీశుడు రాఘవుడంతలోకులన్
వీక భ్రమింపజేయుటకు వెండియు వృష్టిదినంబులందు మా

యాకలితాత్ముడై దలచిహాజనకాత్మజ! సీత! యంచునుం
బ్రాకృతునట్లు శోకమునబాల్పడిచింతిలెనిద్రజెందకన్ 186

తే॥గీ॥ రవియు కర్కటకము జేరరామచంద్రు
డపుడు మేఘాప్తి వలన శైత్యానిలమున
దలచి సీతావియోగ సంతాపమందె
జన్మ సూర్యుండు బాధింప జాలకున్నె 187

కం॥ ఆలోకిష్కింధాపురి
నాలోచనవంతుడైనహనుమంతుడటన్
హేళి సుతుం గపివరుగని
హాళిరహస్యముననిట్టులనుచున్ బలికెన్ 188

సీ॥ కపివర్య! నీకు ముఖ్యంబుగాహితమును
గరపెదవినుము రాఘవుడు మున్ను
బూనినీ కుపకారమును జేసెనెంతయు
నదియుగృతఘ్నుండవగుచు నీవు

మరచినరీతి నామది దోచెడి నిజంబు
నీకుగావీరుని నిఖిలలోక
సమ్మతువాలిని జంపి రాజ్యమొసంగె
దుర్లభయగు తారదొరికె నీకు

తే.గీ॥ నట్టి రాముడు ధీమంతుడచట బర్వ
తాగ్రమున భ్రాతతోడుతనధివసించి
కార్యభారాప్తి నీరాక కాంక్షజేసి
యొంటి నుండినిన్నీక్షింపుచున్నవాడు 189

వ॥ కావున నీవు వానర స్వభావంబున గామినీసక్తుండవై యెరుంగ నేరక మున్ను సీతాన్వేషణంబొనర్చెదనని ప్రతిజ్ఞంజేసి తద్విధంబెరుం గక కృతఘ్నుండవైతి విందు వలన వాలించందంబున నిజంబుగా నిధనంబు నొందగలవనిన వాయునందను వచనంబువిని సుగ్రీవుండు భయవిహ్వల స్వభావుండై నీవచనంబు సత్యంబగుంగదా యని పలికి మరియు హనుమంతుతోడంగపి సత్తమా! నీవు సత్వరంబున నిత్తరి మదాజ్ఞాయత్తంబుగా జవసత్వపరులగు దశ సహస్ర కీశవరుల దశదిశా ప్రదేశంబులకుంబనిచి సప్తద్వీపస్థితులగు సమస్తవానర పతులందోడి తేరంజేయుము, నావృక్ష చరులందరు పక్షంబులోన వచ్చునట్ల నాజ్ఞాపింపుము నందెవ్వడు పక్షంబునకు రాక తక్కునతండు నాచేత యధార్థంబుగా

వధార్హుండగునని నియమించి భానునంద నుండు మందిరాభ్యంతరమునకుంజనియె నంతమంత్రి
సత్తముండు నుం ప్రజ్ఞాయుక్తుండునునగు నమ్మరుత్తనయుండు సుగ్రీవాజ్ఞా పురస్సరంబుగా
నాక్షణంబయగణ్య సత్వసారులును వాయువేగ ప్రచారులగు పర్వతాకారులునునగు వానరవీరులగు
దూతల దాన మానాది సత్కారంబుల సంతృప్తులంజేసి యతి రయంబున సకల దిగంతబులకుంబనిచె
నాసమయంబున 190

చం॥ కమలభవానుమోదశుభకారివి పాండురనాదరాగమో
ద్గమము శితాంశుమండల వికాసద మంచిత వర్ణశాలిస
త్తమఫలదంబు రాగకలితస్ఫుటయోగవిలాస కచ్ఛవి
క్రమమిల శారదాగమము గన్పడెహంసగమాభిరామమై 191

శా॥ జంఘామాత్రములయ్యెనిమ్న గలుస్వేచ్ఛన్ బాండుపక్షాళికిన్
జంఘాలత్వముగల్గెనభ్రగతి నచ్ఛద్యోతమై వారిభృ
త్సంఘాతంబు జరించె తద్గత పయోధారాంశముల్శుక్తికా
సంఘృష్టిన్నవహారయోగ్యమణులై సంధిల్లెనవ్వేళలన్ 192

సీ॥ జడివిదేశతనుండు జనవచ్చుపతిగూడు
చెలికి వండేర్లకు కలకదేరె
తతియధేచ్ఛా ప్రవర్తితహంసలకు నెమ్మి
జాతికి మానస చలన మొలసె
తొలిపుట్టడాగు భోగులకు నిద్రించుట
విష్ణునకును లేచు వేళయయ్యె
వార్షికద్రుమదళవ్రాతంబునకు శాలి
పైరునకును పండు బారుటొదవె

తే.గీ॥ మొదల దార్కొను వారిదంబులకు దిక్ప్ర
దేశమునకును విశద ప్రకాశమెనసె
నవనిజయ కాంక్షి కృపదండయాత్రలకును
జలజ పాళికి దళముపైదళములెక్కె 193

కం॥ విభ్రమణ విభ్రమోధ్య
చ్ఛు భ్రగరుద్గురు పతత్ర శుభ్రవిభాళీ
సభ్రమ మొనర్చెన భ్ర
శ్వభ్రమున నదభ్రగతుల శరదభ్రంబుల్ 194

మ॥ మును శాల్యంతరకహ్వ సంహతిపయింబున్నాగసూనంబులా
వెనకన్ బ్రోత్సవదీపికల్దదుపరింవింటమ్మరాళమ్ములం
తనుమాసంఘములాపయిన్ మొగులుతున్కల్మీదధారావళు
ల్గన బొల్చెన్ సుమనస్సరంబన కరత్కాంతా వియద్వేణికన్ 195

కం॥ మును నారదాప్తిగనుటను
ఘనములపుడు నారదాస్తి గనెనన హంస
ధ్వని వీణాశ్రుతి సుచిగతి
గనదగియెన్ స్వాతి శుభ్రకరకాంబువులన్ 196

సీ॥ విశదకాందంబినీ విహృతులు విలసిల్లె
విశదకాదంబినీ విహృతి వెలసె
పున్నాగవిలసన స్ఫూర్తులింపెసలారె
పున్నాగవిలసన స్ఫూర్తులెసగె
వాహినీ వర్ధన వ్యాప్తులుదనరారె
వాహినీ వర్ధన వ్యాప్తిదనరె
కువలయామోదవైభవములునల రారె
కువలయామోదవైభవములలరె

తే.గీ॥ రాజహంసల ప్రస్థానరమజెలంగె
రాజహంసల ప్రస్థానరమ జెలగె
రాజహంసల ప్రస్థాన రమజెలంగె
భాసురంబైనయల శరద్వాసరమున 197

వ॥ మరియు నట్టి శరత్సమయంబు సమయరంజితంబగు కాశకుసుమ మంజరీ పుంజంబు నిర్మలినంబగు నంబరంబునంబ్రతిఫలించెనన విడంబించు శరదంబుదంబులును, శరదంబులు విశదాంబరంబు లనుచుం గ్రహించు వర్షవారి స్నానసంగతులగు దిగంగనలును, దిగంగనల హారంబులనం బారుమరాళమాలికలును, మరాళ మాలికలు లతాందోళికలనిదూగవచ్చు తత్సమయవనలక్ష్ములు, వనలక్ష్ములగనుంగొను ముకురంబులన సుకరంబులగు సరసీ నికరంబులును, సరసీనికురంబులకు బురుషపతంగ సంగతిం గలుగు పులకంబులనంబొలుచునంబుజంబులును, నంబుజంబు లాసవా వాసంబులని పధుపంబులగుట ననేక విలాసంబులనెసంగు భృంగంబులును, భృంగంబులొనర్చు శృంగార రావంబులు శరద్వాస రోదయంబులంబొదలు భూపాలముఖ్యంబులగు మేలుకొలుపులని మేలుకొను నారాయణుండనం గలిగి యొప్పెనప్పుడు 198

సీ॥ మాల్యవచ్ఛైలాగ్రమణిసానువుల యందు
రజనీముఖంబున రాఘవుండు
సీతావియోగ సంజాతశోకము సహిం
పగలేక భ్రాతతో బల్కెనిట్లు
భ్రాతదైత్యుని చేత బల్మిచేనపహృత
యైన మత్సతిసీత యవని జాత
బ్రాణసమేతయై బ్రతికియున్నదొ! లేదొ!
నేటికి దెలియంగ నేరనేను

తే.గీ॥ నెవ్వడేనియు తక్షేమమెరుగ జేయు
నతడు హితుడగు నాకునెందైననమ్మ
హీజజీవితయనుచు నేనెరిగితేని
బలిమిగొని వత్తు సుధనబ్ధివలనబోలె 199

కం॥ భ్రాతవిను! మత్ప్రతిజ్ఞా
రీతిని మత్సీతనపహరించెను నెవ్వం
డాతని సుతహిత కులబల
జాతాన్వితముగను భస్మ సాత్కృతి జేతున్ 200

వ॥ అని మరియును 201

కం॥ కానకమము దానవుల భ
యానక గృహసీమ నునికి హాచంద్రముఖీ!
జానకి నీవికశోకము
నూనిక బ్రాణములతోడ నుండంగలవే! 202

ఉ॥ చంద్రుడు భానుడయ్యె ఘనజాలము జాలమునయ్యెనీశర
శ్చంద్రికవహ్నియయ్యె దివసంబులు కల్పములయ్యెవాసనా
సాంద్రసమీరవారము విషప్రసరంబుగనయ్యె జానకీ
చంద్రముఖీ వియోగవివశస్థితి నొందిన నాకునెంతయున్ 203

తే॥గీ చంద్రముఖి యొటసమ్ముఖసరణిగనుట
జేరి నీశీతకరముల శీతకిరణ
సీతనుస్పృశించి నన్ను స్పృశించుమవల
నందుచేనైన నాకు నానంద మొందు 204

వ॥ అని మరియును 205

కం॥ సీతావిరహము చేతన్
శీతాంశుడు నన్ను మరియు శీతానిలమున్
శీతాంశుని జామాతయు
చేతోదాహంబొనర్ప జేకొని రెలమిన్ 206

కం॥ మొగమోట జనక తనయకు
జిగిగుందియటుండియిపుడు చెలిబాసినచో
పగలెన్నడు నెరిబూనని
తొగరేడును నేచదొణగె దోషాకరుడై 207

చం॥ కరివరయాన చంద్రముఖి గావున జానకితత్సహాయ వి
స్ఫురణనెసంగు నన్నుమును సూన శరుండడరించు నట్టియా
సరసిజబాణముల్ జెనక జాలకయుండెను నీడుతత్సతీ
విరహము జెందదో మరుడు వేధయొనర్చెడిదచ్ఛరంబులన్ 208

తే॥గీ॥ కానలోనాడు నాడుచు కాంక్షనేమొ
ధరణి సుతమాట జవదాట వెరచియిపుడు
బాలికామణిదత్సతి బాయుటెరిగి
చిలుకయిటులేల మొకమెర్రజజేసి పలుక! 209

కం॥ వనమున నేకగ్రీవత
జనకజతో గాంచిమున్నుసైరించియటన్
జనకజ బాసినగూసెడు
పనిబడికోకిలము పక్ష పాతముచేతన్ 210

కం॥ ధరణీజనడక దమకుం
సరివచ్చిన కాళ్ళమెలగి సతిబాసిననే
డరయన్ రంధ్రాన్వేషము
గరపగ నేమిటికి హంసకాండంబులకున్ 211

మ॥ సతిసాంగత్యములేమి నేడు మరుడేచన్ సాగెడుం సాంకవ
ప్రతతామోదను బాయుటన్ శుకపిక వ్రాతంబు వేధించె న
ట్టితమోవేణియు లేనిచో శశియు వేడింజూపెడింగాన నా
క్షితిజాతాదృతినందకన్ ధృతిలతాశ్లేషంబును న్వీడెడున్ 212

సీ॥ తనపేరుముఖ్య రీతిని వహించిన నైన
చంద్రుడాగ్రహవృత్తి సడల డయ్యె
తనశత్రు చాపఛేదన మొనర్చిననైన
మరుడు దర్పకవృత్తి మరువడయ్యె
తనతనూజుని సమాదరత బ్రోచిన నైన
పవనుండు తీవ్రత బాయడయ్యె
తనకున్కియగు వనస్థలి వసించిననైన
మథుడువిపక్షాప్తి మానడయ్యె

తే.గీ॥ తమదుబలె సుగుణస్థితి దగిననైన
నళులు మలినగుణాంబులు దలగవయ్యె
ననుచు సీతావియోగ యోగాను భూతి
దొడరి వెతనొంది రామచంద్రుండు మరియు 213

కం॥ ఇందుముఖి లేని కతమున
గ్రందుక రవినందనుండు రానికతమునన్
బొందిక వియోగ తమమున
జెందక నేనెట్ల సుఖము జెందంగాంతున్ 214

సీ॥ ఖర కరసూనుండు కరుణావిహీనుండు
శోకమందెడునన్ను జూడ రాడు
రహిత కంటకమైన రాజ్యంబు బ్రాపించి
యేకాంతమున కాంతలెనయ గాంచి
యతి కాముకుండు పానాసక్తినుండు కృ
తఘ్నుడీతండు వ్యక్తంబుగాగ
నీశరత్కాలంబు నీక్షించియైనమ
త్ప్రియసతి వెతికింప పేర్మిగనడు

తే.గీ॥ మున్ననుపకృతి జేసిన నన్నుమరచె
దుష్ట సుగ్రీవుడుపకారదూరుడగుట
పుత్రమిత్రాన్వితముగ నిప్పుడు రణోర్వి
రాలు నాచేత రవిసూతి వాలిరీతి 215

మ॥ అనిరోషోద్ధతుడైనగాంచి రఘువంశాధ్యక్షుతో లక్ష్మణుం
డను నేనిప్పుడు బోయి దుష్టమతియౌ నయ్యర్కజుంద్రుంచి వే
జనుదెంతున్ భవదంతికంబునకు నాజ్ఞాపింపుమీరామ! న
న్నని చాపాశిశరంబు బూనియతడొయ్యం బోవనుంకించినన్ 216

కం॥ సౌమిత్రిని గనుగొని సం
గ్రామోద్ధతు నిలిపిపలికె రాముడు వత్సా!
యీమిత్ర తనూజునితో
నేమైత్రిని సలిపినాడ నెంతయు బ్రేమన్ 217

తే॥గీ॥ కానసుగ్రీవువాలి వైఖరినొనర్ప
గాదు భయపెట్టి కార్యంబుగనగవలయ
నగుట నీవచ్చటికి నేగియతనిగాంచి
కలిసి భాషించియతని వాక్యములు దెలియు 218

కం॥ ఆవాక్యంబులలోపల
భావాభావంబులెరిగిప్రస్తుతరీతిన్
గావింపుదము నిజంబుగ
నావలివిధమనుచు రఘుకులాగ్రణియనినన్ 219

కం॥ భీమబలుండగు లక్ష్మణు
డామాటకు నియ్యకొని యుదగ్రక్రోధ
స్తోమంబున కిష్కింధా
ధామంబున కరిగె కపుల దహియించుగతిన్ 220

సీ॥ సతతలక్ష్మీవర్తి సర్వజ్ఞ మూర్తి వి
జ్ఞానాత్ముడయ్యునిక్ష్వాకు విభుడు
బ్రాకృత జనురీతి బ్రాకృత సతి భాతి
వలచి సీతను గూర్చి వగలబొగిలె
బుధ్యాదిసాక్షియై పొసగమాయామయ
వర్తిత కార్యాతి వర్తియగుచు
రాగాదిరహితుడై రంజిల్లనతనికి
నీమోహ కృతకార్య మేల కలుగు

తే.గీ॥ మాయచేతను మోహిత మతులు నగుచు
సకల జనములు నజ్ఞాన సహితులైన
వీరికేరీతి మోక్షంబు జేరగలుగు
ననుచు జింతించె శౌరిదయావిహారి 221

శా॥ ఈలోకంబు గృతార్థతం బరప లక్ష్మీశుండు రామాయణా
ఖ్యాలీలాత్మ కథా ప్రపంచమతి విఖ్యాతంబుగాగం దదీ
యాలోక శ్రవణాప్తిచే నఘములొయ్యంబోవ మాయావిడం
బాలోలస్థితి రాముడై దగిమనుష్యత్వంబునన్వర్తిలెన్ 222

వ॥ కావున నవ్విభుండు సకల వ్యవహార సిద్ధ్యర్థంబుగా కామ క్రోధాది గుణంబులంగ్రహించి గుణరహితుం డయ్యును నఖిలగుణంబు లయం దనురక్తుండునుంబోలె నవశంబునం దత్తత్కాలోచిత కృత్యంబులం బ్రవర్తించి సమస్తజనంబుల మోహింపంజేయునది యెట్లంటేని విజ్ఞానమూర్తియు విజ్ఞాన శక్తియు సర్వసాక్షియు నిర్గుణుండునునగునతండు నభంబు సర్వగతంబయ్యును తత్తద్గుణం బుల నంటనివిధంబున నిర్లిప్తుండయ్యును నిత్యంబునుంగామాది గుణంబుల నవలిప్తుండై గుణాత్మకుండగు విధంబున గనుపడుం గావున 223

తరల॥ మునులెరుంగుదురొక్కకొంతయు ముఖ్యులౌజనకాదులౌ
ఘనులెరుంగుదు రొక్కకొంతయుగట్టిగావిమలాత్మ వ
ర్తనులు భక్తులు దెల్తురంతయు తద్విభున్ భగవంతునిన్
జననమందుట భక్తవృత్యనుసారియైయజుడాతడున్ 224

వ॥ అంత. 225

మ॥ అపుడాలక్ష్మణుడేగి కీశకులఘోరావాప్తి కిష్కింధకున్
విపులజ్యారవముం ఘటింపనతనిన్వీక్షించి సామాన్యులం
గపులెల్లన్గని నిల్చిరచ్చటను ప్రాకారాగ్రముల్ జేరిపా
దప పాషాణములూనియుం గిలకిలధ్యానంబనూనంబుగన్ 226

కం॥ ఆ మర్కట పటలిం గని
సౌమిత్రియుగ్రోధ తామ్రచక్షుండగుచున్
భీమబలుడు ధను వెక్కిడి
యామూలముగాగవారినణపందలచెన్ 227

ఉ॥ అంతట నేగుదెంచి నగరాగతు లక్ష్మణుగాగగాంచి యం
తంతట నోరగా గపులనందర నుంచియమాత్యసత్తముం

డెంతయునంగదుండు దగవెంచివెసన్ బరతెంచి జేరన
త్యంత భయంబు భక్తి గనదండనమస్కృతులాచరించినన్ 228

సీ॥ అంతనంగదుడాసియాలింగనముజేసి
సౌమిత్రియుత్తమప్రేమ వృత్తి
ననియెనువత్స! నీవరిగి రౌద్రాకారు
డగునట్టి రఘువీరుడనుపనిటకు
వినులక్ష్మణుడు వచ్చెననుచునారాక మీ
పిన తండ్రికిని చెప్పుమనిననతడు
నగుగాకయనివేగనరిగి సుగ్రీవుని
గనిరోగదృష్టి లక్ష్మణుడు వచ్చి

తే.గీ॥ విడిబహిద్వారమందున్నవాడటన్న
దానివిని భీతియుతుడయి భానుసుతుడు
మంత్రి సత్తముడగు హనుమంతునంత
బిలువగాబంచినతనితో బలికెనిట్లు 229

కం॥ నీవునునంగదు గొని చని
వేవేలక్ష్మణుని గాంచి వినయంబున కో
పావృతుని శాంతిజేయుచు
నా వీరుందెమ్ముమద్గృహంబున కెలమిన్ 230

చ॥ అనిహనుమంతు బల్కి ప్లవగాగ్రణితారనుగూర్చి పల్కునీ
వునుసని లక్ష్మణుంబ్రియము బూని మృదూక్తుల శాంతుజేసియం
త నగరు సేర దెచ్చి మరిదర్శనమున్ ఘటియింపు నాకునీ
వనఘ! యటన్ననవ్వనితయౌనని సేరెను మధ్యకక్ష్యమున్ 231

సీ॥ అంతటహనుమంతుడంగద సహితుడై
సౌమిత్రియంతిక సీమ కరిగి
శిరమున నంజలిసేర్చి ప్రణామంబు
గావించి భక్తి స్వాగతమునడిగి
విదిత శౌర్యమహాత్మ! యిదిమీగృహము సుమ్ము!
చనుదెమ్మువేరొక్క శంకయేల
నటవచ్చిరాజ దారాదుల సుగ్రీవు
నరసి మీరెయ్యది యాజ్ఞయిడిన

తే.గీ॥ నదియు సర్వంబుగావింపనగును పిదప
ననిపలికి లక్ష్మణుని హస్తమాత్మహస్త
మున గ్రహించి యమ్మారుతి పురములోని
కతని గొని తెచ్చిరాజగేహమున కరుగ 232

తే॥గీ॥ అందుయూథాధిపులు మహాహర్మ్యపంక్తి
నంతటయు జూచుటయు మహేంద్రాలయంబు
ననుకరించెడిరాజ గృహంబుసేరి
వారలట మధ్యకక్ష్యంబు జేరనరుగ 233

తే.గీ॥ తారమదరక్తయుక్త దృక్తారతార
కాధిప సమానకోదారయఖిలభూష
ణాంశువిస్తార సౌమిత్రినచటగాంచి
మ్రొక్కిస్మితపూర్వభాషణముల వచించె 234

కం॥ దేవరకుశలమె! మీకును
నీవును సాధుడవు భక్తి హితవర్తివి సు
గ్రీవుడు భక్తుడు భృత్యుడు
గావున కోపంబిదేలకావుముమమ్మున్ 235

సీ॥ బహుకాలమును కష్టపడుచునూరటలేక
నటమున్నుదుఃఖమేయనుభవించె
నిపుడు దుఃఖసమూహమెల్లబాయగద్రోసి
చేరిమీచేతరక్షింపనయ్యె
నీమహీపతియగు నినసుతుండు భవత్ప్ర
సాదమునను బ్రాప్తసౌఖ్యుడయ్యె
గావున కపిభర్త కామానుషక్తుడై
రామసేవార్థంబు రాకతక్క

తే.గీ॥ ఘనమహీధర నిభులదిక్తతులనుండు
కపివరుల బిల్వ బదివేల కపులనితడు
బంచియున్నాడు సకల దిగ్భాగచరులు
వనచరులు వత్తురిక రఘువంశతిలక! 236

ఉ॥ వచ్చిన కీశయూథ పరివారముతో రవినందనుండు దా
వచ్చి నిశాటకోటి దశవక్త్రుని ద్రుంపగలండు నప్పుడే
వచ్చును మిమ్ము గూడి కపివర్యుడునంతిపురంబులోనికి
న్వచ్చికుమార దార హితవార పరీవృతు గాంచుమాతనిన్ 237

కం॥ కని యభయమిచ్చి నీతో
గొనిపొమ్మిన సుతునటన్న కోమలివాక్యం
బునువిని కోపమెడలి చ
య్యననాలక్ష్మణుడు చనియెనంతఃపురికిన్ 238

వ॥ ఇట్లు చనియయ్యంతఃపురంబున నత్యంతసుఖతూలికాంకంబగు పర్యంకంబున రుమాంగనాసమాలింగితుండై శయనించియుండు సుగ్రీవుండచ్చటికి వచ్చిన లక్ష్మణునింగని వెగ్గలంబుగా బెగ్గడిల్లి దిగ్గనలేచినన్ జూచి లక్ష్మణుండు సమాలక్షిత క్రోధుండై మదవిహ్వలి తాక్షుండగు వృక్షచరాధ్యక్షునితో నీవుదుర్వృత్తుండవై రఘుసత్తముని యెడ విస్మృతుండ వైతివగుట తొల్లిశౌర్య శాలియగు వాలియే శరంబున నాశంబునొందె నాశరంబున నిన్నుం ప్రతీక్షింపుచున్న యదియునుంగాదేని నాచేత హతుండవై నీవు నవ్వాలి చందంబు నొందగలవని విశేషంబులగు పరుషభాష ణంబులంబలుకు సుమిత్రా పుత్రుం గూర్చి యత్తరి యిత్తెరంగున రోషించి భాషించెద వేలయని వచన చాతుర్య వంతుండగు హనుమంతుండిట్లనియె. 239

సీ॥ ఈ కపివర్యుండు నీకన్న నత్యంత
భక్తుండునగురామభద్రునకును
అనిశంబు రామకార్యార్థంబు జాగ్రత
తోనుండునట విస్మృతుండు గాడు
కనుమంతటను మహాకపులసంఖ్యాకులై
వచ్చిన వారు భూవరకుమార!
అతిశీఘ్రమెసగంగ నవనిజవెతకంగ
నరుగంగగలరు దిగంతములకు

తే.గీ॥ రామకార్యంబు సర్వంబురవిసుతుండు
దెలిసి శోధింపసాధింప గలడటన్న
ననిలసుతసూక్తి వినియునాహరుల గనియు
లజ్జనొందెనిజోక్తికై లక్ష్మణుండు 240

శా॥ సౌమిత్రిందగ నర్ఘ్యపాద్యముఖ పూజంజేసి సుగ్రీవుడున్
బ్రేమన్మించి కవుంగిలించి యనియెన్ పృథ్వీశనే దాసుడన్

రామస్వామికి నీకు రాఘవుడు శౌర్యస్ఫూర్తి గెల్చెన్ దిశా
స్తోమంబేను సహాయమాత్రమె కపిస్తోమంబుతోనెంతయున్ 241

కం॥ అనినన్ సౌమిత్రియు న
య్యినజుని గనినాదు వాక్యమిదియు మహాత్మా!
మనమున బెట్టకునాచే
ప్రణయంబున బలుకునట్టి భాషితముసుమా! 242

- సుగ్రీవాగమనము -

కం॥ ఓకపివర! బోవుదమిపు
డాకాన వసించు రాముడొగాన నతం
డే కాకియు శోకాతురు
డాకడ సీతావియోగి యగుటనచటికిన్ 243

తే॥గీ॥ అనిననగుగాకయనుచురథాధిరోహ
మాచరించి సౌమిత్రితో హరులతోడ
గదలి వానరరాజు భాస్కరతనూజు
డంతరామాంతికంబున కరుగదలచి 244

శా॥ భేరీశంఖమృదంగవాద్యరవముల్ బెంపారగాజాంబవ
త్తారాసంభవ నీలమారుతి ముఖోద్యత్సేన లేతేరగా
సారోరుధ్వజ చామరంబులు సితచ్ఛత్రంబులు న్మీరగా
నారామున్ గననేగెవానరవిభుండత్యంత హర్షంబున్ 245

వ॥ ఇట్లు జనిచని రఘుకులాధ్యక్ష చరణనిరీక్షణవిలక్షణులగునా సుగ్రీవలక్ష్మణులాక్షణంబున దూరంబున
రథావతరణం బొనర్చి తత్సమీపంబునకువచ్చి నచ్చట 246

సీ॥ వల్కలాజినధారు వరమేచకాకారు
కోటీరమయ జటాజూట భారు
విస్తారతరనేత్రు విమల శాంత చరిత్రు
నరవిందసౌందర్యహారి వక్త్రు
మందహాసవిశేషు మౌని సత్తమవేషు
స్మృతిమాత్రవిదళితాశేషదోషు
సీతావిరహతప్తు చిరవిమోహావాప్తు
మృగపక్షిదర్శన ప్రీతిలిప్తు

తే.గీ॥ మణిగుహద్వార సంచారమతివిలాసు
చంద్రకాంత శిలాతలాస్థానవాసు
శ్రీమదంచితగుణసాంద్రురామచంద్రు
ఘనకృపాచంద్రికాసారు గనిరివారు 247

కం॥ ఆలీలరామునింగని
యాలక్ష్మణభాను పుత్రులతి భక్తిర సో
ద్వేలపయోధిం దేలుచు
వ్రాలిరితత్పద సమీప వసుమతినతులై 248

వ॥ ఇట్లు నమస్కరించినం రఘుపుంగవుండును నాప్లవంగ పుంగవు గాంచి యాలింగనంబొనరించి కుశల ప్రశ్నంబుగావించి సమీప ప్రదేశంబునం గూర్చుండనియమించి ధర్మవిదుండగుట యథా విధానంబుగా నాదినరాజతనూజుంబూజించినప్పుడా ప్రజ్ఞాస్వ భావుండగు సుగ్రీవుండును భక్తి నమ్రగ్రీవుండై రఘుకులాగ్రణిం గనిదేవా! యీవచ్చుచున్న మహావానరచమూ సమూహంబుల నీక్షింపు మీవృక్షచర వీరులు కులాచలాంత స్సంభూతులును మేరు మంధర ధురంధర ప్రతిభాప్రభూతులును నానాద్వీప సరిద్వనాద్రి శృంగ సంగత స్థానులును, ననేకవిధ మహాధరో పమానులును, కామరూప ప్రచార ప్రదీప్తాలోకులును, నసంఖ్యాకులునై యెసంగుదు రని వెండియు. 249

కం॥ అందరు దేవాంశోద్భవు
లందరు వీరులును వారలందరయంగా
నందరు యుద్ధవిశారదు
లందరు సత్యప్రచారు లందరు ధీరుల్ 250

వ॥ అని చెప్పి మరియును 251

సీ॥ గంధ సింధురసత్వ బంధురుల్గొందరు
కొందరు దశనాగకూటబలురు
శత సహస్రద్వీపాయుత బలుల్గొందరు
కొందరసంఖ్యాత ఘోరబలురు
అంజనాద్రిప్రభారంజనుల్ గొందరు
కొందరు హాటకకూటనిభులు
నుదిత రక్తోద్దీపవదనులు కొందరు
కొందరు దీర్ఘలాంగూలధరులు

తే.గీ॥ స్ఫటిక సదృశులు కొందరుద్భటనిశాట
సన్నిభులు గొందరంతట సమరకాంక్ష
నాజిదుర్జేయులగుచు గర్జారవముల
వచ్చుచున్నారు వానరుల్ వసుమతీశ! 252

కం॥ వీరందరు ఫలమూలా
హారులు భవదీయ దీవ్యదాజ్ఞాధారుల్
శూరులు నఖముఖ గిరితరు
వారాయుధులగుచు వెంటవచ్చెడి వారల్ 253

వ॥ అదియునుంగాక 254

ఉ॥ అంగదు జూడురత్నకనకాంగదు శ్రీయుతుశూరునత్యుదా
రాంగుడు వీడురాక్షస కులాంతకు డెన్నిట గన్నవాలికిన్
సంగడియౌ నితండన నెసంగును వాలితనూజు డాజినే
పుం గల విశ్రుతుండు కపిపుంగవు డోరఘువంశ పుంగవా! 255

కం॥ అల్లదె! వీరుడు భల్లుక
వల్లభుడు సుబుద్ధి జాంబవంతుండన నా
కెల్ల సచివులకు ముఖ్యుడు
భల్లుకములు కోటి గొలువ బ్రబలునురామా! 256

కం॥ కనుమెంతయు ననిల సుతున్
ఘనమంత్రి వరేణ్యులోకగణ్యుని తేజో
ధనవంతు నీతిమంతుని
హనుమంతునితండు ప్రబలుడగు రఘువీరా! 257

వ॥ మరియు రఘూత్తమా! యనిలపుత్రాదులతో సమానులగు నలనీల గజ గవయ గవాక్ష గంధమాదన మైందద్వివిధ శరభ పనస సుషేణ తార బలీముఖ ప్రముఖులును, హనూమజ్జనకుండును, మహాబల విహారియును నగుకేసరియును నాదిగా నాచే ముఖ్యంబుగా జెప్పంబడు నీయూధప్రవరులగు యోధవీరులు మహాత్ములును మహావీర్యులును శక్రతుల్య పరాక్రములును దేవాంశ సంభూతులును భవదాజ్ఞా ప్రచారులు నై ప్రవర్తింతురు వీరలొక్కడొక్కడ యనేకకోటి వలీముఖులకు నాయకులగుదురు, మరియునుంగల వానర వీరులందరు నీకు వశవర్తులై భవత్కార్యార్థంబుగా బ్రాణంబు లనపేక్షింపక వృక్ష పర్వతపాషాణాదుల నాయోధనంబొనర్చి శత్రు పుంజంబుల భంజింపంగలవారు వీరి నాజ్ఞాపింపు మనిన నానం దాశ్రుమిశ్రితలోచనాభి రాముండైన రాముండు రవిసంభవుం బరిరం భణంబొనర్చి యిట్లనియె 258

చం॥ ఇనసుత! కార్యభారమిదియీవువహించు టెరుంగు నేను సీ
తనువెదకంగనీకును హితంబగు నేనియు పంపుమన్నరా
ముని వచనంబునుంవిని బ్రమోదమనంబున వానరేంద్రు డ
ద్దిన కరనందనుండనిపె దిక్కులకుంగపులన్ బలాఢ్యులన్ 259

సీ॥ శతసహస్రకవనేచర పరీవృతునిగా
వినతుని తూర్పుదిక్కునకు బనిచి
తారతండ్రి సుషేణు తగు లక్షయుగ కీశ
ఘనులతో పశ్చిమంబునకు బంచి
దశలక్షవానర తతులతో శతబలి
ననువంద నుత్తరంబునకు బనిచి
యంగదజాంబవదాదుల బలవంతు
హనుమంతు దక్షిణంబునకు బనిచి

తే.గీ॥ యంగదాదుల తోడ బ్రయత్నముగను
నలునినీలుని శరభు మైందద్వివిదుల
గంధమాధను తారుని గజ గవయుల
మరియు నద్దిక్కునకు బంచెమహితబలుర 260

ఉ॥ ఆ కపివీరులంబనుపునప్పుడు వారల తోడ భానుజుం
డోకపివీరులార! శుభయుక్తిని సీతనతిప్రయత్నమున్
గైకొని దిక్కులన్ వెదకి గన్గొనితచ్ఛుభవార్తదెచ్చినన్
జేకొని వారి మత్సముల జేతును గాతును తప్పులన్నియున్ 261

కం॥ మాసములోరండిది మ
చ్ఛాసనమది గాక జనకజం గానక ని
మ్మాసంబు మీద మీరొక
వాసరముండినమదీయ వధదండార్హుల్ 262

కం॥ అని చెప్పి యినజుడీగతి
ఘన విక్రమనిహత రిపుల గపుల బనిచి దా
జని రాముని పార్శ్వంబున
సనయుండై మ్రొక్కియుండె సద్గోష్టి మెయిన్ 263

మ॥ చనుచోమారుతిగాంచి రాముడనియెన్ సంప్రీతి వాక్యంబు గ్ర
న్ననీయుత్తమమంగుళీయకము మన్నామోక్షరాంకబునై
జను దీనింగొని పోయి జానకికభిజ్ఞానార్థమైయిమ్ము వెం
టనెనీయూర్మికగాంచితత్సతియు దానందోర్మికందేలుతన్ 264

కం॥ వాయుజ! యిక్కార్యంబున్
జేయ సమర్థుడవు నీవె సిద్ధమునీ స
త్వాయతి నేనెరుగుదు నీ
కేయెడ శుభగమన బుద్ధియెసగెడు జనుమా! 265

ఆ॥వె॥ అనుచు బ్రియముమిగుల గనుచు నారఘుకుల
సత్తముండు వానరోత్తముండు
బనుపసీతజాడ ననుపమగతితోడ
హరులు నంగదాదులరిగిరంత 266

కం॥ వినత సుషేణనశతబలు
లొనరగ ప్రాగ్భాగ పశ్చిమోత్తరములకున్
జనిసీత వెదకి కానక
చనుదెంచిరినెలకు రామచంద్రుని కడకున్ 267

వ॥ అంత 268

కం॥ వనచరు లంగదముఖ్యలు
చనిచనియీరీతి గిరులజరులం దరులన్
ఘనముల వనముల వెదకుచు
జనక సుతంగానలేక చనుచోనంతన్ 269

మ॥ కనిరావానరులందు పక్షిమృగసంఘాతోదయావంధ్యమున్
గనదుద్భాసిత ధాతుశోణితవిభాగమ్య స్ఫుర త్సాంధ్యమున్
ఘనరత్న ద్యుతి ధూతనిర్భరమహాగర్భాంతరాళాంధ్యమున్
జనితానల్పక కల్పకద్రుసుమనస్సౌగంధ్యమున్వింధ్యమున్ 270

ఉ॥ వీక్షణమిట్లు సేసి యట వింధ్యమునందొకచో భయంకరా
లక్షితుశైలతుల్యతను లక్ష్యమదేభమృగాది భక్షకున్
రాక్షసుగాంచి వీడెయగు రావణుడంచని ముష్టిఘాతచే
నాక్షణమందెవృక్షచరు లాక్షణదాచరు గూల్చి రార్చుచున్ 271

వ॥ అంత నద్దానవుండు రావణుండు గాడని వానరులందరు నవ్వింధ్య మహీధరంబునందు వేరొక్కఘోర కాంతార సరణింజని రఘుకాంత కాంతామణి నన్వేషింపుచు, శృంగంబుల కెక్కుచు, లతాకుడుంగం బులం ద్రొక్కుచు, బిలంబులనరయుచు, జలంబులదొరయుచు, నదులవీక్షింపుచు, నిధుల లక్షింపుచు, నగణ్యంబులగు నమ్మహా రణ్యంబులందిరిగి తిరగి యతిశ్రమాయత్తులును, దృషార్తులును, శుష్కతాలు కంఠోష్ములును నగుచు, నవ్వనచర శ్రేష్ములందు సలిలం బుగానక చనిచని యక్కాననొక్కయెడ తృణగుల్మలతాచ్ఛాదిత వివరం బైయధికతరంబగుయొక్క గిరిగహ్వరంబుం గాంచి తన్ముఖంబు వలనంజలార్ధపక్షంబులై వెడలి సనుదెంచు క్రౌంచహంసకారండ వాది పక్షిసంచయంబు నీక్షించి, నిశ్చయంబుగా నిచ్చటజలంబులు గలవని యూహించి, దీనింబ్రవేశింతమని యప్పవననందనుండు ముందుగా నందరు కపివరులొండొరుల భుజాదండంబులం బట్టుకొని, తదీయాంధకారంబున నతిదూరంబరిగి యచ్చీకటింబాసి ప్రకాశించు నాప్రదేశంబునందు 272

- స్వయంప్రభ వృత్తాంతము -

సీ॥ మణినిభతోయముల్ మధురసప్రాయము
లమృతాకరములు పద్మాకరములు
వృతపక్వఫలనమ్రవిటపంబులై కల్ప
పాదపంబుల బోలు పాదపములు
మణివస్త్రభూషణ మహితముల్మహితముల్
బహుగుణాన్వితములౌగృహశతములు
దివ్యాన్నముఖ్యముల్ దివ్యసౌఖ్యములుండి
నరహీనమౌనొక్కపురము గాంచి

తే.గీ॥ యందు విశ్రాంతులై గపులచట నొక్క
దివ్య భవనంబునను ప్రభాభావ్యయగుచు
చీరవసన హేమాసనా సీనయైన
ధ్యానయోగిని నొకదివ్యతరుణిగనిరి 273

కం॥ కనియమ్మహాత్మురాలికి
వినయమ్మున మ్రొక్కిభయము విస్మయమును భ
క్తిని దోపనిలిచి యుండిన
ఘనయోగిని కపుల నెల్లగనియిట్లనియెన్ 274

తే॥గీ॥ మీరలెవ్వారిదూతలే కారణమున
నిచటి కెందుండి వచ్చినారీమదీయ
మగు వసతికేల వచ్చితిరనిన దాని
విని హనూమంతు డద్దేవి కనియెనిట్లు 275

సీ॥ శ్రీమంతుడగునయోధ్యామహీకాంతుండు
దశరథుండను రాజుదనరుచుండు
నతని కగ్రతనూజుడగు మహాతేజుండు
రాముండు సుగుణాభిరాముడలరు
జనకాజ్ఞచేతను జనకాత్మజాతను
భ్రాతను గూడియారామసీమ
కరుదేర తద్భార్యనార్యనుదశ్చర్యు
డైన దానవవర్యుడపహరింప

తే.గీ॥ నంతనారాముడనుజుతోనర్మతనుజు
జేర జనుదేరగడు మైత్రి చేతనాత
డొనరదత్సతి వెతకంగ జనుమనంగ
నోమహాభాగ! వచ్చితి మేమువేగ 276

కం॥ కానకరఘుకుల సత్తము
చానన్ వెతుకుచు జలేచ్ఛ సాధ్వసకరమై
కానంబడు శైలగుహా
స్థానంబున వచ్చి తేముదైవవశమునన్ 277

ఉ॥ ఈవిట నుండెదేమిటికి నెవ్వరవీవు వచింపుమాకునో
దేవి! యటన్నయోగిని యతి ప్రమదంబున వారితోయధే
చ్ఛావిధి కందమూలములు చాలభుజించి సుధోపమాంబువుల్
ద్రావిటురండుసెప్పెద యథాస్థితి మద్వివరంబు సర్వమున్ 278

తే॥గీ॥ అనినవనచరులందరు నందు కంద
మూలఫలములు భుజియించి ముదముమించి
యచటికరు దెంచి మ్రొక్కిన నంత దివ్య
దృష్టిచే వాయుసుతున కద్దేవి బలికె 279

సీ॥ మునువిశ్వకర్మనందన విశ్వరూపిణి
బరగు హేమానామ భామయోర్తు
భూతేషు నృత్యంబుచేత బ్రీతుని జేయ
నతడు ప్రసన్నుడై యధికమైన

నీదివ్యపుర మిచ్చెనిందు దత్సతిమున్న
దగననేకాయుతాబ్దంబులుండె
నాహేమ సఖిని మోక్షాసక్తి హరిభక్తి
నతడును దివ్యగంధర్వసుతను

తే.గీ॥ నే స్వయంప్రభయనుదాన నెలమినామె
యఖిల జంతు వివర్జితంబైనయిచట
నీవుతపమొనరింపుచు నిలువుమనుచు
బ్రహ్మలోకాప్తి కరుగుచు బలికెనన్ను 280

మ॥ వినుత్రేతాయుగమందు దాశరథియై విష్ణుండు నయ్యచ్యుతుం
డెనయన్ భూమిభరంబు బాపుటకునై యేతెంచు నిక్కాననం
బున కారాముని భామినింగపిబలంబుల్ జూడగానెంతయే
జనుచో నీదు గుహాంతరంబునకు నిచ్చ న్వత్తురంత న్వెసన్ 281

తే॥గీ॥ ఆ హరులబూజచేసి బ్రయత్నముగను
జని రఘూత్తము సేవించి సంస్తుతించి
గడు సనాతనమును యోగిగమ్యమైన
హరిపదము నీవు జెందెదవనుచు బలికె 282

ఉ॥ కావుననేను రామునిదె కానగనేగెద వేగమీరునే
త్రావళిమూయుడిప్పుడు గుహాంతరమున్ వెడలింతుతన్నవా
రావిధిజేయయప్పటి వనాంతరమందు వసించిరంతన
ద్దేవియునగ్గుహన్ విడిచి తీవ్రతజేరెను రామునన్నిధిన్ 283

వ॥ ఇట్లు చేరి యాస్వయంప్రభ శుభలక్షణంబుగా లక్ష్మణ సుగ్రీవయుక్తుండగు రఘుసత్తము నీక్షించి బ్రదక్షిణములొనరించి బహు విధంబుగా నమస్కరించి రోమాంచకంచుకిత గాత్రియై యిట్లనియె. 284

సీ॥ ఓ దేవదేవ! నే నీదాస్యముననుండి
వచ్చితిమిము జూచు వాంఛనిటకు
నీదర్శనార్థమై నేనద్రిగుహయందు
గావించితధిక దుష్కరతపంబు
నిపుడునా దగుతపం బీడేరె సర్వభూ
తాత్ముడవయ్యు బాహ్యాంతరముల
దోపకతోచు మాయాపరస్థితుడవౌ
నీకు నమస్కృతి నెరపగంటి

తే.గీ॥ మాయయనుపేరదగు తెరమరుగు పడగ
మానవాకృతి బూనియజ్ఞానులకును
వేషధారియునైన శైలూషనటుల
తెలియబడకుండ నుండుదు వెలమిరామ! 285

తే॥గీ॥ భాగవతముఖ్యులందు నీభక్తియోగ
సిద్ధిఘటియింపనవతరించితివి నీవు
నట్టి భగవంతుడైన నిన్నెట్టు గాగ
నెరుగ నేర్తు దమోవృత్తి నెసగునేను 286

కం॥ లోకమున నెవ్వడేనియు
గైకొననీతత్త్వమెరుగు గాకటులైనల్
నాకును నీరూపంబిదె
వీకన్ హృదయమున నెపుడు వెలుగుంగాతన్ 287

తే॥గీ॥ అరయ సన్మార్గ దర్శనంబై భవాబ్ధి
మగ్నులకు దర్శనము గాక మరియు మోక్ష
దర్శనంబగు నీపాద దర్శనంబు
నాకు గూర్చితి రామ! పుణ్యైకధామ! 288

కం॥ ఘనపుత్ర కళత్రాదిక
ధనదర్పితుడైన జనుడు తాత్త్వికులకికం
జనులకు నక్షయ ధనమగు
నినునేగతినెరుగనేర్చు నిరతము రామా! 289

కం॥ అరయగుణాత్మడ వయ్యును
నిరస్తగుణమార్గుడవును నిర్గుణుడవునై
నెరి దీనుల కర్థమవగు
హరికే మ్రొక్కెదను నీకు నాత్మారామా! 290

వ॥ కావున నీశ్వరుండవు, గాలాత్మకుండవు, నాది మధ్యాంతవర్జితుం డవు, సర్వభూతంబులందును సమంబుగబ్రవర్తించు పరమపురు షుండవుంగా నిన్ను దలంచెద, దేవాభవదీయంబగు నరాకార చేష్టితంబు మాయావిడంబం బని యెవ్వరెరుంగరు, నీకుమిత్రామిత్ర పరాపర భావాది భేదంబేదియు లేదైనను భవన్మాయా మోహితులైన యజ్ఞులు బ్రాకృత పురుషునింగా జూతురింతియెగాని దేవతిర్య జ్మనుష్యాది సకల ప్రపంచంబునకుంజనన తిరోధాన కర్తవు భర్తవున ధీశుండవైయజుండవగు నీకు

జన్మ కర్మాది కల్పనంబు దోచునది యత్యంతవిడంబన మాత్రంబని యెరుంగ నగునట్లగుటంగదా భక్తులగువారల నాత్మకథా శ్రవణాదుల వలన ముక్తులంజేయు నక్షరుండవు బరమాత్ముండవగునీవు దనంతనవతరించితివని విజ్ఞానవంతులెరుంగుదు రదియునుంగాక కొందరు దశరథుని తపఃఫలంబున జనించితనియును మరియుంగొందరుకౌసల్యచేత నారాధితుండవై యుదయించితనియును వెండియుం గొందరు భూభరణార్థంబుగావిధాత బ్రార్థింప దుష్టరాక్షస శిక్షణార్థంబు మనుష్యుండవైయుద్భవించి తనియుంజెప్పుదు రివ్విధంబులగు భవచ్చరిత్రంబులు శ్రవణ మననధ్యాన గాన పారాయణాదుల యందెవ్వరు నిరంతరంబుపయోగింతురు వారుగదా భవార్ణవతరణ కారణంబులగు భవచ్చరణంబులు నిరీక్షించి మోక్షంబుజెందు దురగుట భవన్మాయాగుణాచ్ఛాదిత నగు నేను గుణాతీతంబై మనోవచనా గోచరంబగు నీతత్త్వ స్వరూపంబెట్లెరుంగ నేర్చుదాన దానంజేసి రఘూత్తమా సౌమిత్రి సుగ్రీవాది సహచరంబునుబాణా సనధురంధరంబును ప్రత్యక్ష గోచరంబును నగునీ యాకారంబునకు నమస్కరించెదనని బహువిధంబుగా సన్నుతించినం బ్రసన్నుండై రఘువరుండు భక్తియోగినియగు నయ్యోగినిం గూర్చి నీవాంఛితం బెయ్యదియనిన నద్దేవి యారామునకిట్లనియె 291

శా॥ ఏనెందేనియు జన్మమొందినను నేనెందుండినం నిశ్చలం
బౌనీభక్తియు నీదు భక్తుల సహాయంబున్ గృపంజేయునా
కీనీభక్తులు గాని బ్రాకృతులతోనే గూడగానొల్లనో
శ్రీనారాయణ! భక్తవత్సల! రఘుశ్రేష్ఠా! భవోత్తారకా! 292

సీ॥ నీపదార్చనములు నిష్ఠగూర్చినవాని
కరములు కరము లోపరమపురుష!
నీకథాశ్రవణంబునియతి జేసినవాని
వీనులు వీనులోవిశ్వవంద్య!
నీనామకీర్తన నిరతి సల్పినవాని
రసనంబు రసనమోరమ్యచరిత!
నీశుభాకారంబు నెమ్మిజూచినవాని
కన్నులు కన్నులోకమలనయన!

తే.గీ॥ నీప్రదక్షిణయాత్రలు నెరపువాని
పదములు పదంబులోసాధుభక్తవరద
నిన్ను చిన్మయుగాగధ్యానించువాని
జన్మమది జన్మమోరామ! సత్యధామ! 293

ఉ॥ నాదు కరంబులున్నినుదినంబును బూజయొనర్చుగావుతన్
నాదు చెవుల్ భవత్కథ వినంగడు భక్తినొనర్చుగావుతన్
నాదగు జిహ్వారామయను నామముకీర్తనజేయుగావుతన్
నాదుశిరంబునీకును బ్రణామముజేయుత గాతరాఘువా! 294

వ॥ మరియును 295

సీ॥ జానకీలక్ష్మణసంయుక్తు హితసక్తు
భృతశరాశి శరాసు పీతవాసు
ఘనరత్నకోటీరు కాంచన కోటీరు
జ్వలితకుండలకర్ణజలదవర్ణు
కలితమౌక్తికహారు కౌస్తుభాలంకారు
శుభముద్రికాహస్తు సుప్రశస్తు
భర్మసూత్ర కటీరు పదలసన్మంజీరు
తతకృపావేశునిత్యప్రకాశు

తే.గీ॥ నిన్ను నీక్షింపసేవింప సన్నుతింప
ధ్యానమొనరింప హర్షింప తలపునింప
నామనంబున దయసేయవే! మహాత్మ!
యన్యమును వేడ నోరామ! యనఘనామ! 296

చం॥ అనిన బ్రసన్నుడై రఘుకులాగ్రణియోగినికిట్లు బల్కెనో
యనఘ! మదీయ సూక్తి వినుమా! జనుమా! బదరీ వనాంతరం
బున కటసంస్మరించినను భూతమయంబగు మేనుమానుచున్
ననుపరమాత్మ నక్షరుగనంజనెదీవు నిరంతరంబుగన్ 297

తే॥గీ॥ అనిన రఘువీరు సారవచోమృతంబు
వినియునద్దేవి బదరికావిపిన తీర్థ
మునకుజని రాముని దలంచితనువుడించి
యవ్విభుని దివ్య పదమున కరిగెనపుడు 298

శా॥ అంతన్ తద్వనవృక్ష సంఘములయందారూఢులై వానరుల్
చింతా క్రాంతులునైపరిభ్రమముచే సీతాసమన్వేషణ
శ్రాంతస్వాంతులునైన యాహరులనశ్రాంతంబు నీక్షించియ
త్యంత స్థైర్యము చేప్లవంగవరుడౌనయ్యంగదుండిట్లనున్ 299

సీ॥ గిరిగహ్వరములందు దిరుగంగమనకుని
క్కంబుగమాసంబుగాగ వచ్చె
మనచేత రాజాజ్ఞయును జేయబడదయ్యె
గనబడదయ్యె నజ్జనకతనయ
యింకకిష్కింధకు నేగితిమేనియు
నినజుండు వధియించు మనలనెల్ల
పగతుని సుతుడంచు మిగులదోషంబున
ననువిశేషించి ద్రుంచను గలండు

తే.గీ॥ తన్నురాముడు బ్రోచె తత్కార్యమేను
జేయలేదౌట యిదితప్పుజేసినన్ను
దునుమునిజముగ నద్దురాత్ముండు రవిజు
డేలననుబ్రీతిసేయు గపీంద్రులార! 300

వ॥ అదియునుంగాగ మాతృతుల్యయగు భ్రాతృ భార్యననుభవించుటం జేసి యిట్టి పాప స్వభావుండగు సుగ్రీవుని పార్శ్వంబున కేనుబోవ నొల్లంగావున నెద్దియేనియు నొక్కనిర్భంధంబు చేత జీవితంబు బాసెదనని యశ్రు మిశ్రిత నయనుండైయున్న నయ్యంగదుంగనుం గొని ప్లవంగ పుంగవులు గొందరు డెందంబుల గొందలంబంది నేత్రంబుల బాష్పంబులు జార నయ్యువరాజుంజేరి రాజనందనా యీ కార్యంబునందు నా కీశోకంబునొందనేటికి నేము భవత్ప్రాణ రక్షణంబొనరించెద మిగ్గుహాంతరంబున నిర్భయమై వసియించి యుంద మిందుగల పురంబు దేవపురోపమంబై సర్వ సౌభాగ్య సహితంబై యున్నయదియని మందమంధంబునందమలో బలుకు చున్న విని వినయవంతుండగు నయ్యంగదుం గొగిలించుకొని యిట్లనియె 301

సీ॥ ఇట్టివిచారంబు నేటికి సేసెద
వీదుర్విచారంబు లెల్ల విడువు
కపిరాజునకునీవు కడుహితుండవుమీద
తారాత్మ జుడవౌట తద్దగూర్తు
సౌమిత్రికన్నను వేమారునీమీద
రామచంద్రునకతిప్రేమ గలదు
గానరాముని చేత గలుగదు భీతి నీ
కినజునిచే గల్గదేభయంబు

తే.గీ॥ వత్స! నేనీహితరతుండ వలవదితర
మగువిచార మిగ్గుహ యభేద్యము వసింప
ననుచు జెప్పిరి కపులు రామాస్త్రములకు
గనుగొననభేద్యమెద్ది జగత్త్రయమున 302

కం॥ వానరవర! యీవానరు
లీనిసుదుర్బోధమిట్టు లెనయించగదా!
మానియుసుత దారాదుల
మానియు నీతోడ నుండమతి దలతురొకో! 303

వ॥ అదియునుంగాక నంగదకుమార! యింకనొక్కరహస్యంబు నీకుం జెప్పదనని మహితవిచారుండగు
మరుత్కుమారుండు వెండియు నిట్లనియె 304

సీ॥ మనుజుండు గాడు రామవిభుండు నారాయ
ణుండుసాక్షాదవ్యయుండు దలప
జానకి భగవతి సర్వసమ్మోహిని
యవ్విభుచిచ్ఛాయయైన మాయ

లక్ష్మణుండహిరాజ లక్షణుండఖిలలో
కాధారుడాదిశేషావతారు
డజుడు వేడ జనించిరందరు జగమున
నసురుల ద్రుంపమాయానరాప్తి

తేగీ॥ నట్టి వైకుంఠవాసున కనుచరులము
పారిషదులము మనమెల్ల నారమేశు
డీ నరాప్తి వహించెను వానరాప్తి
మహి జనించితి మిట్లు తన్మాయవలన 305

మ॥ వినుమా! తొల్లితపంబు చేసి మనమున్ విష్ణున్ జగద్భర్త నా
తని నారాధనజేసి తత్కరుణచేతత్పార్షదత్వంబు నుం
గనియుండిప్పుడు నప్పరాత్మభజనం గావించిదన్మాయచే
జని వైకుంఠము జెందియుండెదమటన్ సౌఖ్యస్థితిన్వెండియున్ 306

కం॥ కని యంగదు నూరార్చుచు
వనచరులందరును వింధ్యవనమెడలి యటన్
జనక సుతన్వెదకుచునట
విని చనిచని దక్షిణాబ్ధితట నికటమునన్ 307

కం॥ సాంద్రమును శిఖర విలిఖ
చ్చంద్రమును ప్రభూతధాతు జాతవిభాని
స్తంద్రమును మహేంద్రమనుగి
రీంద్రమునుం గనిరి వనచరేంద్రులు సంతన్ 308

కం॥ ఆగిరివరమునకుంజని
యాగిరి చరులెల్లగాంచి రంచద్వీచీ
భాగరమున్ సాగరమున్
వేగిరమున గాఢతరము విపులాంతరమున్ 309

చ॥ కనివనరాశినిట్లు భయకంపితులై గపులెల్ల నెద్దిసే
యనగు నటంచునబ్ధితటమందు వసింపుచు చింతసేయుచున్
మనమటవిన్ భ్రమించునెడమాసము నగ్గుహయందెసెల్లె నొ
య్యనని యొచనల్ సలిపిరంగద నీలముఖుల్ బలాధికుల్ 310

వ॥ మరియును 311

కం॥ దశముఖునేనియు సీతా
శశిముఖినేనియును గాంచిచనకున్న యెడన్
వశియించు తీక్ష్ణదండన
దశగాంచుచు మనలనెల్ల తపనజుడలుకన్ 312

వ॥ కావున సుగ్రీవుండు మనల వధింపకమున్న బ్రాయోపవేశంబున జీవితంబులు దలంగుట శ్రేయస్కరంబగునని తలంచి యాస్థలంబు నందంతటకుశాస్తరణంబొనరించి యందరు సమాసీనులై పంచత్వంబునన్ బ్రాపించుటకు కృతనిశ్చయులైయుండి రయ్యవసరంబున 313

- సంపాతి వృత్తాంతము -

సీ॥ అమ్మహేంద్రాద్రి గుహాంతరంబుననుండి
గిరి నిభుండల్లన గృధ్రవిభుడు
వెలువడి బ్రాయోప విష్టులౌవానర
శ్రేష్ఠులగలయ నీక్షించి పలికె
బహుభక్ష్యమిదె నాకు బ్రాప్తమయ్యె గ్రమాప్తి
దినమొక్కరొక్కరి దినియదేను
ననిన నివ్విహగోక్తి విని భీతివానరు
లిదినిజంబుభుజించు నెల్లమనల

తే.గీ॥ రాఘవుని కార్యమేనియు రవిజుహితము
నేనెయాత్మహితం బేసియించుకైన
జేయమైతిమియీపక్షిచేవధింప
నైకృతాంతుని జేరగా నయ్యె మనకు 314

తే॥గీ॥ రాముడడవికిరానేల? రావణుండు
సీతగొని పోవనేల? తత్సీతతెరువు
దెలుపనేల? జటాయువందులకుగాగ
నినజుడనిపిన మనకునీవనట గలిగె 315

తే॥గీ॥ ఔరపుణ్యాత్ముడగును జితారి ప్రాజ్ఞు
డగు జటాయువు రామకార్యార్థముగను
హతుడు నయ్యెను మరియొగి తతులకైన
నందగూడని మోక్షంబు నందనయ్యె 316

మ॥ అని యీరీతివచించువారి వచనంబాలించి సంపాతి యి
ట్లనియెన్ కర్ణ సుధోపమంబగు మదీయ భ్రాతయౌనజ్జటా
యుని పేరొండొరు తోడ బల్కెదరు నోహో! మీరలెవ్వారలో
ఘను లౌవానరులార! మద్భయములేకంజెప్పరేయంతయున్ 317

వ॥ అనిన సంపాతి వాక్యంబువిని ధైర్యసంగతుండై యంగదుండప్పక్షి సమీపంబునకు వచ్చియిట్లనియె 318

సీ॥ శ్రీమించుదశరథ రాముడు భార్యయౌ
ధాత్రిజగూడి సౌమిత్రి తోడ
వనమున కరుగ రావణుడు దురాత్మకు
డారాఘవులు వేట కరుగచోట
తత్సతీమణి బలాత్కారంబున హరింప
నారామహారామయనుచునడల
కనిజటాయువు శౌర్యఘనుడు పక్షి వరుండు
దారుణంబైన యుద్ధంబు సలిపి

తే.గీ॥ రావణుని చేతనిహతుడై రాఘవార్థ
మతిబల సహాయుడగు వీరుడజ్జటాయు
వపుడు రాముడు సంస్కారమాచరింప
నందె నద్దేవు సాయుజ్యమాక్షణమున 319

ఉ॥ అంతట రాఘవుండు తపనాత్మజుడగ్గిరి యగ్నిసాక్షి న
త్యంతము మైత్రిజేసియు తదర్థమువాలిని శౌర్యశాలి దు
ర్దాంతుని నంతకున్ గనగదార్చి మహాబలుడా రఘూద్వహుం
డెంతయుకీశరాజ్యమున కీశునొనర్చె దినేశు సూనునిన్ 320

వ॥ అంతట నా సుగ్రీవుండు సీతామార్గంబునకు నత్యంత బలసత్వ సంపదలం బెంపొందిన వనచర బృందమ్ములగు మమ్మునందరం బనిచెనప్పుడతండు మాతో మీరు మాసంబునకురండు రాకయుండిన వధాంత దండంబొనరించెదననియును శాసించె నంత మేము వనాంతరంబులందిరిగి మనోహరంబగు నొక్కగిరిగహ్వరంబున విహరించునెడ మోసంబున మాసంబతిక్రమించె నదియునుంగాక జనకజాతనేనియు దనుజనేతనేనియున్ గనమైతి మగుట మీదటన్ జండకర సుతుండొనరించు నుగ్రదండంబునకన్న మున్నెయీ లవణవనధితటంబునన్ బ్రాణంబులన్ బాయునుపాయంబునన్ బ్రాయోపవేశంబు జేసినార మోవిహంగపుంగవా! సీతాంగనా కుశలప్రసంగం బెరింగితేని మాకు నెరింగింపుమని నంగదాదుల గనుంగొని రఘువీరఘున కథాశ్రవణ సముదిత సంతోషబాష్పదారా సంపాతియగు సంపాతియిట్లనియె 321

సీ॥ ఆ జటాయుండు నాకలర బ్రియానుజుం
డగు బహువర్ష సహస్రములకు
నతిశోకకరముగా నతని వాక్యమువింటి
నల భ్రాత కుదక మీవలయునాకు

ననుజలంబులు జేరగొనిచనుండే మీకు
నటమీద వాక్సహాయంబు జేసి
మీకార్యసిద్ధికై మేకొని సర్వంబు
క్షేమకరంబుగా జెప్పెదిపుడు

తే.గీ॥ ననినవనచరులతని నవ్వనధిసేర్పు
స్నానము నొనర్చి భ్రాతకు జలములిచ్చి
మరలి తెచ్చిన వచ్చియా హరుల గూర్చి
హితము బ్రాపింపసంపాతి యిట్టులనియె 322

చం॥ ఒనర పయోధియందు శతయోజన దూరమునం ద్రికూటకా
ఖ్య నగములందు లంకయనగాదగు పట్టణ మొప్పునపురిన్
దనరు నశోకనామకవనంబున దైత్యసతీ పరీతయై
జనకజగాననయ్యెడిదె సందియమందకుడేను సెప్పెదన్ 323

కం॥ నేనున్ గృధ్రకులీనుడ
గానన్ గడు దూరదృష్టి గలుగుటవలనన్
జానకిని లెస్సగంటిన్
దానికి సంశయములేదు తరుచరులారా! 324

కం॥ శతయోజనవిస్తారా
కృతియగు వనరాశిదాట నెవ్వండోపున్
క్షితిసుతనతడే కనుగొని
ధృతిని మరలిరాగలండు ధృఢతరమతితోన్ 325

తే॥గీ॥ నేను మద్భ్రాతహంతయౌవానినద్దు
రాత్మురావణుద్రుంపగా నాగ్రహింతు
నైననొక్కడ పక్షవిహీన వృత్తి
నుండుటను జేసియిట్లూరకుండవలసె 326

కం॥ కావున మీరలు జేయుం
డీ వారిధి దాటుయత్నమిందరునంతన్
భూవరుడగు రఘువీరుడు
రావణుని వధింపగలడు రాక్షసవరునిన్ 327

తే॥గీ॥ అగుట శతయోజనావధి యైనవనధి
దాటిలంకను జొచ్చి సీతావధూటి
గాంచి భాషించి జలధిలంఘించి మరియు
వచ్చువాని విచారింప వలయుపూని 328

వ॥ అని పలికిన పక్షివరుంగని వృక్షచరులందరు నీకు పక్షంబులేమికిం గారణం బేమియనిన వారికిన్
పూర్వకృతంబగు నిజవృత్తాంతంబం తయు నెరుంగింపదలంచి సంపాతి యిట్లనియె 329

సీ॥ అన్నదమ్ములమునేనజ్జటాయువుసుమ్ము
మునువయోబలదర్ప ములుదనర్ప
పక్షులతోగూడ బలము జూడమదించి
యినమండలముజేర నెగసి పార
బహుయోజనసహస్ర పర్యంతమగునంత
ననుజుడంత సహింప కతిదపింప
నతని రక్షింప మోహమున రెక్కలుబూన్ప
రవివేడినాదు పత్రములు మాడి

తే.గీ॥ పడితివింధ్యమునను దూరపతనమునను
మూర్ఛదెరలి దినత్రయమునకు మరలి
ప్రాణసహితుండను విదగ్ధ పక్షకుండ
నైతినీరీతి మీరి వనాటులార! 330

తే॥గీ॥ దేశముల శైలకూట ప్రదేశములను
దెలియలేనైతి మరిభ్రాంతి నొలయనంత
తిన్నగాలేచి కన్నులు దెరచి చూచి
యటశుభాశ్రయమే గాంచియచటి కరుగ 331

కం॥ చంద్రముడనియెడు నొకముని
చంద్రముడున్ నన్నుగనివెసన్ విస్మయని
స్తంద్రుండై యతికరుణా
సాంద్రుండై యిట్లుబలికె సమ్మతినాతోన్ 332

శా॥ సంపాతీ! యిటులీవిరూపగతినిచ్ఛన్ నీకు నెవ్వానిచే
సంపాదింపగనయ్యె నీవుమును నెంచంగా బలస్ఫూర్తిచే
సంపన్నుండ వెరుంగుదేను భవదంచత్పక్షయుగ్మంబు భా
వింపన్ దగ్ధమునయ్యె నేమిటికి తెల్పింబర్వినం జెప్పవే! 333

వ॥ అనినవిని యంతనేనును మదీయ చేష్టితంబంతయు నమ్మునిపుం గవున కెరింగించి యతిదుఃఖితుండనై యతనితో మహాత్మా! యిట్లు పక్షవిహీనుండనై జీవితంబు సహింపంజాలదావదహనుదహించి దేహంబు వలనన్ బాసెదననిన నమ్మునివరుండునున్ గరుణార్ద్ర వీక్షణంబులనన్ను వీక్షించి వత్సా! నేను యధార్థంబుగా నొక్క వాక్యంబు సెప్పెద దానిని నీకు దోచిన విధంబాచరింపుమని యిట్లనియె 334

సీ॥ ఈ దుఃఖమంతయు నిట దేహమూలంబు
సనవిదేహము కర్మసంభవంబు
నట్టి కర్మంబు దేహంబు నేననునట్టి
బుద్ధిచే బ్రాపించు పురుషునకును
నయ్యహంకార మనాదియై తగున వి
ద్యాసంభవంబు జడాత్మకంబు
జడముదేహంబు చిచ్ఛాయతోగూడుట
నదియాత్మయను భ్రాంతినావహించె

తే.గీ॥ నుష్ణగుణమగ్నిదయ్యుతద్యోగవశత
నుండునట్లు తప్తాయసీపిండమునను
నాత్మతాదాత్మ్యమున దేహమటనచేత
నాంశమయ్యు సచేతనం బటులదోచు 335

కం॥ కాననహంకృతి బలమున
నేనీదేహమను బుద్ధినిడునాత్మనకున్
గానన్ సంసారం బిది
గానగు సుఖదుఃఖముఖ్య కారణమగుచున్ 336

కం॥ అవికారంబగు నాత్మకు
దవులు వికారములు మాయతాదాత్మ్యముచే
నవుదేహ మేను కర్మో
త్సవములకేగర్త ననెడు సంకల్పమగున్ 337

వ॥ కావున నయ్యహంకారవశంబునంజేసి జీవుండు సకలకర్మంబు లొనర్చు వాడై యవశంబుగా తత్కర్మ ఫలబద్ధుండగుచు దనంత పుణ్యపాపంబులను భవింపుచునూర్ధ్వాధోలోకంబులం బరిభ్రమింపు చుండు నప్పుడు యజ్ఞ దానాద్యనేక పుణ్యకర్మంబులధికంబుగా నాచేతం జేయనయ్యెనింక ననర్గళంబుగానేను స్వర్గంబున కరిగి సకలదుఃఖంబు లనుభవించెదనని సంకల్పించి తదీయ ధ్యానగతిం జేసి తత్తత్సుఖంబు లనుభవించి తత్పుణ్యంబు నశించిన నిచ్ఛావశం బునంగాక కర్మప్రేరితుండై యధోలోకంబునం బడుచు నివ్విధంబున దిగురుచుండుంగావున 338

సీ॥ అట్టిజీవుండు గర్భావాప్తి జన్మాప్తి
కై చంద్రమండలంబందుజెంది
హిమముతోగూడి మహీస్థలి సస్యాదు
లందును బడిచిరం బచటనిలిచి
యదిచతుర్విధ భోజ్యమైయుండి పురుషుల
చేత భుజింపనై రేతమగుచు
స్త్రీయోనిముఖమున ఋతుకాలములగూడి
యోని రక్తమున సంయుక్తమగుచు

తే.గీ॥ నంతట జరాయు వేష్టితంబగుచు బ్రోది
నందుచుండు నత్తరి రేతమధికమైన
పురుష జన్మైకహేతువై బొరయు రక్త
మెక్కుడైనను స్త్రీ జన్మ హేతువగును 339

ఉ॥ ఆది దినంబునంగలలమై పడియున్ దృఢమౌను వెండియున్
బ్రోదిగ పంచరాత్రముల బుద్బుదమైతగు సప్తరాత్రమౌ
నాదటపిండ రూపమునునైతగు నట్లగుపిండ రూపమై
పాదుగ పక్షమాత్రమున బాల్పడనౌరుధిరాప్లుతంబుగన్ 340

వ॥ అట్టి గర్భగతంబగు నమ్మాంసపిండంబునకు పంచవింశతిరాత్రం బులయందు నంకురోత్పత్తియగు నొక్కమాంసంబునకు గ్రమంబున గ్రీవాశిరస్కంధ పృష్ఠ వంశోదరంబులును నంగ పంచకంబునుద యించు మాసద్వయంబునకు నవ్విధంబున పాణిపాద పార్శ్వకటి జానువులు గ్రమంబున దప్పక నుత్పన్నంబులగు మాసత్రయం బునకు నంగసంధులు ప్రత్యేకంబుగా నేర్పడు మాసచతుష్టయం బునకు సకలాంగుళంబులు వరుసతోడం బొడము మాసపంచకం బునకు నాసాకర్ణనేత్రంబులగునంత దంతపంక్తియు నఖంబులు సంభవించు షణ్మాసాంతంబున కర్ణఛిద్రంబులు విస్ఫుటంబులగు షణ్మాసంబులగునంత పాయుప్రదేశ లింగోపస్థనాభీస్థలంబులుద్భ వంబులగు సప్తమమాసంబునకు సకలతనూరుహంబులు నవ్విధం బున శిరోరుహంబులును యావహించు నయ్యష్టమమాసంబునకు సర్వావయవంబుల విభాగంబులు నెరుంగంబడు నిప్పగిదింగాంతా జఠరాంతరంబున గర్భంబు నిర్భరంబుగా వృద్ధింబొందుచుండు పూర్వంబునం బంచమమాసంబునందు జీవుండెంతయేనియుం జైతన్యంబునం బ్రాపించినాభి సూత్రాల్ప రంధ్రంబువలన బ్రాప్తం బగు మాతృభుక్తాన్నసారం బాధారంబుగా జీవితంబు నొందుచు గర్భంబున నప్పిండంబల్పంబయ్యును తద్గతంబులగు బాధల నశింపకనిజ కర్మవశంబునన్ బెరుగుచుండు నప్పుడెరుక గలుగుటం జేసిమాతృ కృతాహారవిహారాది వైపరీత్యంబుల క్రమంబునొందుచు నేహ్యంబులకు రోయుచు జఠరగతంబులగు దుష్టజంతు వ్యథలం బొరలుచు నించుకేనియున్ జలించన్‌గూడక పూర్వజన్మంబులును జన్మకృతంబులగు కర్మంబు లుందనదు నవివేకంబునుం దలంచి సంతప్తుండై యజ్జీవుండు తన మనంబున 341

సీ॥ సకలయోని సహస్ర జన్మావసరముల
నధిక కష్టంబుల ననుభవించి
పశుపుత్రదారార్థ బంధు కోటులకునై
యఖిల శ్రమంబుల నావహించి
న్యాయమన్యాయంబనక విత్తమార్జించి
భూరి ఘోరకుటుంబముల భరించి
పుణ్యవర్తనముల బొరయక పాపక్రి
యోద్యోగము వహించి యుంటిగాని

తే.గీ॥ యకట హరిచింత యొక్కింతయైన గాని
సేయనైతిని దానన జేసియిపుడు
యధిక తరముగ గర్భ దుఃఖాది నరక
మనుభవించెదనని బాధ నధిగమించు 342

కం॥ మేను క్షణభంగ మైనన్
దీనన్ ధ్రువమనుచునమ్మి తృష్ణాగతి ని
మ్మేనిం బ్రోచితి గానీ
నేనాత్మ హితంబుసేయ నేరగనైతిన్ 343

చం॥ అనియిటు పెక్కుదుఃఖముల నందుచు కర్మవశాప్తి నెన్నడో
ఘననరకోపమానమగు గర్భముననెన్నడలంగ గల్గునా
కనువుగ నింతనుండి యనయంబును నేహరినే భజింతునొం
డన నని నిశ్చయించు హృదయంబున జీవుడు భావితాత్ముడై 344

వ॥ అనియిట్లు జింతింపుచు జీవుండు దుర్గంధ వ్రణంబువలన నిర్గమించు కష్టక్రిమియున్ బోలెనంత నరకంబునకన్న దురంతంబగు యోనియంత్రంబున నతిపీడితుండై వెడలివచ్చి యచ్చట బాలుండై గృహీత భూత మాత్రుండగుట సంజ్ఞాదుల నధిగమించి స్వాధీనం బులు గాని యంగంబులమశక కీటక స్ఫోటనాదుల సహింపనేరక వ్యాధిక్షుధా తృష్ణాదులం జెప్పనేరక మలమూత్రంబుల బొరలునంత యౌవనంబున మదమోహాదిగ్రస్థుండై కృత్యాకృత్యంబు లెరుంగ కుండు వార్ధకంబున చింతావశు ండగు నిట్లు దేహ దుఃఖంబు లనుభవించనగునని మరియును 345

తే॥గీ॥ బాల్యదుఃఖంబు లిటు జెప్పబడియెమరియు
యౌవనాదిక మగుదుఃఖమందరెరిగి
నదియెనీకును ననుభూతమగుట దీని
రీతి సంపాతి నేవిస్తరింపనైతి 346

సీ॥ ఈరీతిదేహంబు నేనను భ్రాంతిచే
గర్భవాసాది దుఃఖములు గలిగె
నటుగాన దేహత్రయ విలక్షణుబరాత్ము
బ్రకృతికంటెను బరుపరమ శాంతు
జాగ్రదాదికసాక్షి సచ్చిదానంద ల
క్షణు బోధగమ్యునిశ్చలత నెరిగి
దేహాది మమతల దిగనాడి విజ్ఞాని
యైన నాత్మానంద మందగలుగు

తే.గీ॥ గానపరమాత్ము నెరిగి యజ్ఞాన మోహ
మెడల బ్రారబ్ధ కర్మాంత మీశరీర
మున్న నేమియునటుగాక చన్ననేమి
యోగ యజ్ఞాన సుఖదుఃఖయోగిగాడు 347

కం॥ కావున దేహము తోడుత
యావత్ప్రారబ్ధ సంక్షయంబగుదనుకన్
నీవుసుఖంబున నుండుము
వావిరి కంచుకము బూనువ్యాళము బోలెన్ 348

వ॥ అదియునుంగాక విహంగపుంగవా నీకు నేనొక్కముఖ్యహితంబు జెప్పెదనా కర్ణింపుము 349

శా॥ త్రేతాకాలమునందు దాశరథియై దేవుండు విష్ణుండిలన్
దైతేయాహరణార్థమై బొడమియంతన్ సీతతోభ్రాతతో
దోతో గానకుబోవరావణుడు నందుందత్సతింగొంచు నా
భ్రాతంగానకయుండ చోరగతిచే బ్రాపించులంకాపురిన్ 350

శా॥ ఆదేవిన్ వెతకంగ నబ్ధితటికై యవ్వానరుల్ భానుపు
త్రాదేశంబున వత్తు రొక్కగతి నీకవ్వారితోగూడ సం
వాదంబౌనట వారికజ్జనకజా వార్తన్ యథార్థోక్తి నా
పాదింపన్మరి గ్రొత్తగానపుడెనీ పక్షంబులు న్వచ్చెడిన్ 351

కం॥ అని చంద్రుడని మునీంద్రుడు
నను దెలిపెను గాననిపుడె నాపక్షంబుల్
జనియించి మృదుతరములుగ
గనుడని సంపాతి బ్రీతి కపితతి కనియెన్ 352

ఆ.వె॥ మీకు శుభముగలుగు నోకపివరులార!
జనియెదేని మీరు జనకతనయ
కనియెదరునిజంబు కడుదుస్తరంబగు
శరధిదాటు యత్నమరయుడింక 353

మ॥ ధరలో నే విభునామ సంస్మరణ మాత్రన్ ఘోరసంసార సా
గరమున్ దాటి దురాత్ముడేని హరిలోకంబున్ మహాశాశ్వతం
బరయంగాంచును మీరు లోకవిభుడౌ నారామభక్తుల్ హితుల్
హరులారా! యిట మీకు నెంతపని యీయంభోధినిన్ దాటుటల్ 354

తే॥గీ॥ అనుచునిటు బల్కిసంపాతియతులరీతి
యంతరిక్షంబున దనంత నరుగునంత
భూమి జాతనుగనుగొను బుద్ధిచేత
హరులు సంతోష పరులౌచు నంతనంత 355

- హనుమత్ప్రేరణము -

కం॥ అంబరమునటుల చటులా
డంబరమునగాధమై విడంబించెడి య
య్యంబునిధింగని యనిరి భ
యంబున నొండొరులు హరులు యత్నము దోపన్ 356

సీ॥ అతి చలద్భంగ సంఘాకులంబొకచోట
నొకచోట శైలజాలోల్ఖితంబు
ధావత్సరిర్ఘూర్ణీ భావితంబొకచోట
నొకచోట నావర్తనోద్గతంబు
ఘోర సత్వగ్రాహగుంభితంబొకచోట
నొకచోట భూతజాతోద్యతంబు
విశ్రుత ప్రళయాభ్ర విభ్రమంబొకచోట
నొకచోట జంఘానిలోద్ధతంబు

తే.గీ॥ మరియునభ్ర భ్రమద్వారి మధనభూరి
దీర్ఘనిర్ఘోష బధిరిత దిఙ్ముఖంబు
నైనయట్టిదిశారోధియగు పయోధి
నెట్టు దరియింతు మనుచింతనెనయునంత 357

ఉ॥ వారకనంగదుండనియె వారికి వానరులార! మీరలున్
వీరులు సత్వసారులును విక్రమచారులు శూరులెందు నె
వ్వారొకొవారిధింగడచి వారిజబంధు కులేంద్రు కార్యమిం
పారగజేసి వానరుల ప్రాణములిచ్చెటి వారు చెప్పుడా! 358

కం॥ లెండిప్పుడ ముందరికిని
రండొక్కడమోఘ బలుడు రామునకునుమా
ర్తాండతనయునకు కపుల క
తండే రక్షకుడునగును తలపగనేలా! 359

వ॥ అనియంగదుడు బలికిన నాప్లవంగపుంగవు లొండొరులంగనుం గొనుచు పలుక కూరకుండిన నయ్యువరాజు వారలంగని యిక్కా ర్యార్థంబుగా మీబలసత్వంబులు సత్యస్థితింబ్రత్యేకంబుగా జెప్పినం గార్యసాధనంబగు విధానంబెరుంగదగుననిన నయ్యంగద కుమారునితో నవ్వానరవీరులు వేర్వేరందమబలంబులువచింప నుద్యుక్తు లైయంత 360

సీ॥ పదియోజనంబుల పర్యంతము గజుండు
నెలమిగవాక్షుండు నిరుబదియును
ముప్పది యోజనంబులమేర గవయుండు
నలువంద శరభుండు నలువదియును
నెమ్మియాబదియోజనమ్ములు గంధమా
దనుడు నర్వది మైందుడనెడువాడు
నమరడెబ్బది యోజనములు నా ద్వివిదుండు
దనర సుషేణుండు నెనబదియును

తే.గీ॥ నలుడుతొంబది యోజనమ్ములుగనిట్లు
దశగుణోత్తరములు గాగ తమకునిట్లు
యోగ్యత కొలంది కపివరులొక్కరొకరు
జలధిలంఘింప బలములు దెలిపిరంత 361

ఉ॥ అప్పుడుజాంబవంతుడను నాది ద్రివిక్రమదేవు కాలమం
దొప్పుత్రిసప్త వారములు నుర్విబ్రదక్షిణ మాచరించితే
నిప్పుడు వార్ధకంబగుట నీశతయోజన దూరమందునం
దప్పక కొంతదక్కువగ దాటెదనంతయు దాటలేననన్ 362

కం॥ ఆదట నంగదు డిట్లను
నేదాటెదయోజనములు నిండుగ నూరున్
పాదోధిమరల దాటం
గాదో! యగునో! యెరుంగ గాదది నాకున్ 363

ఆ॥వె॥ అనినజాంబవంతుడనియె నంగదుతోడ
ననఘ! రాజవును నియామకుడవు
నీవు మాకు నిన్ననియమింపగలమె యె
న్నిటసమర్థుడగుదు నీవునెందు 364

వ॥ అనిన నంగదుండు జాంబవంతునితో నిక్కార్యంబెవ్వరి చేతంగా దయ్యె దానంజేసి వానరులకు నశక్యంబగుంగావున బూర్వవిధం బున సర్వకపులునుం బ్రాయోపవేశంబు జేసుటయుక్తంబనిన నతండు విచారించినయ్యంగదునితోకుమారా! యీ ప్రయోజనంబు సత్వరంబుగా నెవ్వనివలన నిర్వాహకంబగు నవ్వీరునిం జూపెదనని జాంబవంతుం డందున్నహనుమంతుంజూచి యిట్లనియె 365

కం॥ మారుతసుత! నేరనియటు
లూరకయిటు లుండదగునె యొగికార్యకళా
గౌరవము దారివచ్చిన
వారక నీబలము జూపవలదెబలాఢ్యా! 366

సీ॥ అనఘ! సాక్షాద్వాయుతనయుండవీవు న
య్యనిలతుల్య పరాక్రమాన్వితుడవు
నమ్మహాబలు చేతనట రామకార్యార్థ
మైజనింపగ జేయనలరి తీవు
జననమైనప్పుడమును నీవునుదయించు
నర్కుని పక్వ ఫలాశదినగ
శైశవచేష్టచే శతపంచయోజనో
న్నతి మీదికెగసియొక్షితిని బడితి

తే.గీ॥ వపుడె బ్రహ్మేంద్రముఖులచే నఖిలవరము
లందిమిగులనజేయుడవైతి వీవ
యగుట నీబలమహిమంబులభినుతింప
వశమెనెవ్వారికైననోవాయుతనయ! 367

మ॥ వినులెమ్మా! రఘువర్యుకార్యమును గావింపంగమమ్మెల్ల బ్రో
వనురమ్మా! యన భల్లుకేశ్వరుని తద్వాక్యాప్తి హర్షించి చ
య్యన బ్రహ్మాండపిచండ భేదముగ సింహధ్వానముంజేసి పా
వని శైలాకృతియై త్రివిక్రముగతిన్ వర్ధిల్లి దానిట్లనున్ 368

సీ॥ వైదేహిదెత్తునోవనధిలంఘించి లం
కను గాల్చికులముతోదనుజు గూల్చి
రావణుదెత్తునో! రజ్జువుతోనంట
కంఠభాగంబున గట్టి పట్టి
లంకను దెత్తునో! హుంకించి గిరితోడ
నెడమచేనిడి రామునెదుట నిలువ
కుశలంబుదెత్తునో! గురు శుభగుణ జాత
సీతను గని వచ్చి ప్రీతి హెచ్చి

తే.గీ॥ కాకనెయ్యదిగావింతు కడకమింతు
నిగ్రహింతు విజృంభింతు నిర్వహింతు
ననిన హనుమంతు వాగ్రీతివిని వినీతి
నతులగతి జాంబవంతుడిట్లతని కనియె 369

ఉ॥ పావని నీకు భద్రమగు పావనశీలతయున్ శుభాన్వితన్
జీవన భావనాకృతను సీతను గన్గొనిరమ్ము వేగమే
యావల కేవలంబుగ మహాత్ముడు రాముని తోడ గూడగా
నీవు భవత్ప్రతాప మహనీయత జూపెదు గాని యెంతయున్ 370

వ॥ అని బహువిధంబులం బ్రశంసించి సంభావించి మహానుభావా! నభో మార్గంబున నిర్గమించు నీకు ననేక మాంగల్యంబులగుగాగ రఘుకులోత్తము కార్యార్థంబు బ్రవర్తించు నిన్ను వాయుదేవుండు సహాయుండైయానువర్తించుంగాక, సకల సురలు రక్షింతురు గాకయని యాశీర్వదించిన పూర్వుండును నార్యుండును యగు జాంబవంతు నామంత్రణంబు జేసి మరియునుం గీశపుంగవుల నాలింగనాది సాంగత్యంబుల నెసంగించి యచ్చటంగదలి వియచ్చర కృతానుషంగంబునునతిశయ సముత్తుంగంబు నైన మహేంద్రాచల శృంగంబునకు లంఘించి మహాసాహసవంతుండగు హనుమంతుండు నిఖిల భువనంబులకు నద్భుతదర్శనుండై గమనోన్ముఖుండయ్యె నివ్విధంబున 371

పంచరామరము -

మహానగేంద్ర గాత్రుడున్ సమగ్రహేతిదీప్తుడున్
మహామహుండహీంద్ర భోగమాత్రదీర్ఘ బాహుడున్
మహామహోగ్రతేజుడైన మారుతాత్మజుండటన్
మహేంద్రమందు సర్వభూతమాన్యుడైకనంబడెన్ 372

వ॥ అనియిప్పగిది నప్పరమేశ్వరుండు సెప్పి నప్పార్వతియునపూర్వానం దంబున నయ్యిందు ధరునితో మహాత్మా! యఖిలేశ్వరుండగు నారఘుకులేశ్వరు చరిత్రంబతి విచిత్రంబగుచున్న యదియనంతర వృత్తాంతంబు వచియింపవేయని యడుగుటయును. 373

- జాంబవత్పాద బంధచిత్రము -

ఉ॥ రామసహాస తిర్మలధరావర సోమనృపాత్మ సారసా
రామ★ధరాధరావరవరస్తవనాదరణ ప్రమోద సా
రామల శీలధర్మ రచితాద్యవతార కృతానవప్రకా
రాముని మానితాదురితరాజ విభంజక భక్తరంజకా! 374

★ ధరావ - గ.ము.ప్ర.పా.



- రథబంధ చిత్రకందము -

★శ్రీశగరుడ సద్వాహా
దాశరథీలసదగణ్య దర్శిత పుణ్యా
కీశాళీ పరివార
శ్రీశాలివ్యోమ కేశచిద్వశ భావా 375

★ ఈ పద్యచిత్రంలోని మధ్యనగల నిలువు గళ్లలో "శ్రీ గద్వాలపురకేశవా" అని ఉన్నది.

- రథబంధ చిత్రము -



లయగ్రాహి -

బాలకృత శీలపరిశీలహరి నీలనిభ
నీలరుచి జాలతను లీలగుణసారా
వాలహరితాళసమ చేలధర తాళవిధ
సాలహర నీలగళ దైలహర వాణీ
పాలముఖ పాలశిఖి వాలకృతచూళతత
వాలహితలోలగుణ ఖేలవర శ్రీగ
ద్వాలపుర ఖేలవర బాలశశిఫాల శిశు
పాలకవిఫాలక విశాలజయశీలా! 376

- గద్య -

ఇది శ్రీమదుభయ కవితా నిస్సహాయ సాహితీవిహార కాణాదాన్వయతిమ్మనార్యకుమార
వినయవిభ్రాజి పెద్దనసోమయాజి ప్రణీతంబైన
శ్రీమదధ్యాత్మరామాయణంబను మహాపురాణంబునందు
కిష్కింధకాండంబన్నది చతుర్థాశ్వాసము సంపూర్ణము

-★)★(★-



శ్రీ భూ చెన్నకేశవాయనమః

అధ్యాత్మ రామాయణము

సుందరకాండము

శ్రీమద్గద్వాల పురీ
ధామ సమావర్తి సదయతా విస్ఫూర్తీ !
సోమధరావరవిభవ
క్షేమద ! సత్కీర్తి ! చెన్నకేశవమూర్తీ ! 1

వ॥ అవధరింపుముభక్తియోగ విశారదుండగు నారదునకు సకలార్థ సంధాతయగు విధాత సెప్పెనట్లు విజ్ఞానవతియగు పార్వతికి దివ్య ప్రభావుండగు మహాదేవుండిట్లనియె నవ్విధంబున శతయోజన విస్తారంబును మహామకరాది సంచారంబునునగు పారావారంబును దాటన్ గమకించి మహాజీవ ప్రభావభాసమానుండగు సమీర సూనుండు పరమానందంబున 2

కం॥ రాముని నణిమాదిగుణ
స్థేముని బరమప్రభావ సీముని విజయో
ద్ధాముని కృతనత యోగ
క్షేముని మదిలోన దలచి సేమము మీరన్ 3

కం॥ వ్యోమచరంబగుగతిచే
రామ శరంబనగ వేగిరము జుననన్నున్
వే మీరందరు గపులున్
వేమారుంజూడుడనుచు విస్ఫూర్జితుడై 4

కం॥ ఈవిధినేడిదె రాముని
దేవిని జనకజనుగాంచి తిరిగిరఘువరున్
సేవింపవత్తునతని ద
యావేశతయెంతయే కృతార్థుడ సుమ్మీ ! 5

ఉ॥ ప్రాణవిమోక్షవేళ నొకయప్పుడయెవ్వని నామకీర్తనం
బాని నరుండు దుస్తర భవాబ్ధి దరించును నట్టి రామునిన్
ధ్యానమొనర్చియున్మది తదంగుళిముద్రధరించి దూతనై
యేనొకయల్పవార్ధిదరియించుట యెంతని సంతసంబునన్ 6

– హనుమంతుడు సముద్రంమునుదాటి లంకకేగుట –

మ॥ వడిగా బాహువు లప్పళించినిగుడన్ వాలమ్మునిక్కించి రెం
డడుగుల్ జిక్కగనుంచి వంచిసమలక్ష్య గ్రీవుడై పెంపుతో
నొడలు ప్పొంగగ దక్షిణాభి ముఖుడై యూర్ధ్వంబులక్షించి బ
ల్కడకన్ మారుతియంబరంబునకుగా లంఘించెజింఘాలుడై 7

వ॥ ఇట్లన్నగచరుండు గగనచరుండై పవన జవంబునన్ జనుచుండన్‌గని యనిమిషులు వనచర మాత్రుండని యతని యందలి లంకాప్రవేశ జీవసత్వంబుల యందు శంకాయత్త చిత్తులై యత్తరి కౌతుకంబున నాగమాతయగు సురసయగుదానింబిలిచి నీవిమ్మహా జవసత్వ పరుండగు వానరు బలాబలంబులును బుద్ధివైశద్యంబునుం బరీక్షించి యీక్షణంబ రమ్మనిపంచిన నద్దేవియు నమ్మ రుత్తనయు మార్గం బునకు విఘ్నకారణియై యడ్డంబువచ్చి నిలిచి యిట్లనియె 8

కం॥ ఓ కపివర ! యాకొననగు
నాకాహారముగ నిన్ను నాకులుజూపన్
గైకొనవచ్చితి నావద
నాకరమున్ జొరుమటన్న నతడాసతితోన్ 9

మ॥ జననీ! రాఘువునాజ్ఞనేగెద మహీజాతన్నిరీక్షించి జ
క్కననద్దేవి శుభంబు తత్పతికి వేగందెల్పి నేవచ్చెద
న్వినునీయాస్యము జొచ్చెదన్ సరసవౌనీకున్నమస్కారమం
చనినంబల్కె సమీరనందనునితో నద్దేవియున్వెండియున్ 10

కం॥ వానరవర! యిపుడుమదీ
యాననముంజొచ్చి వెడలుమాకలిదీరున్
బోనిత్తు గానిచో నే
నైనన్ భక్షింతు నినునటన్నరయమునన్ 11

వ॥ అప్పుడప్పవనతనయుండమ్మాట కియ్యకొని యద్దేవితో నీవు వదనంబు దెరచినం బ్రవేశించిచనియెదనని యోజనమాత్రంబగు గాత్రంబున నిలిచినం గని యయ్యంగనయుం బంచయోజన మాత్రంబుగా దనవక్త్రంబు దెరచిన నవ్వనచరుండు దశయోజన ప్రమాణ స్వరూపంబున జూపట్టిన నద్దేవియు

వింశతి యోజన ముఖంబున నభిముఖంబుగా నతండునుం ద్రింశద్యోజన పరిమితుం డైన నాభుజగ జననియు నిజాననంబు పంచాశద్యోజన మానంబుగా బెంచినంగాంచి యక్కార్యపరుండింక దడసినం గార్యంబుగాదని యంగుష్ఠ సమానదేహుండై తదీయ వదన గహ్వారంబు సొచ్చి వెడలివచ్చి ముందుట నిల్చి భవద్వచన ప్రకారం బొనర్చితి పోయి వచ్చెదనని నమస్కరించిన సంతసించి సురస హనుమంతున కిట్లనియె 12

కం॥ సాధింతు రాముకార్యము
మేధావంతుడవు సురసమితి నీబలమున్
శోధింపు మనిన వచ్చితి
నాధరణిజ జూచివత్తు వధిపతి మెచ్చన్ 13

మ॥ అని యద్దేవియుదేవలోకమునకై యంతన్ జనన్ వాయునం
దనుడున్ వాయుపథంబునన్ మరిగరుత్మత్తుల్య వేగంబునన్
జనుచుండంగని సాగరంబునిజరక్షాలక్షిత శ్రీకమై
మను మైనాకము జీరియిట్లనియె బ్రేమన్రామకార్యార్థియై 14

సీ॥ వినుముమైనాకమ! హనుమంతుడతిసత్వు
డలరామ కార్యార్థమాకసమున
జనియెడు మున్ననేసగరుల చేవృద్ధి
గాంచిన కతన సాగరమనైతి

తద్వంశమున బుట్టె దశరథునకు రాము
డవ్విభు దూతయీయనిల సుతుడు
కొంతనీయందు విశ్రాంతుని గావింపు
మీతని నని వార్ధిహితవు సెప్ప

తే॥గీ॥ నమరహిత కార్యమౌట భయంబులేక
నంతమైనాకమంబు మధ్యంబు వెడలి
బలమణీ శృంగములతోడ బయలు మెరసి
యటనరాకృతితోనిల్చి యతనిబిల్చి 15

తే॥గీ॥ నగచరోత్తమ! మైనాక నగమనేను
నబ్ధి పంపున వచ్చితి నమృత కల్ప
ఫలములు భుజించి నా శృంగముల వసించి
యంచితారామముల విశ్రమించి చనుము 16

మ॥ అని మైనాకము బల్కవాయుసుతు డో యద్రీంద్ర! కార్యార్థినై
జనునాకున్ మదినిచ్ఛయింతునె భుజించన్ విశ్రమించన్ రయం
బున బోవన్ జనుగాకటంచు శిఖరంబున్మట్టి హస్తంబుచే
జనియెం బైల్పడునీకు నేనభయహస్తం బిత్తునన్ కైవడిన్ 17

సీ॥ అంతయధారీతి హనుమంతుడొక కొంత
దూరంబు జననబ్ధి వారియందు
నాకాశచరుల ఛాయాకృష్టి రాదీసి
చేరిభక్షింపుచు సింహికయను

నొక్క ఛాయాగ్రహంబుండి మారుతితను
ఛాయగ్రహించిన సరభసమున
బోవరాకున్నచో నేవారిచే మార్గ
మరికట్టు బడెనని యధికచింత

తే.గీ॥ వెదకియెవ్వరు లేకున్నవిస్మయమున
నటయధోదృష్టి నరసి భయంకరముగ
మెలయు సింహికగాంచియబ్బలియుడలుక
దానిమీదికి దుమికె సత్వరము గాగ 18

కం॥ ఆమారుతి పదహతిచే
సేమ మెడలి యొడలు నులియ సింహికయు బహి
స్సీమాగత సింహికయై
సాముద్రజలాంతరమున జడిసె న్మడిసెన్ 19

ఉ॥ ఈవిధిసింహికన్ దునిమి యెప్పటిరీతిని దక్షిణాభిము
ఖ్యావృతిబోయి పోయి పవనాత్మజుడంబుధి దాటి యందునా
నా విధ వృక్షవల్లి సుమనఃఫలమై మృగపక్షికీర్ణయై
యావలనొప్పు సాగరతటాంతికముం గని తత్తటంబునన్ 20

కం॥ విలసద్ధరణి త్రికూటా
చల సంగత తుంగ శృంగ సరణిం బరిఘా
వలితంబై బహుసాలా
కలితంబై మెరయుదాని కపివరుడంతన్ 21

కం॥ లంకన్ కృత దర హృదయ క
ళంకన్ బహు వైభవాకలంక న్మణి సౌ
ధాంక న్నిజ సంశ్రిత ని
శ్శంకన్ గని తత్ప్రశంస శంకన్మదిలోన్ 22

కం॥ ఆరావణపాలితమిది
యేరికి జొరరాదు దీని నిందుండుచునే
నీరాత్రి జొత్తు సూక్ష్మా
కారంబున ననుచు మది వికాసతనుండెన్ 23

వ॥ అంత. 24

చం॥ జనక సుతాగవేషణవశంవదుడయ్యె మరుత్సుతుండికన్
జనుమన కార్యసిద్ధియని జంభవిరోధి సరోధి భర్తక
య్యనిమిష పద్ధతిన్ సమయయామికు చేతను కుంకుమాంక శో
భనముగ కమ్మబంపెనని భానుడుదోచె ప్రచేతసోదిశన్ 25

మ॥ తనవంశోద్భవుడైన రామవిభుకాంతన్ పద్మినిన్ భూమిజన్
గను వాంఛన్ తన పుత్రమంత్రియగు ముఖ్యచ్ఛాత్రు డేతెంచిలం
కనుశోధింపగ దత్సహాయకృతి కాంక్షన్ దానుపాతాళ లం
కను శోధింపగ నేగె నారవిగడంకన్ గృంకెనంభోనిధిన్ 26

సీ॥ ప్రకృతిపేరిటి వధూటిక రోదసీ పేటి
కను ఘటించిన ఘనాంజనమనంగ
విధికులాలు డజాండవిధభాండముల జేయ
మట్టించు నావంపు మషియనంగ
రవిరసేంద్రముకాల రసవాది ఖరవహ్ని
పుట మూదనెగసిన పొగయనంగ
నిజనీలగుణముచే నిఖిలభూతశ్రేణి
గాఢమై పొదవునాకసమనంగ

తే॥గీ॥ వస్తుతత్త్వ సమాలోక వాసనైక
వర్తనకు దూరపరచి సర్వ ప్రపంచ
పటలమునగప్పు నజ్ఞానభరమనంగ
నంధకారంబు జగమెల్ల నాక్రమించె 27

వ॥ అంత 28

కం॥ దానవపతి జనక తనూ
జానయన ద్రోహపూరి తాయశమనగా
నానిశ జరించుదానవ
తానవరుచియనగ నంధ తమసంబెసగన్ 29

కం॥ తారకములు గగనాగమ
కోరకములు సన్నిహితచ కోరకములు శ్రీ
కారకములు సుకృత సుధా
సారకములు దనరెసుప్రసారకములునై 30

– గుణిత క్రమము –

చం॥ **క**మల విరోధి **కా**మజయకారి **కి**రద్యుతి **కీ**ర్తనీయుడున్
కుముదహితుండు **కూ**టమృగగోప్త **కృ**తాంకుడు **క్లు**ప్తసత్కళా
క్రముడును **కే**శవేక్షణము **కై**రవణీశుడు **కో**కభేదనా
గమనుడు **కౌ**ముదీకరుడు **కం**ధిభవుండుదయించె తూర్పునన్ 31

చం॥ సమయపు తారవాది దివసప్రభుమండల తామ్రఖండ మ
భ్రమునను మూష సాంధ్యపుట రాగమునుందిమిరంపు ధూమమున్
గుమిగొన వహ్నియోగమొనగూర్పగ చొక్కపువన్నె సిద్ధమై
యమలిన వెండి ఖండమననైందవ బింబము దోచెనంతటన్ 32

శా॥ ఐంద్రవ్యాకరణంబు నేర్చెమునుపయ్యాదిత్య నొద్దన్ విని
స్తంద్రప్రక్రియతోడ నెంతనినవాంచత్కాముదీ వ్యాప్తిచే
చాంద్రవ్యాకరణంబునేర్పెదనునే సామీరికంచుంబలెన్
జంద్రుండొప్పె కళాకలాపకలనా సాంద్రుండునై యత్తరిన్ 33

సీ॥ బహువియుక్త జిగీషు పంచేషుమౌక్తికా
చ్ఛాదిత శితజయచ్ఛత్రమనగ
కమలజాండపయోధి కలిత బుద్బుదకాండ
మండలాంచిత ఫేనఖండమనగ
గగనసరస్యార కైరవశ్రేణికా
శ్రీపరీవృత పుండరీకమనగ
సమయ కల్పితతమశ్శమ హస్తదీపికా
ప్రాంశుచంద్రజ్యోతిరంశువనగ

తే॥గీ॥ చటుల సాయన్నటన్మహానటకిరీట
తట సుమచ్ఛన్న గుచ్ఛావతంసమనగ
ప్రాంత సంక్రాంత తారకాకాంతుడగుచు
తారకాకాంతుడలనభస్థలి వెలుంగె 34

కం॥ తమ కార్యంబొనరించున్
సమీర సుతుడనుచు సురలొసంగిన దివిటీ
సమితియు చామరమనగా
నమరెందారకలు చంద్రుడంబరసీమన్ 35

చం॥ దివస కరిన్నిశాహరి వధింపగ తత్కరరీణ శోణ ప
ద్మ విధిని గ్రుంకె చండరుచితద్రుధిరంబన దోచెసంధ్య త
చ్ఛవియన దార్చె నంధతమసంబు దతగ్రరథంబనంగ నిం
దువుదగె తచ్ఛిరోగళిత నూతన ముక్తల బోల్చెతారకల్ 36

సీ॥ నిబిడతమఃపూర నీరదాక్రమణంబు
తారకాకరకా ప్రకారకంబు
భవనభావిత దీపపటు తటిత్పటలంబు
గ్రహవిభాక్రమ శక్ర కార్ముకంబు
జనలోచన పయోజ సంకోచనరకంబు
సంతాప దావప్రశాంతిదంబు
తతజార చోర చాతక మోద సంధాయి
పధిక సంచార సంభ్రమ నిరోధి

తే.గీ॥ రామధనికీర్తి సస్యవర్ధన విధాన
కరణ సీతాగవేషణ కార్యసక్త
పవనపుత్ర కృషీవల ప్రమదకారి
సాగెనత్తరి రాత్రి వర్షాగమంబు 37

కం॥ మెండుగ నజాండమండల
కాండమునం గౌముదీ ప్రకాండ మఖండం
బొండొండనిండు కొనియెం
బిండారం బోసినట్లు పెంపుగనంతన్ 38

వ॥ వెండియు సమయ దోహకుండు కమల జాండభాండం బునంబండు నిండుకొను వియద్గేను సుధాకరోధస్సాధిత దుగ్ధధారావిధంబున నధికరింపుచు, మహాబిలస్థల స్యంది మందాకినీ సలిల సందోహ ప్రవాహ సందేహంబు సందర్భింపుచు, భువనగర్భ ప్రసిద్ధ శుద్ధాంత మధ్యతల నిబద్ధ పరిశుద్ధ పట్టాంశుక వితానప్రతానద్యుతి ప్రతిభ నతిశయింపుచు, రోదసీప్రాసాద సమాసాదిత దుకూలతూలికా విశద శయ్యావినోదంబు నాపాదింపుచు, దిశావిశాల భిత్తికా విన్యస్త పయస్తిమిత సుధావస్తు విలేపన స్వరూపంబు నారోపింపుచు, రాజవిశ్రుత తనూజ జనన సముత్సాహ మోహసంగతి నుప్పొంగు పయోధిపుంగవునంతరంగ రంగ త్తరంగంబుల బెరుంగు మెరుంగుల నెరింగింపుచు, హరి ప్రయుక్త వాసరోపవాసతప్త జీవంజీవద్విజపుంజసంజీవన కారణపారాణ లబ్ధశుద్ధోదనంబును, నశేషమహౌషధీ పోషణప్రబుద్ధసిద్ధరస విశేషంబును నగుచు, స్వాధీన పతికలకుమనోధవమిధోవలోకన సుఖంబులొనర్పుచు, వాసక సజ్జికలకు శయ్యాదిసజ్జీకరణంబుల శృంగారంబు లెసంగింపుచు, *విరహోత్కంఠికలకు* నుత్కంఠనినుమడింపుచు, *విప్రలబ్ధలకుపతి* లబ్ధవాంచం బెంపుచు, *ఖండితలకు* ప్రియులదుండిగంబులుండం జూపుచు, *కలహాంతరితలకు* పూర్వసముద్దీపిత కోపంబుల బాపుచు, *ప్రోషితభర్తృకలగాత్రపాండిమంబునండంగొనుచు, నభిసారికల* శ్వేత లక్ష ణంబుల రక్షణంబు గావింపుచు, సకలలోక బృందంబునకు నానంద సాంద్రంబుగా చంద్రికావిసరంబు బ్రసరించె నయ్యవ సరంబున 39

శా॥ ఆరాత్రిన్ ధృతిశాలి వాయుజుడు సూక్ష్మాకారతం దత్పుర
ద్వారంబందు జొరందలంపగని ప్రత్యక్షంబుగా రాక్షస
స్త్రీ రూపంబుధరించి లంకయునునెంతే లంకిణీసంజ్ఞచే
జేరన్వచ్చి మరుత్తనూజుని వచించెన్వేగ తర్జింపుచున్ 40

శా॥ ఓరీవానరరూప!లంకనగు నన్నొక్కింత లక్షింపకన్
జోరప్రక్రియ జొచ్చెదెవ్వడవునిచ్చో నెందుకై యంచు రో
షారక్తేక్షణ యౌచుముష్టిగొని వ్రేయన్ వాయుపుత్రుండు దు
ర్వారస్ఫూర్తిని వామముష్టి బొడిచెన్వజ్రోద్ధతిన్ లంకిణిన్ 41

కం॥ తోనన్ రక్తముగ్రక్కుచు
బూనిమతి భ్రమముదోప బుడమింబడి దో
ద్రోనన్ లేచియు లంకిణి
వానరవరు బలముజూచి వడినిట్లనియెన్ 42

సీ॥ అనిలజ! ననుగెల్చి తరుగుము శుభమునీ
కగుదొల్లినాతోడ ననియెబ్రహ్మ
పూనియష్టావింశమైన త్రేతాయుగం
బందునారాయణుండవ్యయుండు

రామాఖ్యచేపంక్తిరథునకు జనియించు
యోగమాయయుసీత నాగజనక
సుతయగు భూభారహృతికిగాగ నజుండు
బ్రార్థింపనాతండు భార్యతోడ

తే।।గీ।। ననుజుడును దానువనమున కరుగునందు
నమ్మహామాయ రావణుడపహరింప
నంత సుగ్రీవుడాసీత నరయుటకును
వానరుల బంపనందొక్క వానరుండు 43

కం।। రాతిరినీకుం గనపడి
నీతో భర్జింపబడియు నిను ముష్టిమహా
ఘాతంబున నిర్జించిన
నాతరిరావణున కంత్యమగు నదివినుమా! 44

చం।। అనుచువిరించిజెప్పెనిపుడాగతి నన్నుజయించినీవునో
యనిలతనూజ! నీకు జయమౌనిక రావణునంతరాలయం
బునబహుదివ్య భూరుహవిభూషితమైన యశోక కేళికా
వనమున శింశుపాతరునివాసమున న్నియమాధి వాసతన్ 45

కం।। జనకసుత ఘోరరాక్షస
వనితారక్షితయు నగుచు వర్తిలునామెం
గనిరామున కెరిగింపుము
జనుమిక ననిపలికి లంకసమ్మతితనలోన్ 46

ఉ।। ఏనతిధన్యనైతినిట నెంతయునుంభవపాశనాశమున్
బూనుచురామ సంస్మరణ ముల్లమునన్ జనియించె దుర్లభం
బైన తతీయ భక్తసుజనాధిక సంగతి గల్గెనేటికిన్
గానమదిన్ బ్రసన్నుడగు గావుతరాముడు నాయెడన్ గృపన్ 47

వ।। అనియిట్లు లంకిణి సంతసించె తదనంతరంబ 48

తే।।గీ।। అనిలసుతుడట్లు జనుచోట వనధిదాటి
తీవరంబుగ నావేళ రావణునకు
భూమిసుతకును వామాక్షి భుజములదరె
రామునకు దక్షిణభుజాక్షి సీమలదరె 49

వ॥ అంతట హనుమంతుండివ్విధంబున లంకిణి జయించి లంకాపురాభ్యంతరంబు బ్రవేశించి తదీయ
దివ్య సౌభాగ్యంబుల కారశ్చర్యంబునొందుచుందన మనంబున నిట్లనితలంచె 50

సీ॥ తమసమున్నతి సురాధార మౌమేరువు
దేలనొత్తగజాలు సాలములును
తమ గభీరతభోగి తతులరసాతల
క్షితిగలంచగజాలు ఖేయములును
తమవిశాలత దిశాధవులపురావళి
నవల ద్రోయగజాలు హర్మ్యములును
తమధనాయతి పురాతన నిధానుధనేశు
నర్ధిజేయగజాలు నాపణములు

తే॥గీ॥ తనరుమణిరుచి ధూతనూతనగభస్తి
భానుశితభాను మండల స్థానమాన
కర్షణోద్ధర్షణోత్తుంగ కలితశృంగ
కనకమయ గోపురంబులంకాపురంబు 51

సీ॥ మితిమీరుతోరణస్థితు లాకసమ్రాకు
నమరపుర స్త్రీల నాగులీల
వాతధూత పటాంతకేతువుల్ దివివ్రాయు
వేల్పులచంపలు వేయులీల
తగు శిరోగృహకపోతములు హుంకృతిజేయు
దీకొని సురల గద్దించులీల
తలలెత్తి దివికిసౌధములకేకులుగూయు
సేవకు త్రిదశుల జీరు లీల

తే.గీ॥ తగు పతాకలు ఘనతటిత్పటలి దివియు
దివిజకాంతలసిగబట్టి తివియులీల
పతిదశాస్యు నౌద్ధత్య మేర్పరపులీల
లంకలోన దినంబు నిశ్శంకతోడ 52

చం॥ సమధిగతోన్నతస్థితుల సప్తశిరోగృహ సౌధపంక్తి ఖే
యమునను బింబితంబయిన తద్దశకంఠుడుబల్మి నూర్ధ్వలో
కములునధో జగత్తులునుగాగ చతుర్ధశ లోకముల్ గ్రమ
క్రమముగ దెచ్చి నిల్పెననగన్పడు నెప్పుడు నప్పురంబునన్ 53

తే॥గీ॥ మేరుకైలాస రోహణ వారినిధుల
వెట్టిబట్టి తెప్పింతురా వీటివారు
స్వర్ణరజిత రత్నాదులు వలయునపుడు
ప్రతిదినములంకలోన నిర్భయము బూన 54

మ॥ అనిలంబున్ గృహమార్జనంబు వనదంబయ్యంబు సమ్మార్జనం
బనలంబున్ బచనంబుదీపరచనం బర్కేందు లీరీతిన
య్యనిమేషుల్ బనులన్నియున్ సలుప దైత్య శ్రేష్ఠనీలంకలో
ననిశంబున్ వచియింపగాదరమె యీయైశ్వర్య మింతంతనన్ 55

వ॥ మరియునీలంకాపురంబు నిజప్రభావలోకంబునను పరిలోకంబులం ప్రతిఘటింపుచు నపరిమిత తపనశశిముఖ గ్రహతారకా ది విభాను భావంబుం విడంబింపుచునగణితంబులైన మాణిక్య సుందరంబు లగు దివ్యమందిరంబులునువివిధవినోదంబులగు ననేనకకోటి కలధౌతప్రాసాదంబులును, ప్రవాళ మంటప గణంబులును, మరకతమయవేదికాంగణంబులును పుష్యరాగ శిరోగృహంబులును, హరమణివిపణికా నివహంబులును, నింద్రనీల సభాగారంబులును, వైడూర్యవలభికావారంబులును, గోమేధిక సమేధిత సోపానంబులును, మౌక్తికానుయుక్తవితానంబులును, మేరుశిఖరాను క్రమంబులగు సేనాస్థాన సంక్రమంబులును, ససంఖ్యాతంబులై విస్మయావహం బులగుచు యధార్థంబుగానిందనం బొనర్చు మహాస్యందనంబులును, సకలదిశాసంచార సంమర్దంబులగుట వాసవ సద్గజంబుల నరసింపుచు నత్యున్నతంబులగుట వామన గజంబుగొంచింపుచు నతిజవంబునం బుండరీక కుముదాదుల నిగ్గదీయజాలి దిగ్గ జాన్వయంబుల నతిక్రమించు చతుర్దంత దంతావళ సంతానం బులును, ఖురశ్రవణంబులనుచ్చైశ్రవంబుల నొచ్చెంబులెంచు నుత్తమ జాతి తురంగ సంఘంబులును, ఏకద్విత్రినేత్రముఖ పాదులును వికలదీర్ఘకుబ్జ కరాళదంష్ట్రాకారులై యనియత కోటి సంఖ్యావశు లగు త్రిదశులస్వప్నులని గణింపక నిర్భయంబున నిద్రజెందు మహోద్భటులగు నిశాట కోటి వీరభటులుంగలిగివి యన్నది కన్నం జెన్నగు విచిత్రమణిమయ కమలకుముద విహంగ భృంగవాలుకా నీరపూరంబులగు కాసారంబుల నెసంగి మహాసుర శూర సింహధ్వానంబులును నభంబు విభేదింప దశానన సేవా సమాగత బృందారక బృందంబులందంద సందడించు నానావిధ కూట వాటంబులం బాటించి పదంపడియనేక జిష్ణు సంగతంబగుట నేక జిష్ణు సంగతంబనగు నమరావతి నిరాకరింపుచు, ప్రబలాను గతంబగుట కృశానుగతం బగుట కృశానుగతంబగు తేజోవతి నతిక్రమింపుచు సార్వకాలిక సముచితంబగుట కాలోచితంబగు సంయమనిపురి నిరసింపుచు, నిఖిలదిక్పాలక సేవాసమాశ్రితం బగుట కోణపాశ్రితంబగు ఘోషవతిందోషంబు లెంచుచు సకలాయుధ ధరలక్షితంబగుట పాశధర లక్షితంబగు ధర్మవతినిర్లక్షింపుచు మరుద్విరోధి వాసంబగుట మరుద్వాసంబగు గంధవతి నిందింపుచు, మనుష్యాశనధర్మాభివేశంబగుట మనుష్య ధర్మావేశం బగు నలకాపురిం దిరస్కరించుచు, గణనాతివ్యాప్త

భూతనాథ నివాసంబగు కైలాసంబుంహసింపుచుండంగని తదీయ సర్వోత్కర్ష స్థితికి నత్యాశ్చర్యంబు
నొందుచుండునంత 56

తే॥గీ॥ అసురకులనేత యీసీత నపహరించి,
రాఘవునితోడ వైరంబు రాఘటించి,
యురక యైశ్వర్య మింత యుజెరుచుకొనియె
ననుచు కటకట పడుచు నయ్యనిలసుతుడు ॥ 57

సీ॥ కోటలుపేటలు గోడలు మేడలు
కెలకులు కొలకులు గిరులు దరులు
ధనమందిరములు స్యందనమందిరంబులు
నృపభవనంబులు నుపవనములు
గజరాజ గృహములు ఘనవాజి గృహములు
సచివగేహములు రాక్షస గృహములు
పాకశాలికలును పానశాలికలును
సత్రశాలలు చిత్రశాలికలును

తే॥గీ॥ నంతిపురములు బందీగృహములు సభలు
సౌధములు నాపణములు బ్రాసాదములును
నాదిగా నొప్పునప్పురి నన్నియడల
సీత వెదకెను పవమానసూతి బ్రీతి 58

సీ॥ కింపురుషులతోడ కిన్నరుల్ గుమిగూడి
పాటలుబిలువక పాడుచుండ
గంధర్వతతి మృదంగ ప్రసంగతి నిచ్ఛ
నచ్చరుల్ జెప్పక నాడుచుండ
సిద్ధులు సాధ్యులు జేరిజీరకమున్న
గలలోకవార్తలు దెలుపుచుండ
యక్షులతోహాస్యదక్షులై గుహ్యకుల్
తెచ్చుకోల్ ప్రొద్దులు బుచ్చుచుండ

తే॥గీ॥ నగరివాకిళ్ళ ముంగిళ్ళ తగినజోళ్ళ
మనువులకుబొంచి సమయంబులనుసరించి
యొదిగి దిక్పాలకులుగాంచియుండనలరు
రావణుగృహాంగణంబు జేరంగ నరిగి 59

వ॥ అంతసీతాన్వేషణ కార్యార్ధియై వాతాత్మజుండునుం దైతేయ కాంతుగృహాభ్యంతరంబునన్ ప్రవేశించి తత్తద్రహస్య ప్రదేశంబుల నవలోకించియు సమంచిత విచిత్ర మణి వితాన కృతానేక విధానం బగు పుష్పవిమానంబులును గాంచియునందు నిద్రాబంధురుండగు దశకంధరు నీక్షించియు దత్సమీపంబున నందందునంగంబు లెరుంగక సుఖసుప్తిజెందు మందోదరీ ముఖ్యులగు సుందరుల నందరిం దిలకించి విచారంబున సీతాభ్రాంతియు వివేకంబున చేతోభ్రాంతియుదలంగి మరియును. 60

కం॥ అంతట నీరీతిగ రా
జాంతఃపురమెల్ల వెదకియవనిజనచ్చో
నెంతయుగానక నటహను
మంతుడు లంకోక్తితనకు మదికిం దోపన్ 61

వ॥ అత్తరినమ్మరుత్తనయుండు సత్వరంబునం బరివేష్టిత సుపర్వపాదప సమ్మర్ద సంభావనంబును, నేకకాల ప్రవర్తిత సకలర్తు విశిష్ట కిసలయ కుసుమఫలవిసర భారానమచ్ఛాఖానుభావనంబును, నానావిధ మృగపక్షి సముదయ సముజ్జీవనంబును, రత్నసోపానవాపికానేక దీపితసుధోపమాన జీవనంబును, శాతకుంభ ప్రాకారగుంభితా వనంబును నసురరాజీవనంబును నగునశోక వనంబు ప్రవేశించి, ప్రతిమహీజాతమ్మున నమ్మహీజాతను వెదకుచు నందొక్క ప్రదేశంబున మణిస్తంభ శతకృత విభావిభేదంబును, గగన లేఖన సమున్నతి శ్రీదంబును, నకుంఠ దశకంఠ విహారవినోదంబునునగు, చైత్యప్రాసాదంబుగనుంగొని, వెరగందియందు సొచ్చి నిర్గమించి యచ్చటికిన్ గొంతదూరంబున సువర్ణవర్ణ విహంగ మాకీర్ణంబును, సమాచ్ఛాదితచ్ఛాయాపూర్ణ పర్ణంబును, నదృష్టాతపలక్ష్యంబునునగు, శింశుపావృక్షంబు గాంచి, విశాలంబగు తత్తరుమూలంబున రాక్షస వధూ మధ్యంబున. 62

– ఆంజనేయుండు సీతాదేవిని జూచుట –

సీ॥ ఉపవాస కృశయయ్యు నొడలి యొప్పిదముతో
దీనయయ్యును ధైర్యదీప్తితోడ
మలినాంబరయునయ్యు మహనీయ కాంతితో
భూతల్పయయ్యు నుద్భాతితోడ
రక్షకచ్యుతయయ్యు రామసంస్మరణతో
దుఃఖితయయ్యు సంతుష్టితోడ
రహితభూషణయయ్యు సహజరేఖాప్తితో
నేకవేణియునయ్యు నింపుతోడ

తే॥గీ॥ భూతిగప్పిన శిఖిరీతి బొసగుదాని
తత్తదుచ్ఛద విటపమధ్యముననుండి
తనతపః ఫలదేవత గనువిధాన
జానకినిగాంచె నప్పవమానసుతుడు 63

కం॥ ఈరీతిగృతార్థుండై
మారుతి ధన్యుండనైతి మహిసుతగంటిన్
శ్రీరాముల కార్యంబీ
డేరెన్ నాచేతననుచు నెలమి వసించెన్ 64

ఉ॥ ఆ సమయంబునందొక మహానినదంబచటందదంతరా
వాస బహిస్థలిన్ వినగవచ్చిన నచ్చెరువంది యేమొకో!
యీసముదగ్రనిస్వనమునే నిదిగాచెదనంచు వాయుజుం
డోసరి తత్తరుచ్ఛద నియుక్తి నడంగి వసించియున్నెడన్ 65

తే॥గీ॥ అమరగంధర్వముఖ కాంతలంతనంత
నఖిలపరిచర్య లొనరింపనతిశయింప
నవలమందోదరీముఖ్య లాత్మసౌఖ్య
మావహించు వధూవార మరుగుదేర 66

సీ॥ చీకటి యెల్లరాశిగనిల్చెనోయన
మేనికాంతులు మిరుమిట్లుగొలుప
ఘనదీర్ఘపరిలంబికాలాహి సంఘంబు
విధమున బాహువుల్ వ్రేగుజూప
కడుభీతిజేయు నుల్కాపాతముల రీతి
నతిరక్తిలోచనద్యుతులెసంగ
నంజనాచలము శృంగాళితోనడతెంచు
గతిమస్తకంబు లంగంబునడర

తే॥గీ॥ త్రిభువన తమోగుణంబుమూర్తీభవించి
వచ్చెనోయన నపుడురావణుడు వచ్చె
పూరిత ప్రేమపాక విస్ఫూర్తిదోప
సరభసంబున నాజగజ్జనని కడకు 67

శా॥ ఆలోనచ్చటి కేగుదెంచిన దశాస్యాళీకరాళీకృతున్
సాలస్కంధ సమానవింశతి భుజున్ సంవర్తవేళాసితో
ద్వేలాభ్రప్రతిమాను లోకజనతావిద్రావణున్ రావణున్
లీలన్ గాంచిమరుత్సుతుండణగియుండెన్ విస్మయంబందుచున్ 68

సీ॥ ఆరావణుండప్పుడాత్మగతంబున
రామునిచేదనకేమివలన
సిద్ధించుమరణంబు సీతార్థమైనను
రాడయ్యె నేమి కారణమొయనుచు

సంతతమవ్విభు జింతించుచుండగా
నాదివసంబున నపరరాత్రి
స్వప్నంబుననురామ సందిష్టుడైయొక్క
కపివరుండేతెంచికామరూప

తే.గీ॥ మునను సూక్ష్మాకృతినివృక్షమునవసించి
నుండకలగని స్వప్నంబు నొక్కతరిని
సత్యమగుగాన కపియు నచ్చటికివచ్చి
యుండగలడని దశకంధరుండు మరియు 69

కం॥ జానకిని వాక్శరంబుల
తోనం దుఃఖింప జేతుతోనన్ గనియా
వానరుడు బోయిచెప్పిన
దానన్ జనుదెంచు రఘువతంసుండలుకన్ 70

తే॥గీ॥ అనుచునెంచుచునచ్చటి కరుగుదెంచు
నతిభయంకరమూర్తియౌనద్దశాస్యు
నంఘ్రిమంజీర ముఖభూషణారవంబు
నమితపరవారిణీరవంబాలకించి 71

కం॥ సీత యధోముఖ ముఖకం
జాత యధిక భీత యశ్రుసగంతనేత్రా
న్వీత రఘునాయకార్పిత
చేతయునై యణగియుండె చింతాయుతయై 72

ఉ॥ అత్తరిరావణుండు జనకాత్మజగాంచి సుమధ్యయేటి కీ
విత్తరినన్ను జూచి యిటనీగతినాత్మ విలీనవై భయా
వృత్తివసింపనేల? జలమేటికి రాముడరణ్యభూమిలో
నత్తరు చారుమధ్యమున సానుజుడైవసియించియుండెడిన్ 73

సీ॥ వేవిధంబులనేను వెదకించి యెల్లలో
కముల యత్నముజేసి కాననైతి
నొకవేళ గనుపడునొకవేళ గనుపడం
డగుణు డయ్యును గుణియట్లదోచు
నీవుకొగిటసేర్ప నీసమీపస్థుడై
మదిలోననీమీద మమతగనడు
నీవిచ్చుభోగముల్ నీగుణవిభవంబు
లనుభవించి కృతఘ్నుడయ్యెనేడు

తే॥గీ॥ నిన్ననేదెచ్చినను నీవునిబిడదుఃఖ
నిరతినుండిన రాడిట్టి నిస్పృహుండు
మొదలనభిమానిగాడు రాముండు కఠిను
డీ నరాధముతోడ నీకేటిసుఖము 74

కం॥ నినుగనియతిసక్తుడనగు
ననుజెందుము దానవేంద్రు నర యక్ష సుధా
శన ఫణిముఖ వనితలకీ
వనిశంబు నియోక్తివౌదు వంబుజనయనా 75

కం॥ అనిరావణుండు బలికిన
విని రామస్మరణజేసి వెసనాదుష్టా
త్మునకు దృణమంతరంబుగ
గొనియిట్లని పల్కెసీత కోపముతోడన్ 76

మ॥ అటనీచాత్మకరాము భీతినయిగాదా రాఘవుల్లేనిచే
నటవిన్ భిక్షడవై హవిస్సును శునంబట్లున్ననుం దెచ్చితీ
విటకుందత్పలమింతలోనె కననౌనీవింక రామాశుగ
స్ఫుటితోరస్కుడవైనచో దెలియవచ్చున్ మర్త్యుగా రామునిన్ 77

చం॥ శరధినిగట్టియైన శరజాలమునన్మరి శౌర్యవహ్నిచే
శరధి నిగిర్చియైన రణసంగతి లక్ష్మణుతోడవచ్చుదా
శరధి నినున్వధింపగ నిజంబుగజూచెదవీవుతద్ధను
శ్శరధి శరార్చినిన్ను యమసద్మము సేర్పగరాక్షసాధమా! 78

కం॥ కానన్ సుతహిత బలముల
తోనన్ దశవదననిన్ను దునిమి బలిమిచే
దోనన్ ననుగైకొనిచను
దానాత్మపురంబునకును దాశరధివెసన్ 79

తే॥గీ॥ అనుచుపరుషోక్తులాడిన జనకపుత్రి
గనిమహాక్రోధరయ వృత్తి ఖడ్గమెత్తి
వ్రేయగమకించి చనుదైత్యవిభునిగాంచి
హితవుగోరి మందోదరి యిట్టులనియె 80

కం॥ దీనిందుఃఖావసతిన్
మానవసతి కృపణ విడువు మదమత్తులు య
క్షానిమిష నాగకన్యలు
నేనేనని నినువరించు నెలతలులేరే! 81

మ॥ అనిమందోదరి జెప్పిననిల్లిచె దైత్యాధ్యక్షుడారాక్షసాం
గనలంగన్గొని రెండు మాసములలోగా సీతనాతో సకా
మనయై మద్వశయైనగాంచు సుఖసామ్రాజ్యంబు వేవేనటుల్
గనగాజేయుడు తర్జనార్జవవచోగాంభీర్యబోధంబులన్ 82

కం॥ కానియెడ భక్షణార్థము
దీనియొడలి పలలమొలిచి తెండనియని య
ద్దానవనాథుడు తోనన్
మానవతులు గొలువనరిగె మందిరమునకున్ 83

కం॥ అంతట కావలిరక్కసి
జెంతలు చెంతలవసించి సీతాసతిన
త్యంతము భీతిలజేయుచు
నెంతయు నయభయము లొలయనిచ్ఛాగతులన్ 84

చం॥ ఒకతె లతాంగియౌవనమయోవృథజేసెదవేలదైత్య నా
యకుని వరించి జేయుమిక సార్థముగానని పల్కివెండి యొం
డొకతి కరాసివ్రేయజను నొక్కతెమ్రింగగనోరు విచ్చె వే
రొకతె భుజింత మింతిననె నొక్కతె కోపము సేసెభూసుతన్ 85

వ॥ ఇవ్విధంబునం జనకతనూజం దర్జన గర్జనాదుల భర్జించు నిర్జరాహిత సతుల నివారించి నికటగతయగు
త్రిజటయను నొకవృద్ధనిశాట వధూటి యిట్లనియె 86

సీ॥ వినుడు దుష్టనిశాట వనితలార! మదుక్తి
హితవుసెప్పెదమీకు నింతనుండి
పృథ్వీసుతను భీతి పెట్టుకుండుడు మ్రొక్కి
వలగొనుడిపుడనా స్వప్నమునను
రాముండు పాండురైరావతంబును నెక్కి
లక్ష్మణుతోవచ్చి లంకగాల్చి
దశకంధరువధించి ధరణీసుతగ్రహించి
యంకంబునను సేర్చి నట్టులయ్యె

తే.గీ॥ రావణుండును గోమయ హ్రదమునను ది
గంబరుండౌచు నలదమాలాన్వితుడయి
పూని శిరమున తైలంబు పుత్రపౌత్ర
కలితముగజొచ్చినట్టుగా కలనుదోచె 87

కం॥ రాముని సన్నిధి భక్తి
ప్రేమంబుల నెసగు మదివిభీషణుడు నుత
ద్రామాంఘ్రి సేవసేయం
గా మరికలగంటి మేలుగంటి న్వెంటన్ 88

కం॥ కావున రాముడు వేగమె
రావణు సకులముగ ద్రుంచి రాజ్యాధిపతిం
గావించి మరివిభీషణు
బ్రోవుందనదేవిగొనుచుపురికి నిజముగాన్ 89

తే॥గీ॥ అనిత్రిజట జెప్ప భయమున నసురవనిత
లూరకుండిరి నిద్రోపయుక్తులగుచు
నంత సీతయు భీతయై చింతతోడ
దానవవధూటు లిడిన బాధల దలంకి 90

ఉ॥ రక్షకులెవ్వరింకనను రాక్షస కాంతలు రేపు ప్రొద్దునన్
భక్షణసేతురింతెయని భామినిమూర్ఛిలిలేచి యశ్రు పూ
ర్ణాక్షుల యంతయేదడవు హాయని యేడ్చుచుతెంపుసేసిత
ద్వృక్షము శాఖబట్టి మరణేచ్ఛకుపాయము చింతసేయుచున్ 91

తే॥గీ॥ రామునెడబాయు జీవన మేమిలాభ
మేమునుద్బంధముననేని మేమువిడుతు
విడువదీనికి నాదీర్ఘ వేణిగలదు
నసురులు వధింపకయ మున్నయదియుమేలు 92

కం॥ అనినిశ్చయించు జనకజ
కనునుగొని మనమునను చింత గదురుగ సూక్ష్మ
ధ్వనిగా నాసతి వీనుల
వినగా నని లాత్మజుండు వెసనిట్లనియెన్ 93

సీ॥ అమరునిక్ష్వాకు వంశమున నయోధ్యాది
పతి పంక్తి రథుడను పార్థివేంద్రు
డతనికి నలుగురు సుతు లతి విశ్రుతు
లఖిల లక్షణయుతు లమరసములు
ధరరామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు
గలరందు రాముడగ్రజుడతండు
జనకరాట్పుత్రితో సౌమిత్రితోగూడ
జనకోక్తిదండకావనము జేరి

తే.గీ॥ వారు గౌతమితటి పంచవటివసింప
రాఘవులు లేనిచోట నారావణుండు
నార్యతద్భార్య వైదేహి నపహరింప
వెతలబడి రాముడాసీత వెదకునపుడు 94

వ॥ వెండియునజ్జటాయుండను పక్షివరుండు తద్రాక్షస నిహతుండైన నతనికి పరలోకంబొసంగి ఋష్యమూకంబున సుప్రభావుండగు సుగ్రీవునితో నైక్యంబుగా సఖ్యంబునెరపి తద్భార్యాహరణ శీలియగు వాలిందునిమి తద్రాజ్యంబమ్మిత్ర తనయున కొసంగిన నతండును దన్మానినియగు జానకినన్వేషింప వానరులంబంపిననందు సుగ్రీవసచివుండగు నేనొక్కరుండ సంపాతిపంపున శత యోజన విస్తీర్ణంబగు నర్ణవంబు జవంబునందాటి నిశ్శంకనీలంకంజొచ్చి యచ్చటచ్చట నా రామసతి న్వెదకుచు నీయశోక వనంబునకు వచ్చి యిచ్చట నేత చ్ఛింశుపావృక్షంబు క్రింద సమక్షంబుగా రాక్షసీ పరీ భూతయును నధిక శోకోపేతయునునగు సీతంగంటి నిమ్మహాదేవియ నా రామమహిషియగునని తత్తల్లక్ష ణంబుల నిశ్చయించితి నేటికిం గదా నేనునుం గృతకృత్యుండ నైతినని పలికి బుద్ధిమంతుడగు హనుమంతుం డూరకుండెనంత. 95

కం॥ జనకజయును దత్సర్వము
విని విస్మయమున నిదేమి విధమో! గగనం

బున పవనేరితమగుచో
కనుగొన నెవ్వారు లేరుగా యనిమదిలోన్ 96

కం॥ కలయని యంచునెట్లు కలగల్గుననిద్దురలేని నాకునుం
గలయగ చిత్తవిభ్రమముగానగునోయను జాగరూకతన్
వెలయగనుండు నాకుమతివిభ్రమమే గతిగల్గునంచునున్
జలజదలాక్షియన్నిటను సత్యమకానగునంచు నెంచుచున్ 97

కం॥ ఎవ్వారమృతోపమమగు
నివ్వచనము బల్కిరిట్టి హితవాదియునై
నివ్వటిలుమహాత్ముడు దా
నవ్విధినాకుబ్రసన్నుండగుగా కనుచున్ 98

చం॥ వినియంతట తద్వాక్యము
హనుమంతుడు పత్రపటలియందుండివెసన్
జనకజసన్నిధికిండిగి
గనబడియెన్ బరమహర్ష కలితుండగుచున్ 99

కం॥ కలవింక శుభములనుచున్
కలవింకనిభుండు నగుచు ఘనతరరక్తో
జ్వలవక్త్రుడు పీతవిభా
విలసితగాత్రుడును వినయ వినమితుడగుచున్ 100

వ॥ అయ్యాంజనేయుండు కృతాంజలియై వందనంబుసేసిన జనకతనయయుంగొంత సందేహంబున 101

తే॥గీ॥ వనచరాకృతి తోడుతనను భ్రమింప
మాయచే రావణుడు వచ్చెనోయటంచు
నొదిగి తలవాంచి మరియూరకున్నగాంచి
తెలిసి మారుతిబలికె యద్దేవితోడ 102

ఉ॥ కోసలభర్త కచ్యుతునకున్ పరమాత్మకు రామమూర్తికిన్
దాసుడు సూర్యపుత్రుడగు తత్కపి మౌళికిమంత్రి నెల్లచో
వాసిగప్రాణభూతుడగు వాయువుసూనుడ నమ్మవమ్మన
న్నాసుర మాయగాదు గనుమా యనుమానము మానునాయెడన్ 103

కం॥ అనవినిజనకజ యనిలజు
గనియనియెను మనుజులకును కపులకునేరీ

తిని సంగతి యయ్యెను విను
మనఘా!నిను రామదాసుడన నగునెటులన్ 104

సీ॥ అనినమారుతి భ్రీతుడై సీతతో దూర
మునునుండియనియెనో జనని వినుము
శబరిబంపగ రామచంద్రుండు పంపా స
రోంతికంబుననుండ ననుజుతోడ
ఋష్యమూకమున సుగ్రీవుండు వారల
గని భీతుడై నన్ను బనుపనేను
వటురూపము ధరించి వారి సన్నిధికేగి
రాముని సత్వ సర్వమునెరింగి

తే.గీ॥ వారినాస్కంధమున బూనివచ్చి రామ
రవిజులకు మైత్రినెరప నారవిజునాలి
నేలుకొను వాలి నొకకోల గూలనేసి
రాముడారాజ్యమొసగెనా రవిసుతునకు 105

వ॥ అంత 106

కం॥ ఇనసుతుడున్ నినువెదకం
వనచరులం బ్రబలవీరవరులదిశలకున్
బనుపన్ జనునెడ రాముడు
ననుగనుగొని యాదరంబెనయ నిట్లనియెన్ 107

సీ॥ అనిలజ! యిక్కార్యమఖిలంబ నీయంద
యునిచితి జనకజ గనియెదీవు
మత్కుశలంబు లక్ష్మణు కుశలంబును
దెలుపుమభిజ్ఞాన వెలయుకొరకు
వనితకస్మన్నామ వర్ణముద్రితమైన
నీయంగుళీయకం బిమ్మటంచు
దనరనా చేతికి దనముద్రిక యొసంగ
దీనియత్నమున నేదెచ్చితిటకు

తే.గీ॥ చూడు మిదియని యమ్మహీసుత కొసంగి
మ్రొక్కియక్కపివరుడు గేల్మొగిచి నిలువ
దేవియంత తదీయ ముద్రిక గ్రహించి
అధిక సంతోషమున శిరసావహించె 108

కం॥ వరుబాసిన తను కృశతన్
గరమున నాయుంగరంబు కంకణలీల
న్మెరసెన్మరియుం గననది
సరసెన్ బహుకంకణాప్తి సతికనుగవకున్ 109

కం॥ ఆ రాముని ముద్రికగన
నారామ ప్రమోదముద్రితాత్మయగుచు దా
నారామ విభుకరగ్రహ
మారూఢిగనప్పుడందినట్లుగ వెలసెన్ 110

ఉ॥ అంతట సీతవాతసుతు నారసియిట్లను ప్రాణదాత వ
త్యంతము నాకు రామునకు దాసుడవౌదువు భక్తియుంబ్రియం
బెంతయు నీకెకద్దు హితమీగతి జేసితి వన్యునేల మ
త్ప్రాంతము సేరబంపును మహాత్ముడు రాముడు మారుతాత్మజా! 111

కం॥ ఉంటివిగద! యిట సర్వము
గంటివిగద! మరియు పంక్తికంధునిమాటల్
వింటివిగద! గడునాతో
నంటివిగద! జీవనాప్తి కధిపతి వార్తల్ 112

తే॥గీ॥ ప్రాణములతోడ మాసద్వ్యావధిగను
బ్రతికి యుండెద నటమీదరామవిభుడు
రానిచోనన్ను భక్షించు రాక్షస తతి
రావణుదురుక్తు లట్టివికావె వినవె! 113

ఉ॥ కావున భ్రాతగూడి రఘుకాంతుడు వానరసేన తోడ సు
గ్రీవునితోడ వచ్చిరణకేళి సపుత్ర బలంబుగా దశ
గ్రీవుని ద్రుంచి యెంచదగు కీర్తి నినున్విడిపించుటెంత యే
కేవలమాత్మశౌర్యవిధికిన్ సదృశంబగుగాన నెన్నిటన్ 114

కం॥ ఈవిధమంతయు రాముడు
గావింపు ప్రయత్నమొనరగా జేయుమునా
దేవునకున్నాపై దయ
రా విన్నపమాచరించి ప్రబలు సుకృతివై 115

చం॥ అన హనుమంతుడిట్లనియె నాసతితో నను జూచినప్పుడే
నినజుడుగొల్వగా రఘుకులేంద్రుడు తమ్ముని తోడవచ్చియే

పునదశకంఠుద్రుంచి కొనిపోవునినుం బురికన్నవెండి యా
వనిత మహాబ్ధినెట్లు రఘువర్యుడు దాటును సేనతోననన్ 116

మ॥ వినియమ్మారుతి సీతతోననియె దేవీ!మద్భుజారోహవ
ర్తననేతెంచి సలక్షణుండగుచు నారాముండు సైన్యంబుతో
నినజుండున్దనతో నభంబునను రానీవారిధిన్ దాటి యా
దనుజశ్రేణివధించునీ కొరకుగా తథ్యంబు వేగంబునన్ 117

ఆ॥వె॥ తల్లినాకనుజ్ఞ దయసేయు పోయెద
రాఘవులను జూచి రానొనర్చు
విధము జేయవలయు విశ్వసింపగనభి
జ్ఞానమిమ్ము రామచంద్రునకును 118

కం॥ అనిన విచారించి ధరా
తనుజయు నిజకేశపాశ తటివిడిచి ధరిం
చిన చూడామణి యిచ్చెను
నిను దీనన్విశ్వసించు నృపతియటంచున్ 119

వ॥ అదియునుంగాక మాకిరువురకుంగాక నితరుండెరుంగని వేరొక్క యభిజ్ఞానంబు నీకుంజెప్పెద పూర్వంబున చిత్రకూట పర్వతంబున నొక్కనాడేకాంతంబుగా మదీయోత్సంగంబున నుత్తమాంగంబునిడి రఘుపుంగవుండు నిదిరించుతరిం బాకశాసన పాకంబగు నొక్కకాకంబు మదీయ పదాంగుష్ఠంబు నిష్ణాత శోణితంబుగా నామిషాశయంబు నఖముఖంబుల బహుళంబుగా విదళింప నంతరామ భద్రుండు బ్రబుద్ధుండై కృతవ్రణంబగు మచ్చరణంబు జూచి యిట్టి విప్రియంబెట్టి దుష్టాత్ముండొనరించె ననుచు నెదుట రక్తాస్యనఖ పటలంబుగా బారతెంచు వికటంబగు కరటకంబుగని యొక్కతృణంబు దివ్య బాణంబుగా నవలీలన్ బ్రయోగించిన నాసాయకంబు మంటలతో వెంటనంటిన నవ్వాయసంబు రయంబున సకల లోకంబులన్ బరిభ్రమించి విరించి సహస్రాక్షుల చేత రక్షింపంబడక మగుడి రామునడుగులంబడిన నక్కరుణానిధిశ రణాగత వత్సలుండు గావున మచ్చరంబుమాని దానితో మచ్చరం బున మోహంబు నీసవ్యనయనం బొసంగు మనిన నదియట్లజేసి సనియె నట్టి పౌరుషదక్షుం డగు రఘుకులాధ్యక్షుండు నన్నుపేక్షించుట కేమిహేతువనిన హనుమంతుం డమ్మహీసుతం గనుంగొని 120

కం॥ దేవీ!యారఘువీరుడు
నీవిందుండుట నెరింగెనేని యపుడ ర
క్షోవికలంకన్ లంకన్
జేవదలంకన్ దహింపజేయడె కినుకన్ 121

కం॥ నా వినిజానకి మరియున్
నీవతి సూక్ష్ముడవు గపులు నీయటులగుచో
నేవిధి యుద్ధం బిద్దను
జావళితో జేయగలరటంచని యనినన్ 122

వ॥ అంతదత్సమీరనందనుండు మేరుమందర సంకాశుండును, నమందతర ప్రకాశంబును, రక్షోగణ భీషణంబును, నక్షత్రాది ఘటిత ఘటీచరణ భూషణంబును, యధానురూపంబునునగు, తన రూపంబు జూపినంగనుంగొని, హర్షాద్భుతంబులు బెనంగొన నయ్యంగన ప్లవంగవుంగవునితో నీవుమహాసత్వ సంపన్నుండవు సమర్థుండవగుదువని బ్రశంసించి నన్నేరాక్షస వధూటులీక్షించు చున్న వారు రామాంతి కంబునకు నంతరాయంబు గాకుండ నీకు శుభమార్గంబగుం జనుమనిన నతండు భుభుక్షితుండై భక్షింపఫలంబులపేక్షించి యద్దేవినియోగంబున నపారంబుగా నాహారంబుపయోగించి యజ్జనకసుతకు నమస్కరించి కించి ద్దూరంబున నిక్కార్యంబు చింతించి యనిలతనయుండు తనమ నంబున 123

తే॥గీ॥ అవని కార్యార్థియగు దూతయధిపు కార్య
ఘటన జెడకుండ తనకు విఖ్యాతి గలుగ
తగిన కార్యమొనర్పనుత్తముడు గాక
నదియు విపరీతముగ జేయ నధముడగును 124

కం॥ కావుననేనొక కార్యము
గావించి తగన్ దశాస్యు గాంచి యతనితో
నేవిధిభాషించి రఘు
క్ష్మావిభుగనబోదునాదు సాహస మెసగన్ 125

మ॥ అనిసీతాశ్రమవృక్షమొక్కటి వినానచ్చో నశోకాటవీ
ఘన వృక్షావళిపై దలంపడియు శాఖాజాలముల్ మూలముల్
మును ముంద్రుంచుచు కుంజపుంజములు నిర్మూలంబు గావింపుచున్
వనమెల్లన్ బెకలింప జొచ్చెనపుడవ్వాతాత్మజుండుద్ధతిన్ 126

వ॥ అయ్యవసంబున 127

కం॥ నరపతి వరసతి గనునా
సురపతి పురగతిని వచ్చి చూచెనొలేదో!
హరిపతియని గనవచ్చిన
సురపతి దూతయన వేగు చుక్కజనించెన్ 128

కం॥ నెక్కొని తమపద శాస్త్ర సు
దృక్కులు నందెలు ప్రహస్వదీర్ఘ ప్లుతముల్

మిక్కుటముగ కుక్కుటములు
కొక్కోకోయని త్రిసిద్ధి గూయం దొణగెన్ 129

ఉ॥ దిక్కులకాంతిమీరె శశిదీధితి వెల్వెలబారె జోడుతో
జక్కవగేరె సంతమస సంతతి జారె సరోజ పత్రముల్
చిక్కులుదీరె భృంగములు జేరె మరందములూరె నంతటన్
జక్కగ దెల్లవారె రవిజన్మకళల్దనరారె తూర్పునన్ 130

మ॥ ఘనపూర్వాచలరత్నదీపియన దిక్కాంతాస్య కాశ్మీరరే
ఖనగాశోణితభీమరామ పరశూద్యద్ఫోఖరీ వ్యాప్తి నా
ఘనవాహప్రియ భూమినీ కరతలాగ్రవ్యక్త రక్తాంబుజం
బనగాభానుడు దోచెతేజమయిరేకై యర్థమై బింబమై 131

కం॥ దివసదశన్ దివిసరసిన్
దివిసన కైరవములనగ దెరలెన్ దారల్
సువిలంబచ్ఛ విలంబిత
రవిబింబంబెసగెరక్త రాజీవమనన్ 132

వ॥ అంత 133

సీ॥ కమలిని కామినీ గళమిళన్మణితాళి
సమదమందేహాజి చక్రకేళి
పూర్వపర్వత కూట పుష్పిత కంకేళి
యగుధాతు శోణ తత్కుధరచూళి
యంతస్థహరికౌస్తుభాంశుకరించోళి
వాసవప్రేయసీ వరనిచోళి
మహితమూర్తి త్రయీమల్ల హేమఖురాళి
నాకార్థి శూరరత్న ప్రతోళి

తే॥గీ॥ శ్రుతివితాన ప్రసూన భాసుర మధూళి
యంబు జాక్షస్ఫురద్దక్షిణాక్షిపాళి
గగనరేఖాసమా లిఖత్కర శిఖాళి
యపుడుగనుపట్టెనుదయాద్రియందుహేళి 134

వ॥ వెండియునమ్మార్తాండ మండలంబు మండలేశ్వరు చెల్వున సముల్ల సత్పుండరీకంబును, పుండరీకాక్షుని రీతి పార్థాభి ముఖోల్లాస ప్రసరం బును, సరంబుడంబున నాశ్రితద్విజ చక్రంబును, చక్రంబు కరణి సహస్రకిరణ భాసురంబును, సురగిరి కరణి తప్త హేమ ప్రభావాను భావంబును, వనరాశివాసి వాసుదేవావాసంబును, వాసవనగరంబు గరిమ సమాక్రాంత పూర్వదిశావకాశంబై బ్రకాశించె నాసమయం బున 135

మ॥ హనుమంతుండిటుల య్యశోకవనమాద్యంతంబు ఖండింప త
ధ్వనికిన్ నిద్దురలేచి, తత్భ్రతవనీ వైకల్యమున్ జూచి, యం
దున దైత్యాంగనలెల్ల సీతగని నీతోవచ్చి భాషించి పో
యిన నవ్వానరుడెవ్వడం చడుగనయ్యేనాక్షియు న్వారితోన్ 136

కం॥ దానవుల మాయలెల్లన్
దానవులకు మీకె దెలియదగు గాకయిటన్
నేనేమెరుగుదు శోక వి
ధాన తమోధీన ననుచు ధరణిజబలుకన్ 137

మ॥ వినిదైత్యాంగనలెల్ల భీతిజని వేవేరావణుంజేరి యో
దనుజేంద్రా! యతిసత్వుడొక్క కపిసీతన్‌గాంచి భాషించి త
ద్వనమెల్లన్ బెకలించి దైత్యవిలసత్ప్రాసాదముల్ గూల్చి వెం
టనె తద్రక్షకులన్వధించియట యున్నాడన్న దూర్ణంబుగన్ 138

కం॥ వనభంగము వినినప్పుడ
దనుజేంద్రుడునియుత సంఖ్యదానవ భటులన్
హనుమంతుని పైబనిచిన
ఘనశైలాకారమొప్పగా భీమగతిన్ 139

కం॥ భాసురలోహస్తంభ మ
హాసాదనుడై కపీంద్రుడపహత చైత్య
ప్రాసాద ప్రథమాంతర
వాసుండైయుండి చలితవాలుండగుచున్ 140

మహాస్రగ్ధ॥

అపుడవ్వాతాత్మజుడయ్యసురులగని సింహధ్వనిన్ మోహపెట్టం
విపులాటోపాప్తివారల్ వివిధశరము లవ్వీరునింగప్పినంద
త్కపియుంబ్రాసాదవాటీఘనతర పరిఘా ఘాతచే దైత్యపంక్తిన్
నిపుణత్వ స్ఫూర్తిద్రుంచెన్వెస కరిశశకానీకమున్ బోలెలీలన్ 141

వ॥ అప్పుడప్పంక్తి కంధరుండునుగ్రోధ బంధురుండై మానాధికులగు సేనాధికులనైదుగురి నవ్వానర
వీరునిమీదికి బంచిన 142

కం॥ సైనిక పతులున్ శరతతి
వానరపతిబొడువ నతడు వారిగదిసె దో
ర్దోనంలోహస్తంభము
తోనన్ బడలుపడజేసి తొంటి విధమునన్ 143

కం॥ పంచద్విగుణాస్యుండిటు
బంచిన సేనాపతి ప్రపంచమునెల్లన్
పంచత్వము సెడకుండన్
పంచత్వమునొందజేసె పవనజుడాజిన్ 144

వ॥ మరియును 145

ఆ॥వె॥ సప్తసచివసుతుల సరవిరావణుడంప
సప్తహయునిసుతుని సచివుడాజి
సప్తశిఖుడు శలభ చయమట్ల నొందించె
సప్త హయుని సుతుని సదనమునకు 146

వ॥ ఇట్లు వచ్చిన రాక్షసులనందర నగ్గంధవహనుందనండు హస్త సంభృతంబగు లోహస్తంభంబునం దునిమి యధాస్థానంబున నశ్రమంబున విశ్రమించియున్నవాడనిన విని దశ గ్రీవుండాగ్రహించి నంగని జనకుననుమతింగొన్నిదనంతం గొనివచ్చి యచట మహా శూరుండగు నక్షకుమారుం డవ్వానర వీరుంగదిసి, ప్రదరంబులం బొదివియుంగదల మోదియుం గుంతలంబులం బాదియు, పట్టసంబుల గొట్టియు, పాశంబుల బట్టియు, వివిధవిధంబుల సమరంబునం బరిభ్రమింపజేయ, నవ్వాయుసుతుండు చలింపక నిలిచి యతనిసైన్యంబులన్నియుం బొలియించి యంత 147

మ॥ హనుమంతుండును ముద్గరంబుగొని జయ్యన్నింగికైలేచి జ
క్కనతద్దేహముఖాదికిందుమికి వేగంబెత్తి యమ్ముద్గరం
బున మూర్ధంబుబెకల్చి కూల్చెననిలో భూరి ప్రభావాభిల
క్షుని నయ్యక్షుని ఘూర్ణితాక్షునతిదక్షున్ రాక్షసాధ్యక్షునిన్ 148

కం॥ ఆరామధ్యాన పరుం
డారీతిగ నక్షజయమునంది తదీయో
దార బలంబుల నెల్లన్
జేరగ నిశ్శేషముగను జేసెన్మరియున్ 149

శా॥ అంతన్ రావణుడక్ష పుత్రునివధంబాలించి క్రోధానలా
త్యంత స్ఫూర్తినినింద్ర జిత్తుగనెపుత్రాపుత్ర హంతన్ భవ
త్ప్రాంతంబున్ గొనివత్తు కానియడ తత్ప్రాణంబులుం గొందునం
చెంతోబోవదలంచు తండ్రిగని యయ్యింద్రాహితుండుద్ధతిన్ 150

కం॥ నేనుండగ నీకేటికి
దీనుండవు బోలెవగవధీరమతీ! య
వ్వానరుని గట్టి తెచ్చెద
ప్రాణంబులతోన బ్రహ్మపాశముతోనన్ 151

కం॥ అనుచు రథస్థితుడై బహు
దనుజావృతుడై దశాస్య తనయు డనిలనం
దను జేరనరుగ నాతడు
గనిలోహ్తంభమూని గర్జోద్ధతుడై 152

వ॥ వెండియు బక్షీంద్రుండునుంబోలె నభ్రంబునకెగసి పరిభ్రమించు చున్న ప్రభంజనతనయుననేక శిలీముఖంబులం గప్పియప్పుడతని శిరంబు నైదు శరంబుల హృదయంబు నెనిమిది ప్రదరంబుల చరణయుగంబునారు నారసంబుల వాలమ్మునొక్కవాల మ్మున భేదించి భయంకరంబుగా మేఘనాథుండు సింహనాదం బొనర్చిన నవ్వనచరవరుండు గరస్తం బగులోహస్తంభంబునం జంభారి విరోధి సారథిరథ్యంబు చూర్ణంబుజేసిన నవ్వీరుండు వేరొండు రథంబెక్కి రోషోన్ముఖుండై ప్రయత్నంబున బ్రహ్మాస్తంబు ననుసంధించి బలవంతుండగు హనుమంతుని బంధించెనంత 153

తే॥గీ॥ అప్పుడయ్యింద్రజిత్తుచే ననిలసుతుడు
పట్టుబడుటకు బ్రహ్మాస్తబద్ధుడయ్యె
ముక్తుడయ్యును సంసారయుక్తుడైన
ప్రాజ్ఞుడిల బద్ధుడుగ దోచబడిన పగిది 154

ఉ॥ ఎవ్వనిదివ్యనామ జపమెప్పుడు సేసిన కర్మబంధనం
బవ్వలనూడి తత్పదము నవ్యయమందిసుఖింతు రెంతయే
నవ్విభుడైన రాముని పదాంబుజముల్ మదినిల్పి వాయుజుం
డవ్విధిముక్తబంధనుడునయ్యెను పాపములేమిజేసెడిన్ 155

సీ॥ మునుబ్రహ్మవరమున ననిలకుమారుని
బాధగావింపక బ్రహ్మశరము
క్షణమాత్రమందుండి సడలిన నాతండు
వీటినే విడద్రోసి వీరితోడ
ననిజేయ బోయిననాలస్యమగునంచు
పట్టరజ్జువులచే పట్టుబడిన
యట్లుండియూరక నరుగుచో బౌరులు
గొట్టుచు దిట్టుచు గూడిరాగ

తే॥గీ॥ నంతనాతనిగొంచు వృత్రారిచేత
రావణాంతికమున నిల్పె దేవవీని
దానవానేక బలహంత యైనవాని
బట్టితెచ్చితి బ్రహ్మాస్త బద్ధుజేసి 156

కం॥ ఏకార్యము యుక్తంబగు
నాకార్యము మీరుమంత్రులరసివిధింపన్
గై కొనుడు లౌకికుడుగా
డీ కపియని తండ్రితోడనింద్రారియనున్ 157

వ॥ అంతనద్దైత్య కాంతుండు నీతిప్రశస్తుండగు ప్రహస్తునితో నవ్వానర వృత్తాంతంబంతయు నడుగుమనిన
నతండతని కిట్లనియె 158

కం॥ ఇందేమి కార్యమెవ్వని
సందేశమువలనరాక సర్వవనంబీ
వెందుకు బెరికితి వాసుర
బృందంబులనెల్ల దునిమి తేటికి చెపుమా! 159

తే॥గీ॥ వెరవక నిజంబుసెప్పిన విడిచిపుత్తు
మధిపుసన్నిధినన రోష హర్షములను
వాయుజుడు లోకభయదు రావణునిగాంచి
రాముని దలంచియనియె సర్వము గ్రమమున 160

మ॥ వినుదేవా! హిత సర్వభృన్నిలయుడున్ విశ్వేశుడౌ రాముడూ
తను హవ్యంబుశునంబనట్లతని కాంతండెచ్చి తీవాత్మ భం
గ నిమిత్తంబుగ నట్టిరాముడు మతంగగ్రామముంజేరి మై
త్రినిసుగ్రీవునకిచ్చె వాలిననివారించీరి తద్రాజ్యమున్ 161

కం॥ ఆవానరవిభుడా సు
గ్రీవుడు కపికోటిగొలువ గినుకన్ రామ
క్ష్మావిభుడు లక్ష్మణుండున్
వావిరియున్నాడు మాల్యవంతము నందున్ 162

కం॥ వారనుప సీత వెదకను
ధీరవరులు హరులునెల్ల దిక్కులచనుచో
వారలలో నేనొక్కడ
మారుతిని తదీయమార్గ మార్గణబుద్ధిన్ 163

కం॥ వచ్చితి ధృతిచేనేపురి
జొచ్చితి శ్రీరాముసతిని జూచితివనమున్
వ్రచ్చితి కపినౌటను పొరి
బుచ్చితి ననుగదిసిగలన బోరినవారిన్ 164

మ॥ కను దేహంబు ప్రియంబుదేహులకగుం గానం దనూరక్షణం
బునకై జేసితినింత దైత్యవర! నీపుత్రుండు బ్రహ్మాస్త్ర పా
శని బద్ధున్నను జేయ బ్రహ్మవరదీక్షన్ బాధలేదైన బ
ద్ధునిరీతిన్జను దెంచితిన్గరుణ బుద్ధుల్జెప్ప నీకెంతయున్ 165

ఉ॥ రాక్షసబుద్ధిగైకొనకు రావణసాధు వివేక పద్ధతిన్
వీక్షణ జేసి దైవపదవింగనుమా! భవమోక్ష హేతువై
దక్షత జేయునాత్మకు హితంబు బులస్త్యకులుండవీవు బ్ర
త్యక్షము బ్రాహ్మణుండవు ధనాధిపబంధుడవుత్తమ స్థితిన్ 166

సీ॥ వినుము! దేహాత్మబుద్ధిని రాక్షసుడవీవు
నాత్మైకబుద్ధిచే నసురగావు
దేహబుద్ధీంద్రియాదిక దుఃఖసంతతి
నీవుగావవియును నీకులేవు

నిర్వికారుండవు నీవునజ్ఞాన హే
తువుననాయదియని తోపబడియె
స్వప్నంబునందు దృశ్యములసత్యములయ్యు
సత్వంబులుగదోపసాగినట్టు

తే.గీ॥ లాకసము సర్వగతమయ్యునయ్య ఖిలము
నంటనివిధాన నీవుదేహగుడవయ్యు
నధిక సూక్ష్మతనెన్నిట నంటదౌట
నీకువికృతులు లేకుంటనిజము సుమ్ము! 167

తే॥గీ॥ సరవిదేహేంద్రియ ప్రాణసంగతులను
నాత్మబుద్ధినిగనిబంధ మావహించు
నజుడవానందరూపుడ వక్షరుండ
వేనుచిన్మాత్రుడనబంధ మెడలునిజము 168

సీ॥ భూవికారైకసంభూతంబు దేహంబు
గావుననదియాత్మగాదు సుమ్ము!
పవన వికారసంభావ్యంబు ప్రాణంబు
గావుననదియాత్మగాదు సుమ్ము!
కన నహంకార వికారంబగు మనంబు
గావుననదియాత్మ గాదుసుమ్ము!
ప్రకృతివిస్తా రస్వభావజంబగు బుద్ధి
గావుననదియాత్మ గాదుసుమ్ము!

తే.గీ॥ మరియు నవికారమానందమయ ముపాధి
రహితమును చిన్మయంబు నిరంజనంబు
దలపదేహాదికాతిరిక్తంబుగాగ
ముఖ్యగతి నాత్మనెరిగిన ముక్తుడగును 169

వ॥ అట్లగుటంజేసి 170

మ॥ కనకాత్యంతికమోక్ష సాధనమెరుంగం జెప్పెదన్ బుద్ధితో
వినునారాయణభక్తి బుద్ధికిని తెల్వింగూర్చు సుజ్ఞానమం
దున జన్మించు విశుద్ధతత్త్వమును దోడ్తోదానగన్పట్టు త
ద్గతబోధానుభవంబు చేగలుగుమోక్ష వ్యాప్తి దైత్యోత్తమా! 171

ఉ॥ రాముపరాత్మనాము నభిరాము హృదంబుజధామునిన్ సుఖ
స్థేముని భావనామతి భజింపక దుఃఖతరంగమాలికా
స్తోమనిధిన్ భవాంబునిధి సొచ్చిజడుండు పరప్రతీరమున్
వేమరు సేరగా మరి వివేకమతిన్ దరిగానొనర్చునే 172

కం॥ కావున రామునిహరి శర
ణావనుని పురాణుబ్రకృతి నంటెను బరు ల
క్ష్మీవరు (మూర్ఖతనగు) రిపు
భావనగడనిడి భజింపుభక్తి స్ఫూర్తిన్ 173

కం॥ సీతన్ బరిపూతజగ
న్మాతనొసగి యభయదానమతి రామునకున్
దైతేయవరసుతాప్త స
మేతముగ నమస్కరింపు మేలగునీకున్ 174

ఉ॥ కానియెడన్ సదాచరిత కల్మషవాతసముజ్వలన్నిజా
జ్ఞానమహాగ్ని చిత్సుధను శాంతిని జేయగ నేరకాత్మనెం
తేని బడంగవైచి యడతీక దపింపగ జేతువింతయే
కా నివిమోక్ష శంకయన గల్గదునీకు నలక్షిత స్థితిన్ 175

కం॥ అనియాగతి వచియించిన
యనిలజునమృతోపమంబులగు వచనంబుల్
శునకమునకు ఘృతముంబలె
దను జేంద్రుమనంబునకు హితంబులు గాకన్ 176

ఆ।వె।। రావణుండు దీర్ఘరక్తాంత నేత్రుడై
కటములదర భ్రుకుటి కంపమదర
నపుడు క్రోధఘూర్ణితాక్షుడై పవననం
దనునినిట్టులనియె దర్పమెనయ 177

శా।। ఓరీ! కీశకులాధమా! భయములే కొండొంట నిచ్చారతిన్
నోరంబ్రేలెదు మత్సమీపమున నెంతేరామునారణ్య సం
చారున్ బేర్కొని ముందు నిం దునిమి యీక్ష్మాపుత్రి ఖండించితో
నారామున్ మరిలక్ష్మణున్ రవిజుసేనాన్వీతుగా ద్రుంచెదన్ 178

కం।। అనవినిరాముని బలిమిన్
తనబలిమి నెరుంగలే డితండని మూర్ఖుం
డని మారుతి మదినెంతయు
గనలుచు వెండియును దెలియగానను వాడై 179

కం।। శ్రీరాములదాసుండ ను
దార పరాక్రముడ నాకు నథమాథములౌ
నీరావణ కోటులు సరి
గారని నయ భయములొలయగా రావణుతోన్ 180

ఆ।వె।। రాముడాద్యుడగు పరబ్రహ్మమగు సుమ్ము!
దెలియ సీతయతని కళయె సుమ్ము!
యతని కిమ్ము సౌఖ్యగతి బొమ్ముదుర్మాని
యోరి ప్రాణములను గోరితేని 181

కం।। లేదా యో దానవలకుల
ఖేదాపాదన దశాస్య! కేవలశిఖలన్
నీదాకరవులు రామ
క్ష్మాదయితుని బాణవహ్ని గ్రాగుదువు సుమీ! 182

మ।। వినరా! యోరి! దురాత్మ! రామునెదుటన్ వేనిల్చినన్నాడగున్
నినునీవే తెలియంగదద్ఘనధనుర్నిర్య ద్భవత్కంఠలుం
ఠన కాండాపశిరః కబంధదశ రంధ్రప్రోద్ఘితాసృక్ఝరీ
జనితాసచ్ఛజలాంబుధిన్ గనిన నీస్వాంతంబు భీతిల్లగన్ 183

మ।। వలదేరాబలుదారుణంబులగు నీవాగ్దిండిమాడంబరం
బులతోనేమి యమోఘరాఘవధనుః ప్రోద్భూత బాణోద్భవ

జ్వలన జ్వాలిక బ్రజ్వలించి రుధిరాజ్యప్రాజ్యమైనుండుచో
శలభవ్యాప్తినినిన్ను నీబలములన్ జాజేయు వెయ్యేటికిన్ 184

కం॥ అన దనుజవిభుడు కోపం
బినుమడిగా నతని జూచి యివ్వనచరునిం
దనుజకులమెల్ల గనుగొన
దునుమునుచునొక్క భటుని తోడుతననియెన్ 185

చం॥ అనునెడతద్భటుండును ధృతాయుధుడై చనుదేరమాంచి యి
ట్లనియె విభీషణుండు దనుజాధిపదూతను జంపజెల్లనీ
తని వధజేయునెవ్వని వధంబును గోరితి వాత్మనట్టి రా
మునికిట గల్గువార్తయును ముట్టగనెవ్వడు సెప్పుసెప్పుమా! 186

కం॥ కావున వధసమమొక్కటి
గావింపుడుగురుతు కపికిగని యీవిధమున్
వేవేగ రాముడును సు
గ్రీవునితోవచ్చుయుద్ధ కేళియు గలుగున్ 187

ఆ॥వె॥ అనుచు ననుజుడనదశాస్యుడు వాలంబు
కపికి మానకరము గానదాని
గట్టి బట్టలంట గాలిచి విడువుడ
క్కపులు నెల్ల వీని గనగ ననిన 188

వ॥ అప్పుడద్దనుజభటు లుత్కటంబుగా నమ్మర్కటవరు వాలంబున పటాలయంబునంగలుగు ననేకపట్టు చేలంబుల వల్కల పట్టజాలం బులం గట్టినం జాలకున్న పురంబునం గల యంబరంబులుంజుట్టి నెట్టన నద్దశకంధరు మందిరంబునందున్న సమస్త వస్త్రంబులు తైల సిక్తంబులు చేసిదృఢంబుగా బంధించి తద్వాలాగ్రంబునందనలంబు ననుసంధించి దిగ్గనంబగ్గంబులనతనిం బిగ్గంగట్టి సత్వసంపన్ను లగు దైత్యులబ్బలవత్తరుంధరించియయ్యూరం జోరుండని యడచుచుం బొడుచుచు తూర్యఘోషంబులతో మాటిమాటికి జాటుచుం జనుచుండ కార్యగౌరవంబుననీవ్వీరుండూరకవచ్చి పశ్చిమంబగు పురద్వార సమీపంబున జూపట్టి బంధంబులంబాసి గంధవహ సుతుం డయ్యసురలుసేసిన దానికిం బ్రతిక్రియగా మదీయ వాలానల కీలావళి నీలంకం దహింపం జేతునని యంత 189

– హనుమంతుడు లంకను గాల్చుట –

మ॥ ఒకసౌధాగ్రము మీదికైయ్యెగసి వాలోగ్రాగ్నినంటించి వే
రొకహర్మంబునకెక్కి కాల్చి మరియిట్లొండొంట నొక్కొక్క యిం
టికి లంఘించి పురంబులోగలుగు నన్నింటిన్ గృహ శ్రేణిదా
నొకవెంటన్ దహియించె వాయుజుడు రోషాగ్రాగ్నియుందోడుగాన్ 190

కం॥ ధూమములు గప్పి యుల్కా
స్తోమంబులుగప్పి భూరిశుంభధ్వనితో
భీమంబుగ లంకాపుర
ధామంబున మంట లభ్రతలమున కెగసెన్ 191

కం॥ హాతాత! హామనోహర!
హా తనయ! యటంచు పౌరులందరు నాక్రం
దాతిశయంబుల గూయిడ
నాతడు వాలాగ్నిగాల్చె నసుర పురంబున్ 192

కం॥ దేవారులు దన్నారులు
నావల సౌధములనుండి యగ్నింబడుచో
వావిరి పుణ్యచ్యుతులగు
దేవతలన దోచెనపుడు దిలకింపంగన్ 193

తే॥గీ॥ అపుడు పవనజయాజకుడఖిల దనుజ
పశుపురోడాశముల వ్రేల్వప్రబలజేసె
రామ యజమాను డింపొంద రాక్షసేంద్ర
పురవితానాగ్ని నాలంక ప్రోవుగాంచె 194

ఆ॥వె॥ అప్పుడావిభీషణాలయంబును దక్క
నెల్లలంకయును దహింపజేసి
వనధిలోనవాల వహ్నిని జల్లార్చి
స్వస్థచిత్తుడయ్యె వాయుసుతుడు 195

కం॥ అనిలుని బ్రియసఖుడౌటను
జనకజ ప్రార్థించు కతనచల్లనగుచున
య్యనలుం డనిలతనూజుని
ఘనలాంగూలాగ్రమపుడు గాల్వక యుండెన్ 196

మ॥ ధరలోనెవ్విభు నామసంస్మరణ విధ్వస్తాఘులౌవారు దు
ర్భర తాపత్రయ వహ్నినైనను దరింపంగాంతురౌనాక్షణం
బరయంబొప్పగనట్టి రాఘువునకుం బాలింపగాదూతయౌ
హరివర్యుండెటుగాదపించు ప్రకృతం బౌనగ్నిచే నెంతయున్ 197

ఉ॥ అంతమరుత్సుతుండు జనకాత్మజగాంచి నమస్కరించి య
త్యంతము రామసన్నిధికి నానతియిమ్మిదె పోయెదన్మహీ

కాంతుడువచ్చు నిన్నుగనగా వెసనంచు బ్రదక్షిణ త్రయం
బెంతయుజేసి పోదలచి యిట్లనియెన్మరియు న్మహీజకున్ 198

కం॥ దేవీ! జనియెద నీకు శు
భావహమగు రామలక్ష్మణార్కజులను గీ
శావళి నిక జూచెదనన
నావసుధాతనయ యతని కనుదైన్యమునన్ 199

ఆ॥వె॥ అనఘ! దుఃఖ భూతనగు నేనుదుఃఖంబు
నేడుమరచియుంటి నిన్ను జూచి
నీవు బోవనింక నేనెట్లు జీవింతు
వాయుపుత్ర! రామవార్త వినక 200

కం॥ అనిన హనుమంతు డిట్లను
జననీ నాస్కంధమెక్కి చనుదెమ్మిపుడే
నినురాముని తో గూర్చెద
ననవిని యనిలజునితోడ నవనిజ మరియున్ 201

ఉ॥ ఆ వనరాశిరాముడు శరావళి గట్టియునైన నీరమున్
బోవనిగిర్చియైనను కపుల్ తనుగొల్వగ వచ్చి యాజిలో
రావణుగూల్చి నన్ను సుకరంబుగగైకన కీర్తిశాశ్వతం
బౌవిను భర్తరాకకయి ప్రాణములన్ భరియింతుననిన్నిటన్ 202

కం॥ అనిపోయిరమ్మటన్నను
జనకజకును మ్రొక్కిపవనసంభవుడంతన్
వననిధి దాటెడు బుద్ధిన్
జనిశైలాగ్రంబు జేరి సరభసలీలన్ 203

మ॥ చరణద్వంద్వనిపీడనోద్ధతిని త్రింశద్యోజనోత్తుంగ మ
గ్గిరి భూసామ్యము నొందగా నెగసితత్కిశోత్తముండంబరాం
తరముంజేరి మహోధ్వనింబరపినన్ దద్వానరుల్ ప్రీతినం
దరునమ్మారుతి రాకగాగని ప్రతిధ్వానంబుగావింపుచున్ 204

కం॥ విని యానినదము చేతను
తను సీతను గనగనగు నితండని తలపన్
వనరాశి దాటి మారుత
తనయుండరుదెంచి ప్లవగతతికిట్లనియెన్ 205

కం॥ కంటిని సీతను గర్వము
గొంటిని లంకను దశాస్యుకోపాస్యునిగా
నంటిని మిమ్మందరగను
గొంటినిపుడ యధిపునొద్దకున్ జనుడనుడున్ 206

ఉ॥ అందున హర్షమందిగపులందరు మారుతిగౌగిలింపుచున్
గొందరు తోకముద్దిడుచు గొందరుగంతులు వైచుచున్ మరిం
గొందరు నార్భటింపుచును గొబ్బునవచ్చిన త్రోవబట్టి లో
జెందిన ప్రేమ రాముడు వసించిన ప్రస్రవణాద్రికేకుచున్ 207

- అంగదాదులు మధువనంబునకు వచ్చుట -

కం॥ మధువనమున్‌కృత బహువిధ
మధువనమున్ గుంజపుంజ మంజుసురవధూ
నిధు వనమున్ సుగ్రీవుని
మధు వనమున్ గాంచిరపుడు మారుతి ముఖ్యుల్ 208

వ॥ ఇవ్విధంబున సుగ్రీవప్రతిపాదితబహువిధావనంబగు నమ్మధు వనంబుగనుంగొని ప్లవంగపుంగవు లంగదునితో శూరాగ్రణీ నీవభిజ్ఞుండవు మార్గ శ్రమంబున నాకలిగొంటిమియ్యుద్యానం బునంగల ఫలమద్యాదు లాహారంబుగా పాలిత నయుండగు వాలితనయుండగు వాలితనయుండ వ్వానరులతో గృతకార్యుండగు హనుమంతుండుండ మనకేమిభయంబగు తదీయ ప్రసాదంబున యధేచ్ఛ భుజింపుండనిన నబ్బలీముఖులు బలముఖంబుల నవ్వనంబు సొచ్చి విచ్చలవిడి ప్రసవంబులు మెసవియు ఫలంబుల నమలియు మూలంబు లున్మూలించియు హృద్యంబులగు మద్యంబులద్రాగియు తీగెలందూగియు నగంబులకెగసియుం గసిమసంగి యయ్యారామంబు నిస్సమంబుగా గలంచినం గాంచి సుగ్రీవ మాతులుండగు దధిముఖుండవ్వనంబునం బ్రముఖుండై యుండి యతండు బ్రేరేపింప తద్భటు లుద్భటులై దండింపవచ్చిన నవ్వానరసమూహంబు సీతాదర్శనోత్సాహంబున వనరక్షకుల లక్షింపక చరణముష్టి ఘట్టనంబులం బిట్టదల్చిన దధిముఖుండు కుపితుండై సుగ్రీవుకడకు వచ్చి భవత్సుతుండును మరుత్సుతుండును జిరకాలాభి రక్షితంబగు మధువనంబు నిహతంబుగావించిరని చెప్పిన నప్పుడయ్యుత్సాహంబెరంగి సముద్గతానందుండై తపన నందనుండు. 209

కం॥ సందేహము లేదవనీ
నందనగనివచ్చె తపననందనుడటుగా
కిం దతి నిర్భయులై గపు
లందరు జొత్తురెమదీయమగు మధువనమున్ 210

కం॥ అని రవినందనుడనుచో
విని రఘునందనుడ దేమివృత్తాంతమనన్

జనకసుతం గనివచ్చెను
హనుమంతుడు నేడు సంశయములేదధిపా! 211

వ॥ అదియునుంగాక 212

చం॥ అనిలతనూజుడేపనికినై జనునాపని నిశ్చయంబుగా
నొనరుచునంచు బల్కియటులుండకయున్నమదాజ్ఞనేరికై
నను జొరరానియామధువనంబటు సొచ్చి సమస్తవస్తువుల్
గొనుచు దతీయ రక్షకులగొట్టి చరింతురె సర్వవానరుల్ 213

కం॥ అనియవ్వనపాలురగని
వనచరపాలుండు భయమువలవదు మీరల్
జనివారిన్ ఘనమతినా
యనుమతి దోడు కొనిరమ్మటంచును బనుపన్ 214

వ॥ అంతనవ్వన రక్షకులాక్షణంబున నయ్యారామంబున కరిగి ఆరామ లక్ష్మణసమన్వితుండగు సూర్యసుతుండు సుప్రీతుండై మిమ్ము రమ్మని సత్వరంబుగా బుత్తెంచెనని విని యంగదహనుమత్ప్రముఖంబుగా నాకీశవర్గం బాకాశ మార్గంబున నిరర్గళంముగాజని రామలక్ష్మణ సుగ్రీవులంగని గ్రమంబున సాష్టాంగ పురస్సరంబుగా నమస్కరణం బొనరించి రంత 215

– హనుమంతుడు శ్రీరాములకు సీతను జూచిన తెరంగెరింగించుట –

తే॥గీ॥ అటుల సీతావలోక సుఖానుభూతి
నందియట వచ్చి శ్రీరామునపుడు గనియె
ననిలజుడు బ్రహ్మ విద్యాసుఖానుభూతి
నంది పరమాత్ముగాంచు మహాత్ము పగిది 216

వ॥ ఇట్లుగని యప్పుడప్పవనపుత్రుండు రఘుసత్తమున కిట్లనియె 217

మ॥ భవదీయాజ్ఞపయోధి దాటి రయమొప్పం లంకలోజొచ్చి త
ద్భవనాళిన్ ధరణీసుతన్ వెదకియంతన్ రావణాంతఃపురీ
భవనారామమహీజ మధ్యమున శుంభత్సింశుపా భూరుహ
ప్రవరాధస్థలి ఘోరరాక్షస వధూపాళీపరీత స్థితిన్ 218

సీ॥ అనిశంబశోకవనాప్త చక్షువునయ్యు
శోకవనాప్త చక్షువులతోడ
సంతతమసుర రక్షణమును గాంచియు
సురరక్షణము జేయు చూడ్కితోడ

సతతవిరామ సంగతమనోరథయయ్యు
రామసంగత మనోరథముతోడ
ననయంబుసహజాప్తి నమలినాంశుకయయ్యు
మలినాంశుకా వృతాకలనతోడ

తే॥గీ॥ శుకముబాసివసించిన శుకియనంగ
మరియు నెడలేని రామసంస్మరణతోడ
నేకవేణినిరాహారయై కృశించు
పూతగుణజాత మహిజాత సీతగంటి 219

కం॥ కనిసూక్ష్మరూపమున త
ద్ఘనవృక్షమునందు నిలిచి ధరణిజతో మీ
జననము తత్పరిణయమున్
వినంటిని దండకాటవీ గమనంబున్ 220

చం॥ వరుస దశాననుండు తనువావిరి మ్రుచ్చిలిదెచ్చుటల్ దినే
శ్వరసుతునేలి మీరచట వాలివధించుట జెప్పి రాముడ
ద్ధరణిజజూడ దిక్కుల కుదారబలాధ్యులకీశ కోటులన్
బరపిననందునేనొకడ మారుతపుత్రుడ నిందువచ్చితిన్ 221

కం॥ రామునిదాసుని రవిజున
కేమంత్రిని నాదు భాగ్యమేమనవచ్చున్
భూమిజగంటి బ్రయాసం
బీమెయి ఫలియించె నేటికిందని యనినన్ 222

కం॥ ఆమాట చెవుల కమృత
స్తోమాటనమైన భూమిసుతయీసువచ
శ్రీమాన్యుడెవ్వడన త
ద్భామిని నికటమున నిలిచి ప్రాంజలినగుచున్ 223

తే॥గీ॥ దూరముననుండి ననుజూచి యారమణియు
ననఘు! నీవెవ్వడవునను నాదిగాగ
విస్తరంబుగనడుగ పృధ్వీజ కేను
సకలమును దెల్పి సంప్రీతి సల్పుటకును 224

కం॥ శ్రీమద్రామ సమాఖ్యా
శ్రీముద్రా మహితముగ ప్రసిద్ధింగన నౌ

మీముద్రికనియ్యంగని
బ్రే మార్ధకయై గరంగి పృధ్వీ సుతయున్ 225

చం॥ ననుగనినెమ్మదిన్మిగుల నమ్మి కపీంద్ర సదామదార్తియున్
దనుజుల బాధజూచితి గదా! యెరుగింపుముభర్తకన్ననే
నును ధరణీజతోడుత నినున్ వినువార్తయలేక రాఘవుం
డనిశము చింతనుండు వనితాజని నేనెరుగించునంతకున్ 226

కం॥ దేవీలక్ష్మణుతో సు
గ్రీవునితో రామవిభుడు కీశబలంబున్
సేవింపవచ్చి పంక్తి
గ్రీవునిబరిమార్చినినుబురికి గొనిపోవున్ 227

కం॥ కాన వెసన్విభున కభి
జ్ఞాన మొసంగుమికనేను జనియెదననినన్
దానరమణీశిరోమణి
దాను నిజశిరోమణిన్ముదంబున నిచ్చెన్ 228

ఆ॥వె॥ అదియుగాక కాకమట చిత్రకూటంబు
నందనర్చువృత్తమదియు జెప్పె
ననుచు జెప్పి మరియు హరిమౌళియారాజ
మౌళిమణికి మౌళిమణి యొసంగె 229

వ॥ అంతనచ్చూడామణిందన సతీచూడామణింజూచు విధంబునం గనుంగొను రఘుపుంగవునితో
మరుత్తనయుండు వెండియునిట్ల నియె. 230

తే॥గీ॥ తరణికులవర్య మరియు నద్ధరణితనయ
కడు భవద్విరహైకశోకమున దొడరి
మీకుశలవార్త లడగి సౌమిత్రిదలచి
యెట్టకేలకు నాతోడ నిట్టునియె 231

శా॥ అన్నా!లక్ష్మణుతో వచింపుదనతోనజ్ఞాప్తి దీవ్రోక్తులే
నన్నాగొన్ని ననుక్షమించి మదిలోనన్నిన్విచారింపకన్
నన్నారాఘవుడుద్ధరించు గతినందంజేయు మాయంచునా
సన్నార్తిన్వచియించె నమ్మహిజ నాశ్వాసించి తేనంతటన్ 232

కం॥ నాకులసతి దాసీగతి
నాకులమతియగుచు మరియు నారామునితో

నా కుశలము జెపుమనుచును
నాకు శలవొసంగె సాశ్రునయనాంబుజయై 233

ఉ॥ అంతదశాస్య జీవనమునైనవనంబు బెకల్చిదానికై
యెంతయు బోరవచ్చిన ననేక నిశాటుల జీల్చిదుర్మదా
క్రాంతనిరీక్షు నక్షుదశకంఠ కుమారుని గూల్చి రోషిత
స్వాంతుని దైత్యకాంతుని సమక్షమ దూరి మిమున్ను తించితిన్ 234

తే॥గీ॥ దాన దానవ విభుడభిమాన మాన
గీలిగీలింప మద్వాల పాళినోళి
లంక గాలిచి నే నకలంకలీల
దరలి మిముమగంటి నట కృతార్థతనుగంటి 235

కం॥ అనియంతయు వినుపించిన
వినియంతయు బ్రేమరామ విభుడనిలభవున్
గనియంతట జేసితివి
ప్పనియింతయు దేవదుర్లభంబని మరియున్ 236

కం॥ ఉపకారికి నీకును బ్ర
త్యుపకార మొనర్ప నెద్దియుందుల్యముగా
దివుడె నిదే సర్వస్వము
గృపను మదీయంబు నీకు నిచ్చితిననఘా! 237

మ॥ అనిశ్రీరాముడు భక్తవత్సలుడు గాఢాలింగితుంజేసి యం
తను సంతోష జలార్ద్రనేత్రుడయితత్సామీరినీక్షించి యో
యనఘాత్మా! పరమార్థమై తగుమదీయంబౌ పరీరంభమున్
గననెవ్వారికి దుర్లభంబదియు వేడ్కన్ నీకు గల్గెన్ జుమీ! 238

కం॥ కావుననతి భక్తుడవున్
నీవత్యాప్తుడవు మాకునిరతిశయ గతిన్
పావని!యనుచును రామ
శ్రీవిభుడానంద పూర్ణ చిత్తుండయ్యెన్ 239

ఉ॥ ఎవ్వనిపాద పద్మయుగ మెప్పుడు శ్రీతులసీముఖార్చనల్
నెవ్వడిజేసి సాధులతి నిష్ఠను విష్ణుపదంబుగాంతు రౌ
నవ్విభుడైన రాముడు దయామతి కౌగిట జేర్చి యాదరం
బివ్విధిజేసెవాయు సుతుడెంతటి పుణ్యనిధానమో కదా! 240

కం॥ అనివిని భవాని భవునిం
గనుగొని యనుమోదపులక కళికాంచితయై
ఘనమతిరాముని చరితము
లనఘా! యవ్వల వచింపుమని యడుగుటయున్ 241

విశ్వముఖమత్స్యత్రయబంధ చిత్రము –

చం॥ కరినుతచిద్విలాస! యనఘస్మరఘస్మర చిత్రబాంధవా!
శరజ విలోచనావిజయ సత్వర సత్వర తాత్మ శైశవా!
విరచిత శీలరాఘవ రవిగ్రహవిగ్రహవర్తి మాధవా!
విరళకథోత్సవానిఖిల విద్విభవా జగదీశ కేశవా! 242



పాదభ్రమక కందము -

శ్రీరత మహిమతరశ్రీ!
సారసవనయ శహితాహి శయనవసరసా!
ధీరశమ సోమ శరధీ!
మార పరకమాన్యధన్య మాకరపరమా! 243

గోమూత్రికాబంధ చిత్రము - సుమవిచిత్ర వృత్తము

సరసిజనేత్రా! శయధృత గోత్రా!
కరినుత పాత్రా! కవివన చైత్రా!
నరనిజమిత్రా! నయకృత చిత్రా!
యరితతజైత్రా! యవిఘన గోత్రా! 244



- గద్య -

ఇది శ్రీమదుభయ కవితా నిస్సహాయ సాహితీవిహార కాణాదాన్వయతిమ్మనార్యకుమార
వినయవిభ్రాజి పెద్దనసోమయాజి ప్రణీతంబైన
శ్రీమదధ్యాత్మరామాయణంబను మహాపురాణంబునందు
సుందర కాండంబన్నది పంచమాశ్వానము సంపూర్ణము.

-★)★(★-



శ్రీ భూ చెన్నకేశవాయనమః

అధ్యాత్మ రామాయణము

యుద్ధకాండము-పూర్వభాగము

శ్రీకృష్ణదక్షిణ తీ
రాకర గద్వాల పట్టణాఖ్య సుధార
త్నాకర పూర్ణ మహాల
క్ష్మీకేళి సనాథ! చెన్నకేశవనాథా! 1

వ॥ అవధరింపుముభక్తియోగవిశారదుండగు నారదునకు సకలార్థ సంధాతయగు విధాత సెప్పెనట్లు విజ్ఞానవతియగు పార్వతికి దివ్య ప్రభావుండగు మహాదేవుండిట్లనియె నవ్విధంబున వాతాత్మజుండు సీతావృత్తాంతం బంతయుం జెప్పిన తద్వచనంబువిని రామచంద్రుం డత్యంత సంతుష్టాంతరంగుండై యొక్కవాక్యంబిట్లనియె. 2

సీ॥ సురలకైనను సుదుష్కరమైన కార్యంబు
వాయుసూనుని చేత సేయనయ్యె
నిక్కార్యమవనిలో నితరుండు మనసుచే
స్మరియించుటకునైన శక్యమగునె
శతయోజనాతివిస్తారమౌ వారాశి
ధాటిగా నెవ్వాడు దాటనోపు
నదిగాక దనుజరక్షాభీలమౌ లంక
శూరతనెవ్వాడు సొరగలండు

తే.గీ॥ గానహనుమంతుచే భృత్య కార్యమిప్పు
డెంతగల దంతయును ఘటియింపనయ్యె
నగుట సుగ్రీవుతో సమమైనహితుడు
ముందువెనుకల లోకంబులందుగదె 3

కం॥ నేనును లక్ష్మణుడును రవి
సూనుడు రవికులము పవనసూనుని చేతన్
జానకిని జూచివచ్చిన
దాన సురక్షితులమగుచు దనరితిమిగదా! 4

కం॥ నానాప్రయత్నములచే
జానకి వెతకంగనయ్యె సంగతినింకన్
బూనిపయోనిధిదాటుట
మానుగ దలచంగరాదు మనసుదలకెడిన్ 5

ఉ॥ ఏగతి భూరిఘోరమకరేభఝుష ప్రకరాకరంబునౌ
సాగరముందరించెదము సైన్యముతో శతయోజనాయతం
బేగతి నవ్విరోధివధియించెద ముగ్రతరాపరాధినం
దేగతి రాక్షసీవృత మహీసుత గాంచెద మంచితస్థితిన్ 6

వ॥ అనిచింతించు రఘుకులాగ్రణి వాక్యంబువిని సుగ్రీవుండు సమగ్రంబగు ధైర్యంబు దోపనిట్లనియె 7

ఉ॥ బూంచెదమాత్మ సైన్యములభూరి సరోధిని మార్గరోధి లం
ఘించెదమన్యసేనగలగించెద ముర్విదలంక లంక సా
ధించెద మందు రావణువధించెద మిప్పుడజూడుమేల చిం
తించెదు కార్యనాశనిగణింపగ చింతయ కాదెరాఘువా! 8

ఉ॥ వీరలజూడుమాప్లవగ వీరులు శూరులు ధీరులుంబలో
దారులు నీకుగాననలమైన జొరంగలవారు గావునన్
వారిధిదాటుయత్నము నొనర్పమొదల్ మరిలంకజూచిన
ట్లారయ రావణుండు హతుడంచు దలంచెద మోరఘూత్తమా 9

కం॥ చే కార్ముకమున్ బూనిన
నీకెదురుగ నెవ్వడేని నిలువగలేడీ
లోకత్రయంబులోనన్
నాకు గనుంగొనగ రణమునన్ రఘువీరా! 10

వ॥ అదియునుంగాక 11

తే॥గీ॥ ఎన్నివిధముల జూచినయినకులేంద్ర!
జయము సిద్ధించు మనకు నిశ్చయముగాగ
నట్లు గానెయ్యెడను విజయావహంబు
లైన శకున నిమిత్తంబు లరయు కతన 12

వ॥ అని భక్తివిహింతంబునునగు సుగ్రీవుభాషితంబు వినియంగీకరించి రఘుపుంగవుండు పురస్థితుండగు మరుత్సుతునీక్షించి కపిప్రవరా యేప్రకారంబున నేనియునిప్పారావారంబు నుత్తరింపంగల మామీద దేవదానవులకైనను దుష్ప్రాపంబులగు లంకాస్వరూపంబు నిరూపింపుము దాని నెరింగి తదీయ ప్రతీకారంబు విచారంబొనర్చెద ననిన రాముని వచనంబువిని వినయరంజితుండగు నంజనా నందనుండంజలి ఘటించి రాఘవా! నేను జూచినంతయు మీకువిన్నవించెద ననియిట్లనియె. 13

- ఆంజనేయుండు లంకా ప్రభావంబు దెల్పుట -

శా॥ దేవా! వార్ధిగభీర! వారివళిత ద్వీపాంతరాబద్ధమ
ధ్యావాసంబగు నాత్రికూటనగ శృంగాగ్రంబునంబోల్చులం
కావిఖ్యాతము దివ్య పట్టణము సాక్షాత్కేతు హస్తావళీ
వ్యావిద్ధ త్రిదశాధ్వమైసురరిపు వ్యాపారసన్నద్ధమై 14

సీ॥ భర్మమయోన్నత ప్రాకారములచేత
నాపూర్ణతోయ ఖేయములతోడ
హాటకసంఘటి తాట్టాలకములచే
సమధికోత్తుంగ సౌధములచేత
తతమణిస్తంభ చిత్రితగృహంబులచేత
నవరత్న దీప్తాపణముల చేత
దివ్యవాపీకూప దీపస్థితుల చేత
బహువిధోద్యాన వైభమముచేత

తే.గీ॥ సుప్రశస్త ప్రశస్త వస్తువులచేత
నమితచతురంగ సైన్య సంఘములచేత
చెలగిరాక్షస వీర రక్షితమునగుచు
ఘనతరంబుదనర్చు లంకాపురంబు 15

వ॥ ఇట్లు దుర్గమతరంబగు లంకాపురంబునం బడమటి పురంబుననేక సహస్రంబులగు గజారోహకులును నుత్తరద్వారంబున నపరిమిత సహస్రంబులగు నశ్వవాహకులునుం బూర్వద్వారంబున నర్బుద సంఖ్యాకంబులగు వీరభటానీకంబులును దక్షిణద్వారంబున నవ్విధంబున నర్బుదసంఖ్యాలగు రథికులును మరియునుంగొందరు శూరజనంబులుం బలసియుండుదురు వెండియు మధ్య కక్ష్యంబున నసంఖ్యాకంబగు ఆశ్వరథ పదాతి వ్రాతంబాయితంబైయుండు నిట్లు వివిధాస్త్ర శస్త్ర ప్రహారులును సంగ్రాహ శూరులునునగు రాక్షసవీరుల చేత రక్షితంబై నిరంతరంబును నానావిధంబుల నివేశ

స్థానంబులకు సంక్రమంబులవలన నమితంబులగు శతఘ్నిప్రముఖ నిఖిల సాధన సహితంబుగా
నతిదుస్తరంబగు లంకాపురంబు బలవత్తరంబై నిశ్శంకంబ్రవర్తింపుచుండు 16

మ॥ అయినందత్పురియందు దేవ! వినుకార్యంబేను గావించితిన్
హయనాగాది దశాస్యసేనల చతుర్థాంశంబులంద్రుంచితిన్
లయకాలానల మావరించునటులా లంకాపురిం గాల్చితిన్
భయదస్ఫూర్తి తదీయ కాంచనమయ ప్రాసాదముంగూల్చితిన్ 17

కం॥ సేనాస్థానములు శత
ఘ్నీనికరము జరుపనయ్యె నెరినా చేతన్
గానభవద్దర్శనమా
త్రాననె రఘువీర! లంక దగ్ధముగాదే! 18

కం॥ కావున రఘుకులవీర! మ
హావీరులు నైననిఖిల హరిముఖ్యులతో
బోవుదము లవణ వనధి త
టావని జేరగ ఘటింపుమా! జయయాత్రన్ 19

వ॥ అని చెప్పిన నప్పవననందను వచనంబువిని రఘునందనుండు రవినందనుంగనుంగొని నీవీ సమస్త వానర సేనావితానంబు జయప్రస్థానంబొనరింపంజేయు మిపుడ విజయాఖ్యంబగు ముహూర్తంబునం జనిన నతిదుష్కరంబునుం ప్రాకార పరిఘాది దుస్తరంబునుం రాక్షస సంకులాకులంబును నగులంకాపురంబు రావణసమేతంబుగ వినాశంబొనర్చి జానకిందెచ్చెదము, విజయ సూచనంబుగా దక్షిణ లోచనంబు జలియింపుచున్నయది సత్వరంబుగా వనచరబలంబు జనుంగాక సైన్యంబునకు నగ్రప్రచ్ఛ పార్శ్వ భాగంబులయూధపతుల రక్షింప నియమింపుమింక నేనును వాయుసూనునధిరోహించి వచ్చెద, లక్ష్మణుండు నంగదునారోహించి నావెనువెంటం వచ్చుగాక సుగ్రీవా నీవు తోడ జనుదెమ్ము పదంపడి గజగవయ గవాక్ష గంధమాదన మైంద ద్వివిధ నల నీల సుషేణ జాంబవదాదులును మరియునుంగలుగు రిపుహరులగు కపివరులందరు సకల సేనానికరంబు లరయచుంబరివేష్టింప వత్తురుగాకయని సౌమిత్రి సూర్యపుత్ర సహితంబుగా సేనామధ్య గతుండై రఘు ప్రవరుండతి ప్రమదంబున విజయప్రయాణం బొనరించె నప్పుడు 20

- సుగ్రీవుండు కపిసైన్యంబుల వెడలించుట -

ఉ॥ వారణరాజతుల్యులగు వానరులందరు గూడి క్రీడలం
జేరుచు గర్జనధ్వనులు జేయుచు దక్షిణ దిక్పథంబునన్
బోరున కామరూపులయి బోయిరి యందలి కందమూలముల్
సారఫలంబులున్మధు రసంబులు భక్షణమాచరింపుచున్ 21

కం॥ రాముని ముందరరావణు
నేమిపుడు వధింతుమనుచు నిటుల బలుకుచున్
వేమరలకజనిరందరు
వేమరు గీశపతు లతుల విక్రమ యుతులై 22

కం॥ హరి పరివృతులై మెరసిరి
హరివాహారోహులగుచు నారఘువర్యుల్
వరనక్షత్రావృతులై
సురపథగతులైన చంద్రసూర్యులు బోలెన్ 23

ఉ॥ ఓలినిటుల్ మహాప్లవగ యూథములీధర నెల్లగప్పుచున్
వాలములెత్తి త్రిప్పుచురవంబులొనర్పుచు భూరిసాలము
ల్మైలములెక్కుచున్భవనసత్వములన్వెస ద్రొక్కుచున్ గనం
బోలుచు లెక్కకెక్కుడుగ బోయెను దిక్కులు బిక్కటిల్లగన్ 24

వ॥ అప్పుడు 25

చం॥ తన సుత సీత లోకవినుతంగొని తేరగ కీశవాహిను
ల్జనవనరాశిలో తెరువుసంగతి బూన్పగధాత్రియంబరం
బనుపుటికన్ ఘటించెనొ మహారజమెల్లననంగ నింగిపై
గను పడియెన్ బలౌఘపదఘట్టిత భూరిధరాపరాగముల్ 26

కం॥ ఈలీలన్ రఘువర పరి
పాలితముగ నెసగుకీశబలములు పగలున్
రేలొకచోక్షణమాత్రం
బాలస్యము లేకనిలువ కరిగెన్మరియున్ 27

కం॥ పురములు సరములు గహనాం
తరములు దరములును భూరి తరములు తృటినీ
వరములు ఝరములు గనివన
చరములు గరమొలయ మార్గసరణిన్ జనుచున్ 28

శా॥ గ్రాహ్యస్ఫూర్తి తదీయ భూధరగుహా కాంతార దేశంబులం
బాహ్యాభ్యంతర చిత్రముల్ గనుచు సంభావ్యాప్తి నచ్చో మన
స్సహ్యంబున్ మలయంబునన్ పునరుదంచత్క్రీడలందేలుచున్
సహ్యంబున్ మలయంబుగాంచె చనియెన్ సైన్యంబగణ్యంబుగన్ 29

వ॥ ఇట్లగ్గిరి ద్వయంబునిర్గమించి మార్గాను శ్రమంబునం జనిచని 30

- శ్రీరామచంద్రుండు సముద్రమును జూచుట -

మ॥ అటకాంచెన్ రఘు పుంగవుండనుజ కీశాధీశ సైన్యంబుతో
నటదుత్తుంగ తరంగ సంఘరవఘూర్ణ ద్యోధరాచ్ఛిద్రమున్
జటులగ్రాహఘుళీ కుళీరశకులీసత్వావళీ భద్రమున్
దట వేలా పటలీ సముద్రము సముద్రంబున్ సమున్నిద్రమున్ 31

వ॥ మరియు నసురవినాశనార్థంబు సనువనచర సేనావిసరంబునకు నివేశింప సురసంఘంబుచేత సంఘటింపనగు బట కుటీరంబులనం బరిశుద్ధంములై పవనోద్ధతిం బెరిగి సముత్తుంగంబులగు తరంగంబులను తరంగంబులు వెల్లువం బెల్లురికి మొల్లంబులై పెల్లగిల్లి వియల్లక్షితంబులై తారకాకారంబుల ననుకరించు ననేక కోటి శీకరంబులును, శీకరనికర పరంపరలు నిలింపమార్గంబున కుద్గతంబులై సత్వరంబు సగ్గి డిగ్గి గుంపు గుంపులంగూడి గొప్ప లైపడు తద్బిందుసందోహ సందర్భిత జలధారా నివహంబులును, ధారానివహంబులుసాగర సమాగమ సమాగతవియత్తటినీ ప్రవాహంబులని క్రొత్త నీటి కెదురెక్కు తిమితిమింగలాదుల తగులునన్ బెగలిపడు గగనగత నక్షత్రంబుల నలక్షితంబులగు నీరు బుగ్గలును, నీరుబుగ్గలు వెగ్గలంబగుటనుద్గమించి తగ్గరిక నిండుకొనియున్న వడుపున దేశకాలంబుల నేనియుందీసిపోని సహజ వారిపూరంబును, వారిపూరంబు బహువిధంబుగా గ్రహింపవచ్చి యచ్చట నింద్రవిజయ శాలియగు రఘునరేంద్రు వంశజుండగు రామచంద్రు సన్నిధానంబగుట నింద్రభయంబు సడలివెడలి వచ్చు శైవలాచ్ఛాదిత శైలంబులన విభ్రమించు నభ్రంబును, గలిగి యభ్రంబునుంబోలె మీనకర్కట కావేశంబై, వేశవాటియుం బోలె భుజంగ సంగతి విస్తారంబై, తారకా విహారంబునుంబోలె గ్రహసహిత పుష్కరాధ్వంబై యధర్వంబునుంబోలె సోమాభ్యుదయ కారణంబై, రణాడంబరంబునుంబోలె సముద్ధత శరధర్మంబై, ధర్మావహిత సభామంటపంబునుంబోలె బాడబప్రభాభాసురంబై, సురపతి కరంబునుంబోలె నశని గర్భంబై, గర్భసముద్భూత పరస్పర సంఘర్షణోత్కర్షిత జంఘాల ఘుంఘుమధ్వాన విస్ఫారంబై యొప్పు నప్పారావారంబు జేరంజని యచ్చట 32

కం॥ మారుతి నంగదునిండిగి
యారాముడు లక్ష్మణుండు నంబుధివేలా
తీరవనోదార మనో
హార వినోదముల మిగుల నరయుచునంతన్ 33

సీ॥ అప్పుడు రఘువీరు డర్కజుతో నబ్ధి
వారిసమీపంబు జేరనరిగి
వచనమిట్లను జేరవచ్చితి మీమక
రాలయాంతికమునకందరమును

నికనశక్యముమనకిట మీదనరుగంగ
హరులార! యొకయుపాయంబులేక
గాననిల్పుద మిందు సేనలనబ్ధిద
రింపగనిట విచారింప వలయు

తే.గీ॥ నవనిరాముని వచనంబువిని వినీతి
నిరతిరవిసూతి వారిధి నికటమునను
సకల కపియూధపతులు రక్షకులు గాగ
సేనల రయంబునను నివేశింపజేసె 34

వ॥ అంత 35

ఉ॥ ఆకపులున్ మహోగ్రమునుదగ్ర భయంకరనక్రముఖ్య స
త్వాకర మున్నతోర్మినికరార్భటి నిర్భరము న్నభస్సమా
నాకృతియై యగాధమగు నంబుధిజూచి భయంబుదోచి బా
ధాకుల చిత్తులైనిలిచి యందరు చేష్టలు దక్కియచ్చటన్ 36

ఉ॥ ఏ విధిఘోరరూపమగు నివ్వరుణాలయ ముందరింపనౌ
రావణుడున్ని కృష్టుడు దురాత్ముడు మాకిపుడే వధార్హుడున్
గావున దుర్ఘటంబిదియ కార్యమటంచు కపీంద్రులెల్ల చిం
తావశులై వసించిరి పదంపడిరాముని పార్శ్వసీమలన్ 37

ఉ॥ అంతట నద్వితీయుడు జిదాకృతియుంబరమాత్ముడున్ విభుం
డెంతయునున్ సనాతనుడు నీశ్వరుడైతగు రాఘవక్షమా
కాంతుడు కార్యమర్త్యుడయి గన్పడియుండుట జేసి జానకీ
కాంతదలంచి దుఃఖమధికంబుగ జెందెను లేని వేదనన్ 38

తే॥గీ॥ వరుస రామస్వరూప మెవ్వడుయథార్థ
సిద్ధిగనెరుంగు వానిని జెందకుండు
సకలదుఃఖాదికములౌట సచ్చిదాత్మ
రామునానందధాము జేరంగగలవె 39

వ॥ కావున దుఃఖహర్షభయ క్రోధమోహమదాదులగు నిగ్గుణంబులజ్ఞాన లింగంబులగుట జ్ఞానస్వరూపకుండగు నతనియందేలయుండు నదియునుంగాక దేహాభిమానియగువానికి దుఃఖంబు బ్రాపించు దేహత్రయ విలక్షణుండగు బరమాత్మునకుదుఃఖాదికంబు రానేరదు సంసారంబునం గాదే

దుఃఖంబు సంభవించు సుషుప్తియందు వేరొండు లేక సుఖమాత్రంబుగనంబడు తెరంగున విచారింప నిస్సంగుండై రెండవవస్తువు లేక వెలుంగు నవ్విభుండు సుఖ మాత్రుండై కనంబడు చిద్రూపకుండగు నతనియెడ జడస్వరూపంబు లగు బుధ్యాదులు దోపంబడు దానంజేసి నిత్యశుద్ధ బుద్ధాద్వయ స్వరూపంబగు తదీయ తత్వంబునందు దుఃఖంబులు గానంబడనేరదది యనుభవసిద్ధంబగు నిట్లగుట దుఃఖాదికంబులు సర్వంబులు నిస్సం దేహంబులుగా బుద్ధి గుణంబులుగాని వేరొండుగాదు గావున 40

ఉ॥ రాముడునిర్వికారుడు పురాణుడునుంబురుషుండు సత్సుఖ
శ్రీమహితుండు నిత్యుడు నిరీహకుడున్ బరమాత్ముడయ్యుమా
యామహిమానువర్తిత గుణానుగతిన్ సుఖదుఃఖయుక్తుడౌ
నామయిదోచుచుండు ననునట్లుగ జెప్పబడున్ బుధాళిచేన్ 41

వ॥ అంతనవ్విధంమున వనచరంబులెల్ల నంబునిధితటంబున విడిసె నాలోన నిక్కడ లంకాపురంబునందు గంధవాహనందనుని చేత నమరబృందంబునకేనిం దుష్కరంబగు విక్రమ కృత్యంబొనర్చుటం గాంచి దశముఖుండు కొంత దలవాంచి వసించితనమంత్రుల నందర రావించి వారితోనిట్లనియె 42

- రావణుడు మంత్రులతోనాలోచించుట -

సీ॥ అనిలజుచే సేయనైన కార్యంబది
యెల్ల మీచేజూడనయ్యె గాదె
శంకలేకనసాధ్య లంకబ్రవేశించి
యితర దుష్ప్రాపభూసుతనుగాంచి
యటనశోకవనంబు నంతయు బెకలించి
దనుజవీరుల రణంబున నడంచి
తనరమందోదరీ తనయునక్షు వధించి
లంకాపురంబు నెల్లను దహించి

తే.గీ॥ సాగరంబును లంఘించి సాహసించి
తివిరియందరమిమ్ము నతిక్రమించి
మరియు విజయంబుగాంచి సమ్మదముమించి
చూడనిర్భీతి నవ్వాయుసూతిజనియె 43

కం॥ కావుననెయ్యది మనచే
గావింపగవలయు మీరు కార్యజ్ఞులు నా
కేవిధి హితమగుదానిన్
గావింపుడు మంత్రవిధిని గడుయత్నమునన్ 44

తే॥గీ॥ అనిన రావణువచనంబువినియు దనుజు
లతనికిట్లని రోదేవ! యట ద్రిలోక
జయముగనునీకు నేమైన శంకగలదె!
మనుజుచేతను దశరథతనుజు చేత 45

వ॥ అదియునుంగాక 46

సీ॥ నీపట్టణంబున నీతనూజుని చేత
బద్ధుడైయింద్రుండు పట్టుబడియె
ధననాథుననిగెల్చి తద్విమానము దెచ్చి
హెచ్చినీచే జరియింపనయ్యె

యముని గెల్చుట చేత యముని దండము ఘాత
నెయ్యెడ భీతిలేదయ్యె నీకు
హుంకారమున గతాహంకారుడైవరు
★ణుండునీచే నిర్జితుండునయ్యె

తే.గీ॥ నెల్లదైత్యులు మరియు జయింపబడిరి
దానమయుడును భయమున తనదుకన్య
నొసగినీకు వశస్థితి నుండు ననగ
నింకనితరుల జెప్పగా నేలయధిప! 47

మ॥ హనుమంతుండొనరించె నిద్ధిరణ కృత్యంబున్ మదీయావహే
ళన మూలంబగునట్టి కార్యమిది లీలన్ వానరుండీతడీ
తనిపై విక్రమమే ప్రతిష్ఠయని గొంతన్ మేముపేక్షించుచో
జనియెన్ గాకటు గానిచో నతనిచే సామర్థ్య మిందేమగున్ 48

వ॥ మరియును 49

కం॥ మేము బ్రమత్తుల మగునెడ
నామెయివచియింపబడితి మాతని చేతన్
నేమిందర మెరిగినచో
నామారుతి బ్రతికియట్టులరుగన్ వచ్చున్ 50

వ॥ కావున 51

★ ణుండు నీచేత నిర్జితుడునయ్యె – గ.ము.ప్ర. పాఠం

కం॥ ఆనర వానర రహితము
గానొనరిచివత్తు మిజ్జగంబెల్లసుమా!
కానతి యిమ్మొకరొకరికి
నేనియునందరికినైననేని సురారీ! 52

వ॥ అనిదనుజులు బలికిన వచనంబులు విని శౌర్యకార్య ప్రచార సముదీర్ణుండగు కుంభకర్ణుండన్నయున్న కడం జేరియారాక్షసేశ్వరుం డగు దశకంధరున కిట్లనియె 53

శా॥ ఆరంభించితి వెద్దినీవు తుదినీ కక్కార్య మాత్మైకనా
శారంభంబగు నీదు భాగ్యవిధిచే నజ్ఞానకిందెచ్చుచో
నారాముండు నినుంగనుంగొనుట లేదవ్వీరుడుం నిన్ననే
పారంజూచిన నీకునుంబ్రతికి రానైవచ్చునే రావణా! 54

కం॥ ఆరామ విభుడు సాక్షా
న్నారాయణు డవ్యయుండు నరుడనకు సుమా!
యారాముని సతి శుభవతి
శ్రీరామయశోభిరామ సీతయగుసుమా! 55

ఉ॥ దానవనాశనార్థముగ దత్సతి దెచ్చితి వీవునున్ మహా
మీనము నామిషంబను తమిన్ విషపిండము గ్రోలిసోలు నె
ట్లానెరినామహీసుత సమాహరణంబొనగూడె మీదటన్
గానగునట్టి కార్యమది గానగుచున్నది దానవాగ్రణీ! 56

కం॥ ఇదియెన్నిటననుచితమగు
నదినీచే జేయనయ్యె నగుట నెరుగకన్
దుతినింతయు జక్కయొన
ర్చెద నేనుండు మిక స్వస్థ చిత్తతనధిపా! 57

వ॥ అనిననక్కుంభకర్ణు వాక్యంబువిని ముఖ్య పుత్రుండగు నింద్రజిత్తుండు తండ్రి కిట్లనియె 58

శా॥ దేవా! యానతియిమ్మునాకిదె సముద్దీప్త ప్రతాపప్రభా
భావిర్భూతిని జొచ్చి యుద్ధ మహియం దారామ సౌమిత్రి సు
గ్రీవున్ వానరులన్ వధించి విజయ క్రీడాపటిష్ఠుండనై
నేవత్తున్ భవదంతికంబునకు నెంతే దానవాగ్రేసరా! 59

వ॥ అని పలికి విక్రమంబునం దక్కితక్కిన రక్కసులందరు తమతమ యుచితవిధంబుల వచించునెడ నచ్చటికివచ్చి భాగవత శ్రేష్ఠుండును బ్రజ్ఞానగరిష్ఠుండును శ్రీరామచరణ ద్వయైక భక్తినిష్ఠా ప్రచారుండును విశుద్ధబుద్ధి వీరుండును వినయభూషణుండునగు విభీషణుండు సమాహితుండై దశముఖునకునమస్కరించి యభిముఖుంబుగా వసియించి మత్తప్రమత్తులగు కుంభకర్ణాది దైత్యుల నాలోకించి కామాతురుండగు రాక్షసేశ్వరు నీక్షించి యత్యాశ్చర్యంబుగా నతనికి నారామదేవుం మహాప్రభావంబు వచియించువాడై యిట్లనియె 60

- విభీషణుండు రావణునకు నీతి జెప్పుట -

మ॥ అతికాయుండును కుంభకర్ణుడధికుండౌనింద్ర జిత్తుండతి
ప్రతిభాబంధురు లౌమహోదర మహాపార్శ్వుల్ నికుంభుండును
ద్ధతుడౌ కుంభుడు నాదిగాగలుగు దైత్యశ్రేష్ఠులెల్లన్ బలా
న్వితులయ్యున్ రణభూమి రామునెదుటన్ నిల్వంగలే రెంతయున్ 61

మ॥ గణుతింపన్ మహిజామహాగ్రహపరిగ్రస్తుండవౌ నీకు మో
క్షము గల్గంగనునేరదో దనుజలోక శ్రేష్ఠ! యజ్ఞానకి
న్మణిహేమాదుల సత్కరించి వెసనిమ్మా! సత్యసంధాపరా
యణుడౌరామునకీవునున్ సుఖివిగమ్మా! ధర్మ నిష్ఠాయతిన్ 62

ఉ॥ ఎంతటిలోన రామధరణీంద్ర నమోఘశరౌఘ మెల్ల లం
కాంతర సీమగప్పియసురాళి శిరంబులు ద్రుంపకుండు నౌ
నంతటిలో దయాపరున కారఘువీరునకట్ల జానకీ
కాంతనొనంగి యర్ఘ్యడవుగమ్ము సుఖమ్మున బొమ్ము రావణా! 63

శా॥ ఏలోనన్ నఖ దంష్ట్ర యోధులు మృగాధీశ ప్రభావాధికుల్
శైలాకారులు వానరుల్ ఘనబలస్ఫూర్తుల్ వడింజొచ్చివా
రీలంకన్ పురినాశముంబరప కెంతే జేరి వర్తింతు రౌ
నాలోరామున కిమ్ముసీతను రయంబారంగ దైత్యోత్తమా! 64

వ॥ మరియును. 65

మ॥ హరశక్రాదుల చేత రక్షితుడవై నాపద్మజోత్సంగమున్
బరగన్ జేరిన మృత్యువెన్కసనినం బాతాళలోకంబునం
దరయంజొచ్చిననీకు జీవసహితంబైబోవగా వచ్చునే
వరుసన్ రాముని మ్రోల ఘోరసమరవ్యాపారముంజూపినన్ 66

వ॥ అదియునుంగాక 67

కం॥ శ్రీకాంత సీత రామ
క్ష్మాకాంతుడు విష్ణుమూర్తి సాహాయ్యగు లౌ
నాకీశులు నాకీశులు
బ్రాకృత దేహముల దాల్చి ప్రభవించిరిలన్ 68

తే॥గీ॥ అగుట దశశీర్షయట్టి సహస్రశీర్ష
డైన రాముని మ్రోల శతాంశమైన
నీబలంబెందు కగుగాని నిష్ఠబూని
యతని సంకల్పమున నాశమగుదు వింతె 69

వ॥ అనియిట్లనేక ప్రకారంబున జెప్పిన హితంబును విహితంబునుం బవిత్రాచరణంబును క్షమకారణంబును నగుననుజుని భాషణంబులు గ్రహింపక రావణుండాసన్నమరణుండగు నతండౌషధంబు గ్రహింపని విధంబునం బొలిచి గాలచోదితుండై రోషంబున నవ్విభీషణు నుపలక్షించి యిట్లనియె 70

- రావణుండు విభీషణుని పరాభవించుట -

ఉ॥ ఏనిడుభాగ్య సంగతి★ మహిన్ మెయి బెంచిమదీయ సన్నిధిన్
దాను వసించియున్ హితవిధాయికినాకహితంబొనర్పగా
బూనెడు మిత్రభావమున బుట్టిన శత్రుడు నాకునిక్క మి
ద్దానవుడంచు రావణుడు తమ్మునియందు దలంచి వెండియన్ 71

కం॥ జలబిందువులరవిందపు
దళబృందము నందు జెంది తత్సంబంధం
బిలనొందని పొలు పొందును
నలువందగ నార్యసంగమట్టిదకాదే! 72

తే॥గీ॥ అగుటను కృతఘ్ను చర్యుడనార్యుడైన
నతనిసంగతి దనకునిందితముగాదె!
జ్ఞాతియగు వాడు జ్ఞాతినాశంబెకోరు
ననిమదిదలంచి మరియు నయ్యనుజుగాంచి 73

ఉ॥ నీవిధిదైత్యు డొక్కరుడు నిక్కముగానొక వాక్యమిప్పుడే
నీవిధి బల్కెనేనివధియింతును వానిని నాక్షణంబునన్
గావున శత్రుపక్షమునుగైకొని బల్కెదు నీ వివేకమున్
ద్రోవగ గాల్పనే పరమదుష్టతమా! దను జాన్వయాధమా! 74

★ గడున్ - గ.ము.ప్ర. పాఠం

వ॥ అని మరియు నివ్విధంబునం గ్రోధబంధురుండై దశకంధరుండు వివిధగంబులగు పరుషభాషణంబులు బలికిన బలవంతుండగు నవ్విభీషణుండు రోషభీషణుండయ్యునుతని నేమన నెల్లకడల వారింగనుంగొని రఘుపుంగవుంగొలువనేగెదనని సెప్పియప్పుడ గదాపాణియై లేచి రావణాసురు ప్రాణపంచకంబు నీరీతింజనియెడు ననువిధంబున చతుర్మంత్రి సహితుండై సభామధ్యంబున నుండి నభోమధ్యంబున కెగసి దశాననుంగని యిట్లనియె 75

ఉ॥ ఈవిధినాశమందకుము నీవనుచున్ప్రియవాదియై హితం
బేవచియించిన న్వినక నీగతిరోషముచే దురుక్తము
ల్భోవగనంటి వగ్రజుడవుంబితృతుల్యుడవు న్ప్రభుండవుం
గావున నిన్ను నేమియనగాదు సుమా! యసురాన్వయోత్తమా! 76

ఉ॥ కాలుడురామరూపమునుగైకొని పంక్తిరథాలయంబున
న్మేలిమిగల్గి కాళియగు మృత్యువునుంజన కాలయంబునం
దోలిని సీతగాగలిగియుండి నినుంహరియించపనుండగా
నేలహితంబు నిందు విధికృత్యము లేరికి దాటవచ్చునే! 77

కం॥ ఆ రామలక్ష్మణులు భూ
భారాహరణార్థముగను బరగిన వారల్
వారే బ్రేరేపింపగ
నేరీతివినంగ నేర్తు వితనాహితమున్ 78

సీ॥ భూత స్వరూపంబు బొరయననిర్వాచ్య
మగువేళనెవ్వడేకాప్తిదోచు
ప్రకృతితో మహదాది వికృతులెవ్వని సూక్ష్మ
సంకల్పలవమున సంఘటించు
నచరంబుసచరంబునగునంతలోవెలి
గలిగియు నెవ్వడ గ్రాహ్యుడగును
వ్యక్తకందమునవ్యక్త తత్త్వము బ్రాక
నవలనెవ్వాడు దనంత వెలయు

తే.గీ॥ నట్టినిర్వేద్యుడాద్యు డనాద్యుడమృతు
డమలుడవిభేద్యుడభవు డవ్యయుడనంతు
డనిత రానంద వర్తియాత్మైకమూర్తి
యవని శ్రీరామ చంద్రుడై యవతరించె 79

వ॥ కావున పరబ్రహ్మమూర్తియగు శ్రీరామదేవుండు ప్రకృతికంటె సాక్షాత్పరుండై యపుడుందనంత బ్రకాశింపుచుండునైనను నానా విధవృక్షాంతర్గతంబగు ననలంబేకరూపంబైయుండియు తత్తదాకృతి విశేషంబులననేక భేదంబులందోచు విధంబున నన్విభుండు సకలభూత బాహ్యాభ్యంతరంబు లందంతట సమంబుగా నేకస్వరూప కుండైయండియు తత్తదాకృతి నామరూపాది భేదంబుల తత్తన్మయుం డగు విధంబునందోచుచుండు వెండియు నీలపీతాదివర్ణ యోగం బున నిర్మలంబగు స్ఫటికంబున నయ్యో వికారంబుల నెసంగు సంగతి పంచకోశవ్యతిరిక్తుండయ్యును నతండు దేహమనః ప్రాణాది పంచకోశాది భేదంబుల దత్తద్రూపుండునుంబోలె బ్రవర్తించునని మరియును. 80

సీ॥ అవ్విభుండొకరుండ యయ్యునుయాత్మ మా
యాగుణబింబితుడగుట జేసి
బురుషుండును బ్రధానమును కాలమవ్యక్తు
డనగచతుర్విధం బగుచునుండు
నవ్యక్తుడగునజుండల పురుష ప్రధా
నావృతులను జగంబంత జేయు
అవ్యయుండతడు కాలాకృతిచే జగ
త్కల్ప ప్రచారంబు గలుగ జేయు

తే.గీ॥ నగుట భగవంతుడైన కాలాత్ముడతడు
నజుడు బ్రార్థింపనాత్మమాయానుగతిని
నేపునజనించె నిలరామ రూపమునను
నీవధార్థంబు మదిగోరి నిర్జరారి! 81

వ॥ కావున 82

మ॥ తనసంకల్పమునారఘూత్తముడు వ్యర్థంబేలగావించు దా
ననిలోనన్నిను బుత్రపౌత్ర గురుగోత్రామాత్యభృత్యాప్త వా
హన సంబంధయుతంబుగాగొని వధవ్యాపారముంజేయుచో
గనజాలన్నిను నీకులంబఖిలముంగ్రవ్యాద వంశాధిపా! 83

కం॥ కానన్ నేనిదె రాముని
గానంబోయెదను చిరముగా నటుమీదం
దోనన్ స్వస్థుడవగుచున్
దానం సుఖమందు జగతి దైతేయ పతీ! 84

చం॥ అనియిటు బల్కి దైత్యవిభుడన్నదురుక్తి వినంగనోడి చ
య్యన సపరిచ్ఛదంబగు గృహంబఖిలంబును వీడి యాక్షణం
బుననె విభీషణుండు రఘుపుంగవు పాదసరోజ సేవనా
జనిత మనోరథంబున వెసన్ జనియెన్ పరిపూర్ణభావుడై 85

వ॥ అంత నవ్విధంబున విభీషణుండు మహాభాగులగు నలుగురు మంత్రులతోడంగూడ నంబర మార్గంబున వచ్చి రాముసమ్ముఖం బున నిల్చియుచ్చై స్వరంబుననిట్లనియె 86

- విభీషణుండు రాముని శరణుజొచ్చుట -

సీ॥ రాజీవవలోచన! రామ! యోదేవ! మీ
దారాపహరుడగు దశశిరునకు
ననుజుండను విభీషణాఖ్యుండ భ్రాతచే
వెడలంగనడవగా బడియు మిమ్ము
శరణంబు వేడనే సనుదెంచినాడనో
స్వామిమూర్ఖుడగు రావణుని తోడ
రామునకిమ్ము సీతామహాదేవిన
టంచునేనునుహితం బాచరింప

తే.గీ॥ వేవిధంబుల జెప్పిన వినకనతడు
కాలపాశవశస్థితి గదిసి మరియు
నపుడు ఖడ్గము బూని దైత్యాధముండు
వడినను వధింప దెంపున వచ్చుటయును 87

కం॥ అంతట నలుగురు మంత్రులు
నెంతయు నేరాగ వేగనేభయపడిమి
మ్మంతట భవభయముడుపగ
సంతత మోక్షేచ్ఛవచ్చి శరణంబంటిన్ 88

కం॥ అనిన విభీషణు వచనము
విని సుగ్రీవుండు రామ విభునింగనియి
ట్లనియెను మాయావిధులై
దనరుట దనుజులను నమ్మదగదిట మనకున్ 89

వ॥ దేవా! యదియునుంగాక విశేషించి యద్దనుజుండు సీతాపహరుం డగు రావణుననుజుండును బలవంతుండును నై యాయుధవంతు లగు మంత్రులంగూడియుండుటం జేసియొక్కొక్క సమయ వివరంబు లెరింగి మనల హరింపందలంతు రగుట నాకాజ్ఞాపింపుము వానరతతుల చేత

నిహతునింజేసెదనిదినాకు దోచిన విధం బీమీద దివ్యచిత్తంబున కెద్ది నిశ్చితంబగు నానతిండనిన
సుగ్రీవునివాక్యంబు విని రఘుకులాగ్రణి సస్మితాననుండై యిట్లనియె 90

కం॥ నెట్టన నేమది దలచిన
గట్టిగ నధిపతులతో జగంబులనెల్లన్
బుట్టించెద మెట్టించెద
గిట్టించెద నిమిషముననె గీశకులేశా! 91

కం॥ కావున నభయంబిచ్చితి
నేవినుశరణాగతునకు నినసుత పొమ్మా!
నీవువిభీషణుడేనియు
రావణుడేనియును నిటకురయమున దెమ్మా! 92

వ॥ అదియునుంగాక నింకనొక్క విశేషంబు గలదు వినుము 93

తే॥గీ॥ భక్తినొకపరియేని బ్రపన్నుడగుచు
జేరినీవాడననుచు యాచించువాని
కఖిల భూతాళి వలననేనభయ మిత్తు
నిదిమదీయ వ్రతంబగు నినతనూజ! 94

కం॥ అనినన్ రాముని వచనం
బును విని రవితనయుడపుడు ముదిత హృదయుడై
చనికొనివచ్చి విభీషణు
గనుగొన గావించెరాము కరుణారామున్ 95

వ॥ అంత 96

చం॥ కనియె విభీషణుండు రఘుకాంతుని శాంతుని సత్యవంతునిన్
వనజవిశాలనేత్రు సురవంద్య చరిత్రు బ్రసన్నవక్త్రునిన్
వనచరకోటి సేవితు నవార్యబలాంచితు లక్ష్మణాన్వితున్
ఘనసుమధాము బూర్ణతరకాముని రాముగుణాభిరామునిన్ 97

వ॥ మరియును శరశరాసన హస్తుండును శుభలక్షణప్రశస్తుండును శరణాగతజనత్రాణ పరుండును తనుత్రాణ భరుండును జటామకు టాలంకారుండును దాపసాకారుండను కరుణారస బంధురుండును మందహాస సుందరుండును సుగ్రీవాదిపరిజనతోషణుండును నగు రఘువంశ భూషణుంగాంచి సాష్టాంగదండ ప్రణామంబాచరించి విభీషణుండును హర్షగద్గద భాషణుండును నత్యంత భక్తి సమన్వితుండును నిటల ఘటితాంజలి కలితుండునునై సంస్తుతించుట కుపక్రమించి యిట్లనియె 98

- దండకము -

(ప్రగ్విణీవృత్త, భుజంగప్రయాత గర్భితము)

శ్రీరామచంద్రా! మహారాజ చంద్రా! మహీజామనోజ్ఞా! ధనుస్సాహ సజ్ఞా! నమత్ప్రేమకారీ! యశశ్రీవిహారీ! సుశాంతా! మహాకాంతి కాంతా! యనంతా! హరీ! దేవ! సుగ్రీవ మిత్రా! రఘూత్తంస! లోకత్ర యాభర్తవై, యాద్య లీలా గృహస్థుండవై, జన్మ కర్మాదికిన్ హేతు భూతుండవౌ, నీకిదేమ్రొక్కెదన్, నీగుణశ్రేణికిన్ సొక్కెదన్, నీవెమూర్తి త్రయస్ఫూర్తి కాలత్రయావృత్తిచే నీజగంబుంజనింపన్నశింపన్వెస న్జేయుచున్ స్వేచ్ఛచేతన్వెలుంగొందువౌ, జంగమస్థావరోద్భూత మౌపంచ భూతప్రపంచం బునందంత బాహ్యాంతర వ్యాప్తినే కాత్మవయ్యున్మరిన్నామ రూపాది భేదంబులన్ దన్మయత్వంబునం బోల్తువోరామ! నీమాయ చేతన్ హృతజ్ఞానులౌబుద్ధిహీనుల్ గదాపాపపుణ్యాతి రేకంబులం వీక లోకంబులం రాకలం బోకలన్ వ్యాకు లాప్తిన్ ప్రవర్తింతురెందాకనేకాగ్రచిత్తంబునన్ మీస్వరూపైక విజ్ఞానముంగల్గి రాడంతలో నిర్మలవ్యక్తికన్వెండియున్వెండియుం బాటియౌ త్రాటియం దేర్పడం సర్పముందోచినట్లెచ్చి యీలోక కృత్యంబు సత్యంబుగా దోచు నీయందు నెందున్ననుం జెందు సంజ్ఞానమున్ లేని యజ్ఞానులెల్లన్ సదాపుత్ర దారాది సంసార సంసక్తులై దుష్క్రియారక్తులైయుండి వ్యర్థంబులౌనింద్రియార్థంబులం దేలియున్ సోలి యంతంబునన్ దుఃఖవంతంబులౌ పొంతలం బోదురౌ ★గాననేనిన్నిటన్ని న్ను నేసుప్రసన్నుండు గాగన్న పుణ్యుండె ధన్యుండగున్ రాఘవా! నీవెయయ్యాది నారాణాఖ్యుండవున్ వాసుదేవాది భేదప్రకారుండవున్ దివ్యలీలాద్యనంతావతారుండవున్ నీవదింగాక నింద్రాగ్ని ధర్మాసురాధీశులన్ పాశభృద్వాయు విత్తేశ భూతేశులున్నీవనీకన్న వేరున్న దేయెన్నిటన్నీట కుంభంబులందోచు బింబంబు లెన్నైన నంభోజ బంధుండొకండేకదా యోఖరారాతి! నీచేత నౌనీజగద్భూతికిన్ దాతవు న్మాతవుంద్రాతవున్ ధాతవున్నీవ భావింపగా గొంచమందున్మరింగొంచమై గొప్పయందు న్మరిన్గొప్పయై యాది మధ్యాంత నిర్ధారణాగణ్యమై సర్వ సంపూర్ణమైయచ్యుతం బవ్యయంబైన నీదొపరాత్మ స్వరూపంబునన్ పాణిపాదంబులున్ శ్రోత్రనేత్రాదికం బేమియున్ లేకయున్ దాతవై యూతవై శ్రోతవై ద్రష్టవై స్రష్టవై నిష్ఠదీపింతు వెంతేనరశ్రేష్ఠ యీపంచకోశాతి రిక్తంబు నవ్యక్తమున్నిర్వికారంబ నాధారమున్ నిర్వికల్పంబనల్పంబు నున్నుర్వి భాసంబనీశంబు షడ్భావ వైకారి కోపాధి దూరంబు మాయా పరంబై యనాద్యంబునౌతత్త్వరూపంబు నీవయ్యుమాయా గృహీతా కృతిన్ మర్త్యమూర్తిన్విడం బింతువౌ, నిన్నజున్నిర్గుణున్ ధ్యానమార్గంబునం గాంచి యాసత్వ వర్తిష్ణులౌ వైష్ణవుల్ మోక్షముం గాంతురౌ నీవు పూర్వంబునం జేప వైసర్వతో వ్యాప్తివైయాపయో రాశిలోనాసురున్రవ్చి వేదంబులం దెచ్చి యాధాత నీడేర్పవే! మేటితామేటివై దేవతాకోటికిన్నిర్జరాహేతు సంపన్న మౌనన్నమున్ గూర్పవే! ధాత్రినింబోత్రివైయిమ్ముగా కొమ్మునన్జేర్పవే! వామనుండౌచు లోకత్రయిన్నిండవే! జండవే!

★ నేనిన్నిటన్ని బ్రసన్నుండు - గ.ము.ప్ర. పాఠం

చండరాజన్య వర్గంబులన్ భార్గవ శ్లాఘచే నేడు నీరాఘువారూఢి దుర్వృత్తదైత్యావళిం ద్రుంపనిం పొందవే! ముందటన్ రామకృష్ణా కృతుల్ బూని భూ భారమున్ ద్రోపవే! ద్రైపురస్త్రీలశీలంబు బుద్ధస్వరూపంబునంగల్గివై మెల్కువన్ దుష్టులన్ ముష్టిపోదట్టవే! యిట్టియీ నిన్ను వర్ణింప నెవ్వారి కైనందరంబా ధరంబాప చిత్తుండ మత్తుండనైనన్ గృపన్నాకు నీరూపమున్ జూపవే! ఘోరసంసార వారాశికిం దెప్పవై తోపవే! సాధన శ్రేణిచే దివ్యవిజ్ఞాన యోగాఖ్య సౌఖ్యప్రబోధంబు నౌముక్తి సౌధంబునందెక్కగా జక్కగానేనెదన్ గోరెదన్ నన్నికన్ గావవే! దేవదేవా! యహో జానకీశా! దయా శ్రీనివేశాయ! హేరావణారీ! జయశ్రీ విహారీ! మహేశస్వరూపా! సమస్తాత్మదీపా! మహాత్మన్నమస్తే నమస్తే నమస్తే నమః 99

దండకాది గర్భితమైన స్రగ్విణీవృత్తము -

రామచంద్రా! మహారాజచంద్రా! మహీ
జామనోజ్ఞా! ధనుస్సాహసజ్ఞా! నమ
స్త్రైమకారీ! యశ శ్రీవిహారీ! సుశాం
తామహాకాంతి కాంతా! యనంతా! హరీ! 100

దండకాంతగర్భితమైన భుజంగప్రయాతము -

అహోజానకీశా! దయా శ్రీనివేశా!
యహోరావణారీ! జయ శ్రీవిహారీ!
మహీశస్వరూపా! సమస్తాత్మదీపా!
మహాత్మ న్నమస్తే నమస్తే నమస్తే 101

వ॥ అనియిట్లు వినుతించిన భక్తవత్సలుండగు రఘువరుండు బ్రసన్నుండై యేను వరదుండనైతి వరంబొసంగెద నీకెద్ది వాంఛితంబగు ననిన విభీషణుండిట్లనియె 102

సీ॥ దేవ! మీ పాదపద్మావలోకముననే
ధన్యుండనుగృతార్థతముడ నగుచు
నేవిముక్తుడనైతి నిస్సంశయంబుగా
శుద్ధిచేతను పుణ్యసిద్ధిచేత
నాకుదుల్యుడొకండు లోకంబుననులేడు
నీమూర్తి దర్శననిష్ఠ కలిమి
భవబంధ హరణంబు భక్తిలక్షణమును
నైన నీధ్యానవిజ్ఞాన పదవి

తే.గీ॥ నీయవే! నాకు నేనింకనితరమైన
విషయ సంభవసుఖమెల్ల వేడనొల్ల
గాననీపద భక్తియే గలుగు గాత!
యనిశమును నాకు రఘురామ! యఘవిరామ! 103

చం॥ అనిననునట్లకాకని బ్రియంబున రాముడనుగ్రహించియి
ట్లను మరియున్ శుభంబును రహస్యమునున్ విను తెల్పెదన్ నిజం
బొనరగ వీతరాగులును యోగులు శాంతులు నాదుభక్తులౌ
జనుల మనంబులన్నిలుతు జానకితోనెపుడే విభీషణా! 104

కం॥ కావున నెంతయు శాంతుడ
వీవనఘుడ వౌట భక్తినెప్పుడు మమ్మున్
భావించి భవాబ్ధి గడచి
జీవన్ముక్తత వసించు చిరమసురవరా! 105

వ॥ అని మరియును 106

కం॥ ఈస్తవమునాకు బ్రియమగు
వస్తువు వినునెవ్వడేని వ్రాయుబఠించున్
బ్రస్తుతము సమర్థముగ బ్ర
శస్తత నతడొందు నాదు సారూప్యంబున్ 107

ఉత్సాహ॥

అనుచు బలికి భక్తసులభుడైన రాముడనియెన
య్యనుజుతోడ నాదుదర్శనాప్తి కిప్పుడేఫలం
బనుభవించుగాత రావణానుజుండు లంకకున్
దనరపట్టమేను గట్టెదన్ జలంబు దెమ్మికన్ 108

మత్తకోకిల॥

ఎంతగాలము చంద్రసూర్య మహీగ్రహోదులు నుందురౌ
నెంతగాలము మచ్చరిత్రము నిజ్జగంబుననుండునౌ
నెంతగాలము నవ్విభీషణుడాయత స్థితి లంకలో
నెంతయే వసియించి రాజ్యము నేలుగాతమదుక్తిచేన్ 109

వ॥ అని నిర్ణయించి రమావిభుండగు రఘువల్లభుండాక్షణంబునలక్ష్మణుని చేత జలనిధి జలంబు కలశంబు చేత దెప్పించి రవిపుత్రాదులగు నమాత్యులచేతను మరియు సౌమిత్రి చేతనుంగూడ లంకారాజ్య సామ్రాజ్య పట్టంబునకున్‌గా విశేషించివిభీషణునభిషిక్తుం గావించినంగాంచి సకల హరిబలంబులు సామోదంబులగు సాధు వాదంబుల నారామదేవునతి శయించి బ్రశంసించిరంత భాను సూనుండవ్విభీషణుంగౌగిలించుకొని యతనితో పరమాత్ముండగు రఘునందనునకు మనమందరముం దాసులమగుదు మందు నీయందు భక్తి పరత్వంబున రఘువరునాదరాధిక్యంబున నీవు సఖుండవగుటం జేసి బ్రశస్తంబుగా దశానన వినాశంబునకు సాహాయ్యం బొనర్పనర్హుండవనినవిని వినయంబున విభీషణుం డిట్లనియె 110

తే॥గీ॥ నిఖిల జగదీశుడగురామ నృపునితోడ
నేను సాహాయ్యమొనరింపనెంతవాడ
శక్తితో భక్తితోడ మీ జాడగూడ
దాస్యమొనరింతు కొంత యతండు జూడ 111

వ॥ అనియెనంత లంకాపురంబున నచ్చటి వృత్తాంతంబంతయువిని దశకంధరుండు రవినందను కడకు సందేశార్థంబుగా శుకుండను నొక మహాసురుండగు చారునింబంచిన నతండువచ్చియంతరిక్షం బున నిల్చి సుగ్రీవునితో నొక్కవాక్యంబిట్లనియె 112

– రావణుండు శుకుండను దూతనుబంపుట –

సీ॥ రాక్షసరాజగు రావణుండిన పుత్ర
భ్రాతవౌ నీతోడ బలికెనిట్లు
హరిరాజవీవు మహాకుల సంప్రసూ
తుడవునాకును భ్రాతృతుల్యుడవును
నృపపుత్రకుని భార్యనేదెచ్చుటకు నీక
నర్థ కార్యంబేమియైన లేదు
కపులతో కిష్కింధ కడకేగు మీలంక
దివిజులకైన సాధింపబోల

తే.గీ॥ దగుటనీయల్ప సారులౌ హరులునరులు
నైననేమౌదురన గోపమూని వాని
వచనమునువిని గపులేచి వడినివేచి
యడచిరట బట్టి దృఢముష్టి హతినినతని 113

ఉ॥ వానరులీగతింబొడువ వాడును రామునితోడ బల్కునో
దీనశరణ్య! దూతల వధింపగరాదటుగాన వీరలన్
మానుపుమంచు నాశుకుడు మాటికిదీనతరోక్తి వేడినన్
మానవభర్త వానరుల మానిచె వాని వధింపకుండగన్ 114

వ॥ అంత నంతరిక్షంబున కెగసి శుకుండు వెండియు సుగ్రీవునింగని దశగ్రీవునితో నేమిజెప్పుదున్
జెప్పుమేనునుం జనియెద ననిన వానితో వానరవరుండిట్లనియె 115

ఉ॥ రావణ! రాక్షసాధమ! దురాత్మక! నాకును భ్రాతవాలి య
ట్లావిధినీవు వధ్యుడవుయత్నముచే సకులంబుగా నిజం
బావల నారఘూత్తముని యంగన దెచ్చితినింకనెచ్చటన్
బోవగవచ్చు నీకనుచుబూని దశాస్యునితోడ జెప్పుమా! 116

కం॥ అనునెడ రఘువరు ననుమతి
కనుకనివనచరులు శుకుని గమనోత్సుకునిన్
జనకుండన్ బంధించిరి
యనయంబిట వచ్చి పొంచులరయు నటంచున్ 117

శా॥ ఆలోగీశ బలంబునెల్లగనగా నచ్చోటికిన్ వచ్చి **శా**
ర్దూలాఖ్యుండసురుండు జూచి చనిదోడ్తో తద్విధంబెల్ల స
ద్యోలక్ష్యస్థితిగా వచింపగ దశాస్యుండింటి లోనొంటిగా
నాలోచింపుచు విశ్వసింపుచును చింతావాప్తి నుండెన్వెసన్ 118

ఉ॥ అంతట నిచ్చటన్ రఘుకులాధిపుడంబుధిగాంచి గ్రోధర
క్తాంత విలోచనుండగుచు నక్కట లక్ష్మణ! చూడు మాసర
స్వంతు నిజాంతికంబునకు వచ్చిననన్నిట చేరవచ్చియ
త్యంతము సంతసింపడు దురాత్ముడు వీనినడంతు నెంతయున్ 119

– రాముడు సముద్రుని మీద బ్రహ్మాస్త్రము వేయుట –

కం॥ నరుడితడు వానరులచే
నరయగ నన్నేమి సేయుననియుండెడునీ
శరనిధినింక గలంతున్
శరమింక నగస్త్యలబ్ధ శరశిఖి శిఖలన్ 120

తే॥గీ॥ జలధియెన్నిట మార్గమీజాలడేని
నతని నిప్పుడ యప్రతిహత మహోగ్ర
నిశితకార్ముక నిర్ముక్త విశిఖశిఖల
హుతవహుని దాహశాంతి కాహుతి యొనర్తు 121

వ॥ అని మరియును 122

కం॥ పాధోనిధిలో లక్ష్మణ
పాధోరసమింక జేసి పాదంబులని
ర్బాధంబుగ నవ్వనచర
యూధంబు న్నడపజేతు నురుభుజకంటే! 123

వ॥ అనియివ్విధంబున గ్రోధతామ్రాక్షుండై రఘుకులాధ్వక్షుండు చాపాటోపం బొనర్చి తూణంబునం బ్రళయాగ్నినిభ ప్రభా ధురీణం బగు బాణంబునుం దిగిచి యనుసంధించిగుణాకర్షణంబొనర్చి యిట్లనియె. 124

కం॥ భూతవ్రాతము జూచును
గాతన్ రామశరశౌర్య గర్వమునిపుడే
యీతోయనిధిని భస్మీ
భూతము జేతునని రామ భూవిభుడనియె 125

మ॥ అని యీరీతి రఘూద్వహుండనినచో నభ్రంబు విభ్రాంతతన్
బెనిచెన్ శైలవనాళితో ధరణి గంపించెన్ దమం బాక్రమిం
చెను దిగ్భిత్తులనక్రకర్కట తిమిశ్రేణుల్భయం బందగ్ర
క్కున వేలాద్ధిదయోజనాంబువయి సంక్షోభించె నంభోధియున్ 126

తే॥గీ॥ ప్రళయమొదవకమున్నెయీ రాఘవేశు
పృథుతమ శ్శక్తి జలభూతమింక దలచె
నింకదలచునె నన్నింట నిట్టులనుచు
చిత్ర సంహృతికిపుడు విచిత్రమయ్యె 127

వ॥ ఇట్లు రోషరక్తాంత నేత్రుండై దశరథ పుత్రుండున్నయెడ భయోన్నిద్రుండై సముద్రుండు దివ్యరూపధరుండును దివ్యాభరణ సంపన్నుండును నగుచు నిజప్రభావిభాగంబున దిశాభాగంబు వెలుంగజేయుచు నావిర్భవించి వచ్చియచ్చట 128

సీ॥ సంపూర్ణ కరుణారసంబు గల్గినవాని
దరహాస హిమకరాదరమువాని
భుజకల్పశాఖికాభ్యుదయంబు గలవాని
కాంతి తరంగ సంఘముల వాని
వరధైర్య పర్వతావాసాంతరమువాని
శౌర్యబాడబ సమాశ్రయమువాని
వనచరవాహినీ వ్యాప్తి వర్తిలువాని
శరధర్మ విభ్రమస్ఫురణవాని

తే.గీ॥ విత్తగాంభీర్య సంపద వెలయువాని
నాప్త సౌమిత్రి వేలచేనలరువాని
రామభద్రు సుభోన్నిద్రు రమ్యగుణస
ముద్రునీక్షించె భక్తి సముద్రుడపుడు 129

వ॥ ఇట్లురఘువరుంగాంచి రత్నాకరుండు దండప్రణామంబాచరించి నిజాంతస్థితంబులగు దివ్యరత్నంబులు పాణిద్వయంబునం గ్రహించి తత్పాదసన్నిధి నుపాయనంబు గావించి యిట్లు స్తుతియించె 130

ఉ॥ నేనిదెమ్మొక్కెద న్పరమనిష్ఠమనంబున సుందసుందరీ
దానికి నాశ్రితేష్ఠ పలదానికి దానవవంశ పద్మినీ
దానికి తాపసప్రియ విధానికి నిర్మల భక్తి జానకీ
జానికి రాజమౌనికిని సాధుజనావనతాభిమానికిన్ 131

కం॥ ఈక్షోణినవతరించిన
సాక్షాన్నారయణుడవు జగదీశ ననుం
రక్షింపుము రక్షింపుము
రక్షింపుము సకలలోక రక్షక! రామా! 132

మత్తకోకిల॥ విశ్వకర్తవు విశ్వభర్తవు విశ్వహర్తవు నయ్యును
న్విశ్వసాక్షివి విశ్వకుక్షివి విశ్వచక్షుడవైనని
న్నీశ్వరేశ్వర! నేమదిన్ ధరణీశ రూపుడవంచునే
శాశ్వతంబగు మూలమున్గన జాలనైతి శమింపవే! 133

వ॥ అదియునుగాక 134

తే॥గీ॥ నిఖిలజగము సృజించెడి నీదువలన
జడుడగానేను సృజియింపబడితి గాన
జనన మాదిజనించిన సహజగుణము
వేరుగా జేయనగునె నెవ్వారికైన 135

ఉ॥ స్థూలము లేనుభూతములు జూడ జడంబులుగాగ నీదుచే
నోలిసృజింపనౌట నవియున్ భవదాజ్ఞనుదాట నేర్చునే
బోలగతామసాహమున బుట్టుట భూతములెల్ల వీనికిన్
గ్రాలుచు కారణానుగతి గల్గదె తామసముంజడత్వమున్ 136

వ॥ కావునదేవా! నీవు నిర్గుణుండవు నిరాకారుండవయ్యును నెయ్యెడ లీలామాత్రంబుగా మాయాగుణంబుల నంగీకరింతువపుడు గదా వైరాజ నామకుండనంబరగుదు వట్టిగుణాత్మకుండగు విరాజుని సత్వగుణంబు వలన దేవతలును రజోగుణంబువలన ప్రజాధీశులును తమోగుణంబువలన భూతంబులును భూతపతియునుం గలిగెం గావున 137

ఆ॥వె॥ భూతపంచకమున బొలుచుతద్గుణ వృత్తి
సహజసిద్ధమగుట సలిలమయత
గనిననాకునియ్యగాధతావృత్తిని
జడతయును స్వభావజములుగావె 138

కం॥ వినుఁ! మాయావృతిలీలా
మనుజాకృతివైనవాని మనుజేశ్వరనే
గననేర్తునె నిర్గుణనిను
మునునే జడమతిని జడుడ మూర్ఖుడనగుటన్ 139

కం॥ కావున దండము జడులకు
కేవల సన్మార్గ వృత్తికిన్మూలమగున్
దేవాధిపపశువులకున్
దావలమగు గుణముదెచ్చు దండము బోలెన్ 140

కం॥ శరణము వేడెదమిమ్మా
దరణంబున భక్తి శరణ దాయివిసుమ్మా!
హరినాకభయంబిమ్మా!
యిరవుగ లంకకును మార్గమిచ్చెద కొమ్మా! 141

వ॥ అనిన ప్రసన్నుండై రఘువరుండు దనకరంబునందున్న శరంబు సాగరంబునకుంజూపి యిట్లనియె 142

కం॥ ఈశరమమోఘతరమగు
నోశరధీ! దీనివ్రేయ నురులక్ష్యంబౌ
దేశంబు సెప్పుమయ్యెడ
నాశుగతిన్ వ్రేయవలయునని విభుడనినన్ 143

వ॥ అనినరాముని వచనంబువిని యమ్మహాశరంబును మహాప్రభావ నిధియగు నంబోనిధి యవ్విభునితో రఘూత్తమా! యుత్తర ప్రదేశంబున ద్రుమకల్పంబును నొక్కదేశంబు గలదందు పాపాత్ములగు పులిందు లనేకులుండి నిరంతరంబును నన్ను బాధింతురగుట నాస్థలంబున నిమ్మహాస్త్రంబు ప్రయోగింపుమనిన నవ్వీరుండట్లసేసిన నాక్షణంబున నందుండు నాభీర నిషాదమండలంబు నెల్లం దహించివెండియుం బూర్వ ప్రకారంబున నబ్బాణంబు తూణంబునం బ్రవేశించినంత వినయోన్నిద్రుండైన సముద్రుండు రామభద్రునకుం దద్బలంబున నలుండను కపిసత్తముంజూపి యతండు విశ్వకర్మ పుత్రుండీ కార్యంబున సమర్థుండని చెప్పివెండియు నిట్లనియె. 144

సీ॥ ఒకడబాల్యమునకందుక మాడనీతండు
వడినది మద్వారి బడిమునుంగ
తండ్రినిమ్మన్న నా తండు దెచ్చిన దాని
తిరిగి యచ్చటవైవ దెచ్చి తెచ్చి
కడనవేసరి విశ్వకర్మయీ నలుడేమి
వైచిన నదియెల్ల వార్ధిదేలు
ననివచియించెగావున నీతడు గిరిద్రు
మాదులువైవ నేనవియునెల్ల

తే.గీ॥ తగధరించెద నాయందు దాననితడు
సేతువొనరించుగాత నీ చిరయశంబు
కలుషహరముగ జగముల వెలయుగాత!
యనుచు రఘువర్యునకు మ్రొక్కి వనధిసనియె 145

- నలుండు సేతువును గట్టుట -

ఉ॥ అంతటలక్ష్మణార్కజ సమన్వితుడై యటరాఘవక్షమా
కాంతుడు వేగమన్నలుని గన్గొని కంథిని సేతుబంధనం
బెంతయు సేయుమన్నను గిరీంద్రసమాన హరీంద్రకోటితో
సంతసమందియన్నలుడు సమ్మతి తద్రచనాభివేశతన్ 146

చ॥ అతులబలప్రభావ గరుడానిల వేగముతోడ నేగిది
క్తతులు జలింపగా గుములుగట్టి వెసంగొని తెచ్చి కీశసం
తతులు మహాద్రిపాదపవితానము లీయ నలుండు నూర్జిత
స్థితినొనరింపబూనెనట సేతువునున్ శత యోజనాప్తిగన్ 147

తే॥గీ॥ ఇకదశాస్యుడు దెగువృద్ధి నెనయనింద్రు
డతడు తముబాధ గావించు ననుభయమున
వనధిడాగగ నేగెనో యనువిధంబు
దెలిపెనగకోటి వానరుల్ జలధివైవ 148

వ॥ అప్పుడు 149

తే॥గీ॥ సేతుబంధన మారీతి సేయబూని
యందు రామేశ్వరుని పాపహరుని హరుని
శివు బ్రతిష్ఠించి పూజించి భువన హితము
గాగనిట్లని పలికె రాఘవ విభుండు 150

సీ॥ ఈసేతుబంధంబు నీక్షించి భక్తిరా
మేశ్వరు భజియించు నెవ్వడతడు
బ్రహ్మహత్యాది పాపముల వల్లవిముక్తు
డైతగు మదనుగ్రహంబువలన

నదిగాకసేతువునందు సుస్నాతుడై
యచట రామేశ్వరు హరుభజించి
కాశీపురికి వచ్చి గంగాంబువులు దెచ్చి
తిరిగిరామేశ్వరు దేవునకును

తే.గీ॥ నాజలంబుల నభిషేకమాచరించి
వనథియందు తద్భారంబు వైచునట్టి
యతడు నిస్సంశయంబుగాయమృతపదము
నందుననుచును శ్రీరాముడాన తిచ్చె 151

వ॥ తదనంతరంబ 152

మ॥ మొదలీరీతిని సేతుబంధనము నంభోరాశి గావింపుచున్
బదినాలిర్వది నిర్వదొక్కటియు నాపైనిర్వదింరెండు ని
ర్వదిమూడుందగు యోజనంబులు దినవ్యాప్తిన్ గ్రమస్ఫూర్తి పం
చదినంబుల్ రచియించి నన్నలుడు గీశశ్రేష్ఠుడత్యంతమున్ 153

వ॥ ఇవ్విధంబున 154

కం॥ దశయోజనముల వెడలుపు
దశదశ యోజనములాయతముగా నలుచే
దశరథుడూన్చెన్ సేతువు
దశశత ఫణభోగిభోగ తౌల్యము మెరయన్ 155

వ॥ ఇట్లు శతయోజనాతయంబుగా నలుండు రఘువీరయశః కేతువగు సేతువుంగావించి నసంఖ్యాతం బగునవ్వానర వాహినీ వ్రాతంబు నమ్మార్గంబున ననర్గళంబుగా నంభోరాశింగడచి యవ్వలసువేలం బున మహాశైలంబున విడిసెనయ్యెడ రామలక్ష్మణులు మరుత్సుతాం గదుల నధిరోహించి వచ్చి యచ్చట లంకాదర్శనేచ్ఛం జేసి విశాలం బగు తత్సువేలాచలంబు నారోహించి యప్పుడు 156

శా॥ వీక్షించెన్ రఘుభర్త చిత్ర పరిఘా విస్తీర్ణ సౌవర్ణ వ
ద్రక్షో రక్షిత సాలతోరణచయ ప్రాసాద సౌధావళీ
నిక్షిప్త ధ్వజ సంక్రమవ్రజ శతఘ్నీలక్ష్యయోధచ్ఛటా
కౌక్షేయ ప్రతిభావిటంకనటలంకన్ భీకరాంకన్ వెసన్ 157

శా॥ ఆలంకాపురియందు నుత్తర పురద్వారాగ్ర సౌధంబునం
దాలోమంత్రి సమేతుడున్ దశకిరీటాంచ ద్విభాన్వీతుడున్
గాలాంభోదనిభుండు నీలగిరి సంకాశుండునుం రత్న దం
డాళివ్యాప్తి శితాతపత్రనికరుండై వారణుండుండగన్ 158

వ॥ ఆయ్యవసరంబున 159

ఉ॥ ఆరయ మున్నుబద్ధుడయి యాహరి మర్ధితుడైన యాశుకుం
డారఘు వీరుచేవిడువనయ్యు వడింజనుదెంచి రావణుం
జేరిన రావణుండును హసింపుచు గన్గొని వానితోడుతన్
వైరుల చేత బాధపడి వచ్చితివోయని పల్కెపల్కినన్ 160

వ॥ అంతనాశుకుండును దశముఖుంగనుంగొని దైత్యసత్తమా! నీచేత ననుజ్ఞాతుండనై సాగరంబునుత్తర తీరంబునంగల వానరసేనా వారంబు సేరంబోయి మీరన్న యుత్తరంబులు రవిపుత్రునకు జెప్ప నయ్యవసరంబునంగీశ విసరంబులెగసిననుంబట్టి ముష్టి ఘాతంబుల ధట్టించి నఖనిఖాతంబులం దంతదంశనంబుల హింసింపందలంప నత్తరినేనును రఘుసత్తముంగని రక్షింపుమనిన యద్దయా వీక్షణుండు కటాక్షించిన వనచరులు విడిచిపుచ్చిరిట్లు హరిబలంబువలన విముక్తుండనై తత్సేనాతిశయ

విభవంబు వీక్షించి భీతిచేత నేతెంచితి నాహరి రాక్షసబలంబులకు దేవదానవబలంబులకుం బలెసంధి
నిబంధనంబనుసంధింపంబోలదగుంగావున 161

కం॥ పురసాలముజేరకమును
హరిజాలము సీతనిచ్చి యారామునెడన్
శరణము జేయుము దనుజే
శ రణముజేయు మికనొండె సత్వరమెసగన్ 162

కం॥ దైతేయనాథ! రామ ధ
రాతలపతి తనదువచన రచనముగాగన్
నీతోడుతననమనుచున్
నాతోడుతననిన భాషణంబులు వినుమీ! 163

సీ॥ ఏబలంబు సమాశ్రయించి హరించితి
వావేళజానకి నీవునిపుడు
నాబలంబును జూపుమభిమతస్థితి బంధు
హితసుత సేనాదియుతముగాగ
రేపుజూచెదవు లంకాపట్టణంబు స
ప్రాకారతోరణ పరిఘముగను
గలగించి రాక్షస బలమెల్ల మద్బాణ
విధ్వంసితముగ గావింతు నింక

తే.గీ॥ గానభీషణ రోషంబు నేనొనర్తు
దానికి సమానబలమును దాల్పుమీవు
రావణ యటంచుబల్కి రాజీవనేత్రు
డా రఘూత్తముడంతట నూరకుండె 164

ఉ॥ రాముడు లక్ష్మణుండు కపిరాజు విభీషణుడుందు రొక్కచో
వేమరునల్గురీ పురుష వీరులె లంకనశింపజేయగా
దామెసమర్థులింకను నుదగ్రతలంక బెకల్పగాల్పను
ద్దామ బలాధికుల్గలరు దానవసత్తమ! వానరోత్తముల్ 165

వ॥ అదియునుంగాక 166

కం॥ ఆరామాదుల బలమా
కారము నాయుధబలంబు గలవారలలో
నారయ మువ్వురటుండగ
నోరిమినీలంక జెరుపనొక్కడ చాలున్ 167

- శుకుండు రావణునకు వానరవీరులందెల్పుట -

మ॥ కనుమావానర! సైన్యజాతము లసంఖ్యాతంబులేదెందు జూ
చినచో నంతట నిండియుండెడు కపిశ్రేష్ఠుల్ నగాభుల్మహా
ధ్వనులుంజేసెడి వీరినెల్ల దరమే వాక్రువ్వగానైననుం
వినుమా! తెల్పెదగొంతముఖ్యులను వేర్వేరంగ దైత్యోత్తమా! 168

మ॥ కనుగొంటే! యటనుండు వానినిట లంకన్ జూచుచున్ యూథపుల్
దనుసాహస్ర శతంబులౌకపులు గొల్వంబోల్చు దుర్దాంతు నీ
సుననీసేనగలంపజాలు బలియున్ సుగ్రీవసేనాధినా
థుని నీలుండును వాని హవ్యవహపుత్రున్ దైత్యవంశోత్తమా! 169

మ॥ గిరిశృంగ ప్రతిమాంగుడున్ కమలినీకింజల్క వర్ణుండు బ
ల్మరుసంరంభ విజృంభణంబెసగ వాలస్ఫోటముంజేయునా
డరయంగా యువరాజు వాలితనయుండౌ నంగదుండుజ్వల
న్నిరవద్యక్రమ విక్రముండు గనుగొంటే! వీనిదైత్యాగ్రణీ! 170

మ॥ వనథిందాటి రఘూద్వహప్రియ సతిన్ వైదేహి నీక్షించినీ
తను జన్ముండగు నక్షుద్రుంచి బలమంతన్నాశమొందించిలం
కను వాలాగ్ని దహించి వేజనియె విఖ్యాతుండునై యెవ్వడా
ఘన గాత్రుం! బవమాన పుత్రుగనుమా! క్రవ్యాదవంశోత్తమా! 171

కం॥ శ్వేతుడు రాజితకాంతి స
మేతుడు విక్రమ కళాభ్యుపేతుడు ప్రజ్ఞా
నీతుడు వడిరవిజుని కడ
కేతెంచియు మరలిచనెడు నితడసురేంద్రా! 172

కం॥ రంభుండు సింహశౌర్యా
రంభుండు మహాబలుండు రహినీలంకా
సంభూతి హరణశక్తి వి
జృంభావిశయుండు దనుజశేఖర! కంటే! 173

కం॥ శూరుండు సేతుబంధన
కారుండీతండు విశ్వకర్మ కుమారుం
డారయుము వీని సబలుని
వైరిదవానలుని నలుని వైరివిదారీ! 174

సీ॥ దశకోటి కీశయూధవిభుండు శరభుండు
వనచర శ్రేష్ఠుండు దనుజసింహ!
సారశౌర్యస్థైర్య సంచారి కేసరి
నగచరవరుడు దానవమదేభ!
గురుమదోన్మత్తుండు కుంజరుండతి బలో
త్కరపరాక్రముడు రాక్షస శశాంక!
విమల ప్రభాశాలి కుముదహితుండు ఋ
క్షవరుండు దైతేయ చక్రనాథ!

తే.గీ॥ భీకర మహావిపక్ష విభేది వజ్ర
కుండునునితండు దైతేయ గోత్రవర్య!
యీహరీంద్రులు లంక దహించునట్లు
జూచుచున్నారు గాంచితే! సురవిరోధి! 175

వ॥ వెండియు పరాక్రమవంతులునుం బలవంతులగు పనససుషేణగజ గవయ గవాక్ష గంధ మాదన మైంద ద్వివిధ శతబలిముఖులగు వలీముఖు లనేకులుగలరీ వానరవీరుల గణింప వర్ణింప నెవ్వారు సమర్థులని చెప్పి వెండియు నిట్లనియె. 176

తే॥గీ॥ అందరును శూరులును ధీరులతి శరీరు
లందరును యుద్ధకాంక్షు లత్యంత రక్షు
లాహరులు నందరీలంక నసురవరుల
తోడ బొడిసేయుటకు సమర్థులుగణింప 177

కం॥ హరిమధ్యంబున గనుమా!
హరిమధ్యంబున వెలుంగు నారఘువీరున్
గిరిమధ్యంబున నంజన
గిరిమధ్యంబున విభాను కృతి వెలుగుగతిన్ 178

సీ॥ మౌళిశోభితజటామకుట చిహ్నమువాని
సంపూర్ణ శశినిభాస్యంబువాని
నాకర్ణదీర్ఘనేత్రాంబుజంబులవాని
జలద గంభీర నిస్వనమువాని

నాజాను దీర్ఘ బాహార్గళంబులవాని
సారవిస్ఫార వక్షంబువాని
హర్యక్ష మధ్యలక్ష్యావలగ్నమువాని
గంధేభగమన వైఖరులవాని

తే.గీ॥ చండ కోదండ కాండ దీక్షాధురీణ
కరతల కఠోర గుణ కిణాంకములవాని
నహితగర్వవిరాము శౌర్యాభి రాము
రాము నీక్షింపు రాక్షసరాజవర్య! 179

కం॥ హైమగిరిన్ దేహద్యుతి
హైమగిరిన్ ధృతిహసించు నఖిలగుణములన్
రామునిసరినియమగతిన్
రామునిసరి లక్ష్మణుండు రావణకంటే! 180

కం॥ ఆ రామలక్ష్మణుల కడ
జేరి విభీషణునితో వసించును దానున్
ధీరుని గను దనుజాగ్రణి
వీరుని సుగ్రీవు హారవృత సుగ్రీవున్ 181

వ॥ మరియు నీ సుగ్రీవాది వానరోత్తముల సైన్యంబు లగణ్యంబులైనను గొంత వేర్వేర వివరించెద నాకర్ణింపు మందునవకోటి సహస్రం బులుంబంచకోటి సహస్రంబులు నాచందంబునబ్బంద శతంబులు నగువీరాగ్రేసరులు సుగ్రీవుని సచివునిబలంబులగు నింకనుంగల వానరసేనాధిక్యంబు లెక్కింపనాకు నశక్యంబగునని పలికి వెండియు సమాహిత వివేకపాకుండగు శుకుండు దశముఖన కిట్లనియె. 182

- శుకుండు రావణునకు హితంబు దెల్పుట -

తే॥గీ॥ రాముడు నరుండుగాడునారాయణుండు
పరుడు ప్రత్యక్షముగ జగద్భర్తయైన
యతనిచిచ్ఛక్తి సీత విశ్వాత్మికయగు
వీరివలన చరాచర విశ్వమొదవె 183

మ॥ అగుటన్ రాముడు సీతయున్ సకలలోకాద్యైక కూటస్థులున్
జగదుద్భూతికి కారణాత్ములయి నిచ్చన్ బోల్తుర వ్వీరుతో
దగునేవైరము నీకు నీవెరుగకన్ దజ్ఞానకిం దెచ్చుటల్
దగవేనిక్కము లోకమాతయగు సీతాదేవి దేవాహితా! 184

సీ॥ క్షణనాశకంబగు సంసారమిందులో
పంచవింశతి తత్త్వభావితంబు
పాంచభౌతికమునై బరగుచు మాంసాస్థి
మలపూయగంధ సంబాధమగుచు
నయ్యహంకృతికాలయంబును క్షణభంగు
రంబునైదగు శరీరంబు నిట్టి
జడరూపమగు మేనియడలమేనికి విల
క్షణుడవౌనీకు నాసక్తి యేల

తే.గీ॥ భ్రాంతినీదేహమున జేసి బ్రహ్మహత్య
లాదియగు పాపములు జేయనయ్యె నీకు
నట్టిభోగానుషంగమౌ నంగమిచట
నురకపడి పోవుటెరుగనే యోదశాస్య! 185

చం॥ అలసుఖదుఃఖ కారణములైదనుద్రిప్పెడి పుణ్యపాపముల్
గలయగ దేహయోగమున గాదె జనింపుచు జీవసంగతిన్
గలుగుచునుండు నింతయె యఖండ సుఖంబగు నాత్మనిష్ఠచే
నలవడకిట్టి దేహమున కాసయొనర్తురె దైత్యసత్తమా! 186

తే॥గీ॥ ఎంతకాలంబు దేహంబు నేనునేను
కర్తయగుచుండు నీయహంకారవశత
నాత్మవిభ్రాంతిచేనుండు నంతగాల
మావహించును జన్మనాశాదికంబు 187

వ॥ కావున మహామతీ! నీవు దేహాదివిషయంబుల యందభిమానంబు మానుము పరమాత్ముండును నిర్మలుండునుశుద్ధుండును విజ్ఞాన రూపకుండును నచలుండును నవ్యయుండునునై వెలుంగుచుండు నజుండు నిజాజ్ఞానంబున జేసి బంధంబునంజెంది విభ్రాంతుండగు దానింగని పెట్టిపరిశుద్ధ భావంబున నాత్మస్వరూపంబు నెరింగి నిరంతరంబును దదీయానుసంధానపరుండవై పుత్రదార గృహాదికం బగు సకలంబునందు వైరాగ్యనిష్ఠుండవగు మిట్లువిజ్ఞాన యుతుం డగు నతండు నరకంబులందయినను శ్వానసూకరాది శరీరంబుల నందియైనను నఖండసుఖంబే బ్రాపించునదియునుంగాక. 188

మ॥ అతివిజ్ఞానవహంబు దేహమును బ్రాహ్మణ్యంబు బ్రాపించి భా
రతవర్షంబున కర్మభూమినతి దుర్లభ్యంబునౌజన్మ సం
గతియుంగాంచి సమంచితాత్మకృత సాక్షాద్భూతి దీపించి పం
డితుడెవ్వాడిల దేహబోగములయందే జెందు వ్యర్థంబుగన్ 189

కం॥ కావున బ్రాహ్మణుడవునై
యావల పౌలస్త్య సుతుడవయ్యును నేలా
నీవజ్ఞనివలె వ్యర్థం
బీవిధి తనుభోగములకెనేగుదు మిగులన్ 190

వ॥ దానవోత్తమా! యింతనుండియు సర్వసంగంబులంబరిహారించి నిరంతరభక్తి భావంబునం బరమాత్ముండగు రఘుపుంగవునాశ్రయించి యద్దేవునకు సీతాదేవిని సమర్పించి తత్ప్రాదాను చరుండవగుము దానంజేసి నీవు నిఖిల పాపంబులవలన విముక్తుండవై విష్ణ లోకంబునుంబ్రాపించెద విప్పగిదింగాదే నిక వనంబునకుంజని యవ్విభునిచేత నిర్జితుండవై పునరావర్తి నిర్జితుండవయ్యెదవేను నీకు హితంబు సెప్పెద నావచనంబొనర్పుమని మరియును 191

శా॥ సత్సంగంబొనరింపుమా! మరకత శ్యామాంగు సీతాసమే
తోత్సంగున్శర చాపహస్తు కరుణాయోగ ప్రశస్థున్ హనూ
మత్సోమిత్రి విభీషణార్క సుతసమ్యక్సేవితాంఘ్రిద్వయు
న్సోత్సాహాప్తి భజింపుమా! రఘువరేణ్యున్ సచ్ఛరణ్యున్ హరిన్ 192

తే॥గీ॥ అనుచుబలికిన నజ్ఞాన హరణమైన
సాధుగుణమగు శుకుని భాషణము వినియు
దానవాధ్యక్షుడతిరోష తామ్రవీక్షు
డగుచు మండెడురీతినిట్లతని కనియె 193

కం॥ కూసెదు దురాత్మభయమున్
బాసిగురునిరీతి నేమి భాషించెదునే
శాసకుడ త్రిజగములకు
న్యాసించెదు సిగ్గులేక నను నీవిటులన్ 194

వ॥ కావున 195

మ॥ ఇపుడేనిన్ను వధింతునైన మునునీవిష్ఠాప్తిచే మాకు జే
యుపనుల్ గొన్నిదలంచి నిన్నును వధార్హుంద్రుంపకన్ గాచితీ
యపలాపంబు వినన్ సహింపనిక బొమ్మామూఢ యన్నన్ శుకుం
డపుడే పోయెతదాజ్ఞగాంచి భయకంపా వాప్తిచే నింటికిన్ 196

సీ॥ అటపూర్వమందు బ్రాహ్మణుడును వేదవి
త్తముడు బ్రహ్మజ్ఞుడై దనరిశుకుడు
సరవి వానప్రస్థ సంవిధాన క్రియ
లాచరింపుచువనంబందునుండి

సురవృద్ధికయ్యు నాసురనాశసిద్ధికై
యవిహితస్థితిజేసె యజ్ఞవితతి
యమ్మహామతి దాననమరులకు హితుండు
నసురలకహితుడై యెసగెనంత

తే.గీ॥ దానిగని యుండియొక వజ్రదంష్ట్రుడనెడు
లోకవిఖ్యాతుడగు దైత్యలోకనాథు
డపుడు శుకునకు నపకారమాచరింప
నంతరము జూచుచుండె బ్రయత్నముగను 197

వ॥ అయ్యవసరంబున నొక్కనాడగస్త్యుండు శుకాశ్రమంబునకువచ్చి యతని చేత పూజితుండును భోజనార్థంబుగా నిమంత్రితుండునునై యమ్మౌనివరుండు స్నానంబునకుంజనిన యవ్వివరంబెరింగి యయ్య సురవరుండగస్త్య రూపధరుండయివచ్చి శుకునకిట్లనియె 198

తే॥గీ॥ భోజనంబిచ్చెదేనియు భూసురేంద్ర!
ఛాగమాంసయుతంబుగా సలుపుమేను
నదిభుజింపక పెక్కునాళ్ళయ్యె ననిన
నతడు గావించె నారీతి నతిశయముగ 199

ఉ॥ అంత భుజింపకుంభభవుడాయితమౌనెడ రాక్షసుండు న
త్యంతము సుందరంబగు శుకాంగన రూపము దాల్చి చిత్తవి
భ్రాంతిఘటింపజేయుచు నపక్వము విస్తరమౌనరామిషం
బంతయు జెప్పి యమ్మునికి నప్పుడు వాడు తిరోహితుండుగన్ 200

వ॥ అంతనపవిత్ర కరంబగు నరామిషంబు నీక్షించి యత్తపస్వివరుండు గుపితుండై శుకునితో దురాత్మా! భక్షణార్ణంబుగాని మానవమాంసంబు బెట్టితివగుటనీవును మానవ భక్షకుండగు రాక్షసుండవగుమని శపియించిన భయంబున శుకుండిట్లనియె 201

కం॥ ఇప్పుడు మీరే సెప్పితి
రిప్పలలనియుక్తి భుక్తి నిమ్మని నేనున్
దప్పక నవ్విధిసేసితి
తప్పని శపియించదగునె తాపసవర్యా! 202

కం॥ అనినన్ శుకవాక్యము విని
మునివరుడు ముహూర్తమాత్రమున చిత్తమునన్
దినదివ్య దృష్టి దెలియచు
ననయము కరుణార్ద్రుడగుచు నాతనికనియెన్ 203

కం॥ శుక నీకపకృతి పరుడగు
నొకదనుజుండింత సేసెనురకవిచారిం
పక నేను శాపమిచ్చితి
నికనావచనంబమోఘమిట్లయగు సుమా! 204

వ॥ కావున నీవు రాక్షస దేహంబు వహించి రావణునకు సహాయ పరుండవైయుండుము దశవదన వధార్థంబు దశరథరాముండు వానర సహితంబుగా లంకాసమీపంబునకు వచ్చిన రావణప్రేరితుం డగు చారుండవై యారఘువీరునీక్షించి శాపమోక్షంబు గావించి యంతనద్ధైత్యవరునకు తత్త్వజ్ఞానం బుపదేశించి ముక్తుండవై పరమపదంబునం జెందెదని యగస్త్యుండుసెప్పిచనియె నప్పుడవ్విప్ర వరుండగు విజ్ఞానాధికుండైన శుకుండమ్ముని వచనంబున మనుజాశనుండై దనుజాధిప ప్రేరణంబున సౌమిత్రి సమేతుండగు రామునింగని శాపవిముక్తుండై పూర్వవిధంబున బ్రాహ్మణుండగుచు వైఖానసవర్తనంబునన్ బ్రవర్తించెనంత నిక్కడ 205

సీ॥ అత్తరిమతిమంతు డాదైత్య భర్తకు
మాతామహుండగు మాల్యవంతు
డతినీతిమంతుండు హితకరస్వాంతుండు
ఘనవిచారుండు రాక్షసవరుండు
దశకంఠునాహవోత్కంఠునిగని పల్కె
నంత రంగము శాంతి నతిశయింప
నావాక్యమును విను మావలనీకు దో
చిన కార్యమీవును జేతుగాని

తే.గీ॥ రాక్షసాధిప! యెన్నడీరాముదయిత
నవని సుతదెచ్చితీవది యాదిగాగ
లంకలో ఘోరములు నాశలక్షణములు
నైన బహుదుర్నిమిత్తముల్ గాననయ్యె 206

వ॥ దానవోత్తమా! యట్టి దుర్నిమిత్తంబులెయ్యవి యంటేనివానింజెప్పెద నాకర్ణింపు మెప్పుడు ఖరధ్వాన నిర్ఘోషంబులం గర్జిల్లుచు దోషంబు లీలంకాపురాంతంబుననుష్ణంబగు శోణితవర్షంబు వర్షించెడు దేవతాయతనంబులయందు దేవచిహ్నంబులు వికలంబులై యాప్రతిమలు నేత్రంబుల నశ్రుజలంబులు స్రవించుచుం జలింపు చుండెడు దుర్వికారంబులగు కాళికాకారంబులేతెంచి పాండుర దంతంబు లంతంతందోప నింటింట బ్రశంసింపుచుండెడు గోవులయందు గర్భంబులు బుట్టెడు విశేషించి

మూషకంబులు ముంగిసలతోడను భుజంగంబులు గరుడ విహంగంబుల తోడం గలహింపనెసంగెడు కృష్ణపింగళ వర్ణుండగు కాలపురుషుండు కరాళ వదనుండును వికటాకారుండును ముండుండునునై ప్రతికాలంబు లందును నందరి మందిరంబు లందునుండొంగిచూచెడు వెండియుం బట్టపగలు ఘూకంబులు గృహంబుల సొచ్చెడు సృగాలంబులు సూర్యాభిముఖంబుగా వాపోయెడునట్టి దుష్ట హేతువు లెన్నేనింగన నయ్యెడుంగావున కులరక్షణార్థంబుగా శాంతిగావింపు మవ్విధంబు సెప్పెద వినుము 207

కం॥ సీతను బహు సత్కారా
న్వీతను గావించి ధనసమేతనుగా భూ
జాతనొసంగుము రాముని
చేతను నభయంబుగనుము జేరిసురారీ! 208

కం॥ ఈరాముడు నారాయణు
డారయ మనుజుండుగాడ హంకారముచే
వైరము జేయకు మీతని
జేరి భజించిన సమస్త సిద్ధులు గలుగున్ 209

సీ॥ సంసారసాగర సంతారణమునకే
దేవుని పాదాబ్జ సేవనావ
పాపదావాగ్ని సంతాపంబు బాపనే
శ్రీమంతు సత్కథా సృష్టివృష్టి
విషయరోగావళీ విదళనంబునకునే
పుణ్యోదయాదృష్టి పొందుమందు
నజ్ఞానతిమిరాప హరణవర్తనకునే
పరమాత్ము విజ్ఞాన సరణితరణి

తే.గీ॥ పరగనేదేవదేవునుపాశ్రయించి
యాత్మవిదులైన బుధులు కృతార్థులగుదు
రట్టి శ్రీరాము సకలహృదబ్జధాము
భక్తి భావన భజియింతు పంక్తి వదన! 210

కం॥ నీవుదురాత్ముడవైనం
బావనమతి వౌదు భక్తి భావన చేతన్
గావింపుము మద్వచనము
రావణ! నీవంశమెల్ల రక్షింపనగున్ 211

మ॥ అనుచుంజెప్పిన మాల్యవంతు హితవాక్యంబుల్ వినంరోసియ
ద్దనుజాధీశుడు కాలపాశవశుడై దానిట్లనున్ మర్త్యునిన్
జనకత్యక్తుని దీనునిన్మునిహితున్ శాఖామృగాధీనునొ
క్కని నీరీతి సమర్థడంచు దెలియంగానేమి యీరామునిన్ 212

కం॥ రాముడు బనిచెనొకో! నిను
నామెయి భాషించెదీవనర్గళముగ మా
తామహుడవు వృద్ధుడవని
యీమాటలనెల్ల విని సహించితి నేనున్ 213

వ॥ అనిమాల్యవంతుంగని భవదీయదురుక్తంబులు మదీయ కర్ణపదవిని దహింపుచున్నయవి నీవింక దడయకం బొమ్మని పలికిన సకల సచివ సహితుండై యచ్చటం గదలిదశాననుండు దశకిరీట రత్నరాజ విరాజమానుండును శ్వేతచ్ఛత్ర సహస్ర విభావభాసమానుండును నైయున్న త ప్రాసాదంబున నాసీనుండై వానరసేనాసమూహంబు నీక్షింపుచు సమీపగతులగు సకల రాక్షస తతుల సమరంబునకు నియోగింపుచున్న సమయంబున 214

శా॥ ప్రాసాదాగ్రమునందు నిప్పగిది శుంభద్వైభవంబొప్పగా
నాసీనుండగు రావణుంగని మహోద్య త్క్రోధుడై రాఘవుం
డాసౌమిత్రి కరార్పితంబయి ఘనజ్యాంబంధురంబైనబా
ణాసంబందొకయర్ధ చంద్ర విశిఖంబారూఢి సంధింపుచున్ 215

శా॥ భ్రాతిన్ రాఘవుడేయలాఘవమునన్ బాణం బసాధారణో
ద్భాతిన్ పంక్తిశిరః కిరీటదశకంబున్ ద్రుంచి తద్భాసుర
శ్వేతచ్ఛత్ర సహస్రముల్ దునిమివైచెందన్నిమేషార్ధమం
దేతచ్ఛాతురి కద్భుత క్రమకళా హేలాగతిందోపగన్ 216

కం॥ చామరములాతపత్ర
స్తోమము లీమాడ్కి బడుటసూచితమయ్యెన్
వేమరు దశముఖ విభవ
స్తోమద్యుతి దెలుపరాలు చుక్కలలీలన్ 217

వ॥ అంత 218

కం॥ రావణుడిట్లు కిరీట వి
భారహితుండౌచునాతపత్ర శ్రీలుం
బోవగ గని వెసజనియె ని
జావాసంబునకు లజ్జితాత్ముండగుచున్ 219

వ॥ ఇట్లు నిజనివేశంబు ప్రవేశించి సభాభవనంబున వసించి దశ ముఖుండు క్రోధోన్ముఖుండై బ్రహస్త ముఖులగు నిశాచరులం బిలిచి మీరు మీబలంబులతో నరిగి వనచరులందర సత్వరంబున సమయించి రండని పంచిననంత 220

సీ॥ పటహకాహళ భేరిపణవ శంఖమృదంగ
గోముఖ ధ్వనులు దిక్కుల చలింప
సైంధవ సింధుర స్యందన భటసంఘ
చరణ సంఘట్టన ధరణి★ యదుర
పటపటాత్కార ఝంపావాత సంపాత
ఘన కేతనమ్ములాకసము గప్ప
పాశతోరణ ఖడ్గపరశుముద్గరశూల
ధనురాది సాధనోత్కరము మెరయ

తే.గీ॥ హరికిరి ఖరోష్ట్ర కాసర వ్యాఘ్ర ముఖ్య
వాహనంబులతో శూరవరులునడువ
జేరిలంకాపురీ చతుర్ద్వారములను
దైత్యసేనలువిడిసె నౌద్ధత్యమెసగ 221

వ॥ ఇట్లు పూర్వద్వారంబున బ్రహస్తుండును దక్షిణ ద్వారంబున మహోదర మహాపార్శ్వులును పడమటి గవిని నింద్రజిత్తుండును నిలిచిరంత నుత్తర ద్వారంబున మంత్రి సహితుండై రావణుండు వసియించె మధ్య స్కంధంబున విరూపాక్షుండును యపరిమిత బలయుతంబుగా నిలిచె నప్పుడు 222

ఉ॥ అంతకు మున్నురామవిభునాజ్ఞను వానర వీరవర్యు ల
త్యంతము వృక్షశైల శిఖరాదికముల్ బెకలించి తెచ్చి యం
తంత దశాస్యుడంపిన బలావళి జూచుచు వేరువేరన
ట్లెంతయులంకకుంగదిసి రేపున రాఘవుడుత్సహింపగన్ 223

కం॥ కోటి మహాయూధ పతుల్
కోటిశతసహస్రయూధకోటుల మహి భృ
త్కూట తరుముష్టి యోధ కు
లాటోపము మీరముట్టి రప్పురిచుట్టున్ 224

కం॥ లంఘింపుచు వెండియును
ల్లంఘింపుచు నార్భులిడుచు లంకాపురికిన్
జంఘాలులగుచు గపులు బ్ర
జంఘాదుల గదిసిరపుడు సత్వస్ఫూర్తిన్ 225

★ యాదృవ – గ.ము.ప్ర. పాఠం

వ॥ ఇవ్విధంబున వానర యూధంబు లంకాపురంబు నిరోధించె నప్పుడు ప్రహస్తుండు నిలిచిన పురద్వారంబున మైందద్వివిదులతో నీలుండు విడిసె, నతనికి సహాయుండై దశకోటి యూధంబులతో కుముదుండు మోహరించినిలిచె, మహోదర మహాపార్శ్వులుండు దక్షిణ ద్వారంబున ఋషభశత బలియుతుండై యంగదుండు విడిసె, నతనికి బాసటయై వింశతి కోటియూధంబులతో వినతుండు బన్నియుండె, నింద్రజిత్తుండు నిలిచిన పడమటి గవినిజంఘ ప్రజంఘులతో హనుమంతుండు విడిసె, నతనికిదోడై షష్టికోటి యూధంబులతో సుషేణుండు బలసియుండె, నంత రావణుండు వసియించు నుత్తరద్వారంబున జాంబవత్ప్రముఖులతో రభు వరుండు సన్నద్ధుండై యుండె నతనికి దక్షిణపార్శ్వంబున వింశతి కోటి గోలాంగూల బలంబులతో గవాక్షుండును వామపార్శ్వంబున కోటి భల్లూక బలంబులతో ధూమ్రుండును నధివసించిరి మధ్య స్కంధంబున షట్త్రింశత్కోటి వనాట యూధంబులతో సుగ్రీవుండు విడిసె, నిట్లు సకల బలంబులయ్యెయెడల బలసియుండ, లక్ష్మణ విభీషణులనేక బలంబులతో బ్రతిద్వారంబునం ప్రహరి దిరుగు చుండి రాసమయంబున, వానర సమూహంబులు గవాటంబులు భేదించియు, ఖేయంబులు గలంచియు కోటలగూల్చియు, కొత్తళంబు లగల్చియుం గలంచుచుండ నీలుండు నంగదుండును హనుమం తుండును జాంబవంతుండును వెండియు నల కుముద శరభమైంద ద్వివిదగంధమాదనగజ గవయకేసరి తార దధిముఖ ప్రముఖులును మరియునుంగల బలవంతులును మహాకాయులును నగు యూధ పతులు పురద్వారంబులు లంఘించి యన్ని దిక్కుల యొక్క పెట్టు యాక్రమించి పర్వత పాషాణపాదపనఖ దంతవాలంబుల చేత సత్వరంబున దైత్యజాలంబులం దూలింపుచు. 226

చం॥ అతిబలుడైన రాముడు మహాబలుడైతగు లక్ష్మణుండునుం
ప్రతతబలుండు భానుజుడు రాఘవరక్షితుడైన గీశరా
జితుల జయంబునన్ గెలుతునంచు మహోధ్వనితోడ నార్చుచున్
బ్రతిభట కోటితోడ సరిబారుచు బోరుచు ఘోరవైఖరిన్ 227

ఉ॥ కోటలపేటలుంజెరిచి గోడలు మేడలు గూల్చి ఖేటముల్
కూటములుంబెకల్చి మరిగోపురముల్ వరముల్ హరించుచున్
కోటులకెక్కుడై కదిశి కొంకక లంక కలంక జెందని
ర్ఘాటముగా జరించిరి విరాధవిరోధి వరూధినీపతుల్ 228

కం॥ అదిగాంచి పంక్తి వదనుడు
మదిగనలుచు దైత్యబల సమాజముతోడం
గదలుడు పురంబు వెలువడి
కదనంబున కనినవారు కడురభసమునన్ 229

సీ॥ ఘనతరఘీంకార ఘంటా ఘణత్కార
కలిత మాతంగ సంఘములతోడ
చక్రఘళాత్కారచల కేతుఝంకార
సమధికరథ సహస్రముల తోడ
తతఖురధూత్కార కృతరావ హీంకార
చటులసాహస మహాభటుల తోడ

తే.గీ॥ భేరికాఘోర భాంకారభూరిపూరి
తారవంబుల నంబరంబార్భటింప
కదన కాంక్షలు మీరలంకాపురంబు
వెడలి వచ్చిరి రాక్షస వీరులపుడు 230

వ॥ ఇట్లు రాక్షస యోధులాయోదనంబునకు వెడలి నడచిన 231

సీ॥ దంతఘట్టనల నుద్ధతి కరోత్పాటిత
నగములేసింధురోన్నతి వహించి
చరణఘాతముల సత్వరవిచార విచిత్ర
గతులను రథసముద్యతి వహించి
వాలవిస్ఫోటన వ్యాప్తినుదాత్త లం
ఘితములై సైంధవస్థితి ఘటించి
కిలకిలార్భటుల నిస్తులసింహ నాదవై
ఖరుల వీరభటోగ్రగతినటించి

తే.గీ॥ ధరణిగంపింప దిక్కులు దల్లడింప
నంబరంబెల్ల భూరజం బాక్రమింప
పటుజయముగూడ రాక్షస బలముతోడ
బవర మొనరింప రాక్షస బలమునడచె 232

- వానర రక్షస్సేనాసంకుల యుద్ధము -

వ॥ ఇవ్విధంబున 233

చం॥ విజయముగోరిరావణుడు వీడ్కొలుపన్ సురవైరిసైన్యముల్
గజహరిముఖ్యముల్ గదిసె గాఢమతిన్ గదనంబొనర్పగన్
విజయముగోరి రాఘవుడు వీడ్కొలుపన్ హరిముఖ్య సైన్యముల్
గజహరి ముఖ్యముల్గదిసె గాఢమతిన్ గదనంబొనర్పగన్ 234

వ॥ ఇట్లు గదిసి యుభయసైన్యంబు లన్యోన్య ప్రహారంబులంబరస్పర శర కరాఘాతంబుల నితరేతర జయాస్ఫోటనంబుల సముత్కీర్ణంబులై సంవర్త సమయ ఘూర్ణమాన మహార్ణవముల భంగి బెనంగునెడ సంగరంబున నధికతర గాత్రులును మహోద్వీక్షులునగు రాక్షసు లావృక్ష చరజాలంబులం శూలంబులం బొడిచియు భిండివాలంబుల నడచియు కరవాలంబుల మోదియు ముసలంబు లంబాదియు ప్రాసంబులంగొట్టియు పాశంబులంబట్టియు ముద్గరంబుల నొంచియు తోమరంబుల నడంచియు మరియు ననేకాయుధంబుల భేదించియు క్రోధించి జయశీలురగు కీశయోధులును మహీధరం బులం ద్రోసియు మహీరుహంబులం వ్రేసియు పాషాణంబులన గల్చియు పదంబుల నొగల్చియు నఖంబుల సీల్చియు ముఖంబుల విదల్చియుదంతంబుల ఘట్టించియు పంతంబుల ధట్టించియు మరియు ననేక విధంబుల బొదివిన బోరు ఘోరంబయ్యెనయ్యవ సరంబున 235

సీ॥ పెల్లుప్రేలెడు మాంసబృందంబు పంకంబు
ప్రీలుప్రేవులు సర్పజాలములును
వ్రాలెడు నస్థిచూర్ణముసైకతంబును
మిడిసిన బాహువుల్ మీనములును
కడజిందు కుక్షి వక్షములునక్రంబులు
కూలెడు పాదముల్ కూర్మములును
సడలిన కేశముల్ శైవాలచయములు
జడబడు కంఠముల్ శంఖములును

తే.గీ॥ అధికరక్తనదీప్రవాహంబులెలమి
గలిగి కనుగొనినతి భయంకరమునగుచు
వృక్షచరులకు రాక్షస వీరులకును
సమరము బొసంగె నద్భుతోపమముగాగ 236

కం॥ కనకస్యందన సైంధవ
ఘన సింధురములను బొదలి కదనమురక్షో
జను లొనరించిరి దశదిశ
లనుపడ ఘూర్ణిల్లుచుండ హరిబలములతోన్ 237

కం॥ వానరులున్ దానవులుం
దానవులును వానరులును దగనన్యోన్యం
బూనిజయేచ్ఛల ననిలో
మానక నొప్పించిరంత మరియు న్మరియున్ 238

వ॥ అప్పుడు 239

సీ॥ శ్రీవిష్ణుడగు వామదేవునిచే జూడ
నగుటను దివిజాంశులైన హరులు
నమృతపానము జేసినట్టుల సతతంబు
బలవంతులగుచును ప్రబలిరపుడు
సీతాభిమర్శన పాతకా న్వీతుడౌ
రావణు చేత సురక్షితులగు
రాక్షసుల్ గరళాను భక్షితులగు మాడ్కి
హృతసత్వులును హృత శ్రీకులైరి

తే.గీ॥ యిటుల నంతంతకును బలంబెసగ మెసగ
నతిజయోత్సాహముల శౌర్యమావహిల్ల
సాహసంబున వానరసైన్యతతులు
గలిసి రెంతయు రాక్షస గణముమీద 240

వ॥ ఇట్లు గవిసి శలభంబులపయింగవియు దవానలంబు ననుకరించి వనచరబలం బద్దనుజ బలంబుపై నురువడించి మాతంగంబులం ద్రుంచియు, తురంగంబులనొంచియు, శతాంగంబుల సమయించియు, భటసంఘంబులభంజించియు, శిరంబుల ఖండించియు, కరంబుల దుండించియు, పాదంబుల డుల్చియు, మేదంబుల దొల్చియు, వక్షంబుల సీల్చియు, పక్షంబులు రాల్చియు, నుదరంబుల గ్రుచ్చియు, రుధిరంబుల ద్రెచ్చియు, నార్చిపేర్చి గసిమసంగి నయ్యసుర సైన్యంబు చతుర్థాంశంబునం జిక్కినందక్కిన బలం బంతయు నంతంబు నొందిననిట్లునిహతంబగు స్వకీయ బలంబు నిరీక్షించి క్రోధ దుర్నిరీక్షుండై యాక్షణంబున నక్షీణ భాగ్య గర్వితుం డును బ్రహ్మ దత్తవర ప్రభావ దర్పితుండును దుష్టచిత్తుండును నగు నింద్రజిత్తుండత్యంత రయంబున 241

ఉ॥ మృత్యు ముఖోగ్రవృత్తి సరిమించు మహారథ మెక్కిజిహ్వికా
కృత్యము దెల్పుతద్భయద కేతువు గ్రాల నవక్ర విక్రమౌ
ద్ధత్యమెలర్పగా నపుడు దైత్యవరుండగు నింద్రజిత్తుడున్
దృత్యభిమానముల్గదుర దీవ్ర రణోర్వికి వచ్చియచ్చటన్ 242

- ఇంద్రజిత్తు ప్రథమ యుద్ధము -

కం॥ నేనుండ నింద్రజేతన్
దానవ సైన్యమున కిట్టి దైన్యంబేలా
బూనగ నని యని యంత
ర్ధానంబుగ నిలిచి మేఘతతిమధ్యమునన్ 243

శా॥ బ్రహ్మాస్త్రాది సమస్త శస్త్ర కలనా పారీణుడౌ రావణ
బ్రహ్మప్రోద్భవుడింద్ర శత్రుడు నభోభాగంబున న్నిల్చియుం
బ్రహ్మాండంబుగడుంజలింపగ దిశాభాగంబులల్లాడగా
బ్రహ్మాస్త్రంబును వ్రేసె వానరబలవ్రాతంబు నందంతటన్ 244

వ॥ ఇట్ల మోహంబుగా మేఘనాద కార్ముకనిర్ముక్తంబై బ్రహ్మదత్తంబగునా బ్రహ్మాస్త్రంబుననల్ప కల్ప సమయ సముజ్వల జ్వాలా భీలంబుగా మండుచుంబరతేర నమ్మహాసాధనంబు వలన నొండంద మెండుకొని పుట్టవిరిసినట్టులంబట్టి పట్టెసప్రాసాంకుశములన ముద్గర ముసిండిభిండివాల కులిశకుంతశర శస్త్రాస్త్రాది నానావిధంబులగు మహాయుధంబులవ్వానరయూధంబునంతయుం జుట్టుముట్టి భయంకరంబుగా నొక్కని కొక్కొక్కయస్త్రంబునుం వెండియుం బెక్కుకపులొకటియునుంగా మర్కట బలంబుల నుక్కణగించుచు దురంబున నెదురించినం గదియుచు బారిచన్న వెన్నంటుచు మున్నుబడిన రథకరి తురంగాది కళేబరంబుల నొదిగిన వెదకి సొచ్చుచు గిరితరు శిఖరంబుల కెగసిన వెంబడి నెగయుచు బారిస మరిన విధంబున నక్కపుల నందర మ్రందించి యుమ్మడించియు సుడించియు బుడమింబడ నడంచి మహాద్భుతంబుగా నంత నమ్మహాస్త్రం బుపశాంతంబయ్యెనందు గొందరయ్యస్త్ర విధానం బెరుంగుటంజేసి తద్బాధనొందకుండిరంత 245

కఃఁ॥ ఆరాఘవుడస్త్ర కళా
పారీణాగ్రణి యెరింగి బ్రహ్మాస్త్రంబున్
జేరిక మన్నించి క్షణం
బూరకయుండెను ★మరల్పనురు బలుడయ్యున్ 246

శా॥ అంతన్ యుద్ధమహీస్థలిన్ బడిన గీశానీకముంజూచియ
త్యంత క్రోధముతోడ రాఘవుడు కాలాగ్ని ప్రభాభీలుడై
యెంతే తమ్ముని గాంచి తెమ్ము ధనువేనిద్దిత్యు బ్రహ్మాస్త్ర వి
క్రాంతిన్ భస్మముసేతు సూడుమిదెమత్రాగల్భ్యమున్ లక్ష్మణా! 247

కం॥ అనినన్ రాముని వచనము
విని వెరచి వితంద్రుడగుచు వేగమెయరిగెన్
దన నగరికి మాయాగతి
మనుజాశన రాజసుతుడు మాయికుడగుటన్ 248

★ నయబలుడయ్యున్ – గ.ము.ప్ర. పాఠం

సీ॥ అవ్విధిననిలుడు హరిబలంబులజూచి
యారాఘవుడు దుఃఖితాత్ముడగుచు
ననిలజుగాంచి యిట్లనియె మారుతి నీవు
యతివేగక్షీరాబ్ధియవలనరిగి
యచ్చట ద్రోణాద్రియను పేర దివ్యౌష
ధీజన్మ శైలంబు తేజరిల్లు
నాపర్వతము దెచ్చియతి సత్వలగుకపి
శ్రేణుల జీవింపజేయు మనఘ!

తే.గీ॥ దాననీకీర్తి సుస్థిరంబౌనటన్న
నధిపునాజ్ఞ ప్రమాణమంచని తలంచి
నతులుగావించి సత్వర స్థితి వహించి
తత్పథంబున ననిలనందనుడుసనియె 249

- ఆంజనేయుండు ద్రోణగిరిదెచ్చుట -

కం॥ చనియాగతి ద్రోణగిరిం
బను పడగొనివచ్చి హరుల బ్రతికించియు రా
ముని యాజ్ఞ నచటతద్గిరి
వనచర వర్యుండు నిలిపివచ్చెను మరియున్ 250

కం॥ అంతట తొంటిన్ బలెన
త్యంతము వానర బలంబులతిభీమ రణ
క్రాంతత నార్వగ విస్మయ
మెంతయు దోపవిని రాక్షసేంద్రుండనియెన్ 251

సీ॥ ఇపుడు దైవవశాప్తినెంతయే శత్రుడై
రాముండు నాయెడ బ్రాప్తుడయ్యె
నతని వధింపగా నతివేగనాజికి
సైనికాధిపులార చనుడు మీరు
చుట్టాలుమంత్రులు శూరులు నెవ్వార
లస్మత్ప్రియాకాంక్షులయినవారు
వారలందరును సత్వరముగాగ మదాజ్ఞ
నరులతో బోరగా నరుగవలయు

తే.గీ॥ నరయ నెవ్వారు భీతులై ప్రాణలోభ
మునమదీయాజ్ఞకును పరాఙ్ముఖులు నగుచు
బూని సంగ్రామమొనరింప బోవరట్టి
వారినందరనిట ద్రుంచివైతు నేను 252

వ॥ అనిన రావణువచనంబు విని భయత్రస్తులై రణదక్షులైన రాక్షస వీరులందరు దురంబున కరుగందలంచి రపుడు. 253

– రావణుని పంపున రాక్షస వీరులు యుద్ధంబునకు వెడలుట –

కం॥ వృక సింహ ప్రముఖ ముఖ
ప్రకట హయాకలితకనక పరిఘటితమహా
శకటంబున ధూమ్రాక్షుడు
వికటధ్వనితోడ ననికి వెడలెన్ బెలుచున్ 254

పంచచామరము॥

వృకోరగోష్ట్ర ఘోరవక్త్ర విశ్రుతాశ్రు మౌరథం
బకంపనాప్తి నెక్కి దిక్కులార్వనార్చుచుంజమూ
ప్రకంపితోగ్ర వైరియైదురంత పాపధారియై
యకంపనుండు వచ్చెసాహసాప్తినాహవోర్వికిన్ 255

కం॥ మాయూరధ్వజయుతమై
వేయుపిశాచాస్య హరుల వెలసిన రథము
గ్రాయతిచే నెక్కి మహా
కాయుండార్చును వెడలె కదనంబునకున్ 256

మ॥ అహికేతుద్యుతు లుగ్రతన్ బొదల నుద్యత్స్యందనారూఢుడై
రహి లంకాపురి గల్గుసైన్యము చతుర్భాగంబు గొల్వంగ దు
స్సహుడై రెండవ రావణుండితడనన్ సన్నాహమొప్పన్ సమి
న్మహికిన్ వేవెడలెన్ బ్రహస్తుడు బలోన్మాదంబు దీపింపగన్ 257

సీ॥ ఐరావత కులీనమగు సుదర్శనమను
నురుగజంబెక్కి మహోదరుండు
భూరిఘంటారవ భువన భయంకర
పటురవంబునమహాపార్శ్వకుండు

నుచ్చైశ్రవఃకులీనోదగ్రమగుశుభ్ర
హయముపైబోల్చి నరాంతకుండు
బహురత్నమేదుర ప్రభల మిన్నొరయు మ
హాస్యందనమున దేవాంతకుండు

తే.గీ॥ బ్రహ్మదత్తధనుశ్శక్తి బాణకవచ
యుతసహస్ర హయాన్వితోన్నత శతాంగ
మతిబలుండగు త్రిశిరుండు నధివసించి
యనికి వెలువడిరందరత్యద్భుతముగ 258

కం॥ వితతాయుధ హేమరథ
ప్రతతసితచ్ఛత్రచామరము లెసగ సురా
హితగేయుండతి మాయుం
డతికాయుండరుగుదెంచె నాహవమునకున్ 259

కం॥ కుంభీనసముఖ సైంధవ
గుంభిత సౌరంభ శాతకుంభశరములన్
కుంభనికుంభులు శౌర్యో
జృంభితగతి వెడలిరనికి సిడములు బొదలన్ 260

కం॥ ప్రకట సమీకసముత్సా
హకులగుయూపాక్షశోణితాక్షులు మరియున్
మకరాక్షుడు శౌర్యకళా
ధిక దక్షుండనికి నరుగు దెంచిరివరునన్ 261

వ॥ మరియు నగ్నికేతుసుప్తఘ్ను యజ్ఞకోపన మిత్రఘ్ను జంబుమాలి ప్రజంఘ తపన ప్రతపనాశనిప్రభ వజ్రముష్టి ప్రముఖులగు రాక్షస యూధాధ్యక్షులు సపరికరంబుగా ననేకబలంబులతో పురంబు వెలువడి. 262

సీ॥ నడకొండలోయన నడరు నేనుంగుల
బృంహితంబుల భూతబృందమగల
పుష్పిత ద్రుమముల బోలిన రథముల
నేమిరవంబుల నింగిబగుల
నేరుల గతివచ్చు ఘోరాశ్వముల పాద
ఘట్టనంబుల భూమికంపమొదవ
మొగులు మూగినరీతి మొనయ బలంబుల
కిలకిలార్భటుల దిక్కులు చలింప

తే.గీ॥ నిఖిలసైన్యచయోద్ధూత నిబిడరజము
నడరి బ్రహ్మాండ భాండంబు నావరింప
భాంక్రుతధ్వాన నిస్సాణ పటలిమెరయ
నాత్మ సైన్యంబు నడపించి రసురవరులు 263

వ॥ అప్పుడు 264

సీ॥ పరువడిలంఘించు పదఘట్టనంబుల
దిగ్గజంబుల తలల్ మ్రొగ్గటిలగ
చటులతరాట్టహాసధ్వానములతోడ
★నిఖిలాంబునిధులు ఘూర్ణిల్లుచుండ
గమనవేగంబుల గప్పెడు పెంధూళి
గగనంబు చీకట్లు గప్పుకొనగ
నొండొరుల్ బిరుదుల నుబ్బున జీరెడు
ఫెల్లున దిక్కులు పిక్కటిల్ల

తే.గీ॥ బహుళపాదపపాషాణ పాణులగుచు
తతమహోద్ధతి వైరులు తల్లడిల్ల
కడగిరఘువీర పనుపుచేనడచిరనికి
నగచరోత్తములాత్మ సైన్యములతోడ 265

కం॥ వారాశియు వారాశియు
మేరువు మేరువును దొడరు మెలపున వడిగా
నారజనీచర వనచర
వీరబలములిట్లు నడచి వేర్వేరగదిసెన్ 266

వ॥ ఇవ్విధంబున నుభయసైన్యంబులు ఘోర హుంకారధ్వానంబునం గలిసి కలయంబెనసి యొక్కొక్కని కొక్కొకరుండు పదుంద్ర కొక్కొక్కరుండు నొక్కొక్కనికి పెక్కుండ్రునుంగా దలపడి శరపరిఘ గదచక్రాదుల నసురులును గిరితరుశిలాశిఖరాదుల గిరిచరులును గదశిరఃపాణిపాదకుక్షి వక్షోజానుజంఘాదు లేర్పడకుండం జెండుచునుద్ధండగతింబోర మహాభండ నంబయ్యెనందు 267

కం॥ కరవాలరుచులు మెరుపులు
నురుతర మౌర్వీరవంబులురుములు గాగన్
శరవర్షంబులు గురియుచు
నురువడిపై బరపి రసుర యూధాధీశుల్ 268

★ నఖిలాండ – గ.ము.ప్ర. పాఠం

కం॥ గిరికూటపాదపాదుల
తరుచు మహానిలము పగిది దార్చుచువేగన్
తరుచర సేనానాయకు
లురుగతులం దాకిరసురయూధాధిపులన్ 269

వ॥ ఇట్లు దాకిన రాక్షసాధ్యక్షులు గోపించి జంబుమాలి హనుమంతుని ప్రజంఘుండు సంపాతిని తపనుండు నలునిప్రతపనుండు గజుని వజ్రముష్టిమైందుని నశనిప్రభుండు ద్వివిదునిన్ దలపడిరందు జంబూమాలి శక్తివైచిన నదివారించి వాయుసుతుండు తద్రథం బునకు లంఘించి హస్తంబున నద్దనుజుమస్తకంబు బగులించి త్రుంచె ప్రజంఘుండు శరసంపాతం బొనర్చిన సంపాతియు ముష్టి ఘాతంబున నద్దైతేయు వధియించె తపనుండు ఘోరాస్త్రంబుల నొప్పించిన నలుండొక్క వృక్షంబున నారాక్షసుంబడనడంచె ప్రతపనుండు శూలంబుగీలించినగజుండు హింతాలంబున నయ్యసురం గాలంబు నొందించె వజ్రముష్టి శరవృష్టిం గురిసిన మైందుండు ముష్టిహతినద్దితిజునంతంబు నొందించె నశని ప్రభుండు విశిఖంబుల నొంప ద్వివిదుండు గిరిశృంగంబునన్నిశాచరుం బొలియించె నత్తరి మిత్రఘ్నుండు నిశితాస్త్రంబులు గాత్రంబున గ్రుచ్చిన విభీషణుండు ముసలంబున నారక్షోవరు వక్షంబగల్చికూల్చె నగ్నికేతు రశ్మికేతు సుప్తఘ్నయజ్ఞ కోపులాటోపంబుజూపిన రఘువరుండర్ధచంద్ర శరంబులవానిశిరంబులు ద్రుంచె మరియును బ్రహస్తాతికాయమహాకాయ కుంభనికుంభాది మహాయోధులు విజృంభించిన సుగ్రీవవినత రంభ ధూమ్రనీల ప్రముఖులుత దస్త్రజాలంబుల నివారించి సాలశిలాది సాధనంబులం దూలించిన వారు దెరలిమరలి చనిరావణ ప్రేరణంబున బలంబులం బురికొల్పు కొని వచ్చిరందు గ్రమంబున ధూమ్రాక్షుండు సబలంబుగా వానరానీకంబునకుం గవిసిన 270

కం॥ ఒండొరులంబురి కొల్పుచు
చండాడిరియప్పుడసురసేనల హరలు
ద్దండంబుల నతుల భుజా
దండంబుల భూరిభూజ దండంబులచేన్ 271

ఆ॥వె॥ అపుడుకపుల మీద నడరిధూమ్రాక్షుండు
బహుళసాయకముల బాధ పరప
ననిలసుతుడు దాకనతనిపై శరములు
ననిచెనొంపదాన కనలునిగుడ 272

కం॥ తామ్రాక్షుడగుచు మారుతి
యామ్రక్షితిజంబుతోడ హతునిగజేసెన్
ధూమ్రాక్షుని కోపతమో
ధూమ్రాక్షుని సంగరమున దోర్బలమెసగన్ 273

ఉ॥ అంత నకంపనుండు సచివావళిదానును వీకదాకన
త్యంతము వానరుల్ తరుశిలాదులు గప్పగ క్రోధదీప్తుడై
యెంతయు జేర్చి వానరులనేపడపన్‌గనియల్గి యా హనూ
మంతుడు వేగనద్దనుజు మార్కొనియెన్ గపివర్యులార్వగన్ 274

కం॥ ద్రుమపాషాణపరంపర
లమరారి బలంబు మీద నడరింపుచునుం
గుముదుండును మైందుండును
తుములముగా వాయుజునకుతోడైరంతన్ 275

మ॥ ధరనేమిధ్వనినుర్విపెల్లగిల గర్వస్ఫూర్తి వాడందరన్
శరజాలంబుల గప్పవాయుజుడవష్టంభంబు నందచ్చరో
త్కరమున్ శైలముబోలెనార్చి నగశృంగంబొక్కటన్ వైవగా
సురవిద్వేషిజలింప కస్త్రములచే చూర్ణంబు గావించినన్ 276

కం॥ తెంపున హనుమంతుడు కడు
గుంపింపుచు గొప్పకొండగొని వేసివెసన్
జంపెనకంపను సమరా
కంపను నమరాంబుద ప్రకంపనునంతన్ 277

– మహాకాయుని యుద్ధము –

వ॥ ఇట్లకంపనుండు దెగినంగోపించి 278

సీ॥ ఘనతరఘంటికా ఘణఘణధ్వనితోడ
సంబంధహయ సహస్రంబుతోడ
చటుల కార్ముకముఖ్య సాధనంబులతోడ
ఘర్ఘర ధ్వానచక్రములతోడ
పవనోద్ధతాంబరార్భటిత కేతువుతోడ
సముదగ్ర చక్రరక్షకుల తోడ
చంక్రమక్రమకళాచతురసారథితోడ
కవచాది సాధనోత్కరముతోడ

తే.గీ॥ బంధురంబగు రథముపై పరిధవిల్లి
భేరికాశంఖ కాహళుల్ భోరుకలగ
సచివ సోదర యోధ సంచయము నడవ
కపి బలంబులపై మహాకాయుడడరె 279

వ॥ ఇట్లడరిన వానరవీరులగు నంగదాదులు నిజబలంబులంబురికొల్పు కొని తాకిన నుభయ బలంబులకు మహారణంబయ్యె నపుడు తన మంత్రులు వజ్రనాభుండును రుధిరాశనుండును గాలదంష్ట్రుండునుం గాలకల్పుండును పాపాశనుండును శతమాయుండును ధూమ్రుండును దుర్ధరుండును ననువారెనమండ్రును మహానాదుం డును దోడుగా దుర్జయుండగు నమ్మహాకాయుండువానరానీకంబు పయింగవిసి నొంచియు ద్రుంచియు నొడిచియుంబొడిచియు పట్టియుంగొట్టియు నేలకుంగోలకుందెచ్చినం గని పృథుండు వజ్రనాభునిందాకిన వాడును శూలంబు వైచిన దానికింజలింపక నవ్వానరవీరుండు తద్రథంబు విరుగందాటి యద్దానవుకాలు కేలంబట్టి నేలంగొట్టి వధియించె గవాక్షుండు రుధిరాశనుందాకిన వాడు ఖడ్గంబునందన్ను వ్రేయనుంకించిన దానికిం దప్పనురికిధరణి బడిన పరిఘుంబుగొని యావృక్ష చరాధ్యక్షుండా రాక్షసువక్షంబు వ్రేసిత్రుంచె వృషభుండు కాలదంష్ట్రునిందలపడిన వాడును దనగజంబు డీకొలిపిన నాకపివరుండు కరప్రహారంబునకరినడంచి ముష్టిఘాతంబున నద్దైతేయుం బరిమార్చె పననుండు కాలకల్పు నిందలపడిన వాడగ్నికల్పంబులైన బాణంబులువైవ నవ్వన చరవీరుండు హస్తంబున నద్ధెత్యమస్తకంబు ద్రుంచి కూల్చెగజుండు పాపాశనుందాకిన వాడునుం బాణఘాతంబుల రక్త సిక్తాంగుం జేసిన నక్కీశవరుండన్నిశాచరు శతబలిశత మాయునిందాకి వాడతనిమించి పనస బుషభ గవాక్షాదులం గలిసి గదాముసలాది సాధనంబుల నొంచికపులం దోలుచు శతబలియురంబు పరిఘంబున వ్రేసినందప్పనురికి యాహరివరుండొక్కని ఖడ్గంబుగొనియద్దనుజు తొడలు విరుగంజరచి నిహతునిం జేసెక్రోధన మేఘపుష్పులు ధూమ్రదుర్ధరులందాకిన వారనేక శరంబులు గురియ నవ్వన చరవరులు కరతలంబున నయ్యసురులం దలలు బగులం జరచి రూపు మాపినంగోపించి మహానాదుండనేక బాణపరంపరలం స్రుక్కించినవెక్కసంబై యక్కపి సైన్యంబు దిక్కులంబరపంగని బరవసంబుచేసి యంగదుండు నుత్తుంగంబగు గిరిశృంగంబువైచిన నడుమనవాడు బాణంబుల భగ్నంబుసేసి యత్తారాసుతు శరీరంబున నిశితశరంబులు నాటించినదండతాడిత భుజగంబుభంగి గనలి యాప్లవంగ పుంగవుండు తచ్ఛతాంగంబునకు లంఘించి మణి మకుట ప్రదీప్తంబగు తదీయోత్తమాంగంబు హస్తద్వయంబునం బట్టి యుప్పరంబున కెగసి జిరజిరంద్రిప్పి పుడమింబడవైచి యంతకు నంతికంబునకుంబనిచెనంత 280

కం॥ అనుజులు మంత్రులు దెగుటకు
గనలి మహాకాయుడపుడు కపులదరుముచున్
దునుముచు వాలితనూజుని
మునుమునుఘన మార్గణముల మూర్ఛన్మించెన్ 281

తే॥గీ॥ మరియు పదియైదు మూడారు మార్గణముల
బుషభు క్రోధను శతబలి పృథుని నేసి
యసురయట మేఘ పుష్పగజాది కపుల
గాసియొనరింపనంత నంగదుడు దెలిసి 282

ఉ॥ ఆయెడముష్టిఘాతమున నయ్యసురం గనలింపవాడునుం
సాయకపంక్తినొంప సురసత్తమ పౌత్రుడురంబు వ్రచ్చి యు
గ్రాయతి జంపెనిర్గత సహాయునిదుర్గతమాయునిన్ మహా
కాయుని దూషితామరనికాయుని భూరితరోగ్రకాయునిన్ 283

వ॥ ఇట్లు మహాకాయుండుబడిన నవ్వీరుండు బడుట రావణు బలంబం తయుంబడునట్టులని విభీషణుండురఘుపుంగవుముంగల నంగదుం బ్రశంసించెనంతనక్కడ దశముఖుండును నతిఖిన్నుండై దానువచ్చి పురద్వారంబులు మరియు నతిరక్షితంబులు గావించెనప్పుడు. 284

- ప్రహస్తుని యుద్ధము -

సీ॥ గంధసింధురముల కదుపులు నొకవంక
ఘీంకారములతోడ గెరలినడువ
గైసేసియొక్కట ఘనరథ బృందముల్
సందడిగా నొక్క చాయనడువ

భూరిహేషారావ పూరితాంబరముగా
హయచయంబొకతట్టు నలమినడువ
సింహనాదస్ఫూర్తి సెలగంగముందట
పటుభటానీకంబు బలసినడువ

తే.గీ॥ భైరవారావ భేరికా పటలిమెరయ
పరభయంకరమగు తేరుపై వసించి
మంత్రులిరుదెస గొలిచిరామహితుడగుచు
నగచరావళి దాకెబ్రహస్తుడపుడు 285

వ॥ ఇట్ల సురసేనానాయకుం డడరి సచివహితంబుగా చతురంగబలం బులం గదియించి హస్తికులు కులిశాంకుశ గదాది సాధనంబులను, రథికులు శస్త్రాస్త్ర పరంపరలను, నాశ్వికులు ఖడ్గకుంత తోమరా ద్యాయుధంబులను, వీరభటులు శూలకరవాల భల్లాది ప్రహరణం బులం గలంచిన, జలించు ప్లవంగబలంబులన్గపిసేనానాయకుండగు నీలుండు బురికొల్పిన నద్దైత్యమంత్రులందలపడి ద్వివిదుండు నరాంతకుంగిరి శృంగంబున ద్రుంగించె తారుండు కుంభహనుని సాలంబుననున్మూలించె జాంబవంతుండు మహానాభునిం గండశైలంబునం బిండిగావించె దుర్ముఖుండు సమున్నతునున్నత వృక్షంబున వక్షంబగల్చి త్రుంచెనప్పుడు 286

చం॥ విరిగెడు తేరులున్నడకు వీగెడిశూరులు మావటీలతో
సొరిగెడు గౌరులుంబుడిమి సోలెడు గుర్రపు బారులుంవెసన్
దొరిగెడి నెత్తుటేరులును తోరపుశల్యపు మేరులైబొరిం
బొరిరజనీచరుల్దొరుగ బోరొనరించిరి వీరవానరుల్ 287

చం॥ అటులనిశాటులంగలచు నాహరులంగనియుంబ్రహస్తుడు
త్కటబహుబాణవర్షములగప్పుచు సింహరవంబెసంగెనొ
క్కట హరివీరులం జదుప గాంచియునీలుడు దాకెనుద్ధతిన్
చటులత బోరిరిద్దరును చండ శరౌఘ నగప్రఘాతలన్ 288

చం॥ అపుడుబ్రహస్తుడేచి బలమంతగలంచగ నీలుడెంతయున్
గుపితుడు నయ్యుతాలమున గూలిచెతద్రథమంత వాడును
గ్రపు పదసాలమేయనలుకం కపివీరుడుఘోరభూధర
క్షపితశిరస్కుజేసి వెసజంపెబ్రహస్తు నతిప్రశస్తునిన్ 289

వ॥ ఇట్లు రావణుని మాతులుండగు బ్రహస్తుండు బడిన రామలక్ష్మణ సుగ్రీవాదులు నీలునగ్గించిరి రావణునాస్థానంబున విషాదారావం బులు బహుళంబులయ్యె నయ్యెడ 290

- అతికాయుని యుద్ధము -

సీ॥ బహుళోగ్ర చతురంగ బలములతోగూడ
భూరిభుజంబు లుప్పొంగుచుండ
తనుగనిభీతిల్లు తరుచరావళితోడ
వడివడి కనుబొమల్ముడిబడంగ

జలచరంబులగప్ప బడునాకసము తోడ
మిడిగుడ్లు కెంజాయ మెలపుజూప
పటహధ్వనులు ప్రీళబారుదిక్కులతోడ
వారకసింజినీవల్లి మ్రోయ

తే.గీ॥ కడగిదేవాంతక నరాంతక త్రిశిరులు
బలసి రా మహోదర మహాపార్శ్వులొకట
గదసిరా భూరితర శతాంగమున బోల్చి
కపిబలంబులపై నతికాయుడడరె 291

వ॥ ఇట్లుదాకి సహోదరసహితంబుగా నిజబలంబులంబురికొల్పిన 292

కం॥ కరికోటిం గవియింపుచు
నురుధాటిన్ ఘోటకములనురుకింపుచునా
హరివాహిని గలగించిరి
సరసి దొరసి కలచు కరుల సరణి సురారుల్ 293

వ॥ అప్పుడు 294

కం॥ కరికరితో హరిహరితో
నరదము నరదంబుతోడ నసురనసురతో
సరివేయుచు బరిమార్చుచు
హరివర్యులు రిపుమదేభ హరివర్యులునై 295

వ॥ ఆసమయంబున నరాంతకుండు నుత్తుంగంబగు నిజతురంగంబు ప్లవంగ పుంగవులపై గవియించి శక్తిప్రముఖ ప్రహారంబులం బరపి తెరపిసేసినం గనలియంగదుండు నిలునిలుమనియదల్చుచుందాక వాడునుం బ్రాసంబువైవ నతండు శరఘాతంబునన్ తదీయ తురంగంబు నడగించినంబడక లంఘించువాని యురంబు పిడుగుంబోలు పిడికిటంబొడిచిన రుధిరంబు ముఖాంతరంబునం దొరంగ నరాంతకుండు ద్రుంగినం బొంగియంగదు నందరు నభినుతింప నయ్యాటోపంబు సహింపకం గోపంబునదేవాంతకుండు పరిఘంబునం త్రిశిరుండు శరప్రసరంబున మహోదరుండు తోమరంబున నురంబునవ్రేసిన నవ్వాసవ పౌత్రుండమ్మహోదరు వాహనంబగుదంతి దంతంబు బెరికి యమ్ముల్వురంబోరు నంతరంబున హనుమంతుండు దేవాంతకుందాకి గొండ వైవంద్రిశిరుండు గాండశతంబున నదిఖండించినం గుపితుండై యప్పవన సుతుండు దేవాంతకుంగదసి నొప్పించిన నప్పలాదుం డును నురగంబుబోని పరిఘంబువైవనతండు గరుడుండునుంబోలె బట్టి విరిచి యరచేతం బిట్టుగావైచినడునెత్తి బగిలినెత్తు రొలుక నాలుకంగరచి దేవాంతకుండంతకుంజెందె నంత 296

ఉ॥ నీలునురంబునం పగమినించి మహోదరు డార్వనంతన
య్యాలములోన సోలియును నప్పుడు తేరియ నీలుడున్ మహా
శైలముత్రేసి వానిగజ సత్తము ద్రుంచియు సాలఘాతచే
వ్రాలినలీల జంపెనట వానిసహోదరు నమ్మహోదరున్ 297

మహాస్రగ్ధర॥

త్రిశిరుండున్వాయుసూనుండెరలిచి విశిఖోద్దీప్తినొంపంగ నాతం
డశనిస్ఫూర్తి ద్రికూటంబసురనగల వ్రేయంగ ఖండించి వాడు
గ్రశరంబుల్ వైచినందద్రథము విరుగ ఘోరంబుగా దాటికూల్చెన్
త్రిశిరున్మున్విశ్వరూపున్ ద్రిదశపతి బలెన్‌దీవ్రతం వాయుజుండున్ 298

శా॥ దానన్వాయుజు మీద గ్రోధమునదిగ్దంతీంద్ర రక్తచ్ఛటా
దానాభోగదయౌగదన్ వయివగా దాల్చెన్ మహాపార్శ్వుడున్
దోనంతన్ ఋషభుండు నడ్డపడియెన్ దోబల్మిచే నగ్గదం
దానే గైకొని వ్రేసిచంపెనపుడ ద్ధైత్యున్మహౌద్దత్యునిన్ 299

శా॥ ఆరీతిందమవార లీల్గగుపితుండై విస్ఫురద్దోర్బల
స్ఫారుండై యతికాయుడున్ హయ సహస్రస్యంద నారూఢుడై
యారాహుధ్వజమర్కునింబొదువ బాణాళింగపిశ్రేణులన్
బారందోలుచు రాముపైనడచె శుంభద్విస్మయా పాదియై 300

వ॥ ఇట్లడరు నతికాయునకు నడ్డంబుసొచ్చి లక్ష్మణుండు తీక్ష్ణబాణపరం పరలబరగించినం జలించక నన్నిశాచరుండు నిశిత విశిఖంబులం దెరల్చిన నాసుమిత్రా నందనుండొక్కశరంబున వానిలలాటంబున నేసిన వాడును తద్ధనుః కౌశలంబునకు మెచ్చిచండకిరణ ప్రచండంబులగు కాండంబులు నిగుడించిన నతండర్ధచంద్రాశుగంబులనవినాశంబు నొందించి నయ్యసురయశని సమంబగు సౌరాస్త్రంబు వ్రేసిన రాఘువానుజుండాగ్నేయాస్త్రంబను సంధించి వైచిన నవియన్యోన్యంబు బోరి దమంత సమసెనంత నిర్జర విరోధి పర్జన్యాస్త్రంబాదిమహాస్త్రంబులనేకంబులు ప్రయోగించిన రఘువంశ సత్తముండును వాయువ్యాస్త్రాది దివ్యాస్త్రంబుల నివారించి మరియు ఘోర నారాచంబువైచినవాని కవచంబు భేదింపంజాలమికి విస్మితుండై వాయుదేవుండు దెలుపబ్రహ్మాస్త్రంబు ప్రయోగించిన. 301

మ॥ ప్రళయాగ్ని ప్రతిమప్రభావమగుతద్బ్రహ్మాస్త్ర మేతేరవా
డలుక న్బాణ గదాదులన్ వయివదానన్నింటినిన్ మ్రింగుచున్
విలసద్రత్నకిరీట కుండలవిభావిష్కారమౌతచ్ఛిరం
బొలయం ద్రుంచి ధరిత్రిగూల్చెనతి కాయున్ దుర్నయోపాయునిన్ 302

వ॥ ఇట్లయ్యతికాయునింబొలియించిన వనచరులు గగనచరులు నుచితవచనంబుల సౌమిత్రిం బ్రశంసింప రాముండునుం గౌగిలించి దీవించెనంత నారావణాంతఃపురంబున హాహారంబులధికంబు లయ్యె నప్పుడు 303

- కుంభనికుంభుల యుద్ధము -

సీ॥ పటుపక్ష సంయుక్త పర్వతంబుల పోలె
పృథులంబులగు మహారథములందు
నవనికి డిగిన కాలాంభోధరములట్ల
ఘనకాయదీధితుల్ గడలుకొనగ

చండదిగ్వేదండ శుండా సముద్దండ
కాండవైఖరిభుజార్గళము లెసగ
ప్రళయ కీలాభీల పాథోనిధుల మాడ్కి
చటుల తరాట్టహాసములునిగుడ

తే.గీ॥ సొరిదియూపాక్షమకరాక్షశోణితాక్షు
లాదియగు యోధవరులు సహాయముగను
బంధురంబున చతురంగబలమునడువ
నడరికుంభనికుంభులు గడగిరనికి. 304

మ॥ అటులాదైత్యులుదాకి సైన్యములు నుద్యత్ప్రౌఢినూకొల్పను
ద్భట కీశాధిపులాత్మసైన్యముల గొల్వన్ వెంటనొండొంటికు
త్కట సంగ్రామము భీమమయ్యె గపులుద్ధం డాప్తిగొండల్ మహా
విటపాదుల్ దనుజుల్గదాసి ముఖముల్ వేవైచుచున్ బోరగన్ 305

కం॥ కరిహరిరథ భటులొక్కట
గురుభల్లూకప్లవంగ గోలాంగూలో
త్కర మొక్కట నిరువాగున్
సరగా గన్బడియె మారి సమరినభంగిన్ 306

ఉ॥ అత్తరిశోణితాక్షుడువియత్తల మంటగనార్చుచున్ మహో
ద్ధృత్తి నెదిర్చినన్ ద్వివిదుడేపున దాకిన వాడునుం రుషా
యత్తతవక్షముంబొడువనల్గి ప్లవంగవరుండుముష్టిచే
నెత్తి బగిల్చి త్రుంచెరజనీచరదక్షుని శోణితాక్షునిన్ 307

కం॥ యూపాక్షుడడర మైందుం
డేపారగ బోరిపోరియెడనొడిచి మహిం
గోపముననడచె వానిన్
రూపరివోవంగ కపులు రూఢిసెలంగన్ 308

వ॥ అంతట కుంభకర్ణాత్మజుండగు కుంభుడు సమరజృంభణంబున మర్మభేదంబులగు శరంబుల నమ్మైంద ద్వివిదుల మూర్ఛనొందించి నందారాసుతుండు వారట్లగుటకుం గోపించి యెదురించిన వాడునుం బాణంబుల నొంచిన నతడు నొక్కనగంబువైవ దానిన్ బొడిసేసి యన్నిశాచరుండవ్వాలితనూజుని ఫాలమ్మునొక్క వాలమ్మునాటించి వివశుంగావించి రఘుపుంగవు పంపున బరతెంచు జాంబవదాదుల

దాకనయ్యిరువురుంగిరిద్వయంబునుంబోలె దలంపడి రప్పుడారక్కసుండు పెక్కుబాణంబులు వైచిన లెక్కకుం గొనకనక్కపివరుండద్దనుజు నొడిచి పట్టిజిరజిరం ద్రిప్పి సముద్రం బున ఘూర్ణితంబుగా వైచినం దోడనేలేచి వాడతని వక్షంబు ముష్టిం ధట్టించిన నతికుపితుండై తపనజుండు నిర్ఘాత పాతంబునుంబోనితన పిడికిటంబొడిచిన నికుంభుండు గతప్రాణుండై ధరణి ద్రెళ్ళిన నయ్యన్నం జూచి 309

చం॥ కడువడి క్రోధముప్పతిలగా రవిసూనుని మీదికిన్నికుం
భుడు పరిఘంబుద్రిప్పుచును భూమిజలింపగబోవ నడ్డమై
కడగుసమీరసూతి పరిఘంబున వ్రేసిన సోలిలేచియా
తడుబడవైచిత్రొక్కి తలదా దునిమెన్ దనుజుంగరంబులన్ 310

చం॥ అటఖరసూనుడైన మకరాక్షుడు మత్పితృఘాతి ద్రుంతునే
నిటననిగీశవాహినుల నేర్చుచుపైబరతేర రాముడు
త్కటముగ తద్రథంబు విశిఖంబుల గూల్చిన శూలహస్తుడై
పటుగతిరాగద్రుంచె ఘనపావకబాణము చేత దైత్యునిన్ 311

వ॥ మరియునుందక్కిన రాక్షసయూధాధ్యక్షులనేకసంఖ్యలవ్వానర యూధాధ్యక్షులం దలపడినిశాత శిలీముఖ పరిఘ పరశు పట్టెస ప్రాసముసల క్షురికాద్యాయుధంబుల నాయోధనంబొనరించిన నవ్వానరవీరల పారక్రోధోద్దీపితులై తరుగిరిశిఖర నఖర ముష్టియష్టి జాను జంఘాది ప్రహరణంబు వ్రేసియు డాసియునొంచియు చించియు నడంచియు గావించిరప్పుడా సంగ్రామరంగంబు తరం గిణియుంబోలె కీలాల ప్రవాహ సహితంబును కరివిహారారామంబునుం బోలె నిర్భిన్నకదళికంబును నరణ్యంబునుంబోలె శల్యవేల్లితంబును లోభిజనస్థితియునుంబోలె నిర్మూలిత ధర్మగుణంబును వర్షా సమయంబునుంబోలె నిర్గతపుండరీకంబును దుర్జన గృహంబునుం బోలె వంచకోదంచితంబును ప్రపంచ వర్తనంబునుంబోలె భూత వ్రాత సమేతంబునునై భయంకరంబైయుండె నివ్విధంబున. 312

మ॥ సొరిదింగొందరురామలక్ష్మణులచే సుగ్రీవుచేగొందరున్
సురరాట్పాత్రునిచేత గొందరుమరుత్సూనుండు సంపంగ గొం
దరునయ్యెగపి యూధసత్తముల చేతన్ గొందరిట్లందరున్
సురవిద్వేషులునాశమొందిరి రణక్షోణింబ్రహస్తాదికుల్ 313

తే॥గీ॥ రామతేజస్సమావేశతామహత్త్వ
కలనబలవంతులైరి తత్కపులునెల్ల
రామభక్తి విహీనులౌ తామసులకు
నిట్టిసామర్థ్యకలన దానేలగలుగు 314

వ॥ కావున 315

శా॥ జ్ఞానానందమయుండు సర్వమయుడున్ సర్వేశుడున్ సర్వసం
ధానాదానధురీణడయ్యునపుడాత్మ స్ఫూర్తియౌ మాయచే
మానుష్యత్వ విడంబనంబునను రామస్వామి యుద్ధాదిలీ
లానేకక్రియ లాచరించె భయదవ్యాప్తిన్ విలాసార్థియై 316

వ॥ ఇవ్విధంబున నతికాయ ప్రహస్తప్రముఖులాయోధనతలంబున సమస్తబలసహితంబుగా నిహతులగుట విని దైత్యకాంతుండత్యంత శోకాక్రాంతుండై యంతటన్ గ్రోధాతి శయంబున ధైర్యోత్సాహంబుల దెచ్చుకొని లంకారక్షణార్థంబుగా నింద్రజిత్తు నియోగించి యనేక రాక్షసయూథాధ్యక్షులుం దోడనడవరామునితో సంగ్రామంబొనర్ప మహాప్రతాపంబునం దనంత వెడలందలంచి యప్పుడు 317

- రావణుడు ప్రథమ యుద్ధంబునకు వచ్చుట -

సీ॥ దశభాను లుదయభూధరమున వెలుగొందు
రహికిరీటములు శీర్షములవెలుగ
కల్పాంతపావకోల్కాపాతముల రీతి
నేత్ర కోణంబుల నిప్పులురుల
పటులీలనగ పార్శ్వ భాసిత ప్రత్యంత
పర్వతంబుల భాతి బాహులడర
పరిఖండ లగ్నశుంభద్గిరిస్థితిమరు
త్కరిదంత లగ్న వృక్షంబుదనర

తే.గీ॥ హేమగిరిబోల్చు హరినీల శృంగమనగ
శాతకుంభమయోన్నత స్యందనమున
నతిబలోద్ధతి నాసీనుడగుచు వెడలె
రావణుండు త్రిలోక విద్రావణుండు 318

శా॥ భేరీకాహళ శంఖతూర్య పటహాభీలధ్వనుల్ మ్రోయఛ
త్రారూఢధ్వజ చామరప్రభలు పార్శ్వాగ్రంబులంగ్రాలవి
స్తార ప్రక్రియ వందిమాగధ మహోధ్వానంబు ఘూర్ణిల్లగం
భీర ప్రౌఢినిపంక్తి కంతుడు రణస్ఫీతోద్ధతిం బోరగన్ 319

సీ॥ గంధ సింధురఘటా గర్భభూమి ధరంబు
దృఢతరరథమహాద్వీప చయము
పటుతురంగ వ్రాతభంగసం ఘాతంబు
చటులభటచ్ఛటా జలచరంబు

కలితశితచ్ఛత్ర ఘనపుండరీకంబు
చారుచామరవార కైరవంబు
పాండురధ్వజకాండ డిండీర ఖండంబు
శస్త్రాస్త్రమాలికా శైవలంబు

తే.గీ॥ నగుచు శూరకృత ధ్వానమంబురవము
భూతల సముద్ధితరజంబు పొందుగాగ
శరసముద్ధతిచే వార్ధి బొరలుభంగి
నపుడు దశముఖ నఖిల సైన్యములు నడచె 320

వ॥ ఇట్లు బలసహితంబుగా దైతేయనాథుండేతెంచుచున్నంగని యీవచ్చు చున్న మహావీరుండెవ్వండని యడిగిన రఘువరునితో విభీషణుండు యితండుగదా భువనత్రయ భయప్రదోన్ముఖుండగు దశముఖుండని సెప్పిన నతని యతిశయ విభవంబున కచ్చెరువంది సౌమిత్రియుక్తం బుగా యుద్ధసన్నద్ధుండై సకల కపివీరులం బురికొల్పిన వారునుశైల సాల శిలాది సాధన సహితులై నిర్భరంబుగానార్భటింపుచు నెదురించిన నద్దనుజబలంబునుగరవాలశూల కులిశాద్యాయుధం బులతో సింహధ్వానంబు లెసంగంబోరిన నుభయ బలంబులం ప్రళయ నిధులుంబోలె గలయంబెలసిననొండొంటికి నద్భుతావహం బుగా నాహవంబు సెల్లెనందు 321

తే॥గీ॥ ఏచి కార్చిచ్చు కాననంబేర్చు పగిది
నాయుధంబుల మిరుమిట్టు లతిశయిల్ల
ఘోరభంగిని కపులు గగ్గోలు పడగ
బారిసమరెడు దానవబలము జూచి 322

కం॥ ప్రళయాంభోదములు సము
జ్వల భంగింబేర్చునటుల వనచరసైన్యం
బులుగిరితరు వర్షంబులు
చలమున గురియించిరసుర సైన్యము సమయన్ 323

కం॥ అదిజూచి పంక్తి వదనుడు
మదినేచిన కోపమొదవ మరిమరియు నభం
బదరగ విల్మోరయింపుచు
గదియెం జనుదెంచె కపిని కాయము బెగడన్ 324

కం॥ ఒక్కొక్క సాయకంబున
పెక్కుంద్రం గపులదునుము బేరుక్కునవా
రొక్కట వైచిన తరుగిరు
లెక్కుడు వడినుగ్గుగాగ నేయుచునంతన్ 325

సీ॥ గంధమాదన గజగవయగవాక్షుల
నొక్కనొక్కని నాల్గునురుశరముల
శరభతారక్రతుశతబలి కుముదుల
ప్రత్యేకమైనైదు బాణములను
నలనీల పనసమైందద్వివిదార్కుల
వేర్వేరపదిపది విశిఖములను
వాయుజాంగద జాంబవంతుల మువ్వుర
నిరువదియిరువది శరములేసి

తే.గీ॥ ఘోరశరవృష్టి మరియును గురియ హరులు
శిరములురములు చరణముల్ గరములురులు
గుదులు గ్రుచ్చిన రీతిని గూలి పొరలు
వారు నొరలు వారునుచచ్చు వారునైరి 326

వ॥ ఇవ్విధంబునం కలహోత్కంఠుండై పంక్తి కంఠుండు విజృంభించినం బారు కపిబలంబులం జూచి యాగ్రహంబున సుగ్రీవుండొక్క మహాశైలంబిరుగేలంగొనివచ్చివైచిన నన్నిశాచర వరుండు మణివిచిత్రపుంఖ కాండంబుల దాని ఖండించి మహోరగంబునుం బోలు యొక్కవాడినారసంబవ్వక్ష చరాధ్యక్షు వక్షంబునుచ్చి పారంగ్రుచ్చిన నతండు మూర్ఛిల్లినంగని గజగవయగవాక్ష ఋషభసు దంష్ట్ర నలజ్యోతిర్ముఖ ప్రముఖులగు వలీముఖులనేక కుధరంబులు వైచిననిశిత ప్రదరంబుల వానినన్నియుంద్రుంచి వారినందరనన్ని సాయకంబుల మృతప్రాయంబులుగా బడంగెడపినం గనలి యనిలసుతుండదల్చుచు నద్దనుజవరుంగదసి భుజామధ్యంబున నుద్ధవిడిన్ బిడికిటన్ బొడిచిన వాడును మూర్ఛిల్లితెలసి పిడుగుం బోలు తన పిడికిట నమ్మరుత్సుతు నురంబునుంబొడిచిన నతండు నేలనుంసోలిన నీలుండును నుంకించి లంకామలయ శిఖరంబు వైచిన నారాచంబుల దానింబొడిజేసిన నద్దైత్యవరునరదంబున కురికియక్కపివరుండు తన్మకుట పటలచ్ఛత్ర చాపధ్వజాగ్రంబుల పయిం జిత్రగతి నటియింపుచు నవధానంబుల బహువిధంబుల విహరింపనన్నిలింపవైరితెంపున మహోగ్రంబగు పావకాస్త్రంబు గీలించిననదియన్నీలుని సోలించి పితృభావంబునంజేసియతని ప్రాణంబుల కలుగకుండెనంత రవినందనాదులందరు దెలసి బలసహితంబుగా దన్నుంజుట్టు ముట్టిన సహింపక. 327

శా॥ కోపాటోపము చూపులంబొడమ దిక్కుల్ వ్రీళగా నార్చుచున్
చాపంబుల్మారయింపుచున్ వివిధ సంచారోద్భటంబై రథం
బేపారన్వధియింతు రాఘవుల నెంతే నాజిలోనంచు బా
హాపాండిత్యము మీరగా నడిచె దైత్యాధీశుడత్యుద్ధతిన్ 328

మ॥ ఘనభేరీ పటహధ్వనుల్మారయ రక్షశ్రేణులుప్పొంగఘో
రనిశాతప్రదరౌఘ లాఘవధనుః ప్రావీణ్యమేపారనే
పున జెండాడగ నవ్వలీముఖబలంబుల్ వ్రాయిచున్ సోలుచున్
గనిభీతిన్ రఘువర్యువెన్కకొదుగంగా జేసి యేతేరగన్ 329

- రామరావణుల యుద్ధము -

సీ॥ శరదంబుజంబుల సరిగొన్న రుచిగన్న
కన్నులకెంజాయ గడలుకొనగ
ఘనభుజగేంద్ర భోగంబులసిరి జూపు
మూపులు నుప్పొంగి మురులెసంగ
పూర్ణిమా చంద్రమస్ఫురిత వైభవమోము
మోమున కనుబొమల్ ముడివడంగ
మత్తేభ గమన సంపద్గుణాస్పదము లౌ
పదముల నడలుర్విభరము బూన

తే.గీ॥ తతజయోద్ధండ కోదండ దండ మెలమి
చేత నలరించి శౌర్యంబు చేత మించి
ప్లవగపతి బొంగ రాక్షస బలము క్రుంగ
భండనోన్నిద్రుడై రామభద్రుడపుడు 330

శా॥ జ్యావల్లీ రవమాకసంబు బగులం జండాంశుగ స్తోమముల్
దేవద్వేషుల గప్పుచున్ సురలు కీర్తింపంగదాకన్ గుణా
రావంబుప్పతిలంగ దైత్యవిభుడస్త్ర వ్రాతసంధానతా
ప్రావీణ్యంబుగదాక నిద్దరకు ఘోరంబయ్యె పోరయ్యెడన్ 331

కం॥ ఇరువాగు బొంగిచూడగ
నిరువురు పటు బాణజాలమెంతయు రోదో
తరపూరితముగ గవిసిన
ఖరకరుడుం గ్రుంకు నటుల గవిసెతమంబున్ 332

వ॥ ఇవ్విధంబుల రామరావణులుందలపడి చండకోదండ ధ్వానంబులు బ్రహ్మాండంబు ఘూర్ణిల్లనుద్దండతర కాండంబుల నొండొరుల గప్పుచు రౌద్రాస్త్రంబు లేసిన నవియొండొంటి నుద్రేకంబునంబోరి పోరిసమసెనంతనద్దైత్య కాంతుండు వాలమ్ములురాము ఫాలమ్మున గీలించిన నతండతి నిశిత విశిఖంబులం వానికంఠంబులు సించి నొప్పించిన వాడునుంగోపించియసురాస్త్రంబు ప్రయోగించిన నది శరభశార్దూల సింహోరగ సూకరప్రముఖ ముఖాస్త్రమయంబుగా నడర నతండాగ్నేయాస్త్రంబు సమంత్రకంబుగా సంధించిన నదియుజ్వల జ్వలన జ్వాలా భీలంబుగా గవిసి దానిమాయించిన నద్దనుజేశ్వరుండమ్మయ నిర్మితంబగు మాయా మయాస్త్రంబు వైచిన నదిబాణకృపాణ పరశుపట్టస ఖిండివాల చక్రగదా ముసల ముద్గరా ద్యాయుధ మయంబుగా నేతేర రామచంద్రుండు గాంధర్వాస్త్రంబునం దాని బొలియించె నిట్లనేక దివ్యాస్త్రంబులు ప్రయోగింపుచు నన్యోన్యజయ కాంక్షలం బోరునవసరంబున గుహనిర్గత మహా మృగేంద్రుండునుం బోలెసుమిత్రానందనుండడ్డంబు వచ్చితత్సారథి శిరంబొక్క తీవ్రశరంబునం గూల్చి తదీయ కార్ముక కేతనంబు లర్ధచంద్రాస్త్రంబులంద్రుంచి నిశాతసాయకంబుల విశాలంబగు నిశాచరాధ్యక్షు వక్షంబు భేదించి నొప్పించిన విభీషణుండు కులాచ లోత్తుంగంబులగు రథతురంగంబుల గదాహతిం జదియ మోదిన విరథుండైలంకావల్లభుండు గోపోద్దీపితుండై వేరొండు రథంబెక్కి నిరంతర పిసితాసవ పరిపూజితంబును నితాంతప్రభా పటల విరాజితంబును ద్రిలోకజయ శక్తియైనమయదత్తంబగు మహాశక్తి గదా కలిత భుజుండగు విభీషణు మీదం బ్రయోగించిన 333

సీ॥ ప్రళయ కాలాభీల భానుమండలమన
నిబిడ ప్రభాపాళి నింగినిండ
కనద కాలాంబోదగర్జిత ధ్వనిమాడ్కి
యష్టఘటానాద మవని బెరయ
నమరాధిపతిచేత నడరు వజ్రమురీతి
దిక్కుల మిరుమిట్లు బిక్కటిల్ల
భుజగేంద్ర జిహ్వికా భూరికరాళమై
యురుతరవిషరోచులుట్టి పడగ

తే.గీ॥ నఖిలము దహింపబోల్చు కాలాగ్ని లీల
బొలుచుమంటలు పైపైని భుగులు కొనగ
నమ్మహాశక్తి యద్ధృత్తి నద్భుతాప్తి
నవ్విభీషణు బొలియింప నరుగుదేర 334

- లక్ష్మణుడు మూర్ఛపోవుట -

చం॥ కనిరఘు వీరుచేనితడు గాంచిన వాడభయంబుగాననే
డనిమొన దీనిచే వెదకు నర్హుడు గాడిపుడేను గాతునం
చనిఘున చాపయుక్తుడయి యాతనివెన్కకు ద్రోచిసాహసం
బెనయగ లక్ష్మణుండు జలియింపని శైలముభంగినడ్డమై 335

తే॥గీ॥ శరపరంపర బరగింప చండభంగి
దానినన్నింటిత్రిుంగుచు దాడిమెరయ
నధికతరశక్తినాశక్తి యరుగు దెంచి
వడిబ్రవేశించె లక్ష్మణు వక్షమునను 336

సీ॥ లోకంబులందు మాయాకల్పితంబులై
యెన్నేని శక్తులు నెసగుచుండు
నట్టిశక్తులకెల్ల నాధార భూతంబు
నైదనరారు మహాత్మకుండు
హరిమూర్తియగుచు శేషాంశసంభవ మహా
లక్ష్మణుండగునట్టి లక్ష్మణునకు
నల్ప కల్పితమును నల్పసారంబునౌ
నిట్టి మాయాశక్తి యేమియగును

తే.గీ॥ నైనమానుషభావంబు నావహించి
మించు తత్కృత్యముల బ్రవర్తించుగాన
బ్రాకృత మనుష్యరీతి విభ్రాంతిదోప
దాన సౌమిత్రి మూర్ఛిల్లి ధరణిబ్రాలె 337

ఉ॥ బ్రాలినలక్ష్మణుంగదిసి రావణుడెత్తగ బోయి చిక్కెహా
స్తాళులు చేగదల్చుటకు నైనను జాలక విస్మయంబుతో
నేలగదల్పనోపు పరమేశు మహాబలు విష్ణునిన్ జగ
త్పాలు విరాణ్మయుం జగదుపాశ్రయు నీలఘుదైత్యుడెంతయున్ 338

సీ॥ ఈ గతి సౌమిత్రినెంతయెగొనిపోవ
గమకించు న ద్దైత్య కాంతుజూచి
కనలిమారుతి వజ్ర కల్పంబునగునట్టి
ముష్టిచే తద్వక్షమునను బొడువ

దానిచే నేత్రవక్త్ర శ్రోత్రముల రక్త
మడరంగ ఘూర్ణమానాక్షుడగుచు
తనదుతేరి సమీపమున బిట్టు నిట్టూర్పు
లొదవంగబడె జానులూదు కొనుచు

తే.గీ॥ నంతరావణ బాధితుడైన యట్టి
లక్ష్మణునియాత్మ బాహార్గళములచేత
బట్టి వెసనెత్తికొని రామభద్రుసన్ని
ధానముననిల్పె నప్పవమాన సుతుడు 339

కం॥ బలవంతులలోనెల్లం
బలవంతుడు లక్ష్మణుండు బరమేశుడజుం
డల హనుమంతుని భక్తికి
గలమైత్రికి మెచ్చి చులుకగాగం దోచెన్ 340

కం॥ నారాయణాంశజుండగు
టారసి లక్ష్మణుని విడిచి యాశక్తియుదా
నారావణు రథమునకున్
జేరన్మరలంగ గడువిచిత్రమెసంగన్ 341

ఉ॥ అంతట మూర్ఛదేరి విబుధారి సరోషతచాపధారియై
యెంతయు నార్చుచున్ రఘులేశ్వరు పైనరుదేరరాముడ
త్యంతరుషా కషాయిత కటాక్షుడునై యను జన్మకైయిటం
జింతిలవేళగాదనుచు శీఘ్రము రావణుపై గడంగుచోన్ 342

కం॥ హనుమంతుడు గనుగొని యి
ట్లనియెను కేల్మొగిచి రథికుడఖిలేశదశా
ననుడీవు పాదచారివి
గనకన్నామీద నిలిచి గడగుము ననికిన్ 343

మ॥ అననంతన్ బలవంతుడౌ నతనిపై నాసీనుడై వజ్రని
స్వన నిర్ఘోష పటిష్ఠ నిష్ఠుర గుణధ్వానంబుతో రాముడ
ద్దనుజేశున్ రథసన్నివేశు గనియుద్యత్క్రోధ సంరంభుడై
ఘనగంభీరవచోనిగుంభన మెసంగన్వానితో నిట్లనున్ 344

చం॥ నిలునిలు రాక్షసాధమ యనిన్సకలంబున తుల్యదృష్టిచే
నెలమి వసించు నాయెదుట నిట్లపరాధము జేసి యెక్కడన్
దొలగెదవేశరంబునను ద్రుంచితి మున్ననిశాటులం జన
స్థలమున దచ్ఛరంబుననె చయ్యన నిన్నిదె నేవధించెదన్ 345

వ॥ అని పలికిన రఘువరుని వచనంబులువిని రావణుండాహవంబున నారఘూద్వహుని వహించు హనుమంతునింగదిసి నిశిత శరంబుల నొప్పించిన నిట్లు ఘోరనారాచపీడితుండయ్యును వాయుసుతుండు రఘువర్యతేజోవిశేషంబు వలన వెండియుం దేజో విరాజితుండై మహాధ్వానం బొనర్చిన నయ్యాంజనేయ కాయంబునంగలగాయం బుల నీక్షించి రెండవకాల రుద్రుండునుంబోలె క్రోధోన్నిద్రుండై తీక్ష్ణశరంబుల వాని సారధింద్రుంచి రథంబు ఖండించియు ఛత్రంబుజించియుధ్వజంబు గీలించియు శస్త్రౌఘంబు విదళించియు రథంబు జూర్ణంబు గావించియుం గలంచి యంత నశని సదృశంబగు నొక్క మహాశరంబున సత్వరంబున పాకాంతకుండు పర్వతంబునుం బోలెనయ్య సురవరునురంబు వ్రచ్చినొప్పించి కరలాఘవంబు జూపిన రాఘవబాధితుండై యవ్వీరుండునుం జలించి భ్రమించునవసరంబున కరంబులనిశరాసనంబులు దమంత ధరణింబడినంగని రామచంద్రుం డర్ధచంద్ర బాణంబుల భానుప్రభా ప్రసారంబులగు దత్కోటీరంబులంద్రుళ్ళనేసి మరియు నయ్యమర వైరితో నీవీయెడమదీయసాయక పీడితుండవై వెలసితి వగుట నాయనుమతిం బురంబునకుంజని సేదదేర్చుకొనుమెల్లి మద్బలంబెల్లంజూచెద వనిన రామబాణ హతుండును హతదర్పుం డును నై దశముఖుండధిక లజ్జితుండును నత్యాతురుండును నగుచు లంకాపురంబు ప్రవేశించనంత 346

ఉ॥ ఈగతి మూర్ఛితుండయి మహింబడియున్న గనిష్ఠ లక్ష్మణుం
డాగని మర్త్య భావమును దార్చుట రాముడు బ్రాకృతుంబలెన్
హాగుణసార లక్ష్మణ మహావనినాకు నహీనతన్ సహా
యాగతిసేసి గాసిలితిగా యని శోకము జెందెనెంతయున్ 347

వ॥ అంతనా రఘుకులాగ్రణి సుగ్రీవజాంబవ ద్విభీషణ సుషేషసహితుండై హనుమంతుం బిలిచి వత్సా! భవత్సామర్థ్యంబున నుత్తర దిగ్భాగంబున హిమశైలహేమకూట కైలాసశృంగ వతంసంబుల నుత్తరించి యుత్తరలవణసముద్రంబునుం గుశద్వీపంబును క్షీరసాగరంబు నతిక్రమించి గ్రమంబున చంద్రశైలసమీపంబునం జెలువందుపయ స్సింధు మంథాన సమయ స్యందమాన సుధాబిందుసందోహ సందర్భిత శృంగ ప్రభూణంబగు ద్రోణంబనుపర్వతంబునంగల విశల్యసంధాన సంజీవసౌవర్ణ కరణి నామంబులందగు దివ్యౌషధీ స్తోమంబులం బూర్వప్రకాశంబునం దెచ్చి మూర్ఛితుండగు లక్ష్మణుం

జీవితుంజేసి తత్తత్సమర నిర్గత ప్రాణులగు గపిశ్రేష్ఠులకుం బ్రాణంబులొసంగు మనిన రఘుపుంగవు
వచనంబంగీకరించి సువేలశృంగంబెక్కియుప్పరంబున కెగసి యప్పవనతనయుండు పవన
జవంబునమ్మహోదధి గడచి చనియెనప్పుడు 348

ఉ॥ చారులు వచ్చి రావణుని సన్నిధికింజని దేవరాఘవ
ప్రేరితుడై సమీరసుతుడేపున లక్ష్మణ జీవనార్థమై
దేరిమహౌషధీతతులు దెచ్చుటకై కలశాబ్ధి కేగెనం
చారయవచ్చిననివినిదశాననుడెంతయు చింతితాత్ముడై 349

కం॥ సరిప్రొద్దు వేళనొక్కరు
డిరవందంగాలనేమి యింటికి వేగం
బరుదెంచె చంద్రహాసము
ధరియించి నిగూఢ కార్యతత్పరుడగుచున్ 350

తే॥గీ॥ ఇటులనేతెంచు రాక్షసాధీశుగాంచి
కాలనేమి భయాశ్చర్య గతివహించి
యర్ఘ్యపాద్యాదికృత్యంబు లాచరించి
యంజలిఘటించి చేరువనధివసించి 351

కం॥ దానవ వల్లభ! యిపుడె
ద్దాన సహాయంబువలయు దానిని వేగం
బానతి యిచ్చిన జేసెద
నేననుచున్ బలుక కాలనేమి కతండున్ 352

కం॥ ధరణీసుత నే దెచ్చుట
నెరుగుదువేకద! తదర్థ మిచటికి రాముం
డరుదెంచి రాక్షసులనం
దరద్రుంచెన్ సుతులబంధు తతులను నగుటన్ 353

సీ॥ కాలవశంబున కష్టమిట్టిది నాకు
గలిగెనటంచు శోకంబుజెంది
బలికెనిట్లని మహాబలియుడౌ సౌమిత్రి
మచ్ఛక్తి నిహతుడై మహిని బడియె

నాతని బ్రతికింప నౌషధంబులు దేర
నరుగుచునున్న వాడనిలసుతుడు
మహితాత్మమాయచే మౌని వేషంబున
మొనయంగ నాతని మోహపరచి

తే.గీ॥ కాలమాలస్యమౌనట్లుగా ఘటించి
యమ్మహావానరుడు బోవునట్టి కార్య
మెట్లువిఘ్నంబుగానగు నట్లొనర్చి
మరలి వేగమె నీవింటి కరుగు దెమ్ము 354

- రావణునకు కాలనేమి జ్ఞానోపదేశంబు జేయుట -

చం॥ అనియిటబల్కిరావణున కవ్విదితాత్ముడు కాలనేమి యి
ట్లను వినురాక్షసాధిప! యథార్థముగాగ మదీయ భాషితం
బెనయగ నిశ్చయింపుమదియెన్నిట నీకు బ్రియంబె సేసెదన్
బనుపడదేను నీపనికి బ్రాణము లాసయొనర్పకెంతయున్ 355

కం॥ మును మృగరూపముతో మ
జ్జనకుడు మారీచుడడవిసమసె నెటులన
ట్లన నాకున్ ఘటియిల్లెను
దనుజేశ్వర బొంకుగాదు తథ్యంబిదియున్ 356

వ॥ అదియెట్లంటేని 357

కం॥ రాముడతిలోక విక్రమ
సీముడదింగాక సకల జీవహృదంత
ర్ధాముడు బరమాత్ముడు సు
స్థేముడు హరిగాన మనకజేయుండగుటన్ 358

సీ॥ దనుజేశ! నీపుత్రులును పౌత్రులును మిత్రు
లును దైత్యులునునేడు సమసిరాజి
నసురవంశమునెల్ల ననియిట్లు సమయించి
యీవు జీవించిననేమి ఫలము?

సీతచేతను రాజ్యభూతిచేతను జడ
స్థితియైన దేహంబుచేతనేమి
గానరామున కిమ్ము జానకి నఖిలరా
జ్య ప్రాభవము విభీషణునకిమ్ము

తే.గీ॥ నీవు ఘనమతి వైరాగ్య నిష్ఠతోడ
ద్వేషరోగంబులను మాని తెలివిబూని
మౌనిజనతాశ్రయమ్ము రమ్యమ్మునైన
వనమునకు బొమ్ము! యిది సుఖావహము సుమ్ము! 359

మ॥ తగునప్పుణ్యతపోవనంబునను బ్రాతఃస్నాన సంధ్యాది కృ
త్య గతుల్ శుద్ధజలంబునం సలిపి యేకాంతంబునం నిల్చియిం
పగు సిద్ధాసననిష్ఠ సర్వవిషయ వ్యాపారముల్ మాని బా
హ్యగమౌ నింద్రియవృత్తి మెల్లగను ప్రత్యఙ్మా ర్గమొందింపుచున్ 360

ఉ॥ భూతగుణంబులెల్ల వెలిబోవకలోనివురం దదింద్రియో
ద్భూతిమనంబుతో నొదుగ బుద్ధి చిదాకృతి నూర్ధ్వగామియై
జ్ఞాతినెదుర్కొనన్ బ్రకృతి సంస్కృతికంటె బరుంబరాత్మ నీ
రీతివిచార భావమొనరింపగ నౌననఘాత్మ యెప్పుడున్ 361

తే॥గీ॥ దేహబుద్ధీంద్రియాదిక స్థితిదనర్చి
యట తృణబ్రహ్మపర్యంతమైన యీచ
రాచరాఖిలమగు జగంబందు వినగ
కనగనగు నెద్ది ప్రకృతిగా దనరు నదియు 362

కం॥ అదియగు మాయయనంగా
నదియెజగద్వృక్ష జనన హరణస్థితికా
స్పదమదియె బ్రజల జగముల
నొదయించి శతాశితారుణోదయగతులన్ 363

సీ॥ నిబిడతమోగుణ నీలకుంతలయును
మోహరూపకముఖాంభోజయుతయు
సముచితజ్ఞాన విజ్ఞానలోచనయును
నూర్జితరాగాధ రోష్ఠమణియు

మదమత్సరస్తన విదితసంశయ మధ్య
వివిధ క్రియాక్రియ వృత్తిహస్త
కలితసంకల్ప వికల్ప పాదద్వంద్వ
★ప్రాపి తాహంకార రూపిణియును

తే.గీ॥ కామరోషహింసా స్పృహానామ ముఖ్య
పుత్రపుత్రీ సమేతయై బోల్చునట్టి
ప్రకృతి కామిని నిజగుణ ప్రాభవమున
నెపుడు విభుడగు నాత్మ మోహింపజేయు 364

వ॥ అదియును గాక సుశీలయగు ప్రౌఢాంగన ప్రయోజనవిశేషంబులు దానొనర్చియుందదీయ కర్తృత్వాదికంబులు నిజయజమానుని యందు జెందజేయు విధంబున ప్రకృతియును కర్తృత్వ భోక్తృత్వాదికంబులగు నిజగుణంబుల నీశ్వరుండగు పరమాత్ముని యందారోపించియతండే కర్తయు భోక్తయునను వ్యవహారంబు నొందించి యీదృశంబులగు విలాసంబుల నయ్యాత్మనితన వశు నింగావించి యవ్విభునితోడంగూడ నెప్పుడు గ్రీడింపుచుండు నట్టి యాత్ముండు బరిశుద్ధుండయ్యును మాయాయుక్తుండగుట దన్మాయా గుణమోహితుండై నిజస్వరూపంబు మరచి బాహ్యవ్యవహారంబులం దోచు గతింగనంబడనెప్పుడేని సద్గురు స్వరూపకుండగు బోధకుని చేత బోధింప బడునపుడుం దదా బ్రకృతిం దొలంగినయ్యాత్ముండు స్వస్వరూపంబుగా నెరుంగు దానంజేసి దేహిప్రకృతి గుణంబులం బాసి జీవన్ముక్తుండగుం గావుననీవు నియతేంద్రియుండవై యివ్విధంమున నాత్మవిచారంబగు బ్రకృతికంటె భిన్నుండగు నాత్మ నెరింగి ముక్తుండవయ్యెదవని చెప్పి వెండియునిట్లనియె 365

కం॥ ఈవిధమగు ధ్యానమునకు
నీవు దగకయుంటి వేని నిర్గుణనిష్ఠా
భావమెడలి సగుణుండగు
దేవుని విభునాశ్రయింపు ధీరవిచారా! 366

తే॥గీ॥ అట్టిదేవుండు రాముడేయగునుగాక
నధిపహృత్పుండరీక మధ్యమునమణి గ
ణాంచితంబగు ▲హేమపీఠాగ్రమందు
సీతతోగూడ నాసీను జేసి యతని 367

సీ॥ వీరాసననివాసువితత నేత్రవిలాసు
విద్యున్నిభ ప్రభాన్వీతవాసు

★ ప్రాప్తితా – గ.ము.ప్ర. పాఠం

▲ మృదుసూక్ష్మహేమపీఠి – గ.ము.ప్ర. పాఠం

ఘనరత్న కోటీరు కనక కుండలధారు
సారసువర్ణ కేయూరహారు
కటకభూషితహస్తు కౌస్తుభాదికవస్తు
కమనీయ వనమాలికా ప్రశస్తు
కాంచన కటిసూత్రు కనక నూపురచిత్రు
సముదీర్ణ మరకతశ్యామ గాత్రు

తే.గీ॥ చాపవరయుగ్మ కరలక్ష్మణోప సేవ్యు
భవ్యు శ్రీరాము సకలహృత్పద్మధాము
పరమ భక్తిని భజియింపు పంక్తివదన
సందియములేక మోక్షంబు జెందెదీవు 368

ఉ॥ ఈవిధిచే భజింపుచును నెప్పుడు భక్తుల చెంత సత్కథల్
భావమునొండు దిక్కునకు బారగనీక శ్రుతిప్రమోదముం
గా వినెదేని పూర్వకృత కల్మషముల్‌జెడు నెన్నియేనియున్
బావకకీల తూలతతి భస్మము నౌగతి నాక్షణంబునన్ 369

ఉ॥ వైరముమాని భక్తినిజవర్తన చేత సదాహృదబ్జమం
దా రఘురాము సర్వజగదంతరపూరితధాము భావనా
పారవిచార భావపరిభావితరూపుననామ రూపునిన్
జేరిభజింపుదైత్యవర! చిన్మయవేషపురాణపూరుషున్ 370

చం॥ అనియిట కాలనేమి గదితామృత తుల్యములైన వాక్యముల్
దనుజకులేంద్రుడు న్వని యుదగ్రతరోషకషాయి తాక్షుడై
యనలముచే ప్రదీప్తమగు నాజ్యము తోయము చేతనుంబలెం
గని కనిమండుచున్బలికె గాఢతరోక్తుల కాలనేమితోన్ 371

కం॥ నరమాత్రునతిశయింపుచు
పరమాత్మునిగాగ జెప్పి పరిపరిగతులన్
దురితాత్మవినుమదాజ్ఞా
పరాఙ్ముఖతనుండెదీవు భయమున్ లేకన్ 372

కం॥ పరుల వలననేమేమో
పరిదానములంగ్రహించి బహువిధముగ ద
త్సరణి న్మాటాడెదు రఘు
వరు కింకరుయట్ల యిపుడె వధియింతునినున్ 373

కం॥ అనినన్ రావణుతోడుత
దనుజేశ్వర కోపమేల తగునా పలుకుల్
మనమునరుచింపవేనియు
చనినీ చెప్పిన విధంబు సలిపెద నేనున్ 374

వ॥ అనియివ్విధంబున బలికి రావణుపనుపున మహోసురుండగు కాలనేమి హనుమంతునకు విఘ్నంబు సేయుటకునై రయంబునంజని హిమవన్నగ పార్శ్వంబునం తపోవనంబుగల్పించి యందమ్మాయా పరుండనేక శిష్యజన పరివృతుండై మునివేషంబున వేదాధ్యయనంబు సేయుచు మహామతియగు నమ్మారుతి జనుచున్న మార్గంబు నధివసించె నంత నత్యంత ప్రభావంతుడగు నాహనుమంతుం డరుగుచుననుపమంబగు నయ్యా శ్రమంబు గాంచి యంతరంగంబు నంగొంత జింతించి యద్భుతకరం బగు నిమ్మునియా శ్రమంబు మున్నిందుగనంబడదిపుడు దోచుచున్నయది మార్గ విభ్రమంబు నెన్నియుంగానోపుదానంజేసి నేనియ్యా శ్రమంబు బ్రవేశించి మునింగాంచి సకలంబును విచారించి సలిలంబునుపయోగించి ముఖ్యతరంబగు ద్రోణమహీధరంబునకుంజనియెదనని తలంచి మహీతలంబున కుడిగి వచ్చి యచ్చట 375

సీ॥ బహుపలాశద్విజ భాషణోత్కర్షిత
వివిధాగమస్తోమ విలసితంబు
ఘనతరసామ సంఘటనాను భావిత
సవిధసురామోద సంగతంబు
వరసమిత్కుశలతా వర్తన సఫలాప్తి
వృతసుమనోభేద విరచనంబు
పంకజాతోదయాస్పద మహామృతగుణా
ధార ప్రచార కాసారకంబు

తే.గీ॥ పుణ్యజన సంకులానేక భూషితంబు
శాస్త్ర పాదపరిష్కార విస్తృతంబు
గనియెపావని యప్పుడక్కాలనేమి
యాశ్రమము తాపసహిత పరిశ్రమంబు 376

వ॥ అదిమరియుం గదళీ సాలరసాల తమాల హింతాలఖర్జూర కాశ్మీర పనసతినిశ కేతకీమాలతీ మల్లికావల్లి కాది పాదప ప్రతాన వృతానేక పరిపక్వఫలభరానమచ్ఛాఖానికాయ కలితంబును, సర్వతః పరీత యోజనాయతంబగు పరిశుద్ధనిర్మలినంబును రమ్యతరంబును నగు నయ్యాశ్రమంబునందు 377

కం॥ జపమాలికచే ద్రిప్పుచు
గృపమాలిన కాలనేమి గృత్రిమవృత్తిన్
జపిరీతిని హరపూజా
విపరీతత నింద్రజాల విధినుండంగన్ 378

- ఆంజనేయుండు కాలనేమిని సంహరించుట -

సీ॥ అక్కాలనేమిని నిక్కంబు మునియంచు
పావని గారవంబారహిల్ల
యభివాదన మొనర్చి హనుమంతుడను వాడ
రాముని దూత నేనో మహాత్మ!
రామ కార్యార్థినై సౌమిత్రి బ్రతికింప
జనియెద నేక్షీరజలధి కడకు
ఘనతృష్ణచేత డస్సినవాడను యధేచ్ఛ
జలము గైకొన జలస్థలము సెపుడు

తే.గీ॥ యనినవినివాడు మారుతికనియె నీవు
మత్కమండలు జలము సమ్మతి గ్రహించి
యిచటిపక్వఫలంబులెంతే భుజించి
యిందు నీవును సుఖ నిద్రజెంది నిలువు 379

ఉ॥ భూతభవిష్యదర్థములు భూరితపోగతి నేనెరుంగుదున్
భ్రాతిగ రామువీక్షణములం★గపి కోటియులక్ష్మణుండు నుం
జేతన తాప్తి లేచిరని చెప్పినచో వినివిస్మయాప్తిచే
నాతరివాయునందనుడు నద్ధనుజుంగని వెండియిట్లనున్ 380

కం॥ నాతృష్ణయధికమగునీ
చేతికమండలు జలంబుచే తృప్తింగా
దీతరి నొక్క జలాశయ
మాతత గతిజూపవే! మహాముని! యనినన్ 381

వ॥ అంతనద్దెతేయుండు భయంకర మకరీ నివేశంబును జలాశయ యంబు మనంబునందలంచియు యమేయమాయాపటుడగు యొక్క వటుంబిలిచి యితని కల్లజలాశయంబు జూపుమని జెప్పియప్పవన పుత్రునితో నీవు నిమీలిత నేత్రుండవై యత్తోయంబు పానంబుసేసి మరలి మదంతికంబునకు వచ్చిన

★ నుంగపి - గ.ము.ప్ర. పాఠం

జెచ్చెరనయౌషధ తంత్రంబులు గనంజేసి నట్టిమంత్రంబుపదేశించెదననిన నగుంగాక యని యాకపివరు వటుదర్శితంబగు జలాశయంబున నయనంబులు మూసి సలింబులు ద్రావునవసరంబున తజ్జలాంతరంబువలన నరుదెంచిమహాశరీరిణియును ఘోరరూపిణియునునగు యొక్క మకరి యతనింమ్రింగందలంచిన నవ్వీరుండు దానింగని కోపంబున తద్వదనంబునుదర పర్యంతంబుగా సీల్చినాశంబొనర్చినం తచ్ఛరీరం బువలన నావిర్భవించి దివ్యరూపధారియగు ధాన్యమాలినియను యచ్చరకాంతయంతరిక్షంబున నిలిచి హనుమంతునింజూచి నీప్రసాదంబున శాపవిముక్తనైతినని నిజవృత్తాంతంబిట్లనియె 382

సీ॥ మున్ననేనిచ్చోట ముదమున జలమాడ
జూచిశాండిల్యుండు సురతకాంక్ష
నను వేడబుతుమతినని మూడుదినములు
మితిజెప్పినేనంత మెలగునంత
పంక్తి కంఠుడునన్ను బరికించి బల్మిచే
గదిశినయపుడతి కాయుడొదవె
యంత నమ్ముని వచ్చియటులైన ననుగాంచి
సరసిలోమకరిగా శాపమిచ్చె

తే.గీ॥ వంశనాశంబుగాగ రావణుశపించె
నేనువేడిన పవమాన సూనువలన
నీకు శాపాంతమగునని నెమ్మిబలికె
నటుల నీచేతనయ్యె మహానుభావ! 383

చం॥ వినుమిదికృత్రిమాశ్రమము వీడు మునీంద్రుడుగాడు రావణుం
డనిపిన కాలనేమి ద్విజహంత మహాసురుడిందు నీకు వి
ఘ్ను నిరతి జేయ మౌనియయినాడటు గావునవీనిద్రుంచినీ
వనఘురయంబునంజను మహౌషధశైలము జేరవారకన్ 384

కం॥ అనిపలికి నాకునీస్ప
ర్శనమున కలుషంబు బాసెచనియెద దివికిన్
జనునీకు జయంబగునని
జనియెందత్కాంతయంత స్వర్గంబునకున్ 385

వ॥ అంతహనుమంతుడును నయ్యాశ్రమంబునకు వచ్చిన కాలనేమి యతనితో నింతకాలవిలంబనం బేలయయ్యె మదీయంబగు మంత్రంబు గైకొననాకు గురుదక్షిణయొసంగుమనిన, నావృక్షచర వరుండునిదె దక్షిణ యొసంగెద గ్రహింపుమని యారాక్షసు వక్షంబు దృఢముష్టింబొడిచిన, వాడును మునివేషంబువీడి శీఘ్రుంబు సింహ వ్యాఘ్రాదిరూపంబుల యుద్ధం బొనర్చియు, సుగ్రీవుండైవచ్చి సౌమిత్రిజీవించెనని చెప్పియు, నివ్విధంబుగ నానావిధంబులగు మాయావిధానంబుల భేదించిన, మహామాయకుండగు రఘు నాయకుని దూతయగు నవ్వాయు సూనుండమ్మాయ మాయించి, వానిశిరంబు వజ్ర కఠినంబగు పిడికిటం బొడిచిన భగ్నశిరస్కుండై యక్కాలనేమి నేలంబడియెనంత 386

కం॥ కలశాంభోనిధి త్రోవన్
గలయంగా పోయిపోయి గనియె కపీంద్రున్
దలదివ్యౌషధ లతికో
జ్వలరుచి సాంద్రంబు ద్రోణశైలేంద్రంబున్ 387

- అంజనేయుడు ద్రోణగిరిని దెచ్చుట -

కం॥ ఆనగములనౌషధములు
గానగరాకున్న నదిబెకల్చి శిరమునన్
బూనిగొనిపోవ గంధ
ర్వానీకమనేక కోటులడ్డంబైనన్ 388

వ॥ ఇట్లు వచ్చిన గంధర్వులనందరం బలియించి పవననందనుండు నందిగ్రామ సమీపంబునకు వచ్చునెడ నారాత్రి భరతుండు రామసౌమిత్రుల కరిష్టంబగు నొక్కదుస్స్వప్నంబుగాంచి తచ్ఛాంతు లొనర్పు నెడనప్పవన సుతుండు నీలమేఘ ప్రభాస్ఫురితుండును జటావల్కల భరితుండునునగు నభ్భరతునింగని యితండు రాఘవుండకాయని మనంబునందలంచి సత్యప్రతిజ్ఞుండగు నవ్వీరోత్తముండంతయు వీడి యిట్లేలవచ్చు నీ పురుషుండు రఘువరుంబోలునొక్క రాజర్షి వరుండగునని నిశ్చయించి గగన పథంబున నతిజవంబునంజనుచున్న నన్నగచరవరునింగని యిది విపరీతంబగు నొక్క మహాభూతంబని బాణ పాతంబుసేయంగమ కించు కైకయీసూతునింగాంచి యశరీరవాణి యితండు నీకు హితుండగుననిన నవ్వీరుండాశ్చర్యంబున నూరకుండె నంత హనుమంతుండు లంకా మార్గంబునం జనియెనిట్లు. 389

ఉ॥ వారకనందు వచ్చునెడ వారిధిచెంతను మాల్యవంతుడే
పారననేక కోటిదనుజావళితో నెదురింపవానినిం
బోరి రసాతలంబునకు బోవనడంచి సమీరనందనుం
డారఘురాము సన్నిధికి నగ్గిరిగైకొని వచ్చిచెచ్చెరన్ 390

- లక్ష్మణుండు మూర్ఛదేలుట -

సీ॥ ఆరఘుకాంతుతో హనుమంతుడిట్లను
తెచ్చితి ద్రోణాద్రి దేవ! యిటకు
నెయ్యదిజేయనౌ నయ్యదిగావింపు
మాలస్యమొనరింప నేలననిన
హర్షితుండై రాముడయ్యౌషధంబులు
సేకొనియపుడు సుషేణు చేత
వేగచికిత్సగావించె మహాత్ముడౌ
నట్టి లక్ష్మణునకు నాక్షణమున

తే.గీ॥ లక్ష్మణుండునునిద్ర మేల్కనినరీతి
నుద్ధితుండయి నిలునిలుమోదశాస్య
యెందు బోయెదునేడు నిన్నేహరింతు
సమరముననంచు పూర్వకోపమున బలికె 391

కం॥ అనిపలుకుననుజు లక్ష్మణు
గనుగొని యాలింగనంబు గావించి శిరం
బునుమూర్కొని రఘువరుడా
హనుమంతునితోడ నిట్టలనుచుంబలికెన్ 392

కం॥ ఓమారుతనందన! నీ
సామర్థ్యకృత ప్రసాద సంగతిచేతన్
సౌమిత్రిని మద్భ్రాత ని
రామయు ననిజూడ గలిగె నగచరముఖ్యా! 393

వ॥ అనిపలికి సమరనిహతులగు కపులను నీయౌషధంబులం బ్రతికిరింక నిప్పర్వతంబు బూర్వప్రకారంబున నిలిపిరమ్మనిన నాహనుమంతు డట్ల సేసెనంత నారాఘవుండు లక్ష్మణ సుగ్రీవు సహితుండై విభీషణానుమతంబున సమరాభిముఖుండై నిలిచిన నవ్వానర వీరులును పర్వత పాషాణ పాదపహస్తులై మహోధ్వానంబులు సేయుచు సన్నద్ధులై నిలిచిరప్పుడు. 394

కం॥ అనియిట్లు శివుడు సెప్పిన
వినిదత్సతిసతి మహేశువీక్షించి మరి
న్వినగా రఘువరుజయ కథ
లనఘా! యవ్వల వచింపు మనియడుగుటయున్ 395

శా॥ ఆర్తత్రాణ పరాయణా! భవితమ
ర్త్యాకార నారాయణా!
మార్తాండాన్వయ భూషణా! మహిజసం
పద్భామినీ తోషణా!
ధూర్తారివ్రజ దారుణా! భవతమ
స్తోమారుణా! వృత్తసం
వార్తాంభోనిధి చారణా! భువనని
ర్వాహక్రియా కారణా! 396

ఖడ్గబంధచిత్రకందము –

శ్రీధర ధర ధర లసదధ
రాధర ధరణీసుతా సమాదర ధీరా
రాధిత విహార తారధ
రాధర వరవినుతసార రఘుకుల వీరా ! 397



పుష్పబంధచిత్రస్రగ్ధరావృత్తము –

శ్రీరామా రామరామాశ్రితహిత సతత క్షేమ సామర్థ్యమగ్నా
సారాకారాదురాత్మా శరహరశర విస్తార శూరత్వ రమ్యా
ధీరాత్మా రాజరాజ స్థిరతరసురధా ధీనయానత్వనంద
ద్వీర శ్రీకీర్తిరజ్య ద్విభవ భవ భరా వేశ కౌశల్య శస్తా 398



- గద్య -

ఇది శ్రీమదుభయ కవితా నిస్సహాయ సాహితీవిహార కాణాదాన్వయతిమ్మనార్యకుమార
వినయవిభ్రాజి పెద్దనసోమయాజి ప్రణీతంబైన
శ్రీమదధ్యాత్మరామాయణంబను మహాపురాణంబునందు
యుద్ధకాండంబున పూర్వభాగంబన్నది షష్ఠాశ్వాసము సంపూర్ణము

-★)★(★-



శ్రీ భూ చెన్నకేశవాయనమః

అధ్యాత్మ రామాయణము

యుద్ధకాండము - ఉత్తరభాగము

 వరనిబద్ధ శైవలి
నీవర సురకార్యకరణ నిశ్చిత భావా!
హేవాక విజిత పంక్తి
గ్రీవా! గద్వాల చెన్నకేశవదేవా!! 1

వ॥ అవధరింపుము భక్తియోగవిశారదుండగు నారదునకు సకలార్థ సంధాతయగు విధాత సెప్పెనట్లు విజ్ఞానవతియగు పార్వతికి దివ్య ప్రభావుండగు మహాదేవుండిట్లనియె నవ్విధంబునం బూర్వదినంబున రావణుండు బాణవిహతుండై సింగంబుచేత మాతంగంబును విహంగపుంగవుని చేత భుజంగంబునుం బోలె పరాభూతుండై పురంబునకు వచ్చి తానొనర్చురాత్రికార్యంబిట్లు విఘ్నంబగుటకు సింతించి మరుదినంబున సభాంతరాసీనుండై రాక్షస వీరుల రావించియిట్లనియె 2

సీ॥ మనుజునిచేత నీకును మృత్యువగునంచు
మును జెప్పెబ్రహ్మ యమ్మనుజులందు
ననువధింపగ సమర్థునిగాన నెవ్వని
నగుటవిష్ణుడు మర్త్యుడై నిజముగ
దశరథ రాముడై ధరణిని జనియించి
నన్ను ద్రుంపగవచ్చినాడుసుమ్ము!
యనరణ్యుడనురాజు మునునన్ను శపియించె
నావంశమునను సనాతనుండు

తే॥గీ॥ శౌరిపరమాత్ముడగు హరి సంభవించి
నిన్నుసుతహిత బాంధవాన్వితముగాగ
ననిజయించు నిస్సంశయంబని వచించి
యతడుదివమున కరిగె నోయసురులార! 3

తే॥గీ॥ అట్టి విష్ణుండె రాఘవుడై మదర్థ
మిటులనేతెంచు మూఢాత్ముడపుడు నిద్ర
నందునాకుంభకర్ణు బలాఢ్యువేగ
మరిగి బోధించి నాకడ కతనిదెండు 4

- కుంభకర్ణుని నిద్రలేపుట -

సీ॥ అనుచు వీడ్కొలిపిన నమ్మహాకాయులౌ
దనుజులు తద్గృహంబునకు నరిగి
భూత్కార నిశ్వాస భూరిఘోషంబుల
దంతఘట్టనల భూతములు బెగడ
ఘుట ఘుట నిద్రించు కుంభకర్ణునిజేరి
ఘోరాప్తి చెవిదండ కూతలిడియు
దుందుభుల్ మొరయించి తూర్యముల్ మొరయించి
గిరులువైచియుమీద కరులద్రోచి

తే॥గీ॥ వీనుల ఘటాళినుడకెడు నూనెబోసి
యోలిబహుయత్నముల చేత మేలు కొలుప
నద్భుతారావముల మూల్గియావులించి
నీల్గియక్కుంభకర్ణుండు నిద్రలేచె 5

వ॥ ఇవ్విధంబున మేలుకొని యపరిమిత జంతు సంతాన మనుష్యాది మాంస సురాశోణితధాతులం దృప్తుండై యక్కుంభకర్ణుండా రాక్షసుల తోడ నన్నకడకుంజని ప్రణతుండై నన్ను బోధించుట బనియే మనిన బలోద్దాముండగు రాముండు సుగ్రీవసహితుండై కపిబలం బులతో సముద్రంబుదాటి యాలంక చుట్టు విడిసి మదీయులగు పుత్ర పౌత్ర మిత్రామాత్య బంధు యుక్తంబుగా ముఖ్యులగు ననేక రాక్షసులం దురంబునం ద్రుంచి గీశ బలంబులం దొక్కరుండును నాశంబు నొందుట గానంబడదు నేనునుంబరిభవింపంబడితి దానంజేసి బలవంతుండవగు నిన్నుం బోధింపం బంచితి మదర్థంబుగా నధిక సత్వంబులంజూపి దుష్కరంబుగా నరవానరుల సమరంబున సమయింపుమనిన భ్రాతయగు దైతేయనాథుని బాధాకులితంబగు వచనంబువిని బ్రహసించి యతనితోనిట్లనియె. 6

- కుంభకర్ణుండు రావణునకు హితోపదేశము జేయుట -

కం॥ మునుమీరు హితాలోచన
మొనరింపగనేను దీన నొదవును కష్టం
బనిన వినిన నిప్పనిచే
సినపాపఫలంబునిపుడె సేకురెనధిపా! 7

కం॥ రాముడు నారాయణుడీ
భూమిజయును యోగమాయ పొలుపుగననుచున్
నేమును దెలియంజెప్పిన
నామాటలువిశ్వసింప నైతివధీశా! 8

సీ॥ ఒకనాటి రాత్రినేనొక కాననంబున
నాతతగిరిసానువందునుండి
కనుగొంటి ప్రత్యక్షగతి దివ్య దృష్టి వి
శారదు నారదు సమ్మదమున
నంత నమ్మునితో మహాత్మ! యెక్కడనుండి
యరుదెంచితనిన నయ్య సురమౌని
యమరులాలోచించు నపుడుంటి నచ్చటి
వృత్తాంతమెరిగింతు విను నిజముగ

తే.గీ॥ మీరలిద్దరిచే ననిమేషులెల్ల
బాధపడియందరవ్విష్ణుపాలికరిగి
భక్తినద్దేవదేవుని బ్రస్తుతించి
ప్రణుతి గావించి సేవించి పలికిరిట్లు 9

కం॥ రావణులోక త్రయ వి
ద్రావణ దుర్జయు జయింపు తద్దైత్యునకుం
దేవా!మనుజునిచే మర
ణావధి వధియించెనొల్లియావిధి యగుటన్ 10

మ॥ నరరూపంబున రావణుందును మన్నన్ సత్యసంకల్పుడీ
శ్వరుడౌ విష్ణుడునట్ల యౌననిరఘుక్ష్మాపాలు వంశంబునం
దరయం దాజనియించి రాముడనవిఖ్యాత స్థితిన్ మిమ్మునం
దరనుం ద్రుంతునటంచు చెప్పిచనియెన్ దన్మొనియిచ్ఛాగతిన్ 11

తే॥గీ॥ కానరాముని పరమాత్ముగా నెరుగుము
పూని మాయామయాకారుడైన వాని
వైరముత్యజింపుము భజింపు చేరిభక్తి
సన్నుతించిననతడు ప్రసన్నుడగును 12

కం॥ భక్తియెజ్ఞాన ప్రదమగు
భక్తియెమోక్షంబొనర్చు భావింపగ త
ద్భక్తి విహీనునిచేత ప్ర
సక్తంబగు సర్వమును నసత్తమ మధిపా! 13

తే॥గీ॥ శౌరిలీలానుసార ప్రచార కలన
బరగునవతారములు పెక్కు ధరణినిట్లు
దనరునవతార సాహస్రమునకు సమము
తత్త్వసారంబు రామావతారమొకటి 14

కం॥ మనసున వాక్కున రాముని
ననిశము భజియించుబుధుడనాయాసమునన్
ఘనసంసార పయోనిధి
ననువుగ తరియించి పొందు హరిపదమందున్ 15

ఉ॥ ఏపరిశుద్ధసత్వులు మహిన్ సతతంబును రామమూర్తి సీ
తాపతినే భజింపుచును ధ్యానమొనర్పుచు తచ్చరిత్రమెం
తేపఠియింతు రట్టి బుధులీభవతాపమహాహి పాశముల్
బాపగనోపి చెందుదు రపారసుఖంబగు తత్పదంబునన్ 16

కం॥ అను కుంభకర్ణువచనము
వినిరోషభ్రుకుటికుటిల వికటాననుడై
దనుజేంద్రుడు సింహాసన
మునదిగ్గుననెగయు చందముగనిట్లనియెన్ 17

కం॥ నినుబుద్ధిమంతుడని మే
ల్కన సేయుట నాకు బోధగరపుటకుంగా
దొనరింపు మాజినాహిత
మొనరింపగ బుద్ధినిశ్చయించితి వేనిన్ 18

కం॥ కాదేని బుద్ధిమంతుడ
వౌదువుచనుమింటి కిప్పుడరయగ నినుని
ద్రాదశ బాధించెదునను
నాదశముఖు మాటకత డుదగ్రతదోపన్ 19

వ॥ అంతనప్పంక్తి ముఖుండు రోషోన్ముఖుండని యెరింగి లేచి దానునుం క్రోధ విజృంభితుండై యక్కుంభకర్ణుండు యుద్ధ సంరంభంబున నప్పుర వీథివచ్చుచున్న సమయంబున నభఃపర్యంతంబగు నతని భయంకరాకారంబు జూచిసకల జనంబులు బెదురంగనుంగొని రఘు పుంగవుం డిమ్మహాభూతం బేమియని యడిగిన విభీషణడవ్వీరుండు మదగ్రజుండగు కుంభకర్ణుండితడు సురాసురల కజేయుండగు నైననిపుడు నిద్రాశేష ప్రబుద్ధుండు గావున వధ్యుండునునని చెప్పెనప్పుడు. 20

- కుంభకర్ణుండు యుద్ధంబునకు వచ్చుట -

సీ॥ ఘటితదంష్ట్రాభీల పటపట ధ్వానంబు
నఖిలదిక్కులను నిట్టట్టుసేయ
తీవ్రకోపాటోప దీప్తారుణాక్షుల
వెడలుమంటలు వినువీథిగ్రాల
చటులోగ్రదీర్ఘ నిశ్వాస వాతాహతి
నంబుదవ్రాతంబులవల బరప
పటుతరజంఘాల పదఘట్టనంబుల
వడికులాద్రులతోడ వసుధవణక

తే॥గీ॥ చేరికపులెల్ల పెనుమూర్ఛజెందునటుల
భూరివారాశిఘూర్ణిల్ల బొబ్బలిడుచు
శైలములదీటు కీటలు జంగదాటి
వెడలియక్కుంభ కర్ణుండు నడచెననికి. 21

కం॥ కాలాయసభారసహ
స్రాళీ ఘటితాళి శోణితాలీఢ మహా
భీలంబగు శూలంబున్
గేలంగొని ముద్గరాది కృతసాధనుడై 22

కం॥ అప్పుడు రావణుపనుపున
దెప్పరముగ వెంట వచ్చుదితిజబలముతో
ముప్పురిగొను రోషంబున
తప్పక నక్కపి బలంబు దాకెన్బెలుచన్ 23

వ॥ ఇట్లు కుంభకర్ణుండు దాకిన నవ్వీరుతోడన రాక్షస బలంబులతోడం గడంగి బహు భంగుల సంగరంబొనర్చుచుండె నప్పుడ ద్దశముఖాను జుండు వలీముఖయూథంబులం క్రోధంబున నీక్షింపుచు

ముద్గరం బున బరిభ్రమించుచుం దొడరునంత కాలాంతకుంగన్న చందంబున నక్కపివీరులు దిక్కులంబారుచుండ నిర్లక్ష్యంబున ప్రత్యక్షంబగు మహా మహీధరంబునుంబోలె వచ్చుచున్న నన్నయగు కుంభకర్ణునింగని గదాహస్తుండై వినయభూషణుండగు విభీషణుండెదురేగి యతని చరణంబులకు నమస్కరించి మహాత్మా! నేను విభీషణుండ నాయెడం గరుణింపుమని యిట్లనియె. 24

సీ॥ అనఘాత్మ! మున్ను మంత్రాలోచనమునందు
భ్రాతయౌరాక్షసనేతతోడ
రాఘవుండాది నారాయణుండతనికి
సీతనిమ్మని పెక్కుజెప్పితేను
నదిగ్రహింపక దుర్జనావృతుడై ఖడ్గ
మును బూనినను దిట్టి పొమ్మటన్న
సచివచతుష్టయ సహితుండు నైరాము
శరణని వచ్చి తిచ్చటికినపుడ

తే॥గీ॥ యనిన ననుజన్ముడటవచ్చుటది యెరింగి
యతని నాలింగనముజేసి యనియెవత్స!
వంశసంరక్షణార్థమీ వసుధలోన
రాఘవ పదాశ్రయుండవై బ్రతుకుమీవు 25

తే॥గీ॥ ఇదియు నారదుచేత మున్నేనువింటి
నిటమహాభాగవతుడవై తీవుతండ్రి!
చనుము నామ్రోలకికరాకు స్వపరజనుల
నెరుగకుండుదు మదమత్త వృత్తి జేసి 26

కం॥ అని పలుక నశ్రుముఖుడై
తనయన్న పదంబులకును దండంబిడిగ్ర
క్కున దరలి మరలి చని ని
ల్చెను రాముని పార్శ్వమునను చింతావశుడై 27

వ॥ అంత నక్కుంభకర్ణుండు సన్నద్ధుండై యుద్ధంబునకుంజొచ్చి యద్రిచరులువైచు పాషాణ పాదపగిరి శృంగంబుల నంగంబులం బోదట్టుచు నక్కపుల పదంబులరాచుచు కరంబుల వైచుచు కూర్పరంబుల నడచుచు హస్తతలంబులనుల్చును నురంబున గూల్చుచు నొక్కొక్కతరి సహస్రానీకంబుల పాతాళ కుహరంబునుం బోని వదనగహ్వరంబులం బారగ్రిమింగిన కొందరు దంత ఘర్షణంబు లకుందప్పి

కర్ణనాసికాదిరంధ్రంబుల వెడలువారును చిక్కిన వారునునై యందురున్ దల్లడిల్లి తెరలి శరథినిన్బడు వారును వనం బులకున్‌జొచ్చువారును వచ్చిన తెరువునుం బట్టువారునునైయిట్లు గలంగిన వానర సేనంబు జూచి వాయుసూనుండు మహాశైలంబు వైచిన దానికించుకంజలించిశూలంబున నతనియురంబు గీలించిన నమ్మరుత్సుతుండు మూర్ఛిల్లిన నీలశరభవృషభ గజ గవయ గంధమాదన మైందద్వివిదులనేక మహీధరంబులువైచిన వానిన్నిటిని శూలాదిసాధనంబుల చూర్ణంబుగావించి ముష్టిప్రకోష్ఠి పాణితల ఘాతంబుల వారినందరం బెను మూర్ఛనొందం జేసినం జూచి యాగ్రహంబున సుగ్రీవుండదల్చుచు నొక్కమహా శైలంబు వ్రేసినంగాసింజెంది తన చేతిశూలంబు బరపిన హనుమంతుం డెడ సొచ్చి దానిబట్టి మోకాలంబెట్టి విరిచిన వాడును మలయశృంగం బున సుగ్రీవువైచి మూర్ఛాలసుం జేసి యతని రావణునకుం జూపుటకునై మూపునంబెట్టి పురంబుసొచ్చిరాజవీథిం జనుచున్న సమయంబున నబ్భాను సుతుండునుం దెలసి యద్దశ ముఖానుజు నాసికా కర్ణాదులు శీఘ్రంబుగా రదనకరనఖంబులంబెరికి యురికి నంగని తనయంగ హీనతకుం గుత్సింపుచు మత్సరంబున మరలి యప్పటివిధంబు నంగదనంబునకు వచ్చి యచ్చట. 28

ఉ॥ కొందరి హస్తముల్ విరుగ కొందరియంగములెల్లనుగ్గుగా
కొందరి శీర్షముల్బగుల కొందరిపేరెయడంగునట్లుగా
నందర గీశులందరమి యాడుచు నద్దశకంఠు తమ్ముడం
దంద మడుంగు గంధగజమట్ల గలంచగ భీతులైగపుల్ 29

కం॥ రాముని మరుగుం సొచ్చిన
నామును మునుకుంభకర్ణుడార్చుచు దానున్
రామునిపై గవిసె దృఢ
స్థేమంబున ముద్గరంబుద్రిప్పుచునంతన్ 30

చం॥ కనుగవకెంపుదోప కినుకన్ రఘుకాంతుడు కుంభకర్ణునిం
గనుగొని భూరిచాపమున గాఢదిగంతర పూరితధ్వనిన్
గొనయముసేర్చి యక్కపులకుం బ్రమదంబున వానిమీద ది
వ్యనిశిత ఘోరసాయక సహస్రపరంపర వేయనుగ్రుడై 31

వ॥ అయ్యసురవరుండగ్గరి నయ్యిద్దరుంజేయు యుద్ధంబుకడనుండి కపులందరు జూచుచుండ వాడును ముద్గరంబు వ్రేయనుంకించిన శంకింపక రాఘవుండు భయంకరంబుగా వాయువ్యాస్త్రంబు సత్వరం బునం బ్రయోగించి ముద్గర సహితంబగు దక్షిణకరంబు ఖండించిన వాడునుంగనలి యొండుకేల సాలంబుగొని వ్రేయంగమకించిన నైంద్రాస్త్రంబున సాలయుక్తంబగు వాని వామహస్తంబు ద్రుంచె

మహాపర్వతంబులుంబోని హస్తద్వయ పాతంబున ననేకవానర వ్రాతంబు చూర్ణితంబయ్యె నిట్లు నిర్భిన్న బాహుండై యార్భటింపుచు మీదికింగవియ నవ్విభుండు నిశితంబగునర్ధచంద్ర విశిఖద్వయం బున వాని పాదద్వయంబునుం దునిమిన న్మహాధ్వానంబులతో లంకాద్వారంబునం బడియెనిట్లు నిష్ప్రత్తహస్త చరణద్వయుండయ్యు నద్దనుజుండు బడబాముఖంబునుంబోలె కరాళంబగు నిజవక్త్రంబు దెరచి యార్చుచు రాహుగ్రహంబు చంద్రునింబోలె కబళింప బరతెంచుచున్న తన్ముఖంబున ననేక నిశితాస్త్రంబులునించిన శర పూరిత వక్త్రుండై భీషణంబుగా నాక్రోశింపుచున్నంజూచి ప్రచండ చండ కరమండల ప్రభా ప్రదీప్తంబును వజ్రాశని ప్రశస్తంబునునగు నైంద్రాస్త్రంబు రఘువరుండు ప్రయోగించిన నమ్మహాస్త్రంబు వజ్రాయుధంబు వృత్రాసురుంద్రుంచు విధంబున మహామహీధర స్థూలంబును దీర్ఘదంష్ట్రాకరాళంబును మణికుండల విభాసురం బునగు కుంభకర్ణశిరంబు ఖండించినంబడి తచ్ఛిరంబు లంకాద్వార నిరోధకంబయ్యె నివ్విధంబున 32

- కుంభకర్ణుని వధ -

ఉ॥ తూర్ణముగాగ సూర్యకుల ధూర్వహుడాజి మహోగ్ర కార్ముకో
త్కీర్ణ మహేంద్ర బాణమున గీటణగించె నవార్య శౌర్య వి
స్తీర్ణుని రోషవేగసము దీర్ణుని భానుజ భిన్న నాసికా
కర్ణుని కుంభకర్ణుని సకల్మష దుర్మదమాన పూర్ణునిన్ 33

శా॥ అంతన్ సప్తఋషుల్ సురల్ ఖగవరుల్ యక్షాహిగంధర్వులం
తంతన్ సిద్ధులుసాధ్యులున్ మొదలుగా నయ్యప్సరోయుక్తులై
యెంతేనారఘుకాంతుమీద సుమనోవృష్టిన్సవర్షింపుచున్
సంతోషంబుల సన్నుతించిరి నభస్సంవాసులై రందరున్ 34

కం॥ ఆయెడ రాముని జూడ వి
హాయసమున నుండి దశదిశాపూర్ణనిజ
చ్ఛాయాపరి భూతశర
త్తోయద పారదుడు నారదుడు వచ్చివెసన్ 35

సీ॥ నీలోత్పలశ్యాము నిఖిల సద్గుణధాము
నైంద్రాస్త్రకలిత మహాభిరాము
భూరిసుందర గాత్రుఘోరరాక్షసజైత్రు
నతిదీర్ఘతర కించిదరుణ నేత్రు

సంగరాంగణవాసు శౌర్య కృతోల్లాసు
వీరశృంగార భావితవిలాసు
అధిక కార్ముకధారు హర్యక్ష సంచారు
చారువిస్తార వక్షః ప్రచారు

తే॥గీ॥ బాణబాధితకపి బలోపరినిమగ్న
రమ్యకరుణార్ద్ర దృక్సాంద్రు రామచంద్రు
గాంచిసుర మౌని మదిలోని కాంక్షబూని
భక్తినిట్లు నుతింప నుపక్రమించె 36

సీ॥ దేవ! జగత్రయాధీశ! సర్వాధార!
నారాయణ! సనాతనా! పరాత్మ!
విశ్వరూపుడవయ్యు విశ్వసాక్షివినౌచు
చెలగునీకిదె నమస్కృతి యొనర్తు
యీ నీవుశుద్ధ విజ్ఞానరూపుడవయ్యు
చేరిలోకముల వంచింపజేసి
మాయామనుజరూప ధేయుడవైసుఖ
దుఃఖయుక్తునిరీతి దోపుచుందు

తే॥గీ॥ నీవుమాయావరణ గోపనీయ వృత్తి
వర్తనస్థితి సర్వహృద్వర్తి వగుదు
వట్టినీవె స్వయంజ్యోతి రాకృతివయి
వ్యక్తముగ దోచుదువు నిర్మలాత్ములకును 37

కం॥ నీవుకను దెరచినప్పుడ
యీవిశ్వమునెల్ల సృష్టినెనయింతుగదా!
నీవుకను మోడ్చినప్పుడ
యీవిశ్వమునెల్ల విలయ మొనరింతుహరీ! 38

కం॥ ఎవ్వనివలన జయించును
నెవ్వనియందు న్వసించు నీసర్వజగం
బెవ్వనిలో విలయించును
నవ్విభునిను బ్రహ్మమూర్తి నభివర్ణింతున్ 39

ఆ।।వె।। లీలప్రకృతిపురుష కాలముల్ వ్యక్తమ
వ్యక్తమనెడిరూప యుక్తుడుగను
నెల్లముని వరేణ్య లే దేవునెరుగుదు
రట్టి రామవిభుని నభినుతింతు 40

వ।। దేవా! వికారరహితుండవు శుద్ధుండవు జ్ఞానస్వరూపకుండవనినిన్ను శ్రుతి జెప్పుచుండు వెండియు నాశ్రుతియే జగత్స్వరూపకుండవనియు జెప్పుచుండు నీరెండు శ్రుతులవలన విరోధంబుగనంబడు భవత్ప్ర సాదంబునంగాని విరోధంబుమాని యీవిషయంబున నిశ్చయంబు గలుగదు నీస్వరూపం బెరుంగిన బుధులకు మాయతోడంగ్రీడించు నీయందవి యించుకేనియు నవ్విరోధంబు దోపంబడ దదియెట్లంటి వేని రఘూత్తమా! రవికిరణస్తోమంబున జలభ్రమంబు దోచిన విధంబున నిట్టి భ్రాంతి వలన నీయందు సర్వప్రపంచంబును గల్పితంబగుచున్నయదిందావున సకలజనంబులకు భవదీయ నిర్గుణ స్వరూపంబు మనంబునకేనియున్నోచరంబుగా దగులు దర్శింప నెట్లగు దర్శనీయంబుగానియెడ భజింపనెట్లువచ్చు దానంజేసి బుద్ధినిపుణులైనవారు భవదీయ దివ్యావతార విశేషంబులు భజించి భవసాగరంబుదరింతురీయర్థంబునుంగామక్రోధులగు విరోధు లనేకులు మనంబునకు బాధకులై మార్జాలంబు మూషకంబునుం బోలె భయంబు నొందింపుచుండుంగావున. 41

శా।। నీనామస్మరణంబొనర్పుచు మదిన్నీరూపమున్నిల్పుచున్
నీనిర్నిద్ర కథాసుధాప్తిరతులై నీపూజగావింపు చెం
తేనీభక్తుల సంగతిందిరుగుచున్నీభక్తు లౌవారి కెం
దైనన్ఘోరభవాబ్ధి గోష్పదము నెట్లైతోచునో రాఘవా! 42

కం।। కావుననీసగుణాకృతి
భావంబున భక్తినెపుడు భావింపుచునే
జీవన్ముక్తత జగముల
దేవతలుంబూజసేయ దిరుగుచునుందున్ 43

సీ।। రామ! దైవతహితార్థంముగా నిప్పుడీ
స్థితిమహాకార్యంబు జేసితీవు
కుంభకర్ణునియిట్లు గూల్చి భూభారంబు
బాపితి సౌమిత్రి రేపునాజి
నింద్రజిత్తును వధియించును మరునాడు
ద్రోహిదశాస్యుని ద్రుంచెదీవు
సిద్ధులచేనింగిజేరి స్వర్గముగుందు
చనియెద శెలవిమ్ము స్వర్గమునకు

ఆ.వె॥ ననుచు బలికిరాము నామంత్రణము జేసి
నయవిశారదుండు నారదుండు
నమరపూజ్యుడగుచు నరిగె వినిర్మలా
లోకమైన బ్రహ్మలోకమునకు. 44

వ॥ ఇట్లు రామునిచేత లీలామాత్రంబుగా మహాబలోదీర్ణుండగు కుంభ కర్ణుండు నిహతుండగుటవిని రావణుండు భ్రాతృవియోగంబునగు శోకంబునభూమింబడి మూర్ఛితుండై యెట్టకేలకు దెలిసియతని బలసాహసంబు లుగ్గడించి విలపించుచుండెనంత పినతండ్రిదెగుట యుందన తండ్రి దుఃఖితుం డగుటయుంగని యింద్రజిత్తుండు శోకమజ్జనకుండగు తజ్జనకునితో మహాత్మా! సర్వసుపర్వ గర్వనిర్దళన దర్పధురీణుండగు నేను బ్రాణంబులతోనుండనీకుశోకింపం బనిలేదు భవత్సంతాపంబుబాపెద స్వస్థ చిత్తుండవగు నీశత్రులందునిమి సకలంబునం జక్కనొనర్చెద నిపుడు నికుంభిలా ప్రవేశంబునకుంజని యందు హుతాశనులందృప్తియొనర్చి యప్పావకునివలన రథరథ్య సాధనంబులంగాంచి రిపుల కజేయుం డనైయ్యెదనని పలికి యనేక కోటిసింధూర స్యందన సైంధవ భటబృందంబులతో నడచి తన్నికుంభిలా ముఖంబున సకలంబులంగావలినిడి తదీయాంతర్వేశ నిర్దిష్టంబగు హవనస్థలంబునకుం జని రక్తమాల్యాంబర ధరుండును రక్తగంధాను లేపనుండును మౌననియతుండు నైతత్తదుక్త ద్రవ్యంబుల నయ్యింద్రజిత్తుండు హవనంబొనర్ప నుపక్రమంబొనర్చిన. 45

- విభీషణుండు రామునకు నింద్రజిత్తుజేయు
నికుంభిలాహోమంబు విఘ్నంబొనర్పుమని చెప్పుట -

సీ॥ అంతవిభీషణుండా మేఘనాదు చే
ష్టితమంతచారులచేత వినియు
రామునకిట్లను రామదుర్మతియింద్ర
జిత్తుండు హోమంబు సేయజొచ్చె
నాహోమము సమాప్తమైన నతండు సు
రాసురాళి కజేయు డైచరించు
గానశీఘ్రంబ లక్ష్మణుచేత నయ్యింద్ర
జేతను వధియింప జేతునేను

తే॥గీ॥ నగుట నాతోడ నచ్చటి కరుగు దేర
నతిబలుండగు సౌమిత్రి కాజ్ఞయిమ్ము
నీదు తమ్ముండు తన్మేఘనాదు దునుమ
జాలు సంగర భూమి నిస్సంశయముగ 46

తే॥గీ॥ అనిన రాఘవుడాతని కనియెనిట్లు
నిఖిలరాక్షస నిర్భేదియైతనర్చు
ఘనతరాగ్నేయ సాయకంబునను మేఘు
నాదు వధియింప దగ నేనెపోదునిపుడ 47

వ॥ అనిన రామభద్రునితో నవ్విభీషణుండిమ్మేఘనాదుండితరులచేత వధియింపబడ డవ్విధంబెరింగించెద
నని యిట్లనియె. 48

మ॥ అనయంబెవ్వడు ద్వాదశాబ్దములు నిద్రాహారముల్ మానునా
తనిచేతన్ మృతియిద్దురాత్మునకు సిద్ధంబంచుమున్నాయజుం
డని యెన్నావున లక్ష్మణుండును నయోధ్యానిర్గమంబాది మీ
యనుసేవార్థము వచ్చి నిద్రయును నాహారంబెరుంగండొగిన్ 49

తే॥గీ॥ కాననన్యునిచేద్రుంపగాడు వాడు
సర్వమునెరుంగుదేను సాక్షాదనంతు
డవనిధరుడౌట లక్ష్మణుననుపునాదు
తోడ నిజమీత డింద్రజిత్తుని వధించు 50

ఉ॥ పాటిగ సర్వలోక పరిపాలుడవౌహరినీవు నిక్కమి
ప్పాటి భవత్సహాయమున బాటిలు లక్ష్మణుడాది శేషుడి
ట్లౌట ధరాభరాపహరణార్థముగాగ జనించు నాజగ
న్నాటక సూత్రధారులయి వర్తిలుమూర్తులు గారెమీరిలన్ 51

సీ॥ అనిన తద్వాక్యంబునాలించి రాఘవుం
డవ్విభీషణున కిట్లనుచు బలికె
నెరుగుదు సర్వమయ్యింద్రజిత్తుని మాయ
నతడు శూరుండు బ్రహ్మాస్త్రవేది
యఖిల మాయావిదుండత్యంత సత్వ స
మన్వితుండౌటయు నదియు గాక
నెరుగుదు మత్సేవ నేపారు లక్ష్మణు
ప్రబలసత్వ స్వరూపంబునెల్ల

తే॥గీ॥ కావునను భావి కార్యార్థ గౌరవమున
నూరకుండితి నేనింత ★మేర నెరిగి
యని విభీషణుతోబల్కి యంతరాము
డఖిలవేత్త సౌమిత్రితో ననియెనిట్లు 52

★ విను నెరింగి – గ.ము.ప్ర. పాఠం

- లక్ష్మణుండునికుంభిలా హోమంబు విఘ్నంబొనర్చుట -

మ॥ చనుమాలక్ష్మణ! నీవు వానరమహాసైన్యప్రతానంబుతో
హనుమజ్జాంబవదాది యూధపులతో నయ్యింద్రజిత్తున్ బలున్
దునుమన్ వేగ విభీషణుండతని మంత్రుల్ దోడనేతెంతు రౌ
మును మున్నాతడెరుంగు నాస్థలమునామూలాప్తి దన్మాయలున్ 53

తే॥గీ॥ అనిన రాముని వచనంబు విని విభీష
ణాన్వితుండయి లక్ష్మణుడన్యఘోర
తరధనుఃపాణియై శౌర్యగరిమ రాము
పదములకు మ్రొక్కి హర్షాప్తి బలికెనిట్లు 54

ఉ॥ నేడు మదీయకార్ముక వినిర్గత మార్గణవర్గముగ్రమై
వాడిగ నింద్రజిత్తు పృథువృక్షము గాడిరసాతలంబునన్
తోడనె సొచ్చి భోగవతితోయములాడెడునంచు బల్కుచున్
బోడిమిమై ప్రదక్షణ సమున్నతినన్నకు మ్రొక్కి గ్రక్కునన్ 55

శా॥ ఆసౌమిత్రి మహేంద్రజిద్విజయలీలా పారపారీణతా
వ్యాసక్తిన్ హనుమంతునెక్కి సమరవ్యాపార వత్కీశ సే
నాసాహస్రములెన్నియే నడవవెంటన్ జాంబవన్ముఖ్యులున్
వాసిన్మంత్రులతో విభీషణుడు గొల్వన్వచ్చునత్యుద్ధతిన్ 56

వ॥ ఇవ్విధంబున ననేక వానరానీకంబుతో నికుంభిలా ప్రదేశంబునకు వచ్చి లక్ష్మణుండు దూరంబుననుండి రాక్షససేనావారంబు నీక్షించి యుద్ధండంబగు కోదండంబునంగుణ సంధానం బొనర్చి మహా వీరులగు నంగద జాంబవదాదులతోడ విజృంభించు నవసరంబున విభీషణుండాసౌమిత్రితో నీలమేఘ సంఘాతంబునుంబోలె దోచు నీరాక్షస బలావ్రాతంబునుంజూడు మిమ్మహాసైన్యంబుభేదింప ప్రయత్నంబొనరింపుమిది గలంగిన నీస్థలంబున నయ్యింద్ర జిత్తుండు గనంబడునని మరియును. 57

ఉ॥ ఎంతటిలోన నింద్రరిపుడీయభిచారపు హోమకర్మమున్
సాంతముజేయ నంతనె దురాత్ముడు ధర్మవిరోధి ఘాతుక
స్వాంతుడు వాడజేయుడగు నౌటను నింతటిలోన వానిన
త్యంత కఠోర బాణహతినాజి నడంపుము రాఘువానుజా! 58

కం॥ అనినవిభీషణు వచనము
లనువిని శుభలక్షణుండు లక్ష్మణుడు వెసన్
దనుజేంద్రనందనుని ది
క్కునకును బహుకాండవృష్టి గురియించెనొగిన్ 59

వ॥ అప్పుడవ్వనచరయూథంబు గ్రోధంబున బ్రళయ కాలవిజృంభిత మహాంభోధర సంఘంబునుంబోలె నిర్భరంబుగా నార్భటింపుచు బయిపయినురువడించినం గాంచి తద్దనుజ సమూహంబు గోపోద్దీపతంబై మత్త మాతంగ శతాంగతురంగ వీరభట సంఘాత జంఘాలంబై ధరాతలంబు గంపింప సంవర్తసమయ సముత్తీర్ణ మహార్ణవంబు భంగిమహోధ్వానంబు సెలంగం గవిసిన నయ్యిరు వాగునకుద్దండంబుగా భండనంబయ్యె నయ్యెడ వృక్షచర వీరులు మహావృక్షంబులు బగుల్చియు గిరిశృంగంబుల నంగంబులగల్చియు గండ శైలంబుల భుజాదండంబులు డుల్చియు, కరంబుల శిరంబులు రాల్చియు, ముష్టిపాతంబుల బొడిచియు, పదాఘాతంబులనొడిచియు ననేక ప్రకారంబులనేపు జూపిన నాటోపంబుననన్నిశాటభట కోటు లవ్వనాటుల శూలంబులంద్రుంచియు కరవాలంబుల గీలించియు భిండివాలంబులం గండడంచియు గదాదండంబులం బిండి గావించియు ముద్గరంబులనుద్గమించియు ముసలంబుల గసి మసంగియు వెండియుం బరశుయష్టితోమర పాశాధి సాధనంబులం బాధ గావించిన నంగద నీలనల కుముద కుముదాక్ష బుక్షవర ప్రముఖులగు మహాయోధలు విజృంభించి కరచరణజాను జంఘా కూర్పప్రకోష్ఠముష్టి ఘాతంబుల నిష్కరంబుగా రాక్షసబలంబులం గదిసి త్రుంచియు నొంచియుంగలంచి తెరల్చియు నయ్యావహసం కులంబుకోలాహల శబ్దబహుళంబులయ్యెనట్లు నిజబలం బంతయుం బలాయమానంబగుట విలోకించి హోమంబు జాలించి యుదం చితరోష భీషణుండై యయ్యింద్రజిత్తుండు సత్వరంబున నికుంభిలా ప్రదేశంబు వెడలివచ్చి యచ్చట. 60

- ఇంద్రజిత్తుయుద్ధమునకు వచ్చుట -

సీ॥ సింహధ్వజధ్వాన సంహతి దిక్కుంభి
గర్భ నిర్భేదన క్రమమొనర్ప
వ్యాళముఖాభీల హయహేషితముల సూ
ర్యానిగ్రహంబు లిట్టట్టుబెదర
చక్రఘుర్ఘురరవాశని వినిర్ఘోషంబు
ధారుణీ భాగనిర్దళన మూన్ప
ఖడ్గాదిక ప్రభాకల్పాంత శిఖిశిఖో
ద్ధతి భూతసంతతి దల్లడిల్ల

తే॥గీ॥ నెసగు నతిఘోర రథముపై నేపు మీరి
తనమహాంభోద గర్జిత ధ్వనుల పేర్మి
నమర హృత్పద్మములు దూలననికి నడచె
సాంద్ర కోపంబుచేత నయ్యింద్రజేత 61

ఉ॥ ఆగతినేగి నిష్ఠుర శరాసనముందనకేల గ్రాలగా
వేగమ లక్ష్మణుంబలికె వీరుడనైతగు నాదుమ్రోల నెం
దేగెదు మేనితో నిలువుమీ! యనిలోనని యవ్విభీషణుం
దాగని గ్రోధ ముప్పతిలదారుణ వాక్యనిరూఢి నిట్లనున్ 62

మ॥ జనకభ్రాతవునుంబితృవ్యుడవు సాక్షాద్భక్తిచే నిచ్చటన్
జననంబందితి వృద్ధి జెందితివి దుశ్చారిత్ర యాత్మీయులౌ
జనులంబాసియు నన్యభృత్యుడవునై జర్చింపబుత్రున్ననున్
దునుమన్ దల్చెద వెట్లునీకు దగదీ ద్రోహంబు పాపాత్మకా! 63

సీ॥ అనిపల్కి హనుమంతునారోపణము సేసి
చనుదెంచుచున్న లక్ష్మణుని గాంచి
ఖడ్గమంకింపుచు ఘనరథంబును నిల్చి
యతిదీర్ఘధనువు సజ్యంబు చేసి
కపులార! నేడు మత్యరశరంబులు మీదు
ప్రాణవాయువులను ద్రావుననగ
నంతలో లక్ష్మణుండరిభీషణుడు కోప
ఘోరనాగేంద్ర భూత్కారమునను

తే॥గీ॥ భూరిసాయకమొక్కటి నారిగూర్చి
వ్రేసిమరియు శక్రాశని విధ నిశాత
సాయకములేయ మూర్ఛిల్లి శక్రవైరి
తోనొకముహూర్తమాత్రంబు లోనదెలసి 64

శా॥ కన్నుల్ నిప్పులురాల వీరుడగు శక్రద్వేషిదోస్సార సం
పన్నుండైతగు లక్ష్మణుం గదసి కోపస్ఫూర్తి భాస్వద్ధను
స్సన్నద్ధంబులుగా నిశాతశరముల్ సంధించి యుద్ధ క్రియా
సన్నాహంబునెసంగనిట్లను నవష్టంభంబు జృంభింపగన్ 65

కం॥ సౌమిత్రి యెరుగ డస్మ
త్సామర్థ్యము నాదుమొదలి సంగరముననీ
కేమెయి జూపెద నించుక
నాముందరనిల్వు మారణ స్థైర్యమునన్ 66

వ॥ అని పలికియతిదీప్తంబగు బాణసప్తకంబున లక్ష్మణువక్షంబుగాడనేసి తీక్ష్ణముఖంబులగు దశవిశిఖంబుల నప్పవనసుత నొప్పించి గ్రోధం బినుమడింప నతిసంరంభంబున దృఢప్రయుక్తంబగు శరశతంబున విభీషణునంగంబు ఛేదించినం గోపించి లక్ష్మణుండు నిశాతసాయక వర్షపరంపరల నన్నిలింప విరోధి శరీరంబు ఛేదించినం దద్బాణ భేదంబునవాని కాంచన ప్రభంబగు కవచంబు తిలప్రమాణ శకలంబులై తద్రథసమీప ధరాతలంబునం బడియెనంతవాడునుం గుపితుండై కఠోరశరశత సహస్రంబుల భీమ విక్రముండగు సౌమిత్రి గాత్రంబు భేదించినం దదీయ దివ్యకవచంబును నవ్విధంబునం బడియెనిట్లన్యోన్య కృత ప్రతికృతంబులగు శౌర్యంబుల దివ్యాస్త్రంబు లేయుచు మృగేంద్రంబులుంబోలె దీర్ఘంబుగానిశ్వసింపుచు నట్టితుములయుద్ధంబున శరసంవిద్ధ సర్వగాత్రులును నత్యంత రక్తసిక్తులునునై కుసుమితా శోకములుంబోలె నెసంగుచు నిట్లు జయాపజయంబులెరుంగక నమ్మహావీరులతి దీర్ఘకాలంబు నితరేతరంబును నిశాత శరాఘాతంబుల నతిమానుషంబుగా మూడహోరాత్రంబులు సమరంబొనర్చిన యనంతరంబ మహా వీరుండగు లక్ష్మణుండు తీవ్రంబులగు నైదు బాణంబుల సారథిరథ్య సహితంబుగారథంబు చూర్ణంబుగావించిన వాడును విరథుం డయ్యునుం గోపించి హస్త లాఘవంబుమెరయ ప్రచండంబగు నొక్కకాండంబున నాలక్ష్మణు కోదండంబు ఖండించిన నతండు వేరొండగు దృఢ చాపంబున గుణారోపంబొనర్చి యొక్క మహా ప్రదరంబున వాని చాపవిదళనంబొనరించి తదీయ దేహంబున ననేకవిశిఖజాలంబులం గీలించిన నతిపరాక్రముండగు నారాక్షసుం డన్య కార్ముకంబున నాదిత్య సన్నిభంబులగుఘోరనారాచశతంబుల నాలక్ష్మణుంబొదివి యనేక సాయక శతంబుల నవ్వానరానీకంబు జీకాకుపరచుచుంజరించు నవసరంబున. 67

- ఇంద్రజిత్తు వధ -

శా॥ ఆకాకుత్థ్సవరానుజుండపుడు క్రోధారక్త నేత్రాంతుడై
యాకర్ణాంతము గాగ కార్ముకముగాఢా కృష్టముంజేసిఘో
రాకారంబు కఠోర సారమగునైంద్రాస్త్రంబు సంధించి దా
నా కాకుత్థ్సపదాంబుజంబులు దృఢ స్వాతంబులన్ నిల్పుచున్ 68

తే॥గీ॥ దశరథాత్మజుడగు రఘూత్తంసుడపుడు
సత్యసంధుండు ధర్మైక సక్తుడేని
సకల జగముల నసమానశౌర్యుడేని
నాయమోఘాస్త్రమిమ్మేఘనాదుదునుము 69

మ॥ అనియయ్యస్త్రము దైత్యనాథసుతు మేనాలక్ష్యముంజేసి వ్రే
సిన లోకంబులు ఘూర్ణిలంగనది యర్చి స్ఫూర్తిమైవచ్చి జ
య్యన తద్ధోర కిరీట కుండల యుతంబౌ శీర్షమున్ద్రుంచియ
య్యనిలోగూల్చెను నింద్రజిత్తు సమరాయత్తున్మదోన్మత్తునిన్ 70

వ॥ ఇవ్విధంబున సకల సైన్యయుక్తంబుగా నింద్రజిత్తుండు భండనం బునందెగిన బృందారకలందరు మహానందంబుల నారఘూత్తము గీర్తింపుచు మాటి మాటికి బుష్ప వర్షంబులు వర్షించి రంత నింద్రుండు మహర్షి సమేతుండైయత్యంత హర్షంబునుంజెందె నభంబునందు దేవదుందుభి ధ్వానంబు వినంబడియె గగనంబు విమలంబయ్యె విశ్వధాత్రియు సంపద్యుక్త యైబ్రవర్తిల్లె నిట్లు సమర నిపతితుండగు నింద్రాహితుంగని జయలక్ష్మీ సమన్వితుండును విగతశ్రముండునునై సౌమిత్రి రణస్థలంబున వియత్తలంబదృవ విజయ శంఖంబునొత్తి సింహనాదంబుగా గావింపుచు ధనుష్టం కారంబు జేసిన తదీయారావంబున వానరులను శ్రమంబులంబాసి సంతసించిరిట్లుసంతుష్టులై తన్ను సన్ను తించుచున్న నగచరుల తోడం దానునుం బరితుష్టాత్ముండై వచ్చి రఘువరుంగని హనుమ ద్విభీషణ సహితుండై వినయంబున నన్నయైన యన్నారాయణుండగు రామునకు నమస్కరించి దేవా! భవత్ప్రసాదంబున నింద్రజిత్తుండు నిహతుండయ్యెననిన విని రఘూత్తముండునుం బ్రేమాయత్త చిత్తుండునునై సౌమిత్రి నాలింగనం బొనరించి మూర్ధాఘ్రాణంబు గావించిససంభ్రమంబును సస్నేహంబుగా నిట్లనియె. 71

కం॥ నీవీదుష్కర కార్యము
గావించితివనుజ! లెస్సగా నిద్దనుజుం
డీవిధినాశమునొందిన
నావలసర్వము జయించి నట్లరిహరణా! 72

ఉ॥ ఈ గతిమూడునాళ్లకును నింద్రజితుండు హతుండు నయ్యెనెం
తేగతి నిస్సపత్నముగ నేడుగదా! గననయ్యె దీనగ్రో
ధాగతి పుత్రశోకహతుడై దశకంఠుడు వచ్చు వచ్చినన్
వేగమెద్రుంతునంచు రఘువీరుడు సంతసమందె నెంతయున్ 73

సీ॥ అంతటహతశేషులగు రాక్షసులులంక
కరుదెంచి పంక్తి కంధరుని గాంచి
దేవలక్ష్మణునిచే దేవేంద్రజేతనీ
తనయుండు హతుడయ్యెనని వచింప
నశనిఘాత నిపాతితావనీరుహమట్ల
పుడమిమూర్ఛిలి కొంతవడికి దెలసి
తద్గుణకర్మముల్ దలపోసిదలపోసి
హాయని విలపించి యార్తిమించి

తే।।గీ।। నేడుగా దిక్పతుల్ సురల్నిఖిలబుషులు
నింద్రజిత్తుండు నిహతుడౌటెగిరి సౌఖ్య
నిద్రజెందుదు రెంతయే నిర్భయమున
ననుచు సుతశోకహతి నేడ్చెనసురభర్త 74

ఉ।। ఆగతిపుత్రశోకహతుడైయట రాక్షసభర్త సర్వర
క్షోగణనాశహేతువుగజూడ్కిని క్రోధముదోప దీనికై
నీగతి రాక్షసుల్ మడిసిరేనువధించెద సీతనంచు వే
వేగమఖడ్గపాణియయివెల్వడియున్ భయదోగ్రవైఖరిన్ 75

ఆ.వె।। అటులభూరిఖడ్గమంకింపుచు క్రోధ
భరితుడగుచువచ్చు పంక్తివదను
గాంచి ఘోరదనుజ కాంతాపరీతయౌ
సీత భీతయగుచు చింతనొందె 76

వ।। అయ్యవసరంబున బుద్ధిమంతుండునునగు సుపార్శ్వుండు తన్మంత్రి వరుండడ్డంబువచ్చి యద్దశగ్రీవునితో నీవు పులస్త్య సంభవుండవు బ్రత్యక్షంబువైశ్రవణానుజుండవు వేదవిద్యా గరిష్ఠుండవు సత్కర్మ నిష్ఠుండవిట్టి సకలగుణ సంపన్నుండవగు నీకిన్నీచ కృత్యంబగు స్త్రీవధంబెట్లునర్హంబగు దానంజేసి మాతోడంగూడ సంగ్రామంబున రామసౌమిత్రుల జయించి రయంబున జానకిన్ గ్రహింపగలవని చెప్పి నప్పుడ ద్దశకంఠుండును ధర్మయుక్తంబును సుహృన్నివేదితం బునునగు తద్వాక్యంబు మన్నించి మరలి గృహంబునకు వచ్చి శోకక్రోధంబులు బెనంగొన నెద్దియుం దోచక సభాంగణంబునకుంజని సింహాసనాసీనుండై సుహృన్మిత్ర సహితంబుగా మంత్రాలోచనం బాచరించి తానేయుద్ధంబునకు బోవందలంచి యంత. 77

- రావణుండు రెండవసారియుద్ధంబునకు వచ్చుట -

సీ।। తన సింహహుంకృతోద్ధతఘోషణము తోడ
భేరీధ్వనుల్ దిశల్బిక్కటిల్ల
తనధనుర్గుణటాంకృతధ్వానముల తోడ
పృథుభటార్భటు లబ్ధులిముకజేయ
తనకోపనిశ్వాసతతి ధూమతతితోడ
జలరజస్ఘార్తులం బరముగప్ప
తనదశకోటీరఘనదీధితులతోడ
బహుశాస్త్రరుచులిన ప్రభలు మాన్ప

తే॥గీ॥ మును సుపార్శ్వవిరూపాక్షముఖుల తోడ
బలసియిరుగడ హతశేష బలమునడవ
ఘోర రథమున కాలాంతకుండు బోలె
భండనమునకు దశకంధరుండు వెడలె 78

చం॥ వెడలిననన్మహాదనుజ వీరుబలంబుల గాంచివానరుల్
బెడిదముగా దిశల్బగుల భీమరవంబుల నార్భటింపుచున్
బడిబడి భూరిశృంగగిరి పాదపపాణులు నైకడంగుచో
తొడరిరి రాక్షసుల్కదన దోహలులై కపికోటి బోరగన్ 79

తే॥గీ॥ ఇటులనిరువాగు బోరుచోనేపుమీరి
పంక్తికంఠుండు నిష్ఠుర బాణతతుల
కపిబలంబుల చీకాకుగా నొనర్చి
బడలు పడజేసె నత్యంత భయదముగను 80

మ॥ అపుడబ్బాను సుతుండు తీవ్రతరరోషావాప్తి నారాక్షసా
ధిపుదాకంగ మహాధ్వనిస్ఫురణనేతేరన్విరూపాక్షుడున్
కుపితస్వాంతతనడ్డమై తగిలియున్గోరాస్త్రముల్గప్ప న
క్కపివర్యుండును తద్రథంబునగలంగాదాట వాడుగ్రుడై 81

మ॥ ఘనమాతంగమునెక్కి యక్కపులద్రుంగం జేయుచున్ వచ్చుచో
గనియంతన్ గ్రధనాఖ్యవానరుడు వృక్షంబేసి తద్దంతిగూ
ల్చిన వాడున్ గదగొంచు నాగ్రధనునిన్ జేరంగ సుగ్రీవుడ
ద్దనుజుందాకి నగంబువైవ నదియస్త్రశ్రేణిచేద్రుంచినన్ 82

మ॥ ఇనసూనుండును ముష్టిచేబొడువ వాడెంతేగదన్ వ్రేయనొ
య్యిననయ్యిద్దరు సోలిలేచిమరిబాహాబాహి యుద్ధంబునన్
బెనగన్ జొచ్చినలావుహెచ్చితునిమెన్ బేరుక్కుమైనర్కజుం
డనిలోవక్షము వ్రచ్చిరాక్షస బలాధ్యక్షున్విరూపాక్షునిన్ 83

కం॥ ఈలీల విరూపాక్షుడు
వ్రాలిన గపులేచి తరుమ రాక్షస వర్యుం
డాలోనున్మత్తు బనుప
నాలంబునబడిన యన్ననారసివాడున్ 84

కం॥ రామునిపైనడచి గపి
స్తోమము స్రుక్కింపగాంచి సుగ్రీవుం డు
ద్దామగతి వానిపైనొక
భూమిధరము వైవదానిబొడిసేసె వెసన్ 85

ఉ॥ అత్తరిభానుజుండు రథమంటగ ద్రొక్కియు విల్లుద్రుంప ను
ద్వృత్తినివాడునుంబరిఘుమెత్తనతండు గదన్ గ్రహింపనా
యత్తతబోరిరిద్దరపుడర్కజుడుందన పైనవచ్చు ను
న్మత్తుని ఖడ్గమున్గొని రణస్థలివానినిత్రుంచెదానిచేన్ 86

తే॥గీ॥ ఇటులనున్మత్తు డీల్గిన నెల్లదనుజు
బలములు దశాస్యువెనుకకు బారజూచి
యేచియంత సుపార్శ్వుడుద్వృత్తిదాకి
కపిబలంబులనెంతయు గాసిపరప 87

ఉ॥ వాలితనూభవుండపుడు వానిపయింజని ముద్గరాహతిన్
దూలగనేసి శైలహతితోడనె గుద్రములున్ రథంబునున్
గూలగజేయవాడుకడు గోపమునన్ ధరనిల్చి భానుజు
న్వాలిసుతున్నవాక్షుగజు వాలికతూపుల నాటెనాటినన్ 88

తే॥గీ॥ కనలియంగదుడొక పరిఘుంబువైవ
సోలిలేచివాడును పరశువున వ్రేయ
మూర్ఛగొనిలేచి బెడిదంపు ముష్టినిహతి
నురముద్రేసిసుపార్శ్వుని ధరణిగూల్చె 89

వ॥ ఇట్లు సుపార్శ్వుండు బడినంజూచి క్రోధోన్ముఖుండై దశముఖుండు సుగ్రీవాంగదాదుల శరపూరి తాంగులంజేసి ఘోరనారాచ పరం పరలం గపిబలంబులపెంపెరలాడుచు నిజబలంబుతోడ శలభచయ సమేతంబుగా ముఖ్య శలభంబు ప్రదీప్తంబగు దవానలంబునకుం గవియుచందంబున రామునిపై నురువడించినంగాంచి కోపించి రఘుపుంగవుండు సకలభూతభయంకరంబుగా కోదండగుణధ్వని గావించి శరాసార ఘోరంబుగానద్దనుజ బలంబులమీద నించించు కేని దిక్కునన్ బాణమయంబుసేసి యొక్కొక్క పెట్ట శతసహస్రాది సంఖ్యాతంబుగాద్రుంచుచు ననేక గజస్యందన ఘోటక కోటులం గీటణంగింపుచు నిఖిలసేనాధీశుల నసంఖ్యాతంబుగా నాశంబు నొందింపుచు నిట్లు దేరి చూడ రాకుండ రాక్షస ప్రళయ కాలంబుగా నిశ్శేషంబుగావించి తన్నుం గదిసిన దశగ్రీవుని చాపరథరథ్య

సారథులనిశితశరంబుల గూల్చి యొక్క తీక్ష్ణబాణంబున వానియొక్క వక్షంబును గ్రుచ్చిమరియు నశనిసదృశంబులగు శరంబుల గాసిం జేసిన భయాతిశయంబున నేదిక్కుజూచిన ధనుర్బాణ కృపాణులును భయంకరపరాక్రమధురీణులునునగు రామశ్రేణులున్నట్లు దోచిన వికలచిత్తుండై సత్వరంబున నద్దైత్యవరుండు లంకాపురంబు సొచ్చెనప్పుడు. 90

మహాప్రగ్ధర -

కరికుంభోన్ముక్త ముక్తోత్కరములునిపత ద్ఘట్ట కోటీర కోటుల్
పరితస్సంకీర్ణ కర్ణాభరణ కరకటీ బాహుకంఠాది భూషా
సరణుల్ రామాస్త్రభిన్నక్షర దసురబృహ చ్ఛామచ్ఛత్ర పంక్తుల్
★ సరవిన్నిండార బోల్చెన్ సమర మహిమ మహా **ప్రగ్ధరావృత్తలీలన్** 91

సీ॥ ఈరీతిరావణుండారాముని యమాను
షంబైన బహుపౌరుషంబుగనియు
పవనజ తపనజ ప్రముఖుల శౌర్యంబు
గనియునుశుక్రాంతికమున కరిగి
యతివేగ నతనికియంజలి జేసి వం
దనము గావించియిట్లను మహాత్మ!
రామునిచేలంకరాక్షసయూధపా
న్వితముగా నశియించె సుతులు హితులు

తే.గీ॥ నెల్లహతులైరి సద్గురుం డీవుగలుగ
నిట్టికష్టంబు వచ్చెనాకెట్టులనుచు
ప్రార్థనముసేయ శుక్రుడిట్లతని కనియె
....◆ 92

ఉ॥ హోమమొనర్పుయత్నమున నోదశకంఠ! రహస్యమందు నా
హోమము విఘ్నమున్ గనక యుండిన నయ్యనలంబునన్ హయ
స్తోమరథాసి చాపశరతూణములాది జనించుదాన సం
గ్రామములోన నీవు రిపురాజికజేయుడవౌదు గావునన్ 93

తే॥గీ॥ నేనొసంగినమంత్రముల్బాని నీవు
చనియు హోమంబుగావింపు మనిన దనుజ
నేత పాతాళ సమముగా నిజగృహమున
జేసియున్న మహాగుహ జేర నరిగి 94

★ సవిధిన్నిండార - గ.ము.ప్ర. పాఠం
◆ లభించిన ప్రతులన్నింటిలోను ఒకపాదము జారిపోయినది.

సీ॥ అట్టిపాతాళగుహాముఖంబున దైత్య
బలములనెల్ల కావలి ఘటించి
కడయత్నమునలంక గౌనులు వేయించి
యన్నిటరక్షణంబాచరించి
యభిచారహోమార్ధమధిక దారుణములౌ
సకల వస్తువులను సంగ్రహించి
★యికగుహజొచ్చియు యేకాంతమున మౌన
శీలుడైహోమంబు సేయుచున్న

తే॥గీ॥ వ్యోమ పర్యంతముగ మహాధూమ మెగయ
నదిగని విభీషణుండు జయాభిరాము
రామునీక్షించి పలికె దిగ్భీమమైన
నీమహాద్భుత ధూమంబు నీవు గంటె! 95

- పాతాళ హోమమును జెరచుట -

కం॥ ధూమంబిది దశవదనుడు
హోమంబొనరింపుచుండ నొదవినయదియీ
హోమంబుపరిసమాప్త
స్థేమంబుగనైన నతడజేయుడగునుమీ! 96

వ॥ కావున దదీయహోమంబు విఘ్నంబుగావింప ప్లవంగ పుంగవులన్ బనుపుమనిన రఘుకులాగ్రణి సుగ్రీవానుమతంబున నంగద హనుమన్నలనీలమైంద ద్వివిదాదులగు మహావీరులం దశకోటి వనాటులతోడం బుత్తెంచిన నత్తరుచరోత్తములు నిశ్శంక లంకాప్రాకారంబు లంఘించి యప్పురం బంతయుం గలంచుచు మహాధ్వానంబుల నద్దశకంధరు మందిరంబు సొచ్చియచ్చటన్ గాపున్న యనేకంబులగు రాక్షసబలంబుల పయింగవిసి యశ్వంబుల వధించియు గజంబులమధించియు రథంబుల ఖండించియు భటపటంబులద్రుంచియు ధనధాన్యాంబరాదుల వెదజల్లుచునెల్ల గృహంబుల రావణుశోధింపుచు వానింజూపుమని గృహజనంబులన్ బాధింపుచున్ దిరుగుచుండు నయ్యెడ విభీషణు భార్యయగు సరమయనునది పరమభయంబున గోప్యకరంబుగా కరసంజ్ఞజేసి యాహోమస్థానంబు సూచించంజని యంగదుండగ్గుహాముఖం బునంగప్పిన గొప్పయుపలంబు పదతలంబునం జూర్ణంబుగావించి సైన్యంబుతోడ నగ్గుహాంతరంబు బ్రవేశించి యందు నిమీలిత లోచనుండును దృఢాసనాసీనుండునునగు దశాననుంగాంచి యంగదునాజ్ఞ నవ్వానరులందరుంగోలాహలార్భటులం

★ యాగుహ - గ.ము.ప్ర. పాఠం

బెట్టుచు తత్సేవకులగొట్టుచు సమిత్కుశాది సంభారంబుల చరణంబుల రాచుచు విరిచి హోమ గుండంబుల వైచుచు దంతంబులం గరచుచు కాష్ఠంబుల జరచుచుం జెరుచుచుండ నప్పుడప్పవన సుతుండు రావణహస్తతలంబు వలనం బలత్కారంబునందీసి ఖండించి తత్ఖండనంబుననుద్ధవిడిం బొడిచిననైనను నద్దశముఖుండు జయబుద్ధింజేసి నిజధ్యానంబు విడురకున్నంగని యంగదుండు సత్వరంబున రావణాంతఃపురంబు సొచ్చియందు. 97

ఉ॥ ఆ దిననాథుడస్తగిరికై జనుచోరుచి బాయుపద్మమో
నా దగు విన్ననైన వదనంబొకయించుక వైచి బెక్కిటన్
జేదళు కొత్త జేర్చి మదిజీవన చింతను వంతనొందు మం
దోదరి గాంచి వాలిసుతుడొయ్యన నీడ్చెగృహీత కేశుడై 98

సీ॥ అటుల రావణుమ్రోలకయ్యనాథయు బోలె
నేడ్చెడితద్భార్యనీడ్చి తెచ్చి
యంగదుడామెరత్నాంచితంబగు కాంచి
ద్రుంచి కంచుకమును చించి వైచి
దశకంధరుండు ప్రత్యక్షముగనుచుండ
కటితటంబున నీవిగళితమయ్యె
వ్రాలెనుముత్యముల్ వ్రీలెనురత్నముల్
సకల భూషావళుల్పడలిపడియె

తే॥గీ॥ వానరులు హృష్టులై తదధీనులైన
దేవగంధర్వ కన్యల దెచ్చిరటకు
నతని యెదుటనె దీనయైయతిశయముగ
నేడ్చిమందోదరియుభర్త కిట్టులనియె 99

ఉ॥ నీ కులకాంతనన్నిపుడు నీయెదుటన్ ఖలులిద్దురాత్మ లి
ట్లీకడ కేశపాశముల నీడ్చుచు బాధయొనర్పయూరకే
నీకరణింగనుంగొనెదు నీహవనంబిది యేలసిగ్గునుం
గాక వసించెదీవ్రతుకు కన్ననుజచ్చుట మేలధీశ్వరా! 100

తే॥గీ॥ హా! తనయ! యింద్ర జేత! నీమాతనేను
హరితతుల చేత బాధిత నైతిపతియు
జీవితేచ్ఛను గాంచెను సిగ్గుగాక
నీవునిపుడున్న నాకునిట్లేల గలుగు 101

కం॥ అనివగచెడి మందోదరి
ఘనశోకారవము వినియు కనియంతదశా
ననుడున్ విడువిడు మీసతి
ననుచున్మరి లేచి వచ్చెయనిబూనివెసన్ 102

ఉ॥ ఆగతిలేచి కోపముననద్దశకంథరుడంగదుం గటీ
భాగము నొవ్వఖడ్గహతి బాల్పడజేసిన దేలివీడి హో
మాగమమంతయున్ జెరిచియక్కపులందరు హర్షితస్థితిన్
వేగమజేరవచ్చియట నిల్చిరి రాముని పార్శ్వసీమలన్ 103

ఉ॥ అంతటరావణుండు సతినారసి యాదరపూర్వకంబుగా
నెంతయుబల్కునోశుభవతీ! యిదియంతయు దైవయోగవి
క్రాంతి ఘటించెగాననిక గానముజీవిత కాలమిందుచే
నింతట జ్ఞాన సుస్థితి వహింపుముశోకముమానిమానినీ! 104

వ॥ అదియునుంగాక శోకంబజ్ఞాన ప్రభవంబగుట జ్ఞాన వినాశకంబగు మరియు ననాత్మ స్వరూపకంబగు శరీరాదు లాత్మయనునహంతా బుద్ధియజ్ఞానంబున బరగు పుత్రదారాది సంబంధంబగు సంసారంబు నయ్యజ్ఞానమూలంబగుం గావున దాననగు హర్షశోకభయక్రోధ లోభమోహ మదాదులును జన్మమృతి జరాదులును నజ్ఞాన సంభవంబులని నెరుంగ నగునేత ద్విలక్షణుండగు పరమాత్ముండు కేవలుండునుశు ద్ధుండును పంచకోశాతి రిక్తుండును నిర్లేపకుండును నానంద మయుండును జ్ఞానవిగ్రహుండును సర్వభావ వివర్జితుం డునునై యుండునట్టి సత్స్వరూపకుండగు నాత్మకునెద్దానివలననైనను సంయోగ వియోగంబులు గలుగకుండునట్లగుట నివ్విధంబున నాత్మస్వరూపంబు నెరింగియజ్ఞానంబునం దొలంగి తజ్జనితంబగు శోకంబు విడువుమని సెప్పివెండియునిట్లనియె. 105

ఉ॥ ఇప్పుడు పోయియారఘుకులేశ్వరు లక్ష్మణు తోడ ద్రుంచెదన్
దప్పకనట్లుగానియెడ తద్రథనాథుడు వజ్రకల్పమై
గప్పెడు బాణజాల మెదగాడగనాజి విదారితుండనై
యప్పుడు నేవసించెదను నవ్యయమైతగు తత్పదంబునన్ 106

తే॥గీ॥ అయిననొక్కటి వచియింతు నదియొనర్పు
మేను మేనున బాసిన దానచాన
జానకివధించి నీవునాతోడ నగ్ని
సానుగమనంబొనర్పుమదాజ్ఞ వలన 107

- మండోదరి బుద్ధి జెప్పుట -

కం॥ అనినన్ పతివచనమువిని
మనమునగడు దుఃఖమంది మండోదరి యి
ట్లను జక్కగ నావాక్యము
వినియంతట జేయుముచిత విధినీవధిపా! 108

కం॥ పతితో ననుగమముచితము
సతికిగలుగ దదియునాకు జనకువరముచే
మృతిజరయు లేదగుటనా
గతియిట్లుండంగవలసెగా యదిగాకన్ 109

కం॥ దేవవరుండీరాముడు
బ్రోవగసాక్షాత్ప్రధాన పురుషేశ్వరుడౌ
గావున నెవ్వండైనన్
నీవైన జయింపగాదు నిజమపుడతనిన్ 110

సీ॥ ప్రళయాగ్నిమీనమై భక్తువైవస్వతు
మునుపునాపద బాపిమనిచెనితడు
వననిధి మథన దీక్షనులక్ష యోజనా
తతకూర్మమై యద్రిదాల్చెనితడు
దుర్వృత్తుకనకాక్షుదునుమాడి క్రోడమై
క్రీడమైధరనుద్ధరించెనితడు
యాదినృసింహమైయటహేమకశిపుని
త్రిభువనరిపునినిర్జించె నితడు

తే॥గీ॥ పదములజగత్త్రయిగ్రహించి బలినడంచి
యమరపతికిచ్చె వామనుండై యితండు
యసుర రూపకనృపభారమడచిపుడమి
నిచ్చె భృగువీరుడై మౌని కీ విభుండు 111

తే॥గీ॥ అట్టి నారాయణుడె నీ వథార్థమిపుడు
రాముడైజనియించెను రఘుకులమున
మానుషంబుగనుండి యమానుషముగ
పౌరుషంబులుగావించె బహువిధముగ 112

మ॥ నినువాలంబునజుట్టి వారినిథులన్నీరంబులన్మించు వా
లిని ఖండించెనినున్ జయించు బలశాలిన్మార్తవీర్యున్ హరిం
చినయబ్బార్గవుగెల్చె నెత్తనగు నీచేగాని బాలేందు భృ
ద్ధనువుంద్రుంచెవధించె దైత్యతతి తద్రాముండు సామాన్యుడే! 113

కం॥ కావున నావిభుదేవిని
నీవేటికి దెచ్చితివి వనీస్థలిబలిమిన్
భావింప మత్సుతున్ హతు
గావింప భవ ద్వినాశకరముగననుటన్ 114

కం॥ ఈమీదట రామునకున్
భూమీసుతనిమ్ము! రాజ్య భూతియునిమ్ము!
ప్రేమవిభీషణునకువన
సీమమనము మునిగతిన్వసింపుదమధిపా! 115

మ॥ అని మందోదరివాక్యములివ్వినియు దైత్యాధీశుడద్దేవికి
ట్లనియెన్ భ్రాతలబంధులన్ సుతుల మిత్రామాత్యులన్ రాముచే
దునుమంజేసియునెట్లుగాననికి భీరుంబోలి జీవేచ్ఛచే
వనమందున్మునివేషినై బ్రతుకగా వాంఛింతునే నెంతయున్ 116

తే॥గీ॥ దిక్పతులగెల్చి ధనములదెచ్చు నేను
దెచ్చిన మహీజనికనెట్టులిచ్చువాడ
మునుల బాధించి పరకాంతలను హరించు
నేను మునినైన నగరెనన్నెల్లజనులు 117

కం॥ అదిగాకన్మదిబోకన్
దుదివేకన్ సకలదుఃఖదురితంబుల కా
స్పదుడనగు నాకు సద్గతి
పదవింజెందంగ యొకయుపాయము గలిగెన్ 118

కం॥ కావున రాముని తోడన్
గావింతున్ సమరమతని ఘన బాణతతిన్
వేవేగన్నిహతుడనై
పావన మన్విష్ణుపరమ పదముంగాంతున్ 119

శా॥ రాము న్విష్ణునిగా నెరుంగుదును తద్రామామణిన్ లక్ష్మిగా
భూమీజాత నెరుంగు దట్లెరిగియున్ భూమీజనే దెచ్చితా
స్వామిన్ బోరి హతుండ నౌచు నినునీ సంసారము న్వీడి త
ద్భావంబంది సుఖంబు నొందుటకుగా తథ్యంబు కాంతామణీ! 120

వ॥ కావున 121

మ॥ పరమానందమయంబు శుద్ధమునుగా భావింపనౌమోక్షత
త్పరులౌవారల చేతనే పదమునాస్థానంబునం జెందగా
హరియౌరామునిచే హతుండనయి ఘోరాఘంబులంబాసిసు
స్థిరముందుర్లభమున్ శుభంబునగు ముక్తిన్ జెందెద న్భామినీ! 122

సీ॥ సమధికక్లేశపంచక తరంగచయంబు
విభ్రమన్మోహజల భ్రమంబు
దారాత్మజాదిక క్రూరనక్రకులంబు
సకలాప్త బాంధవజలచరంబు
బంధురనిజరోష బడబాగ్ని గర్భంబు
స్మరరాగమణిజాల జాలకంబు
సంతత సుఖదుఃఖ సలిల సంపూర్ణంబు
భూరివిత్తాదిక బుద్బుదంబు

తే॥గీ॥ నైనసంసారఘోర మహాంబురాశి
నుచితవిజ్ఞానమను నావనుత్తరించి
దీపితానందమయ సితద్వీపవాసు
హరిని జేరంగ నరిగెద నంబుజాక్షి! 123

వ॥ అనియీచందంబునం బ్రేమ సమ్మోహరాశియగు మందోదరి బలికి శౌర్యధైర్యంబులు బెనంగొన సమరసన్నాహవిజృంభణంబునం గృత నిశ్చయుండునువీర శృంగార యోగ్య సమగ్ర భూషణాంబరాలం కృతుండును రక్తగంధమాలికాబంధురుండునునై దశకంధరుండు బహిరాస్థానంబునకు వచ్చి సకలసైన్యంబును వెడల నాజ్ఞాపించిన. 124

- రావణుండు యుద్ధమునకు వచ్చుట -

శా॥ స్వస్థాన ప్రచలత్ప్రభాకరముఖ స్ఫారగ్రహంబై దిగీ
శాస్థానస్థల శీఘ్రపాతిత తదీయానీకమై జీవనై
కాస్థానాశ విభీతభూతల జనవ్యాపారమై రావణ
ప్రస్థానోద్ధత భేరిమ్రోసె (సహసాఘక్కా) దిశా భాగమై 125

సీ॥ ఘటిత కోటిద్వయ ఘంటికా భీలంబు
భయదషోడశచక్రబంధురంబు
ఘోరభూరి వరూధ కూబర భరితంబు
యధిక భల్లూక చర్మావృతంబు
బరపిశాచమహోగ్ర హరిసహస్రయుతంబు
సకలాస్త్ర శస్త్రౌఘ సంగతంబు
రాహుశీర్షధ్వజ త్రయవిచిత్ర తరంబు
కంటక ఖేటాదికస్ఫుటంబు

తే॥గీ॥ చండరథచంక్రమక్రమాఖండ కౌశ
లాతి హితకాల కేతు విఖ్యాత సూత
రచిత సారథ్యమగు మహారథమునెక్కి
భండనోద్దండుడై రావణుండు వెడలె 126

మ॥ అకృతోగ్రజ్వల నజ్వలద్యుతి యుతుండౌనగ్నివర్ణుండున
వ్యకరోరాతి నిశాత భీషణతనుండౌఖడ్గ రోముండు శౌ
ర్యకృత క్ష్వేళ కరాళ రోషవశులౌ నాసర్పరోముండు వృ
శ్చికరోముండును వచ్చిరప్పుడనికిన్ సేనాసమేతంబుగన్ 127

వ॥ ఆసమయంబున 128

సీ॥ మునుమున్న భేరికాముఖ మహోధ్వనులచే
భువనంబులన్నియు బగులుకొనగ
చతురంగబల సంఘచరణ ఘట్టనలచే
నురగేంద్రతతులు చిందరులుగాగ

నాభీల వీరసింహారవార్భటులచే
యఖిలదిక్పటల మిట్టట్టు వడగ
చటుల రత్నచ్ఛత్ర చామరద్యుతులచే
నర్కాదిరుచులు పెల్లడగిపోవ

తే॥గీ॥ నతిభయంకరమైన మోహరము జూచి
యఖిలనావరసేన చీకాకుపడగ
సొరిదిజూపట్టి రావణుజుట్టుముట్టి
లంకగల యట్టిమూలబలంబు నడచె 129

వ॥ ఇవ్విధంబునననేక బలయుక్తంబుగా నద్దైత్య సత్తముండు సమిత్తలం బునకుంజొత్తెంచు నత్తరి నిర్నిమిత్తంబులగు దుర్నిమిత్తంబు లెన్నేనియుం దోచిన వాని లెక్కింపకవచ్చుచున్ను రాక్షసబలంబుల నీక్షించి యావృక్షచర బలంబులు మహామహీరుహ మహీధరాది సాధన సహితులైయజాండగర్భ నిర్భేదంబుగా నార్భటింపుచున్ బొదివిన 130

సీ॥ గంధసిందురమహాఘటలనుబ్బున జొన్పి
యొకవీకపెనుమూక నులిచియులిచి
బంధురస్యందన పటలంబుపై దోలి
కుప్పకుప్పలుగాగ కూల్చికూల్చి
జవనతుంగతురంగ సంఘంబు నురికించి
బహువాహినులబడల్ పరచిపరచి
పటుభట వ్రాతంబు బలిమినుక్కున దాకి
తొడరియనేకులదునిమితునిమి

తే॥గీ॥ శస్త్రములనస్త్రములచాల చదిపిచదిపి
గదల గుదియల మోదుచు గదిమి గదిమి
పాశముల ప్రాసముల వ్రేసి పట్టిపట్టి
కపుల సమయించి రసుర యూధపులునపుడు 131

సీ॥ ఉరుసత్వగజకోటి నొడిసితోకలుబట్టి
వడిమీర నేలతో వైచివైచి
సూతాశ్వయుతముగా చూర్ణంబులైరాల
తొడరి రథంబుల తొక్కి తొక్కి
యాశ్వికాన్వితముగా నవనిపై డొల్లంగ
తతహయావళికాల దన్ని తన్ని
విసరివాలంబుల వెసభటశ్రేణుల
చాపకట్టగ భూమిచదిపి చదిపి

తే॥గీ॥ బరులు దిరుగంగ బాహులబాదిబాది
మేనులులియంగ మోకాళ్ళ మెదిచిమెదిచి
పునకలగలంగ పిడికిళ్ల బొడిచి పొడిచి
బారిసమరిరి దనుజుల ప్లవగవరులు 132

కం॥ ఈరీతినురుబలంబులు
ఘోరాతిశయంబుగాగ గూలెడివారున్
బోరాడువారు నొండొరు
దూరాడెడువారు వైరిదోర్బలమెసగన్ 133

వ॥ అట్లుభయసైన్యంబు లన్యోన్యంబునుంగసిమసంగి పోరునవసరం బున నొండొరువుల నెగురవైచినంబడి మడియువారునుం బడక లాఘవంబునన్ బగరపై లంఘించు భంగించువారును, పదంబు లొడిసి జిరజిరం ద్రిప్పి కొట్టి గిట్టించు వారును భుజాయుద్ధంబుల నుద్ధవిడింబోరి బలోద్ధతి నద్ధరణిం జరచు వారును, బోరుతరి శిరంబులు నురంబులు నుదరంబులు గరంబులు నరంబులు మొదలగు నంగాంగంబులు వ్రచ్చియుంద్రచ్చియు భీభత్సంబుగా గలంచువారునునై, బరస్పరంబు నడంచుచుం జింతించుచు నొంచుచు ద్రుంచుచుండు నవసరంబున, బలవంతులైన కపివీరుల య్యసుర బలంబులకుదల మిగిలియుద్దండ లాంగూలంబులం బోనీక జుట్టి పట్టి యనేకుల నొక్కపెట్ట బిట్టడంచియు, నఖముఖ కర శూర్పరజాను జంఘూచరణ సంఘాత ఘాతంబుల నురము గావించియు, హిమవద్వింధ్య మంధాచలగంధమాదనాది కులాచల శిఖరంబుల వైచి గాలించియు, సాల తాల హింతాలాది వృక్షజాలం బులడరించి మడియించియు, నానావిధంబుగా సకల నిశాచర వినాశంబొనర్చిన నమ్మహా సంగరంబతి ఘోరంబయ్యె, నందు శాకినీ ఢాకినీ భూత భేతాళ వ్రాతంబు మాంసశోణిత మదోమస్తిష్క పంకంబుల లక్షింపుచు భక్షింపుచు గోరాడుచుం బోరాడుచుండ, నిర్భిన్న నిఖిలసైన్యంబగు నమ్మహాభండనంబు రథద్వీపంబును గజపర్వతంబును హయగ్రాహంబును చక్రకమఠంబును కరవాల వ్యాళంబును భటజలచరంబును చామరఫేనంబును ఛత్రతరంగం బును మేదోమాంస మస్తిష్క కర్దమంబును రుధిర జలంబులునై సకల జంతువిలయ సముత్థితంబగు ప్రళయ సముద్రంబు భంగి నగాథంబును దురవగాహంబును భయంకరంబులునునైయొప్పె నప్పుడు. 134

చం॥ అటుల నిశాటకోటి దెగటారగ గాంచిదశాననుండు ను
త్కటరణ కర్కశుండు నతిదారుణుడై చనుదేరజూచియొ
క్కట రఘువీర పాలితముగా దగువానరసేన భీతిలం
బటుగతివాయునందనుడు పంక్తిగళున్వడిదాకె పోరగన్ 135

ఉ॥ ఆగతిదాకి బిట్టెగసి యాగ్రహమొప్పనవక్రవిక్రమో
ద్వేగత మారుతాత్మజుడు దీర్ఘగతిం దనుజేంద్రు వక్షమున్
వేగమగాధ ముష్టిగొని వ్రేసిన దానును జానులూది మూ
ర్ఛాగతుడై రథంబుపయి వ్రాలియునప్పుడె తేలివెండియున్ 136

కం॥ మారుతి కిట్లను శూరుడ
వారయ నాయెదుటననిననతడేటికినా
శూరత్వంబిది యెటులన
నోరావణ! నీవు బ్రతికి యుండిన కతనన్ 137

ఉ॥ రావణ! నీవునాదగు నురంబుపయిందృఢముష్టి వేయుమా
యావలనేను ముష్టినిను నాహతి జేసిన జచ్చెదెంతయే
నీవనినన్ దశాస్యుడతనిన్ దృఢముష్టిరయంబు వ్రేయయు
ద్ధావని ఘూర్ణితాక్షుడయి యప్పుడొకించుక సోలియంతటన్ 138

కం॥ హనుమంతుడనిల శీతల
తనుమంతుండగుచు తెలిసి దశముఖువేయన్
జనుదేరవాడుతన రథ
మని వేరుగదోలుకొనుచునరిగినయంతన్ 139

శా॥ కల్పాంతానల కల్పకల్పితతనూ కాంతుల్గపి శ్రేణులన్
గల్పంబేర్చెడు నగ్నివర్ణగనియుగ్ర క్రోధుడై విక్రమా
కల్పప్రక్రియనమ్మరుత్సుతు డుదగ్రస్ఫూర్తి మైదాక న
స్వల్పాంగజ్వలనాప్తివాడతనిదిచ్చుంగాల్పగా జొచ్చినన్ 140

చం॥ అనలవరంబుచేతను తదగ్ని వహింపకయున్న వాయుజుం
డెనయగనగ్నివర్ణపయి వృక్షములేసిన నగ్నిబోలు త
త్తనువున భస్మమైచనగ దార్చుచువాడు శరంబులెన్నియే
జొనిపి చలింపజేసినను జూసి మహోగ్రతరాగ్రహంబునన్ 141

కం॥ మహిమ మరుత్సుతుడొకఘన
మహిధరమిరుకేలదెచ్చి మస్తకమగలన్
ప్రహరించి త్రుంచెసురదు
ర్వహరోషాపూర్ణ నగ్నివర్ణనుదీర్ణన్ 142

చం॥ అదిగని సర్వరోముడు నుదగ్రతనూరుహ సర్పవిస్ఫుర
ద్వదన విషాగ్నులంగమిచి వానరులంగలచంగ నంగదుం
డదలచి వానిపై తరుశిలాదుల వైచిన తద్విషాగ్నులన్
జిదురుపలైధరందొరుగజేయుచు డాయుచు రోషదీప్తుడై 143

చం॥ అలదనుజుండు రోమభుజగానన ఘోరగరాగ్నులన్ శరా
గ్నుల తనుగాసి జేయగని కోపమునన్ గురుతత్పరోద్ధతిన్
బలరిపుపౌత్రుడయ్యశని పాతసమిద్ధనిబద్ధ ముష్టినిం
దలబగులించి త్రుంచె కలనన్‌రిపుభీముని సర్పరోమునిన్ 144

ఉ॥ అంతటఖడ్గరోముడు నిజాంగతనూరుహ ఖడ్గపాళిచే
నెంతయు గీశులందునుమ నేచి నలుం డదలంచిదాక న
త్యంతకఠోరరోమనికరాసితతిన్ దనుజుండు గ్రుచ్చి దు
ర్దాంతత రక్త సిక్తునిగ దార్చిన నాతడు క్రోధమూర్తియై 145

చం॥ గిరిశిఖరంబువ్రేయ కడుకిన్క నిశాటుడు రోమఖడ్గ వి
స్ఫురణముచేత దానిబొలిబోవగజేసి తనూరుహాసిని
ష్కరహతి వ్రక్కజేసినను జూసినలుండలుక న్మహామహీ
ధరమున వ్రేసికూల్చెనరి దర్పవిరామునిఖడ్గరోమునిన్ 146

శా॥ ఆలోవృశ్చిక రోముడున్ కపులక్ష్వేళాభీల రోమాగ్నిచే
గాలంజేయగజూచి నీలుడొక వృక్షంబేయచే ద్రుంచివా
డోలిన్ నీలుని ముష్టినొంపనతడత్యుగ్రస్థితిన్ జంపెదో
ర్లీలన్ వృశ్చిక రోమసంగర కృత ప్రేమున్‌న్మహీజాహతిన్ 147

వ॥ ఇవ్విధంబున 148

కం॥ హనుమన్ముఖ్యులు నలువురు
వనచరముఖ్యులపుడగ్ని వర్ణాదులు న
య్యని దునిమి సింహరవముల
జని రాముని పార్శ్వములనెసంగిరి వరుసన్ 149

వ॥ అంత 150

- రామరావణుల యుద్ధము -

సీ॥ వింశతిదృగ్రోష విస్ఫులింగంబులు
వింశతిభ్రుకుటులు వికటమెసగ
వింశతి భుజతటి విస్ఫాలనంబులు
వింశతి కరభృతాస్త్రాంశులడర

దశముఖ సింహనాదముఖాట్టహాసముల్
దశగుణ ధ్వనులు నుద్ధతిసెలంగ
దశరదచ్ఛదన సందష్ట విస్ఫూర్తులు
దశకిరీట స్థిరత్వంబులొరయ

తే॥గీ॥ దశశిరస్త్రాణ దృఢ తనుత్రాణ తూణ
యుక్తుడగుచును విక్రమోద్యుక్తుడగుచు
పృథురథంబున రామున కెదురునడచి
కడిమి దశకంఠుడాహవోత్కంఠననియె 151

చం॥ అతులితమైన నాదగు మహాబలమీవెరుగంగలేకని
ద్దితిజులద్రుంచి త్రుళ్ళెదవుదీర్ణతనింద్రహుతాశనాది ది
క్పతుల మదంబడంచిచులుకన్ సురకోటుల దోలునేను మ
నృతిగణియింతునేయిపుడు మానవమాత్రుని నిన్నురాఘవా! 152

వ॥ అదియునుంగాక 153

సీ॥ చపల భావంబున జలధిలోనీగిన
మైదాచికొనిగిరి మరుగుసనిన
మోరతోపునభూమి దూరిచరించిన
వెసనోరుదెరచి వెల్వెల్లనైన
నీచాప్తిచేగొంత యాచింప జొచ్చిన
విప్రభావంబున వీగిచన్న
కాననంబున కేగిమౌనివైఖరిగన్న
మొగిమైలగట్టుక ముసలివైన

తే॥గీ॥ తరులడాగిన హరియుక్తి బరచిచన్న
గోపవేషచ్ఛలంబు గైకొన్ననైన
నీవుచను దెంచినామ్రోల నిలిచినప్పు
డెన్నిటనుబోవనిత్తునే నిన్నురామ! 154

మ॥ అనినంగ్రోధముతోడ నవ్వునగి దైత్యాధీశుతో రాముడి
ట్లను నోరావణ! నీబలంబెరుగుదేనవ్వాలివాలంబుపే
ర్మినిబంధింపగ కార్తవీర్యుడుచరంబెట్టంగ నీలావునీ
వనగానేటికినంచు బల్కవిని వాడత్యుగ్రకోపంబునన్ 155

చం॥ కులిశసమానబాణముల ఘోరముగా రఘువర్యుగప్పివె
గ్గలమగు భూరి సాయక నికాయములన్ రఘువీరు ముందటన్
బలసిన సర్వవానరులపై బరపెన్వెసముష్టితోయదం
బులు జలధారలున్ గురియు పోల్కిదశాననుడంతకాకృతిన్ 156

ఉ॥ అప్పుడు రాఘవుండు భయదాకృతి కన్నుల కెంపుదోపగా
ముప్పురిగొన్న కోపమున మున్కొని చాపమునన్గుణ స్వనం
బుప్పతిలంగ నిద్ధగతి యుద్ధతలంబున నద్దశాననుం
గప్పెను వహ్నికల్పములు కాంచనపుంఖములైన బాణముల్ 157

సీ॥ అపుడు రథంబుపై నారావణుండును
నుర్విపైరఘువీరుడుండగాంచి
బలవైరిమాతలి బిలచిభూమిస్థుడౌ
కాకుత్థ్సుకడకు మద్ధనరథంబు
ననఘ! వేగమనీవు గొనిచని మత్కార్య
మొనరింపుమన్న నింద్రునకు మ్రొక్కి
హరితాశ్వయుతమునౌ నారథ శ్రేష్ఠంబు
గొని రాముని జయంబు కొరకుగాగ

తే॥గీ॥ నాకముననుండి భూమికి నరుగుదెంచి
యరదమునన్చి మాతలియప్రమేయ
ఘన జయస్థేము రామునిగాంచి మ్రొక్కి
యంజలిఘటించి యతనికిట్లనుచు బలికె 158

ఉ॥ ఈరథమింద్రభూషితము నీధను వక్షయ బాణతూణముల్
సారములీ యభేద్యకవచంబును ఖడ్గము బెట్టి రామజం
భారిభవజ్జయేచ్ఛననుసంపెను నీరథమెక్కి నీవునే
సారథిగా దశాస్యునని జంపుము శక్రుడు వృత్రునిన్బలెన్ 159

కం॥ అనిచెప్పిన దశరథనం
దనుడు న్వలగొనుచు మ్రొక్కితద్రథరాజం
బుననెక్కెను లక్షింపుచు
దనుజులు భయమంద భువనతతిబ్రియమందన్ 160

తే॥గీ॥ అపుడు గంధర్వసిద్ధ విద్యాధరామ
రాదులు విమానములనుండి యంబరమున
వచ్చినిలిచిరి రామరావణులొనర్చు
భువన విలయాభమగు రణంబునుగనంగ 161

ఉ॥ అంతరథస్థుడైతగు మహారథు రామునిగాంచి ధైర్య దు
ర్దాంతుడు రావణుండడరతద్రఘువీరుడుదార శౌర్యుడ
త్యంతము దాకవారి కపుడద్భుత భీషణమౌమహారణం
బెంతయుసెల్లె సాయక సమిద్ధ సముద్ధతి దుర్నిరీక్షమై 162

శా॥ ఆటోపంబుల రామరావణుల బాహాపాటవస్ఫూర్తిచే
కోటిద్వంద్వ కృతైక్యకుండలితవత్కోదండ దండోద్భవ
జ్యాటంకారమహాధ్వనుల్ నిగుడ గాఢావాప్తి మీరన్నిరా
ఘాట ప్రౌఢిమగప్పిరొండొరులపైకాండ ప్రకాండంబులున్ 163

కం॥ పదియున్నూరును వేయున్
పదివేలును లక్షకోటి పదిగోట్లును న
ర్బుదసంఖ్య బొదివి రుగ్ర
ప్రదరంబులు పద్మజాండభాండమునిండన్ 164

వ॥ అంత 165

శా॥ ఆగ్నేయాస్త్రమువేయ రావణుడు కీలాభీల మైరాగ ప్ర
త్యాగ్నేయాస్త్రము చేత రాఘవుడు శాంతంబొందగాజేసి వా
డగ్నింబోలెడి దైవతాస్త్రమును ప్రేయందైవతాస్త్రంబుచే
భగ్నంబైపడజేసెనస్త్రకలనాప్రాజ్ఞుండు రాముండనిన్ 166

సీ॥ రావణుండడరి పర్జన్యాస్త్రమును ప్రేయ
రాముండు మారుతాస్త్రమున మాన్చె
దశకంధరుడుఘోర దానవాస్త్రంబేయ
రాముండు మారుతాస్త్రమున మాన్చె
పౌలస్త్యుడురుదావ పావకాస్త్రంబేయ
రాముండు వారుణాస్త్రమున మాన్చె
దనుజవంశవిభుండు తామసాస్త్రంబేయ
రాముండు భాస్కరాస్త్రమున మాన్చె

తే॥గీ॥ నసురనాథుండు మాయామయాస్త్రమేయ
రాముడలిగి విద్యాధరాస్త్రమున మాన్చె
నమరవిద్వేషి పైశాచికాస్త్రమేయ
రాముడంతటనంతకాస్త్రమున మాన్చె 167

వ॥ అంతట క్రోధఘూర్ణితాక్షుండై రణదక్షుండగు రక్షోవరుండు రాక్ష సాస్త్రంబు బ్రయోగించిన నదిభయంక రానేక రాక్షసాకారంబుల దంష్ట్రాకరాళ వక్త్రంబులంబరతేర రఘువంశవర్ధిష్ణుండును వైష్ణవాస్త్రంబు బ్రయోగించిన నది యనేక చక్ర విక్రమాటోపంబున దానింద్రుంచె, వెండియు నద్దనుజపుంగవుండు భుజంగాస్త్రంబు బ్రయోగించిననది తత్కార్ముక వినిర్ముక్తంబై యతిదర్పంబులగు సర్వరూపంబుల హేమపుంఖ రింఖాసంఖ్యాత మార్గణసంఘంబులై నిజముఖంబుల మహావిషానలంబులం గ్రక్కుచు నఖిలదిక్కులం గప్పుచు జుట్టు ముట్టినంగనుంగొని రఘుపుంగవుండు సముజ్వలజ్జ వోదీర్ణంబగు సుపర్ణాస్త్రంబు బ్రయోగించిన నక్కాండంబు తత్కోదండ ముక్తంబై తీక్ష్ణతుండపక్షపుచ్ఛ చరణ నఖరభీకరంబులగు గరుడాకారం బులం బరతెంచి సర్పశత్రువులగు నమ్మహాస్త్రంబు తత్సర్పబాణంబుల నన్నిటినింబొలియించెనిట్లు గిరిద్వయంబునుంబోలె చలింపక, హరిద్వయంబునుంబోలె విక్రమింపుచు, కరిద్వయం బునుంబోలె చలంబుడింపక, ననేకనిశితాస్త్రంబుల నిద్దరుంబోరు నవసరంబున నిజాస్త్రంబులన్నియు రామాస్త్రంబులం ప్రతిహతంబగుటయుంగని రోషబంధురుండై దశకంధరుండు కల్పాంత ధారాధరంబునుంబోలె ఘోరనారాచ వర్షధారాసారంబుల సంగ్రామ దుస్సహ ప్రచారుండగు నారఘువీరుపయిం గురిసి మరియునుం గినిసి యనేక నిశిత విశిఖానీకంబులం జీకాకుపరచె పురుహూతసూతుండగు మాతలింగదిసి నిశాతశరాఘాతంబుల నొప్పించియప్పుడ తత్కాంచన ధ్వజం బర్ధచంద్ర బాణంబున బడనేసియమ్మహేంద్రాశ్వంబులం కఠోరసాయకంబుల భేదించిన వికలసమరుం డగు నారఘుకుల వరునింగాంచి దేవగంధర్వచారణ మహర్షి పితృదేవతాదులు విషాదంబునొందిరి విభీషణ సహితుడైన సుగ్రీవాంగదాది వానర ప్రతతులు బాధాకులితులై రయ్యడనద్దశాన నుండు వింశతిక రాగ్ర గృహీత శరాసనుండై శైవాల మాలావృత శిఖర జాలంబగు మైనాక శిఖరంబునుంబోలె జలింపకుండెనట్టి సమరంబున. 168

శా॥ అంతన్ రాఘవుడుద్ధతత్వరిత సద్యఃక్రోధ రక్తాంత దు
ర్దాంతో ద్వీక్షణ దుర్నిరీక్షణుడునై తత్కాల తుల్యాప్తి క
ల్పాంత క్రూరకృతాంతుకైవడి మహోద్యద్భ్రూకుటి స్ఫారవ
క్రాంతుండై దనుజున్ దహించుగతి కోపాటోపమేపారగన్ 169

మ॥ మఘవచ్ఛాపసరూపమద్భుతము భీమంబైన చాపంబుదో
ర్లఘిమంగైకొని కల్పహవ్యవహతుల్య క్రూరదుర్వార ఘో
రఘన స్ఫారశరంబు కేలగొని తీవ్ర క్రోధనేత్రాగ్నిచే
రఘువీరుండు గనెన్ దహించుగతి నారక్షోవరున్ ముందటన్ 170

కం॥ విక్రమముదెలుప రాము డు
రుక్రముడీగతి మహోగ్రరోచి స్ఫురణా
వక్రిమ రావణునకు మృ
త్యుక్రముడుగ లోకతతికిదోపగనంతన్ 171

శా॥ చాపారోపముజేసి తద్విశిఖమున్ సంధించియున్ దానిచే
కోపోద్రేకముతోడ రాఘవుడు రక్షోనాథ వక్షస్థలం
బేపారంబగులంగనేయనపుడెంతేవాడు మూర్ఛాయతిన్
బ్రాపింపన్ రథమాజికిన్ దొలగపారన్‌దోలె సూతుండొగిన్ 172

ఉ॥ అంతట దేరి పంక్తిముఖడారథసూతు నదల్చిపల్కియ
త్యంతము చక్కనైనిలిచి తద్రఘువుంగపు మీదగ్రోధ దు
ర్దాంతతనేగు దేరగని రాముడు వానిరథధ్వజ త్రయం
బెంతయు ఘోరబాణహతినేపునధాత్రి బడంగనేయుచున్ 173

కం॥ సంతసమున కపులార్వగ
నంతన్‌దృఢ సజ్యచాపుడై యారక్షః
కాంతునిమీదికి లయకా
లాంతకుగతి రామభద్రుడడరెంబెలుచన్ 174

కం॥ ఆయెడ రావణు శిరముల
బాయకగృధ్రంబులాడె బడెనుల్కలుదా
బోయెన్నక్కలు నెదురున
మేయత రామునకు శుభనిమిత్తములొలసెన్ 175

ఉ॥ ఆతరి శాత్రవుంబొదువనాశుగతింజను రామభద్రుగ్రో
ధాతిశయోగ్రమౌముఖమునారసి భూతములెల్ల భీతిలెన్
భూతలమున్వడంకెరఘుపుంగవుగోపమునన్ భయంకరో
త్పాతము లెల్లగాంచిమది పంక్తిముఖుండు గలంగెనెంతయున్ 176

కం॥ ఈరీతి మదిగలంగియు
ధీరత్వము పెంపువలన దివిజాంతకుడున్
ఘోరశరపరంపరచే
నారాఘవుమీదగప్పునంతటి లోనన్ 177

మ॥ ప్రకటాటోపముదోప రాఘవుడు చాపజ్యావిముక్తంబులున్
గ్రకచాగ్రంబులునైన భల్లములచే ఖండించిరత్నస్ఫుర
త్ప్రకటోదగ్రములైన రావణుశిరంబుల్ భూరికేయూర దీ
ప్త కరంబుల్దెగి వెంటనే యవియు చిత్రస్ఫూర్తి మొల్చెన్వెసన్ 178

చం॥ అదిగనిరామభద్రుడరుదందుచు తోడనెతొంటిరీతి బె
ట్టిదముగ బాణలాఘవ పటిష్ఠత తచ్ఛిరముల్గరంబులున్
గుదిగొన ద్రుంచిననొల్మిచె గొబ్బునబ్బలియుండు వెండియున్
ప్రదరము లేచి త్రుంచినను ప్రాగ్విధిదోపగనయ్యె నవ్వియున్ 179

ఉ॥ మాటికిమాటికిట్లు రఘుమౌళివెసందెగ వ్రేయతొంటియే
ర్పాటున తచ్ఛిరంబులు కరంబులు నార్భటులున్మహాయుధా
స్ఫోటనముల్ దలిర్పబొలిబోవని బీరములన్ రణక్రియో
ద్ఘాటన మొప్పబూర్వగతి గన్పడు నేమిగొరంత దోపగన్ 180

- రాముడు రావణుతలలు దెగవ్రేయుట -

కం॥ తెగియెడునవియున్నభమున
కెగసెడు నవియున్ కడంకనిలబడు నవియున్
దగురూప గుణాదులు నొక
పగిదింగనుపడె దశాస్యబాహులు శిరముల్ 181

కం॥ తెలియం గరములు శిరములు
దళితములగుటయును విదళితములగుటమరిన్
మొలుచుటగనకుండగ నొక
దళముగ ననిసేయుచుండెదశకంఠు డొగిన్ 182

కం॥ ధనువున గొనయము జేర్చుట
దొనశరముందివియుటయును దొడగుటయును శ
త్రునివేయుటెరుగ కుండం
గను దునిమెన్ రాముడసుర కరములు శిరముల్ 183

కం॥ వడిరాముడసుర శిరములు
నడరం దునుమాడ శోణితావృతములునై
కడుదివికి నెగసి పుడమిం
బడె తాళోత్పతిత పక్వ ఫలములలీలన్ 184

కం॥ క్రిందగునవియై దివికిన్
జెందెడునవియై దశాస్యు శిరములు రఘుసం
క్రందనుని శౌర్యలక్ష్మికి
కందుక ఖేలనముబోలె కడునొప్పారెన్ 185

వ॥ ఇట్లు రఘువరుండు బలంబును జలంబు రెట్టింప భయంకర శరంబుల గరంబులు దుండింపుచు శిరంబులు ఖండింపుచు మర్మంబు భేదింపుచు చర్మంబులచింపుచు నంగాంగంబుల నొంపుచు గలంచుచుండ వాడును నంతరంబులేక నుదయించు కరశిరంబులవలనన్ దెగనివాడునుంబోలె ధైర్యంబేర్పడ దర్పంబున నొప్పియుం దప్పియుంజెందక యప్పటియట్ల బాణకృపాణశూల భిండివాల పరశుపట్టెస ప్రాస ముసలముద్గ రాద్యాయుధంబుల నొడుచుచు బొడుచుచుం బోరుచుండెనివ్విధంబున దినంబును రాత్రియు సంధ్యయు దిక్కులు నెరుంగకుండ నేడహోరాత్రంబులు బోరుచు నిక్కరణిం బెక్కుమారులు రక్కసు శిరంబులు దునిమితునిమి యద్దేవాంతకుండంతంబునొందమికింజింతించి యనేక దివ్యాస్త్ర యుక్తుండు సర్వాస్త్ర విద్వరుండును కౌసల్యానందవర్ధనుండును నగు రఘూద్వహుండును హృద్గతంబున మున్ను మహాసత్వ పరాక్రమోద్ధతులగుదైత్యవీరు లెయ్యెయస్త్రంబుల నిహతులైరయ్య స్త్రంబులన్నియు రావణుహరణంబునెడ నిష్ఫలంబులయ్యెనని యత్యంత చింతాపరుండైన నారఘువరు సమీపంబున నుండి విభీషణుండొక్క వాక్యంబిట్లనియె. 186

సీ॥ రఘువీర! బ్రహ్మవరమ్మున నాభియం
దతనికి కుండలాకృతి యమృతము
గలిగియుండుట జేసి కరములు శిరములు
దునిమిన తత్క్షణమునెనె బొడము
నగుట నయ్యమృతంబుననలాస్త్రమున శోష
మెనరించియంత నూటొక్కమారు
తలలుఖండింపనిద్దశకంధరుడు జచ్చు
ననవినిరాఘవుడతిశయమున

తే॥గీ॥ శౌర్యమెడరంగ పావకాస్త్రంబు మంత్ర
పూర్వకముగాగ నడరింపపూనివాని
నాభి భేదింప యమృతకుండము గలంచి
సించియయ్యమృతంబు శోషింపజేసె 187

ఉ॥ వెంటనెతొంటిరీతి రఘువీరుడుదగ్రతరోగ్ర బాణముల్
వింటదొడంగి ఘోరగతి వేగమె నూటొకమాటు బాహువుల్
తుంటలుజేసి శీర్షములు దున్మినముఖ్య భుజాయుగంబుచే
నొంటిశిరంబు చేదనుజుడుండెను తేజముబోవనయ్యెడన్ 188

మ॥ కరముల్ శీర్షములిట్లుబోవ కరయుగ్మంబేక శీర్షంబునుం
బరగన్ రావణుడొప్పె వజ్రనిహత ప్రత్యంత భూమీధరో
త్కరశృంగవ్రజమౌచు పాదగిరి యుగ్మంబేక శృంగంబునన్
గరిమన్నిల్చినయంజనాద్రియన రక్తస్రావధాతూగ్రమై 189

వ॥ అంత 190

మ॥ ఇటమున్నెవ్వడెరుంగనట్టిదగు నాయీమర్మమున్ జెప్పెనీ
కుటిలుండంచు విభీషణుందునుమగాగ్రూరంబునౌ శక్తిను
ద్భట కోపంబునవేయ రావణుడు తత్కాకుత్థ్సుడున్ దానిను
త్కట భర్మాంచిత శాతభల్లములచే ఖండించెనత్యుద్ధతిన్ 191

వ॥ ఇవ్విధంబున రఘువరునిచేత భయంకరంబులగు శిరంబులుం గరంబులు విచ్ఛిన్నంబులైనన్విన్నబోయి, యన్నిశాచరుండు ముఖ్యంబగు నొక్కశిరంబు చేత నుద్దీపించి, కరశిరంబులన్నియుం గలుగు వానింబలె మహోద్ధత క్రోధంబున ఘోరధనుఃపాణియై యనేక శస్త్రాస్త్రంబులు రాఘవుని పయింగురిసిన నారాఘవుండునుం గరలాఘవంబున నమోఘ శస్త్రాస్త్రచయంబులు వానిపయిన్ జొనిపెనిత్తెరంగున ధీరోదాత్తుండగు రఘుసత్తముండును ధీరోద్ధతుం డగు నద్దనుజోత్తముండునుం బరస్పరంబును రథంబుల మండల ప్రచారంబు మెరయింపుచు నసంఖ్యాత మహాశరంబులు పుంఖాను పుంఖంబుగా సవ్యాపసవ్యంబుగా నడరింపుచు వివిధవిధ లక్ష్య విశేషంబుల నవయవంబుల భేదింపుచుంబోర నాయుద్ధంబతి సంకులంబును నతిభీషణంబును రోమహర్షణంబునునయ్యె నయ్యెడ మాతలి రఘునాథునింగని మహాత్మా! యిద్దెత్యునకు మృత్యుకాలంబు బ్రాప్తంబయ్యెననిన వియత్తలంబున మరుత్తుల వాక్యంబులు బ్రవర్తింపుచున్నయవిదానంజేసి వీనివధంబునకు సత్వరంబున నిత్తరి బ్రహ్మాస్త్రంబు బ్రయోగింపుము వీడు శిరో భేదంబున వధ్యుండుగాడు మర్మభేదంబున శిరంబు ద్రుంపక మర్మఘాతంబున వీనివధింపు మనిన నీరీతి మాతలిచేత సంబోధితుండై రఘువీరుండు దీర్ఘతర విషభూత్కార భీకరంబగు మహోరగంబునుంబోని ప్రదీప్తంమగు బ్రహ్మాస్త్రంబు ప్రయోగించె నప్పుడు. 192

- రాముడు రావణాసురుని సంహరించుట -

సీ॥ ఏమహాస్త్రముపార్శ్వ సీమలపవనుండు
ఫాలంబునను భాను పావకులును
సారగౌరవముల మేరుమందరములు
నంగంబునందఖిలాంబరంబు

సర్వపర్వంబుల సకలదిక్పతులును
పుంఖంబునను వస్తుపుంజకంబు
వర్తింపుచుండ జాజ్వల్యమానస్ఫూర్తి
విలయభాస్కరురీతి వెలుగుచుండు

తే॥గీ॥ అట్టి త్రైలోక్యనాశకరాతి భీక
రాద్భుతంబై తనర్చు బ్రహ్మాస్త్రమపుడు
వింటసంధించె నాథర్వవేదమంత్ర
పూర్వకముగాగ నమ్మహాభుజబలుండు 193

కం॥ ఈతీరును రఘువరుడ
బ్జాతభవాస్త్రంబు వింటసంధించినచో
భూతలముదలకె భీతిలె
భూతతతుల్ దిశలువడకెభువనములడకెన్ 194

శా॥ ఆకాకుత్థ్సుడు క్రోధదీపుడును ప్రత్యాలీఢ పాదస్థుడై
యాకర్ణాంత గుణోగ్రచాపమున మర్మాఘాతి బ్రహ్మాస్త్ర ము
ద్రేకస్ఫూర్తిని వ్రేయవజ్రకరనిర్దిష్టాశనింబోలి కా
లాకారోద్ధతి వక్త్రమైపడియె దైత్యాధ్యక్షు వక్షస్థలిన్ 195

మ॥ అతిఘోరంబు శరీర భేదకరమౌనయ్యస్త్రముద్వేగ ము
ద్ధత ఘోషంబునునై దశాస్యునురమొయ్యంగాడి తత్ప్రాణమా
రుతముల్ గ్రోలుచునుచ్చిపారిధరనారూఢంబుగా దూరియ
ద్భుత మొప్పన్ రఘువీరు తూణవరమందుంజెందె ధీరస్థితిన్ 196

మ॥ దిశలెల్లన్ దెలివంద సాహసమునందీపించి యబ్భంగిన
య్యశని స్ఫారకఠోర సారమగు బ్రహ్మాస్త్రంబునన్ వ్రేసిరా
జ శిరోరత్నము రాఘవుండు దునిమెన్ సంగ్రామరంగంబునన్
దశకంఠుం కలుషావకుంఠు సమరోత్కంఠున్ మదాకుంఠునిన్ 197

కం॥ ఆవేళ చాపశరములు
రావణు కేల్సడలి పడియె బ్రాణానిలముల్
బోవందిరుగుడు పడియు
ద్ధావని నారాక్షసేంద్రు నంగము జడియన్ 198

వ॥ ఇట్లు ధరణింబడిన రావణుగని హతశేషులగు రాక్షసులు భయత్రస్తులై సకల దిక్కులకుంబరచిరంత దశవదన నిధనంబును రఘువీరు విజయంబును జయశీలురగు వానరులు సంతుష్టులైయుచ్చె శ్రవంబులనంతటం బ్రశంసించిరత్తరి వియత్తలంబున రఘూత్తము విజయంబును దైత్యవధంబునుం బాటించుగతి దేవదుందుభి ధ్వానంబులు సెలంగె సాంద్రంబుగా రామచంద్రుపయిం బుష్ప వర్షంబులు వర్షించె నమరముని సిద్ధసాధ్య చరణాదులగు ఖేచరులా రామదేవుననేకగతుల నుతియించిరి, సంతసంబులనప్సరః కాంతలు నాట్యంబొనరించి రప్పుడారావణుదేహంబువలన వెడలి యాదిత్యుని విధమునం బ్రదీప్తంబగు దివ్యతేజోవిశేషంబు బ్రకాశింపుచుం జనుదెంచి దేవ బృందంబులందరుం జూడ రఘువరుని యందు బ్రవేశించిన నాబృందారకులాశ్చర్యంబునుం జెందియద్దశగ్రీవు భాగ్యంబెంత యనవచ్చునితండు మహాత్ముండుగదా దేవతలమగు మేము సాత్వికులమై హరికారుణ్య పాత్రులమయ్యును సంసార ప్రవర్తితులమై భయదుఃఖాది వ్యాప్తులంజెందెదమిద్దైత్యుండు గ్రూరుండును బ్రహ్మహంతయు నత్యంత తామసుండును పరదారా రతుండును విష్ణద్వేషకుండును తాపస హింసకుండును నయ్యును సర్వభూతంబులు గనుచుండ రామునియందే ప్రవేసించెనని బరస్పరంబునం బేర్కొనుచుండ సుస్మితుండై నారదుండవ్విబుధులతో మీరు ధర్మతత్త్వవిచక్షణులగుట నొక్కసూక్ష్మంబు సెప్పెద వినుం డిద్దశకంఠుండు విద్వేషంబున నిరంతరంబు రఘూద్వహుని హృద్గతంబున భావింపుచు విద్వేషయుక్తులగు భృత్యులుందా నునిత్యంబును నారామచరిత్రంబు వినుచు నారామునివలన నిజనిధనంబునిశ్చయించి భయంబున నెల్ల కడల రఘువరుండునట్ల వీక్షింపుచు ననుదినంబును స్వప్నంబున రఘువర్యంబరికింపుచుండుం గావున నద్దనుజాధీశునకు గ్రోధంబెగురుబోధంబు కర్మనధిక బోధ కరంబయ్యె నిట్లుండియు నంతంబున నద్దేవుని చేత హతుండగుచు నిర్ధూతాశేష కల్మషుండును నిర్ముక్త బంధనుండునునై రావణుండు రామ సాయుజ్యంబును జెందెనని వచించి మరియును. 199

మ॥ పరదారార్థ రతుండు దుష్టమతియున్ పాపిష్ఠుడేనిన్నిరం
తరమున్ భీతినినైన బ్రీతినయినన్ దద్రాము భావింపుచున్
మరణంబొందిన శుద్ధుడౌ భవశతాంతర్దోషముల్ బాసివే
హరియౌ రాముని ముఖ్యదివ్య పదముంబ్రాపించు వైకుంఠమున్ 200

సీ॥ కలననీరీతిలోకత్రయ కంటకు
దశకంఠుద్రుంచి యుత్సాహలీల
నుర్విపై చాపాగ్రమునిచి సవ్యంబగు
పాణితచ్చాపంబు బట్టినిలిచి

యన్యమౌదక్షిణ హస్తంబుచే నొక్క
శరము ద్రిప్పుచు విలాసంబెసంగ
శరదరుణాంభోజ సన్నిభరక్తాంత
నేత్రుండు శరదళద్గాత్రుడగుచు

తే॥గీ॥ సూర్యకోటి ప్రకాశుండు శుభయశుండు
జిష్ణువినుతుండు వీరలక్ష్మీయుతుండు
రణజయస్ఫూర్తియగు వీర రామమూర్తి
చేరిదయ చేతమమ్ము రక్షించుగాత! 201

వ॥ అనియిట్లునభంబుననుండి నారదుండమర స్తోమంబుతో రామప్రభావంబు బ్రశంసించుచుండె నప్పుడు 202

కం॥ ఈరీతిగ నారాఘవు
డారావణు గెలిచి నిజశరాసము గేలన్
ధారుణి నిలిపిన దనరెన్
ధీర జయస్తంభమును ప్రతిష్ఠించుగతిన్ 203

శా॥ రాముండంత విభీషణుంబవనజున్ రవ్యాత్మజున్ వాలిజున్
సౌమిత్రిన్మరి జాంబవంతు హరిసేనంగాంచి పల్కెన్మనఃః
ప్రేమన్మీభుజ శౌర్యసంగతులనర్థిన్ రావణుంగెల్చితే
నామైగావున నిల్చుమీశుభయశంబాచంద్ర తారార్కమున్ 204

కం॥ లోకత్రయ పావనమగు
మీకథ మత్కథనుగూడి మిగులనఘహరం
బీకృతిదలంచు పుణ్యుడు
ప్రాకటగతిగాంచు పరమ పదమనిపలికెన్ 205

శా॥ ఆలోరామునిచేత రావణవధం బాలించి తాద్భార్యలౌ
నాళీకాస్యలు దుఃఖి తాత్ములగుచున్మందోదరీ ముఖ్యులౌ
స్త్రీలెల్లంబరతెంచి వల్లభుపదోర్విన్ వ్రాలి హానాథ!యం
చాలాపించి వచించిరిట్లు పతితుండౌ తత్పతింగూర్చుచున్ 206

సీ॥ రణవిలయోద్భాసి రామపయోరాశి
నిన్నుదీనినిబోలె నేడుముంచె
రణనగాలక్ష్యంబు రామహర్యక్షంబు
నిన్నుదంతిని బోలె నేడుద్రుంచె
రణవనోదీర్ణంబు రామసుపర్ణంబు
నిన్ను సర్పముబోలె నేడు సించె
రణనభోలంబంబు రామార్క బింబంబు
నిన్నుతమము బోలెనేడణంచె

తే॥గీ॥ రాముడచ్యుతు డారమారామసీత
యనిన వినవైతివపనీతి హతుడవైతి
వధిప యిటు మే మనాథల మైతిమనుచు
నడలిరయ్యింతులు విభీషణాన్వితముగ 207

తే॥గీ॥ అపుడు లక్ష్మణుగని రాముడనఘు వగచు
నివ్విభీషణు బోధింపు మితడువేగ
భ్రాతృసంస్కారమొనరించు గాత! యిటుల
దిగువబడి యేడ్చనబలల దేర్చుగాత! 208

కం॥ అనిరామవిభుడు సెప్పిన
విని మృతునిసమీపమునను వెసబడిమృతున
ట్లన నడలు విభీషణుగని
యెనయుచు సౌమిత్రియతనికిట్లని పలికెన్ 209

- లక్ష్మణుండు విభీషణు శోకంబుజల్లార్చుట -

సీ॥ వినువిభీషణ శోకమున నెవ్వనికిగాగ
నడలేదు సృష్టికి నటకుమున్ను
నికవచ్చుముందట నిపుడును నితనికి
నెవ్వడీతడు నీకు నెవ్వడరయ
గలుగు యోగవియోగములు కాలగతి దేహు
లకు ప్రవాహాగతసికతరీతి
ధాన్యముల్ విత్తినధాన్యంబులొకతరి
నౌనట్లునొకతరిగానియట్లు

తే॥గీ॥ భూతలమయందు భూతముల్ బొడమునొకట
నడగునీభవ మాయావశాప్తిగాన
నీవునేనును వారు వీరితరులెల్ల
కాలగతిగల్గువార మొక్కగతియనఘ! 210

కం॥ భూతముల జన్మమృత్యువు
లేతరినిన్ రామునాజ్ఞనేకలుగుట త
ద్భూత విభుడు భూతములను
భూతములందే సృజించుబూన్చునణంచున్ 211

కం॥ భ్రాతిగనజుడతడు నిజో
ద్భూతములైన స్వతంత్రములునై తగను
ద్భూతములతోడ బాలుని
రీతిన్నిరపేక్షుడగుచు గ్రీడించునొగిన్ 212

సీ॥ బీజంబువలననే బీజాంకురములౌచు
చెడిబీజమంకురంబడరునట్లు
దేహంబువలననే దేహముల్ దేహులౌ
జీవులునుద్భవస్థితినిగనియు
దేహమద్రువమగు దేహినిత్యుడుగ నే
ర్పడదేహ దేహివిభాగమిట్టు
లవివేకమునునున్న వివరింపనేరమి
క్షయవృద్ధి జన్మనాశంబులాది

తే॥గీ॥ యైన యజ్ఞానధర్మంబులఖిలమునకు
ద్రష్టయగు నాత్మయందు తథ్యంబుగాగ
గలిగినటు దోచు దారువికారగతులు
పావకునియందు దోచిన పగిదిగాగ 213

వ॥ కావుననిట్టి దేహి సంయోగంబు నంగదాయసద్విచారంబున నజ్ఞాని యగు వానికి వికారరహితంబగు నాత్మయందు జన్మనాశాది షడ్భావ వికారంబులుం గలుగు విధంబునం దోచుచుండు సదసద్విచారం బున సుజ్ఞానియగువాడు బ్రపాగతజనంబు సంయోగ వియోగంబు వలన మోదఖేదంబులం బొరయనివిధంబున నాత్ముండు నిర్వికారుండని యెరింగి దేహసంయోగ వియోగంబులనగు మోద ఖేదంబులం జెందకుండు నదియునుంగాక బ్రసుప్తుండగు వాని కవమానంబు లేకుండుటంజేసి విషయ సంస్మృతిగలుగని విధంబున విరక్తుండై జీవన్ముక్తుండగు నతండును నహంకారంబును బొరయమింజేసి విషయసంబంధ వికారంబునం బొరయకుండుం గావున నీవును నివ్విధంబంతయుం గనుపెట్టి యింతటికి మూలంబును నహంకారమమకారాశ్రయంబును మాయామయంబును నగు మనోమాత్రంబు జపియింపుమది యెట్లంటేని భగవంతుడు సర్వభూతాంతర్వర్తియును మాయామనుష్య రూపకుండును నీశ్వరుండునుంబరమాత్ముండునగు రామచంద్రధ్యానాదివిధంబుల మనంబు ననుసంధించి రాగాది దోష దర్శనంబు తెలిసి గ్రమ క్రమంబున బాహ్యేంద్రియార్థ సంగతి వలనం దొలంగంజేసి యమ్మనంబును నిర్గతవిషయ పరిస్పందంబును స్వస్వరూప బోధసాంద్రంబునునగు రామానందంబునందు గరుంగంజేయు మని మరియు నిట్లనియె. 214

సీ॥ ఈదేహబుద్ధిచే నెసగు మాతాపితృ
భ్రాతృసుతాదిక భ్రాంతిగనుట
కాయంబునకు విలక్షణునిగానాత్ముని
నాత్మచేతను నెప్పుడరయగలుగు
నపుడెవ్వరెవ్వారి కాప్తపిత్రాదులు
గారుతత్సంబంధ కలనలేమి
నగుటచేనట్టి మిథ్యాజ్ఞాన వశమున
నయ్యెను దారాగృహాదికములు

తే॥గీ॥ సకల శబ్దాదివిషయముల్ సంపదలును
నఖిలబలరాజ్యకోశ భృత్యాదికములు
సరవిన న్నియు నజ్ఞానజములుగాన
బ్రజ్ఞనెరుగంగ క్షణసంగభంగురములు 215

ఉ॥ కావునలెమ్ము! బోధమతిగైకొని రాముని భక్తి భావితున్
భావననిల్పి న్యాయగతి బ్రాప్తమునైతగు రాజ్యధర్మముల్
బ్రోవుము బ్రస్తుతక్రియలు బూనుముభూతభవిష్యదర్ధముల్
ద్రోవుము దీననీకు భవదోషములంటవు సూ! విభీషణా! 216

కం॥ ఈరావణునకు పరసం
స్కారములొనరింపుమితని కాంతలవగపున్
వారించి లంకకనుపుము
యీరీతిగ రాముడాన తిచ్చెన్నీకున్ 217

మ॥ అనిబోధించిన లక్ష్మణోక్తివిని మోహస్నేహ శోకాదుల
న్మునుమున్వీడుచు రామపార్శ్వతటమందున్నిల్చి బుద్ధిన్ విమ
ర్శనముంజేసి విభీషణుండఖిల ధర్మజ్ఞుండు ధర్మార్ధవ
ర్తనమౌవాక్యము రాముతో తదనుయుక్తవ్యాప్తిగానిట్లనున్ 218

వ॥ దేవా! యీరావణుండు నిరంతరంబును గ్రూరుండును ఘాతకుండును సకలధర్మవ్రతదూరుండును పరదారాభిమర్శనుండునుగావున నితనికి పరలోక క్రియలు సంస్కారంబు లొనరింప నిచ్ఛయింపననిన తద్వచనంబువిని బ్రీతుండయ్యును రఘునాథుండవ్విభీషణుతో మహామతీ! వైరంబులు మరణాంతరంబులు తత్పర్యంతంబున మనకుంబ్రయోజనంబు నివర్తించె నింకనితండు నీకెట్లగు

నాకును నట్లగుంగావున నితనికిన్ క్రియాకలాపంబు లొనర్పుమనిన రామాజ్ఞ శిరంబునంగ్రహించి ధర్మాత్ముండగు విభీషణుండు సుగుణమందిర యగు మందోదరి మొదలగు సుందరుల సాంత్వన వాక్యంబుల నూరార్చి బ్రాహ్మణ బంధుయుక్తుండై సత్వరంబుగా నలంకృతంబగు విమానంబున భేరీతూర్యపురస్సరంబుగా రావణ కళేబరంబు గొనితెచ్చి యాహితాగ్ని క్రమంబగు పితృమేధ సంవిధానంబున నగ్నిసంస్కారాదికంబుగావించి సుస్నాతుండై ఆర్ద్ర వసన కుశ తిల సహితంబును విధివిహితంబునుంగా సలిలంబొసంగి శిరంబున నమస్కరించి భూసురభోజనాదికంబు బురస్కరించి యథాసాంగం బుగానివ్విధంబున సంస్కరించి తత్కులాంగనలతో పురంబు ప్రవేశించి వారినూరడించి యనంతరంబునంబరిశుద్ధచరితుండును వినీతుండునునై యవ్విభీషణుండు వచ్చి రాముని సమీపంబున నిలిచియుండెనంత 219

కం॥ రావణుని ద్రుంచి రఘువరు
డావిధిసౌమిత్రి భాస్కరాత్మజ హరిసే
నావృతుడై హర్షించెను
దేవేంద్రుడు వృత్రుదుంచి తెలివందుగతిన్ 220

కం॥ మాతలియును రఘునేతన్
బ్రీతిన్ వలగొనుచు మ్రొక్కిప్రియగతి తదను
జ్ఞాతుండై బహుమతితో
నాతరిస్వర్గమున కరిగెనంబరవీధిన్ 221

- విభీషణునకు రాజ్యాభిషేకంబొనర్చుట -

సీ॥ అంతసంతుష్టుడై యారాముడనుజుని
బిలిచియిట్లనియె విభీషణునకు
నేనులంకారాజ్య మిచ్చితిమున్ను గా
వున నీవుయిప్పుడు జనియితనికి
విప్రులచేమంత్ర విధినభిషేకంబు
గావింపుమనిన లక్ష్మణుడునపుడు
కపులతోనరిగిలంకామధ్యమున హేమ
కలశంబులను సింధుజలయుతముగ

తే॥గీ॥ సలిపెనభిషేకమును విభీషణునకతడు
నంత పౌరులతోనుపాయనయుతముగ
జేరి సౌమిత్రితో జయస్థేముడైన
రామునకొనర్చెదండ ప్రణామమంత 222

ఉ॥ రాముడునవ్విభీషణుని రాజ్యపదస్థుని గాంచిసానుజుం
డైముదమంది తన్నునుగృతార్థునిగాగదలంచి భానుజు
న్వేమరు గౌగిలించియును నీదు సహాయత వైరిద్రుంచిలం
కామహికిన్విభీషణునిగట్టితి పట్టమునంచు హర్షిలెన్ 223

ఉ॥ అంతటరాఘవుండు వినయాన్వితు పార్శ్వతటస్థితున్ హనూ
మంతునిగాంచి పల్కెవెసమారుతి నీవిక రావణాలయా
భ్యంతరమవ్విభీషణుని యానతిసొచ్చిదశాస్యనాశమ
త్యంతముజెప్పిసీతకునుతత్ప్రతి వాక్యముసెప్పుమాకనన్ 224

ఆ॥వె॥ ఇటులరాముడాన తిచ్చిన హనుమంతు
డతులబుద్ధిమంతుడసుర పూజి
తాత్ముడగుచు రావణాంతఃపురముసొచ్చి
యందు శింశుపాద్రుమాంతికమున 225

సీ॥ ఆరామదర్శనాయత్తమైయుండియు
నారామదర్శనంబరయుదాని
నాసురీపరివృతవ్యాప్తి యోగ్యమునయ్యు
నాసురీపరివృతయైన దాని
తనకశోకస్థితియనిశంబు గలిగియు
తనకశోకస్థితిదలచుదాని
మానవసతి వృత్తిబూనుదేవియునయ్యు
మానవసతివృత్తిమలయుదాని

తే॥గీ॥ కృశయు నతిదీనయు ననింద్యవృత్తయగుచు
మానసాధీన రాఘవధ్యానయగుచు
చిరతపస్విని లీల వసించుదాని
జానకినిగాంచెపవమానసూనుడపుడు 226

కం॥ కనివినయావనతుండై
ప్రణుతుండై భక్తినిటుల బద్ధాంజలియై
యనిలజుడు మ్రొలనిలిచిన
జనకజయతనిగని పూర్వసంస్మృతిదోపన్ 227

కం॥ ఈతండు తొంటిరాముని
దూతయనుచు సౌమ్యసుఖముతో హర్షితగా
నాతరి వాతసుతుడు త
త్సీతకు పతివచనమెల్ల జెప్పెడివాడై 228

సీ॥ దేవిరాముండు సుగ్రీవవిభీషణ
సౌమిత్రి హరిసైన్యసహితముగను
సుఖముగనున్నాడు సుతహితబలమంత్రి
యుతముగాననిదశాస్యునివధించి
మొనసిలంకారాజ్యమునకు పట్టముగట్టి
యవ్విభీషణుని కృతార్థుడగుచు
కరుణతోనిన్ను యోగక్షేమ మరయగా
నన్నుబుత్తెంచెనటన్న సీత

తే॥గీ॥ ప్రియుని ప్రియవాక్యమునువిని ప్రియముసిగ్గు
నలర రోమాంచకంచుకితాంగియగుచు
కన్నుల ప్రమోద బాష్పముల్ గడలుకొనగ
హర్షగద్గదసూక్తిచే నతనికనియె 229

కం॥ పావని! నీప్రియ సూక్తికి
నీవలసరిగానొనర్ప నెన్నియుసరిగా
నీవిశ్వంబున గలుగు ధ
నావళిమణిపాళిభూషణాళియునైనన్ 230

చం॥ అనవినిసీతతోడ ననిలాత్మజుడిట్లను దేవిరాజ్యముల్
ధనములు నిచ్చుకన్ననిట దైత్యువధించి జయంబుగన్నరా
మునిగనుగొంటయే మనకు ముఖ్యముగావున నేనురాఘవుం
గనుగొన బోయెదన్ బతిగిగా ప్రతివాక్యము నానతిమ్మికన్ 231

తే॥గీ॥ అనినవిని సీత బ్రీతయైయతనికనియె
సకలగుణములు నీయందు సౌమ్యగతుల
నొకట నిలిచినవగుట సౌమ్యుడవునీవు
భక్తిసంయుక్తి కృతనయ! పవన తనయ! 232

కం॥ రాముని జూడంగోరెద
స్వామిశలవొసంగినపుడ వచ్చెదవెసనే
నోమారుతి! నామనవిగ
వేమరు దెలియంగ విన్నవింపుము పతికిన్ 233

తే॥గీ॥ అనినయగుగాకయని బ్రీతిననిలసూతి
సీతకు బ్రణామమొనరించి సెలవుగాంచి
యధిపుసన్నిధి కరిగి సాష్టాగ మొరిగి
దేవి వచియించువిధమంత దెలిపియంత 234

కం॥ దేవా! యేదేవికిగా
నీవిధియత్నంబొనర్చితీకార్యఫలం
బావహిల శోకవృతన
ద్దేవిన్ రావింప వలవదే! చూచుటకున్ 235

మ॥ అనుచున్ వాయుసుతుండు దెల్పవినిసత్యజ్ఞాన నిష్ఠాపరా
యణుడారాముడు పూర్వక్లుప్తయగు మాయాసీతనున్వీడియ
య్యనలస్థానగతన్ మహీసుతను గాఢాప్తింగ్రహింపంగజే
యనిదేవేళయటంచులోదలచి దైత్యాధీశుతోనిట్లనున్ 236

కం॥ చనుమువిభీషణ జనకజ
ననుగతసుస్నాత నిర్మలాంబర శుభలే
పన భూషాన్విత నొనరిచి
కొని తెమ్ముమదంతికమునకున్ వేవేగన్ 237

వ॥ అని రఘువిభుండానతిచ్చిన విభీషణుండు హనుమత్సహితుండై చనియమ్మహాదేవిం గాంచి నమస్కరించి వృద్ధగణ్యలగు పుణ్యజనాంగ నలచేత మంగళస్నానంబొనరించి వివిధంబులగు దివ్యాంబరాభరణ మాల్యానులేపన విశేషంబుల నలంకరించి యాత్రిలోకసుందరి నాందోళికాసీనంగావించి పరిచారికా సహస్రంబులు దోడనడవ రక్షణార్థంబుగానంచులంకంచు కీజన నివహంబులంతటంతట బరాబరు లొనరింప నమ్మహీసుత వచ్చుతరి మహీతలంబు దనుజ వధూబృందంబును నభంబున బృందారక సుందరులును నచ్చటచ్చటం గచ్చుకొని తచ్ఛోభా సౌభాగ్యంబుల కచ్చెరువందుచు నిరీక్షింపుచుండ నత్తరి వేత్రహస్తజనసహస్రంబులు కోలాహల ధ్వానంబుల నజ్ఞానకింజూడ వచ్చు వానరానీకంబుల రానీకుండ నివారించు విధంబును శిబికారూఢయగు నద్దేవిందూరంబునం గాంచి రఘువీరుండ

విభీషణుతో నీప్లవంగ సంఘాతంబు మాతంబోలె సీతం జూతురుంగాక వారివారింపవలవదు వైదేహియున్ బాదచారిణియై వచ్చుంగాకయని విభుని వచనంబులు విని జనకసుతయును శిబికావతరణంబుజేసి చరణవిన్యాసంబులమంద మంద గతింబతిసన్నిధానంబునకుంజనుదెంచినంగని యారఘూద్వ హుండు హృద్గతంబున నీక్షితిపుత్రియతిపవిత్రయగుట నేనెరుం గుదునైనను లోకాపవాదంబు రాకుండ రాముండగ్నివలన పరిశుద్ధంజేసి యద్ధరాసుతను గైకొనియె ననుజనసమ్మతి వ్యాజంబున నిక్కార్యార్థ నిర్మితయగు మాయాసీత ననలాంతరంబున నంతర్హితంజేసి యియ్యనలగత యగు జనకజాతం గ్రహించెదనని నిచ్ఛయించియచ్చట నిల్చిన మాయా సీతతో దనుజాపహృతయగు సీతన్విడిపింప రాముండు సమర్థుండుగాడను నపయశంబు బరిహరింప బహుదినంబులు రావణునినింటనున్ననిన్నుం దెచ్చితిం గాని గ్రహింపనిచ్ఛయింపనీయిచ్ఛ కొలది ప్రవర్తింపుమనునా దినవాచ్యవాదంబు లుచ్చరించినం తద్రామోక్తంబువిని లజ్జారోషో ద్రేకంబుల నద్దేవి రాముని భావంబునెరింగినదియై సౌమిత్రిగని యిట్లనియె. 238

కం॥ నాడగ్ని సాక్షిగాగను
వేడుకగ్రహించియుండె విభుడటుగానన్
నేడగ్ని సాక్షిగాగను
వేడుక గ్రహియించుగాత విభుడటుగానన్ 239

- సీతాదేవియనలంబు ప్రవేశించి వెడలుట -

కం॥ రాముండు విశ్వసింపగ
భూమిజనులు మెచ్చునటుల భూరిహుతవ హ
స్తోమంబు సొచ్చి వెడలెద
సౌమిత్రీ! ప్రజ్వలింపు సలుపుము వహ్నిన్ 240

చం॥ అనవినిరాఘవాశయమునట్టిదిగాగ నెరింగి యాక్షణం
బున నటలక్ష్మణుండు నతిభూరితరేంధన బృందబృందముల్
గొనకొనిమింటనంటగను గూరిచివెంటనెమంటనంటగా
నొనరిచివచ్చి రామవిభునొద్దవిచేష్టత నిల్చెనాతడున్ 241

వ॥ ఇబ్భంగినభ్రంకషంబును నదభ్రవిభ్రమంబును సముజ్వలజ్వాలా భీలంబునునగు మహానలంబు ప్రజ్వలింపంగాంచి యజ్జనకపుత్రి రఘుభర్తకు సభక్తికంబుగా ప్రదక్షిణంబుగావించి సకలలోకంబులుం గనుచుండ దేవదానవ మానవతీబృందంబులు వెరగందదేవతా గణంబులకుం బ్రాహ్మణులకు నమస్కరించి బద్ధాంజలియై యద్ధరాసుతయప్పావకు సమీపంబునకువచ్చి నిత్యంబగు మదీయ

హృదయంబును రామునికన్ననన్యాసక్తంబుగాదేనియు రామవిభుండె పరదేవతగా నీక్షింతునేనియు సర్వసాక్షియగు నీయగ్నిదేవుండునన్ను రక్షించుగాకయని పల్కి వలగొని నిర్భయంబున నప్పరమ పతివ్రతా తిలకంబు ప్రదీప్తంబగు హుతాశన మధ్యంబునంబ్రవేశించియున్న వన్నియబెట్టనుజ్వల జ్వలజ్వలనంబుననుంచిన కాంచన ప్రతిమయుం బోలెనంతకంతకు మెరుంగు లొప్పుచుండె నప్పుణ్యాంగన నిజ హృత్తటంబున బ్రవర్తింప నవ్వీతిహోత్రంబు బవిత్రంబును నాజ్యాహుతిచేతం బ్రజ్వలించుగతి వెలుంగుచుండె నన్నాతియుం బాతివ్రత్యమహిమచేత శీతలుండగు నజ్జాతవేదునందు కంజాత కింజల్కంబులం తదీయ రజః పుంజంబునసంజాత రక్తవర్ణ ప్రసరం బగు సరంబున హేమ కుంభంబు సౌకుమార్యంబున రంజిల్లుగతిం జెలువొందుచుండె యిట్లమ్మహీతలగతయగు మహీసుతంజూచి విభీషణాది దనుజ తతులునుం దత్సుతులును సుగ్రీవాదివానరులును నార్తస్వరంబుల హాహాకారంబులం బరిభ్రమింప నభ్రంబున నమరసిద్ధ సాధ్యవిద్యాధర చారణాది భూత సంఘంబులు నిజాంగనల తోడం గూడి యారఘుకులాధ్యక్షుండు నిజలక్ష్మియగు నీక్షోణీజాత నీరీతింజేయందగవే యని విస్మయవిషానలంబుల పరస్పరంబు సంభాషింప నక్కోలాహలంబుగగన మహీతల మధ్యంబున నంతట నిండియుండెనప్పుడు. 242

సీ॥ అంతసురాధ్యక్షుడగు సహస్రాక్షుండు
ధర్ముండు వరుణుండు ధనవిభుండు
వృషవాహుడతి విభావిభవుడౌనభవుండు
బ్రహ్మవిద్వరుడగు బ్రహ్మదేవు
డమరగంధర్వ విద్యాధర చారణ
సాధ్యసిద్ధులు మునీశ్వరులు ఋషులు
నప్సరుల్ బితురులు నహివరుల్మరియును
గలిగిన ఖేచర గణములెల్ల

తే॥గీ॥ రాముడున్న లంకాపుర ప్రాంత సీమ
కంచిత విమానములతోడ నరుగుదెంచి
గాంచి పరమాత్ముడైన రాఘవుగురించి
యంజలిఘటించి వారలిట్లనిరిభక్తి 243

సీ॥ అఖిలవిశ్వంబున కాదికర్తవును వి
జ్ఞానవిగ్రహుడవు సాక్షివీవు
వసువులందష్టమ వసువు విష్ణుడవీవు
రుద్రులందున శంకరుండవీవు

కనుగొన నఖిలలోకస్రష్టయౌ చతు
రాస్యుండు నగు బ్రహ్మవగుదువీవ
మొగినాది మధ్యాంతములనుండు నిత్యుండ
వొక్కడవయ్యు సమోదితుడవు

తే॥గీ॥ నశ్వినులు ఘ్రాణభూతంబులరయ నీకు
సూర్యచంద్రులు నీకు చక్షుస్సులగును
నీతనూరోమ నికరముల్ నిఖిల సురలు
నీదు జిహ్వాగ్రపేటి వాణీవధూటి 244

ఆ॥వె॥ నిత్యశుద్ధడవును నిత్యబుద్ధుండవు
నిత్యముక్తుడవును నిర్గుణుడవు
నద్వయుండవీవు చిద్వైద్యమూర్తివి
పుణ్యనామ రామ! పూర్ణకామ! 245

కం॥ నీమాయావళితులకున్
న్రామమనుష్యాకృతిం గనందోతువు నీ
నామస్మృతి నిన్నెరిగిన
ధీమంతులకుం జిదాకృతిన్ దోతువొగిన్ 246

కం॥ మా విభవవిభాస్థలముల
రావణుడు హరించియుండె రాఘవ నీవా
రావణునిద్రుంచినప్పుడ
మావిభవవిభాస్థలములు మరలెన్మాకున్ 247

కం॥ సాక్షాన్నారాయణుడవు
నక్షరుడవు బ్రహ్మమీవయాద్యమహిమచే
సాక్షాల్ల క్ష్మియెయగుట ను
పేక్షింపగ దగునె సీతనీగతి రామా! 248

వ॥ అనియీవిధంబునం దేవతలు బ్రార్థనాపూర్వకంబుగా సన్నుతించు నవసరంబున సాక్షాత్ప్రితామహుండగు
బ్రహ్మదేవుండు సత్యమార్గనిష్ఠ గరిష్ఠుండగు రఘుశ్రేష్ఠునకుం బ్రణమిల్లియిట్లనిస్తుతియించె 249

- బ్రహ్మ స్తోత్రము -

మత్తమయూర వృత్తములు।

౧. శ్రీమద్రామున్ విష్ణునశేషస్థితి హేతున్
ధీమత్తత్వజ్ఞాన విధేయాంతర భావ్యున్
స్వామిన్ సత్తామాత్రుని సర్వాత హృదంత
స్థేమున్నిన్నుంజిన్మయదృగ్రూపు భజింతున్ 250

౨. ధ్యానారూఢుల్నిశ్చలితాంతర్విని బద్ధ
ప్రాణాపానుల్ సంశయబంధాదివిదూరుల్
లోనే దేవుంగాంతు రలోలున్రవితేజ
శ్రీనారాముల్ రత్నకిరీటున్మది నెంతున్ 251

౩. హేయాహేయద్వంద్వ విహీనైక పరాత్మున్
మాయాతీతున్ మాధవుమౌనిస్తుతునాద్యున్
మాయామోహచ్ఛేదకు మానాధికయోగి
ధ్యేయున్ రాముల్ రమ్యునుతింతుంబరిపూర్ణున్ 252

౪. భావాభావప్రత్యయ భావాదివిహీనున్
భావాసక్తేశాదిక భవ్యాంఘ్రిననంతున్
దేవున్ శుద్ధున్ బుద్ధునినిత్యున్ బ్రణవాఖ్యున్
నేవర్ణింతున్ రాముని నిశ్శేషిత దైత్యున్ 253

సుగంధివృత్తము -

నాకుభర్తవీవరామ★ నాక కార్యకారకా!
లోకమానదూర! శ్రీశ! లోకవార ధారకా!
ప్రాకటైక భక్తిగమ్య! భావ్యపాపహారకా!
స్వీకృతాత్మ యోగనిష్ఠ! చిత్తసంప్రచారకా! 254

సరసిజవృత్తము -

నీవీలోకానీకములందున్
నిలిచిమొదలుకొన నెరయుదువనుచున్
నీవీలోకాతీతుడ వనుచున్
నినునిటులెరుగుచు నిజవిభుడనుచున్

★ నేక - గ.ము.ప్ర. పాఠం

భావశ్రద్ధాభక్తి సమేతుల్
భజనముసలుపుచు బలుకుదురగుటన్
దేవున్‌రమ్యేందీవర దేహున్
దెలుతునుతులనిను దెలసిరఘువరున్ 255

మాలిని॥ నీవిట మానవిదూరుడవున్ మరి
నిర్గతమాన వికారుడవున్
గావున మాననియుక్తులు శక్తులు
గారునినుంగన మాధవబృం
దావనమందిరు నిందుధరాదిక
దైవతవందితు సౌఖ్యకరున్
న్దేవున్ రాముని దైత్యవిరాముని
నిన్నిదెకొల్చెద మౌనినుతున్ 256

మత్తమయూర వృత్తము ॥

నానాశాస్త్రామ్నాయ గణద్యోతితు రామున్
జ్ఞానానందున్నిర్గుణ సద్రూపుననాద్యున్
దీనాత్మ త్సేవార్థిత దివ్యన్నర మూర్తిన్
ధ్యానింతున్నే మేచక ధామున్ మధురేశున్ 257

శా॥ ఈముఖ్యస్తవరాజ మబ్జజకృతంబే ప్రొద్దువిజ్ఞానదం
బేమర్త్యుండు పఠించు భక్తిరతిచేనీలోకమందాత్మలో
శ్యామున్ రాముని భక్తకామఫలదున్ సర్వేశుధ్యానింపుచున్
భీమాఘంబుల బాసి వాడిహపరాభీష్టార్థ సిద్ధిన్‌గనున్ 258

వ॥ అనియిట్లు లోకగురుండును దివ్యప్రభావుండును నగుబ్రహ్మ దేవుండు సంస్తుతించు నప్పుడప్పరమ స్తోత్రంబువిని హుతాశనుండు దేదీప్యమానతనుండై యమ్మహాజ్వలనంబు వలన నిర్గమించి భ్రాజమానాకారయును విమలారుణ ప్రభాపూరయును రక్తాంబ రావృతయును దివ్యాభరణాలం కృతయుననగు ధరణీసుతను నిజాంకపీఠంబుననిడికొని వచ్చి విశ్వసాక్షియగు నవ్వైశ్వానరుండు బ్రపన్నజన సర్వార్తిహరుండును రఘువరుండుననగు హరింగాంచి ప్రశంసించి యతనితోదేవా! మీరు పూర్వంబున దశానన వినాశార్థం బుగా మాయాసీతను నిర్మించి తన్నిమిత్తంబున సపుత్ర బాంధవంబుగా దశకంధరుని వధించినదానంజేసి భూభారంబు నివారింపనయ్యె భవత్సంకల్పితంబగు

కార్యంబునిర్వర్తించి కృతకృత్యయై ప్రతిబింబ రూపిణియగు నమ్మాయాసీతయున్ దిరోహితయయ్యే మున్ను కాంతారంబున మదీయాంతరంబుననుంచిన జనకపుత్రికందెచ్చితి గ్రహింపుమనిన నత్యంత సంతుష్టుండై యారమాకాంతుండును నప్పావకుంబూజించియపుడ ద్రిలోకజననియును నిత్యానపాయిని యును శ్రీరూపిణియుననగునజ్జానకిన్ బరిగ్రహించి నిజాంకతలం బున నివేసింపంజేసె నివ్విధంబున సీతావధూసహితుండై ప్రకాశింపుచు మహానుభావుండగు రామదేవునింగాంచి సమీపంబున కేతెంచి దేవేంద్రుండు సాంద్రభక్తి రచనంబులగు హర్షగద్గద వచనంబుల నిట్లని సన్నుతించె. 259

- ఇంద్రుండు శ్రీరాములను స్తుతియించుట -

భుజంగ ప్రయాతం -

౧. భవాదిప్రసన్నున్ శుభశ్యామవర్ణున్
స్వభావానీహృదానందనస్థేము రామున్
భవారణ్యదావాగ్ని భావస్వభావున్
భవాభావహేతు ప్రభావున్ భజింతున్ 260

౨. నిరాకారసంభావ్యునిన్మర్మ మూర్తిన్
సురానీకశోకాపనోదైక(?) హేతున్
హరిన్ రామునీశున్మహాభారనాశున్
బరేశున్ బరానందభావ్యుందలంతున్ 261

౩. ప్రపన్నాఖిలానంద భావప్రసన్నున్
ప్రపన్నార్తి నిశ్శేషభంగాభిధేయున్
తపోయోగ యోగీశతత్వానుభావ్యున్
కపీశాది మిత్రుందగన్ రామునెంతున్ 262

౪. సదాభోగభవ్యాత్మ సాన్నిధ్యదూరున్
సదాయోగభవ్యాత్మ సాన్నిధ్యచారున్
చిదానంద సత్కందు శ్రీరామచంద్రున్
విదేహాత్మజానందవేషున్నుతింతున్ 263

౫. సదాయోగమాయానుషక్తిన్ విలాస
ప్రదస్ఫూర్తివౌదౌ నిరాకారివయ్యున్
త్వదానందలీలా కథాపూర్ణకర్ణుల్
తదానంద మూర్తుల్ గదారామభూమిన్ 264

౬. అహంమానపాన క్రియామత్త వృత్తి
స్పృహాద్యాభిమానాప్తి నేనిన్నెరుంగన్
మహేశాభవద్వీక్షణన్నాకు నేడీ
మహానాథ లోకాభిమానంబు వీడెన్ 265

౭. స్ఫురద్రత్నహారాది భూరిప్రకాశున్
ధరాభార భూతోగ్రదైతేయ నాశున్
శరచ్చంద్ర వక్త్రున్ లసత్పద్మ నేత్రున్
దురావారదూరున్ నినుంరామునెంతున్ 266

౮. సురాధీశనీలాభ్రసుశ్యామకాంతిన్
విరాధాదినాశాప్తవిశ్వార్తి శాంతిన్
పురారాతి లాభున్ సుభాషాది శోభున్
హరిన్‌రాఘవేశున్ ధరాధీశునెంతున్ 267

౯. కనచ్చంద్ర కోటిప్రభాంకాది పీఠం
బునన్‌జానకీయుక్త పూర్ణానురక్తుం
వినూత్నేందు సంకాశువిద్యుద్విభాసున్
నినున్ రామచంద్రున్ గణింతున్వితంద్రున్ 268

వ॥ అనియిత్తెరంగున సుత్రాముండు బ్రస్తుతించిన నత్తరి నభస్థలంబున విమానస్థుండైయుండి భవానీ సహితంబుగా భగవంతుండగు భవుండు రాజీవాక్షుండగు రఘులాధ్యక్షుంగాంచి బ్రశంసించి మహానుభావా! నేను భవదీయపట్టాభిషేక సమయంబున నమ్మహోత్సవంబు నీక్షింప నయోధ్యా నగరంబున కరుదెంచెద నీయెడ నీయవతార జనన కారుణుండగు భవజ్జనకుండు వచ్చినవాడు జూడుమనిన నారాఘవుండును దన పురోభాగంబున విమానగతుండగు దశరథుంగని భక్తి ప్రమోదంబుల లక్ష్మణయుతుండై తచ్చరణంబులకు నిజశిరంబొరయ నమస్కరించిన నక్కుమారుల నక్కునంజేర్చి శిరంబుమూర్కొని పంక్తిరథుండు రామునితో నయ్యానీవు పుత్రుండవై సత్కరించుటంజేసి నేనుదుఃఖసాగరంబగు సంసారంబు వలనం దరించి కృతార్థుండ నైతినని వచించి పున రాలింగనం బొనరించి యత్తనూజునిచేతం బూజితుండై దివంబు నకుంజనిన. 269

సీ॥ అంతరాముండు నిజాంతికంబున కృతాం
జలియునైయున్న వాసవుని గాంచి
యమరేశ! నాకుగా ననిదెగిపడిన మ
ర్కటుల సుధావృష్టి బ్రతుకజేయు

మనఘ! నాయాజ్ఞచే ననునియ్యకొనిసురే
శ్వరుడంతనమృత వర్షంబు గురిసి
యావానరులనెల్ల జీవింపజేసిన
తొల్లియయ్యవనిలో ద్రళ్ళినట్టి

తే॥గీ॥ కపులునందరునిద్రమేల్కనినరీతి
నుత్థితులునయి సంతోషయుక్తులగుచు
పూర్వగతి శౌర్యబలముల బొలిచి రాఘు
వేశ్వరుని పార్శ్వములనాశ్రయించిరెలమి 270

వ॥ అంతనారామదేవుండును మహేశ్వర బ్రహ్మేంద్రాదుల నామంత్రణంబు చేసి బ్రయాణోన్ముఖుండయ్యే
నప్పుడు 271

మ॥ ప్రణతుండౌచు విభీషణుండు రఘుభర్తంగాంచి యోదేవ! కొం
తననున్మీరలనుగ్రహించినటులైనన్మంగళ స్నానభో
జన భూషాదులునేడు భూమిసుతతో సౌమిత్రితో గూడమ
న్ననతోగైకొని రేపుబోవదగదే! నాకుంప్రమోదంబుగన్ 272

సీ॥ అనిన విభీషణుగనిరాముడిట్లను
భరతుండు నాకతి భక్తుడరయ
సుకుమారు డూరిలోనకట శత్రుఘ్ను యు
క్తతజాటవల్కల ధారియగుచు
నెదురుసూచుచునుండ నేరీతినేనలం
కారముల్బూనుదువారి విడిచి
యగుట సుగ్రీవాది హరికోటిమిగులబూ
జించిన నన్ను బూజించి నటులె

తే॥గీ॥ యనవిని విభీషణుండు హేమాంబరాన్న
రత్నభూషాదివివిధవర్షములచేత
వారినందరబూజించె వలయునటుల
దానిగని రాముడధికమోదంబు నొందె 273

ఉ॥ అంతటరాఘవుండు దనుజాగ్రణి దెచ్చినభానుదీప్త మ
త్యంతమునైన పుష్పకమునందు వసించి నిజాంకపీఠిపై
నెంతయులజ్జితాస్యను మహీజను కీర్తిసమాజనుంచి వి
క్రాంతుడు లక్ష్మణుండును సకార్ముకుడైవసియింప వెంబడిన్ 274

వ॥ అంతనవ్విమానాగ్రగతుండై రఘువంశాగ్రణి సుగ్రీవాంగద హనుమ జ్జాంబవదాదివననచరులను విభీషణునిజూచి మీచే మిత్రుండనగు మత్కార్యంబు సర్వంబును నిర్వహింపనయ్యెనని బ్రియంబుసెప్పి యందు భానుసుతుంగాంచి సేనాపరిష్కృతుండవై కిష్కింధ కరిగి సుఖంబుండుమనివచించి వనచరుల నవలోకించి మీరు సమరాయా సంబున నిర్వర్తింప మీమీస్థలంబులకరిగి విశ్రాంతులగు మనియు ననునయించి విభీషణు నీక్షించి నాకతి భక్తుండవగుదువీవు స్వకీయంబగు లంకా రాజ్యం బనుభవించుచుంగుశలంబున నెసంగుము మచ్ఛాసనంబునంజేసి వాసవాదులేనియు నిన్నుందడవ లేరని నిర్దేశించి నేను మదీయ రాజధానియగు నయోధ్యానగరంబున కరిగెద మీరలనుమతులై ననుండనిన వారలందరు ముకుళితహస్తులై దేవా! మేము మీతోడ సాకేతంబునకువచ్చి భవదీయ పట్టాభిషేకం బాలోకించి కౌసల్యాదేవికభివాదం బొనర్చి వచ్చెదమనిప్రార్థించిన నారఘుసత్తముండు నట్లయగుంగాకయని యనుగ్రహించిన హనుమ దాది సచివసహితుండును హరిసేనా సమన్వితుండునునై సుగ్రీవుండు మంత్రి భటయుతుండై విభీషణుండు నవ్విమానంబు నారోహింప నత్తరి నవ్వితృపతి యానంబును రాఘవాజ్ఞాయత్తంబై వియత్తలంబున కెగసె నయ్యవసరంబున 275

- శ్రీరాములయోధ్యకు మరలి వచ్చుట -

కం॥ మానితహంసానీత వి
మానముతోనమరెగపిసమన్వితుడగుచున్
భానుకుల వర్యుడమరుల
తోనం జెలువందునలచతుర్ముఖుడనగన్ 276

కం॥ రామునిచేతను లక్ష్మణ
భూమిసుతాయుతుని చేత భూరిగతి తప
స్సామర్థ్యలభ్యమును రవి
ధామంబగునవ్విమాన ధామమువెలుగెన్ 277

తే॥గీ॥ అంతట విమానమరుగంగ నరుదొసంగ
నెల్లదిక్కులనీక్షించి యేర్పరించి
సీతతోడను శశిముఖాన్వీతతోడ
రాముడనియెసగద్గద ప్రేముడగుచు 278

సీ॥ ఇది త్రికూట శిఖాగ్ర విదితప్రకాశాంక
యకలంకనిశ్శంకయైన లంక
యిదిమాంసకర్దమాస్పదదేశమిటమహా
రణమయ్యె హరులకురాక్షసులకు

నిచట నాచేవధంబెనసి కూలిన వాడు
రావణుండఖిల విద్రావణుండు
నిచ్చోట కుంభకర్ణేంద్రజిన్ముఖులు త
ద్భటరాజి ఘోరాజిబడినవారు

తే॥గీ॥ నిట జలధిసేతుబంధనం బేనొనర్చి
తిదియు త్రైలోక్యపూజితంబిద్ధ మహిమ
సేతుసాగరతీర్థ విఖ్యాతమగును
కనుగొనమువీని హితనయ! జనకతనయ! 279

కం॥ పరమంబు పవిత్రంబును
నరయగగను వారిపాపహరమిది రామే
శ్వరుడు బ్రతిష్ఠితుడయ్యెన్
హరుడటనాచేత సీతయవనీజాతా! 280

కం॥ తరుణి శరణనుచునే నీ
సరణివిభీషణుడు నన్ను సచివాన్వితుడై
ధరణిసుతాతరణిసుతుని
పురమిది కిష్కింధయనిన భూసుతగనియెన్ 281

వ॥ అంత 282

కం॥ తారామానుమతిన్ సీ
తారామ ప్రీతికొరకు తరణిజుడంతన్
దారాదిక హరియూథ ప
దారాదుల దెచ్చి సీత దగ్గర జేర్చెన్ 283

ఉ॥ అంతవిమానమేగ విభుడంగన కిట్లను ఋష్యమూకమీ
ప్రాంతనగంబునందు హతుడయ్యెను వాలిమదాశుగంబుచే
నింతిరొ! చూడు పంచవటియిందసురుల్ హతులైరి తాపసా
క్రాంతతదోచునీయవియగస్త్య సుతీక్ష్ణముఖాశ్రమావళుల్ 284

సీ॥ ఇది చిత్ర కూటాచలేంద్రమిచ్చట నన్ను
భరతుండు బ్రార్థింపనరుగు దెంచె
నిది భరద్వాజ మునీంద్రు నాశ్రమవాటి
యమునానదీతటి నలరుచుండు

నిదిభగీరథధరాధీశ పుత్రికగంగ
గాననయ్యె భువనపావనిదగంగ
నిదిసరయూనామనది మదీయనృపాళి
పాలితదేశ సంభావ్యమాన

తే॥గీ॥ యిదియయోధ్యామహాపురంబీపురీంద్ర
మునకును బ్రణామమొనరింపు మనిగ్రమమున
భూమిసుతకిట్లు దెలుపుచు రామవిభుడు
జనిభరద్వాజమౌనియాశ్రమముగనియె 285

వ॥ ఇట్లు చతుర్దశ వర్షంబులు పూర్ణంబులగుచుండం బ్రవర్తించు పంచమీ దినంబున నయ్యాశ్రమంబునకు వచ్చితన్మధ్యదేశంబున రఘూద్వహుండు సముద్దీప్త తేజుండగు భరద్వాజునకు సానుజుండై సనామంబుగా బ్రణామంబుగావించిన నద్దివ్యమునియును నిజ ధ్యానగత జ్ఞానదీపంబగు బ్రహ్మ స్వరూపంబు బ్రత్యక్షరూపంబునం గోచరించుటకు మహానందంబు నందియుండె నయ్యవసరంబు నంగుశాసీనుండైయున్న మునివరునకు రఘువరుండు వినయంబున నిట్లనియె. 286

చం॥ భరతుడు సానుజుండుగ శుభంబున నుండిన వార్తవింటిరే
తిరము సుభిక్షయేకద! మదీయయునైన యయోధ్యతల్లులం
దరుదగ జీవితస్థితినిదార్చిన వారెయటన్న బ్రీతితో
నిరవుగనందరుంగుశలులేయని యమ్ముని వెండియిట్లనున్ 287

కం॥ భరతుడు చీరజటాజన
భరితుడునై కందమూల ఫలజీవితుడై
నిరతముసాధుకలనభూ
భరమిది మిమ్మెదిరి సూచుభక్తినిరామా! 288

వ॥ అదియునుంగాక 289

ఆ॥వె॥ రామ! మీరుదండకామహాటవినున్కి
యసురవధము భూసుతాపహరణ
మాదియైన కృత్యమంతయు నెరుగుదు
త్వత్ప్రసాద మహిమ ★ తపమువలన 290

వ॥ కావున 291

★ తపముమహిమవలన – గ.ము.ప్ర. పాఠం

సీ॥ జగదీశ! నీవు సాక్షాత్పరబ్రహ్మవా
రయనాదిమధ్యాంతరహితుడవును
నీవాదిని జలంబు నిర్మించియందు సు
ప్తుండవైజేసితి భూతపతుల

నదిగాకనీవు విశ్వాత్ముడవైజీవు
లందుందు వంతరాత్ముండవగుట
జలమునారంబు జీవులు నరుల్ నరసమూ
హంబునారంబౌట నట్టి నార

తే॥గీ॥ మందు సుప్తుండవై యంతరాత్మవగుచు
నుండుటను నీకు నారాయణుండనంగ
నామమయ్యెను నట్టినీనాభి కమల
మందజుడు బుట్టి సృజియించెనఖిల జగము 292

కం॥ కావున జగదాద్యుండవు
నీవుజగద్వందితుడవు నిఖిలేశుడ వౌ
నావిష్ణుడవజ్ఞానకి
శ్రీవనితయె లక్ష్మణుండు శేషుడు రామా! 293

వ॥ దేవా! యిట్టి నీవునీయందు మాయచేత సర్వంబును సృజియింపు చిత్సామర్థ్యంబునంజేసి సర్వసాక్షివై నభంబునుంబోలె నన్నింటినంట కుండుదువు నిట్టి భూతవ్రాతంబులందు బాహ్యాభ్యంతర పరిపూర్ణుండ వయ్యును మూఢదర్శనులగు వారికి విచ్ఛిన్నుండవుంబోలె లక్షింప బడుదువదింగాక నీవ యిజ్జగద్రూపకుండవు జగదాధారకుండవు జగత్పాలకుండవు సర్వభూత భోక్తృభోజ్య స్వరూపకుండవు దర్శన స్మరణశ్రవణాదులగోచరంబగు నీయఖిలంబును నీస్వరూపంబ యగుంగావున నీకన్న యన్యంబెద్దియుంగనంబడదు రఘూత్తమా! నీవునిర్లిప్తుండవయ్యును భవత్ప్రేరితయగునిమ్మాయ యహంమానాది నిజగుణంబుల వలన నీలోక వ్రజంబు సృజియించుటజేసి యీవిడంబనంబంతయు భవత్కృతంబుగా నుపచార వశంబునం దోచుచున్నయది యెట్లంటేని యయస్కాంత సాన్నిధ్యంబున జడంబగు నాయనంబు జలించు విధంబున భవదీయ నిరీక్షణంబున నిమ్మాయయు జగంబుగల్పించుచుండు వెండియు దేహ రహితుండవగు నీకువిశ్వరక్షార్థంబుగా దేహద్వయంబు రక్షింప నయ్యెనందు విరాడ్రూపంబుస్థూల దేహంబును సూత్రాత్మకంబు సూక్ష్మదేహంబును నగునట్టి విరాట్పురుషుని వలన ననం తావతారంబులు సంభవించి నిజకార్యాంతంబున నవ్వి రాజుని యందు

బ్రవేశించునట్టి యవతారకథా విధానంబులు సావధానులై యెవ్వరేనియు శ్రవణపఠన గానధ్యానాదులం
గ్రహింతురట్టి వారలందరు ముక్తింజెందుదురు గావున. 294

సీ॥ మునునీవు ధాతచేతను భూమిభారాప
హారార్థమర్థింపనగుచు నతని
తపముచే బ్రియమంది తగురఘువంశ మం
దవతారమొనరించియమర కార్య
మతి దుస్సహంబైనయఖిలంబు గావించి
బహువత్సర సహస్ర పరిమితముగ
మానవ దేహంబుబూని లోకత్రయీ
సౌఖ్యాకరములుదుష్కరములగుచు

తే॥గీ॥ నఘహరములైన పెక్కుకార్యములొనర్చి
శిష్టరక్షణమును దుష్టశిక్షణంబు
గాగభక్తులు ముక్తులుగా ఘటించి
ఘనయశము లోకములనించగలవురామ! 295

తే॥గీ॥ కానజగదీశ! ప్రార్థించెదేను నీవు
నాగృహము శుద్ధముగను సేనాయుతముగ
యిచటనాతిథ్యమొనరించి యెల్లిజనగ
నగుననిన నీయకొనిరాముడచట నిలిచె 296

తే॥గీ॥ ఆ భరద్వాజ మౌనిశుభాజ్ఞబూని
కామధేనువు సరియైన హోమధేను
వపుడు బహుసృష్టినఖిల పదార్థవృష్టి
దా నభీష్టాప్తి గురిసిన దానజేసి 297

కం॥ భోజన విశేషముఖసుఖ
యోజనముల తృప్తిజేసె యోగివిభుండున్
బూజాయతి బలలక్ష్మణ
భూజాయుతుగాగ మునివిభుని రఘువిభునిన్ 298

సీ॥ అంతముహూర్తంబు సింతించిరఘుకాంతు
డాహనుమంతున కనియెనింక
వేగమీవునయోధ్య కేగిరాజ గృహంబు
నందునందర సేమ మరయుమనఘ!

శృంగిబేరపురంబు సేరిమత్సఖుగుహు
నరసిమదాగమంబెరుగ జెపుమ
యంతనందిగ్రామమందుల కరిగి మ
ద్భ్రాతను శుభరతు భరతుగాంచి

తే॥గీ॥ మేదినీపుత్రితోడ సౌమిత్రితోడ
నేనువచ్చిన కుశలంబు నెరుగజెప్పి
యంతసీతాపహృతిరావణాది వధము
గ్రమముతోదెల్పు మచ్చటి కార్యమెల్ల 299

- శ్రీరాముడు హనుమంతుని భరతునొద్దకు బంపుట -

కం॥ దనుజాళి గెలిచి వనచరు
లినజాదులు తోడరాగ కృతకృత్యుండై
యనుజాపనిజావృతి నొ
య్యనజేర న్వచ్చెరాముడను మనిలసుతా! 300

కం॥ అని యీగతి వినయాగతి
మనము భరద్వాజునాశ్రమము జేరుటయున్
వినుపించి భరతువృత్తము
గనిరమ్మా! యిటకు వేగ కపివరపొమ్మా! 301

వ॥ అని రఘుప్రవరుండు సెప్పిన నప్పుడప్పవనసుతుండుప్పరంబునకుం గుప్పించి మర్త్యాకారయుక్తుండై సమీరసత్వంబున భుజంగారియగు విహంగపుంగవు జవంబున శృంగి బేరపురంబునకుంజని నిషాద కులోద్వహుండగు గుహునింగని మహాహర్షంబున నతనితో శ్రీమంతుండును సత్యవంతుండును దశరథపుత్రుండును భవన్మిత్రుండును ధర్మగుణాభిరాముండునునగు రాముండు సీతాలక్ష్మణ సహితుండై కుశలంబుననుండి నిన్ను కుశలంబడుగం బంచెనెల్లి భరద్వాజమునీంద్రునిచేత ననుజ్ఞాతుండైవచ్చుచున్న వాడమ్మహాత్ముని దర్శింపంగలవనిన యతని మధురవచనములు విని మోదంబున నగ్గుహుండును నుదంచిత తనూరుహుండయ్యె నంతనతనిచేతం బూజితుండై వీడ్కొని మహాతేజుండగు నవ్వాయు సుతుండు వాయువేగంబునం జనిసార్థంబగు రామతీర్థంబు నీక్షించి సరయూమహానది నతిక్రమించి యయోధ్యానగరంబునం గ్రోశ మాత్రంబున సమస్త వృద్ధిధామంబగు నందిగ్రామంబునకరిగి అందు చీరకృష్ణాజినాంబరుండును జటావల్కలధరుండును రజఃపంక పంకిల శరీరుండును ఫలమూలా హారుండును నాశ్రమసమాసీ నుండును కృశుండును రామచింతా పరవశుండునునై యారఘూ

ద్వహుని పాదుకాద్వయంబు బురస్కరించి వసుంధరా శాసనం బొనర్చుచు కాషాయవసనాంబర వరధరులగు మంత్రివరులును బౌరజనంబులు పరివేష్టింప ధర్మంబు సాక్షాత్కరించి మూర్తీభవించిన రీతిం బ్రవర్తించు సకలగుణాభిరాముండగు భరతుంగాంచి సంతోషించి నిటలతటంబున నంజలి ఘటించి వినయరంజితుండై యయ్యాంజనేయుండతనితో నిట్లనియె. 302

కం॥ ఏరాముని జింతించెద
వారయ మునినియతు దండకారణ్యగతున్
భూరిగతిశోకమదరగ
నారఘువరుడనఘ! కుశలమడిగెన్నిన్నున్ 303

సీ॥ దేవ! నీకు బ్రియంబు దెల్పెద దారుణం
బగు శోకమున బాయుదందువలన
నీ ముహూర్తమునంద రాముని తో భవ
ద్భ్రాతతో యోగంబు బరగునీకు
రణవీధినిల్చి రావణుగూల్చి రాఘవుం
డవనిజ దెచ్చి కృతార్థుడగుచు
ననుజుతో భార్యతో నరుదెంచెననవిని
చిరవియోగప్రేమ జేసి భరతు

తే॥గీ॥ డద్భుతంబును మోదంబు నడరసమ్మ
దాశ్రువర్షంబు గురియ రోమాంచమొలయ
మనసు పరవశముగమేను మరచి హర్ష
మూర్ఛచేవారి యుపచారములనుదేరి 304

కం॥ భరతుడు హితవాదితనికి
పరిరంభము జేసి హర్షబాష్పజలమహా
★శరముల నభిషేకింపుచు
పరమానందమున బలికెపవనజుతోడన్ 305

కం॥ నరుడవొ! నీవొకనిర్జర
వరుడవొ! దయహెచ్చియిటకు వచ్చితి మాకున్
గరము బ్రియంబగు వాక్యం
బెరుగించితి సౌమ్య! యెంత హితుడవొమాకున్ 306

★ జలముల – గ.ము.ప్ర. పాఠం

వ॥ అని మరియు నతనితో మహాత్మా! మాకుం బ్రమాగమంబగు రామాగమ వృత్తాంతం బెరుంగించితగుట బారితోషికంబుగా బహు క్షీరదంబులగు లక్షగోనివహంబును సమృద్ధంబగు గ్రామశతంబును స్వరూపమాన్యులై సర్వాభరణ సంపన్నులగు షోడశ కన్యల నొసంగెద నని పలికి మరియు నమ్మరుత్సుతునితో భరతుండిట్లనియె. 307

కం॥ బహువర్షంబులు నీగతి
మహావనివసించి నట్టి మద్విభుని శుభా
వహవార్తవింటి హర్షో
ద్వహముగనే నెంతపరమ ధన్యుడనొక్కో! 308

వ॥ కావున 309

కం॥ జీవితుడగు నరుడబ్దశ
తావధిలోపల నొకప్పుడైనను హర్షం
బావహిలు ననెడు లౌకిక
మౌవార్తయె సిద్ధమనగనయ్యెడు నాకున్ 310

సీ॥ అనివెండి భరతుడిట్లను రాఘవునకును
కపులకునెట్లు సంగతి ఘటించె
నిజముగా జెప్పుము నీకు శుభంబగు
నమ్మెదనీవచనమ్మటంచు
నబ్భరతుండు మహాత్ముడీ గతిబల్క
నంతనా హనుమంతుడతనితోడ
దండకాగమనంబు ధరణిజా హరణంబు
వాలిసంహరణంబు వనధి తరణ

తే॥గీ॥ మసుర వధనంబు పిదపదశాస్యునిధన
మమర సీతాపునస్సమా గమముగ్రమము
దనర రాముని చరితమంతయు వచింప
భరతుడానంద సందోహభరితుడయ్యె 311

వ॥ ఇట్లు భరతుండు హర్షయుక్తుండగు శత్రుఘ్నునితో నిట్లనియె రఘుకుమారా! మదీయంబగు సాకేతనగరంబునంగల దేవతాయ తనంబులన్నియు వివిధోపహార బలివిధానంబుల సుధీజనంబుల చేత బూజింపంజేయుము సూతవైతాళిక వందిమాగధ వాద్యవాదక స్త్రీజనంబుల నిపుడవెడలింప

నొనర్పుము, నుదారులగు రాజ దారులును నమాత్యులును మాతంగ తురంగ చతురంగ ప్రముఖం బులును బ్రాహ్మణక్షత్రియ వైశ్యశూద్రాదులగు పౌరజనంబులందరు రామచంద్రు దర్శనార్థంబుగా రావింపగావింపు నగరంబున లంకరింప జేయుమనిన భరతుని వచనంబులు విని శత్రుఘ్నుండు సకలజనంబులం దత్తత్ప్రయోజనంబుల నిర్దేశించిన 312

సీ॥ మణివిచిత్రంబుల మహిత చిత్రంబుల
వ్రాతచే గంధపు పూతచేత
సిస్తూరి వెలయింప కస్తూరి కలపెంపు
నింపుచే సురరాజి సొంపుచేత
తోరణంబుల రత్నతోరణంబుల పతా
కాళిచే సువితాన పాళిచేత
రచిత ముక్తామణీ రంగవల్లివిడంబ
ముల చేత హేమకుంభములచేత

తే॥గీ॥ ఆపణముల శుభార్థ సంప్రాపణముల
కదళికలను గృహాబద్ధ కదళికలను
దీపములను గృతాగరు ధూపములను
భూషితంబయ్యె సాకేత పురవరంబు 313

- భరతుండు రాములకు నెదురుగావచ్చుట -

కం॥ ఆమాడ్కినయోధ్యాపుర
ధామంబు నలంకరించి తద్విధినంది
గ్రామంబును భరతాశ్రమ
సీమంబు నలంకృతంబు సేసిరి జనముల్ 314

వ॥ అంత రామభద్రాగమనంబువిని రాజనివేశంబున కన్నమున్న తద్దర్శన కాంక్షాతిశయంబుల బ్రాహ్మణ క్షత్రియాదులను పౌరజాన పద వ్రజంబు సేవకజనంబులును దమంతంజనుదేర నంతనంత శతసహస్ర హయంబులును దశసహస్ర గజంబులును కనక సూత్రయుతంబులగు దశసహస్ర రథంబులును భట కోటి సహితం బుగావెడల భేరీకాహళ పటహవేణు పణవ మృదంగ ధ్వానంబులును నటన్నట పాఠకస్వానంబులును భోరుకొన రాజవధూ జనంబులు శిబికారోహణంబులంబరతేర దివ్యంబులగు నానావిధ ద్రవ్యంబులు నుపధానంబులుగా గొని బద్ధాంజలి నిరతుండగుచు భరతుండును తత్పాదుకలు శిరంబున ధరియించి శత్రుఘ్ను సహితుండై రామదర్శనాభి వేశంబునం పాదచారంబునం గొంతమేరం

జనిచని దూరంబునం దారాపథంబున చంద్రసమానంబగు నవ్విమానంబు గని నమస్కరించె నత్తరివచ్చిన స్త్రీబాలవృద్ధాది జనసమూహంబులెల్ల నిజవాహనంబులండిగి మహీచారులై యవ్విమానంబు సందర్శించి వందనంబు లొనర్చిరప్పుడప్పవననందనుండందర కిట్లనియె. 315

సీ॥ ఇది పుష్పక సమాన మినసమానంబగు
మానసంబున దీని బ్రహ్మసెజే
నీవిమానమునందు నిదెరామ లక్ష్మణు
లున్నారు భ్రాతలు యుద్ధజేత
లీరామదేవుని చేరువ వైదేహి
శ్రీదేవిగతి వసించినది యదియె
యతడు సుగ్రీవుండు హరివర్యుడు ఘనుండు
సచివయుక్తుడు విభీషణుడితండు

తే॥గీ॥ వీరెయంగద జాంబవద్వివిదకుముద
పనస నలనీల ముఖ్యులొప్లవగవరులు
గానవచ్చెద రల్లదే కనుడటంచు
ననిలజుడు దెల్పె బ్రేమ నజ్జనులకపుడు 316

కం॥ రాముడిదె వచ్చెవచ్చెను
నామహిజయులక్ష్మణుండు ననుజనములు సాం
ద్రామోదధ్వని రభసము
లామేదుర మగుచునుండె నవనియు దివియున్ 317

వ॥ అయ్యవసరంబున 318

సీ॥ నతిజేయువారును నుతిజేయువారును
మతిజేయువారునై మరియు మరియు
దీవించువారును భావించు వారును
సేవించువారునై చేరిచేరి
లక్షించువారు నపేక్షించువారును
నీక్షించువారునై యెనసియెనసి
వినువారు సంప్రీతి గనువారు గనినమో
యనువారు నైయిట్టులరసి యరసి

ఆ.వె॥ రాకరాకవచ్చు రామచంద్రుని జూడ
సంతసించునట్ల జనములెల్ల
రాకరాక వచ్చు రామచంద్రునిజూడ
సంతసించిరచటి జనములెల్ల 319

కం॥ ఆమహిజనములు గాంచిరి
వైమానికుడగుచు వచ్చు వానిన్ సుగుణా
రామున్ రామున్ బ్రేమన్
సోము న్వ్యోమంబునందు సూచిన మాడ్కిన్ 320

వ॥ అంతనవ్విమానంబు నికటగతంబగుటయు భరతుండును నిటలతట ఘటిత కరసంపుటుండును ప్రమోదోత్కటిత హృత్తటుండునునై విమానగతుండగు రఘువిభున కభిముఖుండై యప్పుడు. 321

- భరతుండు రాములను దర్శించుట -

సీ॥ మండలంబుననుండు మార్తాండ మూర్తియో
యన విమానస్థుడైదనరు వాని
★శ్రీశేషసహితుడై జెలగువిష్ణుని రీతి
నతివతోననుజుతో నలరువాని
సురసైన్యయుక్తుడౌ సురవరేణ్యునిలీల
హరిసైన్యక్తుడై యమరువాని
తానునారాయణ మౌనియౌటెరిగింప
మౌనివేషము బూనిమలయువాని

తే॥గీ॥ తనతపఃఫలదైవంబు గనినమాడ్కి
రాముని విమానధాముని ప్రేమగాంచి
భక్తి సాష్టాంగ మెరిగెనభ్భరతుడెలమి
కనకగిరి మీద వెలయుభానునకు బోలె 322

కం॥ ఈరీతినతడు మ్రొక్కిన
నారాముండవ్విమాన మయ్యవనికిగా
జేరిచి సానుజు భరతుని
నారోహింపగ నొనర్చె నచ్చటనంతన్ 323

★ శ్రీవేష - గ.ము.ప్ర. పాఠం

కం॥ రాముని సన్నిధి గలుగుట
బ్రేమనుచిర దర్శనాప్తి బెనగొను దమకం
బామగ భరతుడు శిరమున
రాముని పాదముల మీద వ్రాలెన్ భక్తిన్ 324

సీ॥ అతడట్లు తత్పద ధ్యానై కరతుడౌట
హస్తపీఠముల యందావహించి
హర్షాశ్రుజలముల నర్ఘ్యంబు పాద్యంబు
నభిహిత స్నానంబు నావహించి

ముఖవస్త్రమును గప్పి మోహాభరణ మూన్చి
ఘన భక్తి సాక్షత గంధ మలది
దృక్సుమంబుల బూజలిడి ముఖవాసనా
ధూపంబు దర్శనదీప మొసగి

తే.గీ॥ తత్పరానంద రస నివేదనమొనర్చి
గ్రమముగా షోడశోపచారములు దోప
నటుల సాష్టాంగ నిరతిరామాంఘ్రులందు
బడి తడవులేవకున్న నా భరతుగాంచి 325

శా॥ ఆరాముండు జిరావలోకితుని బాహాపాళి రాదీసి వి
స్తార ప్రేమ ప్రియానుజున్ భరతునత్యంతాప్తి నాలింగ నా
ద్యారూఢిన్ రచియింపుచున్ దడపినేత్రానంద బాష్పంబులన్
గారాబంబున నంకపీఠినిడియెన్ గౌతూహలోపేతుడై 326

తే॥గీ॥ మరియు భరతుడు వచ్చి లక్ష్మణునిగాంచి
మహిజనీక్షించి తదనునామము వచించి
వేడ్కనభివాదనంబు గావించెనపుడు
హర్ష సంభృతసంభ్రమాయత్తుడగుచు 327

వ॥ వెండియు భరతుండు సుగ్రీవాంగద జాంబవ న్నల నీలమైందద్వివిద శరభ ఋషభ సుషేణ గజగవయ గవాక్ష గంధమాదన పనస కేసరీ ప్రముఖులగు వలీముఖుల నాలింగనంబొనర్చిన వారును మనోహరాకారంబులు ధరియించి యభ్భరతునిం బరిరంభించి సౌమ్యముఖులును హర్షోత్సుకులునునై కుశల ప్రశ్నంబుగావించి రంత మరియునుంగైక యీసుతుడబ్భాను సుతుంగౌగిలించి ప్రియంబుతో

భవత్సహాయంబునం జేసి రావణుండు నిహతుండయ్యె రాఘవుండు విజయంబునుం జెందెనట్లగుట నీవును మానలుగురి సోదరుల యందునైదవ సోదరుండవని బ్రశంసించెనత్తరి శత్రుఘ్నుండు వినయాయత్తుండై భూమిపుత్రి సౌమిత్రి యుక్తుండగు రఘూత్తమునకు దండప్రణామంబు లాచరించిన నబ్భ్రాతలును నతనిం గ్రుచ్చియెత్తి సంప్రీత చిత్తులైరయ్యెడ లక్ష్మణ సమేతుండై రాముండు నిరంతర చింతా దంతురిత కాంతి శైధిల్యయును శోకసాకల్యయునగు కౌసల్యం జేరి తచ్చరణంబులకున్ బ్రణతుండై నిజాలోకన కృత మనోనయన సాఫల్యగాన తల్లినుల్ల సిల్లంజేసి గైకయీ సుమిత్రాదు లగు మాతృజనంబులకు నమస్కరించి బ్రసన్నుండైయున్న యయ్యన్నం జూచి భరతుండు నిజపూజితంబగు పాదుకాద్వయం బారఘూ ద్వహునిపాదంబుల భక్తి ప్రమోదంబుల సంఘటించి నమస్కరించి కరంబులు ముకుళించి దేవా! నాయందు మీరలుంచిన యీరాజ్య భరంబునింత గాలంబును గొంత దడవునం గడపితి నింక నఖిల జగద్భారధురంధరుండవగు నీవు గ్రహింపవేయని మరియునిట్ల నియె. 328

సీ॥ ఓ జగన్నాయక! నాజన్మఫలియించె
నేడు నాకోరికల్ నిండిపారె
నీయయోధ్యాపురి కీవువచ్చుటజేసి
యేనిన్ను నీక్షించి తిపుడు గాన
నీతేజమునజేసి నేటికి నాచేత
కోశంబు బలమును గోష్ఠములును
దశగుణా కృతములై దనరినవిక నీవ
తావకం బగురాజధాని బ్రోవు

తే॥గీ॥ మనుచు వచియించి విన్నపంబాచరించు
భరతుగనుగొని తత్కపి ప్రవరులెల్ల
కన్నులప్రమోద బాష్పముల్ గ్రాలనతని
జేరి హర్షంబు ననుబ్రశంసించిరంత 329

ఉ॥ ఆ రఘువీరుడున్ భరతునంకమునందు ఘటించి తద్విమా
నారతుడౌచువచ్చి భరతా శ్రమసీమకు జేరియందు కౌ
బేరక యానమున్నిలిపి ప్రేమను భూమికి డిగ్గిపాదసం
చార వినోదియై పొలిచి సౌమవిమానముతోన నిట్లనున్ 330

కం॥ రమ్మా! పుష్ప విమానమ
పొమ్మా! వైశ్రవణు కడకు బూనుమతిని నీ
వమ్మానిత దను నెరుగుదు
సుమ్మా!యన నదితదాజ్ఞ చొప్పున నరిగెన్ 331

ఉ॥ రాముడు నంతటన్ గురుని ప్రాజ్ఞ వరిష్ఠ వశిష్ఠ జేరిసు
త్రాముడు దేవతా గురు వతంసునకిట్లు తదంఘ్రిపాళికిన్
బ్రేమను మ్రొక్కిముఖ్యతరపీఠము నందు వసింపజేసి దా
నామునికిన్ సమీపమహియందు వసించె నిజార్హ పీఠికన్332

వ॥ అంతటంగైకయీ సుతుండగు భరతుండు భక్తియుతుండై మౌళిపాళి నంజలిగీలించి జ్యేష్ఠ భ్రాతయగు రఘునేతతో నిట్లనియె రఘూద్వహా! మీరు చిత్రకూటాద్రి పయింజతుర్ధశ వర్ష నియతంబగుట రాజ్యంబున నన్నుంచి తిరగుట మన్మాతృహితంబును నాచరితంబయ్యె దన్నియత కాలం బతిక్రమించెం గావున నింకనాయందు నియమించిన రాజ్యంబు గ్రహించుమని పాదంబులమీదంబడి వశిష్ఠకైకయీ సహితుండై బహువిధంబులం బ్రార్థించిన మాయామనుజాకార విడంబితుండగుట నయ్యఖిలేశ్వరుండీయ కొనియెనివ్విధంబున. 333

సీ॥ అరయ నెవ్వాని నిజానందవనధిలో
బిందువువ్విధిముఖానందతతులు
నగుట నెవ్వాని మహానందమునకన్న
నధికమై యానందమనగ గలుగ

దెవ్వాని కారుణ్య దృష్టి మాత్రంబున
నాఖండ లైశ్వర్య మైనగలుగు
నెవ్వాని భ్రూభంగ కృతరోషలేశాప్తి
త్రైలోక్యమైన తీవ్రమెనశించు

తే॥గీ॥ నట్టి పరమాత్ముడు రమేశుడఖిల భర్త
చిత్రలీలా మహాసృష్టి జేయజాలు
రాములకు లక్ష్మమౌనెస్వారాజ్యమైన
నగుట నరలోక సామ్రాజ్య మనగనెంత 334

కం॥ ఐనను భక్తుల బ్రోవగ
నూతన తద్వాంచితంబు లొసగగలీలా
మానుషదేహము బూని ద
యానిధిహరి సకలలీలలను వర్తించున్ 335

వ॥ కావున 336

సీ॥ అంత రాముండు జటాదిశోధనకృత్య
మనుజులు మున్నుగాగను ఘటించి
రవిజవిభీషణపవనజాంగదజాంబ
వన్ముఖ్యవనచర వ్రాతమెల్ల
నభ్యంగనస్నాన మాచరింపగ దాము
నభ్యంగనస్నాన మాచరించి
యంచితానర్ఘ మహార్హ దివ్యాంబరా
భరణమాల్యానులేపనములాది

తే॥గీ॥ భరతవిరచిత పరికర ప్రతతి రామ
భద్రుడా లక్ష్మణుని తోడ భరతశత్రు
హరులతోడను నంగరాగాది భూష
ణావళులచే నలంకృతుండై వెలుంగె 337

తే॥గీ॥ అప్పుడు విభీషణాదిదైత్యాళులెల్ల
నర్కజాదిప్లవంగ ఋక్షాళులెల్ల
నర్యదివ్యాంబరాభరణాను లేప
తతులచే నెంతయును నలంకృతులునైరి 338

కం॥ సీతను నయ్యెడ రాజ
స్త్రీతతిచే భరతుడెలమి జేయించె శుభ
స్నాతను దివ్యాంబర భూ
షాతత మాల్యానులేప నాంచిత గాగన్ 339

ఆ॥వె॥ వరుసనధికపుత్ర వాత్సల్య గౌసల్య
తారమొదలు ప్లవగ దారలకును
స్నానవస్త్ర భూషణాను లేపాదుల
చేత నందరకును బ్రీతిజేసె 340

ఉ॥ అత్తరిశత్రుభేదివచనాప్తిసుమంతుడు నీతిమంతుడ
త్యుత్తమ భానుదీప్తముఖరథోత్తమముంగొని వచ్చి భానువం
శోత్తముమ్రోలనిల్పిన మహోన్నతి తద్రథమాత డెక్కెను
ద్యుత్తమహేమశైలశిఖరాగ్రము జెందు దినేంద్రునిన్ బలెన్ 341

తే॥గీ॥ ఇనజుడంగదు డసురేశుడనిల సుతుడు
ప్రభువు మ్రోలనే రథహయే భములనరిగి
రంతసీతయు తారాదిహరిమరాళ
యానలును వచ్చిరి నిజార్హయానములను 342

- శ్రీరాములయోధ్యా నగరంబునకు వచ్చుట -

కం॥ హరి తాశ్వయుత రథంబున
సురతతితోసురవరుండు సురపురికి బలెన్
స్ఫురితాశ్వయుత రథంబున
హరితతితోరఘువరుండు నరిగెను బురికిన్ 343

సీ॥ ఈరీతిగానయోధ్యా రాజధానికి
నరదంబుతో రాముడరుగునపుడు
భరతుండు సారథ్య నిరతుడయ్యెను శుభ
వ్యజనంబు లక్ష్మణుం డవధరించె
ఘనరక్తదండయుక్తము శితచ్ఛత్రంబు
శత్రుఘ్నుడతిదీప్తి శాలిబట్టె
చంద్రాంశు విమలంబు చామరయుగళంబు
కేలనబూనిరి కీశవరులు

తే॥గీ॥ నంతదివి దివ్యదర్శనులైనసిద్ధ
సాధ్యవిద్యాధరాది ఖేచరగణములు
రామునుతియించు నంచి తారావములను
భువినరస్తోత్ర రావముల్ భోరు కొనియె 344

శా॥ భేరీకాహళశంఖ వాద్యరవముల్ బెంపొంద భాస్వన్నరా
కారంబుల్ ధరియించి వానరులు నాగస్యందనా శ్వాది యా
నారూఢిన్ జనుదేర సర్వశుభయోగాప్తిన్ జనెన్ జేరగా
నారామ ప్రభుడయ్యయోధ్యకు సుపర్వారాధ్య కిట్లంతటన్ 345

కం॥ రాముడు గనియెంజిత్ర
స్తోమాలంకృతి సమేతసునికేతంబున్
శ్రీమన్నిజాగతోత్సవ
సామోద జనాన్వితంబు సాకేతంబున్ 346

వ॥ ఇట్లు నిరీక్షించి శుభలక్షణ సుందరంబగు పురంబు రఘు ప్రవరుండు మహామహోత్సవంబునంజొచ్చు నప్పుడచ్చటి జనంబులందరు నలంకృతులై యెదురువచ్చి యుపాయనంబులిచ్చి హృదయనిక్షిప్త కరుణాప్రేమరసంబులు ద్గమించుగతి హర్షాశ్రు రోమోద్గమంబులు ప్పొంగనప్పుడు 347

సీ॥ దూర్వాదళశ్యాము సర్వగుణస్తోము
నారక్తనేత్ర పద్మాభిరాము
రచితార్హకోటీరు రత్నభూషాధారు
నవ్యముక్తాఫలానర్ఘహారు
పీతాంబరోపేతు పీనవక్షఃస్థితు
కల్పద్రుసుమమాలికావినీతు
రమ్యసన్మణిసూత్రు రవినిభాంశు విచిత్రు
మృగమద శ్రీగంధ మిళితగాత్రు

తే॥గీ॥ శమదమనిదాన రవితనూజప్రధాన
భక్తహరిసేవ్యమాను విభ్రాజమాను
ఘనజయారాము రాముని గాంచి ధన్యు
లగుచు హర్షాబ్ధి నోలాడి రఖిలజనులు 348

శా॥ అంతన్ రాముని రాకకున్ ప్రమదభవ్యస్వాంతులై యప్పురీ
కాంతల్వేగ నలంకృతాకృతుల నుత్కంఠన్ గుముల్గూడిహ
ర్మ్యాంతశ్రేణులకెక్కి సర్వగృహ కార్యప్రేమముల్వీడి యం
తంతం జూచిరి లోచనోత్సవకరోద్యద్ధామునిన్ రామునిన్ 349

సీ॥ క్షేమలాజలతోడ ప్రేమ సంభ్రమచల
త్కచభార కుసుమముల్ గలసివ్రాల
కనువేడ్క జనుకటాక్షములతో హర్షాశ్రు
బిందువుల్ మునుమున్న బెనసికొనగ

నామోద వికసితా స్యాబ్జమందస్మితో
న్నతులతో సద్గుణస్తుతు లెసంగ
నొగిదర్శన ప్రీతి నుప్పొంగు నంగంబు
తోడనె పులకముల్ దొడరి మొనుప

తే॥గీ॥ నయన సఫలంబు నిజమహానంద నిరుప
మాత్మ మూర్తిమనోనాథుడగుట జేసి
రామునభిరాము దమ మనస్సీమలందు
నలమి పరిరంభ మొనరించి రతివలెల్ల 350

కం॥ జననీ జనకులరీతిన్
గననీగతి జనక జానుగతుదన్నుజనుల్
దనయాగతి నారాముడు
దనయాగతినలరు జనుల దయచేగనియెన్ 351

వ॥ ఇట్లు రాఘవుండు మహావైభవంబునం బురాభ్యంతరంబున నరుగుచు ప్రజానాథుండగు నజుండు సురవ్రజంబునుంబోలె నాత్మీయులగు ప్రజల నందరం దరహాసలక్షిత కటాక్షంబుల నీక్షింపుచు యోగక్షేమంబు లరయుచుం దయారసంబున నాదరింపుచు నరుదెంచి యందు శుభాలంకార బంధురంబును నగునిజ జనకుని మందిరంబునం దాను బ్రవేశించి సుఖాసీనుండై కౌసల్యాదులగు తమ తల్లులకెల్లం బ్రణమిల్లి భరతుంజీరి సకల సంపత్సమాయుక్తంబగు మదీయ గృహోత్తమంబు మిత్రుండగు భాను పుత్రున కొసంగుము మరియును విభీషణాంగద హనుమ జ్జాంబవదాదులగు నెల్ల వారికి నఖిలవస్తు పూరితంబులగుచు సముదంచితంబులగు నివేశంబులు నిర్దేశింపుమనిన నతండట్ల గావించి యందర నఖండ సుఖాన్వితులం గావించెనంత. 352

- శ్రీరామచంద్రుల పట్టాభిషేకము -

చం॥ భరతుడు భానుజుంబిలిచి పట్టముగట్ట రఘూత్తమున్ జతు
శ్శరధిజలంబుదే బనుపుచయ్యనన్న ప్రమోదరీతి నా
హరిపతి జాంబవంతు పవనాత్మజు నంగదునిన్ సుషేణునిన్
సరయతబంచె హేమకలశంబులొసంగి శుభంబెసంగగన్ 353

కం॥ వారును వాయుగతిం జని
వారిధి తీర్థములు గొంచు వచ్చిన గృతసం
భారంబులు శత్రుఘ్నుడు
ధీరాప్తి వశిష్ఠమునికి దెలిపెనఖిలమున్ 354

వ॥ అంత చిరంతనమునిశ్రేష్ఠుండు మంత్రిపురోహిత సహితుండై బ్రయత్నంబునం తీర్థాంబు ప్రభృతి సంభారంబులు సవరించి యలం కృతంబులుగా చతురంగంబుల నుండనియమించి బ్రాహ్మణోత్తముల క్షత్రియాది చతుర్వర్ణంబులం దక్కిన పౌరజనపదాది జనంబుల రావించి రాజమందిరాంగణంబున విశాలంబగు సభాంత రాళంబున నుచితాసనాసీనుండై తత్సభాంతరంబున మణిస్తంభాది సంభృతంబును విచిత్రరంగవల్లికాద్యలంకృతంబును సంఘట్టిత పట్టాంశుక వితానంబును వివిధ విధవిరచిత మౌక్తికాది మణి మాలికా విధానంబును, ఇక్షుదండ కదళీకాండ రసాల పల్లవ ఫలకుసుమాది తోరణభాసితంబును, ధూపదీప పటవాసాది సువాసనావాసితంబును నగు సువర్ణమంటప మధ్యంబున నధ్యాస్తీర్ణ సంపూర్ణ

వ్యాఘ్రాజిన రత్నచిత్ర కంబళ సమున్నద్రంబగు మాణిక్యమయ భద్రసింహాసనంబున మంగళస్నా నాలంకారవిలాస సాంద్రుండగు రామచంద్రుని సీతాంగనా సమేతంబుగా నధివసింపంజేసి భేరీకాహళ పటహ శంఖమృదంగ నిస్సాణ వీణావేణు తూర్యాది నిస్వానంబులును, గాయక గానంబులును, వంది మాగధ పాఠక కీర్తనంబులును, భూసురాశీర్వచనంబులును సువాసినీమంగళ గీతా రచనంబులును సర్వంబును బర్వంబున నుప్పొంగునప్పయోధి రవంబనుకరింప వశిష్ఠవామదేవ జాబాలి గౌతమ వాల్మీకి కశ్యప ప్రముఖులగు మహామునీంద్రులగు మున్నుగా ఋత్విగ్బ్రాహ్మణ క్షత్రియోత్తమ కన్యామంత్రి ముఖ్యులును గుశాగ్ర కుసుమ తులసీ కిసలయ సుగంధ మిళితంబులంగు తీర్థంబువుల ఫాలబద్ధసువర్ణ పట్టాభిరాముండగు నారఘురామునకు వసువులు వాసవునకుంబోలె నభిషేకంబొనర్చిరత్తరి నభస్థితులై ఇంద్రాది లోకపాలచతుష్టయ సహితంబుగా దేవతాగణంబు లెల్ల సమస్త దివ్యౌషధీ రసంబుల నారామదేవునభిషేకించి స్తుతియించి రిట్లు పట్టాభిషేక మహోత్సవ యుక్తుండగు నారఘూత్తముంగాంచి జనంబులందరుం బరమానందంబునుంజెంది రయ్యెడ. 355

సీ॥ భరతసౌమిత్రులు భజియించిరిరుదెస
శత్రుఘ్నుడతిసితచ్ఛత్ర మూనె
వానరేంద్రుండును దానవేంద్రుండును
శ్వేతచామరములు వీచిరంత
వరహేమమాలిక వాయుదేవుడు దేవ
తాధిపప్రేరితుడై యొసంగె
సకలరత్నాంచిత స్వర్ణహారము భక్తి
నమరకాంతుండు దనంత నొసగె

తే॥గీ॥ సురలు నుతియించి రపుడు గిన్నరులు బాడి
రాడి రచ్చరలొగి మ్రోసె నమర భేరు
లంబరంబున పుష్పవర్షంబు గురిసె
శ్రీకరంబైన రామాభిషేకమునను 356

సీ॥ ఘన సంపదలగాంచు గైశిక శ్రీతోడ
రాజత్వమొనయు వక్త్రంబుతోడ
కువలయ భాగ్యంబుగూర్చు కన్నవతోడ
సునిధానమగు గళస్ఫూర్తితోడ
గోత్రాధిపత్యంబుగొనుకుచోన్నతి తోడ
పృథుచక్రమనేలు పిరుదుతోడ

భువన జాత విభూతి బోల్చునంభ్రులతోడ
వసురేఖదగు గాత్రవల్లి తోడ

తే॥గీ॥ లలితభువనైక సామ్రాజ్య లక్ష్మిలీల
నవయవశ్రీల వైభవం బావహిల్ల
నిజవిభుండగు రామ భూనేత తోడ
సీత జెలువందె పట్టాభిషేక వేళ 357

వ॥ అట్టి పట్టాభిషేక సామ్రాజ్య సమయంబునం పద్మపత్రాయతేక్షణుం డును మహారాజలక్షణుండును రత్నకిరీటాది దివ్యభూషా విశేష బంధురుండును కందర్పకోటి సుందరండును భానుకోటి ప్రభాన్వి తుండును పీతాంబరావృతుండును తద్వామాంక స్థితయును రఘువీర వామక రాలింగితయును దివ్యాభరణ భూషితయును సర్వాతిశయ శోభాంచితయును రక్తోత్పల కలిత కరాంభోజాతయును నగు సీతనవలోకించి తదీయ దివ్యమహోత్సవంబు నిరీక్షింపనచ్చటికి వచ్చి సకల దేవతా నివహంబు నిరీక్షింప భవానీ సహితుండై మహాదేవుండా పరబ్రహ్మమూర్తియగు రామదేవుని సన్నుతింప నుపక్రమించి యిట్లనియె. 358

- శ్రీరాములను ఈశ్వరుడు స్తుతిజేయుట -

కం॥ నేమొక్కెద సింహాసన
ధామునకును కోటిసూర్యధామునకును శ్రీ
రామునకును సుగుణ సుమా
రామునకును దనుజకులవిరామున కెలమిన్ 359

సుస్వాగతము॥

నేమదినెన్నెద నీలోత్పల క
శ్యామలకోమల సాంద్రాంశుయుతున్
హైమకిరీటకహారాంగద సు
స్థేమని రాముని సీతాసహితున్ 360

మత్తకోకిల॥

రామ! నీవిట నాదిమధ్య విరామ దూరత నేకరూ
పామలస్థితివయ్యు సర్వమునానబూనగ మానగా
నామెయిందగి నీదుమాయయు నాదరింపగ నవ్వలై
స్వామి! నీనిజ సౌఖ్యభూతినెసంగు దెప్పుడు లీలమై 361

ఇంద్రవ్రజం॥

సేవార్థి భక్తా వనిసిద్ధికైనీ
వావర్తి తానేకగుణాప్తి లీలన్
దేవర్షి మర్త్యాద్యవతార భావ్య
శ్రీవర్తివౌదార్యులచేత రామా! 362

సీ॥ నీయంశముననెనీనిఖిల లోకంబుల
నిర్మించి పాతాళనిలయమునను
నాదిఫణీంద్రుని యాకృతి భూభార
మంతయుదాలిచి యంతమీద
నఖిలంబసూర్యాది కాప్తి వెల్గింపుచు
పవనుండవై ప్రాణభరము నడపి
యోషధరూపంబునొంది జీవనమౌచు
నదిబ్రోది గనగ వర్షాకృతివయి

తే॥గీ॥ జలమవగుచును సంతృప్తి నొలయజేసి
మొనసియంతట యంతరాత్ముండ వగుచు
బహువిధంబుల నీవీప్రపంచమెల్ల
బ్రోచుదువుగాదె రామ! సంపూర్ణ కామ! 363

పంచచామరం॥

శరీరధారులందు నీవు జాఠరాగ్ని దీపవి
స్ఫురద్గతిం జతుర్విధానముంబచింప జేయుచున్
మరుత్ప్రపంచకానుయుక్తి మాటికివ్విధంబునన్
భరింతురిజ్జగత్తతిన్ కృపామతిన్ రఘూద్వహా! 364

కం॥ ఇందురవివహ్ని మధ్యం
బందు నిలిచి సకల జనుల యాత్మలలో చి
ద్బిందువయి వెలుగు తేజము
జెందుదు వీవగుము రామ! చిన్మయధామా! 365

పాదపము॥

నీదుప్రసాదమునిష్ట దలంపన్
బ్రోదిగ సర్వవపుర్ధరులందున్
స్వాదుయశోధృతి శౌర్యసుఖాయ
శ్రీదముగాదగు శ్రీరఘురామా! 366

ఉత్సాహ।।

ఈవురామ పద్మజాచ్యుతేశచంద్ర సూర్యది
గ్దేవ కాలకర్మభేద దీప్తిదోతువౌ పృధ
గ్భావ కలనవాదిజనుల భావమున్ననన్యస
ద్భావ నిశ్చితైకవృత్తి బ్రహ్మమూర్తి వయ్యునున్ 367

శా॥ మీనాద్యాకృతులెన్నియే గలిగియున్మీరొక్కరేయంచునుం
దానీ వేదపురాణలోకముల సిద్ధంబవ్విధిన్ సర్వమున్
గానౌనీ సదసత్ప్రపంచము నెరుంగన్నీవయౌదౌటచే
యీనీకన్నను వేరులేదొకటి యూహింపన్ హరీ! రాఘవా! 368

పంచచామరం॥

అనంతసృష్టిలో చరా చరాప్తిచే జనింపనై
జనింపుచున్ జనింపనుండు సర్వభూత జాతముల్
నినున్వినానొకర్థమైన లేదుగాన నీవునున్
గనంగరామ తత్పరంబు కన్ననుంబరంబవౌ 369

శిఖరిణీ॥

పరాత్ముండవౌటన్ సకల జనముల్ బ్రాకృతగతిన్
గరంబున్నీ మాయావృతులు నగుటన్ గానరునినున్
పరేశానీ సేవా విమలమతులౌ భక్తులెరుగన్
పరంబౌనేకంబున్ పరమమగు తత్త్వంబగునినున్ 370

తరళ॥

అగుటపద్మభవాదికుల్ బహిరర్థ భావకులైన వా
రగుదురెట్లు భవత్స్వరూప చిదాత్మ తత్వమెరుంగగా
దగుదురౌటధనుర్ధరంబిది తావకంబగురూపమున్
దగభజించిబుధుల్విముక్తి పదంబుగాంతురు శుద్ధులై 371

వ॥ కావున 372

ఉ॥ నేనుభవానితోడుతను నిత్యము కాశివసించి నీదునా
మాను జపప్రయుక్తినిగృతార్థుడనై యచటన్మహర్షులౌ
మానవులెల్ల ముక్తిగన మంత్రముతారకరామ తారకా
ఖ్యాన శుభప్రదాక్షరయుగంబుపదేశము సేతు నెంతయున్ 373

ఉ॥ రామభవత్స్వరూపగుణరంజిత మైతగు మత్కృతస్తవం
బేమనుజుండు భక్తిలిఖియించును పాడుననున్వినున్ సదా
శ్రీమహితాత్ముడైయతడు చిత్సుఖమంది భవత్పదంబును
స్థేమముగాంచునీ కరుణచేనని పల్కెమహేశుడెంతయున్ 374

- శ్రీరాములను ఇంద్రాది దేవతలు స్తోత్రముజేయుట -

వ॥ అంతనిద్రుడిట్లనియె. 375

స్వాగతము॥

దేవమావిభవదీప్తి హరించెన్
రావణుండజువరంబున వానిన్
నీవు ద్రుంచుటను నీదయచేతన్
మావిభూతులివెమాకును వచ్చెన్ 376

వ॥ దేవతలిట్లనిరి 377

ప్రగ్విణీ॥

మాహవిర్భాగముల్ మాకు రాకుండగా
నాహరించెన్ గదా! యాదశాస్యుండొగిన్
మాహవిర్భాగముల్ మాకు చేకూరనా
ద్రోహినిన్ ద్రుంచితెంతో దయన్ రాఘవా! 378

వ॥ పితృదేవతలిట్లనిరి 379

భుజంగ ప్రయాతం॥

గయాదత్తపిండాది కర్మంబు బల్మిన్
దయన్మానిదైత్యాళి తామేహరింపన్
జయాప్తిన్ దశాస్యున్ వెసంద్రుంచిమాకున్
దయంజేసితింపొంద దానిన్మహాత్మా! 380

వ॥ యక్షులిట్లనిరి 381

చంద్రవర్త్మ॥

వెట్టిబట్టిమము వేమరు వెతలం
దట్టిమోతువల దైత్యవిభుని నీ
వట్టి దుష్టునిదశాస్యుని దునుమన్
బట్టి దుఃఖముల బాసితిమధిపా! 382

వ॥ గంధర్వులిట్లనిరి 383

పంచచామరం॥

నిరూఢగానవిద్య మేమునీకథాసుధన్ ప్రమో
దరీతి బాడుచుండి మున్ను దైత్యు బాధ రేపగల్
దురాత్మునిన్ దశాస్యుబాడి దుఃఖమొంద నిత్తరిన్
హరించి దానిమేము హర్షమం★దదేవ! రాఘువా 384

వ॥ మరియు నివ్విధంబున మహోరగ మరుద్వసు గరుడ కిన్నరసిద్ధ సాధ్య విద్యాధర గుహ్యకచారణ ముని నివహంబులును గోలోక నాసీనులగు గోవులును బ్రజాతులును నప్సరస్సందోహంబును నందరు నా రామచంద్రు సన్నిధానంబునకు వచ్చి నేత్రోత్సవంబుగా నీక్షించి బ్రత్యేకంబుగా స్తోత్రంబు గావించి తదనుజకృత శ్రమంబు లుచ్చరించి దశకంధరు వధంబునకు నానందించి రఘునందనుని చేత నానందితులై పట్టాభిషేకార్థంబుగా సీతా లక్ష్మణ యుక్తుండును సింహాసనస్థుండును నగు కాకుత్థ్సుని నిజహృదయ స్థితునిగా ధ్యానింపుచుం సంతసంబులం బ్రశంసించుచు తచ్చరిత్రంబు లానందంబు గావింపుచు బ్రహ్మ రుద్రాది పురస్సరంబుగా నిజస్థానం బుల కరిగి రప్పుడు. 385

మ॥ సురభేరుల్మొరయన్ దివిన్ సురమునుల్ స్తోత్రంబు జేయన్మనో
హరలీలన్ సుమవర్షముల్ గురియ సుశ్యాముండు రాముండు భా
స్కరకోటిద్యుతి చేవెలుంగె వికచాస్య శ్రీయుతుండై హరీ
శ్వరులు న్మౌనులు లక్ష్మణక్షితిసుతా వాతాత్మజుల్ గొల్వగన్ 386

శా॥ ఈరీతిం త్రిజగత్సుఖావహుడు రాజేంద్రుండు రాముండు రా
జ్యారూఢిన్ గనధాత్రియున్ సకల సస్యవ్రాత సంపూర్ణయై
శ్రీరంజిల్లె ఫలాభివృద్ధి తరువుల్ జెన్నొందెనింపొందె ని
స్సారభ్యస్థితి దాల్చు పుష్పములు తత్సారభ్యలభ్యస్థితిన్ 387

ఆ॥వె॥ భక్తవత్సలుండు ప్రమదంబుతో రాము
డపుడు భానుదీప్తమఖిల రత్న
హృద్యమైన హారమినజున కొసగి ది
వ్యాంగదంబులిచ్చె నంగదునకు 388

సీ॥ అంతరాముడు బ్రేమనఖిలరత్నాధ్యంబు
చంద్రకోటి ప్రకాశమగు హార
మవనిజ కంఠంబు నందు వ్రేసిన దాని
నద్దేవితన కంఠమందు నిలిపి

★ దేవ పదం – గ.ము.ప్ర. లేదు.

చేబూని భర్త నీక్షింపుచు మరిమరి
కీశాళినెల్ల వీక్షింప గాంచి
యింగితజ్ఞుడు రఘుపుంగవుడిట్లను
వైదేహినీవు నెవ్వారివలన

తే॥గీ॥ సంతసముగంటివతని కీసరమొసంగు
మనిన తనపతి గనుచుండ నపుడ సీత
యనిలజునకిచ్చె నద్దివ్యహారమట్టి
హారమున మారుతి వెలుంగె గౌరవమున 389

- శ్రీరాములు హనుమదాది వానరుల నిజనివాసంబులకు బంపుట -

వ॥ అంతట గృతాంజలియైయంతికంబుననుండు హనుమంతుంగని రఘుకాంతుండతనితో భవత్కృతంబగు నత్యంత భక్తివలన నేను సంతుష్టుండ నైతి జగత్రయంబున నమరుల కేనియు దుర్లభంబగు నభీష్టవరంబునీ కొసంగెద నడుగుమనిన నయ్యనిల నందనుండ త్యానందంబున వందనంబాచరించి రామునితో దేవా! నీనామస్మర ణంబునందు నామనంబునకుం సంతృప్తి చాలదగుటంజేసి యీ లోకంబున నీకీర్తింబొనర్పుచు నుండెద నదిమదీయ వాంఛితంబగు దీనినొసంగవే యనిన రఘుపుంగవుండనుమతించి యమ్మరుత్సు తునితో నీవునవ్విధంబున మత్కీర్తన పరుండవగుచు జీవన్ముక్తుండవై చిరకాలంబున సుఖంబున నుండుము కల్పాంతంబున మదీయ సాయుజ్యంబునొందెద వీయర్థంబున సందియంబులేదని సెప్పె నప్పుడతి ప్రీతయై సీతయు నప్పవనసుతునితో నీవుండునంతగాలం బున మ్మదాజ్ఞా వశంబున సకల భోగంబులు నిన్ననుసరించునని పలికి యిట్లు జగదీశ్వరులగు నాదంపతులచేత సంప్రాప్తమనోరథుం డును సంప్రీత చిత్తుండును నగుచు నానంద బిందు కందళిత నయనారవిందుండై యనేకంబులుగా ప్రణామంబులొనరింపుచు నెట్టకేలకు వారలచేత ననుజ్ఞాతుండై మహామతి మంతుండగు హనుమంతుండు తపంబొనరింప హిమవంతంబునకుంజనియె నంత. 390

మ॥ గుహునింగాంచి రఘూద్వహుండు నతియుక్తుల్ భక్తునింబల్కెనో
మహితాత్మా! జనుశృంగిబేరపురికిన్ మద్దత్త చిత్తుండవై
సహజాప్తిన్ సుఖముల్ భుజింపు తుదమత్సారూప్యముంగాంతుము
ఖ్య హితా! యంచును గౌగిలించి తగు రాజ్యంబిచ్చి యత్యంతమున్ 391

కం॥ నానాభూషణ ముఖస
న్మానము విజ్ఞాన మొసగిమన్నించినచో
ధ్యానమొనర్పుచు రాముని
నానందము తోడ పురికి నాగుహుడరిగెన్ 392

సీ॥ అపుడయోధ్యకు వచ్చినట్టి వారలనెల్ల
నినతనూజాదు లౌవనచరులను
దగువిభీషణు డాదిదను జులనందర
పరమాత్ముడగు రఘువరుడు బ్రేమ
నమరనమూల్య భూషాంబరాదులచేత
నర్చితులుగజేసియర్హ గతుల
ననిచిన సంప్రీతులై రామునకు మ్రొక్కి
వనచర దనుజ వాహినులు గొలువ

తే॥గీ॥ సరవి సుగ్రీవుడును విభీషణుడు మైత్రి
నలరి కిష్కింధకును లంకకరిగి యందు
ప్రాజ్యలీల నిష్కంటక రాజ్యసుఖము
గాంచివెలసిరి రాముని కరుణవలన 393

– శ్రీరాములు రాజ్య పరిపాలనంబు సేయుచు సుఖంబున నుండుట –

ఉ॥ ఈవిధి రాజ్యభారము వహించి రఘూద్వహుడెల్లవారలన్
బ్రోవగవత్సలత్వమున బ్రోచుచు లక్ష్మణుయౌవరాజ్య భా
రావహుజేసె నెంతవలదన్ననునంతట లక్ష్మణుండునున్
భూవహనంబొనర్చె రఘుపుంగవు భక్తిని సేవసేయుచున్ 394

సీ॥ పరమాత్ముడయ్యును పరమనిర్మలుడయ్యు
సకల కర్మాకర్మ సాక్షియయ్యు
వివిధ కర్తృత్వాది విరహితుండయ్యును
ననిశంబునిర్వికారాత్ముడయ్యు
సతత మాత్మానంద సంతుష్టుడయ్యు ని
ష్కాముడయ్యును బూర్ణకాముడయ్యు
జనములు నీరీతి సలుపుదురగుగాక
యనుచు లోకోపదేశార్థముగను

తే॥గీ॥ నపుడు లీలా నరాకారులగుట జేసి
విపులదక్షిణలను వేదవిహితముగను
నశ్వమేధాదియజ్ఞంబు లాచరించి
రాముడత్యంత సంతోష ధాముడగుచు 395

వ॥ మరియును. 396

సీ॥ వ్యాళ భయంబున వ్యాఘ్రభయంబును
వ్యాధిభయంబెందు నడర నీక
జలభీతియును మహానలభీతియును చోర
కులభీతియును నెందు గలుగ నీక
పరబాధలును ఖరోత్కర బాధలును క్షుధా
తురబాధలును నెందు దొరయనీక
గ్రహవేధలును దురాగ్రహవేధ ఖేచర
గ్రహవేధలెందు జేరంగనీక

తే॥గీ॥ జాలమృతిలేక వృద్ధులు ప్రమదమంద
స్త్రీల కెందు వైధవ్యంబు జెందకుండ
నేయనర్థంబు రానీక నెల్లభూమి
ప్రజలు సుఖమంద రాముండు రాజ్యమేలె 397

ఉ॥ అందరు రామపూజకులు నందరు రాఘవచింత నాత్ములౌ
నందరు నాత్మధర్మరతులందరు వర్ణకులాశ్రమాద్యు లౌ
నందరు సర్వలక్షణ సమన్వితులూర్జితులాది రాజ సం
క్రందనులై తనర్చు రఘురాముడు రాజ్యము సేయుచుండగన్ 398

కం॥ ఈలీల రాముడిమ్మహి
నేలుచునుండంగ సస్య వృద్ధికుచితమై
కాలముదప్పకయుండగ
వాలాయము నెలకు మూడు వానలు గురిసెన్ 399

కం॥ కడుపున బుట్టిన ప్రజగతి
నెడపకరాముండు బ్రోవనెల్ల జనంబున్
గడునిత్యోత్సవములచే
నడరెన్ రాష్ట్రంబు పూర్ణమై పెంపెసగెన్ 400

వ॥ ఇవ్విధంబున 401

కం॥ దశవర్ష సహస్రంబులు
దశవర్ష శతంబులిట్లు దైవములీలన్
దశరథ తనయుడు రాముడు
వశగతి సామ్రాజ్య వైభవంబున వెలసెన్ 402

- ఈ యధ్మాత్మ రామాయణంబు జనులకు సకలాభీష్ట ప్రదంబని చెప్పుట -

సీ॥ ఇది రహస్యము శుభప్రదము పవిత్రంబు
దీర్ఘాయురారోగ్యదీప్తికరము
ధనధాన్యపుత్ర పౌత్రశ్రీకరంబును
జ్ఞానాస్పదంబు మోక్షప్రదంబు
పూర్వంబునాదిశంభు ముఖాంబుజోక్తంబు
నధ్యాత్మరామాయణాహ్వయంబు
భక్తిచే సంతోష యుక్తిచే నీపురా
ణోత్తమంబరహిత చిత్తుడగుచు

తే॥గీ॥ చేరి పఠియించినను లిఖించినను వినిన
నతడు పాతక కోటుల నపుడ బాసి
యెనసి కోరిన కోరికెలెల్ల గాంచు
సాదరంబగు రామప్రసాదమునను 403

కం॥ రామాభిషేక మిదివిన
నేమమున ధనాభిలాషినిఖిల ధనంబున్
భామాభిలాషిభామను
ప్రేమనుపుత్రాభిలాషి ప్రియసుతుగాంచున్ 404

శా॥ ఈయధ్యాత్మిక రామసంహిత ద్విజుండేకాత్ముడై విన్న వి
ద్యాయుశ్రీగను, రాజు విన్నవిజయుండై శత్రులన్గెల్చి భూ
శ్రీయుక్తుండగు, వైశ్యుడైన ధనలక్ష్మింగాంచు, శూద్రుండుసు
శ్రేయోయుక్తినఘుంబు బాయు నియమ శ్రీభక్తి సిద్ధించినన్ 405

కం॥ ఈయధ్యాత్మచరిత్రము
స్త్రీయైనను వినిన బ్రబలు జీవత్సుతయై
వేయేల వంధ్యయేని దృ
ఢాయతివిన రూపయుక్తనాత్మజుగాంచున్ 406

వ॥ మరియున్నీయధ్యాత్మరామసంహిత శ్రద్ధాయుక్తుండై యేధన్యుండు క్రోధమత్సర రహితుండై విను నతండఖిల దుఃఖంబులం దొలంగి సుఖాతిశయంబున్గాంచు నెవ్వండు రామభక్తిపరుండై దుర్గమ మార్గంబుల బఠించిన నిర్భయుండగు నేతత్పఠన శ్రవణనియమం బున నమరసంతతులేనియు సంతృప్తింగాంతురు విష్ణు బృందంబులం జెందకుండు నీ యధ్యాత్మ రామచరిత్రం బాద్యంతంబు విద్యుక్తంబుగా వినిన సర్వ సంపత్సమృద్ధి సిద్ధించు నదియునుంగాక నేపుణ్యాంగన యైనను

రజస్వలయగుకాలంబుల రామతత్పరయై యీతత్త్వరహస్యం బగు చరిత్రంబు గ్రమంబున నాకర్ణించు నత్తన్వియుత్తమ చరిత్రుం డగు పుత్రుంగాంచి పాతివ్రత్యంబున జగత్పూజితయగు నెవ్వండేనియు నీగ్రంథంబు భక్తియుక్తి నిత్యంబునుం బూజించి నమస్కరించిన సమస్తపాప నిర్ముక్తుండై విష్ణులోకంబునం జెందు మరియు నిప్పుణ్యాఖ్యానంబు వ్యాఖ్యానంబుచేసి యొక్కరికింజెప్పిన రాముండు సంతుష్టుండగు నయ్యంతరాత్ముండగు నతండు ప్రీతుం డైన ధర్మార్థ కామ మోక్షంబులం దిచ్ఛయించు శుభంబులభించు నగుట నవశ్యంబును శ్రోతవ్యంబగు నిట్లు సమాహితుండై వినిన కల్పకోటి మహా పాతకంబులన్ బాసి యాయురారోగ్యాది సకల శ్రేయోలాభంబు గలుగన్ దేవర్షి పితృచయంబు నొందుం గావున. 407

కం॥ శ్రీమంతంబాధ్యాత్మిక
రామాయణ మద్భుతము విరాగ జ్ఞాన
స్థేయము పూర్వంబిదివిను
నామనుజుడు ముక్తిగాంచునంటవు భయముల్ 408

వ॥ అని యివ్విధంబున. 409

సీ॥ అఖిల వేదపయోధి నాలోడనముజేసి
బహువారములు భూత భర్త శివుడు
తారక బ్రహ్మతత్త్వంబేయదియటంచు
విజ్ఞాన దృష్టిచే వెదకి వెదకి
యాద్యుండు విష్ణురహస్య మూర్తియునగు
రాముడేగద పరబ్రహ్మమనుచు
దెలిసితత్సారంబు దివిసి బ్రున్నటముగా
సంక్షేపముగనంత సంగ్రహించె

తే॥గీ॥ నదియు నధ్యాత్మ రామాయణాహ్వయముగ
నట్టి శ్రీరామ గూఢ తత్త్వార్థమెల్ల
సమ్మదంబున దనప్రియ సతికి సతికి
బ్రాణపదమగు పార్వతి కానతిచ్చె 410

కం॥ అనుచు విధాత వచించిన
వినినారద మౌనివరుడు విస్మయపరుడై
జనితానంద సుధానిధి
ననయమునోలాడుచుండె నాహ్లాదమునన్ 411

- చక్రబంధచిత్ర శార్దూల వృత్తము -

1. సత్యోపేత సుకేళి సోత్కరశమీ సంవిష్టయజ్వప్రధీ
నిత్యోదర్శిత శర్మమందిరసుపాణీ నుత్య భూకృష్టమా
సత్యాయత్తనవ స్వభావరసలక్ష్యాతీర్థ రీతీఖనీ
నీత్యుల్లాస విధాని తల్ప సమకంధీవశ్యమాభామినీ 412



ఈ చక్రము లోపలినుండి మూడవ వలయంలో 'సోమ భూమీపాల', ఐదవ వలయంలో 'కేశవ వినుతీ', ఎనిమిదవ వలయంలో 'పెద్దయజ్వ కృతి', అని ఉన్నది.

- ఛత్రబంధ చిత్రకందం -

సారస భవసుత దర శర
హారహసన సరసదాస హారగిరీశా
శౌరీ గీరవరాధా
ధారావరహార శరదనుతవ భసరసా 413



కవిరాజ విరాజితము॥

జయజయ శారద నీరద నారద
సారదరామల కీర్తిధురీ
జయజయ శ్రీధర సర్వధరాధర
సంభృతభూధర గుప్తకరీ
జయజయసైంధవ జిత్సితసైంధవ
సంధితబాంధవ చక్రధరీ
జయజయకేశవ సన్నుతశైశవ
సంశ్రితవాసవ శౌరిహారీ 414

- గద్య -

ఇది శ్రీమదుభయ కవితా నిస్సహాయ సాహితీవిహార కాణాదాన్వయతిమ్మనార్యకుమార
వినయవిభ్రాజి పెద్దనసోమయాజి ప్రణీతంబైన
శ్రీమదధ్యాత్మరామాయణంబను మహాపురాణంబునందు
యుద్ధకాండంబున నుత్తర భాగంబన్నది సప్తమాశ్వాసము సంపూర్ణము

-★)★(★-



శ్రీ భూ చెన్నకేశవాయ నమః

అధ్యాత్మ రామాయణము

ఉత్తరకాండము

శ్రీ లానీలా పాలన
శీలా! గద్వాల నగర చినసోమమహీ
పాలావన లీలా! ఘన
ఖేలాంచితవిభవకారి! కేశవ శౌరీ 1

వ॥ అవధరింపుము భక్తియోగవిశారదుండగు నారదునకు సకలార్థ సంధాతయగు విధాత సెప్పెనట్లు విజ్ఞానవతియగు పార్వతికి దివ్యభావుడగు మహాదేవుండుసెప్పె నివ్విధంబున శ్రీరామ కథావృత్తాంతబు పట్టాభిషేకపర్యంతంబుసెప్పిన సంతసించి యద్దేవి యద్దేవునకిట్లనియె 2

సీ॥ అనఘ! కౌసల్యా హృదానందవర్ధనుం
డగురాముడఖిలగుణాభిరాము
డారావణాదిక క్రూరాసురల శౌర్య
సారులననిద్రుంచి జయముగాంచి
సీతను దెచ్చిసాకేతంబునకువచ్చి
యవనిపైనభిషిక్తుడగుచునవల
నెన్నేండ్లువర్తించె నేమేమిగావించె
మాయానరాప్తి నారాయణుండు

తే.గీ॥ పరుడనాద్యుండు పిదపనీనరభవంబు
విడిచి నిజరీతి నెచట నేవిధి వసించె
నెంతయును భక్తి వినినిచ్ఛయించునాకు
దెల్పవే! యీవిధంబంత దేవదేవ! 3

కం॥ నీవదనసుధానిధి సు
స్రావితముగు రామచంద్ర చరితామృతమున్
ద్రావంగ తృప్తి జాలదు
నావలివిధమెల్ల చెప్పుమా! సర్వజ్ఞా! 4

సీ॥ హరికథామృత వర్ణనాకర్ణనంబులు
శ్రవణ దోషంబుల సడలజేయు
హరిదివ్యమంగళాంగాలోకనంబులు
దృష్టి దోషంబులదెరల జేయు
హరిచరణాబ్జ తీర్థాస్వాదనంబులు
రసన దోషంబులనసదు జేయు
హరిసమర్పిత సుగంధాఘ్రాపణంబులు
ఘ్రాణదోషంబుల గడకుజేయు

తే.గీ॥ హరిపదస్పర్శనంబులు నంగజనిత
దోషములనెల్ల నవలబోద్రోయుగాన
హరి భజింపగదగు హరిధ్యానమునను
నఖిల మానస దోషంబులణగుటరుదె! 5

కం॥ శ్రీరాముల కథనంబులు
సారామల శుభవిశేష సంగ్రహధనముల్
ఘోరదురిత మథనంబులు
పూరిత మోక్షానుభావ భూరిధనంబుల్ 6

వ॥ కావున రఘుసత్తమునసంతర వృత్తాంతబు సవిస్తరంబుగా చెప్పవేయనిన పార్వతికి యీశ్వరుం డిట్లనియె 7

- అగస్త్యాదిమునులు శ్రీరాముల కడకేతెంచుట -

కం॥ ఈరీతిగ రాక్షస వధ
మారయగావించి బహుజయ శ్రీయుతుడై
ధారుణి సామ్రాజ్యంబున
నారఘువీరుండునుండు నాసమయమునన్ 8

సీ॥ గురుతపోనత కౌశికుడు కౌశికుడు భక్తి
వశవామదేవుడు వామదేవు
డసమసంవిత్సుధాలసితుండు నసితుండు
నతివిభాభంగురుండంగిరుండు
నతితీవ్ర గీర్వాసు డైనదూర్వాసుండు
కృతసువాస సుమేరు భృగుడు భృగుడు
పుణ్యతాపసలోకగణ్యుండు కణ్వుండు
ఘనసృష్టిపాత్రులౌకశ్యపాత్రు

తే.గీ॥ లాదియైన సప్తర్షులు నమరహర్షు
లయ్యగస్త్యుండు మున్నుగానఖిలశిష్య
యుతులునై నాల్గుదిక్కుల నుండివచ్చి
రెంచనారాఘవుని ప్రశంసించుటకును 9

వ॥ ఇత్తెరంగున నయ్యగస్త్యాది మునిసత్తములుత్తరంబగు నయోధ్యా నగరంబున రాజనగరద్వార సమీపంబునంజేరి దౌవారికునితో మదీ యాగమనంబు రఘుపుంగవునకెరింగింపుమనిన వాడునుంజని వినయావనతుండై యవ్విభునితో భవద్దర్శనానందితులై మునీంద్రులు వచ్చియున్నవారని చెప్పిననప్పుడ రఘువరుండప్పరమమునులం దోడ్కొని రమ్మనిన నమ్మునివరుంలుం దదీయానుమతంబున ననేకమణిగణ సుందరంబగు రాజమందిరంబునుంజొచ్చి సభా భవనంబునకు వచ్చి యచ్చట 10

సీ॥ పట్టాభిషేక శోభనహేమపట్టాంచి
తంబగుమణి కిరీటంబువాని
భువనసామ్రాజ్య విస్ఫుట లక్షణ విచక్ష
ణంబగుసింహాసనంబువాని
కటక కుండలహార కటి సూత్రముద్రాది
కంబగు భూషాచయంబువాని
ఛామర ఛత్రాది సకలరాజన్యమా
న్యంబగు బహువైభవంబువాని

తే.గీ॥ జానకీలక్ష్మణాదిక సహజ సహితు
వరసుహృన్మంత్రి భటపరివారమహితు
వందిమాగధ గేయ దివ్యప్రభావు
రాఘవునిగాంచి రమ్ముని ప్రవరులపుడు 11

వ॥ అంతనారఘుకాంతుడును నత్యంత ప్రభావసాంద్రులగునయ్యగస్త్యాది మునీంద్రులంగాంచి యర్ఘ్యాదివిధులన్బూజించి విధివిహితంబుగా ధేనువులనివేధించి నమస్కరించి కుశలప్రశ్నంబుగావించి దివ్యంబు లగునర్హాసనంబులొసంగిననమ్ముని శ్రేష్టులు సుఖోపవిష్టులును సంతుష్టులునునై యక్కౌసల్యా పుత్రుండగు రఘూత్తము నాశీర్వదించి యిట్లనిరి 12

కం॥ దశరథతనుజ మహాభుజ
కుశలమె? మీకందరకును ఘోరాజిరిపు
ప్రశమము జేసితి శ్రేయో
వశమున మిముగంటిమిపుడు వైరివిదారీ! 13

ఉ॥ దేవత్రిలోక కంటకుల దేవవిరోధులనంతకాభులన్
రావణకుంభ కర్ణముఖ రాక్షస వీరులనెల్ల నేడు యు
ద్ధావనినంత కోపమ శరావళి నొక్కట గీటణంచి లో
కావళి నిర్భయాప్తి సుఖమందగ జేసితి గాదెరాఘవా! 14

కం॥ మాకభయమొసగి యసురా
నీకముద్రుంచుటకు మున్ననియతి న్వారిన్
వీకనడంచి కృతార్థత
గైకొంటివి గాదె రామ! కరుణాధామా! 15

కం॥ నీవు శరాసము బూనిన
నీవల లోక త్రయంబునేని జయింపన్
గేవలము సమర్థుడవీ
రావణు వధియించుటెంత? రఘుకులకాంతా! 16

కం॥ కావున కులబల యుతముగ
రావణు వధియించు టబ్బురముగాదు సుమా!
కేవలముగ నింద్రజితున్
రావణ సుతుద్రుంచుటది భరంబగు సుమ్మీ! 17

వ॥ అనిన భావితాత్ములగు నత్తపోధనుల సూక్తంబులువిని విస్మయాయత్త చిత్తుండై రఘుసత్తముండు హస్తముముకుళించి వారల కిట్లనియె 18

కం॥ ఆవల త్రిజగజ్జేతల
రావణునిం కుంభకర్ణ రాక్షసుల మరిన్
బోవిడిచియే బలముగని
యీవల నొకయింద్ర జిత్తు నెన్నెదరిటులన్ 19

వ॥ అనిన తద్వచనంబులు విని యమ్ముని మండల మధ్యబుననుండి తపః ప్రభావ ప్రశస్తుండగు యగస్త్యుండు హర్షాయత్త చిత్తుండై మహాత్ముండగు రఘుసత్తమున కిట్లనియె 20

– అగస్త్యుండు రాములకు రావణాద్యుత్పత్తి క్రమ మెరింగించుట –

ఆ.వె. ఇనకులేంద్ర! రావణేంద్ర జిన్మఖ్యుల
జననమును వరాప్తి జయవిధాన
మాదియైన వృత్తమంతయు నేనుసం
క్షేప రూపముగ వచింతువినుము! 21

సీ॥ మునురామకృతయుగంబున బ్రహ్మపుత్రుండు
ఘనుడుపులస్త్యుండు మునివరుండు
దగుమేరు గిరిపార్శ్వ తటియందు తృణ బిందు
నాశ్రమావసతి స్వాధ్యాయ నిరతి
దన్మహాతేజుండు దపమొనర్పగరమ్య
తమమగునట్టి యాశ్రమము నందు
నమర గంధర్వ ★మున్యాదికన్యలు ధన్య
లాడుచు పాడుచు వేడు కలర

తే.గీ॥ హృద్యముల వాద్యముల నందరేపుజూపి
యమ్ము నీంద్రతపో విఘ్ను మాచరింప
నమ్మహా దీప్తుడు బులస్త్యుడలుక దొలుక
నెలుగు దీపింప నొక వాక్య మిట్టులనియె 22

కం॥ నాకన్నులకుంగనుపడు
నేకన్నియ యదియు గర్భమెనయు ననినచో
నాకన్యలు శాపభయ
వ్యాకులులై యచటనుండ కరిగిన యెడలన్ 23

తే.గీ॥ అందు రాజర్షి యగుతృణబిందు పుత్రి
యట్టి శాపోక్తి విన దొట యమ్మునీంద్రు
గనుచు తద్వేద నాదంబు వినుచునతని
నెదుట నిర్భయమున జరియింపుచుండ 24

కం॥ తనువున పాండిమజూపన్
తన కప్పుడు గర్భ లక్షణమ్ములు దోపన్
దను వైవర్ణ్యము గనుగొని
దన జనకుని కడకు జనియె దత్సతి భీతిన్ 25

సీ॥ అప్పుడు తృణబిందుడధిక ప్రభాసాంద్రు
డతి భీతి నేతెంచు సుతనుగాంచి
జ్ఞానైక దృష్టిచే ధ్యానంబు గావించి
యంతయు ముని కృతంబని తలంచి

★ రాజర్షి – గ.ము.ప్ర. పాఠం

తజ్జనకుడువచ్చి ★తత్కన్యకనుదెచ్చి
ముదమొసంగు పులస్త్యముని కొసంగ
నత్తాపసవరేణ్యుడాకన్యనుగ్రహించి
సమ్మతించినను దత్సతియు భక్తి

తే.గీ॥ సేవగావింప నేకాంత సీమ మునియు
నుభయ కులవర్ధనుని సూను నొసగ బ్రేమ
మెసగ నట్టి పులస్త్య మునీంద్రు వలన
సుదతి గనియెను లోక విశ్రుతుని సుతుని 26

కం॥ విశ్రాంతి పులస్త్యుడు వివి
ధశ్రుతి జాతము పఠింప దచ్ఛ్రవణముచే
సుశ్రోణికి సుతు డొదవుట
విశ్రవుడన దగియె బ్రహ్మ విత్తముడతడున్ 27

వ॥ అంతపులస్త్య సంభవుండగు విశ్రవుండునుం జనకుండునుం బోలె తపోనియతిం బ్రవర్తింప నతని శీలాదికంబునకుం బ్రీతుండై సముద్యత్తేజుండగు భరద్వాజుండు సదృశగుణ మాన్యయగు దన కన్య నవ్వి శ్రసునకుభార్యార్థంబుగా నొసంగిన నతండును దద్వర వర్ణినియందు శుభచరిత్రుండగు పుత్రుని గాంచిన నత్తనయుండును పులస్త్య పుత్రుండగుట బొలస్త్యుండును విశ్రవస్సుతుండగుట వైశ్రవణుండనం బరగి పితృభక్తుండును లోక ప్రసిద్ధ ప్రభావుండునునై బ్రహ్మదేవునిం గూర్చి తపం బొనర్చిన నద్దేవుండు సంతుష్టుండై యతని మనోభీష్టంబుగా నవిచ్ఛిన్నంబగు ధనేశ్వరత్వంబును యుత్తర దిగ్భాగ ప్రయుక్తంబగు లోకాధిపత్యంబును వరంబులు గానిచ్చి కామగమనంబగు పుష్పకంబను విమానంబు నొసంగిన నద్ధనేశుండును బ్రహ్మదత్తంబగు నవ్వివిమానంబు నధిరోహించి సకల లోకంబులు సంచరింపుచు జనక దర్శనార్థం బేతెంచి యవ్విశ్రవసునకు నమస్క రించి తపఃఫలంబు నెరింగించి భగవంతుండగు నమ్మునికాంతున కిట్లనియె 28

సీ॥ మునినాథ! నేతపం బొనరింప బ్రీతుడై
ధాతనాకును వరద్వయ మొసంగె
నేనువసింపగా స్థానం బొసగడయ్యె
నే బాధలును లేక నింపు నింపు
స్థానంబు దెల్పుము జనక! నీవన నతం
డతని కిట్లను లంకయను పురంబు
కంథిలోమును విశ్వకర్మ నిర్మించెరా
క్షసులకై పరులకసాధ్య మదియు

★ నక్కన్యకను – గ.ము.ప్ర. పాఠం

తే.గీ॥ నందు ముందున్న రాక్షసుల్ హరి భయమున
నలరసాతలమున జొచ్చిరగుట జేసి
యచట నెవ్వారు నుండలే దాస్థలమున
నుండు జనుమని విశ్రవసుండు బలుక 29

కం॥ జనకుని యనుమతి గనియా
ధనదుండును లంక కరిగి తత్పురమందున్
దన పరివారము దానును
బనుపడి విభవమున నుండె బహుకాలమునన్ 30

కం॥ ఈ లీల లంకలోపల
నోలిం పౌలస్త్యుడుండి యొక్కొక్కతరిన్
శ్రీలెసగం దలిదండ్రుల
నాలోకింపజను పుష్పకారూఢుండై 31

చం॥ అనిన నగస్త్యసూక్తి వెరగందుచు రాముడు బల్కులంకలో
నను మునుపున్న రాక్షస జనంబులు నెవ్వరు వారలేటి కి
ద్దనుజవిరోధి చేతను విదారితులయ్యు రసాతలంబునన్
జనివసియించిరన్న ముని సత్తముడారఘుభర్తకిట్లనున్ 32

సీ॥ జననాథ! మునుధాత జలముల సృజియించి
తద్రక్షణకును గొందర సృజింప
వారుక్షుధా బాధవలనను బ్రహ్మావా
క్యమునను దొట్రిలి యాజలముల
భక్షింపుదుమటంచు రక్షింపుదుమటంచు
గడగుచో యక్ష రక్షస్సులైరి
యీరాక్షసులలోన హేతిప్రహేతులు
ననినిద్దరు ప్రసిద్ధులైరి మిగుల

తే.గీ॥ నటప్రహేతి విరక్తుండు నయ్యెహేతి
కాలభగినిని భయయను కన్యబెండ్లి
యాడి యాక్కామినీమణి యందు గనియె
సుప్రకాశు విద్యుత్కేశు సుతుని హితుని 33

వ॥ అంతనా విద్యుత్కేశుండు సంధ్యాది పుత్రికయగు సాలకటక యను వధూటిం బరిణయంబైన నత్తరుణియు గర్భంబై యప్పుడుద్భవించిన యర్భకుని మందరనగంబు నందు విడచి మరచి రతికాంక్ష జేసి బతివెంటన్ జనియె నయ్యెడ మార్గవశంబున పార్వతీ పరమేశ్వరులా ప్రదేశంబున కరుదెంచి శిశువుంగాంచి కరుణించి యప్పుడ వయో గుణ ప్రభావవంతుని గావించి సుకేశుండను నామం బొనరించి న ప్పార్వతి యతిని బాల్యంబున నగునవస్థ నీక్షించుటం జేసి రాక్షసులకు సద్యో గర్భంబును సద్యో యవ్వనంబునుం గల్గవరం బిచ్చెనంత నాసుకేశుండు గ్రామణియను గంధర్వుని తనయయగు దేవవతి న్వరియించి యద్దేవవతియందు మాల్యవంతుండును సుమాలియు మాలియునను ముప్పురు సుతుల న్గాంచిన 34

కం॥ వారును బ్రహ్మ వరోద్ధతి
భూరి బలాఢ్యులయి దర్పమున సురశిల్పిన్
జేరియు దివ్యంబగుపుర
మారయ మాకొకటి సేయు మనిన నతండున్ 35

ఆ.వె. వనధినడుమ లంకయను దుర్గమే జేసి
యుంటి మున్ను మీరలుండు డచట
ననిన వారు నిలిచి రఖిల రాక్షసులతో
నతుల వైభవమున నప్పురమున 36

వ॥ అప్పుడ సుర ప్రవరుల యధిక ప్రభావంబులకు బ్రియంబంది నర్మదయను గంధ్వ వధూటి తన కన్యకలమువ్వురం గ్రమంబున నమ్మాల్యవదాదులకు నొసంగిన నందు మాల్యవంతుండు సంకృతియను కాంతయందు వజ్రముష్టి విరూపాక్ష దుర్ముఖ సుప్తఘ్ను యజ్ఞకోప మత్తోన్మత్తులను బుత్రులను ననలయను బుత్రింగాంచె సుమాలియు కేతుమతియను సతియందు ప్రహస్తుండగ్ర పుత్రుండుగాన కంపన వికట కరటా ముఖ ధూమ్రాక్ష శ్యావదంత సుపార్శ సంహ్లాది ప్రఘస భాసకర్ణులను తనయులను పుష్పోత్కటము గైశికయున్ కుంభీనసయను కన్యకలంగనియె మాలియు వసుధ యను సుదతి యందుననిలానల హరసంపాతులను సుతులను బడిసెవారు గదా విభీషణ మంత్రులైరిత్తెరంగున నారాత్రించరులు పుత్రపౌత్ర మిత్ర కుల బలయుక్తంబుగా నభివృద్ధింగని జగత్త్రయం బును బాధింపుచుండ 37

చం॥ అమరులు విష్ణునింగని తదార్తివచింప నతండు ఘోరయు
ద్ధమున మదోద్ధతంబులగు దైత్యబలంబుల ద్రుంచి చక్రవి
క్రమమున మాలినిందునుమ గాంచి సుమాలియు మాల్యవంతుడున్
భ్రమత రసాతలంబునకు బారిరి లంకను వీడి బీతిచేన్ 38

సీ॥ అంతగొన్నాళ్లకు నాసుమాలియుదన
సుతను సాక్షాల్లక్ష్మి గతినెసంగు
కైకసియనుదాని దోకొని యలరసా
తలముననుండి భూస్థలికి వచ్చి
జనకుని గన నేగు ధనదుని పుష్పక
స్థితు గాంచి దనకొక్క హితము నెంచి
పుత్రిక కిట్లను పూర్ణయౌవన లీల
బాలనీకు వివాహవేళయయ్యె

తే.గీ॥ నీవు వల్లక నిరసింప నినువరింప
కేగిరందరుమును గాన నింకనైన
భ్రాత్రుని బులస్త్య పుత్రుని బ్రహ్మ పౌత్రు
వరతపోవసు నవ్విశ్రవసు వరింపు 39

కం॥ ఈ విశ్రవసు దనంతన్
నీవు వరించినను ధనదునిన్ బోలు బల
శ్రీహితులు సుతులు నగుదురు
వావిరి నీకనిన హర్షవతియై యంతన్ 40

- విశ్రవసు వలన కైకసియందు రావణాదులుద్భవించుట -

ఉ॥ ఆశ్రమసీమకున్ జనకు నానతి గైకసి వచ్చి యచ్చటన్
విశ్రవు మ్రోలనేల బొటవ్రేల లిఖింపుచు మోము వాంచియున్
బ్రశ్రితయైన కన్యగని భామిని యెవ్వరి దాన వేటికీ
యాశ్రమమందు జేరితన బ్రాంజలియై చెలి బల్కె సిగ్గునన్ 41

కం॥ భావజ్ఞ! మీరు విజ్ఞా
నావృతి సర్వంబు నెరుగ నగునన మునియున్
భావించి బాల! నీవున్
నావల్ల సుతేచ్ఛ వచ్చినావని మరియున్ 42

ఉ॥ దారుణ సంధ్యవేళ వనితా! సుత వాంఛను వచ్చి తౌటచే
దారుణులైన రాక్షసు లుదగ్రులు నీసుతు లౌదురన్నచో
నారసి పల్కె కైకసి మహాత్మక! నీకుజనించువారికిన్
క్రూరతయర్హమాయనిన కోమలితో మునిమౌళి యిట్లనున్ 43

తే.గీ. ఉభయ సంధ్యలు ముడిబడు నుగ్రవేళ
గోరుటను నీకునిద్దరు క్రూరమతులు
సుతులు జనియింతురట గల్గుసుతుడు నొకడు
పరమ భాగవతుడు రామభక్తి యుతుడు 44

చం॥ అనిముని బల్క కైకసియునంతట రావణుదారుణుం దశా
స్యుని దశకంఠ వింశతి భుజుం గనె దత్సమయంబునందెవా
డును జనియించు వేళనుగడున్ జలియించె ధరిత్రియున్ఖర
స్వనమున మ్రోసె మేఘము లెసంగెను సర్వవినాశ హేతువుల్ 45

ఆ.వె॥ అంతకుంభకర్ణు నత్యుదీర్ణు మహోద్రి
తుల్యు నమర హృదయ శల్యు గాంచె
దుష్ట హేతులడర తోడనె గనెదీప్తి
దర్పదహన శిఖను శూర్పణఖను 46

ఉ॥ అంతట గాంచె కైకసి మహాబుధ తోషణు దుష్టభీషణున్
భ్రాంతిమదాది దూషణు నిరంతర పాతకజాతశోషణున్
స్వాంతవివర్జితేషణు నుదారగుణాధిక సాధుతోషణున్
సంతత సౌమ్య భాషణు బ్రశాంతి విభూషణునవ్విభీషణున్ 47

వ॥ ఇవ్విధంబున నారాక్షసు లుద్భవంబందిరందు విభీషణుండును స్వాధ్యాయనిరతుండును పరిశు
ద్ధచరితుండును, నియతాహార స్థితుండును నిత్య కర్మ నిష్ఠుండునునై యుండె, కుంభకర్ణుండు
సంభవించునప్పుడ విజృంభించి విప్రముఖ సాధుజనంబులను నిత్య సంతుష్టమతులగు ఋషితతుల
వెతకి వెతకి భక్షింపుచు నత్యంత దారుణకృత్యంబున జరింపుచుండె నంతనధిక సత్వబంధురుండగు
దశకంధరుండును భువన భయంకరుండగుచు దేహదారులకు బాధకంబగు మహావ్యాధియుం బోలె
లోకనాశంబు కొరకు బెరుగు చుండె నిత్తెరంగున 48

సీ॥ రామ! నీవఖిలాంతరస్థితుండవు సాక్షి
వౌగి నిర్మలుడవు నిత్యోదితుడవు
నీమహత్త్వంబున నీవు మాయా నరా
కృతివయ్యు మాయచే నెనయ కుందు
విజ్ఞానదృష్టి సర్వజ్ఞుండవౌటచే
నెల్ల వృత్తాంత మీ వెరుగుదైన
నిపుడు విలాసార్థ మీవు బ్రేరేపింప
నెరిగింతు రాక్షస చరితమంత

తే.గీ॥ నీవును నిగూఢమతినున్న నిన్నచింత్య
మహిమును ననంతు నజుని జిన్మాతృగేవ
లాత్మ నెరుగుదు మూఢుండ నయ్యునేను
నీయనుగ్రహమున జేసి నేడు రామ! 49

తే.గీ॥ అనుచు పల్కు కుంభజుగనియినకులేంద్రు
డనియె నగుచు మాయాశ్రితం బయ్యు నఖిల
మిదియు నాకంటె వేరుగా దిదియెరుంగు
మనఘ! మత్కీర్తనంబు సర్వాఘహరము 50

వ॥ అనిన రఘుసత్తమునితో నగస్త్యుండు ప్రస్తుత వృత్తాంతంబు నెరిం గించెదనని యిట్లనియెనట్లు కైకసిసుతసహితయై విశ్రవసునాశ్రమం బున వసించియుండ నొక్కనాడు 51

చం॥ ధనదుడు పుష్పక స్థితి నుదార మహావిభవాఢి రాముడై
ఘనతరధాముడై జనకు గన్గొని వచ్చిన నమ్మహామహున్
గనియు సపత్నియున్ మరియు గైకసి రాక్షసి గానయోర్వకన్
దనసుతుడౌ దశాననుని దగ్గరకుం జని వానికిట్లనున్ 52

మ॥ తనయా! చూచితె రాజరాజు విభవోద్యత్తేజునీవీగతిన్
గనగాయత్నము సేయుమన్న వినివేగన్ రావణుండామెతో
జననీ! చూడు ప్రతిజ్ఞ జేసెదను రోషస్ఫూర్తి నే వీనిక
న్నను హెచ్చైన సమంబయైన నగుదున్ సంతాపమున్వీడుమా! 53

– రావణాదులు బ్రహ్మను గూర్చి తపంబొనర్చి వరంబులు గొనుట –

కం॥ అని పలికి దుష్కరతపం
బొనరింపన్ జనియెననుజ యుతుడగుచు దశా
ననుడున్ గోకర్ణమునకు
దినలేశ కృతోగ్రఫల వితీర్ణంబునకున్ 54

వ॥ ఇవ్విధంబున రావణాదులగు సోదరులు మువ్వురుంజని యమ్మహా క్షేత్రంబునన్ తమ తమ నియమ స్థితులనతిఘోరంబును దుష్కరంబును నిఖిల లోక దుర్భరంబునుంగా బితామహుం గూర్చి తపంబొనరించిరందు కుంభకర్ణుండు బూర్ణంబుగా దశవర్ష సహస్రంబు లతిభీమంబగు తపంబొనర్చె ధర్మాతుడగు విభీషణుండు సత్య ధర్మపరాయణుండై పంచవర్ష సహస్రంబులేకపాద స్థితుండై దపం బొనర్చి వెండియు నన్నివర్షంబులు సూర్యావలోకన పరుండై దపంబుననుసంధించె, దశకంధరుండు నిరాహారుండై దివ్యవర్ష సహస్రంబు మహాతపంబుజేసె తత్సహస్రవర్షంబులకు నిజ శీర్షం బొక్కటి

హుతాశనునియందు నాహుతి యొనర్చు నిప్పగిది నవసహస్ర వర్షంబులు నవశీర్షంబులాహుతి జేసి దశమవర్ష సహస్రాంతంబున దశమశీర్షంబు విచ్ఛేదింపనిశ్చయింపుచున్న నద్దశవదనుని కడకు ధర్మస్వభావుండగు బ్రహ్మదేవుండు వచ్చియి ట్లనియె 55

సీ॥ వత్స!దశగ్రీవ వరమిత్తు ప్రీతుండ
నైతిమనోభీష్ట మడుగు మనిన
నదివిని ప్రీతుడై నాతడు ధాతకి
ట్లను దేవవరదుండ వైతివేని
యక్షాహిగరుడసురాసురాదులకు వ
ధ్యుడుగాని యమరత్వ మొసగు నాకు
మనుజులు తృణభూతులని వారిగణియింప
ననినన‌ట్లగు గాక యని వరంబు

తే.గీ॥ నిచ్చెనీ శీర్షములు నీకు నెప్పటి గతి
మొలుచునవియును నక్షయములుగ సేతు
ననుచు నమృతంబు నాభియందునిచెనజుడు
శిరములును వచ్చెనప్పుంక్తి శిరునకపుడు 56

ఉ॥ అంతవిభీషణున్ ప్రణతునారసి వత్సలుడై పితామహుం
డెంతయు బల్కు వత్స! భవదిష్టవరంబును వేడుమన్నన
త్యంతము మ్రొక్కి బ్రాంజలియునైయతడిట్లను దేవ! ధర్మవి
శ్రాంతిగబుద్ధి నెప్పుడు నొసంగుమ ధర్మము దోపకుండగన్ 57

తే॥గీ॥ అనుచువేడిన ప్రీతుడైయజుడు వత్స!
యట్టి ధర్మాప్తి నీకగుననియుమరియు
నవ్విభీషణుతో నీవునడుగకున్న
నమర భావంబునీకిచ్చి తనుచు బలికె 58

వ॥ అక్కడ నక్కుంభకర్ణుండును నతిభయంకరుండును నతిభయంకరం బగు తపంబాచరింపన్గని భయంపడి నిలింపులు విధాతన్ గని వీడు స్వభావంబున సకల జన భక్షకుండైయుండులబ్ధ వరుండగునేని యసాధ్యుండగు నీరాక్షసుని మనక్షోభంబొనర్ప దగుననిన నజుండు వాణింజేరి వరసమయంబున వాని ముఖంబునంజేరి వచోవైకల్యం బొనర్పుమనిన నద్దేవియు నట్లజేసెదననిన నప్పద్మజుండు పజ్జిముఖానుజుంజేరి వరంబువేడుమనిన వాడును వాణిప్రేరణంబున నద్దేవునితో మహాత్మా! నాకు షణ్మాసంబులు నిద్రింపను నొక్కదినంబు భోజనంబొనరింప వరంబొసంగుమనిన నట్లయగుంగాకయని వచించి విరించియు నమరసహితుండై తిరోహితుండయ్యె సరస్వతి యుందద్వదనంబు వలన నిర్గమించి

స్వర్గంబున కరిగె, నంత దుష్టాత్ముండగు కుంభకర్ణుండును మత్కాంక్షితంబుగాని నీవాక్యం బెక్కడ
దోచెనది విధికృతంబుగదాయని దుఃఖితుండయ్యె నయ్యెడ. 59

సీ॥ అటసుమాలియు నిర్భయంబున హర్షించి
వరబలాఢ్యుల పౌత్రవరుల నెంచి
యతలంబువీడి ప్రహస్తాదులనుగూడి
వసుధ కేతెంచి రావణుని గాంచి

పరిరంభమొనరించి పలికెపుత్రకభాగ్య
దశనుంచి నావాంఛితముఫలించె
నేభయంబునలంకనేము వీడితిమట్టి
విష్ణుభయంబెల్ల విడిచెమాకు

తే.గీ॥ నేముముందున్న దీలంకనేడునీదు
భ్రాతయున్నాడు మరిదాని బలిమినేని
చెలిమినేనియు విడిపింపవలయునృపతి
కనఘ బంధుడు హితబంధుడనగనేమి 60

కం॥ అనినన్మాతామహునిన్
గనిరావణుడిట్టులనియె గన నగ్రజుడీ
ధనదుండు గురుండగు మా
కనఘా! యిట్లనగమాకు నర్హంబగునే! 61

చం॥ అనిన బ్రహస్తుడిట్లనియె నాప్తతదోప నధీశశూరులౌ
జనులకు భ్రాతృబంధుకృత సౌహృదమెక్కడిదయ్యె తొల్లియున్
గనుగొన దేవదానవులు కశ్యపపుత్రులు నయ్యువైరమొ
య్యనగని బోరరేయెపుడు నాయుధజీవులకేటి సఖ్యముల్ 62

ఆ॥వె॥ అనిదురాత్ముడైన యాప్రహస్తుడు దెల్ప
వినిదశాస్యుడెంచి విశ్వసించి
యాక్షణమున గ్రోధలక్షితాక్షుండునై
యటత్రికూటగిరికి నరిగివిడిసె 63

వ॥ అప్పుడప్పంక్తి ముఖుండప్పౌలస్త్యుని కడకుంప్రహస్తుని దూతగా బనిచిననతండు నీతమ్ముండీపురంబు
మదీయమాతామహులదగుట నాకిమ్మని పుత్తెంచెననిసామోక్తులనిన విత్తేశుండును నిజజనకుంజేరి
తద్విధంబు వివరించిన విశ్రవసుండును నతనినాశ్వాసించి దశాస్యుండు బలవంతుడిప్పటికి దలంగి

రజతనగంబున వసింపు మనిన ధనదుండును పితృవాక్యంబున లంకాపురిన్ బాసి కైలాసంబు నకుంజని మహాతపంబున తత్పురాంతకు సంతుష్టంగావించి ముఖ్యంబగు సఖ్యంబుఘటించి యద్దేవుండు నిర్దేశింప విశ్వకర్మ నిర్మితంబగు నలకాపురంబున నధివసించి యమ్మహేశ్వరుండు పాలింప దిక్పాలుండైయుండెనంత నద్దశకంఠండునుం పరబలకృతో త్కంఠుండగుచు సహోదర సహితుండై మాతులమాతామహోదులగు ప్రహస్తసుపార్శ్వ మాల్యవదాదులును మరియును మారీచ మహోద రాదులును మంత్రిమిత్రాది పరిజనంబుగాజని లంకానగరంబున నభిషిక్తుండై నిశాచర సేనాయుక్తుండై యసురరాజ్యంబున కధీశుండగుచు త్రిలోకంబులన్ బాధింపుచు దుష్టవృత్తిన్ ప్రవర్తింపు చుండెనంత. 64

కం॥ మాధ్యద్గతి రావణుడు స
ముద్యతి నిజభగిని వికట ముఖి శూర్పనఖిన్
విద్యుజ్జిహ్వుండును భయ
కృద్యుతమాయునకు కాలకేయును కొసగెన్ 65

సీ॥ వినియంత రాక్షస విశ్వకర్మమయుండు
దితితనయుండరుదెంచి తనకు
హేమనానప్సరో భామయందొదవిన
సుతనుమందోదరి సుందరాంగి
నద్దశాస్యునకు భార్యార్థంబు నిచ్చి ల
క్ష్మణునేసిన యమోఘశక్తినొసగె
నవలవృత్రజ్వాల యనెడువిరోచన
దౌహిత్రినిదనంత దశశిరుండు

తే.గీ॥ దెచ్చియట కుంభకర్ణు పత్నిగనొనర్చె
తనరశైలూషుడనెడు గంధర్వరాజు
తనయనుసులక్షణాన్విత ధర్మచరిత
సరమను విభీషణుండుదాబరిణయించె 66

తే॥గీ॥ అంతమందోదరియు పుత్రునతి సమర్థ
గనియెగనినప్పుడు జగంబు కంపమొంద
నతడు మేఘోద్ధతిని నాదమాచరింప
నాతనయు మేఘనాదుడంచనిరి జనులు 67

ఉ॥ అంతట కుంభకర్ణుడు దశాననుతోడుత నిద్రబాధనా
కెంతయునయ్యెనన్న నతడేపున దీర్ఘతరంబునున్ దృఢా
భ్యంతరమాయతంబగు గుహన్ ఘటియించిన నాతడందు వి
శ్రాంతిగభూరినిద్రనునొసంగెను ఘూర్ణిలుచున్విమూఢుడై 68

- రావణుండు కుబేరుని జయించి పుష్పకంబును గొనుట -

వ॥ అంతనద్దశరకంధరుండు వరగర్వాంధుండైయనివార్యగతిం జరియింపుచు సుపర్వు బాధింపుచు గంధర్వుల వేధింపుచు కిన్నరులన్ గొట్టుచు పన్నగులం బట్టుచు సిద్ధులం దెరలింపుచు సాధ్యులం దరలింపుచు దానవుల శిక్షింపుచు మానవుల భక్షింపుచు బ్రాహ్మణ జనంబులనలంపుచు మునిగణంబుల గలంపుచు సురస్త్రీజనంబుల జెరదెచ్చుచునివ్విధంబున దుర్మదంబు హెచ్చుచు ప్రవర్తించు నద్దశాస్యుదుర్వర్తనంబు విని విత్తేశుండు నీతి ధర్మంబుదలంచి భ్రాతయగు యసురనేతకడకు దూతముఖంబున నిట్టియధర్మ కృత్యంబులు వలదని వారించినన్ కోపించి యిద్ధనరుండునుంబుద్ధి సెప్పెడి వాడయ్యెనేవీనిదర్పం బిప్పుడ డయ్యం జేసెదనని యుగ్రాకారం బున దశగ్రీవుండు బలయుతుండైయలకాపురంబుమీదికిం జనివిడిచి విక్రమించిన. 69

ఉ॥ యక్షబలంబులేచి వివిధాయుధసాధన తామహోద్ధతిన్
రాక్షసులన్బడల్పరప రాక్షసులన్పటు విక్రమక్రియా
దక్షతబారిభూరిశర తాడితదేహులజేసి మించినన్
యక్షబలంబు జేడ్పడిన యక్షబలాధిపులుంజలంబునన్ 70

ఆ॥వె॥ మాణి భద్రకుంభమణిమంతులాదిగా
గవిసి బోరునెడలగసిమసంగి
యటమహోదరప్రహస్త ధూమ్రాక్షులు
దన్మదంబడంప ధనదుడలిగి 71

చం॥ అసురబలంబుదాకి బెగడందగ శూరతనేపుజూపన
య్యసురవరేణ్యు డల్గివివిధాస్త్రములన్బడలించి యొంచినన్
వెసధనదుండు నోడిచన వీడిదశాననుడున్నతిన్ జలం
బెసగతదీయ పుష్పకము నేపునగైకొనియెన్ జయోన్నతిన్ 72

ఆ॥వె॥ ఇట్లుధనదుగెల్చియితడు మార్గముసూప
నెల్ల దిక్పతులునునిట్టివారె
వారిగెలుతుననుచు నారావణుడు సైన్య
గణముతోడ యమునికడకు నడచె 73

- రావణుండు యముని జయించుట -

వ॥ ఇట్లునడచి యసురవర్యుండనివార్యంబగు పుష్పకయానారూఢుండై యుద్దండంబున దండధరలోకంబు సొచ్చినచ్చట నరకానేక యాతనానీత యమభటాయత్త కృత్యంబులు బ్రవర్తింపనీక్షింపుచు నందు. 74

సీ॥ గుదియలఘట్టింప కొరువులముట్టింప
నరచియహోయని యరచువారి
నినుపముక్కులకాకు నినుపకోరలరేచు
లెనసి పీకంగ బిట్టేడ్చువారి
తప్తాయసస్త్రీల తప్తాయసస్తంభ
రాజిమేన్గరగింప రోజువారి
రౌరవంబులమహా రౌరవంబులనేచ
బెట్టుగాబొరలిగూపెట్టువారి

తే.గీ॥ మరియు వైతరణీనదిమండువహ్ని
వారిబడవ్రేయవడిగూయు వారిగాంచి
పూనివిడిపించి పాపంబు బోకమున్న
బలిమి యమభటులనుదోలె పంక్తిముఖుడు 75

కం॥ అంతటనంతకభటులు సు
రాంతకభటులపయినడరి నన్యోన్యము దు
ర్దాంతమహాహవమగుచో
నెంతయురణతుముల ఘోషమెల్లెడనిండెన్ 76

తే॥గీ॥ అత్తరిప్రహస్త శుకసారణాదులడర
నయ్యెడనుచిత్ర వాహాదులడరుచుండ
భువనభయదోరు యుద్ధమద్భుతమునైన
దానవులగెల్చియమసేన దళముబూన 77

ఉ॥ పాశుపతాస్త్రమేసి యటపంక్తిశిరుండు కృతాంతసేనలన్
నాశమొనర్పక్రోధవదనంబున మృత్యువుతోడ రాగకీ
నాశుడునున్ ★రథోత్తమమనన్ వెడలెన్ దనకాలదండమున్
బాశములున్వెసన్ గొలుచు భండన భూమికి భీకరాకృతిన్ 78

వ॥ ఇట్లేతెంచిన కృతాంతపంక్తిముఖులకు మహోద్దండంబగు భండనం బయ్యె నయ్యెడ నొండొరులు భిండివాల కరవాల గదా ముసలాది సాధనంబులు బరగించుచు మహాస్త్రంబులు ప్రయోగించుచు బరస్పరంబు వారింపుచు కాలసర్పంబులపగిది దర్పింపుచుం బోరునెడ కాలుండు కాలపాశంబు లడరించిన వాడును మాయా పాశంబుల వానినడంచియు దీపించినం గోపించి దండధరుండ మోఘంబగు కాలదండంబుల కేలంబూనిన లోకంబులెల్ల ఘూర్ణిల్లం గాంచి విరించియరుదెంచి సమవర్తితో మద్దత్తంబగువరంబు వ్యర్థంబుగాకుండ నుపశమింపుమన శమనుండును సరోజభవుని వాక్యంబునం దిరోహితుండయ్యె నంత రావణుండును దన విజయంబు జాటించుచు చనియెనిట్లు. 79

★ రథోత్తమనన్ – గ.ము.ప్ర. పాఠం

సీ॥ అంతట వరుణజయాకాంక్షనద్దశా
ననుడు రసాతలంబునకునరిగి
యందుముందుగ గాననగు సర్పరాజి పా
లితమగు నా భోగవతి జయించి
నురగులవశులగా నొనరించి మణిపురి
గాంచియందునివాత కవచులగని
యనికి బిలిచిన బ్రహ్మజనివారుబలవంతు
లని బోరుమాన్పసఖ్యంబు జేసి

తే.గీ॥ యొక్కచోనందు కాలకేయుల మధించి
సరకుగొనకున్నవారి నందర వధించె
నపుడగాదె విద్యుజ్జిహ్వానాత్మ భగిని
మగని నెరుగక పరుడను మతి వధించె 80

ఉ॥ అంతదశాననుండు రచితాద్రినిభంబగు దుగ్ధసాగరా
భ్యంతర వర్తియౌ వరుణపట్టణముంగని జొచ్చియందు దు
ర్దాంతతపాశ భృద్బలము దైత్యబలంబు గడంగిపోరగా
నెంతయుదానె దీర్చిజలధీశు బలంబు జలింపజేయగన్ 81

ఉ॥ పుష్కరముఖ్యులౌవరుణ పుత్రులు రావణుదాకి తీవ్రధా
నుష్కత నస్త్రముల్ బరపనొచ్చియు రాక్షసభర్త విక్రమా
విష్కృతి నస్త్రశస్త్రముల ★వెంపరలాడుచు బెక్కుమాయలున్
దుష్కరవృత్తి బేర్చియని దొల్గగజేసెనువారి నందరిన్ 82

వ॥ అంతటన్ బ్రభాసుండును పాశధరు మంత్రి మంత్రాలోచనం బొనరించి వాని వరదర్పితుంగాదలంచి వానితో వరుణుండు బ్రహ్మలోకంబునకుం జనినవాడని వచించిన నద్దశశిరుండును దనవిజయంబు ఘోషించి నానామణిభూషితంబై బలినివాసంబగు నశ్మనగరంబునకు విజయార్థంబుగాజనియందు. 83

ఉ॥ ఆరజనీచరేంద్రుడు మహోజ్వలన ప్రభతోడనప్పుర
ద్వారముననెల్లుంగెడు మహాభుజదీర్ఘగదాధరున్మహా
కారు ఖలద్విషన్భురుషు గాంచిభయంపడియూర్ధ్వరోముడై
ధీరుడుగానవాడు మరిదెప్పిరి ముప్పిరిగొన్న భ్రాంతితో 84

వ॥ అమ్మహాపురుషునడిగియతనిచేత ననుజ్ఞాతుండైయంతఃపురంబున కరిగి బలిందర్శించి తత్తేజంబునకు నద్భుతంబందియుండ నబ్బలీంద్రుండును నయ్య సురేంద్రంగాంచి యంకంబున నుంచి గొన్నిదినంబులాదరించి నీవచ్చిన కార్యంబెయ్యదియనిన గర్వగ్రంధి యగు దశకంధరుండేను

★ దెంపర – గ.ము.ప్ర. పాఠం

నిన్నుబంధించిన వానింజయించినీ బంధంబులు విడిచిపుచ్చెదననివచ్చితిననిన నవ్వియవ్విరోచన సుతుండతనితో నన్ను నిరోధించినవాడు మధుకైటభ హిరణ్యాక్షా ధ్యనేక రక్షోహరణుండును జగత్కారణుండునునగు నారాయణుండ జేయుండగు నీవిప్పుడద్దేవుని మత్పురద్వారంబున గంటివి గదాయింకబొమ్మనిన నమ్మనుజాశనుండు దన్మార్గంబున వచ్చి యచ్చోనమ్మహాపురుషునిం గనుంగొన నేరక యూరక మేరుకూటం బున కేతెంచి యద్దివసంబచ్చట నచ్చరలతోడం గ్రీడించి విశ్రమించి మరుదినంబున నుదయించు దినకరుందిలకించి యతనిజయింతు నను మనంబున. 85

కం॥ భాను నెడకరుగ నాతడు
హీనుండగు వీనితోడ నేమని విధిస
న్మానము దలంచియూరక
యైనను భానుని జయించితని జనియంతన్ 86

కం॥ ఆ రావణుడత్తరి సుత
నారీపరిగీత గీతనాదాంకూర
న్నీరస తరు దారువునగు
మేరువునందచటనచట మెలగుచునుండన్ 87

తే॥గీ॥ ద్వీపసప్తక విజయప్రదీపుడగుచు
వచ్చుమాంధాతగని యుద్ధవాంచనరుగ
నొండొరులకందు భండనం బుగ్రమైన
నస్త్రనివహంబులడరించి యాగ్రహించి 88

కం॥ ఆలంకాధీశుడు భూ
పాలుండును వ్రేయబూన బ్రహ్మాస్త్రంబుల్
గాలవపులస్త్యులనుమును
లోలింజను దెంచిమాంచిరుచిత విధములన్ 89

వ॥ అంత 90

ఉ॥ ఇంద్రునిగెల్తునంచు నసురేంద్రుడుబోయి యనేకలోకముల్
ముందుగదాటి శీతకరుముంగల నిల్చిన శీతభీతులై
యందరు గ్రాగదాను వివిధాస్త్రములేయగ బ్రహ్మ వచ్చి మీ
రిందుదొలంగుడంచు వచియింపయథేచ్ఛదశాస్యుడేగుచున్ 91

ఉ॥ అంతటయక్షకిన్నర సురాసుర నాగ నరాది జాతు లౌ
కాంతలబట్టి వారలు దగంబొగులంగొని పోవదత్సతుల్
గాంతకుగాగ నీవుమృతి గాంతువటంచు శపించనెంచ క
త్యంతములంకకేగను దశాననుడాత్మ జయాంకమెన్నగన్ 92

కం॥ పాడిదలంచి విభీషణు
డాడిచెరందెత్తురయ్య యననతడరులన్
దాడిచెర బెట్టకను ము
ద్దాడుదురే! యనుచుననియెననుజునకంతన్ 93

ఆ॥వె॥ తనమగని ద్రుంచితంచు శూర్పనఖివిగవ
దేర్చి సోదరి మనకు మాతృష్వసేయు
డీఖరుడు దండకాటవి నేలునీదు
పనుపుసేయుసుఖంబుండు మనుచుబనిచె 94

ఉ॥ ఆ యెడ మేఘనాదుడును యాగచయంబునికుంభిలాస్థలిం
జేయహరుండుమెచ్చి జయసిద్ధశరాసన మక్షయాస్త్ర లీ
లాయతికామగంబగు శతాంగమునిచ్చియువెండి తామసీ
మాయనొరుల్ దనున్‌గననిమాటగు దానినొసంగె నెంతయున్ 95

వ॥ అంతనద్దశాస్యుండాస్థలంబునకుంజని శక్రునివలనం దత్క్రమం బంతయు నెరింగి పుత్రునిందోకొని
పురంబునకు వచ్చియుండ విభీషణుండారావణున కిట్లనియె. 96

చం॥ నేనుపయోధిలోనిలువ నిద్రిల మధ్యముడింద్రజిత్తునున్
మానుగదీక్ష నుండగని మజ్జననీభగినీ తనూజ కుం
భీనస మన్మథుండు బలిమిన్గొనెనన్న దశాస్యుడల్ల కుం
భీనస వేడినన్మథుని మిత్రునిగా గరుణించియంతటన్ 97

– రావణుండింద్రాదులతో యుద్ధంబు జేయుట –

సీ॥ ఉచ్చైశ్రవముగెల్చు నురుతురంగములతో
సురకరిని హసించు కరులతోడ
దగు విమానావళినగు రథోత్కరముతో
త్రిదశులెంతనుభట శ్రేణితోడ
నింద్రుచాపముగేరు సాంద్ర చాపములతో
నశనిహసించు నస్త్రాళితోడ
క్రౌంచభేది గలంచగల సైన్యతతులతో
త్రిదివమగల్చు భేరీలతోడ

తే.గీ॥ హరిజయంతాదులేమని యనిఘటింప
ననుజ తనుజాది దనుజాళి తనుభజింప
జయమహోత్సుకమైన పుష్పకమునెక్కి
యింద్రుమీదికి నసురేంద్రుడేచి నడచె 98

కం॥ ఈరీతింజని రావణు
డారజితాద్రికడవిడిసి యచట తదీయ
శ్రీరమ్యత నీక్షింపుచు
నారేయచ్చట వసించునాసమయమునన్ 99

చం॥ అటచనుచున్నరంభగనియద్దశకంఠుడు నన్నువీడినీ
వెటు జనెదన్న మామయని యించుకగొంకుచు మ్రొక్కినేనుమి
క్కుటగతి నీకుమారునలకూబరు జేరగ బోయెదన్న న
క్కుటిలుడు బల్మిబట్టి రతిగూడెను చేడియవ్రీడితాత్మగన్ 100

తే॥గీ॥ అంతనలకూబరుని కడకరిగిరంభ
యవ్విధము దెల్పనతడు బోధాప్తినెరిగి
కామవశగాని సతిబల్మిగవిసెనేని
చచ్చు రావణుడని ఘోరశాపమిచ్చె 101

ఉ॥ అప్పుడు దైత్యరాకగని యచ్యుతుగాంచి సురేంద్రుడంతలున్
చెప్పిన రావణుండపుడజేయుడు మీదవధింతు వానినే
నిప్పుడు రాను నీవు జనుమీ! యని శౌరివచింప వజ్రి దా
యొప్పిమరుద్వసు ప్రముఖ యోధులతో బొలిచెన్బలోద్ధతిన్ 102

తే॥గీ॥ ఆయెడ సహాయముగను పాకాహితునకు
పావక పరేతపాలక పలలభోజి
పాశిపవమాన పౌలస్త్య పశుపతులను
బలములనిపినవచ్చిరి బవరమునకు 103

వ॥ అంతనారాక్షసాధ్యక్షుండు నక్షోహిణీ సహస్రంబులగు బలంబులతో నమరపురంబుపై విడిసి విక్రమించిన నమరబలంబును సన్నద్ధంబై యుద్ధంబును కుద్యోగించినాసైన్యద్వయంబునుం బ్రళయసమయ సముద్రేకంబులగు సముద్రంబుల భంగిగడంగి యొండొరులం గాండ పరంపరలం గీలించియు దూలించియు భంగించియు ద్రుంగించియు నడచియు బొడచియు నలంచియు గలంచిన భయంకరం బగు సంకులసమరంబుగా కుంభకర్ణుండు రుద్రాదిత్యుల మేఘనాదుండు జయంతుని సురనాథుమాతా మహుండగు పాతాళగతుండైన సుమాలి వసువిసరంబును బ్రహస్తాదులు కార్తికేయాదులను మహోదర మహాపార్శ్వులశ్వినులను కుంభనికుంభులు మరుత్తులను మరియునుం దక్కిన ఖరప్రముఖులు దలపడి పరస్పరంబును దీవ్రంబుగా దివ్యంబులగు శస్త్రాస్త్రాది ప్రహరణంబుల ప్రవాహ యుక్తంబై సమిత్తలంబు భీభత్సంబుగా రణం బొనర్చిన నుభయబలంబును నజేయంబగుటంజేసి బలాబలంబుల కొలంది నెరింగియుంగలంగియు దొలంగియు మూర్ఛమునింగియు జీకాకు పడకుండ పోరు ఘోరంబయ్యె నయ్యెడ. 104

ఆ।।వె।। అంతకుంభకర్ణుడాత్మ బలంబున
ఘనమహాస్త్రవేది గాడుగాన
సురలగసిమసంగ జూచి రుద్రాదిత్య
లనిగి పెనగి రతని నసమెసంగ 105

ఉ।। అప్పుడు మేఘనాదుడు జయంతునిదాకి మహాస్త్రసంఘముల్
గుప్పిననింద్రసూతి శరఘోరతజూపినవాడు మాయయున్
గప్పివధింపజూడనదిగాంచి పులోముడు దల్లిదండ్రి బెం
పొప్పజయంబుజేకొని పయోనిధిడాచెను మాయచేవెసన్ 106

చం।। వసుసంఘంబుల నాసుమాలివిశిఖ వ్రాతంబులంగప్పి గ
క్కసిలం నేలకు గోలకుంబరచుచున్గావింపనం దెన్మిదౌ
వసుడుగ్రాకృతి దివ్యబాణముల నొవ్వంజేసి సావిత్రుడ
య్యసిచేవ్రేసిసుమాలినిం దునిమె దైత్యవ్రాతముల్భీతిలన్ 107

కం।। ఇంద్రుడసురేంద్రుడయ్యెడ
నైంద్రాసుర శరపితామహాస్త్రాదులచే
సాంద్ర క్రోధస్థితి ని
స్తంద్రగతిన్ బోరిరపుడు సాహసమెసగన్ 108

వ।। అప్పుడప్పంక్తి ముఖసుతుండగు మేఘనాదుండు దూరంబున ఘోరంబుగా బలవంతులగు భాస్వర మహారాజికతుషితాదులగు నమరగణంబులతోడ రణంబొనరింపంగని బలాంతకుండు మంతనంబున నంతకాది బలంబులతో నిర్జరవిరోధి దుర్జయుండగు వీనింబట్టుట కర్జంబని యొక్క పెట్టజుట్టు ముట్టుకొని దశముఖుండు వ్రేయు విశిఖంబుల కోర్చిబేర్చియందరుం బొదివిదశ వదనుంబట్టి కట్టివైచిన నట్టియడ నయ్యమరగణంబుల జయించి మేఘనాదుండు సింహనాదంబునం గదలి జనకుండు జిక్కుట వినియొక్కటన్ దరలి సురల పయిం దివ్యాస్త్రంబులు బరపి యత్తెరపినన్ దానునుంజొచ్చి యచ్చటి వియచ్చరుల విచ్చలవిడిం దొలంగించి దుర్దశం దొరయ నద్దశకంధరు విడిపించి ముందరం బురందురనకుందివురు బురందరుం బట్టి బంధించి విజయంబనుసంధించి వెనువెంటన్ దగిలిన బృందారకులందెరలించి తమతమ బలంబులన్మరలించి యసురేంద్రునింబురస్కరించి తత్తనుజుండు దనుజనికరంబుతో నిజనగరంబునకుం జనియె నివ్విధంబున 109

ఉ।। అంతవిధాత లంకకు రయంబున వచ్చి దశాస్యుసూతిక
త్యంతము నింద్రజిత్తుడను నాహ్వయమిచ్చి బ్రియంబు సెప్పి ని
శ్చింత సురేంద్రునిం విడువజేసిన వాడమరత్వమిమ్మటం
చెంతయువేడ గల్గదని యిష్టవరంబులు గొన్ని యిచ్చుచున్ 110

తే॥గీ॥ రణమునెడ హోమమొనరింప రథముగల్గు
దానజయమొందుదని పల్కి వానికపుడ
యింద్రున కహల్య రతిదోష మింతజేసె
విష్ణునిజయింపుమని చెప్పివిధియు జనియె 111

కం॥ ఈరీతినఖిల లోకము
లారూఢి జయించి వచ్చి యద్దశకంఠుం
డారయ కైలాసజయ
ప్రారంభమొనర్చువాంఛ బలయుతుడగుచున్ 112

ఉ॥ ఈ సరణిన్విమానవరమెక్కి దశాననుడేగి కాంచె కై
లాసము నీశభాసితవిలాసము హైమవతీ కృతోచితో
ల్లాసము నిత్యవర్తితకిలాసము దుర్జనచిత్తభేది హృ
ల్లాసము సాంగభృంగి కృతలాసము గాంగఝరీ జలాసమున్ 113

సీ॥ ఈరీతిరజితాద్రిజేరి రావణుడు ద
చ్చెలంబున యధేచ్ఛ సంచరించి
పుష్పకంబొకచోట బోవకున్ననిదేమి
యనుచుండ నయ్యెడ హరభటుండు
వానరాస్యుడు నందివచ్చి దేవుడుదేవి
గ్రీడింతుడిట బోవగూడదనిన
నంది రూపముగాంచి నవ్విననందియా
ఖలునితో మన్ముఖకపులతోడ

తే.గీ॥ సకులముగ జత్తువీవని శాపమిచ్చె
నదిగణింపక ననునిల్పెనగమటంచు
పరిఘ సమబాహుల బెకల్చెపంక్తివదను
డదిగనిహరుండు బొటవ్రేలనదుముటయును 114

కం॥ వేవర్షంబులు భుజములు
నోవన్‌రావంబుచేసి నుతియించిన న
ద్దేవుడు రావణనామము
గావించి కృపాప్తిపంక్తి కంఠుని బనిచెన్ 115

ఉ॥ ఆదటనద్దశాస్యుడు హిమాద్రికుశధ్వజపుత్రిసుందరిన్
వేదవతిందపోనియతివిష్ణుని గోరెడుదాని జూచి కా
మాదృతి పట్టజూడ సతికైమృతిగాంచెద వీవటంచుశా
పోదకమిచ్చి వానికరి యోగచితాగ్నినిజొచ్చి భూమిలో 116

- రావణుండు కైలాసమెత్తుట -

వ॥ అంతనపంక్తిముఖుండు హిమవంతంబునం గదలి భూలోకజయార్థం బరిగి మరుత్తుండను రాజోత్తముండు బృహస్పతితమ్ముండగు సంవర్తుండు యాజకుండుగా యాగంబు జేయుచుండంగని కలహార్థంబుగా బిలిచిన నతండు గురునను మతంబుననె నధ్వరదీక్షితుండ యుద్ధవర్తనంబ కర్తవ్యంబనిన నద్దూర్తుండును నిజవిజయంబ బచరించి చనియెనంతక మున్నయాగ భాగంబులకై యింద్ర మయ వరుణ కుబేరులేతెంచిన మయూరవాయస మరాళకృకలాసాంగంబులతో నడంగి వాడుసనిన నిజాకారంబుల నిలిచిరందు మహేంద్రుండు మయూరంబునకు సహస్రాక్షి లాంఛనంబుగా పించంబును నిజవర్షితంబగు వర్షంబున హర్షంబును యముండు కాకంబున కనేకకాల జీవనంబును నిజాస్థానపూజనంబును వరుణుండు హంసంబున కాత్మీయంబగు ధవళకాంతియు జలజీవనంబును కుబేరుండు కృకలాసంబునకు సువర్ణవర్ణంబును నొసంగి చనిరంతన సురకాంతుండు వసుధా కాంతుల నందరం జేరిపోరునకుంజీరిన వారును విచారించి వీడు పరదుర్జయుండు నిర్జింపరాదని దుష్యంత సురథగాధి గయపురూరవు లాదిగా నీవిందరింజయించితివనిన విజయంబు జేకొని దనుజ వరుండు జనియెనంత 117

మ॥ ఒకటందైత్యుడయోధ్యకేగియనరణ్యంబోరికిం జీరమా
నకరుండొట ననిం గడంగ బలమంతంద్రుంచి వాడానృపున్
వికటాస్త్రంబులనొంపనాతడొకడెంతే మత్కులంబందుమ
త్సుకృతాప్తిన్ జనియించి నిన్ దునుమునంచున్బల్కిజేరెన్ దివిన్ 118

కం॥ అనవిని రాముడు రావణు
ననినొంపగ నృపతియొక్క డయ్యును లేడ
య్యెనొకో! ధరలోనన న
య్యినకుల భర్తకు నగస్త్యుడిట్లని పలికెన్ 119

సీ॥ విను మర్జునుడు కార్తవీర్యుండుహైహయా
న్వయుడు మాహిష్మతీ నాథుడలరు
నతనితో రావణుడని కేగ నర్మదా
జలకేళినుండ నచ్చటికివచ్చి
భటులతో బోరునార్భటివిని యర్జునుం
డరుదేరననిఘోరమయ్యెనంత
నన్యోన్యమస్త్రాళినడరించు నెడరాజు
రావణుదారుణాస్త్రముల నొంచి

తే.గీ॥ వేయుకరముల చేబట్టి విరిచికట్టి
బురికి గొనితెచ్చి దానును బురికివచ్చె
నంతటబులస్త్యుడేతెంచి హైహయేంద్రు
కాంచి దశకంధరుని విడిపించిచనియె 120

– రావణుండు వాలిని గూర్చి యుద్ధమునకు బోవుట –

ఉ॥ వాలినిగెల్తునంచు దశవక్త్రుడు దక్షిణవార్ధి వేలపై
వాలిజపింపపట్ట జన వానినె చంకబిగించి వ్రేలగా
నాలుగువార్ధులన్మునిగి నైష్ఠికుడైయరుదెంచె నూరిక
వ్వాలినిగాంచి చిత్రపడి వాడొనరించె తదీయ సఖ్యమున్ 121

కం॥ ఒకనాడు పశ్చిమాంభో
ధికిజని దశకంధరుండు దిరుగుచుమిగులన్
శుకసారణాది మంత్రి
ప్రకరముతో నచటితీర భాగమునందున్ 122

సీ॥ జ్వలదర్కనిభుశుద్ధ జాంబూనదప్రభు
జ్వాలమాలావ్యాప్తు వహ్నిదీప్తు
లలితహేమాబ్జమాలావక్షు పింగాక్షు
చలకింకిణీధ్వాను సుశరతూణు

చటులఘంటాబద్ధచామర భీకరు
చక్రాది సాధన సహితుమహితు
గురువేగు మండూక కుక్షిభాగు ఘనాంగు
విపులు నాహరిమూర్తి కపిలుగాంచి

తే.గీ॥ ననికి జననవ్విభుడు ముష్టినడవ మూర్చ
నందెను దశాస్యుడచటి దైత్యాళి దోలి
యంతపాతాళ దీర్ఘగుహాంతరమున
కరిగె నద్దేవుడును వాడునపుడు లేచి 123

కం॥ తానును వెంటనె జనియట
దానవపతి మూడుగోట్ల తత్సదృశవయో
మానబలాఢ్యుల తత్సం
తానముగని భీతిమరలి తరలియునంతన్ 124

తే॥గీ॥ శ్రీవృతుండగు నవ్విష్ణు దేవుగాంచి
చూచితద్విశ్వరూపంబు చోద్యమంది
యతని చేతను దనుహతుండని యెరింగి
రావణుడు వచ్చి మరితన రాజ్యమేలె 125

కం॥ ఆరీతి లోకరావణు
డారావణుడాత్మ తులితుడగుసుతుతోడన్
జేరిక జని వశములుగా
నీరహిలోకములనెల్ల నేలెన్‌రామా! 126

కం॥ ఇటుల చటుల ప్రభావో
త్కటులగు దశకంఠ కుంభకర్ణుల రక్షఃపటలముతోద్రుంచితినీ
వటు లక్ష్మణుడింద్రజిత్తునని వధియించెన్ 127

- అగస్త్యుండు రాముల స్తుతియించుట -

కం॥ శ్రీరామ! నీవు సాక్షా
న్నారాయణుడవు జగజ్జననమూలమవౌ!
నీరూపమీచరాచర
మారయ సర్వంబు ప్రభుడవగుదీవుహరీ 128

వ॥ కావున రఘూత్తమా! భవన్నాభీకమలంబున లోకపితామహుడగు బ్రహ్మ సంభవించె, నివ్విధంబున నీముఖంబువలన వాక్కుతోడ నగ్నియు, బాహువులవలన లోకపాలాదులును, చక్షులవలన చంద్రభాస్కరులను కర్ణంబులవలన దిక్కులును విదిక్కులును ఘ్రాణంబువలన ప్రాణంబులును, నశ్వినులును జంఘా జానూరు జఘనంబు వలన భువర్లోకాదికంబులును, కుక్షిదేశంబున చతుస్సాగరంబులును స్తనంబుల నింద్ర వరుణులును, రేతంబున వాల ఖిల్యులును లింగప్రదేశంబున యముండును, గుదంబువలన మృత్యువును, క్రోధంబువలన త్రినేత్రుండగురుద్రుండును, నస్థిజాతంబున పర్వతంబులును, కేశంబులవలన మేఘంబులును, రోమంబుల నోషధులును, నఖంబులవలన ఖరాదిజంతువులు ప్రభవించె నగుటంజేసి 129

సీ॥ వితతమాయాశక్తియుతుడవౌ పురుషుడ
వీవిశ్వరూపుడ వీవురామ!
గుణవిభేదవ్యాప్తిగూఢ నానావిధ
రూపకుండుగ నీవుదోపబడుదు

వధ్వరంబులనునిన్నాశ్రయించుట గాదె!
ద్రావుదురమృతంబు దేవతతులు
ననఘ! నీచే సృష్టమయ్యెనీ విశ్వంబు
సర్వంబు జంగమస్థావరంబు

తే.గీ॥ గాన నిన్నాశ్రయించియే గాదె బ్రతుకు
సూవె! నీసర్వజంగమస్థావరములు
దుగ్ధగతసర్పి దుగ్ధమైదోచినటుల
నఖిలముననుండి యఖిలమైవ్యహరింతు 130

కం॥ నీప్రభచే నర్కాది ని
జప్రభ వెలుగొందుచుండు చాలదు నర్కా
దిప్రభనిను వెలుగింపగ
దీప్రగతిన్ రామదివియ దివిటియ బోలెన్ 131

కం॥ విజ్ఞానదృశుండెరుగున్
ప్రాజ్ఞత సచ్చిత్సుఖైక పరిపూర్ణుని ని
న్నజ్ఞాన దృశుండెరుగం
డజ్ఞతచే నిన్ననంధుడర్కునిబోలెన్ 132

చం॥ ఉపనిషదంతరార్థవిధియోగులు నాత్మశరీరమందుని
త్యుపరుని నీశ్వరున్ వెదుకుచుందురు నిన్నటులయ్యు నీపదా
బ్జపరమభక్తి లేశపరిభావితులెల్లనునిన్నుగాంతురౌ
నెపుడును చిత్స్వరూపునిగనెంతయు నన్యముగాక యుండగన్ 133

తే॥గీ॥ దేవదేవ! సర్వజ్ఞమూర్తివగునీదు
సన్నిధినినేవచించు గొంచంబులైన
యీప్రలాపంబులను క్షమియింపవలయు
భవదనుగ్రహపాత్రుండనవుట నేను 134

మ॥ వినుసర్వజ్ఞు ననన్యు నద్వయు నజున్ దిగ్దేశకాలాది చిం
తనకుందూరు ననంతు సద్గుణుని చిన్మాత్రున్ చలద్వాదివ
ర్జనుని న్మాయుని నక్షరుం రఘువరున్ సర్వేశు దన్నున్భజిం
చిన వారిందనకన్న వేరనకరక్షించే విభుంగొల్చెదన్ 135

తే॥గీ॥ అనుచువినుతించి మునిగాంచి ననియెరాము
డే వినదలంతు వాలిసుగ్రీవుజనన
మింద్రదివసేంద్రులే యీ కపీంద్రులనుచు
నెంతురన రామునకగస్త్యుడిట్టులనియె 136

సీ॥ కనకాద్రియగుమేరువున రత్నమయమధ్య
శృంగంబునందు విస్తీర్ణముగను
శతయోజనంబైనసభయందునొక్కనా
డజుడు దా యోగసమాధినుండ
నతనినేత్రముల దివ్యానంద సలిల మ
త్యంతంబు స్రవియింపనవ్విరించి
చేతులగ్రహియించి చిరమునాలోచించి
విడిచిన నదిభూమి బడినయపుడ

తే.గీ॥ నొకమహాకపిమూర్తియై యుండుఋక్ష
వరుడనుచు నామమిడివాని కజుడు వత్స!
నిఖిల భోగాడ్యమైన మన్నికట వసతి
నిలుపుగొన్నాళ్లు శుభమగు నీకుననిన 137

కం॥ ఆరీతిగబహు దినములు
నాఋక్షవరుండు నుండియభిహితమతియై
యారయఫలమూలార్థము
మేరువు శిఖరములయందు మెలగుచునుండన్ 138

వ॥ అంతనమ్మేరువు శిఖరంబున సుకరంబై వాపికారూపంబగు సరంబున పూర్వంబునం బార్వతీ సహితుండై శివుండు నొక్కనాడు క్రీడింపుచు నక్కడికి నేపురుషుండు వచ్చిన నొక్కదినంబు సుందరియై మరుదినంబున నిజరూపంబగునని వచించియుండె నట్టి మణిశిలా వలయిత దివ్యసలిల ప్రసారంబగు నక్కాసారంబునకు నాఋక్ష వరుండును సలిలేచ్ఛనువచ్చి తజ్జలంబున నిజచ్ఛాయ నీక్షించి గపి స్వభావంబునం బ్రతికపియనికోపంబున నవ్వాపికం దుమికి యందేమియుంగానక తీరంబునంజేరి సుందరియగు తనరూపం బునకు వెరగందుచుండ నరవిందభవుంగొలిచి వచ్చుచు మధ్యం దినంబున నమరేంద్రుండు మనోహారిణియగు తత్కామినింగని కామవశంబున వచ్చి యనుగవింపకమున్నె రేతంబుద్గమించి తద్వాలంబునంబడిన నతిబలశాలియగు వాలియుద్ధవించిన నవ్వాలికి హేమమాలిక నొసంగి వాసవుండుసనియె నాసమయం బున భానుండబ్భామినింగామించి వచ్చిన నవ్విధంబున నతనివీర్యం బును దదీయ గ్రీవాభాగంబునంబడిన నధికప్రభావుండగు సుగ్రీవుండుదయించిన నద్దినకరుండునుందనవద్ద విద్యనభ్యసించు బలవంతుండగు హనుమంతు నత్తనయునకు

సహాయార్థంబుగా నిచ్చి యరిగెనంత నవ్వానర కాంతయు నారాత్రి బుత్రులుందాను నొక్కయెడ
నిద్రింప బ్రొద్దున నిజరూపంబు వచ్చిన ఋక్షాధీశుండును నుత్సాహంబున. 139

సీ॥ తనయులగొనిచని ధాతకు మ్రొక్కిన
నాఋక్షవిభుగాంచి యాదరించి
ధాతయునొకదేవదూతను బిలచి నీ
వీతని గొనిభూమికేగియందు
సురలకేనియసాధ్య తరముగా బహుభాగ్య
విభవబంధురముగ విశ్వకర్మ
కృతమునై బెంపొందు కిష్కింధయను దివ్య
నగరిలో సింహాసనముననునిచి

తే.గీ॥ జేరియభిషిక్తుగావించి శూరునితని
రాజుగా జేయుమధికదుర్జయులునైన
ద్వీపసప్తకగతకపివీరులెల్ల
బూని యాఋక్షవరు భజింపుదురుగాక! 140

కం॥ నారాయణుడెప్పుడు దా
శ్రీరాముడునగుచు నసుర శిక్షకుడై భూ
భారమడచు నపుడీకపి
వీరులతని తోడగలసి వెలసె దరనినన్ 141

కం॥ త్రిదశుల దూతయుజెప్పిన
యదియంతము జేసితెలిపెనజునకు సర్వం
బదియాదిగ కిష్కింధయె
మొదలిపురంబయ్యె గీశముఖ్యులకెల్లన్ 142

కం॥ అంతట ఋక్షవిభుడు కా
లాంతంబుగ శక్రసమ మహావిక్రమ వి
క్రాంతుండై కిష్కింధా
కాంతుండై వాలియేలె కపిరాజ్యంబున్ 143

వ॥ కావున 144

కం॥ శ్రీరామ యవ్విరించి స
మారాధ్యతనట్టి నీవమాయామనుజా
కారంబున సకలధరా
భారంబునడంచితిపుడు పరమేశ! హరీ! 145

చం॥ అరయసమస్త భూతబహిరంతరవర్తివి విశ్వభర్తవై
నిరతముచిత్సు ఖాత్మవగు నీకిదియెంతటి కార్యమైనను
న్నరతనులీల చేత రఘునాథుడవైతగు నీయశంబఘా
హరణము సౌఖ్యదంబనుచు నార్యులుసన్నుతిజేతురెల్లెడన్ 146

కం॥ క్షమనిది భవదీయ కథా
సుమహత్వాశ్రయము వాలిసుగ్రీవుల జ
న్మమునేనరుండు దలచున్
గ్రమమున నతడఖిలపాతకంబుల బాయున్ 147

కం॥ అనరాముడువిని బ్రేమను
హనుమంతుని జననమంతయాద్యంతంబున్
వినవలతు దెలుపవేయన
యినకులునకు కలశజన్ముడిట్లని పలికెన్ 148

సీ॥ మేరుసానువుననింపారు కేసరి భార్య
యంజన కుదయించియనిలు వలన
నుదయించునప్పుడ యుదయించురవిగని
ఫలమని భక్షింప బరవనింద్రు
డశనివ్రేసిన నదిహనువుడాసిన మూర్ఛ
నందనితడు వాయువలిగియాత్మ
శక్తిమరల్పిన జగముబ్రూన్పడనజుం
డాత్మజు బ్రతికింపననిలుడమరె

తే.గీ॥ నంతబ్రహ్మేంద్రముఖ్యసురాసురాదు
లాత్మ సాధనముల బాధనందకుండ
వరమొసంగిరివానర వరుని కశని
హనువునొరయుట హనుమంతుడయ్యెనితడు 149

కం॥ ఆవరతతి కాతరమతి
తీవరగతి నితడు బాల్యధృతి మునులవెతల్
గావింపగ బలికిరి వా
రీవల తన బలిమితండు యెరుగకయుండన్ 150

కం॥ దానమరుత్సూనుడు రవి
సూనునిహితుడయ్యె నింద్రసూనునిజెనకం
గానేరడయ్యె యదిగా
దేనియసాధ్యమననెద్ది యితనికి నెచటన్ 151

ఆ॥వె॥ అనియు మునియు మరియు ననఘ! భవత్కథా
కలితమైన యొక్క కథవచింతు
దశశిరుండు ఖలుడు ధరణిజగొనినవ
ర్తనము దీని దెలియు మనుచుబలికె 152

– సనత్కుమారుండు రావణునకు రాములే పరదైవమని చెప్పుట –

కం॥ వినురామ! కృతయుగంబున
దనర మును సనత్కుమారు ధాతకుమారుం
గనియొక్కతరి వసింపగ
బ్రణతుండై రావణుండు బలికెవినీతిన్ 153

ఉ॥ లోకములందు దేవతలలో బలవత్తముడెవ్వడెవ్వనిన్
వీక సమాశ్రయించి యరివీరులగెల్తురు వేల్పులెవ్వరిన్
జేకొని విప్రులెప్పుడు యజింపుదురెవ్వని యోగులెల్ల ధ్యా
నైకతగండ్రు దీనివచియింపుము బ్రశ్నము బ్రశ్నవిత్తమా! 154

సీ॥ అనబ్రహ్మసూనుడిట్లను రావణునకునీ
వనిన ప్రశ్నములెల్ల వినువచింతు
నెవ్వాడు భర్తయౌనీజగంబులకు నె
వ్వనికి జన్మాదికంబనగలేదు
యట్టినారాయణుండవ్యయుండగు హరి
యలసురాసురవంద్యుడగును నెపుడు
నెవ్వానినాభి రాజీవజన్ముడు బ్రహ్మ
యావిశ్వకర్తల కెల్ల భర్త

తే.గీ॥ సకల మెవ్వనిచే చరాచరము గలిగె
నతని యాశ్రయమున గెల్తు రమరు లరుల
ద్విజులు యోగులర్చించి భావింతురతని
ననవిని దశాననుడు మౌని కనియె మరియు 155

కం॥ దనుజులు దివిజులు రాక్షసు
లనయము హరిచేతనిహతులై యేగతికిన్
జనుదురు నమరాదులచే
ననిహతులై యెందునుందురనఘా! సెపుమా! 156

చం॥ అనిననసనత్కుమారుడసురాధిపు బల్కుసురాళిచేనని
న్వినిహతులైనవారలు దివిన్ బహుభోగములంది పుణ్యముల్
జనినను వత్తురిమ్మహికి సర్వజనుల్ తమపూర్వపుణ్య పా
పనిరతిబుట్టుచున్మరియు బాయుచునుందురు గాదె రావణా! 157

కం॥ హరిచేహతులగు వారలు
హరిపదముంగాంచి తిరుగరనమునిసూక్తుల్
పరమాప్తివిని దశాస్యుడు
హరితో సమరంబు సేతునని మదిదలచెన్ 158

ఉ॥ అంతసనత్కుమారుడు తదాత్మగతంబునెరింగి వానితో
నెంతయు బల్కువత్స! భవదిష్టము సిద్ధిలు కొంతలోసుఖ
స్వాంతతనుండు మాయికుడు శౌరియరూపుడునైన నీకున
త్యంతము దత్స్వరూపమును దప్పక జెప్పెదనంచునిట్లనున్ 159

సీ॥ సకల చరాచరస్థల నదీనదపుణ్య
తలముల విష్ణుండు దనరుచుండు
నోంకారమును సత్యమూర్వియు సావిత్రి
సర్వదేవతలును సాగరములు
నఖిలలోకాధారుడైన శేషుడు సూర్య
చంద్రులు మృత్యువు శమనుడగ్ని
యనిలుడింద్రుడు కాలమహమురాత్రియువసు
పర్జన్యులును మరిబ్రహ్మరుద్రు

తే.గీ॥ లవ్వలసురాసురాదులు నతనిరూప
వెలుగువెలుగించు బ్రోచుగావించు ద్రుంచు
నిట్లు గ్రీడించు నవ్యయుండీశుడు హరి
యతనిచేత ద్రిలోకముల్ వ్యాప్తమయ్యె 160

వ॥ అదియునుంగాకనద్దేవుండు నఘటన ఘటనాప్రభావుండును, నీలోత్పల శ్యాముండును, భాస్కరకోటి ధాముండును, శంఖచక్రగదాపద్మ శార్ఙ్గనందక వరదాభయంకరుండును, విద్యుద్వర్ణాంబర ధరుండును, వెండియు శుద్ధ జాంబూనద ప్రభాన్వీతయును, నిజవామాంక స్థితయును, నిత్యానపాయినియునునగు, శ్రీదేవిం బరిరంభించియుం దద్విలోకన తత్పరుండైయుండునద్దేవదేవుని దర్శింప దేవదానవ పన్నగాదుల కేనియుంగాదు, మరియు యజ్ఞ జపతపోధ్యయనాదులనేనియు నితరోపాయంబులనేనియునతని నాలోకింపనశక్యంబగునైనను విధూత పాతకశ్రేణులును తద్గత ప్రాణులును తత్పదాయత్తచిత్తులునునగు వేదాంత ద్రష్టలగు శిష్టులచేత నాభగవంతుండు విలోకింప శక్యుండగునట్లయ్యును నీకు నప్పరమేశ్వరు నీక్షింపనిచ్చగల దేనియు జెప్పెదవినుము. 161

సీ॥ త్రేతాయుగమున నద్దేవుండు నృపతను
స్థితిని మర్త్యామర్త్య హితముకొరకు
నిక్ష్వాకు కులమున నిలభూరిబలశౌర్య
ధాముడౌదశరథ రాముడగుచు
హరిబరమాత్ముండు నధిక ధర్మాత్ముడై
జనకోక్తిదండ కావననియుక్తి
నైజమాయాభూతితో జగన్మాతతో
సీతతో భ్రాతతో జేరగలడు

తే.గీ॥ నింతయును జెప్పితేను దైత్యేశ! దెలియ
శ్రీయుతుడు రాముడచ్చట జేరియపుడ
యహితవృత్తి రచింపనౌనని వచింప
వినివిచారించి యద్దశాననుడు నంత 162

కం॥ నీతోడుత వైరమునకు
చేతోగతి ప్రీతుడగుచు శ్రీరఘువర!యా
దైతేయుడు యుద్ధార్థం
బీతీరున దిరుగుచుండె నెల్లజగములన్ 163

కం॥ కావున నీవిధముననా
రావణుడు వివేకమున ధరాసుతసీతా
దేవిన్ హరించెనిటునీ
చేవధముంగోరి కాదెశ్రీరామ! హరీ! 164

కం॥ ఈకథవినగ పఠింపగ
నాకాంక్షంజేయు వారి కాయుష్యారో
గ్యాకలితవస్తు లాభ
స్వీకృతి నక్షయముగాగ సిద్ధించెందున్ 165

వ॥ అని వెండియు నక్కుంభసంభవుండు రఘుకుల సంభవున కిట్లనియె 166

కం॥ ఈరహిసనత్కుమారుడు
నారయవీడ్కొని దశాస్యుడఖిల జగత్సం
చారుడయి విధిగృహాగతు
నారదు నొకనాడు గాంచి నతుడై యనియెన్ 167

కం॥ జ్ఞాననిధీ! నీవెరుగుదు
వీనిఖిలజగంబుగాన నేననిజేయం
గానగు బలాఢ్యు లెచ్చట
గానంబడుదురన వానిగని సురమునియున్ 168

తే॥గీ॥ మదివిచారించి వీనిదుర్మదమడంతు
ననితలంచి శ్వేతద్వీప జనములధిక
తనులు నతిబలధనులతిఘనులు మరియు
భువి నజేయులు దేవదానవులకైన 169

వ॥ అదియునుంగాక 170

- రావణుండు శ్వేతద్వీపంబునకు యుద్ధార్థమై బోవుట -

కం॥ హరిపూజాతత్పురులును
హరిచేనిహతులగువారు నచ్చోటజనిం
తురుగావున నీవచటికి
నరుగుచు నీతోడ బోరనర్హులువారల్ 171

సీ॥ అనిన మంత్రి సమేతుడై రావణుడు పుష్ప
కారూఢుడగుచును నపుడయట్టి
ద్వీపసమీపంబు వెసజేర తత్ప్రభా
హతి బుష్పకము బోవకచట నిలువ
నదియందెనిల్చి సహామాత్యుడై దశా
స్యుండు తద్వీపంబుసొచ్చినపుడ
యొకకాంతవచ్చి చేనొడిసిపట్టియిటేల
వచ్చితెవ్వడవు నెవ్వాడునిన్ను

తే.గీ॥ బనిచెచెప్పము నీవిధంబనుచు లీల
గొనుచు నొకరొక్కరిటు దన్నుగనుచునగుచు
నుండ తత్కరపీడనంబొలసియలసి
బలిమినొక్కరిచే ద్రవ్చి పారివచ్చె 172

కం॥ వచ్చియు తన్మహిమమునకు
నచ్చెరుపడి విష్ణుచేత హతుడనునగుచున్
జొచ్చెద వైకుంఠమునని
యచ్చట నీకెట్లు కోపమచ్చరువనుచున్ 173

కం॥ దైతేయుడు హరియనిమిము
చేతోగతి నెరిగి వైరసిద్ధికినీతో
సీతంగొని మాతంబలె
నాతడునిచి నిహతుడయ్యెనటు మీచేతన్ 174

వ॥ కావున. 175

శా॥ శ్రీరామా! పరమేశ్వరుండవగుటన్ జిచ్చక్షురాప్తింద్రి కా
లారూఢస్థితి సాక్షివైకనుచు భక్తాభీష్ట సిధ్యర్థమై
యారాజీవభవాది మౌనివచనంబాలించి యీసర్వకా
ర్యారంభంబొనరించి బోల్చితిటు మర్త్యాప్తిన్ జగత్పూజ్యతన్ 176

కం॥ అనియీరీతిగ రాముని
వినుతింపుచు రాముడగ్ర విధిబూజింపం
గని మోదమున నిజాశ్రమ
మున కరిగె నగస్త్యుడఖిలమును యుక్తుండై 177

ఉ॥ ఆరఘుకాంతుడంత మహిజాన్వితుడై భరతాది సోదరుల్
గోరిభజింప మంత్రులుసుఖుల్బరి వారముగొల్వశౌరి సం
చారియటుల్ నటింపుచును సక్తుడుగాకయ సీతగూడి భో
గారతుడై వసించెను గృహంబున వాయుసుతాది సేవ్యుడై 178

మ॥ ఒకనాడప్పుడు పుష్పకంబు రఘువర్యుంజేరి యోరామ! పు
ష్పకమేనద్ధనదాజ్ఞచే మిముభజింపన్వచ్చితిన్ రావణుం
డొకడర్ధేశ్వరుగెల్చి తెచ్చెనను దైత్యుం గెల్చి తీవౌట నీ
దుకడన్నిల్చెద మీరలాత్మ పదమందుంజెందినం బోయెదన్ 179

కం॥ అనిన విభుడు పుష్పకమున
కినసమమున కిట్టులనియె నేదలచినచో
జనుదెమ్మిపుడు యధేచ్ఛను
జనుమనిననుమ్రొక్కి యదియుజనియె నిజేచ్ఛన్ 180

ఉ॥ అంతట భ్రాతృమంత్రియుతుడై దగునీతిని రాముడా రమా
కాంతుడు రాజ్యమేల మహిగన్పడె సస్యపలార్ధవృద్ధిచే
నెంతయు ధర్మమెచ్చ సతులెల్ల బతివ్రతలై సెలంగిర
త్యంతము భూజనంబులు సుతచ్యుతిలేక సుఖించిరెల్లెడున్ 181

ఉ॥ ఆమహనీయమూర్తిరసికాగ్రణిరాముడు సీతతోసుధా
ధామము లౌవిచిత్రమణి దామములన్ రమణీయ నందనా
రామములన్ లతాంతరభిరామములం బహుసింధు సైకత
స్తోమములందు పుష్పకముతో విహరించెను కేళిలోలుడై 182

వ॥ మరియును. 183

భుజంగప్రయాతము -

క్షమాజాతయున్ భ్రాతృజాతంబుగీశో
త్తముల్‌గొల్వ భూమిన్ సదాసంచరించెన్
విమానాగ్రమంబెక్కి విష్ణుండురాముం
డమానుష్య కార్యంబు లందందొనర్చెన్ 184

ఉ॥ కాలముగాకనేమృతుడుగా ద్విజబాలుడు తద్విజుండు భూ
పాలురదూరుచుంబొగుల బ్రాజ్ఞతరాఘవుడంత ధర్మమున్
వ్రీలదపంబు విప్రవరురీతినొనర్చెడి శూద్రుద్రుంచి త
ద్బాలు సజీవుజేసియు గృపామతిశూద్రునకిచ్చె స్వర్గమున్ 185

- అగస్త్యుండు రామునకు దివ్యాభరణంబొసంగుట -

వ॥ ఇట్లు ధర్మ ప్రతిష్ఠాపనంబుసేసిన రఘుశ్రేష్ఠునభినందించి పురంద రాది సురబృందంబులతనిం దోడ్కొని యగస్త్యుండొనర్చు నధ్వరంబున కరిగిన నమ్మునీంద్రుండు నమరులకు హవిర్భాగంబులొసంగిన యంతనారఘుపతిం బ్రియాతిథింగా సత్కరించి పూర్వంబును నమూల్యంబునునగు నొక్క దివ్యాభరణం బొసంగిన తత్కాకుత్థ్సుం డును నేనుక్షత్రియుండ బ్రతిగ్రహింప నర్హంబగు నేయనిన కుంభ సంభవుండిట్లనియె. 186

చం॥ ప్రజలసృజింపవారి పరిపాలనకై నృపతిన్ సృజించి యు
న్నజుడు మహేంద్రునంశను మహాత్ముని ధర్మునియంశదండమున్
బ్రజలను బ్రోదిసేయుటయుపాశ ధరాంశను విత్తపాంశచే
బుజుగతి నీగియున్మరి గ్రహించుట ధర్మము జేసెరేనికిన్ 187

కం॥ కావున దిక్పాలాంశ మ
హీవరునంశయగు గాన నీవిదిగొనుమా!
నావినియావస్తువునీ
కేవిధిగల్గెనన పతికి బుషి యిట్లనియెన్ 188

సీ॥ మునుపు నిక్ష్వాకునందనులు నూర్గురువారి
యనుజుండు దండకుండజ్ఞతముడు
శతయోజనమువింధ్య జగతినేలుచు శుక్రు
నాశ్రమంబునకేగి యందువిరజ
యనుశుక్రపుత్రి కామాతురుండై కూడ
తెలిసి శుక్రుడువీని దేశమెల్ల
ద్వాదశాబ్దములశ్మ వర్షంబున నశించు
ననిశపించిన నదియట్లయైన

తే.గీ॥ దండకారణ్యమయ్యె తత్తనయజనక
శాపమునను సరస్సయ్యె సకలజంతు
హీనముభయంకరంబునై యొసగునచటి
కేను బోయితి నొక్కనాడినకులేంద్ర 189

వ॥ ఇట్లు జనియుండనద్భుతంబుగా నక్కడికి నొక్కదివ్యపురుషుం డచ్చరులు గొలువ విమానంబుతోవచ్చి శుచియై తత్కాలప్రాప్తంబగు దివ్యకళేబరంబు భక్షించినంగని నేనప్పురుషునితో నీవంటి మహాత్ముని కీయాహారంబతి కుత్సితంబనిన నతండు నాతో మునీంద్రానేను విదర్భరాజ సుతుండగు శ్వేతుండను వాడ రాజ్యంబగ్రజాధీనంబు జేసియీసరస్సమీపంబున తపఃప్రభావాతిరేకంబున నాకంబునం జెందియు క్షుధాబాధితుండనై తత్సమయ సమాగతుండగు విధాతతో నీలోకంబుల నిట్లేమియనిన నద్ధాతయు నాతోనీవు ధర్మంబొనర్చునెడ క్షుధార్తులై కొందరు మహాత్ములు వచ్చిననుపేక్షించుట నీకు నీక్షుధావ్యథ గలిగెంగావున నీసరస్తీరంబున నీపూర్వ శరీరంబు నీకుంగనుపడుదానిం భుజింప నమృతోపమంబగు నాకలియుందీరు నంతనాకంబునకుంజనుమిట్లనేక కాలంబుగానుండ నగస్త్య దర్శనంబున నీక్షుధాదోషంబు నిర్వర్తించు నీగాత్రంబునం దోపకుండునని సెప్పెనప్పగిది భవద్దర్శనంబున గృతార్థుడనైతినని నన్నంబ్రార్థించి యప్పురుషుండిభ్భూషణం బొసంగి బ్రహ్మలోకంబున కరిగె నింద్రాది

యోగ్యంబగు దీనింగైకొనుమనిన నయ్యాభరణంబు గ్రహించి మునిపతినామంత్రించి రఘునాథుండు సాకేతంబునకు జనందలంచు నవసరంబున. 190

చం॥ గృహమునకై వివాదపడి గృధ్రములూకమువచ్చి యారఘూ
ద్వహు గనిసృష్టికిన్మొదల దార్చితిమట్లనిరెండు బల్కినన్
మహిపు డులూకసృష్టి బ్రథమం బపరంబగు గృధ్ర సర్గమున్
బ్రహితముగాన గద్దమృషబల్కెను దండన కర్హమౌగదా! 191

చం॥ అనునెడమున్ను గౌతమున కన్నముబెట్టగ బ్రహ్మదత్తుడన్
జనపతిమాంసదష్టమయినన్ నృపతిన్ మునిగృధ్రరూపుగ
మ్మనమరివేడినన్ రఘుకులాధిపుజూచిన శాపమోక్షమౌ
ననివచియించెగాన నృపుడప్పుడు గృధ్రపుమేను బాయుచున్ 192

వ॥ శ్రీరామునింబ్రశంసించు దివ్యరూపంబున దివంబున కరిగె రఘువరుండనుం బురంబునకుంజని సకలధర్మంబుల బాలింపుచుండియంత. 193

కం॥ లోకోపకారమునకై
జేకొని నియతగతి కోటి శివలింగంబుల్
వీకన్ బ్రతిష్ఠజేసెను
ప్రాకటమతి రామమూర్తి పరమాత్ముడొగిన్ 194

వ॥ ఇట్లు లీలామానుష విగ్రహుండునుం త్రిలోకవంద్య పదాంబురు హుండును పరమధర్మపరుండును నగురఘువరుండు సర్వసమ తుండునునేక పత్నీవ్రతుండును రాజర్షిచరితుండును శుచినిరతుండు నై సకల కలుషాపహంబులగు రామాయణాది నిజకథానివహంబులు నిఖిలజగంబులం బ్రతిష్ఠాపింపుచు దశసహస్ర వర్షంబులు రాజ్యంబు పరిపాలింపుచు గృహమేధీయ కార్యంబు లఖిలంబు నొరింపుచు సమస్తజన ధర్మంబులు రక్షింపుచు నిత్యానం దంబునం బ్రవర్తించె నిత్తెరంగున. 195

కం॥ సీతాసతియును యనుగతి
ప్రీతి సమాశ్రయణనియతి కృతసహనమతిన్
భీతిలిరీతింబ్రజ్ఞా
రీతిం పతికిని మనోజ్ఞ వృత్తి నొసంగెన్ 196

సీ॥ అంతట నొక్కనాడఖిలభోగకై భా
జనమగునుద్యానవనమునందు
నెసగు దివ్యంబగు నేకాంతగృహసీమ
బూనిసుఖాసీనుడైన వాని

నీలమాణిక్య సన్నిభవేషు తటిదంశు
భావ్యవస్త్రవిశేషు దివ్యభూషు
వరదుశాంతు ప్రసన్నవదనుని శ్రీమంతు
రాముని ప్రేమాభిరాము జేరి

తే.గీ॥ కరముల పదంబులొత్తుచు కమలపత్ర
నేత్రదరహాస లజ్జావినీత వక్త్ర
నిఖిలదివ్య విభూషణాన్వీత సీత
హితవుతోడనతనితోనిట్టలనియె 197

– సీతాదేవి రామునకు వైకుంఠమునకు రమ్మని దేవతలు ప్రార్థించిరని చెప్పుట –

తే॥గీ॥ దేవదేవ! జగన్నాథ! దేవవినుత!
యాది మధ్యాంతరహిత! పరాత్మమూర్తి!
సచ్చిదానంద విగ్రహ! సకలమూల
కారణ!పురాణపురుష! రాఘవ! మహాత్మ! 198

సీ॥ అధిపదేవతలెల్ల యరుదెంచి ప్రార్థించి
యేకాంతమునను నాకిటువచించి
రాదిమీనిజధామమైన వైకుంఠంబు
విడిచియు మమునెల్లవిడిచివచ్చి

నేడు చిచ్ఛక్తివౌ నీతోడ రాముడు
గ్రీడాప్తినిందున్న వాడుగాన
మునునీవు వైకుంఠమునకు నేతెమ్ము తో
డనెవచ్చువిభుడునో జననిసేవ

తే.గీ॥ కుల మము ననాథులను సనాథులనొనర్పు
డనుచువిన్నప మొనరించిరగుట నిపుడు
నిదియు నేవిన్నవించితినెల్ల నీకు
హర్షమదిజేయుడేనేమి యనగజాల 199

చం॥ అనినవిమర్శజేసి విభుడంగనకిట్లను దేవియింతయే
ననయ మరుంగు దిందొకయుపాయము దెల్పెదనీకు నీపయిన్
ఘనమగులోకవాదమున కల్పనజేసి తదర్థమౌభయం
బునబలె నిన్ననేవిడిచిపుచ్చెద కానన సీమనంతటన్ 200

మ॥ ఇటవాల్మీకి మునీంద్రునాశ్రమమునందీవుండి నీకైనయి
ప్పటిగర్భంబునజేసి పుత్రయుగమున్ బ్రాపించి నాయొద్దక
ప్పటికేతెంచి జగంబులం బ్రతినదోపన్ భూమిమార్గంబుచే
నటవైకుంఠము జేరనీవు సనుమా! యామీదనేవచ్చెదన్ 201

వ॥ అని నిశ్చయించియద్దేవినంతఃపురంబునకు బంచి కాకుత్థ్సుం డాస్థానంబున నధివసించి తన్నుంజూడ వచ్చిన జనకయుధాజిత్ప్ర ముఖులగు బంధువులను మరియునుందగిన రాజులను సబహు మానంబుగ నిజనగరంబునకుం బనిచి భ్రాతృమంత్రి బలపరివారం బుతో బౌరకార్యంబులం ప్రవర్తించి యంతటం బౌరాణికపాఠక గాయక గణికాది విద్యాప్రసంగంబుల నానందించి యందరం దగినభంగి శలవొసంగి కొలువువిడిసి కొంత విశ్రమించి యభ్యంతర సభాంతరంబున విజయభద్ర పింగళ వజ్రదంత మాధవమధు మంతులాదియగు మితజనంబులతో మిత్రులుందానును విచిత్ర హాస్య కథాగోష్ఠిన్ బ్రొద్దులు బుచ్చుచు విజ్ఞానలక్షణుండగు రఘుకులాధ్యక్షుండు ప్రసంగవశంబున రహస్యంబుగా విజయ నామకున కిట్లనియె. 202

– లక్ష్మణుండు సీతను వాల్మీకాశ్రమంబున విడిచివచ్చుట –

కం॥ మాతల భ్రాతల సీతన్
భూతల జనమేమియనెడు పొరిబుచ్చకుమా
నాతోడ శుభాశుభవా
ర్తాతతి దెలుపుమన నతడు రామునకనియెన్ 203

సీ॥ రాముని కృత్యముల్ రావణ హరణాదు
లతిదుష్కరంబులౌనైననొకటి
వనమున నేకాంతమునను సీతను బ్రీతి
బలిమిచేగొనిపోయె పంక్తిముఖుడు
నారావణుండు దురాత్ముండు బలవంతు
డబల జానకియేమి యయ్యెనొక్కొ!
తన కళంకమువెన్క నునిచియింటికి సీత
గొని తెచ్చెతెచ్చెబో కొదవయనక

తే.గీ॥ నిట్టి సీతాంగసంభోగమేమి సుఖము
యతనికికరాజునడవడి యగును ప్రజల
కనినజనవార్త దెలిపిన వినివిభుండు
నాప్తజనముల నడుగవారట్లయనిన 204

కం॥ నృపమణి రాముడు సఖులను
నపుడు విజయముఖుల బోవననిపిమనుసులో

నపవాదభీతిచేనగు
నెపమున భూసుతనువిడువనిశ్చితుడగుచోన్ 205

కం॥ భూమిజయును మునియాశ్రమ
సీమలుజూడంగనిచ్చజేసి యడిగినన్
రాముడు సౌమిత్రి బిలిచి
యామహితాత్మునకు నిట్టులనుచున్ బలికెన్ 206

శా॥ సౌమిత్రీ! యపవాదమొక్కటిదె యీక్ష్మాపుత్రికై నాపయిన్
భూమిన్విశ్రుతమయ్యె వింటెకద! యిభ్భూమీజ వాల్మీకి స
ద్ధామాగ్రాటవివీడిరమ్మయిట మీదన్నీవునేనున్ననున్
నామీదన్ దెగినట్లటన్ననతిచింతా దంతుర స్వాంతుడై 207

కం॥ ప్రాతఃకాలమునాతడు
భీతియు శోకంబు మదిని బెనగొనవనికిన్
సీతంగొంచు సుమిత్రా
నీతంబగు రథముతోడ నేగెన్వేగన్ 208

వ॥ ఇట్లు వాల్మీకిమునివరు నాశ్రమనికటంబునకుంజని సుమిత్రానంద నుండు నిజస్యందనంబువలన నద్ధాత్రీనందనండించి మహాక్రంద నంబు జేసిన నాసతియును నతనితోనిట్లేమి యీమునీశ్వరుల దర్శించియిప్పుడ రఘుప్రవరు సన్నిధికిం బోవుదమనిన నశ్రుమిశ్రితేక్షణుండై లక్ష్మణుండద్దేవితో నమ్మా! రఘూద్వహుండు దుర్విధం బగు లోకాపవాద భయంబున నిజ్జానకిం గాననమ్మున విడిచిరమ్మ నిన వచ్చితి నాయందేమియుం దప్పులేదని నమస్కరించి సమీప మ్మున నిమ్ముని యాశ్రమంబునకుం జనుమని చెప్పి యెట్టకేలకు మరలి రామునింజేరవచ్చె నచ్చటనతి ముగ్ధయగు నద్ధరాసుతయును రాఘవ వియోగశోకంబున దుష్టమృగాది భయోద్రేకంబున హాహా కారంబున పరిదేవింప శిష్యముఖంబున వాల్మీకిముని వరుండువిని దివ్యబోధంబున వైదేహింగానెరింగి యరుదెంచి యాదరించి యర్ఘ్యపాద్యాదులం బూజించి భవిష్యదర్థంబు సమస్తంబునుం దలంచి మునివనితల కర్పించిన నప్పుణ్యాంగనలును నమ్ముని వాక్యంబులచేత పరమాత్ముండగు రఘూత్తముని పత్నియగు నాక్షితిజాత నాదిలక్ష్మింగా నీక్షించి ప్రతిదినంబును నతిభక్తి నుపచరింపుచుండిరంత. 209

ఉ॥ ఆమునిసేవితాంఘ్రియు బరాత్ముడు కేవలుడాదిదేవుడా
రాముడు విష్ణుడీశుడు ధరాసుతవీడియు జ్ఞానదృష్టి లౌ
క్యామిత భోగముల్ విడిచి యంతవిరక్తమతిన్ముని వ్రత
స్థేముడునై సుఖస్థితివసించెను మానుషలీలయిమ్మహిన్ 210

వ॥ ఇట్లు జానకిని విడిచివచ్చునెడ లక్ష్మణునకు బ్రజారక్షణంబువలనం గొన్నిదినంబు లంతరం బగుటయు 211

- శ్రీరాముడు లక్ష్మణునకు రాజ్యపాలనయందప్రమత్తుండై యుండవలయునని చెప్పుట -

తే॥గీ॥ అంత సౌమిత్రితో రాముడనియె వత్స!
యెడబడియె భూమిరక్షణం బిపుడుమనకు
మహిని బాలించుతరి నప్రమత్తతయును
గురుజనానుగ్రహముమేలు గూర్చు పతికి 212

చం॥ నృగుడను రాజు విప్రునకు నిచ్చిన గోవది రాజుమందనే
మగుడియు తప్పిచేరిన ప్రమత్తతనన్యునకీయ దానికై
నృగుడనునంత వాదపడునిద్దరు విప్రులరాజు లక్షధే
నుగణమునిత్తు నేనదిగొనుండన వారలు శాంతినొందకన్ 213

తే॥గీ॥ నృగునిశపియింప కృకలాసమగుమటంచు
నతడు ప్రార్థింప ద్వాపరమందు కృష్ణ
దేవుదర్శింప శాపంబు బోవుననిరి
గావున బ్రమాదముననుండగాదు పతికి 214

వ॥ అనిమరియును. 215

సీ॥ మునుపునిక్ష్వాకుని తనయుడు నిమియాగ
మాచరింపవశిష్ముడనగనతడు
నింద్రునధ్వరమున కేగెద పిదపజే
యుదమన్నను వశిష్మునురక విడిసె
గౌతము యాజకు గావించిన వశిష్మ
డెరిగివిదేహుగా నృపుశపింప
నిమియువశిష్మదేహము బోవశపియింప
నజునియాజ్ఞను దేహమందె మునియు

తే.గీ॥ నిమియుగురుశాప హతినిదేహమునుగనక
నమరులు వచింప జనిన దోషముల నిలిచె
గానగురువుల యెడననుగ్రహము గొనక
దానువారలగ్రోధింప దగదు పతికి 216

వ॥ అదియునుంగాక తొల్లినహుషతనయుండగు యయాతికి భార్యా ద్వయంబునందు శుక్రపుత్రియగు దేవయానకు యదుండను సుతుండును వృషపర్వపుత్రియగు శర్మిష్ఠకు పూరుండను కుమారుం డునుం

గలికిరందు యదుండు తల్లితో భార్గవ పుత్రియగు నీవుండమజ్జనకుండగు యయాతికి శర్మిష్ఠ
యెడన్ బ్రీతి యతిశయం బని చెప్పిన నప్పడంతి యసూయంజేసి శుక్రునకెరుంగించిన నతండతని
జరాభారంబు బ్రాపించునని శపించిన నయ్యయాతియు సుతులతో కామశమనంబగు నంతకు
మజ్జరంగ్రహింపుడనిన యదుండు గర్హించినందత్కులంబు దుర్వృత్తంబగునని శపించె పూరుండు
గ్రహించిన రాజ్యార్హుండుగా గరుణించె గావున గురుజ నానుగ్రహంబవశ్యంబనియె నివ్విధంబున
లక్ష్మణుడడిగిన చెప్పి రాముండు వెండియు నిట్లనియె 217

కం॥ వర్ణాశ్రమధర్మంబుల
నిర్ణయమును సకల కార్యనియతియు జనసం
కీర్ణ వివేకము ప్రజ్ఞా
పూర్ణతనెరుగంగవలయు భూపతినీతిన్ 218

కం॥ కానం జనరక్షణ కా
స్థానంబున నిలుతునేను సౌమిత్రీ నీ
పూనిక నిలువుము బహిరా
స్థానికినన లక్ష్మణుండు తద్విధినుండెన్ 219

వ॥ అప్పుడు 220

సీ॥ శ్వానమొక్కటి బోధశాలి విభిన్న మ
స్తకమయి వచ్చి లక్ష్మణునిజేరి
రామునికెరుగింపు నామొరసభ కేగ
జనదు బిల్వకహీన జాతి కనిన
విని భర్తదోడి తెమ్మనజనవిభునకి
ట్లనియె శ్వానముభిక్షుడడచెనన్ను
దేవవిచారింపు మీవుధర్మాతుండ
వనఘాత్మరాజుదేవాంశజుడగు

తే.గీ॥ ననిన రాముండు భిక్షువునడుగ నాత
డధిపయిక్కటు ననుత్రోవనడ్డమైన
నడచితిని భీతి నపరాధి నగుదునేను
నొరులనగ నేల దండనార్హుండననిన 221

వ॥ అంత నారాఘవుండా శ్వానంబునకుంగల పరిజ్ఞానంబు ప్రకటింపం దలచి దానితోనీవిప్రునకు యుక్త దండంబెయ్యది యనిన నదియు నారఘూద్వహునితో మహాత్మా! యీద్విజునకు దేవద్విజ స్థానంబుల కధికారంబొసంగిన నతండతి మూర్ఖుండగుట తత్తద్ద్రవ్యాదానాదుల యథేచ్ఛం బ్రవర్తించి నరకంబునం బడునది యెట్టులనిన నేనట్టికుల పతిత్వంబున బ్రవర్తించి వివేకినయ్యు నిట్టిదశం బ్రాపించితి దీనం బరిదేవించు నాతోనొక్కమహాత్ముండు రఘుసత్తముం దర్శించి కృతగృత్యుండవయ్యెద వని వచించెం గావున మిముంగాంచి గృతార్థుండనైతినింక వారణాసికింజని నిరశన వ్రతంబునం జేసి యీభువనంబునుం బాసి భవత్పదంబునం జెందెదనని పలికి యవ్విభువలగొని యదియునుం జనియె నారఘూత్తముండును నిట్టి విచిత్ర కృత్యంబుల జగద్రక్షణదీక్షితుండైయుండెనని చెప్పినవిని పార్వతి యప్పరమేశ్వరునితో నొక్కపరమరహస్యం బడుగందలంచి యిట్లనియె. 222

– శ్రీరాముడు లక్ష్మణునకు జ్ఞానోపదేశంబు జేయుట –

కం॥ శ్రీరామగీత యెట్టిది
యేరీతిగ లక్ష్మణునకు నెరుగించెనుదా
నారాముడు దెలుపగదే!
యారయనిదియనిన గౌరికభవుండనియెన్ 223

సీ॥ ఈరీతినంతట నారాఘవుడు జగ
న్మంగళమంగళాత్మకుడు విభుడు
నత్యుత్తమంబు రామాయణసత్కీర్తి
నిఖిలలోకంబుల నింపునింప
నాదిరాజర్షిముఖ్యాచరితంబగు
దివ్యచర్యను బ్రవర్తింపుచుండి
బ్రేమమహామతి సౌమిత్రియడుగంగ
చిరశుభ కథలెల్ల జెప్పుచుండ

తే.గీ॥ నొక్కనాడు నేకాంతమందుండు రాము
శ్రీరమాలాలిత పదాబ్జసీముగాంచి
లక్ష్మణుడు శుద్ధభావైక లక్షణాప్తి
వినయమున మ్రొక్కి భక్తిచే ననియెనిట్లు 224

ఉ॥ ఆరయసర్వదేహులకు నాత్ముడవీశుడవయ్యునున్నిరా
కారముశుద్ధ బోధమనగాదగు నీవు దనంతనీపదాం
భోరుహ భృంగమూర్తులగు పుణ్యుల సంగతిగాంచుజ్ఞానదీ
క్షారతులైన వారలకుగన్పడుచుందువు గాదెరాఘవా! 225

ఉ॥ నేనిటయోగిభార్యయగు నీపదపద్మయుగంబు సన్నిధిన్
బూనిభవైకనిస్తరణ బుద్ధి ప్రసన్నుడవైతి వేగ న
జ్ఞానమహాంబుధిన్ సుఖమునందరియింపగజాలు నెట్టివి
జ్ఞానముచేత తద్విధిని నన్నిదె శిక్షయొనర్పు మీశ్వరా! 226

తే॥గీ॥ అనిన సౌమిత్రివచనముల్ విని నతార్తి
హరుడు రఘువీరుడు ప్రసన్నుడగుచునతని
గాంచియజ్ఞాన తమము హరించువేద
హితమునైదగు విజ్ఞానమిట్టులనియె 227

సీ॥ స్వాధ్యాయనియతియు శాంతియు దాంతియు
తపమును బ్రాహ్మణ ధర్మములగు
శిష్టరక్షణమును దుష్టశిక్షణమును
నీతియు తాల్మియునృపతికలరు
వాణిజ్యమును న్యాయవర్తన కృషియు గో
రక్షావిధియువైశ్యలక్షణములు
ద్విజదేవభక్తియు ఋజువృత్తియును పురా
ణోక్తకర్మము శూద్రయుక్తములగు

తే.గీ॥ దయయుసత్యంబు వినయంబు ధర్మచింత
దురితభీతియు సకలజాతులకు వలయు
పతిగురుహితంబు శీలంబు సతికి విహిత
మతిధిసత్కృతి గార్హస్థ్య మతము సువ్వె! 228

ఉ॥ కావున నాత్మయోగ్యశుభకర్మ హితస్థితిమున్నెశుద్ధమౌ
భావమునంది కర్మఫల భావితవాంఛలుమాని మోక్షవాం
ఛావిధిశాంతినిష్ఠ సదసత్వవివేకత నాత్మబుద్ధి కై
యీవిధి సాధనాప్తిగనియిష్టగురుంభజియింపగాదగున్ 229

తే॥గీ॥ కర్మము శరీరసంభవకారణంబు
నట్టికర్మంబె ప్రియమునునప్రియమగు
ధర్మమునధర్మమనజేసి దానసక్తు
డైనవానికి భవబంధమడగుగాన 230

కం॥ క్రమమున జన్మమునకు క
ర్మము కర్మము వలన జన్మరతియును గలుగున్
సమమున కులాలచక్ర
భ్రమణన్యాయమున దిరుగు భవకర్మంబుల్ 231

తే॥గీ॥ మొదలనజ్ఞాన మింతటి మూలమగుట
వలయునజ్ఞాన హరణ మవశ్యముగను
కర్మమజ్ఞాన జంబౌట కతనదాని
నణపజాలదు పంకంబునందువలన 232

కం॥ ఈయజ్ఞానమునణపం
బాయకసుజ్ఞానమే సమర్థంబగు బ్ర
జ్ఞాయత విచార తేజం
బేయెడ తిమిరమును నాశమెనయించుగతిన్ 233

తే॥గీ॥ కలుగదజ్ఞానముననురాగక్షయంబు
నగుట తజ్జన్యమగు కర్మమఘము నిడును
నెప్పటివిధంబుగా భవంబెడలకుండు
నగుట సుజ్ఞానవిదుడుగానగును బుధుడు 234

వ॥ అదియునుంగాక 235

సీ॥ కర్మంబు విధిపూర్వకముగ వేదముఖంబు
నందు జెప్పంబడునటుల మరియు
జ్ఞానంబుపురుషార్థసాధనంబౌట క
ర్తవ్యంబులగు రెండు ప్రాణులకును
నటుగాక జ్ఞానసహాయంబునగుకర్మ
మేయెడ కర్మంబుజేయకున్నె
దోషంబుగాశ్రుతి భాషించుటను మోక్ష
కాంక్షికి జేయనౌ కర్మమెపుడు

తే.గీ॥ కారకాదుల నెల్ల బ్రకాశమెనయ
నధ్వరముబోలె జ్ఞానంబునట బ్రకాశి
తములునగు కర్మతతులచే తనెవిముక్తి
సిద్ధిగావించుటకు విశేషింపుచుండు. 236

చం॥ అనుచువితర్కబుద్ధి నిటులందముగొందర సత్క్రియావిలో
కనమున నౌవిరోధగతిగైకొని కాని యెకింతయేనియున్
మనమునైన కర్మలవమాత్రముగోరక నేస్వంతంత్రతన్
జనుధ్రువకార్యకారియగు జ్ఞానము మోక్షవిధాన సంగతిన్ 237

వ॥ అదియునుంగాక కర్మంబఖిల కారకాదుల వలననుదయించి దేహాభి మానంబునం జేసి వృద్ధింజెందు జ్ఞానంబహంకార వర్జనంబున సిద్ధించు, యఖిల కారకాదుల నశింపంజేయుచు నాత్మకు చరమవృత్తి యగు ననియెరింగి తత్త్వమ్మను నాత్మానుసంధానపరుండై సర్వేంద్రియ వృత్తుల నివర్తించి కర్మంబు విజ్ఞాన విరోధంబు గదాయని తెలిసివిడు వందగు, నదియుంగాక యెంతపర్యంతంబు శరీరంబునం దాత్మ బుద్ధిదోచు నంతపర్యంతంబును విధిచోదితంబగు కర్మంబాచరిం పందగు, కావుననేతియను వాక్యాదుల దేహేంద్రియాది ప్రపంచా తీతంబగు పరమాత్మ స్వరూపంబు నిశ్చయింప నేర్చిన సకల కర్మంబులు దనంతందొలంగి చనునెపుడు పరాత్మైక భావంబు సంపూర్ణ విజ్ఞానంబు సంభవించునపుడు గాదె యాత్మసంసృతి కారణంబగు మాయాస్వరూపంబు కారకాదులుంగూడ నణంగిచను నిట్లు శ్రుతిప్రమాణంబున నశించునవిద్య కార్యకారణిగానేర దివ్విధంబున నమలంబును నద్వితీయంబునునగు విజ్ఞాన మాత్ర ప్రకాశంబున నయ్యవిద్య వెండియు జనింపదగుట నేను కర్తయను బుద్ధి సిద్ధింపదు దానంజేసి కర్మాదికంబపేక్షింపక స్వతంత్రంబుగా జ్ఞానంబుమోక్ష సాధనంబగు నట్లగుటంగదా సకలకర్మ సన్యాసంబు బ్రశస్తంబని శ్రుతియుంచెప్పుచుండుననిన మరియును. 238

కం॥ దానంగ్రతుదృష్టాంతము
జ్ఞానమునకురాదు కర్మసంగతి క్రతువున్
నానాఫలదంబగుటను
జ్ఞానముమోక్షైకసాధనంబేయగుటన్ 239

కం॥ నేనను యనాత్మమతివి
జ్ఞానికి గల్గదది కర్మజడునకుగాకన్
గానం గర్మమశేషము
మానగదగు దోషమనుచు మహితాత్మునకున్ 240

తే॥గీ॥ శుద్ధమైన మహావాక్య సిద్ధివలన
తత్త్వమెరిగి గురుప్రసాదమునజేసి
మొనయునేకాత్మ విజ్ఞానమున సుఖించి
మేరువట్ల జలింపకమెలగు బుధుడు 241

కం॥ 'తత్త్వం' పదములను విరు
ద్ధత్వము లేకుండ నప్పదంబున నేకా
త్మత్వంబు నెరుగనగు నిపు
ణత్వంబున బుధుడు లక్షణాభాగమునన్ 242

కం॥ కావుననిటుసంశోధిత
భావన నిర్ద్వంద్వుడైన పరమాత్ము ననున్
గేవలు నెరింగి ముక్తి
శ్రీవెలయగవలయు బుధుడు సిద్ధుండగుచున్ 243

కం॥ ఈరీతి మహావాక్యవి
చారంబున దెలిసియాత్మ సహజాకారా
కారితుడగు పూర్ణునకు వి
కారములగు కర్మకృత వికల్పనలేలా! 244

వ॥ మరియునుం బంచీకృత సంభవంబైయింద్రియ ప్రాణమనోహం కారాత్మకంబును సుఖాది భోగ సాధనంబుననగు సూక్ష్మదేహంబును మాయా ప్రధానంబై యనాద్యంబైనను నిర్వాచ్యంబుననగు కారణ దేహంబుననగునుపాధి భేదంబుల పృథగ్గతుండుగా దోచునాత్ముండు పురగృహారణ్య గతుండగు పురుషుండునుం బోలె నొక్కడయనియును భవచక్షుండై నిరీక్షింపనగు మరియును. 245

ఉ॥ ప్రాణమునాదికోశములు పంచకమందును తత్తదాకృతిన్
గానక దోచుగానిస్ఫటికంబును బోలె నసంగు డద్వయుం
డైన పరాత్ముకిట్టి వివిధాప్తియుగల్గునె యంచు నయ్యవ
స్థానవిలక్షణత్వము విచారముచేత నెరుంగగా నగున్ 246

కం॥ స్వాపాది భేదములుగుణ
రూపములగు బుద్ధి వృత్తి రూపములుమృషా
రూపములని నిత్యుడజుం
డాపరమాత్ముండు సాక్షియని దెలియనగున్ 247

వ॥ కావున దేహేంద్రియ మనఃప్రాణచిదాత్మ సంఘాతంబు వలన బుద్ధికి తమోమూలంబగు నజ్ఞాన వృత్తి లక్షణంబెంత పర్యంతంబు గలుగునంత పర్యంతంబును సంసారంబున్న యట్లయగు దేహేంద్రి యాదులాత్మగాదని యెరింగి జ్ఞానామృతంబనుభవింపనగు నప్పుడు హంసంబు క్షీరంబు గ్రహియించి జలంబు త్యజియించు గతి జగన్మూలంబగు వృత్తి జాలంబునశించు నెట్లంటేని యెన్నడేని యాత్మకు జననమరణ క్షీణవర్ధనాది వికారంబులు గలుగవనుట సర్వాతిశయంబును స్వయంప్రకాశకంబును

నర్వగతంబును నద్వయంబును జ్ఞానమయంబును సుఖస్వరూపంబగు నాత్మయందు దుఃఖమయంబగు భవంబు విరోధంబునం దోపంబడు నజ్ఞానం బుననగు నభ్యాస వశంబునందోచు ప్రపంచంబు జ్ఞానోదయంబున లీనంబై చనునని మరియును. 248

సీ॥ అన్యంబునన్యంబు నందు దోచిన భ్రాంతి
యధ్యాస మనియందు రార్యులట్టి
అధ్యాసవశమున నహిగానిరజ్జువం
దహిరీతి జగమాత్మయందు దోచు
నందునగాదెమాయా వికల్పములేని
యఖిలకారణము నిరామయంబు
నగుచిదాత్మునియందహంకృతి మొదల క
ల్పితమయ్యెదాన సంసృతికిమూల

తే.గీ॥ మైనరాగాదికముబుద్ధియందు బొడమె
గనసుషుప్తి నహంకృతి యనగలేమి
శుద్ధ సుఖరూపమగు నాత్మబుద్ధిసాక్షి
యగుట నాత్మకునిన్ని మాయాప్తిగాదె 249

కం॥ బుద్ధిపరిచ్ఛిన్నంబై
సిద్ధంబుగగుణమయాప్తి జీవితమెలగున్
బుద్ధికిని సాక్షియగుచున్
శుద్ధంబగు నాత్మవెలుగు సుఖచిన్మయమై 250

కం॥ అనలార్క లోహములజెం
దినగతి చిద్బింబ సాక్షిధీయోగముచే
గనునాత్మకు నన్యోన్యం
బనుగతి నధ్యాసమున జడాజడ వికృతుల్ 251

కం॥ అనుగత గురువేదోక్తుల
ననుభవ విజ్ఞానియైన నాత్ముని నాత్మన్
గని నిరుపాధికుడగుచున్
జనునాత్మకు నీయశేష జడములు దొలగున్ 252

వ॥ కావున నజుండును స్వయంప్రకాశకుండును నతినిర్మలుండును శుద్ధవిజ్ఞానమయుండును నిరుపాధికుండును నారదాత్మకుండును పరిపూర్ణుండును నిశ్చలుండును నిత్యముక్తుండును

ననంతశక్తియు నతీంద్రియుడునునై పరమాత్ముండును వెలుంగునని నిరంతరంబును వేదవాదులగు విబుధుల చేత హృదయంబున నెరుంగనగు నవ్విధంబున నాత్మస్వరూపంబున నాత్మచేత నఖండ విచారంబును బరిశీలించిన విశుద్ధ భావనాశంబున నచిరకాలంబున కారకంబుల తోడ నవిద్యా విడంబనం బంతయు దివ్యంబగు రసాయనంబు సేవించిన నిజవికారంబులతోడ రోగంబులు నశించు విధంబున నశింపునని చెప్పి శ్రీరామదేవుండు లక్ష్మణునకిట్లనియె. 253

సీ॥ సమతవివిక్తదేశముననాసీనుడై
నియతనుపాధితేంద్రియుడు నగుచు
విమలాంతరాశయ విధినిర్జితాత్ముడై
ఇతర సాధనములనిచ్ఛగొనక
సూక్ష్మవిజ్ఞాన చక్షువున నీక్షింపుచు
కేవలంబుగనేక భావనమున
యాత్మ సంస్థితుడునై యాత్మదర్శనమగు
వివిధరూపంబునౌ విశ్వమెల్ల

తే.గీ॥ నఖిల కారణమగు నాత్మయందు సమర
సాప్తినొలయించి నిశ్చలుండైనయట్టి
సచ్చిదానందమయ బోధశాలియతడు
బొలుచు బాహ్యాంతరములేక బూర్ణుడగును 254

తే॥గీ॥ అటసమాధికి పూర్వంబునందు జగము
నఖిలమోంకార మాత్రంబయని తలంచి
వాచ్యమఖిలంబు ప్రణవంబు వాచ్యకముగ
జ్ఞానవశమునభావింప నౌనిజమున 255

వ॥ అట్టి ప్రణవంబు నంధకారంబు విశ్వుండును నుకారుండు తైజసుండును మకారంబు ప్రాజ్ఞుండన స్థూల సూక్ష్మకారణంబులగు తనుత్రయంబున జాగ్రత్స్వప్న సుషుప్తులను యవస్థాత్రయంబువలన పురుషుండొక్కరుండయ్యును నుపాధివశంబున నీయఖిలంబును బ్రవర్తింపునని దోపుచుండు సమాధిపూర్వంబున నవధానంబునం జేసి ప్రత్యాహరింపందగు నట్లంటేని బహువ్యవహారంబు విశ్వరూప కంబై ప్రథమంబు నకారంబుద్వితీయంబగు నుకారంబునంజొనిపి తైజసరూపంబగు నుకారంబునుం బ్రణవాంతిమంబున గురుకారం బున విలయింపంజేసి కారణంబునుం ప్రజ్ఞారూపంబును నగు మకారంబాత్మయందు పరిణయమింపంజేసిన నిట్టి యుపాధి విముక్తంబై నిర్మలంబును విజ్ఞానమయంబునునగు పరబ్రహ్మంబు దనంతం బ్రకాశించునిట్లు విజ్ఞానపరాత్మ భావనుండును నిజానంద సంతప్టుండును విస్మృతాఖిల ప్రపంచుండును నిరంతరాత్మ ప్రకాశు

ండును సాక్షాద్విముక్తుండును నగునతండనిశ్చలంబగు సముద్రంబునుంబోలె పరిపూర్ణుండగు నివ్విధంబున సదాభ్యస్త సమాధి యోగుండును నివృత్తి సమస్త విషయుండును నిర్జితాశేష శత్రుండును నిర్గత గుణవృత్తుండునునగు తత్త్వజ్ఞునకు రామమూర్తి నగు నేనెపుడుంగోచరింపుచుండుదు నని చెప్పి వెండియు. 256

సీ॥ ఈరీతి నపుడాత్మనెరిగి ధ్యానమొనర్చు
ముని యుండు ముక్తబంధనుడు నగుచు
ప్రారబ్ధమగుదాని ననుభవింపుచు మాన
మెడలి తత్తాదాత్మ్య మెనయుగాన
భయశోక మూలమౌభవమునాద్యంతంబు
నెరిగియాతడు కర్మమెల్ల విడిచి
యఖిలస్వరూపుడై నాత్మునియందు నీ
యఖిల విశ్వమున భేదాప్తివగుచు

తే.గీ॥ నట్టియాత్ముని రాముడేయని యెరింగి
యట్టిబుధుడుండు వారిధియందువారి
నభమున నభంబు క్షీరంబు ననుపయస్సు
యనిలమున వాయువునభేదమగు విధమున 257

తే॥గీ॥ ఇట్టి మునిజూచె నేనియునిజ్జగంబు
మిథ్యయని వేదబోధ సమ్మతినెరుంగు
దిక్కులందును దిగ్భ్రమస్థితినిగాంచి
యదియు దిజ్మాత్ర భేదమం చెరుగులీల 258

ఉ॥ ఎంతటలోమదాత్మికము నంతయునంచునెరుంగడంత ప
ర్యంతము సాధకుండు మదుపాసన తత్పరుడై వసింపుచో
నంతట భక్తి లక్షణమునైతగు శ్రద్ధ జనించునట్టి శు
ద్ధాంతరుడైన వాని కనిశాప్తిని నేమదిగోచరించెదన్ 259

వ॥ అని మరియు రఘువరుండిట్టులనియె. 260

సీ॥ ఇది రహస్యము నిశ్చయించి నేనునునీకు
సంప్రీతి ప్రతిసార సంగ్రహంబు
దెలిపితినెవ్వాడు దీనిజింతించు ధీ
యుతుడునప్పుడయఘ ప్రతతిబాయు

ననఘ! యీదృశ్యంబునగు విశ్వమంతయు
మాయామయంబని మదిని విడిచి
భక్తి మద్భావనా భావితస్థితి నిరా
మయుడును నానందమయుడునగుచు

తే.గీ॥ నగుగుణాత్ముడు నిర్గుణుండనుచు గాని
యెంచి బాహ్యాంతరముల భావించునెవ్వ
డతడు లోకత్రయము విచిత్రాప్తి నెరపు
దవిలి నిజపాదరజముచే రవియుబోలె 261

ఆ.వె॥ ఇదియువేదసారమేకమోవిజ్ఞాన
మాగమాంతవేద్యుడైననేన
బతికితిని మదుక్తి భక్తినిగురు భక్తి
దెలియునతడు మోక్ష కలనగాంచు 262

కం॥ ఈరామగీత జదివిన
శ్రీరాముండగుచుభక్తి శీలతచే మ
త్సారూప్యమందు ననుచున్
శ్రీరాముడు బలికె ననుచు శివుడు వచించెన్ 263

వ॥ అని చెప్పిన నప్పార్వతియతి ప్రీతితో రఘుప్రవరుననంతర కథా ప్రపంచంబు జెప్పవేయని యడిగిన నప్పరమేశ్వరుండిట్టులనియె. 264

మ॥ ఒకనాడయ్యమునానదీ తటమునందొప్పారు నత్తాపస
ప్రకరంబుల్ లవణాసురోద్ధత భయభ్రాంతాత్ములై భార్గవా
ధికుడౌ నాచ్యవనుండు మున్నుగనునెంతే రామునిం లోకనా
యకునింజూడగ నందరేయభయదానాకాంక్షులై వచ్చినన్ 265

సీ॥ ఈరీతి నరుదెంచువారి కారఘువీరు
డతిభక్తిబహుపూజలాచరించి
మధురోక్తి బల్కునమ్మౌనులహర్షంబు
జెందజేయుచుమునిశ్రేష్ఠులార!
ననుమీరుగన వచ్చుటనునేను ధన్యుండ
నైతి మీయాగమనార్థమెద్ది
యొనరింతు దుష్కరంబునునైన భృత్యుండు
నైననాకాయర్థమానతిండు

తే.గీ॥ మతిదలపబ్రాహ్మణుండు దైవతమునాకు
ననిన రాముని వచనంబు విని ప్రమోద
భరితుడగుచును నతనితో బహుతపఃప్ర
భావభవనుడాచ్యవనుండు బలికె నిటుల 266

కం॥ మునుకృతయుగమున మధుడను
దనుజాధీశ్వరుడు గలడు ధర్మాత్ముడు స
ద్వినుతుడు దేవబ్రాహ్మణ
ఘన పూజారతుడు రామ! కలుషవిరామా! 267

తే॥గీ॥ ఆమధుని భక్తికిని మెచ్చి హరుడు వచ్చి
యధికమగు శూలమును దెచ్చి యతనికిచ్చి
దీనినెవ్వని వధియింపబూనె దట్టి
వానినీశూలమెవధించి వచ్చుననియె 268

తే॥గీ॥ అట్టిమధునకు కుంభీనసాఖ్యభార్య
రావణానుజగలదు తద్రమణి మొదలె
లవణుడను రాక్షసుడు దుష్టుడవుచువారు
దేవతాబ్రాహ్మణాది విద్వేషుడయ్యె 269

– శత్రుఘ్నుండులవణాసురుని వధించుట –

ఉ॥ ఆ లవణుండజేయుడు భయంకరుడై మము బాధజేయుచో
నోలినిటుల్ మిమున్ శరణమొందగవచ్చితిమన్న రాముడున్
జాలగ వారిజూచి భయసంగతిమానిజనుండు మీరునే
నాలవణున్ వధింతునని యంతట తమ్ములతోడ నిట్లనున్ 270

కం॥ ఈఋషుల కభయ మిచ్చితి
మీరలొకరు దనుజుదునుమ మేకొనుడనుచో
నారామునిగని భరతుడు
నారాక్షసుడే వధింతుననియె వినతుడై 271

మ॥ అనశత్రుఘ్నుడు మ్రొక్కి రామునకు మీరారణ్య వాసార్థమై
జననిచ్చో భరతుండు మౌనిగతి కష్టంబంది సౌమిత్రియున్
వనవాసంబునవచ్చి కష్టపడెదేవా! మీదయంజేసి నే
ననిద్రుంతున్ లవణుం దురాత్ముననునాజ్ఞాపింపుమా! రాఘువా !272

సీ॥ అనిన శత్రుఘ్నుని నంకపీఠిక జేర్చి
వినయాప్తినతడుగైకొనకయున్న
సంభార చయము లక్ష్మణు చేత దెప్పించి
రాముడు మధురాధిరాజ్యమునకు
స్నేహంబుచే నభిషేకంబుగావించి
యతనికినొక్కదివ్యాస్త్రమిచ్చి
యిదిధాతయొసగె నాకీశరంబున జగ
ద్రోహుని లవణుని ద్రుంచుమీవు

తే.గీ॥ లవణుడు నభేద్యమైన శూలంబునింట
నుంచి బూజించి యడవికినొకడపోయి
ప్రాణి కోటివధించి తద్భక్షణార్థ
మటనిలిచివాడు రాకుండు నంతలోన 273

కం॥ పురివాకిట నిలువుధను
ర్వరముంగొని నీవువాడు వచ్చికుపితుడై
దురముననీచే హతుడగు
కరమున శూలంబులేని కతమునవత్సా! 274

కం॥ ఆవిధివధించి లవణుం
వావిరితన్మధువనంబుననను మధురాఖ్యం
గావించి నగరమెచ్చట
నీవుమదీయాజ్ఞ వలననిలువుముబతివై 275

వ॥ అదియునుంగాక పంచసహస్రహయంబులును, తదర్ధంబులగు రథంబులును, షట్శతసంఖ్యాకంబులగు గజంబులును, నయుతత్రయం బులగు భటచయంబును, నీవెనువెంటంబంచెద, నీసైన్యంబునకన్న మున్నుగా నీవుజని యసురుంజయింపుమని దీవించి మూర్ధా ఘ్రాణంబు జేసి రఘుసత్తముండు బంచిన శత్రుఘ్నుండును మునియుతుండై కతిపయప్రయాణంబుల దన్మధువనంబుజేరి వాడరణ్యం బునకుంజని యుండనొక్కరుండ ధనుర్ధరుండై తత్పుర ద్వారంబున వసించునవసరంబున. 276

ఉ॥ ఆలవణుండపారముగ బ్రాణులద్రుంచి భుజించి వెండియున్
జాలగదెచ్చి వచ్చి రఘుసత్తమునింగని యోనరాధమా!
యేలయిటుండె దీవు గ్రసియించెదనిన్నిదె నన్నెరుంగవా
నేలవణాసురుండనని నిర్భయతంగవయంగవచ్చినన్ 277

వ॥ అత్తరి శత్రుఘ్నుండును దైత్యాధమా! నేను రఘుసత్తముననుజుండ, నిన్ను నిర్జింప వచ్చితినని తర్జనోక్తుల భర్జింప, వాడును నరమాత్రుం డని క్రోధంబున నిజాయుధంబు దెచ్చుటకేనిలక్షింపక నతనితో మీయన్నయారాక్షసుండు వృక్షసంఘంబులు వ్రేసియు, గిరిశృంగం బులు ద్రోసియు, మరియు మహోపలంబుల పరంపరలు బరగించి నంగినిసి భరతకనిష్ఠుండు నిష్ఠురకాండంబుల వానినన్నింటిని ఖండించి, దానిమీద ననేక ప్రదరంబులు గప్పిన, నప్పలాదుండు సాహసంబున మహానగంబున నతని వక్షంబు వీక్షించి వైచిన లక్ష్మణానుజుండు మూర్ఛిల్లిన మునిసమూహంబు హాహారవంబుల దెరలె, నప్పుడు దెప్పిరి రాఘవానుజుం డ మోఘంబగు నగ్రజదత్తం బగు దివ్యాస్త్రంబు బ్రయోగించిన నమ్మహాబాణంబు ప్రళయ కాలానల జ్వాలాభీలంబై వచ్చి, యారాక్షస హృదయంబు బ్రచ్చి, రసాతలంబును జొచ్చి, మరలి యతని పొదింజేరె నయ్యసుర శూలంబు హరుని కడకుంజనియె నివ్విధంబున. 278

కం॥ బవరంబున నిట్లు రఘు
ప్రవరుడు శత్రుఘ్నుడవనిబడవైచెఖల
ప్రవణున్‌జిత హరియమవై
శ్రవణున్ దిక్తటవిభేది రవణున్‌లవణున్ 279

వ॥ అప్పుడు 280

కం॥ మధురయశుడు శత్రుఘ్నుడు
మధుపుత్రున్ దైత్యుద్రుంచి మధువనసీమన్
మధురాదేశము మనిచెన్
మధురిపుడగు రాముసూక్తి మర్యాదాప్తిన్ 281

వ॥ అంతనిక్కడ 282

సీ॥ వైదేహియవ్వేళ వాల్మీకియాశ్రమ
స్థలమున సుతులనిద్దరనుగనియె
నబ్బాలుర కొనర్చె నగ్రజక్రమమున
నామౌని కుశలవ నామములను
గృపనంతవానికి నుపనయనంబువే
దాదివిద్యారూఢి నతడునెరపె
వేదోపబృంహణ విధికిగాపూర్వంబు
శివుడు పార్వతికిగాజెప్పినట్టి

తే.గీ॥ యాది కావ్యంబునైన రామాయణంబు
సర్వము విపంచిగా గానపూర్వకముగ
పాఠమొనరించెమునియునబ్బాలురకును
వారునది యెల్ల జదివిరి వరుసనంత 283

మ॥ స్వరసంపన్నుల నాశ్వినేయుల బలెన్ సౌందర్య సంపూర్ణులున్
వరతంత్రీలయ గానతానయుతులై వారెల్లచోనవ్వనిన్
సరవిన్మోమనుల సన్నిధిం జదివినం సంభావితాశ్చర్యులై
వరుసన్ దమ్మునులెల్ల నిట్లనిరి విశ్వాసప్రసాదోక్తులన్ 284

కం॥ కృపమెచ్చి కుశాస్తరణము
జపమాలయుగలశమేణ చర్మముదండం
బుపవీత ముత్తరీయం
బపరిమిత ప్రీతినిచ్చిరబ్బాలురకున్ 285

కం॥ ఈకరణి కుశీలవులగు
నాకుశలవులఖిలమునులు హర్షింపగ వా
ల్మీకిముని యాశ్రమంబున
నేకాంతముగాగ నుండి రెంతయు సుఖులై 286

వ॥ మరియు 287

సీ॥ అత్తరి నొక్కనాడట తపస్విసహాయ
గోష్ఠినుంటకుశుండు కుశలబుద్ధి
శాంతుని యోగవిశ్రాంతుని వాల్మీకి
మునికాంతునేకాంతమునను జేరి
దేవసుజ్ఞానము నేవిన వలతుస
ర్వము సూక్ష్మగతిదెల్పవలయు మీరు
భవబంధమేరీతి ప్రభవించు దేహికి
తద్విమోక్షణమేవిధమునగలుగు
తే.గీ॥ నానతిమ్మిది శిష్యునకనిన మునియు
వినుము దెల్పెద సంక్షేప మొననుబంధ
మోక్షములరీతి సాధనములను దీని
నధిగమింప జీవన్ముక్తి నందె దీవు 288

ఉ॥ దేహములేనియాత్మకును దేహియనంగను దేహమే మహా
గేహమునయ్యెనందు బరికింపనహంకృతి మంత్రియయ్యెన
ద్దేహికి నాత్మకల్పిత వతిన్ దదహంకృతి దేహగేహ సం
దోహ కృతాభిమాన విధముంగలుగుంగతి బూన్చె దేహికిన్ 289

వ॥ మరియును రాజుచేత కల్పితుండగు మంత్రి తానుచేసిన పుణ్య పాపమూలంబులగు కృత్యాకృత్యంబు లన్నియు నిర్మలుండగు రాజునందారోపింపంజేయు గతినాత్మకల్పితంబగు నహంకారం బాత్మతో గలిసినట్లుండి నిజచేష్టితంబగు సమస్తంబాత్మయందారోపింపం జేసి యాత్ముండు సంకల్పాది గుణావృతుండై పుత్ర దారాగృహాది ప్రపంచంబునంతయు సంకల్పించి తదీయ వ్యథలంబడునట్లు దోచునని మరియును. 290

తే॥గీ॥ అయ్యహంకారములకు దేహములు మూడు
అధమముత్తమమను మధ్యమాను గతిని
తమముసత్వంబు రజమనదనరుచుండు
కననివియె లోకసంస్థితికారణములు 291

కం॥ వినుముతమస్సం కల్పం
బున తామస చేష్టనతి తమోభూతుండై
యనయము క్రిమికీటాదిక
జననంబుల జెందుచుండు జంతువువత్సా! 292

తే॥గీ॥ సత్వసంకల్పమునను విజ్ఞానధర్మ
సత్పరాయణుడైయతి సాత్వికమున
ఘనవివేకాప్తి జననంబుగనిగ్రమమున
మోక్షసాధన సుఖరూపమున వసించు 293

కం॥ సతత రజస్సంకల్పా
గతిచే వ్యవహారమున జగద్వర్తనుడై
సుతదారాదిక రంజన
మతియైసంచారమునను మరివర్తించున్ 294

వ॥ కావున 295

కం॥ వివిధములగు సంకల్పము
లవగతినాత్మగన నంతరాయములగుటన్
త్రివిధములగు సంకల్పము
లివివిడువగ వలయునాత్మనెననసెడి కొరకున్ 296

ఆ।వె।। విషయదృష్టులన్ని విలయించి నిలయించి
మనసుమనసుచేత మదిగురించి
వెలయులోనవిర్రవీగినసంకల్ప
మదినశింపజేయ నాత్మవెలుగు 297

మ।। ధరలోనన్ సురలోకమందుమరి పాతాళంబునందుండినా
వరుసన్వర్ష సహస్రముల్ దపము తీవ్రస్ఫూర్తిచే జేసినా
పరమాత్మున్ గనగా నుపాయమొకటిం బాటింపవేరున్నదే
గరమంతర్భహిరర్థ కల్పమగు సంకల్పంబు శాంతింపగన్ 298

కం।। అనుపాధికమతి పావన
మనుపమ సవికారమైన యాత్మసుఖంబున్
గనసంకల్పోపశమము
బనుపడుయత్నంబుజేయ పౌరుషరీతిన్ 299

తే।।గీ।। గముచు సంకల్పతంతుజాలములు దెగిన
నీప్రపంచపటస్ఫూర్తులేలజెడును
నట్టి సంకల్ప రహితుడై బ్రాప్తవస్తు
తృప్తుడగువాడు నాత్మ సౌఖ్యాప్తిగాంచు 300

కం।। ఈసరణి వికల్పంబులు
బాసియు పరమార్థసిద్ధి పరుడు సుషుప్తి
శ్రీసుఖియగు వానింబలె
భాసితుడై వెలయునాత్మ పదసౌఖ్యమునన్ 301

కం।। అనివాల్మీకియు దెలిపిన
వినిశుకుడు త్రిశుద్ధినపుడు విగతభ్రముడై
గన జీవన్ముక్తుండై
యనుగతినొనరింపుచుండె నఖిల క్రియలన్ 302

– కుశలవులు శ్రీరామసన్నిధానమందు రామాయణంబు గానంబు జేయుట –

సీ।। అంతనచ్చటరాముడశ్వమేధాదిక
యాగముల్ బహుదక్షిణాన్వితముగ
స్వర్ణమయాకృతి జానకి నొనరించి
శ్రీవైభవస్ఫూర్తి జేయుచుండ

నయ్యజ్ఞవాటికి నఖిలరాజర్షులు
ఋషులుపండితులును ఋత్విజులును
వరుస బ్రహ్మక్షత్ర వైశ్య శూద్రాదులు
నయ్యుత్సవముజూడ నరుగుదేర

తే.గీ॥ నపుడు రామాయణంబు బ్రేమాయనముగ
కుశలమతి గానమొనరించు కుశలవులను
రామకృతయజ్ఞ ఋషివాటి సీమమునకు
దోకొనుచువచ్చెబూని వాల్మీకమౌని 303

ఉ॥ వచ్చిన బాలురంగనియు వారికి నమ్మునియిట్టబల్కు మీ
రచ్చట నచ్చటన్మధురమౌనటు గానము జేయుచుండగా
నిచ్చట రాఘవుండు విననిచ్ఛయొనర్చినబాడి మెచ్చియే
మిచ్చిననవ్విభుండు గ్రహియింపక రమ్మని చెప్పె చెప్పినన్ 304

కం॥ పురవీధుల మునిజన చ
త్వరవీధుల నాపణముల తద్యాగపరీ
సరములకిద్ధర మధుర
స్వరములగానోత్సవంబు సలిపిరివారల్ 305

వ॥ అంతనిజవృత్తాంతంబగు రామాయణంబున పూర్వ పాఠవిధానం బుగా గాన సరణింరామాయణం బొనర్చుట వినిరఘూత్తముండు ప్రమోదాయత్త చిత్తుండై యధ్వరానంతరంబున సహోదరపురోహిత బంధుసచివాది సహితుండగుచు పండిత పౌరాణిక వైణికాది పరిజనంబులును పౌరజానపదంబులును యాగదర్శనాగతులగు సుగ్రీవాది వానరులను విభీషణాదిదానవులను రావించి సకల జనామోద సంధాయకులగు నగ్గాయకులం బ్రవేశింపంజేసి సభాంతరా సీనుండైయుండ నాసభాసదులందరుం రఘువీరుని యాకారంబును దత్కుమారుల యాకారంబులు ననిమేషదర్శనంబులంగని విస్మయ హర్షంబులు బెనంగొన మనంబుల. 306

ఉ॥ ఆకృతివల్ల దోచనగు నాకృతులుంబలె రామమూర్తి బ్ర
త్యాకృతి నీకుమారకుల యాకృతియున్నదిగాని వీరిలో
గాక విశేషమేమియును గన్పడదంచును విస్మయాప్తి నా
లోకనజేసియందరును లోకులు డెందముగందలింపగన్ 307

కం॥ మునివేషముదక్కగ రా
ముని వేషము వీరిదనుచు మునుకొని జనముల్
దనగతులగు వీడొ రా
ముని సుతులని బహువిధముగముదముదలిర్పన్ 308

కం॥ అనగానిట్లు జలింపక
గనగా చిత్రపటలిఖితగతి సర్వజనుల్
వినగాన మానుషస్థితి
ఘనగానము వినికి జేయగణగిరివారల్ 309

మ॥ శ్రవణానందకరంబు సుందరముగా షడ్జాదిసప్తస్వరా
ర్జవమున్ జాతిగతుల్ త్రికాలకలితస్థాన త్రయీపూర్ణ మా
ర్గవిధుల్ దోపగవల్లకీచతురతన్ రంజిల్ల గాంధర్వ సా
రవిధుల్ గానమొనర్చిరా కుశలవుల్ రామాయణాంబాసభన్ 310

వ॥ అంత మధురరసప్రధానంబగు నగ్గానం బివ్విధంబున నపరాహ్ణ పర్యంతంబుగా ప్రతిదినంబును సాంగంబుగా విని, రఘుకాంతుం డత్యంత సంతోషంబున భరతుంగని, యబ్బాలురకు దశసహస్ర సంఖ్యంబగు సువర్ణంబొసంగు మనిన, వారును మేము మహా వనసంచారులగు మహీసురవరుల మీయర్థంబు మాయదియ ఫలభోజనులమగువారి కిదేలయని గ్రహింపక వాల్మీకి సన్నిధికిం జనిన, రఘూత్తముండత్తనయులు సీతాపుత్రులుగా నెరింగి శత్రుఘ్ను సహితంబుగా హనుమత్సుషేణ విభీషణాంగదాదులంజీరి వారితో భగవంతుండును దేవసన్నిభుండును నగు వాల్మీకిముని సత్తముని సీతాయుక్తంబుగా దోడ్కొని తెండమ్మేదినీతనయ నపవాద భయంబున బరిత్యజించితిం గావున నీసభాస్థలంబున సత్యంబొనర్చిన సభికులెల్ల విగతకల్మషగా నెరుంగుదురు గాకయనిన వారలు దదాశ్చర్యంబులం జెందిరంత వారును వాల్మీకికడకుంజని రఘుప్రవరు వచన ప్రకారంబుజెప్పిన నప్పరమమునియును రఘూద్వహుహృదయంబు సర్వంబునుందెలసి యిద్దేవి రేపుప్రొద్దున సభామధ్యంబున శపథం బొనర్చుగాకయని మరియును. 311

కం॥ సతులకు పతియేపరదై
వతమగు నిజమగుట మీదువాక్యస్థితినీ
క్షితిసుతయొనర్చునన రఘు
పతికింజని చెప్పిరదియు పవనజ ముఖ్యుల్ 312

వ॥ అంత 313

కం॥ ఆముని వచనమువినియా
రాముడు రాజులను మౌని రాజులగని మీ
రీమెయి శపథముగని య
క్కోమలి శుభమశుభమెరిగికొనుడన నంతన్ 314

కం॥ భ్రాతలు పురజనపరజన
నేతలు మునిజనులు జనులు నిఖిలవనచరుల్
చాతుర్వర్ణము వచ్చిరి
కౌతుకమున తద్విధంబు గనుగొనువాంఛన్ 315

– సీతాదేవి భూమిలో ప్రవేశించుట –

సీ॥ అంతయావాల్మీకి యాకాంతదోకొని
మునుపుగాజన సీతమునికి వెనుక
సుతుల దోకొని బాష్పయుతయునై తలవాంచి
యంజలిఘటియించి యటకురాగ
వనజసంభవువెంటవచ్చు లక్ష్మినిబోలె
మునివెంట జనుసీతగను జనాళి
సాధువాదంబులు సందడింపగమౌని
సీతతో తత్సభాసీమకరిగి

తే.గీ॥ రఘువరునితోడ సీతధర్మవ్రతాఢ్య
జనమృషోక్తి మదాశ్రమ సరణిమీరు
మును విడువజేయనేదెచ్చి యునిచితిప్పు
డతివశపథంబొనర్ప మీరానతిండు 316

కం॥ మీరెరుగనిదే మీపతి
మీరెరుగరు మీదుమాట మీసుతులెసుమీ!
మీరీతి సుతులు రఘుకుల
వీరా! యమళజులు ఘనులు వీరాగ్రణులున్ 317

కం॥ నేనుప్రచేతసుపదియవ
సూనుడు ననృతంబు బలుక సుమ్మీ! యెన్నం
డేనియు నిబ్బాలురునీ
సూనులు నామాట నిజము సుమ్మా! రామా! 318

కం॥ జానకి దుష్టాత్మకు రా
లేనియు బహువర్షగణము లేజేయుతపో
ధీనంబగు నధిక ఫలం
బేనొందక పోదుగాక! యినకుల తిలకా! 319

సీ॥ అనిన వాల్మీకికిట్లను రాముడు మహాత్మ!
నీవుబల్కినమాట నిజముసుమ్ము!
నిష్కల్మషములైన నీవాక్యములచేత
నాకును నమ్మికైనదియెయైన
నింతినిష్కలుషయం చెరిగియు జనభీతి
నేనువీడితిక్షమియింపు మిదియు
నమరసన్నిధి సీతయాలంకలో సత్య
మిచ్చెగావున దెచ్చితింటికేను

తే.గీ॥ నాకు తనయులు నగుదురు నీకుశలవు
లిప్పటి జనాపవాదంబు దప్పిపోవ
శపథమున శుద్ధయైననీ జనకతనయ
నాదరించెద మౌనీంద్ర! యనిననంత 320

కం॥ ధాతపురస్సరముగ సుర
లాతరి రఘువరుని నిగ్రహంబును గనియున్
గౌతూహలసహితముగా
నాతతగతినరుగు దెంచిరందరుగుములై 321

వ॥ అంతనవ్విధంబున దివిజ మనుజదనుజ మునిజన వనచర బృందాదులగు నందరు నానందంబులం గ్రందుకొని సందడింపుచున్ దర్శింప నప్పుడప్పరమ పతివ్రతయగు జనక సుతయును గౌశేయ వాసినియును నుత్తరాభిముఖియును నధోదృష్టియునునై తత్సభా మధ్యంబున కేతెంచి యంజలి ఘటించి దేవబ్రాహ్మణులకు నమస్క రించి రామదేవుని పదద్వయంబు హృదయంబున భజించి యద్దేవి నేనురామునికన్న నన్యుని మనంబున నేనియుం దలంచకుందునేని మదీయ పాతివ్రత్య శుద్ధ భావంబున నిద్ధరాదేవి మత్ప్రవేశంబునకు మార్గంబొసంగుంగాకయని శపథంబుగాబలికిన నవ్వాక్యంబు వెంటన మింటంబ్రతిధ్వానంబు లెసంగ దిగ్భాగంబులదర సభాసదు లెల్లం జెదర పటపటధ్వానంబున నద్ధరణీమధ్యంబు పాతాళపర్యం తంబుగా గ్రక్కునంబగిలి మహావివరంబు దోచినం దోడనేమహాదేవి యరుదెంచి దుహితృస్నేహంబునం గుశల ప్రశ్నంబు గావించి యవ్వైదేహినిం బాహువులంగ్రహించి దివ్యదేహప్రభా సాంద్రులగు నాగేంద్రులు వహించి తెచ్చిన భాస్కర విభాభాసమానంబగు హేమరత్న సింహాసనమందుంచి దత్సతిందోకొని రసాతలంబునకుం బ్రవేశించె నిట్లు బ్రవేశించు సీతాదేవిమీద నమరులు పుష్పవర్షంబులు గురియించిరి దేవదుందుభులు మొరయించిరి భూనభస్థితులగు సురనర వానరాదులుందక్కిన స్థావరజంగంబులును హాహాకార పూర్వకంబులగు సాధువాదంబుల నద్దేవినత్యాశ్చర్యంబున బహు విధంబులం బ్రశంసించి రయయ్యవసరంబున. 322

ఉ॥ కొందరు చింతనొందుచును కొందరుధ్యానమొనర్చుచున్ మరిన్
గొందరు రామునింగనుచు గొందరు సీతనుజూచుచుండిరి
ట్లందు ముహూర్తమాత్రముగ నజ్జనులంద రచేతన స్థితిన్
జెందిరి మోహితాత్ములయి సీతరసాతలమందు జొచ్చినన్ 323

ఉ॥ ఆయెడరాఘవుండు సకలాత్ముడు సర్వమెరింగి భావికా
ర్యాయతి చేనెరుంగ నటులంగనకై బహుదుఃఖితాత్ముడై
తోయజగర్భమౌనితతితోప్రతిబోధితుడౌచు స్వప్నబ
ద్ధాయతి రీతిజేసె తదనంతరకృత్యము సర్వమంతయున్ 324

తే॥గీ॥ మఖములకు వచ్చుమునులను మనుజ పతుల
సకలజనుల ఋత్విజులను సంభ్రమమున
ధనమణిశ్రేణి సంతృప్తి దార్చిబనిచి
పుత్రులగ్రహించి రాముండు బురికినరిగి 325

కం॥ అదియాదిగనిస్పృహుడై
సదనాదిక సకలభోగ సమితివిరతుడై
మదినాత్మచింత జేయుచు
ముదముననేకాంత దేశమునవసియించెన్ 326

- శ్రీరాముడు కౌసల్యకు జ్ఞానోపదేశంబు జేయుట -

సీ॥ ఈమాడ్కివసియించు రామునాత్మారాము
హరియంచునెంచి యందరుగు దెంచి
తల్లి కౌసల్యసంతత భక్తి హితసూక్తి
నదిఘటించి బ్రసన్ననతని గాంచి
రామనీవాద్యంత రహితుండ వీశుండ
వానందనిధివి పరాత్ముడవును
బూర్ణుండవు పురాణపురుషుండవేజేయు
నురుపుణ్య పదవినాకొదవి తీవు

తే.గీ॥ నికటమయ్యెనంతిమ దశనేటికైన
సడలదజ్ఞానభవము సంసారబంధ
మీభవమడంచు విజ్ఞాన మీవునాకు
తెలియ సంక్షేపముగను బోధింపు మీశ! 327

కం॥ అనిమదినిర్వేదింపుచు
ననుముదుసలితల్లిగాంచి యతివత్సలుడై
జననీ! నీవనుగతి స
జ్జననీతియె యనుచునతడు జననికిననియెన్ 328

తే॥గీ॥ మోక్షసాధకములుగాగ మూడు మార్గ
ములువచించితి నిజముగా మున్ననేను
కర్మవిజ్ఞానభక్తి యోగంబులనగ
గను సులభమిందు భక్తి యోగంబుజనని! 329

తే.గీ॥ కర్మయోగంబుపూజాది కర్మవిధియు
జ్ఞానయోగంబునంతరాత్మాను భవము
భక్తియోగంబు తదధీనభావవృత్తి
గ్రమవశాప్తినిమూడు మోక్షంబెసేయు 330

కం॥ ఆభక్తిరజస్సత్వ త
మోభేదంబుల నెసంగుమూడు విధములై
స్వాభావికమేగుణమం
దేభక్తునకాగుణంబె నేర్పడుభక్తిన్ 331

తే॥గీ॥ దంభమాత్సర్య హింసావిధములు దలచి
భేదదృష్టిని సంరంభవాదియగుచు
భక్తినెవ్వాడు జేయు నాభక్తుడెలమి
తామసుండని జెప్పంగదగునుమిగుల 332

కం॥ ఫల కాంక్షియు భోగార్థియు
నలధనమును యశముగోరియటనన్నర్చా
దుల భేదబుద్ధి పూజల
సొలపెడు భక్తుండు రాజసుండగునరయన్ 333

కం॥ పరమార్థబుద్ధిగానీ,
గరిమను గర్మహరబుద్ధి గానీ, భేదా
దరబుద్ధి గాని, భక్తిన్
సరవినవశ్యముగజేయు సాత్వికుడెలమిన్ 334

చం॥ దవిలియనంతసద్గుణ నిధానమునై తగునట్టి నాగుణ
శ్రవణము చేత వారినిధి సంగతి గంగజలంబు గూడిన
ట్లవిహితమై తనర్చు హృదయంబున భేదము లేకయుండునా
ప్రవిమలభక్తుభక్తియది బాయకనిర్గుణ లక్షణంబగున్ 335

శా॥ ఆలీలంవిహితంబు నవ్యవహితంబైబోల్చు మద్భక్తి దా
సాలోక్యంబు సమీపసంగతియునున్ సారూప్య సాయుజ్యముల్
బాళింజేయగ జాలనొల్లడవి మద్భక్తుండు నాదైన సే
వాలోలత్వము దక్కనొక్కపదవిన్ వాంఛింపడన్యార్థమున్ 336

కం॥ ఇదిభక్తియోగమున కా
స్పదమగు నత్యంతయోగపదమిది గనువా
డుదితమతి గుణత్రయముం
బదపడి విదళించి గాంచు మద్భావంబున్ 337

వ॥ మరియు నధికకామ పరిత్యాగంబును, స్వధర్మానుసరణంబును, సత్కర్మయోగా చరణంబును, హింసార్జనంబును, మద్దర్శన స్మృతిస్తుతి పూజావందనంబులును, సకలభూతంబులయందు మద్భావన యును, నసత్యనివర్తనంబును, బహుమాన దృష్టియు, దుఃఖితుల యందు కరుణయు, సమానులయంద మైత్రియు, యమనియమాది నిషేవణంబునుం, వేదాంత వాక్యాదరణంబును, మదీయ నామాను కీర్తనంబును, సత్సంగంబును, ఋజుభావంబును, నహంకార వారణంబును, నస్మదీయ ధర్మకాంక్షయు, మద్గుణ శ్రవణంబునుం, గలుగు పరిశుద్ధాంతఃకరణులగు జనంబులు యోగాభ్యాస నిరతంబగు చిత్తంబున, వాయు వశంబునంజేసి, సుగంధంబు నిజాశ్రయంబు విడిచి ఘ్రాణంబునుంజెందు చందంబున, శీఘ్రంబ నాయంద జెందుదురని చెప్పి, వెండియు రఘువల్లభుండు తల్లికినిట్ల నియె. 338

కం॥ సకలప్రాణులలోపల
నొకగతినేకాత్మ మూర్తినుండుదు నది పొం
దిక నెరుగక మూఢాత్మకు
డకటా! నను బాహ్యగతుడయను గేవలమున్ 339

కం॥ భూతావహమూనినవా
డేతాదృశవస్తుతతుల నెన్నిటనైనా
మాతా! ననుబూజించిన
బ్రీతాత్ముడగాను నాకు బ్రియమిడదదియున్ 340

తే॥గీ॥ ఎంతగాలంబు సర్వభూతాంతరాత్ము
డనుచునన్ను నెరుంగలేడంత గాల

మర్చగావింపనగు ప్రతిమాదులందు
దేవునిగ నన్ను తల్లి! సాధ్వీమతల్లి! 341

కం॥ ఎవ్వాడు పరాత్మస్థితి
నవ్వారిగ భేదదృష్టినలముచు గననౌ
నవ్వానికి మృత్యువుభయ
మవ్వా! గావించు సందియము లేదిందున్ 342

ఉ॥ కానవిభిన్న రూపముల గన్పడు భూతములందు నన్నిటన్
మానుగనేక రూపముగనన్నునుమానము చేత మైత్రిచే
జ్ఞానముచే నభేదమతి సాధుజనుల్‌గని పూజసల్పుచున్
మానసమందు భూతతతిమన్నన చేత నెరుంగగానగున్ 343

కం॥ వినుజీవరూపసంస్థితు
ననుగననగు శుద్ధచేతనంబుగ నెపుడున్
జననీ! యెచ్చట నేనియు
మొనసి పరాత్మ ప్రభేదమునుమానదగున్ 344

ఆ॥వె॥ వినుము! భక్తియోగమును జ్ఞానయోగంబు
దెలిపితేను జనని! దీనియందు
నొక్కయోగనిష్ఠనూనియైననుశాంతి
నొందిపరమగతికి జెందు జనము 345

కం॥ కావునను భక్తియోగము
గావింపుచు సకలహృదయగతుడని గానీ
కేవలసుతుడని గానీ
భావించిన నన్ను ముక్తిబడయుదు తల్లీ! 346

కం॥ అనిరాముడానతిచ్చిన
విని తధ్యానానుమోదవిధిభవబంధం
బునవెడలిగుణత్రయముల
పనిసడలియు నామెజెందె పరమపదంబున్ 347

ఆ॥వె॥ కైకయంతరామ కధితయోగశ్రద్ధ
శాంతియుక్తిభక్తి స్వర్గముననను
భర్తతోసుఖాప్తి బరిగెసుమిత్రయు
నట్ల యయ్యెరామునందుభక్తి 348

సీ॥ అంతటగొన్నినాళ్ళరుగంగ తనమేన
మామయుధాజిత్తు ప్రేమమీర
జగములబాధించు శైలూషపుత్రులై
మొనయు గంధర్వుల మూడుగోట్ల
ననిజయింపగ బిల్వనంపిన రామాజ్ఞ
భరతుండు శూరుండు బలముతోడ
నరిగివారలతోడననికి గడంగిన
వారలు భీతులై వచ్చిసొచ్చి

తే.గీ॥ శస్త్రముల నస్త్రముల తీవ్ర సరణిధరణి
యదృవదలపడి చలపడి యడరిదొడరి
మారిబారిన దారిన బోరి మీరి
బలము చీకాకుబరుపగా భరతుడలిగి 349

ఉ॥ దుర్వహసర్వశత్రుహర ధూర్వహుడై భరతుండు భూరిదో
ర్గర్వముచే నమోఘమగు కాలమయాస్త్రమునేసిగ్రోధమున్
బర్వకృతాంతుదారినొకబారిన ఖర్వుల మూడుగోట్ల గం
ధర్వుల దుష్టగర్వుల నుదగ్రరణోర్వుల గూల్చెనంతటన్ 350

తే॥గీ॥ భరతుడట్టి గంధర్వు సంపత్సమృద్ధి
నలరుగాంధార దేశమందధిపతులుగ
సుతుల బుష్కర బుష్కరావతిని తక్షు
తక్షశిలనుంచి రామునొద్దకును జనియె 351

ఉ॥ అంతట బ్రీతితో రఘుకులాగ్రణి లక్ష్మణుగాంచి పశ్చిమా
శాంతమునందు మల్లులు దురాత్మకులుందురువారి ద్రుంచిత
త్ర్వాంతధరిత్రి నీసుతుల భర్తలజేయుమటన్న లక్ష్మణుం
డెంతయునేగి శూరుల జయించెను మల్లుల క్రూరభల్లులన్ 352

- యముడు మౌనివేషంబున రామసన్నిధానంబునకు వచ్చుట -

ఆ॥వె॥ అంతనంగదీయ మనుపురినంగదు
జంద్రవక్త్రపురిని జంద్రకేతు
సుతుల బతులజేసి శూరుల సౌమిత్రి
జేరిరామమైత్రి సేవనుండె 353

ఉ॥ అంతననేక కాలమగునంతట కాలుడు మౌనివేషియై
యెంతయుధార్మిక ప్రవరునీశ్వరువిశ్వవిభున్ రఘుక్షమా

కాంతుహరింబరాత్ముగనగా జనిరాజగృహాంగణాంతర
ప్రాంతమునందు రాజ్యపదరక్షణు లక్ష్మణు గాంచియిట్లనున్ 354

వ॥ మహాత్మా! నేనతిగతుండను మునిసత్తముండు బుత్తెంచిన దూతనొక్క విజ్ఞాప నార్థంబు రఘూత్తముని దర్శింప వచ్చితి నప్పురుషోత్తము నకుంజెప్పుమనిన సౌమిత్రి సత్వరంబునతనితో మునిపుంగవుని నాగమనంబెరుంగించిన నవ్విభుండత్తాపసవరున్ సత్కార పూర్వకం బునందోడి తెమ్మన లక్ష్మణుండునుం దదనుమతంబునం బ్రశేశించి పంజేసిన నత్తపస్విని ప్రత్యుత్థానాభి వందనంబుల రావించి విద్యుక్తం బుగా బూజించి యుచిత పీఠంబుననుంచి స్వాగతంబు గావించిన నమ్మునీంద్రుండు సింహాసనా సీనుండును నిజతేజోవిరాజమానుం డునునగు రఘుసూనుంగాంచి దీవించి కుశలాచరణంబొనరించి రఘువీరుండు సంతసించి భవదాగమన కార్యంబెయ్యది యనిన మునివర్యుండిట్లనియె. 355

కం॥ మనకును రహస్యమాడగ
పనిగలదిద్దరమె దక్క పరుడొక డవియున్
వినినం గనిన నవశ్యం
బనఘా! నీచేత వధ్యుడగుగాకతడున్ 356

చం॥ అననగుగాకయంచు విభుడట్టి ప్రతిజ్ఞ యొనర్చి లక్ష్మణుం
గనిమునిసూక్తి నేప్రతిన గైకొనినాడ రహస్యవేళ వ
చ్చిన నతనిన్వధింతునని జేరికనెవ్వరు రాకయుండగా
గనుగొనియప్రమత్తతను గాచుకనుండుము నీవువాకిటన్ 357

తే॥గీ॥ అనుచు లక్ష్మణు నియమించి మునినిగాంచి
యనఘ! నెవ్వారు బనుపనేయదివచింప
వచ్చితామాట యేకాంతవాసమౌట
దెలుపుమన బూని నతనితో బలికె మౌని 358

ఉ॥ కాలుడ సర్వసంహరణ కారుడనేమును నీకు మాయకున్
బోలగ సంగమంబుననుబుట్టితి నీదగుపూర్వపుత్రుడన్
మేలుగ బ్రహ్మపంపునను మిమ్ముగనుంగొన వచ్చినాడ ద
న్మూలము జెప్పెదన్ సకలమున్వినుమా! రఘువంశసత్తమా! 359

సీ॥ దేవ! దేవర్షివందితుడును భగవంతు
డగుధాత నీతోడననియెనిట్లు
జగములన్నియునుపసంహార మొనరించి
నీవొక్కడవెమున్ను నిలిచితీశ!
కూడి మాయాభార్యతోడి సంగతినుంచి
కాలరూపుని పుత్రుగాగగాంచి

యంత భోగీంద్రు ననంతు జలేశయు
జేరిశేషునిమాయచే సృజించి

తే.గీ॥ బలమదాధ్యుల మధుకైటభుల వధించి
వారిమేదోస్థుల సశైల వసుధజేసి
ననుప్రజానాధునరుణాభనాభి పద్మ
సీమనొదవించి సకలమిచ్చితివి దనకు 360

కం॥ ఆనేనుసకల భారము
బోనిడి నాబలమడంప భూతములెల్లన్
వానివలన ననుబ్రోవగ
దీనావనవచ్చి మిమ్ము ధృతి శరణంటిన్ 361

తే॥గీ॥ అనిన మును కశ్యపునకీవు జననమంది
విష్ణుడవు వామనాకృతి వృద్ధిజెంది
ప్రజలను హరించుదానవ ప్రతతి ద్రుంచి
భూభరమడంచి జగముల బ్రోచితీశ! 362

వ॥ మరియునిప్పుడు రఘుప్రవరా! సకలప్రజల బాధించు దశవదను వధార్థంబు మర్త్యలోకంబునకేతెంచితి విక్కడి కార్యంబు సర్వంబును నిర్వర్తించితి విందును నేకాదశ సహస్రవర్షంబులు సమగ్రంబయ్యె పూర్వంబున సుపర్వుల సన్నిధింజేసి నరకలోకనివాస సమయంబు సాంగంబయ్యె మానుష్యంబున నాయుష్యంబు బూర్ణంబయ్యెం గాననిక్కాలంబున కాలుండు తాపసరూపంబున మీసమీపంబున నెరింగింపవచ్చెనింకను రాజ్యంబొనర్పనిచ్ఛయగునేని తద్విదంబు గైకొను మదింగాక దేవలోకాగమన బుద్ధియె సిద్ధంబగునేని యద్దేవతలు జగద్విభుండవగు నీతోడసనాథులై నిర్భయులగుదురని విధాత విన్నవించెనన్న కాలభాషితంబగు పితామహవచనంబు వినినవ్వి యవ్విష్ణుండగు రావణాంతకుం డయ్యంతకునకిట్లనియె. 363

కం॥ విననయ్యెన్నీ వాక్యము
గననయ్యెన్నాకభీష్ట కరముగనిదియున్
వినునీవచ్చుట మదిముద
మునహెచ్చుటగాదె గదనమునకున్ బుత్రా! 364

ఉ॥ లోకహితార్థమేను నరలోకమునందవతారమందితిన్
నీకుశుభంబుగల్గు మునునేనిట వచ్చితినందజేరెదన్
జేకురెనాకు సర్వహితసిద్ధియులేదు విచారమేమినే
డాకమలాస నోక్తియును నట్టిదయట్టిదనాకభీష్టమున్ 365

కం॥ నాసేవకులగు సురలకు
నీసకలార్థములయందు నేనుండదగున్
వాసిగమాయాగతినని
యాసంవర్తియును రాముడంతర్యోక్తిన్ 366

కం॥ అనివారుగోప్యమాడగ
ననివార్యుండత్రిపుత్రుడగుదుర్వాసుం
డనుముని వచ్చి గృహాంగణ
మున లక్ష్మణు గూర్చి తీక్ష్ణముగ నిట్లనియెన్ 367

- దుర్వాసుండు రామదర్శనార్థమై వచ్చుట -

ఉ॥ రాముని గాంచజేయవెసరమ్ము భరమ్మగు కార్యసత్వరం
బీమెయి మాకుగల్గుననినిద్ధ హుతాశన ధామునిన్ముని
గ్రామణినంత లక్ష్మణుడు గన్గొని యిట్లను కార్యమేమియా
రాముని చేతనేనె సుకరంబుగ జేసెద మీయభీష్టమున్ 368

వ॥ అదిగాదంటివేని 369

కం॥ రాముడు కార్యాంతరధీ
వ్యామగ్నత బూనియున్నవాడు ముహూర్తం
బోమునివర నిలువుండన
నామునిసౌమిత్రి కనియెనతికుపితుండై 370

కం॥ ఈక్షణమున రఘువంశా
ధ్యక్షునిగనజేయవేని తద్విభు కులదే
శక్షితి సహితముగ దపో
దక్షతభస్మంబొనర్తు తథ్యంబనియెన్ 371

చం॥ అనవిని ఘోర శాపయుతమమ్ముని వాక్యమునాలకించి చిం
త నెనసినాకు నొక్కనికెనాశము మేలగుగాదె సర్వనా
శనమగు కంటెయంచు ధృతిసంగతి లక్ష్మణుడాత్మనెంచిత
న్ముని వచనంబురామునకునుం వచియించగనిశ్చితాత్ముడై 372

వ॥ అంతమంతనంబున రఘుకాంతుని సన్నిధికింజని సుమిత్రా పుత్రుండు వినయయుక్తుండై దుర్వాసు నాగమనంబు జెప్పిన నప్పుడ యంత కుంభోవంబంచి రఘూత్తముడు సత్వరంబున నయ్యత్రి పుత్రునిం దర్శించి నమస్కరించి పూజించి కుశలయోగంబుగావించి యతనితో మీకెయ్యది కార్యంబొనరించెద వచియింపుడనిన నత్తపస్వియునేను సహస్ర వర్షంబులుపవసించితి నేడు వ్రతసమాపనంబునకుగా

నుచిత భోజనంబు నిశ్చయించి వచ్చితినని బ్రియంబున నవ్విభుండు శుభ సంపన్నంబును నమృతరూపోపపన్నంబునునగు నన్నంబుబెట్టించిన భుజియించి సంతుష్టున్‌గాంచి యాశీర్వదించి దూర్వాసుండు వెండి యునిజాశ్రమం బునకుం జనియెనివ్విధంబున. 373

సీ॥ అంతనారఘుకాంతుడంతక భాషితం
బంతయు దలపోసి చింతజేసి
విహ్వలహృదయుండు వికలుడు దుఃఖితా
త్ముడు దీనుడునునథోముఖుడునగుచు
మాటాడగాలేక మదిలక్ష్మణుని హత
ప్రాయుగానెంచియూరక వసింప
నీవిధిశోకంబుగావించి స్నేహబం
ధనముగర్వించి చింతను ఘటించి

తే.గీ॥ యేమిదోచకయున్న భూమీశుగాంచి
వీకసౌమిత్రియిట్లను నాకు గాగ
విడువుతాపంబునన్నుబో విడువుమధిప!
కాలగతిమున్ను నిట్టిదేకాదెరామ! 374

కం॥ నీవుప్రతిజ్ఞంబానిన
నావల నరకంబునాకునగు నటుగానన్
నావలన బ్రీతిగలిగిన
బోవిడువుము నను నధర్మమున్ జొరకుండన్ 375

వ॥ అనినలక్ష్మణువచనంబువిని వికలహృదయుండై రఘూద్వహుండు వశిష్ఠప్రభృతులగు మంత్రి పురోహితులను సకలజనతతులను రావించి వారితో దూర్వాసునాగమనంబును ధర్మదేవుని వచనంబును నిజప్రతిజ్ఞారచనంబును వచియించిన వారలందరు వినయకృతాంజ లులై ధర్మాత్ముండగు రఘూత్తమునితో మహాత్మా! భూభారహరివగు నీచేత నింతయుంబూర్వనిర్దిష్టంబగు విజ్ఞాన చక్షుండవగు నీకు లక్ష్మణునితో వియోగంబగుట విజ్ఞాతంబేగావున సత్వరంబున సౌమిత్రిన్ బరిత్యజింపుము ప్రతిజ్ఞంద్యజియింపకుము నీవు బ్రతిజ్ఞంబాసిన ధర్మంబునిష్ఠంబగు ధర్మంబు నశియించిన త్రైలోక్యంబు నశియించు నీవు త్రిలోకనాథుండవగుట లక్ష్మణునొక్కని త్యజించి త్రైలోక్య లక్షణంబొనర్పు మనిన ధర్మార్థసహితంబును ననిందితంబును నగు తద్భాషితంబువిని యోగీశ్వరేశ్వరుండగు రఘువరుండు సభామధ్యంబున సౌమిత్రి బరిరంభించి ధర్మం బవలంబించి యతనితోనిట్లనియె. 376

- లక్ష్మణుండు శ్రీవైకుంఠంబునకు వేంచేయుట -

తే॥గీ॥ నీవుజనుమింక లక్ష్మణ! నీయథేచ్ఛ
లోకములధర్మలోపంబు గాకయుండ
వధమునైన బరిత్యాగ విధమునైన
బుధుల కీరెండు గననొక్క విధముగాదె! 377

చం॥ అనిరఘుభర్త బల్కవినియవ్విభుబాయుట శోకయుక్తుడై
గనిప్రణమిల్లి రామునకు గ్రక్కున నింటికి వచ్చియంతటన్
జనిసరయూతటంబునకు సాంజలియై జలమున్ స్పృశించి య
య్యనఘుడు లక్ష్మణుండు శుచియై గుశపీఠిసుఖోపవిష్టుడై 378

సీ॥ ప్రాణంబుదెచ్చియపానుని గూర్చియ
పానుని ప్రాణంబు నందు సేర్చి
యాధారమాదియొనారు చక్రంబుల
గ్రమత నొందించి యూర్ధ్వమున జొనిపి
మొనయు నయ్యాజ్ఞేయమున నవధానాప్తి
దృఙ్మనంబులతోడ దెచ్చినిలిపి
మూసినవద్వారములు జాలనియమించి
తనయంత బ్రహ్మరంధ్రమున నుంచి

తే.గీ॥ యక్షరంబు పరబ్రహ్మమద్వయంబు
నైన నిజవాసుదేవతత్త్వానుభవము
పరమధామంబునైతగు పదమునాత్మ
చేత సౌమిత్రి ధ్యానంబుజేసి నిలిచె 379

కం॥ ఈరీతివాయురోధ స
మారతు సౌమిత్రి గాంచియగ్ని సహితులై
యాబుషులు సురలునందరు
నారయనుతిజేసి గురిసిరట సుమ వృష్టిన్ 380

ఆ.వె॥ అపుడదృశ్యుడైన యాలక్ష్మణుసదేహు
గొనుచు శక్రముఖులు జనిరి దివికి
హరిచతుర్థభాగమగునట్టి యద్దేవు
జూచి రర్చలిచ్చి సురలుమునులు 381

కం॥ హరియగు లక్ష్మణుడిటుదివి
కరిగి మహాహిస్వరూపుడయి వెలసినచో
చిరసిద్ధలోక గతులగు
వరయోగులు జనిరి జూడవనజుజుతోడన్ 382

కం॥ రామసహాయుడు బహుగుణ
ధాముడు హితకరుడనంతతనుడపరాత్ముం
డామెయిలక్ష్మణడరిగిన
రాముడు చింతాపరాంచితస్థితినుండెన్ 383

సీ॥ సౌమిత్రి నీరీతిసంత్యజించియు రఘు
వీరుండు శోకప్రచారుడగుచు
నంతమంత్రిపురోహితాదులు పౌరజా
నపదాదినాల్గువర్ణముల వారు
వినవశిష్టనకు నిట్లనియె ధీనిరతులీ
భరతురాజ్యమునందు బట్టమూంచి
నేడులక్ష్మణుమార్గ నిరతినేనేగెద
ననినదుఃఖార్తు లైయఖిలజనులు

తే.గీ॥ ఛిన్న మూలద్రుమములట్ల క్షితినిబడిరి
భరతుడునువిని రాముని భాషితంబు
నపుడ మూర్ఛిల్లి దెలిసి రాజ్యాభిషేక
మెలమిగర్హించి విభుగాంచి యిట్టులనియె 384

ఆ॥వె॥ సత్యముననునేను శపథంబుబల్కెద
ధరణినైనస్వర్గ సరణినైన
రామ! నీవులేని రాజ్యంబునేనొల్ల
నీపదంబులాన నృపకులీన! 385

తే॥గీ॥ కోసలలముల నుత్తరకోసలముల
కుశలవులపట్టమునుగట్టు కువలయేశ!
చారులను బంపు శత్రుఘ్ను జీరనతడు
మన మహాస్వర్గమనంబు వినునుగాగ 386

కం॥ అనినన్ భరతుని వచనము
వినయతనిన్ గనియురామ విరహభయంబున్

మనమందమూర్ఛనొందిరి
జనులందరునందు శోకచలితాశయులై 387

కం॥ వారింగనియు వశిష్ఠుం
డారాముని కనియెజూడు మయ్యవిచేష్టల్
వీరలు వీరింగని గృప
జేరిచి తద్భావమెరిగి జేయుమురామా! 388

సీ॥ అనిన విశిష్ఠోక్తి వినియాప్రజలలేపి
స్నేహాప్తి బహుమతి జేసిరాము
డేనేమి జేయగా నౌనుమీకనభక్తి
బ్రాంజలులైవారు బలికిరిట్లు
నెచటి కీవరిగెదవచటికి నీవెంట
వచ్చెదమదియెమద్వాంఛితంబు
సుతదార భృతకాదియుతముగా నీయను
గమనంబు ధర్మమక్షయముగాన

తే.గీ॥ పురము కేనియు స్వర్గమందిరముకేని
నెరితపోవన మేనియునీవు జనిన
వచ్చెదమటన్న కాలోక్తి వారిదృఢత
నరసి బ్రజలను కరుణరమ్మనియె విభుడు 389

వ॥ ఇట్లు గృతనిశ్చయుండై రఘూద్వహుడద్దివసంబున నిజనందనులగు కుశలవులకు వేయుగజంబులును నెనిమిదివేలు రథంబులును యరువదివేల హయంబులునున్నంతయె బలచయంబును యొక్క రొక్కరికి వేరువేర యొసంగి యనేక మణిధన పరిజనావృతులుగా ననిపిన నక్కుమారులా రామునకు దండప్రణామంబుల్గావించి వశిష్ఠాదులకు వందనంబొనరించి భరతునకు నమస్కరించి పితృ స్నేహంబున నెట్టకేలకు మరలించి ధనధాన్య సమృద్ధ ప్రవేశంబు లును హృష్టపుష్ప నివేశంబులునగు నిజదేశంబులకుంజని యందు కుశావర్తింగుశుండును కౌశాంబ శాబాస్యపురంబున లవకుమారుం డును యభిషిక్తులై సుఖంబుండిరంత. 390

ఉ॥ చారులు లక్ష్మణానుజుని సన్నిధికంపిన వేగమేగి వా
రారయ కాలురాకయును యత్రితనూజుని చేష్టితంబు దు
ర్వారత లక్ష్మణోర్ధ్వగతి రాముప్రత్షి సుతాభిషేకమున్
జేరివచింపనాతడును జింతిలితద్విధికిన్మహోధృతిన్ 391

కం॥ సుతుని సుబాహుని మధురన్
ద్వితీయ సుతు యూపకేతు విదిశానగరిన్

బతులుగ నిడితానుద్భూ
యతిమతి సాకేతమునకు నరిగియు నచటన్ 392

చం॥ కనియెమహీశుపావకనికాశుదుకూలయుగా వృతున్ సనా
తనముని ముఖ్యు సేవితుని తద్రఘునాథు రమాధినాథునిన్
ఘుననియతిం బ్రశస్తు కుశకల్పితహస్తు మహాత్మునిన్ బరా
త్మునిగుణధాముఁరామునతి మోదమునన్ లవణారి భక్తితోన్ 393

మ॥ కనిమధ్యాహ్నమునన్ విభున్వినతుడై గైమోడ్చి శత్రుఘ్నుడి
ట్లనియెన్ రాఘవపుత్రులన్నిలిపి రాజ్యంబందు మీవెంటనే
నును రానిశ్చిత బుద్ధివచ్చితిని నన్నుంభక్తునిన్వీడగా
దనినన్ రాముడనుగ్రహింపనతడట్లాయత్తుడయ్యెన్వెసన్ 394

సీ॥ అప్పుడు ఋషిదేవతాంశజులగు కీశ
ఋక్షగోపుచ్ఛలు రాక్షసులును
కామరూపులురామగమనంబు వినియనే
కులు లేచివిభుజూచి కుతుకవీచి
నీవెంటవత్తము నేమెల్ల ననుతరి
రవిసుతుడును మ్రొక్కి రాజ్యపదవి
నంగదునుంచి నేనరుదెంచి తనవారి
దృఢబుద్ధిగనిరాముడీయ కొనియె

తే.గీ॥ నటవిభీషణుగని పల్కె నాదరోక్తి
నవని ప్రజలుందు రెందాక నంతదాక
నసురలోకము బ్రోవునాయాజ్ఞనీవు
మీరిపల్కితివైన నామీదియాన 395

కం॥ అనిహనుమంతుంగనుగొని
యనిలజ చిరజీవివగుచు నవని నిలువుమా!
ననునేమియు నడుగకుమా!
వినుమా! నాయాజ్ఞ నీవు వృథసేయకుమా! 396

ఆ॥వె॥ అనియుజాంబవంతుగని రాఘవుడు ద్వాప
రాంతమునను నొక్క యర్థమునను
నాకునీకు బహురణంబగు నపుడుబ్ర
త్యక్షమగుదునుండు మనుచుబలికె 397

- శ్రీరాముని నిర్యాణము -

వ॥ అంతటన్ ప్రభాతంబున శుచిస్నాతుండై, విశాల వక్షుండును, పుండరీకాక్షుండును, నగురఘుకు లాధ్యక్షుండు, గురుపురోహిత శ్రేష్ఠుండగు వశిష్ఠునితో, మహాత్మా! మదీయంబులగు మఖాగ్ని హోత్రంబులు ముందరన్ దరలింపు మని నత్తెరంగునన్ గావించి, యత్తపస్వి సత్తపస్వి సత్తముడును మహాప్రస్థానవిధి కృత్యంబు నిర్వర్తించి, వెంబడిన్ బుత్తేర నత్తరి మహాపథప్రయాణాయత్తుండును, సహజ విజ్ఞాన వైరాగ్యాది షడ్గుణయుక్తుండును, విమలక్షౌమాంబరుం డును, దర్భపవిత్రకరుండును, శశికోటి ప్రభాసాంద్రుండునగు, రామచంద్రుండు శుభ్రంబగు నభ్రంబువలన చంద్రుండునుంబోలె, సకరంబగు నగరంబువలన నిర్గమించె, నప్పుడు రఘుప్రవరు వామపార్శ్వంబున విశాలపద్మనేత్రయు విశదపద్మ హస్తయు నగుశ్రీదేవియు దక్షిణ పార్శ్వంబున నరుణపద్మ హస్తయు శ్యామప్రభా దీప్తయగు భూదేవి మరియునుం దివ్యులగు మునివర్యులుం జనిరి, ముందట దివ్యవిగ్రహంబులతో ధనుర్బాణంబులును శస్త్రాస్త్ర కృపాణంబులుందరలె, వెండియు దివ్యకాయంబులతో వేదాది విద్యానికాయంబులును ప్రణవవ్యాహృతి సమేతయై వేదమాతయగు సావిత్రియుం జనియెనిట్లు రమాసమేతుండై చనురఘునాథుని వెనువెంటననుచరాతః పురజనసహితంబుగా సభార్యలగు భరత శత్రుఘ్నులును అమాత్యమంత్రి వర్గంబులును సుగ్రీవ ప్రముఖ వానరాదులును పదంపడి పుత్రపౌత్ర కళత్ర మిత్రబంధు పశుభృత్య బాలవృద్ధాదులతో పౌరజానపదాదులం బ్రాహ్మణక్షత్ర వైశ్యశూద్రులు నుందక్కిన కుంభకార కువింద రథకార రజకాంబిష్ఠ కిరాత చండాల పర్యంతంబులగు సంకీర్ణ వర్గంబులవారునుం దరలి రప్పుడప్పురం బునంగల మృగపక్షిగణంబులను గజోష్ట్ర తురగ గోమహిష ఖరశ్వాన మార్జాల మశకాదులగు మరియునుంగల దృశ్యాదృశ్యంబులగు భూతవ్రాతంబులు మొదలుగా స్థావరజంగమ శ్రేణులగు ప్రాణులు నుందరలి రివ్విధంబున సాక్షాత్పరమాత్ముండును ననంతశక్తియు పరమేశ్వరుండును నగు రఘువరునితో ననిరోద్వారంబగు నపవర్గం బునకుంబలె నందరు సంపూర్ణ కాములై మహోత్సవంబులకుం జనునట్లు శుభశబ్ద సహితులును సుస్నాతులును విరక్తులును నానందయుక్తులునునై జననయోధ్యానగరంబునిశ్శబ్దంబునై యుండెనయ్యెడ. 398

కం॥ భీతుడును శోకమోహో
పేతుడునుండైన్యయుతుడు పృథుబాహ్య సుఖ
ప్రీతుండును లేడయ్యెను
నాతరి రఘుశౌరి వెనుక నరుగు జనులలోన్ 399

కం॥ చనియెదమిదె రామునితో
గనియెదమిదె మోక్షపదవిగడు మోదముతో
ననువారె కానినిలిచెద
మనువారొకరైన గలుగరైరావేళన్ 400

వ॥ అంత. 401

కం॥ హరిరఘువరుడీగతిజన
పరివృతుడై యరిగిమోక్ష పదసంసరణిన్
హరినేత్రజనన సరణిన్
సరయూ ఝరిణిన్ సమీప సరణిన్ గనియెన్ 402

కం॥ కనియానదినిటుసంస్మృతి
జనపావనుడవ్విభుండు సంతోషమునన్
దనహృదయస్థముగాగను
గనియెన్ సర్వంబు సర్వకర్తయె యగుటన్ 403

మ॥ అపుడారాముని బ్రహ్మయున్ ఋషులు దేవాళుల్మహాసిద్ధులున్
విపులస్ఫూర్తులు బుణ్యమూర్తులును వేవేగోట్ల సంఖ్యంబులౌ
తపనద్యోతమలౌ విమానములతో దర్శింపగా వచ్చినన్
ద్యుపదం బొప్పెనతిప్రకాశతమహాజ్యోతిర్మయంబైయటన్ 404

సీ॥ పరిమళయుతములై పవమానములువీచె
విస్తారముగపుష్ప వృష్టిదోచె
దేవతాభేరికా రావంబులుప్పొంగె
నమరమృదంగ నాదములెసంగె
గంధర్వ కిన్నరగానముల్దీపించె
నప్సరోనాట్యంబు లతిశయించె
దివిచారణులజయ రవములు విలసిల్లె
దిక్ప్రదేశంబులు దేజరిల్లె

తే.గీ॥ నఖిలజగములు దనవెంట నరుగుదేర
శ్రీయుతుండగు నాదినారాయణుండు
రామదేవుండు నిజపూర్వధామమునకు
జేరి వసియించుటకు నిచ్ఛజేయువేళ 405

కం॥ ఉరుధాముడు రాముండిటు
సరయూసలిలావగాహ సంభ్రమలీలా
పరుడైనడచిన తరియా
హరిగాంచినమస్కరించి యజుడిట్లనియెన్ 406

సీ॥ రామ! విష్ణుడవు నారాయణుండవు పర
★మాత్ముడవును పరమాధిపుడవు
నఖిలేశ! పూర్ణుండవానందమయుడువు
నీనిజతత్త్వంబునే నెరుగుదు
నైననీ దాసుండనైన నావచనంబు
బాలింపుభక్త తత్పరుడవగుట
నీవుభ్రాతల తోడనేక మాంద్యంబునై
దీపించువైష్ణవ తేజమైన

తే.గీ॥ మూర్తినేనియు మరియొండు మూర్తినేని
బొరిబ్రవేశించి మమ్మెల్ల బ్రోవుమయ్య!
నీవుహరివగు దేవాది దేవుడవగు
నేనకాననన్యులెరుగరు నినకులేశ! 407

కం॥ దేవాధిప! వేవిధముల
శ్రీవర! నీకే నమస్కరించెద గనుమా!
నీవు బ్రసన్నుడవగుమా!
నేవెండియు మ్రొక్కువాడనీకిదె రామా! 408

వ॥ అని పితామహుండు బ్రార్థింపుచుండ మహాప్రభావుండగు శ్రీరామ దేవుండందరుంగనుచుండ నరవింద సంభవాది బృందారక బృందంబులు వెరగంద నిజమాయా విభ్రమంబుననేత్ర భ్రమంబా పాదింపుచు తదీయ దివ్యదేహంబునంద కౌమోదకీ శంఖచక్ర శార్ఙ్గాది సాధనయుతుండును చతుర్భుజాన్వితుండును శ్రీవత్స వక్షోవిరాజితుండును వనమాలికా విభ్రాజితుండును పీతాంబ రావృతుండును దివ్యప్రభా భావ్యమాన కిరీటకుండల కేయూరహార కటక కంకణాంగుళీయక కటిసూత్రనూపురాద్యలంకృతుండును నగు నారాయణదేవుండై ప్రకాశించిన నాక్షణంబ లక్ష్మణుండును నద్దేవునకు తప్పభూతుండై యుద్భుత శరీర సమేతుండును విద్యోతిత సహస్రఫణా విశేషుండును నగు శేషుండయ్యె, భరత శత్రుఘ్నులిద్దరు శంఖచక్రంబులై రంతకమున్న సీతామహాదేవి లక్ష్మీస్వరూపంబును దేజరిల్లి పురాణపురుషుండగు నవ్విష్ణుదేవు నాశ్రయించెనప్పుడు. 409

కం॥ సేవింపుచు భావింపుచు
గావింపుచు వందనములు గడువినతుల సం
భావింపుచు నారాయణ
దేవుని సేవించిరెల్ల దేవతలెల్లన్ 410

★ మాత్ముండవును పరమేశ్వరుడవును – గ.ము.ప్ర. పాఠం

వ॥ ఇట్లు శ్రీరామదేవుండు నిజానుజసహితుండై పూర్వదేహంబుతోడ నవ్వైష్ణవ తేజోమయంబగు దివ్యమూర్తి యుద్భవించిన నద్దేవునిం బరివేష్టించి విరించి సహస్రాక్ష ప్రముఖులగు నమరయక్ష సిద్ధసాధ్య విద్యాధర ప్రభృతులును మహర్షి ప్రతతులును దివ్యస్తోత్రంబుల నుతియించి బహువిధంబుల బూజించి సంప్రాప్తమనోరథులై యానంద సందోహ సంపూర్ణ చిత్తంబుల నుండి రత్తరి మహోను భావుండగు విష్ణుదేవుండు బ్రహ్మదేవునకిట్లనియె. 411

సీ॥ వీరిగంటివెయున్న వారి బుణ్యాత్ముల
మానవుల్ తిర్యక్కులైన వారి
భక్తులు నాకనురుక్తులు నేనిట
వచ్చిన నావెంట వచ్చినారు
వైకుంఠ సమముఖ్య లోకంబువీరికి
జేరినాయాజ్ఞ వచింపుమీవు
ననవిని హరితోడనజుడిట్టులనుదేవ
కలవు సాంతానికాఖ్యంబులైన

తే.గీ॥ లోకములు భాస్వరములు ముల్లోకములకు
నుపరిసీమవిచిత్ర భోగోజ్వలములు
జెందుదురు గాక కృతపుణ్య శీలులైన
వీరునీభక్తి భావాప్తి వెలయువారు 412

కం॥ జ్ఞానముననేని మరియ
జ్ఞానమునను దలచి రేని సపవిత్రం బౌ
నీనామము తుదనెవ్వా
రేనియు జెందుదురు వారలీలోకంబుల్ 413

వ॥ అనియద్దేవునితో విరించి విన్నవించునంత నత్యంత సంతోషంబుల వృక్షచర బుక్షరాసులెల్ల తత్సరయూజలంబులు సంస్పర్శించుమాత్రం బున తద్గాత్రంబులువీడియుం బూర్వరూపంబుల తోడనయ్యె యంశంబులం జానపదముఖ్యులగు మనుష్యులెల్లం తత్పుణ్య వారిగృతావగాహులై తద్దేహంబులు పరిహరించి దివ్యదేహంబులు వహించి దివ్యాంబరాభరణాదులు ధరియించి బ్రతిష్టించిరంత తిర్యగ్జంతు సంతతులును రామసంతుష్టింజేసి తజ్జల ప్రవిష్టంబై యవ్విధంబున దివంబునకు జనియె వెండియు నయ్యుత్సవంబు జూడవచ్చిన పదాంతర జనంబులు లోకగురుండైన రఘువరుండగు హరిందర్శించియు తత్కాల జనిత వైరాగ్యంబుల ముక్తసంగులై తజ్జలంబుల మజ్జన మాత్రంబున పుణ్యమార్గంబగు స్వర్గంబునకుం జనిరిట్లు సకల ప్రాణి వర్గంబులతో నపవర్గ ప్రదుండును దివ్యమంగళ విగ్రహుండునునగు శ్రీరామదేవుని వైకుంఠయాత్రా మహోత్సవంబగు నారఘూత్తమునుత్తర కథావశేషంబుతో నాద్యంతం బును సమగ్రంబుగా నమ్మహాదేవుండానతిచ్చె నివ్విధంబున. 414

కం॥ ఇది తత్త్వరహస్యంబగు
నిదిసర్వపురాణసారమిది వేదమయం
బిది సకలార్థ ప్రదమగు
నిదిభక్తి పఠింపరాముడిష్టములిచ్చున్ 415

శా॥ ఈరామాయణమందు పాపజయమెంతేకోరు వాడాస్థచే
నారూఢస్థితి పాదమేనియు దినంబర్ధంబు నేనిన్మదిన్
సారశ్లోకమునేని భక్తిజదువన్ సాహస్రజన్మాఘముల్
జూరంబుచ్చియనన్యలభ్యమును గాంచున్ రామసాలోక్యమున్ 416

కం॥ అనిశివుడివ్విధి భవన
ప్రణుతంబధ్యాత్మనామ రామాయణముం
వినుపింపసర్వమంగళ
వినినిత్యానందసాంద్ర విభవమునందెన్ 417

కం॥ ఈరామచరిత్రము మును
శ్రీరామప్రేరణమున శివుడు వచించెన్
సారముభవిష్యదర్థము
జేరివినిన రామతుష్టి జెందునిజముగన్ 418

ఆ॥వె॥ ఇదియనంతపుణ్యమిట్టి రామాయణ
కావ్యమాదిశివుడు గౌరికొరకు
జెప్పెదీనిభక్తిచే విన్నజదివిన
బహుళజన్మపాప పటలిదొలగు 419

కం॥ అధ్యాత్మరామకథవిన
నధ్యయనముజేయ భక్తినవనీసుతతో
సాధ్యత ప్రసన్నుడగుచు న
యోధ్యాధిపు డొసగు నిహపరోన్నత సుఖముల్ 420

ఆ॥వె॥ ఆదికావ్యమైన యధ్యాత్మ రామాయ
ణంబు జనమనోహరంబు పద్మ
జాది సురలచేత నర్చితంబదిభక్తి
జదువవినిన విష్ణుపదముగలుగు 421

కం॥ వినిన బఠించిన వ్రాసిన
వినుపించిన బూజసేయవిప్రునికియ్యన్
జనుడాధ్యాత్మిక రామా
యణమున్ రామకృతలోకమందు సుఖించున్ 422

సీ॥ సురలు బ్రార్థింప దాశరథియై జన్మించి
యజ్ఞసంరక్షణంబాచరించి
సీతావివాహ సంప్రీతితో వర్తించి
యఖిల కల్యాణగుణాప్తిమించి
మునిరక్షణమునకు వనమునవసియించి
తోయధియందు సేతువుఘటించి
యనిలజరవిజాది హరియుక్తి విహరించి
రావణాదినిశాట రాజిద్రుంచి

తే.గీ॥ సీతను గ్రహించి మరిపురస్థితి సుఖించి
యంతవైకుంఠ నిజధామ మధిగమించి
యలరెనేశౌరి నతడతిఖ్యాతి వెలసె
రాముడానంద సందోహధాముడగుచు 423

కం॥ అనుచు విధాతవచించిన
వినినారదమునివరుండు విస్మయపరుడై
జనితానంద సుధానిధి
ననయమునోలాడుచుండె నాహ్లాదమునన్ 424

సీ॥ అజభవసుమనః ప్రియాప్తినందుటజేసి
యజభవసుమనః ప్రియాప్తినంది
కౌశికసాహాయ్యగరిమగాంచుటజేసి
కౌశిక సాహాయ్యగరిమగాంచి
అచలాప్తయగు లక్ష్మినధిగమించుట జేసి
యచలాత్మయగు లక్ష్మినధిగమించి
అసుర భేదనధర్మ మావహించుటజేసి
యసుర భేదనధర్మమావహించి

తే.గీ॥ యందువైకుంఠవాసుడై యలరుశౌరి
యిందుసాకేత వాసుడై యేపుమీరి
జగముల భరించి విబుధ రక్షణ ఘటించి
వెలసె శ్రీరామ విస్ఫూర్తి విష్ణుమూర్తి 425

అ॥వె॥ అచలనవ రసైక రచిత భావశకాప్తి
మన్మథాభిహిత సమస్ఫుటాప్తి
నలరజేసె నిజ మహాకృతి యధ్యాత్మ
రామమూర్తి జగతిరమ్య కీర్తి 426

కం॥ జాగ్రత్స్వప్నసుషుప్తుల
కగ్రిమ పదవిన్వెలుంగు హరియగు రఘువీ
రాగ్రణినాకన్నులకెపు
డగ్రస్థితినిలుచుగాత! యానందముగాన్ 427

సీ॥ శ్రీమించుగద్వాల సోమేంద్ర వరదుడౌ
నాదికేశవ శౌరి కర్పితముగ
నమృతసారమగు బ్రహ్మాండ పురాణోక్త
మైనయధాత్యరామాయణమున
నటబాల కాండాదులైదును మరియుద్ధ
కాండంబు రెండు భాగములుగాగ
నుత్తర కాండంబు నొకటిగాగను నెన్మి
దాశ్వాసముల జేసెనాంధ్రసూక్తి

తే.గీ॥ సుగుణ విభ్రాజి పెద్దన సోమయాజి
యట్టియధ్యాత్మరామాయణాఖ్యకృతియు
జగతినాచంద్రతారార్కముగ బ్రసిద్ధి
గాంచుగాత! శ్రీరాముల కరుణచేత 428

మ॥ ప్రకటాంభశ్చర ఘోణితాకృతసుర ప్రహ్లాద ప్రహ్లాద ర
క్షకతా వామనరామతాప్తి కలనా సర్వజ్ఞ సర్వజ్ఞ తా
గ్ర కనత్కల్కి దశానటత్తురగ రంగద్వాల గద్వాల నా
మక విఖ్యాత పురీంద్రపాలన కృపామాధుర్య మాధుర్యధీ! 429

కం॥ బాలసలీల యయోధ్యా
శ్రీలతపోరణ్య ఖేల శ్రితకిష్కింధా
పాలదయాసుందర యు
ద్ధాళీకృతజయశుభోత్తరాధ్యాత్మహరీ! 430

కం॥ వారణముఖనిజ యానా
ధోరణతాముఖ్య దాస్యధూర్వహసోమ
క్ష్మారమణ భరణదక్షా
శ్రీరమణ కృపాకటాక్ష శ్రితజనరక్షా! 431

మంగళ మహావృత్తము॥

శ్రీధరసదావిబుధసేవధిసుధాదవళ
శీలవిధి శోభితయశశ్శ్రీ
సాధువన మాధవసుసాధన గదారిధర
సాధితనిరంతర జయశ్రీ
భూధవసుధీనికరబోధకర ★సాధుతర
భూషిత వినిర్మలగుణశ్రీ
మాధవ ◆దయావనధి మందర గిరీంద్రధర
మంజుతరమంగళ మహాశ్రీ 432

- గద్య -

ఇది శ్రీమదుభయ కవితా నిస్సహాయ సాహితీవిహార కాణాదాన్వయతిమ్మనార్యకుమార
వినయవిభ్రాజి పెద్దనసోమయాజి ప్రణీతంబైన
శ్రీమదధ్యాత్మరామాయణంబను మహాపురాణంబునందు
నుత్తరకాండంబన్నది అష్టమాశ్వాసము సంపూర్ణము

-★)★(★-

★ సాధుతర వినిర్మల - గ.ము.ప్ర. పాఠం
◆ దయాదరగిరీంద్ర - గ.ము.ప్ర. పాఠం

అనుబంధం

I. తెలుగు సాహిత్యంలో అధ్యాత్మరామాయణాలు

అధ్యాత్మ రామాయణాన్ని చాలామంది కవులు తెలుగులో రచించినారు. పద్యకావ్యాలు, ద్విపదకావ్యాలు, కీర్తనలు, వచన గ్రంథాలు మొదలయిన ప్రక్రియలలో అధ్యాత్మరామాయణం తెలుగుసాహిత్యంలో వెలిసింది. తెలియవచ్చినంతవరకు వాటి సంక్షిప్త వివరాలు :

కంచర్ల శరభనకవి :

16వ శతాబ్దం ప్రారంభంలో ఉండిన కంచర్ల అయ్యన్నకవికి శరభనకవి పౌత్రుడు. ఇతడు రచించిన అధ్యాత్మరామాయణం పద్యకావ్యం అసమగ్రంగా ఉంది. ఇది సమగ్రమైఉంటే తొలితెలుగు అధ్యాత్మ రామాయణం ఇదే అయ్యేది.

ఇమ్మడిజగదేవరాయలు :

17వ శతాబ్దం పూర్వార్ధంలో చెన్నపట్టణాన్ని నిర్మించిన ఈతడు తెలుగులో అధ్యాత్మరామాయణాన్ని రచించినట్లు ఓబళకవి తాను రచించిన వామనపురాణావతారికలో పేర్కొన్నాడు. వామనపురాణం జగదేవరాయలకు అంకితం. జగదేవరాయల అధ్యాత్మరామాయణం అలభ్యం.

కాణాదం పెద్దనసోమయాజి :

ప్రస్తుతం మీ చేతిలోఉన్న అధ్యాత్మరామాయణానికి ఇతడు కర్త. సమగ్రంగా లభిస్తున్న తొలితెలుగు అధ్యాత్మరామాయణ పద్యకావ్యం ఇదే.

రాపాక శ్రీరాముకవి :

పరకాల నివాసి, క్రీ.శ. 1780 ప్రాంతంవాడు. ఇల్లిందకుంటలో వెలసిన దైవానికి ఇతడు రచించిన అధ్యాత్మరామాయణ యక్షగానం అంకితం. ఇది అలభ్యమని తెలియవస్తుంది. ఇతడే పద్యకావ్యంగా రచించిన అధ్యాత్మరామాయణ అసమగ్రప్రతి ఆంధ్రసాహిత్య పరిషత్పుస్తక భాండాగారం కాకినాడలో ఉంది.

కాళహస్తి సుబ్రహ్మణ్యకవి :

అధ్యాత్మరామాయణ సంకీర్తనలను రచించినాడు. అవి శేషగిరి ముద్రతో ఉన్నవి. మునిపల్లె సుబ్రహ్మణ్యకవి అనికూడా ఇతనికి వ్యవహారం. ఈ కవి అధ్యాత్మరామాయణంలో 104 సంకీర్తనలున్నాయి. క్షేత్రయ్య చెప్పిన 40 రాగాలకు తోడు సుమారు 20 రాగాలు ఈ కవి రచనలో ఉన్నాయి. గ్రంథం ముద్రితం.

పరశురామపంతుల లింగమూర్తి :

అధ్యాత్మరామాయణ పద్యకావ్యం, దీని సమగ్రప్రతి కాకినాడలోని ఆంధ్రసాహిత్యపరిషత్తులో ఉంది. ఈయన సీతారామాంజనేయ సంవాదం అధ్యాత్మరామాయణంలోని ఒక చిన్న అంశానికి విస్తృత వివరణ గ్రంథం.

పరశురామపంతుల రామమూర్తి :

సీతారామాంజనేయ సంవాద కర్తయగు పరశురామపంతుల లింగమూర్తికి ఈకవి కుమారుడు. క్రీ.శ. 1814 ప్రాంతంవాడు. వరంగల్లు సమీపానగల మట్టెవాడ ఇతనిఊరు. ఈయన అధ్యాత్మరామాయణాన్ని రచించినట్లు తెలియవస్తోంది.

ముదుంబై వేంకటకృష్ణమాచార్యులు :

అధ్యాత్మ రామాయణాన్ని రచించినారు. తిరుత్తని తాలుకాలోని అగరము గ్రామవాసి. క్రీ.శ. 1800 ప్రాంతంవాడు. కార్వేటి ప్రభువులకు ఆశ్రితుడు.

మోదుకూరి పండరినాథకవి :

ఈయన రచించిన అధ్యాత్మరామాయణాన్ని పండరి రామాయణం అని వ్యవహరించినారు. నిజాం రాష్ట్రంలోని ముదిగొండ వాసి. గ్రంథరచన అనుమకొండలో జరిగిందని గోలకొండ కవులసంచికలోఉంది. ఈయన గ్రంథం అముద్రితమని ఆంధ్రకవిసప్తశతి చెప్పింది.

అల్లమరాజు రామకృష్ణకవి :

ఇతడు విద్వత్కవి రంగధామార్యుని పుత్రుడు. కాలం 18–19 శతాబ్దాల మధ్యకాలం. పిఠాపురం చెంతనున్న చేబ్రోలు నివాసం. అధ్యాత్మరామాయణాన్ని రచించినాడు.

కోటమరాజు నాగయ :

ఈయన అధ్యాత్మ రామాయణాన్ని పద్యకావ్యంగా రచించినాడు. 'ఇది కాణాదం పెద్దనసోమయాజి రచించిన అధ్యాత్మరామాయణ మంతటి ప్రశస్తమైనది కాకున్నను మొత్తముపై హృద్యముగను నిర్దుష్టముగను ఉండు'నని ఆంధ్రకవి సప్తశతిలో పేర్కొన్నారు. కవికాలం 18వ శతాబ్దం ఉత్తరార్ధం. 1911లో గ్రంథం ముద్రితం.

కృష్ణగిరి వేంకటరమణకవి :

ఈయన ధర్మపురినివాసి. అధ్యాత్మ రామాయణం, వాసిష్ఠ రామాయణం రచించినాడు. క్రీ.శ. 1870 ప్రాంతాన ఉన్నాడు. వాసిష్ఠ రామాయణానికి వ్యాఖ్యానం కూడా రచించినట్లు తెలియ వస్తోంది.

ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రి :

కాలం 1860–1916. ప.గోదావరి జిల్లా కాకరపర్రు వీరి నివాసం. గద్యపద్యాలతో నాటకంగా అధ్యాత్మ రామాయణాన్ని రచించినాడు. 1907లో ముద్రితం.

కోటమరాజు రామయామాత్యుడు :

కాలం 1880 ప్రాంతం. ఈయన రచించిన అధ్యాత్మ రామాయణంలో కిష్కింధకాండంనుంచి కొంతవరకే లభించింది. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారంలో అసమగ్ర ప్రతిఉంది.

ఉప్మాక నారాయణమూర్తి :

వీరి జననం 1894. వీరి రచనకు అధ్యాత్మ మాలికా రామాయణమని పేరు.

బులుసు వేంకటేశ్వర్లు :

అధ్యాత్మ రామాయణమును నిర్వచనంగారచించినారు. 1970లో ముద్రితం.

కస్తూరి వేంకటసత్య స్వరాజ్యలక్ష్మి :

ఈమె కాకినాడలో ఉపన్యాసకురాలుగ పనిచేసినది. బులుసువారి అధ్యాత్మరామాయణానికి ఇది వచనం. 1982లో ముద్రితం.

వేంకట కృష్ణమాచార్యులు :

అధ్యాత్మరామాయణం–వచనం. 1871 ముద్రితం.

సుబ్రహ్మణ్యశాస్త్రి :

అధ్యాత్మరామాయణం–పురాణం వచనం. 1876 ముద్రితం

వేమూరి జానకీరామ శాస్త్రి :

వీరు రచించిన అధ్యాత్మ రామాయణం ఒక్కొక్క కాండం ఒక్కొక్క సంపుటంగా ముద్రితం. 1931 నాటికి అరణ్యకాండం ముద్రితం. ఈ కవి 20వ శతాబ్దం పూర్వార్ధంవాడు.

మామిడన్న సుభద్రాంబ :

ఈమె జననం 1900 ప్రాంతం. ఈమె ద్విపద అధ్యాత్మ రామాయణాన్ని రచించింది.

అల్లూరు రాజేశ్వరకవి :

అధ్యాత్మరామాయణంలోని ఉమామహేశ్వర సంవాదోత్తరకాండంలోని రామగీత ద్విపదగా తెనిగించినారు.

చీరాల నరసింహకవి :

అధ్యాత్మరామాయణం–రామగీతి అనువాదం.

పురిపండ రామమూర్తి :

అధ్యాత్మరామాయణం–వచనం.

చదలవాడ సుందర రామశాస్త్రి :

అధ్యాత్మరామాయణ శ్లోకాలకు టీకా తాత్పర్యాలు రచించినాడు. 1907 ముద్రితం.

గుడిపాటి ఇందుమతి :

అధ్యాత్మరామాయణ కీర్తనలు.

బాలకృష్ణ మొదలి :

అధ్యాత్మరామాయణం–వచనం. 1909 ముద్రితం.

అజ్ఞాత కర్తృకం :

వచనం 1913 ముద్రితం. (చూడు : ఆంధ్రవాఙ్మయ సూచిక).

దూర్వాసుల రామయార్యుడు :

అధ్యాత్మరామాయణము–వచనం 1918 ముద్రితం.

కౌతా శ్రీరామశాస్త్రి :

అధ్యాత్మరామాయణం–వచనం 1910 ముద్రితం. మచిలీపట్నం.

బి. లక్ష్మయ్య :

అధ్యాత్మరామాయణ సంగ్రహము–వచనం 1921 ముద్రితం.

అజ్ఞాత కర్తృకం :

అధ్యాత్మరాయాయణం–పద్యకావ్యం ముద్రితం.

గన్నమరాజు సాయిబాబ :

కర్నూలువాసి. అధ్యాత్మరామాయణము–వచనం (ముద్రితం).

ఈ పట్టికలో తెలియవచ్చినంత వరకు పేర్కొనటం జరిగింది. ఇంకా ఎందరో కవులు/రచయితలు అధ్యాత్మరామాయణాన్ని రచించిఉంటారు. సంస్కృత అధ్యాత్మ రామాయణాన్ని శ్రీ శంకరానందస్వామివారు హిందీలో రచించినారు. వీరి హిందీ అధ్యాత్మ రామాయణాన్ని కాళీవరవేదాంత వాగీశులవారు విపులంగా వంగభాషలోనికి అనువదించినారు.

* * *

II. గద్వాల సంస్థాన సంబంధితం

1. గద్వాల సంస్థాన పాలకులు-కాలం :

కాకతీయుల కాలనాడు బుడ్డారెడ్డి నుండి తర తరాలుగ పెదసోమ భూపాలుడు (శోభనాద్రి) వరకు వివిధ పరగణాలకు నాడగౌడు మొదలైన అధికారాలు కలిగి పాలనజరిపినారు. పెదసోమభూపాలుడు క్రీ.శ. 1663 నుండి 1712వరకు వివిధ పరగణాలకు అధిపతిగా ఉన్నాడు. అయితే 1695-1702 మధ్య కాలాన గద్వాలసంస్థాన నిర్మాణం జరిగింది. అప్పటినుంచి వీరు గద్వాల సంస్థాన ప్రభువులుగా వ్యవహరించబడినారు. అప్పటినుంచి సంస్థానాన్ని పాలించిన పాలకుల క్రమం ఈ దిగువన ఇవ్వబడింది. 1948లో సంస్థానాలు భారతప్రభుత్వంలో విలీనమయినవి. శ్రీమాన్ కవిశరభ పెద్దమందడి వేంకటకృష్ణకవి (క్రీ.శ. 1888-1943) 'గద్వాలసంస్థానచరిత్ర' రచన చేయటానికి వివిధ తామ్రపత్ర శాసనాలు, సనదులు మొదలయిన వాటినుంచి సేకరించి ఒక కాగితప్రతిలో వ్రాసుకున్నాడు. ఆ లిఖిత ప్రతి ఆధారంగా ఈ వివరాలు ఇక్కడ పొందుపరచడమైనది. (గద్వాల సంస్థాన రాజుల వంశ చరిత్రలోకూడ ఈ వివరాలు ఉన్నాయి. పుట-80, ద్వితీయ ముద్రణ-1995.)

పెదసోమభూపాలుడు	-	క్రీ.శ. 1702-1712 (గద్వాల ఏర్పడిన తర్వాత పాలించినకాలం)
కల్లా వెంకటన్న	-	క్రీ.శ. 1712-1716
రమణయ్య	-	క్రీ.శ. 1716-1723
తిమ్మక్క	-	క్రీ.శ. 1723-1725
లింగమ్మ	-	క్రీ.శ. 1725-1740
తిరుమలరావు	-	క్రీ.శ. 1740-1742
మంగమ్మ	-	క్రీ.శ. 1742-1745
చొక్కమ్మ	-	క్రీ.శ. 1745-1747
రామరాయడు	-	క్రీ.శ. 1747-1761

(చిన) సోమభూపాలుడు II	–	క్రీ.శ. 1761–1794
రామభూపాలుడు I	–	క్రీ.శ. 1794–1807
సీతారామభూపాల్ I	–	క్రీ.శ. 1807–1810
వేంకటలక్ష్మమ్మ	–	క్రీ.శ. 1840–1840
		(4 నెలలు)
సోమభూపాల్ III	–	క్రీ.శ. 1840–1844
వేంకటమ్మ	–	క్రీ.శ. 1844–1845
రామభూపాల్ II	–	క్రీ.శ. 1845–1901
సీతారామభూపాల్ II	–	క్రీ.శ. 1901–1924
ఆదిలక్ష్మీదేవమ్మ	–	క్రీ.శ. 1924–1948

(సంస్థానం అప్పుడప్పుడు కొంతకాలం కోర్టుఆఫ్ వార్డ్స్‌లో ఉండినది.)



2. గద్వాల సంస్థాన చిత్రపటం



పటంలోని గ్రామాలు

1. గద్వాల	2. పూడూరు	3. దరూరు
4. అయిజ	5. రాజోలి	6. బోరవెల్లి
7. ప్రాగటూరు	8. అలంపూరు	9. కందనవోలు
10. బండిఆత్మకూరు	11. నంద్యాల	12. వెలుగోడు
13. శ్రీశైలం	14. చాగలమర్రి	15. అహోబిలం
16. శిరువెళ్ల	17 బనగానిపల్లె	18, బేతంచర్ల
19. డోను	20. ఆదోని	21. మానవ
22. రాయచూరు	23. శిరిగుప్ప	



3. గద్వాల సంస్థానం కోట



గద్వాల కోటలో ఒకభాగం

4. కేశవస్వామి ఆలయం



ఆలయగోపురం



ఆలయం



5. సంస్థాన నిర్మాత చిత్రం



పెద్దసోమభూపాల్

మొట్టమొటటి ఏలిక

6. అధ్యాత్మరామాయణం–ప్రారంభ పుటలు



(1/4డెమ్మీ సైజు)



(1/4డెమ్మీ సైజు)

శ్రీరస్తు



శ్రీకేశవ పర బ్రహ్మణేనమః

అధ్యాత్మరామాయణ ప్రారంభము

శ్రీకాంతామణి జానకీస్ఫురణచే చెల్వంబు గాతానురా । మాకారంబునలోకబృందమునకౌత్మానం
దమానద్వితీ । యైక బ్రహ్మము కేశవుండు గరుణాయత్తస్థితిన్ నిర్మలశ్లోకన్ దిర్మలరాయసోమనృ
పతిన్ సుశ్రీయుతుం జేయుతన్ ॥ .....* ।

॥ సి ॥ సరసగుణోద్భాసిజనకప యోరాశిజనియించివేల సినజల జపాణి । రమ్య లక్షణశాలి రాజ సపేలాద
రిభావంబు గనినసం పన్నిధాన । రామనామనిరూఢి రంజిల్లు శౌరికిమానినియగు నట్టిమంగళాఖ్య । యాశ్రిత స్వజన
గేహాంగణ సీమలసిరులు నించవహించు శ్రీసమాఖ్య । యతనువిధిరీతి కుశలవ త్వానుభూతి । గనుసుతు లగన్నకైకజనే
నయనేగ । నవనినుదయించివిలసిల్లు నాదిలక్ష్మి । సహజ యంబూనిసోమ భూజానిబ్రోచూ ॥ మ ॥ తన శేషస్థితి దెల్పె నెం
తయుననం తవ్యాప్తినౌభక్తిచే । వనాలోకస్థ లితల్పముఖ్యకృతి సేవా వృత్తి రామాఖ్యచే । ననువౌశౌరికి వేడ్కగూపుం
చుసుమిత్రా నందసంధానతన్ । మనుసల్లక్షణుడైనలక్ష్మణుడుసోమక్ష్మా పరున్ బ్రోవుతన్ ॥ మ ॥ తమశం ఖారియు
గాంశతల్ దెలుపదైత్యత్రా సకారిస్పరో । ద్యమముం గైకొని రామశౌరికినిపార్శ్వాలంకృతిస్ఫూర్తినం । దుమహీ
సాధనభూతులౌ భరతశత్రుఘ్నుల్ యశశ్శౌర్య సం । భ్రమయుక్తిన్ విజయం బొసంగు దురు సోమక్ష్మా వధూ భర్తన్
కున్ ॥ ఉ ॥ రామపరాత్మతత్వము దిరంబుగ వేడిన నవ్వధూటికిన్ । రామపరాత్మ తత్వమువరంబని తెల్పి సుఖించువిశ్రు
తుల్ । శ్రీమహితుల్ శివాకృతుల శేష జగన్నుతులాదిదంపతుల్ । సోమనృపాలుసత్య భవశోభన శీలునిబ్రోతు రె
ప్పుడున్ ॥ మ ॥ తనబ్రహ్మాఖ్యనిజంబుగా వేలుగ సత్యస్ఫూర్తిశోభిల్లిచి । ద్ఘనతంబాపివిభారతీ కలితలక్ష్యవ్యాప్తినా
నందభా । వనచేభాసిలహంసగమ్యుడగుచున్ వర్తించువాణీశుడి । చ్చునువిజ్ఞానచిరాయురున్నతులు శ్రీసోమక్షమాజా
నికిన్ ॥ సి ॥ దళమహీవల యితాంతస్వర్ణ కర్ణికావనజమే దేవినివాసభూమి । మరిపరావస్య తిమధ్యమావైఖరు
లెదేవికి నివైభవోదయములు । శ్రీమహాకాళీ శచీచండికాదులెదేవికి పరివారదేవ సతులు । సుకరహిరణ్మ యాం
శుకకింశుక శ్రేణులేదేవికినిదలంకృతిచయంబు । లేమహాదేవికరుణా సుధైకసార । మసమ విద్యారసంబు గానాభూసు
నట్టి । ధేనువాగీశ్వరీమహాదేవిరీవి । నిగమతతిమాత మత్కృతినిలుచుగాతా ॥ వినాయక గరుడస్తు తి ॥ మ ॥ నృపమౌళి
తున్ విబుధేంద్రచిత్రముగనావిర్భూతసంవిత్సుధా । ఘనసం పాదనకైసువర్ణరుచిపక్ష స్ఫూర్తియైపుష్కరాయ । లనగ

(1/4డెమ్మీ సైజు)



శ్రీరస్తు

శ్రీకేశవపరబ్రహ్మణేనమః

అథాత్మరామాయణప్రారంభము

శ్రీకాంతామణి జానకీస్ఫురణబే చెల్వొందుగా తానురా
మాకారంబున లోకబృంబమున కాత్మానందమా నద్రితో
యికలబ్రహ్మముకేశవుండు గరుణాయత్తస్థితిన్ నిశ్మల
శ్లోకుడ్ దిగ్మలరాయ నామనృపతిన్ సుశ్రీయుతుంజేయుతన్ 1

సీ. సరసగుణోద్భాసి జనకపతివారాశి
జనియించి తెలసిన జలజపాణి
శమ్మలుష్ణాంశుధాజసహోదరి
భావంబుగని నపంపన్నిధాన
రామనామనిరూఢి శరంజిల్లుశౌరికి
మానినియు నట్టిమంగళాక్ష్
యాశ్రితస్వజనగేహాంగణాస్థుల
పరులుసింహవహించు శ్రీసమాక్ష్

యతనుసిరీతికుశలవత్వాదుభూతి
గనుసుతులుగన్న కైకజనెనయునేగ
దవనిజనియించి శిలసిల్ల నాదిలక్ష్మి
సహజయంబొనిసోమభూ జాని బ్రోచురా . 2

మ. తనశేషస్థితిపెల్లెనెంతయునసంతవ్యాప్తి నాభక్తిచే
వనకాశిస్థలి తల్పమల్లి కృతిసేవావృత్తిచామాశ్రిచే
వసుతాధారకి దేర్ధరార్చుచు సుమిత్రానంద సంధానతన్
వసుసల్లక్షణశత్రునుర్మిణుడు సోమక్ష్మావరుబ్రోచుతన్. 3.

మ. తమశంభారి యుగాంతకాలపెలుపై దైత్యత్రాసకారిప్రభా
భ్రమునుంగైకొని రామకారికని పారాళ్యుంకృతిస్ఫూర్తి నం
దుమవిపాదిత భూతలాభరణతశత్రఘ్నుల్ యశశ్శార్వరిసం
భ్రమయుక్తివిజయంబాసంగుడు సోమక్ష్మావరుబ్రోచుతన్. 4.

ఉ. రామపరాత్మతత్వము విరంబుగకొనిన నవ్యభూతికిన్
రామపరాత్మతత్వము పరంబుని తెల్పు సుభంయవిశ్రుతుల్
శ్రీమహితులైన వారలుశేషజగత్పతులాదిదంపతుల్
సోమనృపాలు సత్కృపవశోభవశీలుని బ్రోతురెప్పుడున్. 5

(గద్వాల ముద్రిత ప్రతిని, మద్రాసు తాళపత్ర ప్రతిని సరిపోల్చి
పాఠభేదాలు గుర్తించి 1984లో వైద్యం వేంకటేశ్వరాచార్యులు
వ్రాసుకున్న కాగితప్రతిలోని కావ్యారంభ పుట.)

III. సురపురం సంస్థాన సంబంధితం

1. వేణుగోపాలస్వామివారి ఆలయం



2. వేణుగోపాలస్వామివారు



కాణాదం పెద్దన రచించిన శేషశైలేశలీల, మత్స్యపురాణం
సురపురం పామనృపాలుని (1752–1762) ఆశ్రయాన రచించి,
అక్కడ వెలసిన శ్రీ వేణుగోపాలస్వామివారికి అంకితం ఇచ్చినారు.

IV. ఈ బంధాలకు చిత్రాలు ఇలా...

మూసీపత్రిక గత (సెప్టెంబరు–2013) సంచికలో సహృదయమిత్రులు వెలుదండనిత్యానందరావు 'ఈ బంధాలకు చిత్రాలేమిటో చెప్పండి' అనే వ్యాసం ప్రకటించినారు. 24 ఏళ్ళ కిందట రాజమండ్రినుండి వెలువడే 'సమాలోచన' పక్షపత్రిక (ఏప్రిల్, మే–1990) లో 'ఈ బంధాలకు చిత్రాలెలా వుంటాయో చెప్పండి?!' అనే వ్యాసాన్ని నేను ప్రకటించటం జరిగింది. ఆ తరువాత నా 'వ్యాస వైజయంతిక' (సాహిత్య సంబంధ వ్యాసాలు) గ్రంథంలో కూడా ఆ నా వ్యాసం (2004) పునఃప్రచురితం అయ్యింది. అయినా ఆ బంధాలకు చిత్రాలెలావుంటాయో ఎవరూ తెలుపలేదు.

ఆ బంధాలు జాంబవత్పాద బంధం, విశ్వముఖ మత్స్యత్రయబంధం. ఇవి 18వ శతాబ్దపు విద్వత్కవి విద్వద్గద్వాల సంస్థాన విరాజితుడు అయిన కాణాదం పెద్దనసోమయాజి రచించిన అధ్యాత్మరామాయణంలో ఉన్నాయి. అధ్యాత్మరామాయణాన్ని ప్రచురించాలనే సంకల్పం నాకు చిరకాలంగావుంది. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలించడంచే అధ్యాత్మ రామాయణాన్ని డి.టి.పి. కూడా (745 పుటలు 1/8 డెమ్మి) చేయించి ప్రచురణకు సిద్ధంచేసినాను. చెన్నై – ప్రాచ్యలిఖిత గ్రంథాలయములోని అధ్యాత్మ రామాయణ తాళపత్ర ప్రతితో గద్వాల ప్రతిని పోల్చి పాఠ భేదాలు కూడ గుర్తించడమైనది. అధ్యాత్మరామాయణంలో మొత్తం తొమ్మిది బంధాలున్నాయి. వాటిలో ఏడింటికి చిత్రాలు గీసి ఆయా పద్యాల దగ్గర స్కాన్ చేసి పెట్టడమైనది. అయితే విశ్వముఖ మత్స్యత్రయ, జాంబవత్పాద చిత్రాలు ఎలావుంటాయో తెలియకపోవటంచేత వాటి చిత్రాలు వుండవలసిన తావు ఖాళీగా వుంచినాను.

ఆ బంధ చిత్రాలకోసం చిరకాల ఆత్మీయ సాహితీ మాన్యమిత్రులు కపిలవాయిలింగమూర్తిగారిని మూడు నెలల క్రితం సంప్రదించినాను. ఆ బంధాలకు చిత్రాలు రూపొందించవలసినదని లింగమూర్తిగారిని కోరినాను. వారు చాలా ప్రయత్నించినాకూడా బంధచిత్రాలు కుదరడంలేదని తెలిపినారు.

మరొక పర్యాయం ఆ బంధచిత్రాలను వేయగలిగే వారెవరైనా ఉంటారని గట్టి ప్రయత్నం చేసినాను. అందులో భాగంగా మిత్రులు వెలుదండ నిత్యానందరావును బంధకవిత్వములో పరిశోధనలు సాగించినవారుంటే తెలుపగలరని దూరవాణి ద్వారా అడిగినాను. 'విశ్వవిద్యాలయాలలో తెలుగు పరిశోధన' అనే గ్రంథాన్ని వెలువరించినారు కనుక అలాంటి పరిశోధకులు వారికి తెలిసివుంటుందని వారిని సంప్రదించటం జరిగింది. వారు ఇద్దరిపేర్లను సూచించినారు. ఆ తరువాత తామే ఆ బంధాలకు చిత్రాలు రూపొందించే ప్రయత్నం చేస్తున్నానని, మూసీలో వాటిని ప్రకటిస్తానని తెలిపినారు. గత మూసీ సంచికలో వారి వ్యాసం ప్రకటించటం జరిగింది.

తెలుగు బంధకవిత్వ ప్రపంచంలో విశ్వముఖ మత్స్యత్రయ, జాంబవ త్పాదబంధాలకు చిత్రాలు ఎలావుంటాయో తెలియని పరిస్థితులలో వెలుదండవారు ఆ బంధాలకు చిత్రాలు రూపొందించటానికి చేసిన

ప్రయత్నం ప్రోత్సహించదగినది, హర్షించదగినది. పద్యమంటేనే పెదవివిరిచే కాలంలో అపురూప బంధాలకు చిత్రాలు రూపొందించేందుకు చేసిన వెలుదండవారి ధైర్య ప్రయత్నానికి సహృదయులు మెచ్చుకోక తప్పదు. ఇలాంటి ప్రయత్నాలు చాలా అవసరం. అది సఫలీకృతమా, కాదా అన్నది వేరేఅంశం. ప్రయత్నమే లేకుంటే సఫలములేదు, విఫలములేదు కదా!

ఈ బంధాలకు చిత్రాలు రూపొందించవలసినదిగా లేదా రూపకల్పనలో సలహాలు అందివ్వవలసినదిగా సర్వశ్రీ కపిలవాయి లింగమూర్తి (నాగర కర్నూలు), బేతవోలు రామబ్రహ్మం (హైదరాబాదు), ఏల్చూరి మురళీధరరావు (ఢిల్లీ), చింతారామకృష్ణారావు (హైదరాబాదు), శ్రీరంగాచార్య (హైదరాబాదు), హరిశివకుమార్ (వరంగల్), కె. కోదండరామాచార్యులు (ఖమ్మం), యస్.గణపతి (విశాఖ) మొదలైనవారిని సంప్రదించినాను. బేతవోలు వారు అనేక సూచనలు చేసి దారి చూపించినారు. చింతారామకృష్ణరావుగారు మత్స్యత్రయ బంధానికి, గణపతిగారు జాంబవత్పాద బంధానికి చిత్రాలు రూపొందించి పంపినారు. వాటిని చిరుమార్పులు చేసి ప్రస్తుతం చిత్రాలు అందించటం జరిగింది. బంధ చిత్రరూపకల్పనలో ఎందరో పండితులను పరిశోధకులను ఎన్నిమార్లో సంప్రదించి, వారికి ఇబ్బందికూడ కలిగించి ఈ విధంగా ఈ చిత్రాలు అందించే ప్రయత్నంచేసినాను. అందుకు వారందరికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు. వారి సలహాలు, సహకారాలు లేకుంటే ఈ బంధాల చిత్రాలు ఇలా రూపు దిద్దుకొనేవి కావు. అయినా ఈ చిత్రాలకు ఇంకా మెరుగులు దిద్దే సలహాలను కూడ విజ్ఞులనుండి ఆహ్వానిస్తున్నాను, అభ్యర్థిస్తున్నాను. దీనికంతటికీ కారణమేమంటే నేను ప్రచురించబోయే అధ్యాత్మరామాయణంలో అన్ని బంధాలకు చిత్రాలు సలక్షణంగా ఉండాలనే సత్సంకల్పమే.

ఇక జాంబవత్పాద, విశ్వముఖ మత్స్యత్రయ బంధాలనుగురించి కొంత తెలుసుకుందాం –

జాంబవంతుడు భల్లూకజాతికి చెందినవాడు. భల్లూక పాదం ఎలావుంటుందో దాదాపు 30 సంవత్సరాల నాడే పరిశీలించే ప్రయత్నం చేసినాను. బిక్షాటకులు కొందరు ఎలుగుబంట్లను వెంట పెట్టుకొని వచ్చేవారు. ఆ ఎలుగుబంట్లపై పిల్లలను కూర్చునబెట్టి ఎలుగుబంటి బొచ్చును ఆ పిల్లల మొలతాళ్లకు కట్టేవారు. నన్నుకూడ నా చిన్నతనంలో మానాన్న గారు ఎలుగుబంటిపై కూర్చొనబెట్టినారు. నేనుకూడ నా పిల్లలను ఎలుగుబంటిపై కూర్చొనబెట్టినవాడినే. 30ఏళ్ళనాడు జాంబవత్పాద చిత్రబంధంకోసం ఎలుగుబటి పాదాన్ని పరిశీలించటం జరిగింది. ఎలుగుబంటి ముందరి పాదాలు ఒకరీతిగా వెనుకపాదాలు ఒకరీతిగా కనిపించినవి. ఆ తరువాత మరికొంతకాలానికి మరొక ఎలుగుబంటి పాదాలు పరిశీలించగా అదివరకు చూసిన ఎలుగుబంటిపాదాలకన్న అవి భిన్నమైన రీతిలో ఉన్నట్లు గుర్తించి అయోమయ పరిస్థితిలో పడ్డాను. చిత్రనిర్మాణానికి ఏ పాదాన్ని గ్రహించాలో అర్థంకాక తికమక పడ్డాను. ఇటీవల అంతర్జాలంలో ఎలుగుబంటి పాదాల బొమ్మలు చూడడమైనది. అందులో ఐదువేళ్ళపాదం నాలుగువేళ్ళ పాదం కనపడినది. నాలుగువేళ్ళ పాదం కలిగిన ఎలుగుబంటుఉత్తమజాతికి చెందినది అని విన్నాను. అంటే జాంబవంతుని జాతికి చెందినదేమోనని

భావించినాను. అలాంటి పరిస్థితులలో డా॥ గణపతిగారు జాంబవత్పాదబంధచిత్రాన్ని అంతర్జాలంలో గ్రహించి, బంధచిత్రాన్ని నిర్మించి పంపినారు. ఆ చిత్రం సరియైనదని భావించినాను. చిరుమార్పు చేసి దానినే ఇప్పుడు అందివ్వడమైనది. సాహిత్యంలో పాదుకాబంధం, పాదబంధాలు ఉన్నాయికాని జాంబవత్పాద బంధం మాత్రం అధ్యాత్మరామాయణంలో మాత్రమే కన్పిస్తుంది. దీనికి ఎవ్వరూ లక్షణం చెప్పలేదు. చాలా బంధాలకు లక్షణాలు లేవు. ప్రాచుర్యం పొందిన బంధాలకే లక్షణాలు చెప్పబడినవి. లక్షణాలకు ప్రయోగాలే శరణ్యంకదా! కవి స్వోపజ్ఞ కల్పితబంధాలు అనేకం. కొత్త కొత్త బంధాలు పుట్టుకొస్తూనేవుండటం గమనార్హం.

అధ్యాత్మరామాయణంలో కిష్కింధకాండంలో శ్రీరామచంద్రులవారు జాంబవంతుని చూడటం జరుగుతుంది. ఈ సందర్భం కలిగిన కిష్కింధకాండం చివరన స్తుత్యాత్మకమైన జాంబవత్పాదబంధం రచించటం సందర్భోచితం.

జాంబవత్పాద బంధ పద్యం :

రామ సహాస తిర్మల **ధరాధర** సోమన్నపాత్మ సార**సా**
రామ ధరాధరా వర వర స్తవనాదరణా ప్రమోద**సా**
రామల శీలధర్మ రచితాద్యవతార కృతానవప్ర**కా**
రాముని మానితా దురితరాజనిభంజన భక్తరంజ**కా**

– అధ్యాత్మరామాయణం–కిష్కింధ–674 ప

పద్యపాదాలలోని మొదటి అక్షరమైన 'రా' బంధచిత్రములో కేంద్ర స్థానములో ఉంది. నాలుగు పాదాలుకూడ ఆ కేంద్రస్థానములోని 'రా' నుండే మొదలవుతాయి. బంధంలోని అంకెలు ఏఏ పాదాలు ఎలా పయనిస్తాయో సూచించేందుకు వేయబడినది. బాణం గుర్తులు పద్యపాద ప్రయాణ మార్గాన్ని సూచిస్తాయి. పద్యములోని ముద్ద అక్షరాలు బంధచిత్రంలో పునరావృతం అవుతాయి.

విశ్వముఖమత్స్యత్రయబంధం

తెలుగు సాహిత్యంలో (కేవల) మత్స్యబంధాన్ని కొందరుకవులు రచించినారు. తూము రామదాసుకవి మిత్రవిందోద్వాహము (2–37)లో, ఠంయాల లక్ష్మీనృసింహాచార్యులు కృష్ణాకుబ్జవిలాసం (3–123)లో, ఠంయాలవారే వేల్పుగొండ లక్ష్మీనృసింహ మాహాత్మ్యము (2–37)లో, శిరిశినహల్ కృష్ణమాచార్యులవారు శతవిధబంధకావ్యములో (65) మత్స్య బంధమును రచించినారు. శిరిశినహల్‌వారు శతవిధబంధకావ్యములో (67) మత్స్యత్రయ బంధాన్ని కూడ రచించినారు. అయితే ఆ చిత్రంలో మూడు చేపల తోకలు వలయంలో సమాన దూరంగాను, ఆ మూడు చేపలకు ఒకే మూతి కేంద్రస్థానంలోను రచించబడింది. ఇందాక పేర్కొన్న మత్స్య బంధాలకు ప్రస్తుత విశ్వముఖమత్స్యత్రయబంధానికి నిర్మాణంలో చాలా భేదం వుంది. ప్రస్తుత మత్స్యత్రయబంధం అధ్యాత్మరామాయణం– సుందరకాండంలో వుంది. హనుమంతుడు సముద్రాన్ని లంఘించే

ఘట్టం వుండిన కాండం చివరన విశ్వముఖ మత్స్యత్రయబంధం సముచితంగా ప్రయోగించబడింది. బంధచిత్రంలో మూడు 'వా'లు ఆవృత్తమవుతాయి. 'వాలుగ' అంటె చేప. కనుక రెండర్థాలలో మత్స్యత్రయబంధాన్ని 'మూడువాలు గల ముడి' అనవచ్చు (ముడి=బంధం).

విశ్వముఖ మత్స్యత్రయబంధ పద్యం :

చం. కరినుత చిద్విలాస యనఘ స్మరఘ స్మర మిత్ర బాంధవా
శరజవిలోచనా విజయసత్వర సత్వ రతాత్మ శైశవా
విరచితశీల రాఘవ రవిగ్రహ విగ్రహ వర్తి మాధవా
విరళకథోత్సవా! నిఖిల విద్విభవా! జగదీశ కేశవా!

– అధ్యాత్మరామాయణం–సుందరకాండ–242 ప

ఒక్కొక్కచేపలో ఒక్కొక పద్యపాదం ఇమిడింది. వలయంలో నాలుగవ పాదం వుంది. చేప పైభాగంలో పొలుసులు చిన్నగా వుంటాయి. కింది భాగంలో పొలుసులు పెద్దగావుంటాయి. మొదటి మూడు పద్యపాదాలు ఆయా చేపలలో పై పొలుసులతో ప్రారంభమై తోకను రెండు పర్యాయాలు చుట్టి పెద్దపొలుసులద్వారా పయనించి చేప మూతిముందు వలయంలో పద్యపాదం ముగుస్తుంది.

తెలుగు పద్య సాహితీ ప్రపంచంలో బంధకవితాప్రౌఢాంగన పటుపాండిత్యశౌండీర్య మండితులనే గాక రసాస్వాదన తత్పరులగు కోవిదులను కూడ ఆకట్టుకొంటుంది. అయితే బంధకవితా ప్రౌఢాంగన ధీమాన్యులను మాత్రమే అలరిస్తుందికానీ సామాన్యులను మాత్రం దరిదాపులకుకూడా రానీయదనటం సకలజన విదితం.

సుమధుర రసప్లావిత కవితా సుగంధి బాగుంటుందా? పటుతర బంధకవితా సుందరిబాగుంటుందా? అని అడిగేవారికి ఏమని చెప్పగలం! నాటకం బాగుంటుందా? సర్కస్ బాగుంటుందా? అంటే ఏమనిచెప్తాం! ఒకటి ఆహా! అనిపించి హాయిగొలుపుతుంది, మరొకటి అహో! అనిపించి అబ్బురపరుస్తుంది. దేని అందం దానిదే, దేని అనుభూతి దానిదే. అయితే బంధ కవిత్వంలో హృదయాన్ని కదిలించే లక్షణాన్ని ఆశించరాదు. అది బౌద్ధికవ్యాయామ క్రీడమాత్రమే.

కవితారసాస్వాదనంతో ప్రమోదించే కోవిదుడు బంధక్రీడలతో కూడ వినోదిస్తాడు.

(మూసీ మాస పత్రిక – అక్టోబర్–2013.
వ్యాసకర్త : వైద్యం వేంకటేశ్వరాచార్యులు).

గమనిక : బంధ చిత్రాలు 321, 363 పుటలలో చూడవచ్చు.

వైద్యం వారి సాహిత్యం

1. 1969 వేంకటరమణ నక్షత్రమాల – కందపద్యాలు
2. 1979 హనుమత్తారామాల – సీసపద్యాలు
3. 1979 శ్రీ కురుమూర్తిగిరినిలయ లక్ష్మీవేంకటేశ్వర సుప్రభాతమ్, సంస్కృతం – సాంధ్రతాత్పర్యం
4. 1983 శ్రీ కురుమూర్తి శ్రీనివాస శతకము, కందపద్యాలు – సాంధ్రతాత్పర్యం
5. 1983 శ్రీ కురుమూర్తి క్షేత్ర చరిత్రము, వచనం – పరిశోధనాత్మకం.
6. 1988 వ్యాసత్రయి, వచనం – చౌడేశ్వరీదేవి నందవరీకసంబంధితవ్యాసాలు
7. 1988 శ్రీ దత్తజయంతి చరితము, యక్షగానం – రంగయామాత్యుని రామకృష్ణకవి కృతం, తాళపత్రప్రతి – పరిష్కరణం
8. 1988 శ్రీ దత్తావధూతశతకము, గేయశతకం – రంగయామాత్యుని రామకృష్ణకవి కృతం, తాళపత్రప్రతి – పరిష్కరణం
9. 1988 శ్రీ దత్తప్రభు శతకము, గేయశతకం – క్రిష్టిపాటి వేంకటసుబ్బకవి కృతం, తాళపత్రప్రతి – పరిష్కరణం
10. 1988 శ్రీ గురుదేవ దత్తధరణి సీతారామయోగీంద్రస్వామివారి మాహాత్మ్యము, వచనం – పరిశోధనాత్మకం
11. 1990 శ్రీ సీతారామ కల్యాణము, యక్షగానం – దేవరవఝుల సుబ్బకవి కృతం తాళపత్రప్రతి – పరిష్కరణం
12. 1991 మహావాక్య ప్రకరణము, ద్విపదకావ్యం – వేదాంతం – రంగయామాత్యుని రామకృష్ణకవి కృతం
13. 1991 శ్రీ చౌడేశ్వరీ స్తోత్ర కదంబం, వివిధ పూర్వకవి విరచితం – సంస్కృతాంధ్రపద్యాలు, తాళపత్రప్రతి – పరిష్కరణం
14. 1991 నందవరీక ప్రశంస, వివిధ పూర్వకవి విరచితం – సంస్కృతాంధ్రపద్యాలు, తాళపత్రప్రతి – పరిష్కరణం
15. 1992 శంకర శతకము, తడకనపల్లి కవిరామయోగ విరచితం సంపాదకత్వం
16. 1993 తడకనపల్లి కవిరామయోగి లఘుకృతులు – సంపాదకత్వం
17. 1993 తారకబ్రహ్మ శతకము, ద్విశతి – తడకనపల్లి కవిరామయోగి విరచితం
18. 1994 శ్రీ వేంకటేశ్వర శతకము, పులకుర్తి లక్ష్మిరెడ్డి రచితం, వ్రాతప్రతి – పరిష్కరణం
19. 1994 శంకర శతకము – నందికొటుకూరి శంకరయోగి కృతం
20. 1998 శ్రీ తిమ్మగురులీల,పద్యకావ్యం – బాలకవి గోవింద ప్రసాదవిరచితం, పరిష్కృతం
21. 2000 శ్రీ కంబగిరి లక్ష్మీనృసింహ శతకము, గేయశతకం – స్థలపురాణ సహితం
22. 2001 భజయతిరాజ స్తోత్రము, తెలుగు అనువాదం – టీకాతాత్పర్య సహితం
23. 2002 వ్యాసవైజయంతిక – వైష్ణవ సంబంధిత వ్యాసాలు (20) మొదటిభాగం
24. 2003 తెలుగుభాష – పద్యశతకం
25. 2004 వ్యాసవైజయంతిక – కర్నూలు జిల్లా సంబంధిత (20) వ్యాసాలు
26. 2004 వ్యాసవైజయంతిక – సాహిత్య సంబంధిత (20) వ్యాసాలు
27. 2005 వ్యాసవైజయంతిక – వైష్ణవ సంబంధిత (20) వ్యాసాలు
28. 2005 ఉన్నమాట – పద్యశతకము

29. 2005 ఉత్తరవేంకటాచల మాహాత్మ్యం – శ్రీకురుమూర్తి క్షేత్రస్థలపురాణం సంస్కృతమూలం – తెనుగు వచనీకరణం

30. 2007 ఆంధ్రవ్యాకరణములు – పద్యాంధ్రవ్యాకరణము, సూత్రాంధ్రవ్యాకరణము,
ఆంధ్రశబ్ద శాసనము, శబ్దలక్షణసంగ్రహము
పరవస్తు చిన్నయసూరి విరచితం, సంపాదకత్వం

31.2008 చాత్తాదనామభాష్యం – పరిశోధనాత్మకం

32. 2009 సుదర్శన చక్రరాజ శతకము పద్యశతకము – స్వీయరచన, విపుల పీఠికాసహితం

33. 2011 శతకద్వాదశి – పన్నెండు స్వీయ శతకాల సంపుటం

34. 2011 కర్నూలు జిల్లా కవితరంగిణి – 800 మంది కవుల సంక్షిప్త చరిత్ర

35. 2011 ఆంధ్రనిఘంటువు, పరవస్తు చిన్నయసూరి కృతం – పునర్నిర్మాణం

36. 2011 శ్రీ కరస్థల నాగలింగేశ్వర స్వామి చరిత్ర, ద్విపద కావ్యం – నాగెళ్ల శివమూర్తి కృతం, సంపాదకత్వం

37. 2012 కవితావైజయంతి – స్వీయచాటు కవితా సంకలనం

38. 2012 యోగీశ్వర విలాసము – ద్విపద కావ్యం (18వ శతాబ్దం) నందికొటుకూరి సిద్ధయోగి కృతం – పరిష్కరణం

39. 2013 ఆంధ్రపూర్ణాచార్య ప్రభావము, చంపూకావ్యం – దొంతిరెడ్డి పట్టాభిరామ దాసకవికృతం, పరిష్కరణ; సంపాదకత్వం

40. 2013 శాత్తాద శ్రీవైష్ణవం చాత్తాద శ్రీవైష్ణవులకు సంబంధించిన పరిశోధనాత్మక (30) వ్యాసాలు

41. 2014 వైద్యం వారి పీఠికలు (అచ్చులో), పూర్వ సమకాలీనులు రచనలకు సంతరించిన పీఠికలు, ముందుమాటలు, సమీక్షలు

42.2014 చిత్రబంధమాలిక (బంధ కవితా విలసితం, 18వ శతాబ్దపు తిరుమల బుక్కపట్టణం, అన్నయాచార్య విరచితం) పరిష్కరణ, వ్యాఖ్యానం.

43.2014 చిత్రం (చిత్ర కవితా విలసితం, 18వ శతాబ్దపు ఆయలూరి కందాళార్య కృతం) పరిష్కరణ, వ్యాఖ్యానం.

44..2014 కామకళ (1990 ప్రాంతపు స్వీయ వ్యాస రచన – అచ్చులో).

45.2015 బంధకవిత్వ సర్వస్వం (డబుల్ డెమ్మీ 1000 పుటల గ్రంథం – అచ్చులో).

46.2015 నృసింహమూర్తి దర్శనం (అచ్చులో).

47.2015 ముద్రా దర్శనం (అచ్చులో).

48. 2016 అధ్యాత్మరామాయణము (ప్రస్తుత గ్రంథం), కాణాదం పెద్దనసోమయాజి ప్రణీతం – పరిష్కరణ, పీఠిక, సంపాదకత్వం

వివిధ పత్రికలలో, ప్రత్యేక సంచికలలో ప్రచురితమైన సాహిత్యం ఎంతో ఉంది. కర్నూలు, కడప, హైదరాబాదు, వరంగల్, తిరుపతి ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమైన సాహిత్యమూ ఉంది.

అముద్రిత రచనలు వేల పుటలలో ఉన్నాయి. పరిష్కృత పూర్వకవుల రచనలు, స్వీయనిర్మిత కోశాలు, వ్యాసాలు, కావ్యవ్యాఖ్యానాలు మొదలయినవి వీలును బట్టి ఆర్థిక వనరులను బట్టి ప్రచురించే ప్రయత్నం జరుగుతోంది.

-★)★(★-